# Piṅgaḷi lakṣmīkāntaṁ jīvitaṁ, racanala pariśīlana

A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the requirement for the award of

**Doctor of Philosophy**

**In**

**Telugu**

Researcher

**Nalasani Ramprasad**

**(Reg No: 16HTPH21)**

**Department of Telugu**
**School of Humanities**
**UNIVERSITY OF HYDERABAD**
**Hyderabad- 500046**
**Telangana, India**

**December – 2022**

# పింగళి లక్ష్మీకాంతం జీవితం,
# రచనల పరిశీలన

**పిహెచ్.డి. పట్టా కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి**

**సమర్పించిన పరిశోధన గ్రంథం**

పరిశోధకుడు

**రాం ప్రసాద్ నలసాని**

**(Reg No: 16HTPH21)**

పర్యవేక్షకుడు

**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**

తెలుగుశాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,

హైదరాబాద్-500046

డిసెంబర్-2022

# DECLARATION

I, Ramprasad Nalasani hereby declare that this thesis entitled Piṅgaḷi lakṣmīkāntaṁ jīvitaṁ, racanala pariśīlana submitted by me under the guidance and supervision of Prof. Darla Venkateswara Rao is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this thesis can be deposited in Shodhganga/INFLIBNET.

N. Ramprasad
30/12/2022

Signature of the Student

Date: 30.12.2022

Name: Ramprasad Nalasani
Registration No. 16HTPH21

# CERTIFICATE

This is to certify the Thesis entitled **Piṅgaḷi lakṣmīkāntaṁ jīvitaṁ, racanala pariśīlana** submitted by **Mr. Ramprasad Nalasani** bearing **Regd. No. 16HTPH21** in partial fulfilment of the requirements for the award of **Doctor of Philosophy** in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been: (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately in the chapter-1and 4 of the thesis.)

1. ***Bhāratīya sāhityanlō guruśiṣyula sambandhālu: Ācārya piṅgaḷi lakṣmīkāntaṁ, Bhavaveena Journal of Arts, Literary, Culture & Language Study Monthly, UGC _Care Journal, ISSN No.2456-4702, July, 2021, Vol.18-Issue.07, Spl.Edition, July, 2021, Pages: 197-203. Editor: Kolla Sri Krishnarao, Chief Editor: Pitta Santhi, Published by*** Kolla SriKrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur, A.P.India. **(Thesis Chapter -I)**
2. ***Manavuni Antha Sangarshanalanu Chitrinchina MobiDik Novel***, 2022, Vol.7, No:01, Pages: 10 – 11, ISSN: 2581-3153, Editor: Sake Srihari Murthy, Published by Siri Publications, Ananthapuram-515 001, Andhra Pradesh, India. **(Thesis Chapter -VII)**
3. ***Piṅgaḷi-kāṭūri dr̥ṣṭilō saṅkrānti vaibhavaṁ***, ***Prajamanipusa Telugu Monthly,*** January, 2022, Vol.2. No: 12, pages: 22-25, ISSN:  Editor: Kanaparthi Raja Rao, Published by Praja Media Network, Visakhapatnam-530 002, Andhra Pradesh, India.
4. ***Pingali- Katuri Äjnana Kritamu" Karunasri puspavilapam: Prakrititatwam, Bhavaveena Journal of Arts, Literary, Culture & Language Study Monthly, UGC _Care Journal, ISSN No.2456-4702, January, 2022, Vol.19-Issue.0 1(1), Pages: 76-81. Editor: Kolla Sri Krishnarao, Chief Editor: Pitta Santhi, Published by*** Kolla SriKrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, Guntur, A.P.India. **(Thesis Chapter -II)**

**B. Presented in the following National seminars:**

(Issues presented in the following papers have been discussed elaborately in the chapter-1and 4 of the thesis.)

1. ***Bhāratīya sāhityanlō guruśiṣyula sambandhālu: Ācārya piṅgaḷi lakṣmīkāntaṁ, Chapter-1,*** International Webinar on *Telugu Literature- Indian Life Style* conducted by Sri Kanyaka Parameswari Arts& Science College for Women, Chennai dated on 5,6 and 7 July, 2021.
2. ***Acharya Pingali Laksmikantham gari Bhakthi tatwam, Chapter-4,*** International Webinar on Bharatiya Bhakthi Sahityam, conducted by Department of Telugu, Karnataka State Open University, Mysore, on June, 27th & 28th 2022.

Further, the student has passed the following courses towards fulfilment of course work requirement for Ph.D.

| **Sl.No** | **Course Code** | **Name of the Subject** | **Credits** | **Pass/Fail** |
|---|---|---|---|---|
| 1. | HT-801 | Research Methodology | 4.00 | Pass |
| 2. | HT-802 | History of Telugu Research | 4.00 | Pass |
| 3. | HT-803 | Studies in Literature and Language | 4.00 | Pass |
| 4. | HT-804 | Specialized area and Broad Field | 4.00 | Pass |




**(Prof.Darla Venkateswara Rao)**
**Research Supervisor**




**(Prof.Darla Venkateswara Rao)**
**Head, Department of Telugu**

**(Prof.V. Krishna)**
**Dean, School of Humanities**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | కృతజ్ఞతలు | vi |
| | సంకేత పదాల వివరణ | xxvii |
| | ప్రస్తావన | xxviii |
| 1. | పరిశోధనాంశం పరిచయం (Introduction) | |
| 2. | పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research) | |
| 3. | పూర్వ పరిశోధనల పరామర్శ (Review of literature) | |
| 4. | క్షేత్ర పర్యటన/ గ్రంథ సేకరణ(Field-Work/ Books collection) | |
| 5. | పరిశోధన ఆకరాలు (Research Source) | |
| 6. | పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research) | |
| 7. | పరిశోధన పరిధి (Scope of the Research) | |
| 8. | పరిశోధన లక్ష్యాలు – ప్రయోజనాలు (Research objects) | |
| 9. | ఫలితాంశాలు ( Research Results) | |


మొదటి అధ్యాయం

## పింగళి లక్ష్మీకాంతం జీవితం: రచనల పరిచయం(1-59)


| | |
|---|---|
| 1.0. పింగళి లక్ష్మీకాంతం జీవితం: | 1 |
| 1.1. బాల్యం, విద్యాభ్యాసం: | 2 |
| 1.2. పింగళి లక్ష్మీకాంతం వివాహం: | 2 |
| 1.3. పింగళి లక్ష్మీకాంతం ఉద్యోగం: | 3 |
| 1.4. అధ్యాపకుడిగా పింగళి లక్ష్మీకాంతం : | 3 |
| 1.4.1. బందరులో తెలుగు ఉపాధ్యాయునిగా ఉద్యోగం: | 3 |
| 1.4.2.మద్రాసు విశ్వవిద్యాలయంలో ఉద్యోగం: | 4 |
| 1.4.3. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యక్షుడు: | 4 |
| 1.4.4. విజయవాడ ఆకాశవాణిలో ఉద్యోగం: | 4 |
| 1.4.5. ఆచార్యుడుగా పింగళి లక్ష్మీకాంతం: | 5 |
| 1.4.6. పింగళివారి పేరుతో బంగారు పతకం: | 6 |
| 1.5. వివిధ సంస్థలతో పరిచయం: | 6 |
| 1.5.2. భారత తొలి ప్రధాని నెహ్రూగారితో అనుబంధం: | 6 |
| 1.5.3. ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అకాడమీ సభ్యునిగా పింగళి: | 7 |

1.6. సత్కారాలు–బహుమతులు: 7
1.7. పింగళివారి వ్యక్తిత్వం సూటితనం: 7
1.8. పింగళి లక్ష్మీకాంతంపై ప్రముఖుల అభిప్రాయాలు: 8
1.9. పింగళి లక్ష్మీకాంతగారి అభిరుచి: 8
1.10. పింగళి లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వం: 9
1.11. పింగళి లక్ష్మీకాంతంగారి శిష్య బృందం: 9
1.12. అవధానిగా పింగళి లక్ష్మీకాంతం: 9
1.12.1 గుంటూరు సభలో అవధానిగా పింగళి: 10
1.12.2. నెల్లూరు సభలో అవధానిగా పింగళి: 11
1.12.3. బందరు సభలో  అవధానిగా పింగళి: 12
1.12.4. పింగళివారి అవధాన కళపై విమర్శకుల అభిప్రాయాలు: 12
1.13. నటుడిగా పింగళి లక్ష్మీకాంతం: 13
1.13.1.విద్యార్థి దశలో నాటక  ప్రదర్శన: 13
1.13.2. పింగళివారి నాటక ప్రవేశం: 14
1.13.3. తొలిసారి ధర్మరాజు పాత్ర ప్రదర్శన: 14
1.13.4. పాండవోద్యోగ విజయం (ధర్మరాజు పాత్ర): 14
1.13.5. అనేక నాటకాల్లో ధర్మరాజు పాత్ర పోషణ: 15
1.13.6. 'సంపూర్ణ భారతములో నటుడిగా పింగళి: 16
1.13.6.1. సంపూర్ణ భారతం: 16
1.13.7. ధర్మారాజు పాత్రపై ప్రశంసలు: 17
1.13.8. గయోపాఖ్యానం నాటకం అర్జునుడిగా పింగళి : 17
1.13.9. నరకాసుర వధ నాటకం మాణిభద్రుని పాత్రలో పింగళి: 18
1.13.10. సారంగధర నాటకం సారంగధరుడి పాత్రలో పింగళి: 18
1.13.11. పాదుకాపట్టాషేకం నాటకం– భరతుడి పాత్రలో పింగళి: 19
1.13.12. రస పుత్ర విజయం నాటకం– మంత్రి రాక్షసుడిగా పింగళి: 19
1.13.13. రసపుత్ర విజయం నాటకం– రాజసింహుడిగా పింగళి: 20
1.13.14. ముద్రా రాక్షస నాటకం– మంత్రి రాక్షసుడిగా పింగళి: 20
1.13.15. పింగళి వారి నటనలో వైవిధ్యమైన తీరుతెన్నులు : 21
1.13.16. పింగళివారు నాటకాలలో పాత్రలు – పోషించిన విధానం: 21
1.13.17. నాటకాలలోని   పాత్రలు  పోషించిన రసాలు– పింగళి : 22
1.13.17.1.నాటకాలలో రస పోషణ – పింగళి దృక్పథం: 22
1.13.18. పింగళి – నాటకాల్లో పాడిన సంగీత రాగాల పరిచయం: 22

1.14. పింగళివారి వ్యక్తిత్వంపై – ప్రముఖులు, విమర్శకుల ప్రశంసలు: 23
1.14.1. పత్రికల ప్రశంసలు: 23
1.14.2. ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అకాడమీ ప్రశంస: 24
1.14.3. విశ్వనాథ సత్యనారాయణగారి అభిప్రాయం: 24
1.14.4. గూడూరి నమశ్శివాయగారి అభిప్రాయం: 25
1.15. రంగస్థల నటుల పట్ల పింగళివారి దృక్పథం: 25
1.15.1. నాటకం పట్ల పింగళివారి అభిప్రాయం: 25
1.16. పింగళివారి పద్య, వచన, అనువాద రచనల పరిచయం: 26
1.16.1 ఆత్మలహరి ఖండకావ్యం: 26
1.16.2. మహాభారతం ప్రత్యేక అధ్యయనం: 27
1.16.3. తొలకరి ఖండకావ్యం: 27
1.16.4. బిగ్ జార్గల్ అనువాద నవల (1920): 28
1.16.5. సౌందరనందము (1932): 29
1.16.6. మధురపండితరాజము (1962): 30
1.16.7. సాహిత్య శిల్ప సమీక్ష : 30
1.16.8. ఆంధ్ర సాహిత్య చరిత్ర(1974): 31
1.16.9. గౌతమ వ్యాసములు(1952): 33
1.16.10. మానవులందరూ సోదరులు(1964): 34
1.16.11. మాబీడిక్ అనువాద నవల(1964): 34
1.16.12. సంస్కృత కుమార వ్యాకరణం (1968): 35
1.16.12.1. భాష నిర్వచనాలు: 36
1.16.12.2. వర్ణాలు, ఉత్పత్తి: 36
1.16.12.3. సంధి నిర్వచనం: 36

1.16.13. ఆంగ్ల దేశ చరిత్ర (1931): 37
1.16.14. పింగళి లక్ష్మీకాంతం గారి పరిష్కరణ రచనలు: 37
1.16.14.1. విష్ణు పురాణము: 38
1.16.14.2. ద్విపద భారతము: 38
1.16. 14. 3. రంగనాథ రామాయణము: 38
1.16.14.3. పల్నాటి వీర చరిత్ర: 38
1.17.పింగళి లక్ష్మీకాంతంగారి అలభ్య రచనలు: 39
1.17.1. కచదేవయాని నాటకం: 39
1.17.2. ఆంజనేయస్వామి శతకం: 39

1.17.3. శతపత్రసుందరి పీఠిక: 39
1.17.4. కల్పలత పీఠిక: 40
1.18. పింగళి లక్ష్మీకాంతం– గురు శిష్య సంబంధాలు: 40
1.18.1. ఆరు దశలుగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతం జీవితం: 41
1.18.2. తిరుపతి వేంకటశాస్త్రి – పింగళి లక్ష్మీకాంతం: 42
1.18.3. విశ్వనాథవారితో పింగళివారి అనుబంధం: 44
1.18.4. కట్టమంచివారితో సాన్నిహిత్యం: 44
1.18.5. ఆచార్య కోరాడ రామ కృష్ణయ్య– పింగళి లక్ష్మీకాంతం: 45
1.18.6. ఆచార్య పింగళి వారిపై ఆయన శిష్యుల అభిప్రాయాలు: 46
1.18.6.1. పింగళి వారి ప్రసంగ కళపై విద్యార్థుల అభిప్రాయం: 47
1.19. సాహిత్య సభలను నిర్వహణలో పింగళివారి సామర్థ్యం: 47
1.19.1. వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేసే సామర్థ్యం: 48
1.19.2. పింగళివారు విద్యార్థులను ప్రోత్సహించే చర్యలు: 48
1.20. అధ్యాపక ఉద్యోగ విధుల నిర్వహణ: 49
1.21. మహిళా విద్య పట్ల పింగళివారి దృక్పథం: 49
1.22. పింగళివారి బోధనా విధానం: 51
1.22.1. సాహిత్య విమర్శ బోధనా విధానం: 51
1.22.2. పింగళి లక్ష్మీకాంతంగారి విద్యాబోధన ప్రత్యేకత: 52
1.23. సహ ఉద్యోగులతో లక్ష్మీకాంతంగారి సంబంధాలు: 53
1.24. విద్యా బోధన పట్ల పింగళివారి దృక్పథం: 54
1.25. పింగళి వారిపై విశ్వనాథ దృష్టి: 54
1.26. పాఠ్యాంశాల ఎన్నిక– పింగళివారి దృష్టి: 55
1.27. పాఠ్యాంశాల ఎన్నికలో నిష్పక్షపాత దృష్టి: 55
1.28. పింగళివారిపై  విద్యా సంస్థల అభిప్రాయాలు: 56
1.28.1.ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు (వాల్తేరు): 56
1.28.2. పింగళివారికి కట్టమంచివారి ఉత్తరం: 57
1.29. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవన యానం: 58

రెండవ అధ్యాయం

## పింగళి, కాటూరి: జంటకవిత్వం (తొలకరి) పరిశీలన (69–98)

2.0 ఉపోద్ఘాతం: 60–98

2:1 పింగళి, కాటూరి జంట కవిత్వం: 60
2.2. తొలకరి ఖండకావ్య సంపుటి: 62
2.2.1. కవితా సామగ్రి: 62
2.2.2. కవి శిశువు: 67
2.2.3. కోకిల: 68
2.2.4. సంక్రాంతి: 71
2.2.4.1. గంగిరెద్దుల వాళ్ళు: 73
2.2.4.2. కొత్త పెండ్లి కొడుకు మర్యాద: 74
2.2.4.3. కోడి పందాలు ఆట: 74
2.2.4.4. పల్లెల్లో ఆనంద పారవశ్యం: 76
2.2.4.5. బ్రాహ్మణులకు దానాలు: 77
2.2.5. జొన్న చేను: 78
2.2.6. ఎడబాటు : 80
2.2.7. అజ్ఞానకృతము: 82
2.2.7.1. కృష్ణశాస్త్రీ కృష్ణపక్షం: 84
2.2.7.2. కరుణశ్రీ 'పుష్పవిలాపం': 86
2.2.8. రసాలము: 89
2.2.9. తొలిపూత: 90
2.2.10. ఎవరు నీవు?: 90
2.2.11.బోనులో సింగం: 91
2.2.12. రక్త తిలకము: 92
2.2.12.1. చిత్తోర్ ఘడ్ రాజ్యం: 93
2.2.12.2. రాణి పద్మావతి: 95
2.13.కావ్య ఫలితాలు: 97

మూడవ అధ్యాయం

## పింగళి – కాటూరి –'సౌందరనందం' కావ్య వైశిష్ట్యం (99-135)

3.0.ఉపోద్ఘాతం: 99
3.1. ప్రథమ సర్గ పునరాగమనం: 100
3.2.ధర్మచక్ర ప్రవర్తనం: 101
3.3. భిక్షాగమనం: 101
3.4. పరివ్రాజనం: 104

3.5. నిరీక్షణ: 106
3.6. అనుతాపం: 109
3.7. 1. బుద్ధోపదేశం: 112
3.8. ధర్మ సంవాదం: 115
3.9. అనుజ్ఞ: 119
3.10. సహధర్మ చర్యం: 122
3.11.1.సమ్యక్ దృష్టి (మంచిని అన్వేషించడం): 125
3.11.2. సమ్యక్ సంకల్పం (మంచి సంకల్పం): 125
3.11.3. సమ్యక్ కర్మ (మంచి పనులు): 126
3.11.4.సమ్యక్ వ్యాయామం (మంచి ప్రయత్నం ): 126
3.11.5.సమ్యక్ స్మృతి (మంచి దృక్పథం): 126
3.11.6. సమ్యక్ సమాధి (మంచి ధ్యానం) : 127
3.12.ఆర్య సూత్రాలు: 127
3.12. త్రిరత్నాలు: 128
3.13. శాంతి, కరుణ, సత్యం: 129
3.14. విశ్వ మానవ ప్రేమ సిద్ధాంతం: 129
3.15.పేదలకు సేవ: 130
3.16. ఆంధ్ర సౌందరనందము – పాత్ర పోషణ: 131
3.16.1. బుద్ధుడు: 131
3.16.2. సుందరి నందుడు: 132
3.16.3. కావ్య నాయిక సుందరి: 133
3.16.4. బుద్ధుడు: 133
3.16.5. ఇతర పాత్రలు: 135
3.16.6. నాయకుడు: 135

నాల్గవ అధ్యాయం

## పింగళి లక్ష్మీకాంతం – స్వతంత్ర పద్య కవిత్వం పరిశీలన

(136–178)

4.0 ఉపోద్ఘాతం: 136
4.1 ఆత్మ లహరి: 136
4.1.1 పర్వతా రోహణము: 137

4.1.2 సవిత: 139
4.1.3 దైవస్తుతి: 140
4.1.4 ఆదివైద్యుడు: 141
4.1.5 ప్రణయ లేఖలు: 143
4.1.6 తిక్కనామాత్య: 146
4.1.7 తిలక్ నిర్యాణం: 148
4.1.8 శివబ్రహ్మైక్యం: 150
4.1.9 గురు కీర్తనం: 151
4.1.10 విశ్వ శిల్పి: 153
4.1.11 లక్ష్మీ నిర్గమనము: 154
4.1.11.1 లక్ష్మీ నరసమ్మ శ్రీరామ నవమి నాడు మరణించడం: 154
41.11.2 నాలుగు దశలుగా సాగిన దాంపత్య జీవితం: 155
4.1.11.3 భార్యకు పుస్తకాన్ని అంకితమివ్వడం: 156
4.1.11.4 లక్ష్మీ పోయె కాంతుడు మిగిలే: 156
4.1.11.5 హరిహరనాథతత్త్వం: 157
4.1.11.6 స్వర్గలోకంలో ముచ్చట్లు: 157
4.1.11.7 సీతా రాముల దాంపత్య విషయాలను తెలుసుకొనుట: 158
4.1.11.8 తిరుపతిలోని పద్మావతి ప్రార్థన మండలి వ్యవస్థాపకురాలు: 158
4.1.11.9 సౌందరనందంలో నాయికగా పింగళి లక్ష్మీ నరసమ్మ: 160
4.1.11.10 జనన మరణాలు సహజం (మోక్షం): 160
4.1.11.11 శ్రీ వేంకటేశ్వర ప్రశంస: 161
4.1.12 ఆత్మ లహరి (నేను): 162
4.1.12.1 పింగళి వంశం: 163
4.1.12.2 తన రచనల అచ్చు కావడానికి దూరంగా ఉండుట: 163
4.1.12.3. వివాదాలకు దూరంగా ఉండటం: 164
4.1.12.4. అధికారాన్ని మన్నించినా అవ గుణాన్ని మన్నించలేని తత్త్వం: 164
4.1.12.5. తండ్రి నుంచి సంక్రమించిన గుణం: 165
4.1.12.6. శిష్యవాత్సల్యం: 165
4.1.12.7. సత్య వాక్ పరిపాలన: 165
4.1.12.8. శాంత స్వభావం కలవాడు: 166
4.1.12.9. కావ్య పరమార్థాల పట్ల నిష్కోష ఉండటం: 166
4.1.12.10. గురువుకే తన కావ్యాన్ని అంకితం ఇవ్వడం: 167

4.2. పింగళి లక్ష్మీకాంతంగారి భక్తి తత్త్వం: 167
4.2.1 అంకితం పద్యాలు – భక్తి తత్త్వం: 168
4.2.3. సంస్కృత కుమార వ్యాకరణం (1968): 169
4.2.4. పాఠాలు చెప్పేటప్పుడు వ్యక్తమైన పవిత్ర భావన: 171
4.2.5. శ్రీ వేంకటేశ్వర స్వామి పై ప్రత్యేక భక్తి: 172
4.2.5.1. పర్వతారోహణము: 172
4.2.5.2. సవిత: 172
4.2.5.2. దైవ స్తుతి: 173
4.3. నేను ఖండిక: 173
4.4. ప్రణయ లేఖల్లో మధుర భక్తి: 174
4.5. మధుర పండిత రాజము(1962): 175
4.6. అవధానాలలో భక్తితత్త్వం: 176
4.7. శ్రీ పద్మావతీ ప్రార్థనా మందిరం నిర్మాణం: 176
4.8. సాహిత్య చరిత్రలో వ్యక్తమైన భావనలు: 176
4.9. పింగళి వారి శతకాల్లో భక్తితత్త్వం: 177

ఐదవ అధ్యాయం

## సాహిత్య విమర్శకుడుగా పింగళి లక్ష్మీకాంతం (179-234)

5.0 సాహిత్య విమర్శకుడు: 179
5.1 విమర్శకుడిగా గుర్తించే అంశాలు: 179
5.2. సాహిత్య విమర్శ నిర్వచనాలు (పాశ్చాత్యులు): 180
5.2.1 సాహిత్య విమర్శ లక్షణాలు: 180
5.2.2. సాహిత్య విమర్శ పద్ధతులు: 181
5.3. గ్రంథ పరిష్కరణ విమర్శ: 182
5.3.1. పల్నాటి వీర చరిత్ర పరిష్కరణ: 184
5.3.1.2 పల్నాటి వీర చరిత్ర పరిష్కరణ కవి పాండిత్య పరిశీలన: 184
5.3.2. రంగనాథ రామాయణం గ్రంథపరిష్కరణ: 187
5.3.3. విష్ణుపురాణం:(1931) 188
5.3.3.1 విష్ణుపురాణం పరిష్కరణాంశాలు: 189
5.3.3.2 విష్ణుపురాణాన్ని తులనాత్మకంగా పరిశీలన చేయడం: 189
5.3.3.4 పట్టిక: విష్ణుపురాణంలోని శబ్దాల పరిష్కరణ: 190
5.4. కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ: 191

5.4.1. నన్నయ భారత రచనా కాలము: 192
5.4.2. నన్నెచోడుడు కుమార సంభవం: 192
5.4.3. పాల్కురికి సోమనాథుడు: 193
5.4.4. తిక్కన కవి జీవితసమన్వయ కావ్య విమర్శ : 194
5.4.4.1, తిక్కన కృతులు: 195
5.4.4.2 నిర్వచనోత్తర రామాయణం: 195
5.4.4.3. నన్నెచోడుడు తిక్కన కావ్య లక్షణాల తులనాత్మక లక్షణాలు: 196
5.4.4.4. నిర్వచనోత్తర రామాయణంలో వదిలిపెట్టిన అంశాలు: 197
5.4.4.5. నిర్వచనోత్తర రామాయణం-తిక్కన శిల్ప దృష్టి: 197
5.4.4.6. తిక్కన భారత వైశిష్ట్యం: 198
5.4.5. శ్రీనాథుడు కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ: 198
5.4.5.1.హరవిలాసం: 199
5.4.5.2.సిరియాలుని పాత్ర: 199
5.4.5.3.భీమేశ్వర పురాణం: 200
5.4.5.3.1. అగస్త్యుడి పాత్ర: 200
5.4.5.4. వర్ణనలు –శ్రీనాథుని జీవితవిశేషాల పరామర్శ: 201
5.4.5.5. క్రీడాభిరామం కర్తృత్వం: 201
5.4.6. శ్రీకృష్ణదేవరాయలు కవిజీవిత విమర్శ: 203
5.4.7. నంది తిమ్మన కవిజీవిత కావ్యసమన్వయ విమర్శ: 204
5.4.7. అయ్యలరాజు రామభద్రుడు- కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ: 206
5.4.8. వేమన సాహిత్యం-కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ: 206
5.5. తులనాత్మక సాహిత్య విమర్శ: 210
5.5.1.ఎర్రన, సోమన హరివంశం తులనాత్మక విమర్శ: 211
5.5.2. సోమన రసపోషణ విధానం: 210
5.5. 3.ఎర్రన, సోమన హరివంశం, పురాణం- తులనాత్మక విమర్శ: 210
5.6. చారిత్రక సాహిత్య విమర్శ: 213
5.6.1. నన్నయ భారత రచనా కాలము –చారిత్రక సాహిత్య విమర్శ: 214
5.7. సాహిత్య ప్రక్రియా విమర్శ: 220
5.7.1.కావ్య భేదాలు: 221
5.7. 2. కులకం నిర్వచనం: 222
5.7. 3. కావ్యం- ప్రబంధం: 222
5.7.4. రాయల యుగం ప్రబంధ లక్షణాలు: 224

5.7.4.1. ప్రబంధ నిర్వచనం: 224
5.7. 6. నవలా ప్రక్రియ: 224
5.7.7. ఒక సాహిత్య ప్రక్రియగా వ్యాసం: 225
5.7.8. సాహిత్య ప్రక్రియగా జీవిత చరిత్ర: 226
5.7.9. సాహిత్య విమర్శ ప్రక్రియ: 228
5.7.10. నాటక ప్రక్రియ పింగళి వారి దృక్పథం: 229
5.7.10.1. నాటకంలో అంకం: 230
5.7.10.2. నాటకంలో పంచ సంధులు: 231
5.7.10.3. నాటకంలో అర్థోపక్షేపకములు: 232
5.7.10.4. నాటక సాహిత్య విమర్శ: 233
5.8. ఆలంకారిక విమర్శ –రస సిద్ధాంతం: 234
5.8.1, భారతీయ ఆలంకారికులు –రస సిద్ధాంతం: 234
5.8.2. రస స్వరూప వివేచన: 236
5.8.3. శృంగార రస భేదాలు: 236
5.8.4. రస రాజం: 238
5.8.5. కరుణ రసం: 239
5.8.6. శాంత రసం: 240
5.8.8. శృంగార రసం: 240
5.9. పద్నాలుగు రకాల నైజాలు పట్టిక: 241
5.10. నవరసాలు వాటి స్థాయీ భావాల పట్టిక: 243

ఆరో అధ్యాయం

## పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం (245-332)

6.0. పింగళి లక్ష్మీకాంతం పరిశోధన: 245
6.1. సాహిత్య పరిశోధన పద్ధతులు లేదా విధానాలు: 245
6.2. పాఠ్య పరిశోధన విధానం: 245
6.3. జీవన చారిత్రక పరిశోధన విధానం: 246
6.4. కవి/ కృతి కాల పరిశోధన: 246
6.5. ప్రక్రియా వికాస పరిశోధన: 246
6.6. తులనాత్మక (Comparative) పరిశోధన: 247
6.7. సాహిత్య పరిశోధన – సాహిత్య విమర్శ: 247
6.8 సాహిత్య చరిత్ర నిర్మాణం–పరిశోధన: 250

6.8.1. సాహిత్య చరిత్రలు – యుగ విభజన విశిష్టత : 250
6.8.2. కావ్య అధ్యయన పద్ధతులు: 252
6.8.3. యుగకర్త నిర్వచనం–పింగళి అభిప్రాయం: 252
6.8.4. సాహిత్య చరిత్రలో ప్రక్రియ వికాస స్వభావం: 254
6.8.5. సాహిత్య యుగ విభజన తులనాత్మక పరిశీలన: 255
6.9. గౌతమ వ్యాసములు : 255
6.10. ఆంధ్ర సాహిత్య చరిత్ర: 256
6.11. విజ్ఞాన సర్వస్వంలో సాహిత్య చరిత్ర నిర్మాణం : 256
6.12. పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య చరిత్రలు–తులనాత్మకత: 257
6.13. యుగవిభజన – పట్టిక: 258
6.14. సాహిత్య శిల్ప సమీక్ష–విమర్శనాత్మక పరిశోధన: 259
6.15. పింగళివారి పీఠికలు– పరిష్కరణ పరిశోధన: 260
6.15.1. రంగనాథరామాయణం పీఠిక: 260
6.15. 2. మా భూమి నాటకం 262
6.15.3.'ముసలమ్మ మరణము: 263
6.15.4. కళ్యాణ రాఘవము : 264
6.16. ఆధునిక యుగం: 265
6.17. కవిజీవిత సమన్వయ పరిశోధన: 268
6.17.1. సంస్కృత కవి కాళిదాసు: 268
6.17.2. భాసనాటకకర్తృత్వము: 270
6.17.3. ఆముక్తమాల్యద ప్రబంధం కర్తృత్వం– పరిశోధన దృక్పథం: 271
6.17.4. అల్లసాని పెద్దన మను చరిత్ర పరిశోధన దృష్టి: 272
6.17.4.1. మను చరిత్ర– వస్త్వైక్యము పింగళి : 273
6.17.4.2. మను చరిత్ర రస పోషణ: 273
6.17.4.3. వరూధిని, ప్రవరాఖ్యుల పాత్రల గుణాల వైశిష్ట్యం: 274
6.17.4.4. మను చరిత్ర నాటకీకరణ విధానం: 274
6.18. సాహిత్య ప్రక్రియలు–పరిశోధన: 275
6.18.1. ద్విపద కవిత్వం నిర్వచనం: 275
6.18.2. పద కవిత నిర్వచనం: 276
6.18.3. ప్రబంధ ప్రక్రియ: 277
6.18.4. కావ్యము – కవిత్వము నిర్వచనం: 278
6.18.4.1. వస్తు, శిల్పా కవిత్వము నిర్వచనం: 278

6.18.5. నిబద్ధ, అనిబద్ధ కావ్య ప్రక్రియలు నిర్వచనాలు: 279
6.18.6. దృశ్య కావ్యం: 279
6.18.7. శ్రవణ కావ్యం: 279
6.18.8. సంగీత కావ్యం: 279
6.18.8.1. నిబద్ధ కావ్యము: 279
6.18.8.2 అనిబద్ధ కావ్యాలు: 280
6.18.9. ముక్తకం: 280
6.18.10. కులకం: 280
6.18.11.పురాణ ప్రక్రియ పరామర్శ: 280
6.18.12. ఇతిహాస ప్రక్రియ పరామర్శ : 282
6.19. భావకవిత్వం– ప్రక్రియా వివేచన: 283
6.19.1. ఆత్మాశ్రయ కవిత్వం పరామర్శ: 284
6.19.2. ఆత్మాశ్రయ కవిత్వ ప్రక్రియ నిర్వచనాలు: 284
6.19.3. గేయ కవిత్వ నిర్వచనం: 285
6.19.4.అన్యాశ్రయ కవిత్వ నిర్వచనాలు: 286
6.20. కథానిక ప్రక్రియ పరిశోధన దృక్పథం: 286
6.20.1. కథానిక ప్రక్రియ నిర్వచనం: 287
6.20.2. నవల, కథానిక పాత్రలు తులనాత్మక విమర్శ: 288
6.21. నాటక ప్రక్రియ పరిశోధన విధానం: 288
6.21.1. నాటకంలో అంకం: 289
6.21.2. నాటకంలో పంచ సంధుల ఆవశ్యకత: 290
6.21.3. నాటకంలో అర్థోపక్షేపకములు ఆవశ్యకత: 290
6.21.4. నాటకం – నాయకుడి పాత్ర విశిష్టత: 291
6.21.4.1. సంస్కృత, ఆంధ్ర నాటకాల లక్షణాలు–తులనాత్మక పరిశోధన: 291
6.21.5. నాటకం – నాయకుని పాత్ర నిర్మాణం: 282
6.21.5.1. ట్రాజెడీ నిర్వచనం– విమర్శల దృష్టి: 292
6.22. మహాభారత రామాయణాలపై పరిశోధన: 293
6.22.1. ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము: 293
6.22.1.1. శ్రీకృష్ణుడు–వ్యాసుల అవతారతత్త్వం: 294
6.22.1.2. మహాభారతేతిహాసాలు–సంస్కృతి: 296
6.22.1.3. నన్నయ ఆంధ్ర మహా భారతం: 298
6.22.1.4. వ్యాస భారతం: 299

6.22.1.5.భారతజాతికంతకు ఒకే సంస్కృతి: 300
6.22.1.6.వ్యాస భారత ఆవిర్భావం: 301
6.22.1.7. భారత ప్రతులు : 301
6.22.1.8.గౌతమ వ్యాసములలో మహాభారతాంశాలు: 301
6.23. ద్విపద భారతము : 302
6.24. మాని కొండ రామాయణము: 304
6.25.'ప్రభావతీ ప్రద్యుమ్నము దాని– మూలము' తులనాత్మక పరిశోధన: 304
6.25.1.పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నము –ఇతివృత్తం: 305
6.25.2. ప్రభావతీ ప్రద్యుమ్నములో పింగళి సూరన చేసిన మార్పులు: 306
6.25.3. శుచిముఖి పాత్ర చిత్రణ: 307
6.25.4.చిలుక పాత్ర చిత్రణ: 308
6.25.5. ప్రభావతీ ప్రద్యుమ్నము సూరన శైలి: 309
6.25.6.ప్రద్యుమ్నాభ్యుదయం సంస్కృత నాటకం–ఇతివృత్తం: 310
6.25.7 సంస్కృత హరి వంశంలోని కథ: 311
6.26. పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం– విమర్శకులు అభిప్రాయాలు: 312
6.26.1. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు: 312
6.26.2. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు: 216
6.26.3. గొల్లపూడి ప్రకాశరావుగారు 317
6.26.4. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు: 318
6.26.5.ఆచార్య ఎస్వీ రామారావుగారు: 319
6.26.6.ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు: 319
6.26.7. ఆచార్య కొలవెన్ను మలయవాసినిగారు: 319
6.26.8. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు: 320
6.26.9. తెలుగు అకాడమీవారు: 320
6.26.10. శలాక రఘునాథ శర్మగారు: 321
6.26.10.1.భారతీయ జీవన విధానంలో గురువుగా పింగళి పాత్ర విశిష్టత: 321
6.26.10.1.1. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు: 322
6.26.10.1.2. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు: 323
6.26.10.1.3. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు: 323
6.26.10.1.4. ఆచార్య కాకర్ల వేంకటరామనరసింహంగారు: 324
6.26.10.1.5. ఆచార్య తంగిరాల సుబ్బారావుగారు: 325
6.26.10.1.6. ఆచార్య నాయని కృష్ణకుమారిగారు: 326

6.26.10.1.7. శ్రీమతి పులిగడ్డ విజయలక్ష్మీగారు: 326
6.26.10.1.8. ఆచార్య జి. నాగయ్యగారు: 327
6.26.10.1.9. ఆచార్య పోణంగి శ్రీరామ అప్పారావుగారు: 328
6.26.10.1.10. డా. ప్రసాదరాయకులపతిగారు: 328
6.26.10.1.11. శ్రీ ఎఱ్ఱోజు మాధవాచార్యులు: 329
6.26.10.1.12.డా. మల్లెల గురవయ్యగారు: 330

ఏడవ అధ్యాయం

## అనువాదకుడుగా పింగళి లక్ష్మీకాంతం (333-367)

7.0. ఆంగ్ల నవలానువాదకునిగా లక్ష్మీకాంతం: 333
7.1 మాబీడిక్ నవల – పింగళి లక్ష్మీకాంతం అనువాదం: 333
7.1.1 మాబీడిక్ నవలా వస్తువు: 334
7.2 బగ్ జార్గల్ ఆంగ్ల నవలానువాదం: 336
7.2.1 నవల నేపథ్యం: 336
7.3. నవలావస్తువు: 336
7.4. బగ్ జార్గల్ కథా సారాంశం: 337
7.5 విక్టర్ హ్యూగో విశిష్టత: 338
7.6. భారతీయ తత్త్వ వేత్తగా మహాత్మా గాంధీజీ: 340
7.6.1. మానవులందరు నా సోదరులు: 340
7.6.1. గాంధీజీ సత్యనిష్ట : 341
7.6.2. ఆధ్యాత్మిక వేత్తగా గాంధీజీ: 341
7.6.3. తత్త్వ వేత్తల పట్ల గాంధీజీ వైఖరి: 342
7.6.4. గౌతమబుద్ధుని పట్ల గాంధీజీ దృక్పథం: 342
7.6.5. అహింస వాదిగా గాంధీజీ: 343
7.6.6. మతం సత్యం పట్ల గాంధీజీ దృష్టి : 343
7.6.7. గాంధీజీ దృష్టిలో ప్రపంచ శాంతి : 343
7.6.8. పేదల పట్ల గాంధీజీ ఆలోచనలు: 343
7.6.9. ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్ర : 344
7.6.10. గాంధీజీ విద్యా విధానం: 344
7.6.11. గాంధీజీ దృష్టిలో విశ్వవిద్యాలయ విద్య: 344
7.6.12. గాంధీజీ దృష్టిలో భారతీయ స్త్రీ స్థానం: 344
7.6.13. శాస్త్రీయమైన, మేధోపరమైన ఆలోచనలు: 344

| | |
|---|---|
| 7.7.అనువాదంవివిధపారిభాషికపదాలు : | 344 |
| 7.7. 1. ముగింపు | 367 |
| **పరిశోధన ఫలితాంశాలు** | 371 |
| **సింహావలోకనం** | 372 |
| **ఉపయుక్త గ్రంథ సూచిక** | 375 |
| **అనుబంధాలు** | xli - lxxxiv |
| అనుబంధం-1 | xli - lxvii |
| పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం, | |
| సాహిత్యంపై జాతీయ సదస్సుల పరిశోధన పత్రాలు | |
| అనుబంధం-2 | lxviii-lxx |
| నా పరిశోధనేతర సాహిత్య వ్యాసాలు | |
| అనుబంధం-3 | lxxi-lxxvi |
| పింగళి వారితో పరిచయం ఉన్న | |
| కొంతమంది రచయితలతో ముఖాముఖి | |
| అనుబంధం-4 | lxxvii |
| ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి పర్యవేక్షణలో జరిగిన పరిశోధనలు | |
| అనుబంధం-5 | lxxviii |
| ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవిత రేఖలకు సంబంధించిన ఫోటోలు. | |
| అనుబంధం-6 | lxxix |
| ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి వంశ చరిత్ర | |
| అనుబంధం-7 | xx |
| పింగళి వారి రచనల్లో ముఖ్యమైన కొన్ని పుస్తకాల ముఖచిత్రాలు | |
| అనుబంధం-8 | lxxxiv |
| పింగళి వారి స్వ దస్తూరి | |

# కృతజ్ఞతలు

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నా ఉన్నతిని ఆకాంక్షించే నా తల్లిదండ్రులు శ్రీనలసాని దశరథరామయ్య (B.A, Literature), శ్రీమతి నలసాని లక్ష్మమ్మగార్లకు నా పాదాభివందనాలు.

అమ్మా అనే పదానికి ఒక విలక్షణమైన స్థానాన్ని నిర్మించుకున్న డా. దార్ల మంజుశ్రీగారికి నా పాదాభివందనాలు. నాకు పరిశోధన చేయడానికి ఎంతో సమయాన్ని వెచ్చించి, సమయానికి ఆహార ఏర్పాట్లు చేసి సమయానికి తినమని చదువుకోమని, సమయానికి నిద్ర పొమ్మని, నాలో ఆత్మవిశ్వాసాన్ని, బలాన్నిచ్చి సమయాన్ని ఇచ్చి పరిశోధనను పూర్తి చేయడానికి సహకరించిన మాతృసమానురాలు డా.మంజుశ్రీ అమ్మగారికి ఎన్నిసార్లు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెప్పినా కూడా చిన్న మాటలే అవుతాయి. దార్ల సార్ దగ్గర పరిశోధన చేసే విద్యార్థులందర్నీ తన బిడ్డలుగా భావించి అప్యాయంగా అమృతాన్ని పంచుతూ పరిశోధనను తొందరగా పూర్తి చేయమని ప్రోత్సహిస్తూ మాకు మనోబలాన్ని చేకూర్చుస్తూ సహాయసహకారాల్ని ఇచ్చిన డా.మంజుశ్రీ అమ్మగారికి మరోసారి వినమ్రంగా, వినయంతో, భక్తితో పాదాభివందనాలు. అమ్మ అనే పదానికి నిఘంటువులలో చూస్తే అనేక అర్థాలు దొరుకుతాయి. కానీ, మంజుశ్రీ అమ్మగారిని చూసినప్పుడల్లా ఆమెకు నేనెందుకు జన్మించలేదని దేవున్ని తిట్టుకొనేవాణ్ణి. ఆమె కడుపున పుట్టకపోయినా కూడా నన్ను కన్న బిడ్డలా చూసుకున్న డా.మంజుశ్రీ అమ్మగారికి మరలా నా హృదయపూర్వక పాదాభివందనాలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

పరిశోధన వ్యాస సిద్ధాంతాన్ని రాయడానికి నాలో మెళకువలు తీర్చిదిద్ది కంప్యూటర్ పట్ల అవగాహన కలిగించి, మెయిల్ చూడడం, ఏదైన విషయాన్ని భద్రపరచడం, విషయాన్ని షేర్ చేయడం, సేవ్ చేయడం, కాఫీ చేయడం, కాఫీ పేస్టు చేయడం, నేనే నా వ్యాసాలను స్వయంగా తెలుగులో టైఫ్ చేసుకొనేట్లు చేయించడం, వాటిని మరలా వేరేవాళ్ళకు పంపిచడం ఇలా నాలో ఎన్నో నైపుణ్యాలను పెంపొందేవిధంగా చేసిన, సాంకేతిక నిపుణులైన నా పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగార్కి ఎన్ని సార్లు కృతజ్ఞతల చెప్పిన ఆయన రుణం తీర్చుకోలేనిది, వెలకట్టలేనిది, లెక్కించలేనిది, మాటలకు అందనిదిని భావిస్తూ వినయంతో, భక్తితో నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నాకు ఎం.ఏ. లో పాఠాలను బోధించిన ఆచార్య బృందం ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, (ద్రావిడ విశ్వవిద్యాలయం, ఉపకులపతి, కుప్పం), ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారికి, (తెలుగు శాఖ అధ్యక్షులు) ఆచార్య. ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి, గారికి, ఆచార్య జి. అరుణ కుమారి

గారికి  ఆచార్య రేమిళ్ళ వేంకట రామకృష్ణశాస్త్రి గారికి, ఆచార్య నడుంపల్లి శ్రీరామరాజుగారికి, ఆచార్య పిల్లలమర్రి రాములు గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికి, ఆచార్య డి. విజయలక్ష్మి గారికి, డా. బాణాల భుజంగ రెడ్డి గారికి, డా. దాసర విజయ కుమారి గారికి, డా. సోమయాజుల గారికి  మొదలైన  ఆచార్య బృందానికి నా హృదయపూర్వక ధన్యవాదాలను తెలియజేస్తున్నాను. అలాగే, మా తెలుగు శాఖలో కొత్తగా చేరిన ఆచార్య గోవా నాయక్ గారికి, ఇటీవలే దివంగతులైన ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

నాలో ఒత్తిడిని దూరంచేస్తూ నాతోనే ఆడుకుంటూ నన్ను కూడా ఆడమని పిలుస్తూ నాలో మరింత ఉత్సాహాన్ని కలిగించిన నా ప్రియ తమ్ముడు  ( చిన్నాన్న-దార్లసార్, చిన్నమ్మ మంజుశ్రీ అమ్మ) గారాలపట్టి చిరంజీవి దార్ల శ్రీనివాసరావుకు నా ఆశీస్సులు. పరిశోధన పూర్తి చేయమని ప్రోత్సాహించి, ధైర్యాన్నిచ్చి డా. దార్ల రవికుమార్ గారికి, సుజాతగారికి, (చిన్నాన్న, చిన్నమ్మ), దార్ల విజయలక్ష్మి అత్తగారికి. అలాగే డాక్టర్ బాబుకు, తమ్ముళ్లు దార్ల సాత్విక్, దార్ల మురళీ, దార్ల సుధీర్, దార్ల అనిబిసెంట్ కు, చెల్లి దార్ల సునీతకు నాఆశీస్సులు. నానమ్మ శ్రీమతిపెదనాగమ్మగారికి నా కృతజ్ఞతలు. నా పరిశోధన పూర్తి చేయమని ప్రోత్సాహించిన అమ్మమ్మ శ్రీమతి సరోజగారికి,  శశి మామయ్యగారికి, వసు,మాయా, కనకా చిన్నమ్మ గార్లకు(వికారాబాద్) నా ప్రత్యేక కృతజ్ఞతలు.

పింగళి లక్ష్మీకాంతంగారి రచనలను ఇచ్చి తన  నా సందేహాలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పిన ఆచార్య పింగళి శైలజాగారికి(Prof. Pingali Sailaja Department of English and Comparative  study , University of Hyderabad), పింగళి లక్ష్మీకాంతంగారి వంశ వృక్షం గురించి సమాచారాన్ని ఇచ్చిన పింగళివారి మేనల్లుడు సి. శివ చందర్ గారికి( హైదరాబాద్) ధన్యవాదాలు.

అలాగే పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం, సాహిత్యాంశాలన్నింటినీ ప్రశ్నావళి రూపంలో తెలియజేసిన విలువైన సమయాన్ని ఇచ్చిన పింగళి వేంకట కృష్ణారావుగారికి(విజయవాడ,రిటైర్డ్ తెలుగు ఉపన్యాసకులు), పింగళి లక్ష్మీకాంతగారి సాహిత్య సమాచారాన్ని పుస్తక రూపంలో ఇచ్చిన డా. ఆర్. అనంతపద్మనాభరావుగారికి ( retired radio chief administrative officer New Delhi), అలాగే డా, నాగసూరి వేణుగోపాల్ గారికి (retired radio chief administrative officer New Delhi), అలాగే పింగళి లక్ష్మీకాంతంగారి అధ్యయన, బోధనల గురించి కేవలం  ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇచ్చిన పింగళి లక్ష్మీకాంతంగారి ప్రత్యక్ష శిష్యుడు ఆచార్య బి. ఎల్. శంకర్రావుగారికి, (తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు మద్రాసు విశ్వవిద్యాలయం),అలాగే పింగళి లక్ష్మీకాంతంగారి గురించి మౌఖికంగాను, వ్యాసంగా కొంత సమాచారాన్ని అందించిన పింగళివారి విద్యార్థి శ్రీమతి పులిగడ్డ విజయలక్ష్మిగారికి(హైదరాబాద్) కమోవాక్కులు.

నా పరిశోధనకు సంబంధించి వివిధ సందర్భాలలో వారితో మాట్లాడినప్పుడల్లా నాకు సూచనలు సలహాలు ఇచ్చినటువంటి ఆచార్య బన్న ఐలయ్యగారికి (కాకతీయ విశ్వవిద్యాలయం,

వరంగల్) ఆచార్య మాడభూషి సంపత్ కుమారగారికి (ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, Centre of Excellence for Studies in Classical Telugu, CESCT, నెల్లూరు), ఆచార్య జి. యోహాను బాబుగారికి (ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు), ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తిగారికి (బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం), డా. ఎస్. రఘుగారికి (తెలుగుశాఖ, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, కోఠి, హైదరాబాద్), ఆచార్య విస్తాలి శంకరరావుగారికి (తెలుగుశాఖ అధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం), ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారికి, (విశ్రాంత, ఆచార్యులు, యోగివేమన విశ్వవిద్యాలయం), ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావుగారికి (తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు), ఆచార్య మేడిపల్లి రవికుమార్ గారికి (తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి), ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మగారికి (తెలుగుశాఖ అధ్యక్షులు, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి), ఆచార్య నరసింహులుగారికి (శ్రీకృష్ణదేవరాయలు విశ్వవిద్యాలయం, అనంతపురం), ఆచార్య బాల సుబ్రమణ్యంగారికి, (తెలుగుశాఖ అధ్యక్షులు, శ్రీకృష్ణదేవరాయలు విశ్వవిద్యాలయం), ఆచార్య జయదేవ్ గారికి, (తెలుగుశాఖ పూర్వ అధ్యక్షులు, ఆంధ్ర విశ్వకళా పరిషత్తు), ఆచార్య జర్రా అప్పారావుగారికి, (తెలుగుశాఖ అధ్యక్షులు, ఆంధ్ర విశ్వకళా పరిషత్, వాల్తేరు), ఆచార్య రామనాథం నాయుడుగారికి, (తెలుగుశాఖ అధ్యక్షులు, కర్ణాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు), ఆచార్య ఏటూరి జ్యోతిగారికి(కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్), ఆచార్య కాత్యాయనీ విద్మహేగారికి(తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు కాకతీయ విశ్వవిద్యాలయం,వరంగల్), ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారికి (తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్), ఆచార్య గుజ్జర్లమూడి కృపాచార్యులగారికి (ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం), డా. లావణ్యగారికి (తెలుగు శాఖ తెలంగాణ విశ్వవిద్యాలయం నిజామాబాద్), డా. జెరుపుల రమేష్ గారికి(తెలుగు శాఖ అధ్యక్షులు, యస్. ఆర్. బి. యన్. ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఖమ్మం) వారికి నా హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం సాహిత్యాలపై జరిగిన పిహెచ్.డి సిద్ధాంత పరిశోధన గ్రంథాన్ని జిరాక్స్ తీసుకోవడానికి అనుమతి ఇచ్చి నా పరిశోధనకు సహకరించి పరిశోధన పూర్తి చేయమని సలహాలు, సూచనలు ఇచ్చిన మాతృమూర్తి ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మగారికి(తెలుగుశాఖ అధ్యక్షులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి) నా హృదయపూర్వక ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. పరిశోధన బాగా చేయమని ప్రోత్సహించిన ఆచార్య పులికొండ సుబ్బాచారి గారికి నమోవాక్కులు.

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య పొదిలే అప్పారావుగారికి, ఆచార్య సర్రాజుగారికి (ప్రో-వైస్ ఛాన్సలర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్), ఆచార్య వి.కృష్ణగారికి (డీన్, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) ఆచార్య జి.

నాగరాజుగారికి, చీఫ్ వార్డెన్ గా పనిచేస్తున్న పని చేస్తూ ఆచార్య వినీత్ నాయర్ గారికి, NX Hostal వార్డేన్ గా పని చేసిన డా. ప్రమోద మిశ్రాగారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు.

అలాగే నా పరిశోధనకు ఎలాంటి ఆటంకాలు అడ్డంకులు లేకుండా సజావుగా కొనసాగడానికి నా పట్ల ప్రేమ ప్రదర్శిస్తూ కలిగించిన నా కుటుంబ సభ్యులైన నలసాని రామకృష్ణ, అ నలసాని చిన్నక్క, నలసాని కుదిరప్ప, నలసాని గిరిజమ్మ, బూరగ నారాయణ, బూరగ శ్రీనివాసులు, బూరగ శివమ్మ, బూరగ నరసింహులు, నలసాని నిర్మలమ్మ, నలసాని సుజాత, కవిత అక్క, కృష్ణమ్మ ఒదిన, సుగుణమ్మ ఒదిన, శశికళ ఒదిన గార్లకు ధన్యవాదాలు. అలాగే మా అందరి జీవితాల్లో వెలుగులు నింపుతూ ఆనందాన్ని నింపుతున్న అనిత, రజిత, పూజిత, భవ్య, విజయ్, రుద్రా, దావ్యాంశ్, మానస, బాలు, లాస్య, చరణ్ లకు నా ఆశీస్సులు.

నలసాని వంశానికే కాకుండా చుట్టు ప్రక్కల గ్రామాలకు వివిధ సందర్భాలలో ఆర్థికంగా వస్తు, ధన రూపాలలో పేద ప్రజలకు చేవ చేసి ఆ పుణ్య ఫలాల్ని పరలోకం నుంచి మమ్మల్ని దీవిస్తున్న ముత్తాతలు, తాతలు కీర్తిశేషులైన నలసాని పెద్దప్పల్ల, చిన్నప్పల్ల, నరసప్ప(1978), మునెప్ప, అప్పల్ల, చిన్నప్ప, అబ్బా గంగులప్ప, అబ్బా లక్ష్మయ్య, అబ్బా కదిరప్పగార్లకు వందనాలు. నాకు వ్యవసాయం అందులోని నైపుణ్యాన్ని నేర్పించిన సహృదయశీలి, నిగర్వి, నిస్వార్ధ జీవి మా కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉండి ఇటీవలే దివంగతులైన మా పెద్దనాన్న కీ.శే. నలసాని నరసింహులుగారికి నన్ను చూడగానే అప్యాయంగా పలకరించి నాకు తెలియని జీవిత మర్మాలను చెప్పిన పెద్దనాన్న కీ.శే. నలసాని నరసింహులుగారికి, పిల్లల్ని చూడగానే చిరునవ్వును నవ్వి తల నిమురుతూ అందరిని దగ్గరకు తీసుకొని ప్రేమతో వీళ్లందరు నా తమ్ముళ్ల పిల్లలని సంతోషిస్తూ తన ప్రేమను పంచి దివంగతులైన చిన్ననరసింహులుగారికి నా పాదాభివందనాలు. నా పట్ల అపారమైన అభిమానాన్ని చూపుతూ ప్రేమగా పలకరించే మా పెద్దమ్మలు నలసాని వేంకట లక్ష్మమ్మ, లక్ష్మీదేవీ, బూరగ రమణమ్మ, గంటా ప్రభావతీగార్లకు నా పాదాభివందనాలు. నన్ను ప్రేమగా పలకరించే నలసాని నరసింహులు (APS RTC) హరికృష్ణ, వేమనారాయణ, కీ.శే. నరసింహులు (ఉపాధ్యాయులు), చంద్రశేఖర్ (తెలుగు ఉపాధ్యాయులు), నరసింహులు (చిన్నోడు), సుధాకర్, మా మేనమామలు అబ్బా నరసింహులు, అబ్బా రామచంద్ర, అబ్బా ఆంజనేయులు, పోతినేని ఉత్తన్న, పోతినేని ఆంజనేయులు, పట్టా వేమయ్య, గార్లకు ధన్యవాదాలు. అలాగే నా పరిశోధన పూర్తి కావడానికి సహకారాల్ని ఇచ్చి కుటుంబ భారాన్ని మోస్తూ నడిపించిన నలసాని శ్రీలత, శారదా, సరస్వతి, రాపర్తి రాణీ, చంద్రిక, సురేఖ లకు నా ఆశీస్సులు. అలాగే పరిశోధనకు సహకరించిన అన్న వేమయ్య , ఒదిన రాజేశ్వరీ గార్లకు నమస్కారాలు. తమ్ముళ్లు విష్ణు, విశ్వనాథ, గోపాల్, చంద్రమోహన్, అబ్బా సుధాకర్, తమ్ముళ్లు సతీష్, తులసీ, జయప్రకాష్, పురుషోత్తం, తేజ, వినోద్, వినయ్ లకు నా ఆశీస్సులు. పరిశోధన చేయడానికి సహకరించి, నా కుటుంబ క్షేమాన్ని నాకు తెలిపిన సోదరుడు జి. ఓం ప్రకాష్, టి. వేంకటరమణ, టి. మల్లికార్జున

(ఉపాధ్యాయుడు), టి. జగన్మోహన్ (ఎంపీపీ. గాండ్లపెంట), టి. మధుసూదన్ గార్లకు ధన్యవాదాలు.

నా పరిశోధన విషయ సేకరణలో పింగళి లక్ష్మీకాంతంగారి లభించని గ్రంథాల్ని 'నా రేడియో ప్రసంగాలు' పుస్తకం వంటి వివరాలను తెలిపి తోడ్పడిన డా పింగళి వేంకట కృష్ణారావు ( విజయవాడ) గారికి నా ప్రత్యేకమైన నయోవాక్కులు. అలాగే 'సరస భారతి సంస్థ' (ఉయ్యూరు, కృష్ణా జిల్లా)వారు ప్రతి సంవత్సరం ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జయంతి, వర్ధంతులను చేస్తుంటారు. నా పరిశోధన విషయాన్ని తెలిసి ఆ సంస్థ వారితో మాట్లాడినప్పుడు తన సహకారాన్ని సమాచారాన్ని ఇచ్చిన గబ్బిట దుర్గాప్రసాద్ గార్కి నా ధన్యవాదాలు.

అంతర్జాలంలో నా పరిశోధనాంశాల విషయ సేకరణకు సంబంధించిన వ్యాసాల్ని అంతర్జాలంలో పొందుపరిచిన ఆంధ్ర భారతి, మిసిమి, కౌముది, భావవీణ మొదలైన మాస పత్రికల యాజమాన్యాలకు నా అభివాదాల్ని తెలుపుతున్నాను. నా పరిశోధనకు సంబంధించిన వ్యాసాలను ప్రచురించిన 'రాయలసీమ జాగృతి' మాస పత్రిక (అనంతపురం) ఎడిటర్ శ్రీసాకే శ్రీహరిమూర్తిగారికి, భావవీణ మాస పత్రిక ఎడిటర్ డా. బూసి వేంకట స్వామి (ఆంధ్ర విశ్వ కళా పరిషత్, వాల్తేరు) గారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అలాగే నా పరిశోధనకు సంబంధించినవి మాత్రమే కాకుండా తెలుగు సాహిత్యానికి సంబంధించిన నేను రాసిన వ్యాసాలను ప్రచురించిన 'ప్రజామణిపూస' మాస పత్రిక (విశాఖపట్నం) చీఫ్ ఎడిటర్ శ్రీకనపర్తి రాజారావు గారికి, ఆంధ్రప్రభ దినపత్రిక (హైదరాబాద్) యాజమాన్యానికి కూడా నా హృదయపూర్వకమైన ధన్యవాదాలను తెలుపుతున్నాను.

యూనివర్సిటీలో నాకు చేదోడువాదోడుగా ఉన్న నా సీనియర్, డా.సతీష్, డా, నాగరాజు, డా. ఆదినారాయణ, డా. ఉమేష్, డా. బాలిరెడ్డి , డా. రాజేంద్ర, డా. శ్రీధర్, డా. చంద్రమౌళి, కె. రవి, లకు ధన్యవాదాలు.

మిత్రులు డా. AVVK చైతన్య, డా. మస్తాన్ ,గుప్తా, వేణు, స్వామి, లింగరాజు, రాఘవేంద్ర, మహేందర్, గోపి, భరత్,అశోక్ పుష్పిని, సుజన, మారుతి, కృష్ణవేణీ గార్లకు ధన్యవాదాలు.

కరోనా వల్ల లాక్ డౌన్ సమయంలో నేను యూనివర్శిటిలోనే ఉన్నప్పుడు నాకు ఆర్థికంగా ఆదుకొని, మనోధైర్యాన్ని, నా పట్ల ప్రేమను, అభిమానాన్ని చూపించి చేదోడువాదోడుగా నిత్యం ఫోన్ ద్వారా పలకరించిన ప్రియ తమ్ముడు అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, సుమలతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు, ఆశీస్సులు.

యూనివర్సిటీలో నాకు సహకరించిన 'అంబేద్కర్ విద్యార్థి సంఘం', 'ఒ.బి.సి. విద్యార్థి సంఘం' మిత్రలకు ముఖ్యంగా గోపి స్వామి, డానియల్, వినోద్, శివా, అభిషేక్ లకు, నా ప్రత్యేక

కృతజ్ఞతలు. యూనివర్శిటీ పరిపాలన అధికారులకు, ఫెలోషిప్ విభాగం, సెక్యూరిటీ అధికారులకు, వైద్య విభాగ అధికారులకు నా ధన్యవాదాలు.

అలాగే, నా పరిశోధన పుస్తకాలను ఇచ్చి పరిశోధన పూర్తి చేయడానికి సహకరించిన ఇందిరాగాంధి మెమోరియల్ నేషనల్ లైబ్రరీ (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్) డా. శ్రీనివాస్, డా. శివశంకర్, సురేంద్ర గార్లకు పుస్తకాలను తీసిచ్చి జిరాక్స్ చేయించిన లైబ్రరీ ఉద్యోగులకు నా ధన్యవాదాలు.

మా తెలుగు శాఖ నాన్ టీచింగ్ స్టాఫ్ కృష్ణ బాబాయి, మధు గార్లకు ప్రత్యేక ధన్యవాదాలు. నా పరిశోధన పూర్తి చేయడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు.

పరిశోధకుడు




నలసాని రాంప్రసాద్

16HTPH21

# సంకేత పదాలు

(సంపా) : సంపాదకులు

(ప్ర.భా) :ప్రథమ భాగం

(ద్వి.భా) :ద్వితియ భాగం

(తృ.భా) :తృతీయ భాగం

(చ .భా) :చతుర్థ భాగం

(ప.భా) :పంచమ భాగం

(ప్ర.ము) :ప్రథమ ముద్రణ

(ద్వి. ము) :ద్వితీయ ముద్రణ

(APA) :American Psychological Association

(I.C) : Internal citation

# ప్రస్తావన

**పరిశోధనాంశం పరిచయ (Introduction)**

తెలుగు సాహిత్యంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతం (1894–1972) అనే పేరు వినగానే మనకు గుర్తుకు వచ్చేవి రెండు ముఖ్యమైన గ్రంథాలు. మొదటిది *'ఆంధ్ర సాహిత్య చరిత్ర'*, రెండోది *'సాహిత్య శిల్ప సమీక్ష'*. ఇవే కాకుండా *'గౌతమ వ్యాసములు'*, *పీఠికలు*, *'ఆత్మలహరి'*, *'మధుర పండిత రాజము'* మొదలైన ఖండకావ్యాలు రాశారు. కాటూరి వెంకటేశ్వరరావుతో కలిసి జంట కవిత్వంగా *'తొలకరి'*, *'సౌందర నందనం'* అనే రెండు ఖండ కావ్యాలు రచించారు. వీటితో పాటు పల్నాటివీరచరిత్రను పరిష్కరించిన పరిశోధన మొదలైనవి మనకు గుర్తుకు వస్తాయి. పింగళి లక్ష్మీకాంతంగారు తొలి తరం గ్రంథ పరిష్కర్తలైన వేటూరి ప్రభాకరశాస్త్రిగారికి సమకాలికుడు. ఆ కాలంలో అగ్రశ్రేణి పండితుల మధ్య వీరి సాహిత్య అధ్యయనం కొనసాగింది. పింగళి లక్ష్మీకాంతంగారు కవిగా, సాహిత్య అధ్యాపకునిగా, విమర్శకునిగా, పరిశోధకుడిగా, రేడియో ప్రవక్తగా, విభిన్న రకాలుగా సాహిత్యానికి సేవ చేశారు. ఇన్ని రచనలు చేసిన వీరిపై కొన్ని రచనలపై తప్ప సమగ్ర రచనలపై పరిశోధన జరగలేదు. ఈ కారణాలతో పింగళి లక్ష్మీకాంతంగారి రచనలపై పరిశోధనలను జరగలవలసిన అవసరం ఉంది.

**పరిశోధన ఆవశ్యకత (Necessity of the Research)**

ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఒక సంస్థ చేయవలసిన పనులను చేసినపుడు ఆ వ్యక్తి భవిష్యత్ తరాలకు ప్రేరణ, ప్రమాణం అవుతాడు. తెలుగు సాహిత్యంలో ఈ కోవకు చెందిన అతి కొద్దిమంది వ్యక్తులలో పింగళిలక్ష్మీకాంతంగారు ఒకరు. కానీ తెలుగు సాహిత్యంలో సాహిత్య శిల్ప సమీక్షకుడిగానే పింగళివారు ప్రసిద్ధులు. కవిగా, విమర్శకుడిగా, పరిశోధకుడిగా పింగళివారి కృషి బహుముఖీనమైనది. ఇటువంటి సాహితీవేత్త కృషిని నవతరానికి పరిచయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. తెలుగుకు ఇప్పటికీ ఒక సమగ్ర సాహిత్య చరిత్ర అంటూ లేదు. ప్రామాణికత విషయంలో, శాస్త్రీయ పద్ధతులను అనుసరించి నిర్మించిన అతి కొద్ది సాహిత్య చరిత్రలలో ఒకటి లక్ష్మీకాంతంగారు రచించిన ఆంధ్ర సాహిత్య చరిత్ర. ఈ విధంగా భిన్న సాహిత్య ప్రక్రియలలో పింగళి లక్ష్మీకాంతంగారి కృషిని, అనుసరించిన పద్ధతులను, ప్రతిపాదించిన సిద్ధాంతాలను పరిశోధనాత్మక దృష్టితో వివేచించవలసిన అవసరం ఉంది. అలాంటి సాహితీవేత్త తెలుగు సాహిత్యానికి అందించిన రచనలను పరిశీలించి పరిశోధించాల్సిన అవసరం ఉందన్న ఉద్దేశంతో ***'పింగళి లక్ష్మీకాంతం రచనలు – పరిశీలన'*** ను ఎన్నుకున్నాను.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి గురించి కొన్ని పరిశోధనలు జరిగినప్పటికీ ఆయన సాహిత్య విమర్శ పరిశోధన, సమగ్ర జీవితంపై చిన్నచిన్న వ్యాసాలు తప్ప ప్రత్యేక

పరిశోధనలు జరగలేదు. *'పింగళి లక్ష్మీకాంతం గారి కావ్య సమాలోచనము'* అనే పేరుతో పింగళి వేంకట కృష్ణారావు గారు తన అభిరుచితో రాసిన గ్రంథంలో పింగళి లక్ష్మీకాంతం రచనలపై విమర్శ జరగవలసిన కృషి గురించి ఇలా అన్నారు. ***"పింగళి లక్ష్మీకాంతంగారి విమర్శను గురించి చెబితే అది ఒక పెద్ద గ్రంథమే అవుతుంది"*** అని ఒక సూచనను చేశారు. అంతేకాకుండా పింగళి లక్ష్మీకాంతం గారి కావ్యాల గురించి *పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, రసజ్ఞ శిల్పి* అనే గ్రంథాలలో ఆయన జీవితం రచనలు గురించి కొన్ని వ్యాసాలు ఉన్నాయి. అయితే ఆ వ్యాసాల్ని రాసిన వ్యాసం కర్తలు అంతగా లోతైన అధ్యయనం చేసి విశ్లేషణాత్మకంగా వివరించలేదు. ఆ వ్యాసాలు కేవలం కవి, కవి రచనల సూక్ష్మ పరిచయాత్మకంగా వ్యాస కర్తలందించారు. కనుక పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యాలను ప్రత్యేకంగా పరిశోధనలు జరగవలసిన కృషి ఉందని భావిస్తూ ఈ పరిశోధనను చేస్తున్నాను.

## పూర్వ పరిశోధనల పరామర్శ (Review of literature)

ఇంతవరకు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారిపై జరిగిన పరిశోధనలను నాకు తెలిసినంతవవరకు నేను సేకరించిన సమాచారం మేరకు ఈ పరిశోధనలు జరిగాయి.

| క్రమ. సంఖ్య | పరిశోధన పేరు | పరిశోధకుని పేరు | విశ్వవిద్యాలయం | పర్యవేక్షకుడు | సంవత్సరం |
|---|---|---|---|---|---|
| 1 | *సౌందరనందం–పరిశీలన* (ఎం.ఫిల్). | జి. చెన్నకేశవులు నాయుడు. | శ్రీవెంశ్రీకటేశ్వర విశ్వవిద్యాలయం. (తిరుపతి). | డా.జాస్తి సూర్యనారాయణ. | 1978. |
| 2. | *మధుర పండిత రాజము – పరిశీలన* (ఎం.ఫిల్). | టి. కె. లలిత. | ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం. (గుంటూరు). | యస్. గంగప్ప. | 1984. |
| 3. | *సౌందరనందం-పరిశీలన* (ఎం.ఫిల్). | టి. వరలక్ష్మీ. | ఉస్మానియా విశ్వవిద్యాలయం. (హైదరాబాద్). | కె. గోపాల కృష్ణారావు. | 1980. |
| 4. | *కాటూరి వేంకటేశ్వరరావు జీవితం – సాహిత్యం* (ఎం.ఫిల్). | టి. వరలక్ష్మీ. | ఉస్మానియా విశ్వవిద్యాలయం. (హైదరాబాద్). | పి. సుమతీ నరేంద్ర | 2006. |
| 5. | *పింగళి లక్ష్మీకాంతం గారి* | జి. విశ్వనాథ నాయుడు. | శ్రీవెంశ్రీకటేశ్వర విశ్వవిద్యాలయం. | డా. మల్లెల గురవయ్య. | 1992. |

| | | | | | |
|---|---|---|---|---|---|
| | *వ్యక్తిత్వం – సాహిత్యం* (పిహెచ్.డి). | | (తిరుపతి). | | |
| 6. | *సంస్కృతాంధ్ర సౌందర నందాలు తులనాత్మక పరిశీలన డ* | పి. రాయదుర్గ. | తెలుగు విశ్వవిద్యాలయం. (రాజమండ్రి పీఠం). | డా. బేతవోలు రామబ్రహ్మం. | 1998. |
| 7. | *ఆంధ్ర సౌందర నంద కావ్యము సమాలోచనాత్మక అనుశీలన* (పిహెచ్.డి). | రత్నాకరం రమాదేవి. | శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం. (అనంతపురం). | ఆచార్య. తుమ్మపూడి కోటేశ్వరరావు. | 1996. |
| 8. | *సౌందర నందం –పరిశీలన (ఎం.ఫిల్).* | ఆర్. విజయలక్ష్మి. | మద్రాస్ విశ్వవిద్యాలయం. (మద్రాస్). | యస్ . అక్కిరెడ్డి | 1978. |

ఈ పరిశోధనలన్నీ గమనించిన తర్వాత పింగళి లక్ష్మీకాంతంగారి వచన రచనలపై కూడా ప్రత్యేకంగా విమర్శ దృక్పథం గురించి కూడా పరిశోధన జరగవలసిన అవసరం ఉందని భావిస్తున్నాను. అందువలన పింగళి లక్ష్మీకాంతంగారి రచనలపై పరిశోధన చేయాలని ఈ అంశాన్ని నా పరిశోధన అంశంగా ఎన్నుకున్నాను.

**క్షేత్ర పర్యటన (Field–Work)**

పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్యవిమర్శ, పరిశోధన రచనలపై సమగ్రంగా పరిశోధనలు జరగలేదని, ఆయనను విమర్శకుడిగా, పరిశోధకుడిగా ఆయన రచనలన్నిటినీ పరిశీలించకుండా చేసి మూల్యాంకనలు, నిర్ణయాలు అసమగ్రమనీ అధ్యాపకులు చెప్పారు. అప్పుడు ఆయన మౌలిక రచనలను చదవాలనిపించింది. అప్పుడే ఆయనపై జరిగిన పరిశోధనలను కూడా సేకరించడం మొదలుపెట్టాను. తీరా ఆ పరిశోధనలు లభించినవి గమనిస్తే కొన్ని అంశాలు మాత్రమే పునరావృతమైనట్లు తెలిసింది. ఆ ప్రేరణతోనే ఈ పరిశోధనాంశాన్నీ ఎన్నుకొని స్వీకరించాను. తీరా ఆ పరిశోధన కోసం ఆ పరిశోధనలు జరిగిన వివిధ విశ్వవిద్యాలయాలకు వెళ్ళాను. కానీ వాటిని విశ్వవిద్యాలయాల్లో భద్రపరిచలేదని కొంత మంది వాటిని ఇవ్వకూడదని కొంత మంది రకరకాల సాకులు చెప్పారు. అయినప్పటికీ ఏదోలా కొన్ని పరిశోధనలు సేకరించాను.

వీటితోపాటు పింగళి లక్ష్మీకాంతంగారి కొడుకు పింగళి సూర్య సుందరంగారిని కలిశాను. ఆయన తన తండ్రి సాహిత్య కృషిని, వ్యక్తిత్వాన్ని చెప్పి పింగళి లక్ష్మీకాంతంగారి

రచనలపై జరిగిన పరిశోధనలను తెలిపారు. దీనితోపాటు పింగళివారి గురించి రాసిన వ్యాసాల సంపుటి రసజ్ఞ శిల్పి పుస్తకాన్ని మాత్రమే నాకు ఇచ్చారు. దాన్ని నేను అప్పటికే జిరాక్స్ తీయించి తీసుకున్నాను. ఆయన చెప్పిన పింగళివారి వ్యాసాలను గ్రంథాలను సేకరించి భద్రపరచుకున్నాను. మా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఇందిరాగాంధీ నేషనల్ లైబ్రరీ లో పింగళివారి రచనలు వరుసగా *గౌతమ వ్యాసములు, సౌందరనందం, ఆత్మ లహరి, తొలకరి, ఆంధ్ర సాహిత్య చరిత్ర, బిగ్ జార్గల్ , పింగళి లక్ష్మీకాంతం గారి శత జయంతి సంచిక, భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి– కాటూరి కవులు* వంటి ప్రాథమిక, తృతీయ ఆకారాలను మొదలైన వాటిని జిరాక్స్ తీయించుకున్నాను. 2017 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ లో నిర్వహించింది. ఈ ప్రపంచ మహాసభలకు నా పరిశోధన అంశానికి సంబంధించి గ్రంథాల సేకరణ కోసం వెళ్లాను.

ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి ద్వారా తెలుసుకున్న పింగళి వేంకట కృష్ణారావు గారి పుస్తకం **'పింగళి లక్ష్మీకాంతం గారి కావ్య సమాలోచనము'** (2013) పరిచయం అయింది. అదే పుస్తకాన్ని ఆచార్య పిల్లలమర్రి రాములు గారు కూడా నాకు చూపించారు. తరువాత ప్రపంచ మహాసభల్లో ఈ పుస్తకాన్ని సేకరించాను. దీనితో పాటు పింగళి సూర్య సుందరం గారు రాసిన **'పింగళి లక్ష్మీకాంతం(జీవిత చరిత్ర)** అనే పుస్తకం ఈ ప్రపంచ మహా సభలోనే సేకరించాను. తరువాత కాలంలో ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ వచ్చింది. కరోనా వలన సమాచార సేకరణకు ఆటంకాలు ఏర్పడ్డాయి. ఈలోగా డిజిటల్ లైబ్రరీలో, మంచి పుస్తకం అనే గ్రూపు ద్వారా కొన్ని వ్యాసాల్ని, పుస్తకాల్ని సేకరించాను. పింగళి వేంకట కృష్ణారావు గారు ఈ పరిశోధనలో సమాచార సేకరణలో ఎంతో సహకరించారు. ఆయన రాసిన పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము అనే పుస్తకం నా పరిశోధనకు ఎంతగానో దోహదపడింది. దాని ద్వారా ఆత్మలహరి, తొలకరి, సౌందరనందం వంటి పుస్తకాల్ని సంపాదించగలిగాను.

పరిశోధన చేయడం కంటే ఆ పరిశోధన రచనలను, వ్యాసాలను సేకరించడమే నాకు ఒక అభిరుచిగా మారిపోయింది. ఆ విధంగా మద్రాసు విశ్వవిద్యాలయంలో దొరకని పింగళి లక్ష్మీకాంతంగారు యం.ఏ ఆనర్స్ పుస్తకం ఆన్ లైన్ ద్వారా సంపాదించగలిగాను. ఆయన పరిశోధన ఆంధ్ర సాహిత్య చరిత్ర ప్రణాళికకు మూలమైన **కోరాడ రామకృష్ణయ్య గారి శతజయంతి సంచిక' 'సారస్వత వ్యాసాలు'** వంటి పుస్తకాలను సంపాదించగలిగాను. ఆ విధంగా ఆయన రాసిన **'సంస్కృత కుమార వ్యాకరణము' 'ఆంగ్ల దేశ చరిత్ర'** అనే గ్రంథాల్ని ఆన్ లైన్ ద్వారా డిజిటల్ లైబ్రరీ నుంచి సేకరించాను. ఈ విధంగా నాకు ఈ సమాచార సేకరణ ఒక పరిశోధనకు కావాల్సిన సమాచారాన్ని ఎలా సేకరించాలో గొప్ప అనుభవాల్ని కలిగించింది.

అలాగే పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యువుల్లో ఒకరైన ప్రముఖ జానపద సాహిత్య పరిశోధకులు విశ్రాంత ఆచార్యులు తంగిరాల వెంకట సుబ్బారావు గారికి ఫోన్ చేసి పింగళి లక్ష్మీకాంతంగారి రచనల వివరాలను, సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని,ఇతర అంశాలను తెలుసుకున్నాను. ఆయన ఎంతో ఓపికతో పింగళి లక్ష్మీకాంతంగారి జీవితాన్ని,సాహిత్యాన్ని తెలిపే విధంగా ఒక వ్యాసాన్ని రాశాననీ చెప్పారు. **'ఆచార్యపింగళి లక్ష్మీకాంతం'** **మిసిమి** మాస పత్రిక సెప్టెంబర్ 2018 అంతర్జాలంలో ఉందనీ చెప్పారు. దాన్ని నేను సేకరించి జిరాక్స్ తీసుకున్నాను. ఆ విధంగా చివరి సంవత్సరం వరకు నా పరిశోధన అంశానికి చెందిన సమాచారాన్ని సేకరిస్తూనే ఉన్నాను. **'సరస భారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ'** ఉయ్యూరు (కృష్ణా జిల్లా) అధ్యక్షులు గబ్బెట దుర్గా ప్రసాద్ గారు కృష్ణా జిల్లా రచయితల గురించి వారి సాహిత్య కృషిని తెలపడం ఆయన అభిరుచి. ఈ నేపథ్యంలో ఆయన ఫోన్ నెంబర్ ఆన్ లైన్ లో సేకరించి ఆయనకు ఫోన్ చేసి పింగళి లక్ష్మీకాంతం జీవితం రచనలపై పరిశోధన చేస్తున్నానని తెలిపాను. మాట్లాడాను. ఆయన పింగళి లక్ష్మీకాంతంగారి నాటక సాహిత్య విశేషాల్ని వీటి యొక్క పూర్వ పరాలను, వివిధ నాటకాల్లో పింగళి వారు పోషించిన పాత్రల తీరుతెన్నులు కూడా తెలియజేశారు. ఆ పాత్రలను పోషించిన విధానాన్ని ఆయన విశ్లేషించాననీ వాటిని కూడా తెలిపారు.

తరువాత పింగళి లక్ష్మీకాంతంగారి మాబిడీక్ నవలను క్లాసిక్ బుక్ వారు (విజయవాడ)2021 లో పునర్ముద్రణ చేశారు. దీన్ని లోగిలి అంతర్జాల బుక్ హౌస్ ద్వారా సేకరించాను. అదే విధంగా నవ చేతన బుక్ హౌస్ (హైదరాబాద్) విశాలాంధ్ర బుక్ హౌస్ (విజయవాడ), విశాలాంధ్ర బుక్ హౌస్ (విశాఖపట్నం) విశాలాంధ్ర బుక్ హౌస్ (తిరుపతి) విశాలాంధ్ర బుక్ హౌస్ (అనంతపురం) వారికి ఫోన్ చేసి పింగళివారి రచనలు నాకు లభించని పుస్తకాల వివరాలను అవి ఎక్కడ లభిస్తాయో ఇలా అనేక విషయాల్ని కనుగొనే ప్రయత్నం చేశాను. తెలుగు అకాడమీ హైదరాబాద్( హైదరాబాద్) తెలంగాణ సారస్వత పరిషత్తు (హైదరాబాద్), ఉస్మానియా విశ్వవిద్యాలయం (హైదరాబాదు) తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాదు), కరీంనగర్ లైబ్రరీ ( కరీంనగర్) తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రరీ (సంగారెడ్డి), ధర్మపురి ఓరియంటియల్ కళాశాల లైబ్రరీ(ధర్మపురి) ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల లైబ్రరీ (అనంతపురం), అనంతపురం జిల్లా లైబ్రరీ , నాంపల్లి, కోటి (హైదరాబాద్) ఇలా వివిధ ప్రాంతాలలో ఉన్న బుక్ హౌస్ లను, లైబ్రరీలను సందర్శించి పింగళి లక్ష్మీకాంతంగారి రచనలను గురించి సేకరించే ప్రయత్నం చేశాను. పింగళి లక్ష్మీకాంతంగారి రచనలను ఈ సిద్ధాంతం గ్రంథం పూర్తి అయ్యే చివరి క్షణం వరకు ఏది దొరికినా వదలకూడదనే లక్ష్యం ప్రయత్నం చేశాను. దాని ఫలితంగా ఈ సిద్ధాంత గ్రంథం సమర్పించడానికి పదిహేను రోజుల ముందు కొన్ని మౌలిక గ్రంథాలు లభించాయి. పింగళి లక్ష్మీకాంతంగారి మనుమరాలు ఆచార్య పింగళి శైలజగారు 11-04-22 తేదీన నాకు

పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన గౌతమ నిఘంటువు ఇంగ్లీష్ తెలుగు డిక్షనరీ (1961), నా రేడియో ప్రసంగాలు (1963), మానవులందరు నా సోదరులు (అనువాద గ్రంథం) (1964) అనే గ్రంథాలను చూపించారు. అలాగే పింగళి లక్ష్మీకాంతం గారి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని గురించి రాసిన వారి గ్రంధాలు ను నాకు ఇచ్చారు. ఆ గ్రంథాల వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు నమశ్శివాయ గారు రాసిన **'శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర'** (1991) అనే గ్రంథాన్ని , దేవరాజు వెంకట సత్యనారాయణ మూర్తి గారు రాసిన **'ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు'**(2002), అనే వ్యాసం, పింగళి నాగేంద్రరావు గారు రాసిన **'పింగళి వంశ చరిత్ర'** (2007) అనే గ్రంథాలను జిరాక్స్ తీయించి నాకు అందించారు. అవి చదువుతుంటే ఇంతకు ముందు పరిశోధనలు పింగళి లక్ష్మీకాంతంగారిపై వచ్చిన వ్యాసాలు వాటిలో ఈ పుస్తకాల్లో విషయాన్ని వాడుకున్న విధానం కళ్ళముందు కదిలింది. చాలా మంది పుస్తకాలను ఉపయోగించుకున్న ఆ సమాచారాన్ని వెల్లడించలేదు. కొంత మంది ఆ రచనల పేరు చెప్పారే గానీ ఆ రచనల్లో తాము తీసుకున్న విషయాన్ని రిఫరెన్స్ గా పెట్టడాన్ని విస్మరించారు.

నా సిద్ధాంత గ్రంథాన్ని మరలా ఈ పరిస్థితుల్లో మౌలిక గ్రంథాల రిఫరెన్స్ లు పెట్టడం చాలా కష్టమనిపించింది. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ప్రాథమిక సమాచారాన్ని రిఫరెన్స్ గా పెట్టే ప్రయత్నం చేశాను. కొన్నింటిని ద్వితీయ ఆకారాలతోనే రిఫరెన్స్ లు సూచించక తప్పదని భావిస్తున్నాను.

**పరిశోధన ఆకరాలు (Research Source)**

నా పరిశోధనను పూర్తి చేయడానికి గ్రంథాలు, పత్రికలు, ఇతర గ్రంథాలు తోడ్పడ్డాయి. వాటన్నింటినీ నా సిద్ధాంత గ్రంథ ఉపయుక్త గ్రంథ సూచిలో పొందుపరిచాను. పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన పద్య, వచన, ఇతర గ్రంథాలను, వీరి రచనలపై వెలువడిన విశ్లేషణాత్మకంగా గ్రంథాలను కూడా ఇక్కడే తెలియజేస్తున్నాను.


1. లక్ష్మీకాంతం, పింగళి. వేంకటేశ్వరరావు, కాటూరి.(1923).***తొలకరి*** బందరు: త్రివేణి పబ్లికేషన్స్.

2.లక్ష్మీకాంతం, పింగళి. వేంకటేశ్వరరావు, కాటూరి. ***'సౌందరనందం*** (2001, 8 వ ముద్రణ). హైదరాబాద్: జూబ్లీహిల్స్, వై.యమ్.ఏ. పబ్లికేషన్స్.

3.పింగళి. కాటూరి. (1967). ***బగ్ జార్గల్*** (అనువాదం) విజయవాడ: కాటూరి కవితా లత పబ్లిషర్స్.

4. లక్ష్మీకాంతం, పింగళి.(1952).***గౌతమ వ్యాసములు.*** విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

5. లక్ష్మీకాంతం,పింగళి. (1966). ***సాహిత్య శిల్ప సమీక్ష.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

6. లక్ష్మీకాంతం, పింగళి. (1974). ***'ఆంధ్ర సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: తెలుగు అకాడమీ తొలి ముద్రణ.

7. లక్ష్మీకాంతం, పింగళి. (2018). ***ఆంధ్ర సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: నవ చేతన పబ్లిషింగ్ హౌస్.

8. లక్ష్మీకాంతం, పింగళి.(1973).***ఆత్మ లహరి.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

9. లక్ష్మీకాంతం, పింగళి. (1931) ***'ఆంగ్ల దేశ చరిత్ర.*** చెన్నపురి: ఇండియన్ పబ్లిషింగ్ హౌస్, లిమిటెడ్.

10. లక్ష్మీకాంతం, పింగళి.(2021). ***మాబిడిక్*** (అనువాదం), విజయవాడ: క్లాసిక్ పబ్లిషర్స్.

11. పింగళి లక్ష్మీకాంతం, ***'సంస్కృత కుమార వ్యాకరణము',***

12. లక్ష్మీకాంతం, పింగళి. (1967). ***'మానవులందరు నా సోదరులు'*** (అనువాద గ్రంథం), సూక్తులు

13. లక్ష్మీకాంతం, పింగళి(1933). ***'ప్రభావతీ ప్రద్యుమ్నము – దాని మూలము.*** మద్రాసు: మద్రాసు విశ్వవిద్యాలయం ప్రచురణ.

14. ***'ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక',***(1974). హైదరాబాద్, విజ్ఞాన సమితి తెలుగు అకాడమీ.

15. శ్రీరామ అప్పారావు, పోణంగి. రామకృష్ణమాచార్య నందూరి. సూర్య సుందరం, పింగళి.(సంపా).(1994). ***రసజ్ఞ శిల్పి (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక)*** హైదరాబాద్: ఉషా లేజర్ గ్రాఫిక్స్.

16. నమశ్శివాయ, గూడూరి. ***'పింగళి లక్ష్మీకాంతం గారి జీవిత చరిత్ర.***

17. ***ప్రకాష్ రావు, గొల్లపూడి. (1999). 'భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి – కాటూరి.*** న్యూ ఢిల్లీ: కేంద్ర సాహిత్య అకాడమీ.

18. వెంకటేశ్వరరావు, దార్ల. (2009). ***వీచిక*** (సాహిత్య విమర్శ వ్యాసాలు) ***పరిశోధకుడిగా పింగళి లక్ష్మీకాంతం వ్యాసం హైదరాబాద్:*** హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

19.. సూర్య సుందరం, పింగళి. (2010). ***పింగళి లక్ష్మీకాంతం.*** (జీవిత చరిత్ర). హైదరాబాద్: సి.పి. బ్రౌన్ అకాడమి.

20. వేంకట కృష్ణారావు, పింగళి. (2013). ***'పింగళి లక్ష్మీకాంతం గారి కావ్య సమాలోచనము.*** విజయవాడ: నిర్మలా ఆఫ్ సెట్ ప్రింటర్స్.

21. విశ్వనాథనాయుడు, జి.(1992). ***పింగళి లక్ష్మీకాంతం గారి వ్యక్తిత్వం – సాహిత్యం.*** తిరుపతి: (అముద్రితం) పిహెచ్.డి సిద్ధాంతం గ్రంథం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

22. చెన్నకేశవులు నాయుడు, జి. (1978). ***సౌందరనందం – పరిశీలన.*** తిరుపతి: ఎం.ఫిల్. సిద్ధాంత వ్యాసం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం.

**పరిశోధన గ్రంథ రచనా పద్ధతి (Method of Research)**

సాహిత్యంలో ఉపయోగించే వాఙ్మయపద్ధతినే ఈ పరిశోధనలో అనుసరించాను. పింగళి లక్ష్మీకాంతంగారి కవిత్వాన్ని, విమర్శను, పరిశోధనను విశ్లేషణాత్మక పద్ధతిలో అధ్యయనం చేశాను. ఈ పరిశోధన అంతా అధిక శాతం ఆయన రచనలను సాహిత్య విలువలను విశ్లేషించడం నా అధ్యయనంలో ప్రధాన లక్ష్యం. అందువల్ల ప్రాథమిక ఆధారాలు (Sources) సేకరించడానికి క్షేత్ర ప్రకటన చేసినప్పటికీ దానికంటే ఆయన

రచనల్లోనే వివిధ అంశాలను విశ్లేషించడమే ప్రధానంగా కొనసాగింది. దీన్ని సాహిత్య పరిశోధనా పద్ధతుల్లో (qualitative),(గుణాత్మకత) పద్ధతిగా భావిస్తారు. ఈ పరిశోధనా సిద్ధాంత గ్రంథా రచనలో APA (American psychological association) శైలి పత్రాన్ని అనుసరించాను.

పింగళి లక్ష్మీకాంతంగారి మౌలిక భావాలను విశ్లేషించే క్రమంలో ఆయన భావాలను నా మాటల్లో చెప్పడం కంటే వాటిని అంటే ఆయన ప్రకటనలను యథాతథంగా ఉటంకించడమే మంచిదని భావించాను. అందువల్ల మూల గ్రంథాలలోని ఉటంకింపులను ప్రతి అధ్యాయంలో ఇచ్చే ప్రయత్నం చేశాను. అంతేకాకుండా వాటిని పూర్వపరపక్షం చేసే క్రమంలో కూడా వారివారి అభిప్రాయాలనే స్పష్టంగా తెలియయడం కోసం ఉటంకింపులను ఇవ్వాల్సి వచ్చింది. ఇవన్నీ తెలిసి చేసిన విషయాలే APA (American psychological association) వారి శైలి పత్రాన్ని అనుసరించి Internal citation ఇవ్వడం వలన ఆయా అంశాలను నిరూపించడానికి నేను గమనించిన సాక్ష్యాలను గుర్తించగలుగుతారు. ఈ పరిశోధన గ్రంథంలో నేను ఊహించుకున్న ప్రాథమిక, ద్వితీయ, తృతీయ ఆకారాలను ఉపయుక్త గ్రంథ సూచిక APA పద్ధతిలోనే సూచించాను.

**పరిశోధన లక్ష్యాలు – ప్రయోజనాలు (Research objects)**

1.పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం, ఆయన రచనలను సమన్వయించడం ప్రధాన లక్ష్యం.

2. పింగళి లక్ష్మీకాంతంగారి భావజాలాన్ని గుర్తించడం.

3.పింగళి లక్ష్మీకాంతంగారు తన విద్యార్థులతో, గురువులతో ఏలా ఉండేవారనేది అధ్యయనం చేయడం.

4. ఆయన వ్యక్తిగతమైన పేరు ప్రతిష్ఠల కోసం పనిచేసేవాడా వ్యవస్థీకృత పనులువైపే దృష్టి మరల అధ్యయనం చేయడం.

5. ఆయన కవిత్వాన్ని, విమర్శని, పరిశోధనని, అనువాదాన్ని, నాటకాల అనుభవాన్ని, ఆయన నాయకత్వ లక్షణాలను అధ్యయనం చేయడం, ఆయన పాఠ్యాంశాల్లో తెచ్చిన మార్పుల్ని తెలియజేయడం.

6. ఆయన పొందిన పురస్కారాలు బహుమతులు తెలియజేయడం.

7. ఆయన కుటుంబ జీవన సంబంధాలను, గుర్తించడం.

8. ఆయన అధికారులతో మెలిగే విధానాన్ని గుర్తించడం.

10. ఆయన ప్రభుత్వ విధానాలను రూపకల్పన చేయడంలో వాటిని గుప్తంగా దాయడంలో లేదా వాటిని బహిర్గతం పరచడంలో ఆయన పాటించిన విధానాల్ని గుర్తించడం

11. ఆయనపై శిష్యుల ప్రభావాన్ని అంచనా వేయడం.

12. ఆయన రచనలు కలిగించిన ప్రభావాన్ని విశ్లేషించడం.

13.జంట కవిగా ఆయన వ్యవహరించిన తీరును సోదాహరణంగా వివరించడం.

14. ఆయన జీవిత కాలంలో వచ్చిన వివిధ పరిణామాల్ని విశ్లేషించడం.

15. అనుకున్న భాష పాండిత్యాలను పరిచయం చేయడం.

16. అనుకున్న పఠన శీలత రచన అభిలాషలను గుర్తించడం.

మొదలైనవి అని ఈ పరిశోధనలు లక్ష్యాలు – ప్రయోజనాలు.

**మొదటి అధ్యాయం: ( పింగళి లక్ష్మీకాంతం జీవితం: రచనల పరిచయం)**

పింగళి లక్ష్మీకాంతంగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒకవైపు చదువుకుంటూనే మరోక వైపు ఉపాధి అవకాశాలను అలాగే ఉపాధి అలాగే ఉద్యోగం చేస్తూనే ప్రైవేట్ గా సాధించడంలో కనిపించే గొప్ప పార్శ్వాలు. పురాణేతిహాసాలను, కావ్యాలను లోతుగా అధ్యయనం చేయడం, వాటితోపాటు చదవడం అనువదించడం, వాటిని తరగతి గదిలో బోధించడం అంకితభావంతో చేసిన వ్యక్తిగా కనిపిస్తారు. తన విద్యార్థులకు మొదటి ప్రాధాన్య ఇచ్చేవారు. సభలు సమావేశాలకు ఎక్కువ ఇచ్చేవాడు కాదు. వ్యవస్థకు ఉపయోగపడే శాశ్వతమైన పని చేయడానికి తపన పడేవాడు ఇదే ఆయనను పదవి విరమణ అనంతరం కూడా అనేక పదవులు వరించడానికి కారణమైంది. అందువలనే ఆయన డాక్టరేట్ చేయకపోయినా ప్రొఫెసర్ కాగలిగారు. ఆకాశవాణిలో పనిచేసి చేయించి కేంద్ర సాహిత్య అకాడమీ, తెలుగు అకాడమీ వంటి సంస్థలలో పనిచేసే అవకాశాన్ని కలిగించింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే పద్యకవిగా, అవధానిగా, నటుడిగా, దైవ భక్తుడిగా ఆయన ప్రత్యేక వ్యక్తిత్వంతో నిలబడేలా చేశాయి. ఇవన్నీ సత్ప్రమాణంగా సోదాహరణంగా మొదటి అధ్యాయంలో వివరించాను.

**రెండో అధ్యాయం: (పింగళి, కాటూరి: జంటకవిత్వం (తొలకరి) పరిశీలన )**

రెండో అధ్యాయంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతం కాటూరి వెంకటేశ్వరరావు గారు రాసిన జంట కవిత్వాన్ని పరిశీలించాను. అవధానాల్లో ఆశువుగా పద్యాలను వర్ణించడం, ఆంజనేయ శతకాన్ని చెప్పడం సౌందరనందం కావ్యాన్ని రాయడం, తొలకరి ఖండ కావ్యాన్ని రాయడం ఇవన్నీ వీరి జంట కవిత్వాన్ని తెలిపే రచనలు. వీరిద్దరి కవిత్వం విడదీయరానంతా మధురమైన శైలిలో కొనసాగిందని పూర్వ పరిశోధకులు విమర్శకులు భావించారు. అయితే వీరివురి ఇతర రచనలను పరిశీలించి ఆ శైలిలో ఇరువురి శైలిని జంట కవిత్వంలో కూడా గుర్తించి అవకాశం ఉందని ఉదాహరణలతో వివరించే ప్రయత్నం చేశాను. భక్తి భావాలను వర్ణించడంలో పింగళి లక్ష్మీకాంతం గారు దిట్టగా కనిపిస్తాడు.

సౌకుమార్యమైన భావాలను వర్ణించడంలో కాటూరి వేంకటేశ్వరరావుగారు దిట్టగా కనిపిస్తాడు. అయినప్పటికీ వీరు ఇరువురి శైలి విడదీయలేనంతగా మృదుమధురంగా వెలువడిందినీ, వీటిని సోదాహరణంగా ఈ అధ్యాయంలో వివరించాను. వీరిద్దరూ కూడా సమకాలీకులు, సమకాలీన సామాజిక అంశాల కంటే, భావుకతకే ప్రాధాన్యం తెచ్చారని ఈ అధ్యాయంలో గుర్తించాను . అయితే వీరగాథల విషయంలో పింగళి లక్ష్మీకాంతంగారి శైలిని

ప్రత్యేకంగా గుర్తించవచ్చునని కూడా రక్త తిలకము, తిలక్ వంటి ఖండకావ్యాలు ఆధారంగా చేసుకొని ప్రతిపాదించాను.

**మూడో అధ్యాయం: ( పింగళి– కాటూరి–'సౌందరనందం' కావ్య వైశిష్ట్యం )**

ఈ అధ్యాయంలో పింగళి, కాటురి కవులు జంటగా తెలుగు సాహిత్యంలో విశిష్టత స్థానాన్ని సంపాదించి పెట్టిన సౌందరనందం వైశిష్ట్యాన్ని గురించి వివరించాను. ఈ కావ్యంపై వివిధ విశ్వవిద్యాలయలలో ప్రత్యేకించి పరిశోధనలు జరిగాయి ఆ విషయాలను గుర్తిస్తూనే పింగళి వారి జీవితం సమగ్ర రచనల్లో భాగంగా ఆ అంశాలను నా పరిశోధనలు పేర్కొన్నాను. సౌందరనందంలో వివాహబంధం, కుటుంబం అవసరాలు, సంతానం విషయాలు ప్రస్తావిస్తూనే బుద్ధుని బోధనలను వారి ప్రతిపాదించిన అష్టాంగ మార్గాలను సోదారణంగా వివరించాను. పింగళి, కాటూరి వారు భారతీయ జాతీయ తాత్త్విక చింతనను గల అహింస జీవన విధానాన్ని గుర్తించడానికి ముఖ్యమైన కావ్యంగా సౌందరనందం నిలుస్తుందని ఈ అధ్యాయంలో సోదాహరణంగా వివరించాను.

**నాలుగో అధ్యాయం: ( పింగళి లక్ష్మీకాంతం – స్వతంత్ర పద్య కవిత్వం పరిశీలన )**

పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన పద్యకవిత్వాన్ని, ఆయన పేరుతో వెలువడిన కావ్యాలను విశ్లేషించాను. ఆయన సంస్కృత ఆంధ్ర ఆంగ్ల సాహిత్యంలో ఎంత లోతైన అధ్యయన చేశారో వాటిలో ఎంతో పాండిత్యం ఉందో తెలియాలంటే వారి ఆత్మ లహరి పద్య ఖండికలను పరిశీలించాల్సిందే. పింగళివారికి భారత జాతీయత పట్ల అచంచలమైన విశ్వాసం ఉంది. అందుకనే తిలక్ కవులలో తిక్కన అభిమాన పాత్రుడైన అందువలన వారిని వర్ణించేటచ్చేటప్పుడు వారిలో వీరావేశం ఉప్పొంగుతుంది. ఇవన్నీ కూడా ఈ అధ్యాయంలో వివరించాను. దీంతో పాటు పింగళివారికి గురువు పట్ల , దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి పట్ల గల ప్రత్యేకతను వివరించి, వారి పద్యాలను సోదాహరణంగా వివరిస్తూ, ఆ పద్య శైలిని, వర్ణనా ఔన్నత్యాన్ని వివరించాను.

**ఐదో అధ్యాయం: (సాహిత్య విమర్శకుడుగా పింగళి లక్ష్మీకాంతం)**

పింగళి లక్ష్మీకాంతంగారు మౌలికంగా విమర్శకుడు, పరిశోధకుడు. ఆయన రాసిన గౌతమ వ్యాసములు, ఆంధ్ర సాహిత్య చరిత్ర, సాహిత్య శిల్ప సమీక్ష, ఇతర వ్యాసాలు మొదలైన చోట్ల ఆయన భావాలను పరిశీలిస్తే 'సాహిత్య విమర్శకుడుగా' వారి విశిష్టత తెలుస్తుంది. ఆయన పల్నాటి వీరచరిత్ర, రంగనాథరామాయణం, విష్ణుపురాణం, ద్విపదభారతం మొదలైన రచనల్లో ఆయన పరిష్కరణ విమర్శనా పద్ధతులను సమన్వయించి చూపాను. అలాగే నన్నయ, నన్నెచోడుడు, తిక్కన పాల్కురికి సోమనాథుడు, శ్రీనాధుడు శ్రీకృష్ణదేవరాయలు, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుడు, వేమన వారి జీవితాలను రచనలను కవిజీవిత కావ్యసమన్వయ విమర్శ పద్ధతిలో చెప్పిన విమర్శనాంశాలను వివరించాను. మహాభారతాన్ని, సంస్కృత ఆంధ్ర మహాభారత, పాటు ఇతిహాస,

పురాణాలతో తులనాత్మకంగా పరిశీలించి చెప్పిన అంశాలు తులనాత్మక విమర్శకుడుగా పింగళివారి విమర్శనా పద్ధతుల్ని తెలియజేశాను. దీనితో పాటు ఎఱ్రన, నాచన సోమన కవుల రచనలను, హరివంశ, ఉత్తర హరివంశాలను తులనాత్మక విమర్శ పద్ధతిలో వివరించాను. తులనాత్మక విమర్శకు పాటించాల్సిన పద్ధతులను తొలితరం విమర్శకుడుగానే ఆయన సమన్వయించిన తీరును సోదాహరణంగా వివరించాను. నన్నయ మహాభారత రచన కాలాన్ని, కుమార సంభవం కర్తృత్వ రచనా విశేషాలను, పాల్కురికి సోమనాథుని భాషా చరిత్రను చారిత్రక విమర్శలుగా. ఆయన చెప్పిన విశేషాలను సోదాహరణంగా వివరించాను. అలాగే పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య విమర్శలో ఒక ప్రత్యేకమైన గుర్తించవల్సిన అంశం ప్రక్రియ విమర్శలో ఆయన సమన్వయించిన విషయాలు సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల సాహిత్యాలలో వివిధ ప్రక్రియలుగా ప్రాచుర్యం పొందిన ప్రక్రియలతో పాటు ప్రబంధ వికాసాన్ని వివరించిన తీరు తర్వాత విమర్శకులకు ఆదర్శనీయమైంది. వీటితో పాటు కథానిక, నవల, నాటకం, వ్యాసం మొదలైన ప్రక్రియలు ప్రాచ్య పాశ్చాత్య సాహిత్యంశాల సమన్వయంతో ప్రక్రియలను గుర్తించే విధానం వీరి సాహిత్య విమర్శలో విశేషమైందని గుర్తించాను. కవిగా అనేక రచనలు చేసిన పింగళ లక్ష్మీ కాంతంగారు భారతీయ అలంకారక సిద్ధాంతాలను సమన్వయిస్తూనే పాశ్చాత్య సాహిత్య సాహిత్యం ద్వారా వచ్చిన మన వైజ్ఞానిక విమర్శను ప్రత్యేక్షంగా కాకుండా పరోక్షంగా మనోధర్మ విషయాలుగా ఆయన సమన్వించడం సాహిత్య విమర్శలో సిద్ధాంతాన్ని అనువర్తనం చేసిన పద్ధతిగా సాహిత్య విమర్శను పాటించాలని ఈ అధ్యాయంలో గుర్తించాను. ఆలంకారిక విమర్శ ఆయన సాహిత్యచరిత్రలో, ఆయన రేడియో ప్రసంగాలలో ప్రధానంగా కనిపిస్తుందని సోదాహరణంగా నిరూపిస్తూ ఈ అంశాలన్నీ ఈ అధ్యాయంలో వివరించాను.

**ఆరో అధ్యాయం: (పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం )**

పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతంగారి గురించి పరిశీలించినప్పుడు కవి జీవిత కావ్య సమన్వయ పద్ధతి, తులనాత్మక పద్ధతి, ప్రక్రియ వికాస పద్ధతి, గ్రంథ పరిష్కరణ పద్ధతి ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య ప్రక్రియల తులనాత్మక పద్ధతి మొదలైన పరిశోధన పద్ధతులను ఆయన వివిధ రచనల్లో పాటించారు. ముఖ్యంగా నాటకం గురించి సంస్కృత ఆంధ్ర పాశ్చాత్య నాటకాలను, పురాణ ఇతిహాసాలలోని అంశాలను, కావ్యాలు, ప్రబంధాలు, ఆంధ్ర మహాభారతం, రామాయణం ,భాగవతం మొదలైన వాటిని Quantitative (గుణాత్మకత) పరిశోధనగా ఆయన ఉపయోగించారని ఆయనపై పరిశోధన చేసినవారు, వారి అభిప్రాయాలతో పాటు ఉదాహరణంగా క్రమబద్ధంగా వివరించాను.

ఆయన పరిశోధనలో అత్యంత ముఖ్యమైన దానిలో సాహిత్య చరిత్ర నిర్మాణ కృషిని చెప్పవచ్చుననీ సోదాహరణంగా వివరించాను. దీనితోపాటు పింగళి లక్ష్మీకాంతంగారి

పరిశోధనలను విమర్శను సమన్వయించిన తీరుని పూర్వ పరిశోధకులు అభిప్రాయాలతో సహా ప్రత్యేకించి వివిధ శీర్షికలలో వివరించాను.

**ఏడో అధ్యాయం: (అనువాదకుడుగా పింగళి లక్ష్మీకాంతం )**

ఏడవ అధ్యాయంలో అనువాదకుడిగా పిల్లల పేర్లు గురించి వివరించాను. ముఖ్యంగా ఆయన మహాత్మా గాంధీ ప్రవచనాలను తెలుగులోకి అనువదించారు. ఆంగ్ల నవలలను తెలుగులో అనువదించారని వీటి ఆవశ్యకతను సోదాహరణంగా వివరించాను. . ఈ నవలలు నేటికి కూడా పునర్ముద్రణ చేస్తున్నారు. దీంతోపాటు గారి వివిధ అనువదించిన పారిభాషిక పదాలు తెలుగు సాహిత్య చరిత్రకు, సాహిత్య పరిశోధనకు, సాహిత్య విమర్శనకు గొప్ప ఆధారంగా నిలిచాయి. అటువంటి పదాలన్నిటినీ పట్టికగా పెట్టాను. సుమారు 331+77, 408 పదాలు ఆయన రచనల్లో గుర్తించాను. వాటిని పట్టికలో రచనలు, పుట, పదాలుగా చిత్రించి పట్టిక వేసి చూపించాను.

వివిధ అనుబంధాలుగా ఆయన దగ్గర చేసిన పరిశోధనలను వివరించాను వీటితో పాటు ఆయన శిష్యులు సమకాలికలతో జీవి జరిపిన ఇంటర్వ్యూలను అనుబంధంలో పెట్టాను. ఆయనపై రాసిన వివిధ గ్రంథాలలో పత్రికలలో ప్రచురించిన రచనలను అనుబంధంలో పెట్టాను. పిహెచ్.డి పార్ట్ వన్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను తెలుపుతూ ఆ వివరాలను కూడా అనుబంధంలో చేర్చాను. దీంతో పింగళి వారి వంశం వృక్షం, వారి రచనల ముఖచిత్రాలు, భావచిత్రాలు ఆయన జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయని అనుబంధంలో పెట్టాను.

**పరిశోధన పరిధి (Scope of the Research)**

పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన కవిత్వాన్ని, జంటకవిత్వాన్ని, ఆయన రాసిన సాహిత్యచరిత్ర, సాహిత్యశిల్పసమీక్ష, గౌతమవ్యాసాలు, పీఠికలు, చేసిన అనువాదాలను ఈ పరిశోధనలో పరిశీలించడం నా పరిశోధన పరిధి.

**పరిశోధన ఫలితాంశాలు: (Research Results)**

ఈ పరిశోధనను దీనివల్ల కింది ఫలితాంశాలు వస్తాయని భావించాను.

- ***ఆంధ్ర సాహిత్య చరిత్ర*** గ్రంథంలో సాహిత్య చరిత్ర నిర్మాణం కోసం కవి కాల నిర్ణయం, కవి రచనాకాల నిర్ణయం, సాహిత్య యుగ విభజన వంటి అంశాలలో అనుసరించిన పరిశోధనా దృక్పథాన్ని మరింత లోతుగా విశ్లేషణ చేయడానికి అవకాశం కలుగుతుంది. ఒక రచన విలువల్ని నిర్ణయించేటప్పుడు కేవలం ఆ రచనకే పరిమితం కాకుండా, అటువంటి ఇతివృత్తం కలిగిన రచనలను కూడా పరిశీలించి కావ్య ఉత్తమత్వాన్ని నిర్ణయించే లక్షణం పింగళి లక్ష్మీకాంతం గారి విమర్శలో ఉందని చెప్పిన పలు సందర్భాల్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

- ***సాహిత్య శిల్ప సమీక్ష*** గ్రంథంలో భారతీయ పాశ్చాత్య కావ్య సంప్రదాయాలను సమన్వయించిన విధానాన్ని గురించి, ***గౌతమ వ్యాసములు*** అనే సంపుటిలో వివిధ కావ్యాలకు రాసిన పీఠికలలో పరిశోధనా దృక్పథాన్ని అధ్యయనం చేయడానికి ప్రస్తుత పరిశోధన తోడ్పడుతుంది.
- ***ఆత్మలహరి, తొలకరి*** వంటి ఖండకావ్యాల రచయితగా, కాటూరి వెంకటేశ్వరరావుతో కలిసి జంట కవిత్వాన్ని చెప్పిన కవిగా, తెలుగులో విజ్ఞాన సర్వస్వ నిర్మాతగా, గాంధీజి ప్రవచనాలను తెలుగులోకి అనువదించిన అనువాదకుడిగా పింగళివారిని ఆధునిక తరానికి పరిచయం చేయడానికి ఈ పరిశోధన తోడ్పడుతుందని విశ్వసిస్తున్నాను.
- పింగళి లక్ష్మీకాంతంగారి పేరు చెప్పగానే ఆయన్ని ఒక విమర్శకుడిగా, పరిశోధకుడిగా మాత్రమే అత్యధికులు పేర్కొనేవారు. కానీ ఈ పరిశోధన వల్ల ఆయన ఒక అనువాదకుడుగాను, ఒక గొప్ప కవిగాను, ఒక గొప్ప ఆధ్యాత్మిక భావాలు గల వ్యక్తి గాను గుర్తించే అవకాశం ఉంది.
- దీనితో పాటు పింగళి లక్ష్మీకాంతంగారు తన అధ్యాపకం, అధ్యయనం, కవిత్వం, పరిశోధన, విమర్శ, అనువాదం మొదలైన రంగాలలో లబ్ధ ప్రతిష్ఠులై తెలుగు భాషా, సాహిత్యాలకు ఎంతో సేవ చేశారని ఈ పరిశోధన ద్వారా గుర్తించే అవకాశం ఉందని భావిస్తున్నాను.
- ***ఆత్మలహరి, తొలకరి*** అనే ఖండకావ్యాల్లో ఉన్న కవిత్వ మర్మాల్ని పరిశీలిస్తే పింగళి లక్ష్మీకాంతంగారు నవ్యసాహిత్య దృక్పథంతో నాటి భావకవిత్వ ఉద్యమానికి ప్రభావితమైయ్యారని భావిస్తున్నాను. ఈ భావాల్ని ఆయన కాటూరి వెంకటేశ్వరరావుగారితో కలిసి జంటగా అనుసరించారని విశ్వసిస్తున్నాను. పింగళివారు భావకవిత్వ శాఖల్లోని స్మృతి కవిత్వం, ప్రకృతి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, ప్రణయ కవిత్వం ధోరణులకు ప్రభావితమైయ్యారని పైన తెలిపిన కావ్యాలే నిదర్శనాలేనని భావిస్తున్నాను.
- ***సాహిత్య శిల్ప సమీక్ష*** గ్రంథంలో భారతీయ పాశ్చాత్య కావ్య సంప్రదాయాలను సమన్వయించిన విధానాల్ని గమనిస్తే ఆయన రసవాదిగా కనిపిస్తారు.

మొదటి అధ్యాయం

# పింగళి లక్ష్మీకాంతం జీవితం: రచనల పరిచయం

## 1.0. పింగళి లక్ష్మీకాంతం జీవితం:

తెలుగు సాహిత్యంలో సాహిత్య చరిత్రకారుడిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, కవిగా బహుముఖ ప్రజ్ఞా పాటవాల్ని ప్రదర్శించిన వారిలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతం ఒకరు. ఈయన క్రీ.శ.1894 వ సంవత్సరం జనవరి పదవ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా బందరు తాలూకా ఆర్తమూరులో పింగళి కుటుంబమ్మ, వెంకటరత్నం దంపతులకు లక్ష్మీకాంతం జన్మించారు. ఈయనకు ఇద్దరు తమ్ముళ్ళ, ఒక చెల్లెలు. వారి పేర్లు వరుసగా నరసయ్య, వీరయ్య సుందరమ్మ. పింగళి వంశస్తులు, గౌతమ గోత్రస్తులు. వీరు సూర్యోపాసకులు, శ్రీ వేంకటేశ్వరస్వామి ఇలవేల్పు. పింగళి వంశంలో కళాపూర్ణోదయ ప్రబంధ కర్త పింగళి సూరన, అక్కన్న-మాదన్న, కంచర్ల గోపన్న, జాతీయ పతాక నిర్మాత పింగళి వెంకయ్య కూడా పింగళి వంశస్తులని *'పింగళి వంశ చరిత్ర''* ను రాసిన పింగళి నాగేశ్వరరావు తెలిపారనీ *''పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర''* లో సూర్య సుందరం పేర్కొన్నారు. పింగళి లక్ష్మీకాంతంగారు కూడా తన *ఆత్మలహరిలో* తాను పింగళి వంశానికి చెందినవాడినని చెప్పుకుంటూ ఇలా ఒక పద్యాన్ని వర్ణించారు.

> *'' గర్వపు మాటలేల గురుకారుణికత్వ మొకందుగాక, మా*
> *పూర్వులు సూరనాదుల తపోబల సంపదకల్మి, సాహితీ*
> *ధూర్వహుడన్న పేరునకు తోడు మహాకవియన్న కీర్తి యాం*
> *ధ్రోర్వి లభించె నిక మిది, యోగ్యతలేని యశమ్ము మోసితిన్ ''*

(ఆత్మలహరి:76)

## 1.1. బాల్యం, విద్యాభ్యాసం:

పింగళి లక్ష్మీకాంతం చిన్నతనం నుంచి చాలా చురుకుగా ఉండేవారు. చిన్నతనం నుంచి పద్యాలు, పాటలు నేర్చుకోవడం, అందరి ముందు భయం లేకుండా మాట్లాడేవారు. ఆయన సొంత గ్రామం చిట్టూర్పులో ఐదవ తరగతినీ, ఆరు, ఏడు తరగతులు రేపల్లెలోనూ చదివారు. ఆ రోజుల్లో ఆరవ తరగతిని మొదటి ఫారం అని, ఏడవ తరగతిని రెండో ఫారం అని, ఎనిమిదవ తరగతిని మూడో ఫారం అని, తొమ్మిది తరగతిని నాలుగో ఫారం అని, పదవ తరగతిని ఐదో ఫారం అని పిలిచేవారు. పదకొండవ తరగతిని యస్.యస్.యల్.సి. (SSLC) సెకండరీ స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్ లేదా స్కూల్ ఫైనల్ అని పిలిచేవారు. ఎనిమిదవ తరగతిని (మూడవ ఫారం) చదువుకోవడానికి బందరు హిందూ హైస్కూల్లో ప్రవేశించారు. ఆ పాఠశాలలో తెలుగుః

పండితునిగా చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు పాఠాలు బోధించేవారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం తెలివితేటలను, ప్రతిభను చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు గుర్తించారు. తన శిష్యుడిగా పింగళి లక్ష్మీకాంతాన్ని దగ్గరకు తీసుకొని ప్రోత్సహించారు. పింగళివారు గురువు గారి దగ్గర మంచి విద్యార్థిగా పేరు సంపాదించుకున్నారు.

పింగళి లక్ష్మీకాంతం పదవతరగతి చదువుతుండగా తండ్రి వెంకటరత్నం మరణించారు. తన గురువు సహాయంతో, దాతల సహకారంతో పదవ తరగతి పూర్తి చేసుకున్నారు. తర్వాత ఇంటర్మీడియట్ చదువును బందరు నోబుల్ కాలేజిలో పూర్తి చేశారు. బందరులో నాటకాల్లో వేషాలు వేసి కుటుంబానికి కొందంత అండగా తన సహకారం అందించారు. ఆ సమయంలోనే కాటూరి వెంకటేశ్వరరావుతో పింగళి లక్ష్మీకాంతానికి పరిచయం ఏర్పడింది.1921 సంవత్సరం నాటికి బి.ఏ. పూర్తి చేశారు. బందరు నోబుల్ హైస్కూల్లో తెలుగు పండితునిగా 1922 నుంచి1927వరకు ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అక్కడ మంచి ఉపాధ్యాయునిగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో ఆంధ్ర విభాగానికి కోరాడరామకృష్ణయ్యగారు అధిపతిగా పర్యవేక్షకులుగా ఉండేవారు. వారు తన వద్ద పని చేయడానికి విద్యార్థుల కోసం వెదకడం ప్రారంభించారు. తన మిత్రుల సమాచారంతో పింగళి లక్ష్మీకాంతాన్ని తన విద్యార్థిగా ఎన్నుకున్నారు. తన వద్ద రెండు సంవత్సరాలు రిసెర్చ్ ఫెలోషిప్ పొందారు. మద్రాస్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో పింగళి లక్ష్మీకాంతం మహాభారతానికి సంబంధించిన వివిధ పత్రులను పరిశీలించేవారు. పనిలో భాగంగా తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీకి వెళ్లి చాలా గ్రంథాలను చదువుకొని విజ్ఞానాన్ని సంపాదించారు. ఈ క్రమంలో ద్విపదభారత గురించి చదువుకున్నారు. మద్రాస్ విశ్వవిద్యాలయం ఎం.ఏ. (సంస్కృతం) పరీక్షలు రాసి ప్రథమ స్థానంలో బంగారు పతకాన్ని సాధించారు. అక్కడే *'ప్రభావతీ ప్రద్యుమ్నము–మూలములు'* అనే అంశంపై పరిశోధనాత్మకంగా వ్యాసం సమర్పించి ఎం.ఏ. ఆనర్స్ (Honours) డిగ్రీ పట్టా పొందారు. దీని గురించి 'పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం' అనే అధ్యాయంలో ప్రత్యేకంగా పరిశీలించాను.

**1.2. పింగళి లక్ష్మీకాంతంగారి వివాహం:**

పింగళి లక్ష్మీకాంతం వివాహం 1912 సంవత్సరంలో అంటే పద్దెనిమిది సంవత్సరాల వయస్సులో తన మేనమామ కూతురు లక్ష్మీనరసమ్మ గారితో వివాహం జరిగింది. తాను రాసిన సాహిత్య శిల్ప సమీక్షను తన భార్యకే అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఈ పద్యాలను చెప్పారు.

*" మాంగల్యనిధికి, బంధుజ*
*నాంగీకృతశీలక స్మదర్ధాంగికి, శ్రీ*
*పింగళి లక్ష్మీ నరసమ కుం, గృతి*
*యొసగితిని దీని, కులవర్ధనికిన్ "*

*" పింగళివంశము మేలిమి*

*బంగరు గని, దాని వలన వన్నెయును, భవ*

*న్మాంగల్య మహిమవలన శు*

*భాంగీ! నాకొదవె, నాయురారోగ్యములున్ "*

(సాహిత్య శిల్ప సమీక్ష,1966:2)

ఈ దంపతులకు ముగ్గురు సంతానం కలిగారు. వారిలో పింగళి వెంకటరత్నంగారు, పింగళి లక్ష్మీతులసిగారు, పింగళి సూర్యసుందరంగారు, పింగళి అలుమేలు. జన్మించాడు. సూర్యసుందరం హైదరాబాద్ లో నివాసం ఉండేవారు. ఆయన 2019 వ సంవత్సరంలో మరణించారు.

**1.3. పింగళి లక్ష్మీకాంతం ఉద్యోగం:**

పింగళి లక్ష్మీకాంతంగారు మొదటి నుంచి చదువుకోవడానికి అనేక ఇబ్బందులను ఎదుర్కొని ఉన్నత చదువులు పూర్తి చేసుకున్నారు. చదువుకునే రోజులలోనే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ జీవితాన్ని గడిపేవారు. మొదటిసారిగా తాత్కాలిక ఉద్యోగం రెండుసంవత్సరాల పరిమితిలో బందరు హైస్కూల్లో తెలుగు పండితునిగా అవకాశం వచ్చింది.

**1.4. అధ్యాపకుడిగా పింగళి లక్ష్మీకాంతం :**

పింగళి లక్ష్మీకాంతంగారు తన జీవితంలో అత్యధిక కాలం అధ్యాపకుడుగానే పనిచేశారు. దానివల్లనే నిర్మాణాత్మకమైన విధానలు తీసుకోవడంతో పాటు, నూతన పాఠ్య ప్రణాళికల ఏర్పాటు, కొత్త కోర్సుల రూపకల్పనతో పాటు అనేకమైన రచనలు చేయగలిగారు. అందువల్ల అధ్యాపకుడిగా ఆయన జీవితాన్ని ప్రత్యేకించి పరిశీలించవలసిన అవసరం ఉంది.

**1.4.1. బందరులో తెలుగు ఉపాధ్యాయునిగా ఉద్యోగం:**

పింగళి లక్ష్మీకాంతంగారు బి.ఏ. చదువు పూర్తి చేసిన తర్వాత 1922 నుండి 1927 వరకు బందరు నోబుల్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా ఉద్యోగం చేశారు. మొదటి జీతం నలభై రూపాలను పొందారు. వీరి పాఠాలను విద్యార్థులు చక్కగా విని మంచిగా ఉత్తీర్ణత సాధించేవారు. విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దారు. పాఠశాలలోనే కాకుండా నిజ జీవితంలో భిన్నమైన వస్త్రాలతో పంచెకట్టు, తలపాగా, ఉత్తరీయం నుదుట నిలువుగా చూర్ణరేఖను వైష్ణవ సాంప్రదాయాన్ని అనుసరించారు. తెల్లటి కోటులను ధరించి ఎంతో ఆకర్షణీయంగా ఉండేవారు. విద్యార్థులను దగ్గరకు తీసుకొని వారితో స్నేహంగా మెలిగేవారు. ఈ లక్షణాలన్ని తర్వాత కాలంలో కూడా అనుసరించడం వలన అధ్యాపక రంగంలో విశ్వవిద్యాలయ స్థాయిలో ఆచార్యత్వం వహించే అవకాశాలు లభించాయని అర్థమౌతుంది.

### 1.4.2.మద్రాసు విశ్వవిద్యాలయంలో ఉద్యోగం:

మద్రాసు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో కోరాడ రామకృష్ణయ్యగారి దగ్గర లక్ష్మీకాంతంగారు రెండు సంవత్సరాల పాటు గ్రంథ ప్రతులను పరిష్కరించే ఉద్యోగంలో చేరారు. దీని గురించి కొందరు విమర్శకులు చెబుతూ *"కోరాడ రామకృష్ణయ్య కాలంలో తెలుగు శాఖలో పని చేసిన హేమి హేమిలలో వారిలో పింగళి లక్ష్మీకాంతంగారు ఒకరు. పింగళి లక్ష్మీకాంతం1927-30 మధ్యలో తెలుగు శాఖలో సహాధ్యాపకులుగా నండూరి బంగారయ్య, పింగళి లక్ష్మీకాంతం పని చేయడం విశిష్టత"* అని డా. ఆర్.అనంత పద్మనాభరావుగారు (ఆచార్య దేబోభవ (160మంది విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యుల జీవనరేఖలు),2022:17,18) పేర్కొన్నారు. ఈ ఉద్యోగం కేవలం రెండు సంవత్సరాల పరిమితితో ఇవ్వడం జరిగింది. అక్కడే ఆంధ్రమహాభారత ప్రతులను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.

### 1.4.3. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యక్షుడు:

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఏ. ఆనర్స్ తెలుగులో 1931 సంవత్సరంలో పింగళి లక్ష్మీకాంతంగారు ప్రారంభించారు. అప్పటి ఉపకులపతి డా॥ సర్వేపల్లి రాధాకృష్ణగారి సహాయంతో తెలుగుశాఖ అధ్యక్ష పదవిని స్వీకరించారు. దీని గురించి కొందరు విమర్శకులు చెబుతూ *" ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ అధ్యయన, అధ్యాపనాలకు పరమ గురువు పింగళి లక్ష్మీకాంతం మద్రాసు, ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలు మూడింటిలో పని చేసిన విశిష్టవ్యక్తి, సాహిత్యచరిత్ర పితామహుడు పింగళి"* అని డా.ఆర్.అనంత పద్మనాభరావుగారు (ఆచార్య దేబోభవ (160మంది విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యుల జీవనరేఖలు),2022:72) వ్యాఖ్యానించారు. ఇదే వారి మొదటి శాశ్వత ఉద్యోగం. తెలుగుశాఖ అధ్యక్షుడైన వెంటనే విద్యార్థులకు సరైన పాఠ్యాంశాలను, పరీక్ష విధానాన్ని ఏర్పాటు చేశారు. వీరు స్వయంగా తెలుగు పాఠాలను బోధిస్తూ ఆంధ్ర సాహిత్య అధ్యాపక రంగానికి పునాదులు వేశారు. విద్యార్థులకోసం పాఠ్యప్రణాళికల రూపకల్పన, విద్యాబోధన సూత్రాలను ప్రవేశపెట్టారు. విద్యార్థులకు స్వయంగా సాహిత్యవిమర్శసూత్రాలు, సాహిత్యచరిత్ర, వ్యాకరణాంశాలను సుదీర్ఘంగా బోధించేవారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 1931 నుంచి 1949 వరకు రీడర్ గా తన విధులను నిర్వహించారు. అక్కడే ప్రముఖ తత్త్వవేత్త సర్వేపల్లి రాధాకృష్ణగారితోను, ఆధునికాంధ్ర విమర్శాగ్రేసరులు కట్టమంచి రామలింగారెడ్డితోను చాలా సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి . చివరకు ఆంధ్ర విశ్వవిద్యాలయంలోనే రీడర్ గా పదవీ విరమణ పొందారు.

### 1.4.4. విజయవాడ ఆకాశవాణిలో ఉద్యోగం:

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఖాళీగా ఉండకుండా మరింత సాహిత్య కృషిని కొనసాగించారు. తరువాత 1954 నుండి 1961 సంవత్సరం వరకు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో రేడియో ఉపన్యాసకుడిగా

విధులు నిర్వర్తించారు. దీని గురించి కొందరు విమర్శకులు చెబుతూ *"సుప్రసిద్ధులైన ఆయా రంగాల వ్యక్తిల్ని ప్రయోక్తలుగా నియమించే సంప్రదాయంలో భాగంగా పింగళి ప్రసంగశాఖ ప్రయోక్తగా 1954లో నియమింపబడ్డాడు"* అని డా.ఆర్.అనంత పద్మనాభరావుగారు (ఆచార్య దేవోభవ (160మంది విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యుల జీవనరేఖలు),2022:72) తెలియజేశారు. సంస్కృత రూపకాలను రేడియో రూపాలకు అనుగుణంగా సంభాషణలు సరైన క్రమంలో కూర్చి వాటిని రేడియోలో ఉపన్యసించేవారు. సంస్కృత రూపకాలలోని పాత్రల సంభాషణలను విశ్లేషించి మాట్లాడేవారు. తర్వాత కాలంలో ఈ ఉపన్యాసాలన్నింటినీ కలిపి *"నా రేడియో ప్రసంగాలు"* అనే పుస్తకాన్ని ముద్రించారు. ఇందులో 19 ప్రసంగ సాహిత్య వ్యాసాలున్నాయి. వాటి వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

1.నాటక శరీరబంధం, 2. భాస నాటక కర్తృత్వము, 3. భాసుని ఏకాంక నాటకాలు, 4. కాళిదాసుని ప్రణయతత్వము, 5. కాళిదాసు కావ్య జగత్తు – తతపస్వి ఆశ్రమజీవితము, 6. కుమారసంభవము కాళిదాస నన్నెచోడుల కవితాసాదృశ్యము, 7. ఆంధ్రసాహిత్యంపై సంస్కృత మహాభారత ప్రభావము, 8. ఆంధ్ర ప్రబంధము– ఉత్పత్తి, 9. తెలుగు సాహిత్యం, 10. కావ్యము– కవిత్వము, 11. భావము–ధ్వని, 12. రసానుభూతి, 13. పురాణము, ఇతిహాసము, కావ్యము, 14. సన్నిహితభావములు–భక్తి,ప్రేమ, 15. సాధ్యసాధనములపవిత్రత, 16. నేను చిన్ననాడు చదివినవి, 17. భారత భారతి, 18. బుద్ధుని ధర్మప్రచారం, 19. బాపూజీ ప్రవచనములు అనే ప్రసంగ సాహిత్యాలని చెప్పవచ్చు.

### 1.4.5. ఆచార్యుడుగా పింగళి లక్ష్మీకాంతం:

పింగళి లక్ష్మీకాంతంగారు 1961 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తెలుగుశాఖలో ఆచార్య పదవిని చేపట్టారు. దీన్ని గురించి కొందరు విమర్శకులు చెబుతూ *"శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం,తెలుగు శాఖవారి పదవీకాలంలో మహోజ్జ్వలముగా వెలుగొందినది.సహోపన్యాసక బృందమునందు కూడా వారి వారి అభిరుచులను గుర్తించి తెలుగు అధ్యయన శాఖ మూడు పువ్వులు ఆరు కాయలుగా శోభించినది"* అని ('పింగళి లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వము – సాహిత్యము) అనే అంశంపై పిహెచ్.డి చేసిన డా. జి విశ్వనాథ నాయుడుగారు తెలియజేశారు.

దీన్ని మరికొంత మంది వక్తలు చెబుతూ *"తెలుగుశాఖ ఆచార్యులుగా అధ్యయన, అధ్యాపనాలతో బాటు పరిశోధనలకు తోడ్పడ్డాడు"* అని డా.ఆర్.అనంత పద్మనాభరావుగారు (ఆచార్య దేవోభవ (160మంది విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్యుల జీవనరేఖలు),2022:72) వ్యాఖ్యానించారు. పింగళివారు తెలుగుశాఖను ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగుశాఖతో సమానంగా అభివృద్ధి చేశారు. 1965 సంవత్సరంలో వీరి జీవిత కాలంలో మొత్తం 27 సంవత్సరాలు ఉద్యోగ విధులను సంపూర్ణంగా నిర్వర్తించారు.1970 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం

ఆయనకి గౌరవ డాక్టరేట్ పట్టాను ప్రకటించి దాన్ని అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావుగారి చేతులమీదిగా తీసుకున్నారు.

### 1.4.5.1. పింగళివారి పేరుతో బంగారు పతకం:

ఆచార్యపింగళి లక్ష్మీకాంతంగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) తెలుగు శాఖలో ఆచార్యులుగా పనిచేశారు. ఆయన సేవలకు గుర్తుగా ఆయన పేరు మీద ఒక గోల్డ్ మెడల్ అవార్డును ఏర్పాటు చేశారు. ఆ అవార్డు ఎం.ఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల్లో అత్యున్నత ప్రతిభను కనబర్చిన అమ్మాయికి కేటాయించడం జరిగింది. దానికి సంబంధించిన వివరాలు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ లో ప్రచురించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**Prof. Pingali Lakshmikantham Gold medal for the best outgoing women student of M.A. Telugu.**

**svuniversity.edu.in/departments/telugu-studies** (అనే వెబ్ సైట్ ను చూడిండి).

### 1.5. వివిధ సంస్థలతో పరిచయం:

పింగళి లక్ష్మీకాంతంగారు తన గురువుతో, మిత్రలతో తోటి ఉపాధ్యాయులతో విద్యార్థులతో సన్నిహితంగా మెలిగేవారని అనడానికి ఆయన జీవిత చరిత్రలు ద్వారా తెలుస్తుంది. కనుక ఆయన వివిధ సాహిత్య సంస్థలతో సన్నిహిత సంబంధాలుండేవని వీటి ద్వారా ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని తెలుసుకోవడానికి ఈ వివరాల్ని కింది విధంగా ప్రస్తావిస్తున్నాను.

### 1.5.1 కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యునిగా పింగళి:

పింగళి లక్ష్మీకాంతంగారు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా కూడా వ్యవహరించారు. పింగళివారు తన ఉద్యోగ నిర్వహణలో అనేక ప్రాంతాలలో ఉన్న వివిధ సంస్థలతో పరిచయాలు కలిగే ఉండేవారు. ఆ సంస్థలలో పనిచేసే ఉద్యోగులతో, సిబ్బందితో, ప్రముఖులతో పరిచయాలు ఉండేవి. 1970 సం॥లో తెలుగు అకాడమీ పాలకమండలి సభ్యునిగా విద్యావిషయక సంఘానికి అధ్యక్షులుగా అప్పటి ప్రభుత్వం నియమించింది. ఉదాహరణకు విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో అకాడమీకి సంగీత, సాహిత్యశాఖలకు సలహాదారునిగా పనిచేసే కాలంలో విస్తృతంగా పరిచయాలు ఉండేవి. ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతులు సర్వేపల్లి రాధాకృష్ణ, కట్టమంచి రామలింగారెడ్డిగారితో స్నేహపూర్వకంగా మంచి సంబంధాలను కొనసాగించారు.

### 1.5.2. భారత తొలి ప్రధాని నెహ్రూగారితో అనుబంధం:

భారత ప్రభుత్వం దేశంలోని వివిధ భాషలకు సాహిత్య అకాడమీలను స్థాపించింది. దీని ప్రారంభించడానికి ఘనంగా ఏర్పాట్లను చేసింది. ఈ సమావేశాలకు తెలుగు భాషా తరపున పింగళి లక్ష్మీకాంతంగారిని ఆహ్వానించింది. లక్ష్మీకాంతంగారితో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు

పాల్గొన్నారు. అంతకు ముందు పింగళి లక్ష్మీకాంతంగారు దక్షిణ భారతదేశ రేడియో కార్యక్రమాలకు కూడా ప్రతినిధిగా నియమితులైయ్యారు. మరోవైపు కేంద్ర సాహిత్య అకాడమీలో సభ్యునిగా సేవలను అందిస్తున్నారు. వాటి గురించి నెహ్రూగారి మాటల్లో విందాం.

*"సమావేశాలనంతరం తిరిగి బయటకు వస్తూంటే ప్రధాని నెహ్రూగారెదురై నమస్కరించి 'లక్ష్మీగాంతంగారూ! సాహిత్య ఎకాడమీ ప్రారంభించడం జరిగింది. సాహిత్యలోకానికి ఎలా సేవ చేయాలో, భారతప్రభుత్వం వల్ల కాదగినదేమైనావుంటే చెప్పి చేయించుకునే బాధ్యత మీది. అంతా కలిసి ఆ సాహిత్యానికి సేవ చేద్దాము. నా సేవలు వినియోగించుకునే బాధ్యత మీదేనని చెప్పి వెళ్లారు"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:97) పింగళివారితో నెహ్రూగారు స్వయంగా తెలియజేశారని గూడూరి నమశ్శివాయగారు సోదాహరణంగా ప్రస్తావించారు.

### 1.5.3. ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అకాడమీ సభ్యునిగా పింగళి:

1970 సం॥లో తెలుగు అకాడమీ పాలకమండలి సభ్యునిగా విద్యావిషయక సంఘానికి అధ్యక్షులుగా, పాఠ్యపుస్తకాల శైలీ సంఘానికి పింగళివారిని అప్పటి ప్రభుత్వం నియమించింది. తెలుగు అకాడమీ సభ్యునిగా పని చేసినంతకాలం ఆయన తెలుగుభాష పాఠ్యపుస్తకాలలో విద్యార్థులకు అనుగుణంగా సరళగ్రాంథిక, వ్యావహారికభాషను ఏవిధంగా అమలు చేయాలనే సంఘాలకు అధ్యక్షుడిగా వ్యవహరించారు. దీనితోపాటు తెలుగుభాషను మరింత విస్తృతంగా సరళీకరించడానికి నాటి ఆంధ్రదేశంలో కొన్ని సమావేశాలను ఏర్పాటు చేసి తగిన సూచనలను, సలహాలను ప్రభుత్వానికి తెలిపారని పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్రలను రాసిన గూడూరు నమశ్శివాయగారు, పింగళి సూర్యసుందరంగారు ఉటంకించారు. ఈ కృషికి గాను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఆయన శతజయంతి ఉత్సవాలను 1994 లో హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించి ఆయన రాసిన ఆంధ్రసాహిత్యచరిత్రను పరిష్కరించడానికి సహాయసహకారుల్ని ఇచ్చింది. ఈ గ్రంథం నేటికి కూడా పలుమార్లు పునర్ముద్రణలు పొందుతూనే ఉంది.

### 1.6. సత్కారాలు-బహుమతులు:

పింగళి లక్ష్మీకాంతంగారు ఉన్నత శిఖరాలను అధిరోహించినా, ఎప్పుడూ కూడా సత్కారాలకు, బహుమతులకు ఇష్టపడేవారుకాదు. సాధారణ వ్యక్తిగానే జీవించారు.

పండితసభలలో జరిగే సత్కారాలను వ్యతిరేకించారు. ఉదా: 1967 సంవత్సరంలో తన శిష్యులు బలవంతంమీద పింగళి లక్ష్మీకాంతంగారు గుడివాడలో ఒక సన్మానానికి అంగీకరించారు. ఆ సన్మానం చివరకు కనకాభిషేకంగా మారింది. తనకు ఇష్టం లేకున్నా ఉన్న సద్యోగాలు అనుభవించక తప్పదని ఆ సందర్భంగానే వ్యాఖ్యానించారు.

### 1.7. పింగళివారి వ్యక్తిత్వం సూటితనం:

పింగళి లక్ష్మీకాంతంగారికి ఏ విషయమైన సూటిగా మాట్లాడం అలవాటు. ఎటువంటి దొంగతిరుగుడు లేకుండా చెప్పడం అలవాటు. అందుకనే ఆయనతో ఏదైనా మాట్లాడాలంటే

ఎవరైనా సరే జాగ్రత్తగా మాట్లాడాడేవారు. ఒక సారి ఒక రాజకీయ వ్యక్త పింగళి లక్ష్మీకాంతం గారి దగ్గరకి వచ్చి తాను ఆత్మకథ రాసుకోవాలనుకుంటున్నాను సలహాలు సూచనలు ఇవ్వమన్నాడు. ఆయనకు పింగళివారు ఈ కింది సలహాలు సూచనలు పాటించాలని తెలిపారు.

1. ఆత్మకథ అనేది కల్పన లేని నిజమైన జీవితకథగా ఉండాలి. 2. చాలామంది తమ తప్పుల్ని దాచేసి తమ ఆత్మకథలో గొప్పల్ని మాత్రమే రాసుకోవాలి. 3. ఆత్మకథ రాసుకోవాలనేవారు తమకి ఇష్టమైనవి రాసుకొని దానికి 'అనుభవాలు-జ్ఞాపకాలు' అనే శీర్షికతో రాసుకోవాలని సూటిగా పేర్కొన్నారు. (*శిరాకదంబం*, అంతర్జాల మాస పత్రిక, జనవరి, 2011) లో పింగళివారు అన్నట్లు అనుభవాలు, జ్ఞాపకాలు అనే శీర్షికతో నిర్వహించిన దానిలో తెలిపారు.

**1.8. పింగళి లక్ష్మీకాంతంపై ప్రముఖుల అభిప్రాయాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారిపై తన సమకాలికులు, తన శిష్యులు భిన్న సందర్భాలలో విభిన్న రకాలుగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రధానంగా తనరచనలపైన, తన వ్యక్తిత్వంపైన తన బోధన సామర్థ్యం పైన అభిప్రాయాలు వెలిబుచ్చారు. ఉదాహరణకు విశ్వనాథ సత్యనారాయణ పింగళి లక్ష్మీకాంతంగారు మరణించినప్పుడు "చచ్చిన పోయినవాడు అన్న, బ్రతికి ఉన్నవాడు తమ్ముడు'', ఒట్టి అన్న కాదు వాడే గురువు, నడిస్తే వాడికి మళ్లే నడవాలి, వాడికి మళ్లీ కవిత్వం వ్రాయాలి అంటూ గత స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటూ బాధపడ్డారు.

కాకర్ల వేంకట రామనరసింహంగారు పింగళివారి గురించి చెబుతూ *"సాధారణంగా పింగళి లక్ష్మీకాంతంగారిలో ఠీవి. దర్పం ఉట్టి పడుతుండేది, మాటల్లో గాంభీర్యం తొణికిసలాడేది. చూపులో, ముఖ భంగిమలో, నడకలో, రాచఠీవి చెంగ అంచేది. అందుచేతనే వారితో చనువుగా మాట్లాడటానికి చాలామంది జంకేవారు. కాని నిజానికి వారు అమృత హృదయులు"* అంటూ తన గురువు గారి గుణాలను పింగళి లక్ష్మీకాంతంగారి స్మారక సంచికలో ప్రస్తావించారు. దీన్ని బట్టి పింగళివారు ఎంత గంభీరంగా ఉన్నా తమ విద్యార్థుల పట్ల సహృదయత కనబరిచేవారని కాకర్లవారు ఉటంకించిన మాటలే నిదర్శనమని అర్థమౌతుంది.

**1.9. పింగళి లక్ష్మీకాంతగారి అభిరుచి:**

పింగళి లక్ష్మీకాంతంగారు అధ్యాపకుడు కావడం వలన విశ్వవిద్యాలయాల్లో, సాహిత్య సంస్థలో, సభలలో ప్రసంగించేవారు. వీరికి అత్యంత ఇష్టమైనది పుస్తకపఠనం. దీనితో సంపాదించిన జ్ఞానాన్ని, నలుగురికి పంచేవారు. విద్యార్థులకు చదువు చెప్పడంతో పాటు వారికి సాహిత్య జ్ఞానాన్ని ప్రసాదించి విద్యార్థుల పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి ఎల్లప్పుడు తోడ్పాటును అందించేవారు. అధ్యయనం, బోధన, పరిశోధన వృత్తి కావడం వలన వీరికి ఇది ఒక అభిరుచిగా, ఆసక్తిగా మారిపోవడం వల్ల మంచిసాహిత్యం, మంచిమిత్రులు, ప్రముఖులను సంపాదించుకున్నారు. అయితే తాను ఏది రాసినా పత్రికలకు పంపించడం గానీ, లేదా వివాదాల్లో చిక్కుకోవడం గాని ఈయనకు ఇష్టం ఉండేది కాదనీ ఆత్మలహరిలో ఇలా ఒక పద్యంలో చెప్పుకున్నారు. దాన్ని చూద్దాం.

" విచ్చలవిడి పత్రికలకు
రచ్చలకును బోవ నేను వ్రాసిన కొంచెం
బచ్చొత్తి చూచుకొనియెడి
ముచ్చట సాధారణముగ పొడమదు నాకున్ "

(ఆత్మలహరి:77)

### 1.10. పింగళి లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వం:

పింగళి లక్ష్మీకాంతంగారు అందరిని కలగొలుపుతనంతో, నిజాయితిగా ఉండేవారు. ఎవరితోనైనా, ఏ సందర్భంలోనైనా సులువుగా పరిచయాలు పెంచుకునే చొరవకలిగినవ్యక్తి. వృత్తిరీత్యా అధ్యాపకుడు కావడం వల్ల, తనవద్ద చదువుకున్నా విద్యార్థులకు మంచి జీవితాన్ని అందించారు. తన ఇంటికి విద్యార్థులు, పరిచయస్తులు ఎవరు వచ్చిన ఎంతో అభిమానంతో మర్యాదలు చేసేవారు. విద్యార్థులకు కష్టకాలంలో సహాయం చేసి వారికి ధైర్యాన్నిచ్చి ఎంతో ప్రోత్సాహాన్ని కలిగించేవారు. పండుగలకు, విందులకు తన పరిచయం ఉన్నవారిని తన ఇంటికి ఆహ్వానించి మంచి భోజనాలను ఏర్పాటు చేసేవారు. వీధినాటకాలలో 'ధర్మరాజు' పాత్రను ధరించి ఆ పాత్రకు వన్నె తెచ్చాడు. భారతంలో ధర్మరాజులాగా తను కూడా అజాత శత్రువుగా సంపాదించుకున్నారు.

### 1.11. పింగళి లక్ష్మీకాంతంగారి శిష్య బృందం:

పింగళి లక్ష్మీకాంతంగారు బందరుపాఠశాలలో, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో, మద్రాసు విశ్వవిద్యాలయంలో, నిరంతరంగా అధ్యాపకవృత్తిలో ఉండడం వలన ఎందరో శిష్యులను తయారు చేసుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో 1931–1932 సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులను బట్టి వారి శిష్యబృందాన్ని అంచనా వేయవచ్చు. దివాకర్ల వేంకటావధాని, పాటిబండ మాధవశర్మ, పెద్దింటి రామస్వామి నాయుడు, వక్కలంక శ్రీనివాసరావు, గొండవర్తి సూర్యనారాయణ, దేవరాజు వేంకట సత్యనారాయణమూర్తి, కాకర్ల రామనరసింహం మొదలైన ఉద్దండ ప్రతిభావంతులు అనేకమంది పింగళి లక్ష్మీకాంతంగారి దగ్గర చదువుకున్నారు. కొందరు ఆయన తరువాత తరంలో అనేక విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా నియమితులైయ్యారు.

### 1.12. అవధానిగా పింగళి లక్ష్మీకాంతం:

తెలుగు సాహిత్యంలో 'అవధానం' ఒక ప్రక్రియగా ప్రత్యేకమైన గుర్తింపు పొందింది. ఈ అవధాన ప్రక్రియను ఎంతోమంది కవులు ఆదరించి ప్రోత్సహించారు. ఆంధ్రదేశంలో గుంటూరు సీమలో కొప్పరపు సోదరులకు, తిరుపతి వేంకట కవులకు మధ్య అవధానాలు తీవ్ర స్థాయిలో వాదోపవాదాలుగా జరిగాయని పలువురు పరిశోధకులు, కవులు అభిప్రాయం పడుతున్నారు. ఇలా అవధానాలు జరిగినప్పుడు తిరుపతి వేంకటకవులు తమ శిష్యులను కూడా తమ వెంట పిలుచుకునేవారు.

అలా వెళ్ళినవారిలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ, రాయప్రోలు సుబ్బారావు తదితరులు తిరుపతి వేంటనేశాస్త్రిగారి దగ్గర బందరు పాఠశాలలో చదువుకున్నారు. అప్పటి నుంచి గురువుగారి అడుగుజాడల్లో అనుసరించారు. తిరుపతి వేంకటకవులు అవధానాలను చేసినప్పుడు వీరి శిష్యులు. తప్పకుండా పాల్గొనేవారు. అలా గురువుల వద్ద అవధానాలను నేర్చుకుంటూ గురువుల అనుమతితో, ప్రేరణతో శిష్యులు కూడా అవధానాలను చేసేవారు. అలాంటి వారిలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఒకరు. పింగళివారు తిరుపతి వేంకటశాస్త్రిగారికి నిత్యం తోడుగా ఉంటూ గురువుకు సేవ చేశారు. పింగళి లక్ష్మీకాంతంగారు గురువు దగ్గరే ఛందోబద్ధమైన పద్యసాహిత్యంలో మేళకువలు నేర్చుకున్నారు. ఈ నేపథ్యంలోనే పింగళి లక్ష్మీకాంతంగారు గురువును అనుసరిస్తూ గురువు సమక్షంలో అవధానాలు చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాల్ని స్మరిస్తూ పింగళివారు రాసుకున్న ఆత్మలహరి (ఆత్మకథ)అనే పద్యకావ్యంలో అవధాల గురించి చెప్పకున్నారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు అవధానాలను చేశారని స్పష్టంగా కనిపిస్తుంది. కనుక పింగళివారు ఎక్కడెక్కడ ఏ సందర్భంలో అవధానాలు చేశారో ఇక్కడ తెలియజేస్తాను.

పింగళివారి అవధానాల తీరు తెన్నుల విశిష్టతల గురించి పింగళి వేంకట కృష్ణారావుగారు, పింగళి సూర్యసుందరంగారు, గొల్లపూడి ప్రకాశరావుగారు, పింగళి లక్ష్మీకాంతంగారి శతజయంతిసంచిక, స్మారకసంచికలు, ఇతరులు రాసిన వ్యాసాల్లోను మొదలైన వాళ్ళు రాసిన గ్రంథాలలోను, వ్యాసాలలోను, కొన్ని పద్యాల్ని పేర్కొన్నారు. అందువల్ల వారందరి వలనే పింగళి లక్ష్మీ కాంతంగారి అవధాన విశేషాల్ని గుర్తించడానికి వీలవుతుంది. ఆయన విద్యార్థి దశలోనే అవధానాల్ని తిరుపతి వేంకటకవులతో పాటు చేసినట్లు పై వారందరూ కూడా ఎంతో స్పష్టంగా తమ పరిశోధనాత్మక గ్రంథాలలో తెలియజేశారు.

పింగళి లక్ష్మీకాంతంగారు చదువుకునే రోజులలోనే అవధానాన్ని నేర్చుకున్నారు. "*పింగళివారికి కాటూరితో పరిచయం అయిన తర్వాత బందరు, తోట్ల వల్లూరు, గుంటూరు, అనంతపురం, నెల్లూరు మొదలైన ప్రాంతాలలో అష్టావధానాలు, శతావధానాలు చేసినట్లు తెలుస్తుంది. తర్వాత చదువుకోవడానికి మద్రాసుకు వెళ్లిపోవడంతో అవధానాలు కొనసాగించినట్లు ఆధారాలు లభించలేదు*" అని పింగళి వేంకటకృష్ణారావుగారు (పింగళి లక్ష్మీకాంతం కావ్య సమాలోచనము', 2013:344,345) తెలియజేశారు. దీన్ని బట్టి పింగళివారు అనేక సభల్లో పాల్గొని అవధానాల్ని చేసినట్లు కనిపిస్తుంది. ఈ అవధానాల్ని తిరుపతి వేంకటకవుల ఆశీస్సులతో, ప్రోత్సాహంతో కాటూరి వేంకటేశ్వరరావు వంటివారి సహకారంతో చేసినట్లు పింగళివారి జీవిత చరిత్రలను రాసిన గూడూరి నమశ్శివాయ, గొల్లపూడి ప్రకాశరావు, పింగళి సూర్య సుందరంగార్లు తెలిపారు.

### 1.12.1 గుంటూరు సభలో అవధానిగా పింగళి:

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాలలో అవధానాలు చేశారు. వాటికి సంబంధించిన కొన్ని విశేషాలను పింగళి వేంకటకృష్ణారావు రాసిన *'పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము''* అనే గ్రంథంలో పేర్కొన్నారు. ఆంధ్రదేశంలో గుంటూరు జిల్లా వేమవరంలో తిరుపతి వేంకటకవులు అవధానం ఒకటి జరిగింది. ఆ సభలో పింగళి లక్ష్మీకాంతం గారు ఒక ప్రేక్షకునిగా కూర్చున్నారు. పృచ్ఛకులలో ఒకరు *''క్రొప్రమ్మున దాగియుంట ప్రతిపక్షులకున్ సహజమ్ము కాదొకో'* అని తిరుపతి వేంకట కవుల్ని ఈ పద్యాన్ని పూరించమని అన్నారు. (పింగళి వేంకట కృష్ణారావు2013:343.) వెంటనే తిరుపతి వేంకట శాస్త్రి గారు ఈ పద్యాన్ని మా లక్ష్మీకాంతం పూర్తి చేస్తాడని అన్నారు.

*'' రమ్మని పిల్వనంపిన యరాతుల యందలి భీతిచేసి ప్రా*
*ణమ్ములు దక్కవంచు నయనమ్ముల భాష్పములుప్పతిల్ల శో*
*కమ్మున కొప్రమందిరిక కానగ రారిది వింత కాదు కొ*
*ప్రమ్మున దాగియుంట ప్రతిపక్షులకున్ సహజమ్ము కాదొకో''*

ఇక్కడ ఈ పద్యంలో ప్రతిపక్షకులకున్ అనేది కీలకమైన అంశం. ప్రతి పక్షాలు అనగా విరోధులు, పోటీదారులు అనే అర్థాలు చెప్పుకోవచ్చు. ఆ రోజుల్లో తిరుపతి వేంకటకవులకు అవధానాలలో ప్రధాన పోటీదారుల్లో కొప్పరపు కవులు ఒకరు. కొప్పరపు కవులు తిరుపతి వేంకట కవులతో ప్రతి పక్షానికి చెందిన వారు కాబట్టి వాళ్ళు అవధానాలకు రాకుండా దాక్కున్నారనే ఎత్తి పొడుపు ఆ సమస్యలో ఉన్నట్లుగా కనిపిస్తుంది. లోకంలో సహజంగా బలవంతుడైన వాళ్ళతో శత్రుత్వం ఉన్నప్పుడు బలహీనులు ఆ బలమైన వాళ్ళతో పోటీ పడటానికి ఇష్టపడరు. కానీ అలాంటి పరిస్థితి ఎదురైనందుకు దుఃఖిస్తారు. అని లోకి సామాన్య విషయాన్ని చెప్పి ఇక్కడ కొప్పరపు కవులను కూడా ఉద్దేశించి ఆ సమస్యను పింగళి లక్ష్మీకాంతంగారు పూరించారు. 'కొప్రరమ్మున' అనగా కొప్పరపు కవుల స్వగ్రామం పేరు అది గుంటూరు జిల్లా నరసరావుపేటలో ఉంది. తిరుపతి వేంకట కవుల శత్రువు లు కొప్పరపు కవులు ఈ అవధాన సభకు రాకుండా ఓడిపోతామని భయపడి వాళ్ళ గ్రామంలోనే దాక్కున్నారని దీనిలో శ్లేష అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:343)అభిప్రాయంలో పింగళి లక్ష్మీకాంతంగారు అవధానంలో పాల్గొని చెప్పిన మొదటి పద్యమని తెలియజేశారు.

### 1.12.2. నెల్లూరు సభలో అవధానిగా పింగళి:

నెల్లూరు ఆంధ్ర సాహిత్య పరిషత్తులో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు గార్లు శతావధానం గురించి గూడూరి నమశ్శివాయగారు రాసిన పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్రలో చెప్పారని పింగళి వేంకటకృష్ణారావుగారు తన గ్రంథంలో ఉటంకించారు. (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:343) శతావధానంలో పింగళి లక్ష్మీకాంతం సమస్యను పూరించారని తెలుస్తుంది. *కాంతా రమ్మనియెన్ మునీంద్రుడు చమత్కారంబు*

*దీపింపగన్.* ఈ సమస్యను పింగళి– కాటూరి కవులు ఈ విధంగా పూర్తి చేశారు. మునీంద్రుడై ఉండి ఒక కాంతను పిలవడమే చమత్కారం. దీన్ని ఈ విధంగా పూరించారు కవి.

*"దంతుల్ ఘటకముల్ పదాతులును చెంత గొల్చిరాన్ వచ్చు దు*
*ష్యంతున్గన్గొని కణ్వమౌని "యిటు రాజారామ్మ" నన్ "మీకు మీ*
*అంతేవాసులకున్ సుఖమ్మె" యన "నీ యండన్సుఖంబుండె మా*
*కాంతారమ్మ"నియెన్ మునీంద్రుడు చమత్కారంబు దీపింపగన్ "*

ఈ పద్యంలో ఏనుగులు, గుఱ్ఱాలు, కాల్బలము చెంత నుండి సేవించుచుండగా వచ్చిన దుష్యంతుని కణ్వమహాముని చూసి "రాజా యిటు రమ్మని" పిలువగా రాజు కణ్వునితో *"మీరు మి శిష్యులూ సుముఖముగా ఉన్నారా"అని పలుకగా "మీ ఆశ్రమంలో మా వనము సుముఖముగా ఉన్న"*దని మునీంద్రని చమత్కారము"గా పూరించారు.

**1.12.3. బందరు సభలో అవధానిగా పింగళి:**

బందరు జాతీయకళాశాలలో ఒక అవధాన సభ జరిగింది. ఆ అవధాన సభలో ఒక పృచ్ఛకుడు పింగళి సూరన గురించి ఒక పద్యాన్ని చెప్పమని అడిగారు. పింగళివారు ఆ పద్యాన్ని ఈ విధంగా చెప్పారు.

*" వంగడ మంతకున్ తగిన పావనుడై జనియించి జాహ్నవీ*
*తుంగ గభీర్ భంగచయ తుల్యపటుత్వ కవిత్వకర్తయై*
*బంగరు రంగులీనెడు ప్రబంధములన్ రచియించినట్టి మా*
*పింగళి వంశ సూర సుకవిన్ వినుతింతు సభాంతరంబునన్ "*

పింగళి లక్ష్మీకాంతంగారు తాను పింగళి సూరన వంశానికి చెందినవాడినని అనేక సందర్భాల్లో చెప్పిన విషయాన్ని ఈ అవధానంలో ఎంతో చక్కగా పింగళి సూరన గొప్పతనాన్ని చెబుతూనే తాను ఆ వంశానికి చెందినవాడినని చెప్పడం కనిపిస్తుంది.

**1.12.4. పింగళివారి అవధాన కళపై విమర్శకుల అభిప్రాయాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారి ప్రత్యక్ష శిష్యుల్లో డా. దివాకర్ల వేంకటావధానిగారు ఒకరు. పింగళివారు చేసిన అవధానం గురించి ఈ విధంగా చెప్పారు. *"ఒకప్పుడు వారు గురువుగారొనరించిన యవధానమును దర్శించి, విస్మయావిష్టులై, తాము నావిద్యనభ్యసించి, అష్టావధానమును, శతావధానమును, గూడా నాచరించిరి. అవధానములు తాత్కాలిక కీర్తికరములయ్యును, రసవత్కవితా కౌశల ప్రేరకములు కావని గుర్తించి తరువాత వారు వానియెడనంతగా శ్రద్ధవహింపరైరి"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక 1974: 12) వ్యాఖ్యానించారు.

దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు అవధానవిద్య పట్ల అనుసరించిన తీరును తెలియజేశారు. దీనితో పాటు పింగళివారు అవధానం, శతావధానం, అష్టావధానాలలో పాల్గొన్నారని కానీ ఆయన ఎలాంటి సత్కరాలను, పేరు ప్రతిష్టతల్ని సంపాదించుకోవడానికి

ఇష్టపడేవారు కాదని తెలుస్తుంది. అయినా కూడా ఆయన అవధానసాహిత్యాన్ని తనదైన కృషితో మరింత ముందుకు తీసికెళ్లారని అర్థమౌతుంది.

### 1.13. నటుడిగా పింగళి లక్ష్మీకాంతం:

పింగళి లక్ష్మీకాంతంగారు చిన్నతనం నుంచి పద్యాలు, పాటలు పాడేవారు. అందరి ముందు ఎటువంటి భయం, బిడియం లేకుండా పాఠశాలలో చురుకుగా తన అభిప్రాయాలను అందరిముందు తెలియజేసేవారు. ఆయన మాటతీరు మెచ్చి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు పింగళివారిని తన శిష్యునిగా ఎన్నుకున్నారు. గురువు దగ్గర భారతం, రామాయణం, భాగవతం వంటి ప్రాచీన సాహిత్యాంశాలను ఎంతో క్రమశిక్షణతో నేర్చుకున్నారు. చిన్నతనం నుంచే నాటకరంగ పట్ల అభినివేషంతో నాటకాలలో వేషాలు వేసి అందరిచేత నటుడిగా ప్రశంసలందుకున్నారు. మహాభారతంలోని 'ధర్మరాజు' పాత్రను వేసి ఆ పాత్రకు వన్నె తెచ్చారు. నిజ జీవితంలో ధర్మరాజులాగా నీతి, ధర్మం, న్యాయం, మంచి మనస్తత్వ గుణాలను, లక్షణాలను అలవరచుకొని ఎవరితోను శత్రుత్వాన్ని పెట్టుకోలేదు. బందరులో ''రాయల్ థియేటర్'' అనే నాటక కంపెనీ ఉండేది. ''ఆంధ్రసభ'' అనే మరొక సంస్థ ఉండేది. గుంటూరులో వీరి పెద్ద అన్న నరసయ్యగారు ఒక నాటకకంపెనీని స్థాపించారు. వీరి ఆధ్వర్యంలో పింగళివారు నాటకాలు వేశారు. *గయోపాఖ్యానంలో* 'కృష్ణుని' పాత్రను పాదుకా పట్టాభిషేకంలో 'భరతుని' పాత్రను, *కంఠాభరణంలో* 'కృష్ణారావు' పాత్రను, రసపుత్రవిజయంలో 'రాజసింహ' పాత్రను, *ప్రతాపరుద్రీయంలో* 'విద్యానాథుడు' పాత్రను, *చిత్రనళీనీయంలో* 'బహుకుడు' పాత్రను, *ముద్రారాక్షసంలో* 'రాక్షసమంత్రి' పాత్రను, *మృచ్ఛకటికంలో* 'చారుదత్తుని' పాత్రల్ని పోషించి నాటకం పట్ల కళల పట్ల చిన్నతనం నుంచే అభిరుచివున్నట్లు మనకు స్పష్టంగా తెలుస్తోంది. తన నటన గురించి లోకంలో వీరరసాన్ని పండించడంలో ఆరితేరినవాడనే వారనీ, వాళ్ళ తమ్ముడు కూడా నటుడనీ తన '*ఆత్మలహరి*'లో ఇలా చెప్పుకున్నారు.

**'' వీరరసావతారుడని విశ్రుతికెక్కిన నాటకుండు వా**
**క్కూరుడు మా నృసింహునకు కూరిమి తమ్ముడ హాస్యశోకశృం**
**గార రస ప్రధానముల నాయక వేషధరుండు సత్కవిన్**
**పేరునకేను కాంతుడ సవిత్రపు పింగళి వంశజాతుడన్ ''**

### 1.13.1.విద్యార్థి దశలో నాటక ప్రదర్శన:

పింగళివారు తొలిసారిగా నాటకంలో వేషాలు వేయడానికి వీరి ఆర్థిక పరిస్థితియే కారణం. ఈ నేపథ్యాన్ని గూడూరి నమశ్శివాయ గారు ఈ విధంగా తెలియజేశారు. *''ఐదవ ఫారం చదువుతూండగానే ఆయన నాటకాలలో చిన్నచిన్న వేషాలు వేయడం ఆరంభించారు. కాని ఆర్థిక మైన యిబ్బందుల వల్ల పాఠశాల చదువు వారికి చాలా కష్టమే అయింది. నాటకాలలో వేషాలు వేస్తూనే స్కూలు ఫైనల్ పూర్తి కావించారు''* అని (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,

1991:5,6). దీన్ని బట్టి ఆయన నాటకాల పట్ల చిన్నతనంలోనే ఆకర్షతులైయారని తెలుస్తోంది. దాన్ని వివిధ పాత్రల్లో విభిన్నంగా ధరించారని అర్థమవుతుంది.

### 1.13.2. పింగళివారి నాటక ప్రవేశం:

ప్రముఖకవి విశ్వనాథ సత్యనారాయణగారి షష్టిపూర్తి సన్మానసభలో పింగళి లక్ష్మీకాంతంగారు తన నాటకప్రవేశమును గురించి ఈ విధంగా చెప్పుకుంటూ... *"నాటకరంగంలో ప్రవేశం తొలుత నాకు గురుపాదులైన శ్రీచెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి మూలంగానే కలిగింది. శాస్త్రిగారు తాము ఏ వూళ్లో అవధానం చేసినా అచట తమ నాటకాలను గూడా తమ శిష్యులచేత ప్రదర్శింపచేస్తూ ఉండేవారు. శిష్యులకు కవిత్వములోనే గాక నటనలో కూడా ఆయన తరిఫీయతు(శిక్షణ) ఇచ్చేవారు. నాటకాలలో వేషాలు వేసేవారిని ఆ కాలంలో ఒక విధంగా చిన్నగా చూడడం ఉండేది. కాని వేంకటశాస్త్రిగారు తమ శిష్యుల చేతనే వేషాలు వేయిస్తున్నారనే సరికి నాటక కళకు, నటులకు గూడ గౌరవం ఏర్పడింది"* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీపింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:13) తెలిపారు. దీన్ని బట్టి పింగళివారు ఎలాంటి సాహిత్య రచనలు రాసిన, నాటకాలలో నటుడిగా వివిధ పాత్రలు వేసిన, అవధానాలు చేసిన, పాఠాలను బోధించినా మొదలైనవాటిని చేయడానికి గురువు కృప ఉందనే విషయాల్ని పింగళివారు వివరించారు.

### 1.13.3. తొలిసారి ధర్మరాజు పాత్ర ప్రదర్శన:

పింగళి లక్ష్మీకాంతంగారు నాటకంలో ధర్మరాజు పాత్రను ఏ పరిస్థితుల్లో ప్రదర్శించాల్సి వచ్చిందో చెబుతూ *"శ్రీ చెళ్లపిళ్ల వారి ఆధ్వర్యాన ఒక ఊళ్లో పాండవోద్యోగ విజయముల నాటకం ప్రదర్శించవలసి వచ్చిందట. ధర్మరాజు పాత్రధారి జబ్బుచేసి రాలేక పోయాడు. శాస్త్రిగారు ఆ పాత్రను లక్ష్మీ కాంతంగారిని ధరించవలసినదిగా ఆదేశించారట. లక్ష్మీకాంతంగారు ఆ పాత్రను ధరించటం, పెద్దల మెప్పుపొందడం జరిగింది. అప్పటి నుండి ఆ పాత్రను వారే ధరించి నటిస్తూ వచ్చారు"* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:10) అన్నారు. దీన్ని బట్టి నాటకాలలో ధర్మరాజు పాత్ర యాదృచ్ఛికంగా లభించిందని తెలుస్తుందని దీన్ని పింగళివారు పోషించారని నమశ్శివాయగారు తెలియజేశారు.

### 1.13.4. పాండవోద్యోగ విజయం (ధర్మరాజు పాత్ర):

తెలుగు నాటకసాహిత్యం గురించి మాట్లాడేవారికి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు తెలియనివారుండరు. ఆయన రాసిన 'పాండవోద్యోగవిజయం' అనే నాటకం ఆ నాటి నాటకకర్తలందరినీ ప్రభావితం చేసింది. నాటకసాహిత్యంలో అంత గొప్ప నాటకం పాండవోద్యోగ విజయం. కనుక ఈ నాటకాన్ని కూడా పింగళివారు ప్రదర్శించారనడానికి కొందరు విమర్శకులు ప్రశంసించిన తీరే నిదర్శనం. దీనిని శ్రీ గొడవర్తి సూర్య నారాయణగారు ఈ విధంగా తెలియజేశారు. ఒకసారి "1917లో రాజమండ్రిలో పాండవోద్యోగ విజయం నాటకంలో పింగళివారు ధర్మరాజు పాత్రధారి. ఇందులో పింగళివారి సోదరుడు పింగళి

నరసింహుడు భీముడు పాత్రను వేశారు. వీరి పాత్రల ప్రదర్శనాన్ని వడ్డాది సుబ్బారాయుడుగారు పింగళివారితో 'ఎవరయ్యా వీరు అన్నదమ్ములా' అని అన్నారు. అప్పుడు వీరు రంగస్థల మీదికివచ్చి ఆశువుగా కింది పద్యాన్ని చదివినారు.

**" వీర రసావతారుడని విశ్రుతికెక్కిన నాటకుండు వా**
**క్ర్యారుడు మా నృసింహునకు కూరిమి తమ్ముడ వీర శోక శృ**
**గార రస ప్రధానముల నాయక వేష ధరుండ సత్కవిన్**
**పేరునకేను కాంతుడ పవిత్రపు పింగళి వంశజాతుడన్ ".**

(ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక: 1974:4) అని దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు పింగళి వంశానికి చెందిన వాడిననీ, తాను వీరరస పోషణలో ప్రసిద్ధి చెందాననీ, నాటకాల్లో పండితుడునని అన్నారు. తన అన్న నరసింహుడు వీర, శృంగార రసాల్లో అమితంగా నాయకుడి పాత్రలను వేసి మంచి పేరు పొందారని చెప్పారు. శ్రీ గొడవర్తి సూర్య నారాయణగారు పింగళివారి శిష్యుడు.

### 1.13.5. అనేక నాటకాల్లో ధర్మరాజు పాత్ర పోషణ:

పింగళివారు భారత నాటకం ప్రదర్శించారు. అందులో ధర్మరాజు వేషాన్ని వేశారు. ఆయన ధర్మరాజు పాత్రలో చూపిన శాంత స్వభావం, వినయం, పెద్దల పట్ల గౌరవం, మాట తీరు, పద్య పఠనం, రసం మొదలైన లక్షణాలు కనిపించాయి. దీన్ని పురాణం సూరిశాస్త్రిగారు ఇలా చెబుతూ *"లక్ష్మీకాంతముగారు గొప్ప పాటకుడుగాదు. కాని పద్యమునకు రసపుష్టినొసంగు గానకౌశల్యమేర్పడియున్నది. వెంకటశాస్త్రిగారి తరువాత నీయూరిలో పద్యముల నర్థవాహకవైశద్యముతో, స్పష్టముగ రసభావయుక్తముగ నుచితమగు సంగీతముతో శ్రవణానందముగ జదువనేర్చినవాడీ లక్ష్మీకాంతమే"* అని పురాణం సూరిశాస్త్రిగారు (తొలినాటి తెలుగు నాటక విమర్శ 'నాట్యాంబుజము' ఆచార్య మొదలి నాగభూషణ శర్మ, (సంపా), 2011:105) అన్నారు. దీన్ని బట్టి పింగళివారు భారతనాటకంలో ధర్మరాజు పాత్రలో నటించారని, ఆయన వాచికాన్ని అభినయించిన తీరు తెన్నులను పురాణంవారు విశదీకరించారు. పురాణంవారే మరోచోట పింగళివారు వేసిన ధర్మరాజు పాత్ర గురించి ఇలా పేర్కొన్నారు.

*"లక్ష్మీకాంతము తన నిత్యజీవన పద్ధతులకనుకూలమైన పాత్రలనే యెక్కువ సామర్థ్యముతో నిర్వహించగలడు గాని లక్ష్మణస్వామి ఘమేరుసింగు భీభత్సమును, నాగరాజారావు పఠాను మతి భ్రమణమును, రాఘవాచారి రామదాసు భక్తి నిశ్చేష్టతను, సంబంధం మొదలియారయాగో కౌటిల్యమును, గోపాలర్సు శకారశ్యాలకతత్వమును ప్రకటించునట్లు నిజస్వభావమును సంపూర్ణ విరుద్ధముగనుండు నాటక పాత్రలతో గుణ రూప సాదృశ్యమొంది యభినయించలేదు"* అని పురాణం సూరిశాస్త్రిగారు (తొలినాటి తెలుగు నాటక

విమర్శ 'నాట్యాంబుజము' ఆచార్య మొదలి నాగభూషణశర్మ, (సంపా),2011:20) తెలియజేశారు.

### 1.13.6. 'సంపూర్ణ భారతములో నటుడిగా పింగళి:

తెలుగు నాటకసాహిత్యచరిత్రలో తిరుపతి వేంకటకవుల స్థానం ప్రత్యేకమైంది. చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి శిష్యుల్లో పింగళి లక్ష్మీకాంతంగారిది అగ్రస్థానం. అంతేకాదు తిరుపతి వేంకటకవులు రాసిన నాటకాల్లో వివిధ పాత్రలను వేశారు. బందరులోని 'రాయల్ థియేటర్' అనే నాటక సంస్థకు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు అధ్యక్షులుగా ఉండేవారు. ఒకసారి పాండవోద్యగ విజయం నాటకాలన్నింటిని కలిపి 'సంపూర్ణ భారతము'ను పేరుతో ప్రదర్శించడానికి పింగళి వారిని మద్రాసు నుండి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆ వివరాలను శ్రీనివాస చక్రవర్తిగారు ఈ విధంగా ప్రస్తావించారు. *"1929 సంవత్సరంలో రాయల్ థియేటర్ వారు బందరు మినర్వాహాలులో తిరుపతి వేంకట కవుల పాండవోద్యగ విజయం నాటకాలన్నింటిని కలిపి 'సంపూర్ణ భారతము'ను పేరుతో ప్రదర్శించిరి. లక్ష్మీకాంతముగారు మద్రాసు నుండి వచ్చి నాటక ప్రదర్శనలో పాల్గొనిరి. ఆనాటి ప్రదర్శనం చాక్షుషక్రతువు చూచే భాగ్యం నాకు కలిగింది"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక,1974:26) తెలిపారు. దీని ద్వారా తాను పింగళి వారి నాటకాన్ని ప్రత్యక్షంగా చూసి ఆ విశేషాలను తన మాటల్లో వెలుబుచ్చారు. ఇంకా పింగళి లక్ష్మీకాంతంగారు వివిధ నాటకాల్లో ప్రదర్శించిన తీరుతెన్నులను సోదాహరణంగా ఉటంకించారు.

### 1.13.6.1. సంపూర్ణ భారతం:

1929 సంవత్సరంలో 'సంపూర్ణభారతం' నాటకాన్ని ప్రదర్శించడానికి ఒక ప్రత్యేక కారణం ఉంది. లక్ష్మీకాంతంగారి శిష్యవాత్సల్యం చాలా దొడ్డది. యోగ్యతకల విద్యార్థులకు ఆర్థిక కారణాలవల్ల చదువు ఆగిపోయే పరిస్థితి వస్తే వాళ్లని ఎట్లాగైనా ఆదుకొనేవారు. ఆ అనుభవాలు తనకు కలిగాయి కదా. ఆయన ఆదుకొన్న వారిలో కమలాకర వెంకటరావు ఒకరు. (ఈయన ప్రఖ్యాత సినీ దర్శకుడు కమలాకర కామేశ్వరరావు సోదరుడు). ఆయనకు కాలేజీ చదువు సాగే అవకాశం లేకపోయింది. ఆయనకు ఆర్థిక సహాయం చేయటానికే ఆ నాటకమాడారు. ఆ 'బెనిఫిట్ షో' వల్ల వచ్చిన పైకాన్ని వెంకటరావుగారి కిప్పించి, బి.ఏ., చదువు పూర్తి చేయించారు. ఆ తరువాత ఆయనకి ముట్నూరి కృష్ణారావుగారితో చెప్పి "కృష్ణాపత్రిక" లో ఉద్యోగం ఇప్పించారు'' అని పింగళి సూర్య సుందరం, పింగళి లక్ష్మీకాంతం అనే గ్రంథంలో (2010:36) రాయడాన్ని బట్టి పింగళివారి ఔదార్యం ప్రత్యేకంగా తెలుస్తుంది. ప్రత్యేకంగా ఆయనకు శిష్యులపై అపారమైన వాత్సల్యం ఉందని, అది ఆయన వ్యక్తిత్వంలో కనిపించే ఒక గొప్ప లక్షణమని తెలుస్తోంది. మరోవైపు ఆయన విద్యార్థులకు సహాయం చేయడానికే నాటకాలను ప్రదర్శించి వచ్చిన ధనాన్ని ఆ విద్యార్థికి ఇచ్చేవారు. తన దగ్గర చదువుకున్న పేద విద్యార్థులకు, ఇతర విద్యార్థులకు ఆర్థిక విషయాలలోను, విద్యాభ్యాసానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించే

దృక్పథం ఆయనలో కనిపించే ఒక గొప్ప విశేషం. అందుకనే నాటి విద్యార్థులు అనేక మంది పింగళి లక్ష్మీకాంతంగారిని అనుసరించారని స్పష్టంగా కనిపిస్తుంది.

ఈ విషయాలన్నింటిని పింగళి లక్ష్మీకాంతంగారి స్మారకసంచికలో, జీవితచరిత్రలో, ఇతర వ్యాసాలలో అనేకమంది విరివిరిగా ప్రస్తావాంచారు.

### 1.13.7. ధర్మారాజు పాత్రపై ప్రశంసలు:

పింగళి లక్ష్మీకాంతంగారు నాటకాలలో నటుడిగా అనేక పాత్రలను పోషించారని కొందరు విమర్శకులు ప్రస్తావిస్తున్నారు. అయితే ఆయనకు ధర్మరాజు పాత్ర అంటే ఇష్టమని తన మిత్రలతో చెప్పుకున్నారని ఆయన జీవిత చరిత్రలను రాసిన గూడూరి నమశ్శివాయగారు, పింగళి సూర్యసుందరంగారు క్రోడీకరించారు. ఈ విషయాన్నే కొందరు విమర్శకులు ప్రస్తావించారని ఆ విషయాలను ఇక్కడ తెలుపుతున్నాను.

బందరులో రాయల్ థియేటర్ ఆధ్వర్యంలో లక్ష్మీకాంతంగారు పాండవోద్యోగ విజయాల్లో ధర్మారాజు పాత్రను వేసి నటించేవారు. ధర్మరాజు పాత్రను పింగళివారు ఏ విధంగా అభినయించేవారో గూడూరి వారి మాటల్లో గమనిద్దాం. *''వారా పాత్రను ప్రత్యేకమైన్యా విమర్శనా దృష్టితో స్టడీ చేసి అభినయించేవారు. లక్ష్మీకాంతంగా ధర్మజ పాత్ర చూస్తూంటే! ఎంతటి పక్కా లౌకికుడు కాకపోతే యుద్ధరంజీ సమయంలో శత్రు సేనల మధ్య తాతగారికి భీష్మాచార్యులు నమస్కరించుకు ఆశీస్సుల నొంది మరీ యుద్ధారంభము చేస్తాడు! ఈ విషయములన్నీ పరిశీలన చేస్తే పింగళివారి ధర్మరాజు పాత్ర ఎంత శ్రద్ధగా విశ్లేషించుకొనే వారో ఊహించవచ్చు. పింగళి వారి పద్య పఠనము చెళ్లపిళ్ల వారి ఫక్కీలో మనోహరంగా ఉండేది. ఆ నాడు బందరులో పద్యం బాగా చదివేవారిద్దరే''* అని (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:8) పేర్కొనడాన్ని బట్టి పింగళివారు పద్యాన్ని బాగా చదవడమే కాకుండా, ధర్మరాజు పాత్ర పింగళివారికి ఇష్టమున్నట్లు పైన తెలిపిన అభిప్రాయం వలన మరింత బలాన్ని చేకూర్చుతోంది.

### 1.13.8. గయోపాఖ్యానం నాటకం అర్జునుడిగా పింగళి :

తిరుపతి వేంకటకవులు 'గయోపాఖ్యానం' అనే నాటకాన్ని రచించారు. ఆధునిక తెలుగు నాటక చరిత్రలో గయోపాఖ్యానం నాటకానికి విశేషమైన ఆదరణ లభించిందని విమర్శకులు భావిస్తున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారు తిరుపతి వేంకటకవుల నాటకాలను ప్రదర్శించి వాటికి విశేషమైన ప్రచారాన్ని తెచ్చారు. గయోపాఖ్యానం నాటకాన్ని లక్ష్మీకాంతంగారి ప్రదర్శించిన నేపథ్యం ఇది. పింగళి నరసయ్య గుంటూరు జిల్లా, రేపల్లె దగ్గర 'పెదపులివర్రు' అనే గ్రామంలో నివసించేవారు. ఆ గ్రామంలో ఒక నాటక సంస్థను స్థాపించారు.

దీనిలో పింగళి లక్ష్మీకాంతంగారిని చేర్పించి నాటకాలలో వేషాలు వేసేవారు. *''గయోపాఖ్యానంలో లక్ష్మీకాంతంగారు అర్జునుడిగా, నర్సయ్యగారు గయుడిగా, నటించేవారు. నరకాసుర వధిలో శ్రీకృష్ణుడిగా లక్ష్మీకాంతంగారు, నరకాసురుడిగా నర్సయ్యగారు నటించారు'' అని* గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:8) తెలిపారు.

### 1.13.9. నరకాసుర వధ నాటకం మాణిభద్రుని పాత్రలో పింగళి:

పింగళి లక్ష్మీకాంతంగారు తెలుగు నాటకరంగంలో ప్రమేయం లేకపోయినా ఆయన నటనకు మెచ్చని వారు లేరనే చెప్పాలి. మునిమాణిక్యం నరసింహారావు, మిక్కిలినేని రాధాకృష్ణ, బలిజేపల్లి లక్ష్మీకాంతం మొదలైన వారంతా తెలుగు నాటకరంగంలో లబ్ధ ప్రతిష్ఠులుగా పేరు పొందారు. ఒకసారి గుంటూరులో 'నరకాసుర వధ' నాటకంలో శ్రీకృష్ణుని పాత్రకు పోటి జరిగింది.

ఆ నాటకానికి శ్రీ బుర్రారాఘవచార్లుగారు తదితరులు అనేకమంది పోటీచేశారు. *''నరకాసుర వధ' నాటకంలో పింగళి లక్ష్మీ కాంతంగారు 'మాణిభద్రుడి' పాత్రలో నటించారు. బుర్రా రాఘవాచార్లు ఈ నాటకంలో బంగారు పతకాన్ని సంపాదించుకొన్నారు. ఈ నాటకానికి న్యాయ నిర్ణేతగా ప్రముఖ నాటక కర్తలు హరిప్రసాద రావుగారు, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గార్లు వ్యవహరించారు. నరకాసుర వధ నాటకంలో మాణిభద్రుని పాత్రకు అద్భుతంగా నటించిన పింగళి లక్ష్మీకాంతంగారికే స్వర్ణపతకాన్ని ఇవ్వాలని న్యాయనిర్ణేతలు ప్రకటించారు. దీని ద్వారా మాణిభద్రుని పాత్రలో కొత్త శైలిలో నటించారని, ఆ పాత్రను ఎంతో బాగా నటించినవారు నాటక కర్తలలో ఇంతవరకు ఎవ్వరు లేరనీ వారి నటన పరమాద్భుతమని ఇద్దరు న్యాయ నిర్ణేతలు ప్రశంసించారు. అయినా కూడా జరిగిన ఈ పోటీలో కృష్ణ పాత్రకు కాబట్టి బుర్రా రాఘవాచార్లుగారికి సువర్ణపతకం ప్రకటించారు. చిన్న తనంలోనే చిన్నచిన్న పాత్రలు ధరిస్తూనే చెప్పనటుడనే ప్రఖ్యాతి సంపాదించుకొన్నారు''* అని గూడూరి నమశ్శివాయ (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:7) పేర్కొన్నారు.

### 1.13.10. సారంగధర నాటకం సారంగధరుడి పాత్రలో పింగళి:

తూర్పుగోదావరి జిల్లా రామ చంద్రపురం తాలూకాలోని 'పసర్లపూడి' అనే గ్రామంలో ఒక నాటకం కంపెనీ స్థాపించి నర్సయ్యగారిని ఆహ్వానించారు. ఈ కంపెనీ ఆధ్వర్యంలో పింగళి లక్ష్మీకాంతంగారు 'సారంగధర' నాటకంలోని సారంగధరుడి పాత్రను పోషించారు. లక్ష్మీకాంతంగారు ప్రసిద్ధ నటీమణి రానాబాయిని తీసుకు వెళ్లి కంపెనీలో చేర్పించారు. *''సారంగధరలో రాంభాయి చిత్రాంగి, లక్ష్మీకాంతంగారు సారంగధరుడు, నర్సయ్యగారు రాజరాజుగా నటించి ఆ కంపెనీకి మంచి పేరు తెచ్చారు. కృష్ణుడు, అర్జునుడు పాదుకాపట్టాభిషేకంలో భరతుడు వేషాలు వేశారు. బొబ్బిలిలో బుస్సీ రంగారావు కంఠాభరణంలో కృష్ణారావు, చిత్రనళీయంలో బాహుకుడు లక్ష్మీకాంతంగారు వేషాలను పోషించారు''* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:8) తెలియజేశారు. దీన్ని బట్టి పింగళివారు పౌరాణిక పాత్రలనే కాకుండా చారిత్రక పాత్రలను ధరించారు.

### 1.13.11. పాదుకాపట్టాషేకం నాటకం– భరతుడి పాత్రలో పింగళి:

పింగళివారు ధర్మరాజు, సారంగధరుడు, అర్జునుడు మొదలైన పాత్రలతో పాటు భరతుడు పాత్ర కూడా వేశారు. ఆ సందర్భంగా ఆ పాత్రలో లీనమై చెప్పిన పద్యాలు ఎంతో విశిష్టమైనవిగా కొందరు పరిశోధకులు భావిస్తున్నారు.

**“ పురితెఱగు గనిన మంగళ**
**విరహితమై తోచు, జనులవిన్నదనంపుం**
**దెఱగుగనుగొనిన, హృదయము**
**మఱగెడు వచియింపు నేమమా! రాజునకున్**

**సర్వసామంతరాజనశస్తమకట**
**వందనమ్ములు గల యూచియందుకొనెడు**
**ధ్వజమెగురదేల బురుజుల పైన నేడు**

**ఆనతమౌని చంద్రుడన హంకృతచిత్తుడుగాది పుత్రశి**
**క్షాని పుణీకృతాత్మబల సారుడు మారఘురాముడేలగా**
**నైన యయోధ్యయల్ప విషయాత్మకుడే భరతుండు పూనగ**
**ర్ఙానినదప్రకంపిత ధరాధరగహ్వర భూవిహారి పం**
**చానన భోగ్యమైన భయదాట విజంబు కమాస సేయునే ? ”**

(గూడూరి నమశ్శివాయ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:13)

### 1.13.12. రస పుత్ర విజయం నాటకం– మంత్రి రాక్షసుడిగా పింగళి:

పింగళివారి నటన జీవితాన్ని గమనిస్తే ఆయనకు నాటి నాటకరంగ సంస్థలతో విస్తృతమైన అనుబంధాలున్నాయి, దీని ద్వారా పింగళివారి సాహిత్య జీవితంలో నాటక దశ ఎలా ఉందనే విషయాన్ని పురాణంసూరిశాస్త్రిగారు చెబుతూ *“మంత్రి రాక్షసుని గూర్చియు లక్ష్మీకాంతముగారి యభినయ కౌశలమునుద్దేశించియు నొక ప్రత్యేక విమర్శనమల్లియున్నాను. వీరు బాహుకవేషమును, అశ్వద్థామ భూమికను మిక్కిలి సామర్థ్యముతో నభినయించినట్లు వింటినిగాని వానిని నేజూచి యుండలేదు. నేను చూచినవానిలో భారత నాటకములందు ధర్మరాజు వేషమును, రసపుత్ర విజయమునందు రాజసింహుని భాగమును మిక్కిలి చతురతతో నెరవేర్చిరి”* అని (‘నాట్యాంబుజము’ ఆచార్య మొదలినాగభూషణశర్మ, (సంపా), 2011:105) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి పింగళివారు నాటకాలలో విభిన్నమైన పాత్రలను పోషించి నాటక సాహిత్యానికి తనదైన కృషి చేశారని అవగతమౌతోందని భావించవచ్చు.

**1.13.13. రసపుత్ర విజయం నాటకం– రాజసింహుడిగా పింగళి:**

పింగళి లక్ష్మీకాంతంగారు 'రసపుత్ర విజయం' అనే నాటకంలో రాజసింహుడు అనే పాత్రను పోషించారు. వీరరసపుత్రగుణములను యధోచితముగ ప్రదర్శించి నాటక పరిషత్తువారి బంగారు పతకాన్ని సాధించారు. పింగళివారు అధికంగా శాంత స్వభావంతో ప్రవర్తించే వ్యక్తి. ఈ 'రాజసింహుడి' పాత్ర చిత్రణలో వీరరసాన్ని, వీరావేశాన్ని ప్రదర్శించే గుణాలను కలిగి ఉంటుంది. అయితే పింగళి లక్ష్మీకాంతంగారు ఈ వీరరసంతో అభినయించి పోషించిన పాత్ర కావడం వలన ఆయన నవరసాలను సమదృష్టిని పాటించారనీ స్పష్టంగా కనిపిస్తుంది. అంతే కాదు నాటకాల్లో ఇతివృత్తం, కథా సన్నివేశాలు ఏ విధంగా ఉన్నా వాటిని సహృదయతో స్వీకరించి ఆ పాత్రకు కావాల్సిన సమాచారాన్ని తనకు తగినట్లుగా సమన్వయం చేసుకోవడం ఆయన పాత్రలను పోషించారనే విషయం దృక్పథం కూడా తెలుస్తోంది.

**1.13.14. ముద్రా రాక్షస నాటకం– మంత్రి రాక్షసుడిగా పింగళి:**

ముద్రారాక్షసంలో మంత్రి రాక్షసుడుగా నటించేవారని చెప్పారు. రాక్షసుడు మలయ కేతునకు మహామంత్రి. చాణక్యుడు మలయకేతుని తండ్రిని చంపించింది మంత్రి రాక్షసుడే. ఈ పని చేసినాడని అసత్య ప్రచారం చేయిస్తాడు. మలయకేతుమంత్రి రాక్షసుణ్ణి నిలవదీసి అడిగిన ఘట్టంలో అన్యాయంగా ఆ నింద నెత్తిన పడిందని, ఆసీనులో(నాటక పరిభాషలో అంకం) లక్ష్మీ కాంతంగారు నటించిన నటనాపద్ధతి లోకోత్తరంగా ఉంటుంది. రాక్షసమంత్రి పాత్ర నిర్వహణలో పింగళివారి నటనా కౌశలం హిమాలయ స్థాయికి చేరుతుంది. పంచమ అంకంలో చివరలో మరలా రంగస్థల మీదకు వచ్చి ఈ పద్యాలన్ని పాడతారని పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్రను రాసిన గూడూరి నమశ్శివాయగారు ఉటంకించారు.

**" ఖడ్గమును గేలబూని యక్కటిక శత్రు**
**సైన్య మోపిన కొలదిగా జంపి చత్తు**
**నందునా, నే గృతఘ్నుడ నగుదు బద్ధు**
**డైన చందన దాసు మోమరయకున్న"**

**" కాలముకాదు కత్తికిది–ఘాతుకులన్ వధియించె ముందె, యే**
**కాలమునన్ జనించునొ! వికల్పఫలంబులు నీతి మార్గముల్**
**జాలము సేయగా దగదు చందనదాసుడు చచ్చు చుండె, నా**
**పాలిటి కింకనేనొనరు పందగినట్టిది దేహనాశమే"!**

(గూడూరి నమశ్శివాయ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:12)

**1.13.15. పింగళి వారి నటనలో వైవిధ్యమైన తీరుతెన్నులు :**

పింగళి లక్ష్మీకాంతంగారు నాటకాల్లో విభిన్న పాత్రలను పోషించారని తెలుస్తోంది. ఆయన రంగస్థల నటుడిగా ఆ పాత్రల్లో అభినయించిన ప్రత్యేకతలను గుర్తిస్తే, ఆయన నటుడిగా ఏ విధంగా వివిధ రసాలను ప్రదర్శించేవారో తెలుస్తుంది. నటుడిగా ఆయన అనేక సందర్భాల్లో శోకాన్ని, దుఃఖాన్ని కలిగించే సన్నివేశాలు ఎదురైనప్పుడు ఆయన హృదయం కరుణారస భరితంగా ఉంటుందనే విషయాన్ని కొందరు మంది విమర్శకులు తెలిపారు. అది వారి నటన కళలలో కనిపించే ఒక గొప్ప విశేషమని చెప్పవచ్చు. అలాంటి సన్నివేశాలను కొన్నింటిని చూద్దాం.

1. *సంపూర్ణ భారతం నాటకంలో అభిమన్యు వధ సందర్భమంతా కరుణరసభరితం. లక్ష్మీ కాంతంగారు ఆ ఘట్టంలో చూపిన విషాదం ప్రేక్షకులు శోకంతో విలపించేటట్లు నటించారు.*
2. *ద్రోణ వధ ఘట్టంలో కృష్ణార్జునులు ధర్మరాజును అబద్ధమాడమని అడిగే సందర్భంలో "ఒడబడీ పృథా గ్రతనయం దనృతమ్ము వచింప........ అంటూ కోపంతో లేచిపోయాడు. ఇది పింగళి వారిలో కనిపించే సత్యనిష్ఠ. దీన్ని చూసిన ప్రేక్షకులు ఆహా! ఇదే నటన" అని ఆ నాటి ప్రేక్షకులు అన్నారు.*

*3. పాండవ విజయం షష్ఠాంకంలో ధర్మజార్జునుల సంవాదంలో పింగళి వారి నటన వారి నటనా చాతుర్యానికి పతాక స్థాయి వంటిది. ఆ అంకంలో ధర్మరాజు విభిన్న భావాలను వ్యక్తీకరణ చేయాల్సి ఉంటుంది.*

*4. పింగళివారు పరాభవాన్ని ఓర్చుకోలేదు. దీన్ని నాటకంలో ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. ధర్మరాజు భీమార్జునులతో సంభాషిస్తూ 'భీమాదులను గాక నన్ను కూడా పరాభవించెనని వినియు వానిని జంపక నా సేమం బరయ వచ్చితివా?' అంటూ పింగళివారు చూపులో పరాభవ క్లేశం, కోపం, ఆశ్చర్యం ఇంకెన్నో భావాలను వ్యక్తం చేశారు.*

*5. పింగళివారు ముద్రా రాక్షస నాటకంలో రాక్షస మంత్రి పాత్ర నిర్వహణలో హిమాలయాల స్థాయికి చేరింది. దీన్ని పింగళివారు నటించిన వేషాలను చూసి కథలుగా చెబుతారు"* అని శ్రీనివాస చక్రవర్తి (ఆచార్య పింగళిలక్ష్మీకాంతం స్మారకసంచిక,1974:27) తెలియజేశారు.

**1.13.16. పింగళివారు నాటకాలలో పాత్రలు – పోషించిన విధానం:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారికి పాశ్చాత్య నాటకసాహిత్యంపై అవగాహన ఉండడమే కాకుండా, దాన్నెలా అభినయించాలో తెలిసిన నటులని చెపుతూ పురాణం సూరి శాస్త్రి గారిలా రాశారు. *"వీరు ఆంగ్ల విద్యయందు నాటక విమర్శన మెరింగిన యనూనావకాశము కలవారగుటయేగాక చక్కని లౌకికజ్ఞానము, మానసవ్యాపార విమర్శనశక్తియు కలిగి తామభినయించు పాత్రములు సంప్రదాయమును పురాణేతిహాసముల నుండి గ్రహించి విమర్శించి*

*పాత్రస్వభావమును వివిధములగుపట్టులలో మనుష్యులకుండు గుణములను లెస్సగ బరికించి యభినయింతురు"* అని పురాణం సూరిశాస్త్రిగారు (తొలినాటి తెలుగునాటక విమర్శ, 'నాట్యాంబుజము', ఆచార్య మొదలి నాగభూషణశర్మ, (సంపా), 2011:106) వ్యాఖ్యానించారు.

దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారికి సంస్కృతాంధ్ర, ఆంగ్ల భాషల్లో ప్రవేశముందనీ, ప్రత్యేకించి ఆయనకు ఆంగ్ల భాషలో ఉన్న సాహిత్యాన్ని అధ్యయనం చేసి, ఆ విషయాలను మన తెలుగు సాహిత్య విమర్శలో, పరిశోధనలో అన్వయించారనీ ఆయన చెప్పిన పాఠాలను ద్వారా తెలుస్తోంది. ఆయన ఆంగ్ల నాటకాల్లో ఉన్న పారిభాషిక పదాలను కూడా తెలుగు నాటకాలకు కూడా సమన్వయించారు. ఉదాహరణకు ఆయన రాసిన సాహిత్య శిల్ప సమీక్షలో నాటకానికి సంబంధించిన ఆంగ్ల పారిభాషిక పదాలను ప్రస్తావించారు. ఈ అంశాలన్నింటిని ఆరు, ఏడు అధ్యాయాలలో విమర్శనాత్మకంగా పరిశోధనాత్మకంగా వివరించాను. (చూడు– ఆరు, ఏడు అధ్యాయాలు).

### 1.13.17. నాటకాలలోని పాత్రలు పోషించిన రసాలు– పింగళి :

పింగళివారు నటించిన నాటకాలలో భిన్నమైన పాత్రలను పోషించాలనీ ఆయన జీవితాన్ని, సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వలన తెలిసింది. ఈ నేపథ్యంలో ఆయన సాహిత్య జీవితంలో తొలి దశలో నాటక ప్రక్రియ పట్ల ఆకర్షితులయ్యారనీ, అలా ఆకర్షితులైన నాటకాల్లో పాత్రలను వేసి నటన పట్ల మరింత ముందుకెళ్లారు. దీన్ని బట్టి ఆయన నాటకాన్ని ఎంతగా విశ్వాసాన్ని కలిగి ఉన్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. మరో విధంగా చూస్తే చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి ప్రభావంతో పాటు చెళ్లపిళ్లవారి 'పాండవోద్యోగ విజయం' అనే నాటక ప్రదర్శన ప్రభావం కూడా కావచ్చు.

### 1.13.17.1 నాటకాలలో రస పోషణ – పింగళి దృక్పథం:

లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వంలో ప్రధానంగా సత్వ గుణాలు కనిపిస్తాయి. దీని వలన ఆయనకు సహనం, శాంతి, ఓర్పు లక్షణాలు సంక్రమిస్తాయి. వీటి వలన పింగళివారిలో ఒక ఉదాత్తమైన స్వభావాన్ని, దృష్టిని కలిగి ఉండేవారు. ఈ లక్షణాలను ఆయన తన జీవితంలో అనుసరించారనే విషయాన్ని పురాణం సూరిశాస్త్రిగారు వివరిస్తూ *"లక్ష్మీకాంతము రసోద్వేగమునమైమరచి భావసాంకర్యమును విపరీతచేష్టలను చూపగల నటుడు కాడు. తెలివి, శాంతము, విమర్శకశక్తి, కరుణాప్రవృత్తులు, ప్రధాన లక్షణములై యితర రసములక్షణికావేశములను జెందు మేధాసంపన్నుల గుణవిశేషములు చక్కగ నభినయింపగలడు"* అని పురాణంసూరిశాస్త్రిగారు (తొలినాటి తెలుగు నాటక విమర్శ, ఆచార్య మొదలి నాగభూషణశర్మ, 2011:106) ప్రశంసించారు.

### 1.13.18. పింగళి – నాటకాల్లో పాడిన సంగీత రాగాల పరిచయం:

నాటకానికి, నటనకు, నటులకు సంగీత ప్రవేశం ఉంటే ఆ నాటక కళ శ్రవణ భరితంగా, రసభరితంగా, వినసొంపుగా, లయాత్మకంగా ఉంటుంది. నాటక కళకు సంగీతమే మౌలిక

లక్షణం. సంగీతభరితమైన నాటకాలకు ప్రేక్షకాదరణతో పాటు సామాజికులకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఆ ఆనందానికి సంగీతంలో ఉండే మోహనరాగం, కళ్యాణిరాగం, బీమ్ప్లాస్ రాగం, దేవగాంధారి, మోహన, కేదారగౌళ రాగాలు ఎంతగానో తోడ్పడతాయి.

సంగీత మయమైన నాటకాలలో చెళ్లపిళ్లవారి నాటకాలకు ఒక ప్రత్యేక స్థానం ఉందని ఎంతో మంది విమర్శకుల అభిప్రాయపడుతున్నారు. చెళ్లపిళ్లవారి పద్యాలు రాగయుక్తంగా పాడడానికి అనుకూలంగా ఉంటాయి. సంగీతానికి అనుకూలంగా, లయాత్మకంగా ఉంటాయి. ఈ సంగీత లయాన్ని పింగళివారు అనుసరించిన విధానాన్ని శ్రీనివాస చక్రవర్తి వివరిస్తూ *“పింగళివారి పద్య పఠనం చెళ్ళపిళ్ళ వారి ఫక్కీ మనోహరంగా ఉండేది. పద్యం చక్కగా విరిచి చదువుతూంటే అర్థం ఇట్టే అర్థమయ్యేది. వాచికాభినయంలో పింగళివారు సాధించిన ఘనవిజయం ఇదే: పద్యంతో రాగం ఆగిపోయేది. సంగీతం పెద్దగా లేదనే లోటు కనిపించేది కాదు. వారి పద్యపఠనా చాతుర్యంలో దానికి తగ్గ నటనలో ప్రేక్షకులు తలమున్కలు వేసి ఆనందించేవారు. లక్ష్మీకాంతంగారు దేవ గాంధారి, మోహన, కేదారగౌళ రాగాలు బాగా పాడేవారు” అని* (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:26) తెలిపారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు నాటకాల్లో పాడే పద్య పఠన విశేషాల గురించి పేర్కొన్నారు. పైన తెలిపిన అంశాలన్నింటిని గమనిస్తే తెలుగు నాటక సాహిత్య చరిత్రలో నటుడిగా పింగళి లక్ష్మీకాంతంగారి కృషి కనిపిస్తుంది. దీనితో పాటు పింగళివారు రస సిద్ధాంతాల పట్ల, సంగీత సాహిత్యాలలో ప్రమేయం ఉందని, ఆంగ్ల సాహిత్యలో ప్రవేశం ఉందని వీటన్నింటి ఎంతో విస్తృతంగా అధ్యయనం చేసి తన విద్యార్థులకు పాఠాలలో బోధించారని తెలుసుకోవడానికి కొంత బలాన్ని చేకూర్చుతున్నాయని భావిస్తున్నాను.

### 1.14. పింగళివారి వ్యక్తిత్వంపై – ప్రముఖులు, విమర్శకుల ప్రశంసలు:

పింగళి లక్ష్మీకాంతంగారి జీవితాన్ని,వ్యక్తిత్వాలను కొందరు విమర్శకులు ప్రశంసించారు. దీనితో పాటు ఆయన నాటకసాహిత్య సేవలను కొందరు విమర్శకులు గమనించారని భావిస్తున్నాను. కనుక పింగళివారి జీవితంలోని ప్రతిఫలించిన విశేషాల గురించి ప్రముఖ విమర్శకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. దీని ద్వారా పింగళివారి దృక్కోణాలను తెలుసుకోవచ్చు. వాటిని చూద్దాం.

### 1.14.1. పత్రికల ప్రశంసలు:

తెలుగులో నాటకాలకు, నటులకు పత్రికలు విశేషమైన ప్రచారాన్ని కలిగించాయి. పత్రికల ద్యారా అనేక మంది నాటక కర్తల జీవితాలను, *“జీవిక కోసం నాటకాలాడినారని ఎవరో పత్రికలలో వ్రాసింది యదార్థం కాదని ఆయన ఒక సారి నాతో( శ్రీ గొడవర్తి సూర్య నారాయణ) తనతో అన్నారనీ” అని* ( ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక,1974:4) గొడవర్తిగారు తన గురువు గురించి స్మరించుకున్నారు. దీన్ని బట్టి కూడా పింగళి లక్ష్మీకాంతంగారికి నాటక సాహిత్య పట్ల ఆసక్తిని కనపరిచేవారని స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక్కడ రెండు విషయాలు గుర్తించాలి. తొలిదశలో నిజానికి జీవిక కోసమే నాటకాల్లో నటించినా, తర్వాత కాలంలో తన ఇష్టమైన రంగంగా భావించి నాటకాల్లో నటించి ఉండొచ్చు. ఎందుకంటే గూడూరి నమశ్శివాయగారు అనేక సంవత్సరాల పాటు పింగళివారిని దగ్గర నుండి గమనించినవారు. కనుక ఆ అనుభవంతోనే పింగళివారి జీవిత చరిత్ర రాశారు. అందులోని అన్ని విషయాల్ని ఒప్పుకొని, కొన్ని విషయాల్ని ఎవరో వ్యతిరేకించడమో, తప్పుగా వ్యాఖ్యానించడమో కూడా కావచ్చు. అయినా ఎవరికైనా ఆర్థిక పరిస్థితులు బాగున్న తర్వాత నటించడం తనకున్న ఇష్టం వల్ల కూడా నటించవచ్చు. అప్పుడు ఆర్థిక పరిస్థితుల ప్రభావం వల్లనే నటించడం లేదని చెప్పడం కూడా నిజమే అవుతుంది. ఆవిధంగా శ్రీగొడవర్తివారి అభిప్రాయం కూడా పింగళివారి తర్వాత దశలోని అభిప్రాయంగా తీసుకుంటే సరిపోతుంది.

### 1.14.2. ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అకాడమీ ప్రశంస:

పింగళి లక్ష్మీకాంతంగారు కొంతకాలం పాటు ఆంధ్రప్రదేశ తెలుగు అకాడమీ కార్యవర్గంలో పని చేస్తూ సాహిత్యానికి సేవలను అందించారు. పింగళివారి మరణానంతరం అకాడమీ తరపున డా. దివాకర్ల వేంకటావధానిగారు స్మారకోపన్యాసాన్ని ఇచ్చారు. ఆ ప్రసంగంలో దివాకర్ల వేంకటావధాని పింగళివారి జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని సమీక్షించారు. ఈ నేపథ్యంలోనే పింగళి లక్ష్మీకాంతంగారి నటన జీవితాన్ని, ఆయన నాటకాల్లో వేసిన పాత్రలను కూడా విశ్లేషిస్తూ ఈ విధంగా అన్నారు. *“పాండవ విజయోద్యోగములలో వారు ధర్మరాజు పాత్ర నసాధారణ ప్రతిభతో నభినయించి గురువుల కీర్తి వల్లరి కనార్తవ విలాస వాల్లభ్యమును, సామాజిక మనోనురక్తి కపూర్వానంద సక్తిని కలిగించిన తీరు చూసినవారిప్పటికినీ చెప్పుచునే యుందురు”* అని (ఆచార్యపింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:14) దివాకర్లవారు తెలియజేశారు.

దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు నాటకాల్లో ధర్మరాజు పాత్రను ప్రదర్శించేటప్పుడు వారి అభినయాన్ని చూసిన ప్రేక్షకులు ఎంతో ఆనందించేవారని తెలుస్తుంది. దీని ద్వారా నాటి నాటకాలను ప్రజలు ఎంతో ఆదరించారనే విషయం తెలుస్తుంది.

### 1.14.3. విశ్వనాథ సత్యనారాయణగారి అభిప్రాయం:

విశ్వనాథ సత్యనారాయణ, పింగళిలక్ష్మీకాంతం, నాయనిసుబ్బారావు, కాటూరి వేంకటేశ్వరరావు, బందరు పాఠశాలలో సహ విద్యార్థులు. విశ్వనాథవారు ఉద్దండ పండితుడు, కవి, నాటక కర్త దీనితో పాటు నాటి కవులతో పరిచాయాలుండేవి. ఆయనకు లక్ష్మీకాంతంగారితో కూడా సన్నిహిత బంధం ఉండేది. కనుక పింగళివారి జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని, అతి దగ్గరగా చూశారు. దీని బట్టి పింగళివారి వ్యక్తిత్వాన్ని అనేకమంది చూశారనీ బందరు ప్రజలు లక్ష్మీకాంతంగారి ఏ దృష్టితో చూశారో విశ్వనాథ సత్యనారాయణగారి మాటల్లో చూద్దాం. *“లక్ష్మీకాంతం గారివలె పద్యంచదవలెనని, ఆయనవలె నడవలెనని, ఆయనవలె*

*ద్రస్సుచేసికోనవలెనని బందరు వీధులలో యువకులు, యువకవులు-నటులు అభిలషిస్తూ ఉండేవారు. లక్ష్మీకాంతంగారిని అనుకరిస్తూ వారి వెంట తిరుగుతూ ఉండేవాణ్ణి"* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:13) విశదీకరించారు.

### 1.14.4. గూడూరి నమశ్శివాయగారి అభిప్రాయం:

పింగళి లక్ష్మీకాంతంగారితో గూడూరి నమశ్శివాయగారికి సన్నిహితంగా మేలిగేవారు. పింగళివారి జీవితం, వ్యక్తిత్వం, పెద్దలతో సంబంధాలు, దినచర్య, అభిరుచులు ఇలా అనేక విషయాల పట్ల గూడూరివారికి ఎంతో అవగాహన ఉంది. కనుకనే గూడూరివారు పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్రను రచించారనపిస్తుంది. *"ముద్ర రాక్షస నాటకములలో మంత్రి రాక్షస పాత్రను పింగళివారు ఎంతో సమర్థవంతంగా నిర్వహించేది వారిని చూసిన ప్రేక్షకులు చెప్పేవారు పంచమాంకములో చందనదాసును రక్షించుటలో పడు ఆవేదనను పరమాద్భుతముగా నటించెడివారు. ధరించిన ప్రతి పాత్రను ప్రాణం ప్రతిష్ఠ గావించి, అందు తాను జీవించుటయే గాక రసజ్ఞులగు సదస్యులను రసజలధిలో వోలలాడించుట వీరి నటనలోని విశేషము"* అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతిలో (1991) పింగళి లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వము – సాహిత్యము అనే అంశంపై పిహెచ్.డి చేసిన డా. జి విశ్వనాథ నాయుడు గారు, గూడూరి నమశ్శివాయగారితో ముఖాముఖీ చేసిన ఇంటర్వ్యూలో తెలుసుకున్న అభిప్రాయాన్ని బట్టి తెలుస్తుంది.

### 1.15. రంగస్థల నటుల పట్ల పింగళివారి దృక్పథం:

సాధారణంగా మానవులను, వారి గుణగణాలు చూసి గౌరవించడం ఒక సంప్రదాయం. ఈ కోవలోనే పింగళివారు కూడా తన నటన జీవితంలో అనేక మంది నటులను గౌరవించారనీ, ఆదరించారనీ పింగళివారి వ్యక్తిత్వం గురించి ప్రస్తావించినప్పుడు కొందరి అభిప్రాయం ఆధారంగా కనిపిస్తాయి. సరిగ్గా ఈ విషయాన్ని శ్రీనివాస చక్రవర్తి గారు పింగళివారి ప్రవర్తనను, మాట తీరు తెన్నులను ఇతర గుణాల గురించి చెబుతూ... *"గొప్పవారు ఇంకొకరి గొప్పతనాన్ని గుర్తించి మెచ్చుకోవడం అరుదు. పెదవి విరుస్తూనే ఉంటారు. కాని గొప్పవారిని గొప్పవారిగా గుర్తించి మెచ్చుకోవడంలో లక్ష్మీకాంతంగారిది ముందడుగు"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:28) తెలియజేశారు.

దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారికి నటుల పట్ల సహృదత ఉందని తెలుస్తుందని ఇవన్ని ఆయన గుణగణాలలో కనిపించే లక్షణాలుగా చెప్పమచ్చని విశదీకరించారు.

### 1.15.1. నాటకం పట్ల పింగళివారి అభిప్రాయం:

నాటకాల్లో పద్యాలు ఉండాలనే విషయంలో పింగళి లక్ష్మీకాంతంగారి అభిమానులను గమనిస్తే ఆయన నాటకం పట్ల ఉన్న సహృదయ విమర్శ ధోరణులను స్పష్టంగా కనిపిస్తుంది. *"నాటకంలో పద్యాల విషయంలో వీరిది ఉదారవాదం. నాటకాల్లో పద్యాలు ఉండాలనే వీరి నిశ్చితాభిప్రాయం. అయితే శుద్ధ గద్య నాటకాలంటే విముఖులు కారు. వైవిధ్యం కోసం నిర్వచన*

*ప్రబంధమును శుద్ధ గద్య నాటకములు ఉండవచ్చు. వాని వలన ఏ కీడును రాదు. పద్యములుండరాదని వాదించే వారివలె గద్య నాటకములుండరాదని నేను వాదించను"* అని శ్రీనివాస చక్రవర్తి (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక,1974:28) తెలిపారు.

దీన్ని బట్టి నాటకాలను ప్రదర్శించడానికి అనువుగా ఉండాలని, దాని కోసం నటులు రాగయుక్తంగా పాడడానికి వీలవుతుందని అన్నారు. మరోవైపు నాటక విమర్శకులు భావించిన అభిప్రాయాలను గౌరవించి తనకు నటన పట్ల, నాటక సాహిత్యం పట్ల సరైన అవగాహన ఉందనే విషయాన్ని ప్రస్తావించారని తెలుస్తోంది. అంతేకాకుండా నాటకాల్లో శుద్ధ నాటకాలుండవచ్చని, అవన్నీ కూడా నాటక సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తాయని అన్నారు. శుద్ధ నాటకాలను విమర్శించే వారి అభిప్రాయాలతో నేను (పింగళి) ఏకీభవించననీ, అలాగే అలాంటి వారిని విమర్శించననీ, ప్రశంసించననీ సమదృష్టితో చూస్తాననీ తన విమర్శ దృక్పథాన్ని ప్రకటించుకున్నారు.

కనుకనే బందరు ప్రజలే కాకుండా యావత్ ఆంధ్ర నాటక ప్రేక్షకులు పింగళి లక్ష్మీకాంతంగారి నటనా ప్రతిభను కొనియాడారనడానికి ఈ కింది పద్యమే నిదర్శనంగా కనిపిస్తోంది.

**" విచ్చి పంజాజూలులు విదలించి గర్జించు**
**నీమని లక్ష్మణ స్వామి యొకడు**
**భారతోద్యోగ జయారంభచణ సూత్ర**
**ధారికృష్ణయముంజులూరి యొకడు**
**సాహితీ వైదృగ్ధ్య సహిత నాటక కళా**
**శోభి పింగళి ధర్మసూనుడొకడు**
**బహుపాత్రధారణ ప్రాగల్భ్యనటనాతి**
**కుశలుండు దేవరకొండ యొకడు**
**తెలుగునాట గప్పురపు దాపులు వేలార్చు**
**వెలుగు కంబాలు వాణి కర్పింపలేదో!**
**పట్లుగాదోయి! బందరు పత్తనమ్ము**
**పురిటి గడ్డోయి! నటకుల భూషణులకు! "**

(గూడూరి నమశ్శివాయ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:14)

దీనితో పాటు పింగళివారు తన చిన్నతనంలో వీధినాటకాలను రాత్రి సమయంలో చూశానని చెప్పుకున్నారు. అంతేకాకుండా సంక్రాంతి పండుగ సమయంలో ఊరూరా తిరిగే హరిదాసుల కీర్తనలను, తన చిన్నతనంలో బైండ్ల వారు మౌఖికంగా పల్నాటి వీరచరిత్ర కథను చెప్పేవారని దాన్ని కూడా విని చూశానని పింగళివారు *'నా చిన్ననాటి చదువు'* అనే రేడియో ప్రసంగంలో ప్రస్తావించుకున్నారని పింగళి సూర్యసుందరంగారు అన్నారు.

ఈ విధంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తెలుగు నాటక సాహిత్యంలో నటుడిగా విభిన్న పాత్రలను పోషించారు. ఈ నేపథ్యంలోనే  చెళ్లపిళ్ల వారి నాటకాలను ఆదరించి గురువు పట్ల భక్తిని, గౌరవాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా నాటి నటులకు, నాటక సంస్థలకు, నాటక ప్రేక్షకులను ఎంతో స్ఫూర్తిని కలిగించారు.

**1.16. పింగళివారి పద్య, వచన, అనువాద రచనల పరిచయం:**

పింగళి లక్ష్మీకాంతంగారు కేవలం ఒక విమర్శకుడుగానో, ఒక పరిశోధకుడుగానో మాత్రమే కాకుండా పద్య కవిగా, అనువాదకుడిగా కూడా ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందారు. అందువల్ల ఆ విషయాల్ని కూడా ఇక్కడ ప్రస్తావించుకోవాలి.

**1.16.1 ఆత్మలహరి ఖండకావ్యం:**

పింగళి లక్ష్మీకాంతంగారు ఆత్మలహరి ఖండికను (1916–1934) మధ్యకాలంలో రాశారు. ఇదే పేరుతో తర్వాత ఆయన రాసిన అముద్రిత పద్యాలను కలిపి 1973లో ఆయన మరణించారు. ఇందులో పన్నెండు ఖండికలున్నాయి. ఆత్మలహరి ఖండకావ్య సంపుటిలో *స్వతంత్ర రచన పర్వతారోహణము, తిరుపతియాత్ర, సవిత, దైవస్తుతి, ఆదివైద్యుడు, ప్రణయలేఖలు, తిక్కనామాత్య, తిలక్ నిర్యాణము, శివబ్రహ్మైకము, గురుకీర్తనము* (చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి మరణం సందర్భంగా (1950), *విశ్వశిల్ప* (అడవి బాపిరాజు మరణం సందర్భంగా (1954), *లక్ష్మీ నిర్గమనము* – భార్య శ్రీమతి పింగళి లక్ష్మీనరసమ్మ మరణించిన సందర్భంగా (1969), *ఆత్మలహరి* (నేను) మొదలైన ఖండికలు *ఆత్మలహరిలో* ఉన్నాయి. అనాటి *భారతి, కృష్ణా*పత్రికలలో వీటిని ప్రచురించారు. 1973 సం॥లో *"ఆత్మలహరి"* అనే ఖండికా సంపుటిని పింగళి సూర్యసుందరంగారు, ఆయన శిష్యులు ముద్రించారు. ఆత్మలహరి ఖండకావ్యంలోని కవితాత్మను తదితర అంశాలన్నింటిని రాబోవు అధ్యాయాలలో వివరిస్తానని తెలుపుతున్నాను.

**1.16.2. మహాభారతం ప్రత్యేక అధ్యయనం:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన ఊరిలో ఒక కరణం గారి అమ్మాయికి మహాభారతాన్ని చెప్పడానికి కరణంగారి ఇంటికి వెళ్ళి చెప్పేవారు. ఆవిధంగా ఆంధ్రమహాభారతం పట్ల ఆసక్తి కలిగి తర్వాత దాన్ని లోతుగా అధ్యయనం చేయడానికి తోడ్పడింది.

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర మహా భారతాన్ని అధ్యయనం చేశారనడానికి  గల నేపథ్యాన్ని ప్రస్తావించాలి.

I. మొదటిసారి చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారి దగ్గర మహాభారతాన్ని అధ్యయనం చేశారు.

II. పింగళివారి సొంత ఊరిలో కరణంగారి అమ్మాయికి మహా భారతాన్ని చెప్పడం.

III. పింగళివారు పరిశోధన చేయడానికి మద్రాసు వెళ్ళుతున్నపుడు బందరు ప్రజలు ఆయనకు మహా భారతాన్ని బహుమతిగా ఇచ్చారు.

IV. మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధకుడిగా ఉన్న సమయంలో తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీలో ఆంధ్ర మహా భారతాన్ని అధ్యయనం చేశారు.

V. ఆయన రాసిన నా రేడియో ప్రసంగాలు అనే గ్రంథంలో ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము అనే వ్యాసాన్ని రాశారు.

ఈ విధంగా పింగళి లక్ష్మీకాంతంగారు తన జీవితంలో వివిధ దశలో ఆంధ్ర మహా భారతాన్ని అధ్యయనం చేశారని తెలుస్తోంది. విజయవాడ ఆకాశవాణి కేంద్రములో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. అప్పుడు ఆయన గూడూరి నమశ్శివాయగారి ఇంట్లో ఉండేవారు. ఆ సమయంలో వావిళ్ళ వేంకటేశ్వరశాస్త్ర కట్టమంచివారిని కలిసి ఆంధ్ర మహా భారతానికి వ్యాఖ్యానం రాయమని అడిగారని, దీనికి పింగళి లక్ష్మీకాంతంగారే సమర్థులని చెప్పి ఆయన్ని పింగళివారి దగ్గరకు వెళ్లమని ఆదేశించారు. తరువాత పింగళివారిని వావిళ్ళవారు కలిసి చర్చించుకుంటున్నారు. దీని గురించి గూడూరు నమశ్శివాయగారు ఈ విధంగా ప్రస్తావిస్తూ *''మహా భారత వ్యాఖ్యానం కూడా వారి డిక్టేట్ చేస్తే నేనే వ్రాసి పెట్టేవాడిని. సభా పర్వం వ్రాశాను. అంతటితో ఆగిపోయింది. అంతలో వేంకటేశ్వర శాస్త్రి గారు మరణించారు. అంతటితో ఆ పనికి పూర్ణానుస్వారం చుట్టువలసి వచ్చింది''* నీ గూడూరు నమశ్శివాయగారు పేర్కొన్నారు. (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:65) అంతేకాకుండా పింగళివారు మహాభారతానికి కొంత వ్యాఖ్యానం కూడా రాశారని గూడూరు నమశ్శివాయ తాను స్వయంగా విని రాసిన ఆంధ్ర మహా భారత సభా పర్వం వ్యాఖ్యాన నేపథ్యాన్ని వివరించారు. పింగళివారు ఈ విధంగా తన జీవితంలో ఆంధ్ర మహా భారతాన్ని విస్తృతంగా పఠించారనీ స్పష్టమౌతోంది. ఈ విషయాన్ని *'సాహిత్య పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం'* అనే ఏడో అధ్యాయంలో విశ్లేషించాను.

**1.16.3. తొలకరి ఖండకావ్యం:**

పింగళి, కాటూరివారి జంట కవిత్వ సంపుటి తొలకరి కావ్యం ఇది. వీరి మొదటి ఖండకావ్య సంపుటి. దీనిని 1923 సం॥లో బందరు కృష్ణా స్వదేశి ముద్రాక్షరశాలలో ముద్రించారు. *తొలకరి* ఖండకావ్య సంపుటిలో పన్నెండు కవితా ఖండికలు ఉన్నాయి. *కవితా సామాగ్రి, కవి శిశువు, కోకిల, సంక్రాంతి, జొన్నచేను, ఎడబాటు, అజ్ఞానకృతము, రసాలము, తొలిపూత, ఎవరు నీవు?, బోనులో సింగము, రక్త తిలకము* మొదలైనవి ఖండికలు ఉన్నాయి. ఈ ఖండికలు ఆనాటి కృష్ణాపత్రికలో ప్రచురించారు. *'తొలకరి'* ఖండకావ్య సంపుటికి ప్రముఖ విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డిగారు ''తొలిపలుకు'' అనే శీర్షికతో పీఠికను రాశారు. ఈ తొలకరి కావ్యం గురించి రెండో అధ్యాయాలలో ప్రస్తావిస్తాను.

**1.16.4. బగ్ జార్గల్ అనువాద నవల** (1920):

ప్రపంచ ప్రఖ్యాత నవలా రచయిత విక్టర్ హ్యూగో (Victor-Marie Hugo 1802–1885) రాసిన ***బగ్ జార్గల్ (Bug-Jargal)*** అనే ఆంగ్ల నవలను పింగళి-కాటూరి కవులు జంటగా అనువదించారు. ఇంగ్లీషులో ఈ నవల 1826 వచ్చింది. ఈ నవలలో నీగ్రోలకు, శ్వేత జాతులకు మధ్య జరిగిన సంఘర్షణను చిత్రించాడు. వెస్టిండీస్ దీవులలో ముఖ్యమైన డామింగో దీవి (పాత పేరు) డొమినికన్ (కొత్త పేరు) రిపబ్లిక్ అనే రాజ్యంగా అవతరించింది.

బగ్ జార్గల్ నీగ్రో యువరాజు ఈ నవలలో 'బైసో' అనే పాత్ర ముఖ్యమైనది. బైసో మంచి మాటకారి, నేర్పరి స్వభావం, యుద్ధ వీరుడు ఇలా అనేక లక్షణాలు ఉన్న బైసో నవలకు ఆకర్షణగా ఉంది. *బగ్ జార్గల్* ఆంగ్ల నవలను తెలుగుభాషలోకి పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగారు జంటగా సృజనాత్మకంగా అనువదించారు. *బగ్ జార్గల్* నవలను తొలిసారిగా1920 ప్రచురించారు. దీన్ని మళ్లీ 1967 సంవత్సరం నాటికి మూడవ ప్రచురణ జరిగింది. ఈ నవలలోని విశేషాలను *'అనువాదకుడుగా పింగళి లక్ష్మీకాంతం'* అనే అధ్యాయంలో వివరించాను.

### 1.16.5. సౌందరనందము (1932):

కనిష్కుని కాలానికి చెందిన అశ్వఘోష మహాకవి ''సౌందరనందము'' అనే కావ్యాన్ని సంస్కృతంలో రచించాడు. సంస్కృత సౌందరనందము కావ్యాన్ని తెలుగు భాషలోకి జంటకవులు పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు జంటగా అనువదించారు. దీన్ని ఇద్దరూ ఎలా అనువదించారో ఆత్మలహరిలో ఇలా వర్ణించారు కవి.

*'' గంగాయమునా స్రోత*
*స్సంగమ సుందరము సరస సౌందరనందం*
*బంగీకృత హృన్మేళన*
*పింగళి కాటూరి కవన విద్యాఫలమున్ ''*

(ఆంధ్ర సౌందరనందము: )

తెలుగు భాషలోకి ***సౌందరనందము*** కావ్యాన్ని స్వతంత్ర రచనగా తీర్చిదిద్దారు. తెలుగులో దీన్ని తొమ్మిది సర్గలుగా పింగళి, కాటూరి కవులు రచించారు. ఉన్నాయి. సంస్కృత ***సౌందరనందము***లో బౌద్ధ ధర్మం మోక్షార్థం ప్రధానంగా అశ్వఘోషుడు రాశాడు. తెలుగు ***సౌందరనందము***లో తొమ్మిది సర్గలు వరుసగా పునరాగమనం, బిక్షాగమనం, పరివ్రాజనము, నిరీక్షణము, అనుతాపము, ఉపదేశము, ధర్మ సంవాదం, అనజ్ఞ, సహదర్శపర్యము, పునరాగమనం, బిక్షాగమనం, పరివ్రాజనము, నిరీక్షణము, అనుతాపము, ఉపదేశము, ధర్మ సంవాదం, అనుజ్ఞ, సహదర్శపర్యము. తెలుగు సౌందరనందమును పింగళి కాటూరి వారు చెల్లపిళ్ల వేంకటశాస్త్రిగారికి అంకితం ఇచ్చారు. ఈ సందర్భంగా పింగళి కాటూరి కవులు చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రీ గారికి రాసిన ఇచ్చిన అంకితం పద్యాలు ఈ విధంగా ఉన్నాయి.

*''శ్రీమత్తిరుపతికవిసు*
*త్రామసుహృత్త్వాభిరామ! రసవత్కవితో*
*ద్దామా! వేంకట శాస్త్రి!*
*స్వామీ ! గురుదేవ ! కొనుము సాష్టాంగనతుల్ ''*

*''భావవిశుద్ధి దోపగా భవత్పదముల్ భజియించునాటి మా*

*సేవలు మెచ్చి, యాదరవిశేష మెలర్పగ సల్పినట్టి మీ*
*దీవన నిక్కమై యొసగే దియ్యని కావ్యఫలమ్ము నేటికిన్*
*నీ విడినట్టి భిక్ష యిది నీకె యొసంగెద మిష్ఠ విందుగాన్"*

(ఆంధ్ర సౌందరనందము, 2001:5,6)

తర్వాత పింగళి లక్ష్మీకాంతంగారు కూడా గురువు పట్ల సందర్భం వచ్చినప్పుడల్లా ఏదొక రూపంలో తన భక్తిని వ్యక్తం చేసేవారు. ఈ పద్యాన్ని చూద్దాం.

*"విచ్చలవిడిగా రణముల*
*తెచ్చితి నడిగించుకొనక తీర్చితి జ్ఞానం*
*బిచ్చి గురునకు కావ్యం*
*కృతార్థుండనైతి నీ పుట్టువునన్ "* (ఆత్మలహరి:83)

మొదటిసారిగా ఈ కావ్యాన్ని1932సం॥లో ముద్రించారు. తర్వాత తెలుగు సాహిత్యంలో అనేక సార్లు ఈ కావ్యం ప్రచురితమైంది. ఈ ఆంధ్ర సౌందరనందము కావ్యం గురించి రాబోవు అధ్యాయాలలో తెలియజేస్తాను.

**1.16.6. మధురపండితరాజము (1962):**

సంస్కృత భాషలో ప్రసిద్ధి చెందిన జగన్నాథ పండితుడు రాసిన *పండితరాయల లహరీ పకం, భామినీ విలాసం, కవిత విలాసినీ, విహరనిలయాలు* రచనలు ముఖ్యమైనవి. పింగళి లక్ష్మీకాంతంగారు పండితరాయల సంస్కృత గ్రంథాలను ఆంధ్రీకరించారు.

పండితరాయల శ్లోకాల అనువాదాలకు మధురపండితరాజము అనే పేరు పెట్టారు. ఈ మధురపండితరాజములోని ఖండికలు భారతి, శాంతి పత్రికలలో 1961 సం॥లో ఎక్కువగా ప్రచురించారు. 1962 సం॥లో M.S.R. మూర్తి వీరి బృందం *తేజోలహరి, గంగాలహరి, అన్యాపదేశలహరి* కలిపి విశాఖపట్నంలో *"మధురపండితరాజము"* అనే పేరుతో ముద్రించారు. ఇందులో పదమూడు ఖండికలు ఉన్నాయి. ఈ 'మధురపండితరాజము' కావ్యం గురించి రాబోవు అధ్యాయాలలో వివరించాను.

**1.16.7. సాహిత్య శిల్ప సమీక్ష :**

సాహిత్య శిల్ప సమీక్ష గ్రంథాన్ని విశ్వవిద్యాలయ స్థాయిలో ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్ర బోధించారు. ఆ బోధన అనుభవంతో పింగళి లక్ష్మీకాంతంగారు "సాహిత్య శిల్ప సమీక్ష"(1966)ని రాశారు. దీనికి ఆయన రాసిన పీఠికలో ఈ విధంగా చెప్పుకున్నారు. ఇది నేను ముప్పది యేండ్ల క్రితము ప్రచురించవలసిన గ్రంథము. అయినప్పటికి దీని వ్రాతప్రతులు ఆంధ్రదేశములో సుమారు ఒక వేయి పైగా ఉన్నవి. ఆ ప్రతులు గల వారిలో కొందరు ఇందలి సిద్ధాంతములను, వాక్యములను, ప్రకరణములను నా పేరు మీద గాకపోయినను ప్రతికల్లో, గ్రంథములలో విరివిగా ప్రచారము చేసి ఈ నూతన విమర్శ సంప్రదాయమునకు కొంత ప్రతిష్ఠ సంపాదించిరి. వారికి నేను కృతజ్ఞుడను. వారి వల్లనే నేను

కల్పించిన పెక్కు విమర్శ భాషను పోల్చి చూచినప్పుడు కానవచ్చెడి పారిభాషిక భిన్నత్వమునకు నేనే కర్తనని చెప్పుటలో తప్పులేదు. నా ''ఆంధ్ర వాఙ్మయ చరిత్ర'' కును ఇట్టి యశమేప్రాప్తించెను. ''పాశ్చాత్య కావ్య విమర్శ సిద్ధాంతములకును, భారతీయాలంకారిక సిద్ధాంతములకును వస్తుతః ఉండే భేద సాదృశ్యములను వివరించును''. ఆ రెండు పద్ధతులను ఎంతవరకు సంవదించునో నిరూపించుటకు కొంత ప్రయత్నము చేసితిని. ఆ ప్రయత్నములో కొన్ని శాస్త్ర వాక్యములకు నేను చెప్పిన వ్యాఖ్యానము సాంప్రదాయక వ్యాఖ్యానములకు భిన్నముగా ఉండవచ్చు. అయినా, పాపము లేదు పాశ్చాత్య గ్రంథముల వలసను, మన యలంకార గ్రంథములవలనను నేను నేర్చిన ఈ పన్వీర్యకు భిన్న సంప్రదాయం సమన్వయాత్మకమైన ఒక స్వరూపమును తెచ్చితిని నా అభిప్రాయము. ఇందులో పరకీయభాగ మెంతయో గ్రంథకర్త యొక్కస్వీయ భాగమెంతయో విజ్ఞులు తెలుసుకోనగలరు. ఈ గ్రంథమున సుమారు ఏబది ఆంగ్ల ఉల్లేఖనములు (Quotations) కలవు. వాటిలో ఇంచుమించు ఇరువది 'Hudsion' తన ''An Introduction to the Study of Literature'' అనే గ్రంథంలో ఉదాహరించిన వాటినుండి గైకొంటిని. తక్కినవి ఆ యా మూల గ్రంథముల నుండియో తీసికొంటిని. ఆ యుల్లేఖనములకు ఆ మూల గ్రంథముల పుటలు, పంక్తులు ఇవ్వలేకపోతిని. అయినా అవి సూన్నతములే, శంకనీయములు కావు. నవ్య విమర్శకు లక్ష్మీకాంతంగారు నాంది పలికారు. పారిభాషిక పదాల విషయంలో,ప్రాక్పశ్చిమ సిద్ధాంత గ్రంథాల్ని అవలోకనం చేసి సమన్వయం రూపంలో ప్రతిపాదించడం విషయంలో పింగళివారు అగ్రగణ్యమైన కృషి చేశారు. సాహిత్య కళా సిద్ధాంతాల్ని ఇంత విపులంగా, అధికారకంగా, తులనాత్మకంగా వివేచించిన గ్రంథం తెలుగులో లేదంటే అతిశయోక్తి కాదు. సంస్కృతంలో కావ్య శాస్త్రానికి సంబంధించిన ముఖ్య విషయాలు ఎన్ని ఉన్నాయో అన్ని ఈ గ్రంథంలో విషయ వైవిధ్యాన్ని ప్రదర్శిస్తూ విపులంగా ఉన్నాయి. సంస్కృత మూలగ్రంథాన్ని చూసుకోలేని వాళ్ళకి. ఈ విషయాలన్నీ ఇంత బాగా ఎక్కడా ఉక్తమయిలేవు. పాశ్చాత్య కావ్య సిద్ధాంతాల్ని గ్రహించదలచుకొన్న వాళ్ళకి మూలాపేక్ష లేకుండా అన్ని ఒకచోట *'సాహిత్య శిల్ప సమీక్ష'* లో తిరుగుతాయి. ఈ రెండు సంప్రదాయాలని మూల గ్రంథాల్ని చూసుకొని తెలుసుకోగలిగిన వాళ్ళకి, ఈ గ్రంథంలో వాటి తులనాత్మక పరిశీలన ప్రదర్శితమై ఉపయోగకారి అవుతుంది. 'సాహిత్య శిల్ప సమీక్ష' సర్వులకు ఉపాదేయమైన ఉద్ధంద్రం. అని పింగళి లక్ష్మీకాంతంగారే (సాహిత్య శిల్ప సమీక్ష, పీఠిక,1966) చెప్పుకున్నారు.

### 1.16.8. ఆంధ్ర సాహిత్య చరిత్ర(1974):

ఆచార్యపింగళి లక్ష్మీకాంతంగారు తన ఆంధ్ర సాహిత్య చరిత్ర'కు ***'సవిమర్శఆంధ్ర వాఙ్మయసాహిత్యచరిత్ర'***గా తొలిపేరును పెట్టుకున్నారు. పింగళివారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో ప్రవేశించే నాటికి 'ఆంధ్ర సాహిత్యచరిత్ర'కు ఒక నిర్దిష్ట రూపం ఏర్పడలేదు. గురజాడ శ్రీరామమూర్తి 'కవి జీవితములు', కందుకూరి 'ఆంధ్ర కవుల చరిత్ర', మరి కొందరు అందించిన ఆంధ్ర వాఙ్మయ చరిత్రలు మాత్రమే పరిశోధక విద్యార్థులకు అందుబాటులో ఉండేవి.

వాటన్నింటికి భిన్నంగా తెలుగు సాహిత్య, వాఙ్మయ చారిత్రక యుగాలను విపులీకరించి, విశ్లేషించి కవితా ప్రక్రియల లక్షణాలను, కవి అంతరంగ భావనలను సహేతుకంగా విమర్శించి రచించిన గ్రంథంగా పింగళివారి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' గుర్తింపు పొందింది.

*"ఇది జనించిన నలుబది యేండ్ల నుండి*
*సరస సాహిత్య విజ్ఞాన సత్రమనుచు*
*ఆశ్రయింపని తెలుగు విద్యార్థి లేడు*
*చొచ్చి చూడని తెలుగు వ్యాసుండు లేడన్న"*

(ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:iv)

అని ఖ్యాతి పొందింది. వాఙ్మయ, సాహిత్యాలకు గల భేదాలను విడమర్చి చూపడం నుంచి కావ్య సల్లక్షణాలు, తెలుగు భాష – జాతి పుట్టు పూర్వోత్తరాలు, తదనంతర యుగాల్ని ఈ గ్రంథంలో చక్కగా వివరించారు. దీన్ని తొలి సారిగా ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ వారు ఆంధ్ర సాహిత్య చరిత్రను తోలిసారిగా 1974లోను రెండోసారి 1976 లో మళ్ళీ పునర్ముద్రించారు. పీఠికను తొలి పలుకు అనే పేరుతో దేవులపల్లి రామానుజారావు రాశాడు. 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' రచనలో లక్ష్మీకాంతంగారు పరిశోధకునిగా ఎట్లా. రాణించారో విపులంగా వ్రాశారు. సాహిత్య చరిత్రకారునికి ఉండవలసిన లక్షణాలని ఆయన తన గ్రంథంలో ఎట్లా ప్రతిబింబించారో వివరించారు. సాహిత్య చరిత్ర అధ్యయనంలో 'యుగ విభజన' ఒక ముఖ్యమైన అంశమనుకున్నాం కదా. ఈ యుగ విభజనని ఒక్కొక్క సాహిత్య చరిత్రకారుడు ఒక్కొక్క విధంగా చేశాడు. పింగళి లక్ష్మీకాంతంగారు చేసిన యుగ విభజన రాజుల పేర్లు, ప్రక్రియ పేర్లు మీద కాకుండా కవుల పేర్లు మీదే ఉంటుంది. దీన్ని శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితం చేశారు.

కం. *"శ్రీధరునకు నలమే ల్మం*
*గాధవునకు, శేషశైల నాథునకు నురా*
*రాధిత పదాబ్జునకు తే*
*జోధవళిత దిఙ్ముఖునకు, సూర్యాత్మునకున్"*

*"బాలిశుడైనవాకు, నొకపాటి వివేక మొసంగి, గాలికిన్,*
*తూలెడు నాకు కాలు నిలద్రొక్కుకొనందగు దార్ఢ్యమిచ్చి, వా*
*చాలుడు నై పొనర్చునపచార సహస్ర శతాపరాధ సం*
*క్షాళనచేసి యేలుకొను స్వామికి నియ్యది యంకితమ్మగున్"*

కం: *"గురుడౌ వేంకటకవి సొం*
*దరనందము స్వీకరించి ధన్యత యొసగెన్*
*పరమేశ, కుమారవ్యా*

*కరణము నీకొసగి విబు గణ్యత గంటిన్ "*

*కం: " ఇది యింకొక కానుక నీ*
*మృదు పదముల నిడితి స్వీకరింపుము దీనిన్*
*సదమల కోమల కరుణా*
*స్పద శుభదాలోకనముల బరికింపు ననున్ "*

(ఆంధ్ర సాహిత్య చరిత్ర,1974:3)

### 1.16.9. గౌతమ వ్యాసములు(1952):

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయలలో ఉన్నప్పుడు వివిధ సందర్భాలలో రాసిన వ్యాసాలను "***గౌతమ వ్యాసములు***"గా ఒక సంకలనంగా రచించారు. దీన్ని 1952 సంవత్సరంలో ప్రచురించారు. ఈ గ్రంథం తర్వాత కాలంలో ఆంధ్ర, మద్రాసు విశ్వవిద్యాలయాలకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించబడింది. ఈ గౌతమ వ్యాసములలో ఎనిమిది వ్యాసాలుండేవి. సాహిత్య విద్యార్థులు, సాహిత్యాభిమానులు ఈ గ్రంథాన్ని చాలా ఆదరించారు. ఇదే పునర్ముద్రితమవుతుండేది. 1964 వరకూ దాదాపు 25 సంవత్సరాల తర్వాత 1989 'గౌతమ వ్యాసములు' కొత్త ఎడిషన్ విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వాళ్లు ప్రచురించారు. ఈ ఎడిషన్లో అదనంగా 'పల్నాటి వీరచరిత్ర పీఠిక' అనే వ్యాసాన్ని చేర్చారు. 'ద్విపద భారతం' 'పీఠిక, పల్నాటి వీరచరిత్ర' అనే రెండు గ్రంథాల్ని కూడా లక్ష్మీకాంతంగారే పరిష్కరించారు. దాని వెనుక ఎంతో పరిశోధన ఉంది. కట్టమంచి రామలింగారెడ్డిగారి రచనలు. వ్యాసమంజరి, సాహిత్య వ్యాస సంకలనం, ముసలమ్మ మరణం అనే పద్య కావ్యాలకు పీఠిక రాశారు. ఇక్కడ విశేషమేమంటే పింగళి కాటూరి జంట ఖండకావ్య సంపుటి 'తొలకరి'(1923)ఖండకావ్యానికి 'తొలిపలుకు' అనే శీర్షికతో కట్టమంచి రామలింగారెడ్డిగారు పీఠికను రాశారు. ఆ రోజులలో లక్ష్మీకాంతంగారు కొత్తగా కవితా లోకానికి పరిచయమయ్యారు. శ్రీ రెడ్డిగారి గ్రంథాలకి పీఠిక వ్రాసేటప్పటికి విమర్శకుడుగా పరిణతి చెందారు. ఆంధ్ర నాటక పరిషత్తు తమ వార్షిక సమావేసానికి ఆయనే అధ్యక్షత వహించమని. ఆహ్వానించింది. ఆ సందర్భంలో ఆయన చేసిన 'అధ్యక్షోపన్యాసము' గౌతమ వ్యాసములలో మరొక వ్యాసం.

ఈ వ్యాస సంకలనంలో అన్నింటికన్నా సుదీర్ఘమైనది "ఆంధ్ర వాఙ్మయ – స్థూల రూపము" అనేది ఉత్తరోత్తంగా ఆయన గ్రంథస్థం చేయబూనిన చరిత్రను రేఖా మాత్రంగా ఆవిష్కరించారు. పింగళి వారి సమగ్ర సాహిత్యావలోకనం స్థూలంగా తెలుసుకోవడానికి దోహదం చేసే వ్యాసమిది. 2008 సంవత్సరంలో 'ఆధునిక సాహిత్య విమర్శ విమర్శకులు – ప్రస్థానాలు' అనే విమర్శ వ్యాసాల సంకలనం ఒకటి వెలువడింది. అందులో పింగళి లక్ష్మీకాంతంగారి గౌతమ వ్యాసాలు ఇతర విమర్శ గ్రంథాల గురించి వ్రాస్తూ శ్రీ కసిరెడ్డి వెంకటరెడ్డి తమ అభిప్రాయాన్ని ఇట్లా చెప్పారు. గౌతమ వ్యాసములను అధ్యయనం చేసినప్పుడు ఆచార్యులవారు సాంప్రదాయక

విమర్శలుగా. పరిచయానుశీల విమర్శకులుగా, సహృదయ విమర్శకులుగా, పరిష్కరణ విమర్శకులుగా, దేశిప్రోత్సాహిత విమర్శకులుగా సాక్షాత్కరిస్తారు. అత్యాధునిక విమర్శకులకు ఆదర్శమూర్తిగా సాక్షాత్కరిస్తారు.

పరిష్కరణ విమర్శ (Textual Criticism) గురించి అధ్యయనం చేసేవారు. తప్పకుండా చూడాల్సినది 'ద్విపద భారతము' పీఠిక. రంగనాథ రామాయణాన్ని ద్విపద భారతాన్ని పరిష్కరించి వ్రాసిన పీఠికలు రంగనాథ రామాయణ పీఠికలో వివాదాంశాలున్నప్పటికి వారు చూపించిన ఉప పత్తులు ఆలోచనాత్మకాలు. మాని కొండ సత్యనారాయణశాస్త్రిగారి 'మానికొండ రామాయణం' అనే గ్రంథాన్ని ప్రశంసిస్తూ పీఠిక రాశారు. ఇందులో పింగళివారీ రామాయణాన్ని రమణీయంగా ఎంతో ప్రశంసించారు. పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్న ప్రబంధానికి మూలాన్ని నిర్ణయించే వ్యాసం చివరిది. రవివర్మ భూపతి రచించిన 'ప్రద్యుమ్నాభ్యుదయం' పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నానికి తేజస్సు. నిచ్చిందని వీరీ వ్యాసంలో నిరూపించారు. గౌతమ వ్యాసములు గ్రంథం లక్ష్మీకాంతంగారి విమర్శనా పటిమను నిరూపిస్తుందని'' అని (పింగళి సూర్యసుందరంగారు, పింగళి లక్ష్మీకాంతం,2010: 138,139,140, భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి కాటూరి, గొల్లపూడి ప్రకాశరావు, 1999, పుట, 78,79) లో చెప్పారు. '*గౌమమ వ్యాసములు*' పుస్తకంలోని విమర్శ, పరిశోధనాంశాలను రాబోవు అధ్యాయాలలో తెలియజేస్తాను.

**1.16.10. మానవులందరూ సోదరులు(1964):**

కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోరికపై మహాత్మాగాంధీ సూక్తుల సంకలనం *''All Men Brothers''* అనే గ్రంథాన్ని తెలుగు భాషలోకి ''మానవులందరూ సోదరులు'' అనే పేరుతో అనువాదం చేశాడు. దీన్ని 1964 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ వారు ప్రచురించారు. ఇందులో1. స్వీయ 2. చారిత్రకము, మతము-సత్యము, 3. సాధ్య సాధనములు, 4. అహింస, 5. ఆత్మ సంయమనము, 6. ప్రపంచ శాంతి, 7. మానవుడు- యంత్రము,8. సమృద్ధిలో దారిద్యము, 9. ప్రజాస్వామ్యము- ప్రజలు, 10. విద్య,11. స్త్రీలు,12. ప్రకీర్ణము అనే అంశాలకు సంబంధించిన సూక్తులున్నాయి.

**1.16.11. మాబీడిక్ అనువాద నవల(1964):**

అమెరికా దౌత్య కార్యాలయపు సాంస్కృతిక విభాగం వారి కోరికపై ప్రసిద్ధి అమెరికన్ నవలా రచయిత హెర్మన్ మెల్విల్లీ (Herman Melville) రచించిన ''మాబీడిక్''(Moby-Dick) అనే నవలను లక్ష్మీకాంతంగారు అనువదించారు. 19వ శతాబ్దంలో అమెరికాలో తిమింగలాల వేట పెద్ద ఎత్తున జరిగేది. అట్లా వేటాడిన తిమింగలాల ఒంటి కొవ్వును కరగపెట్టి ఆ నూనెను అమ్ముకునేవారు. 'అహబ్' అనే ఒక వేటగాడు ''మాబీడిక్'' అనే తిమింగలాన్ని వేటాడం. ఆ వేటలోని కష్టాలను, నష్టాలను ఈ నవల వర్ణించడంతో పాటు సముద్రంలో తిమింగలాలను వేటాడి పట్టడం ఇతివృత్తం. 'అహబ్' అనే ప్రధాన పాత్ర ఇందులో

వర్ణించబడింది. పైకి ఒక సముద్రంలో తిమింగలాలకోసం వేటాడ్డం ప్రధానమనిపిస్తున్నా, అదొక జీవిత సంఘర్షణలా అనిపిస్తుంది. అందుకే దీన్ని విమర్శకులు ఒక ఆధ్యాత్మిక నవల అని కూడా అన్నారు. ఈ నవల గురించి, అందులోని విశేషాలను రాబోవు అధ్యాయాలలో వివరించాను.

### 1.16.12. సంస్కృత కుమార వ్యాకరణం (1968):

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వవిద్యాలయం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలలో ఎం.ఏ తెలుగు విద్యార్థులకు సాహిత్య చరిత్రను, సాహిత్య విమర్శను బోధించారు. అయితే కేవలం శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోనే ఎం.ఏ విద్యార్థులకు సంస్కృత వ్యాకరణాన్ని కూడా బోధించారు. అలా బోధించిన సంస్కృత వ్యాకరణ పాఠాలను ***సంస్కృత కుమార వ్యాకరణము***గా ప్రచురించుకున్నారు. ఈ గ్రంథంలో సంస్కృత భాషలో ఉన్నటువంటి వర్ణమాల, వర్ణోత్పత్తి, సంధి, సమాస, కృదంతాలు, తద్దినాలు, క్రియలు ఇలా మొదలైన వాటిని గురించి చర్చించారు. ఆయన సంస్కృత కుమార వ్యాకరణాన్ని గురించి పూర్వ పరిశోధకుల చెప్పిన తమ అభిప్రాయాలు ఈ విధంగా ఉన్నాయి. *"లక్ష్మీకాంతంగారు సంస్కృత కుమార వ్యాకరణ రచనకు పూనుకొనిరి. ఎం.ఏ విద్యార్థులకు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయమునందిచ్చిన ఉపన్యాసములే కొద్ది మార్పులతో చేర్పులతో కుమార వ్యాకరణముగా వెలువడినది. వారు దీనికి పేరు పెట్టుటలో కూడా నెంతో ఔచిత్యమును పాటించిరి. బాల్యము దాటి కౌమార దశయందడుగిడిన విద్యార్థులకిది యుద్దేశింపబడినదగుటచే వారి మానసిక పరిపక్వతకు అను గుణముగా మరికొంత విజ్ఞానమునందజేయక తప్పలేదని గ్రంథకర్త విజ్ఞప్తిలో తెలియజేశారు. ఎం.ఏ విద్యార్థులు భాషా శాస్త్రమును కూడా అధ్యయనము గావించుటచే ఈ కుమార వ్యాకరణ గ్రంథములో భాషా శాస్త్ర విషయములు పింగళి వారు సందర్భసముచితముగా సమన్వయించిరి"* (జి. విశ్వనాథ నాయుడు, ***పింగళి లక్ష్మీకాంతం గారి వ్యక్తిత్వము – సాహిత్యము***, అముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం,1991:464) లో అని ఈ సంస్కృత కుమార వ్యాకరణ ప్రయోజనం గురించి అన్నారు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తమ విద్యార్థులకు సంస్కృత వ్యాకరణాన్ని సులభశైలిలో, అర్థవంతంగా చెప్పిన దాన్ని నోట్స్ రూపంలో రాసుకొని దాన్ని ***'సంస్కృత కుమార వ్యాకరణము'*** (1968) అనే పేరుతో ముద్రించారని గ్రంథ పీఠికలో చెప్పుకున్నారు. ఈ గ్రంథాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితం ఇచ్చారు. ఇందులో సంస్కృత భాషలో ఉన్నటువంటి వర్ణోత్పత్తితో మొదలుకుని వర్ణాలు వాటి లక్షణాలు, స్వభావాలు, సంధులు, భాషాభాగాలు, వృత్తులు, తద్ధితములు, కృదంతములు, ఉపసర్గలు, అవ్యయములు, కారకములు, ఉప విభక్తులు ఇలా మొదలైన వాటి గురించి ఎంతో లోతైన అవగాహనతో చర్చిస్తూ విస్తృతంగా వివరించారు. వీటి గురించి స్థూలంగా తెలియజేస్తాను.

### 1.16.12.1. భాష నిర్వచనాలు:

ఆయన భాషను *''మానవుడు తన భావములను ప్రకాశము చేయుటకు ఉపయోగించునపుడు ఆ శబ్దము భాష అని పిలువబడును''*(**సంస్కృత కుమార వ్యాకరణం,1968**:1) లో అని భాషను నిర్వచించారు. అలాగే సంస్కృత భాషకు కూడా ఒక నిర్వచనాన్ని చెప్పే ప్రయత్నం చేశారు.*'' ప్రపంచంలో ఎన్నో జాతులున్నవి. ఆ జాతులన్నింటికి తగిన ఎన్నో భాషలున్నవి. వాటిలో అతి ప్రాచీనమై, సుసంపన్నమై, నాగరికమై, ప్రాచీన భారతీయార్యులచే మాటలాడబడిన భాషకు సంస్కృతమని పేరు''* (**సంస్కృత కుమార వ్యాకరణం,1968**:1) లో అని సంస్కృత భాషను నిర్వచించారు.

సంస్కృత భాషలో పదమూడు స్వరములు(Vowels), ముప్పై మూడు వ్యంజనములు (Consonants), ఉన్నాయని భాషాశాస్త్ర వేత్తల అభిప్రాయాలను ఏకీభవిస్తూ, తన అభిప్రాయాన్ని తెలిపారు. *''స్వరమనగా ఇతర పేక్షలేకుండా స్వయంప్రకాశమానమగు అక్షరము'' భాషలో దానికి స్వయం ప్రతిపత్తి కలదు. అంటూ అదేవిధంగా ''వ్యంజనమనగా స్వరములు సాయమున వ్యక్తమగు వర్ణము''* వ్యంజనములకు స్వయంప్రస్థితి లేదు. (పుట: 2) లో పేర్కొన్నారు. పాణిని సంస్కృత భాషకు వ్యాకరణాన్ని రాశాడని తెలిపారు. సంస్కృత భాషకు నలభై ఆరు (46) వర్ణములని, మహేశ్వర సూత్రాలను అనుసరిస్తూ వివరించే ప్రయత్నం చేశారు. స్వరాలకు అచ్చులని, వర్ణాలను హల్లులని మరో విధంగా పిలుస్తారని చెప్పారు. భాషలో స్వరాల ప్రాధాన్యత కంటే వ్యంజనాలకే (వర్ణము) అధిక ప్రాధాన్యతగా భాషావేత్తల అభిప్రాయాలను వివరించారు.

### 1.16.12.2. వర్ణాలు, ఉత్పత్తి:

సంస్కృత'భాషలో ''అచ్చులలో అక్- అ,ఇ,ఉ,రు లను సమాక్షరాలని (simple vowels),ఇక్-ఇ,ఉ,రు లను సమచరాచ్చులని (liquid simple vowels), ఏచ్-ఏ,ఓ,ఐ,ఔ లను సంధ్యాక్షరాలని(diphthongs'), యణ్- య,వ,ర,ల లను అంతాస్థాలని (semi vowels),జశ్-జ,బ,గ,డ,ద లను అల్ప ప్రాణనాదాక్షరాలు (unaspirated soft consonants except),శర్-శ,ష,స లను ఊష్మశ్వాసాక్షారాలని(sibilant hard consonants) అచ్చులలో ఒక్క అచ్చుతోనే పనినట్టినప్పుడు దానికి 'త్' చేర్చి ప్రత్యేకంగా అత్- హ్రస్వ అకారం, ఇత్-హ్రస్వ ఇకారం, ఈత్- దీర్ఘ ఈకారం వీటిని భాషపరంగా తపకరణాలనే పేరుతో పిలుస్తారు.

### 1.16.12.3. సంధి నిర్వచనం:

*''రెండు పదముల యొక్క అవ్యవహితమైన యుచ్చారణవలన, పూర్వపదము యొక్క చివరి యక్షరమునకును, ఉత్తరపదము యొక్క ప్రథమాక్షరమునగాకును, అత్యంత సన్నికర్షమేర్పడును''* అని (Contact), దానినే 'సంహిత' అనీ, 'సంధి' అని (సంస్కృత కుమార వ్యాకరణం:25) పేర్కొన్నారు. దీనితో ఇందులో సంస్కృత భాషకు సంబంధించిన భాషా విశేషాలేన్నో

పరిశోధనాత్మకంగా పింగళివారు ఎంతో సమన్వయం చేస్తూ తెలియజేశారు. ఇవన్నీ కూడా పింగళివారికి సంస్కృత భాషలో పాండిత్యం ఉందని నిరూపించాడానికి అవకాశం ఉందని భావిస్తున్నాను. ఈ అంశాలన్ని కూడా ప్రత్యేకంగా భాషా బోధనలో ఆయన పాటించిన భాషా పద్ధతులను తమ విద్యార్థులకు బోధించారు. కనుక ఈ అంశాలను పరిశోధన చెయవచ్చునని తెలియజేస్తున్నాను.

**1.16.13. ఆంగ్ల దేశ చరిత్ర (1931):**

ఆంగ్ల రచయిత L.G.Brakdak అనే పేరుని తెలుగులో ఎల్.జి. బ్రెండన్ గా పుస్తకంలో ముద్రించారు. ఈయన ఒక ఉపాధ్యాయుడు. ఈయన ఇంగ్లీషులో *History of British* అనే పేరుతో ఈ గ్రంథాన్ని రచించారు. దీన్ని పింగళి లక్ష్మీకాంతం గారు ***'ఆంగ్ల దేశ చరిత్ర'*** (1931) అనే పేరుతో అనువదించి ప్రచురించారు. దీన్ని ఇండియన్ పబ్లిషింగ్ హౌస్ లిమిటెడ్ (చెన్నై) వారు ముద్రించారు. ఇది బ్రిటిష్ దేశానికి చెందిన చరిత్ర. సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్ర అనే పుస్తకంలో తెలుగు ప్రాంతాన్ని వివిధ రాజవంశాలైన చోళులు చాళుక్యులు, శాతవాహన, రెడ్డి రాజులు, కాకతీయులు, విజయనగర సామ్రాజ్య మొదలైన పరిపాలించిన రాజులు, వారి పాలనలో వెల్లువిరిసిన ఆర్థిక, చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను చెప్పినట్లేగానే *'ఆంగ్లదేశ చరిత్ర'* అనే పుస్తకంలో కూడా అలాంటి విషయాలను రాయడం జరిగింది.

దీని గురించి పింగళివారు చెప్తూ "*దేశ భాషల మూలమునకే విద్య గణపవలెనను భావము నానాటికీ పెంపొందుచున్నది. ఇది యెప్పటికి కొనసాగునో దైవమెరుగును. కాని పురుషకారమున లోపము ఉండరాదు. గనుక మునుముందు మనము దేశ భాషలలో గ్రంథములు రచించుటయు, వానిని ఉపయోగించుటయు మేలు. మూలకర్త బహు భావ బంధుర హృదయుడు. సాధారణముగా అట్టివారి రచన గంభీరమై అనువాద సులభము గాకుండును. అయినను నేను యథాశక్తి దానిని తెనిగించి యిచ్చితిని. దీని నేనెందును మూలాతి క్రమణము చేయలేదు. యథామాతృకముగానే వ్రాసితిని. అందుచేతనే వాక్యఘట నాదికమున అచ్చటచ్చట చిక్కు వచ్చెడిది నా చేతనైనంతనఱకు ఆ చిక్కు తొలగించుకొని, మన భాష కనుగుణ మగు యోజన పద్ధతి నవలంబించి రచనను ధారాళముగా జేయయత్నించితిని* " అని పింగళి లక్ష్మీకాంతం (ఆంగ్ల దేశ చరిత్ర,1931:3,4) తెలిపారు.

**1.16.14. పింగళి లక్ష్మీకాంతం గారి పరిష్కరణ రచనలు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఆధునిక సాహిత్యచరిత్రలో ఒక పద్యకవిగా, నిఘంటుకర్తగా, వ్యాసకర్తగా, సాహిత్య లోకానికి తెలిసిందే. కానీ ఆయణ్ణి ఒక గొప్ప పరిశోధకుడిగా, విమర్శకుడిగా తెలుసుకోవడానికి ఆయన పరిష్కరించిన గ్రంథాలను పరిశీలించాలి. కనుక ఆయన పరిష్కరించిన గ్రంథాలను తెలియాలనుకుంటున్నాను. వాటి వివరాలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

### 1.16.14.1. విష్ణు పురాణము:

కలిదిండి భావ నారాయణ విష్ణు పురాణాన్ని తెలుగులోకి అనువదించారు. ఈ విష్ణుపురాణాన్ని కోరాడవారు, పింగళివారు కలిపి పరిష్కరించారు. 1929 లో వీరిద్దరు పరిష్కరణ పీఠికను రచించారు. దీన్ని 1931లొ Andhra press Madras వారు ముద్రించారు. సుమారు 240 పుటల్లో ఈ గ్రంథాన్ని ముద్రించారు. 491 పద్య గద్యాల్లో విష్ణుపురాణం ఉంది. దీనికి 10 పుటల్లో పీఠిక ఉంది. దీనిలోని పరిష్కరణ విషయాలు ప్రస్తావించారు. విష్ణుపురాణాన్ని పరిష్కరించిన పింగళివారి విమర్శ, పరిశోధనల దృక్కోణాలను రాబోవు అధ్యాయాలలో వివరిస్తాను.

### 1.16.14.2. ద్విపద భారతము:

ద్విపదభారతాన్ని బట్టేపాటి తిరుమలయ్య, బాల సరస్వతి, ఆత్మకూరి సోమన త్రయం రచించారు. బట్టే పాటి తిరుమలయ్య, బాలసరస్వతి ఆది పర్వం నుంచి ద్రోణ పర్వం వరకు రచించారు. ఆత్మకూరి సోమన కర్ణపర్వం నుంచి తుది పర్వం వరకు రచించారు. ద్విపద భారతంలోని తిమ్మన రాసిన ఆదిపర్వాన్ని పింగళి లక్ష్మీకాంతంగారు పరిష్కరించారు. దీన్ని తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీ నుంచి ప్రతిని సేకరించి, పరిష్కరించి సుమారుగా 44 పుటల పీఠికను పరిశోధనాత్మకంగా రచించారు. ఈ ద్విపద భారతాన్ని ఆంధ్ర విశ్వకళాపరిషత్ (వాల్తేరు) వారు 1943 లో ప్రచురించారు. పింగళి లక్ష్మీకాంతంగారికి ఈ పరిష్కరణలో తన శిష్యులు శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ , శ్రీ తిరుమల రామచంద్ర సహాయకులుగా తొలి నుంచి తుది వరకు తోడ్పడ్డారని ఈ గ్రంథ పీఠికలో పింగళి లక్ష్మీకాంతం గారు తెలియజేశారు.

### 1.16. 14. 3. రంగనాథ రామాయణము:

పింగళి లక్ష్మీకాంతంగారు ఒకవైపు మార్గ సాహిత్యాన్ని, మరోవైపు దేశి సాహిత్యాన్ని సమదృష్టితో చూశారనడానికి ఆయన పరిష్కరించిన ద్విపదభారతం, రంగనాథ రామాయణం, పల్నాటి వీర చరిత్ర గ్రంథాలే నిదర్శనం. ఈ రంగనాథ రామాయణం గురించి వేటూరి ప్రభాకరశాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పింగళి లక్ష్మీకాంతంగార్లు అనేకమంది కృషి చేశారు. అయితే పింగళి లక్ష్మీకాంతంగారు రంగనాథ రామాయణానికి చెందిన ప్రతులను సేకరించి పరిష్కరించి విపులమైన పీఠిక రచించారు. దీన్ని ఆంధ్ర విశ్వకళా పరిషత్తు (వాల్తేరు)వారు 1942 లో ప్రచురించారు. తరువాత 1989 లో తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాదు) వారు పునర్ముద్రణ చేశారు.

### 1.16.14.3. పల్నాటి వీర చరిత్ర:

దీన్ని ద్విపద పద్య కావ్యంగా శ్రీనాథుడు, మల్లయ్య, కొండయ్య రాశారని కొంత మంది విమర్శకులు అంటున్నారు. దీనికి అక్కిరాజు ఉమాకాంతంగారు చక్కని పీఠికను రచించారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు పరిష్కరణ చేశారు. దీన్ని 1961 సంవత్సరంలో విజయవాడ

విశాలాంధ్రవారు మొదటి సారి ముద్రించారు. అవసరాల సూర్యారావు సహాయకుడిగా పనిచేశారు. దీన్ని మరలా 1991 సంవత్సరంలో విజయవాడ విశాలాంధ్రవారే మరలా పునర్ముద్రించారు. దీనిలోని పరిశోధనాంశాలను రాబోవు అధ్యాయంలో తెలియజేస్తాను.

### 1.17. పింగళి లక్ష్మీకాంతంగారి అలభ్య రచనలు:

వీటితో పాటు పింగళివారు రచించిన రచనలు తనకు ఇష్టం లేకపోవడం వల్ల వాటిని చించేసినట్లు ఆయన స్మారక సంచికను బట్టి తెలుస్తుంది. అటువంటి వాటిలో కచదేవయాని నాటకం ఒకటి.

#### 1.17.1. కచదేవయాని నాటకం:

పింగళి లక్ష్మీకాంతంగారు పద్యకవిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా సాహిత్య లోకానికి తెలిసిందే. ఆయన నాటకాల్లో ఎన్నో పాత్రలను పోషించారని కూడా ఇంతకుముందే చర్చించాను. దీనితోపాటు ఆయన నాటక రచయితగా 'కచదేవయాని' అనే నాటకాన్ని రచించిచారనీ ఆయన శతజయంతి సంచికను, స్మారక సంచికలను తెలిసింది. ఆ వివరాలను చూద్దాం. *''పింగళి లక్ష్మీకాంతంగారు నాటకాలలో వేషాలు వేస్తున్న రోజులలో 'కచదేవయాని' అనే నాటకం వ్రాశారనే –సంగతి చాలా మందికి తెలియదు. అది వారు వ్రాసి పూర్తి చేసేసరికి రవీంద్రనాథ ఠాకూరుగారి 'కచదేవయాని' వెలువడింది– రెంటికీ పోలికలు చాలా ఉన్నాయి. ఎత్తుగడ రెంటిలో ఒక మాదిరిగానే ఉంది, అంతట ఠాకూర్ గారిని అనుసరించారనే అపఖ్యాతి – వస్తుందని లక్ష్మీకాంతంగారు తన రచనను చించి పార వేశారు''* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:97) గూడూరు నమశ్శివాయ పేర్కొన్నారు.

#### 1.17.2. ఆంజనేయస్వామి శతకం:

పింగళి, కాటూరి కవులు ఆంజనేయస్వామి శతకాన్ని రచించారని పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్రలను రాసిన గూడూరు నమశ్శివాయ, పింగళి సూర్యసుందరం, పింగళివారి స్మారక సంచిక, పింగళివారి శత జయంతి సంచికల్లో ప్రస్తావించారు. కానీ బందరులో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ శతకాన్ని మౌఖికరూపంలో చెప్పడం వలన దీని రాత ప్రతులు లభించలేదని పేర్కొన్నారు. దీనితో పాటు శ్రీవేంకటేశ్వర శతకం దుక్కిరాల వేంకటరత్నం వంశ చరిత్ర, ఆంధ్రమహా భారత వ్యాఖ్యానం(ఆది పర్వం), కొన్ని పీఠికల్ని రాసినట్లు తెలుస్తుంది. కానీ వీటిలో మౌఖికంగా చెప్పినవి, మరికొన్నింటిని పింగళివారే చించివేనట్లు (పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:30,31) గూడూరి నమశ్శివాయగారు తెలిపారు

#### 1.17.3. శతపత్రసుందరి పీఠిక:

ప్రముఖ కవి శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు 'శతపత్రసుందరి' (1954)అనే గేయం సంపుటాన్ని రచించారు. దీన్ని వావిళ్ళ వారు ముద్రించారు. ఈ గేయ సంపుటికి పింగళి లక్ష్మీకాంతంగారు 'ఆశీస్సు' అనే శీర్షికతో పీఠిక రచించారని విశ్వనాథనాయుడు చెప్పారు.

### 1.17.4. కల్పలత పీఠిక:

ప్రసిద్ధి కవి శ్రీ గురజాడ రాఘవశర్మగారు 'కల్పలత' అనే ఖండకావ్యాన్ని రచించారు.ఇది తొమ్మిది ఖండికల ఖండకావ్యం. దీన్ని 1967 లో మచిలీపట్నం బృందావన ప్రచురణ సంస్థ వారు ముద్రించారు. ఈ కావ్యానికి దువ్వూరి వెంకట రమణశాస్త్రిగారు, ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, విశ్వనాథ సత్యనారాయణగారు పీఠికలను రచించారు. వీరే కాకుండా ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు కల్పలత అనే కావ్యానికి 'పరిచయం' అనే శీర్షికతో పీఠిక రచించారు.

### 1.18. పింగళి లక్ష్మీకాంతం– గురు శిష్య సంబంధాలు:

భారతీయ జీవన విధానంలో సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆ సంస్కృతీ సంప్రదాయాలలో 'విద్యావిధానం' ప్రముఖపాత్ర పోషిస్తుంది. ఆ విద్యావిధానాలలో గురువు, శిష్యువుల మధ్య గల సంబంధాలకు ఒక ప్రత్యేకత ఉంది. రామాయణం, మహాభారతం, భాగవతం, పురాణాలు, కావ్యాలలో గురు–శిష్యుల మధ్య ఉన్న సంబంధాల గురించి అనేక కథలు ఉన్నాయి. అటువంటి గురు–శిష్యుల సంబంధాలే ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితంలోనూ కనిపిస్తాయి. ఆయన తన గురువుల పట్ల పాటించిన వినయం, తన శిష్యుల కూడా పాటించారు. ఆవిధంగా ఒక గురు–శిష్యుల సంప్రదాయాన్ని ఒక పరంపరగా కొనసాగడం మన భారతీయ జీవనవిధానంలో అంతర్భాగమని చెప్పవచ్చు. మన భారతీయ జీవన విధానంలో గురుశిష్యుల పరంపరకు ఎంతో విలువ ఉంది. ఆధునిక కాలంలో కూడా డా ఆ భారత జీవన విధానంలోని గురుశిష్యుల జీవన పరంపర కొనసాగుతోందనడానికి సజీవ నిదర్శనం ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం గొప్ప ఉదాహరణ. అది ఏ విధంగా కొనసాగించడమనేది తెలియజేస్తాను.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు విద్యార్థి దశ నుంచే తరగతి గదిలోను, చదువులోను ముందుండేవారు.ఆయన తన గురువుల పట్ల భక్తి ప్రదర్శించి వారి దగ్గర అనేకమైన అంశాలను నేర్చుకున్నారు. ఆయన తన విద్యాభ్యాసాన్ని ఈ లక్షణాలనే సమన్వయం చేసుకుంటూ పాటించారు. ఆయన పాటించిన విధానాలను ఆయన శిష్యులకు బోధించడం ఒక విశేషం. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు కూడా దీన్నే అనుసరించారు.

రామాయణంలో శ్రీరాముడు తన గురువైన వశిష్ఠ మహర్షి దగ్గర ఎంతో వినయంగా ఉన్నాడు. తండ్రి మాట ప్రకారం రాముడు విశ్వామిత్రునితో పాటు అడవులకు వెళ్ళి రాక్షసుల నుండి విశ్వామిత్రుణ్ణి, మునులను కాపాడి విశ్వామిత్రుని దగ్గర విద్యను నేర్చుకుంటాడు. ఆంధ్ర మహాభారతంలో కూడా గురువు, శిష్యుల మధ్య ఉన్న సంబంధాల గురించి మాట్లాడితే అది ఒక గ్రంథం అవుతుంది. భరద్వాజ అనే ముని ఆశ్రమంలో ద్రోణుడు, ద్రుపదుడు పెరిగి విద్యాభ్యాసాన్నీ పూర్తి చేశారు. ఒక సందర్భంలో ద్రోణుడు, ద్రుపద మహారాజు దగ్గరకు వెళ్లి సహాయాన్ని అర్థిస్తాడు. గర్వంతో ద్రుపదుడు నిండు సభలో ద్రోణుణ్ణి అవమానిస్తాడు. తర్వాత ద్రోణుడు

కౌరవులకు, పాండవులకు గురువు అవుతాడు. ద్రోణుడు అర్జుణ్ణి చేరదీసి అన్ని విద్యలను నేర్పించి ద్రుపదుడిపై ప్రతీకారాన్నీ తీర్చుకుంటాడు. కాబట్టి మిత్ర వాత్సల్యం, గురు వాత్సల్యం, గురుభక్తి లేకపోతే ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందో ద్రోణుడు, ద్రుపదుడి కథలో మనం గమనించవచ్చు.

విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుడు సాంధీపుని ఆశ్రమంలో విద్యను నేర్చుకుంటాడు. ఒకసారి సాందీపుని ఏకైక కుమారుణ్ణి పాంచజన్యం అనే రాక్షసుడు ప్రభాత తీర్థంలో అపహరిస్తాడు. ఈ విషయం తెలిసిన సాందీపుని దంపతులు దుఃఖిస్తుంటారు. బలరామకృష్ణులు సాందీపుని దుఃఖానికి కారణమైన పాంచజన్యుణ్ణి సంహరించి, సాందీపుని కుమారుణ్ణి కాపాడి గురువుకు గురు దక్షిణంగా కుమారుణ్ణి సమర్పిస్తారు.

మహా భారతంలో ద్రోణాచార్యుడు, ఏకలవ్యుడి కథ మన అందరికీ తెలిసిందే. ఒకసారి ద్రోణుడు పాండవులతో కలిసి అడవులకు వెళ్ళుతుంటారు. అడవి మార్గంలో వారికి ఒక శబ్దం వినపడుతుంది. ద్రోణాచార్యులు, పాండవులతో కలిసి అక్కడికి వెళ్తారు. అక్కడ ఏకలవ్యుడు ద్రోణాచార్యుని విగ్రహాన్నీ తయారు చేసుకొని ఆ విగ్రహం ముందు విలువిద్యలను నేర్చుకుంటుంటాడు. అక్కడికి వచ్చిన ద్రోణాచార్యుల శిష్యబృందాన్నీ చూసిన ఏకలవ్యుడు ఒకింత ఆశ్చర్యానికి లోనవుతాడు. తనకు కూడా విద్యలను నేర్పమని ఏకలవ్యుడు ద్రోణాచార్యులను కోరతాడు. ద్రోణుడు ఏకలవ్యుడితో మాట్లాడుతూ నీవు గిరిజన కులంలో జన్మించడం వలన నీకు విద్యను నేర్పనని నిరాకరిస్తారు. అయినా కూడా ఏకలవ్యుడు ద్రోణుణ్ణి గురువుగా భావించి విద్యలను నేర్చుకుంటాడు. ఏకలవ్యుడి విలువిద్యల శక్తులను తెలుసుకున్న ద్రోణుడు జరగబోవు ప్రమాదాన్నీ గ్రహించి ఏకలవ్యుడి బొటనవేలును గురుదక్షణగా ఇవ్వమని అడుగుతాడు. ఏకలవ్యుడు ఏ మాత్రం ఆలోచించకుండా తన బొటనవేలును ఇస్తాడు. ఈ కథలో ఏకలవ్యుడు పాత్రను గమనిస్తే ఒక త్యాగభక్తిని చూడవచ్చు. ఇక్కడ ఏకలవ్యుడు తన గురువు ద్రోణుడికి ఇచ్చిన విలువ చూస్తే భారతీయ విద్య విధానంలో గురువు యొక్క పాత్ర తెలుస్తుంది. అలాగే ఏకలవ్యుడు గురువుకు ఇచ్చిన ప్రాధాన్యాన్నీ, ఏకలవ్యుడు చేసిన త్యాగాన్నీ చూస్తే గొప్ప శిష్యుడిగా, త్యాగశీలిగా ఏకలవ్యుడు చరిత్రలో నిలిచిపోయాడు.

ఆధునిక కాలంలో భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు (1888–1975) ఉపాధ్యాయుడిగా, తత్త్వవేత్తగా, భారత తొలి ఉప రాష్ట్రపతిగా ప్రసిద్ధి చెందారు. ఆయన ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్ళుతుంటే ఆయన శిష్యులు ఆయణ్ణి రథంపై ఊరేగింపుగా తీసుకుపోయారు. ఇక్కడ గురువు, శిష్యుల సంబంధం ఎంత ఉన్నతమైయిందో తెలుస్తుంది. భారతీయులు డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినమైన సెప్టెంబర్ 5 తేదీన ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. దీన్ని బట్టి మన సమాజంలో గురువుకు ఎంతో విశిష్టత ఉందని చెప్పవచ్చు.

### 1.18.1. ఆరు దశలుగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతం జీవితం:

ఆధునిక కాలంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితాన్ని బందరు (పాఠశాల దశ), మద్రాసు విశ్వవిద్యాలయం (పరిశోధన దశ), ఆంధ్రవిశ్వకళాపరిషత్ (బోధన, పరిశోధనల దశ), విజయవాడ (ప్రసంగాల దశ), శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (బోధన, పరిశోధనల దశ), హైదరాబాద్ దశ ఆరు దశలుగా వర్గీకరించవచ్చు. ఆర్తమూరు, రేపల్లె, బందరు, మద్రాసు మొదలైన ప్రాంతాలలో విద్యనభ్యసించారు. ప్రముఖ శతావధాని, తిరుపతి కవుల్లో ఒకరైన తిరుపతి వేంకటశాస్త్రిగారు బందరు హైస్కూల్లో తెలుగు పండితునిగా పాఠాలను బోధించారు. పింగళివారు తరగతిలో చదువులో ప్రతిభను కనపరిచేవారు. ఈ నేపథ్యంలోనే తిరుపతి వేంకటశాస్త్రిగారు పింగళివారిని చేరదీసి మరింత శిక్షణ ఇచ్చారు. పింగళివారు వేంకటశాస్త్రిగారి శిక్షణలోనూ, ఆచార్య కోరాడ రామకృష్ణయ్యగారి శిక్షణలోనూ ఏ విధంగా రాణించాడో, అదే విధంగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన విద్యార్థులను ఎలా తీర్చిదిద్దారో వీరందరిలో ఉన్న గురుశిష్యుల సంబంధాల్లోని నేపథ్యాలను కాలక్రమంలో ఎలా పరిణామం జరిగాయో సమన్వయం చేస్తూ తెలియజేస్తాను.

### 1.18.2. తిరుపతి వేంకటశాస్త్రి – పింగళి లక్ష్మీకాంతం:

పింగళి లక్ష్మీకాంతంగారు ఆర్తమూరు, రేపల్లెలో ప్రాథమిక విద్యను, బందరు హైస్కూల్లో యస్, యస్, ఎల్, సి (నేటి పదవ తరగతి) పూర్తి చేశారు. బందరు జాతీయ కళాశాలలో ఇంటర్మీడియట్, బి,ఏ పూర్తి చేసి కొంతకాలం అక్కడే ఉపాధ్యాయుడిగా పని చేశారు. ప్రముఖ శతావధాని, తిరుపతి కవుల్లో ఒకరైన తిరుపతి వేంకటశాస్త్రిగారు బందరు హైస్కూల్లో 1904లో తెలుగు పండితునిగా చేరారు. ''*పింగళి లక్ష్మీకాంతం పదమూడు, పద్నాలుగు సంవత్సరాల వయస్సులో బందరు హిందూ హైస్కూలులో* చేరాడు. క్లాసులో వేంకటశాస్త్రిగారడిగిన ''నదికీ, కాలువకీ భేద మేమిటి?'' అనే ప్రశ్నకి సమాధానం చెప్పిన మర్నాడు ఆ బాలుడు వేంకటశాస్త్రిగారింటికి వెళ్ళి ''*నన్ను శిష్యువుణ్ణిగా చేసుకోమ్మని*'' అడిగాడు. ''*నీ అభిలాష ఏమిటని*'' ప్రశ్నించారు. ఆ బాలుడు ''*నేను కవిని కావాలి*'' అని (పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,2010:24) అన్నారు. అప్పటి నుంచి పింగళివారు తిరుపతి వేంకటశాస్త్రిగారిని తమ గురువుగా భావించారు. 1910 లో రాయప్రోలు సుబ్బారావుగారు, మంగిపూడి వెంకటశర్మగారు ఒకసారి వేంకటశాస్త్రి గారింటికి వెళ్ళినప్పుడు ''*మహాకవి (చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి) ఒక విద్యార్థికి కౌముది పాఠం చెప్తున్నారు. ఆయన ప్రక్కనే వున్నాడు మరొక పడుచువాడు.మంచి ఆకారము, కోరచూపు, పసిమిఛాయ. మంగిపూడిశర్మగారు నన్ను వేంకటశాస్త్రిగారికి ఎఱిగించారు. రాయప్రోలు సుబ్బారావు సాష్టాంగ నమస్కారం చేసుకుని వెంటనే నన్ను చూసి లలిత కావ్య రాసింది మీరేనా అన్నాడు. ఆ సుందర వ్యక్తి లక్ష్మీకాంతము*'' (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

స్మారక సంచిక,1974:17) అని గురుశిష్యులకు చెపుతున్న విద్యావిధానాన్ని గురించి పేర్కొన్నారు.

పింగళివారు తన గురువు దగ్గర ఛందోవ్యాకరణాలను, అలంకారాలను నేర్చుకొని పద్యాన్ని రాయడానికి కావలిసిన నైపుణ్యాలను పొందారు. గుంటూరు సీమలో అవధానాలు విస్తృతంగా జరుగుతున్నప్పుడు తిరుపతికవులకు, కొప్పోరపుకవులకు వివాదాలు జరిగేవి. ఆయన గురువుతో కలిసి పలు అవధానాలలో పాల్గొనేవారు. పింగళి లక్ష్మీకాంతంగారి జీవితంలోనూ, సాహిత్యంలోనూ జరిగిన పరిణామాల గురించి గూడూరు నమశ్శివాయగారు తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశారు. ''*గురు కృపచే అవధానాలతో ప్రారంభమైన లక్ష్మీకాంతం గారి సాహిత్య జీవితం మధ్య వయస్సులో ఆయనను మహాకవిగా చేసింది. ఆయనకు చిరయశస్సును ఘటింపజేసి పిమ్మట ఆచార్యవర్యునిగా ఒక తరం సారస్వతోపాసకులకు ఆయనకు గురుపీఠం అధిష్ఠింపజేసింది''* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:69) లో గురువుతో కలిసి అవధానాలను నిర్వహించారు. ఈ విషయాలను కొన్నింటిని తన 'ఆత్మ లహరి' అనే ఖండకావ్యంలో చెప్పుకున్నారు. అందులో తన గురువుగారిని స్మరిస్తూ పింగళి లక్ష్మీకాంతంగారు కొన్ని పద్యాలను రాశారు.

*'' ఆంధ్ర కవితా జగద్గురు డమరపురికి*<br>*దరలిపోయెను శిష్య సంతతుల విడచి*<br>*సహజగీర్వాణవాణీ ప్రసక్తులైన*<br>*దేవతలు చెప్పగల రింక దెల్గు కవిత ''*

(ఆత్మ లహరి:64)

తిరుపతి వేంకటశాస్త్రి గారు బందరు పాఠశాలలో తెలుగు పండితునిగా పని చేశారు. ఆయన దగ్గర పింగళి లక్ష్మీకాంతంగారు, కాటూరి వేంకటేశ్వరరావుగారు, రాయప్రోలు సుబ్బారావుగారు, విశ్వనాథ సత్యనారాయణగారు విద్యనభ్యసించారు. తరువాత కాలంలో వీరంతా తమ గురువుగారి అడుగుజాడల్లో పయనించి పద్యకవులుగా, ఉత్తమ అధ్యాపకులుగా, రాణించి తిరుపతి వేంకటశాస్త్రి గారి వలె పేరు ప్రఖ్యాతలను పొందారు. పింగళి లక్ష్మీకాంతంగారు వేంకటశాస్త్రిగారి ఇంట్లో అత్యంత దగ్గరగా ఉండి, గురువుకు సేవ చేస్తూ చదువుకున్నారు. గురువు మరణించినప్పుడు విషాదకర హృదయంతో పై పద్యాన్నీ రాశారు. దేవ లోకానికి అధిపతి ఇంద్రుడు, దాని రాజధాని అమరపురి. అలాగే నాటి ఆంధ్ర కవిత లోకానికి తిరుపతి వేంకట శాస్త్రిగారు అధిపతులుగా ఉండేవారని, ఆయన మరణించి ఈ కవితా లోకాన్నీ, శిష్యులందరిని విడిచి అమరపురికి వెళ్ళిపోయారని పింగళి లక్ష్మీకాంతంగారు తెలియజేశారు. ఇక్కడ పింగళి వారిపై వేంకటశాస్త్రిగారి ప్రభావాన్నీ, గురు, శిష్యుల సంబంధాలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది.

### 1.18.3. విశ్వనాథవారితో పింగళివారి అనుబంధం:

ఆధునిక తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణగారికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయన షష్ఠిపూర్తి సమావేశం బెజవాడ(నేటి విజయవాడ) S.S.R. ,C.V. R కళాశాలలో జరిగింది. ఆ సమావేశానికి పాటిబండ్ల మాధవశర్మ, మాధవపెద్ది కోటేశ్వరరావుగార్లు లక్ష్మీ కాంతంగారి దగ్గరకు వచ్చి ప్రసంగించాలని కోరారు. అప్పుడు పింగళివారు విశ్వనాథవారి గురించి గూడూరి నమశ్శివాయగారితో ఈ విధంగా మాట్లాడారు.

*''సత్యనారాయణను, సత్యనారాయణా అని పిలుస్తాను. ఎందుకంటే అతను నాకంటే చిన్నవాడు. సత్యనారాయణ లబ్ధప్రతిష్ఠుడు. బహుగ్రంధకర్త. గొప్ప భావుకుడు. రామాయణం కూడా వ్రాస్తున్నాడు. మేము చిన్నతనంలో బందరులో ఏకోదరులుగా చరించాం. ఒక కంచంలో తిని ఒక మంచంలో పండుకొని ఒక గురువు వద్ద చదివి ఒకే స్కూలులో వృద్ధిలోకి వచ్చిన వాళ్లం. మాకు మెరమెరలు లేవు. మేము ఒకరినొకరు కలిసి కొన్నప్పుడు చిన్ననాటి చేష్టలు-ఆప్యాయతలు వెల్లడించుకొంటు ఉంటాము. తరువాత ఉద్యోగ ధర్మంలో మేము బందరు విడిచి పెట్టాము. నేను మద్రాసు వెళ్లి అచటనుండి విశాఖపట్టణం చేరాను. అతను బెజవాడకు వచ్చాడు. మేము ఎప్పుడు సన్నిహితులమే! నాకు అన్నదమ్ములున్నారు. సత్యనారాయణకు తమ్ములు మాత్రమే ఉన్నారు. మాదంతా ఒకటే సాహిత్య కుటుంబం. నేను సత్యనారాయణకు అన్న వంటివాణ్ణి. సత్యనారాయణ అభివృద్ధిని గురించి నావలె అతని సోదరులు కూడా కాంక్షించ రేమో! అతను అలాంటివాడే! మా మైత్రి అలా పెనవేసుకుపోయింది. ఈ మధ్య మేము ఒకే రైలు పెట్టెలో ఎక్కి కూర్చొని బందరు వరకూ ప్రయాణము చేశాము. అనేక విషయాలు చిన్ననాటివి గుర్తుకు తెచ్చుకొన్నాము. దూరమైన హృదయాలు దగ్గరయ్యాయి. ఇద్దరమూ తాటితేగలు కొనుక్కొని తినిన చిన్నతనాన్ని గుర్తుకు తెచ్చుకొన్నాము'' అని* (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:72) బందరు జీవితాన్నీ, తన చిన్ననాటి జీవితాన్ని, విశ్వనాథ సత్యనారాయణ గారితో ఉన్న అనుబంధాన్ని ఎంతో సహృదయతతో గుర్తు చేసుకున్నారు.

### 1.18.4. కట్టమంచివారితో సాన్నిహిత్యం:

*''అతిరథ మహారథ నిరూపణ మోస్తరు కవుల రచనల నాధారంగా చేసుకొని వాఙ్మయ రంగంలో వారివారి స్థానాలను వెలగట్టి నిర్ణయించడంలో సునిశిత రత్న పరీక్షకునివలె వర్తించే వారు. రెడ్డికి తోడుగా నిలిచి రెడ్డికి దీటనిపించి యాదినా బొడ్డులదాక నాంధ్ర కవితోదధి పింగళి'* అని శ్రీ తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారు మనసారా ప్రశంసించీ అన్నా''రనీ (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 1974:10) 'రూపు రేఖలు' అనే వ్యాసంలో శ్రీ గొడవర్తి సూర్య నారాయణగారు అభిప్రాయపడ్డారు.

పింగళి లక్ష్మీకాంతంగారు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులు. పింగళి వంశీయులు వైష్ణవ భక్తులు. వీరు సూర్య భగవానుని ప్రార్థకులు. పింగళివారికి చిన్న తనం నుంచే ఆధ్యాత్మిక ప్రవృత్తిని అలవడిందనీ తాను రాసుకున్న ఆత్మలహరి అనే ఖండికావ్యంలో పద్యాలను

రాసుకున్నారు. వీరి ఆధ్యాత్మిక దృష్టిని ప్రత్యక్షంగా చూసిన శ్రీ గొడవర్తి సూర్య నారాయణగారు ఇలా అన్నారు. వీరు సూర్యోపాసకులు. తమ రెండో కుమారునికి సూర్య సుందరుడని నామ కరణం చేసుకొన్నారు. జీవుడు మరణానంతరము వసు, రుద్ర రూపాలు దాటి ఆదిత్య రూపంలో ఉంటాడని మనవారి నమ్మకం. వీరు కూడా అదే కోరుకుంటూ ఉండేవారని శ్రీ గొడవర్తి సూర్య నారాయణగారు పింగళివారి ఆధ్యాత్మిక దృక్పథాన్ని పేర్కొన్నారు.

**1.18.5. ఆచార్య కోరాడ రామ కృష్ణయ్య– పింగళి లక్ష్మీకాంతం:**

కోరాడ వారు మద్రాసు విశ్వవిద్యాలయంలో తొలితరం ఆచార్యుడిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా ప్రసిద్ధి చెందారు. ఆయన భాషా, సాహిత్య రంగాల్లో విస్తృతంగా పరిశోధనలు చేశారు. పింగళి లక్ష్మీకాంతంగారు బందరులో ఉపాధ్యాయుడుగా ఉన్నారు. పింగళి లక్ష్మీకాంతంగారికి పరిశోధన చేయడానికి ఫెలోషిప్ లభించింది. ఈ నేపథ్యంలో ఆయన మద్రాసుకు వెళ్ళడానికి కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి. ఆయన మద్రాసుకు ఏ విధంగా వెళ్ళారో గొడవర్తి సూర్యనారాయణగారు చెప్పిన మాటలను చూద్దాం. *“1927 లో మద్రాసు విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫెలోషిప్ వీరికి లభించింది. పట్టాభి, జాన్ స్టన్ , అహోబలరావు గార్ల సలహా సంప్రదింపుల మీద అక్కడికి వెళ్లి అక్కడ 1929 వరకు పరిశోధన సాగించారు. అక్కడే నండూరి బంగారయ్యగారు వీరితో కలిసి భారతంలో కొంత పరిశోధన చేయడం జరిగింది. తంజావూరు సరస్వతీ మహల్ లో ఉన్న తాళపత్ర గ్రంథావలోకనం కూడా జరిగింది. ఆ ఉద్యోగం ముగియగానే రెండు సంవత్సరాలు మద్రాసులోనే ఉండిపోయారు. ఆ కాలంలోనే “ప్రభావతీ ప్రద్యుమ్నము దాని మూలం” (1927–1930) కాలంలో* అనే *పరిశోధనాత్మక వ్యాసాన్ని* రాసి *యం.ఏ ఆనర్స్ పట్టాను పొందారు. లక్ష్మీకాంతంగారు ప్రయివేటుగా ఎం.ఏ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై బంగారు పతకాన్ని కూడా అందుకున్నారు”* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 1974:5) తెలియజేశారు.

పింగళివారు మద్రాసులోనే మరికొంతకాలం ఉండి మహాభారతంతో పాటు యక్షగానాలను, ద్విపద భారత ప్రతులను సేకరించి వాటిని విస్తృతంగా అధ్యయనం చేసి, వాటిని పరిష్కరించి పీఠికలుగా రాసి ప్రచురించుకున్నారు. కోరాడ రామకృష్ణయ్యగారి సమక్షంలో పింగళి లక్ష్మీకాంతంగారు పరిశోధనలో విశేషమైన పాండిత్యాన్నీ కనబరిచారు. కోరాడవారి పరిశోధన, విమర్శల ప్రభావంతో పింగళివారిపై ఉందని చెప్పవచ్చు. దీనికి ఒక బలమైన కారణం ఉంది. కోరాడవారి విమర్శ పద్ధతులను పింగళివారు అనుసరించడమే ఆ బలమైన కారణం. కోరాడ వారు ‘ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, యుగ విభజనము’ అనే వ్యాసాన్నీ రాశారు. దీనిలో ఆయన చేసిన యుగ విభజన విధానాలను పింగళివారు తన ‘ఆంధ్ర సాహిత్య చరిత్ర’ లో పాటించి వాటిని సాహిత్య చరిత్రలో అనుసరించారు.

వీటిని గురించి ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారు చెప్తూ *“ ఆచార్య పింగళి లక్ష్మీకాంతము గారు చేసిన యుగ విభజనమే నేడు విశ్వవిద్యాలయస్థాయి పఠన పాఠనములందు*

*ప్రామాణికము నిర్దిష్టములయిన విభజనగా పలువురు పండితులు అంగీకరించిరి. ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారి శిష్యులు. వీరి పర్యవేక్షణలో "ప్రభావతీ ప్రద్యుమ్నము" పై శ్రీ లక్ష్మీకాంతముగారు MA (Honours) ను చేసిరి. శ్రీ కోరాడవారి సాన్నిధ్యము, ప్రభావము కలిగిన లక్ష్మీకాంతముగారు ఆంధ్ర వాఙ్మయమును పది యుగములుగ విభజించిరి. ఆ పది యుగములు కోరాడ వారి యుగ విభజనము నుండి పుట్టినవే.*

*పింగళివారి విభజనము ప్రధానముగా మహాకవులను యుగ కర్తలుగా నిర్ణయించి చేసినదే. ఈ విధానము ఆ గురు ప్రభావమే. కోరాడవారి కవిత్రయ యుగమును – పింగళివారు 'నన్నయ యుగము', 'తిక్కన యుగము', 'ఎఱ్ఱన యుగము' అని విభ జించిరి. నన్నయ తిక్కనలకు నడుమ శివకవి యుగమును చేర్చిరి. దక్షిణదేశ వాఙ్మయ ఆధునిక యుగములకు నడుమ క్షీణయుగము నొకదానిని చేర్చిరి. కోరాడవారి మార్గముననుసరించియే పింగళివారు ఈ విభాగము చేసిరి. కాగా ఆంధ్ర వాఙ్మయ యుగ విభజనమునకు కోరాడవారు మార్గదర్శకులన్నమాట"* అని (కోరాడ రామ కృష్ణయ్య శత జయంతి సాహితీ నీరాజనం, 1992: 241) అన్నారు. దీన్ని బట్టి కోరాడవారికి, పింగళివారికి మధ్య ఉన్న సంబంధాలను బట్టి సాంస్కృతికంగా, చారిత్రకంగా, సామాజికంగా భారతీయుల జీవితాలలో గురువు,శిష్యువుల యొక్క ప్రాధాన్యాలను మనందరినీ ఆలోచింపజేస్తుంది

**1.18.6. ఆచార్య పింగళి వారిపై ఆయన శిష్యుల అభిప్రాయాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారు బందరు జాతీయ కళాశాలలో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. ఆయన మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేశారు. 1931 లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ (వాల్తేరు) తెలుగుశాఖను కొత్తగా ఏర్పాటు చేశారు. అదే సమయంలో పింగళి లక్ష్మీకాంతంగారిని రీడర్ గా నియమించారు. ఆయన విద్యాసంబంధమైన పాఠ్య ప్రణాళికల రూపకల్పన చేశారు. తరువాత కాలంలో వాటినే మిగతా విశ్వవిద్యాలయాలు పాటించి వాటిని విశ్వవ్యాప్తం అవడానికి ముఖ్య కారకులైయ్యారు.

పింగళివారు క్రమక్రమంగా ఎదిగి శాఖాధ్యక్షులుగా కూడా విధులు నిర్వర్తించి 1949లో పదవీవిరమణ పొంది సాహిత్య వ్యాసంగాన్నీ కొనసాగించారు. ఆయన కొంతకాలం పాటు విజయవాడ ఆకాశవాణికేంద్రంలో సాహిత్యానికి సంబంధించిన అనేక అంశాలను రేడియోలో ప్రసంగించి వాటిని ప్రసారం చేసేవారు. తర్వాత పింగళివారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(తిరుపతి) ఆచార్యునిగా నియమితులయ్యారు. ఆయన జీవితంలో ఎక్కువ కాలాన్నీ బోధనారంగంలో కొనసాగించారు. ఆయన ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో, (వాల్తేరు) విజయవాడ ఆకాశవాణికేంద్రంలో, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అనేకమంది విద్యార్థులకు పాఠాలను బోధించారు.

ఆయన చెప్పిన పాఠాలకు ప్రభావితులై అనేక మంది విద్యార్థులు బోధనా రంగంలో స్థిరపడడం ఒక విశేషం. ఆయన శిష్యువుల పట్ల ప్రదర్శించిన వ్యక్తిత్వాన్నీ ఆయన తరగతిలో

బోధించిన తీరు తెన్నులను, ఆయన శిష్యుల పట్ల చూపే వాత్సల్యాలను మొదలైన సుగుణాలను ఆయన గురించి ఆయన శిష్యులు చెప్పిన మాటల్లోని విశేషాల్ని తెలియజేస్తాను.

### 1.18.6.1. పింగళి వారి ప్రసంగ కళపై విద్యార్థుల అభిప్రాయం:

తరగతిలో గానీ, సాహిత్య సభల్లో గానీ పింగళివారి ప్రసంగం కళాత్మకంగా ఉండేదని కొందరు విమర్శకులు అంటున్నారు. దీన్ని శ్రీ గొడవర్తి సూర్యనారాయణ 'రూపు రేఖలు' అనే వ్యాసంలో పింగళివారి ప్రసంగకళ గురించి చెబుతూ ఈ విధంగా అన్నారు. *''కవిగా వీరు ఎంత ప్రసిద్ధులో వక్తలుగా కూడా అంతటి లబ్ధ ప్రతిష్ఠులు. ఏ విషయంపైన ప్రసంగించినా శ్రవణ సుఖం గాను, అభిరుచి జనకం గాను ఉండడానికి కారణం వారి ప్రసంగాల్లో ఉండే ఔచిత్యం ప్రధానం. వారి ప్రసంగాల్లో ఐక్యత, పొందిక, సమత అంగాంగీభావము ఉండి శాఖా చంక్రమణం లేకుండా సంక్షిప్తంగా ఉండడమే. అదీ కాక సామాజికుల స్థాయిని బట్టి కూడా ప్రసంగం రూపభేదం పొందుతుండేది. వేదిక మీద ఉన్నప్పుడు 'కాలపరిమితి' 'విషయము', 'సామాజికులు' అన్న వాటిని దృష్టిలో ఉంచుకొని మాట్లాడే బహు కొద్ది మంది వక్తలలో వీరొకరు. అందమైన పదబంధాలతో, లఘువాక్య నిర్మాణంతో చక్కని వీణానాదంవలె వారి ఉపన్యాసాలు శ్రీనివాసశాస్త్రిగారి ప్రసంగాలను జ్ఞప్తికి తెచ్చేవి''* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:9) తెలియజేశారు.

దీన్ని బట్టి ఆయన తన సాహిత్య ప్రసంగాలలోని పాటించిన మౌలిక లక్షణాలు విషయంలో ఔచిత్యం, విషయంలో ఐక్యత, విషయంలో పొందిక, విషయంలో సమతాభావం, విషయాన్నీ చెబుతున్నప్పుడు కాలపరిమితిని గుర్తుంచుకోవడం, వినేవారి స్థాయిని బట్టి ప్రసంగించడం మొదలైన లక్షణాలన్నింటినీ పింగళి లక్ష్మీకాంతంగారు తన ప్రసంగాలలో సమన్వయం చేసుకుంటూ పాటించారని తెలుస్తోంది. ఆయన అనంతరం వివిధ విశ్వవిద్యాలయాలలో ఆయన శిష్యువులు కూడా ఈ లక్షణాలనే పాటించి ఆయనకు మరింత కీర్తిని తెచ్చిపెట్టారు.

### 1.19. సాహిత్య సభలను నిర్వహణలో పింగళివారి సామర్థ్యం:

పింగళి లక్ష్మీకాంతంగారు విద్యార్థులకు సాహిత్య సభను ఏ విధంగా నిర్వహించాలనే దాని గురించి విద్యార్థులు ఎలా మాట్లాడాలో వారిలోని నైపుణ్యాలను వెలికి తీయడానికి కృషి చేశారు. ఆ విషయాన్ని తన విద్యార్థి దేవరాజు వెంకట సత్యనారాయణమూర్తిగారు ఇలా అన్నారు. ''సభా నిర్వహణ విశిష్టముగా నుండవలెనన్న, దానికి తగిన మార్గ దర్శక సూత్రములలో మాకు శిక్షణ గరిపెడివారు మాగురువుగారు.

- మున్ముందుగా సభను ఏర్పాటు చేసిన వారిని, సభ్యులను గౌరవించుచు కొన్ని వాక్యములతో వారిని ఉత్తేజ పరచవలెను.
- మన ఉపన్యాస విషయమును వివరించక ముందు, ముందు మాటగా, ఉపోద్ఘాతముగా, ఎచ్చటనో విషయమును, సూచ్యార్థ సూచకముగా ఎత్తు కొనవలెను.

- చివరకు క్రోడీకరించుటలో మొదటి ఎత్తుబడికి తగినట్లు, మొదటి.. వాక్యమును సమర్థించుచు పునరుద్ఘాటించవలెను. ఎచ్చటనో ఎత్తుకొని, ఎక్కడనో ముగింపజేయుట ఒక గడుసుదనము.
- ముగింపు హఠాత్తుగా, (తలవని తలంపుగానున్నచో, సభ్యులు, శ్రోతలు అందఱును ఆశ్చర్యచకితు లగుదురు. *"ఉపన్యాసమింకను ఉన్నచో బాగుండునే!" అని పించును. ఇది ఆనందదాయకమగు, చక్కని అనుభూతి"* అని (*'ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ శేఖరుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు'*, దేవరాజు వెంకటసత్యనారాయణమూర్తి,2002: 7) సాహిత్య సభలను పింగళివారు నిర్వహించే తీరుతెన్నులను పేర్కొన్నారు.

### 1.19.1. వక్తృత్వ పోటీలను ఏర్పాటు చేసే సామర్థ్యం:

పింగళి లక్ష్మీకాంతంగారు తన విద్యార్థులకు భాషా,సాహిత్యాలకు సంబందించి వక్తృత్వపోటీలను ప్రారంభించేవారు. విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఈ వక్తృత్వపోటీలను ఏర్పాటు చేసేవారు. ఈ విషయాన్ని దేవరాజు వెంకట సత్యనారాయణమూర్తిగారు ఈ విధంగా చెప్తూ *"విద్యార్థుల్లో వాగ్ధాటి, వాగ్విభవము, భావవిశ్లేషణాశక్తి అభివృద్ధికావలెనని వక్తృత్వపోటీలు ఏర్పాటు చేసి అందు చారిత్రక, సామాజిక, నైతిక, వైజ్ఞానిక విషయాల గూర్చి చర్చలను నడిపించెడివారు"* అని (*'ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ శేఖరుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు'*, అనే వ్యాసం,2002:8) దేవరాజు వెంకట సత్యనారాయణమూర్తిగారు తెలియజేశారు.

దీన్ని బట్టి పింగళివారు విద్యార్థులకు పాఠాలను చెప్పడమే కాకుండా విద్యార్థులకు సాహిత్య సభలను నిర్వహించేవారనీ తెలుస్తోంది. కనుక ఈ సాహిత్య సభల ద్వారా విద్యార్థులు అదనపు విజ్ఞానాన్ని పొందుతారని అవగతమౌతోంది.

### 1.19.2. పింగళివారు విద్యార్థులను ప్రోత్సహించే చర్యలు:

పింగళి లక్ష్మీకాంతంగారు విద్యార్థుల పట్ల ఎంతో సానుకూలంగా ఉండేవారనీ చదువుకోవడానికి ఎవరికైనా ఆర్థిక సమస్యలు వచ్చినప్పుడు తనకు తోచిన సహాయాన్ని అందించేవారనీ పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. మరోవైపు విద్యార్థులకు జ్ఞానాన్ని పెంపొందించడానికి అనేక సాహిత్య కార్యక్రమాలను చేపట్టేవారు. అలాంటి వాటిలో ఒకదాన్ని చూద్దాం.*"1932-33 సంవత్సరమున, అనగా మా రెండవ సంవత్సరమున శ్రీలక్ష్మీకాంతంగారు విద్యార్థుల రచనా సామర్థ్యమును పెంపొందించుటకును, వారి పద్య, గద్య, విమర్శనాపటిమను ప్రోత్సహించుటకును, 'ఆంధ్రవిశ్వకళాపరిషత్ లో తెలుగుసంఘపత్రిక' అను త్రైమాసిక సంచికను ప్రారంభించిరి. దీనికి జయపుర సంస్థానాధీశులు శ్రీవిక్రమ దేవవర్మ మహారాజులుంగారును, దేశోద్ధారక శ్రీకాశీనాథుని నాగేశ్వరరావుగారును, డా॥ శ్రీయస్. రాధాకృష్ణన్ గారును పోషకులు. శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు సంపాదకులు. విద్యార్థులలో ఒకరు అధ్యక్షుడు, ఇంకొకరు కార్యదర్శిగా వ్యవహరించిరి. 1932 అక్టోబరులో Volume 1, Issue I "దసరాసంచిక" అను*

*పేరుతో వెలువడినది"* అని (ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ శేఖరుడు ఆచార్య శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు, అనే వ్యాసం, 2002:3) దేవరాజు వెంకటసత్యనారాయణమూర్తి పేర్కొన్నారు.

**1.20. అధ్యాపక ఉద్యోగ విధుల నిర్వహణ:**

పింగళివారి జీవితాన్ని గమనిస్తే ఆయన క్రమశిక్షణను పాటించేవారని తెలుస్తుంది. ఆయన ఉద్యోగ విధులను ఎట్లా నిర్వహించే విధానాన్ని వారి శిష్యుల ద్వారా తెలుసుకుందాం. ఆంధ్ర విశ్వకళాపరిషత్ (వాల్తేరు-నేటి విశాఖపట్నం) తెలుగు ఆనర్స్ కోర్సులో మొట్టమొదటి బ్యాచ్ కి చెందిన ఆచార్య పి. ఆర్. పి. ఫ్రాన్సిస్ ఒకరు. ఆయన మాటల్లో చూద్దాం *"ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆనర్సు తరగతి ప్రథమ దళానికి చెందినమాకు అప్రతిమాన-ఆదర్శ గురుదేవులు శ్రీ పింగళివారే. వత్సరత్రయంలో వాఙ్మయ విశ్వరూపాలను మా మన ఫలకముపై సుస్థిరముగ చిత్రించిన శేముషీమంతులువారు. నిజకవితావేశమున సహృదయులను ఎటుల సమ్మోహితుల గావింపగలరో, అటులే పాఠ్యభాగములు వివరించునప్పుడు తాము చెప్పదలచుకొన్న విషయమును విస్పష్టముగ, సూటిగ, మంజులముగ హృదయాకర్షకముగ చెప్పి, విద్యార్థులను ఏకాగ్ర చిత్తులగావించుటయేగాక తన్మయులను గావించెడివారు. ఎట్టి క్లిష్ట విషయములైనను అనాయాసముగ అవగాహనయగునట్లు పరిణమింప జేయగల ప్రావీణ్యము వారికి వెన్నతో అబ్బినది. వారి రచనలో ఎటులో అటులే వారి బోధనలో సంభాషణలో, ఉపన్యాసములో శైలీప్రసన్నత్వమూ, శిల్పవైదుష్యము, నవనవోన్మేషత్వము ప్రత్యేకఫణితిని సువ్యక్త మౌతున్నవి. శ్రుతి రమ్యముగ, సుబోధకముగ, హృదయరంజకముగ పాఠము చెప్పగల నేర్పు గురు దేవులకు ప్రత్యేకము" అని* గూడూరి నమశ్శివాయగారు (శ్రీపింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:30) తెలిపారు.

దీన్ని బట్టి పింగళివారు తమ విద్యార్థులకు పాఠాలను బోధించడానికే తన జీవితాన్ని అధికకాలంపాటు కేటాయించి అధ్యాపక వృత్తిని ఎంతో నిబద్ధతతో కొనసాగించారని అవగతమౌతోంది.

**1.21. మహిళా విద్య పట్ల పింగళివారి దృక్పథం:**

శ్రీమతి పులిగడ్డ విజయలక్ష్మీగారు పింగళి లక్ష్మీకాంతంగారి దగ్గర శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రత్యక్షంగా చదువుకున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారికి విద్యార్థుల పట్ల ఎలాంటి అభిప్రాయం కలిగి ఉండేవారో చెప్తూ ఆమే ఇలా అన్నారు. *"తనంతటి వాళ్లని తన శిష్యుల్ని చేయాలని సంకల్పించారు పింగళివారు. లక్ష్మీకాంతంగారికి శిష్య వాత్సల్యంలో తరతమభేదా లెప్పుడూ లేవు, ఆయన ఎంతటి గురుభక్తి కలవారో అంతటి శిష్యవాత్సల్యం గలవారు. వారికి ప్రత్యక్ష శిష్యురాల్ని కావడమే నేను చేసుకొన్న సుకృతం. వారి దగ్గర చదువుకొన్న వాళ్లందరూ శిష్యులమనే చెప్పుకొంటుంటారు. ఆయన ప్రాచీన సంప్రదాయాలను ఎంతగా పాటించేవారో, ఆధునిక భావాలను అంతగా ఆదరించేవారాయన. ఆడపిల్లలు కూడా బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని వారి ఉద్దేశ్యం" అని* (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

స్మారక సంచిక,1974:62) శ్రీమతి పులిగడ్డ విజయలక్ష్మి తనకు గురువుతో గల అనుబంధాన్ని, ఆయన వ్యక్తిత్వాన్ని చక్కగా తెలిపారు.

ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఆయన ఎలాంటి భేద భావాలను ప్రదర్శించలేదు. ఆయన ఉత్తమ గురువుగా ఆలోచించి, స్త్రీలు కూడా విద్యావంతులు కావాలనే అభిప్రాయాన్నీ బట్టి ఆయన నిర్మించుకున్న వ్యక్తిత్వం విద్యార్థులకు ఏ విధంగా మార్గదర్శకత్వాలను చూపిందో స్పష్టమవుతుంది. *"లక్ష్మీకాంతం గారి శిష్య వాత్సల్యం చాలా గొప్పది. వర్ణించి చెప్పనలవిగానిది. శిష్యులను ఆయన తన తనయులవలె, తమ్ముళ్ల వలె చూచుకొనే వారు. అవసరమైతే ఆ శిష్యుని సహాయార్థం ఒక నాటక ప్రదర్శనమును సైతం జరిపించేవారు"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:94) లో గూడూరి నమశ్శివాయ గారు చెప్పారు. ఇంకా ఆయన విద్యార్థుల అవసరాలను గుర్తించి, వారికి వివిధ రూపాలలో సహాయం చేయాలనీ భావించే గొప్ప సహృదయత కలిగిన వ్యక్తి ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు. ఆయన వ్యక్తిత్వమే విద్యార్థిలోకాన్నీ ప్రభావితం చేసింది. మరొక సందర్భంలో జరిగిన సంఘటనను చూద్దాం తనకు సహాయం చేసిన వారిని గుర్తించుకొని వారి పట్ల కృతజ్ఞతను తెలపడం ఆయనకు ఉన్న ప్రత్యేక లక్షణం. ఈ లక్షణానికి ఒక ఉదాహరణాన్ని చూద్దాం. పింగళివారి చిన్నతనంలో అనారోగ్యంగా ఉంటే గూడూరి సుబ్రహ్మణ్యం గారు వైద్యం చేస్తారు.

పింగళివారు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఉన్నప్పుడు గూడూరి సుబ్రహ్మణ్యంగారి మనుమడు గూడూరి కృష్ణగారు నాటి తెలుగు అధ్యాపకుల గురించి సమాచారాన్ని సేకరించి పత్రికల్లో ప్రచురించేవారు. కృష్ణగారు పింగళివారిని తరచు కలిసేవారు. కృష్ణగారు పింగళి లక్ష్మీకాంతంగారు గురువుగా విద్యార్థులకు ఏ విధంగా మార్గదర్శకులో చెప్తూ *"ఆయన గురువుల చిత్రాలకు నమస్కారం చేసి కళాశాలకు వెళ్లేవాడిని, శిష్యులతో ఏనాడు పేచీ పడలేదని, విద్యార్థులకు సరిగా పాఠాలు చెప్పి వారు గౌరవ మానాలను సంపాదించిన ఉపాధ్యాయుడు గురవుతారు"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:127) పేర్కొన్నారు.

దీన్ని బట్టి ఆయన మొదట్లో గ్రాంథిక భాషలో బోధించేవారనీ, కాలక్రమంగా పాఠాలను సరళ గ్రాంథిక భాషలో బోధించేవారని తెలుస్తోంది. ఆధునికంగా భాషలో వచ్చిన మార్పులను గమనిస్తూ ఆయన దృష్టి వ్యవహారిక భాష వైపు మళ్లడం ఆయనలో కనిపించే ఒక విశేషమని చెప్పాలి. అంతేకాదు పాఠ్యపుస్తకాలలో పిల్లలకు అనుకూలంగా తెలుగు భాషలోనే బోధనను ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలలో ఉండాలని తన దృక్పథాన్ని తెలియజేశారు. దీనితో పాటు కాలానికి అనుగుణంగా భాష మారుతుందని, ఒకటి నుంచి పదో తరగతి వరకు పిల్లలకు వ్యవహారిక భాషలోనే బోధించాలని సూచించారు.

'ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ' (హైదరాబాదు, 1968) ఏర్పాటుకు ఆయన ఎంతో కృషి చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలకు ఇచ్చే కేంద్ర సాహిత్య అకాడమీ

పురస్కారాలో  తెలుగు అనువాద గ్రంథాలకు కూడా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ఇవ్వాలని నాటి భారత ప్రధానమంత్రి నెహ్రూగారిని ఒప్పించారు. ఈ విధంగా  ఆయన చొరవ వలనే తెలుగు అనువాద గ్రంథాలకు కూడా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను ఇస్తున్నారు. ఈ విధంగా పింగళివారు తెలుగు భాషకు చేసిన సేవ ఎంతో విలువైనదని స్పష్టంగా కనిపిస్తోంది.

## 1.22. పింగళివారి బోధనా విధానం:

పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్రను బోధించేవారు. దానితో పాటు సాహిత్య విమర్శను బోధించేవారు.  తర్వాత సంప్రదాయ సాహిత్యాన్ని కూడా బోధించేవారు. ఈ బోధనా విధానం ఎంతో విశిష్టంగా ఉండేది. సాహిత్యచరిత్ర బోధనవిధానం, సాహిత్యచరిత్రను సాధారణంగా కవులచరిత్ర అంటే కవులు పుట్టిన వివరాలు, వారి తల్లిదండ్రులు, ప్రాంతం, వారి రచనల వివరాలు మాత్రమే ప్రధానంగా ఉంది. ఎప్పుడు పుట్టాడు? ఎక్కడ పుట్టాడు? వాటికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. అదే సాహిత్యచరిత్రలో ఏమవుతుందంటే మనకి కవులు పుట్టిన వివరాలు సంక్షిప్తంగా చెప్పి వారు రాసిన రచనలు కూడా పరిచయం చేసి తర్వాత ఆ సాహిత్యాన్ని పరిచయం చేయడం అనేది ఆ సాహిత్యచరిత్రలో ఉండే ఒక విధానంగా కనిపిస్తుందని పింగళివారి జీవిత చరిత్రను రాసిన గూడూరి నమశ్శివాయ, పింగళి సూర్య సుందరంగార్లు ప్రస్తావించారు.

మనకి పూర్వం పరిశోధకులు గానీ, తర్వాత పరిశోధకులకు గానీ కవుల చరిత్రకి, సాహిత్య చరిత్రలకి మధ్య ఉన్నటువంటి భేదాలను ఇలాగే చెప్పారు. మనకు ఆ విధంగా చూచినప్పుడు  ఆయన కావ్యాల్ని ఆ కావ్యంలో ఉన్నటువంటి వస్తువును చెప్పడం, ఆ వస్తువులో ఉన్నటువంటి పాత్రల్ని, రసాల్ని, తర్వాత ఆ లక్షణాల్ని వివరించి సమన్వయం చేయడమనేది సాహిత్య చరిత్రలో ఆయన చేసిన కృషి తెలుస్తుంది. ఆ విధంగా సాహిత్య చరిత్రను చదవడం ద్వారా ఆ కావ్యం పట్ల ఒక అవగాహనకి ఒక పరిచయానికి అవకాశం కలుగుతుంది. తర్వాత మూల గ్రంథాల్ని చదవాలనే ఆలోచన కూడా వస్తుంది ఈ పద్ధతి మనకి పింగళి లక్ష్మీకాంతంగారి ఆంధ్ర సాహిత్య చరిత్ర రచనలో కనిపిస్తుంది. ఆ రచన అంటే ఆయన బోధించినటువంటి బోధనా విధానంగా మనం గుర్తించుకోవాలి.

### 1.22.1. సాహిత్య విమర్శ బోధనా విధానం:

సాహితీ విమర్శను విభజించేటప్పుడు అంటే ఇంకా సాహిత్య చరిత్ర బోధన విధానంలో మూల రచనల్ని చూడడమనేది అంటే సంస్కృతం, ఇతర భాషల నుంచి వచ్చిందా, ఎక్కడి నుంచి వస్తువును తీసుకున్నాడు అనేది కూడా చెప్పడం వలన తులనాత్మకమైనటువంటి పరిశోధన విధానం కూడా ఆయన సాహిత్య చరిత్రలో, ఆయన విధానంలో కనిపిస్తుంది. దాని వలన ఈ మూల గ్రంథం ఏమిటి అనేది మనం తెలుసుకునే అవకాశం ఉంటుంది. తర్వాత ఇంకా సాహిత్య విమర్శకు సంబంధించి భారతీయులు చెప్పిన రస, ఔచిత్యం మొదలైన సిద్ధాంతాలను చెప్తూనే పాశ్చాత్యులు చెప్పినటువంటి విధానాలతో సాహిత్య విమర్శను బోధించడం అనేది సాహిత్య

విలువల్ని నిర్ధారించడమనేది మనకు పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య విమర్శ బోధనలో కనిపిస్తుంది.

తర్వాత ప్రక్రియల పట్ల ఆయన ప్రత్యేకమైనటువంటి బోధనా విధానం ఎంతో ఉంది. అంటే సాహిత్య విద్యార్థికి ప్రక్రియల పట్ల స్పష్టమైనటువంటి అవగాహన చాలా అవసరం. అసలు కావ్యం అంటే ఏమిటి?, ప్రబంధం అంటే ఏమిటి?, నవల అంటే ఏమిటి?, కథా అంటే ఏమిటి?, ఏకాంకిక, నాటకం అంటే ఏమిటి? విషాదాంత నాటకం అంటే ఏమిటి?, మోదాంత నాటకం అంటే ఏమిటి?, వ్యాసం అంటే ఏమిటి? ఈ విధంగా వీటన్నింటి పట్ల ఒక స్పష్టమైనటువంటి అవగాహనని కలిగించడం కోసం ఆయన ప్రయత్నం చేశారు. దీనితో పాటు ఆయన రాసినటువంటి గౌతమా వ్యాసములు, పల్నాటి వీర చరిత్రకు రాసిన ముందు మాటలు గానీ, ఇతర రచనలకు రాసిన పీఠికలు ఇవన్నీ చూసినట్లయితే గనుక సాహిత్య విద్యార్థికి పరిశోధనాత్మక దృష్టి ఉండాలనే అనే ఆలోచన మనకు పింగళి లక్ష్మీకాంతంగారు కలిగించారు.

ఈ విధంగా చూసినప్పుడు మొదటిది సాహిత్య చరిత్ర బోధనా విధానం, రెండోది ప్రక్రియల పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలిగించే విధానం, మూడోది పరిశోధనకి ఉత్సాహాన్ని చూపించే విధంగా ఆయన బోధనా విధానం ఉండేది అనేది మూడు పద్ధతులను బట్టి మనకి అర్థమౌతుంది. ఈ మూడు పద్ధతుల్లో *'ఆంధ్ర సాహిత్య చరిత్ర', 'సాహిత్య శిల్ప సమీక్ష', 'సంస్కృత కుమార వ్యాకరణము'* వంటి గ్రంథాలు ఆయన పాఠాలు చెప్పిన సారాంశాలే.

ఈ విధంగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం భారతీయ విద్యావిధానంలో గురువు పాత్రను ఎంతో ఉదాత్తంగా పోషించారు. ఆయన ముఖ్యంగా తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకు చేసిన సేవ మరువరానిది. ఆయన అనేక మంది విద్యార్థులను అధ్యాపకులుగా తీర్చిదిద్ది మన సమాజానికి అందించిన గొప్ప గురువు. గురువుగా ఆయన జీవితం అధ్యాపక లోకానికే గాక మనందరికీ ఆదర్శనీయం.

**1.22.2. పింగళి లక్ష్మీకాంతంగారి విద్యాబోధన ప్రత్యేకత:**

తాను పాఠాలు చెప్పే తొలి రోజుల గురించి గూడూరి నమశ్శివాయ గారితో లక్ష్మీకాంతంగారు ఇలా చెప్పేవారని ఆయన ఇలా రాశారు. *"నేను ప్యాసయినది యం. యే. నేను యం. యే విద్యార్థులకు బోధన చెయ్యాలి. నా విద్యార్థులంతా చాలా తెలివిగల వారు. అందులో గడసరులు కూడాను. నన్ను ఏవో ప్రశ్నలు వేస్తూ ఉండేవారు. ఒక్కొక్క ప్రశ్నకు చాలా తికమక పడవలసి వచ్చేది. చాలా వరకు సత్యమే చెప్పేవాణ్ణి. కొన్ని సందర్భాలలో చూచి ఆలోచించి చెప్తాననే వాణ్ణి. దానితో వాళ్లు శాంతించేవాళ్లు. ఒక్కొక్క రోజున వాళ్ల ప్రశ్నలకు గురువుగారి రూపాన్ని తలుచుకొని వారికి నమస్కరించి ప్రార్థించే వాణ్ణి. వెంటనే ప్రశ్నకు సమాధానం స్ఫురించేది. ఈ విధంగా ఉద్యోగంలో చేరిన మొదటి రోజులలో నాస్థితి ఆసి ధారావతంగా ఉంటూ ఉండేది. గురు కృప, సరస్వతీ కరుణా కటాక్షములు నా యందున్నవని చెప్పుటకు ఇవే*

*కారణములు అన్నారు''* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:38) పేర్కొన్నారు.

దీన్ని బట్టి పింగళివారు తన బోధనలో విద్యార్థులకు సమాధానాలను చెప్పేటప్పుడు ప్రశ్న–సమాధానాలు అనే తెలిసిన విషయం నుంచి తెలియని విషయం అనే పద్ధతిలో బోధించారని తెలుస్తుంది. ఈ పద్ధతనే నేటి ఆధునిక విద్యావేత్తలు అత్యధికులు ఆమోదించి విస్తృతంగా ప్రచారాల్ని కలిగిస్తున్నారు. అంటే పింగళివారు ఈ పద్ధతులను ముందు చూపుతో గ్రహించి విద్య బోధనలో తన విశిష్టతలను ప్రదర్శించారనే విషయం అవగతమౌతోంది.

లక్ష్మీకాంతంగారి శిష్యువుల్లో నందూరి రామకృష్ణమాచార్యులు ఒకరు. నందూరివారు పింగళి లక్ష్మీకాంతంగారి బోధనా విధానం గురించి ఇలా చెప్పారు. ''*పాఠము చెప్పుట ఒక ప్రత్యేక లలితకళ, గురువుకంటే తెలివిగల శిష్యులుండవచ్చు. ఒక ప్రమిద కాగడాలను వెలిగింపవచ్చు. శ్రీపింగళి దేశికోత్తమునిలో ఆ ప్రతిభ ఉన్నది. ఆ ప్రజ్ఞ అనిర్వచనీయమైనది. దానిని మాటలలో చెప్పుట తొలి యుషస్సులలో అరవిచ్చిన లేత గులాబిరేకుల మధ్యనున్న మంచు బిందువును అరచేతిలో కెత్తి చూపుటయే కాగలదు. అలమతి విస్తరేణ.*'' అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:55) ప్రస్తావించారు.

దేవరాజు వెంకట సత్యనారాయణ మూర్తి ఆంధ్ర విశ్వ కళా పరిషత్ తెలుగు శాఖలో బి.ఏ ఆనర్స్ విద్యార్థుల్లో తొలి బ్యాచ్ చెందిన వారు. దేవరాజుగారు తన గురువు గురించి *'ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ శేఖరుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు'* అనే శీర్షికతో ఒక వ్యాసం రాశారు. ఈ వ్యాసంలో పింగళి వారు విద్యార్థులకు ఏ విధంగా బోధించేవారో పింగళివారు అనుసరించిన బోధనా పద్ధతి గురించి ఇలా చెప్పారు ''*గురువుగారు జ్ఞాన ముద్రగా అంగులీయమును పెట్టి పాఠములను విస్పష్టముగా ప్రారంభించెడివారు. పద్యమును ఒక చక్కని ఇంపైన కర్ణ శ్రావ్యముగ చదివి పదవిచ్ఛేదనచేయుచు, ఆరంభిచెడివారు. నాగస్వరమునకు నాగేంద్రుడు తల పంకించునట్లు శ్రోతలు ఉర్రూతలూగెడివారు. ఈ పురాతన ఆశ్రమ కులపతుల తీరు, ఒక్క లక్ష్మీ కాంతం గారికే చెల్లును''* అని ('ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ శేఖరుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు,2002:5) తన స్వీయ అనుభవాలను గుర్తు చేశారు. విద్యాబోధనలో పింగళివారంతటివారు విద్యార్థులకు లభించడం నాటి విద్యార్థులకు ఎంతో తోడ్పడిందని ప్రత్యక్షంగా తెలుస్తోంది.

### 1.23. సహ ఉద్యోగులతో లక్ష్మీకాంతంగారి సంబంధాలు:

పింగళి లక్ష్మీకాంతంగారు తన వారితో, ఇతరులతో, సహోద్యోగులతో, అధికారులతో ఎలా ఉండేవారో దువ్వూరి వెంకటరమణశాస్త్రిగారు తెలిపారు. దువ్వూరివారు ఆంధ్ర కళా పరిషత్తులో పింగళివారితో కలిసి ఉద్యోగం చేశారు. దువ్వూరివారు పింగళివారి వ్యక్తిత్వాన్ని, తమ అనుబంధాలను ఇతరులతో ఆయన ఏవిధంగా ఉండేవారనే విషయాలను చూద్దాం. ''*వారి గురించి లెక్చర్లు, రీడర్లూ, ప్రొఫెసర్లు నాకు మిత్రులు చాలామంది ఉన్నారుగాని ఆయనలో ఉండే టెక్కూ, ఠీవిమాత్రం ప్రత్యేకంగా ఉండేవి. మనమెరిగినంతలో ఏ విషయంలోనూ దైన్యము చూపని*

*వ్యక్తులు ఎవరా అని నాకు ప్రశ్నకలిగినప్పుడు ముందుగా ఈయనే జ్ఞప్తికి వస్తారు. స్నేహమున్నచోట ప్రాణస్నేహమేగాని అషామోషీ స్నేహం ఎవ్వరితోనూ ఉండేదికాదు. ఆ ప్రీతి కలిగినా అంతే నన్ను ఎక్కువగా ఆకర్షించిరి. ఆయన ఉపన్యాస పద్ధతి ఉత్తమోత్తముగా ఉండేది. శ్రోతలను ఆకట్టుకొనేది"* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:56) పేర్కొన్నారు. దువ్వూరి వేంకటరమణశాస్త్రిగారు, గంటిజోగి సోమయాజిగారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో పింగళివారికి సహోద్యాయులుగా ఉండేవారు. వీరు పింగళివారి బోధనను దగ్గర నుంచి చూసి పై విషయాన్ని సమన్వయించారని దీన్ని బట్టి తెలుస్తుంది.

## 1.24. విద్యా బోధన పట్ల పింగళివారి దృక్పథం:

పింగళి లక్ష్మీకాంతంగారనగానే సాహిత్య విమర్శకుడిగా, సాహిత్య పరిశోధకుడిగా, కవిగా అందరికి తెలిసిన విషయమే. కానీ ఆయన కవిత్వం రాయడం కన్నా విద్యార్థులకు పాఠాలను చెప్పడమే ఎంతో ఇష్టమైనదనీ పలు సందర్భాల్లో చెప్పుకున్నారు. ఈ విషయాన్ని గూడూరు నమశ్శివాయ గారు ఇలా చెప్తూ *"కవిత్వానికేం, ఎవ్వరైనా చెప్పగలరు. కాని ఈ విద్యా బోధన నా వల్లనే అవుతుంది. ఇది నా ఊహ అని గూడూరు వారు అన్నారు. అయితే పింగళివారే స్వయంగా చెప్పుకున్నారనీ చెప్తూ "విద్యా వితరణ మొనరించుటనన్ను బ్రహ్మానందోల్బణ చిత్తుని గావించెడిన్"* అనిగూడూరి నమశ్శివాయగారు (శ్రీపింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:56) చెప్పుకున్నారు.

పింగళివారికి, గూడూరివారికి సహృదయమైన సాహిత్యపరమైన భాంధవ్యాలు ఉన్నాయి. దీనికి కారణం పింగళివారు విజయవాడ ఆకాశవాణి రేడియో కేంద్రంలో పని చేసేటప్పుడు గూడూరివారి ఇంటిలో కొంతకాలం పాటు నివసించేవారు. మాటల సందర్భాలలో పింగళివారు తనకు కవిత్వం రాయడం కన్న విద్యార్థులకు పాఠాలను చెప్పడంలో నాకు *"విద్యా వితరణ మొనరించుటనన్ను బ్రహ్మానందోల్బణ చిత్తుని గావించెడిన్"* అని గూడూరివారితో అనడం ద్వారా ఆయనకు బోధనారంగం పట్ల ఉన్న దృక్పథం తెలుస్తుంది.

## 1.25. పింగళి వారిపై విశ్వనాథ దృష్టి:

గూడూరి వియ్యన్నగారు(మృత్యుంజయ ఔషదాలయం వ్యవస్థాపకులు:బందరు) మరణిస్తారనీ తెలిసినప్పుడు పింగళివారిని చూడాలని వియ్యన్నగారు గూడూరి నమశ్శివాయతో అన్నారు. కానీ పింగళివారు ఉద్యోగ బాధ్యతల వలన రాలేకపోయారు. వియ్యన్నగారి పెద్ద కర్మ అయిన నెల రోజుల తరువాత వియ్యన్నగారి చిత్ర పటాన్ని ఆవిష్కరణ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు విశ్వనాథ సత్యనారాయణగారు అధ్యక్షత వహించారు. ఈ సభలో విశ్వనాథవారు పింగళివారి గురించి చెప్తూ *"లక్ష్మీ కాంతంగారికి ఒక గుణముంది. అశ్రిత పక్షపాతమది. తన చాకలి, మంగలి తన అశ్రితులను గొప్ప వాళ్ళుగా చిత్రిస్తారు. వియ్యన్నగారి విషయం కూడా అంతేననుకొన్నాను. లక్ష్మీ కాంతంగారు చెప్పే విషయంలో సత్యముందని, నిజంగా వియ్యన్నగారు*

*చాలా గొప్పవాడు అన్నారు. అప్పుడు పింగళి లక్ష్మీకాంతంగారు నాతో ఆశ్రిత పక్షపాతమున్నమాట సత్యమే గాని చెప్పుడు మాటలు వినే గుణం లేదు అన్నారు. మంచి వాళ్ళైతేయితేనే నా దగ్గరకు చేరుతారు. అట్టి వాళ్ళనే నేను ఆదరిస్తాను దరిజేరనిస్తాను అని పింగళివారు అన్నారు''* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీపింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:48) అనడం వలన పింగళివారి వ్యక్తిత్వంలో కనిపించే సుగుణాలను విశ్వనాథ సత్యనారాయణగారు ఎంతో చక్కగా ప్రస్తావించారు. పింగళివారు తనను నమ్మిన వారికి ఎలాంటి ద్రోహాలు, కీడు, మోసం వంటివి చేయలేదని దీన్ని బట్టి తెలుస్తుంది.

**1.26. పాఠ్యాంశాల ఎన్నిక– పింగళివారి దృష్టి:**

ఒక సారి ఆంధ్ర విశ్వకళాపరిషత్ లో(వాల్తేరు), బి.ఏ విద్యార్థులకు ఉండే తెలుగు పాఠాల్లో మను చరిత్ర ప్రబంధంలో ద్వితీయ, తృతీయ అశ్వాసాలు పాఠ్యాంశాలుగా చెప్పేవారు. అందులో శృంగారరసానికి సంబంధించిన విషయాలు ఎక్కువగా ఉన్నాయనీ వాటిని విద్యార్థులు అభ్యాసం చేస్తే చెడిపోతారని ఒక విద్యార్థి తండ్రి వైస్ ఛాన్సలర్ కట్టమంచి రామలింగారెడ్డిగారికి ఫిర్యాదు చేశాడు. అప్పుడు పింగళివారికి, విద్యార్థి తండ్రికి వాదోపవాదాలు జరిగాయి. అప్పటికే అన్ని కళాశాలలో 'మను చరిత్ర' పాఠ్యాంశంగా కొనసాగుతోందని వాటిని సిలబస్ నుంచి తొలగించడం సాధ్యం కాదని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. కానీ తర్వాత కాలంలో అధ్యాపకులంతా చర్చించి అటువంటిభాగాలను సిలబస్ నుంచి తొలగించారు. ఆ సమయంలో పింగళివారు శృంగారరసం గురించి ఇలా చెప్పారు. *''ప్రేమ శృంగారం అనే వాటి గుణ రూపాలు ప్రమాదకరమైనవి కావు. వాటిని తెలుసుకొనలేకపోతే మనిషి జడమైపోతాడు. చతుష్షష్టి కళలలో శృంగారం మొదటి కదా! వాటిని తెలుసుకొనవలెనని లక్ష్మీకాంతము గారి యభిప్రాయము ''* అనిగూడూరి నమశ్శివాయ (శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:52) పేర్కొన్నారు. దీన్ని బట్టి పింగళివారికి పాఠాల ఎన్నికలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలని ఒక సూచనను కలిగించారు. దీనితో పాటు విద్యార్థుల జీవితాలను సరైన మార్గాలలో పయనించడానికి సరైన పాఠ్య ప్రణాళికల్ని నిర్మించే దిశగా విద్యావ్యవస్థలో తీసుకురావాల్సిన మార్పుల్ని నాటి కాలంలో ఎంతో ముందుచూపుతో ఆలోచనలు చేశారని అర్థమౌతోంది.

**1.27. పాఠ్యాంశాల ఎన్నికలో నిష్పక్షపాత దృష్టి:**

ఒక కవి తన గ్రంథాన్ని కట్టమంచి రామలింగారెడ్డి గారికి అంకితం ఇచ్చారు. దాన్ని పాఠ్యాంశంగా పెట్టాలని కట్టమంచి రామలింగారెడ్డి గారిని అడిగారు. కట్టమంచి వారు ఆ గ్రంథాన్ని పాఠ్యాంశంగా పెట్టాలని పింగళి వారిని అడిగారు. పింగళి వారు దీనికి సమాధానాన్ని ఇలా చెప్పారు *''కట్టమంచి వారిని గారిని పింగళి ఒకసారి కలిశారు. గ్రంథం మీ కంకితం చేసినంత మాత్రాన పాఠ్యంగ్రంధార్హత సంపాదించుకొదు. అందులో విషయం పాఠ్య గ్రంథానికి ఉండవలసిన అర్హత కలదికాదు అని వారితో అన్నారు''* అని గూడూరి నమశ్శివాయగారు

(శ్రీపింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,1991:52) పేర్కొన్నారు. దీన్ని కూడా పింగళి వారికి పాఠ్యాంశాలలో ఎలాంటి పాఠాలను నిర్ణయించాలి, ఎలాంటి పాఠ్య ప్రణాళికలను ఎన్నుకోవాలి అనే అంశాల పట్ల లోతైన అవగాహన ఉందని అర్థమౌతుంది.

ముద్దుకృష్ణగారు రాసిన వైతాళికులు అనే పుస్తకాన్ని పాఠ్య గ్రంథంగా నిర్ణయించాలని గోపాల స్వామి నాయుడుగారు కట్టమంచివారిని అడిగారు. వారు పింగళివారిని కలవమని సలహా ఇచ్చారు. కట్టమంచి వారితో పింగళివారు ఇలా అన్నారు *"వైతాళికులలోని విషయం ప్రశ్నలిచ్చుటకు అనుకూలమైననదేనా చూచి చెప్పమని ప్రశ్నించగా అనుకూలముగా లేదని రెడ్డిగారే ఉపసంహరించుకున్నారు"* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీపింగళిలక్ష్మీకాంతం జీవితచరిత్ర,1991:52) తెలియజేశారు. వైతాళికులనే పుస్తకం కవుల జీవితాలను, వారిరచనలను సంక్షిప్తంగా ఉండడం వలన ఆ పుస్తకాన్ని పాఠాలుగా ఎన్నుకోవడం సరైనది కాదని చెప్పారని ఇది పింగళివారి విజ్ఞతను తెలియపరుస్తుంది.

బరంపురం సంస్థానాధిపతి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రో ఛాన్సలర్ ఆయన విశ్వవిద్యాలయానికి ప్రతి ఏటా లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చేవారు. విక్రమ దేవవర్మగారికి ఒక పండితుడు తన గ్రంథాన్ని అంకితం ఇచ్చాడు. దాన్ని పాఠ్యాంశంగా పెట్టాలని దేవవర్మ సిఫారసుతో ఆ పండితుడు పింగళి వారి దగ్గరకు వెళ్లాడు. అప్పుడు ఆ గ్రంథాన్ని చూసి పింగళివారు ఈ విధంగా ఆయనతో చెప్పారు *"ఇది కేవలం విమర్శన గ్రంథం. ఇటువంటి పుస్తకాలు పాఠ్యాంశాలుగా తగవండీ. దీన్ని సిఫార్సు చేసే బదులు మీ మీద అభిమానముంటే మీకు వేయి రూపాయలు పారితోషికంగా యీయవచ్చునే రాజావారు"* అని గూడూరి నమశ్శివాయగారు (శ్రీపింగళి లక్ష్మీకాంతం,1991:52) అన్నారు. దీన్ని బట్టి పింగళివారికి పాఠ్య ప్రణాళికల గురించి అవగాహన అలాగే పాఠ్యగ్రంథాలలో ఉండాల్సిన విషయాల పట్ల సరైన ఆలోచనలు, అవగాహన స్పష్టంగా కనిపిస్తోంది.

**1.28. పింగళివారిపై విద్యా సంస్థల అభిప్రాయాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారు తన ఉద్యోగ బాధ్యతలను నిర్వహించి ఆ సంస్థలకు ఎంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చారు. ఆయన చేసిన సేవలకు గాను ఆ సంస్థలు ఆయన ఉద్యోగ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని, గుణగణాల గుర్తించి వారిని ప్రసంగించారు. వాటి వివరాలను ఇక్కడ తెలియజేస్తున్నాను.

**1.28.1.ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు (వాల్తేరు):**

ఆంధ్ర విశ్వకళాపరిషత్(వాల్తేరు) తెలుగుశాఖ అధ్యక్షుడు, ఉపన్యాస కర్తగా, పాఠ్య ప్రణాళిక సృష్టికర్తగా, ఆ సంస్థకు సుదీర్ఘ కాలం పాటు సేవలందించారు. ఈ సేవలను ప్రశంసిస్తూ ఆ సంస్థ తెలిపిన అభిప్రాయాన్ని చూద్దాం. *"విశ్వకళాపరిషత్ కళాశాల క్రొత్తగా నెలకొనినప్పుడు లక్ష్మీకాంతంగారు విశ్వ కళా పరిషత్తులో తెలుగు శాఖలో అధ్యాపకుడుగా చేరినారు. ఆ శాఖాధిపతిగా, శాఖను వ్యవస్థీకరించి అట్టి పాఠ్య ప్రణాళికకు ఆ నాడు ఆదరణ*

*లభించినప్పటికీ విద్యా ప్రమాణాలను నిలబెట్టిరి.''* అని పింగళివారు పదవీ విరమణ పొందినప్పుడు ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు తెలిపిన సారాంశం. (చూడు–అనుబంధం)

1944లో అధ్యాపక వర్గాన్ని వ్యవస్థీకరించినప్పుడు శ్రీలక్ష్మీకాంతంగారిని రీడరుగా నియమితులయ్యారు. వారు చేసిన కృషిని దృష్టిలో ఉంచుకొని వారి పదవీకాలాన్ని రెండు పర్యాయములు సిండికేట్ పొడిగించింది. వారి కార్య కౌశలం, కేవలం పాఠ బోధనకే పరిమితమైంది కాదు. కవిగా, రచయితగా, విమర్శకుడుగా ఉత్తమ శ్రేణికి చెందినవారు.

పరిశోధకులకు మార్గదర్శిగా తంజావూరు గ్రంథాలయాన్ని తిరిగి రాయించడంలో వారు చక్కటి సేవలను చేశారు. అంతేకాదు 'ద్విపదభారతము' అనే గ్రంథాన్ని పరిష్కరణ చేసి ప్రచురించారు. అలాగే పరిష్కరించడానికి యక్షగానాలను సేకరించారు. కానీ వీటి పరిష్కరణ కాక ముందే వారు పదవీ విరమణ చేశారు. దీని ద్వారా ఆయన పరిష్కరణ కృషి ఎంతో ఉందని తెలుస్తుంది.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు అధ్యాపక, ఉద్యోగ బృందాలలో కాకుండ విద్యార్థిలోకంలో కూడా శ్రీలక్ష్మీ కాంతం ఒక ఉత్తమ వ్యక్తిగా కీర్తిని పొందారు. వారి ప్రవర్తన కుశలత, సాత్విక భావాలు, దృఢవైఖరి, వివేచన, విచక్షణ, విజ్ఞత, విశాలహృదయం, మాట తీరు, గాంభీర్యం, ఔదార్యం మొదలైన లక్షణాలన్నీ పింగళి లక్ష్మీకాంతంగారిలో కనిపిస్తాయని ప్రశంసించారు. దీన్ని బట్టి ఆయన అధ్యాపక వృత్తికి, తెలుగు భాష, సాహిత్యాలకు ఇచ్చిన ప్రాధాన్యాలు తెలుస్తాయి.

వారికిగల యితర వ్యాసంగములను కొనసాగించుటకు వారికి తగు ఆయురారోగ్యము లుండవలెననీ, భవిష్యత్తు అనువుగా కొనసాగవలెననీ ఉపాధ్యక్షుడు, సిండికేటువారు వాంఛించుచున్నారు'' అని ఆంధ్ర విశ్వకళాపరిషత్ తరపున రిజిస్ట్రారువారు పై విధంగా పేర్కొన్నారు. (చూడు–అనుబంధం)

### 1.28.2. పింగళివారికి కట్టమంచివారి ఉత్తరం:

పింగళి లక్ష్మీకాంతంగారు తన ఉద్యోగ పదవీ విరమణ చేసినప్పుడు కట్టమంచి రామలింగారెడ్డిగారు పింగళివారికి ఒక ఉత్తరం రాశారు. ఆ ఉత్తరంలో పింగళి లక్ష్మీకాంతంగారి గురించి చెప్పిన అంశాలు పింగళిలక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

*''ప్రియమైన లక్ష్మీ కాంతమునకు, మీరు పంపిన సమాచారమునకు కృతజ్ఞుడను. ఇప్పుడిప్పుడే అనారోగ్య పరిస్థితులనుండి తెప్పరిల్లుచున్నాను. మీ జాబు కొంత ఉల్లాసము కలిగించినది.*

*మీరు త్వరలో పదవీ విరమణ చేయుచున్నట్లు నిర్ణయమైన సంగతి మీకు ఇంకను అధికారపూర్వకముగా తెలిసి యుండక పోవచ్చును. క్రిందటి సంవత్సరము మీ పదవీకాలమును పొడిగింతురని మీరు ఊహించియుందరు. ఈ విధమైన నిర్ణయములను, మార్పులను మీరు ఎంత నిబ్బరముగ పెద్ద మనిషివలె స్వీకరింపగలరో నాకు తెలుసును. నిర్ణయమునకు సంబంధించిన వివరములు తరువాత జారీ కాగలవు. విశ్వకళా పరిషత్తుకు మీరు చేసిన సేవ మీ పాండిత్యము,*

*హుందాతనము, వివేచనా పట్టెను. అసాధారణ లక్షణములని గుర్తించి నేను విశ్వకళాపరిషత్తువారు మీకు ఎంతయో ఋణపడి యుండిరని తెలియజేసికొనుచున్నాను. మీరు గొప్ప పండితులలేగాక ఉత్తమ శ్రేణికి చెందిన పెద్దమనుష్యులు కూడా. నా సూహోర్దిక ప్రకటనను మన్నించి ఆమోదింతురుగాక!''* అని ది 4-10-1948 న ఈ ఉత్తరం రాశారు. చివరిలో స్నేహ పాత్రుడు సి. ఆర్. రెడ్డి'' అని తన పేరుని రాసుకున్నారు. ఈ భావాలన్నీ ఆంగ్లంలో సి.ఆర్.రెడ్డిగారు రాశారు.దీన్ని ఆయనపై పరిశోధన చేసిన జి.విశ్వనాథనాయుడుగారు తన సిద్ధాంతగ్రంథంలో తెలుగు అనువాదాన్ని పెట్టారు.

దీన్ని బట్టి వీరిరువురి మధ్య గల సాన్నిహిత్యం తెలుస్తుంది. దీని అసలు ప్రతిని (ఆంగ్లంలో రాసిన ఉత్తరాన్ని) అనుబంధంలో పెట్టాను.

**1.29. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవనయానం:**

పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఆయన జీవితంలో అధిక భాగాన్ని అధ్యాపక వృత్తినే చేపట్టారు. అంటే విద్యారంగంతో మమేకమయ్యారు.

★1894 జనవరి 10 తేదీన కృష్ణా జిల్లా అర్తమూరులో శ్రీ పింగళి వేంకట రత్నం, కుటుంబమ్మ దంపతులకు నరసయ్య, లక్ష్మీకాంతం, వీరయ్య, కూతురు సుందరమ్మగార్లు జన్మించారు. వీరిలో లక్ష్మీ కాంతం మూడవ సంతానం.

★1907-08 ప్రముఖ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి మార్గదర్శకత్వంలో ఉత్తమశిష్యునిగా జ్ఞానాన్ని పొందడం.

★ 1909-10 మధ్యకాలంలో తండ్రి పింగళి వేంకటరత్నం నిర్యాణం.

★1912 సంవత్సరంలో లక్ష్మీనరసమ్మతో వివాహం.

★1915-17 మధ్య కాలంలో విజయవాడ సబ్ కోర్టులో బెంచ్లర్క్ గా కొంత కాలంపాటు అనువాదకుడిగా, లేఖకుడిగా పని చేశారు.

★1917-1968 కాటూరి వేంకటేశ్వరరావుతో స్నేహం చేశారు. ఆయనతో కలిసి తొలకరికావ్యం, సౌందరనందము కావ్యాల్ని జంటగా రచించారు. కాటూరి వారితో కలిసి బగ్ జార్గల్ నవలా అనువాదం చేశారు.

★1921 బందరు జాతీయ కళాశాలలో బి.ఏ. పూర్తి చేశారు.

★1922-27 బందరు నోబుల్ పాఠశాలలోను, జాతీయ కాలేజీలోను తెలుగు పండితునిగా, అధ్యాపకుడిగా కొంతకాలం ఉద్యోగం చేశారు.

★1927-1930 మద్యకాలంలో మద్రాసు యూనివర్సిటీకి సంబంధించిన ఓరియంటల్ మ్యాన్యుస్క్రిప్ట్ లైబ్రరీలో పరిశోధకుడిగా కృషి చేస్తూ ఆంధ్ర మహాభారతంతో పాటు యక్షగానాలను, ఇతర గ్రంథాల అధ్యయనం చేశారు.

★1927-30 మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులుగా ఉన్న డా. కోరాడ రామకృష్ణయ్యగారి శిక్షణలో, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, అధ్యయనవేత్తగా, అనువాదకుడిగా విశేషమైన బాధ్యతలను చెపట్టారు.

★1931-1949 ఆంధ్ర విశ్వవిద్యాలయంలో (వాల్తేరు) తెలుగు శాఖలో అధ్యక్షుడిగా, పాఠ్య ప్రణాళికల సృష్టికర్తగా సుదీర్ఘకాలంపాటు సేవలందించారు.

★1954-61 విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో సాహిత్య కార్యక్రమాలకు ప్రయోక్తగా విధులు నిర్వహించారు.

★1954 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడెమీ నూతనంగా ఏర్పాటు చేశారు. అందులో తెలుగుభాషా, సాహిత్యాలకు సంబంధించిన విషయాలలో సలహాదారునిగా నిమితులయ్యారు

★1961-65 వరకు శ్రీవేంకటేశ్వర యూనివర్శిటీలో (తిరుపతి) తెలుగు శాఖాధ్యక్షుడుగా, ఆచార్యుడిగా విధులు నిర్వహణ.

★1968 తెలుగు అకాడమీ సభ్యులుగా, పాఠ్య ప్రణాళికలో భాగంగా తెలుగు వాచకాల్లో ఎలాంటి భాష ఉండాలనే దానిపై నిర్వహించిన శైలీ సంఘానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు.

★1969 పింగళి వారి భార్య లక్ష్మీ నరసమ్మ నిర్యాణం.

★1970 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(తిరుపతి) వారు పి.వి. నరసింహరావుగారి చేతుల మీదుగా గౌరవ డిలీట్ పట్టానిచ్చి గౌరవించింది.

★1972 ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు జనవరి 10 తేదీన ఉస్మానియా వైద్యశాల హైదరాబాదులో నిర్యాణం.

రాబోయే అధ్యాయాల్లో ఆయన రచించిన రచనలతో పాటు, ఆయన జంటగా రచించిన రచనలను వాటి విశేషాలను పరిశీలిస్తాను.

రెండవ అధ్యాయం

# పింగళి, కాటూరి: జంటకవిత్వం (తొలకరి) పరిశీలన

### 2.0 ఉపోద్ఘాతం:

పింగళి లక్ష్మీ కాంతంగారు అనేక సంవత్సరాల పాటు బోధనలో ఉన్నారని ఇంతకు ముందు అధ్యాయంలో తెలుసుకున్నాం. ఆయన అధ్యాపకుడిగా చేరిన రోజుల్లో అప్పుడప్పుడే కొత్తగా తెలుగు శాఖను ప్రారంభించడం, వాటికి పాఠ్య ప్రణాళికలను రూపొందించడం, తెలుగు శాఖను అభివృద్ధి పరచడం వంటి పనుల్లో తలమునకలవ్వవలసి వచ్చింది. అందుకనే చాలామంది ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆయనతోనే తెలుగు శాఖ ప్రారంభమైనదని అంటారు. అలాగే, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖను కూడా అభివృద్ధి పరచడంలో కూడా ఆయన విశేషంగా కృషి చేశారు. అందువల్ల తొలి రోజుల్లో కవిత్వం రాసినా తరువాత కాలంలో పరిశోధన, పాఠ్య ప్రణాళికల రూపకల్పనలు, సాహిత్య విమర్శ పరిభాషను బోధించడంలో నిమగ్నమం కావడం, దాని వలన ఆంధ్ర సాహిత్యాన్ని, సాహిత్య చరిత్రను, సాహిత్య విమర్శను విస్తృతంగా అధ్యయనం చేయవలసి వచ్చింది. ఇవన్నీ మేధోపరమైన అంశాలు. ఈ పనులు అనివార్యంగా చేయడం వల్ల సృజన కంటే విజ్ఞానదాయకమైన అంశాలకే ఆయన ప్రాధాన్యం ఇచ్చినట్లయింది. ఈ పరిస్థితులకు ముందు కాటూరి వేంకటేశ్వరరావుగారితో కలిసి విడిగానూ కవిత్వాన్ని రక్షించేవారు. కానీ ఈ తెలుగుశాఖలో చేరిన తర్వాత వివిధ కార్యక్రమాల్లో నిమగ్నం కావడం వలన కవిత్వాన్ని పక్కన పెట్టారు. కానీ పింగళి లక్ష్మీకాంతంగారు గొప్ప పండిత కవి. పింగళి, కాటూరి కవులు రాసిన జంట కవిత్వాన్ని ఒక భాగంగానూ, పింగళి లక్ష్మీ కాంతంగారు రాసిన పద్య కవిత్వాన్ని ప్రత్యేకించి అధ్యయనం చేస్తాను.

### 2:1 పింగళి, కాటూరి జంట కవిత్వం:

పింగళి లక్ష్మీ కాంతంగారు తన గురువు గారు చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారి ప్రభావంతో అవధానాల పట్ల ఆసక్తిని ప్రదర్శించారు. తిరుపతి వేంకటకవులు అవధానాలు చేసేటప్పుడు కూడా పింగళి లక్ష్మీకాంతంగారిని ప్రోత్సహిస్తూ వివిధ అవధానాలలో సమస్యను పూరించమనేవారు. అప్పుడు పింగళి లక్ష్మీ కాంతంగారు ఆ సమస్యను పూరిస్తుండేవారు. దీనికి కారణం పింగళి లక్ష్మీకాంతంగారు చదువుకొనే రోజుల్లో ఒక సంఘటనను ప్రస్తావించుకోవాలి. బందరు హైస్కూల్లో తెలుగు పండితునిగా చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారు పాఠాలను చెప్పేవారు. విద్యార్థులను *'నదికి, కాలువకు భేదాలు ఏమిటి?* చెప్పండని ప్రశ్నించారు. పింగళి లక్ష్మీకాంతంగారు లేచి సమాధానం చెప్పారు. 'మర్నాడు ఆ బాలుడు వేంకట శాస్త్రిగారింటికి వెళ్లి 'నన్ను *శిష్యుణ్ణిగా*

*చేసుకొమ్మని* అడిగారు. వేంకట శాస్త్రి గారు' నీ అభిలాష ఏమిటని ప్రశ్నించారు. ఆ బాలుడు *'నేను కవిని కావాలి'* అన్నాడు.

సాధారణంగా తమ వద్దకి వ్యాకరణమో, సంస్కృతమూ నేర్చుకుంటామంటూ వస్తారు, కాని ఆ బాలుడు 'కవిని కావాలి' అని అడగడంతో శాస్త్రి గారికి ముచ్చట కొల్పింది, అనన్య ప్రీతి కలిగింది'' అని పింగళి సూర్య సుందరం (పింగళి లక్ష్మీ కాంతం,2010:24) అన్నారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీ కాంతంగారిపై చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారి ప్రభావం ఎంత ఉందో ఇక్కడ స్పష్టంగా తెలుసుకోవచ్చు.అంతేకాకుండా ఆనాటి నుంచి పింగళివారిపై చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారు ప్రత్యేక శ్రద్ధ పెట్టడాన్ని గమనించేవారు. పింగళివారి మాటల్లోనూ, రాతల్లోనూ సృజనాత్మకతను గమనించేవారు. అందుకనే పింగళివారిని తమ అవధానాలకు, అవధానాలు చేసే చోట్లకు తీసుకు వెళ్ళేవారు. తిరుపతి వేంకట కవులు జంటగా అవధానాలు నిర్వహించినట్లే పింగళివారు కూడా ఎవరితో ఒకరితో కలిసి అవధానాలు నిర్వహించాలనే ప్రేరణ పొందేవారు. ఆ ప్రభావం వలనే తొలుత చిన్నచిన్న పద్యాల్ని కాటూరి వేంకటేశ్వరరావుగారితో కలిసి వర్ణించేవారు. ఈ ఇరువురు ఆశువుగా ఒక ఆంజనేయస్వామి శతకాన్ని కూడా చెప్పినట్లు గూడూరి నమశ్శివాయగారు పేర్కొన్నారు. కాటూరి వేంకటేశ్వరరావు గారితో కలిసి పింగళి లక్ష్మీ కాంతంగారు అవధానాలు నిర్వహించడం, సౌందరనంద కావ్యాన్ని రాయడం, తొలకరి కావ్యాలను రాశారు. వీరివురిశైలి వీడదీయలేనంతగా కలిసిపోయిందని విమర్శకుల అభిప్రాయం. అయినప్పటికీ కొన్ని ప్రత్యేకమైన అంశాల్ని గుర్తించే అవకాశం ఉంది. కానీ స్పష్టంగా నిరూపించడం కష్టం. అందువల్ల ఈ జంట కవుల పద్య కవిత్వాన్ని ఇక్కడ ప్రత్యేకంగా పరామర్శించడం జరుగుతుంది.

### 2.2. తొలకరి ఖండకావ్య సంపుటి:

పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు జంటగా రాసిన ఖండకావ్య సంపుటి పేరు ***తొలకరి.*** దీనిలో పన్నెండు ఖండికలు ఉన్నాయి. అవి వరుసగా ***కవితా సామగ్రి, కవి శిశువు, కోకిల, సంక్రాంతి, జొన్న చేను, ఎడబాటు, అజ్ఞాన కవిత్వం, రసాలము, తొలిపూత, ఎవరు నేను, బోనులోని సింగం, రక్త తిలకము*** అనే ఖండికలు ఉన్నాయి. ***తొలకరి*** ఖండకావ్య సంపుటి పింగళి లక్ష్మీ కాంతం గారికి, కాటూరి వేంకటేశ్వరరావు గారికి మొదటి రచన అని చెప్పవచ్చు.

దీని గురించి కట్టమంచి రామలింగారెడ్డిగారు పీఠిక రాస్తూ దీన్ని ''సుకుమార పుష్పమంజరి'' అని అన్నారు. అంతేకాకుండ ప్రకృతి వర్ణనలు కలిగిన చక్కని కావ్యమని, మానవుల స్వభావాల్ని గొప్పగా వర్ణించిన కావ్యమని ఈ కావ్యం గురించి కట్టమంచి రామలింగారెడ్డిగారు వ్యాఖ్యానించారు. పింగళి కాటూరి జంట కవిత్వం గురించి పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము అనే గ్రంథంలో పింగళి వేంకట కృష్ణారావు గారు ఇలా వ్యాఖ్యానించారు. *''జంట కవిత్వం భార్యా భర్తల సంసారంలాంటిది. ఇతరుల అభిప్రాయాల్ని ఆమోదించలేని అతిస్వతంత్రులు జంట కవులు కాలేరు. ఒకరంటే మరొకరికి మెచ్చుకోలున్న*

*వారు, సమస్కందులు. ఒకే విధంగా ఆలోచించేవారు సంతోషంగా భావవినిమయం చేసుకోగలవారు మాత్రమే జంట కవులు కాగలరు. బాల్యసఖులు, బంధువుల, సహపాఠులు కావడం పింగళి కాటూరి కవులకు అదనంగా అబ్బిన అదృష్టాలు''* అని పింగళి వేంకట కృష్ణారావు (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము,2013:356) పేర్కొన్నారు. తొలకరి కావ్య రచన నేపథ్యాన్ని గురించి కాకర్లవారి మాటల్లో *''శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు రసహృదయులు, ప్రకృతి సౌందర్యాన్ని చూచినప్పుడు అమితమైన ఆనందంతో పరవశించిపోయేవారు. గుంటూరులో ఉన్నప్పుడు తరచుగా సాయం సమయం ముందు వారు ఊరిబయట పొలాల్లోకి వాహ్యాళి వెళుతూ ఉండేవారు. వారితో నేనూ (డా. కాకర్ల వెంటకరామనరసింహం శ్రీ వేంకటరమణశాస్త్రిగార్లు) వెళ్లేవాళ్లం. ఎర్రగా విరగబండిన మిరపతోటలలో మధ్యమధ్య విరియబూచిన ముద్దబంతి మొక్కలతో అక్కడి పొలాలు కన్నుల పండువుగా కనబడేవి. వాటిని చూసినప్పుడు లక్ష్మీ కాంతంగారు మైమరచిపోయేవారు. 'తొలకరి' లోని కొన్ని గీతాలు మధురంగా పాడి, వినిపించి, ప్రకృత్యుపాసకులైన కవుల్ని గూర్చి ప్రసంగించేవారు. రసభావస్నిగ్ధమైన వారి హృదయం నుంచి వెలువడే ఆ వాక్యాల్ని వింటూ ఉన్నప్పుడు అందరూ సర్వసాధారణంగా అనభిగమ్యుడూ,అహంకారీ అనుకునే వ్యక్తి యీయనేనా ? అని అనిపించేది'' అని* (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 1974:39) డా. కాకర్ల వెంటకరామనరసింహంగారు అభిప్రాయపడ్డారు.

### 2.2.1. కవితా సామగ్రి:

ఈ కవితా సామగ్రి ఖండికను 1918 సంవత్సరం నవంబరు రెండో తేదీన కృష్ణా పత్రికలో ప్రచురించారు. కవితా సామగ్రి ఖండికలో కవిత్వ సిద్ధాంతం చెప్పడం ప్రదానం. అందుకే దీన్ని పింగళి వేంకట కృష్ణారావు గారు *'' ఇది లాక్షిణిక దృష్టి గల పింగళి లక్ష్మీ కాంతం గారి రచన''* అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము,2013:361) అభిప్రాయపడ్డారు.

దీన్ని బట్టి భావకవిత్వ స్వరూపం ఎలా ఉందో వర్ణిస్తూ ''మామిడి చిగురును తిన్న ఆడ కోయిలా పాటలాగ మెరిసే ఆభరణాలకు మెరుగులు దిద్దడానికి ఉపయోగపడే మేలిమి బంగారు తరుగులాగా భావంలో కలువ పూరేకుల్లో దాగిన మృదుత్వం లాంటి శబ్ద సౌందర్యం భావకవిత్వంలో ఉంటుందని ఆ కవిత్వ లక్షణాలను వర్ణించారు. అంతేకాదు ఆ కవిత్వం చదువుతూ ఉంటే పరిమళభరిత సువాసనలు వస్తున్నట్లు చందనం రాసుకుంటే పొందె చల్లదనం హృదయానికి తాకినట్టు మకరందం తాగితే వచ్చే తీయదనం భావకవిత్వంలో ఉంటుందని ఒక గొప్ప పద్యాన్ని వర్ణించారు.

*'' చూతురా ? దీనిని జూతపల్లవఖాది*
**దిగుమతియగు కమ్మ తెమ్మెర దివి**
*ని పికాంగనా గాన నిస్వనంబు*

*కొందురా? దీబూ గ్రొమ్మెరుంగుల జిల్గు*

*పనికి గాదగిన కుందనపుదళ్కు*

*కావలెనా ? యిద్ది కలువపూరేకు పొ*

*త్తములజిప్పి లేదు మెత్తందనమ్ము*

*వలయునా ? మలయ పర్వత సానువుల నుండి*

*తీయుదుర దీని వెన్నెల తేట నిగ్గు*

*ఒరయుదుర దీని బచ్చకప్పురపు దావి*

*కోరికొందుర? దీని బటీరజలము*

*త్రావిచూతుర? తీయని పూవుదేని "* (తొలకరి కావ్యం:9) అని దీనలో ఈ భావాలన్ని ఉన్నాయి. అంతేకాకుండ తన కవిత్వం ఎటువంటిదో చెప్తూ....

*"కపురంపుంబలుకుల్, తుషార జలముల్, కల్వల్ పికధ్వానమ*

*చప్పు బంగారము పూవు దేనియలు జ్యోత్స్నల్ చల్లగాలుల్ కవి*

*త్వపు సామగ్రి యటంచు జూపెడు, కవిత్వంబన్న నెట్లుండునో*

*యెపుడున్ జూడనివానికింబలెనె పొమ్మీ చాలు సంతోసమే "*

ఈ పద్యంలో 'కపురంపు పలుకుల్' అంటే పలుకులలో సువాసనలు ఉంటాయని అనడం అంటే 'ధ్వని' రసభరితంగా ఉంటుందని చెప్పినట్లు అయింది. అంతేకాదు తమ కవిత్వం ఎటువంటిలా ఉంటుందో చెబుతూ చల్లని నీటి బిందువుల మీద పడితే పొందే గిలిగింతలు, గాన యోగ్యంగా, విన సొంపుగా ఉండే కోయిలా పాటలాగా తమ కవిత్వం ఉంటుందన్నారు. దీన్ని బట్టి పింగళి కాటూరి కవుల కవిత్వ లక్షణాలను ఆలోచిస్తే వీరి కవిత్వం కింద విధంగా ఉండాలని మనం సూత్రీకరించవచ్చు.

1. కప్పురపు పలుకులు అనడం ద్వారా శబ్ధసౌందర్యం ఉండాలి. కప్పురము నోట్లో వేసుకున్నప్పుడు గాలి పీల్చినప్పుడల్లా కొత్తదైన అనుభూతి కలుగుతుంది. అలాగే కవిత్వంలో కొన్ని శబ్దాలు చదివినప్పుడల్లా కొత్తకొత్త అర్థాలు సృజించినప్పుడు పాఠకుడికి ఆనందం కలుగుతుంది. ఆ విధంగా కవిత్వం ఉండాలనేది ఒక లక్షణం. అంటే కవిత్వం శ్లేష, ధ్వనిమయంగా ఉండాలనేది పింగళి కాటూరి కవుల భావన.

2. ''తుషార జలముల్'' అనడం ద్వారా కవిత్వ వర్ణనల్లో చమత్కారం ఉండాలి. సూర్యోదయానికి సూర్యోదయంలో గడ్డిపోచ మీద కనిపించే నీటి బిందువు ఎంతో అందంగా ఉంటుంది. అది మనిషి మీద పడినప్పుడు పొందే ఒకరకమైన గిలిగింతలు, ఒకరకమైన హాయి మాటల్లో చెప్పలేము. కాబట్టి కవిత్వం కూడా అనుభూతి రమ్యత అనేది కవులు ప్రయోగించే శబ్ద చమత్కారం అర్థ చమత్కారం వలన కలుగవచ్చు.

పాఠకుల స్థాయిని బట్టి ఆ అనుభూతి రమ్యతను అందుకోగలుగుతారు. కలువ పువ్వుల వలే సుకుమారంగా ఉండాలనడం ద్వారా శబ్దాలు మాధుర్య గుణంతో ఉండాలనేది వారి భావన.

కలువలు అనడం ద్వారా కవిత్వం హృదయానికి చల్లదనాన్ని మాధుర్యాన్ని అందించాలనేది కవుల భావన. సాధారణంగా కలువపూలు చంద్రుడు. వచ్చినప్పుడు రాత్రిసమయంలో వికసిస్తాయి. అలాగే దీని వల్ల కలువపువ్వులను ప్రస్తావించడం ద్వారా అంతరార్థాన్ని గమనిస్తే చంద్రుడు వచ్చినప్పుడు కలువలు  వికసించినట్లే మృదుమధురమైన హృదయం గల సహృదయ పాఠకులు చదివినప్పుడు ఆ కవిత్వం అంతా చల్లదనాన్ని అంటే మనస్సు ప్రశాంతతను, ఆనందాన్ని ఇవ్వగలిగినట్లైతే కవిత్వం ఉండాలనేది వీరి భావన.

3. 'పికధ్వానం' అనడం ద్వారా కోయిల గానం కలిగించే పారవశ్యాన్ని కవిత్వం అందించాలనేది వీరి భావన.

4. 'పచ్చకప్పరం' అనే ప్రయోగం ద్వారా స్వేచ్ఛమైన నిష్కలంకమైన ఆలోచనను కలిగిస్తూ కవిత్వం ఉత్తమ సంస్కారాన్ని పెంపొందించాలనేది ఆయన భావన కావచ్చు.

5. 'పువ్వు తేనియల్' అనడం ద్వారా కవిత్వం రసభరితంగా ఉండాలనేది వీరి భావన. వీటితో పాటు 'జ్యోత్స్నల్ చల్లగాలుల్ అనే పద్యంలో మరోక పద్యం మలయ పర్వత కమ్మతిమ్మెమల్' అనే ప్రయోగాలను గమనిస్తే కవిత్వం చదివిన తర్వాత పాఠకుడు ఆనందమయమైన, తేజస్సుతో, సంతోషంతో వెలుగొందాలనేది ఈ కవుల ఉద్దేశం.

6. ఒక విధంగా 1,2,6 పద్యాలు పునరుక్తమైన భావాలే ఉన్నాయి. బహుశా జంట కవులు తమ కవిత్వం ఎలా ఉండాలో చెప్పిన విడివిడి భావాలైన ఆ భావాలు వేరువేరు పద్యాలుగా వర్ణితమై ఒకే భావాన్ని వ్యక్తం చేస్తున్నాయని భావించవచ్చు. ఈ కవితా సామగ్రి ఖండికలో బందరులో జరిగే సాహిత్య ప్రియుల ఆలోచనలను ఆసరాగా చేసుకుని ఈ కవులు వివిధ సాహిత్య లక్షణాలను వర్ణించారు. బందరు పరిసరాల్లో కవులు ఎలాంటి కవిత్వాన్ని రాసేవారో ప్రజలు ఎలాంటి కవిత్వం పట్ల ఆసక్తి చూపేవారో ఈ కవితా సామగ్రి ఖండికలో కనిపిస్తుంది. తమ కవిత్వం తమ పూర్వీకుల సంప్రదాయాన్ని పాటిస్తూనే భావకవిత్వ పరిణామ స్థితిగతులను బట్టి కవిత్వంలో వచ్చిన మార్పులను కూడా ఈ కవితా సంపుటిలో చర్చించారు.

*"ఈ నాటిదా ! మాకు, బానయ్య మా మూల*
*పురుషుండు  యజ్వ కీసరకులమ్మె*
*ముత్తన్న సెట్టి మా ముత్తాత పింగళి*
*వారింట దననాడు వతనకాడు*
*కన్నయ్య మా తాతకాలాన జేమకూ*
*ర్వెంకన్న మా కొట్టు బేరగాడు*
*ధవళేశ్వరమున మా తండ్రి యంగడిమీద*
*దిరుపతికవులు నీసరకె కొనిరి*
*నమ్మకమ్మైన యీసరకమ్ముచుందు*

*నాంధ్రదేశమ్ము నలుదిక్కులందు దిరిగి*

*వతనుగా వత్తు నే ననువత్సరమ్ము*

*నొకపరి గొనుడు మాటనమ్మకము తెలియు"* (తొలకరి కావ్యం:10) అని తమ పూర్వీకులు యజ్ఞయాగాదులు చేసేవారికి కవిత్వ సామగ్రిని అమ్మారు అని యజ్ఞ్వకీసరుకులు అమ్మే అని చెప్పారు. అంటే వేదాలు ఆ సంస్కృతం ఆ సదాచారం అన్నీ కూడా కొంతమంది పాటించేవారని, ఆ విధంగా తిక్కన, పింగళి సూరన, చేమకూర వేంకట కవి, తిరుపతి వేంకట కవులు మొదలైన వాళ్ళంతా సంస్కృతాంధ్ర సాహిత్యాలలో విశేషమైన పాండిత్యాన్ని పొంది ఆంధ్రదేశ వ్యాప్తంగా వివిధ అవధానాలను చేశారని అటువంటి అవధానాలు జరిగేటప్పుడు

*"రచ్చకు వచ్చి, యోయి యిటురమ్మనిపిల్చి కవిత్వవస్తువుల్*

*తెచ్చితివా! కనుంగొనెదదీయుముమూతలటం చొకొక్కడున్*

*విచ్చి సకౌతుకాద్భుతపు వీక్షల జూచుచు పీడించి పో*

*వచ్చు, నివేటి వస్తువులు వర్తకుడా! యని నవ్వి యిట్లనున్ "*

*"కపురంపుంబలుకుల్ , తుషార జలముల్ కల్వల్ పికధ్వానమ*

*చ్చపు బంగారము పూవు దేనియలు జ్యోత్స్నల్ చల్లగాలుల్ కవి*

*త్వపు సామగ్రి యటంచు జూపెడు కవిత్వంబన్న నెట్లుండునో*

*యెపుడున్ జూడనివానికింబలెనె పొమ్మీ చాలు సంతోసమే "* (తొలకరి కావ్యం:11) అని నిరంతరం కవిత్వ పరిణామాన్ని దానికి కావలసిన భాషా సామగ్రి గురించి ఆలోచించే వారని ఈ ఖండికలో వలన తెలుస్తోంది. కొంతమంది ఈ ఆధునిక పరిశీలన తెలియక

*"ప్రౌఢ సమాస కల్పనమున్న*

*జూపుమీ యని చేయిచాపెనొకడు*

*శ్లేష కవిత్వమంజూష నీకడనున్న*

*గొనియెద నేనంచు గొసరె నొకడు*

*సత్కావ్యరచనా రసాయనంబున్నచో*

*నీ బుద్ధి నింపు మంచిచ్చె నొకడు*

*ఆశుకవిత్వమ్ము నల్లుమంత్రములున్న*

*నూదుమీయని చెవియొగ్గె నొకడు*

*పారసీ మెట్లు వ్రాయంగ బనికి వచ్చు*

*ఫణితులేమేని యున్నచో బయటబెట్టు*

*మంతియే కాని కవనదాహమ్ము దీన్ని*

*మంచునీళ్లేలయని కోపగించె నొకడు "* (తొలకరి కావ్యం:11) అని కవిత్వం ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోలేనివారు కూడా ఆంధ్ర దేశంలో ఉండేవారని దీన్ని బట్టి

తెలుస్తోంది. ప్రౌఢ సమాసాలు, శ్లేష కవిత్వం, ఆశుకవిత్వం మొదలైన వాటిని ఇష్టపడి ఆ సంప్రదాయ భావాలనే కొనసాగించి ప్రోత్సాహించేవారని, లేకపోతే అటువంటి కవిత్వం రాయకపోతే నిరాధారణకు కూడా ఎదురైయెదని, అటువంటి వారు ఆ ప్రాంతాలను వదలి వెళ్ళిపోయెవారని తెలుస్తోంది. అటువంటివారు మరోచోటికి వెళ్లిపోయెవారని చెబుతూ

*"కవితాలతాంగికి గర్త భూషణ మైన*
*కలువ మీచేబడి నలిగిపోవు*
*మీకృతికన్యల కీ కుందనపు దళ్కు*
*నగలు కై సేయు పుణ్యమ్ము గలదె*
*ఈవలిగాడ్పు మీమ్మావహించిన దవ*
*జ్వాల లీనునెకాని సౌఖ్య మిడదు*

*తీయని యీ గండుగోయిలగానమ్ము*
*వెగటాయె నౌర మీ వీనుగవకు*
*ఈ తుషార జలమ్ము మీ చేతులంటి*
*మలినమైపోయె గొనకున్న మానె పొందు*
*సుకవిభోగ్యమ్ము లిచటి వస్తువులు వీని*
*నలిపివేయకు డటునిటు గలచివైచి "*
*"ఎఱుగక వచ్చినాడ క్షమియింపుడు వేరొక పేటయుందునే*
*ర్వరులుగలారు వారు నను రమ్మని మాటికి జీరుచుందు రే*
*బొరపడి వీనినమ్మెదనుబో! తముబోంట్లకు లాభమేంటి? నా*
*సరుకుల పేరు కూడా జెడు జాలని సాగె మరొక్కచోటికిన్ "* (తొలకరి కావ్యం:12)అని కవితా సామగ్రి ఖండిక అంతా జంట కవులు రాసినట్లున్నప్పటికి సాహిత్య స్థితిగతులపై ఎక్కువగా ఆలోచించే విస్తృతంగా అధ్యయనం చేసే పింగళి లక్ష్మీ కాంతంగారి ప్రభావమే ఎక్కువగా కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద ఈ కావ్య ఖండికలో ఆ కాలంలో 1918 ప్రాంతంలో తెలుగు కవిత్వం ముఖ్యంగా భావ కవిత్వం దాన్ని వ్యతిరేఖించే సంప్రదాయవాదుల భావాలను చర్చించి ఆధునిక అవసరాల దృష్ట్యా కవిత్వంలో వివిధ పరిణామాల్ని ఆహ్వానించవలసిన అవసరాన్ని తెలియజేస్తోంది.

దీన్ని వ్యాఖ్యానిస్తూ పింగళి వేంకట కృష్ణారావుగారు ఇలా *" వీరడిగిన ప్రౌఢ సమాస కల్పన శ్లేష కవిత్వం, ఆశు కవిత్వం, ప్రాచీన కవిత్వానికి సంబంధించినవి. పారసీ, గజల్స్, వేలం వెర్రిగా ఆనాడు వ్యాపించిన, అన్య భాషకు సంబంధించినవి. ఇక ఈ కవి అమ్మ జూపిన సామగ్రి నవ్య కవిత్వానికి, భావకవిత్వానికి సంబంధించినవి. బందరులోని ఆనాటి ఛాందసవాదులకిదొక చురక"* అని (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్యసమాలోచనము,2013:363) అన్నారు. పింగళి, కాటూరి కాలంలో ఉన్న సాహిత్యం గురించి చక్కగా వ్యాఖ్యానించారు.

### 2.2.2. కవి శిశువు:

కవి శిశువు అనే ఖండికలో ఎనిమిది పద్యాలు ఉన్నాయి. ఈ ఖండికను తెలుపుతూ పింగళి వేంకట కృష్ణారావుగారు ఇలా అంటూ *" కవి శిశువు అంటే యువకవి, లేక బాలకవి, అమాయకుడైన కవి అనే అర్థాలు స్ఫురిస్తున్నాయని, ఆ రోజుల్లో యువకులు కొందరు, భావకవులమంటూ, గిరజాలు పెంచుకొని, లాల్చీ జేబులో చెరువు పెట్టుకొని, కొంపగోడు పట్టకుండా, కాలువ గట్లు వెంట, పొలాల వెంట, తాము కవిత్వం కోసమే పుట్టినట్లు తిరుగుతుండేవాళ్లు. అలాంటి బాధ్యతారాహిత్యం వలన ఇబ్బంది పడ్డ కుటుంబాలు లేకపోలేదు"* అని (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము, 2013:364) కవి శిశువు కవిత్వం గురించి తనదైనశైలిలో వివరించారు. అంతేకాకుండా ఎనిమిది పద్యాల్లో బాలకవి అంటే అప్పుడే కవిత్వం రాస్తున్న యువకవులు కుటుంబాల్ని వదలి భావ కవుల కవిసమ్మేళనాలలో పాల్గొనేవారు. అటువంటి కవులు బాధ్యతారాహిత్యంతో తిరిగే కవుల వలన కుటుంబాలలో ఆ కవుల కోసం ఎదురు చూపులు చూస్తున్నవారు ఎంతోమంది ఉండేవారని చెప్తూ...

*" నీడలారెడు నీచెట్లతోడ దొంగ*
*బూచి, దోబూచియాడుచు బ్రొద్దుగడపు*
*చందమామను బట్టనెంచవుగదన్న !*
*ఎచటికేగును జాబిల్లి, యింట నీదు*
*చిన్ని చెల్లెలు నీవు రాకున్న , బువ్వ*
*తిననను చు బోరు పెట్టుచుండెను గదోయి*
*పరుగుపరుగున జనుము నిన్నరయువారి*
*కంటెముందుగ జెల్లితో నింటిముందు*
*నారుబయటను గంచమ్మునందు దొంగి*
*చూచు జాబిల్లి తోడ దోబూచి యాడు*
*కొనుచు బాలును నన్నమ్ము దినెదుగాని"* (తొలకరి కావ్యం:14) అని ఈ

కవులు వర్ణించడంలో కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేసేటప్పుడు వాళ్ళు లేకపోతే వాళ్ళు ఎంత బాధపడేవారిలో తెలియజేస్తున్నారు కవులు.

*"ఆకటి బ్రొద్దెరుంగక, సహాయులగూడక, రేయినాక,పై*
*నాకసమందుదోచెడి శశాంకుడు జుక్కలె తోడుగా గాని*
*ట్లేకతముండి, నిశ్చలత నేదియొ ? యోజనమున్గి యున్న వ*
*త్సా ! కవి వై యశమ్మును జిరాయువు గల్గి సుఖమ్ము జెందు మీ "*

(తొలకరి కావ్యం:14) అని

*"కవి, కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూ సుఖంగా బ్రతుకుతూ ఆయురారోగ్యాలతో గొప్ప కావ్యాల్ని వ్రాసి ఘనమైన కీర్తిని సంపాదించుకోవాలన్నదే ఈ కవుల సందేశం. చదువరులు*

*కవితా సామగ్రి లోని శైలికి, కవి శిశువు లోని శైలికి తేడా గమనించే ఉంటారు. కొంచెము, చందమామ,పాల అన్నమము మొదలైన మాటలు కాటూరి వారివి''* అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము,2013:365) తొలకరిలోని 'కవి శిశువు' ఖండిక రచన కాటూరి వేంకటేశ్వరరావుగారిదనీ అని చెప్పారు.

**2.2.3. కోకిల:**

ఈ కోకిల ఖండిక కూడా 1916 సెప్టెంబర్ 2వ తేదీన కృష్ణా పత్రికలో ప్రచురితమైంది. దీనితో పాటు ఎడబాటు అనే ఖండిక కూడా ఈ కోకిల ఖండికకు కొనసాగింపుగా కనిపిస్తుంది. ఈ రెండు ఖండికల్లోనూ కోయిల పక్షుల అంత: సంఘర్షణలను వర్ణించినట్లే కోకిల ఖండికలో మావిచిగూరు తిని పాట పాడుకుంటుంన్న కోయిల తన తన్మయత్వాన్ని మన కళ్లకు కట్టినట్లు వర్ణించారు కవులు. ఒక బోయవాడు ఆ కోయిలను మెడ విరిచి తన సంచిలో వేసుకుంటాడు ఆ కిరాతకుడు. కిరాతకుడు కోయిలను కొట్టేటప్పుడు కోయిల ఏ స్థితిలో ఉంది, కిరాతకుడు ఆ కోయిలను కొట్టడానికి ఎలా ప్రయత్నిస్తున్నాడో ఒక కదులుతున్న దృశ్యంలా ఈ కోకిల ఖండికను వర్ణించారు. ఆ సమయంలో కవులు పడిన తత్తర పాటు కోయిలను ఎలాగైనా రక్షించాలనుకునే ఆకాంక్ష బోయవాణ్ణి కొట్టకుండా నిలువరిస్తే బాగున్ననే మానవతా ఆలోచన ఎంతో ప్రత్యేకతను కలిగి ఉంది. ఒకదాన్ని ఒకటి తోసుకుంటూ ముందుకు వచ్చిన ఆలోచనల్లా అనిపిస్తుంది ఈ కోకిల ఖండిక. ఈ రెండు భాగాలుగా ఉంది.

మొదటి భాగంలో తన్మయత్వంతో పాడుకుంటున్న కోయిలను బోయవాడు బాణంతో కొట్టడం, రెండో భాగంలో బోయవాడి విధిని చర్చిస్తూ నే దైవాన్ని ప్రశ్నిస్తాడు. ఇంత హింస చేసే విధిని నీకు ఆ దేవుడు ఎలా కలిగించాడని బాధపడతారు. పక్షులను కొట్టి తినడం బోయవాని వృత్తి అని తెలిసిన ఆ పక్షి చనిపోయెటప్పుడు ఆ కిరాతకుణ్ణి దీనదృష్టితో చూసిన టువంటి ఆ సన్నివేశాన్ని గుర్తు చేసుకొని ఆ పక్షిని చంపకుండా వదిలి వేయవచ్చు కదా అని బాధపడతాడు కవి. అంతేకాకుండా భారతదేశంలో పశ్చిమ రాష్ట్రాలలో తిరుగుతున్న హిందువుల వీరుల గొప్పతనాన్ని ప్రశంసిస్తూ ఆ కిరాతకుణ్ణి కూడా వాళ్ళతో చేరో ఆ యుద్ధరంగంలో పాల్గొని వీరుడవు అనిపించుకోవచునని ఆ బోయవాడిని ఉద్దేశించి పలుకుతారు కవులు. కోకిల ఖండిక కరుణరసభరితంగా కొనసాగింది. కోయిల తన్మయత్వంతో పాడుతున్న దృశ్యాన్ని వర్ణిస్తూ....

***''వెన్నకన్నను మృదువగు క్రొన్న నలను***
***మెక్కి కొమ్మావిగున్నపై నెక్కి పంచ***
***మస్వరంబున, నవ్యక్తమధుర గాన***
***మును బొనర్చెదు, కోకిలా! వెనుక దిరిగి***
***చేరువనెయున్న హాని వీక్షింపవేమి''*** (తొలకరి కావ్యం:15) అని కోయిల

స్వేచ్ఛగా, ఆనందంతో హాయిగా జీవిస్తున్న స్థితిని వర్ణిస్తారు అలాంటి స్వేచ్ఛను ఓర్చలేని లేదా

పక్షులను చంపుకుని తినే తన ప్రవృత్తి ప్రకారం బోయవాడు ఆ పక్షిని చంపాలనుకొనే ఆలోచనను వర్ణిస్తూ

*“వింటిబద్దను జేగొని, కంటిరెప్ప*
*వాల్చకుండగ, దృష్టి నీపైని నిలిపి*
*పొంచియున్న కిరాతు వీక్షించవేమి?*
*తొంగిచూచెడి యాకంట దుమ్ముచల్లి*
*యెగిరిపోవేమి? యెత్తినదెత్తినట్టు*
*వింటిబద్దను గ్రింద దింపింపవేమి”* (తొలకరి కావ్యం:15)అని స్వేచ్ఛ కోసం తన ప్రాణానైనా వదిలివేయడానికి సిద్ధపడినట్లు ఉన్న కోయిల స్థితిని వర్ణిస్తూ...

*“ బోయని దురాశ నట్టేట ముంచిన లేమి?*
*గానలోలత్వమున బ్రాణమైన విడువ*
*దలతువాయేమి? గాన ప్రియులకు దేశ*
*కాలములు లేని మాట నిక్కమ్ము నేసి ”*

(తొలకరి కావ్యం:15)

కోయిల స్వేచ్ఛగా గానాన్ని ఆలపించే వాళ్ళు ఒక దేశం, ఒక కాలం అని మాత్రమే చెప్పనక్కరలేకుండా ప్రపంచ వ్యాప్తంగా తమ స్వేచ్ఛ కోసం ప్రాణాలను వదిలివేయడం నిజం. అలాగే నీవు కూడా చేస్తున్నావా అని కోయిలను ఉద్దేశించి పలుకుతారు కవులు. ఇక్కడ జాగ్రత్తగా ఆలోచిస్తే 1916 సంవత్సరంలో ప్రచురితమైనది. అప్పటికి భారతదేశ వ్యాప్తంగా రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని వ్యతిరేకిస్తూ భారతీయులు పోరాటం చేస్తున్న స్థితి ఏ దేశంపైన దాడి చేయకుండా తాను సుఖ సంతోషాలతో, ఆనందంతో, తన్మయత్వంతో జీవిస్తున్న భారతీయులను బ్రిటిష్ వాళ్ళు లేదా విదేశీ పాలకులు హింసిస్తూ రాజ్యాలను పరిపాలిస్తున్నారు. ముఖ్యంగా క్రైస్తవాన్ని వ్యాపింపజేస్తూ హిందువులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీన్ని ధ్వనింపజేస్తున్నట్లుగా ఈ ఖండిక కనిపిస్తుంది. కోయిల తన్మయత్వంగాను, భారతీయుల జీవన విధానాన్ని, బోయవాని చేష్టలు పరదేశీయుల పాలనా విధానాలను పరోక్షంగా స్ఫురింపజేస్తున్నారని అనిపిస్తుంది. అందుకనే ఇలా వర్ణిస్తూ...

*“బాహుబలమును బుద్ధి వైభవము నున్న*
*గత్తి చేబూని యుద్ధరంగమున కురికి*
*స్వామిభక్తిపరాయణత్వమున గంఠ*
*రక్తధారల బశ్చిమరాష్ట్రములను*
*దడవుచున్నట్టి వీర హైందవుల జేరి*
*నీదు శక్తిని బ్రకటింపరాదె? యపుడు*
*దీనసంరక్షణార్థమై దిగితివంచు,*

*సల్పుదును బద్యకుసుమపూజలను నీకు"* (తొలకరి కావ్యం:18) అని వర్ణించారు ఈ కవులు. స్వాతంత్ర్య సంగ్రామంలో అశువులు బారిన వీరులను దృష్టిలో పెట్టుకొని ఈ ఖండికను రాసినట్లు అనిపిస్తుంది. నాయకులు తమ జాతీయోద్యమాన్ని స్వాతంత్ర్య స్వరాన్ని ఆలపిస్తూ ప్రాణం పోయినా తమ జాతీయోద్యమ లక్ష్యాన్ని వీడని స్థితిని దాన్ని వమ్ము చేస్తున్న బ్రిటిష్ పాలకుల దుర్మార్గాల్ని స్ఫురించినట్లుగా

*"ఒందు చింతలు దక్కుము, మొండి ధైర్య*
*మును వహింపకు, నావాక్యములను నమ్మి*
*వేరు చోటికి బొమ్ము, జీవించియున్న*
*రేపు నీ గానమహిమంబు సూపవచ్చు.*
*చూడగాజాల నీవిట బాడువింటి*
*దెబ్బ తిని క్రింది బడగ నీయబ్బి చెట్టు*
*కడకు బరుగునవచ్చి నిన్నొడిసిపట్టి*
*మెడవిరిచి సంచిలో గ్రుక్కి నడుచుచుండ"* అంతేకాకుండా

*"ఏమి యెఱుగని పక్షుల హింసచేయ*
*నెట్లు పాలించు నిన్ను సర్వేశ్వరుండు*
*హాయిగొల్పుచు గర్ధరసాయనముగ*
*బాడుచున్నది వినుము, నీబండచెవికి*
*శూలములవలె నాటినచో మరొక్క*
*యెడకు బోరాదె ? నీకంట నెట్లు పడెను*
*రా దురాత్మక! యీ పక్షిరాజ మిపుడు*
*దిక్కు లేనట్టివారికి దిక్కు దేవు*
*డనెడి వాక్యము సత్యమే యైన యెడల*
*బరభృతంబది నీచేతబడక మున్నె*
*భూత నిర్మాణకర్తయే ప్రోచు దాని"*(తొలకరి కావ్యం:18) అనడం ద్వారా భగవంతుని చర్యలను స్మరించుకుంటూనే అమాయకంగా దుర్మార్గుడైన కిరాతకుని చేతిలో పడిపోయి చనిపోతున్న పక్షి రాజును (కోయిల) రక్షించేవాళ్ళు ఎవరో వస్తారని దిక్కు లేనివారికి దేవుడే దిక్కు అని నమ్ముతున్నామని ప్రకటించారు కవులు. ఇక్కడ బ్రిటిష్ పాలన దుర్మార్గాలు ఆ సమయంలో ప్రజల ఆలోచనలు పరోక్షంగా స్ఫురిస్తున్నాయని *"1916 సంవత్సరంలో మహారాష్ట్రలో బాలగంగాధర తిలక్ హోమ్ రూల్ ఉద్యమం నడుపుతున్న రోజులవి. అంటే తిలక్ పింగళివారికి అభిమానం మెండు. దీన్ని బట్టి కూడా ఇది పింగళివారి రచన అని ఊహించవచ్చు"* అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము,

2013:369) తెలిపారు. దీన్ని బట్టి భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న వారి పట్ల దేశభక్తిని ప్రదర్శించారని తెలుస్తుంది.

**2.2.4. సంక్రాంతి:**

తెలుగు పండుగలలో సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. సంక్రాంతి పండుగ రోజున సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అందుకనే దీన్ని మకర సంక్రమణం అంటారు. ఈ పండుగ మూడు రోజులు పాటు జరుగుతుంది. మొదటి రోజు భోగి, రెండో రోజు మకర సంక్రాంతి, మూడో రోజు కనుమ.

ఈ సంక్రాంతి పండుగను హిందువులు ఉత్తర భారతదేశంలో 'మాఘీ' అనీ, మధ్య భారతదేశంలో 'సుకరాత్' అనీ, అస్సాంలో 'మాఘీ బిహు' అనీ తమిళ రాష్ట్రంలో 'పొంగల్' అనీ, తెలుగు ప్రాంతాలలో 'మకర సంక్రాంతి' అని వివిధ పేర్లతో పిలుస్తారు. ఈ సంక్రాంతిలో 'సం' అనగా 'మిక్కిలి' అనీ క్రాంతి అనగా 'అభ్యుదయాన్ని లేదా ప్రగతిని' ఇచ్చే క్రాంతి. కనుక దీన్ని సంక్రాంతిగా పిలుస్తారని శాస్త్రాలు చెబుతున్నాయి.

మకర సంక్రమణము నుండి ఉత్తరాయణ పుణ్యకాలము ప్రారంభము అవుతుంది. ఆ తరువాత కుంభ, మీన, మేష,వృషభ, మిథున రాశులలో కొనసాగినంత కాలము ఉత్తరాయణం. అంటే, నియమానుసారం ప్రతి ఏడాది డిసెంబర్ 22 తేదీ నుంచి ఉత్తరాయణం ప్రారంభం అవుతుంది. ఈ పుణ్య కాలంలో మరణించిన వారు స్వర్గానికి, వైకుంఠానికి వెళ్తారని హిందువులు ఎంతో విశ్వాసాన్ని వ్యక్తం చేస్తారు. అందుకనే మహాభారతంలో స్వచ్ఛంద మరణం పొందిన 'భీష్ముడు' ఉత్తరాయణ పుణ్యకాలం వరకు ఆగి ఈ సంక్రాంతి పండుగ రోజున మాఘశుద్ధ ఏకాదశి రోజున మరణిస్తాడని మహాభారతంలో ఒక కథనం ఉంది. అలాగే 'గోదాదేవి' కూడా గోపికలతో కలిసి శ్రీకృష్ణుణ్ణి ఆరాధిస్తూ ధనుర్మాసం పూర్తి కాలం పాటు ఎంతో నియమం నిష్ఠలతో పవిత్రంగా వ్రతం చేస్తుంది. చివరికి మకర సంక్రాంతి రోజు శ్రీమహావిష్ణువును వివాహం చేసుకుటుంది. భగీరథుడు 'గంగను' భూలోకానికి తీసుకొచ్చి సముద్రాలకు శాపం విమోచనం చేశాడని శాస్త్రాలు చెబుతున్నాయి. మకర సంక్రాంతి అంటే పాతవి పోయి, కొత్తదనానికి స్వాగతం పలికే రోజనే అర్థం ఉంది. ఈ విధంగా మకర సంక్రాంతికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని తెలుస్తోంది.

తెలుగు పండుగలలో సంక్రాంతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఇది ప్రతి ఏడాది జనవరి 14,15,16 తేదీల్లో జరుపుకుంటారు. సంక్రాంతి గురించి అనేకమంది కవులు అనేక రకాలుగా వర్ణించారు. వీరిలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు 'సంక్రాంతి' అనే శీర్షికతో ఒక ఖండకావ్యాన్ని రాశారు. సాధారణంగా పింగళి లక్ష్మీకాంతం అనగానే సాహిత్య చరిత్ర, పరిశోధన, విమర్శ గ్రంథాలే గుర్తుకొస్తాయి. కానీ ఈయన సంక్రాంతి గురించి కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. చిత్రమేమిటంటే తేటగీతి మాలికలో ఈ సంక్రాంతి ఖండకావ్యం

కొనసాగుతుంది. సంక్రాంతి సమయంలో సూర్యుడు తన ప్రచండ వేడిని తగ్గించడం, చలిగాలి ఉండటం, పంటలు బాగా పండి వాటిని ఇంటికి తెచ్చుకోవడం వంటి వాటిని వర్ణిస్తూ ...

*"దినకరుఁడు శాంతుఁడై తోఁచె దినము లింత*
*కుఱుచలయ్యెను జలిగాలి చుఱుకు హెచ్చెఁ*
*బొలములన్ రేల గ్రుడ్డివెన్నెలలలోనఁ*
*గుప్పలన్ నూర్చు కాపులు గొంతులెత్తి*
*పదములన్ బాడఁదొడఁగిరి, పచ్చపూల*
*జనుపచేలకు ముత్యాల సరులగూర్చి*
*మిరపపండ్లకుఁగుంకుమ మెరుపుఁదార్చి*
*బంతిపూవుల మొగములల్లంత విచ్చి*
*మనగృహమ్ముల ధాన్యసంపదల నిల్పి*
*సరసమధురమ్ము పుష్యమాసమ్ము వచ్చె"* (తొలకరి కావ్యం:19) అని దీనిలో

ప్రకృతి సోయగాన్ని పంటలు పండి ఇండ్లకు తీసుకురావడాన్ని అత్యంత సహజంగా వర్ణించారు. 'జనుపచేలకు ముత్యాల సరులగూర్చి, మిరపపండ్లకుఁగుంకుమ మెరుపు దార్చి' అనడంలో ఆయన భావుకత అత్యద్భుతంగా కనిపిస్తుంది. బాగా పండిన మెరుపు పండ్లు దూరం నుంచి చూడటానికి కుంకుమ చల్లించినట్లు ఉంటుంది. దాన్ని ఆయన కుంకుమ మెరుపు దాల్చి అని వర్ణించారు. ఈ వర్ణన చక్కని భావ చిత్రంలా అనిపిస్తుంది.

అంతేకాకుండా ఆనాటి గ్రామీణ వాతావరణం పైరు పంటలు, స్థితిగతులు మనకు కళ్ళముందు కనిపించినట్లుగా వర్ణించారు. ఇటువంటి పంటలు వచ్చినప్పుడు జరిగే సంక్రాంతి పండుగ తొలి రోజును బొగి అంటారు. అప్పటికే పదిహేను రోజుల ముందు నుంచే హరిదాసులు కీర్తనలు పాడుకుంటూ ఇంటింటికి వస్తారు. కేవలం హరిదాసులు వస్తారని చెప్పితే పెద్దగా ప్రత్యేకత కనిపించదు కానీ వాళ్ళంత పవిత్రంగా వస్తారో వర్ణిస్తూ ఇలా వర్ణించారు కవులు.

*" కోడితో మేలుకొని తానమాడి నుదుటఁ*
*దిరుమణియుఁ దిరుచూర్ణముఁ దీర్చిదిద్ది*
*యొక్క కేలను దుంబుఱ, నొక్క కేలఁ*
*జఱుతలం బూని నున్నని శిరమ్ము పైని*
*తొలఁగకుండ నక్షయపాత్ర నిలిపి, మేలు*
*కొలుపులంబాడి వీథి వీథులను దిరిగి*
*యనుపదమ్మును 'రంగరంగా' యటంచుఁ*
*గడప గడపకు నేల భిక్షమ్ముఁ గొనుచుఁ*
*జేరవచ్చును సాతానిజియ్య రడుగొ "* (తొలకరి కావ్యం:20) అని వర్ణించడంలో

అంటే కోడి కూసింది వెంటనే తొలి జామునే లేచి స్నానం చేసి తిరుమణి, తిరుచూర్ణం పెట్టుకుని

ఒకచేత్తో తుంబుర ఒకచేత్తో చిరుతలు పట్టుకుని 'రంగరంగా హరిలో రంగా హరి' అని అనుకుంటూ వీధివీదులు తిరుగుతూ ఉంటారు. చిత్రమేమిటంటే తల మీద హరిదాసు ఒక అక్షయపాత్రను పెట్టుకుంటారు. దాన్ని పెట్టుకోకుండానే ఒంగి భిక్షం అందులో వేయడానికి అనుకూలంగా ఒంగి లేవడం హరిదాసుల నైపుణ్యాన్ని తెలియజేస్తుంది. దాన్ని కవులు వర్ణిస్తూ నున్నని శిరపైని తొనగకుండా అక్షయపాత్ర ను నిలిపి పాటలు పాడుకుంటూ వస్తాడు. ఇక్కడ కూడా కవులు హరిదాసులను ముస్ముందు ఉంచినట్లు పెట్టారు కవులు.

### 2.2.4.1. గంగిరెద్దుల వాళ్ళు:

సంక్రాంతికి హరిదాసులతో పాటు గంగిరెద్దుల వాళ్ళు కూడా బిక్షాటన కోసం వస్తారు. ఆ గంగిరెద్దులను అందంగా ఆకర్షణీయంగా అలంకరించి గంగిరెద్దుల వాళ్ళు కూడా అలంకరించుకుంటారు.

గంగిరెద్దుల వాళ్ళు గంగిరెద్దుల చేత ఆటలాడిస్తారు. గంగిరెద్దుల వాళ్ళని చూడటానికి పిల్లలు, పెద్దలందరు వస్తారు. అంతేకాకుండా ఆ గంగిరెద్దులతో వివిధ ఆటలు ఆడిస్తారు. భిక్షం వేసిన వాళ్ళని గంగిరెద్దులతో దీవించే లాగా గంగిరెద్దుల వాళ్ళు ఆ గంగిరెద్దులకు ఆజ్ఞలను ఇస్తుంటారు. కొన్నిసార్లు శిరము మీద గంగిరెద్దులతో కాలు పెట్టి దీవించేలా చేస్తుంటారు. అటువంటప్పుడు ఆ గంగిరెద్దులు పొరపాటున ప్రజలను ఇబ్బంది పెట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటారు. దీన్ని కవులు 'పింగళి–కాటూరి'గార్లు ఎంతో జాగ్రత్తగా పరిశీలినతో ఇలా వర్ణించారు.

*"తమ్ముడా రొమ్ము గంగెద్దు దాసు డదుగో*
*వెండిబిళ్ళల మొలత్రాడు దండక డెము*
*ముక్కునన్ బైడికాడయు మోమునందు*
*బంగనామమ్ములును, వెంట గంగిరెద్దు*
*చేత మునికోల తన పేరు సెప్పుచుండ*
*పూరి నడువీథి నాడుచునుండె రమ్ము*

*డోళ్ళ చప్పుళ్ళు, మంగిలికోళ్ళపాట*
*లదర శ్రీ రామునకును సీతమ్మ నిచ్చి*
*పెండ్లి గావించుచుండె నా వేడ్క జూచి,*
*కానుకల నిచ్చి వృత్తము కదలిరమ్ము*
*"బసవనా! పాలుత్రావెదో? ప్రత్తి విత్తు*
*లే తినెదొ? " యంచు నడిగి గంగిరెద్దు చేత*
*దలనుద్రిప్పించు వింత చూత మటురమ్ము"* (తొలకరి కావ్యం:20,21) అని ఇక్కడ అలంకరణలను వర్ణించడం తో పాటు వాళ్ళ పేరు చెప్పి దీవించేటప్పుడు గంగిరెద్దులు తల ఊపి ఊపడం దానికి సంతోషపడే అతనికి కానుకలు ఇవ్వడాన్ని చక్కగా వర్ణించారు కవులు.

### 2.2.4.2. కొత్త పెండ్లి కొడుకు మర్యాద:

తెలుగు పండుగలలో సంక్రాంతికి పండుగకు కొత్త అల్లుడిని అత్తవారింటికి తీసుకురావడం అల్లుడికి తగిన మర్యాదలు చేయడం సంప్రదాయ పరంగా కొనసాగుతుంది. పెండ్లి అయిన తొలి ఏడాదిలో వచ్చే సంక్రాంతికి అల్లుడని అత్తవారింటికి పిలుస్తారు. అతనికి కొత్త బట్టలు పెడతారు. కొత్తకొత్త పిండి వంటలు వండి పెడతారు. మరదళ్లు ఉంటే భావతో సరదాగా ఆటలాడుతారు. సాధారణంగా ఈ సంప్రదాయం తెలుగు ప్రాంతాలలో కోస్తాంధ్రలో ఎక్కువగా ఉంటుంది. తెలంగాణలో (ప్రస్తుత తెలంగాణ రాష్ట్రం) 'దసరా' పండుగ సందర్భంలో ఈ రకంగా చేస్తారు. ఈ అంశాలను ఎంతో సహజంగా కవులు పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు ఇలా వర్ణించారు.

*"అన్ని పండువులందు ముఖ్య మిది గాని*
*నత్తవారింటి కేగుమో క్రొత్త పెండ్లి*
*కొమరుడా ! యందు నీకు నెక్కుడు సుఖమ్ము*
*ముద్దుమరదలు నీ తోడు ముచ్చలాడు*
*వదిన నీ తోడ మాటికి వరుసలాడు*
*గురవు దీరగ నినుగాంచు తెరువు లేక*

*తలుపు చాటున నిలిచి నీ తరుణి నిన్ను*
*నోరచూపుల జూచి, ఎర్ర తలూచు*
*జిత్తమును, నిన్ను జూచి యా చిగురు బోడి*
*పెట్టజాలని సంతోషభరము చేత*
*నింట మాటికి నటునిటు నేగుచుండి*
*ముగ్ధమోహన కళ్యాణ మూర్తి తోడ*
*సమయమగునెడ నీకు సాక్షాత్కరించు*
*అత్తవారింటి విందులటన్న భార్య*
*వాలుజూపకోపులె కాని, వారు పెట్టు*
*పంచభక్ష్యమ్ము లను కొని భ్రాంతి పడకు*
*ఊరివారెల్ల నిను గడు గారవమున*
*మన్ననలు సల్పుదురు నీదు మామకూడ*
*నడుగుదోయికి భృత్యుడై మడుగులొత్తు*
*అత్తవారింటికేగి రావయ్య నీవు"* (తొలకరి కావ్యం:21)

### 2.2.4.3. కోడి పందాలు ఆట:

సాధారణంగా కోడి పందాలు ఆట అనేది సంక్రాంతికి ఆంధ్ర దేశంలో కోస్తాంధ్రలో అన్ని కులాల వాళ్ళు ఆడుతారు. ముఖ్యంగా రాజులు, కాపులు, వెలమలు ఎక్కువగా ఈ కోడి

పందాలు ఆడుతూ ఉంటారు. అయితే పింగళి కాటూరి కవులు వెలమ దొరలను గురించి ప్రత్యేకంగా ప్రస్తావించి, గొర్రె పొట్టేళ్లతో పందాలు, కోడి పందాలు ఈ రెండింటి గురించి ఈ కవులు వర్ణించారు. ఇక్కడ ఒక ఔచిత్యం ఉంది. బొబ్బిలి దొరలు తాండ్ర పాపయ్య, విజయరామరాజు మొదలైన వాళ్ళు కోడి పందాలు ఆటల వలనే వారి రాజ్యాలను పోగొట్టుకుని యుద్ధాలు చేసిన ఒక చారిత్రక నేపథ్యం అంతా గర్తుకొచ్చినట్లుగా ఇక్కడ వర్ణించడం ఈ కవుల రచనా శైలిలోని విశేషం. అయితే ఈ కోడి పందాలు వలన ఇరు వర్గాలకు అప్పులిచ్చి బాగుపడే షావుకార్లను కూడా ఈ కవులు నిశిత దృష్టితో వర్ణించారు.

*"వెలమ దొర లార! రండు, మీ పెంచినట్టి*
*గొర్రెపోతుల దెండు , మీ కోడిపుంజు*
*కాలికిన్ గత్తి గట్టి పంతాలు పలికి*
*పౌరుషము చూపరండు పై పందెములకు*
*సంచులు దెండు ఋణమిచ్చు సాహుకారి*
*వెదకబంపుడు వడ్డికై వెరవబోకు*
*డింటిపేరును నిల్పుటయే ఘనమ్ము "* (తొలకరి కావ్యం:22) అని తరువాత ఈ

కోడి పందాల సందర్భంగా ఆ కోడి పుంజులను సంబోధిస్తూ తమతమ యజమానుల కోసం కోడి పందెంలో కోడి ప్రాణాలను విడవవలిసి వస్తుంది. ఒక వేళ పారిపోయి వచ్చిన ఆ కోడిని బ్రతకనివ్వరు.అందువలన ఆ కోడి పందెంలోనే చనిపోవాలి. అలా చనిపోవడాన్ని ఒక వీరత్వంగాను, ఆ సమయంలో చనిపోయినటువంటి వాళ్ళు పుణ్యగతులు చేరుకునే అవకాశం ఉంటుందని అది కూడా ఆ సంక్రాంతి సమయం ఉత్తరాయణం ప్రవేశిస్తుంది కాబట్టి అది ఖచ్చితంగా స్వర్గానికి చేర్చే అవకాశం ఉంటుందంటారు కవులు. దాన్ని ఇలా వర్ణిస్తారు.

*"కుక్కుటమ! నీవు సుకృతివి , కోరి యురిని*
*బెట్టుకొన్నను జూపు లభింపదుత్త*
*రాయణమ్మున నీవు సంక్రాంతి వేళ*
*గుత్తి దెబ్బకు శిరమొగ్గి కదననిహతు*
*లైన వీరులకే భోగ్యమై, తదన్య*
*దుర్లభంబగు దివి జేరుదువుగదన్న "* (తొలకరి కావ్యం:22) అని అంటూ

కోడి పందాల సందర్భంలోనే వెలమ దొరల శౌర్యాన్ని మరోసారి గుర్తు చేశారు కవులు. ఈ సందర్భంగా తెలుగు వెలమ దొరల శౌర్యం గురించి ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ విధంగా తెలుగు వారి ఒక పండుగలలో సంక్రాంతికి ఒక ప్రాముఖ్యాన్ని చారిత్రక ప్రాధాన్యాన్ని వర్ణించడం ఈ సంక్రాంతి ఖండ కావ్యంలో కనిపించే ఒక గొప్ప విశేషం. దీన్ని

*"విధి వశమ్మున మా తెల్గు వెలమ దొరల*
*శౌర్యములు వచ్చిడాగె ద్వచ్ఛరణబద్ధ*

*ఖడ్గపుత్రికయం , దీపు గడన చేసి*

*పంచి పెట్టుము యశము నిన్నెంచినట్టి*
*దొరలకున్ గుక్కుటపురేడు మరచినాడ*
*నెరుగుదువొ లేదొ? కంఠమున్ దరుగునట్టి*
*కత్తి కాలికి గలదంచు, నెత్తురట్లు*
*వరదలై పారుచున్నను వ్రాలిపోక*
*మెడను రిక్కించి రివ్వున మీదికెగిరి*
*కంఠమున దుదియారుపు గలుగుదాక*
*బోరి మడసెద వో కోడిపుంజుతేడ !"* (తొలకరి కావ్యం:23) అని దీనిలో వెలమ దొరలు శౌర్యంతో చేసిన యుద్ధాలతో, చరిత్రలతో ఈ కోడి పందాలు వర్ణన చేయడం ప్రత్యేకంగా కనిపిస్తుంది.

### 2.2.4.4. పల్లెల్లో ఆనంద పారవశ్యం:

పండుగలు అన్ని కుటుంబాలను లేదా కుటుంబాల్లోని అందర్నీ కలపడానికి ఉపయోగపడే సందర్భంగా కొనసాగుతూ ఉంటాయి. సంక్రాంతి కూడా అలాంటి ఆనందాన్నే కలిగిస్తుంది. చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లిన వాళ్ళు, వ్యాపారం కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లిన వాళ్ళంతా తమ కుటుంబ సంబంధాల్ని గుర్తు చేసుకుంటూ, వారి వారికి తగినట్టుగా చిన్న పిల్లలకు బొమ్మలు, ఆడపిల్లలకు గాజులు, కొత్త బట్టలు మొదలైనవి ఒకరినొకరు ఇచ్చుకుంటూ సంతోషంతో గడపాల్సిన పండుగ సంక్రాంతి పండుగను అభివర్ణించారు కవులు. ఇటువంటి సందర్భారను వర్ణిస్తూ...

*"పత్తనమ్మున జదివెడి బాలకుండ!*
*పొత్తమున, కొయ్యవారికి , బెత్తమునకు*
*సలుపుదాస్యమ్మునుండి మోక్షమ్మునంది*
*చిన్ని చెల్లెలికన్ వన్నెవన్నెగాజు*
*బొమ్మలన్ గొని మీ గ్రామమునకు బొమ్మ*
*చిన్ని చెల్లెలి ముచ్చటచెయిదములును*
*నాటలాడగ నిను బిల్చునట్టి తమ్ము*
*గుర్రవిసివింపులును పూరి మర్రినీడ*
*జరుగు లోకవార్తాప్రశంసలును, వేచి*
*యుండె నానందవనధి నిన్నో లలార్ప*
*దేజమెడలిన నీకు సందీప్తి నొసగి*
*బుద్ధికి వికాస ముత్సాహమును ఘటింప*
*దనివితీరంగ నచట స్వాతంత్ర్యవాయు*

*వులను బీల్చుము వీపొలమ్ములను దిరిగి*

*చీకునుం జింత దిగ్రావి చిన్న వాడి*

*జననియును, జన్మభూమియు స్వర్గసుఖము*

*గ్రిందువడ జేయు నన వినుచూందువుగద*

*బాలుడా! చూచిరమ్ము మీ పల్లెటూరు"* (తొలకరి కావ్యం:24) దీనిలో బాలుని ప్రత్యక్షంగా సంబోధిస్తున్నట్లుగా వర్ణించడం ఇక్కడ గమనార్హం.

### 2.2.4.5. బ్రాహ్మణులకు దానాలు:

సంక్రాంతి పండుగకు ఒక ప్రత్యేకత ఉంటుంది. చనిపోయిన వారికి భోజనాలు పెట్టడం, వాళ్ళను గుర్తుకు చేసుకొని దానాలు ఇవ్వడం సంక్రాంతి పండుగలోనే కనిపించే ఒక విశేషం. దీన్ని పెద్దలకు భోజనాలు పెట్టడం అంటారు. ఆ సందర్భంగా బ్రాహ్మణులకు గుమ్మడి కాయ, బియ్యం, నెయ్యి తదితరులు ఇవ్వడం అనేది సంప్రదాయంగా వస్తోంది. అంతేకాకుండా సంక్రాంతి పండుగ మూడో రోజున దాన్ని పెద్ద పండుగ, ముక్కనుమని పిలుస్తారు. ఇంటిలో నుంచి వీధి వాకిలి వరకు ముగ్గులరథాలు, రథాల ముగ్గులను పెడుతూ ఉంటారు. త్రిశంఖుని బైటకు ఈడ్చినట్లు భావిస్తారు. సంక్రాంతి మూడు రోజులు రకరకాల రథాల ముగ్గులు, గొబ్బెమ్మలు పెట్టుకోవడం తెలుగు పల్లెటూర్ల సంప్రదాయం. దీన్ని కూడా పింగళి కాటూరి కవులు చాలా చక్కగా రాశారు.

*"బ్రహ్మణుఁడ! రొమ్ము మకర సంక్రమణ పుణ్య*

*కాలకూష్మాండదానముల్ గైకొనంగ*

*నుంతచెప్పు మీయేఁడ సంక్రాంతి పురుషు*

*డెక్కి వచ్చెడి వాహన మేది? పుణ్య*

*గేహినీ! పెద్ద రథ మును  వాహనములు*

*ముంగిటనుముగ్గిడుము, వేగుమున్న మీరు*

*కన్నెముత్తైదువలు మేలుకనుఁడు, నేఁడు,*

*తలలనంటుకొనుండు, క్రొత్తలుగ వేష*

*ములను గైసేసికొనుడు, బొమ్మల కలంక*

*రించి పులగమ్ము వే నివేదించి మ్రొక్కి*

*కడుపునిండఁగఁ దిని యంత కలకలమని*

*నిలచియుండుఁడు మీదు వాకిళులయందు*

*వచ్చునీదారి బలిచక్రవర్తి నేఁడు*

*వరముల నొసంగ మీకు నవ్వారిగాక"* (తొలకరి కావ్యం:24) అని ఈ విధంగా తెలుగు వారు చేసుకునే అతి పెద్ద పండుగలలో సంక్రాంతి నుండి పల్లె టూర్లు విశేషంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఒకరింటికి మరొకరు పేరంటాలుగా వెళ్లడం, పూజా

కార్యక్రమాల్లో పాల్గొనడం చిన్న పిల్లలు,యువతులు కొత్త బట్టలు, కొత్తజడలు ప్రత్యేకంగా అలంకరించడం, కాళ్లకు పారాణి పెట్టుకోవడం, ప్రతి స్త్రీ ఒక లక్ష్మీదేవిలా కళకళలాడుతూ ఉంటుంది. ప్రతి స్త్రీలోను సంక్రాంతి లక్ష్మి ప్రతిబింబించినట్లు ఉంటుంది. అందుకనే ఓ సంక్రాంతి పౌష్య లక్ష్మి నువ్వు మా ఇంటికి రమ్మని ప్రతి ఒక్కరు ఆహ్వానిస్తుంటారు. అని సుఖ సంతోషాలతో వెల్లివిరిసె శుభకరమైన ముగింపుతో

*"రండు ! మా యింటి కీరు పేరంటమునకు*
*బొమ్మ లెత్తును మా పిల్ల యమ్మలార!*
*ముద్దు చేమంతిపూలు ముడిచినట్టి*
*జడలతో గ్రొత్తపల్లెతో నడుగులంబడి*
*చిందులంద్రొక్కు పరికిణీ చెలువు తోడఁ*
*గాళ్ళఁబారాణి కాటుక గన్నుఁగవను*
*దిద్దికొని మురిపెమ్మును ముద్దుదొలఁక*
*నగుమొగమ్ములతోడఁ గన్యకలు నీకు*
*నర్చలొసఁగగ నిలిచి రీ పరుగునపుడు*
*వచ్చిపోవమ్మ! మాయింటిపజ్జ కీవు*
*పరమకళ్యాణి! మాతల్లి! పౌష్య లక్ష్మి! "* (తొలకరి కావ్యం:25)అని ముగించారు.

మన భారతీయ సంప్రదాయంలో శుభంతో ప్రారంభించి, శుభంతో ముగించడం వలన మన కవులు పాటించే కావ్య సంప్రదాయం. అందుకని ఈ కవులు *'సంక్రాంతి"* అనే ఖండకావ్యంలో *"దినకరుండు శాంతుఁడై తోచె దినము లింత"* అనీ సూర్యుడు శాంతమూర్తితో ఉన్నాడని ప్రారంభించి ముగింపులో *"పరమకళ్యాణి! మాతల్లి! పౌష్య లక్ష్మి!"* అని శుభకరంగానే ముగించడం ఈ ఖండ కావ్యంలో కనిపించే గొప్ప విశేషం. ఈ ఖండకావ్యాన్ని చదువుతూ ఉంటే తెలుగు పల్లెల్లో జరుపుకునే 'సంక్రాంతి' కాంతులు మన కళ్ళల్లో కనిపిస్తాయి.

### 2.2.5. జొన్న చేను:

జొన్న చేను కవితా ఖండికను పింగళి కాటూరి కవులు జంటగా రాసిన కవిత్వంగా తొలకరి ఖండకావ్య సంపుటిలో ప్రచురించారు. అయితే *"ఈ ఖండిక గ్రామీణ జీవితంలో ఒక రమణీయ సన్నివేశం చిత్రింపబడింది. దీన్ని కాటూరి వారు రాసి ఉంటారని పింగళి లక్ష్మీకాంతం గారి చరిత్రలో ఉన్నట్లు గూడూరి నమశ్శివాయగారి అభిప్రాయాల్ని వ్యక్తంచేశారని ఈ విషయం చూసిన శైలి చూసిన ఇది కాటూరి వారిదేననిపిస్తుంది. దీంట్లో ఒక సున్నితమైన శృంగార భావన ఉన్నది. ఈ జొన్న చేను నా కవితా కృష్ణ లోని పెసరచేనుకు ప్రేరణ"* అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్యసమాలోచనము,2013:382) తెలియజేశారు. అయినప్పటికీ జొన్న చేను ఇరువురి జంట కవిత్వంగా పేర్కొనడం వలన ఇక్కడ కొద్దిగా వివరిస్తాను. జొన్న చేను ఖండిక మృదుమధురంగా, శృంగార భరితంగా ఉంది. భావకవిత్వంలో

ప్రణయ కవిత్వం ఒక భాగం. కాబట్టి ఇది భావ కవిత్వ శాఖకు చెందినది అవుతుందని తెలుస్తోంది. సాధారణంగా జొన్నచేల్లో వాటిని తినడానికి వచ్చే పిట్టలను తోలడానికి మంచెలు ఏర్పాటు చేస్తారు. దానిపై కూర్చోనే విధంగా, నిల్చోనే విధంగా నిర్మిస్తారు. జొన్న చేనులకు పిట్టలు రాకుండా కావలి కాసేవాళ్ళు మంచెల పైకి ఎక్కి వడిసెలతో ఆ పిట్టలను బెదిరిస్తూ జొన్న కంకులను తినకుండా కాపాడుతుంటారు. ఆ విధంగా మంచెలపై కూర్చొని ఒక యువకుడు పిట్టలను తోలుతుంటాడు. ఒక యువతి అటుగా వస్తూ ఓ చిన్నవాడా పిట్టలను తోలడానికి బెండలను విసురుతున్నారు. ఈ చుట్టూ వస్తున్న జనాలను చూసి బెండలను విసురు, అని లేకపోతే అవి అటుగా వచ్చే మనుషులకు తగులుతాయని ఒక యువతి ఆ యువకుడిని హెచ్చరిస్తూ పలకరిస్తుంది. ఆ యువకుడు ఆమె వైపు చూశాడు. వెంటనే నువ్వు నా వైపు చూస్తున్నావు. ఇంతలోనే ఆ గోరువంక జొన్న కంకులను తినేస్తుందని చూడమంటుంది. ఆ మాటల్లో ఒక కవ్వింపు, ఒక కలుపుగోలుతనం తనను దగ్గర చేసుకొనే తానం కనిపిస్తుంది.

*"కంకోవెడలిన యా లేత కారు జొన్న*
*దేనిపై పిట్టలు దోలు చిన్న వాడు!*
*దారిబోయెడు వారల బారజూచి*
*విసరుమా! సుంత వడిసెల వెనుక నదిగో*
*కంకి తినుచున్న యది గొరువంక ఇంత*
*యాలసించిన నిలుచునా? చాలాదూర*
*మెరిగిపోయినదప్పుడే దిగకు మంచె*
*బెడ్డలను నీకు నే దెచ్చి పెట్టుచుంటి "* (తొలకరి కావ్యం:26) అనీ ఆ అమ్మాయి అతణ్ణి పలకరించి గొరింక జొన్న కంకులను తినేస్తుందని చెప్పి నీ దగ్గర వడిసెలో రాళ్లు అయిపోయాయి కనుక వాటిని నేను (యువతి) తెచ్చిస్తానని అంటుంది. ఆ తరువాత మీ జొన్న చేనులో గడ్డి ఎక్కువగా ఉందనీ, మీ గిత్తలకు గడ్డిని వేయడం లేదని, కానీ మాకున్న ఆవుకు గడ్డి సరిపోవడం లేదని, కొంచెం గడ్డిని మీ జొన్న చేనులో కోసుకుంటానని ఆ యువతి అంటుంది. దాన్ని ఎంతో లౌక్యంగా వర్ణిస్తూ...

*" ఒత్తుగా బట్టె గడ్డి మీ గిత్తల కిది*
*మేపరాయేమి? మాయవు రేపు మాపు*
*మొన్నమొన్న టిదనుక దా నన్ని యన్ని*
*పాలనిచ్చెడి దైదుదినాల నుండి*
*దూడకే చాలకున్న , వీ యేదు గడ్డి*
*బొత్తుగా బట్ట లేదు మా పొలము గట్ల*
*నాల్గుకు పెళ్ళ చాలను నాకు బిట్ట*
*వ్రాలినట్లుండె మాతోటపైన సుంత*

*తోలుమా నాల్గు గుప్పెళ్ళు చాలు నాకు*

*ఆసమై నొకతట్టెడు కోసిమాత్ర*

*మేమి సేయుదు బిట్ట పోయినద? లేద? "* (తొలకరి కావ్యం:26) అని తనకు కొద్దిగా గడ్డి చాలునని ఒకవేళ గడ్డి ఎక్కువగా ఉన్న మీకు చాలునని అంటుంది. శెనగపువ్వు రంగు రవిక తొడిగిన ఓ చిన్నదానా అని చెప్పి మా చేను చివరిలో మూలలో ఒక చిలుక వాలింది. ఎంత తోలిన పోవడం లేదు ఏమి చెయ్యాలని అడుగుతాడు యువకుడు. అంతేకాదు ఈ ఏడాది మెరప కాయలు, వంకాయలు, బంతిపూవులు అన్నీ కూడా బాగా పండినాయి. ఆ ప్రక్కనే దోస తీగలు కూడా ఉన్నాయి. వాటికి కాయలు ఉన్నాయెమో చూడు నేను (యువకుడు) జొన్న కంకెలను తెస్తాను. మా చేనులో చితుకులు (కట్టెలు) ఉంటాయి వాటిని ఎరుకురా కంకులను కాల్చుకు తిందామని యువతితో అంటాడు. పచ్చి జొన్నలు కాల్చకుండా తింటే ఎంతో తియ్యగా ఉంటాయి. కాల్చితే ఆ తీపి పోతుంది. అదేంటి అప్పుడే తట్టను ఎత్తుకొని వెళ్ళిపోవడానికి సిద్ధమౌతున్నావని యువతిని అడుగుతాడు. దానికి ఆమె మా ఆవు ఇంటి దారి పట్టింది. దానికి కుడితి పెట్టె వేళ అయ్యింది. ఇక నేను వెళ్ళాలి. అది సరేగాని లేత కంకులు తినమని ముదురు కంకులు తెచ్చావేంటి, సరేలే ముదురు కంకులను తింటూ వెళ్ళిపోతానని ఆ యువతి యువకుడితో అంటుంది. అంత తొందర ఏమిటి? అని నేను కూడా వస్తాను. నీకు ఒక దోసపండు కూడా దొరకలేదా. ఇటు వేస్తే నీకు దోసపండు కోసిస్తాను కదా అని ఆమెతో సంభాషణ పెంచుతాడు ఆ యువకుడు. దానితో జొన్న చేను ఖండిక ముగుస్తుంది. దీన్ని ఎంతో రమ్యంగా ముగించారు పింగళి కాటూరి కవులు, ఆమె కొంచెం గడ్డి కోసుకుని తెలివిగా అతనితో మాట్లాడి ఆ గడ్డిని కోసుకుంటుంది. కానీ అతడు కేవలం గడ్డి మాత్రమే కాకుండా తన చేతిలో ఉన్న పూలు, పండ్లు, జొన్న కంకులు మొదలైనవన్నీ ఇచ్చి కాసేపు ఆమె తన దగ్గర ఎక్కువ సమయం గడపాలని కోరుకుంటాడు ఆ యువకుడు. ఇక్కడ యువతి, యువకుల మద్య ఉండే ప్రణయాన్ని ఎంతో రసభరితంగా వర్ణించారు పింగళి, కాటూరి కవులు. ఇలా ప్రకృతిలోని కవితా వస్తువును తీసుకొని కవితాత్మకంగా వర్ణించడంలో ఈ కవులు అద్భుత ప్రతిభను ప్రదర్శించారని అర్థమౌతుంది.

### 2.2.6. ఎడబాటు :

ఎడబాటు ఖండికలో అన్ని వృత్త పద్యాలతో కూడి ఉంది. ఒక కవి ప్రకృతిని చూసి పులకరించిపోయి పాడుకుంటారున్నాడు. అది నిండు పున్నమి రోజు దీన్ని చెబుతూ ఇలా అంటాడు.

*"కలువలసంగడీడు తెలికన్నుల విచ్చి వెలందిపండువె*

*న్నెలలను గ్రుమ్మరింప, నవనీజములన్ డిగి పిల్ల తెమ్మెరల్*

*కొలనిజలంపు డోలికలలో దమిదీరగ నూగుచుండ గం*

*దళితమనస్కుడై ప్రకృతి తత్వము సత్క విపాదుచుండగన్ "* (తొలకరి కావ్యం:29)
అనే పద్యంలో తెల్లని చందమామ వెన్నెలను కుమ్మరించినట్లు ఉంది. ఆ ప్రకృతి అటువంటి స్థితిలో ఉన్న ప్రకృతి తత్త్వాలు కవులు పాడుకుంటున్నారు. ఆ సమయంలో ఒక చక్రవాక పక్షి అతనికి కనిపించింది. అది ప్రియుని యడబాటుతో బాధపడుతోంది. దాన్ని చూసి కవులు ఓ చక్రవాకమా నువ్వు నీ ప్రియురాలి వియోగం వలన పొగిలియదంటి పాటున అంటే ఏడుస్తూఏడుస్తూ ఆ ఇసుక తిన్నెలలో అంటూ,ఇటూ ఒంటరిగా తిరుగుతున్నావు ఎందుకిలా నీ చరిత్ర ప్రవర్తన చాలా విచిత్రంగా కనిపిస్తున్నది. ఏమైంది అని అడుగుతాడు కవి. అయినా నీవు ఒంటరిగా ఎందుకు ఉన్నావు. నీ ప్రియురాలు కనిపించలేదు ఏమైంది అని అడుగుతాడు కవి. బహుశా మీ దంపతులు ఇద్దరు ఆనందంగా ఉంటే ఆ చంద్రుడు సహించలేక చల్లని గాలి మాయమైన మద్యకు రాకుండా ఇసిరేశాడా అని అడుగుతాడు. దీన్ని వర్ణిస్తూ...

*" చూడలేక మీదు సొగసుం జెలికారము చక్రవైరి రే*
*గాడుపుటూదరల్ గొలుపగా వడగొట్టి యెదేని వృక్షపున్*
*నీడను స్రుక్కి, చల్లనగు నీ కయిదండను గొరి, యక్కటా*
*రాడుగదా ప్రియుం డనుచు బ్రాణములన్ బిగబట్టియుండెనో"* (తొలకరి కావ్యం:30)

అంటూ ఆ మగ చక్రవాక పక్షి ఏమి సమాధానం చెప్పలేదు. మళ్ళీ కవులు అడుగుతారు మీ ప్రియురాలి కోసం కంపిస్తున్న ధ్వనితో బాధపడుతున్నావు. బహుశా నిన్ను తలచుకుంటూ కూడా ఆ ఆడ చక్రవాక పక్షి ఎక్కడికో చెదరిపోయి ఉంటుంది. ఆమె కోసం వెతుకు. ఆమె కూడా నిన్ను వెతుకుతూ ఉంటుంది. అని చెప్పి ఎల్ల కాలం ఈ వెన్నెలే ఉండదు. చంద్రుడు అస్తమించి సూర్యుడు వస్తాడు. అప్పుడు మిమ్మల్ని బాధపెట్టిన చంద్రుడు పోయిన తరువాత నీ చెలి నీ కౌగిలిలోకి వస్తుంది. అని అంటూ...

*' కోకమ! తెల్లవాఱదనుకోకుమ, క్రుంకిన భాస్కరుండెటున్*
*రాక నిలండు, చెందొవలరాయడు పోకనిలందు మారు వె*
*న్గాకల గ్రాగినట్టి చెలికౌగిట జొక్కకపోవు మాను మీ*
*శోకము, పోయివచ్చెదము చూతుముగాక మిమున్ సుఖంపడన్"* (తొలకరికావ్యం:30)

అని కవులు అంటారు. ఈ ఎడబాటు ఖండికలో ప్రేయసి, ప్రియురాల మద్య వచ్చె ఎడబాటు వలన కలిగే ఆ మానసిక సంఘర్షణలను వర్ణించడం గొప్ప విశేషంగా కనిపిస్తుంది. సాధారణంగా కావ్యాలలో చక్రవాక పక్షులు ఒక దాన్ని మరొకటి రెప్పపాటు కాలం కూడా విడిగా ఉండలేవు. అటువంటి సమయంలో ఆ చక్రవాక పక్షులు ఆ విరహాన్ని ఒక అగ్నిలా భావిస్తాయని కవులు వర్ణిస్తారు. ఇక్కడ చంద్రుడు చక్రవాకాలకు శత్రువు ఎందుకంటే వారి మద్య మరింత విరహాన్ని పెంచడానికి కారణం అవుతారు. సాధారణంగా భార్య భర్తలు, గానీ ప్రేయసి ప్రియురాలు గానీ కలిసిమెలిసి ఉంటున్న సందర్భంలో కొంత మంది ఆ జంటలను విడగొట్టాలని చూస్తారు. అటువంటప్పుడు ఆ ప్రేయసి, ప్రియులకు కలిగే ఎడబాటు ఎలా ఉంటుందో చక్రవాక పక్షుల

నెపంతో వర్ణించారు కవులు. భావకవిత్వంలో ఉన్న ప్రదాన లక్షణం ప్రకృతిలోని సౌందర్యాన్ని ఆస్వాదించడం , ఆ ప్రకృతితో విడదీయరాని అనుబంధాన్ని జాగ్రత్తగా వర్ణించడం ఈ ఎడబాటు ఖండికలో కూడా భావ కవిత్వ లక్షణం స్పష్టం గా కనిపిస్తుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు కృష్ణపక్షంలో శ్రీకృష్ణుని గురించి రాధ అన్వేషిస్తున్నట్లు అద్భుతమైన ఖండికలు రాశారు. అక్కడ రాధాకృష్ణులను వర్ణించిన పాఠకుల్లో రాధాకృష్ణ లో తమ ప్రణయాన్ని ఊహించుకుంటారు. అలాగే ఇక్కడ కూడా చక్రవాక పక్షుల ఎడబాటును చదువుతున్న పాఠకులు తమ ప్రణయాన్ని ఊహించుకుంటారు కాబట్టి ఈ ఎడబాటు కవితా ఖండిక దేశ కాలాలకు అతీతమైన సర్వ కాలాల్లోను నిలిచిపోదగిన గొప్ప కవిత్వం లక్షణం ఉన్న కవిత.

**2.2.7. అజ్ఞాన కృతము:**

అజ్ఞానకృతమనే ఈ ఖండిక కృష్ణా పత్రికలో 1927 ఆగష్టు లో ప్రచురితమైంది. ఇది పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు జంటగా రాసిన 'తొలకరి' అనే ఖండకావ్య సంపుటిలోనిది. *"దీనిని కాటూరి వేంకటేశ్వరరావుగారు రాసిన ఉంటారని"* అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము:385) తెలిపారు. మరలా దీనికి ఒక ఉపపత్తిని చూపించారు" అది *"అలెగ్జాండర్ డ్యూయస్' రచించిన 'బ్లాక్ టులిప్' అనే ఆంగ్ల నవలను కాటూరి వేంకటేశ్వరరావు గారు నల్లకలువ పేరుతో 1965 సంవత్సరంలో అనువదించారు. ఇందులో కోర్నిలియస్ పుష్ప ప్రేమికుడు. అతడు పెంచిన కలువ పూవును ఈర్ష్యతో గ్రిఫస్ అనేవాడు ధ్వంసం చేస్తాడు.ఆ సందర్భంలో కాటూరి వేంకటేశ్వరరావు గారు కోర్నీలియస్ చేత జాలి గొలుపు పూలపాటను పాడించారు. దీనిని బట్టి మొదటి నుండి వీరికి పుష్పాలంటే ఒక సుకుమారమైన భావన ఉన్నదేమో వినిపిస్తుంది. భావంలో భాషలో ఈ ఖండికలో కాటూరి వారి పోకడలే కనిపిస్తున్నాయి"* అని అజ్ఞానకృతమనే ఖండికను కాటూరి వేంకటేశ్వరరావు గారే రాసి ఉంటారని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. *"జంట పువ్వులలో ఒక పువ్వును తెంపిన పుత్రుని మందలిస్తున్న తల్లి భావాలను వివరించే ఖండిక"* అని గొల్లపూడి ప్రకాశరావు (భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి-కాటూరి,1999:27) అని తెలియజేశారు.

పూలమొక్కలకు కూడా మనిషిలాగే ప్రాణముంటుంది. ప్రకృతిని కవులు అంత ఇష్టపడటానికి కారణం ప్రకృతిలోని కదలికను కవి హృదయంతో చూడగలుగుతాడు. అందుకనే ప్రకృతిని అంతగా ఇష్టపడతాడు కవి. వీటిని ఆకాశాన్ని, భూమిని, వాయువుని, అగ్నిని, నీటిని వీటినే పంచభూతాలంటారు. ఈ పంచభూతాలు అన్ని కలిస్తేనే ప్రకృతి. మనిషి పంచభూతాల నిర్మాణం. మనిషిలో అగ్ని అంటే వేడి ఉంటుంది. ఊపిరి అంటే మనిషిలో వాయువు ఉంటుంది. శరీరం ఒక పదార్థ నిర్మాణం. దానిలో మట్టి ఉంటుంది. ఇలా మానవ దేహం పంచభూతాత్మకం. అందుకే మనిషికి, ప్రకృతికి విడదీయరాని బంధం ఉంటుంది. భావ కవిత్వం లో కవులు విస్తృతంగా వర్ణించడం జరుగుతుంది. అజ్ఞాన కృతము ఖండికలో మానవునిలాగే ప్రాణమున్న

చెట్లను నరకడం, పువ్వులను కోయడం, కొమ్మలను నరకడం మొదలైన పనులన్నీ అజ్ఞానంతో చేసే పనులు అని చెప్పడమే ఈ అజ్ఞానకృతము ఖండికలోని ముఖ్యమైన సందేశం.

తన తోటలోని చెట్లకు రెండు పూలు పూస్తాయి. ఆ రెండింటిలో ఒకదాన్ని ఒక బాలుడు తుంచుతాడు. ఆ దృశ్యాన్ని చూసిన తల్లి ఆ పువ్వుని విడదీసి నందుకు మరొక పువ్వు ఆ చెట్టు ఎలా బాధపడతామో కవులు ఇలా వర్ణిస్తారు. ఆ రెండు పువ్వులు ఒకే మంచంపై ఎంతో సంతోషంగా పడుకొని ఉండగా వాటి నుండి ఒకదాన్ని విడదీయడానికి నీకు  చేతులేట్లా వచ్చాయి. అంతేకాదు తనకెంతో ఇష్టమైన బిడ్డను త్రుంచడం వలన ఆ తల్లి తీగ ఎంత దుఃఖిస్తుంది కదా అంటూ...

*"కనులు మొగిడ్చి కూర్కు తన గాదిలిబిడ్డను  నీవు త్రుంచిపో*
*యినఁగని తల్లితీవ నిలువెల్లఁ జలింపఁగ నెట్లు విహ్వలిం*
*చనొ కనుగొంటివే? కడుపు చుమ్మలుచుట్టగ బాష్పబిందువుల్*
*కనుగొనలందు నిండి తొలఁకన్ గనువారల గుండె నీరుగన్"*

(తొలకరి కావ్యం :31)

అని వర్ణిస్తారు. పువ్వు తల్లి అయిన చెట్టు బాధను కడుపు లుంగలులుంగలు చుట్టిన బాధతో కన్నీళ్ళు కారుస్తూ గుండె నీరు అవుతుంది అంటారు కవి. సహజంగా పూలమొక్కలపై రాత్రి కురిసిన మంచు ఉంటుంది. మనం, ఆకు గానీ, పువ్వు కోసినప్పుడు గానీ గట్టిగా తెలుపడం వలన ఆ మొక్క మీద ఉన్న మంచు నీళ్ళు కిందపడతాయి. అలా నీళ్ళు కిందపడటాన్ని గుండెనీరై కన్నీళ్ళు కాలుస్తుందనడంలో అద్భుతమైన భావుకత కనిపిస్తుంది. *"అందుకనే ప్రకృతిని మాతృమూర్తిగా, దేవతగా భావకవులు గ్రహించడం జరుగుతుందని"* అని (ఆంధ్రునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు: ప్రయోగములు,1989:403) భావకవిత్వ లక్షణాలలో ఒక శాఖైన ప్రకృతి కవిత్వం గురించి పేర్కొన్నారు.

అంతేకాదు, అక్కా చెల్లెళ్లలా జంటగా కలకాలం పెరిగే ఆ జంటలోని ఒక పువ్వుని త్రుంచేసిన తరువాత ఆ మిగిలిన పువ్వు ప్రొద్దున్నే లేచి తన ప్రియమైన చెల్లెలు కనిపించకపోవడం వలన బాధపడునో కదా అంటూ అలా ఆ జంటను విడగొట్టడం అది ఎంతటి విషాదానికి కారణం అవుతుందో అని భయం వేస్తుందని తల్లి తన కొడుకుని మందలిస్తున్నట్లు ఈ విధంగా వర్ణిస్తారు.

*' 'కటకట! నిద్ర లేచి తన గాదిలిచెల్లెలు గానరామి మి*
*క్కుటమగు నార్తిజెంది, నవకమ్ములు మాయగఁదొంటిమేని ము*
*చ్చటలకుఁ బాసి యెంతటి విషాదము జెందునొ జంటపూవు? నీ*
*కటికతనమ్ముగన్నఁగొడుకా ! భయమయ్యెందు నేమిసేతురా"*

(తొలకరి కావ్యం:31)

అని అంతేకాదు ఆ అక్కాచెల్లెళ్ళు ఒకరినొకరు కానరాక ఎలా బాధపడుతుందో

*"నిన్నటి సంజఁ జెల్లి జననీ ! యవి కోసియొసంగు మన్న, నీ*
*క్రొన్నన లెల్లి విచ్చినను గోసియొసంగెద నంటి , శయ్యపై*
*కన్నులు విచ్చి జాలకముక్రంతల నీ దురవస్థ చూసి, యా*
*చిన్నది యెంత పోరిడునొ? చెంపల నశ్రులు జాలువాఱఁగన్ "* (తొలకరి కావ్యం:32) అని అంతేకాదు నీ అజ్ఞానం వలన ఆ పువ్వును కోసేశావు. నిన్న ఒక తుమ్మెద ఆ పువ్వుల చుట్టూ తిరుగుతూ వాటిని ఎవరూ ముట్టుకోకూడదని కొన్ని మంత్రాలు వేసింది. దాని ప్రభావం నీపై ఉంటుందమో అని తల్లి భయాన్ని వ్యక్తం చేసింది. తన కుమారుడు చేసిన పనికి ఎంతో బాధపడింది. అది తెలియక చేసిన పని అని ఆ తల్లి పదేపదే ఆ పూలమొక్కకు వివరించింది. ఆ పూల మొక్కల్ని, పూవుల్ని రాత్రంతా తన చల్లని ప్రేమ అనే రసాన్ని వాటి మీద చల్లుతూ రాత్రంతా కాపాడింది. మరలా రాత్రి వచ్చి ఒక పువ్వు కనిపించకపోవడం వలన ఆ చందమామ ఎంతగా బాధపడుతుందో అని ఆ ప్రకృతిలో ఒకదానితో ఒకటి ఎలా సంబంధాల్ని కలిగి ఉంటాయో ఊహిస్తున్నారు కవి. ఆ భావనను ఒక అందమైన పద్యంలో వర్ణిస్తూ...

*" చల్లని ప్రేమరసము బై*
*జల్లుచు రేయెల్ల సాకె చంద్రుఁడు వీనిన్*
*బిల్లఁడ! మాపటికిన్ జిం*
*తిల్లుచుఁదనపూవు గనమి దెసల బరచుగా"* (తొలకరి కావ్యం:32) అని వర్ణించారు. తన కుమారుడు చేసిన పనిని కాదనలేను, కానీ తన బిడ్డను తాను మరలా ఎలాగో తెచ్చి ఇవ్వలేకపోయిన తన బిడ్డను మాత్రం మీ బిడ్డగా భావించమంటుంది. అంతేకాదు భవిష్యత్తులో మొక్కలను, పువ్వులను ఎవరూ నాశనం చేయకుండా కలకాలం మేలు జరగాలని కోరుకుంటున్నాననీ దీవిస్తుంది.

ఈ ఖండికలో పువ్వును కోసిన మొక్కలను కొట్టేసినా ప్రకృతితో వాటికున్న అనుబంధాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అవి కూడా మనుషుల్లాగే తమ చుట్టూ ఉండే గాలి, నీరు, భూమి, సూర్యుడు,చంద్రుడు మొదలైన వాటితో అనుబంధాన్ని కలిగి ఉంటాయని గుర్తుంచాలని అంటారు కవులు. భావకవులు ప్రకృతితో గల తాదాత్మ్యాన్ని ఎంతగానో అనుభూతి చెందుతారు. ఆ ప్రభావం ఈ అజ్ఞాన కృతము ఖండికలో స్పష్టంగా కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని భావ కవితా ఉద్యమానికి ఒక నాయకుడిగా చెప్తారు.

### 2.2.7.1. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం:

*"ఆయన రాసిన కృష్ణపక్షంలో ప్రకృతి తాదాత్మ్యంతో అనేక కవితలు రాశారు. ఒక సారి ఆయన బెజవాడ నుంచి బళ్లారికి రైల్లో వెళ్లుతుండగా చుట్టూ ఉన్న పొలాల సౌందర్యానికి రైలు పడుతున్న వరకు పరవశించి 'ఆకులో ఆకునై' అనే ఖండికను రాశారు "* (దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం,2021:1)

*"ఆకులో ఆకునై పువ్వులో పూవునై*

*కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై*

*ఈ యడవి దాగిపోనా*

*ఎట్లైన నిచటనే యాగిపోనా"* ఇక్కడ అడవి అనగానే ఒక ప్రకృతి సౌందర్యం, క్షేత్రం అనిపిస్తుంది.

*"గల గాలని వీచు చిరుగాలిలో కెరటమై*

*జల జలని పారు సెలపాటలో తేటనై*

*ఈ యడవి దాగిపోనా*

*ఎట్లైన నిచటనే యాగిపోనా "* ప్రకృతిలో గాలి, నీరు వాటి వలన కలిగే ఆనందాన్ని ఇక్కడ ప్రత్యేకంగా వర్ణిస్తున్నారు కవి.

*"పగడాల చిగురాకు తెరచాటు తేటినై*

*పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై*

*ఈ యడవి దాగిపోనా*

*ఎట్లైన నిచటనే యాగిపోనా"* ఇక్కడ పగడాల చిగురాకు మొక్కలోని చిగురాకులో కనిపించే అందం లేదా సౌందర్యం అక్కడే తిరిగే తుమ్మెదలు అప్పుడప్పుడు విరిసే మొగ్గలు వాటిని మానవీకరించినట్లుగా అవి తనను పిలుస్తున్నట్లుగా, అని తనతో మాట్లాడుతున్నట్లుగా వర్ణించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ప్రకృతి తాదాత్మ్యం అపూర్వమైంది.

*"ఆకలా దాహమా చింతలా వంతలా*

*ఈ కరణి వెర్రినై యేకతమ తిరుగాడు*

*ఈ యడవి దాగిపోనా*

*ఎట్లైన నిచటనే యాగిపోనా"*

(దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం2021:1) అని

ఇక్కడ ప్రకృతితో తాదాత్మ్యం చెందిన వ్యక్తికి ఆకలి, దాహం, నిద్ర మొదలైనవి ఉండవనడంలో భావకవి ప్రకృతి వర్ణనలతో ఆ సౌందర్యానికి పతాక చిహ్నం. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ప్రకృతినంతా ఎంతో తాదాత్మ్యంతో అనుభవించి, అనుభూతి చెందుతూ పులకరించాడని ఈ కవిత్వంలో అని చెప్పవచ్చు. ప్రకృతే తానై మాట్లాడాడు. పింగళి, కాటూరి కవులు మాత్రం ఆ ప్రకృతితో సంభాషించడం ఆ ప్రకృతికే తన బిడ్డను అంకితం చేయడం వంటి వర్ణనలు కృష్ణశాస్త్రిగారితో పోటి పడటం అనిపిస్తుంది. కృష్ణశాస్త్రిగారు 'కృష్ణపక్షం'లో ప్రకృతి తాదాత్మ్యంతో కూడిన కవితలు ఎన్నింటినో వర్ణించారు. ఈ ప్రకృతిని ఎందుకు ప్రేమిస్తున్నావు, ఈ ప్రకృతి మనల్ని ఎందుకు ప్రేమిస్తుందనే ప్రశ్నలు ఒకదానికి మరొక ప్రశ్నగా మిగులుతాయి తప్ప అదే సమాధానంగా చెప్పలేము. దీన్ని 'ఏల ప్రేమింతును' అనే ఖండికలో కృష్ణశాస్త్రిగారు పువ్వుల పరిమళాన్ని ఎందుకు ఇస్తాయి, చందమామ వెన్నెలను ఎందుకు ఇస్తుంది,నదులు ఎందుకు

ప్రవహిస్తాయి, ఈ చల్లగాలి ఎందుకు వీస్తుంది అంటే ఏమి చెప్పగలం. అలాగే నిన్నే నిన్ను ఎందుకు ప్రేమిస్తున్నావని నేను ఎందుకు చెప్పగలనని చెప్పడం ప్రేమించడం తన సహజ గుణంగా చెప్పిన మాటల్లో గొప్ప తాత్త్విక సత్యం ఉంది. ప్రకృతి మనిషికి కావాల్సింది నావి ఎందుకు ఇస్తుంది, ప్రకృతిని మనిషి ఎందుకు ప్రేమిస్తున్నాడు. అవి ఒకదానికి ఒకటి ముడిపడిన సహజ బంధాలు అని ఈ కింది పద్యాంలో ఇలా చెప్తారు కృష్ణశాస్త్రి గారు.

*"సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజంబు?*
*చంద్రికల నేల వెదజల్లు చందమామ?*
*ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?*
*ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను? "*

*"మావిగున్న కొమ్మను మధుమాసవేళ*
*పల్లవము మెక్కి కోయిల పాడు టేల ?*
*పరుల తనియించుటకొ? తన బాగు కొరకొ?*
*గాన మొనరింపక బ్రతుకు గడవ బోకొ?"*

(దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం,2021:14) అని ఇటువంటిదే కరుణశ్రీగారి పుష్ప విలాపం కూడా అని ఈ ఖండిలకలను చూస్తే అర్థమవుతుంది.

**2.2.7.2. కరుణశ్రీ 'పుష్పవిలాపం':**

కరుణశ్రీగారి పూర్తి పేరు జంధ్యాల పాపయ్య శాస్త్రి. ఆయన రాసిన ఈ పుష్ప విలాపం. కరుణరస భరితమైనది. ఒక భక్తుడు పూజ కోసం పూలు కోయాలని, పూలతోటకు వెళ్తాడు. పూలు కోసేటప్పుడు ఆ పువ్వుల ఆవేదన అతని మనస్సులో ఎలాంటి భావ ప్రకంపన కలిగించిందో ఒక సంభాషణగా వర్ణించిన తీరు తెన్నుల్ని ఎంతోమందిని ఆకట్టుకుంటుంది.

*"నే నొక పూలమొక్క కడ నిల్చి చివాలున కొమ్మవంచి గో*
*రానెడు నంతలోన విరు లన్నియు జాలిగ నోళ్ళు విప్పి "మా*
*ప్రాణము తీతువా" యనుచు బావురు మన్నవి; క్రుంగిపోతి; నా*
*మానసమం దెదో తళుకు మన్నది పుష్పవిలాప కావ్యమై "*

(కరుణశ్రీ 'పుష్పవిలాపం') అని ఆ పుష్ప విలాప సందర్భాన్ని వర్ణిస్తారు కవి కరుణశ్రీ. ఆ పువ్వులు కోసే అతనితో ఇలా అంటాయి. ఓం భక్తుడా నువ్వు మోక్షం అనే ధనం కోసం మిమ్మల్ని మా తల్లి ఒడిలోని ఆడుకుంటున్న మమ్మల్ని తెంపి బుట్టలో పెట్టి అమ్ముకుంటావు. హృదయమే లేని నీకు పూజలెందుకు అని ప్రశ్నిస్తుంది. ఇక్కడ ప్రకృతినే దైవంగాను, దైవాన్ని ప్రకృతిగాను అనే ఒక తాదాత్మ్య భావం ఇందులో కనిపిస్తుంది. ఈ పద్యంలో ఇలా ఉంది.

*" తల్లి యొడిలోన తలిరాకు తల్ప మందు*
*ఆడుకొను మమ్ములను బుట్టలందు చిదిమి*
*అమ్ముకొందువె మోక్ష విత్తమ్ము కొరకు!*
*హృదయమే లేని నీ పూజ లెందుకోయి?*
*జడమతుల మేము; జ్ఞానవంతుడవు నీవు;*
*బుద్ధి యున్నది; భావ సమృద్ధి గలదు;*
*బండబారె నటోయి నీ గుండెకాయ!*
*శివునకై పూయదే నాల్గు చిన్ని పూలు?* (కరుణశ్రీ 'పుష్పవిలాపం:5) అని

పింగళి కాటూరి కవులు కూడా ఈ పద్యంలోని భావంలాగే పువ్వులు తల్లితో ఆడుకుంటున్నట్లు వర్ణించారు. ఓ భక్తుడా నిన్ను జ్ఞాన వంతుడు అంటారు. మమ్మల్ని జడవంతులంటారు. మరి నీకు బుద్ధి ఉన్నది, మాట్లాడగలిగే శక్తి ఉన్నది. అటువంటి నీకు హృదయం బండబారిపోయిందా అని అనడం కవి వర్ణిస్తారు. గారిని గౌరవించి ఆ గాలి ద్వారా మేము పరిమళాల్ని వెదజల్లుతాం. తుమ్మెదలకు మనుషులకు విందు చేస్తాం. అటువంటి మమ్మల్ని తల్లి బిడ్డలను వేరు చేస్తూ ఉంటారు. అది స్వార్ధ బుద్ధి కాదా అని ప్రశ్నిస్తాయి.

*" ఆయువు గల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవతల్లి జా*
*తీయత దిద్ది తీర్తు ము; తదీయ కరమ్ములలోన స్వేచ్ఛమై*
*నూయల లూగుచున్ మురియుచుందుము; ఆయువు దీరినంతనే*
*హాయిగ కన్ను మూసెదము ఆయమ చల్లని కాలి వ్రేళ్ళపై "*

(కరుణశ్రీ, పుష్పవిలాపం:6) అని పింగళి

కాటూరి కవులు కూడా ఒక పువ్వును తుంచడం వలన కలిసి ఆడుకుంటున్న అక్క చెల్లెళ్ల, తల్లి బిడ్డలా ఉన్న వాళ్ళని విడగొట్టడాన్ని ఒక విషాదం గానే అభివర్ణించారు కవులు. అలా ప్రకృతిలో ఉన్నటువంటి పువ్వుల్ని కోసినప్పుడు కేవలం రెండవ పువ్వు, తల్లి ఆ ప్రకృతి విలాపాన్ని పింగళి, కాటూరి కవులు పలికించగలిగారు. దాన్ని ఒక అజ్ఞాన మైన చర్యగా అభివర్ణించి ఆ ఖండికలు అజ్ఞాన కృతమనే పేరును పెట్టారు. కరుణశ్రీ పువ్వులను కోయడం ఆడవాళ్ళు పువ్వులను దారాలతో గొంతులను గూర్చి ఉరి బిగించి గుండెలో నుంచి పువ్వుల్ని గుచ్చి తలలో పెట్టుకుంటారు. అటువంటి దయలేని ఆడవాళ్ళు కూడా నిందిస్తారు కరుణశ్రీ. అసలు ఆ నరజాతికే నీతి, జాలి లేదని వ్యాఖ్యానిస్తారు.

*" మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ*
*జీవిత మెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయె; మా*
*యౌవన మెల్ల కొల్లగొని ఆ పయి చీపురుతోడ చిమ్మి మ*
*మ్మావల పారబోతురు గదా! నరజాతికి నీతి యున్నదా !*

*"బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు*
*సహజ మగు ప్రేమ నీలోన చచ్చెనేమి?*
*అందమును హత్య చేసే హంతకుండ!*
*మైలపడిపోయె నోయి! నీ మనుజ జన్మ.*
*పూజ లేకున్న బాబు నీ పున్నె మాయె!*
*కోయ బోకుము మా పేద కుత్తుకలను*
*అకట! చేసేత మమ్ముల హత్య చేసి*
*బాపుకొన బోవు ఆ మహా భాగ్య మేమి?*

(కరుణశ్రీ, పుష్పవిలాపం:8) అని కరుణశ్రీగారి పద్యాలు పువ్వుల వలె మెత్తగా మకరందం జాలువిరునట్లుగా హృదయాన్ని తాకుతూ ఉంటాయి. పువ్వుల్ని కోయడం మాత్రమే కాకుండా ఆ పువ్వుల్ని మరలా ఎలా పడేస్తారో చెప్పారు. దానికి బుద్ధి దేవుడు పుట్టిన,అహింసను వారసులైన శాంతి భూమిలో పుట్టినవారు కూడా పువ్వుల్ని కోస్తున్నారని ఎంతో ఉదాత్తంగా వర్ణిస్తారు. కరుణశ్రీ పద్యాలు మాధుర్య గుణంతో సుకుమార శైలిలో వినగానే అర్థమయ్యేటట్లుగా వర్ణించారు.

భావకవులొకరినొకరిపై వారి ప్రభావం పడుతుంది. కృష్ణశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతంగారు ఎంతో స్నేహంగా ఉండేవారు. వివిధ శుభకార్యక్రమాలేవైనా జరిగితే ఒకరింటికి మరొకరు వస్తూపోతుండేవారు. పింగళి లక్ష్మీకాంతంగారి కుమారుడి వివాహానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు హాజరయ్యారు. ఆ దృశ్యాన్ని పింగళి సూర్య సుందరం తన (పింగళి లక్ష్మీకాంతం,2010:69)లో ప్రచురించారు. దీన్ని బట్టి ఒకరికొకరికి ఎంత దగ్గరగా ఉండేవారో దీన్ని బట్టి కూడా అర్థమవుతుంది. వీరి భావాలు కూడా ఒకరివి మరొకరిపై పడే అవకాశం కూడా ఉందని దీన్ని బట్టి కూడా ఊహించవచ్చు. అయితే ఆ ప్రభావం ఎంత ఉన్నప్పటికి పింగళి, కాటూరి కవులపై పడిన ప్రభావం గురించి ప్రముఖ విమర్శకులు కడియాల రామ మోహన రాయ్ వ్యాఖ్యానిస్తూ *"భావ కవులు రానే దంతా ప్రేయసి గురించి మాత్రమే కాదని భావ కవిత్వంలో ఒక నూతన ఒరవడిని సృష్టిస్తారని"* అని (తెలుగు కవిత వికాసం,1982:69) తెలియజేశారు.

పింగళి, కాటూరి కవుల పద్యాల్లో నిగూఢమైన భావుకత ఉంటుంది. గొప్ప ధ్వని ఉంటుంది. మాధుర్య గుణం ఉన్నప్పటికి కరుణశ్రీ గారి పద్యాలలోని పదలాలిత్యం కనిపిస్తుంది. కానీ ప్రకృతితత్త్వం ఔచిత్యవంతగా ప్రతిఫలిస్తుంది. భావ కవులు సుకుమార మైన ప్రకృతిని ప్రేమిస్తారు. మనుషుల్ని ఇంకెంత ప్రేమిస్తారో ఆలోచించుకోవలసిందే, అందుకే. ప్రేమకు స్వేచ్ఛ ప్రాణం, స్వేచ్ఛ సుఖ సంతోషాల్ని నిర్వాజత అందిస్తుంది. అంటే ఒకరు మనకు ఇచ్చిన దానికి వెలకట్టడం గానీ, లేదా మనకు ఇచ్చిన వారికి పరోపకారం చెయ్యాలని అనుకోకుండా ఇవ్వడమే

లక్ష్యంగా ఉండేదాన్ని నిర్వ్యాజత అంటారు. నిజానికి ప్రకృతి మానవునికి ఇచ్చిన త్యాగాన్నే నిర్వాసిత అంటారు. అంటే ఒకరు మనకు సహాయం చేశారు కాబట్టి, మనం కూడా వారికి సహాయం చెయాలనుకోవడం స్వార్థం పరస్పర సహకారం అవుతుంది. అలా కాకుండా వాళ్ళు అడక్కుండానే మనం సహాయం చేయడం, మరలా వారి నుంచి సహాయాన్ని ఆశించకపోవడం నిర్వ్యాజత. ఈ గుణం ప్రకృతిలో ఉంది. కాబట్టి ప్రకృతియే మనిషి కంటే గొప్పది. ప్రకృతితత్త్వ రహస్యం ఇదేనని భావించవచ్చు. ప్రముఖ కవి, విమర్శకుడు సుమనశ్రీ ''కవితాసామాగ్రి పుష్కలంగా ఉన్న 'తొలకరి'' అనే వ్యాసం (రసజ్ఞ శిల్పి–ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక,1974:24)లో చెప్పిన మాటలతో దీన్ని ముగిస్తాను. *''ప్రకృతి దృశ్యాల్ని వర్ణించుటలోను, నాటకీయంగా దృశ్యాల్ని మన కళ్ళముందు రూపుకట్టించడంలోను ఈ జంటకవులు (పింగళి–కాటూరి) సిద్ధహస్తులు.''* అని తన అభిప్రాయాన్ని తెలిపారు.

**2.2.8. రసాలము:**

ఈ ఖండికలో ఏడు పద్యాలు ఉన్నాయి. రసాలము అంటే మామిడి చెట్టు అని అర్థం. మామిడి చెట్టు వివిధ కాలాల్లో ఏ విధంగా ఉంటుందో వర్ణించడం దీనిలోని వస్తువు. భావ కవులు ప్రకృతికి పరవశమై వాటిలో లీనమై వాటితో మాట్లాడుతూ కవిత్వం రాయడం జరుగుతూ ఉంటుంది. ఈ ఖండికలోని పద్యాలను చదివిన తరువాత మానవ జీవితంలోని సుఖ, దుఃఖాలు వస్తూ పోతూ ఉండే స్థితిని ప్రతీకాత్మకంగా వర్ణించారని అర్థమౌతుంది. ఒక కాలంలో మామిడి చెట్లు ఆకులు రాలిపోతాయి. అలాగే ఎంతో సంపద ఉన్న వ్యక్తులు కూడా దానం చేయడం వలన మరొక కారణాల వలన పేదవారిగా కూడా మారవచ్చు. అటువంటప్పుడు తమ దగ్గరికి వచ్చిన వారికి ఏమి ఇవ్వలేక వాళ్ళని ఆనందింపజేయలేక తమలో తాము బాధపడతారు.

*''కాలవశమ్మునన్ విసరుగాడ్పులకున్ ముదురాకుపుట్టముల్*
*రాలగా బాటసారుల బరామరిసింపగ లేక సంపదల్*
*దూలిన దాతవోలె జిగిదూలిన యీ యెలమావిగున్న యా*
*కాలయశమ్ము చేతనె సఖా! వికసించెడి సౌరు గంటివే ''* అని వర్ణించడంలో

మామిడి చెట్లను మానవులతో పోల్చారని బాటసారుల పరామర్శించలేక 'సంపదల్ దూరిన ధాతవలె' అనడాన్ని ఈ సందర్భంగా గమనించవచ్చు. మామిడి చెట్లు శుభాలు కలిగించే అందమైన దేవతలా వర్ణిస్తారు కవులు. *''ఈ ఖండిక పింగళి లక్ష్మీకాంతంగారే రాసి ఉంటారని పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్రను రాసిన గూడూరి నమశ్శివాయగారు పేర్కొన్నారని''* (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:392) అని పింగళి వేంకట కృష్ణారావు గారు అభిప్రాయపడ్డారు.

**2.2.9. తొలిపూత:**

వసంత కాలంలో ప్రకృతి సోయగం ఎలా ఉంటుందో ఎంతో భావుకతతో ఈ తొలి పూత ఖండికలోని పద్యాలను వర్ణించారు పింగళి, కాటూరి కవులు. ఈ ఖండికలో వసంతకాలాన్ని వసంతుడిగాను, మామిడి చెట్టును మాధవీలత గాను వర్ణించి వారిద్దరికి పుట్టిన వసంతతీగకు మాధవీ పుష్పానికి తుమ్మెదకు పెండ్లి చేయడం ఈ తొలి పూత ఖండికలో కనిపించే గొప్ప ఊహ. దీన్ని వర్ణిస్తూ

*"వెడలి రమ్మింక సిగ్గుల పెండ్లి కొడుకు*
*పాటకుడ వౌదులెమ్ము సంభరుడ రేపు*
*మొదలు తనివిసనంగ బాడెదవు గాని*
*వేగ దయసేయు మీ పెండ్లి పీటపైకి*
*జగములకు నెల్ల నానందసంవిధాయి*
*యగు వసంతుని తొలి చూలు ముగుదతనపు*
*ప్రథమయౌవనసుధ గ్రోలరాగదయ్య*

*నీలమేఘుడ వీవు, మా బాల తళుకు*
*చిలుకు తొలకరిమెరపు, మీ చెలిమి కాదు*
*మలయపవనుండు నొకచోట గలసియాడి*
*కాలగతిరహస్యము దెల్ప గడుగుడింక*

*పరిణయాగతద్విజకులవనితలార!*
*పలుకు జవరాలి వీణతో గలిపి యొక్క*
*మంగళము పాడరమ్ము బంభరవరునకు*
*సకల సౌభాగ్యవతికి వాసంతికకును "* (తొలకరి కావ్యం:38) అని వివాహం జరిగేటప్పుడు తెలుగువారు చేసే వివిధ ఆడంబరాలు అన్నీ కూడా ఈ తొలి పూత కవిత్వంలో కనిపిస్తాయి. అయితే ఈ ఖండిక కాటూరి వేంకటేశ్వరరావు గారు రచించారని చెప్పడానికి *"ఈ మంగళం కాటూరి వారిదేనని నా అభిప్రాయం"* అని పింగళి వేంకట కృష్ణారావుగారు (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము,2013:378) పేర్కొన్నారు.

**2.2.10. ఎవరు నీవు?:**

ఈ ఖండిక ఊహాసుందరిని వర్ణించిన కవిత. భావ కవులు ఊహాసుందరిని వర్ణించుకోవడం ఒక సరదా. పింగళి కాటూరి కవులు కూడా తమతో మాట్లాడే, తమకే కనిపించే,తమకే ఆనందాన్నిచ్చే ఊహాసుందరిని ఊహించుకున్నారు. ఒక విధంగా చెప్పాలంటే కవుల భావుకత ఒక ఊహాసుందరిగా వర్ణితమైంది. కవిత్వం రాసేవాళ్ళు సమ్మోహంలో ఒకరిగా

ఉంటూనే, ఒంటరిగా ఉంటూనే సమ్మోహంతో మాట్లాడుతుంటారు. కవిత్వం ఆవహించిన వాళ్ళు పలాన సమయంలోనే కవిత్వం రాస్తారని చెప్పలేము. ఆ భావుకత ఎప్పుడైనా కవిత్వం ఆవేశమై రావచ్చు. అది పగలు, రాత్రి, అర్థరాత్రి , తెల్లవారుజామున, ఉదయం ఇలా ఒక సమయం అంటూ ఉండదు. పింగళి కాటూరి కవులు ఎవరు నీవు ఖండికలో ఒక ఊహ సుందరిని వర్ణించినట్లు వర్ణించిన అది వారి కవిత్వ సుందరే. అది వారి భావ కవిత్వ సుందరేనని భావించాలి.

*"నాటి నిశీథమందు ములునాటిన పూవుటెడందతోడ న*
*య్యేటి కురంగటన్ బొదల యీరమి గారు మొగుళ్ళ జీకటుల్*
*గాటముగాగ నొంటినయి కన్నులనీరిడువేళ మింటిపై*
*దాటి తళుక్కునన్ మెరసి తారితి వెవ్వరు నీవు చెప్పుమా"* (తొలకరి కావ్యం:39) అని ఈ ఖండిక లో ఉన్న పద్యాలన్నీ కవిత్వ ఆవేశం పొందిన కవుల మన: స్థితికి అందంలా కనిపిస్తుంది. శ్రీశ్రీ 'కవితా ఓ కవితా' అనే ఖండికలో కూడా ఆ కవిత్వాన్ని ఉద్దేశిస్తూ ఆ కవిత్వంతోనే మాట్లాడుతున్నట్లుగా వర్ణిస్తారు. అది కవిత్వ ఆవేశం. కాబట్టి ఆ కవిత్వంలో వర్ణించే సుందరి ఆ కెలికే కొన్ని సార్లు అస్పష్టంగా ఉంటుంది.

*"తుది మొదలు లేని గంభీరదు:ఖఘోష*
*మదర బ్రహ్మాండముల్ దిగుల్పడగ నెత్తి*
*మోదికొను వారిని నిధితీరమునను దాని*
*బాష్పజల మేను దోయిట బట్టుచుండ*
*బొంగివచ్చు తుద్దుఃఖతరంగములను*
*దేలియాడుచు నరుదెంచి, దివ్యధామ*
*కాంతి దొలకు నపాంగవీక్షణము నాదు*
*స్మృతి ముకురమందు నస్పష్టబింబమీన*
*జిరునగవు తొల్కరింప నన్ జేరి చెవిని*
*ఏమి వ్యాపారమిది యంచు నెగిరిపోతి*
*వేల నన్నిట్లు వెంటాడ ? నెవరు నీవు?"* (తొలకరి కావ్యం:40) అని భావుకత ప్రపంచంలో కవులను ఆ కవిత్వ సుందరి ఎలాంటి సుఖదుఃఖాలతో కూడిన తన్మయత్వాన్ని కలిగించిందో ఈ కవితా ఖండిక కనిపిస్తుంది. తొలకరి అనే పద్యకవితా ఖండికల్లో గొప్ప భావుకత సామర్థ్యం ఉన్న ఖండికలలో ఎవరు నీవు ఖండిక ఒకటి.

### 2.2.11.బోనులోని సింగము:

ఈ ఖండికలోని నేపథ్యం గురించి పింగళి వేంకటకృష్ణారావుగారు ఇలా చెప్పారు. *"బందరుకు ఒక సర్కస్ వచ్చింది. సింహం ఉన్న బోనును బండిపై తరలిస్తుండగా, ఆ బండి బోల్తా పడి బోను తలుపు తెరుచుకుంది. సింహం బయటపడి వీర విహారం చేసి బండి యెద్దును*

*చంపింది. జంట కవులు ఈ రచనకు, ఆ సన్నివేశమే ప్రేరణ. ఈ ఖండికను పింగళి కాటూరి కవులు చెరిసగం రచించారు. ఆధునిక కావ్య రచన కనువైన ఉమ్మడి శైలిని ఈ ఖండికలో వీరు సాధించినట్లు కనిపిస్తుంది"* అని (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము,2013:378) పేర్కొన్నారు.

*" స్వేచ్ఛా విహారములకు*
*నను వొసగునట్టి ఘోర కాంతారమునకు*
*సార్వభౌముడవై , నిజసాహసమ్ము*
*శాసనమ్ముగ భవదన్యసత్వములను*
*బాలనమ్మొ నరించుచు,వలయు మత్త*
*హస్తి మస్తకమస్తిష్క మారగించి*
*నిర్భయమ్ముగ గుహలలో నిదురసెంది"* (తొలకరి కావ్యం:43) అని

సింహం అరణ్యంలో ఉన్నప్పుడు తనకేంతో స్వేచ్ఛ ఉంటుంది. నిర్భయంగా తిరుగుతుంది. కానీ అది జనంలోకి వస్తే దాన్ని బంధిస్తారు. మహావీరుడైనటువంటి వారు కూడా ఏదో ఒకనాడు ఎవరో ఒకరి చేతిలో ఓడింపబడతారు. అప్పుడు ఓడిపోయిన ఆ వీరుడి మనస్తత్వాన్నీ సింహ వర్ణనలో చూపించారు పింగళి కాటూరి కవులు. కాలమెప్పుడు ఒకేలా ఉండదు. బలవంతుడు బలహీనుడు అవ్వచ్చు. బలహీనుడు బలవంతుడు అవ్వచ్చు. స్థల చలనం కలిగిన తరువాత జంతువులకు కానీ, మనుషులకు కానీ వారివారి అస్తిత్వంలో మార్పులు వస్తాయి. కాబట్టి స్థల కాలాలను బట్టి కూడా వారివారి విలువలు మారుతూ ఉంటాయి. ఇక్కడ స్వేచ్ఛగా బతికే సింహాన్ని ఒక బోనులో బందింపబడినప్పుడు ఉండే పరిస్థితిలో సత్యాలను మార్మికంగా తెలిపారు పింగళి కాటూరి కవులు.

**2.2.12. రక్త తిలకము:**

రక్త తిలకము అనే ఖండ కావ్యానికి మూలం రాజస్థాన్ లో జరిగిన వీరగాథగా పరిశోధకులు పింగళి వేంకట కృష్ణారావుగారు భావిస్తూ *"రక్త తిలకము క్రీ.శ. 1303-1326 మధ్య రాజస్థాన్ లో జరిగిన ఒక వీరగాథ వర్ణింపబడింది. ఇది పింగళి లక్ష్మీ కాంతంగారి రచన. వీరరసంపై వీరికాసక్తి అభిరుచి ఎక్కువ"* అని (పింగళి లక్ష్మీ కాంతంగారి కావ్య సమాలోచనము,2013, :390) తెలియజేశారు. దీన్ని బట్టి రక్తతిలకమనే రచన పింగళివారిదేనని తన అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారు. ఈ సంఘటనను ఆధారంగా రక్త తిలకము అనే వీరగాధను పింగళి లక్ష్మీ కాంతంగారు రచించారు. ఈ వీరగాథే ఈ మధ్యకాలంలో రాణిపద్మావతిగా సినిమా కూడా వచ్చింది. ఒక మహమ్మదీయుడైన మహా సైనికుడు మహమ్మద్ ఖిల్జీ ఒక హిందు మహారాణి సౌందర్యాన్ని చూసి తాను వివాహమాడాలని అనుకున్నాడు. దాని కోసం రకరకాల కుట్రలు పన్ని ఆ రాజుపై యుద్ధం చేస్తాడు. ఆ సందర్భంలో ఆ మహారాణి చితి

పేర్చుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ సందర్భంలో పింగళి లక్ష్మీ కాంతంగారు రాసిందే ఈ రక్త తిలకము.

*"హతవిధి! యెన్ని కష్టములు కగ్గము నేసితి తాతతండ్రు లం*
*చితగతినేలు రాజ్య రమణిన్ దురకల్ గ్రహియించి యేల దీ*
*నతమెయి నీ యవరాళి దినమ్ములుపుచ్చెడు నన్ను నేటికీ*
*గతిని గిరాతబాణహతి గారియపాలొనరించినాడవే "*

(తొలకరి కావ్యం:46 )

### 2.2.12.1. చిత్తోర్ ఘడ్ రాజ్యం:

భారతీయ రాజవంశాలలో రాజపుత్రులకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజపుత్రులు ఎంతో ధైర్యాన్ని, శౌర్యాన్ని పౌరుషాన్ని ప్రదర్శించేవారు. రాజపుత్రులు అంటేనే ఒక వీరత్వానికి, ధైర్యానికి, త్యాగానికి ఒక నిలువెత్తు సజీవ సాక్ష్యమనీ చరిత్రకారులు చెబుతున్న మాట. భారతదేశాన్ని మధ్యయుగంలో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ పరిపాలన చేశాడు. ఆ సమయంలోనే మేవాడ్, చిత్తోర్ ఘడ్ (నేటి రాజస్థాన్ లో ఒక ప్రాంతం) రాజ్యాన్ని రాజపుత్ర వంశానికి చెందిన రతన్ సింగ్ పాలించేవాడు. అతని భార్య రాణి పద్మావతి ఎంతో ఆనందంగా ఉండేది. ఆమె అందాన్ని, సౌందర్యాన్ని విన్న ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ ఎలాగైనా ఆమెను పొందాలని చిత్తోర్ ఘడ్ రాజ్యంపై ప్రత్యక్ష యుద్ధం చేశాడని చరిత్రకారులు, సినిమాలు మనకి తెలిపాయి.

నిజానికి మధ్యయుగపు యుద్ధాలు కేవలం అందమైన రాణుల కోసం మాత్రమే చేసినవి కావని తెలుసుకోవాలి. చిత్తోర్ ఘడ్ కేవలం ఒక కోట కాదు. సుమారు750 ఎకరాల్లో విస్తరించి అందమైన కొండపై నిర్మించారు. ఆ కోట ఏ మధ్యయుగపు కోటతో పోల్చినప్పటికీ అది చాలా అద్భుతమైనది, ప్రత్యేకమైనది. క్రీ.శ. 7 వ శతాబ్దం నుంచి కొనసాగుతున్న హిందూ సామ్రాజ్యాలకు ఆ కోట అందమైన కేంద్రంగా విరాజిల్లుతోంది. ఎంతటి సుదీర్ఘ ముట్టడినినైన తట్టుకోగలదు. లోపల విశాలమైన బావులు, చెరువులు యాభై వేల సైన్యానికి ఒక సంవత్సరం పాటు దాహార్తిని తీర్చగలదు. రాజస్థాన్ లోని ఎడారి ప్రాంతం ఎంతటి నీటి కొరతతో ఉంటుందో చూస్తే చిత్తోర్ ఘడ్ కోట ఎంతో విలువైనదనీ, ఎంతో ప్రత్యేకమైనదని అర్థమౌతుంది. అందుకనే ఆ కోట ఒక బలీయమైన సామ్రాజ్యానికి కేంద్రస్థానమైంది. ఆ కోట ఎవరి చేతిలో ఉంటే ఆ మొత్తం ప్రాంతమంతా వారిదే అవుతుంది. అల్లావుద్దీన్ ఖిల్జీ ఆ కోటను ఎందుకు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేశాడనేది ఇప్పుడు తెలుస్తోంది. అల్లావుద్దీన్ ఖిల్జీ పరమ కర్కోటకుడు, కిరాతకుడు పసిపిల్లలను, తల్లిదండ్రుల ఎదుటే నిర్దాక్షిణ్యంగా చంపి రాక్షసానందాన్ని పొందేవాడని చరిత్రకారులు రాశారు. ఇరవై వేల భారతీయ సైనికుల పుర్రెలతో, ఎముకలతో గోపురాలను కట్టించినవాడు. ఖిల్జీ కావాలంటే ఆమెను ఎత్తుకుపోవడానికి, మాయం చేయడానికి అంతటి శక్తి సామర్థ్యాలున్నాయి. మహారాజు రతన్ సింగ్, అల్లావుద్దీన్ ఖిల్జీ ల మధ్య

యుద్ధం కొన్ని నెలల పాటు సాగింది. ఈ యుద్ధంలో రతన్ సింగ్ అతని అనుచరులను వీరమరణం పొందారు. అలా రాజు యుద్ధభూమిలో చనిపోతే ఏమి జరుగుతుంది. ఒక సామ్రాజ్యాన్ని సమూలంగా నాశనం చేయడానికి దుర్మార్గంగా దాడిచేసి ఆ పాలకుణ్ణి చంపేస్తే ఊరుకుంటాడా, యుద్ధభూమిలో విజయం కంటే ప్రత్యర్థిపై మానసికవిజయాన్ని సాధించడానికే దురాక్రమణదారుడు ప్రయత్నం చేస్తాడు.

ఆధునికకాలంలో కూడా వివిధ దేశాలు ఇలాంటి సూత్రాన్ని పాటిస్తుంటారు. ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురిచేసి లొంగిపోయేటట్లు చేయడానికి వారి కుటుంబాల్ని లక్ష్యంగా చేసుకుంటారు. అందుకనే పాలకుల కుటుంబాలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తారు. రతన్ సింగ్ చనిపోయిన తరువాత ఖిల్జీ చిత్తోర్ ఘడ్ కోటను జయించాడు. కానీ దోపిడికి దుర్మార్గాలకి అలవాటు పడిన తన సైనికుల ఆకలి తీరడం ఎలా? కోటను దోచుకోమని కనిపించిన మహిళలపై అత్యాచారాలకు పాల్పడమని అనుమతిచ్చి ఉంటాడు. ఎందుకంటే మధ్యయుగపు దురాక్రమణ దారులు అనుసరించిన యుద్ధనీతి ఇదే. సైనికులు ఆ శవాలపై కూడా అత్యాచారాలు చేసేవారని చరిత్రకారులు చెబుతున్నారు. రాణి పద్మావతి సామాన్య స్త్రీ కాదు. ఆమె శౌర్యవంతుల వంశానికి చెందినది. రాజు మరణించిన తరువాత కోటలో తనతో పాటు ఉన్న వందలాది మంది స్త్రీల పరిస్థితి ఏమిటో, తాము ఎలాంటి అవమానాలను ఎదుర్కోవాల్సి వస్తుందో ఆమెకు బాగా తెలుసు. మొదట సుల్తాన్ అతని అనుచరులు, ఆఖరి సైనికుడి వరకు అందరి చేతిలో ఘోరమైన అత్యాచారాలు, అవమానాలు తప్పవని తెలుసు. ఆ తరువాత కూడా బ్రతికి ఉన్న స్త్రీలను బందీలుగా పట్టుకొని బానిసలుగా అమ్మేస్తారు. అందుకనే రాణి పద్మావతి తన వాళ్లందరూ అగ్నిలో ఆహూతి అవుతారు. ఈ విధంగా రాణి పద్మావతి రాజపుత్రుల్లో ప్రతీకార జ్వాలలను ప్రజ్వరింపజేసింది. ఆమె అనుకున్న ప్రజలు దాన్ని అక్షరాల పాటించి చైతన్యులయ్యారు. ఖిల్జీ ఆక్రమణతో చిత్తోర్ ఘడ్ ప్రజల్లో పౌరుషం, పరాక్రమాలు రాణి పద్మావతి త్యాగం వ్యర్థం కాలేదు. పదేండ్లలోనే రాజపుత్ర కిషోరాలు చిత్తోర్ ఘడ్ కోటను మరలా తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత చిత్తోర్ ఘడ్ రాజ్యాన్ని రాణా ఉదయ్ సింగ్, రాణా రతన్ సింగ్ ఇలా ఎంతోమంది భారతీయులు పాలించారు. వీరందరు చరిత్రలో చిత్తోర్ ఘడ్ కోట కీర్తిని దశదిశలా వ్యాపింపజేశారు. ఈ విధంగా రాణి పద్మావతి ఎంచుకున్నది, అనుసరించింది చావును కాదు వీరత్వాన్ని, అమరత్వాన్ని పాటించిందని చెప్పక తప్పదు.

ఈ వీరగాథే ఈ మధ్య కాలంలో 'రాణి పద్మావతి' గా సినిమా కూడా వచ్చింది. ఒక మహమ్మదీయుడైన మహా సైనికుడు మహమ్మద్ ఖిల్జీ ఒక హిందు మహారాణి సౌందర్యాన్ని చూసి తాను వివాహమాడాలని అనుకున్నాడు. దాని కోసం రకరకాల కుట్రలు పన్ని ఆ రాజుపై యుద్ధం చేస్తాడు. ఆ సందర్భంలో ఆ మహారాణి చితి పేర్చుకుని ఆత్మహత్య చేసుకుంటుంది. ఆ సందర్భంలో పింగళి లక్ష్మీ కాంతం గారు రాసిందే ఈ రక్త తిలకము. ఇలా రాణి పద్మావతి ధైర్యాన్ని, వీరత్వాన్ని హిందీ, ఆంగ్ల భాషల్లో రచనలు వెలువడ్డాయి. తెలుగు సాహిత్యంలో

పింగళి లక్ష్మీకాంతంగారు కూడా తొలకరి అనే ఖండ కావ్యంలో 'రక్త తిలకము' ఖండికలో రాణి పద్మావతి గురించి సుమారు ఇరవై పద్యాలలో రాశారు వాటిని గురించి తెలుసుకుందాం.

**2.2.12.2. రాణి పద్మావతి:**

*"హతవిధి! యెన్ని కష్టములు కగ్గము సేసితి తాతతండ్రు లం*
*చితగతినేలు రాజ్య రమణిన్ దురకల్ గ్రహియించి యేల దీ*
*నతమెయి నీ యవరాళి దినమ్ములుపుచ్చెడు నన్ను నేటికీ*
*గతిని గిరాతబాణహతి గారియపాలొనరించినాడవే "* (తొలకరి కావ్యం:46) అని

అంటూ ఈ మహమ్మదీయులు అరాచకాలు వాటిని ఎదిరించి రకరకాల కష్టసుఖాలతో ఎదురు నిలిచిన హిందు హైందవ స్త్రీల మనస్తత్వాలను వీటిలో వీరరసభరితంగా పింగళివారు వర్ణించారు. సాధారణంగా మహమ్మదీయుల్ని 'తురకలు' అని హిందూ కవులు ప్రయోగిస్తుంటారు. టర్కీనుండి వచ్చి, భారతదేశంలో స్థిరపడిన విదేశీ పాలకులను క్రమేపీ టర్కీలు... తుర్కలు, తురకులుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. అటువంటి తురుష్కులు తాము స్వాధీనం చేసుకున్న సామ్రాజ్యాల్ని నాశనం చేశారు. హిందువుల మూలాల్ని, ఆ పరాక్రమాల్నీ లేకుండా చేసే ప్రయత్నాల్ని కవులు జీర్ణించుకోలేక ఇలాంటఖండ కావ్యాల్ని రాశారు. పింగళి లక్ష్మీకాంతంగారు కూడా మేవాడ్ రాజ్యాన్ని నాశనం చేశారని పైపద్యంలో వర్ణించారు.

*"పాదుషహీ నెదెర్చి తమ ప్రాణములర్పణసేయు దండ్రియున్*
*గాదిలి యన్నదమ్ములు నఖండవరూధినితోడ, నన్నునౌ*
*రా దెసమాల్చి యిట్టుల సరణ్యముపాలొనరిచి మ్లేచ్ఛర*
*క్తాదనయోగ్యమైన నిశితాసిని గట్టెలగొట్టఁ జేసితే?"* (తొలకరి కావ్యం:46) అని

అంటూ రాణి పద్మావతి ఢిల్లీ సుల్తాన్ పాదుషాను ఎదిరించడానికి తన ప్రాణాలను సైతం అర్పించడానికి వెనుకాడదు. అంతకుముందే పాపాత్ములైన, అతిక్రూరేలైన పాదుషహీలకు బయపడి తండ్రి, అన్నదమ్ములు అడవులకు పారిపోతారు. కానీ రాణి పద్మావతి ఎంతో దైర్యంతో సుల్తాన్ ను ఎదిరించడానికి అఖండజ్యోతిలా మనకు కనపడుతుంది.

*" హర్షసంభ్రమపులకితమైన చేయి*
*సాచి, దరిఁజేరరమ్ము వత్సా యటంచు*
*దిగిన కౌగిటఁజేర్చి, రుధిరమయమ్ము*
*లైన యంగకముల నల్లనల్ల దుడిచి"*

*" జనకుని పంపునన్ ధరణిసర్వము తమ్మునకిచ్చి కానకున్*
*జను రఘురామమూర్తియన సజ్జన సింహుడువోవ మ్లేచ్ఛులన్*
*మునుమిడి కాల్పగా దనదుమూడవకంటిని విప్పు శంభుశం*
*కను గలిగించి రక్తతిలకమ్మును దాల్చి హమీరసింహుడున్ "* (తొలకరికావ్యం:47)

అని రాణి పద్మిని (ఆమెకి పద్మావతి పేరు కూడా ఉంది.) భర్త రతన్ సింగ్ యుద్ధంలో వీరమరణం పొందుతాడు. ఆ వార్త తెలిసిన రాణి పద్మిని అంతఃపుర స్త్రీలు ఆత్మహత్య చేసుకుంటారు. ఆ తరువాత రతన్ సింగ్ దాయాది లక్ష్మణసింగ్ ను రాజపుత్రులు రాజుగా ప్రకటించుకుంటారు. లక్ష్మణ్ సింగ్ పెద్ద కుమారుడు హరిసింగ్ రెండు కుమారుడు అజయ్ సింగ్. హరిసింగ్ కుమారుడు అమీర్ సింగ్, అమీర్ సింగ్ కుమారుడు సజ్జనసింగ్ ఈ వంశచరిత్రను అంతా కథలో అంతర్భాగంగా వర్ణించుకు పోయారు పింగళి లక్ష్మీకాంతం. అందుకనే కొన్ని పద్యాలు విడి విడిగా చదివితే అర్థం కాదు. అన్నదమ్ముల మధ్య సఖ్యత దేశ ప్రజలను కాపాడుట కోసం రాజ్యాల్ని కూడా త్యాగం చేయడం ఈ ఖండికలో పింగళివారు అద్భుతంగా వర్ణించారు. అజయ్ సింగ్ ఆరావళీ పర్వత ప్రాంతాల్లో అజ్ఞాతవాసం చేస్తూ, గుర్తుకు తెచ్చుకున్న గత స్మృతులే ఈ కవిత. అతడు తనలో తాననుకున్న కొన్ని మాటలివి.

*"కష్టసుఖములు కావడికడవ లనుచు*
*బలుకు పెద్దల వాక్యమ్ము పాటిచేసి*
*మూపు కాయలుగాయంగ మోయుచుంటి*
*గష్టపుంగుండ; దీనికి గడవులేదె?"* (తొలకరి కావ్యం:46) అని అంటూ పెరిగిన హమీర్, సజ్జన్సింహులను చూచి అజయసింహుడు బాధపడిన విధానాన్ని కాంతంగారు చక్కగా చిత్రించారు.

*"సమశీలవయస్కులు, ను*
*త్తమవిద్యానిధులు, శూరతాఖనులగు నీ*
*కొమరుల హృదయమ్ముల వి*
*క్రమరసమూరుటలు గనిన గడుపు చెఱువగున్"* (తొలకరి కావ్యం:48) అని చిత్తోడు రాజ్యానికి అన్న కుమారుడు హమీర్ సింహుడే తగినవాడని అజయసింహుడు భావించినప్పటి సన్నివేశంలోని పద్యం చూడండి.

*"నిడుదకనుల్, విశాలమయి నిగ్గులుదేరెడి ఫాలభాగమున్*
*వెడదయురమ్ము, రాజ్యరమణిన్ వహియించెడు నున్నతాంసముల్*
*కడు బెడగై హమీరునకు గన్పడు వీడెనిజమ్ముగా జితోడ్*
*గడెముజయించి యేలుకొనగా దగువాడనితోపజేయుచున్"* (తొలకరి కావ్యం:48)అని రక్తతిలకం ఖండకావ్యం చిన్నదే అయినప్పటికీ, భారతదేశంలో చిన్నచిన్న రాజ్యాలను విచ్ఛిన్నం చేయడం దాని వలన రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగాను మహమ్మదీయులు తమ పెత్తనాన్ని నిలబెట్టుకున్న వైనాన్ని ఈ పద్యాలలో ఉంది. పింగళివారు ఎంతో నైపుణ్యంగా వర్ణించారు. భారతదేశంలో చిన్నచిన్న రాజ్యాల మధ్య అనైక్యత, భారతదేశంలోని స్త్రీల అందచందాలు, విదేశీయుల్ని ఆకర్షించిన తీరును కూడా స్ఫురించేలా వర్ణించారు కవి.

*“కష్టసుఖములు కావడికడవ లనుచు*

*బలుకు పెద్దల వాక్యమ్ము పాటిచేసి*

*మూపు కాయలుగాయంగ మోయుచుంటి*

*గష్టపుంగుండ; దీనికి గడవులేదె? ”* (తొలకరి కావ్యం:46) అని

అంటూ ఈ పద్యాలను చదువుతూ ఉంటే మహామ్మదీయులు అరాచకాలు వాటిని ఎదిరించి రకరకాల కష్టసుఖాలతో ఎదురు నిలిచిన హిందు హైందవ స్త్రీల మనస్తత్వాలను వీటిలో వీరరసభరితంగా వర్ణించారు పింగళి–కాటూరి కవులు.

‘తొలకరి’ ఖండకావ్య సంపుటిలోని ఖండికలన్నీ పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్ల పేర్లతో జంట కవిత్వంగానే ముద్రించుకున్నారు. ఈ ఖండికలన్నీ భావకవిత్వం ధోరణులతో వర్ణించారని కొంత మంది పరిశోధకులు, విమర్శకులు భావిస్తున్నారు. తొలకరి కావ్యంలోని కొన్ని ఖండికల్ని పింగళి లక్ష్మీ కాంతంగారు, మరికొన్ని ఖండికల్ని కాటూరి వేంకటేశ్వరరావుగారు, మరి కొన్నింటిని ఇద్దరు కలిసి రాశారని పేర్కొన్నారు. కానీ స్పష్టంగా నిరూపించడానికి అవకాశం లేదు. సౌందరనందం కావ్యాన్ని కూడా ఇరువురు కలిసి రాసినట్లు, రాసుకున్నట్లు ప్రకటించుకున్నారు.

శబ్ద ప్రయోగాలు, శైలి, వస్తువు మొదలైన వాటిని ఆధారంగా చేసుకుని కొన్ని ఖండికల్ని ఎవరెవరు రాశారో పరిశోధకులు గూడూరి నమశ్శివాయ, పింగళి వేంకట కృష్ణారావు, పింగళి సూర్య సుందరం మొదలైన వాళ్ళు చెప్పే ప్రయత్నం చేశారు. మృదుమధుర మైన గ్రంథాలు శబ్దాలతో వర్ణించే పద్యాలను కాటూరి వేంకటేశ్వరరావుగారి రచన గాను, నారికేళపాకశైలిలో ఉండే పద్యాలను, వీరరసపూరిత వస్తు వర్ణనలను పింగళి లక్ష్మీకాంతంగారి వర్ణనలు గాను పరిశోధకులు వింగడించే ప్రయత్నం చేశారు. ఈ విషయాలను రాబోయే అధ్యాయంలో స్పష్టంగా తెలియజేస్తాను. ప్రస్తుతానికి జంటకవుల రచనలగానే తొలకరి కావ్యాన్ని ఈ అధ్యాయంలో పరిశీలించాను. ఈ తొలకరిలో ఒక పది ముఖ్యమైన అంశాల్ని, లేదా విశేషాంశాల్ని ఈ అధ్యాయంలో గుర్తించాను. వాటిని ఈ కింది విధంగా తెలియజేస్తున్నాను.

### 2.13. కావ్య ఫలితాలు:

1. ప్రకృతి వర్ణనలను ఎంతో ఉదాత్తంగా వర్ణించడం వీరి కవితా శైలిగా చెప్పుకోవాలి.2. అపూర్వమైన భావనా చమత్కృతిని పాటించడం వలన ఒక కవితా లక్షణంగా చెప్పాలి. 3. సామాజిక అంశాల కంటే ప్రకృతిగత వస్తువును సాహిత్యాంశంగా గ్రహించడం ఒక ప్రత్యేకతగా తెలుస్తోంది. 4. ఈ కవితా ఖండికలన్నింటిలోను మార్మికత ఉండటం ఒక విశేషం.5. ధ్వని గర్భితంగా వర్ణించడం దీనిలోని ఒక ప్రత్యేకత. 6. నేపథ్యం తెలియకుండా కేవలం ఖండికలు చదివిన వెంటనే స్ఫురించకుండా రచనా శైలిని కొనసాగించడం ఒక విశేషం. 7. ఈ ఖండికలలో ప్రకృతిని వర్ణిస్తున్నట్లు పైకి కనిపించినా అంతర్లీనంగా మానవ జీవిత తాత్త్విక రహస్యాల్ని పలికించడం వీరి నిశితమైన ఆలోచనలకు ఒక చక్కని నిదర్శనం. 8. కొన్ని ఖండికలలో

శాంతరసం, మరికొన్ని ఖండికలలో వీరరసం వర్ణించడం ఒక విశేషంగా చెప్పాలి.9. ఒక్కొక్క కవితా ఖండిక ఒక్కొక్క కావ్యంగా అనుభూతిని కలిగించడం ఈ కవుల ప్రధాన కవిత దృష్టిగా భావించాలి.10. భావ కవిత్వంలో ప్రధాన అంశాలైన ప్రణయం, స్వేచ్ఛ నిష్కలంకత్వాలను వర్ణించడంలో సఫలీకృతం అయ్యారని చెప్పుకోవాలి.

ఈ విధంగా 'తొలకరి' పద్యకావ్యంలో ఉన్న ఖండికలలో పింగళి–కాటూరి కవుల ప్రత్యేకతలు వ్యక్తమవుతున్నాయి. తరువాత అధ్యాయంలో పింగళి– కాటూరి కవులు జంటగా రాసిన 'సౌందరనందం' కావ్య వైశిష్ట్యాన్ని పరిశీలిస్తాను.

మూడవ అధ్యాయం

# పింగళి–కాటూరి

# 'సౌందరనందము' కావ్య వైశిష్ట్యం

**3.0.ఉపోద్ఘాతం:**

భారతీయుల జీవన సరళిలో జైన, బౌద్ధ, శైవ, వైష్ణవ మతాలకు సుధీర్ఘమైన చరిత్ర ఉంది. ఈ మతాలు ప్రాచీన కాలం నుంచి నిరంతర పరిణామం చెందుతున్నాయి. ఇవి నాటి నుంచి నేటి వరకు సమాజాన్ని ఎంతో ప్రభావితం చేస్తున్నాయి. అలా ప్రభావితం చేయడంలో మహానుభావుల ప్రభావం ఒకటి, మరొకటి వారి తాత్త్విక సిద్ధాంతాల ప్రభావం.

ప్రాచీన కాలం నుంచి నేటి వరకు విశ్వవ్యాప్తంగా బౌద్ధమతానికి ఒక ప్రత్యేకత గుర్తింపు ఉంది. దీనిలో బౌద్ధ ధర్మాలకు విశిష్ట స్థానం ఉంది. అహింసతో కూడిన బౌద్ధమతం ఒక ప్రత్యేక జీవన విధానాన్ని కలిగి ఉంది. బౌద్ధమతంలో బుద్ధుడు కేంద్ర బిందువుగా, ఒక గొప్ప సంస్కర్తగా, ఒక గొప్ప తత్త్వవేత్తగా కనిపిస్తాడు. బుద్ధుని జీవితం, బౌద్ధ ధర్మాలలో ధర్మం, త్యాగం, సత్యం, అహింస, శాంతి, ప్రేమ, మానవసేవ, వాత్సల్యం, దుఃఖం, కోరికలు, జ్ఞానం, బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి మొదలైన సుగుణాలున్నాయి. బౌద్ధమతంలో వివిధ సూత్రాలను అష్టాంగమార్గాలనీ, త్రిపీఠకాలనీ, త్రిరత్నాలనే పేరుతో పిలుస్తారు. బుద్ధుడు ఎవరు? బౌద్ధమతం అంటే ఏమిటి ? బౌద్ధ ధర్మాలు అంటే ఏమిటి ? అనే వాటి గురించి సంస్కృతం, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో ఎంతోమంది మేధావులు అనేక రచనల్ని రచించారు.

తెలుగు కవులు బుద్ధుని బౌద్ధమత తత్త్వాన్ని సాహిత్య వస్తువుగా తీసుకుని అనేకమైన రచనల్ని రచించారు. అవి ఆధునిక యుగంలో తిరుపతి వెంకట కవులు చరిత్ర, పింగళి కాటూరి కవుల *సౌందరనందము*, జంధ్యాల పాపయ్య శాస్త్రి 'కరుణశ్రీ', కరుటూరి సత్యనారాయణ *కరుణా సౌగతము*, జి.వి కృష్ణారావు *బొమ్మ ఏడ్చింది* నాటిక, సంజీవ దేవ్ కుణాలుడు, చర్లా గణపతి శాస్త్రి బుద్ధ భగవానుని చరిత్ర, పెన్మత్స రాజంరాజు బుద్ధ పురాణం, బోడేపూడి వెంకటరావు కళా క్షేత్రం, దుర్భా రామమూర్తి త్యాగం, వారణాసి వేంకటేశ్వర్లు ఏణరాజు, వడ్లమూడి సిద్ధయ్యకవి కరుణా లోకం, బుద్ధ హృదయం ఎస్.టి. జ్ఞానానందకవి ఆమ్రపాలి, దాశరథీ మహాబోధి, ప్రసాదరాయ కులపతి కరుణా సింధువు, బొద్దులూరి నారియణరావు శాంతి పథము మొదలైన గ్రంథాలు బౌద్ధమతాన్ని అనుసరించి వచ్చినాయి. ఈ క్రమంలోనే పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు జంట కవులుగా వివిధ ఖండికలను రాయడమే కాకుండా కావ్యాలను కూడా రాశారు.

ఇంతకుముందు అధ్యాయంలో ఈ జంట కవులు రాసిన 'తొలకరి' కావ్య సంపుటిలోని వివిధ ఖండికలను పరిశీలించాను. ఈ అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు కవులు జంటగా రాసిన 'సౌందరనందం' కావ్య వైశిష్ట్యంలోని ముఖ్యాంశాలను తెలుసుకుందాం.

సౌందరనందం కావ్యంపై ఇంతకు ముందే చాలామంది పరిశోధన చేశారు. అందువల్ల ఇంచుమించు వారి అభిప్రాయాలనే అవసరమైనంతవరకు ఇక్కడ స్వీకరిస్తున్నాను. తద్వారా పూర్వపరిశోధకుల అభిప్రాయాలకు గౌరవం ఇస్తున్నట్లుగా భావిస్తున్నాను.

సంస్కృతంలో అశ్వఘోషుడు 'బుద్ధ చరిత్ర' 'సౌందరనందం' అనే కావ్యాలను వర్ణించాడు. ఆ ప్రభావంతో అనేక మంది బౌద్ధ కావ్యాలను రాశాడు. ఆ కవులలో తిరుపతి వేంకట కవుల్లో చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారి శిష్యుడు పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగారితో కలిసి తెలుగులో సౌందరనంద కావ్యాన్ని రాశారు. సంస్కృతంలో సౌందరనందాన్ని 19 సర్గలుగా వర్ణిస్తే దాన్ని తెలుగు సౌందరనందములో తొమ్మిది సర్గలుగా పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావు కవులు రాశారు. ఈ కావ్య వైశిష్ట్యాన్ని పరిశీలించేముందు కావ్యంలోని ఇతివృత్తాన్ని తెలుసుకుందాం. తెలుగు సౌందరనందంలో తొమ్మిది సర్గలలోని ఇతివృత్తాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తాను.

### 3.1. ప్రథమ సర్గ పునరాగమనం:

సిద్ధార్థుడు, కపిలవస్తు పురాధీశ్వరుడైన శుద్ధోధన మహారాజు కుమారుడు. తల్లి మాయాదేవి, భార్య యశోధర, కుమారుడు రాహులుడు. యౌవన ప్రాయంలోనే సంసారంలో గల సుఖదు:ఖాలకు విరక్తుడై, సిద్ధార్థుడు సత్యాన్వేషణా తత్పరుడవుతాడు. తన తోడిదే లోకమని వున్న వృద్ధుడైన తండ్రినీ, తన వక్షస్సున రాలి నిద్రిస్తున్న ప్రేమమూర్తి యశోధర, కుమారుడు రాహులుని, ప్రేమను రాజ్యలక్ష్మినీ పరిత్యజించి, సత్య మార్గాన్ని అన్వేషించి, చివరికి నిర్వాణపథం కనుగొంటాడు. ఆ మహాత్ముని ఈ త్యాగమహిమను విని త్రి కాలాలు (భూత, భవిష్యత్, వర్తమానములు) రోమాంచాన్ని పొందుతాయి. ఆయన బోధించిన ధర్మం సప్త ద్వీపాలకు వ్యాపించింది.

*" యన్మహాత్యాగ మహిమంబు నాలకించి,*
*మూడుకాలముల్ రోమాంచమును వహించు*
*నేడు దీవులకున్ బ్రాకి యెవని ధర్మ*
*లతలు వనలెత్తె నాశాక్యపతి సుతుండు"*

(సౌందరనందము,2001:7)

ఈ విధంగా నిర్వాణ పథాన్ని కనుగొని సిద్ధార్థుడు బుద్ధ భగవానుడిగా మార్పు చెందాడు. అంటే పరమ జ్ఞానాన్ని పొందాడనే అర్థం స్ఫురిస్తుంది. బుద్ధుడు కపిలవస్తు

నగరానికి తిరిగి వచ్చి, ఆత్మ బోధను, మానవ కోటిపైన ఎంతో దయతో, జాలితో బోధించాడు. ధర్మచక్రప్రవర్తకుడైన ఆ మహాత్ముడు, పాలసముద్రాన జన్మించిన సుధాకలశాన్ని దాల్చి, స్వర్గవాసులను కాపాడడానికి వచ్చిన దివ్య వైద్యునిలాగా, ఈ లోకాన్ని ఉద్ధరించడానికి అడవులను వదలి కపిలవస్తు నగరానికి వచ్చాడు.

### 3.2.ధర్మచక్ర ప్రవర్తనం:

ఈ విధంగా వారణాసి మొదలైన ముఖ్య ధర్మక్షేత్రాలను ఆ మహాత్ముడు ధర్మబోధ చేయగా, తల్లిదండ్రుల దగ్గరకు వస్తాడు. అప్పుడు ప్రజలందరు ఆయన ధర్మామృతాన్ని బోధించడానికి ప్రయత్నిస్తాడు. బౌద్ధాన్ని బోధించడంలో పండితులు సామాన్య ప్రజలు అనే భేదభావం లేకుండా, అందరికి శోకరహితమైన పదాన్ని చేర్చు ధర్మాన్ని, బోధిస్తూ, క్రమక్రమంగా కపిలవస్తు నగరానికి చేరుకంటాడు. ప్రజలు ఆయనను చూసి ఆశ్చర్యపడి ఎంత భాగ్యమో అని ఆయన ఉపదేశాన్ని, సందేశాన్ని చూస్తూ వింటూ బుద్ధుని దగ్గరకు వస్తారు.

### 3.3. బిక్షాగమనం:

ఇందులో బుద్ధుడు, తన సవతి తమ్ముడైన నందుని ఇంటికి భిక్షకోసం వెళ్తాడు. ఆ సమయంలో సుందరీ నందుల ఎంతో ప్రణయ కలాపాల్లో ఉంటారు, మహాత్ముడైన శాక్యమునీంద్రుని ఒక సవతి తమ్ముడున్నాడు. అతడు యువకుడు, తేజోశాలి. అతని పేరు నందుడు. అతని భార్య సార్థక నామధేయురాలు సుందరి. కేళీమందిరంలోను, పుష్పోద్యాల్లోనూ, నిరంతరం సుందరితో ప్రణయమగ్నుడైన నందుని ‘‘వీనులందు బుద్ధభగవంతుడి ధర్మాలు పడునో? అతని ఆత్మయందు ప్రవేశించునో? అన్న రెండో పద్యంలో ఈ సర్గ కథాంశ ప్రాచుర్యాన్ని సూచిస్తోంది. నందుడు సుందరి ప్రేమ సుధాసాగర నిమగ్నతలో విశ్వమునే విస్మరించాడు. ఆ హంసయాన, భాస్కరుని అనుసరించే ఛాయవలె ఆనందభాస్కరుని ఎప్పుడూ ఎడబాయదు. ఆ దంపతులకు సౌందర్యంలో, ప్రణయంలో సమానులైన వారు ఈ లోకంలో సాటి గలవారు లేరు. వారు రతిమన్మథులకు లక్ష్యభూతులు, మోదాన్ని నిత్యమాంగల్యానికి వారాశ్రయులుగా ఉపక్రమించుటకు సాధ్యంకాని ఉత్సాహ విజయాలే వారు. కానీ ఎప్పుడు చూడని ఆకాశ పువ్వులు కొత్త పరిమళంతో సమకూర్చినట్లుగా వారున్నారు. వారి జీవితం మధురంగా నవ యౌవ్వనంతోన ఉన్న ఆ నందుడు సుందరి జంటగా ఉంటారు. ఇలా ప్రణయంలో మిథునంలో విహరిస్తూ ఉండేవారు. నందుడు పూలు కోస్తే, సుందరి పూలను హారాంగా, అందంగా కూర్చేది. సుందరి రంగులు కలిపి ఇస్తే నందుడు పారాణి రాస్తాడు. నందుడు ఒక సుకుమార భావం వెల్లడిస్తే, దానికి అనుగుణవగా మరో పద్యాల్ని సుందరి చెప్పేది. సుందరి చక్కగా రాగాలాపన చేస్తే, పులకించి నందుడు వీణపై పలికిస్తాడు. ఈ పద్యాలను జంటకవులు కలిపి కవిత్వం చెప్పినట్లుందని విమర్శకులు భావిస్తున్నారు.

ఈ విధంగా నందుడి, సుందరి చూపులలలో ఎరుసెరలు సుందరి ముఖాన చంద్రుని కెంపుల నివాళిగా కనిపిస్తుంది. సుందరి కాటుక కన్నుల చూపు, నందుని పక్షమునకు నల్లకలువ పూలతోరణంగా వీరి జీవితం సత్యమైతే వారికది విశ్రాంతి నెరుగని స్వప్నంగా కొనసాగుతుంది. ఈ సత్య స్వాప్నాల విషయం వేదాంతంలోనిది. సుందరి తాను అలంకరించుకోవడానికి నందుడు అద్దం తీసుకొని నిలబడాలి. ఆమె అద్దంలోని తన ప్రతిబింబాన్నీ, తన ముఖాన్నీ, చూస్తూ కుంకుమలో తన వేలును అద్ది నవ్వుతూ రాసుకుంటుంది. సుందరి, తన చెక్కిళ్లపై, రంగరించించుకున్న పత్రిభంగాలను మందహాసంతో చూస్తూ నందుడు 'ఉఫ్' అని ఊదితే, ఆ ఊర్పులకు గాలిలో తుంపురులుగా తళతళలాడుతూ మెరిసే అద్దాన్ని మాయ చేసినట్లుగా ఉంటుంది. నందుని చూపులతో ఆనందిస్తూ, దాన్ని చూచి రోషంతో ఎర్రని పెదవులు కనిపించగా, బొమ్మ ముడిపెట్టి సుందరి తన చెవిలోని కలువ పూవు అతని పైకికి విసరి మనోహరంగా నడుస్తూ వెళ్లే ప్రయత్నం చేస్తుంది. నందుడు సుందరిని అడ్డగించి, పైట చెంగును పట్టుకోగా, ఆమె దానిని వదిలించుకొని వెళ్లుతుంటే, సరదాగ పరిహాసానికి 'ఉఫ్' మని అంటూ నందుడు సుందరితో ప్రణయంతో జీవిస్తాడు.

తలలో ధరించిన పువ్వులు ముందుగా నేల రాలతాయి. ఈ విధంగా సుందరి పాదాల మీద రాలి వెరపు వెల్లడించు చూపులతో నందుడు ఇలా అంటాడు. "*సన్నీలిన దేవీ నీ చూడ్కులనెడి ఉరులను ఏల బిగించెరవు? నీ మనఃప్రియ శకుంతమైన హృదయాన్ని విలపించునట్లుగా, ఏల ఇట్లు ప్రవర్తిస్తావు? నా వలన తప్పు జరిగితే చేతులు వంచి నిన్ను ప్రార్థిస్తున్నాను. నేను నీ దాసుడను నన్నేలుకొమ్ము!' సుందరి పకపక నవ్వి, నందుని చూచి ఇంతలోనే 'నీ బింకం సడలిపోయినదేమి? ఇంత పాటకే కాసర కూసం ఆయితివి'* అని నందుని కౌగిట చేరి తన చేతులతో చెక్కిళ్లను దువ్వుతుంది. "అక్కటా! ఈ పాపపు కోపంతో అపురూపమైన కెంపునన్నెతో నొప్పనా ప్రియుని కపోలాన్ని వెల్లబోవునట్లు చేసితిని, నాది కటిక గుండె నందుని హృదయంలో ఆనందం నిండుకొనగా, అతని చెక్కుటద్దంపై అనురాగంతో సుందరి ముద్దుపెట్టుకుంటుంది."ఊరడించుట యందు మృదువైన హృదయం కలవాడా నాథా అంటూ తీరమేలేని అగాధ హృదయ రాజ్యాన్ని ఏకచ్ఛత్రంగా ఏలాలని కాంక్షిస్తాను. లఘు హృదయము, నన్నెట్లు మన్నింతువో?" "అపరాధ ప్రియకారితానవనవంబౌ ప్రేమ లీలాసుధన్ గృహమై మచ్చపలాంతరంగమున నిక్షేపించి, యీ దాసురా లివయిన్ జూపునను గ్రహమ్మునకు గల్పింతున్ మదాత్మాంబు జమ్ము పచారమ్ముగ నల్పమం చనక యెట్లో స్వీకరంపంగరే" అపరాధ ప్రియములను నొనరించునది, సూక్ష్మమైనది, సత్యనూతనమైనదీ, అయిన ప్రేమ లీలామృతమును కృష్ణతో, నావంచల హృదయంలో, నిషేపించి, ఈ దానురాలి యెడ అనుగ్రహం చూపించావు? ఇలా మనస్సుకు ఇష్టములై ముగ్ధములయిన మాటలతో అక్కువ రాలిన సుందరిని హృదయమున

చేర్చుకుని ఆమె పొవటను సవరిస్తూ ఆమె ఫాలాన్ని చుంబింపగా ఆమె తేరుకున్నది. ఆమె ముఖాన్ని చూసి నందుడు ఈ విధంగా అంటాడు. ‘‘కోపమునెడి మేఘాల మాటున నీ ముఖచంద్రుడు ఒక్క క్షణకాలం మరుగునపడి వెంటనే ప్రకాశమానములైన చిరునవ్వు వెన్నెలలు వ్యాపించునట్లు, మరల నా యెడల ప్రసన్నుడగుట, ఓ కాంతా! వినూతనమైన ఉత్సవమిది కాదా? మనమిరువురమిట్లు పోషించుకొను ప్రేమ అనే కల్పలతకు ఇదే కదా దోహద కార్యం. రెండు చేతుల నిన్ను కౌగిలించుకోడానికి కాంక్షిస్తాను. నీ విన్నాణాన్ని దోయిలింప కోరుతాను, నవ్యామృత నిర్భరములైన నీ చూపులను నా చూద్కులతో పానం చేస్తాను. నీ యూర్పుల్లోని సుగంధాన్ని నా శరీరం చందంతట ఘ్రాణములు చేసుకుని ఆఘ్రాణిస్తాను.

నీ సౌందర్యానికి అంజలిఘటిస్తాను. అనురాగ రంజితమైన వామనోరత్నాన్ని శకలాలుగా చేసి నీకు కంఠహారాన్ని రచిస్తాను. ముగింపు లేకుండా, నా హృదయ ప్రబంధాన్ని విశద రీతిగా నీకు వినిపిస్తాను. కాంతా అనుంగ లతలు పుష్పించేటట్లు, నీ మనోరథాలు ఫలించేటట్లు, తీరాల. నొరసికొని ప్రవహిస్తున్న మమతా స్రవంతిలో, మనం తేలిపోవురము గాక మనకు ఇతర తలంపులు వలదు. అరమరికలు లేని కూర్ములతో ఆడుతూ, పాడుతూ, ప్రేమామృతాన్ని పావనం చేస్తూ మనం చరింతుము గాక) ఓ మనస్వినీ! నీ చెక్కిళ్లపై మరల మకరికా పత్రాలను రచించుకొనుము. అని మందహాసముఖుడై సరసంగా ఆ నందుడు మరల నిలువుటద్దాన్ని దాల్చి నిలిచాడు. ఇలా, దర్పణాన్ని దాల్చి నిల్చిన తన పతి ముఖాన్ని మాటిమాటికి చూస్తూ, ఆ సుందరి వెక్కిళ్లలో మకరికా పత్రభంగాలను రచించుకున్నది. ఆమె ముఖం శైవలంతో కూడిన పద్మంలాగ వెలుగుతుంది. చంద్రకాంత శిలా నిర్మితమైన, అందంగా సుందరమై, ఆకాశాన్ని చూస్తున్న ఇంటిలోని గదిలో శృంగార భోగాలతో, సుందరిన, నందులు ఉంటారు. ఆ సమయంలో, మధ్యాహ్నం బిక్ష కోసం, వారున్న ఇంటి ముందరకు గౌతమ బుద్ధుడు వచ్చి ‘‘ భవతీ *భిక్షాం దేహి*’’ అని పలికి, బిక్షను అడుగుతాడు. చెలికత్తెలందరు, వారి వారి పనులల్లో నిమగ్నమై ఉండడం వలన బుద్ధుని పిలుపులకు ఎవరూ స్పందించలేదు.

‘‘ఎవరు వినరు బుద్ధుని పిలుపు’’ నిస్సంగుడైన శాక్యమునీంద్రుడు లోనికి వెళ్లక, ఇతరుల గృహాల వలెనే తన తమ్ముని గృహాన్ని సైతం భావించి, ఒక్క నిమిషమాత్రం నిలిచి, ‘అస్తి నాస్తి’ అని మాట విన పడక పోవడం వలన వెనక్కి పోతాడు బుద్ధ భగవానుడు. బుద్ధుడు ఈ విధంగా వెనక్కి పోవడాన్ని చూసిన ఒక చెలికత్తె ఈ చరిత్రాన్ని ఇలా వెలయించాలని వున్న దైవయోగము వలన ‘పూజ్యనిగర్హణ నింద’ తమ స్వామి అయిన నందునిపై పడునేమోయని భావించి నందుని చెంతకు వెళ్లి, ఈ వృత్తాంతాన్ని విన్నవించింది. అందుకు నందుడు చాల చింతించి పరమ పూజ్యుడైన ఆ మహానుభావుని సన్నిధికి వెళ్లి పాదములపై బడి, మరలా ఇంటికి భిక్షార్థమై తోడుకుని రావడానికి అనుమతింపవలసిందని

సుందరిని ప్రార్థించాడు. గురు చరణ సేవగావింప అరుగుతున్న తనకు కంఠ హారము కనుల వెలుగైనా ప్రాణనాథుడు నందుని, సుందరి అనుమతించింది. కానీ విశేషకం తడియారక ముందే తిరిగి రావాలని ఆదేశించింది. అలా తిరిగి వస్తే, కౌగిలించి, చుంబించి, ప్రణయానుగ్రహాన్ని ఆమె కాన్పింప చేస్తుందట. అందుకు అంగీకరించి వ్యాకుల చిత్తంతో నందుడు భగవంతుని తోడుకొని రావడానికి బయలుదేరాడు. బుద్ధగతమైన పరమభక్తి అతనిని ముందుకు లాగుతుంది. సుందరి మీద గల అనురాగం వెనక్కి లాగడం జరుగుతుంది. ఆ విధంగా సముద్రంలోని అలల మధ్యలో చిక్కుకున్న కలహంతో, కదలలేక, నిలవలేక , అతడు అనిశ్చితిలో పడి ఎలా అయినా బుద్ధుడు ఉన్న ప్రదేశానికి చేరుకోవాలని ఆత్రుతతో బయలుదేరుతాడు నందుడు.

### 3.4. పరివ్రాజనం:

ఈ సర్గలో నందునికి బుద్ధుడు ఇచ్చిన బలవంతపు సన్యాస దీక్షకు సంబంధించిన కథను వివరిస్తుంది. బుద్ధభగవానుడు, గాలిలేని చోట నిశ్చలంగా కొడిసాగి వెలిగే దీపశిఖవలె, నిశ్చల కాంతి రాశియై వెలుగుతూ, మేరుపర్వతంపై నడచు విధానాన్ని, తలపించే విధంగా పురవీధికి వచ్చినాడు. అలా, వస్తున్న ఆ భగవంతుని దూర, దూరంగా కపిలవస్తునగరానికి ఆభరణాలైన రాజపుత్రులు, వస్తున్నవారు గురుదేవుడని నిరూపించుకుని, తమతమ వాహనాలు దిగి, తమ యౌవనాన్ని, రాజత్వాన్ని పక్కకు పెట్టి, ఆయన ఎదుట సాగిలపడి నమస్కరించారు. ఆ మునీంద్రుడు చేయి చాచి మీకు 'భవమోచనమస్తు' అని దీవించాడు. ఆ తరువాత ముందుకు పోవడానికి ప్రయత్నించే లోపే, అంగడి వీధులలో క్రయవిక్రయాలు చేసే వారందరు, కరుణాసాగరుడైన గౌతముని చుట్టూ చేరారు. ఆ మునీంద్రునికి నమస్కరించడానికి వారందరూ మేమంటే మేమని ఒకరికి నొకరు పెనుగులాడారు. ఆ. సమయంలో, నందుడు, వదనమున చెమట బిందువులతో ఆ ఎండలో, గురుదేవుడు ఉన్న ప్రదేశానికి వస్తాడు. దేవతలకు సైతం దుర్నిరీక్ష్యమైన మహాతేజస్సుతో జన్మవిముక్తికి దారి చూపు ధ్వజము వలెనున్న గురుదేవుని చూచి, రోమాంచితుడై నందుడు తన మనస్సున మందరిని తప్ప, సమస్త బహిర్వస్తు జాలాన్నీ విస్మరించాడు.

మునీంద్రుని సన్నిధికి పోవడానికి సందు లేనందున, అతడు దోబూచులాడుచున్నట్లు ఆ జనం లోపల తిరుగుతూ వుండగా బుద్ధుడు అప్పుడే నందుడిని చూసి, ఆ జనాల ప్రవాహాన్ని దాటి ఒక ఏకాంతమైన వాతావరణంలో తన తమ్ముడికి దర్శనమివ్వడానికై చేరుకున్నాడు. ఈ అవకాశానికి నందుడు సంతోషించి, మోము వాల్చి అస్ఫుటాక్షరాలతో కంఠ ధ్వని త్వరపడగా, గురువర్యులతో ఇలా అన్నాడు. ''దేవర వారు భిక్షార్థమై వచ్చిన సమయంలో ప్రాసాదం లోపలి భాగంలో వుండడం వలన మీరు వచ్చారని తెలుసుకోలేకపోయాను. దయామూర్తులైన మీరు నేను చేసిన తప్పును మన్నించి, మరల వచ్చి ప్రేమతో మీ మరదలైన సుందరి ఇచ్చే భిక్షాన్ని స్వీకరించాలని వేడుకుంటాడు నందుడు.

ఇప్పటికే ఆలస్యమైంది. రెండు రాత్రుల కాలమైందని వినయమధురంగా తెలియని నందుని, కడగంట చూసి భవంతుడు ఆ నాటికి భిక్షం అవసరం లేదని బుద్ధుడు చెబుతాడు. తర్వాత శ్రద్ధా భక్తి సంపన్నమైన నగర ప్రజలు, అన్నదానాన్ని బుద్ధునికి ఇస్తారు. బుద్ధుడు తన దగ్గర ఉన్న భిక్ష పాత్రను నందుని చేతిలో పెడతాడు ఇది నందుని పరివ్రాజక దీక్షకు తొలి శుభంగా సూచకగా భావించవచ్చు. బుద్ధుడు మౌనంతో ముందుకు సాగిపోతు ఉంటాడు. నందుడు అతని అభిప్రాయాన్ని తెలుసుకోలేక, రెండు మూడు అడుగులు వెంట వెళ్లి, మళ్ళీ వెనుకకు తిరిగి తన ఇంటికి వెళ్లడానికి ప్రయత్నించి అది తప్పని భావించి, మరలా బుద్ధుని దగ్గరకు పోయాడు. ఆ మునీంద్రుని నిలిపి ప్రశ్నించుటకు నందుడికి నోటి మాట రాలేక, అలా ప్రశ్నించడం వలన అతి ప్రవర్తన కావచ్చని అతి వినయం కావచ్చునని, నందుడు అనుకుంటాడ. సుందరి చెక్కుటద్దముపై నిల్చిన చిత్తాన్ని మరలించడానికి సాధ్యపడలేదు.

నందుని మనస్సులో అంతర, బహిర ఇంద్రియాలకు అనుకూలంగా నశించింది. అతడు వివశుడై బుద్ధుని వెంట వెళ్లాడు. నందుని మనస్సులోని కల్లోలాన్ని తెలుసుకొని కూడా, బుద్ధుడు అతనిని అనుగ్రహించాలనే కృపాచిత్తంతో, తపోబలంతో, ధర్మబలంతో అతన్ని బంధించి మారవికార దూరమైన, బౌద్ధ విహార భూమికి తీసుకువచ్చి ఈ విధంగా అన్నాడు ‘‘తండ్రీ ఎప్పుడూ ఎండకన్నెరుగని, నిన్ను విడిచిపెట్టలేక, కరుణతో ఇంత దూరం తీసికొని వచ్చాను. నీకు దివ్య విజ్ఞానం సిద్ధించుగాక అని నీవు పడిన ఈ శ్రమకు కడపట అనంత సుఖం లభిస్తుంది. ప్రాణి జన్మించినది మొదలు త్రాచుపామువలె మృత్యువు వెన్నాడుతూనే వుంటుంది. బ్రహ్మ సైతం మృత్యువశుడై ఉండగా, ఇతర ప్రాణిజాతన్ని గురించి చెప్పడం దేనికి? ఈ లోకంలో నిత్యమైనది ఏది లేదు. కానీ, లోకానికి కన్నులు ఉండి కూడ, ఈ సత్యాన్ని కాంచలేదు. మృత్యువు దయా రహితమైనది. అది, తల్లి బిడ్డలకు, ప్రియులకు ఎడబాటును, బాధను, విషాదాన్ని కలిగిస్తుంది. ప్రేమ బంధాల్ని,అనురాగ బంధాల్ని కూడా తెంచివేస్తుంది. విధిని ఎవరూ నిర్ణయించలేరు. ఈ లోకంలో దాని చేష్టలకు ప్రతీకారాలు లేవు. ఎపుడైనా, ప్రాణికోటి మృత్యువశం కావలసిందే. మరణ సమయంలో విలపించి లాభం లేదు. ఈ జరారుజలు రెండూ, ఘోరరాక్షసులు. ఇవి మృత్యుదేవతకు రెండు కన్నులు. మరణానికి ముందే, దానికి చెయ్యవలసిన కార్యాలను, ఈ జరారోగాలు చేస్తూ వుంటాయి. శరీర సౌందర్యాన్ని, కాలం హరించి వేస్తుంది. వార్ధక్యంలో తన దేహమే తనకు రోతను కలిగిస్తుంది.

ఈనాటి ప్రణయ బంధాలను ఆనాటి వరకు నిలిచి ఉండవు. యౌవనం అనేది. నీటిలోని బుడగ వంటిది. కానీ దుఃఖానికి కారణమయిన కాలం ఆక్రమించక ముందే సౌఖ్యదాయకమైన యోగధారణ ప్రయత్నం చెయ్యాలి. అజ్ఞానం అనే నిద్రనుండి మేలుకోవాలి. మదన, వికారాలకు లోబడి, ఇంద్రియార్థాలకై పాటుపడడం, కడపట చేటునకే కారణమౌతుంది. అజ్ఞాన వశంతో మదన వికారాలకు లోబడి ఈ ప్రపంచాన్నీ మరచిపోయి

ప్రవర్తిస్తున్నావు. ఇకనైనా కన్నులు తెరచి మంచి బుద్ధితో కాంతదాసుడు అనే వ్యామోహాన్ని మరచి ఈ సంసార సాగరాన్ని పూర్తిగా వదిలేయి. నీకు నేను దారి చూపిస్తాను'' అని బుద్ధుడు నందుడితో అంటాడు. తనతో సమానమైన శిష్యుని ఒకణ్ణి పిలిచి, కుమారనందునకు ధర్మదీక్షను ఇవ్వమని ఆదేశిస్తాడు. అతడు నందుని తోడుకొని పోతాడు. ధర్మదీక్షను ఇవ్వడానికి ప్రయత్నం చేస్తుండగా, నందుడు ఒక్కసారిగా తెల్లబోయి, వణుకుతూ, తనకు దీక్ష వద్దని అంటాడు. నందుడు శిష్యుని పాదాలపై పడి వేడుకుంటాడు. ''నా ప్రాణ సమానురాలైన ప్రియురాలిని విడచి ఒక్క క్షణకాలం పాటు కూడా, కూడ ఉండలేను. నా హృదయంలో నున్న సిగ్గు, భయం నన్నాక్రమింపగా మా సోదరుడు బుద్ధునితో 'ఔను', 'కాదు' అని చెప్పలేకపోయాను. ఆ సత్యాన్ని నీకు చెబుతున్నాను. దేవతలను వరమడగి నా శరీరాన్ని తరుణీమణి సుందరి గ్రహించినది. ఈ జీవితం, ఈ శరీరం సుందరికే సొంతం. పరధనమైన దీనిని నా ఇష్టం వచ్చినట్లు ఉపయోగిస్తే పాపం పాలు కావలసి వస్తుంది. పరధనాన్ని ఇష్టము వచ్చినట్లు వాడకూడదు కదా అంటున్న నందుని మాటలు విని, ఆ మునీంద్రుని శిష్యుడైన భిక్షువు, ''కుమారా! నీవు మిక్కిలి బేలవై తెలిసికొన జాలకపోతివి. గురుదేవుడు పరమ దయానిధి. మనకందరికి ఆయన అనతి శిరోదార్యం, మహనీయుడూ, లోకపూజ్యుడూ, అయిన అతనికి సోదరుడగుట నీ మహాభాగ్యం. ధర్మంలో కూడ నీవు నీ వంతును పంచుకోవలసిన ఈ విషయాన్ని ఆలోచించాలి. సంతగింపక, మంగళకరమైన ధర్మపథంలో అడుగుపెట్టుమని బలవంతంగా, ధర్మదీక్షలో నందుడ్ని కూర్చోబెడతారు. ప్రవేశ మార్గాలు నిర్వర్తించి, ఆ భిక్షువు నవమన్మథాకారుడైన నందుని కూడ క్షణంలో ముడుపులు కట్టించి బౌద్ధభిక్షువుగా మార్చుతారు. నందుని అవస్థను చూస్తే వర్ణించలేము. అతడు నడి సముద్ర తుఫానులో చిక్కుకొని తీరం దాటలేక బయటపడటానికి ప్రయత్నం చేస్తాడు. నందుడు ఉడుత లాగా ఆకాశం నుంచి వచ్చిన యమకింకరుల బారినుండి తప్పించుకొవడానికి ప్రయత్నించి ప్రాణాలతో బయటపడడానికి అవస్థల్ని భరిస్తాడు. చివరకు ఆ భిక్షువులతో పెనుగులాడి, వేడుకొని బిగ్గరగా అరుస్తూ నందుడు సొమ్మసిల్లి పడిపోతాడు. ఇలా సుందరీ ప్రాణమైన నందుడు భిక్షువుల చేతిల్లో చిక్కి అనేక బాధల్ని మానసికంగా అనుభవిస్తాడు.

### 3.5. నిరీక్షణ:

నందుని శాక్యమునీంద్రుడు తన వశం చేసుకుని విహారానికి తీసుకుని వెళ్లాడు. మొదలుగా, సుందరి అతని కోసం ఎంతో నిరీక్షించింది. ఇంటి గవాక్షంపై ముఖాన్ని వాల్చి సొగలు తీగలై విస్తరిస్తున్న చూపులతో ఆమె నాలుగు దిక్కులు అనేకసార్లు కలయ చూచింది. పలుదిక్కుల వీక్షిస్తూ అతడు రాగానే తాను దండించగలనని భావించినది. ఒకవేళ తన వెనుక వచ్చి నిల్చినాడేమో అనుకుని, ఆశతో వెనుదిరిగి చూస్తుంది. మరలా, వీథుల దిశచూస్తూ, తన నీడ తనే చూచుకుని ఉలికిపడుతుంది. చాలా సమయం ఈ విధంగా తన

ప్రియుని దర్శనభాగ్యం లేకపోవడంతో, ఆమె మనసు ఎంతో తల్లడిల్లిపోయింది. ఒక పట్టును నిలవడానికి కాళ్లు ఒకచోట ఉండలేకపోయాయి. ఆమె మనసు అంతలా శోకంతో నిండిపోయింది. సుందరి పాన్పుపై తన శరీరాన్ని వాల్చింది. ఆమె హృదయంలో కామక్రోధాలు రెండు సమ్మిలితమై అమిత సంక్షోభం కలిగించాయి.

నందుడు ఏర్చికూర్చి తన కబరీభరంలో పూచిన పూలు చెదరిపోయాయి. రత్నాల హారం చిక్కులు పడింది. దారం తెగిపోయిన ముత్యాలపరుస లాగా ఆమె కన్నుల నుండి కన్నీటి బిందువులు ధారాళంగా జాలువారాయి. ఆమె శరీరం చెమటతో ఒక చిన్న ప్రవాహంలా శరీరమంతా ఉంది. ఆమె ఎంతో మదనపడుతుంది. సుందరి తన హృదయాన్ని వెల్లడించడానికి ఇంతకన్నా ఏమి చెప్పగలం. ఈ విధంగా సుందరి మనసు ఉన్మత్త స్థితిలో పాన్పుపై అడ్డంగా పడిపోయింది. సుందరి దగ్గరే ఉన్న చెలికత్తెలు ఎంతో దిగులుపడ్డారు. శృంగార విధానమైన ఆమె, ఇలాంటి అవస్థకు లోనుకాగా, అంతఃపురంలో మాంగల్యం తొలగిపోయి, మనకలు కమ్మినట్లయింది. చెలికత్తె ఒకరే నందుని ఉనికిని తెలుసుకొని వస్తానని మెట్ల వెంబడి ఇంటిని దిగింది. ఆ శబ్దం విని, తన భర్తయే వచ్చినాడని భావించి సుందరి హృదయంలో బావ పరంపర తరంగాలు లేచాయి. ఎదురుగా వెళ్ళి కౌగిలించుకోవాలనీ, ఆలస్యానికి కారణాన్ని గురించి అదలిస్తాననీ, స్వాంత్వనాత్మకములైన అతని మృదుసులు విని, హృదయాన్ని సమాధానపరచుకుందుననీ, పలువిధాల డోలాందోళన చిత్తమై, సౌధసోపానతలం గాంచి నిరాశపడింది. ఆమె ఈ పరిస్థితి అనిల వశమున గట్టును ఢీకొని, సుడివడుతున్న పడవవలె వుంది. విశేషకము తడియారకుండానే, తిరిగి వస్తానని చెప్పి వెళ్లిన ప్రియుడు, రానందుకూ, ఇంతగా ఆలసించినందుకూ, ఆమె మనస్సు అనేక విధాలుగా నందుని గురించి శంకించింది. అతడు తన్ను పంచించాడని సుందరి భావించింది. ఒకరు ప్రాణం, మరొకరు దేహం అనుకున్న తమ ప్రేమకు ఇలాంటి కొదవలు, వాటిల్లునని తనకు తెలియదని విలపించింది. 'నందుని చంద్ర సదృశమైన వదన సౌందర్యాన్న చూసి, ఏ స్త్రీయో అతణ్ని వంచించి, తన ఇల్లు చేర్చుకుందేమో' అని అనుమానపడింది. నందుడు ప్రదర్శించిన రసభావాలూ, మురిపాలూ, సుద్దులు, ప్రేమలు ఇవన్నీ అన్యకాంతకు వశమైంది నిజమైతే, అతడు నిజంగా చంచలాత్ముడే, అని అనుకుంది. కానీ, మరుక్షణంలోనే అద్వైత ప్రణయ పరతత్వవేత్తయైన తన భర్త, అలాంటి హీన స్థితికి దిగజారడని, అతని మనస్సు తెలుసుకోకుండా, పాప శంక చేశానని చింతించింది. నందుని యెడల తన ప్రవర్తనను గురించి అతన్ని అనేక విధాల తన శృంగార చేష్టలతో విసిగించి చేసిన దొనగుల సన్నింటినీ మనస్సుకు తెచ్చుకొని పశ్చాత్తాప పడింది. అతడు వచ్చిన వెంటనే పాదపద్మాలపై బడి, వేడుకుంటాననీ, అతణ్ని తోడితెచ్చిన వారికి మాడలు, మాన్యాలిచ్చి సంభావిస్తాననీ, పరిచారికత్వాన్ని మరపిస్తాననీ ఏమేమో చెప్పి విలపించింది. ఇలా విలపించగా, చెలికత్తెలు ఒకరి మొగాలొకరు కనుగొనే వేళ, నందుని ఉనికి తెలుసుకొని

తిరిగి వస్తానని వెళ్లిన చెలికత్తే తిరిగి వచ్చింది. నందుని గురించి పలువురు పలువిధాలుగా చెపుతున్నారనీ, ఎవ్వరికి తోచినట్లు వారంటున్నారనీ, మరికొందరు బుద్ధదేవుని వెంట ఆయన బౌద్ధ విహారానికి వెళ్లాడని చెప్పారని చెప్పింది. ఆ మాటకు నందుడు ప్రియా విముఖుడై సమస్తం పరిత్యజించి, బౌద్ధభిక్షువైనాడన్న అర్థాన్ని అనుసంధించుకొని, సుందరి అనేక విధాల వాపోయింది. "భిక్షువుల్లో చేరి, కాషాయ వస్త్రాలు దాల్చు నిరసమైన శాంతమే నీ నిసర్గ స్వభావమైతే, నన్నెందుకు ప్రేమించావు? ఈ వలపుదనములు, ప్రణమిచ్చే ప్రేముడులు, ఎందుకు నటించావు? ధూర్తుడా? నన్నెందుకు మోసం చేశావు? అమృతపూర్ణమైన పాత్రలో చేతులారా విషం పోశావు అనుభవించడానికి నీకు ఇష్టం లేకపోతే, ఈ పాత్రని అమృతంతో ఎందుకు నింపావు? సర్వ విధాల నీతో తాదాత్మ్యాన్ని పొంది, అసిధారావ్రతంతో నిన్ను సేవించాను. నా హృదయాన్ని తెలుసుకోకుండా, నన్ను వంచించి ఏ పుణ్యాన్ని, ఏ మోక్షాన్ని, ఆర్జిస్తావు? తోబుట్టువుల కూరిమినీ, వయస్యల చెలిమినీ, జననీ జనకులు సేవల్ని, గృహదేవతల పూజల్ని, అన్నింటిని విడిచి, నీ పరిచర్యే సర్వస్వమని భావించాను. సర్వభావాలను నీ ప్రణయాగ్ని యందే ఆహుతులుగా అర్పించి, నేను శూన్యనైపోయాను. ఎవ్వరిని నిందించి ఏమి ప్రయోజనం? నన్ను నేనే నిందించుకోవాలి." అని ఈ విధంగా తన భర్తను కినుకతో నిందించి, అతడు స్వయంగా తనకు తానే భిక్షువువయ్యాడా? అని శంకించింది. ఆరాధ్య దైవం, నిత్య యౌవన సంవత్సదాతా, యువజనులకు అభ్యర్థనీయుడూ, గురువూ, శృంగార కళలపెన్నిధీ, మన్మథుడే యని తన భర్త కీర్తిస్తూ ఉంటాడు. మదన సుందరుడూ, మన్మథ సేవకుడు, అయిన తన భర్త యతిజనులకు పూజితమైన వైరాగ్య పద్ధతి అవలంభించాడవడం నమ్మరాదని అనుకుంటుంది. ఆ గురువే బుద్ధుడు బలవంతంగా తన భర్తను వశపరచుకొని వుంటాడనుకొని,

వెంటనే ఆ మహాత్ముని ఏమనుటకు రాక, అతనిని గూర్చి ఇట్లు పలికింది.ఆర్తజనాళిని రక్షించడమే ప్రధానంగా వున్న నీ పనులు సోదరివంటి నా ఎడల మాత్రం వ్యర్థమయ్యాయి. కరుణామయత్వం నీ అధీనమని, వేరుచోట్ల అది దుర్లభమని ఏవేవో గాథలు ప్రజలు వచిస్తారు. కానీ, నా పట్ల అవన్నీ పొల్లయిపోయాయి. నాలో ఏదైనా తప్పుంటే దానికింత కఠోర శిక్ష విధించడం న్యాయం కాదని భర్త విరహాల కంటేసాధ్యులకు మరణమే ఉచితము కాదా? " అని ఆమె బుద్ధున్ని ప్రశ్నిస్తుంది. తన దోషాన్ని పెద్దలు చేసి తల త్రుంచితివని బుద్ధుని నిందించింది. ఇప్పుడు సుందరి శోకరూపిణియైన యశోధరకు నిజంగా తోడి కోడలినీ శాక్య కులాన్ని మెట్టిన సతులందరికీ భర్త) విరహమే నోముల ఫలమా? అని ఆమె బుద్ధుని ప్రశ్నించింది. గౌతమ వంశస్తులు పరమ దయా మూర్తులు.కాన మాతృ వియోగ బాధ మీకు మాత్రం ఉండదనీ, చింత అనవసరమని లేని వికాసం, కన్పించునట్లు మా తల్లి నన్ను మీ చేతుల్లో పెట్టేటప్పుడు వచించింది కదా పాదపద్మములకు నమస్కరించడానికి వచ్చిన సోదరునికి అభ్యుదయ మంగళప్రదంగా ఆశీర్వదించడం మాని,

సన్యాసదీక్ష మీ వంటివారు ఈవచ్చునా? వార్ధక్యంలో భౌతికములైన దారసుతాది సంబంధాలను పరిత్యజించి, మీరు ప్రతిపాదించిన ధర్మమార్గంలో చరించడం సముచితం, కానీ, మొగ్గను తెంచుట, పిందెలను కోయడం, ధర్మం కాదు. మా వివాహ సమయంలో సత్యంతో అహింసవలె శాశ్వతమైన భర్త యోగ సంపదకు పాత్రురాలు కమ్మని మీరు అశీర్వదించారు కదా మాకు వియోగం కలుగుట మీ అమోఘమైన పలుకులకు దోషం కాదా? పశుపక్షులుగా పుట్టండని, శాపం ఇచ్చినా, పరస్పర వియోగం లేకుండా చెట్లల్లో, గుట్టల్లో, మేము బతుకుతాం. వలలో చిక్కిన పక్షిలాగా దయనీయంగా విలపిస్తున్న నా భర్త, అర్తరావాలు మీ చెవిలో పడడం లేదా మీకు వినపడలేదా. పశుపక్ష్యాదుల కష్టదశలును కూడ చూడవోపని నీవు సోదరుని విలాపాలు విశదంగా వినగల్గడం, మా దురదృష్టమని అనంతమైన దుఃఖంతో నేలబడి, పొరలి విలపిస్తూండగా, వృద్ధురాలైన ఒక చెలికత్తె ఆమెను పెక్కుగతుల అనునయించింది. ''చిన్నరాణి పరమకోమల చిత్తురాలైనా, భర్తకంటే ధీరమనస్కురాలు, అని మేము చెప్పుకొని సంతోషిస్తూంటాం. ఇంత మాత్రానికే ఈ బేలతనమేల తల్లీ?'' అని సుందరిని మృదువచనాలతో తాల్మికరపుటకు ప్రయత్నించింది, ఆ చెలికత్తె. ''ఎంతమంది గురుదేవుని దర్శనార్థమై ప్రతిరోజూ వెళ్ళ లేదా గురువుకు సేవలు చేసి, మరల వారు తమ ఇంటికి రారా? నీ భర్త సైతం చాలకాలం తర్వాత, ఆ భగవంతుని కలుసుకున్నందున,ఏమైనా మంతనాల్లో వున్నాడేమో. తప్పకుండా ఇంటికి వస్తాడు. నీ కనుసన్నలలో సంచరించే నీ భర్త గురించి ఈ అధీరవిచారాలు మంచివి కావు. ఆయన తిరిగి వచ్చేవేళ అయింది. అమ్మా లెలెమ్మ'' ని ఆ వృద్ధురాలు సుందరిని స్వాంతన పరిచింది. అంతలో సూర్యుడస్తమించాడు. సుందరి మనస్సు లోవలె చీకట్లు నలుదిక్కులా వ్యాపించాయి. చెలికత్తెలు బుజ్జగిస్తూ విత్తిన అశల్లా, స్వల్పకాంతులతో గగనాన తారకలు అక్కడక్కడ ఉదయించాయి.

### 3.6. అనుతాపం:

ఇందులో నందుని దుఃఖం, సుందరి విరహంతో నందుడు విలపించే వృత్తాంతమూ, మనోహరంగా వర్ణించారు పింగళి కాటూరి కవులు. అమతాపశబ్దానికి పశ్చాత్తాపం, లేక, నగవు అని అర్థం. ఈ సర్గలో, బౌద్ధ విహార భూమిలో, నందుని వగపును అత్యంతంగా వర్ణించబడింది. ప్రారంభంలో బౌద్ధ విహార భూమి వర్ధనం విస్తృతంగా చర్చించారు కవులు. దుర్మదుడైన మన్మథుని సపరివారంగా పశువరించిన యజ్ఞవాటికలా, ఉద్వేల తరంగరహితమై, నిశ్చలమై, ప్రశాంతంగా వున్న సముద్రంలా వర్షాకాల మేఘావరణం తొలగిపోయిన శరత్స మయకాశంలా, రజోగుణం తోడి ప్రయత్నాలన్నీ ఉపశమించి, సత్వగుణోజ్వలమైన అంతరంగంలో, శాంతమూ, పవిత్రమూ, గాంభీర్యమూ, సరళభావ పూర్ణమూనై, ధర్మదేవత స్వయంగా నిర్మించుకొన్న సభాభవనం లాగా ఎంతో అందంగా రమణీయంగా శోభిల్లుతోంది అ బౌద్ధ విహార భూమి. వృక్షచ్ఛాయల్లో, ఇసుకతో

నిర్మించుకున్న వేదికలపై, శిష్యులకు పరమార్థాన్ని గురించి బోధిస్తున్న శాక్యమునీంద్రునిపై పరిమళభరిత పుష్పాలను, పుణ్యవశమున ఈ వృక్షాలు అన్ని వెదజల్లుతున్నాయి. గురుదేవుని ఉపదేశాలనూ, మరచిపోకుండా, మననం చేసి, వాని ననుష్ఠించి ఆ మునీంద్రుని శిష్యులు పట్టణాల పర్యటిస్తూ ప్రచారం చేస్తూ ఉంటారు. బుద్ధధర్మం, జగత్తు, పరిణామ శీలమనీ విద్య విక్రియాత్మకమనీ, నశ్వరమనీ, బోధిస్తుంది. అహింసా ధర్మాన్ని బోధిస్తూ వర్ణ బేధాన్ని ఖండిస్తుంది. దయకు, సత్యానికి ఈ ధర్మం పరిపోషకం. ఇలాంటి బుద్ధప్రోక్త ధర్మాన్ని, శిష్యులు పట్టణాలకు, పల్లెలకు వెళ్లి నిరంతరమూ బోధిస్తూ బౌద్ధమత తత్త్వం గురించి నిత్యం ప్రచారాలు చేస్తుంటారు. వారు, పశుహింసాత్మకములయిన యజ్ఞలను నిలిపివేశారు. మాల పల్లెలకు వెళ్లి, అక్కడ పేదలకు హితవచనాలు చెప్పి శరీర శుభ్రతను బోధిస్తారు. దుర్గంధ భూయిష్టమైన కుష్ఠరోగంతో బాధపడేవారికి సేవలు చేస్తారు. అప్తులయిన వారిని పోగొట్టుకొని ఎడబాటున శోకించే వారిని ఓదార్చి వైరాగ్యాన్ని బోధిస్తారు. ప్రతి దినమూ పెరిగిపోతున్న శిష్యగణాలకు ధర్మదీక్షలిస్తారు. ఈ శ్రమణులు, దేవదూతలతో సమానులు వీరు, వారు అనేటటువంటి భేదాలు లేకుండా లభించే చోటంతటా, భిక్షను ఆదరంతో స్వీకరిస్తారు. రాత్రుల్లో విహారం చేరుకుని, గురుదేవుని పాదపద్మముల చెంత శిరస్సును పెట్టి ఎంతో ప్రశాంతతో శయనిస్తారు. ఇలా, చిత్త సంక్షోభాలకు ఏ మాత్రం ఆస్కారం లేని ఈ విహారమే నందుని హృదయానికి చెప్పరానంత సంక్షోభ హేతువయింది. అ రాజసుతుడు బోనులో బంధించబడ్డ భద్రగజ కిశోరంలా, రోషంతో, దుఃఖముతో నిండిన మనస్సుతో కన్నీటితో నిండిన చూపులతో, ఏకాంత ప్రదేశంలో తన ప్రియురాలయిన సుందరిని గూర్చి విలపిస్తాడు నందుడు. నందునికి ఆమె జగదేక మోహనానంగీ, ప్రాణధనం. ప్రణయ రాజ్యలక్ష్మి రమణీయ వైభవం. అలాంటి సుందరికి దూరంగా దీనుని వలె, నిస్సహాయుని వలె, దిక్కులేని వానివలె, జీవించి ఉన్నాననీ నందుడు బాబుతో విలపిస్తాడు. విశేషకం తడియారక మునుపే, సన్నిధికి రాగలనని శపథాలు పలికినా, ధర్మవృత్తికి హాని కల్గుతుందని బుద్ధదేవుని మాటను అంగీకరించాడు. ఇది బలవంతమైన సంన్యాస దీక్ష తన అభీష్టానికి విరుద్ధమైంది.

తన విహారంలో, తన రాక కోసం ఎదురు చూస్తూ వాడిపోయిన తీగవలె, తిన్నపై బడి, కన్నులు తేలవేస్తూ, సుందరి ఉంటుందేమోననీ నందుడు తపన పడతాడు. ఆ సమయానికైనా, సుందరి సన్నిధి చేరి ఓదార్చి, ముద్దిడి చిరు చెమటతో కూడిన ఆమె బాహువల్లికను మెడపైన వేసుకుని చెలీ! నన్ను రక్షింపుమని వేడుకుని వట్టి వేళ్ల విసనకర్రతో చల్లగా విసిరేవాణ్ణి అనీ నందుడు అనుకుంటాడు. ఆ భాగ్యం తాను పోగొట్టుకున్నానని, తనకు లభించలేదని తీవ్రంగా పశ్చాత్తపపడతాడు. కొమ్ములా అరవిచ్చిన సుందరి కన్నుగవను కాంచే భాగ్యం, తనకు లేదని నందుడు విలపించాడు. తనవైపు సుందరి చూపులు, సుందరి వైపు తన చూపులు, అల్లికలై వెళ్లి, అంతరాళములో కలిసికోవడమే వారికి

మిగిలిన దర్శన భాగ్యం! అన్న అనతి లేకుండా, విహార భూమిని దాటడానికి కానీ, సుందరి దగ్గరకు పోయి తన బాధను తెలుపుకోవడానికి కానీ అవకాశం లేదు. తన పరిస్థితిని చూచి ఒకవేళ బుద్ధుడు విహారాన్ని విడిచి వెళ్ళిపోమని అన్నా కూడా భిక్ష వేషంతో సుందరిని బాధపెడుతూ, ఆమె ఎదుట నిల్చే శక్తి తనకు లేదని వాపోయాడు నందుడు. గండు తుమ్మెదలకు కాంక్షణీయమైన ఆమె కబరీభరమున పూలను కోసి, ఎఱ్ఱ తామరల లాగ రక్తసతో ఒప్పారే ఆమె పాదాలకు రత్నమాపురాలు గురించి, అర్ధచంద్రుని సౌందర్యాన్ని మించే విధంగా ఆమె ఫాల భాగంలో కస్తూరీ తిలకాన్ని తీర్చి, తన సౌందర్యంలోని బాగోగులను పరిశీలించు కొమ్మని మణిగణగీతమైన దర్పణం దాల్చి ఎదుట నిలిచి, ప్రణయ కలహం వేళ ఆమెకు అంజలి ఘటించి ఇలాంటి ప్రణయ పరిచర్యలతో ధన్యమైన హస్తద్వయంతో, ఒకటి భిక్షాపాత్రను మోయడానికి పూనుకొన్నది. మరొకటి కన్నీటిని తుడుస్తున్నది. ఈర్ష్యను, ద్వేషాన్ని విడని, సుందరి తనపై దయచూపితే, మకరికా పత్రరమ్యమైన ఆమె వదనలక్ష్మిని మనస్సున ప్రతిష్ఠించుకుని ధ్యానిస్తూ మన్మథుని దయతో తాను ముక్తి కోసం ప్రయత్నిస్తానని చెప్పు ఇలాంటి భావనలతో నందుడు నిరంతర శోక వాహినిలో మునిగిపోయాడు. అశాంతితో ఇటునటు తిరుగాడాడు. అత్యంత మనోజ్ఞమైన సుందరి చరితంలోని ఒక్కొక్క భావం మానసాకాశంలో తోచి, నందుని ఆమె సౌందర్య పరిపూర్ణతకు ప్రణమిల్ల చేస్తున్నది. అతని మనో నయనాల ఎదుట విరహ రూపిణియై, ఎన్నెతొలగి, వెల్లనై వాడిపోయిన కబరీభరంతో నిలిచినట్లు ఆమెను నందుడు భావించాడు. కఠినాత్ముడు, కృతఘ్నుడు, అయిన తనపై సుందరికి ప్రేమ తగదనీ, తన్నామె చూడవచ్చుట కూడ అనర్థమనీ అనేక విధాల నందుడు శోకించాడు. తన మనోభూమికపై ధ్యాన వశమున సుందరీ రూపాన్ని సాక్షాత్కరించుకున్నాడు. ఆమె కపోలకం నందునితో ప్రణయ ప్రసంగాల రహస్యాలను జ్ఞప్తికి తెచ్చె రేఖ, తాజేసిన పాపాన్ని నిరూపించే ధర్మముద్ర, తన మరో జన్మకోసం రూపొందిన కర్మవిపాక బీజం అనేక విధాల హృదయం ఇచ్చి కూడ అలా క్రూరుడైన తన్ను సుందరి సేవించింది. అలాంటి సుందరిని తలచి మనస్సున విలపించాలా? జాలిపడాలా? సంపూర్ణంగా హృదయమిచ్చిన ప్రేయసీ ప్రణయాన్ని నిష్ఫల మొనర్చిన తన్ను గురించి తాను శోకించాలా? లేక పెనుసిగ్గుతో నశించిపోవలెనా? నిలువెల్లా అనురాగ భరితమైన సువర్ణపాన పాత్రయై, గణించుటకు అసాధ్యమైన ప్రేమతో తన రెండు చేతులతో నిలిచిన నిల్చిన తన పెన్నిధి, ఇష్టదైవం ఆ సుందరి. అట్టి ఆమెను పోగొట్టుకుని నిరుపేదనై సంన్యాసినై దిక్కులేకుండా తాను అలమటిస్తున్నానని నందుడు భావించాడు. వలపులు, అతిశయింపగా, పరిరంభించుటకు ఆమెపాత్రురాలు. తన నిండు చూపులు ఆమెకు వెన్నెల! శోత్రయుగళికి మనోహరమైన గానం నిట్టూర్పులకు పుష్పపరిమళం ఆత్మకు ప్రధానమైన భోగ్యం. అన్ని చింతలను దాటి తనతో అద్వైతమందిన తన ఆత్మయే ఆమె అట్టి ఆమె తనకు

లేకపోయినదని నందుడు తన హృదయాకాశమున ధ్యాన వశమున సుందరీ మూర్తిని ప్రతిష్ఠించుకొని, పరిపరి విధముల విలపించాడు.

### 3.7. ఉపదేశము:

ఉపదేశమనే ఆరో సర్గలో ప్రణయతత్త్వంతో పరితపించిపోతున్న నందునికి బుద్ధుడిచ్చిన సందేశం, లేక ఉపదేశం ఇచ్చారు 'పింగళి, కాటూరి' కవులు. ముందు సర్గలో నందుడు ప్రతిరోజు ఒక యుగంగా భావిస్తూ దుఃఖూ ఉంటాడు. ఇలా నందుని దీన పరిస్థితిని చూసిన, బుద్ధుడు ఒకనాడు నందుని దగ్గరకు వచ్చి నిలిచాడు.

తన జ్ఞాన శూన్యతను బుద్ధుడు చూచాడేమో, విన్నాడేమో, అనే సిగ్గును, లజ్జ పడే ఇబ్బందులను చూడలేక, తాను విడిచిపెడతాడని చిన్న ఆశా తన చేతిలో ఉన్న అమృత పాత్రని కిందకి తోసేస్తాడు. దీనితో కొంత అసహనం పూజార్హుడైన ఆ భగవంతుని పట్ల, తనకు గల్గిన చెడు భావానికి మనస్సులో పాప భావాలన్నీ, ఒకటొకటిగా పుట్టి ఒకదానిని మరొకటి నశింపజేసి మరలా సమన్వయం పొంది, హృదయంలో మరల మరలా తోస్తూ, నందుని మనస్సును మరలామరలా భరింపరాని సంక్షోభాన్ని కలుగజేస్తాయి. సహింపరాని ఈ భావ సందోహ భారాన్ని వహించడానికి నీరసించి, అంజలి ఘటించినాడు. కాని, దానితో పాటు ''పూజ్యుడా నీకు నమస్కారం''. అంటూ పలుకలేక పోయాడు. మహాత్ముడైన ఆ గురుదేవుడు, మిక్కిలి జాలితో నందుని సమీపించి, కౌగిలించి శిరమును మూర్కొన్నాడు. ఇలా బుద్ధుడు కౌగిలించడంతో వేడికి వాడి, చిగుళ్లతో కృశించిపోయిన లేత తీగకు వన్నెలొల్కు కొత్త మిసిమి చేకూరినట్లు, నందుని అంగకములన్నీ కొత్త సత్తువను, నూతన యౌవనాన్నీ పొందినట్లయింది. మనస్సు తేరుకుంది. ఆ మునీంద్రుడు ఉపవిష్ఠుడై తమ్ముని గూడ ఉపవిష్టుని చేసి, అతని శరీరాన్ని ప్రేమతో నిమిరుతు ప్రసన్న భావంతో ఆ కుమారుని మృదుల భావాలకు అనురూపమైన రీతిలో ఇలా అంటాడు.

#### 3.7.1.బుద్ధోపదేశం:

''సముద్రానికి చంద్రోదయంలా, నీ శుభప్రవేశం, ఈ విహార వాటికకు ఎంతో మహోత్సవంగా ఉంటుందని భావించి, నిన్నెచ్చటికి తోడ్కొని వచ్చాను. కానీ, కుమారా! దీనత్వంలో మునిగియున్న నీ ముఖాన్ని ఈ శ్రమణులు చూడలేకపోతున్నారు. వీరందరు శుభమైన శీలం. గలవారు. ప్రాణుల దుఃఖాన్నీ చూడలేరు. వీరి మనుస్సెప్పుడూ ప్రాణుల శ్రేయస్సునే కాంక్షిస్తూ వుంటుంది. సత్యదేవతకు కలిగే పీడను వారు సహించలేరు. కనుక వీరు కాముని పెంపును జయించిన శూరులు, వాడి ఎరుగునట్టి మృదుభావులు. తాను తప్ప వేరే గతి లేని ఒక తల్లి కుమారుడితడు. అత్యంత సౌందర్యరాశియైన ఒక ఇల్లాలి భర్త ఈతడు, రాజ్యసింహాసనాన్నే త్యజించాడీతడు, సమర వీరత్వాన్ని విసర్జించిన వీరుడితడు. వీరందరు, మమతాహంకారములను వీడి, కామ వ్యామోహానికి లోనుకాకుండా, రాజ్యలో భాన్నీ, క్రౌర్యాన్నీ, పరిత్యజించి, శాంత మనస్సుతో ధర్మదేవతను ఆరాధించడానికి,

అంకితభావంతో ఇటకేటించారు. ఈ విహారం, అతివ్యాధులకూ, మోహాదికమునకూ విముక్తి స్థానం. సత్యానికి, దయ ఇది విడిది. ఇలాంటి చోట నీకెందుకు దైవభావం? భవతాపాలను పరిహరించే శాంతి, సత్యం, దయా, అనే నందులకు జన్మస్థానమైన ఈ విహారమనే మహాపర్వతాన్ని అధిరోహించి, నీవంటివాడు. కంటనీరు పెట్టరాదు. ఈ లోకం హింసా రహితమైతేనే, దేహధారులకు సుఖం లభిస్తుంది. ఆకలితో పులి తన సంతానాన్ని భక్షిస్తే, హింసాపరులయిన ఈ నరులు పరసంతానాన్నే భక్షిస్తున్నారు. ఇలా పరహింసాపరమైన లోకాన్ని కారుణ్య దృష్టితో వీక్షించి, రక్షింపకుండా మనకెందుకులే, అని రాజపుత్రులు ప్రొద్దగడపకూడదు. సౌధాగ్రభాగాల్లో, భోగలంపటులైన వారు దయాదురులూ, మహాంధులూ, కారా? అరణ్యాల్లో పచ్చికమేసి, గుక్కెడి నీరు త్రాగి, జంతుజాలం ప్రాణధారణ చేస్తూండగా, ఈ నరులు జానెడు పొట్టకోసం, పాప సముద్రంలో మునిగి, ఈ సృష్టిని దుఃఖమయం చేసుకొని జీవితాలను నరకంగా చేసుకుంటున్నారు. ఇది చాలా విషాదకరం, బాధాకరం కాదా? ఆకలి బాధలను తట్టుకొని ప్రాణాలను పణంగా పెట్టి, చమటదారలతో జీవించలేక ఇతరుల రక్తమాంసాలను పీల్చుతూ జీవిస్తున్నారని అంటాడు బుద్ధుడు. ఎన్ని సంపదలు ఉన్న సంపదల పట్ల, రోయకుండా, ఈ తుచ్ఛ కోరికలను అదుపులో పెట్టుకోలేక భోగాలను ఎలా అనుభవిస్తారో? లోక మిలా వుండగా, నీవంటి నరేంద్ర నందనులు రాగిల్లి, భోగాలనుభవ నిమగ్నులు కాకూడదు కదా అని బుద్ధుడు నందుడుని కోరతాడు. లోకయాత్ర అనే రథాన్ని పరమర్షులకు సమ్మతమైన గమ్యస్థానాన్ని చేర్చు కోసమై, బ్రాహ్మణుని జన్మము, రాజన్యు ని జన్మము కల్గినది. ఒకడు సారథి కృత్యం చేస్తే, మరొకడు సైంధవ నృత్యాన్ని నెరవేర్చాలి. ఇవి రెండు పరస్పరాధారములైన ధర్మాలు. ఇందులో ఒకటి గొప్పా, మరొకటి' తక్కువ కాదు. నేడు బరువుమోసే అశ్వాలు లేవు. గమ్యాన్ని తెలిసికొని నడిపే సారథులు లేరు. కనుక ఈ ధర్మరథం దారితప్పిపోతోంది. ఇది ఎక్కడ ఎలా కూలి పోతుందో తెలియదంటాడు బుద్ధుడు. స్వర్గ సుఖాల కోరికలతో కొందరు యజ్ఞాలు యాగాలు, పూజలు, వృతాలను నిత్యం ప్రచారం చేస్తుంటారు. ఇది రాజ్యవిస్తార ఆశతో, ధనాశతో, అనేకమంది యుద్ధాలు చేస్తుంటారు. వీరికి దయా, జాలి, ప్రేమ, ధర్మం, అనేవి ఉండవు. కనుక యుద్ధంలో కురిపించే రక్తవర్షంతో, భూదేవి శరీరం తడిసిపోతున్నది. యాగార్థమై కాని పోబడే మేకలు తమ పిల్లల విరహంతో రాల్చే కన్నీటి బొట్లే అంకురాలుగా విషవృక్షాలు మొలస్తున్నాయి.

ధర్మదేవతకు సత్యమూ, అహింసా, అనేవి రెండు కన్నులలాంటివి. లోకకల్యాణం కోసం బోధించి వెళ్లారు. ఆ ధర్మదేవత ఇప్పుడు రెండు కన్నులు పోగొట్టుకొని, అంధురాలై అల్లాడి పోతున్నది. ఈ విశ్వధాత్రి బురదలో దిగబడిపోయిన గోమాతలా తల్లడిల్లి పోతున్నది. నీ రాజపుత్రుడు దీన్ని ఉపేక్షింపకూడదు. నా తమ్ముడు దయాసాగరం. ఆశ్రయించిన వారికి చింతామణి, దిక్కు లేనివారి విషయంలో రూక్షానిష్టావరుడు. బుద్ధ ప్రోక్త ధర్మరూపాలైన పల్లికలకు రక్షకుడుగా ఉంటాడని అనుకున్నాను. నీవు ఇలా కామశాస్త్రి, పాతకులలో

అగ్రగణ్యుడవై పోతావని అనుకొనలేదు; ఈ చర్య నీకు తగదు. ఆకలి బాధకు కొంతైనా గంజి లభింపని నిరుపేదలూ, ఔషధ పథ్యపానాలు, అరసేవారు ఏ మాత్రం లేని అనాథ రోగులూ, యుద్ధరంగంలో కాళ్లు, చేతులు తెగిపోయి, విలపించువారూ, పతినీ, ఏకపుత్రునీ పోగొట్టుకొని దుఃఖించే నిర్భాగ్యురాళ్లూ, వీరందరి విలాపరావాలు నీ చెవిలో పడడం లేదా? గ్రుడ్డివారు, కుంటివారు మొదలైన వికలాంగుల గగోలుతో ఈ జగం, శోక భయంకరమైన మహాసముద్రమై విరామం లేకుండా దుఃఖిస్తూండగా, ఆ దుఃఖాన్ని నీవు అలకించడం లేదా? ఆహారం లేక నిరసించి చిక్కి శల్యావశిష్టులైన బిడ్డలు, పెరటిలోనికి పోయి మట్టిపెల్లలు తింటూ వుంటే, చూచి గూడ, వారించడానికి మాటరాక, మెడలో నల్లపూస కానీ, కుండలో వండ్లగింజ కానీ కన్నులలో బాష్పజలంగానీ, లేకుండా కడుపులో నివేదనతో దుఃఖిస్తున్న తల్లులను నీవు కాంచలేదా? పాషాణానికి సైతం గుండెలు పగిలిపోతున్న ఈ విశ్వదైన్యాన్ని చూచి కంటనీరు పెట్టడానికి వెయ్యి కన్నులు కూడ చాలవు. పాపకూపంలో పడిపోయిన విపన్నాత్ములను ఉద్ధరించడానికి లక్షభుజాలు కావాలి. వారి దుఃఖాన్ని పోగొట్టడానికి, కంటనీరు తుడవడానికి, నాయనా నీవు సన్నద్ధుడవై లేవ్వా అని అంటూ భగవంతుడు నందుని బుజ్జగించి ఉపదేశించాడు.

కొంత భయం పోగొట్టుకొన్న మనస్సుతో మొగమెత్తి, ఏదో విన్నవనింపబోయి, నందుడు మరల సందేహ మనస్కుడయ్యాడు. ''నా ప్రేమ, పవిత్రమూ, సుకుమారమూ అయినది. ఇలాంటి కొన్నన వంటి నా వలపును గూడ గురుదేవుడు దోషంగా భావించి నన్ను కుత్సితునిగా భావించి, నిరసించాడు. ఆయనకు ఏమని మారుపలకాలి?'' అని చింతిస్తూ ప్రణయమూర్తియైన సుందరిని మనస్సులో భావించి అనుతప్త హృదయంతో అమెనుద్దేశించి ఇలా అనుకున్నాడు. గురుదేవుడు నిరుపమానమైన తమ అనురాగ మందాకినిని నిరసిస్తూండగా, ఎదురాడుటకు తాను భయపడుతున్నాడు. సుందరి ఈ దోషాన్ని మన్నించాలి. తన పాపానికి నిష్కృతి లేదు. అతిమానుషములైన తమ ప్రేమలు సామాన్యులైన ఇతరులు తెలుసుకోలేరు. ఇలా చింతా పరంపరలలో మరలా మునిగిపోతున్న నందుని వైఖరి గమనించి గురుదేవుడు అతన్ని అనునయిస్తూ ఇలా అన్నాడు. '' కుమారా నీ మనస్సులోని విషయాన్ని దాచిపెట్టకూడదు. ఈ మౌనముద్ర త్యజించి, వదనమెత్తి మన మధ్య ఎలాంటి భేదాలు లేకుండా నిజాన్ని చెప్పమని అంటాడు బుద్ధుడు నా మాట నీకు రుచింపలేదేమోననీ మనస్సుకు బాధను కలిగించామనే అని మనసు స్వభావం ఎటువంటిదో తెలియకూడదా? నాయనా నాకంటే నీకెవరు అప్తులున్నారు'' అని ఎంతో ప్రేమతో తమ్ముని భిన్న రకాలుగా సముదాయించి ఓదార్చుతాడు బుద్ధుడు.

### 3.8. ధర్మ సంవాదం:

ధర్మ సంవాదమనే పేరుగల సప్తమ సర్గలో బుద్ధ భగవానునికి, కుమార నందునికి మధ్య కల్గిన ధర్మ సంబంధమైన చర్చలు జరిగాయి. నందుడు తన హృదయంలో ఉన్న సంశయాలను నిస్సంకోచంగా భగవంతునికి వెల్లడిస్తాడు. ఆ సంశయాల కన్నీటికి భగవంతుడు ధర్మబద్ధమైన సమాధానాలు చెప్పి నందుని యొక్క ప్రేమ, స్వచ్ఛమైన ప్రేమ కాదనీ, కామదూషితమనీ, స్వార్థస్వరూపమనీ, విశ్లేషణాపూర్వకంగా వివరించి నిజమైన ప్రేమ స్వరూపాన్ని, జీవిత పరమార్థాన్ని స్థాపిస్తాడు. నందుడు నమ్రుడై భగవంతునితో సంపాదించుటకు మొదట కొంత తొట్రిల్లి కూడ, ఆ కొంకును నిగ్రహించుకుని, మాటల్లో మధురిమ తోపగా, అంజలి జోడించి, నమస్కరించి, తాను ఏదైనా పొరపాటున మాటలు మాట్లాడినా కూడా, వాటిన్నింటిని దయతో క్షమించాలని భగవంతుని స్వరూపుడైన బుద్ధున్ని ప్రార్థించాడు. తాను కేవలం కాముకుడు కాదు. కాముకునిగా తన్ను భావించి మదనశాస్త్ర విద్యార్థిగా భగవంతుడు భావించడం తగదు, తన విన్నపాన్ని గురుదేవుడు ఆలకించాలి.. 'తుమ్మెదరెక్క కొంత సోకినా, కసుగందే మల్లెమొగ్గకు సమానమై, పూర్వ సంధ్యారాగ కాంతులతో వికసించే వలపును నిరాకరించడం, అనుచితం. నిష్కపటమైన భావాలతో ఐక్యమై ప్రణయ పరిమళాలు వెలార్చే అదృష్టం అల్పంగారు. ఆ భగవంతుడే అన్నట్లు శోక బహుతమై, క్షణ భంగురమైన ఈ ప్రపంచంలో ప్రేమకు మించిన భాగ్యం లేదు. మహత్తరమైన ప్రణయ భావావేశంలో ఏ చింతలకు తావులేదు. ప్రణయం ఉదార గుణాలను అనుష్ఠింపజేస్తుంది. అంతశత్రువులైన కామక్రోధాదులను సంహరించే దివ్యాస్త్రం ఇది. అద్వైత భావ సాక్షాత్కారానికీ, దీనికి గురు శిష్య సంబంధం కరుణామయైన ఆనందలహరి. ఇది సర్వభూత అంతర్యామి కదా తాపహారకమైన ఈ ప్రేమ ఆనందధామానికి రాజమార్గం. ప్రకాశమానమైన, నిరంతర మధుసమయ సుఖాన్ని ఇస్తుంది. ప్రియజన శూన్యమైన జీవితం ఒక మోదులాంటిది. నిర్జీవమైంది" ప్రణయ మాధుర్యాన్ని అనుభవించే బ్రతుకు ఒకదినమైనా చాలు. ప్రేమరాహిత్యం కంటే దారిద్ర్యం మరియేముంది " అని, నందుడు బుద్ధుడిని ప్రశ్నించాడు. వీణలోని సప్తస్వరాలు సమ్మిళితములౌ, రాగరసాలను ఉత్పదిస్తాయి.

అలాగే ప్రియుల భావాలు సమ్మేళనం పొందితే, అనురాగం జనిస్తుంది. ఇలాంటి మధురభావాలను తియ్యని వలపులను ఉమ్మలించడమెట్లు'' ఆకాశంలోని గ్రహాల పరిభ్రమణానికీ, వాటివరస్పరం ఆకర్షణ బంధానికి రాగాధీనమైన ప్రేమ మాత్రమే కారణం. తారకలు ఆకాశంలో అతిదీర్ఘ ప్రయాణం చేస్తున్నా, వాటికి శ్రాంతి ప్రేమయే."మహాత్మా నక్షత్రాలు వియోగ భారాన్ని సహించే దయామయమైన గీతికాధ్వనితో గగనంలో చరిస్తున్నాయి. తరంగాలనే బాహువులతో ఈ విశ్వాన్ని విస్తృతమైన తన పరిరంభణ ప్రవాహంలో తేల్చడానికి సముద్రమనే నాయకుడు, ఈ ప్రణయమైక్య భావంలో కలిగే

సౌఖ్యాన భూతి తోనే కదా ప్రయత్నిస్తున్నాడు. సంసార విషపాత్రలో మరంద బిందువులు ప్రణభాజనులకే కదా! లభిస్తున్నాయి.

నిష్కల్మషమైన ప్రేమకు స్థానమై, నురుగులు గ్రక్కుతున్న స్వచ్ఛ మణిపాత్రలో నర్తిస్తున్న తమ ప్రతిబింబ దర్శనాభిలాషలోని సౌఖ్యాన్ని వినిశ్చలంగా అనుభవింపగలవారే నేర్పరులు; పుణ్యాత్ములు. అలాంటి వారికే ఈసంసారం రమ్యంగా, శుభకరంగా కనిపిస్తుంది. ఈ ప్రపంచం ప్రేమపుష్పాలను విరియపూస్తున్నది. ఈప్రేమపుష్పాలలో మకరందభరితమై, మనోజ్ఞమైన ఒక వినూత్న కుసుమం నాకు లభించింది. అది నాహృదయాన్ని అనురాగరస మాధుర్యాలతో నింపింది." కేవలం నాపైన అసత్యపు కావిబట్టలు కప్పిన మాత్రాన, ఆమనోజ్ఞ ప్రేమ కుసుమం ముకుళిస్తుందా? ఈ ప్రేమపుష్పం ఎప్పుడూ వాడి పోదు. ఇందలి పరిమళం తగ్గదు. ఇదెప్పుడూ, మరందాన్ని చిలికిస్తూ వుంటుంది. ఈ పుష్పన్ని నా హృదయంలో విసుగు లేకుండా ధరిస్తాను. ఈ ప్రపంచంలో జనజీవనం దోషనిలయం రోగవికలం, జరావశం పాపలతలకు ఆలవాలం శ్మశానతుల్యం, బీడుభూమి దుఃఖక్రిమి సమూహనికి గూడయి, యిది మృత్యుముఖం పాలు గావడం తథ్యం దీని స్వరూపం నాకు తెలియనిది కాదు. ఈ లోకంలో, జనులు క్షణభంగురమైన తుచ్ఛసుఖానికి ఆశపడి, మాంసం లేని ఎముకకోసం పోట్లాడు కొనే కుక్కల గుంపులా, ప్రణయసుందరమైన ఈ భూమిని బుద్ధి శూన్యులై, రణరంగాంగా మార్చారు. కానీ ఈ లోకంతో నాకు పని లేదు.

*"క్షీరసాగరంలో ఏకాంత ప్రదేశంలో పగడపుదీవిలో, ఆకులురాలని, పూలు వాడని వసంత సమయరమ్యారామంలో, నేనవేలు పున్నమినాటి చంద్రబింబాలు వేల్గుతూన్న సౌధాగ్రభాగంలో నాప్రాణానికి ప్రాణమైన నా చెలితో, అనేక సుఖాలు అనుభవిస్తూ, లతాడాలికల్లో ఊగుతూ, భేదం లేని దివ్యామృతాన్ని అస్వాదిస్తూ, దేశకాలాతీతమై, నిర్వికారమై, ఏకరూపమై, నిత్యమై, ప్రకాశించే ఆ ఆనందాన్ని కాంక్షిస్తాను. ఈ విధంగా తాను కాంక్షించిన వస్తుప్రాప్తికోసం, తొందరపాటుతో, బాధతో, స్వకీయమైన ప్రేమసిద్ధాంతాన్ని నందుడు భగవంతునికి విన్పించాడు.*

*"సుశోభనమైన జ్ఞానసంప్రాప్తిని పొందిన ఆ సుగతుడు, తమ్ముని ముఖం చూసి మందహాసంతో, అధికకారుణ్యంతో ఇలా బోధించుటకు ఉపక్రమించాడు.*

*"కుమారా! నీహృదయాన్ని విప్పిమేలు చేశావు. విలాసవంతమై ఇంపులో ఇక నీ ప్రణయ సిద్ధాంతాన్నంతా నేను విన్నాను. "సర్వ జంతుజాలానికి అతి సామాన్యమైన దాంపత్య సౌఖ్య లోలత్వాన్ని చాల గొప్పగా రుచులు గొల్పునట్లు ఇంతదూరం చెప్పావు. కామమెహిళ్లలైన వారందరికి ఇది ఎంతో చక్కని ఉపదేశం! అవధులు మీరిన విషయసుఖ వాంఛతో పరువు లెత మనస్సు అనే గుర్రం వెంటపడి వెళ్లే భావనను నిగ్రహించుకోలేక, కలలు కల్పించే క్షుద్రకవుల రాతలు ఏమైనా నీవు చదివినావేమో! ఆ చెట్టు కొమ్మపై పళ్ళు*

*తింటూ పరస్పరం ప్రేమించుకుంటూ, కామ సంప్రీతితో తమ రెండు దేహాలను ఒక్కటిగా చేసి, ఆనందిస్తున్న ఆకోతుల జంట అనుభవించే సౌఖ్యానికి నీవేమి పేరు పెడతావో?*

*"ఆ కోతుల జంట దాంపత్య లీలకూ, మనుజుల కామసుఖ కేళికీ, ఏమాత్రం భేధం లేదు. మిథ్యా సౌఖ్యాలను గొప్పగా భావన చేసి, భ్రాంతి సాగరంలో ఈదుతూ, దానికి పెద్ద పేరులు పెట్టి, ఇదే సత్యం! ఇదే నిత్యమని అంటున్నావు. ఇది ఉన్మాదం కానీ, ప్రేమకాదు. ఇది మావనోన్మత్త. విలాసం! యౌవన ప్రాయంలో ఉన్న రాజకుమారుడవు. అందగాడవు, కనుక ఈ రాగ భోగాలు కొనసాగిస్తూ కొత్తపూలు పూస్తున్నాయి. కానీ, ఈ యౌవన మనేది నీకు మాత్రం శాశ్వతం కాదు. నీ భార్య సుందరి, సార్థక నామధేయురాలని అందరు చెప్పగా విన్నాను. నీ రూపాన్ని సైతం చూచాను. నీ మధుర వాక్యాలు కూడ విన్నాను. మీ ప్రణయ స్వరూపాన్ని విస్తారంగా ఉపన్యసించావు. కానీ, కుమారా! దీనికి మించిన సౌందర్యం, అనురక్తి వేరొక చోట ఈ విశ్వంలో లేదని చెప్పగలవా అని నందుడిని బుద్ధుడు అడుగుతాడు."*

ఆ వానరకాంత ఆ వానరానికి సౌందర్యవిధానం. నీ భార్యాయూ నీకు వరాల మూట. మరి ఎప్పటికీ శాశ్వతమైన దేవకాంతల నిత్య యౌవన విలాసాలు నీవు అనుభవిస్తే, తక్కిన రూపాలన్నీ, చీకటి తో డబుట్టవులుగా కన్పించి రోతను కల్గింపనా?

కుమారా అలాంటి అప్సరసల నిత్యసౌందర్యం సైతం నాశనమవక తప్పదు. క్షణభంగురమై అశాశ్వతమైన చక్కదనాన్ని నీవు ప్రేమిస్తున్నావు. నిత్యనవీనమూ ఆత్మభోగ్యమూ, సత్యమునైన సౌందర్యం నీకు కన్పింపదా? ఈ విషయ ప్రపంచంలో, ఎలాంటివారికి కూడ కాంక్షాపరిపూర్ణత సత్యమైన ప్రేమ ఎన్నటికీ మారదు. అది నిర్వికారమైనది. నిర్వ్యాజమైనది. అదెక్కడ అని విషయాది వికార జన్యమైన కామమెక్కడ అని ప్రేమ నిష్కామమనీ, చాటిస్తున్నావు. నిన్ను ఒక్క విషయమై ప్రశ్నిస్తున్నాను. ఏ లేశమైన కామ వికారం లేకపోతే, ప్రేమకు ఆలవాలమని నీవు చెప్పుతున్న ఆ ప్రేయసి కోసమై ఏల ఇలా శోకిస్తున్నావు కదా కాంత యొక్క చేలాంచలమే ఈ భూమండలంగా భావించి, ప్రదక్షిణం చేసి, ఆమె కటాక్ష మాలికే విశ్వసామ్రాజ్య నట్టంగా భావించి, పాల ప్రదేశాన,, దరించి, ఆమేకేలు గవయే, సత్యధర్మాలుగా భావించి, అంజలి ఘటించి, ఆ పూబోడి ముఖలక్ష్మియే మోక్షలక్ష్మిగా భావించి హృదయాన్నీ, చూడ్కులను అందే స్థాపించుకుని మోహితాత్ముడవైనావు. ఆకాంత చింతనలు వినర్జింపుము కుమారా ఈముల్లోకములను ఆత్మ సంసారముగా భావించే మహనీయ చరిత్రకు నీవంటివాడు అప్పదం కావాలి." " నీ హృదయంలో పొంగి పొరలే ఆ ప్రణయ మందాకినిలొ ఈ లోకత్రయాన్ని కారుణ్యంతో – మునుకలెత్తిజేయటే నీకు అర్థమైంది, కాని, ఒక స్త్రీని మాత్రమే నీవు ఆ మందాకినితో అభిషేకం చేస్తున్నావు. ఇది సముచితం కాదు. ఈ విశ్వంలో అనేక పుష్పాలు విరపూస్తూ

వుండగా, నీ ఒక్క పుష్పాన్నే పుణికి నీ ఉరమున ధరించావు. అది, వాడి, రాలి పోవునప్పుడు, నీకు ఎంత దుఃఖము కలుగునో? ఆ దుఃఖ కంటకం నీ హృదయంలో నాటుకోనగా, దానికి చికిత్స చేయగల వైద్యుని గురించి ముందే అలోచించుకో అని ఇన్ని పూలుండగా నీ ఒక్క పూవునే పుణికి ఎందుకు ధరించాలి? హృదయంపై ముల్లు నాటుకుంటే, తాపమొందడం దేనికి?

కుమారా మనుత్వ దోషమే, శోకానికి కారణము సుమా కడుపు తీపీ, పితృభక్తి, కాంత మీద ప్రేమా, స్నేహంలోని మాధుర్యమూ, వీటన్నిటికీ మమత్వమే బీజం. ఆ మమతా బీజంలో పుట్టి, ఇవి నశిస్తాయి. మమతాశూన్యమైన ప్రేమ నిత్యమైంది. ప్రతి వాడు అహంకారమనే తన ఇష్టదైవానికి ఆలయం కట్టి, పూజలు చేస్తాడు. గాలి, వెలుతురు ప్రవేశించలేని ఆ ఆలయంలో భాధపడే, ఆ దేవునికి చెంతకు మాన్పించుట నీకు సముచితం." 'అహం' అనేది గడ్డ కట్టుకోని పోగా, ఆ నిష్ఠతో పాషాణలై నశించే, అజ్ఞానులకు సుఖమెక్కడిది? తాను తన భార్యా, సంతానం, తోబుట్టవులు, తల్లి తండ్రులు , కులం, దేశం, మానవులు, సర్వప్రాణులు కుమారా ఈ సమస్తమూ తాను కావాలి. కాబట్టి, నీవు కోడుకులు లేని వారికి ప్రేమ బిడ్డవు, తల్లులు లేని బిడ్డలకు తల్లివీ, 'నా' 'నీ' అనువారు లేని దీనులకు, పేదవారికి, దుఃఖితులకు, రక్షణార్థమై, ఆధారమై వారిని సేవిస్తూ సేవకులవ్వాలి.. ఈ భూతతాన్ని స్వర్గధామం చెయ్యాలి. ఇదే బుద్ధ శిష్యులకు పరమార్థం ఇందుకే, గృహ పరిత్యాగం చేయాలని నేనన్నాను."

*"మమతారహితమూ, నిరావ్యజమూ, అయిన ప్రేమను నేను తిరస్కరింపను. నీవు సుకృతాత్ముడవు. నీ హృదయం రసమయం. ఈ సర్వ జగత్తును ఆరాధించడమే నీకు శ్రేయస్కరం. మధుర భావాలను ఉన్మూలించాలనీ, హృదయ ప్రసూనాన్ని త్రుంచి వేయాలనీ, నేను చెప్పడం లేదు. ఈ భీక్షుగణం ప్రేమరహితం కాదు. జీవకారుణ్యమే వీరికి జీవాధారం; జీవనౌషధం. వీరికి ప్రేమకంటే సత్యమైనది వేరొకటి లేదు. సత్యం కంటే సుందరమైంది మరేది లేదు. సౌందర్యాన్ని అధికంగా ప్రేమించే నీవంటి వాడు నాకు లభించాడు. మన విహారాలు ఇక మీదట. రసమయము లౌతాయి."* ఇట్లు మహితాత్ముడైన తథాగతుడు హృదయంగమంగా మాధుర్య భరితంగా, ధర్మపారవచనాలు అనేక రకాలుగా ఉపన్యసించాడు. ఈ పరమార్ధమునందు ఒకింత మాత్రమే నందుని హృదయం గ్రహింపగల్గింది. గౌతముని ధర్మబోధలు సహజంగా నిశితమైనవి కదా నందుడు గురుదేవుని పాదాజ్ఞములు లక్ష్యంగా వీక్షించి, ఇలా అన్నాడు

"దేవా స్త్రీలు సైతం, అర్హత దీక్షను పొంది, భీష చర్యను అనుష్ఠిస్తూ, ధర్మమును ఆరాధింపవచ్చునేమో, తెల్పవలయును, నన్నే నమ్ముకుని వున్న సుందరికి కూడ సంసార

తారకమైన మార్గం చూపి అజ్ఞానాన్ని తొలగింపకుండా, నేనొకడనే, ఈ ధర్మపథాన్ని ఎలా అనుసరింపగలను? అని చెబుతాడు.

*"సహధర్మ చారిణియైన ఆమె నెట్లు వీటి బుచ్చగలను? నామనస్సు ఇప్పుడు ప్రసన్నమై వికాసం పొందింది. శోకమోహాలు దూరంగా తొలగి పోయాయి. సంసారాంధకూపంలో తూలిపోయిన జీవకోటిని ఉద్ధరించడానికి ఆకాంశగల్గింది. మునుపటి కాముక శృంగారానికి దూరంగా నిల్చి, మిమ్ములను ప్రార్థిస్తున్నాను. పురుషులందరు ఈ ధర్మానుష్మానానికి అర్హులై, స్త్రీలు మాత్రమే, అనర్హులవుతారా?"* అంటూ అంజలి ఘటించి బొంగురపోయిన గొంతుతో నందుడు ప్రార్థింపగా, గురుదేవుడు కొంత సేవు కన్నులు మూసి, అలోచించి, నేత్ర పద్మములు వికసింపగా, ప్రేమ మరంద వాహినులు స్రవించగా ఆదరంతో హస్తం సాచి, తమ్ముని హస్తాన్ని గ్రహించి, ఇలా అన్నాడు. కుమారా నన్ను పెంచిన తల్లిని అర్హతిని చేయడానికి, నీ వలెనే ఆనందుడు సైతం అనేక రీతుల ప్రార్థించాడు. కానిందు; నేనెందుకు దాన్ని కాదనవలె? కాంతా కారణంగా హాని పొందకుందుగాక అని భావిస్తాడు.

అసమానమైన బ్రహ్మచర్యవ్రతాన్ని పాటిస్తూ, ధర్మపథాన్ని స్వీకరించడానికి అధికారిణుకై స్త్రీలుంటే, అట్టి శీలవతులకు అర్హత సిద్ధించుగాక అని భగవంతుడు నందుని ప్రార్థనను మన్నించాడు.

**3.9. అనుజ్ఞ:**

సుందరి మనోవ్యథా, ఆమె నైరాశ్యమూ, బుద్ధుడు పంపిన బౌద్ధభిక్షువు ఒకడు సుందరి దగ్గరకు వచ్చి ధర్మ దీక్షను ఇవ్వడం జరుగుతుంది. సుందరి ధర్మదీక్షా స్వీకార విధానాన్ని ఇందులో వర్ణించారు పింగళి–కాటూరి కవులు. "అనుజ్ఞ అనే ఈ ఎనిమిదో సర్గలో సుందరిలో కలిగిన మానసిన మార్పుల్ని, హృదయ పరివర్తనాన్ని, గుణపరిణాన్ని మనోహరంగా, శబ్దచిత్రణంగా, మనోజ్ఞంగా చేశారు ఈ కవులు. బాల్యం నుండి అభ్యసించి, తన పతియైన నందుని ప్రశంసలందుకున్న గాన విద్య ప్రసంగాన్ని సుందరి మరచి పోయింది. నందుడు తన్ను విడచి. వెళ్లిన మార్గం వైపే కన్నుంచి, విలపిస్తున్న రామచిలుకను ఆమె బుజ్జగించింది. ఉద్యానవనంలో తన కోసమై నిరంతరం, నిత్యనూతనంగా పుష్పించే సుమలతావళి పట్ల స్నేహాన్ని కూడా ఆమె మానుకుంది. నందుడు, సుందరి అన్యోన్యానురాగంతో చిత్రించుకున్నట్లు ప్రణయ చిత్రాలను ఆమె వస్త్రంతో కప్పేసింది. రంగు వెలిసి పోయిన చిత్రమూ, పరిమళం పూసిన పుష్పమైన, సుందరి గుర్తుపట్టరాని విధాన, అంతఃపురంలో ఏదో ఒక రీతిగా కాలం గడుపుతూ ఉంటుంది. ఆ పుర కాంతలు ఎందరో వచ్చి, పరామర్శించు మాటలతో, సుందరిని వూరడింపగా, ఆమె కన్నుల్లో నీరు గానీ, వదనంలో సైన్యంగానీ, చేరనీయలేదు. వారేమన్నను, నిర్వికార చిత్తంతో ఆమె బదులే పలుకదు. నందుడు మనస్సు మరలించుకున్నాడని, సుందరిని మరచి పోయాడనీ,

సర్వదుఃఖాలను కాలమే మాన్పుతుందనీ, సుందరి మాన పతియనీ, విరక్తి భావాన్ని వహించదనీ, ఆమెను గూర్చి కపిలవస్తు నగరంలో తలకొక మాట అనుకున్నారు. ప్రతి దినమూ శుద్ధోధన మహారాజు, బుద్దదేవ దర్శితమైన మాత్న ధర్మసంస్థాపనాన్ని గురించి వివరిస్తూండగా, సుందరి శ్రద్ధతో శ్రవణం చేసి, అధర్మాన్ని, ఆ తపస్విని ఏకాంతంగా మననం చేస్తుంది. తన శిష్యులతో భగవంతుడు జగజ్జన సేవామతితో చేసే పవిత్ర సంచారాలును, ప్రవచనాలను, ఆమె ధ్యానపరత్వంతో అలోకిస్తుంది. సర్వసంగ పరిత్యాగం చేసి గౌతమమునీంద్రుని ధర్మపథాన్ని అనుసరించే పుణ్యాత్ములను గూర్చి ఆమె భావిస్తుంది . గురుదేవుని ఆదేశాలను శిరసా వహించి, అనుష్టించే శిష్యవరంలో తమహృదయ నాథుడే అగ్రేగురుడని నందుని భావించి మెచ్చుకుంటుంది. శరీర సౌందర్య పోషకాలైన వస్త్రాదులను పరిత్యజించి, ఆమె కాషాయధారిణి అయింది. సౌందర్య బంధురంగా కురులను ముడివే నిపుణతను వదలివేసి, ఏకవేణిని ధరించింది.

ఆ భగవంతుని ధర్మబోధల గూర్చి ప్రీతితో చెలికత్తెలకు వివరించి చెబుతుంది. భిక్షువేషధారైన తన భర్త నందుని సత్త్వగుణ స్వరూపాన్ని తలుచుకుంటూ, ధ్యానిస్తూ, నమస్కరిస్తూ ఉంటుంది. ప్రతిరోజు యశోధరాదేవి అంత:పురానికి పోయి, ప్రోద్దుపుచ్చుతూ ఉంటుంది. గృహపరిత్యాగం చేసిన ఆ అన్నదమ్ముల గూర్చి, ఇంటిలో ఉన్న నందుని గురించి ఉత్కంఠతో శోకిస్తుంది. రెండవ జాములో భవతి భిక్షాం దేహి అన్న వాక్యం ఆమె స్వాంతంలో భావి ధర్మపథాన్ని వున్న తమ్ము గూర్చి, ఉత్కంఠతో స్మరింపజేస్తూ, కరుణాప్రమోద నిర్భరమైన భావ సందోహాన్ని కలిగిస్తూ, ఆమె నయనాలను అశ్రుజల పూర్ణంగా చేస్తుంది. భిక్షువులను పూజించి, ఆదర పూర్వకంగా విహార వృత్తాంతాలను వింటుంది. దేవవైద్యులవలె, సుధాకలశం వహించి, సంసారదుఃఖ మనోవ్యాధులను పరిహరించుటకై ఆ సోదరులిద్దరూ (బుద్ధుడు,నందుడు) ఇంటికి ఎప్పుడు రాలేదు కదా అని సంకోచంతో ప్రశ్నిస్తుంది. చెలికత్తెలందరూ నిద్రింపగా, తన పెంపుడు చిలుకతో ఏకాంతంగా, సుందరనందుని వృత్తాంతాన్నీ, రహస్యంగా చెప్పి, భావపరంపరలను ప్రస్తానానికి తెచ్చుకుంటుంది. ముల్లోకాలను ముంచెత్తే దివ్య ప్రేమమందాకినిని గృహోద్యానంలోని చిన్న సరస్సులో నిలుపుకుని, ఓలలాడగా భావించడ మంతా, వెఱ్ఱితనం కాదంటే వెఱ్ఱిచిలుకా అని చిలుకతో నల్లపాలు చేస్తుంది. అంతం లేనిదీ, మధురమూ అయిన అభగవంతుని పాదుకలకు సమర్పితమయిన పుష్పపీఠలపై, అధికారిణిగా నిలిచి, 'దేహి' అనగానే వరమిచ్చే దేవతయై, ప్రేమదేవియై, జాగరూకతతో నున్న తన్ను, ఆయన వడద్రోసి, విశ్వసంసార రాజ్యాన్ని పాలించడానికి వెళ్లాడు గదా చిలుకా!" అనియు చిలుకను పలకరిస్తుంది.

భర్త నందుని హృదయం, గంభీరతలేనిది. అది మోకాలి బంటి మాత్రమే అని అనుకొని ఉప్పొంగినాను. శాక్యమునీంద్రుని హృదయాంతరంలో ఉన్న అమూల్య నిధులను

విచారించి తెచ్చి, జనులందరికి ఆస్వచ్ఛమణులను తన భర్త చురలిచ్చాడు. అజ్ఞానాంధకారం నిండిడుకుని వున్న వాహృదయగుహలో వెలుగుచున్న మంగళ దీపిక నేడు సమస్త విశ్వాన్నీ స్నేహపూర్ణమై, అవిచ్ఛిన్నమైన, నిత్యమంగళకాంతి వ్యాపించేటట్లుగా వెలుగుతోంది కదా"అని ఈ జగత్తు యొక్క పుణ్యం ఫలించి, అ స్వామి సేవలను అందుకొను గాక నేను కాదనలేదు కదా అని ఈ అభాగ్యురాలికి కూడ సేవలో కొంత పాలీయక, ఇట్లు వెలి పెట్టినందుకే నేను చింతిస్తున్నాను. తన భర్తయైన నందుడు ఏతేంచే మార్గాన్ని అలంకరించి, అతని అడుగుదోయికి మడుగులోత్తుటకూ, అతడు ఆచరించే లోకారాధనానికి, జలమై, పుష్పమై, ఉపచరించుటకూ నిరంతరం, అర్తసేవా శ్రాంతుడగు ఆ దయారాశికి వింజామరనై చమట బాపుటకూ, విహారకుడ్యాలపై అతడు చిత్రించే భావాలకు ప్రాణార్పణం చేయడానికి నేను తగనా? తన కంగీకారం కాని భాగ్యం నాకు మాత్రం యెగ్యమా? తాను అడవులకు వెళ్లి, నాకు ఇంటినే అడవిని చేశాడు. నేను వెంట నుంటే ఆ అడవినే దేవాలయంగా తీర్చిదిద్దినా?" అని అంటూ, చిలుకతో సుందరి అనేక విధాలుగా మంతనాలాడుతుంది.

అర్తులను రక్షించడానికి కదా తనకు కూడ ధర్మం. భిక్షువులు ప్రాణహింసచేయరు కదా. హృదయంలో తన్నే నమ్ముకుని వున్న నన్ను ఈ రీతిగా విడనాడకూడదని, నీవైనా వెళ్లి బోధింపరాదా అని సుందరి దీనవదనయై, విలపించింది. స్వయంగా తానే, బుద్ధభగవానుని పావన పాదపద్మముల చెంతకు వెళ్లి, శరణు వేడాలని ఆమె కాంక్షిస్తుంది. కానీ, మరల అంతటి సాహసం కూడదని ఆమె ఆ ప్రయత్నాన్ని విరమిస్తుంది. ఇట్లు డోలాందోళిత చిత్తయై, ఆ మానవతి వుండగా ఒకనాడు బుద్ధుడు, అతని ప్రశస్తమైన ధర్మపథమూ శరణమని పలుకుతు, ఒక భీక్షువు తన ఇంటి ముందు నిలువగా, చూచి ఆ సుందరి దగ్గరకు వెళ్లి అతనిని శరణు అని వేడుకుంది. ఆ భిక్షువు ఓ పరమ దయావతీ గురుదేవుడగు భగవంతుడు పంపగా నేను మీ దగ్గరకు వచ్చానని అంటాడు.

'పూజ్యుడా అంటూ ఈ రోజు ఎంతో మధురమైనది. అ భగవంతుడు అజ్ఞాపించాడు. ఈ మంద బాగ్యురాలిపై ఆ గురుదేవునికి ఈ రోజుకి తనపై కరుణ కలిగిందా? ఇక నేను ధన్యురాలిని కదా' అని సుందరి వికసించిన పద్మంలాగా పలికింది. సోదరీ! గురుదేవులు నీహృదయ వేదనాన్ని తెలుసుకొని బుద్ధధర్మమును, స్వీకరించడానికి అనుమతి ప్రసాదించాడు. నీ నడవడికను, ప్రవర్తనాన్ని ఆ స్వామి మెచ్చుకున్నాడు. గురుదేవుని అనుగ్రహంతో నిన్ను తన శిష్యురాలిగా స్వీకరించడానికి సిద్ధమయ్యారు. ధర్మదీక్షను, బౌద్ధ ధర్మాలను గ్రహించీ బుద్ధదేవుడు నీకు శుభాల్నీ, మంగళాన్నీ ప్రసాదిస్తాడని, భిక్ష సంఘం నిన్ను రక్షించి, దీవిస్తుందని అమ్మా శరణు వేడుకోండి అని ఆ బౌద్ధ భిక్షువు సుందరితో అంటాడు.

ఈ భగవసాగరాన్ని మీరు తరించు కోసమే, భగవంతుడు మీకు వియోగాన్ని కలిగించాడు. లేకపోతే, మీరు క్షణభంగురమైన వలపు తెప్ప నెక్కి, సంసార సముద్రంలో మునిగిపోయి ఉంటారు. మిమ్మల్ని ఉద్ధరించడానికి, విశ్వ కారుణ్య మణి హారాలుగా మిమ్ములను తీర్చిదిద్దాడానికి గొప్ప సంకల్పంతో బుద్ధుడు ఈ వియోగాన్ని, ఎడబాటును కల్పించాడు. నీ భర్త నందుడు, నీ కోసం ఎంతో పరితపించాడు. భిక్ష ధర్మాన్ని స్వీకరించడానికి కూడ పట్టుపట్టాడు. నీయందు ఆయనకు గల ప్రేమకు ఈ, భిక్షుసంఘమే, విహారభూమి కూడా నిదర్శనంగా చెప్పవచ్చు. ఆ బుద్ధుడు అహింస, ప్రేమ, దయ, సత్య గుణాలున్నాయి పొందినవాడు. నందుడు సాధుహృదయుడై అన్ని విధాల పరిణామాల్ని ఎంతో ఓర్పుతో తెలుసుకున్నాడు. నీ మనస్వితను, నీ చిత్తపరిపాకాన్ని నేను వేరుగా వర్ణించలేను. అమ్మా విషయసుఖ భోగవ్యసనంలో చిక్కు బడిన మీప్రేమ కణాన్ని, ఆ సమంత భద్రుడైన గురుదేవుడు వెలికి దీని,. దివ్య దీప కళికగా తీర్చి, ఈ విశ్వాన్నే వెలిగింప చేశాడు. బ్రహ్మ చర్య వ్రతమూ, సత్య వాఙ్మయమూ, జీవకారుణ్యమూ, వహించి, చింతను విసర్జించి, నీ భర్తకు సహధర్మ చారిణిపై, చరించే భాగ్యానికి నీవు యోగ్యురాలిని కావాలని అని గురుదేవుడు నిన్ను రక్షించుగాక. అని, యా భిక్షువు వచింపగా, ఆనంద బాష్పాలతో అత్యంత నిర్మలమైన శాంత భావాన్ని అలవర్చుకొని మాలిన్యాన్ని తొలగించుకొని, మౌక్తికంలా, వదనం వెలుగొండగా, కొత్త సౌందర్యంతో శరీరం శోభింపగా, సుందరి, నమ్రభావంతో చేతులు జోడించి నిలిచింది.

**3.10. సహధర్మ చర్యం:**

ఈ సహధర్మ చర్యమను నవమ సర్గలో సుందరి యొక్క ధర్మ చర్యను పాటించే విధానాన్ని సమగ్రంగా వర్ణించబడింది. ప్రతి దినమూ దయామూర్తి యైన సుందరి, దీనజనులను తన ఇంటికి పిలిపించుకుని ఇలవేల్పులను వలె వారిని భక్తితో సేవించి, ఆభరణారులు ప్రీతితో పంచి పెడుతుంది. గృహ రామంలో దిక్కులేకుండా వీథుల వెంటబడి తిరుగు ఆవులకూ, కుక్కలకు మొదలైన పశుపక్ష్యాదులకు సౌకర్యాలను ఏర్పాటు చేస్తుంది. ప్రతి ఇంట భిక్షమెత్తుకునే కుంటివారి పట్ల, అంధుల పట్ల జాబిలిని, ప్రేమను తెలుపుతూ అలాంటి వారికే గాక ప్రజలను తన ఇంటిలో ఉండటానికి వీలు కల్పిస్తూ ఎంతో సేవలను అందిస్తుంది. రోగులకు, అన్ని విధాల పథ్య పానాదుల మార్చి, వారి వ్యథలను పోగొడుతుంది. మృత్యు దేవత ప్రవేశించిన ఇండ్లలోనికి అదృష్టదేవతలా వెళ్ళి, దుఃఖించేవారందరిని ప్రేమతో ఓదారుస్తుంది. రోజులు గడుస్తున్న కొద్ది సుందరి ఇల్లు, అనాథ బాలలకు, విద్యాలయంగా, రోగులకు వైద్యశాలగా, ధర్మదేవతకు ఆలయంగా గొప్ప ఆదర్శ సంఘసంస్కర్తగా పరివర్తనం చెందుతుంది. ఆమె, దేవాలయంలో అర్చకురాలైంది. 'హా' అని పిలుపు వినబడినంతనే 'ఓ' అని ఆమె తన భౌతిక శరీరాన్ని సైతం విడిచి, కేవలం శబ్దంతో మాత్రమే ఊహింపతగిన సూక్ష్మతరమైన ఆకృతిని, భూతదయవలె ధరిస్తుంది.

తపోరూపమైన ఈ ధర్మచర్యానుష్ఠానం వలన, ఆమె శరీరంలో ముందున్న కాంతి తొలగిపోయి, కృశించిపోయింది. అయినాకూడా సుందరి ప్రసన్నమైన శాంతి రూపంతో ప్రకాశిస్తుంది. ఆ కాంతిలో ఆమె గొప్పగా వెలుగుతుంది. ఒయ్యారమొలకించే ఆమె అందమైన నడకకు ఆర్తత్రాణ పరాయణత్వం తొందరపాటును నేర్పించింది. మదన సంజీవనములైన ఆమె తళుకు చూపులు నిర్వికారములై కరుణరస భరితములయ్యాయి.

నిరవధికమైన ఆమె హృదయ సౌందర్యాభిషేకముతో సమస్త విశ్వం, రసమయత్వాన్ని, రమణీయతను పొందుతుంది. ఆమె మందహాసం ఆ ముఖ కాంతి, వాత్సల్యాన్ని వర్షింపగా, కాషాయాంబర ధారణియై, అశాంత భావమూర్తి, దుఃఖాంధకారం వ్యాపించినట్టి ప్రదేశాలను వెదకి వెళ్లి, అందు అరుణోదయంలా ప్రవేశిస్తుంది. ఒకనాడు, సందె చీకట్లు ముసురుకోనే వేళ, ఆమె గృహాభిముఖంగా వెళుతూన్నపుడు, వెక్కివెక్కి ఏడుస్తూ ఒక బాలకుడు ఆమె దారి కడ్డమై నిలిచాడు. ఆమెను చూచిన తోడనే, దగ్గరకు వచ్చి, ఆమె కాని కొంగును చేతితో లాగుతూ, వెనక్కి రమ్మని చేయిచాచి చూపించాడు. సుందరి దయతో కరుణతో ఒక చేత్తో తన కన్నులు నులుముకుంటూ, మరొక చేత్తో తన్ను లాగుతూ వున్న ఆ బాలకుని జుట్టు దువ్వుతూ, ఏడవద్దని బుజ్జగించి ఆ బాలుని వెంట వెళ్లింది సుందరి.

అక్కడ దీపాలతో ఉజ్జ్వలంగా వెలుగొందే విపణి వీథినీ, ధనికులు నివసించే వాడలను దాటి వెళ్లి, కటిక చీకట్లలో తేలుచున్న గుడిసెల సముదాయంలో దుర్గంధ బంధురమైన ఒక సందులో ముందుకు సాగి, వెలివాడ సమీపానికి వెళ్తుతుంది. ఆ ప్రదేశం మురికి నీటితో, చేపలకంపుతో, పందుల చప్పరింపులతో, కుక్క కూతలకు ప్రతి ధ్వనించే కప్పల బెక బెకమనే ధ్వనులతో, ఈదుర గాలుల ధ్వనులతో, దరిద్రదేవత తలలోని పేలును గ్రుక్కి కోనే ప్రదేశంలా ఉంది.

అచ్చట ఒక గుడిసెలోనికి బాలుని వెంట వెళ్లి, కొద్దిపాటి నూనెతో మిణుకుమిణుకు మని వెలుగుతున్న దివ్వె వెలుగులో మరణావస్థలో నున్న ఒక స్త్రీని ఆమె చూచింది. అచ్చట, కావి బట్టలు కట్టి వున్నను ఉదయ భాస్కరునిలాగా ప్రకాశిస్తున్న వానినీ, దుఃఖిస్తూ ఉన్న ఒక బాలికను, కరుణతో అక్కున దగ్గరకు చేర్చుకుని, ముంగురులు దువ్వి, ముద్దు పెట్టుకుంటూ ఆవలి ముఖమై నిలబడియున్న. ఒక భిక్షువును, ఆపావన చరిత్ర చూచి, 'బుద్ధభగవానుడు మాకు శరణమగుగాక' అని పలికింది. ఆపలుకు విన్నంతనే, ఆ భిక్షువు, ఆమెను చూశాడు.

ఆమె కూడ అతని ముఖాన్ని చూసి అంతట వారు అన్యోన్యంగా చేతుల్ని చాచి అరవిచ్చు. నాసావుట నేత్ర యుగ్మములతో వెంటనే పరస్పరం చేరటోవుటకు ప్రయత్నించి, నిరుద్ధమైన మనస్సులతో 'హా' అని నిలిచిపోయారు. ఇద్దరు పరస్పరము 'ప్రాణమా' అని పల్కరించుకొనుటకు ప్రయత్నించి కేవలం 'ప్రా' అను శబ్దముతో నిలిచిపోయి, చివరికి *'బుద్ధం శరణం గచ్ఛామి'* అని అన్నారు. వాయువుతో కల్లోలమై, అంతలోనే శాంతమై, సహజస్థితి పొందిన సరస్సుల లాగ, వారి మనస్సులు తేరుకున్నాయి.

కనుచూపుల ఆవరించిన చీకట్లు తొలగి, సుందరీ నందులు ప్రసన్న భావంతో నిలబడ్డారు, తర్వాత మరణావస్థలో, మంచంలో పడివున్న ఆ పేదరాలు, కన్నులు తెరచి, నలుదిక్కులు చూచి, చెంత నిలిచి వున్న చిన్నపాపల చేరదీసి నందుని చేతిలో కూతురి చేతిని, సుందరి చేతిలో కొడుకు చేతిని పెట్టింది. సుందరి నందులిరువురు ఆ బిడ్డల హస్తాలను తమ హస్తాలతో స్వీకరించి, కనులలో ఆనంద బాష్పాలు రాలగా, నిట్టూర్పులు విడుస్తూ, కన్నులు ముకులించారు. అంతలోనే సంసారసాగరాన్ని తరింపజేసే నావలాంటి వాడగు గౌతమ మునీంద్రుడు వారి సన్నిధి యందు సాక్షాత్కరించాడు.

'బుద్ధదైనం శరణం' అని వారు సాగిలివడి నమస్కరించారు. భగవంతుడు, వారిని దీవించి, ఆ చిన్ని పాపులను చెరొక చంకకెత్తుకొని, మందహాసంతో ఆదరంగా వారి చర్యలను ఎంతో కొనియాడాడు.

ధర్మ సోదరి సుందరి నేను ముందు ఒక్క నందుని మాత్రమే  మీ దగ్గర నుంచి తస్కరించాను. ఇపుడు ధర్మసోదరుడు, ధర్మతనయుడు అయిన ఒక బాలనందుని నీకు ఇస్తున్నాను. ''నందుడు సుందరి బంధాలలో సుఖించు నిన్ను, అనాడు తీసుకుపోయాను. ఇప్పుడు ధర్మసోదరి అయిన ఈ అనాథ శిశుసుందరిని నీకు  నా రుణాన్ని తీర్చుకుంటాను. మీకు ఇక మీదట ఈ సమస్త సృష్టి ఆనందం, సుందరం అయి కన్పించుగాక మృత్యు ముఖంలో ప్రవేశించి కూడ, మీ కోసమై వెనుదిరిగి వచ్చి, ఈ ఉత్తమురాలు తన బిడ్డలిద్దరిని మీకిచ్చింది. ఈపసిపాపలను మృత్యు దేవతా ప్రసాదంగా స్వీకరించండి. తొలినాటి మీప్రేమ అనాథవాత్సల్యానికి చూలైఫలించుగాక ఎందరో నందులు, మరెందరో సుందురులు, అయిన ఇట్టి దీనులైన పసిపాపలను, రక్షించి అఖండమూ, అవ్యయమూ అయిన ఆనందాన్ని అనుభూతిని పోందుదురు గాక  అని బాలనందుని సుందరికిచ్చి, బాల సుందరిని నందున కిచ్చి దివ్యకరుణామయుడైన, ఆ గురుదేవుడు, అశీర్వదించాడు.

ఆ సుందరి, నందులు బాల సుందరి నందులను స్వీకరించి, ఆనంద పారవశ్యంతో గళములెత్తి అలపిస్తూ, ఆర్త సంరక్షకుడైన, పరమ సత్యవ్రతుడైన, పేదల బంధువైన, విశ్వకల్యాణ గురువైన ఆ బుద్ధునికి  విజయ గీతాన్ని ఆలపిస్తూ  తమ సు నమస్సుల్ని ఎంతో వినమ్రంగా ప్రేమతో తెలియజేశారు. ఈ విధంగా తెలుగు *'సౌందరనందం'* కావ్యం కావ్య సంప్రదాయాన్ని అనుసరింపజేస్తూ శుభప్రదంగా ముగుస్తుంది.

బౌద్ధమతం పేరు విన్నా, బుద్ధుని పేరు విన్నా బౌద్ధ బోధనలు, బౌద్ధ ధర్మాలు అష్టాంగ మార్గాలు,  త్రిరత్నాలు, త్రిపీతకాలు వెంటనే స్ఫురిస్తాయి. బౌద్ధమతంలో బుద్ధుని చెప్పిన బోధనలకు,  అష్టాంగ మార్గాలకు, త్రిరత్నాలకు, త్రిపీతకాలకు  ఒక ప్రత్యేకత ఉంది. ఈ సృష్టిలో మానవ జీవితం ఎంతో వివేకమైనది, విచక్షణమైనది. మానవులు ఎంత వివేకం ఉన్నా కూడా తప్పులు చేస్తారు. కనుక తప్పులు చేయకుండా సరైన మార్గంలో పయనించడానికి బుద్ధుడు చెప్పిన కొన్ని మార్గాలను తెలుసుకుందాం.

### 3.11. బౌద్ధ మతంలోని అష్టాంగ మార్గాలు:

బౌద్ధమతం ఈ ప్రపంచానికి ప్రేమను, శాంతిని, దయని, జాలిని, సత్యాలను అందించింది. వీటిని అనుసరించడం వలన మానవులు సరైన మార్గంలో పయనిస్తారు. అందుకే బుద్ధుడు ఈ మతంలో అష్టాంగ మార్గాలను పొందుపరిచాడు.

#### 3.11.1.సమ్యక్ దృష్టి (మంచిని అన్వేషించడం):

అన్వేషణ ఎంతో క్లిష్టమైనది. అది ఒక తాత్త్వికమైన చింతన, ఆలోచన, దృక్పథం, ఏకాంతం. మానవుల దుఃఖానికి గల కారణాలను బుద్ధుడు సుమారుగా ఆరు సంవత్సరాల పాటు తపస్సు చేసి అన్వేషించాడు. వాటిని బౌద్ధమతంలో గల ఆర్య సూత్రాలను తెలుపుతూ దుఃఖం గురించి ఆలోచిస్తాడు. బుద్ధుడు నందుడుకి దుఃఖం గురించి చెప్పిన పద్యాన్ని చూద్దాం.

*"నేడు గాకున్న రేపు గానీ, మరొక్క*
*నాడు గానీ, వియోగమున్నదియె సుమ్ము*
*జంతుకోటికి మృత్యువశమ్ము కతన*
*నాడు విలపించి లాభ ముండదు కుమార !*

*" అపుడు తన దేహమే తన కగును రోత*
*ముద్దులాడియె తనపాలి భూతమగును*
*నేటి ప్రణయ ప్రబంధముల్ నాటిదన్క*
*నిలిచియుండవు , పరువు నీటి బుడగ "*

(సౌందరనందం, 2001:32)

అని సృష్టిలో ప్రతి జీవికి మరణం తప్పదని అది ఒక తాత్వికమైన చింతనకు సంబంధించింది. ఈ విషయాన్ని పింగళి, కాటూరి కవులు చెబుతూ దీన్ని కవులు పై పద్యాల్లో వర్ణించారు.

#### 3.11.2. సమ్యక్ సంకల్పం (మంచి సంకల్పం):

ఆరో సర్గ ఉపదేశంలో బుద్ధుడు నందుడుకి ప్రజలను పరిపాలించే రాజు ఎలా ఉండాలి, ఆ రాజు తన ధర్మాన్ని మరచి అధర్మం వైపు పయనించడం సరైనది కాదని బోధిస్తాడు. ఇక్కడ నందుడు శాక్యవంశానికి చెందిన యువరాజు కనుక అతని సంకల్పాన్ని, కర్తవ్యాన్ని బుద్ధుడు బోధిస్తాడు. ఆ సంకల్పాన్ని కింది పద్యంలో బుద్ధుడు ఎలా బోధించిన తీరును చూద్దాం.

*" ప్రాసాదోపరితలముల*
*దాసీజలకల్యమానతత్తద్భోగో*
*ల్లాసలసితాత్ములెల్ల ద*

*యాసారవిదూరులో ? మహాంధులో? తనయా! ”*

(సౌందరనందం, 2001:57)

3.11.3. సమ్యక్ కర్మ (మంచి పనులు):

*“ ఆకలిబాధచే జెమట లాఱని గానికి నోర్చి, ప్రాణముల్*

*పోకుండా పెట్టువారి శ్రమమున్ రుధిరమ్ము గడించి యీయగా*

*జేకురినట్టి యర్థము లివీ యని రోయ కెటుల్ భుజింతు వ*

*న్నా ! కృపమాలి , ఘోరకలుషాక్తత దుచ్చములైన భోగముల్”*

(సౌందరనందము,2001:58)

బుద్ధుడు నందుడుకి హితబోధ చేస్తూ శ్రమ విలువను దాని ప్రాధాన్యతను వివరించారు. ఆకలితో అలమటించే ప్రజలు తమ శ్రమైక సౌందర్యంతో కష్టించి పని చేస్తారని చెప్తాడు. వారి చెమటతో, రక్తంతో ధారపోసి సృష్టించిన సంపదతో ధనవంతులు మేడలను కట్టుకొని జీవిస్తారని అలా సంపదను అనుభవించడం ఎంత పాపమని బోధిస్తాడు. ఇక్కడ శ్రమ, కర్మల ఫలితం వలన సిద్ధించే సంపదను సృష్టించడంలో పేదలు, ధనవంతులు సమానమనీ చెప్తాడు. శ్రమను , కష్టాన్ని కూడా సమానంగా పంచుకోవాలని శ్రమ యొక్క గొప్పతనాన్ని నందుడుకి గుర్తుచేశాడు బుద్ధుడు. ఇలా బౌద్ధమత అష్టాంగ మార్గంలో ఉన్న కర్మ విలువను అర్థమయ్యేలా నందుడుకి బుద్ధుడు విశదీకరించారు.

3.11.4.సమ్యక్ వ్యాయామం (మంచి ప్రయత్నం ):

*“ అంచు సరగున గాని కట్టించుటాది*

*ధర్మ దీక్ష ప్రవేశ తంత్రము లెల్ల*

*నడిపి నవమన్మథా కారు ‘నందసుతుని’*

*క్షణములో భిక్షుమాత్రగా సల్పుచుండు”*

బుద్ధుని శిష్యులు నందుడికి బలవంతంగా ధర్మ దీక్షను ఇవ్వడంతో పాటు అతని చేతిలోకి భిక్ష పాత్రను అందించనప్పుడు పడిన మానసిక స్థితిని తెలుస్తోంది. ఇక్కడ నందుడి సుఖాల నుంచి జీవితాన్వేషణవైపు దృష్టిని మార్చడానికి దీక్షను ఇవ్వడం ద్వారా నందుడిని సన్మార్గంలో జీవిస్తాడని బుద్ధుని ఆలోచనగా కనిపిస్తోంది. దీన్ని అష్టాంగమార్గాలలో ‘సమ్యక్ వ్యాయామం’ లేదా ‘మంచి ప్రయత్నంగా’ అర్థంచేసుకోవాలి.

3.11.5.సమ్యక్ స్మృతి (మంచి దృక్పథం),

*“బుద్ధాయ మహితప్రబోధాయ వైరాగ్య*

*భవనాయ దేవ! తుభ్యం జయోస్తు*

*కలికల్మషహరాయ కారుణ్యలతికాల*

*వాలాయ దేవ! తుభ్యం జయోస్తు*

*నిర్జితహింసాయ నిర్మిత ధర్మప్ర*

*పంచాయ దేవ ! తుభ్యం జయోస్తు*

*త్యాగస్వరూపాయ దశదిశాగతశిష్య*

*భజనాయ దేవ! తుభ్యం జయోస్తు*

*ఆర్త సంరక్షకాయ తుభ్యం నమోస్తు*

*పరమసత్య వ్రతాయ తుభ్యం నమోస్తు*

*దీనజనబంధుమిత్రాయ తే నమోస్తు*

*విశ్వకల్యాణకరగువే నమోస్తు "*

(సౌందరనందము, 2001:83)

అని అనడంతో ద్వారా కావ్య ప్రయోజనం నెరవేరనట్లు అయ్యింది. స్త్రీలకు కూడా బౌద్ధ ధర్మాలకు అర్హులేనడానికి బుద్ధుడు చెప్పిన విధంగా స్త్రీలు కూడా బౌద్ధ ధర్మాలను అనుసరించడానికి అర్హులేని బుద్ధుడి నోటి వెంట పింగళి కాటూరి కవులకు పలికించారు. స్త్రీలోకం కూడా బౌద్ధమతాన్ని అనుసరించాలిసిన దృష్టిని ఈ పద్యంలో వర్ణించారు.

*"గురుని పాదాబ్జముల జూడ్కి గుదురుకొల్పి*

*దేవా! భిక్షుకవృత్తి వర్తిల్లునట్టి*

*స్త్రీజనము గూడ నార్హతదీక్ష గాంచి*

*బౌద్ధ ధర్మము పాలింపవచ్చునేమొ?"*

(సౌందరనందము,200 :70)

"శరణము బుద్ధదైవము ప్రశస్తపథమ్మగు బౌద్ధ ధర్మమే" అని ఈ పద్యంలో చెప్పారు ఈ జంట కవులు.

### 3.11.6. సమ్యక్ సమాధి (మంచి ధ్యానం) :

బౌద్ధమతంలో వీటినే అష్టాంగ మార్గాలంటారు. బౌద్ధంలో వీటికెంతో ప్రాధాన్యం ఉంది. అందువల్ల పింగళి, కాటూరి కవులు ఈ మార్గాలను విస్మరించకుండా అనేక పద్యాల్లో వాటిని వర్ణించారు. కథలో అంతర్భాగంగా వాటిని వర్ణించడం వల్ల కావ్యం సౌందర్యభరితమైంది. కేవలం బోధనలను చెప్పడానికి చెప్పినట్లు కాకుండా, కథలో అంతర్భాగంగా వర్ణించడంలో కావ్యానికి విలువ ఏర్పడింది.

### 3.12.ఆర్య సూత్రాలు:

1.దుఃఖము, 2.దుఃఖానికి కారణాలు, 3.దుఃఖాన్ని ఎలా పరిత్యజించాలి. 4.దుఃఖం తొలగించే విధానాలు అనే నాలుగింటినీ బౌద్ధమతంలో స్ఫురించే ఆర్య సుత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. వీటిని కూడా వివిధ పద్యాల్లో కవులు వర్ణించారు.

### 3.12. త్రిరత్నాలు:

బౌద్ధమతంలో అష్టాంగమార్గాల తర్వాత త్రిరత్నాలకు ఒక ప్రాధాన్యత ఉంది. వీటినే త్రిపీటకాలనే పేరుతో బౌద్ధమతస్తులు  పిలుస్తారు. అవి బౌద్ధం శరణం గచ్ఛామి' మనసుకు దారి చూపే చుక్కాని 'ధర్మం శరణం గచ్ఛామి' ధర్మం అనే దాన్ని మానవులు నడవలిసిన లేదా అనుసరించాలిసిన మార్గం, 'సంఘం శరణం గచ్ఛామి'  మానవ జీవితం సమాజంతో కలిసి నడవాలిసిన మార్గాలని చెప్పవచ్చు. ఈ త్రిపీటకాలు తెలుగు సౌందరనందంలో పింగళి, కాటూరి కవులు చెప్పిన విధానాన్ని ఈ పద్యంలో గమనించవచ్చు.

బౌద్ధమత విశిష్టత ఏమిటి? అనీ ప్రశ్నించినప్పుడు బౌద్ధమతాన్ని పాటించడం వలన కలిగే  ప్రేమ, వాత్సల్యం, కరుణ, భారతీయతను, సమైక్యతను, విశ్వమానవ శాంతిని, సత్యం, అహింస, శీలం, అస్పృశ్యత నివారణ, ఇలా ఎన్నో సార్వకాలిన అంశాలతో మిళితమైన ప్రయోజనాలున్నాయి. ఇవన్నీ సౌందరనందం కావ్యాన్ని చదివినప్పుడు మనందరికీ తెలుస్తాయి. కనుక  ఈ కావ్యం బౌద్ధ సాహిత్యంలో ఎంతో గొప్పతనాన్ని, కీర్తిని దశదిశలా పొందిందని అనేకమంది విమర్శకులు అభిప్రాయపడుతున్నారు. అనాథలకు, పేదలకు సేవలు చేయడం ఒక బౌద్ధమతంలో కనిపించే ఒక విశేషం.  బుద్ధుడు బోధించిన సూత్రాలలో ఒకటి. దీన్ని బుద్ధుడు నందుడికి, సుందరికి బోధించారు. అందుచేత బుద్ధుని ప్రభావం వలనే నందుడు, సుందరి ఏకమై బౌద్ధ దీక్షను, బౌద్ధ ధర్మాన్ని పాటిస్తారు. నందుడు సుందరి లు పేదలకు సేవలు చేయడం వంటి  మానవతా దృక్పథాన్ని ప్రతిబించేటట్లు పరివర్తనం చెందుతారు. దీన్ని కవులు ఇలా వర్ణించారు.

*"చితచితలాడు నీరమున చేపలకంపున బంది ముట్టియల్*
*కతికెడి చప్పరింపులను, గైకుయి లాడెడు కుక్కకూతలన్*
*బ్రతిననదించు దద్దుర రవమ్ముల, నీదర మ్రోతలన్, దరి*
*ద్రత తలపేలు గ్రుక్కికొను తావులలో వెలివాడ చక్కటిన్ "*

(సౌదరనందము:81)

దీని వలన వెలివాడలో  చేపల వాసన, పందులు, కక్కులు, దరిద్రుల జీవితాలను స్వాభావికంగా పింగళి, కాటూరి కవులు  వర్ణించారు.  ఇలాంటి చోటును నందుడు, సుందరి కలిసి నిరు పేదలకు సేవ చేస్తుంటారు. ఆ సమయంలోనే  నంద సుందరిలను బుద్ధుడు దర్శిస్తాడు. వీరికి హరిజన పట్ల గల అపారమైన ప్రేమను చూపి ఇద్దరిని అనాథ పిల్లలను నందుడి సుందరిలిద్దరికి  ఇచ్చి పెంచమని చెప్తాడు. అలా పెంచడానికి కావలిసిన ధర్మాలను బౌద్ధమతం ద్వారా పొందారు కనుకనే ఆ లక్షణాల వలనే వీరు పేదలకు సేవ చేయడంతో పరివర్తనం చెందారనీ చెప్పడానికి ఇది ఒక నిదర్శనమని తెలుస్తోంది.

**3.13. శాంతి, కరుణ, సత్యం:**

బుద్ధుడు బోధించిన ధర్మాలలో శాంతి, కరుణ, సత్యం, శీలం, ప్రేమ, వాత్సల్యం అనేవి ఎంతో విలువైనవిగానూ, ఉదారమైనవిగానూ. పింగళి కాటూరి కవులు సౌందరనందంలో బుద్ధుని బోధనల ద్వారా నందుడికి, సుందరికి సత్యం, శీలం, ప్రేమ లను బోధిస్తాడు. అలాంటి పద్యాన్ని చూద్దాం.

**3.14. విశ్వ మానవ ప్రేమ సిద్ధాంతం:**

బుద్ధుని బోధనలలో విశ్వమానవ ప్రేమ ఒకటి. దీన్ని పింగళి కాటూరి కవులు సౌందరనందంలో ప్రతిపాదించారు. బుద్ధుడు బౌద్ధ దీక్షను, ధర్మబోధను నందుడుకి విశ్వ మానవ ప్రేమ గురించి బోధించారు. అప్పుడు నందుడు తనకు వ్యక్తి ప్రేమ తప్ప వేరొకటి వద్దని అంటాడు. ఆ సందర్భంలో బుద్ధుడు నందుడికి చెప్పిన విశ్వ మానవ ప్రేమను ఈ పద్యంలో చూద్దాం.

*“ నాకుం బ్రాణము ప్రాణమైన చెలితో నానాసుఖమ్ముల్ లతా*
*నీకమ్మై పెను గొన్న డోలికలలో ని:ఖేదదివ్యామృత*
*స్వీకారమ్ము భజింపుచున్ సమయముల్ సీమల్ వెసన్ దాటి,యే*
*కాకారమ్మును నిత్యమై నెగడు నయ్యానంద మర్థించెదన్ ”*

*“ అని యుత్కంఠ దలిర్ప నందుడు స్వకీయ ప్రేమ సిద్ధాంతమున్*
*వినిపింపన్ , సుగతుండు తద్వదనమున్ వీక్షించి, మందస్మితం*
*బును బెన్ జాలియు జాలువార , హృదయంబున్ విప్పి మేల్సేని తో*
*తనయా! వన్నెలు దేరు నీ ప్రణయతత్త్వం బెల్ల నాలించితిన్ ”*

(సౌందరనందము: 65,66)

*“బుద్ధాయ మహితప్రబోధాయ వైరాగ్య*
*భవనాయ దేవ! తుభ్యం జయోస్తు*
*కలికల్మషహరాయ కారుణ్యలతికాల*
*వాలాయ దేవ! తుభ్యం జయోస్తు*
*నిర్జితహింసాయ నిర్మిత ధర్మప్ర*
*పంచాయ దేవ ! తుభ్యం జయోస్తు*
*త్యాగస్వరూపాయ దశదిశాగతశిష్య*
*భజనాయ దేవ! తుభ్యం జయోస్తు*

*ఆర్త సంరక్షకాయ తుభ్యం నమోస్తు*

*పరమసత్య వ్రతాయ తుభ్యం నమోస్తు*

*దీనజనబంధుమిత్రాయ తే నమోస్తు*

*విశ్వకల్యాణకరగువే నమోస్తు ''*

(సౌందరనందము:83)

అని బుద్ధుడు నందుడు, సుందరీలకు వెలివాడలో విశ్వమానవ ప్రేమతత్త్వాన్ని తెలియజేస్తాడు. దీనితో నందుడు, సుందరిలో వచ్చిన పరివర్తనతో ఈ కావ్యం సమాప్తం అవుతుంది.

**3.15.పేదలకు సేవ:**

చివరి సర్గ 'సహధర్మచర్యం' లో బుద్ధుని బోధనలకు ప్రభావితమై నందుడు సుందరి సమాజ సేవను చేస్తూ పేద ప్రజలకు సేవలు చేస్తూ ఒక వెలివాడలో కలుస్తారు. ఒక పేదరాలిని, ఒక బాలికను, మరొక బాలుణ్ణి దత్తత తీసుకుంటారు. దీన్ని ఈ పద్యంలో కవులు వర్ణిస్తూ

*'' పిదప మంచము లోని యా పేదరాలి*

*గాంచిన చెరియొక దెస నిల్వగాలమహిష*

*ఘంటికానాదములు వీనుగవ నుదింప*

*నావె కనువిచ్చి నలుదెసలరసికొనుచు''*

(సౌందరనందం:82)

అని అంటూ అక్కడికి వచ్చిన బుద్ధుని చూసిన నందుడు సుందరి 'శరణము బుద్ధ దైవ' అని నమస్కారాలు చేస్తారు. తరువాత నందుడు, సుందరి తమ ఇంటినే బౌద్ధ ఆరామంగా చేసుకుని ఎందరినో నిరుపేదలకు, అనాథలకు సేవలను కొనసాగిస్తారు. అలాగే బౌద్ధమతాన్ని పాటిస్తూ కోరికలను, సంతోషాలను, బాధలను వదిలేసి త్యాగం చేయడం బౌద్ధంలో కనిపించే ఒక గొప్ప లక్షణమని చెప్పవచ్చు. అందుకనే బౌద్ధమత అనుసరించడం వలన ఈ సమాజానికి కలిగే ప్రయోజనాన్నీ ఈ పద్యంలో కవులు వర్ణిస్తూ బౌద్ధమత ప్రాధాన్యాన్ని తెలియజేశారు. *''పింగళి కాటూరి జంట కవులు ప్రాత క్రొత్తల మేలుకలయికతో నిర్మించిన సౌందరనందం ప్రబంధము ఆధునికాంధ్ర సాహితీ విహాయసములో వెలుగొందు ఒక ఉజ్జ్వలతార''* అని జంధ్యాల పర దేశి బాబుగారు (ఆధునికాంధ్ర సాహిత్యంలో బౌద్ధమత కావ్యములు – తులనాత్మక పరిశీలన ముద్రిత పిహెచ్.డి గ్రంథం,2003:361) ఆంధ్ర సౌందరనందం కావ్య విశిష్టతను తెలియజేశారు.

ఆంధ్ర సౌందరనందం గురించి గూడూరి నమశ్శివాయ గారు చెప్తూ *''ఆంధ్ర సౌందరనందము ఇరువదవ శతాబ్ది పూర్వార్ధమున మహాకావ్యము. ఆనాడు పరాధీన*

*మయిన భారతదేశమునకు పారతంత్ర్య విముక్తి ప్రసాదించుటకై జాతిపిత మహాత్ముడు జాతీయోద్యమమునకు సారథి అయ్యెను. కావున ఆంధ్రకావ్యమున గాంధేయవాదము గోచరించును.*

*హరిజనోద్యమము దీనికి ప్రాణకల్పము. ప్రప్రజ్య స్వీకరించి లోక సుందరినందులు వెలివాడలో మృత్యుదేవత యొడిలోనికి జారిపోవుచున్న ధీనురాలి గుడిసెలో కలసికొనిన విధము గాంధేయవాదమునకు మచ్చుతునక"* అని ('రసజ్ఞ శిల్పి' సంపాదకత్వం,డా పి.యస్.ఆర్ అప్పారావు, డా నందూరి రామకృష్ణమాచార్యులు, పింగళి సూర్య సుందరం,1994:30) తెలియజేశారు.

దీన్ని బట్టి ఆంధ్ర సౌందరనందం కావ్యంలో బుద్ధుడు వలన నందుడు సుందరి కాకుండా సమస్త మానవలోకం బౌద్ధమతతత్త్వాన్ని దర్శించాల్సిన ఆవశ్యకతల్ని, తీరుతెన్నుల్ని ఎంతో చక్కగా వివరించారు. త్యాగం, అహింస, సమాజసేవ అనే గుణాలు మూడుపాయలుగా కొనసాగుతూ బౌద్ధమత తత్త్వాన్ని ప్రదర్శించిన గొప్ప కావ్యం సౌందరనందం.

సౌందరనందంలోని ఇతివృత్తం బుద్ధుని జీవనవిధానం, బౌద్ధ మత ధర్మాలు సత్యం, అహింస, ప్రేమ, ధర్మం, త్యాగం, సేవా దృక్పథాలను స్ఫురింపజేస్తూ బౌద్ధమత మౌలికతను ఇముడ్చుకుంటూ కొనసాగుతుంది. ఆధునిక ఆంధ్రసాహిత్యంలో 'బుద్ధ శరణం గచ్ఛామి', 'సంఘం శరణం గచ్ఛామి' 'ధర్మం శరణం గచ్ఛామి అని అనడంలో 'సౌందరనందం' కావ్యం ఒక ఉజ్జ్వల తారగా వెలుగుతోంది. దీన్ని విశిష్టతను కొందరు ప్రశంసించారు. "*సౌందరనందము ఆంధ్ర ప్రబంధ సరస్వతికి మకుటము"* అని ఈ ప్రశంసా వాక్యాలను పలికినవారు శ్రీమూట్నూరి కృష్ణారావుగారమన్నారనీ (ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి స్మారక సంచిక,1974:100) లో 'సృష్టిజేసితి మీ కావ్యశిల్పమూర్తి' అనే వ్యాసంలో శ్రీరాచకొండ నరసింహమూర్తిగారు తెలియజేశారు.

### 3.16. ఆంధ్ర సౌందరనందము – పాత్ర పోషణ:

పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు జంటగా రాసిన సౌందరనందం కావ్యంలో పాత్రలను పరిశీలన చేస్తే బుద్ధుడు, నందుడు, సుందరి, శుద్ధోధనుడు, మాయాదేవి, యశోధర, రాహులుడు, చిలుక, ఆనందుడు, పరిచారికలు ఇలా పాత్రలు ఉన్నాయి.

### 3.16.1. బుద్ధుడు:

సిద్ధార్థుడు కపిలవస్తుపురాధీశుడైన శుద్ధోధనమహారాజు కుమారుడు. తల్లి మాయాదేవి, భార్య యశోధర, కొడుకు రాహులుడు. యౌవ్వన ప్రాయంలోనే సంసారదుఃఖ దృశ్యాలను గాంచిన విరక్తుడై, సిద్ధార్థుడు సత్యాన్వేషణాతత్పరుడై అరణ్యాలకేగి తపశ్చర్యను ఆశ్రయించాడు. తన తోడిదే లోకమని ఉన్న వృద్ధుడైన తండ్రినీ, తన వక్షస్సువాలి నిద్రిస్తున్న

ప్రేమమూర్తి యశోధరనూ, కుమారుడైన రాహులునీ కూర్మినీ, రాజ్యలక్ష్మినీ పరిత్యజించి, సత్యమార్గమున అన్వేషించి, తుదకు నిర్వాణపథం కనుగొన్నాడు. ఆ మహాత్ముని ఈ త్యాగమహిమను విని త్రికాలములు (భూత, భవిష్యత్, వర్తమానాలు) రోమాంచాన్ని పొందుతాయి. ఆయన బోధించిన ధర్మం సప్తద్వీపాలకూ వ్యాపించింది.

పింగళి, కాటూరి రాసిన ఆంధ్ర సౌందరనందములోని పాత్రలను చిత్రించిన విధానాన్ని పరిశీలించడం ద్వారా ఈ కవుల ప్రతిభ పాత్రల మనస్తత్వాల్ని, పాత్రల పరిణామ గతుల్ని తెలుస్తాయి. ఆచార్య తమ్మారెడ్డి నిర్మలగారు పాత్ర పోషణను నిర్వహిస్తూ *"కథా గమనంలోని వివిధ సన్నివేశాలలో దానికి తగినట్లుగా ఆ పాత్రల చేష్టలు, మన: ప్రవృత్తులు ఒక క్రమంగా నిరూపించడాన్నే పాత్ర పోషణ"* అని (నన్నెచోడుడు కుమారసంభవ పరిశీలన,1999:238)లో తెలిపారు.

*"కవి కావ్యాన్ని నిర్వహించడానికి కథ ప్రధానమైనది. కథలోని ప్రధానమైన పాత్రలను ఆశ్రయించే రసభావాదులు కలుగుతాయి. కవి స్వీకరించిన ఆ కథ కవి చెప్పబోయె మహా విషయానికి అనుగుణంగా అవి మారుతూ ఉంటాయి. కవి తన కావ్యంలోని అన్ని సంఘటనలను పాత్రల మనోవృత్తులను కల్పన చేయవచ్చని పాత్రచిత్రణ దాని ప్రయోజనాన్ని"* అని (కోవెల సుప్రసన్నాచార్యులు, సహృదయ చక్రం,1983:13) వివరించారు. *"కవి సామాన్యంగా తనకు తెలిసిన జీవితాన్నే చిత్రించినప్పుడు అది సజీవమైన పాత్ర పోషణను బట్టి నాయకా, నాయికలకు, కథకు ఔన్నత్యం చేకూరుతుందని"* అని దార్ల వెంకటేశ్వరరావుగారు (జ్ఞానానందకవి ఆమ్రపాలి పరిశీలన,1999:23) తెలియజేశారు. దీన్ని బట్టి సౌందరనంద కావ్యంలో పాత్రలను చిత్రించడంలో పింగళి, కాటూరి కవులు గొప్ప ఔన్నత్యాన్ని ప్రదర్శించారని తెలుస్తోంది.

### 3.16.2. సుందరి నందుడు:

పింగళి, కాటూరి కవులు జంటగా రాసిన సౌందరనంద కావ్యానికి నాయక నాయికలు నందుడు సుందరి.ఇతడు బుద్ధునికి సవతి తమ్ముడు. మంచి అందగాడు. ఇతని భార్య పేరు సుందరి. ఇరువురు అనురాగం అనే సముద్రంలో ఓలలాడుతుంటారు. సుందరి కనుబొమ్మల కదలికకే నందుని మనస్సు పరవశించగా అతడు విశ్వాన్ని మరచి విభ్రాంతుడై నిలిచిపోయాడని కవులు వర్ణించడం సుందరి పట్ల నందునికి గల వ్యామోహం, అనురాగం వ్యక్తమౌతుంది. నిరంతరం నందుడు సుందరి తో శృంగారకేళి విలాసాల్లో మునిగితేలేవాడు. అయినప్పటికీ నందుడు ఎంతో సంస్కారశోభితుడు. బుద్ధుడు నందుని యింటికి బిక్షం కోసం వచ్చి రిక్తహస్తాలతో తిరిగి వెళ్లడాన్ని విని ఎంతో బాధపడ్డాడు. దీనికి కారణం నందుడిలో ఉన్న సంస్కారం. ఆ సంస్కారం వలనే బుద్ధుడు నందుడికి బిక్షాపాత్రను ఇచ్చినప్పుడు బౌద్ధ దీక్షను ఇచ్చినప్పుడు కానీ దాన్ని తిరస్కరించలేకపోయాడు. విశ్వాన్ని మరచి విభ్రాంతుడై సుందరిని మోహించినటువంటివాడే బుద్ధుని బోధనలకు కరిగిపోయి ఆత్మజ్ఞానాన్ని

పొందడం అనే వర్ణన ఆటు నందుని గుణ శీలాన్ని, బుద్ధుని ఔన్నత్యాన్ని చక్కగా మేళవించి వర్ణించారు పింగళి కాటూరి కవులు.

### 3.16.3. కావ్య నాయిక సుందరి:

పింగళి, కాటూరి కవులు రాసిన ఆంధ్ర సౌందరనందము అనే బౌద్ధ కావ్యంలో కావ్యనాయిక సుందరి. ఈమే నందుని భార్య. బుద్ధుని మరదలు. సుందరని పేరుకు తగ్గట్టుగానే అందగత్తె, నడకలలో రాజహంసగా నువ్వుల్లో విరిసిన వెన్నెలలో, మాటల్లో మకరందం అని కవులు వర్ణించారు. సుందరి పాత్ర తొలినాళ్ళల్లో భర్తను తన ఆధీనంలో పెట్టుకొని బయట ప్రపంచానికి సంబంధాలు లేకుండా తమ సంసారిక జీవితాన్ని పొందుతూ ఉంటూరు. అలాంటి సుందరి తన భర్త నందుడు బుద్ధుడి ప్రభావంతో, బోధనలతో బౌద్ధమతస్తుడిగా పరివర్తన చెందుతాడు. చివరికి సుందరి కూడా బుద్ధుని మానవతా ప్రేమకు లొంగిపోయి తను కూడా నందుని అడుగుజాడల్లో పయనించి బౌద్ధమతాన్ని స్వీకరించి ఒక గొప్ప కావ్య నాయికగా ఈ సౌంరనందము కావ్యం ముగుస్తుంది. బుద్ధుడు, నందుడు, సుందరి పాత్రలన్ని కూడా ఈ జగతికి మూలస్తంభమైన విశ్వ మానవీతను అందించిన గొప్ప బౌద్ధ కావ్యంగా విమర్శకులచేత ప్రశంసించబడింది.

### 3.16.4. బుద్ధుడు:

బుద్ధుడు భూత, భవిష్యత్, వర్తమాన కాలాల్లో మహాధర్మంగా భావించబడే బౌద్ధ ధర్మ బోధకుడిగా సౌందరనంద కావ్యంలో తొలి పద్యంలోనే పింగళి కాటూరి కవులు ఎంతో ఔన్నత్యం తో వర్ణించారు.

*“ యన్మహాత్యాగ మహిమంబు నాలకించి,*
*మూడుకాలముల్ రోమాంచమును వహించు*
*నేడు దీవులకున్ బ్రాకి యెవని ధర్మ*
*లతలు వనలెత్తె నాశాక్యపతి సుతుండు”*

(సౌందరనందము,2001:7)

బుద్ధుడు తన భార్యాబిడ్డలను, తల్లిదండ్రులను, రాజ్యాన్ని వదలి సత్యాన్ని అన్వేషించడానికి భవబంధాలను తృణప్రాయంగా తజ్యించిన గొప్ప బోధకుడిగా కవులు బుద్ధుడ్ని వర్ణించారు. కుటుంబానికి కంటే ప్రపంచ ప్రజల దుఃఖ నివారణ తనకు అత్యంత ముఖ్యమైనదని భావించిన త్యాగశీలిగా కవులు బుద్ధుడ్ని వర్ణించారు. కాశీలోని మహా పండితులు కూడా బుద్ధుని బోధనలను విన్న తరువాత బదులు పలకలేకపోయారని వర్ణిస్తూ “వారణాసి ప్రణతిచేసే” అందరికి నమస్కరించారని చెప్పడం బుద్ధుని ధర్మం. బుద్ధుని బోధనలోని గొప్పతనాన్ని ఎంతోమంది అంగీకరించారని అంత ప్రభావశాలిగా బుద్ధుని వర్ణించారు కవులు. కేవలం పండితులకే కాకుండా సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో ఆయన బోధనలు ఉండేవని అందుకనే ఆయన జ్ఞాని అయిన తరువాత ఆయణ్ణి చూడటానికి

కపిలవస్తు నగర ప్రజలంతా ఎగబడేవారని బుద్ధుని గొప్పతనాన్ని, ఆయన బోధనల ఆదరణను అద్భుతంగా వర్ణించారు కవులు. ఆయన కపిలవస్తు నగరానికి మరలా తిరిగి వచ్చినప్పుడు ఆయణ్ణి చూడటానికి జనం ఎగబడుతూ

*"అలనాటి నడిరేయి నశ్వరాజము వెన్ను*
*చామంతి వీడ్కొనినట్టి స్థలము దాటి*
*చెన్నరి దొల దోచిన రాజగృహలక్ష్మీ*
*పుల్కుపుల్కున దన్ను బోల్చికొనగ "*
*నెలగోలుమూకల యెల్గుల సౌధవా*
*తాయనమ్ము లపావృతములుగా గా*
*తలుపులు తెరిచి పౌరులు కిమితి(బువా*
*ణులగుచు వెరగంది నిలిచిచూడ*

*నాత్త పరతత్త్వ బోధమౌ నాత్మతేజ*
*మానసేందుని బరివేషమై భజింప*
*బురము చొత్తెంచి నిలిచిన బోధిసత్వు*
*గనుకనిన్ గని పౌరులు గములుగూడి.*

*బోధిసత్వుడనుచు మునికులమణి యంచు*
*భూపసుతుండు సంగముక్తుండనుచు*
*శాక్యరత్న మనుచు శౌద్ధోదనియటంచు*
*నడు గడుగున విన్న యాజనమ్ము "*

(సౌందరనందము,2001:9)

అనడంలో బుద్ధుని త్యాగాన్ని ప్రజలు పదేపదే స్మరించుకున్నారని భార్యాబిడ్డల్ని వదిలేసి రాజ్యాన్ని, తల్లిదండ్రులను వదిలేసి వెళ్లిన దాన్ని ప్రజలు హర్షించరని కవులు అద్భుతంగా వర్ణించారు.

*"అంతకంటే సుకృతాత్మయైన మాయాదేవి*
*కడుపార గన్న బంగరు తండ్రి*
*ఆలు బిడ్డలును రాజ్యము దృణమ్ముగ గాన*
*కేగినట్టి విరక్తు డీతడటవె*
*వీడెయౌనే కన్న బిడ్డలవలె మమ్ము*
*రక్షించుననుకొన్ని రాసుతుండు*
*మనబోటి పాపులకు ను మోక్షము నొసంగ*

*నరుదెంచు పుణ్యాత్ము డటవె యితడు*
*ఎంతభాగ్యమె, యెన్నాళ్ళకే లభించె*
*సౌమ్య గంభీరమైన యీ చక్కనయ్య*
*నెమ్మొగము గాంచారు పుణ్యమ్ము కాదగడే యితండు ".*

(సౌందరనందము,2001:10)

ఆయన బోధించిన బోధనలు మోహవిభ్రాంతిని పోగొట్టి దుఃఖాన్ని లేకుండా చెయ్యగలిగిన సత్యదర్శనవాదిగా

*" సుతుడుంచున్ బతియంచు బాంధవుడటంచున్ మోహవిభ్రాంతిసం*
*గతులై ,దుస్తరశోకవార్ధి బండి చీకాకైన యో జీవసం*
*చేతులారా కలిపాశబద్ధులగు నార్త ప్రాణులారా జను*
*ర్మృతిసంపీడితులార సత్యపథమున్ మీరెల్ల రాలింపుడీ"*

(సౌందరనందము,2001:11)

ఇలా మొత్తం తొమ్మిది సర్గలలో  బుద్ధుని తేజస్సు బుద్ధుని ప్రభావం ప్రతి సర్గలో కనిపిస్తున్నట్లుగా వర్ణించడం ఒక గొప్ప ఔన్నత్యం.

### 3.16.5. ఇతర పాత్రలు:

బుద్ధుని తల్లిదండ్రులు బుద్ధున్ని ఎంతో ప్రేమతో వాత్సల్యంతో చూసేవారని కవులు వర్ణించారు. తల్లిదండ్రుల ప్రేమను వర్ణిస్తూ బుద్ధున్నే తమ లోకంగా నమ్మి జీవించేవాళ్ళగా తల్లి దండ్రులు గుణశీలాన్నీ వర్ణించారు కవులు. తండ్రి శుద్ధోదనుడు ,తల్లి మాయాదేవి కుమారుడు రాహువుడు, భార్య యశోధర,పెంచిన తల్లి గౌతమి పాత్రలను స్వరమాత్రంగా. వారికి బుద్ధుని పట్ల గల ప్రేమను వర్ణించారు కవులు. పాత్ర పోషణలో అత్యంత ముఖ్యమైన పాత్రలుగా, బుద్ధుడు, నందుడు, సుందరి కనిపిస్తారు.

### 3.16.6. నాయకుడు:

సౌందరనందములో ప్రధాన నాయకుడు ఎవరూ అనే ప్రశ్న వచ్చినప్పుడు నందుడు సుందరి నాయకా నాయికలు. వారి శృంగారం ప్రధానంగా వర్ణించినప్పటికి వారిని బౌద్ధ ధర్మం వైపు తీసుకువెళ్ళిన బుద్ధుడు కూడా ప్రధాన పాత్రగా కూడా కనిపిస్తాడు. అయినప్పటికీ సౌందరనందములోని ప్రధాన రసం(అంగి) శృంగారం. కానీ బుద్ధుని బోధనలు విని నందుడు సుందరి బౌద్ధ ధర్మం వైపు పయనిస్తారు. ఆ విధంగా చూసినప్పుడు కావ్య ఫలంలో శాంతరసం ప్రధాన రసంగా  అవుతుంది.

తర్వాత రాబోయే అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతంగారి స్వతంత్ర పద్యకవిత్వంలో కనిపించే భావుకత, రచనావిశేషాల్ని తెలుసుకుందాం.

నాల్గవ అధ్యాయం

# పింగళి లక్ష్మీకాంతం స్వతంత్ర పద్య కవిత్వం పరిశీలన

**4.0 ఉపోద్ఘాతం:**

పింగళి లక్ష్మీకాంతంగారి పద్యకవిత్వమనగానే సాహితీవేత్తలకు కాటూరి వేంకటేశ్వరరావుగారితో కలిసి రాసిన జంట కవిత్వమే గుర్తుకొస్తుంది. కానీ, ఆయన స్వతంత్రంగా ఎన్నో పద్యాలను రాశారు. వాటిని ఈ అధ్యాయంలో పరిశీలించడం జరుగుతుంది.

**4.1 ఆత్మ లహరి:**

పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన ఒక ఖండిక పేరు ఆత్మలహరి అనేది పింగళివారి జీవిత. అనుభవాల సంగమం. వీటిలో మూడు ఖండికలు తప్ప మిగిలినవన్నీ పింగళి లక్ష్మీకాంతం బతికి ఉండగానే ఇంతకు ముందు అధ్యాయాల్లో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావుగార్లు రాసిన జంటకవిత్వాన్ని పరిశీలించడం ఆ రెండు అధ్యాయాల్లో కవిగా పింగళి లక్ష్మీకాంతంగారిని పరిశీలించే అవకాశం కొంత లభించినా పూర్తిగా సాధ్యం కాదు. అందువల్ల ఆయన రాసిన స్వతంత్ర పద్యకవిత్వాన్ని ఈ అధ్యాయంలో పరిశీలన చేస్తాను. పింగళి లక్ష్మీకాంతంగారు స్వతంత్రంగా అంటే సొంతంగా రాసిన పద్యకవిత్వాన్ని దీనిలో పరిశీలించడం జరుగుతుంది. ఇక్కడ అనేది సొంతం అనే అర్థంలో ప్రయోగిస్తున్నాను. సాధారణంగా స్వతంత్ర రచన అనగానే ఆంధ్ర భాషలో కాకుండా ఇతర భాషల అనువాదం చేసిన రచనలను స్ఫురించే అవకాశం ఉంది.

పింగళి లక్ష్మీ కాంతంగారు **'ఆత్మ లహరి'** పేరుతో రచించిన పన్నెండు పద్య ఖండికల్ని ఆయన మరణానంతరం వారి కుమారుడు పింగళి సూర్య సుందరంగారు పింగళివారి శిష్యులు మరికొందరు కలిసి పుస్తక రూపంలో తీసుకువచ్చారు. ఈ రచనల్లో పింగళివారి పద్య రచనా శైలి, స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. అందువల్ల ఈ అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతంగారి ఆత్మ లహరిలోని ఖండికలు కాలాను క్రమంగా పింగళి లక్ష్మీకాంతంగారి రచనలను విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

దీనిలో కాలాను క్రమం కాకుండా మొదట పింగళి లక్ష్మీకాంతంగారి ఇష్ట దైవానికి సంబంధించి ఖండికల్ని మొదట చేర్చారు. కనుక మధుర పండిత రాజము కంటే ఆత్మ లహరి ఖండ కావ్యం ముందుగానే ప్రచురితమైంది. కానీ ప్రచురణ కర్తల మనో భావాలను అనుసరించి

అదే పద్ధతిలో ఇక్కడ కూడా పేర్కొంటున్నాం. ఆత్మ లహరిలో ఉన్న ఖండికల పేర్లు అవి ప్రచురితమైన కాలం, అవి వెలువడిన నేపథ్యాల్ని, పూర్వపరాల్ని, వాటిలో ఉన్న ప్రత్యేకతల్ని ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు 'రసజ్ఞ శిల్పి' లో (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక)లో ఈ 'ఆత్మలహరి' ఖండ కావ్య సంపుటి యొక్క స్వరూపాల్ని, వాటి చరిత్రల్ని స్పష్టంగా పేర్కొన్నారు. ఆ వివరాల్ని ఈ విధంగా తెలిపారు.

*"1. పర్వతా రోహణము (మే 1934)*

*2. సవిత (1928)*

*3. దైవస్తుతి (1969–1971 మధ్య కాలంలో తమ డైరీలో అప్పుడప్పుడు రాసుకున్న పద్యాలు)*

*4. ఆది వైద్యుడు (1927)*

*5. ప్రణయ లేఖలు (1923 ఆగష్టు, నవంబర్ మధ్య రాసినవి)*

*6. తిక్కనామాత్య*

*7. తిలక్ నిర్యాణం (ఆగష్టు,1920)*

*8. శివ బ్రహ్మైక్యము (1916 కాశీనాథుని బ్రహ్మయ్య లింగం గారి నిర్వాణ సందర్భంలో రాసినవి)*

*9. గురుకీర్తనము (1950 తమ గురుదేవులు చెళ్లపిళ్ల వేంకట శాస్త్రి గారి నిర్వాణ సందర్భంలో రాసినవి)*

*10. విశ్వ శిల్పి (1954 అడవి బాపిరాజు గారు దివంగతులైనప్పుడు రాసిన పద్యాలు)*

*11. లక్ష్మీ నిర్గమనము (1969 లక్ష్మీ కాంతం గారి భార్య లక్ష్మీ నరసమ్మ గారు స్వర్గస్థులైనప్పుడు వ్రాసిన పద్యాలు)*

*12. ఆత్మ లహరి (నేను) పింగళి వారు అప్పుడప్పుడు డైరీలో వ్రాసుకున్న పద్యాలు)*

*ఈ పన్నెండు కావ్య ఖండికల చివరి 'చాటువులు' అనే శీర్షికతో ఆరు పద్యాలు చేర్చబడ్డాయి. ఈ మొత్తం కవితా సంపుటికి 'ఆత్మ లహరి' అని వారి కుమారులు నామకరణం చేశారు"* అని అనే వ్యాసంలో ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు ఆత్మ లహరి కావ్యంలోని ఖండికల వివరాల్ని వాటికి సంబంధించిన నేపథ్యాన్ని విశ్లేషణాత్మకంగా వివరించారు (ఆత్మ లహరి ఖండ కావ్య సంపుటి – ఒక అనుశీలన' రసజ్ఞ శిల్పి 'ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక,'1994:84) అవి ఈ కింది విధంగా ఉన్నాయి. వాటి గురించి తెలియజేస్తున్నాను.

**4.1.1 పర్వతా రోహణము:**

'ఆత్మలహరి'లోని తొలి ఖండిక పేరు 'పర్వతా రోహణము' పింగళి లక్ష్మీకాంతంగారు తిరుపతియాత్ర సందర్భంగా తనకు కలిగిన స్వీయ అనుభవాలు, ఊహలు ఈ ఖండికలుగా రచించారు. ఇవి శ్రీవేంకటేశ్వర స్వామిపై తనకు ఉన్న భక్తి ప్రవృత్తులను తెలియజేస్తాయి. ఈ

ఖండిక నేపథ్యాన్ని వివరిస్తూ పింగళి లక్ష్మీకాంతంగారి కుమారుడు పింగళి సూర్యసుందరంగారు ఈ విధంగా ఉటంకించే ప్రయత్నం చేశారు. ఈ పర్వతా రోహణము అనే ఖండిక వివరాల్ని పింగళి సూర్య సుందరంగారు ఇట్లా అంటూ *"తిరుమలేశుని దర్శించుకోవడం వెనుకటి రోజుల్లో ఎంతో శ్రమతో కూడిన పనిగా ఉండేది. రవాణా సౌకర్యాలు ఉండేవి కావు. నడకతో వెళ్లి మాత్రమే కొండపైకి ఎక్కి శ్రీవారిని దర్శించుకోవాలి. ఆ సందర్భంలో శ్రీవేంకటేశ్వరస్వామి మహిమల గురించి రకరకాల కథలు చెప్పుకునేవారు. పింగళి లక్ష్మీకాంతంగారు కూడా అలా తన అనుభవాలను చెప్పిన కథలే దీనిలోను ఉన్నాయి"* అని పింగళివారి పర్వతారోహణము ఖండికకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని తెలియజేశారు (పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర,2010: 117,118) పేర్కొన్నారు. దీన్ని బట్టి శ్రీవేంకటేశ్వరస్వామి శ్రీమహావిష్ణువు యొక్క అవతారం. ఆయన వైకుంఠాన్ని వీడి భూలోకానికి రావడానికి అనేక కారణాలున్నాయి. అందులో ఒక కారణం తెలుగు వారు చెప్పే కవిత్వాన్ని వినాలని కోరిక వలన తిరుపతిలోని శేషాచలం పర్వతాలపై కొలువైయ్యారని చెప్తూ

***"వసుమతి నెల్లచో సపరివారముగా విహరించు నిందిరా***
***రసికున కాంధ్ర కానన ధరాధరసానువిహార లీల***
***పొసగగ బోలు, నాంధ్రకవితోక్తుల జేరికమై వినన్ ముదం***
***బెసగగ బోలు, కోరి వసియించెను శేషగిరిన్ బ్రసన్నుడై "*** (ఆత్మలహరి: 45) అని

ఈ పద్యాన్ని గమనిస్తే తెలుగు కవులు భక్తి తన్మయత్వాన్ని శ్రీ వేంకటేశ్వరస్వామి ఎంతో మెచ్చుకున్నారడనే ధ్వని తెలుగు కవులలో రచయిత్రులు అనేకమంది శ్రీవేంకటేశ్వర స్వామిపై కవిత్వం రచించారు. అటువంటి వారిలో తాళ్ళపాక అన్నమాచార్య, తాళ్ళపాకకవులు, తరిగొండ వెంగమాంబ మొదలైనవారు శ్రీవేంకటేశ్వరస్వామి గురించి కీర్తనలు రచించి కవిత్వాన్ని అల్లారు. ఆ కవిత్వం ఎంతో భక్తి పారవశ్యంతో వెలుగొందింది. ఇదే విధంగా పింగళి లక్ష్మీకాంతంగారు పరోక్షంగా తెలుగు సాహిత్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి వర్ణనలు అత్యధికంగా వచ్చాయనీ ధ్వనింపజేశారు. అంతేకాదు శ్రీవేంకటేశ్వరస్వామి వేదాలలో, ఉపనిషత్తులలో ఉన్న భావానికి అనుగుణంగా వెంకన అనే పేరు పెట్టారని ఈ పద్యంలో చెప్పారు.

***"ఆ పరంజ్యోతి కుపనిషదర్థమునకు***
***బేరు పెట్టిరి ఆంధ్రులు 'వేంకన' యని***
***అలజడుల వేల 'కో' యని పిలిచినంత***
***'ఆ' యనుచు బల్కి వెంకన్న యాదుకొనును "*** (ఆత్మలహరి:45) అని

అందుకనే ఆయన భక్తులను ఆయన్ని ఆశ్రయించిన వారిని ఆశీర్వదించి ఆదుకొనగల రక్షకుడిగా భావిస్తూ కథలు ఏ విధంగా చెప్పుకునేవారని వర్ణిస్తూ ఈ పద్యాన్ని చెప్పారు.

*" కడచిన యాపదల్ కథలుగా సహయాత్రికుతోడ జెప్పుచున్*

*గడపిన వేంకటేశ్వరుని కారుణికత్వము నుగ్గడించుచున్*

*గడలు ప్రతిధ్వనింప భజనల్ పచరించుచు నేడుకొండలున్*

*గడియలమీద బ్రాకెదరు కంజదళాక్షుని భక్తులయ్యెడన్ "* (ఆత్మలహరి: 46) అని

ఈ పద్యంలో శ్రీవేంకటేశ్వరస్వామి మహిమల్ని ఎంతో గొప్పగా వర్ణిస్తారని, అలా కథలకు నిదర్శనంగా తన జీవితంలో సంభవించిన ఒక సంఘటనను వర్ణిస్తూ శ్రీవేంకటేశ్వరస్వామి మహాత్మ్యాన్ని జీవిత సత్యంగా కవి వర్ణించారు.

దీన్ని పింగళి వేంకటకృష్ణారావుగారు ఈ విధంగా చెప్తూ *'పింగళి లక్ష్మీకాంతంగారి కొడుకు వెంకటరత్నానికి స్ఫోటకం అనే వ్యాధి వస్తే దానిని తగ్గించి పిల్లవాడికి ఆరోగ్యం కలిగించాడని అందువల్ల ఒక శతకాన్ని కూడా రాయలనుకున్నానని'* (పింగళి లక్ష్మీకాంతం కావ్య సమాలోచనము, 2013:277) ఉటంకించారు.

*" పోయిన ప్రాణముల్ మరల బోసి సుతున్ బ్రతికించియిచ్చె, నం*

*భా'యని యీనమోపయిన యావు నదిన్ సుడిలో మునుంగ దె*

*ప్పై యొక యొడ్డు సేర్చెను, దయానిధి వేంకట నాయకుండు మా*

*నాయన యంచు మ్రొక్కుదురు నమ్మినవారు విశుద్ధచిత్తులై "* (ఆత్మలహరి:46) అని

ఈ విధంగా తనకు కష్టాలు గానీ, ఆపదలు గానీ, మరే ఇతర సంఘటనలు ఎదురైనప్పుడు వివిధ సందర్భాలు వచ్చినప్పుడల్లా శ్రీ వేంకటేశ్వరస్వామిపై తన భక్తిని పింగళి లక్ష్మీకాంతంగారు ప్రదర్శించారు.

### 4.1.2 సవిత:

సవిత అంటే 'సూర్యుడు' అని అర్థం నిఘంటువుల్లో ఉంది. పింగళి లక్ష్మీకాంతంగారు 'సవిత' అనే శీర్షికలో మూడు పద్యాల్లో సూర్యదేవును వర్ణించారు. జగన్నాథ పండితరాయల తేజోలహరి అనే సంస్కృత ఖండికని తెలుగులోకి అనువదించక ముందుగానే 1928 సంవత్సరంలో ఈ సవిత ఖండికలు రచించారు. తేజోలహిరిలో సూర్యని వర్ణన ఉంది. మయూరిని సూర్య శతకంలోని కొన్ని అంశాలు దీనిలో ఉన్నట్లు అనిపిస్తుంది.

*"ముకుళితమైన యీ భువనమున్ వికసింపగ జేయు జీవశ*

*క్తికి నిలయమ్ము లౌ సవితృ దివ్య సహస్ర మయూఖముల్ తమో*

*వికృతములైన మా హృదయ వీధుల సాగి పవిత్రతా నిరో*

*ధకము లడంచి పావన సుధాపరిపూర్ణములన్ బొనర్చుతన్ "* (ఆత్మలహరి:47) అని

ఈ పద్యంలో ఈ ప్రపంచాన్ని వికసింపచేయడానికి, జీవశక్తిని సూర్య భగవానుడు చీకటిని పోగొడుతూ సహస్ర కిరణాలతో ప్రపంచాన్ని దీప్తిమంతం చేస్తుంది. అటువంటి సూర్యుడు

తమ వీధుల్లో పయనిస్తూ అపవిత్రతను పోగొట్టి అమృతం వంటి పవిత్రతను, పుణ్యాన్ని కలగజేస్తున్నాడని సూర్యుణ్ణి వర్ణిస్తాడు కవి. సూర్యుణ్ణి వర్ణించడంలో మొదటి పద్యంలో ఆయువు, తేజాన్ని, వరాన్ని, ఇచ్చే గొప్ప దాతగా వర్ణిస్తాడు. సూర్యోదయం మన శరీరంపై తాకితే విటమిన్ డి శరీరానికి అందుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకనే చిన్న పిల్లలు జన్మించిన తరువాత కొన్నాళ్ళ పాటు ఉదయం పూట, సాయంత్రం పూట సూర్య కిరణాలలో పెడతారు. అది ఆ పిల్లలకు ఆయువును ఇచ్చి అంటే ప్రాణాన్ని ఇచ్చే గొప్ప చర్య. ఈ విధంగా సూర్యుణ్ణి ఒక దైవంగా భావించడంలో ఎన్నో ఆరోగ్య రహస్యాలున్నాయని ఈ పద్యాలు ద్వారా కవి ధ్వనింపజేస్తున్నారు. ఈ పద్యాలు పైకి సూర్యుణ్ణి వర్ణించే భక్తి ప్రభావంలా అనిపించినా మానవ శక్తిని కలిగించే శాస్త్రీయమైన అనేక విషయాల్ని సూర్యుడు మానవులకే కాకుండా సమస్త జీవకోటికి అందిస్తున్నాడని ఈ పద్యాల ద్వారా పింగళి లక్ష్మీకాంతంగారు స్ఫురింపజేశారు.

### 4.1.3 దైవస్తుతి:

దైవ స్తుతి ఈ పద్యాలను కూడా శ్రీవేంకటేశ్వరస్వామి గురించి వర్ణించినవే. దీని పూర్వపరాల్ని పింగళి సూర్యసుందరంగారు ఇలా చెప్తూ *"1969 సంవత్సరంలో తన భార్య లక్ష్మీనరసమ్మ మరణించారు. అయినప్పటికీ శ్రీ వేంకటేశ్వరస్వామిపై గల భక్తితో ఆ కొండ మీద ఉండిపోయాడు. నిజానికి 1961 సంవత్సరంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా వెళ్ళారు. అక్కడ పది సంవత్సరాల పాటు తిరుపతిలో నివసించాడు. ఈ సందర్భంలో ముఖ్యంగా తన భార్య చనిపోయిన తరువాత 1969-1971 మధ్యలో ఈ పద్యాల్ని రాసుకున్నట్లు ఆయన కుమారుడు పింగళి సూర్య సుందరంగారు తెలిపారు"* అని (పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,2010:118) తెలిపారు. దీన్ని బట్టి ఈ దైవస్తుతి ఖండికలో తన శక్తి అంతా క్షీణించిందని ఈ సంసార సాగరాన్ని తాను ఇక ఈదలేనని శ్రీవేంకటేశ్వరుడే ఒక తప్పక ఇచ్చి ఈ సంసార సముద్రాన్ని దాటించమని కొడతాడు కవి.

తనని నరకంలో పెడతావో, స్వర్గంలోకి తీసుకెళ్తావో అంతా ఇష్టం అంటూ తాను పాపమే చేశాడో, పుణ్యం చేశాడో తనని ఆదుకోవలసిన మహానుభావుడివి నీవ్వేనని శ్రీవేంకటేశ్వరస్వామిని కోరతాడు. దైవ స్తుతి పేరుతో ఐదు పద్యాలు రచించారు. కావ్య భేదాలలో ఐదు పద్యాల ఖండికని పంచరత్నావళి అంటారు. ఐదు పద్యాలు రచించి ఆపేయడంలో పంచేంద్రియాలు భగవంతుడిలో లీనమయ్యేటట్లు జీవుని వేదనను ధ్వనింపచేయడం ఈ పంచరత్నావళిలోని శిల్ప రహస్యం. అందువల్ల ఈ ఐదు పద్యాలు స్థల, కాల కాలాలకు అతీతంగా నిలిచే గొప్ప పద్యాలుగా అభివర్ణించవచ్చు. ఆ ఐదు పద్యాలను ఇక్కడ పేర్కొంటున్నాను.

***"గాటంబైన భుజాబలమ్ముడిగె, జంఘాశక్తి క్షీణించె, ము***
***న్నీటన్ మున్గుచు దేలుచున్ సొలసి శ్రాంతిం జెందితిన్, నీ తులా***

*కోటి ద్వంద్వ విభూషితమ్ములగు నంఘ్రుల్ తెప్పగా నిచ్చి నన్*
*దాటింపంగదవయ్య సంసృతి సముద్రంబున్ మహానావికా! ”*

*“ నరకమునందె త్రోసెదవో, నాక నివాససుఖ మ్మొసంగెదో,*
*అరమరలేక నీ సముఖమందున సేవకె నిల్పుకొందొ, నీ*
*వెరుగని పాపపుణ్యముల నే నొనరింప, నిహమ్మునంబలెన్*
*పరమునగూడ నన్నరయు భారము నీదె సుమీ మహేశ్వరా! ”*

*“ ఆల్లదె శేషశైల శిఖరాగ్రమునన్ వెలుగొందు తత్త్వవిద్*
*వల్లభ భాగధేయము నిధానము శ్రీపతి వేంక టేశ్వరుం*
*డెల్ల విధంబులన్ శరణమిచ్చి భయమ్మును దీర్చు, నేటికే*
*తల్లడపాటు కట్టెదుట దైవము నిల్వగ మూఢచిత్తమా ! ”*

*“ ఈవే రాముడ వీవే కృష్ణుడవు నీవే వాసుదేవుండవున్*
*ఈవే శంభుడ వీవే పార్వతివి నీవే కా ర్తికేయుండవున్*
*నీవెవ్వండవౌ నిర్ణయింపగల జ్ఞానిన్ జూడగాబోమయా*
*దేవా! తీర్పతి వేంకటేశ్వర! నమస్తే! సర్వదేవాత్మకా ! ”* (ఆత్మలహరి:48) అని

కోరితినేని యిచ్చెదవు కోటికి నే పడగెత్త జాలు బ గారము, కాదు కూడదని కట్టడ చేసిన నిత్తు వేదియేన్, కోరిక తీరి యాశను రగుల్చునెకాని మనఃప్రశాంతికిన్ కారణమౌట కల్లయని కల్గొనిరెప్పుడో పూర్వు లచ్యుతా! మానవుడి నిజమైన పశ్చాత్తాపం, వాస్తవ స్థితి తన తప్పుని ఒప్పుకునే పరిస్థితి తన జీవిత చరమాంకంలో కలుగుతుంది. అది కొంత మందిలో లేకపోతే తన జీవిత చరమాంకంలోనైనా కనిపిస్తుంది అది ఆ జీవుడికి భగవంతుడుకి మాత్రమే తెలుస్తుంది. అందువల్ల ఈ పద్యాలు నిజంగా ఆణిముత్యాలని స్పష్టంగా చెప్పవచ్చు.

### 4.1.4 ఆదివైద్యుడు:

'ఆదివైద్యుడు' అనే ఖండిక నేపథ్యాన్ని గురించి పింగళి వేంకటకృష్ణారావుగారు ఈ విధంగా చెప్తూ *“పింగళి లక్ష్మీకాంతంగారి మిత్రులు శ్రీ గూడూరు నమశ్శివాయ గారి చిన్నాన్న వడ్లమన్నాడు అనే ఊరిలో మృత్యుంజయ ఔషదా లయం స్థాపించారని ఆ ప్రారంభోత్సవానికి పింగళి లక్ష్మీకాంతం వెళ్ళారని”* అని (పింగళి లక్ష్మీకాంతంగారి, కావ్యసమాలోచనము, 2013:310) పేర్కొన్నారు. ఆ సందర్భంగా ఆది వైద్యుడు పేరుతో ఏడు పద్యాలు రచించారు. ఆ ఏడు తేటగీతి పద్యాలు భారతీయ వైద్యజ్ఞానాన్ని తెలియజేస్తాయి. ఇవన్నీ భారత, భాగవత

పురాణాలలో వర్ణించడాన్ని గమనించవచ్చు. క్షీర సాగర మధనం సందర్భంగా అమృతం పుట్టిందని చెప్తారు. ఆ అమృత మధనంలోనే ధన్వంతరి కూడా వస్తారు. అతడు దివ్యుడు అతని గురించి వర్ణిస్తూ

*"అదితి బిడ్డలు పడిన యాయాసభరము*
*పండి మూర్తీభవించిన పగిది నమృత*
*హస్తుడై క్షీరసాగరాభ్యంతరమున*
*నుద్భవించిన యాదివైద్యునకు జయము"* (ఆత్మలహరి:50) అని ఈ పద్యంలో

ధన్వంతరిని స్తుతించారు కవి *దీన్ని మొట్టమొదట విశ్లేషించిన ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు ఏడు పద్యాలలో ఉన్న ధన్వంతరీ వార్షితి ఔషదాల్ని కనుగొన్న మహర్షిని దేహ నిర్మాణ రహస్యాల్ని సుశ్రుతుడు ఆ తరువాత చరకుడు, వాక్భటుడు మొదలైన వారి క్రమాన్ని అంతా ఈ పద్యాల్లో వర్ణించారని తంగిరాలవారు చక్కగా విశ్లేషించారు"* అని (ఆత్మలహరి ఖండకావ్య సంపుటి ఒక-అనుశీలన, ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు, రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక,1994:92) తెలిపారు.

*"జలమయమ్ముగ నున్న విశ్వమ్ము స్థల వి*
*కార పరిణామ మొందిన క్షణములోన*
*ఇంతలింతలుగా బుట్టి మృత్యుహరణ*
*శక్తి గర్భితమైన యోషధి నుతింతు!"* (ఆత్మలహరి:50) అని ఈ పద్యంలో

జలమయమైన విశ్వాన్ని దాని ఆవిర్భావాన్ని దానిపై మొలిచిన మొక్కలు, వృక్షాలు, జంతువులు ఇతర ప్రాణ కోటినన్నింటిని సమయోచితంగా కవి వర్ణించారు.

*" ప్రాణిహితమె ఫలమ్ముగా బహుళ దివ్య*
*వత్సరంబులు దీక్షాతపమ్ము సేసి*
*ఓషధీశక్తి కనుగొన్న యోగమూర్తు*
*లలమహర్షుల కిదియె యంజలి ఘటింతు "*

**" కమలగర్భుని సత్యసంకల్పవశత**
**బ్రాణికోటుల దేహనిర్మాణ మగును**
**అతడె యెరుగడు దాని రహస్యవృత్తి**
**చోద్య మెటు గ్రహియించెనో సుశ్రుతుండు!"** (ఆత్మలహరి:50) అని ఈ పద్యాల్లో

ఆయుర్వేద శాస్త్ర అభివృద్ధిని వాటిని కనుగొన్న మహర్షిల్ని కవి ఇలా వర్ణించారు. 345 దేవతల నుంచి మనుషులకు వివిధ మార్గాల ద్వారా తెలిసిన వైద్య రహస్యాలు అన్ని ఖండాలలోను వ్యాపించాయి అని చెబుతూ గొప్ప పద్యాన్ని చెబుతారు.

*" మనుజవై ద్యులకా మహామహుడె*

*భిక్ష పెట్టిన గురుడు తద్విద్య నేడు*

*వివిధ ఖండాంతరమ్ముల వెలుగుచుండె*

*చండభానుని కరసహస్రముల వోలె "* (ఆత్మలహరి:51) అని ఇక్కడ వివిధ ఖండాలకు ఆ వైద్య రహస్యాలు కాంతివంతంగా మొగుతున్న సూర్యని సహస్ర కిరణాలు అన్ని ఖండాలపై పడుతున్నట్లుగా వైద్య రహస్యాలు ఖండాలన్నింటికి వ్యాపించాయని ఉపమా అలంకారంలో అభివర్ణించిన పింగళి లక్ష్మీకాంతంగారి భావుకత భారతీయ ఆత్మను ఈ ప్రపంచానికి చాటే విధంగా ఉంది.

*" చరక వాగ్భట సుశ్రుతాచార్య బుద్ధి*

*జనిత విజ్ఞాన తేజ మస్తంగతమ్ము*

*గాక వెలుగొందునట్లు రక్షణమొనర్చు*

*భరము వహియించు నీ సభాపతి నుతింతు"* (ఆత్మలహరి:51) అని ఈ పద్యంలో చరకుడు, వాక్భటుడు, సుశ్రుతాచార్యులు ఈ ముగ్గురు పాశ్చాత్య భారతీయ వైద్య రంగాన్ని సుసంపన్నం చేసినవారు. వారిని ఈ పద్యంలో కవి వర్ణించారు. దీని గురించి పింగళి వేంకటకృష్ణారావుగారు చెప్తూ *"చరకుడు క్రీ. పూ. వర్ధిల్లిన బౌద్ధమతానికి సంబంధించిన వైద్య శాస్త్ర పండితుడు. ఈయన చరక సంహిత అనే ఆయుర్వేద వైద్య గ్రంథాన్ని రచించాడు. సుశ్రుతుడు గుప్తుల కాలం వాడు. ఈయన శస్త్రచికిత్సలో ప్రతిభావంతుడు. ఈయన రచన సుశ్రుత సంహిత. వాగ్భటుడు కూడా గుప్తుల కాలం వాడే. ఈయన రచించిన అష్టాంగ సంగ్రహం అనే ప్రసిద్ధమైన వైద్య శాస్త్ర గ్రంథం. వీరిని పింగళి లక్ష్మీకాంతంగారు తన రచనల్లో ప్రస్తావించారని"* అని పింగళి వేంకటకృష్ణారావుగారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము, 2013:332) పేర్కొన్నారు.

*" నీతిమంతులు దీనిధుల్ స్నిగ్ధహృదయు*

*లిచటి పండితవరులు వేరిడిన ఔష*

*ధాలయము సాగి 'మృత్యుంజయమ్ము' గాత*

*అమృతహస్తుడు గాత 'వియ్యన్న' సఖుడు "* (ఆత్మలహరి:51) అని సరిగ్గా ఇలాంటి వైద్య రహస్యాలు కలిగిన వారి పేరుతో గూడూరి వియన్నగారు శ్రీ మృత్యుంజయ ఔషదాలయాన్ని 'వడ్లమన్నాడు' లో ప్రారంభించి అనారోగ్యాన్ని మాపడానికి తన వంతు కృషి చేస్తున్న నీతిమంతుడైన వారు వియన్న అని కవి వర్ణించారు.

**4.1.5 ప్రణయ లేఖలు:**

ఈ ప్రణయ లేఖలు ఖండిక గురించి గొల్లపూడి ప్రకాష్ రావు ఈ విధంగా అంటారు *" పింగళివారి నిండు యౌవనంలో వ్రాసిన మధుర ఖండిక ప్రణయ లేఖలు. ఆంధ్రదేశమంతా భావ*

*కవితా పవనాలు వ్యాపించిన సమయంలో పింగళి వారు పాడిన ప్రణయ గీతాలు ఈ ప్రణయ లేఖలు. విరహ వేదననునుభవిస్తున్న నాయిక నాయకుని సంబోధిస్తూ వ్రాసిన ప్రణయ లేఖలివి"* అని (భారతీయ సాహిత్య నిర్మాతలు, పింగళి-కాటూరి,1999:53) అన్నారు. దీన్ని గట్టి ఈ ప్రణయ లేఖల విశిష్టతల్ని, నేపథ్యాల్ని తెలిపారు. 'ప్రణయ లేఖలు' ఆరు శీర్షికల్లో పింగళి లక్ష్మీకాంతంగారు 1923 సంవత్సరం ఆగష్టు నుంచి నవంబర్ మధ్యకాలంలో వీటిని రచించారు. ఇవి 1923 కృష్ణా పత్రికలో ప్రచురితమయ్యాయి. వీటి గురించి మలయవాసినిగారు ఇలా అన్నారు. *"ప్రియుని తలంపులో తలమునకులవుతున్న తరుణికి తన మనోభావాలను సకునకు వివరించడం ఈ ప్రణయ లేఖల భావాలలోని ప్రధాన అంశం. అయితే పురుషుడు తనను స్త్రీగా భావించుకొని ఆ పరమేశ్వరునిలో గల ప్రణయభావాన్ని వివరించడంలో అది కేవలం సంభోగ శృంగారమో, లేక విప్రలంభ మాత్రమే కాక ప్రణయ భావపరిపూరిత మనస్కతను కాక పరమాత్మను వ్యక్తం చేయడం ప్రధానంగా పెట్టుకోవడం ఇక్కడ కనిపించే విశేషం. ఇవి మధుర తత్త్వ భక్తి మార్గంలో పింగళి లక్ష్మీకాంతంగారు రచించారు"* అని ('ప్రణయ లేఖలు భావసరళి', అనే వ్యాసం, రసజ్ఞ శిల్పి,1994:70-73) తెలిపారు. దీన్ని బట్టి ప్రణయ లేఖల భావాలలో పింగళి లక్ష్మీకాంతంగారు తన జీవితంలో ప్రణయబంధాల్ని అనుసరించిన విధానాన్ని చెప్పారు.

కాబట్టి ఇవి లౌకిక శృంగారానికి సంబంధించినవి కావు. ప్రణయ లేఖల పేరుతో రాసిన ఈ 21 పద్యాలలో పింగళి లక్ష్మీకాంతంగారి భక్తికి కారణాలను కోలవెన్ను మలయవాసినిగారు ఇలా చక్కగా విశ్లేషించారు *"మన లీలోద్యానంలో నీవు పాతిన మల్లీవల్లి చక్కగా పూసింది. మరి ఆ పూలను కోసి నీ పాదపూజ చేయాలని ఉంది. ఆలస్యం చేయకు త్వరగా రా ఆలస్యం చేస్తే 'రెక్కలతో వీడి పూవుల్ భువిన్ రాలున్, నిల్చిన గండు తుమ్మెదలు సౌరభ్యంబు వోగ్గోలెడిన్' అంటుంది. ఈ భావాలు వేంకట పార్వతీశ్వర కవులు ఏకాంత సేవలోని భావాలకు చేరువగా ఉన్నాయి. ఇవి మొదటి లేఖలోని విశేషాలు. రెండవ లేఖలో బాలభానుని కిరణాల కాంతులు నీ హస్తకాంతులనుకున్నాను. కాని అందుకోలేక పోయాను. పారిజాత మకరందం నువ్వు వచ్చే వరకు చిగురుదొన్నెలలో కూడబెట్టి నీకు అర్పించాలని ఉంది. కానీ ఆ కోరిక తీరేదెలా అంటుంది"* అని (ప్రణయ లేఖలు భావసరళి', అనే వ్యాసం, 'రసజ్ఞ శిల్పి' ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక,1994:73,74) పింగళివారి ప్రణయతత్త్వాన్నీ తెలిపారు.

***" లీలోద్యానమునందు నీవిడిన మల్లీవల్లి పుష్పించె, నా***
***పూలన్ మెల్లగ ద్రుంచి పదములన్ బూజింపగా గోరుదున్***
***గాలాతిక్రమణం బొనర్పకుము, రెక్కల్ వీడి పూవుల్ భువిన్***
***రాలున్, నిల్చిన గండు దుమ్మెదలు సౌరభ్యంబు వోగ్గోలెడిన్ "*** (ఆత్మలహరి:52) అని

ఇది ఒక ప్రత్యేకమైన పద్యం. దీని గురించి పింగళి వేంకటకృష్ణారావుగారు చెప్తూ *“లీలోద్యానం మనస్సుకు నాటబడ్డ మల్లి తీగ జన్మతహా సంక్రమించిన సంస్కారానికి మల్లెపూలు కవిత్వానికి తుమ్మెదలు లౌకిక విషయాలకు ప్రతీకలని”* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:289) తెలిపారు. దీన్ని బట్టి పింగళివారి వ్యక్తిగత స్వభావాన్ని అర్థం చేసుకోవచ్చని తెలిపారు.

రెండవ లేఖ గురించి ఆచార్య కోలవేన్ను మలయవాసినిగారు చెప్తూ *“ప్రణయ లేఖలు మర్మకవితా మధురిమలని స్పష్టమౌతోందని”* అని (రసజ్ఞశిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక,1994:74.77) వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యానం అక్షరసత్యంగా కనిపిస్తుందని పలువురు విమర్శకులు భావిస్తున్నారు.

ప్రణయ లేఖలు 1923 సంవత్సరంలో వెలువడ్డాయని చెప్పుకున్నాం. ఆ కాలంలో భావకవులు ఊహా ప్రేయసిల గురించి ప్రకృతి తాదాత్మ్యం గురించి విస్తృతంగా రాసేవారిని సాహిత్య చరిత్రలు తెలియజేస్తున్నాయి. శ్రీశ్రీ కూడా భావ కవిత్వ ప్రభావం నుంచి తప్పించుకోలేక పోయాడు శ్రీశ్రీ ప్రభవ అనే కవితా సంపుటి భావకవిత్వాన్ని సాక్ష్యంగా చూపిస్తుంది. కానీ ఆ కాలంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి భావకవిత్వం గురించి విస్తృతంగా రాస్తున్నాన్నప్పటికీ ఆయన రాసిన కృష్ణపక్షంలో ‘అన్వేషణ’ అనే ఖండిక కృష్ణతత్త్వాన్ని దానిలో వర్ణించారు. అలాగే భావకవులలో మధురభక్తి పరిపూర్ణతమైన కవిత్వాన్ని ఈ ప్రణయలేఖల పద్యాలలో పింగళి లక్ష్మీకాంతంగారు వర్ణించిన విధానం గమనించదగినవి. పింగళి లక్ష్మీ కాంతంగారిలో మొదటి నుంచి దైవభక్తి మెండుగా కనిపిస్తుంది. అందుకే భగవంతుని సంబోధిస్తూ ఆధ్యాత్మికంగా వర్ణించారు కవి. అందుకనే కోలవెన్ను మలయవాసినిగారి మాటలు ఈ సందర్భంగా గుర్తించదగినవి. పింగళి లక్ష్మీ కాంతంగారి కుమారుడు పింగళి సూర్య సుందరం సి.పి బ్రౌన్ అకాడమివారు ప్రచురించిన పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర పుస్తకంలో పేర్కొన్నారు. ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారి మాటల్లో *“అభ్యంచిత మాధురీ మహితమైన ఈ ప్రణయ లేఖలు పింగళి లక్ష్మీకాంతంగారి మానసాభ్యాంతరం నుండి జాలువారిన రసవాహినులు”* అని (‘ప్రణయ లేఖలు భావసరళి’, అనే వ్యాసం, రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక,1994:78) వ్యాఖ్యానించారు.

దీన్ని బట్టి ఊహ ప్రేయసితో కవులు ప్రేమ ఊసులాడుకుంటున్న కాలంలో తనను ప్రేయసిగా పరమాత్మను ప్రియునిగా భావించుకుని ప్రణయ మోహనను అందించిన కవులలో పింగళి లక్ష్మీకాంతంగారు కూడా ఒకరని మలయవాసినిగారు వ్యాఖ్యానించడం ఎంతో సమంజసంగా ఉంది.

#### 4.1.6 తిక్కనామాత్య:

పింగళి లక్ష్మీకాంతంగారు తిక్కనామాత్య పేరుతో నాలుగు పద్యాలలో తిక్కన కవిని వర్ణించారు. ఇందులో రెండు సీస పద్యాలు, ఒక ఉత్పలమాల, ఒక తేటగీతి పద్యాల్లో వర్ణించారు. గూడూరి నమశ్శివాయగారు తన డైరీలో తిక్కనను వర్ణిస్తూ పింగళి లక్ష్మీకాంతంగారు ఒక పద్యాన్ని రాసుకున్నారనీ ప్రచురణ కర్తలు ఆత్మ లహరి ఖండ కావ్య సంపుటిలో దాన్ని చేర్చలేదనే నిజాన్ని ఆ పద్యాన్ని కూడా పింగళి వేంకట కృష్ణారావుగారు తన గ్రంథంలో తెలిపారు.

*“ హరి మూర్తిన్ హరు జూతును*

*హరు మూర్తిన్ హరిని జూతు ఆ తేజంబే*

*హరిహరనాథంబలో*

*నరసిన కవిలోక గురుని నారాధింతున్ ”* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనలు,2013:316) పేర్కొన్నారు. దీన్ని బట్టి ఈ పద్యంలో విష్ణువులో శివుణ్ణి, శివునిలో విష్ణువుని దర్శించిన అద్వైత సిద్ధాంతం ఈ పద్యంలో కనిపిస్తుంది. ఈ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన తొలి తెలుగు కవి తిక్కన. అందుకనే తిక్కన తన భారతాంధ్రీకరణను హరిహరనాథునికి అంకితం ఇచ్చారు. కాబట్టి తిక్కనలో మత సామరస్యం ఎంతో గొప్పది. అందుచేత ఈ పద్యాన్ని విస్మరించలేమని పింగళి వేంకట కృష్ణారావుగారు అన్నారు.

*“అన్నమాంబా కొమ్మనామాత్య పుణ్యదాం*

*పత్యవల్లీ రసవత్ఫలమ్ము*

*మనుమసిద్ధి మహీవిభుని రాజ్యసంప*

*త్పరంపరానిధికి శ్రీరామరక్ష*

*వ్యాస వాల్మీకి సంయమికవీశ్వరశిల్ప*

*చాతురిందిద్దు నాచార్యశిల్పి*

*వేదమంత్రమ్ము తద్వేదాంతసూత్రమ్ము*

*నొక పోగునకు గ్రుచ్చు యోగివరుడు*

*శివుని కేశవుడంచు కేశవుని శివుడ*

*టంచు బేర్కొని మాట చెల్లించుకొన్న*

*సత్యసంకల్పు డెవరయా సాటి తిక్క*

*శౌరికిన్ యాదవుండగు శౌరిగాక”* (ఆత్మలహరి:57) అని తిక్కన సమకాలీన సమాజంలో మతవైషమ్యాలను పోగొట్టడంలో హరిహరనాథ అద్వైతం ప్రతిఫలించే విధంగా ఆంధ్ర మహాభారతాన్ని వర్ణించారు.

ఈ పద్యం చివరిలో ఈ విషయాన్ని పింగళి లక్ష్మీకాంతంగారు చక్కగా వర్ణించారు. బహుశా ఈ పద్యం ఉండటం వలనే ఇంతకముందు ఉదహరించినా *'హరి మూర్తిన్'* అనే పద్యాన్ని ప్రచురణ కర్తలు ప్రచురించ లేదని అనిపిస్తుంది. కానీ ఆ పద్యం కూడా పింగళి లక్ష్మీకాంతంగారి ప్రతిభను తెలిపేది. ఈ పద్యంలో తిక్కన జీవితాన్ని,ఆయన మనుమసిద్ధి ఆస్థానంలో చేసిన రాయబారాన్ని, భారత, రామాయణల్ని రాసే వ్యాస, వాల్మీకిల శిల్ప చాతుర్యాన్ని అందిపుచ్చుకున్న వాడిగా వేదాల సారాంశాన్ని మహాభారతంలో రాసిన వాడిగా తిక్కన గొప్పతనాన్ని పింగళివారు వర్ణించారు. ఈ పద్యంలో ఒక శిల్ప రచనా చమత్కారం ఉంది. అటువంటి తిక్కన మహాభారతంలోని శ్రీకృష్ణుడంతటి గొప్పవాడు అని అభివర్ణించారు కవి. దీన్ని పింగళి వేంకటకృష్ణారావుగారు ఇలా వివరించారు. *"తిక్కన శౌరి అన్నది చమత్కార పద్యం. దీన్ని బట్టి ఒక వైపు తిక్కనను మరొకవైపు మహాభారతాన్ని, మహా భారతంలోని ముఖ్యమైన పాత్రలో శ్రీ కృష్ణుడ్ని మరొక పార్శ్వంలో తన తాతగారైన మంత్రి భాస్కరుని స్ఫురించేలా వర్ణించడం 'తిక్కన శౌరి' అనే పద్యంలో ఉన్న చమత్కారం. అందుకనే పింగళి లక్ష్మీకాంతంగారి పద్యాల్ని అర్థం చేసుకోవాలంటే భావుకతతో పాటు పూర్వ కావ్యాల పరిజ్ఞానం ఎంతో అవసరమని తెలుస్తోంది"* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము,2013:318,319) అన్నారు. పింగళివారు రాసిన తిక్కన ఖండిక లోని విశేషాంశాలను వ్యాఖ్యానించారు.

*"మహనీయుడైనా కొమ్మన మంత్రి యర్చించు*
*త్రేతాగ్నులెంతగా తేజరిలెనొ*
*స్వర్లోకమున రాజచాళుక్య చెవిదండ*
*ఆ యాదికవి యే రహస్య మనెనొ*
*చిరకాలమున్ తపఃస్థితుడైన యే తెల్గు*
*ముని కన్నుదమ్ముల మూతవిడెనొ*

*దక్షిణాపథమెల్ల తాండవంబాడు అ*
*ధర్మ రాక్షసి యెంత తల్లడిలెనొ*
*ఆలకించి సమర్థులైనట్టి వార*
*లాలికించిరొ కర్ణరసాయనముగ*
*కిన్నరీసుప్రయుక్త సంగీతకముల*
***ఉభయకవిమిత్రు జన్మ ముహూర్తమందు"*** (ఆత్మలహరి:57) అని తిక్కన జన్మ ఒక కార్యకారణ సంబంధమైనదని అభివర్ణిస్తారు కవి. అంతేకాకుండా యజ్ఞయాగాదులు చేసే ఋత్విజుల వంశంలో తిక్కన జన్మించాడు. అందుకనే 'త్రేతాజ్ఞలు' అనే పదాన్ని ప్రయోగించారు

కవి. దీనితో పాటు ఈ పద్యంలో నన్నయ రెండున్నర పర్వాలను అనువదించిన ఆంధ్ర మహాభారతం అదే క్రమంలో తిక్కన కలం నుంచి కూడా వెలువడింది. అంతేకాదు స్వర్గంలోని రాజరాజనరేంద్రుడి చెవిలో నన్నయగారు ఒక మాట చెప్పారంటా మన మహాభారతాన్ని తెలుగులో రాయడానికి తిక్కన అవతరించబోతున్నాడు కాబట్టి మీరు తలపెట్టిన మహాభారతం పూర్తి అవుతుందని ఒక చమత్కారంగా వర్ణించారు కవి. తిక్కన రచన కర్ణ పేయంగా ఉంటుందని ప్రశంసించారు. దీన్ని సీస పద్యానికి వేసిన తేటగీతి పద్యంలో కిన్నెరలు ఆయన జన్మ స్వాగతించాయని చమత్కరించడం గమనార్హం. ఈ విధంగా తిక్కన గొప్పతనాన్ని ఆయన ఆంధ్ర మహా భారత రచనా రీతిని కొన్ని పద్యాలోనే అభివర్ణించారు. కొండను అద్దంలో చూపించినట్లు ఉన్నాయి ఈ పద్యాలు.

**4.1.7 తిలక్ నిర్యాణం:**

పింగళి లక్ష్మీకాంతంగారు కొన్ని స్మృతి గీతాలను రచించారు. వాటిలో తిలక్ నిర్యాణం ఒకటి. ఇది 1926 సంవత్సరం ఆగష్టు నెలలో రచించారు. ఈ ఖండికలో ఎనిమిది పద్యాలున్నాయి. తిలక్ అంటే మన తెలుగులో బాలగంగాధర్ తిలక్ అనే పేరుతో ప్రసిద్ధి చెందారు. ఇంకొకరు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు బాలగంగాధర్ తిలక్. ఈయనకు లోకమాన్య బిరుదులున్నాయి. రెండోవాడు బాలగంగాధర్ తిలక్ ఈయన అమృత కురిసిన రాత్రి అనే కవితా సంపుటి రాసిన కవి. పింగళి లక్ష్మీకాంతంగారు రాసింది దేశభక్తుడైన స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ గురించి ఈ పద్యాల్లో వర్ణించారు.

*"పశ్చిమాశాంగనా పాలకుంకుమరేఖ*
*కాటుక కన్నీట గలసి పార*
*చేతనాహీనమై చెలువెల్ల గోల్పోయి*
*ప్రకృతి సర్వము జడత్వము వహింప*
*మెఱక పల్లములను దొరలెడి స్వాతంత్ర్య*
*రథమునకొక్క చక్రమ్ము క్రుంగ*
*భారతీయుల దాస్యబంధనాహుతి గ్రోలు*
*సవనాగ్రికీలలు చల్లవాఱ*

*అస్తమించెను గీతారహస్యవేది*
*కారణభవుండు జగదేక కర్మయోగి*
*బాలగంగాధరుడు లోకబాంధవుడు*

*శివశివా యెట్టి దుర్వార్త చెవుల సోకె "* (ఆత్మలహరి:59) అని అంటూ 1856 జులై 23 తేదీన మహారాష్ట్రలో జన్మించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో విరివిరిగా పాల్గొన్నారు. ఈయనతో పాటు లాలాలజపతి రాయ్, బిపిన్ చంద్రపాల్ ముగ్గురు అతివాద నాయకులు. వీళ్ళని లాల్, బాల్, పాల్ త్రయంగా అనేవారు. ఆయన నడుపుతున్న మరాఠీ కేసరి పత్రికలో దేశభక్తికి సంబంధించిన భావాలు పెంపొందించేలా సంపాదకీయాలు రాసేవారు.

1908 లో ఆంగ్ల ప్రభుత్వం *'ఖుదీరాంబోజ్'* ని ఉరి తీసినప్పుడు ఒక దేశభక్తిని ఉరి తీస్తే లక్షల మంది దేశభక్తులు పుట్టుకొస్తారని హెచ్చరించారు. దాని ఫలితంగా ఆంగ్ల ప్రభుత్వం రాజద్రోహనేరం ఆరోపించి తిలక్ ని ఆరు సంవత్సరాలు పాటు 1908 నుంచి 1914 వరకు మాండవి జైల్లో బంధించారు. అప్పుడే ఆయన మరాఠీ భాషలో భగవద్గీతకు గీతారహస్యం అనే పేరుతో వ్యాఖ్యానం రాశారు. దీన్ని పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొంటూ 'తిలక్' ని *'గీతారహస్యనిధి'* అని అభివర్ణించారు.

*" అడిగిడరాని చీకటులయందు మునింగిన మాకు దారి జూ*
*పెడి నవరత్న దీపమయి పెంకెతనమ్ము నిరంకుశత్వమున్*
*దునిచెడి శస్త్రరాజమయి దుర్మతులన్ వణికించు కేసరిన్*
*నడపెడు కర్మ వీరుడగు నావికుడేగె దివమ్ము దేనికో "* (ఆత్మలహరి:60) అని ఈ పద్యంలో అడుగుతీసి అడుగు వేయడానికి స్వేచ్ఛలేని చీకటి పాలనలో ఆ ప్రజలందరికి దీపంగా దారి చూపించిన నావికుడిగా తిలక్ ని పింగళి లక్ష్మీకాంతంగారు అభివర్ణించారు. అంతేకాదు నిరంకుశత్వంతో పరిపాలిస్తున్న ఆంగ్లేయులను వణికించే కేసరి అని పత్రికను నడిపినవాడు తిలక్ అని అటువంటి తిలక్ స్వర్గలోకానికి ఎందుకు వెళ్ళిపోయాడో అని పింగళివారు బాధపడతాడు.

*"తన రాష్ట్రపున్ యశోఘనత నిల్పిన వీర*
*సింహమంచును శివాజీ ప్రభుండు*
*తన వంశపుంబవిత్రతను గాపాడిన*
*కులదీపకుండని నలినభవుడు*
*తనపేరు దాల్చి రుద్రతకు సత్యము నూత*
*గా జేసితంచు గంగాధరుండు*
*తనదు గీతాంతర్గతంబైన పరమార్థ*
*మెఱిగితి వంచు శ్రీ కృష్ణయోగి*
*కూడుకొని వచ్చి నీ కెదుర్కోలు నెఱపి*
*సేమపుం బ్రశ్న లడుగుచు జెవుల పండు*
*వౌ నటుల విందు నీ యుపన్యాసములను*

*ఇచట నీ వెల్తి సవరింప నెవ్వడోపు "* (ఆత్మలహరి:61) అని ఈ పద్యంలో తిలక్ జన్మస్థలమైన మహారాష్ట్రలో శివాజిని హిందువుల్ని కాపాడిన గొప్ప వంశదీపకుడని అటువంటి శౌర్యాన్ని మరలా తిలక్ ప్రదర్శించాడని పింగళివారి భావన. తన అతివాద ధోరణితో ఉద్యమాలు చేయడానికి సత్యమే వ్రతమే నిలిచిందని శివుడు వృద్ధుడైనా గంగను తలపుపై పెట్టుకోవడం వలన అతనిలో రుద్రత కంటే ప్రసన్నతే అధికంగా కనిపిస్తుందని పోల్చి చెప్పాడు కవి. ఇక్కడ తిలక్ అతివాదిగా భారత జాతీయోద్యమంలో పేరును పొందిన అతడు ప్రజలందరికి సత్యం కోసం పోరాడుతున్న ధర్మ వీరుడిగానే కనిపించాడని చెప్పడం ఎంతో ఔచిత్యవంతంగా పోలిక చేశారు కవి. ఈ పద్యంలో తిలక్ లోని వీరత్వాన్ని, బ్రహ్మ తత్త్వాన్ని, సత్యాన్ని ఈ మూడింటిని నింపుకున్న రుద్రతత్త్వం, గీతా యోగతత్త్వాన్ని పెట్టిన గొప్ప పద్యం. ఈ విధంగా పింగళి లక్ష్మీకాంతంగారు ఏ విషయాన్ని వర్ణించినా భక్తి తత్త్వాన్ని లేదా సాత్త్విక గుణాన్ని, లేదా చమత్కార ప్రయోగాల్ని చేయడం పింగళివారు రచించిన పద్య రచనా విశిష్టతకు నిదర్శనమని చెప్పవచ్చు.

### 4.1.8 శివబ్రహ్మైక్యం:

ఇది 1916లో శ్రీకాశీనాధుని బ్రహ్మలింగంగారి నిర్యాణం సందర్భంగా రాసిన ఖండిక. దీనిలో ఎనిమిది పద్యాలున్నాయి. ఈ పద్యాల గురించి పింగళి లక్ష్మీకాంతంగారి కుమారుడు పింగళి సూర్యసుందరం రాస్తూ *"పింగళి లక్ష్మీకాంతంగారు అప్పుడు విద్యార్థి. కాశీనాథుని బ్రహ్మయ్య లింగయ్యగారు చనిపోయినప్పుడు ఒక సభ జరిగింది. ఆ సభలో వీటిలో కొన్ని పద్యాల్ని చదివారు. ఆ పద్యాలు డా. అహోబలరావుగారికి నచ్చాయి. ఆ పద్యాలు చదివి బాగా రాశాననీ మెచ్చుకొని అతని కుటుంబ పరిస్థితిని విని యాభై రూపాయలు ఇవ్వబోయారు. కానీ స్వాభిమానంతో ఆ డబ్బులను తీసుకోలేదు"* అని (పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,2010:43) అన్నారు. దీన్ని బట్టి ఈ ఖండిక రచన వెలువడిన నేపథ్యాన్ని సోదాహరణంగా పేర్కొన్నారు.

*"కైలాసమ్మున ద్వారముల్ దెఱచి యింకన్ రాడు రాడేమి యం*
*చాలోకింపుచు శంకరుండు గిరికన్యన్ గూడి యోజింప ద*
*త్ప్రాలేయాచల మధ్యభాగమున గన్పట్టెన్ విమానంబు, పూ*
*ర్ణాలంకార విరాజమానము సహస్రాంశు ప్రభావంతమున్"* (ఆత్మలహరి:62)అని

ఈ పద్యంతో ఈ ఖండిక ప్రారంభమౌతుంది. బ్రహ్మలింగంగారు వీర శైవులు. ఆయన నిర్యాణం పొందగానే కైలాస ద్వారాలు తెరుచుకొని ఎదురు చూస్తున్నట్లుగా ఈ పద్యంలో వర్ణించారు కవి. ఆ విధంగా ఎదురు చూడటానికి కారణం ఏమిటో పింగళి వేంకటకృష్ణారావు ఇలా చెప్పారు.

*"వీరశైవంలో పరమేశ్వరుడు లేక పరమశివుడు ఆది అనాది నిర్గుణుడు నిరంజనుడు. శివుడు కైలాస వాసి. ఎవరైనా భక్తునికి కైలాస ప్రాప్తించడమంటే సాలోక్యం విభజించినట్లుని అర్థం. శివలోకంలో అనగా కైలాసంలో ప్రమథ గణాలలో ఒకడుగా ఆ భక్తుడు చేరతాడు. కైలాసం అనగా పరమేశ్వరునిలో ఐక్యం చెందటం. వారికి కైలాసంలో కైవల్యం లేదు. కైలాసంలో బ్రహ్మయ్య లింగయ్య గారు కైవల్యం పొందటం, వీరశైవానికి విరుద్ధం. అందువలన వీర శైవ నాగమాలు ఆక్రోశించాయన్నది తాత్పర్యం. లక్ష్మీకాంతంగారు వీరశైవాన్ని వైదికశైవంగా చిత్రించారిక్కడ"* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:325) తెలిపారు. దీన్ని బట్టి పింగళివారికి వైష్ణవ, శైవ మతాల పట్ల ఏ విధమైన

భేద భావాల్ని ప్రదర్శించకుండా అన్ని మతాలను సమ భావంతో చూస్తూ జాతి సమైక్యతకు కృషి చేసినట్లు ఈ ఖండిక వలన తెలుస్తోందని చెప్పవచ్చు.

***" మతిమంతుండు విశుద్ధవర్తనుడు, బ్రహ్మజ్ఞానసంపన్నుడౌ***
***శతవృద్ధుండు మదైక్యమున్ గనుటకై సంతోషముల్ మాని, డీ***
***నత శోకించుట పాడిగాదు, పరమామ్నాయమ్ము లెద్దాని శా***
***శ్వత మంచున్ వచియించు నా పదవి సంప్రాప్తించె మీ బ్రహ్మకున్ "***

***"శాంత శాసించు శవు సమాశ్వాస మృదుల***
***గీతికలు మౌళి నలరు గంగా తరంగి***
***ణీనినాద శ్రుతులతోడ లీనమగుచు***
***బ్రకృతియం దంతటను శాంతరసము గురిసె"*** (ఆత్మలహరి:63) అని

బ్రహ్మయ్యగారు ఎటువంటివారో రెండు పద్యాల్లో దృశ్యావిష్కరణ చేశారు పింగళివారు. ఆయన నీతిమంతుడు పవిత్రమైన మనస్సుతో ఋజువర్తన కలిగినవాడు. బ్రహ్మయ్యగారు జ్ఞాన సంపన్నులు అందుకనే బ్రహ్మయ్యలింగంగారు మరణించినందుకు కుటుంబం, సమాజం బాధపడవచ్చునో కానీ శాశ్వతమైన ఆనంద లోకం శైవులకు ఆనందంలోకం కైలాసం. ఆ కైలాసానికి చేరుకున్నందుకు శివుడు, పార్వతి అక్కడ ఉన్నటువంటి ప్రమథ గణం సంతోషపడుతున్నారని కనుక మానవులు బాధపడటం, దుఃఖించడం తగదని గొప్ప ఉపశమనంతో ఈ పద్యాలు చెప్పడం పింగళి లక్ష్మీకాంతంగారి లోని పరిణిత దృష్టికి నిదర్శనంగా కనిపిస్తుంది.

### 4.1.9 గురు కీర్తనం:

పింగళి లక్ష్మీకాంతంగారు తన గురువు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు. ఆయన 1870 ఆగష్టు 7 తేదీన జన్మించారు. ఈయనకు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారంటే ఎనలేని అభిమానం. ఇంతకు ముందు అధ్యాయాలలో కూడా పింగళివారి గురుభక్తి శుశ్రూషల గురించి వివరించాను.

పింగళివారిని తన గురు భక్తిని గురించి పింగళి సూర్య సుందరంగారు ఇలా చెప్తూ *"తనకి లభించిన కీర్తి కేవలం గురు కృప వల్ల, గౌతమ గోత్రజుడైన సూరన తపోబలం వల్ల మాత్రమేననీ, తనకి వేరే అర్హత ఏమీ లేదని ఆయనకు"* అని(*'పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర'* 2010:129) *చెప్పుకున్నారని ఆయన కుమారుడు సూర్యసుందరం వ్యాఖ్యానించారు.*

ఈ విషయాన్ని మల్లంపల్లి శరబయ్యగారు ఈ విధంగా చెప్తూ *"పింగళి లక్ష్మీకాంతంగారికి గురుభక్తి అసామాన్యం "నాకు గురువు, దైవము స్నేహితుడు ఒక్కరే" అన్నారట ఒక సారి. నేను కవిని కాను. పండితుణ్ణి కాను. నాకున్న ధనం గురుకటాక్షమొక్కటే. అది నాకు ఏ సమయానికి ఏది స్ఫురించాలో దాన్ని స్ఫురించేటట్లు చేస్తుంది. అది నాకు కనకధారా వర్షం కురిపిస్తుంది. నా అభ్యుదయానికంతటికి అదే మూలం"* అని ('గుణరమ్యులు వేంకటేశ్వరరావు' అనే వ్యాసం, ఆచార్యపింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974:75) తెలియజేశారు. దీన్ని బట్టి పింగళివారికి గురువు పట్ల ఉన్న గౌరవం, గురుభక్తి అచంచలమైనదని మల్లంపల్లి శరబయ్యగారి మాటలను బట్టి స్పష్టమౌతోంది.

***" ఆంధ్ర కవిత జగద్గురు దమరపురికి***
***దరలిపోయెను శిష్యసంతతుల విడిచి***
***సహజ గీర్వాణవాణి ప్రసక్తులైన***
***దేవతలు చెప్పుగల రింక దెల్గు కవిత"*** (ఆత్మలహరి:64) అని ఈ పద్యంలో

తెలుగు కవిత్వమనే ప్రపంచానికి గురువు వంటి చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు తమ శిష్యుల్ని భలోకంలోనే విడిచి స్వర్గలోకానికి వెళ్ళారు. ఎందుకంటే అక్కడ దేవతల చేత కూడా తెలుగు కవిత్వం బోధించారు. ఈ చమత్కారం ఏమిటంటే సంస్కృతాన్ని దేవ భాష అంటారు. కానీ వాళ్ళ చేత కూడా తెలుగు మాట్లాడించి తెలుగును కూడా దేవి భాష చేయించి కలిగిన చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారి గొప్పతనాన్ని పింగళివారు ప్రశంసించారు.

***" మరల దిరుపతి వేంకటేశ్వరుల జంట***
***కలిసే ముప్పదియేండ్లపై కాలమునకు***
***సాగగలదింక దిక్పాల సభలయందు***
***అద్భుతావహ శతవధానాంధ్ర కవిత"*** (ఆత్మలహరి:64) అని తిరుపతి

వేంకటకవులు ఇద్దరు కలిశారంటే అవధానాలకు కొదవ ఉండదు. ఎనిమిది దిక్కుల్లో ఉన్న అష్టదిక్పాలకులు వీరి శతావధానాలను చూసి శభాష్ అనాల్సిందే . ఆ విధంగా అవధానాలలో గొప్పవారనే తీర్పును ఇచ్చారు.

*" మా గురుండిప్డు దగిన వాఙ్మయపు గద్దె*
***యుర్వి ననధిష్ఠితంబుయి యుండగలదు***
***ఆనభిగమ్యము నప్రధృష్యమ్ము నౌచు***

*విక్రమార్కుని సింహాసన క్రమమున"* (ఆత్మలహరి:64) అని విక్రమార్కుని సింహాసనాన్ని అధిష్ఠించాలంటే వీరత్వం ఉండాలి. అలాగే చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారిలా సాహిత్యసభలను అలంకరించాలంటే గొప్ప సాహితీవేత్త అయ్యి ఉండాలి. కాబట్టి అది నేటికి అధిష్ఠించడానికి సాధ్యం కాదు అనడంలో తన గురువు చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు గొప్ప పండితుడు. సాహితీవేత్త అని ప్రశంసించిన విధానం ఈ పద్యాల్లో గమనించవచ్చు.

తన గురువు గురించి పింగళి లక్ష్మీకాంతంగారు రాయడం ప్రారంభిస్తే ఆయన కలం ఒక పట్టాన ఆగదు అని చెప్పడానికి అనేక సందర్భాల్లో ఆయన ప్రదర్శించిన ప్రేమ, గౌరవం, భక్తి మార్గాలు నిదర్శనంగా నిలుస్తాయి.

**4.1.10 విశ్వ శిల్పి:**

ప్రముఖ నవలా రచయిత, కథా రచయిత, చిత్ర కళాకారుడు అడవి బాపిరాజుగారంటే పింగళి లక్ష్మీకాంతంగారికి ఎంతో ప్రేమ, అభిమానం, గౌరవం. బాపిరాజుగారు 1952 సంవత్సరంలో మరణించారు. ఆ తరువాత పింగళి లక్ష్మీకాంతంగారు బాపిరాజుగారిని తలచుకొని ఈ పద్యాన్ని రచించారు.

*" తన చేతికుంచె కాదర్శమ్ము కాదగు*
*రేఖగలట్టి యాకృతియె లేని*
*తన కన్ను గవకు విందొనరించి యాకట్టు*
*రమణీయతర పదార్థమ్మె లేని*
*తన చాచు హస్తాగ్రమున బ్రీతి గైకొని*
*కైదండ గూర్చెడి కరమె లేని*
*తన కళాభారతీ దరహసన్ముఖ వీక్ష*
*ణము సల్పగల సహనమ్మె లేని*

*వికృతి-సౌందర్యరహిత- విద్వేషభరిత*
*మర్త్య లోకమ్ము రోసి యమర్త్య భువికి*
*వెడలిపోయెను బాపిరాడ్విశ్వశిల్పి*
*సరస సౌహార్ద ముగ్ధ ప్రసన్న మూర్తి"* (ఆత్మలహరి:65) అని ఇది ఒక మృతి పద్యం. తనకు ఇష్టమైనవారు మరణించినప్పుడు ఆ వ్యక్తుల గొప్పతనాన్ని వర్ణిస్తూ రాస్తుంటారు. పింగళి లక్ష్మీకాంతంగారు కూడా అలాగే అడవి బాపిరాజు గురించి అద్భుతమైన ఈ పద్యాన్ని చెప్పారు. ఈ పద్యంలో యుగళ భావాన్ని ఇలా చూడవచ్చు. *"తన కుంచెకు ఆదర్శం కాదగిన ఆకృతి లభించకపోవడం వల్ల తన కన్నులకు విందు చేసే రమణీయమైన దృశ్యాలు లేకపోవడం*

*వల్ల తనను ప్రేమతో ఆదరించి చేయూతనిచ్చే వారు కరువు కావడం వలన తన కళా సరస్వతీ దరహాసాన్ని చూసే సహనశీలత లేకపోవడం వల్ల ద్వేషాల తో మాత్సరాలతో వికృతమైన సౌందర్యమంటే తెలియని ఈ లోకంపై సహృదయుడు, సరసుడు అమాయకుడు ఎప్పుడు చిరునవ్వులు చిందించే విశ్వ శిల్పి బాపిరాజు స్వర్గానికి తరలివేళ్ళాడు''* అని పింగళి వేంకటకృష్ణారావుగారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013: 3350) అవగతమౌతోంది. బాపిరాజుగారి చిత్రకళను ఉటంకించే ప్రయత్నం చేశారు.

**4.1.11. లక్ష్మీ నిర్గమనము:**

పింగళి లక్ష్మీకాంతంగారి భార్య పేరు లక్ష్మీనరసమ్మ. ఆమె 1969 సంవత్సరంలో మరణించారు. అప్పటికి ఆమె వయసు 75 సంవత్సరాలు. తన 15 వ ఏట వివాహం అయ్యింది. ఆమెకు పింగళివారితో 60 సంవత్సరాల దాంపత్య జీవితం ఉంది. ఆమె మరణించినప్పుడు లక్ష్మీనిర్గమనము అనే పేరుతో పింగళివారు ఈ ఖండికను రచించారు. దీనిలో 51 పద్యాలున్నాయి. ఆయన ఈ ఖండికకు 'లక్ష్మీనిర్గమనము' పేరు పెట్టడంలో ఎంతో ఔచిత్యం ఉంది. 'నిర్గమనం' అంటే వెళ్ళిపోవడం అని అర్థం ఉంది. తన పేర్లలో లక్ష్మీ అనేది ఉండేది. తన భార్య పేరులో కూడా లక్ష్మీ అనే పేరు ఉండేది. 'లక్ష్మీ' అంటే సంపద, ఇంటికి ఇల్లాలే గొప్ప సంపద. అటువంటి ఆమె చనిపోయిన తరువాత తెనాలి ఉన్నటువంటి లక్ష్మీ తన నుంచి వెళ్ళిపోయిందని అర్థం. లక్ష్మీ అనే పదానికి వెలుగు అనే అర్థముంది. తన భార్య ఉన్నంత వరకే తన ముఖంలో నిజమైన సంతోషం ఉంటుంది. తన భార్య చనిపోయిన తరువాత తనలోని వెలుగు తనలోని సంతోషం అన్ని కరువు మొరుగు అయిపోయాయని భావిస్తూ ఈ పద్యాలను వర్ణించారు. దీన్ని ఒక స్మృతి కావ్యంగా చెప్పవచ్చు. ఈ పద్యాలు సరళంగా అలవోకగా జాలువారినట్లు ఉంటాయి.

దీన్ని పింగళి సూర్యసుందరంగారు ఇలా చెప్తూ *''ఆత్మలహరిలో 'లక్ష్మీ నిర్గమనము' మనే సుదీర్ఘమైన స్మృతి గీతముంది. పింగళి లక్ష్మీకాంతంగారి భార్య పోయేటప్పటికి ఆయన వయస్సు 75 సంవత్సరాలు దాదాపు 60 సంవత్సరాల జీవిత భాగస్వామినిగా వ్యహరించిన ఆమె పోయినప్పుడు వారికి కలిగిన దుఃఖాన్ని ఈ ఖండికలో వ్యక్తపరిచారు''* అని(పింగళి లక్ష్మీకాంతం జీవితచరిత్ర,2010:132) తెలిపారు. దీన్ని బట్టి లక్ష్మీ నిర్గమనము ఖండిక వెలువడిన చారిత్రక నేపథ్యాన్ని తెలిపారు.

**4.1.11.1 లక్ష్మీ నరసమ్మ శ్రీరామ నవమి నాడు మరణించడం:**

*''శ్రీరామనవమి పర్వం*
*ప్రారంభబై న రాత్రి నమృతాంశునితో*
*నారామ య స్తమించెను*

*పారావారంబులయ్యె బంధుహృదయముల్ "* (ఆత్మలహరి:66) అని ఈ పద్యంలో తన భార్య లక్ష్మీనరసమ్మ శ్రీరామనవమి ప్రారంభమైన తరువాత ఆ రాత్రే మరణించారు. అంటే శ్రీరాముని కళ్యాణం అయిన తరువాత ఆమె ప్రాణాలను వదిలేసిందని చెప్పడం ద్వారా తమది సీతా రాముల దాంపత్యం వంటిదని కానీ రామాయణంలో సీత ఎడబాటు ఉండి మరలా రాముణ్ణి కలుసుకుంటారు. కానీ తన జీవితంలో వివాహం అయిన తరువాత తన జీవాతాంతం వరకు కళ్యాణ ప్రదంగానే సుఖ సంతోషాలతో ఎటువంటి ఎడబాట్లు లేకుండా జీవించామని పింగళి లక్ష్మీకాంతంగారు పరోక్షంగా సూచిస్తున్నారు. ఇలా లక్ష్మీనరసమ్మ తనకు సీతలాగా ఎంతో భారాన్ని భరించిందని పింగళివారు భావించారని అవగతమౌతోంది.

### 4.1.11.2 నాలుగు దశలుగా సాగిన దాంపత్య జీవితం:

*"బాల్యంబునన్ మేనబావగా మేలమ్ము*
*లాడుచు నీతోడ నాడుకొంటి*
*జవ్వనంబున గావ్య సరసాభిరుచులను*
*గరపి నీ నెయ్యంపు గురువునైతి*
*గార్హస్థ్యమున నీవు కర్ణధారణివిగా*
*సంసార నావలో సాగిపోతి*
*వార్ధకంబున నీదు వాంఛదీరగ శ్రీని*
*వాసు సన్నిధి నున్కి చేసికొంటి*

*ఆకట యరువది వత్సరా లహరహంబు*
*తోడునీడగ మెలగి యీనాడు కన్ను*
*మూసి మరపించి దోబూచి చేసిపోతి*
*వెచట వెదకిన గానరావింక నాకు "* (ఆత్మ లహరి:66) అని ఈ పద్యంలో పింగళివారికి, లక్ష్మీనరసమ్మకు చిన్ననాడే వివాహం అయ్యిందనీ, వీరిది మేనరిక వివాహమనీ, అందువల్ల వీరు చిన్నతనం నుంచె కలిసిమెలిసి ఆడుకుంటూ స్నేహంగా ఉంటూ వివాహం చేసుకున్నారనీ పింగళివారు చెప్పారు. తరువాత యవ్వనంలో కావ్యాలలోని శృంగారరసాన్ని చదువుకుని ఆనందించేవారు. వివాహం అయిన తరువాత గృహస్థురాలిగా తన బాధ్యతను తాను నిర్వహించింది. వార్ధక్యంలో ఆమె కోరుకున్నట్లుగా శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలోనే ఇల్లు కట్టుకొని నివసించారు. ఈ విధంగా తమ జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించుకుంటే ఒక మానవుడు పుణ్య దంపతులుగా తమ జీవితాన్ని ఎలా జీవించాలో అలా వారు జీవించినట్లు ఈ పద్యాల్ని బట్టి అర్థమవుతుంది. తన కుటుంబ భారానంతా ఎంతో ఓపికతో

భరించిందని ఎటువంటి పొరపాట్లు లేకుండా జీవితం కొనసాగించారని చెప్పుకున్నారు. ఈ విధంగా వీరిద్దరూ చిన్నతనం నుంచె ఎంతో అన్యోన్యంగా ఉన్నారనీ జీవించారనీ చెప్పవచ్చు.

**4.1.11.3. భార్యకు పుస్తకాన్ని అంకితమివ్వడం:**

*" గురునకు, దేవునకుంగా*
*కొరులకు గ్రంథప్రదాన మొప్పని నేనీ*
*గరిమకు ముగ్ధనై మ*
*ద్విరచిత సాహిత్య శిల్ప వేద మొసగితిన్ "* (ఆత్మలహరి:67) అని

గురువుకి, దేవునికి తన గ్రంథాన్ని అంకితం ఇవ్వడానికి కంటే ముందే తన భార్య అయిన లక్ష్మీనరసమ్మకు సాహిత్య శిల్ప సమీక్ష అనే గ్రంథాన్ని అంకితం ఇచ్చారు. అది. ఆమె పట్ల తనకున్న అనుబంధాన్ని, గౌరవాన్ని, అభిమానాన్ని తెలియజేస్తున్న ఘట్టం ఈ సందర్భంగా సాహిత్య శిల్ప సమీక్షలో ఆమెకు అంకితం ఇచ్చిన పద్యాలను పేర్కొందాం.

*" మాంగల్యనిధికి ,బంధుజ*
*నాంగీకృతశీలక స్మదర్ధాంగికి శ్రీ*
*పింగళి లక్ష్మీ నరసమ*
*కుం, గృతి యొసగితిని దీని, కులవర్ధనికిన్ "*

*" పింగళి వంశము మేలిమి*
*బంగరు గని, దాని వలన వెన్నెయును, భవ*
*న్మాంగల్య మహిమ వలన శు*
*భాంగీ! నాకొదవె, నాయురారోగ్యములన్ "*

(సాహిత్య శిల్ప సమీక్ష,1966:4)

ఆమెను ఈ రెండు పద్యాల్లో మాంగల్య నిధిగానూ, బంధువులందరికి అంగీకారయోగ్యమైన జ్యోతిగాను కుటుంబం అందరితోనూ కలుపుగోలు తనం కలిగిన వ్యక్తి గాను అభివర్ణించడం గమనార్హం. అంతేకాకుండా ఆమెను వంశ అభివృద్ధికి కారణభూతురాలుగా వర్ణించడం ఒక స్త్రీకి ఇచ్చిన ఒక భార్యకు ఇచ్చిన గొప్ప గౌరవంగా దీన్ని భావించాలి. ఈ విధంగా తన వంశాన్ని అభివృద్ధి చేసిన బంగార ఘని లాంటిదని ఆమెను అభివర్ణించి ఆ వంశానికి ఆయురారోగ్యాల్ని ప్రసాదించమని కోరుకోవడం ఈ రెండు పద్యాల్లో కనిపించే గొప్ప విశేషాలుగా కనిపిస్తాయి.

**4.1.11.4. లక్ష్మీ పోయె కాంతుడు మిగిలే:**

*" నీ వలన సార్థకంబయి నెగడె లక్ష్మీ*
*కాంతుడను నామ మితనికి నింతదనుక*

*దేహమున బోలె నా నామధేయమునను*

*సగమె మిగిలెను నా లక్ష్మీ యెగిరిపోయె "* (ఆత్మలహరి:67) అని ఈ పద్యంలో ఆ దంపతుల ఇరువురి నామాలలో గల 'లక్ష్మీ' అనే పేరుతో ఉన్న అర్థ తాత్పర్యాలను సందర్భోచితంగా వర్ణించడం పింగళివారిలోని సమయస్ఫూర్తికి నిదర్శనం. 'లక్ష్మీకాంతం' అనే పేరులో లక్ష్మీ అనేది ఉన్నప్పటికి తన భార్య ఉన్నప్పుడు మాత్రమే జీవించి ఉండగా తనకు ఆ పేరు సార్థక మని ఆమె లేనప్పుడు ఆ పేరు సార్థకం కాదనీ చెప్పడంలో భార్య పట్ల తనకున్న అనురాగం వ్యక్తమవుతోంది. ఇంతకు ముందే పేర్కొన్నట్లుగా తన పేరులో కేవలం లక్ష్మీ అనేది మాత్రమే ఉందనీ నిజమైన సుఖ, సంతోషాలు అన్నీ ఆమెతోనే వెళ్ళిపోయ్యయని చెప్పడం ఎంతో సందర్భానికి తగ్గట్టుగా ఉంది.

### 4.1.11.5. హరిహరనాథతత్త్వం:

ఇక్కడ తన భార్య చనిపోయెటప్పుడు ఆమె గొప్పతనం వల్ల వేదవిప్రులు వేదదానాలు చేశారట. అంతేకాదు ఒకరు శివస్తోత్రాన్ని మరొకరు భావగీత గీతాన్ని పలికారట. దీనిలో దీని ద్వారా తన భార్య కూడా హరిహరనాథద్వైత్వానికి ఎంతగానో అవలంభించిదని తెలుస్తుంది.

*" ఒకరు వేదసూక్త మొకరు శివస్తోత్ర*

*మొకరు భాగవతము నొకరు గీత*

*చదువుచుండ నీవు సాగిపోయిన వేళ*

*నమరలోకవాయు వావరించె "* (ఆత్మ లహరి:68)అని ఆమె పార్థివదేహాన్ని బంధువులు చూడటానికి వచ్చినప్పుడు ఆమె ముఖం చిరునవ్వుతో కనిపించినట్లుగా ఉందంట.

*" పరవశ చిత్తంబున మై*

*మరచియు బయనంపు వేళ మాయాతీత*

*స్ఫురణకు జిహ్నంబా? యొక*

*చిరునవ్వు వెలార్చి తీవు శీతాంశుముఖీ "* (ఆత్మలహరి:68) అని ఆమెకు స్వర్గలోకంలో అక్కడివారు స్వాగతం పలికి ఉంటారనీ కూడా చెప్పారు.

### 4.1.11.6. స్వర్గలోకంలో ముచ్చట్లు:

ఆమె ఈ లోకాన్ని వదిలి స్వర్గలోకం వెళ్లిన తన భార్య లక్ష్మీనరసమ్మ అక్కడి వారితో ముచ్చట్లు పెట్టుకుంటు ఉంటుందంట. ఈ సందర్భంగా తన చెడ్డ పనులను చెప్పవద్దనీ, తన మంచి గుణాలను, పనులను మాత్రమే చెప్పమనీ కోరతాడు. ఒక వేళ అంత మంచి వాడైతే అతన్ని వదిలేసి ఎందుకు వచ్చేశావనీ అడగవచ్చినేమో అది తన దురదృష్టమని చెప్పు ఇంకా నమ్మకపోతే తిరుపతిలోని శ్రీవేంకటేశ్వరుని ఆదేశం ప్రకారం వచ్చానని చెప్పమంటాడు.

*"సురలోక పురంధ్రులతో*

*సరసముగా నీవు సల్పు సల్లాపములన్*

*స్మరియింపబోకు నా దు*

*శ్చరితంబుల, మరువబోకు సాధుగుణములన్"* (ఆత్మలహరి:69) అని ఈ సందర్భంగా స్వర్గలోకంలో ఉన్నవాళ్లు కనిపిస్తే వాళ్ళని పలకరించమని, పరామర్శించిమని పింగళి సూరనను, వెంకటేశ్వరరావుగారిని ప్రస్తావిస్తారు. వీటన్నింటి కంటే తన భార్య లక్ష్మీనరసమ్మను ప్రస్తుతిస్తూ వర్ణించిన పద్యం ఈ పద్య ఖండికకే శిరోభూషనమైనది. తన భార్య ఒక దేవత, పితృదేవతగాను భావిస్తారు. అయినప్పటికీ ఆమెను ఒకవేళ మహావేశంతో భార్యగా భావించారననేమో అని అలా జరిగితే నన్ను తప్పుపట్టకు, నీ పట్ల గల ప్రేమ మాత్రమే అలా చేయించిందని తన భార్య ఒక దేవతారత్నంగా భావిస్తూ ఈ పద్యం వర్ణించారు.

*"దేవతవె యైతివో పితృ*

*దేవతవే యైతివో సతీమణి! నిను మో*

*హావేశమ్మున బత్నిగ*

*భావించితినేని తప్పు బట్టకు లక్ష్మీ!"* (ఆత్మలహరి:69)

### 4.1.11.7 సీతా రాముల దాంపత్య విషయాలను తెలుసుకొనుట:

తన భార్య స్వర్గానికి వెళ్ళినప్పుడు శ్రీరాముడ్ని దర్శించిందే అని అడిగి తాను ఈ లోకంలో రాసుకున్న రామకోటిని ఆ స్వామికి అర్పించావా లేదా అని అడుగుతాడు. రాముడి దగ్గర ఉన్న సీతాదేవి తన భార్య అయిన లక్ష్మీనరసమ్మను దగ్గరకి చేరదీసిందా లేదా అని అడుగుతాడు. ఇంతకి మరిచిపోయాను సీతమ్మ వారు శ్రీరాముడి దగ్గరకు రావడానికి ఇష్టపడిందా లేకపోతే శాస్వతంగా భూలోకంలోనే ఉండిపోయిందా అనేక నిష్టూరాలతో తన భర్త శ్రీరాముని దగ్గరకి వెళ్లడానికి ఇష్టపడటం లేదా ఉన్నంత పాతివ్రత్య మహిమ వంటిదే సీతాదేవి కూడా ఉందని చెబుతాడు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతం భార్య కూడా కొన్నాళ్ళు భర్తకు దూరం ఉందనే అనుమానం కలుగుతుంది. కానీ శ్రీరాముని పట్ల సీతాదేవికి ఎంత భక్తి ఉందో అతనే లోకంగా బతికిందో అటువంటి భక్తి అటువంటి ఆలోచనలే తన భార్య లక్ష్మీనరసమ్మలో కూడా ఉన్నాయని చెప్పడమే కవి లక్ష్యం. అలాగే శ్రీరాముడు లోకాలకు అతీతమైన ధర్మం, ధర్మాన్ని పాటించడంలో అతన్ని మించిన ఏ దేవుడికి లేదన్నారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతం గారికి తన భార్యకు సీతారాముల పట్ల ఉన్న అచంచలమైన భక్తి విశ్వాసాలు ప్రతిపాదిస్తున్నాయి. అటువంటి పద్యాలు మనం తప్పకుండా స్మరించుకోదగినవి.

*"శ్రీరాముని దర్శించితి*

*వా? రాముని నామకోటి యర్పించితివా?*

*ఆ రాము చెంత సీతమ*

*గారామున నిన్ను జేరగాదీసినదా? "* (ఆత్మలహరి:70)

*" మరచితి, సీతమ రాముని*
*సరసకు రానిష్టపడెన? శాశ్వతభూగ*
*హ్వరము ననెడాగెనా? ని*
*ష్ఠురుడౌ పతి మోము జూచు సుముఖతలేమిన్!*
*" పాతివ్రత్య మహత్త్వము*
*సీతమకున్ నీకు సమము, శ్రీరాముని లో*
*కాతీత ధర్మవర్తన*
*మీతనికే కాదు లేద యేదేవునకున్ "*
*" స్వాభిమానమును జానకీదేవితో*
*దుల్యురాలనీవు బాల్యమాది*
*చిన్నచూపు గాని, చిన్న మెత్తు పరాభ*
*వంబుగాని సైప వంబుజాక్షి! "* (ఆత్మలహరి:70,71)

**4.1.11.8. తిరుపతిలోని పద్మావతి ప్రార్థన మండలి వ్యవస్థాపకురాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా చేరిన తరువాత అక్కడే చాలా కాలం పాటు తిరుపతిలోనే ఉన్నారు. ఆ సందర్భంలో అనేకసార్లు తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శింస్తూ ఉండేవారు. అక్కడ తిరుపతిలోని శ్రీపద్మావతి భక్తిప్రాంగణంలో ఒక ప్రార్థనా మండలి మహిళాభవనం ఉంది. దాన్ని కట్టించడంలో తన భార్య లక్ష్మీనరసమ్మ కృషి ఎంతగానో ఉందనీ ఆ పేరుతో చెప్తూ తిరుపతి వేంకటేశ్వరుని సన్నిధిలో ఆమె కీర్తి ధ్వజము స్థిరంగా నిలుస్తుందని పింగళివారు అంటున్నాడు.

*" తిరుపతి మహి ళాభవనము*
*శరీర సౌఖ్యంబు వోని స్థాపించితివా*
*తిరుపతినాథుని సన్నిధి.*
*స్థిరకీర్తిధ్వజము నీ కదే లోకమునన్ "* (ఆత్మలహరి:71)

*" ఇట్టి దేవరహస్యము లెన్ని యేని*
*కాంచియే యుందు వచ్చుట, గాని నాకు*
*దెలియ జెప్పవు ,చెప్పగా దలతువేని*
*లేదు నీకును నాకు సంవాదసరణి "*

*" కలలో నైనను దర్శనం బొసగవో కల్యాణి నా మీదనిం*

*తలుకా? నా పొరపొచ్చెముల్ మరువలేవా? దేవలోకమ్ములన్*

*గలవా మానవ కోపతాపములు? నిష్కారుణ్య భావంబు లీ*

*యిలపై నున్నపు డీ వెరుంగవుగదా? యీ క్రొత్త వింతేటికిన్ "*

(ఆత్మలహరి:72)

**4.1.11.9 సౌందరనందములో నాయికగా పింగళి లక్ష్మీ నరసమ్మ:**

తాను ఏదైనా పొరపాటు చేసి నొప్పిస్తే తనను సత్క్రమమార్గంలోకి వెళ్ళితే గానీ నొప్పించకుండా గానే తనను సరిదిద్దేదని అటువంటి గుణాలన్నీ తన భార్య నుంచే గ్రహించి తాను కాటూరి వేంకటేశ్వరరావు కలిసి రాసిన సౌందరనందం కావ్యంలోని కావ్యనాయిక సుందరి వర్ణనలో తాను ఉపయోగించుకున్నానని ఒక పద్యంలో పింగళివారు చెప్పుకున్నారు.

*" దెందము నొప్పించిన న*

*న్నందండన సేయు దీవు నొవ్వని రీతిన్*

*సౌందరనందము నాయిక*

*సుందరి నీ యొద్ద మాటసొంపులు నేర్చెన్ "* (ఆత్మలహరి:73)

*" దేహము గాక, దానికి నతీతుడు జీవుడె నీవటంచు సం*

*దేహ నివృత్తి సేయు నుపదేశము లెన్నిటి నాలకించినన్*

*స్నేహరసావిలంబియగు చిత్తము దేహమునే స్మరించెడున్*

*మోహతమోహమౌ వెలుగు మోసు కనంబడలేదు నెచ్చెలీ ! "*

(ఆత్మలహరి:73) అని

ఈ రెండు పద్యాల్లో పింగళి లక్ష్మీకాంతంగారు సుందరి పింగళి లక్ష్మీ నరసమ్మ సౌందరనందంలోని నందుడు, సుందరి గుణాలు ప్రతిఫలించడం గమనర్హాలు. తాను ఈ లౌకికమైన భోగ భాగ్యాల పట్ల విముకం అవుతూనే మరలా వాటి పట్ల ఆసక్తిని కనపరచడం ఈ పద్యాలలో ధ్వనిస్తుంది.

**4.1.11.10 జనన మరణాలు సహజం (మోక్షం):**

పింగళి వారి భార్య ఎంతో సుకుమారమైనదనీ కానీ ఆమెను మృత్యువు అనే ఏనుగు ఆమెలోని ప్రాణాన్ని పెకలించివేసిందనీ ఆ సందర్భంలో ఎంతగా బాధను భరించిందో అని భావిస్తాడు. ఆ సందర్భంలో తామంతా ఆ మృత్యువుని అడ్డుకోలేకపోయామనీ వీళ్ళంతా నిన్ను కాపాడుకోలేకపోయారనీ అనుకొని ఉంటావనీ ఆమె చివరిగా తలుచుకొని ఉంటారు. అయినా పుట్టిన వారికి మరణం తప్పదు. ఆ మృత్యువు అనేది ఒక త్రాచు పాము వలె పగబట్టి కాటు వేయడానికి చూస్తూ ఉంటుందంట అలా మరణించినవారు మరలా జన్మిస్తారు. ఒక వేళ మరలా

జన్మించకపోతే మోక్షానికి చేరుకుంటారు. కానీ తన భార్య మోక్షానికి చేరిందని పింగళివారు వర్ణిస్తాడు.

*" నీ సుకుమార ప్రాణము*
*లీసున బెకలించి వైచె మృత్యువను గజం*
*బో సుమగాత్రీ! యెంతటి*
*గాసిని భరియించితో వికార రహితవై "*

*" ప్రాణి పుట్టగానె పగబటు మృత్యువు*
*త్రాచుపామువోలె, దాని కాటు*
*తప్పుకొనుట యనగ తనువు తాల్పక యుంట*
*అదియె మోక్షమనగ న బుజాక్షి! "* (ఆత్మలహరి:73)

### 4.1.11.11 శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రశంస:

మానవునికి ఏది మంచిదో, ఏది చెడిదో తెలియదు. కానీ తమ కోరికలన్నీ తీరాలని కోరుకుంటారు. వాటినన్నీ విని, చూసి భగవంతుడు ఏమి చెయ్యాలో అదే చేస్తాడు. మృత్యువును జయించాలనీ ఈ పద్నాలుగు లోకాలలో ఎక్కడెక్కడో దాక్కున్న మృత్యువు తప్పదు. అటువంటి మృత్యువుకి పొగరుని ఆనచ కలిగినవాడు భగవంతుడు ఒక్కడే. ఆయనే అభయప్రధాత శ్రీవేంకటేశ్వరస్వామిని దైవంగా భావించి తానేమైనా పాప కార్యాలు చేశాడేమోననీ భార్య మరణించిందనీ పశ్చాత్తాపపడుతూ పింగళివారు ఉంటారు.

*" ఈ పదునాల్గు లోకముల నెవ్వడు మృత్యువు నడ్డగింపగా*
*నోపడు దాని ధాటికి మహోజ్వలతేజులు రామకృష్ణులే.*
*సైపగ లేక చిక్కిరొక శర్వుడు మృత్యువుపాలి రుద్రుడై*
*యా పొగరణగార ద్రొక్కెను పురారిపదమ్ములకున్ నమస్కృతుల్ ! "*

(ఆత్మలహరి:74)

మరలా వేంటనే పునర్జన్మ లేకుండా ఆయన సన్నిధానంలోకి ఆహ్వానించాడనీ, ముక్తిని ప్రసాదించించాడనీ భావిస్తాడు కవి. మృత్యువు మరొక దేహంలోకి వెళ్ళకుండా అనగా మరొక జన్మ ఎత్తి ఒక జీవిగాను, ఒక మానవుడి గాను, ఒక చెట్టు గాను, ఒక పుట్టగాను మరలా కొన్నాళ్ళు ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి వణికి, లౌకికమైన సుఖ సంతోషాలతో కులుకకుండా భగవంతుడు ఆమెకు మోక్ష ప్రాప్తిని కలిగించాడనీ అందుకు ఆ శ్రీవేంకటేశ్వరునికి కృతజ్ఞతలు చెప్తాడు.

*" అతడే తిరుమలపతి, యా*
*శ్రితులకు నభయప్రదాత, మృత్యుచ్ఛాయా*
*ప్రతిబింబమైన సోకని*
*సితాతపత్రంబు నీడ వుల నడపున్ "*

*" దేవా! వేంకటనాయక!*
*కావరమున భక్తిహీనకార్యంబేదో*
*కావించియుందునా? లే*
*దా, విధిని జయింప జాలవా నీ మహిమల్ "*
*" జీవున కెయ్యది శ్రేయమొ*
*యా వెంటనె నడపుచుందు వజ్ఞానులమై*
*మా వాంఛలెల్ల దీర్పగ*
*వే విధముల వేడుకొనిన వినవు మహాత్మా! "* (ఆత్మలహరి:74) అని

ఇక్కడ మృత్యువు అనేది మృత్యువుకి పొగరు ఉంటుంది. అందుకనే తనకు వచ్చినంత కాలం ఏదో ఒక జీవిలో ఉంటుంది. ఆ పొగరు వలనే తనకు ఇష్టం వచ్చినప్పుడు ఈ పద్నాలుగు లోకాలలో ఎక్కడో ఒక చోట విహరిస్తూ ఉంటుంది. అంటే ఒక జీవి ఎక్కడో ఒక చోట విహరిస్తూ ఉంటుంది. అంటే ఒక జీవి దేహాన్ని వదిలి మరొక జీవి దేహంలోకి ప్రవేశిస్తూ అక్కడ నుండి మరలా మరొక్క దేహంలోకి ఈ సృష్టిలోని రకరకాల జీవుల దేహాలతో ఆడుకుంటుంది. అలా మృత్యువు జీవులతో ఆడుకోవడం ఒక పొగరు. ఆ పొగరును అణచినవాడు శ్రీ వేంకటేశ్వరుడు. దానికి మరలా మరొక జీవిలో పుట్టే శక్తి లేకుండా చేశాడు. అంటే మోక్షాన్ని ప్రసాదించాడు. ఇక్కడ ప్రాణి జీవిలో ఉండేది జీవాత్మ, దానికి మరణం ఉంటుంది. అంటే మృత్యువు ఉంటుంది. జీవి దేహం వదిలి ఇంకా మరొక జీవిలోకి ప్రవేశించే వరకు ఉండే స్థితిని 'ఆత్మ' అంటారు. ఏదో ఒక రూపం లేకపోతే దానికి శక్తి లేదు. అది భగవంతుడిలో లీనమవుతుంది.

అంటే ఆత్మ పరిశుద్ధంగా ఉండటం మాత్రమే పరమాత్మలో లీనం కావడం దాన్ని మోక్షం అనీ పునర్జన్మ లేకపోవడం ఆ విధంగా మోక్షాన్ని పొందడం ఈ కావ్యం గొప్ప ఖండకావ్యంగా చెప్పవచ్చు.

### 4.1.12. ఆత్మలహరి (నేను– పింగళి):

పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన 'ఆత్మ లహరి' లో 45 పద్యాలున్నాయి. ఈ పద్యాలన్నింటినీ తాను అప్పుడప్పుడు రాసుకున్నారనీ అవన్నీ అసమగ్రాలనీ ప్రచురణ కర్తలు పేర్కొన్నారు. 'ఆత్మలహరి' అనేది ఒక ఖండిక అయినప్పటికీ సుమారుగా 12 ఖండికల్ని కలిపి 'ఆత్మలహరి' పేరుతో ప్రచురించారు ప్రచురణ కర్తలు. దీన్ని పింగళి లక్ష్మీకాంతంగారి స్వీయ అనుభవాల విశేషాలను కవితాత్మకంగా చెప్పిన కావ్యంగా తెలుస్తుంది.

లక్ష్మీకాంతంగారి మనస్సు అనే సముద్రంలో ఎగసిపడే అల వంటిది ఆత్మలహరి. ఈ ఆత్మలహరి లోని పద్యాలను వ్యాఖ్యానిస్తూ పింగళి వేంకట కృష్ణారావుగారు పింగళివారిలోని సత్త్వ, రజ, తమో గుణాలతో సమన్వయించారు.

**4.1.12.1 పింగళి వంశం:**

సందర్భం వచ్చినప్పుడల్లా పింగళి లక్ష్మీకాంతంగారు పింగళి సూరణ్ణి తమ వంశ గోత్రానికి చెందిన వాడిగా చెప్పుకుంటాడు. అంతేకాదు తిక్కణ్ణి కూడా తన వంశానికి చెందిన వాడిగా భావిస్తాడు. అందువల్ల నాకు (పింగళి) సాహితీవేత్త అనే పేరు వచ్చిందని కానీ నిజానికి నాకు అంత యోగ్యత లేదని మా పూర్వీకులు తపోబలం వలన మాత్రమే నాకు ఆ కీర్తి లభించిందని చెప్పుకుంటారు.

*" గర్వపు మాటలేల గురుకారుణికత్వ మొకండుగాక, మా*
*పూర్వులు సూరనాదుల తపోబల సంపదకల్మి, సాహితీ*
*ధూర్వహుడన్న పేరునకు తోడు మహాకవియన్న కీర్తి యాం*
*ధ్రోర్వి లభించే నిక్క మిది, యోగ్యతలేని యశమ్ము మోసితిన్"*

(ఆత్మలహరి:76) అని

ఈ పద్యంలో మా పూర్వీకులు సూరన, తిక్కన మొదలైన వాళ్ళని స్పష్టంగా చెప్పుకున్నారని తెలుస్తుంది.

*" ఈ తెలుగు భారతీ వి*
*ఖ్యాతికి నున్నతికి ప్రథమ కారణభూతుల్*
*మా ' తిక్కన సూరన్నల*
*గౌతమగోత్రజుడ ననచు గర్వింతు మదిన్"* (ఆత్మలహరి:76) అని ఈ

పద్యంలో తిక్కన పింగళి సూరనల గౌత్రమా గోత్రజులు గోత్రానికి పింగళి లక్ష్మీకాంతంగారు కూడా ఆ గోత్రానికే చెందినవారని స్వయంగా చెప్పుకున్నారు. బహుశా తమ గోత్రం పేరు 'గౌతమా' అనే పేరుతోనే కొన్ని వ్యాసాల్ని 'గౌతమ వ్యాసములు' (1952) ఒక పుస్తకంగా ముద్రించుకున్నారు. దీనితో పాటు 'గౌతమ నిఘంటువు'ను (1968) కూడా మరో పుస్తకాన్ని ప్రచురించుకున్నారని స్పష్టంగా తెలుస్తుంది.

**4.1.12.2. తన రచనల అచ్చు కావడానికి దూరంగా ఉండుట:**

పింగళి లక్ష్మీకాంతంగారు స్వీయవిషయాలను పత్రికలలో ప్రచురించుకోవడానికి పెద్దగా ఇష్టపడేవారు కాదు. వివాదాలకు కూడా ఎంతో దూరంగా ఉండేవారు. కానీ నిరంతరం రాసుకున్న మనస్తత్వం ఆయనకు ఉండేది. అందకనే ఆయన అనువాదాలు కూడా చేశాడు. అవి *'ఆంగ్ల దేశ చరిత్ర', 'బగ్ జార్గల్', 'మాబిడిక్', 'మానవులందరు సోదరులు'* వంటి వాటిని తెలుగులోకి అనువదించారు. ఆరుద్రగారు ఒక సారి సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రలో, పత్రికలలో పింగళి లక్ష్మీకాంతంగారి గురించి రాస్తానని పింగళివారిని వివరాలు చెప్పమన్నాడు. కానీ తన గురించి లోకానికి తెలియని విషయాలు ప్రత్యేకించి చెప్పించుకొని ఇష్టం లేక వద్దన్నాడు. ఈ

విషయాలను 'పింగళిలక్ష్మీకాంతం జీవితచరిత్ర'లో పింగళి సూర్యసుందరంగారు పేర్కొన్నారు. కూడా. ఈ విషయాలు స్ఫురించేటట్లుగా ఈ కింది పద్యంలో చెప్పుకున్నాడు.

*" విచ్చలవిడి పత్రికలకు*
*రచ్చలకును బోవ నేను, వ్రాసిన కొంచెం*
*బచ్చొత్తి చూచుకొనియెడి*
*ముచ్చట సాధారణముగ పొడమదు నాకున్ "*

(ఆత్మలహరి:77)

### 4.1.12.3. వివాదాలకు దూరంగా ఉండటం:

సాధారణంగా కొందరిని ఒక గుంపుగా సమకూర్చుకొని తమ వాదనలు నెగ్గాలని తమ ఆధిపత్యనే ప్రదర్శించాలని అనుకోకుండా తన పని ఏదో చేసుకుని పోయేవాడు. అయినప్పటికీ తన మిత్రులు కొంతమంది కొన్ని వివాదాలకు లాగేవారు. అందుచేత తన చేత ఉపకారం పొందిన వాళ్ళే కృతజ్ఞతలు లేకుండా తనను వ్యతిరేకించిన సంఘటనలు లేకపోలేదని కొన్ని పద్యాలు వలన తెలుస్తుంది. ఇది అంతా అసూయ వలనే జరిగే పనిగా తాను భావించాడు.

*" ఆగ్రహ హరితప్తు లను*
*యాగ్రస్తులు విసరునట్టి యస్త్రంబులకున్*
*నా గ్రహబలమో, దైవా*
*నుగ్రహమో, యడ్డుపడి ననున్ గాపాడున్ "*

(ఆత్మలహరి:77)

### 4.1.12.4. అధికారాన్ని మన్నించినా అవ గుణాన్ని మన్నించలేని తత్త్వం:

పింగళి లక్ష్మీకాంతంగారు చాలా సున్నితమైన మనస్తత్వం కలిగినవాడు. అందు వలన ఎటువంటి వాదనలకు వెళ్ళకపోవడంతో పాటు తనకు నచ్చకపోతే ఎవరీ దగ్గరికి వెళ్ళకుండా దూరంగా ఉంటారు. కానీ వాళ్ళనీ ద్వేషించాడు. పాపులకు దూరంగా ఉండాలనీ భావించే మనస్తత్వం కలిగినవాడు. అలా కొన్ని ఏళ్ళ పాటు కొంతమంది అధికారులతో వచ్చిన వివాదం వల్ల దూరంగా గడిపిన రోజులు ఉన్నాయని అటువంటి తాను తప్పు చెయ్యలేదని ఆత్మ విశ్వాసాన్ని తనకు మార్గం చూపించిందనీ చెప్పుకున్నాడు.

*" అధికారము మన్నించెద*
*నధికారిని గుణము బట్టి యారాధింతున్*
*అధముడగునేని యాతని*
*పథమునకున్ దొలగి నిలుతు పాపమునకుబలెన్ "*

*"గడపితిని కొన్ని యేండ్లు చీకటి మయములు*

*గ్రుడ్డి వెన్నెలయైన నెగుంగకుండ*

*సత్యమొక్కటి ఆత్మవిశ్వాస మొకటి*

*కనువెలుంగయి నాకు మార్గమ్ము చూపె"* (ఆత్మలహరి:78)

**4.1.12.5. తండ్రి నుంచి సంక్రమించిన గుణం:**

తన తండ్రి వేంకటరత్నంగారు ప్రాణం పోయినా సత్యాన్ని విడవద్దని చెప్పినారు. దాన్ని తాను జీవితాంతం ఆచరించారు. అదే నాకు (పింగళి) నిజమైనటువంటి పిత్రార్జితంగా వచ్చిన సంపదగా భావించుకున్నాడు. తనని దగ్గరిగా చూడని వాళ్ళు చెడ్డవాడని అనుకొనేవారు. దగ్గరగా ఉన్న వాళ్ళు గంగిగోవు తనని అనుకునేవారు. ఈ గుణాలను కింది పద్యంలో చెప్పుకున్నారు.

*"సత్యసంధత యిహపర సాధనముగ*

*బ్రతికె మా తండ్రి వెంకటరత్నం మంత్రి*

*ఆదియె మిగిలెను నాకు పిత్రార్జితముగ*

*వ్యర్థపుచ్చక దాని కాపాడుకొంటి "* (ఆత్మలహరి:79)

**4.1.12.6. శిష్యవాత్సల్యం:**

పెద్దవాడు, చిన్నవాడు లేకుండా అంటే ఎలాంటి భేద భావం లేకుండా తన దగ్గరికి వచ్చిన శిష్యుల్ని తన కొడుకులతో సమానంగా శిష్యుల్ని దగ్గరికి చేర్చుకొనేవారు. ఒక్కొసారి తమ దగ్గర ఉండటానికి వారు అర్హులో కాదో తెలుసుకొకుండా దగ్గరకు తీసుకొనేరాన్నది వారి మనసులు తెలుసుకున్న తరువాత బాధపడిన సంఘటనలు కూడా ఉన్నాయి. బాధపడుతూ తన ఆత్మను ఆవిష్కరించుకొన్నాడు.

*"ఘనుడనియు నల్పుడనియున్*

*మనమున నరమరలు లేక మన్నింతును నె*

*మ్మన మిచ్చినవానిని, నా*

*తనయులతో పాటు శిష్యతతి ప్రేమింతున్ "* (ఆత్మలహరి:78)

**4.1.12.7. సత్య వాక్ పరిపాలన:**

'ఆత్మలహరి'లో అనేక చోట్ల తానెంత సత్యవంతంగా జీవించడానికి ప్రయత్నించారో అనేక పద్యాల్లో చెప్పుకున్నాడు. ఎవరికైనా తాను ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు తను ఎలాంటి ధనాన్ని ఆశించకుండా పని చేస్తాననీ తనకు నచ్చకపోతే దాన్ని ఎట్టి పరిస్థితుల్లో చేయనని అది మంచైనా, చెడైనా నవ్వుతూ మాట్లాడి వాళ్ళని పంపించి వేసేవానినీ పౌరుషంగా ఉండేవాడనీ కాదనీ చెప్పుకున్నాడు. అందుకనే సత్యాన్ని పలకనివాడు, సత్యాన్ని పాటించని వారిపై స్నేహాన్ని చేయడం తనకు ఇష్టం లేదు అన్నాడు. అంతేకాకుండా చేసిన మేలు మర్చిపోయెవాననీ తప్పులను

క్షమించలేననీ చెప్పుకున్నాడు. ఇటువంటప్పుడు ఆయనలోని రాజసప్రవృత్తి కనిపిస్తుందని పింగళి వేంకటకృష్ణారావుగారు తెలిపారు.

*" ధర్మములు రెండు నాకు నీ తనువు నందు*
*రుతము పల్కుట కృతము స్మరించుకొనుట*
*సత్యదూరులతో చెల్మి సల్పలేను*
*మేలు మరచినవాని క్షమింపలేను"* (ఆత్మలహరి:80)

### 4.1.12.8. శాంత స్వభావం కలవాడు:

తనను చాలా మంది లౌకికత్వం తెలిసినవాడనీ, వివేకం తెలిసినవాడనీ ఎవరితో ఎలా మాట్లాడాలో కార్యాన్ని ఎలా సాధించాలో తెలిసిన తెలివైనవాడనీ చాలా మంది మాట్లాడుతు ఉంటారు. కానీ తనకు ఇంకేమి తెలేవనీ సనాతన సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగి రుజువర్తనం అంటే వినేవాడిగా చెప్పుకున్నాడు. తనకి తండ్రి లోని సత్వగుణం, తల్లిలోని రజోగుణం సంక్రమించడం వల్ల ఆ రెండు గుణాల కలయిక తనలో కనిపిస్తుందనీ చెప్పుకున్నారు.

*" లౌకికుడటంచు మంచి వివేకియంచు*
*తంత్ర భేదకుడంచు, స్వతంత్రుడంచు*
*నిక్క మెరుగక నన్ను వర్ణించుచుంద్రు*
*నన్ను బోలిన వట్టి ఛాందసుడు లేడు "*

*"సంక్రమించెను జనకుని సత్వగుణము*
*జనని రాజసమును నాకు జన్మ వలన*
*ఉభయగుణ సమభాగ సంయోజితాత్మ*
*ప్రకృతి చోదిత నిత్యవర్తనము నాది "* (ఆత్మలహరి:82)

### 4.1.12.9. కావ్య పరమార్థాల పట్ల నిష్కర్ష ఉండటం:

మంచి కావ్యాన్ని రాసేటప్పుడు గుణదోషాలను వివరించడంలో స్వపరభేదాలు పాటించననీ అవసరమైతే ఆ సరస్వతీ దేవితో కూడా వాదులాడుతాననీ కావ్యం పట్ల తనకున్న నిర్మమత ఉంటుందనీ పింగళివారు కింది పద్యంలో ప్రకటించుకున్నారు.

*" రమణీయమైన యర్థము*
*కమనీయమ్మయిన శైలిగల కావ్యముభా*
*వము వివరించెడి పట్టున*
*కమలాసను రాణికిన్ ముఖాముఖి నిలుతున్ "* (ఆత్మలహరి:83)

**4.1.12.10. గురువుకే తన కావ్యాన్ని అంకితం ఇవ్వడం:**

తన జీవిత కాలంలో అనేకమంది దగ్గర అప్పులు తీసుకున్నారనీ కానీ, వాళ్ళు అడక్కుండానే వాటినన్నింటినీ తీర్చేశాననీ కానీ జ్ఞానాన్ని ఇచ్చిన గురువు గారికి మాత్రం ఏది ఇచ్చినా రుణం తీరదనీ అయినప్పటికీ ఈ జన్మకు ఒక కావ్యాన్ని అంకితం ఇచ్చాననీ చెప్పుకున్నాడు.

*“ విచ్చలవిడిగా రణముల*
*తెచ్చితి నడిగించుకొనక తీర్చితి జ్ఞానం*
*బిచ్చి గురునకు కావ్యం*
*కృతార్థుండనైతి నీ పుట్టువునన్ ”* (ఆత్మలహరి:83)

ఈ పద్యంలో సౌందరనందం కావ్యాన్ని తన గురువు చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రీ గారికి అంకితమిచ్చాడు. ఆ సందర్భంగా పింగళి, కాటూరి కవులు చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రీగారికి రాసిన ఇచ్చిన అంకితం పద్యాలు ఈ విధంగా ఉన్నాయి.

*“ శ్రీమత్తిరుపతికవిసు*
*త్రామసుహృత్త్వాభిరామ! రసవత్కవితో*
*ద్దామా! వేంకట శాస్త్రి!*
*స్వామీ ! గురుదేవ ! కొనుము సాష్టాంగనతుల్ ”*
*“ భావవిశుద్ధి దోపగా భవత్పదముల్ భజియించునాటి మా*
*సేవలు మెచ్చి, యాదరవిశేష మెలర్పగ సల్పినట్టి మీ*
*దీవన నిక్కమై యొసగే దియ్యని కావ్యఫలమ్ము నేటికిన్*
*నీ విడినట్టి భిక్ష యిది నీకె యొసంగెద మిష్ట విందుగాన్”*

(సౌందరనందము:5,6)

పింగళి లక్ష్మీకాంతంగార్కి గురువులపట్ల ఆవిధమైన భక్తి భావన, వినయం, గౌరవం మొదలైనవి ఉండడానికి కారణం ఆయన వ్యక్తిత్వంలోని గొప్పదనం. అంతే కాకుండా పెద్దల పట్ల గౌరవభావంతో పాటు, దైవం పట్ల భక్తి భావం కూడా ఎంతో ఉంది.

**4.2. పింగళి లక్ష్మీకాంతంగారి భక్తి తత్త్వం:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు విశ్వవిద్యాలయ అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా, సాహిత్య చరిత్రకారుడిగా చాలా మందికి తెలుసు. కానీ, ఆయన గొప్ప భక్తితత్పరుడు. తన పుస్తకాలను శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చిన భక్తుడు. ప్రత్యేకించి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం కాలినడకన కొండమెట్లు ఎక్కి శ్రీవారిని దర్శించుకున్న పరమ భక్తుడు. ఆ సందర్భంగా ఆయన ఆ విశేషాలను ఛందోబద్ధ పద్య కవిత్వంలో కూడా వర్ణించాడు. కేవలం శ్రీ వేంకటేశ్వరస్వామిపైనే కాకుండా ఈశ్వరుణ్ణి కూడా వివిధ సందర్భాలలో ఆయన కీర్తించాడు. శైవ, వైష్ణవ తాత్త్వాలను ఆయన హరిహరనాథతత్త్వంగా భావించిన తీరు

కూడా చాలా చోట్ల కనిపిస్తుంది. ఈ పత్రంలో ఆయన భక్తి తత్వాన్ని వివరించే ప్రయత్నం చేస్తాను.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు పింగళి సూరన వంశానికి చెందినవారు. పింగళి వంశీయులు అత్యధికంగా వైష్ణవులు. అంతేకాదు, సూర్యారాధన భక్తులు కూడా. పింగళి లక్ష్మీకాంతం శ్రీవేంకటేశ్వరస్వామిపై అపారమైన భక్తినే కాకుండా సమస్త దేవతను, దేవుళ్లను ప్రత్యేకంగా ప్రదర్శించేవారనడానికి ఆయన తన పద్య కావ్యాల్లో రాసిన పద్యాలే నిదర్శనం.

అసలు భక్తి అంటే ఏమిటి? భగవంతుడి పట్ల భక్తుడికి కలిగే ఆధ్యాత్మికపరమైన, భక్తిపరమైన అనురక్తి ఎలా కలుగుతుంతో అనేకమంది పరిశోధకులు తెలిపారు. వాటిని పరిశీలిద్దాం. డా. పిల్లలమర్రి రాములుగారు 'తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ' అనే పిహెచ్.డి సిద్ధాంత గ్రంథంలో భక్తిని, వివిధ కవుల రచనల్లో కనిపించే ఆధ్యాత్మిక దృష్టిని గురించి పరిశోధన చేశారు. ఆయన భక్తిని నిర్వచిస్తూ *"భక్తునికి భగవంతునిపట్ల అనురక్తి, ఆత్మరతి ఉండడంతో నిరంతరం ధ్యానించి దేవుడి దయకు పాత్రమవ్వాలని ఆశిస్తాడు. భక్తుడైన వ్యక్తి తన ప్రత్యేకతను, అస్తిత్వాన్ని సంపూర్ణంగా త్యజించి తనను భగవంతునికి సమర్పించుకోవాలని కోరుకోవడమే భక్తి'* అని ('తెలుగులో భక్తి కవిత్వం-సామాజిక విశ్లేషణ',2015:31) తెలియజేశారు.

**4.2.1 అంకితం పద్యాలు – భక్తి తత్వం:**

పింగళి లక్ష్మీకాంతంగారు *'ఆంధ్ర సాహిత్య చరిత్ర',* (1974) *'సంస్కృత కుమార వ్యాకరణం'* (1968) గ్రంథాలను రచించారు. ఈరెండింటినీ శ్రీ వేంకటేశ్వరస్వామిని స్తుతిస్తూ, అంకిత పద్యాలను రచించారు. ఈ గ్రంథాల్ని శ్రీ వేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చారు. ఆ సందర్భంలో ఈ కింది పద్యాల్ని చెప్పారు.

*" శ్రీధరునకు నలమే ల్మం*
*గాధవునకు శేషశైల నాథునకు, సురా*
*రాధిత పదాబ్జునకు, తే*
*జోధవళిత దిఙ్మకునకు, సూర్యాత్మునకున్ "*

*"బాలిశుఁడైన నాకు, నొకపాటి వివేక మొసంగి, గాలికిన్*
*తూలెడు నాకు కాలు నిలఁద్రొక్కు కొనందగుదార్ఢ్యమిచ్చి, వా*
*చాలుఁడనై పొనర్చునపచార సహస్ర శతాపరాధ సం*
*క్షాళనచేసి యేలుకొను స్వామికి నియ్యది యంకితమ్మగున్"*

*" సారతరాంధ్రవాఙ్మయ విశాల జగత్పరిణామ కారణో*
*దార కవీంద్ర కావ్య పురుషార్థ నిరూపిత తత్తదాత్మ సం*

*స్కార విలోక దర్పణ ముఖమ్మిది, యీ చరితమ్ము సాహితీ*
*మేరువులౌ బుధోత్తముల మెప్పుగడించెను మున్నె నీ కృపన్ "*

*" ఇది జనించిన నలువదియేండ్లనుండి*
*సరస సాహిత్య విజ్ఞాన సమత్రమనుచు*
*ఆశ్రయించిన తెలుగు విద్యార్థిలేడు*
*చొచ్చి చూడని తెల్గు వ్యాసుండు లేడు "*

(ఆంధ్ర సాహిత్య చరిత్ర,1974:6)

ఈ అంకిత పద్యాల్లో త్రిమూర్తులతో పాటు శ్రీవేంకటేశ్వరస్వామినీ, సూర్యుడినీ ప్రార్థించిన విధానం పింగళివారి భక్తితత్పరతకు నిదర్శనంగా కనిపిస్తుంది. తనను తాను తగ్గించుకొని, తన తప్పులను తెలుసుకొని వాటిని సరిచేయగలిగిన వాడు భగవంతుడేనని చెప్పడం పింగళివారి వినయానికీ, విధేయతకూ, భక్తి తత్పరతకు ప్రతిబింబంగా ఈ అంకితపద్యాల్లో కనిపిస్తున్నాయి. భగవంతుని కృపవల్లనే చిన్నవాడినైనా తాను మహోన్నతమైన సాహిత్య చరిత్రను రాయడానికి సాహసించానని చెప్పుకున్నారు.

**4.2.2. సంస్కృత కుమార వ్యాకరణం (1968):**

పింగళివారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా ఉన్నప్పుడు ఎం.ఏ తెలుగు విద్యార్థులకు సంస్కృత వ్యాకరణాన్ని బోధించారు. అలా బోధించిన సంస్కృత వ్యాకరణాన్ని సంస్కృత కుమార వ్యాకరణంగా ప్రచురించారు.

ఆయన ఈ గ్రంథం గురించి రెండో ముద్రణ పీఠికలో ఇలా చెప్పుకున్నారు *"విశ్వవిద్యాలయాలలో తెలుగు బి.ఏ, ఎం.ఏ పరీక్షకులకు 'బి' విద్వాన్ పరీక్షకులకు కొద్దిపాటి సంస్కృత వ్యాకరణ పఠనము విధించారు. నా అధ్యాపకత్వం కాలములో ఈ విషయము ప్రత్యక్షంగా గుర్తించి, స్వయముగా ఒక ప్రణాళికను ఊహించి, దాని ప్రకారము ఎం.ఏ విద్యార్థులకు ఒక సంవత్సరములో సంస్కృత వ్యాకరణ ప్రధానాంశములను, తెలుగులో బోధింపగలిగినాను. ఇది శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితమైన గ్రంథముగా వెలువడుచున్నది"* అని (సంస్కృత కుమార వ్యాకరణము,1968:ii) అన్నారు. ఈ గ్రంథ యొక్క అంకిత పద్యాలు ఇలా చెప్పుకున్నారు.

*"శ్రీ కరునకు గళ్యాణ గు*
*ణాకరునకు బాపనాశనాభిఖ్యునకున్*
*లోక త్రయాభి పూజిత*
*సాకార ప్రకృతిపురుష సాయుజ్యునకున్*
*" కొందఱు శివుడన, వేఱొక*

*కొందఱు బాలాజి యనగ గొందఱు హరి, గో*
*విందుండన, మఱికొందఱు*
*ష్కందుండన నవ్వుకొనెడి సర్వేశునకున్ ”*

*“ అంకిత మీ వ్యాకరణము*
*వేంకట శైలాధివాస విశ్వాత్మునకున్*
*శంకావిదూర భక్త శు*
*భంకరునకు శ్రీనివాస పరదేవతకున్ ”*

*“ స్వామి: పరాకు, శేషగిరివాస పరాకు, ప్రసన్న మానసా*
*రామవసంత కోకిల పరాకు, సహస్రఘటాభిషేచనా*
*ర్చా మహాయదర్శన రసప్లుత భక్తజనాంతరంగ వి*
*శ్రామ పరాకు, భూత పరిరక్షణ దీక్ష పరాకు, కేశవా ”*

*“ ఇది నీ కర్పించితి నే*
*కొదవయుఁ దలపెట్టకందు కొందువుగాతన్*
*సదయాంతః కరుణులు కో*
*విదులీయత్నమ్ము గారవింతురు గాతన్ ”*

(సంస్కృత కుమార వ్యాకరణము,1968:iv,v) అని

వ్యాకరణమనేది భాషానిర్మాణానికి సంబంధించినది. దీన్ని ఎంతో శాస్త్రీయంగా చెప్పాలి. అటువంటి వ్యాకరణాన్ని తాను రచిస్తున్నాననీ, దానిలో అనేక సందేహాలు వస్తుంటాయి. అసలు సందేహాల్నే దూరం చేసి శుభాన్ని కలిగించేవాడవు నీవే శ్రీనివాసా... అంటూ తాను ఈ వ్యాకరణాన్ని రాస్తున్నప్పటికీ తనకొచ్చే సందేహాలన్నీ ఆ భగవంతుడే తీర్చి తన చేత ఈ వ్యాకరణాన్ని రాయిస్తున్నాడనే ధ్వని ఈ పద్యాల్లో కనిపిస్తుంది. నిరంతరం తాను శ్రీవేంకటేశ్వరుణ్ణే మనసులో పెట్టుకొని ఈ గ్రంథాన్ని రాస్తున్నాననీ, తనని నడిపించమనీ, మర్చిపోవద్దనీ తనను జాగృతితో నడిపించమని వేడుకుంటూ *'స్వామి: పరాకు, శేషగిరివాస పరాకు....'* అంటూ అద్భుతమైన పద్యాన్ని రాశారు పింగళివారు. అందువల్లనే సహృదయులంతా తన వ్యాకరణాన్ని ఆదరిస్తారనే నమ్మకాన్ని వ్యక్తం చేస్తారు. ఒక శాస్త్రాన్ని రాసేటప్పుడు కూడా భగవంతుడినే స్మరించుకునే అద్భుతమైన విశేషాలీ అంకిత పద్యాల్లో ఉన్నాయి. పింగళివారికున్న గొప్ప భక్తితత్పరతను గుర్తించడానికి ఇంతకంటే నిదర్శనమేమీ ఉండనవసరం లేదేమో.

**4.2.3. పాఠాలు చెప్పేటప్పుడు వ్యక్తమైన పవిత్ర భావన:**

భారతీయ విద్యావిధానంలో గురువు స్థానానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాంటి గురువులు బోధించే ఆశ్రమాలు లేదా, విద్యను అభ్యసించే శిక్షణా ఆలయాలకు ప్రముఖ స్థానముంది. ఆ విధంగా ప్రాచీన కాలం నుంచి నాటి నేటి వరకు భారతీయ సమాజంలో కొనసాగుతున్న విద్య విధానమని స్పష్టంగా కనిపిస్తోంది. ఆ పరంపరనే ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తరగతి గదిని ఒక పవిత్ర భావంతో చూసేవారని అనడానికి ఆయన ప్రత్యక్ష శిష్యులు చెప్పిన ఉదాహరణలే సాక్షాలుగా కనిపిస్తున్నాయి.

వాటిని చూద్దాం. పింగళి లక్ష్మీకాంతంగారు దైవం పట్ల, గురువు పట్ల, తరగతి పట్ల ఎంతో భక్తిని ప్రదర్శించారు. *"గురువుగారికి అధిక అభ్యాసం ఉండేది. అవసరమైనప్పుడు తరగతి బయటికి వెళ్ళి ఆ పని ముగించుకొని వచ్చేవారు. లేదా తరగతిలోని ప్రవేశించేముందే ఆ పని ముగించుకొని కాలి జోడు (చెప్పులు) బయట వదలి తరగతిలోకి ప్రవేశించేవారు. అంటే వారి దృష్టిలో తరగతి ఒక దేవాలయం వంటిది మహాకవుల అక్షరార్చన దేవతార్చన వంటిదేకదా! మమతాదూరులై సోపపత్తికంగా విప్రతిషేధంగా వారు సాహితీ పీఠంలో కవిపుంగవులకు వారివారి స్థానాన్ని నిర్ణయించారు. కవిత్రయం వారిపట్ల వారికున్న భక్తి ప్రపత్తులు ఆయా పాఠాలు విన్న వారికి మాత్రమే తెలుసు"* అని శ్రీ గొడవర్తి సూర్యనారాయణగారు (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక, 'రూపురేఖలు' అనే వ్యాసం,1974: 7,8,) తెలియజేశారు.

దీన్ని బట్టి పింగళివారు బోధించిన పద్ధతిలో ప్రత్యేకతను ఉటంకించారు. ఇక్కడ పింగళివారికి సరస్వతి దేవి పట్ల ఉన్న భక్తి మన కళ్ళకు కనిపిస్తుంది. పింగళి వారు విజయవాడ ఆకాశవాణి రేడియోకేంద్రంలో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. ఆ ఉద్యోగం చేసే సమయంలో పింగళివారు గూడూరి నమశ్శివాయగారి ఇంట్లో ఉండేవారు. పింగళివారి వ్యక్తిత్వాన్ని నమశ్శివాయగారు ఒక వ్యాసంలో కీర్తించారు. ఇక్కడ 'శారదాపీఠం' అనడం ద్వారా గూడూరు నమశ్శివాయగారి ఇల్లును సరస్వతీ దేవితో పోల్చారు. 'శారదా' అనే పదానికి నిఘంటువుల్లో పార్వతీ, దుర్గా, సరస్వతీ అనే పేర్లున్నాయి. *"వారు మా ఇంట నాకు అతిథిగా వుండిన కాలంలో మా ఇల్లు అనేక సాహిత్య గోష్ఠులతో నిజంగా ఒక శారదా పీఠం వలె విరాజిల్లింది. చివరకు వారే ఆ మాట కాస్తా అనేశారు"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక 'శారదా పీఠం' అనే వ్యాసం,1974:97) పేర్కొన్నారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారికి విద్య పట్ల, దైవం పట్ల ఉన్న ఆధ్యాత్మిక దృక్పథం స్పష్టంగా కనిపిస్తోంది. అలాగే ఆయనకు వివిధ సమస్యలు ఎదురైనప్పుడు శ్రీవేంకటేశ్వర స్వామిని, ఇతర దేవుళ్లను ప్రార్థించేవారని పైన తెలిపిన అభిప్రాయాలే నిదర్శనం.

#### 4.2.4. శ్రీ వేంకటేశ్వర స్వామి పై ప్రత్యేక భక్తి:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు స్వతంత్రంగా ‘ఆత్మలహరి’(1964) అనే ఖండకావ్యాన్ని, రచించారు. ఆయన అందులో ‘పర్వతారోహణము’ ‘సవిత’, ‘దైవస్తుతి’ అనే శీర్షికలతో శ్రీ వేంకటేశ్వర స్వామిని, సూర్య భగవానుని స్తుతిస్తూ కొన్ని పద్యాలను రచించారు.

#### 4.2.4.1. పర్వతారోహణము:

ఆయన తిరుపతి యాత్రలు చేస్తూ వివిధ సందర్భాలలో తనకు కలిగిన స్వీయ అనుభవాలు, ఊహల ద్వారా శ్రీ వేంకటేశ్వర స్వామిపై తనకు గల భక్తిని ప్రకటించారు. ఆ పద్యాల ఆధారంగా శ్రీ వేంకటేశ్వర స్వామిపై తనకు ఉన్న భక్తి ప్రవృత్తులను ఈ కింది పద్యాల్లో తెలియజేశారు.

“వసుమతి నెల్లచో సపరివారముగా విహరించు నిందిరా
రసికున కాంధ్ర కానన ధరాధరసానువిహార లీల
పొసగగ బోలు, నాంధ్రకవితోక్తుల జేరికమై వినన్ ముదం
బెసగగ బోలు, కోరి వసియించెను శేషగిరిన్ బ్రసన్నుడై ”

(ఆత్మలహరి:45)

#### 4.2.4.2. సవిత:

పింగళి వారి ‘ఆత్మలహరి’ అనే ఖండకావ్యంలో ‘సవిత’ అనేది ఒక ఖండిక పేరు. సవిత అంటే ‘సూర్యుడు’ అనే అర్థం నిఘంటువుల్లో ఉంది. పింగళి లక్ష్మీకాంతం గారు ‘సవిత’ అనే శీర్షికలో మూడు పద్యాల్లో సూర్య దేవుణ్ణి వర్ణించారు. అందులో ఒక పద్యాన్ని పరిశీలిద్దాం.

*“ ముకుళితమైన యీ భువనమున్ వికసింపగ జేయు జీవశ*
*క్తికి నిలయమ్ము లౌ సవితృ దివ్య సహస్ర మయూఖముల్ తమో*
*వికృతములైన మా హృదయ వీధుల సాగి పవిత్రతా నిరో*
*ధకము లడంచి పావన సుధాపరిపూర్ణములన్ పొనర్చుతన్ ”* (ఆత్మలహరి:47)

అని ఈ పద్యంలో ఈ ప్రపంచాన్ని వికసింపచేయడానికి, జీవశక్తిని సూర్య భగవానుడు చీకటిని పోగొడుతూ సహస్ర కిరణాలతో ప్రపంచాన్ని దీప్తిమంతం చేస్తుంది. అటువంటి సూర్యుడు తమ వీధుల్లో పయనిస్తూ అపవిత్రతను పోగొట్టి అమృతం వంటి పవిత్రతను, పుణ్యాన్ని కలగజేస్తున్నాడని సూర్యుణ్ణి వర్ణిస్తాడు కవి. సూర్యుణ్ణి వర్ణించడంలో మొదటి పద్యంలో ఆయువు, తేజాన్ని, వరాన్ని,ఇచ్చే గొప్ప దాతగా వర్ణిస్తాడు. సూర్యోదయం మన శరీరంపై తాకితే విటమిన్ డి శరీరానికి అందుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అందుకనే చిన్న పిల్లలు జన్మించిన తరువాత కొన్నాళ్ళ పాటు ఉదయం పూట, సాయంత్రం పూట సూర్య కిరణాలలో పెడతారు. అది ఆ పిల్లలకు ఆయువును ఇచ్చి అంటే ప్రాణాన్ని ఇచ్చే గొప్ప చర్య. ఈ విధంగా సూర్యుణ్ణి ఒక

దైవంగా భావించడంలో ఎన్నో ఆరోగ్య రహస్యాలున్నాయని ఈ పద్యాలు ద్వారా కవి ధ్వనింపజేస్తున్నారు. ఈ పద్యాలు పైకి సూర్యుణ్ణి వర్ణించే భక్తి ప్రభావంలా అనిపించినా మానవ శక్తిని కలిగించే శాస్త్రీయమైన అనేక విషయాల్ని సూర్యుడు మానవులకే కాకుండా సమస్త జీవకోటికి అందిస్తున్నాడని ఈ పద్యాల ద్వారా స్ఫురింపజేస్తున్నాడు కవి పింగళి లక్ష్మీకాంతం.

### 4.2.4.3. దైవస్తుతి:

పింగళి లక్ష్మీకాంతంగారు 'ఆత్మలహరి' అనే ఖండకావ్యాన్ని రచించారని ఇంతకు ముందే చెప్పుకున్నాం. అందులో ఒక ఖండిక పేరే 'దైవస్తుతి'. ఈ దైవ స్తుతి ఖండికలో శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించారు. దీనితో పాటు ఆయన హరిహరనా తత్వాన్ని తెలియజేసే విధంగా ఒక పద్యాన్ని కూడా రచించారు. ఆ పద్యాన్ని చూద్దాం.

*" ఈవే రాముడ వీవే కృష్ణుడవు నీవే వాసుదేవుండవున్*
*ఈవే శంభుడ వీవే పార్వతివి నీవే కార్తికేయుండవున్*
*నీవెవ్వండవౌ నిర్ణయింపగల జ్ఞానిన్ జూడగాబోమయా*
*దేవా! తీర్పతి వేంకటేశ్వర! నమస్తే! సర్వదేవాత్మకా ! "* (ఆత్మలహరి:48) అని

శ్రీవేంకటేశ్వరస్వామివారిని సందర్భం వచ్చినప్పుడల్లా లోకంలోని అనేక పేర్లతో ఉన్న దేవుళ్లందరి రూపమూ ఆయనేనని పింగళివారు అభివర్ణిస్తుంటారు. ఈ పద్యంలో కూడా త్రేతాయుగంలో శ్రీరాముడిగా ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడుగా పిలిచినా కలియుగంలోని శ్రీవేంకటేశ్వరుడే అన్ని రూపాల్లోనూ ఉన్నాడని, ఆయనే ఈశ్వరుడుగా, కుమారస్వామిగా కూడా ఉన్నాడనీ, ఆయన్ని ఈ రూపంలోనే ఉన్నవాడు మాత్రమే దైవమనే భావాన్ని చెప్పడానికి తాను అంత గొప్పజ్ఞానిని కాదనీ చెప్తాడు పింగళివారు.

*" కోరితినేని యిచ్చెదవు కోటికి నే పడగెత్త జాలు బం*
*గారము, కాదు కూడదని కట్టడ చేసిన నిత్తు వేదియేన్,*
*కోరిక తీరి యాశను రగుల్చునెకాని మనఃప్రశాంతికిన్*
*కారణ మౌట కల్లయని కల్గొని రెప్పడొ పూర్వు లచ్యుతా! "* (ఆత్మలహరి:48)

అని మానవుడి నిజమైన పశ్చాత్తాపం, వాస్తవ స్థితి తన తప్పుని ఒప్పుకునే పరిస్థితి తన జీవిత చరమాంకంలో కలుగుతుంది. అది కొంత మందిలో లేకపోతే తన జీవిత చరమాంకంలోనైనా కనిపిస్తుంది అది ఆ జీవుడికి భగవంతుడుకి మాత్రమే తెలుస్తుంది. అందువల్ల ఈ పద్యాలు నిజంగా ఆణిముత్యాలని స్పష్టంగా చెప్పవచ్చు.

### 4.3. నేను ఖండిక:

పింగళి లక్ష్మీకాంతంగారు 'ఆత్మలహరి' అనే ఖండకావ్యంలో ఒక ఖండిక పేరే 'నేను'(స్వీయ కథనం). దీనిలో ఆయన వ్యక్తిత్వంలో భాగంగా భగవంతుని పట్ల ఆయనకున్న

అచంచలమైన భక్తి తెలుస్తుంది. మరోవైపు ఆయన నిత్యం ఆధ్యాత్మీక భావాలను ప్రదర్శించేవారని ఆయన రాసుకున్న పద్యాలను బట్టి తెలుస్తుంది. దీని వలన ఆయనలో సాత్వికగుణాలు అలవడి ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగించారనీ, అది వారికి మనోబలాన్ని, ఆత్మవిశ్వాన్ని కలిగించాయని చెప్పవచ్చు. కనుక అలాంటి పద్యాన్ని ఒకదాన్ని చూస్తే ఆయనకు శ్రీ వేంకటేశ్వర స్వామిపై ఉన్న భక్తి తెలుస్తుంది.

*"పిలిచిన పలుకని దేవున*

*కలిగెద ప్రియురాలు ప్రియుని కలిగిన రీతిన్*

*ఎలుగెత్తి దేవు చెవిబడ*

*పిలువగలేనైతి నన్ను విజ్ఞత లేమిన్"* (ఆత్మలహరి:78) అని ఈ పద్యంలో పింగళి వారి ఉదాత్త భక్తి కనిపిస్తుంది. ఇందులో తనను నాయికగా భావించి, భగవంతుని నాయకుడిగా అనుభూతి చెంది తన మధుర భక్తిని ప్రకటించుకున్నారు.

**4.4. ప్రణయ లేఖల్లో మధుర భక్తి:**

'ఆత్మలహరి' ఖండ కావ్యంలో 'ప్రణయ లేఖలు' అనేది ఒక ఖండిక పేరు. దీనిలోని పద్యాలు మధుర భక్తి కనిపిస్తుంది. అలాంటి పద్యాన్ని పరిశీలిద్దాం.

*" శ్రీరాముని దర్శించితి*

*వా? రాముని నామకోటి యర్పించితివా?*

*ఆ రాము చెంత సీతమ*

*గారాముగ నిన్ను జేరగాదీసినదా?"* (ఆత్మలహరి:70) అని ఈ పద్యంలో తనను శ్రీరామునిగా, తన భార్యను సీతమ్మగా పోల్చుకున్నారు. మరో విధంగా తనను ప్రియగాలిగాను, దేవుణ్ణి ప్రియునిగాను భావించి సంబోధించారు. ఈ మధుర భక్తి సంప్రదాయ రీతులు మిగిలిన మతాలలో కన్నా వైష్ణవమతంలోనే కనిపిస్తుందని కొందరు పరిశోధకులు భావిస్తున్నారు.

దీన్ని పింగళి వేంకటకృష్ణారావుగారు ఇలా తెలిపారు. *"మధుర భక్తి సంప్రదాయం ఎక్కువగా వైష్ణవంలో కనపడుతుంది. భక్తుడు భగవంతుని రూపాన్ని పొందటాన్ని వైష్ణవంలో సారూప్యముక్తి ఈ రమణి ఒక్క క్షణం పాటు ఆ అనుభూతిని కలిగింది. మరలమరల అదే అనుభూతి కోసం ఆరాటమే మిగిలిన పద్యాల్లో ఉంది"* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:288) తెలియజేశారు. దీన్ని బట్టి చూస్తే పింగళివారు ఆధ్యాత్మికతలో మధుర భక్తి దృక్పథం కూడా అంతర్లీనంగా కొనసాగిందని స్పష్టంగా కనిపిస్తుంది.

### 4.5. మధుర పండిత రాజము(1962):

పింగళి వారు రాసిన 'మధుర పండిత రాజము' అనే కావ్యాన్ని కూడా సూర్య భగవానుని స్తుతిస్తూ, గంగానదిని స్మరిస్తూ అనేక పద్యాలను రచించారు. ఆయన రచనలను కాలక్రమంలో శ్రీ వేంకటేశ్వర స్వామికి, గురువుకు, భార్యకు మాత్రమే అంకితమిచ్చాడు. ఆయన రాసిన 'మధురపండిత రాజము' అనే కావ్యాన్ని సూర్య స్తుతితోనే ప్రారంభించారు. దీన్ని బట్టి ఆయన భక్తి తత్త్వాన్ని అవగాహన చేసుకోవచ్చు. అందులో 'తేజోలహరి' అనే ఖండికలో సూర్యుణ్ణి వర్ణిస్తూ ప్రార్థించారు.

*" ఉదయాద్రిశిఖరసానూద్ధూత ధాతుధా*
*రామజ్జనక్రీడ రక్తి నొంది*
*జంభారి భద్రేభకుంభస్థలీసాంద్ర*
*సిందూర రజముతోఁజెలిమి చేసి*
*త్రిదశకన్యాకరార్పిత హేమజలజాత*
*బలిపుష్పపరిచితిన్ బ్రౌఢి మెఱసి*
*దరహసితాంభోజ దళ దళాంతరరాగ*
*సంగ్రహోత్కంఠచే జాజువాఱి*
*యబ్జజాండఘటీబహిరంతరములఁ*
*దళుకు జలపోత గావించి వెలుఁగు నవి గొ*
*నవన వారుణభాను భానువులు ప్రార్థ*
*నాంజలి ఘటింపుఁ డభ్యుదయమ్ము లొసఁగు "*

(మధుర పండిత రాజము:1) అని

సూర్యప్రార్థనతో తేజోలహరి ఖండకావ్యాన్ని ప్రారంభిస్తారు పింగళివారు. సూర్యుడు ఉదయించేటప్పుడు కొండపై కనిపించినప్పుడు కిరణాలు భూమిపై పడవు. అప్పుడు సూర్యదంతా ఒక ముద్దలాగా ఉంటాడు. సాధారణంగా తూర్పు దిక్కుకు ఐరావతం అధిపతి. కనుక సూర్య బింబాలు సింధూర వర్ణంలో దాని తల మీద ఎర్రగా పడ్డాయని అంటున్నారు కవి. తరువాత సూర్య కిరణాలు బారెడు పైకొచ్చి సరోవరాలలో ఉన్న బంగారు పుష్పాలు వికసించి శ్వేత వర్ణంలో ఆ పద్మాలు కనిపిస్తాయి. ఇక్కడ సూర్యుడు అరుణ వర్ణం, తెలుపు వర్ణం, కషాయ వర్ణాల్లో కనిపించడం వలన ఒక విశేషమనీ తెలుస్తుంది. ఈ మధుర పండిత రాజము కావ్యంలో సూర్యుణ్ణి, గంగానదిని దీని మూలాల్ని స్ఫురిస్తూ భగవంతునికి చెందిన భక్తి భావాల్ని తెలపడం మరొక విశేషం. ఈ కావ్య వైశిష్ట్యాన్ని పింగళి వేంకటకృష్ణారావుగారు ఈ విధంగా అన్నారు *"మధుర పండిత రాజము పింగళి వారి కుల దైవమైన సూర్య స్తుతులతో ప్రారంభమై గంగాలహరులపై తేలి భక్తి కనపడుతుంది. వస్తు పరంగా చూస్తే కర్మ సాక్షి అయిన సూర్యుని*

*మహిమా విలాసాలతో రమణీయమైన వృత్తాంతం మధురపండితరాజము"* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము,2013:232) తెలిపారు. దీన్ని బట్టి 'మధురపండితరాజము'లో పింగళివారు అనుసరించిన భక్తితత్పరత కనిపిస్తుందనీ పింగళి కృష్ణారావుగారు అన్నారు.

**4.6. అవధానాలలో భక్తితత్త్వం:**

తిరుపతి కవులలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారి పేరు తెలియనివారుండరు. పింగళి లక్ష్మీకాంతం చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారికి ప్రియమైన శిష్యుడు. ఆ కాలంలో తిరుపతి కవులు చేయని అవధానాలు లేవు. ఆ అవధానాలలో పింగళి–కాటూరి కవులు పాల్గొని తిరుపతి కవులకు అండదండలందించారు. ఈ నేపథ్యంలోనే పింగళి వారు తమ గురువు చెళ్లపిళ్ల వారితో కలిసి అవధానాలు చేశారు. ఆ సమయంలో అవధానాలను నిర్వహించేటప్పుడు సాధారణంగా తమ ఇష్టదైవాన్ని స్తుతించడం సంప్రదాయంగా కనిపిస్తుంది. ఆ కోవలోను పింగళివారు తన ఇష్టదైవం శ్రీవేంకటేశ్వరుణ్ణి తన అవధానం విజయవంతంగా పూర్తిచేయమని ప్రార్థిస్తూ ఇలా చెప్పారు.

*"శ్రీ వేంకటేశ పదయుగ*
*సేవా తత్పరత మమ్ము శ్రీఘ్రుంబ జయ*
*శ్రీవరియింపం జేయున్*
*గావుత యని కోరువాడ కాగలదనుటలన్ "*

(పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:346)

**4.7. శ్రీ పద్మావతీ ప్రార్థనా మందిరం నిర్మాణం:**

పింగళివారు తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా నాలుగు సంవత్సరాలు కొనసాగారు. వీరు తిరుపతిలోనే నివాసాన్ని ఏర్పరుచుకున్నారు. ఆ సమయంలో ఆ సంపతులిద్దరు శ్రీవేంకటేశ్వర స్వామిని భక్తితో కొలిచేవారు. ఆ పింగళివారి భార్య లక్ష్మీనరసమ్మగారు తిరుపతిలో శ్రీ పద్మావతి ప్రార్థన మందిరాన్ని నిర్మించారు. ఈ నిర్మాణాన్ని తెలిపే పద్యాన్ని ఆయన 'ఆత్మలహరి' అనే ఖండకావ్యంలో 'లక్ష్మీ నిర్గమనము' అనే ఖండికలో ఒక పద్యంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు.

*" తిరుపతి మహి ళాభవనము*
*శరీర సౌఖ్యంబు పోసి స్థాపించితివా*
*తిరుపతినాథుని సన్నిధి*
*స్థిరకీర్తిధ్వజము నీ కదే లోకమునన్ "* (ఆత్మలహరి:72)

**4.8. సాహిత్య చరిత్రలో వ్యక్తమైన భావనలు:**

పింగళివారు తన ఆంధ్రసాహిత్య చరిత్రలో వివిధ కవులు రాసిన కావ్యాలలో లేదా కవుల భక్తికి సంబంధించిన శైవ, వైష్ణవ మతాల విశేషాలను ప్రస్తావించారు. నన్నయ, శివకవులు, తిక్కన, ఎర్రన, నాచన సోమన, శ్రీనాథుడు, పోతన, అన్నమయ్య, మొల్ల, ధూర్జటి, వేమన,

రామదాసు, క్షేత్రయ్య, తాళ్ళపాక కవులు, శతకాలు మొదలైన కవుల రచనల్లో ప్రతిఫలించే ఆధ్యాత్మిక కోణాలను ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. దీన్ని బట్టి కూడా ఆయన భక్తి తత్పరతను కలిగి ఉన్నారని స్పష్టమౌతుంది.

### 4.9. పింగళి వారి శతకాల్లో భక్తితత్త్వం:

ఆయన శతక ప్రక్రియలో రెండు శతకాలను రాసినట్లు పింగళివారి జీవిత చరిత్రను రాసిన గూడూరి నమశ్శివాయ, పింగళి సూర్యసుందరం, అలాగే పింగళి వారిపై పరిశోధనలు చేసినవారు చెప్పారు. దీన్ని బట్టి శతక కవిగా పింగళివారు ప్రసిద్ధులనీ స్పష్టమౌతోంది. పింగళి, కాటూరి కవులు జంటగా *'ఆంజనేయస్వామి'* శతకాన్ని మౌఖికంగా చెప్పారే కానీ, గ్రంథస్థం చేయలేకపోయారు. పింగళివారు ఒక్కరే శ్రీవేంకటేశ్వరస్వామి శతకాన్ని రచించారనీ ఆ రచన కూడా కాలక్రమంలో గ్రంథస్థం కాలేదని పరిశోధకుడు గొల్లపూడి ప్రకాశరావుగారు అభిప్రాయపడ్డారు. పింగళివారు నాటకాల్లో శ్రీకృష్ణుని పాత్రను పోషించారు. పింగళి లక్ష్మీకాంతం, లక్ష్మీనరసమ్మ దంపతులు తిరుపతిలో శ్రీపద్మావతీ ప్రార్థనామందిరాన్ని నిర్మించారు. ఈ విధంగా పింగళి లక్ష్మీకాంతంగారు పలు సందర్భాల్లో, తన రచనల్లో, సంభాషణల్లో భక్తి పారవశ్యాన్ని కనబరుస్తూ జీవితమంతా ఆధ్యాత్మిక దృక్పథాన్ని ప్రదర్శించేవారనీ తెలుస్తోంది.

ఈ విషయాల్ని డా. కాకర్ల వెంకటరామనరసింహంగారు ఈ విధంగా చెప్పారు. *"పింగళి లక్ష్మీకాంతంగారు గొప్ప ఆస్తికులు: శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతిదినం భక్తిశ్రద్ధలతో ఆరాధించేవారు. 'శ్రీవేంకటేశ చరణౌ ప్రపద్యే' అనే మకుటం గల వేంకటేశ్వర స్తనాన్ని నిత్యం పఠించేవారు. వారి పూజా విధానం ముఖ్యంగా భగవంతుణ్ణి అలంకరించడానికి పరిమితమై ఉండేది. 'అలంకార ప్రియో హరిః విష్ణువు అలంకార ప్రియుడు కాబట్టి ఆయన్ని పుష్పాదులచేత అలంకరించడం ప్రధానం అని చెప్పేవారు"* అని (పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 'మరపురాని గడియలు' అనే వ్యాసం,1974:40) తెలియజేశారు. దీన్ని బట్టి పింగళివారికి ఆధ్యాత్మిక దృష్టి ఉందనే విషయాన్ని కాకర్లవారు తెలియజేశారు.

ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని, ఆయన రాసిన రచనలను కనుక పరిశీలిస్తే ఆయన తరచు తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామిని, సూర్యుణ్ణి, ఇతర దేవుళ్లను స్మరించుకునేవారనీ మనకు అవగతమౌతోంది. కనుక పైన తెలిపిన పింగళివారి సాహిత్యాంశాలను పరిశీలించడం వలన పింగళివారి ఆధ్యాత్మిక దృక్పథం మనకు స్పష్టంగా కనపడుతుంది. భక్తితత్పరతను భగవంతునితో పింగళివారు కింది పద్యంలో చెప్పుకున్న జీవునివేదనను, జీవాత్మను, పరమాత్మను ఇక్కడ ప్రస్తావించడం సముచితమని భావిస్తున్నాను.

*" భావంబున కోరుదు భ*
*వ్యావేశుడనైన సమయమందున నా యీ*

*జీవుడు నిర్జరతటినీ*

*ప్లావితుడయి భానుమండలము చొరబారన్ '* (గూడూరి నమశ్శివాయ, పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర:88) ఇంత భక్తి పరుడైనప్పటికీ ఒక శాస్త్రకారుడిగా తన అభిప్రాయాన్ని చెప్పేటప్పుడు నిష్కర్షగా వివరించడం పింగళి లక్ష్మీకాంతంగారిలో కనిపించే ఒక విశిష్టగుణమని చెప్పవచ్చు. తర్వాత 'సాహిత్య విమర్శకుడుగా పింగళి లక్ష్మీకాంతం' అనే అధ్యాయంలో విమర్శకుడుగా పింగళివారి ప్రత్యేకతను రాబోయే అధ్యాయంలో వివరిస్తాను.

ఐదవ అధ్యాయం

# సాహిత్య విమర్శకుడుగా పింగళి లక్ష్మీకాంతం

## 5.0 సాహిత్య విమర్శకుడు:

పింగళి లక్ష్మీకాంతంగారు సహృదయ విమర్శకులు, పరిశోధకులు. ఆయన తన రచనల్లోను, తన ప్రసంగాల్లోను ఈ అంశాలను వెల్లడించారు. ఈ అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్యవిమర్శను విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను. ఈయన ***గౌతమ వ్యాసములు*** (1952), ***సాహిత్య శిల్ప సమీక్ష*** *(*1966), ***ఆంధ్ర సాహిత్య చరిత్ర*** (1974,2019), ***తెలుగు విజ్ఞాన సర్వస్వం***లో రాసిన వ్యాసాలు, ఇతర రచనలకు రాసిన ***పీఠికలను***, అభిప్రాయాలు, ఆయన వివిధ గ్రంథాలను పరిష్కరించినప్పుడు ఆయన రాసిన పీఠికలలో సాహిత్యవిమర్శ తీరుతెన్నులను గమనించవచ్చు. పింగళి లక్ష్మీకాంతంగారి పేరు చెప్పగానే ఆయనను ఒక సాహిత్యవిమర్శకుడిగా, ఒక పరిశోధనకుడిగా సాహిత్యలోకం భావిస్తుంది. అందువల్ల ఆయన సాహిత్యవిమర్శను, విమర్శపద్ధతుల్ని ఈ అధ్యాయంలో విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

## 5.1 విమర్శకుడిని గుర్తించే అంశాలు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు చిరకాలం పాటు విశ్వవిద్యాలయ స్థాయిలో బోధించేవారని ఇంతకు ముందే తెలుసుకున్నాం. అలా పాఠాలను బోధిస్తున్నపుడు కవికాలాదులను నిర్ణయాలు, జన్మస్థల విషయంలో వివాదాల నిర్ణయాలు, ఆ కవి రాసిన రచనల నిర్ణయం వంటి కావ్య వైశిష్ట్యం మొదలైన విషయాలను బోధించేటప్పుడు కేవలం వివిధ పుస్తకాలలో ఉన్న విషయాలను వివరిస్తే సరిపోదు. వాటికి తనదైన నిర్ణయాన్ని కూడా ప్రకటించడం అవసరం. అప్పుడు మాత్రమే స్నాతకోత్తరస్థాయిలో విద్యార్థులు సంతృప్తిపడతారు. ఒక వేళ ఆ విద్యార్థిని, విద్యార్థులు ఆ తరగతిలో అడగకపోయినా తర్వాత వచ్చిన వాటి గురించి అడుగుతారు. అప్పుడైనా తన అభిప్రాయాన్ని చెప్పక తప్పదు. అలా విద్యార్థులకు పాఠాలను బోధించేటప్పుడు, సాహిత్య చరిత్రలోని అనేక అంశాల పట్ల పింగళి లక్ష్మీకాంతంగారు తన నిర్ణయాలను వెలిబుచ్చారు. ఆ నిర్ణయాలే తర్వాత కాలంలో *'ఆంధ్ర సాహిత్య చరిత్ర'* గా(1972) పుస్తకరూపంలోకి వచ్చాయి. అందువల్ల 'ఆంధ్ర సాహిత్య చరిత్ర'లో, 'సాహిత్య శిల్ప సమీక్ష'లో (1966) పింగళి లక్ష్మీకాంతంగారి విస్తృతమైన అధ్యయనంతో పాటు, ఆ సాహిత్యవిమర్శ పట్ల

ఆయన చేసిన కృషిని కూడా గమనించాల్సిన అవసరం ఉంది. అలాగే ఆయన రాసిన 'సాహిత్య శిల్ప సమీక్ష' (1966) 'గౌతమ వ్యాసములు' (1952) ఇతర పీఠికలు మొదలైన రచనల్లో కూడా ఆయన సాహిత్య విమర్శను గమనించవచ్చు. ఈ అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతంగారి విమర్శ స్వరూపాలను, స్వభావాలను ఆయన పాటించిన వివిధ విమర్శపద్ధతుల్ని కూడా సమన్వయించే ప్రయత్నం చేస్తాను.

**5.2. సాహిత్య విమర్శ నిర్వచనాలు (పాశ్చాత్యులు):**

సాహిత్యవిమర్శకు సంబంధించిన నిర్వచనాలను పాశ్చాత్యులు తమదైనశైలిలో తమ అభిప్రాయాలను ఈ కింది విధంగా వెలుబుచ్చారు. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు తన 'ఆంధ్రసాహిత్య విమర్శపై ఆంగ్ల ప్రభావం' అనే గ్రంథంలో వివిధ విమర్శ పద్ధతులను శాస్త్రీయంగా వివరించారు.

టి.ఎస్.ఇలియట్ Eliot defines criticism as, "the commentation and exposition of works of art by means of written words "Criticism always has one and only one defmitie end, and that end is, "elucidation of works of art and the correction of taste." In his essay The Frontiers of Criticism, he further explains the aim of criticism as, "the promotion of understanding and enjoyment of literature." (కళారూపాల్ని అక్షరరూపంలో వ్యాఖ్యానించేదీ, వివరించేది విమర్శ).

హడ్సన్ Criticism may be regarded as having two different functions – that of interpretation and that of judgment. It is indeed true that in practice these two functions have until our own time been generally combined, since themajority of critics, while conceiving judgment to be the real end of all criticism, have freely employed interpretation as a means to that end. (విమర్శ వస్తురీత్యా తైలాన్ని తెలపడం, గుణగణాల్ని వ్యాఖ్యానించేది.).

ఐ.ఎ.రిచర్డ్స్ ''criticism as i understood it is an endeavour to descriminate between experience ab to eavalate them'' (అనుభూతుల తారతమ్యాలన్ని, నివేదించి వాటి విలువల్ని, అంచనా వేసేది విమర్శ.)

**5.2.1. సాహిత్య విమర్శ లక్షణాలు:**

కోరాడ రామకృష్ణయ్యగారు తన సారస్వత వ్యాసములు గ్రంథంలో *'సాహిత్య విమర్శనా పద్ధతులు'* అనే వ్యాసాన్ని రాశారు. దీనిలో కవి జీవితం కొంతైనా తెలిసి ఉంటే అతని కావ్యాన్ని

బాగా అర్థం చేసుకోవచ్చు అనేక విషయాల *గురించి* చెప్తూ "*కవి గ్రంథములను అందలి విశేషాలను గ్రహింపవలయునన్నచో ఆ కవి జీవితము మనకు కొంత ఉపయోగపడుతుంది.*" అని అన్నారు. ఈ వ్యాసం చివరిలో విమర్శ విధానం గురించి, ఆయన ఇచ్చిన విమర్శ లక్షణాలను పరిశీలిస్తే ఆయన విమర్శ పట్ల చూపిన ఔన్నత్యం తెలుస్తుంది. .

1.విమర్శయనగా దోషారోపణ కాదని తేలుచున్నది. అయినను ఆ గ్రంథకర్త కుకవి యని పరిగణింపబడునేమోయను భయముచే దోషములను దోషములని చెప్పుటకు భయపడ గూడదు.

2.గ్రంథంలో లేనియౌన్నత్యమును నొక కావ్యమునం దున్నదని చెప్పచు జనులను మోసపుచ్చరాదు.

3.ఉన్న గుణములను గణన చేయకయుండరాదు "గ్రంథంలో ఉన్న మంచిని విస్మరించకూడదు అని అర్థం అని కోరాడ రామకృష్ణయ్యగారు విమర్శ లక్షణాల గురించి తన అభిప్రాయాలను వెల్లడించారు.

### 5.2.2. సాహిత్య విమర్శ పద్ధతులు:

సాహిత్య విమర్శ, లక్షణాలగురించి, విమర్శ పద్ధతుల గురించి అనేకమంది వివిధ రకాలుగా వివరించారు. ప్రముఖ పరిశోధకులు, విమర్శకులు 'కోరాడ రామకృష్ణయ్య'గారు తెలుగు సాహిత్య విమర్శకు సంబంధించిన విమర్శ లక్షణాలను పేర్కొన్నారు. ఆయన రచించిన '*సారస్వత వ్యాసములు*' అనే విమర్శ వ్యాసాల్లో 'విమర్శ పద్ధతులు' అనే వ్యాసంలో ఆయన విమర్శ గురించి చెప్పిన అభిప్రాయాలను ఈ విధంగా చేప్తూ "*కవి జీవితం కొంతైనా తెలిసి ఉంటే అతని కావ్యాన్ని బాగా అర్థం చేసుకోవచ్చు అనేక విషయాల గురించి కవి గ్రంథములను అందలి విశేషాలను గ్రహింపవలయునన్నచో ఆ కవి జీవితము మనకు కొంత ఉపయోగపడుతుంది.*" అని ఆ వ్యాసం చివరిలో విమర్శ విధానం గురించి ఆయన ఇచ్చిన ముగింపు ఆయన ఔచిత్య దృష్టికి నిదర్శనంగా చెప్పవచ్చు. అదే గ్రంథంలో ఆయనే విమర్శ పద్ధతుల గురించి కూడా చర్చించారు. ఆయన విమర్శ అంటే ఏమిటో చెప్తూ " *విమర్శయనగా దోషారోపణ కాదని తేలుచున్నది. అయినను ఆ గ్రంథకర్త కుకవి యని పరిగణింపబడునేమోయను భయముచే దోషములను దోషములని చెప్పుటకు భయపడ గూడదు. గ్రంథంలో లేనియౌన్నత్యమును నొక కావ్యము నందున్నదని చెప్పచు జనులను మోసపుచ్చరాదు. ఉన్న గుణములను గణన చేయకయుండరాదు* " అని (కోరాడ రామకృష్ణయ్య, శతజయంతి సంచిక, 1992, పుట: 240) కోరాడవారు చెప్పిన విమర్శ యొక్క మౌలిక లక్షణాలను ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారు పేర్కొన్నారు.

'విమర్శ' అనే పదానికి 'సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ' అనే పరిశోధనా గ్రంథంలో డా ఎస్. ఎస్ నళినీగారు కింది విధంగా నిర్వచనాలను తెలియజేశారు.

1. సాహిత్య రచనలను హేతుబద్ధంగా చర్చించడం.

2. రచనలను వివరించడమూ, సమర్థించడమూ, వ్యతిరేకించడమూ, విశ్లేషించడమూ, అంచనా కట్టడమూ వంటి పనుల్ని విమర్శగా భావిస్తారు.

3. విమర్శ అనే మాటకి తప్పులెన్నడం అనే అర్థం. వాడుకలో ఉన్నా, దీనికున్న అసలు అర్థం ఒక వస్తువు లేదా ఒక విషయాన్ని అన్ని విధాలుగా పరిశీలించి దాని మూల స్వభావాన్నీ, స్వరూపాన్నీ వివరించే ప్రయత్నం చేయడం. అంటే ఆ వస్తువు లేదా విషయానికి సంబంధించిన తీర్పుగా భావించవచ్చు. ఈ విధంగా చెప్పే తీర్పులో, తీర్పు చెప్పే వ్యక్తి పెరిగిన సామాజిక వాతావరణం ద్వారా ఆ ఏర్పడ్డ అభిప్రాయాలు ప్రతిబింబిస్తాయనే అభిప్రాయం ఉంది. అయితే విమర్శ వీలయినంతవరకు వస్తుగతంగా ఉండడం ఆశించ దగ్గ విషయం. అయినా విమర్శ అనేది విమర్శకుడి సిద్ధాంతావగాహనను బట్టి మారుతూ ఉంటుందని కూడా గమనించవచ్చు.

4. విమర్శలో అనేక రకాల పనులు జరుగుతాయి. ప్రత్యర్థుల నుంచీ సమర్ధనాయ ప్రక్రియాపరంగా రచనలను వర్గీకరించడం. శైలీ పరిశీలనా, ఇతర రచనలతో పోల్చి చూడడమూ, పాఠకులపై ఒక రచన చూపగల ప్రభావము: సాహిత్యాన్ని అంచనా కట్టేందుకు ఉపకరించే సూత్రాల ప్రతిపాదనా మొదలయిన అనే రకాల పనులు విమర్శ కిందికి వస్తాయి.

5. విమర్శ అంటే సాహిత్య విలువలు గల రచనలను పరిశీలించడమే గానీ, మామూలుగా దేన్నిబడితే దాన్ని తప్పు లెన్నడం మాత్రమే కాదనీ, విమర్శకులు భావిస్తారు.

6. ఒక రచన ఎందుకు బాగుందో దాన్ని ఎందుకు చదవాలో కూడా కొంతమంది విమర్శకులు చెబుతూ ఉంటారు.

**5.3. గ్రంథ పరిష్కరణ విమర్శ:**

దీనిని విమర్శకులు అనేక రకాలుగా నిర్వచించారు. ఒక రచనకి ఉన్న అనేక ప్రతులను తీసుకుని వాటిలో అనేక విషయాలతో పరిశీలించి అసలు ప్రతి ఏదో నిర్ణయించడానికి చేసే విమర్శ గ్రంథపరిష్కరణ విమర్శ అంటారు.

1. రచన రాతప్రతి దశ నించీ అచ్చయిన దశకి చేరేప్పటికి, ఆ రచనలో వచ్చిన మార్పులూ, చేర్పులూ గురించి, రచయిత ఉద్దేశించిన అర్థాల గురించి విమర్శకులు పరిశీలించాలని చెప్పే విమర్శనా పద్ధతి.

2. ఒక రచనను రచయిత చిత్తు ప్రతిరూపంలోనే విడిచి వెళ్లిపోయి ఉండవచ్చును. అతని మరణం తర్వాత, ఇతరులు ఆ రచనను. సవరించడమో, చేయడమో, మార్పులు చేర్పులు. పరిష్కరించడమో ఉండవచ్చు. తద్వారా, పాఠకులకు ఇలా అందిన రూపం రచయిత ఉద్దేశ్యాలకు

దగ్గరగానో, దూరంగానో ఉండవచ్చు. కొన్నిసార్లు ఒకే రచనకు అనేక రూపాంతరాలు రావచ్చును. ఇలాంటి విషయాలన్నింటినీ పరిశీలిస్తుందీ విమర్శనా పద్ధతి.

3. రచనా కర్తృత్వాన్నీ, సాధికారికతనీ నిరూపించడానికి ఈ విమర్శనా పద్ధతి ఉపయోగ పడుతుందంటారు.

సాధారణంగా ఈ విమర్శకు పూనుకున్నవారు నాలుగు రకాల పనులు చేస్తారని పరిశీలకులు గుర్తించారు.

1. ముందుగా రాతప్రతి లక్షణాలను విశ్లేషించడం,
2. పుస్తకం మారిన ప్రతిలోలేని విషయాలు రాతప్రతిలోఉంటే వాటిని గు
3. రాత ప్రతిలో పుస్తకంగా వచ్చే క్రమంలో జరిగిన మార్పులు ఏమైనా వుంటే వాటిని పరిశీలించడం.
4. ఇంతవరకూ జరిగిన పరిశీలన ద్వారా తిరిగి ఒక కొత్త ప్రతిని అందించడం.

ఈ విమర్శలో రచన భౌతిక స్వరూపాన్ని (రచనా రూపం, శైలీ) చూడ్డమే కానీ, కథావస్తువుకు సంబంధించిన అంశాలపై ఎటువంటి వ్యాఖ్యానము, విమర్శా కనిపించవు. కాబట్టి దీన్ని విమర్శకు పనికివచ్చే ప్రాథమిక కృషిగానే భావిస్తారే తప్ప నిజంగా దీన్నొక విమర్శనా పద్ధతిగా చెప్పడానికి పనికిరాదు. పింగళివారు వివిధ సందర్భాల్లో గ్రంథ పరిష్కరణ విమర్శకు సంబంధించిన విషయాలను వాటిని ఇప్పుడు సమన్వయిద్దాం.

**5.3.1. పల్నాటి వీరచరిత్ర గ్రంథపరిష్కరణ :**

పల్నాటి వీరచరిత్రను పింగళివారు పరిష్కరించారు. దీన్ని విశాలాంధ్ర విజయవాడవారు 1961లో ముద్రించారు. ఈ కావ్యాన్ని అనేక ప్రతులను సేకరించారు. దీన్ని ముద్రించే క్రమంలో అనేక పాఠాంతరాలను పేర్కొన్నారు. ఆ సందర్భంలో పింగళివారి గ్రంథ పరిష్కరణ విమర్శ దృష్టి కనిపిస్తుంది.

పల్నాటి వీర చరిత్రకు పల్నాటి భారతం అనే పేరు కలదు. ఈ కథకు, భారత కథకు కొన్ని పోలికలు ఉన్నాయి. కౌరవ పాండవులు అన్నదమ్ములు. పల్నాటి వీరులు సవతి తల్లి బిడ్డలు. భారతంలో దుర్యోధనుడు సగరాజ్యాన్ని పాండవులకు ఇవ్వడానికి ఇష్టం లేకనే భారత యుద్ధం జరిగింది. పల్నాటి వీర చరిత్రలో పల్నాడు రాజ్యంలో సగ భాగాన్ని నలగామిుని ఇష్టం లేదు. భారతంలో దుర్యోధనుడిని శకుడు  ఉసిగొల్పగా, పల్నాటి వీర చరిత్రలో నలగామునికి నాగమ్మ ఉసిగొల్పింది. రెండు కావ్యాలలో రాయభారం,  ఘట్టాలు ఉన్నాయి. భారతంలో శకుని మాయా జూదంతో పాండవులు అడవులు పోగా, పల్నాటి వీర చరిత్ర నాగమ్మ మోసం వలన కోళ్ళపోరుతో అలరాజు వర్గం అరణ్య వాసం గడిపారు. భారతంలో ఘోష యాత్ర ఉంటే, పల్నాటి

వీర చరిత్రలో మందపోటు కలద భారతంలో పాండవులు ఒప్పందం ప్రకారం దుర్యోధనుడిని రాజ్య భాగం ఇమ్మని అడగగా ఇవ్వకపోవడంతో భారత యుద్ధం జరిగింది. అదే విధంగా పల్నాడు రాజ్యంలో అలరాజు సగ భాగాన్ని  నలగాముని అడగా దీనికి అంగీకారం తెలపకపోవడంతో పల్నాటి యుద్ధం జరిగింది. భారతంలో దుర్యోధనుడు పెళ్లి కొడుకు కాబట్టి రాజ్యం తనదేననీ చెప్పగా, నలగామునికి తన తల్లి ద్వారా ఆరణంగా వచ్చిన పల్నాడు రాజ్యం తనదేననీ తమ్ముళ్లకు సగరాజ్యాన్ని ఇవ్వలేదు. అన్నదమ్ముల మధ్యలో కలహాలు ఉండకూడదని పెద్దలు చెప్పిన అటు భారతంలో దుర్యోధనుడు ఇటు పల్నాడులో  నలగాముడు వినలేదు. భారత రాయబారం ఘట్టంలో శ్రీకృష్ణునికి విష ప్రయోగం చేశారు. అదే విధంగా పల్నాడు రాజ్యంలో కూడా నాగమ్మ విషం ప్రయోగంతో అలరాజు మరణించాడు. భారత యుద్ధంలో అభిమన్యుడు వీర మరణం పొందగా, పల్నాటి యుద్ధంలో బాల చంద్రుడు కూడా వీర మరణం పొందాడు. భారతంలో, పల్నాటి చరిత్రలో వంశం నాశనం కాకుండా సంధి చేయడానికి ఇరు పక్షాల పెద్దలు చేసిన ప్రయత్నాలు నెరవేరలేదు.

దీనితో కురుక్షేత్ర సంగ్రామంతో కౌరవులు,  కారంపూడి యుద్ధంలో పల్నాడు రాజ్యం అంతరించాయని చెప్పాలి. ఈ విధంగా భారతంలో, పల్నాటి చరిత్రలో జరిగిన పరిణామాల గురించి పరిశీలిస్తే రెండు కావ్యాలలో గాథలు ఒకేలాగా ఉండి కొన్ని పోలికలు ఉన్నాయని తెలుస్తుంది. కానీ భారతంలో యుద్ధంలో  ధర్మరాజుకు విజయం సాధించగా, పల్నాటి యుద్ధంలో అపజయం పొందిన నలగాముడు రాజు అయ్యాడు. భారత కథ భారతజాతికి సంబంధించింది, పల్నాడు ఆంధ్ర జాతికి సంబంధించింది. కనుక రెండు కావ్యాలు ఆ జాతి వర్గంలో ఒక చారిత్రక నేపథ్యాలను ప్రతిష్టలను కలిగి ఉండి ఒకదానికొకటి మహా కావ్యాలుగా వెలుగుతున్నాయి. ఈ విధంగా చూస్తే పల్నాటి వీర చరిత్రను పల్నాటి భారతం అనే పేతో పిలుస్తారని కూడా కొందరు విమర్శకులు, పరిశోధనలు భావిస్తున్నారు.

**5.3.1.1. పల్నాటి వీరచరిత్ర పరిష్కరణ కవి పాండిత్య పరిశీలన:**

పింగళివారు పల్నాటి వీరచరిత్ర పరిష్కరణకు సంబంధిన కొన్ని ముఖ్యమైన నిర్ణయాలను ప్రకటించారు. వాటిని ఇక్కడ వివిధ అంశాలుగా పేర్కొంటున్నాను.

*''ఈ కవియును బాలచంద్రుని యుద్ధమున కార్యమపూడి యుద్ధక్షేత్రమును ఇట్లే ఉపమించుట అతని ప్రాచీన కావ్య పరిజ్ఞానమును ప్రస్ఫుటీకరించుచున్నది:*

*''సమర రంగము చూడ చక్కనైయుండె*
*ఘనమైన నెత్తురు కాల్వలై నిలిచె*
*తెగిపడ్డ గజములు దీవులై యొప్పె*
*నరకిన తురగముల్ నక్రములయ్యె*

*పొర్లాడు శిరములు బుద్బుదపటలి*
*టెక్కెముల్ గొడుగులు డిండీరవితతి*
*మనమైనయరిగెలు కచ్ఛపరా*
*మేటినే తంబులు మీనవారంబు*
*దీర్ఘశిరోజముల్ తీరైననాచు*
*మెదడును మాంసంబు మించిన బురద*
*తరచైన యూటెలు దర్వీకరాళి*
*పొడియైన భూషణపుంజంబులెల్ల*
*సైకతనిచయంబు దాడ్పున నెసగె ''*

*(పుట 470–71; పంక్తులు : 4028–85)* ఇతడు పూర్వకావ్య పరిజ్ఞానమున్న కవి మాత్రమేకాక, సంస్కృత వ్యాకరణ మర్యాదను ఆకళించుకొన్న పండితుడని, అతని సమాస రచనా పద్ధతి నిరూపించుచున్నది.

*'పూర్వ పర్వత శిరః పూజ్యాగ్రమందు*
*ఘనతర మాణిక్యఖచితసౌవర్ణ*
*కుంభంబువలె నిల్పి గురుతేజమునను*
*భానుండు దిక్కుల ప్రబలె నావేళ.''*

సూర్యోదయవర్ణన సర్వకవిసామాన్యమయ్యును, ఇవి కవి సమయములు తెలిసిన కవి మాత్రమే వ్రాయదగిన పంక్తులనుటకు సందేహము లేదు. ఇందలి దీర్ఘ సమాస రచన ఆపండితుడు చేయవలసినది కాదు. అట్లే ''పగలును రేలును బహుజాగ్రదాత్మ కాపాడుడి మీరె కలవారు మాకు'' అనెడు పంక్తులందలి 'బహుజాగ్రదాత్మ' అను సమాసమును సంస్కృత వ్యాకరణ సంప్రదాయ మెరిగిన పండితుడు మాత్రమే ఘటింపగలడు.

ఇట్లు, ఈ కథాభాగమునందంతటను, పండితవాక్కు ప్రతిధ్వనించుచునే యుండునని చూపుటకు మరియొక ముఖ్యమైన విశేషమును ఉదాహరింతును. వేదములో 'స' కార 'న' కార సంయుక్తమైన అక్షరమును ఉచ్చరించునపుడు, ఆ రెంటికి నడుమ ఒక 'త' కారమును చేర్చి పలుకుట సంప్రదాయము. దానిని అభినిధాన 'త' కారము అందురు. స్నానము అను శబ్దములో 'స్నా' అను సంయుక్తాక్షరమున, ఆ అభినిధాన 'త' కారము చేరగా, అది 'స్త్నానము' అని ఉచ్చరింపబడును. స్నానమునకు తెలుగున తానము అను తద్భవ మేర్పడుట, ఈ 'త' కారమును బట్టియే కాని, 'స్నా' అను అక్షరమును బట్టి కాదు. 'స్నా' లోని 'సా' నుండి, 'న' నుండి, 'తా' పుట్టుట అసంభవము. వైదిక సంప్రదాయ మెరిగిన అల్ప సంఖ్యాకులైన ఆంధ్రకవులు ఒకటి రెండు చోట్ల ఈ స్నాన శబ్దమును స్నానశబ్దముగానే ప్రయోగించిరి. తిక్కన భారతము ప్రాచీన

ప్రతులందును, ఎఱ్ఱన ఆరణ్యపర్వము పూర్వపు ప్రతులందును, ఈ శబ్దము స్నాన శబ్దముగానే కలదు. కాని అది యతి స్థానములో 'త' కారమును అపేక్షించిన శబ్దము కాకపోబట్టి ముద్రాపకులు ఆ 'త' కారమును తొలగించి లౌకికోచ్చార ణము ననుసరించి స్నానశబ్దమునే ముద్రించిరి. ఆ మార్పువల్ల యతిభంగము కలుగలేదు కనుక, వ్యాకరణయుక్తమైన శబ్దస్వరూపము స్నానమే కనుక, ఆ 'త' కారమును తొలగించినందువల్ల, ఏ విధమైన లోటును కలుగలేదు. కాని శ్రీనాథుని హరవిలాసములో ఒక పద్యమున ఆ 'త' కారమును తొలగించుటచే యతి భంగమైనది.

*"ధీనిధి సెట్టినంబి తన దేహమునిండ విభూతి మంగళ*
*స్నానముఁ జేసి గౌతపరిధానముఁ గట్టి త్రిపుండ్రధారియై*
*చే నమృతాంశుమౌళిని వశీకృతభక్తుధరించి సంతత*
*ధ్యానముఁజేసి యెంతయును దత్పరభావము ప్రస్ఫుటంబుగన్."*

(ద్వితీయాశ్వాసము:పద్యం–88) శ్రీనాథుడు అచ్చట స్నానశబ్దమును ప్రయోగించి 'త' కారమునకు యతిని పాటించెను. ముద్రాపకులు చేసిన యీ తప్పును తొలుత పట్టి చూపిన వారు కీర్తిశేషులు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు.

వైదికమైన యీ శబ్దస్వరూపమును ఎరిగియున్న కవి గొప్ప పండితుడై యుండవలెననుట నిస్సందేహము. ఈ గ్రంథములో "స్నానముల్ చేసియు, తమ పేరుపేర" (పుట 468; పంక్తి 2716) అనుచోట, యతిస్థానమున 'త' యుండు టచే యతిభంగమైనది. ఈ కావ్యమున యతిభంగమైన ప్రదేశములు పెక్కులు నేను సవరింపబూనలేదు. కనుక యీ పాదమును అట్టే యుంచితిని. పంక్తి అర్థవంతమై, శబ్దము సాధువై, వాక్యము అన్వితమగుచున్నప్పుడు, ప్రత్యేకము యతికోసమని, నేను, స్వంతకవిత్వము చెప్పబూనలేదు. ఆ పనికే పూనుకొన్నచో ఈ గ్రంథమునందలి పేలవములైన అనేక పంక్తులు సంస్కరించియుండెడి వాడను. నే నాదారి త్రొక్కలేదు. ఈ పంక్తిలో కవి యతిభంగము చేయనే లేదనియు, "స్నానముల్" అనియే వ్రాసియుండుననియు నా అంతరాత్మ బోధించినది. అయినను పైన చెప్పిన కారణముల వలన నేను ఈ శబ్దమును మార్చలేదు.

ఈ శబ్దస్వరూపము ఈ కవికి తెలియుననియు, ఇతడు కేవలము వ్యుత్పన్ను డేకాక, వైదిక సంప్రదాయాభిజ్ఞుడనియు నిర్ణయించుటకు యీ యొక్క నిదర్శనమే చాలును. కావున, పిండితార్థ మేమనగా, కల్లు ప్రతిష్ఠ మొదలుకొని బాలచంద్రుని యుద్ధమువరకును వ్రాసిన ఈ కవి సామాన్యుడు కాదు; పండితు లలో లెక్కింపదగినవాడు. సాహితీసంపన్నుడు; ఇట్టివాడు, రసవంతమైన ఈ కథా భాగమును రచించి, ఆంధ్ర లోకమున్నంతవరకును నిల్వదగిన తన యశస్సును శ్రీనాథునకు ధారపోయవలసిన అవసర మేమి కలదుః గ్రంథరచనము చేయుట, కవి,

యశము నర్థించియే కదా! గ్రంథగుణము ను బట్టి, హస్తగతమైన ఆ యశ స్సును అతడు వదలుకొనుటకు కారణ మూహింపగలమా? ఒకవేళ శ్రీనాథుని పేరు పెట్టిన గ్రంథమునకు పేరు వచ్చునని అతడు ఆ త్యాగము చేసె నందమా అది బొత్తుగా పొసగదు. పసలేని గ్రంథమునకు శ్రీనాథుని పేరు పెట్టినను పేరు రాదు; కాళిదాసు పేరు పెట్టినను లాభము లేదు. గ్రంథయశము రచనను బట్టి వచ్చును కాని, కవి పేరును బట్టి రాదు ఈ గ్రంథము, కవి పేరు లేకపోయినను, స్వతః ప్రభావమువలన, ఆంధ్రమున్నంతవరకును జీవించి యుండును. కాబట్టి ఎవడో అనామకుడు వ్రాసిన ఈ గ్రంథమునకు శ్రీనాథుని పేరు పెట్టెననుట యుక్తి రహితమైన వాదము'' అని గ్రంథ పరిష్కరణ అంశాలను వివరించారు. (పింగళి లక్ష్మీకాంతం, 'పలనాటి వీరచరిత్రము' పీఠిక, పుట:XXXVIII-XLI) , 1961)

పింగళి లక్ష్మీకాంతంగారు పల్నాటి వీరచరిత్రపై చేసిన విమర్శ, పరిశోధనల గురించి దివాకర్ల వేంకటావధానిగారు ఇలా అన్నారు.

*''పల్నాటి వీర చరిత్రను సంపాదించి యందలి విపులమైన యుపోద్ఘాతముతో వివాద గ్రస్తములైన పెక్కు విషములను విమర్శన పూర్వకముగా బరిష్కరించి యుండిరి. వారి పరిశోధన లెంత స్వతంత్రతా సముచితములో అంత హేతువాద శోభిత ములు ఎంత భావగంభీరములో యంత మృదుమధుర పదప్రయోగోదారములు..* 'వారి గౌతమ వ్యాసములాంధ్రమున బరిశోధన విమర్శన పాటవమునకు వలెనే వచన రచనకును ఒజ్జబంతులు'' అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ తరపున, డా. దివాకర్ల వేంకటావధాని, 1974:13) తెలిపారు.

### 5.3.2. రంగనాథ రామాయణం గ్రంథపరిష్కరణ:

రంగనాథ రామాయణానికి పింగళి వారు రాసిన పీఠికలో అనేక విమర్శనాంశాలు ఉన్నాయి. ఆయన ఈ వ్యాస నేపథ్యం గురించి చెబుతూ ఇలా అన్నారు. *''1942వ సంవత్సరంలో ఆంధ్ర విశ్వ విద్యాలయ ప్రచురణముగా నా పీఠికతో ఈ రామాయణము ప్రకటింపబడిన తరువాత శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ గారు నా పీఠికను విమర్శించుచు 1943 సంవత్సరంలో మే నెల భారతిలో ఒక వ్యాసము వ్రాసిరి. అందులో నేను చేసిన యీ నామసమన్వయ సిద్ధాంతము శ్రీ వావిలాల వేంకటేశ్వర శాస్త్రిగారి సిద్ధాంతమునకు అనువాదమని నిందమోపిరి అనగా ఈ యూహ నా సొంతము కాదనియు శ్రీ వేంకటేశ్వర శాస్త్రిగారి యూహకు అనుకరణ మనియు వారి అభిప్రాయము'* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:123) పేర్కొన్నారు. దీన్ని పూర్వ పక్షం చేస్తూ దానికి సమాధానాన్ని ఇలా ఇచ్చారు.

*"ఇది సత్యదూరము, శ్రీ వేంకటేశ్వర శాస్త్రిగారి 'కోనబుద్ధరాజు – రంగనాథ రామాయణము' అను వ్యాసము 1940 సంవత్సరము ఆగష్టు నెల భారతిలో ప్రచురింపబడినది. నేను అంతకు ఐదేండ్ల ముందే 1935 సంవత్సరం మార్చి* "Andhra University Telugu Association bulletin" *అనే పత్రికలో ఈ యూహను వ్యాస రూపమున ప్రకటించితిని. శ్రీ అనంత కృష్ణ శర్మ గారు నా వ్యాసమును చూచియుండరు. నేను శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారి ప్రత్యర్థమై ఆయన మెప్పు గోరి ఈ నామసమన్వయమును గడంగితిని నా స్వభావమెరుగని మరి కొందరు తలచిరట. నేను ఇతరుల మెప్పు కొరకు చేయరాని పనులు చేయకుండా వాదను గాను. రామలింగారెడ్డి గారితో నాకు పరిచయము కలుగుట 1936 సంవత్సరములో అంతకు 14 సంవత్సరాల పూర్వము (1922–23) ఈ రంగనాథ రామాయణము నుండి ఒక భాగము యూనివర్సిటీ పరీక్షలలో ఒక దానికి పాఠ్యమయ్యెను. దానిని నేను విద్యార్థులకు పాఠము చెప్పినప్పుడు ఈ నామ సమన్వయము నూహించితిని. ఆనాటి విద్యార్థులలో చాలా మంది నేటికిని చల్లగా ఉన్నారు."* అని పేర్కొన్నారు.

ఈ వాదనలో తన నిర్ణయాన్ని మళ్ళీ సమర్థించుకునే ఆధారాల్ని చూపించడం కేవలం విమర్శకుడుగానే కాకుండా పరిశోధనాత్మక విమర్శకుడుగా, సత్యనిష్ఠ కలిగిన విమర్శకుడుగా పింగళివారు కనిపిస్తారు.

*"రంగనాథ రామాయణమునకు సవిమర్శమును, సహృదయానంద దాయకమును, సర్వాంగీకార యోగ్యము నైన చక్కని పీఠిక రచించిరి"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ తరపున, డా. దివాకర్ల వెంకటావధాని, 1974, పుట:13) పేర్కొన్న విషయాన్ని బట్టి పరిష్కరణ విమర్శకుడిగా పింగళి లక్ష్మీకాంతంగారి ప్రతిభ తెలుస్తుంది. దీనితో పాటు పింగళివారు రంగనాథరామాయణంలో అవాల్మీక అంశాలను కూడా పేర్కొన్నారు.

### 5.3.3. విష్ణుపురాణం పరిష్కరణ:

కలిదిండి బావ నారాయణగారు విష్ణుపురాణాన్ని(1931) తెలుగులోకి అనువదించారు. దీన్ని కోరాడ రామకృష్ణయ్య, పింగళి లక్ష్మీకాంతంగార్లు కలిసి పరిష్కరించారు. విష్ణుపురాణాన్ని పరిష్కరించడంతో పింగళివారు తొలిసారిగా పరిష్కరణ పద్ధతిలోకి ప్రవేశించారు. కలిదిండివారు తన గురించి ఒక సీస పద్యంలో ఈ విధంగా చెప్పుకున్నారు.

*"సమధిక స్ఫూర్తి కృష్ణా గౌతమీ మధ్య, దేశంబునకు భవ్యతిలకమగుచు, బొగడొందు కలిదిండిపురమున కధిపతి, సుగుణుడాపస్తంబ సూత్రుడధికుడసమ శాలంకాయనస గోత్రుడదవిరా, చయమంత్రి వెలయునయ్యనఘమతికి దనయుండు మంత్రి రాజనఘుడాతడుగాంచి విమల చారిత్రునివేంకటాద్రి. నమ్మహాత్మనకును సూరమాంబికకును,*

*నందనుడు బూరషోత్తమనాథపాద నందనానంద మహిమ జీవాతుజీన,   నాధ్యుడను*

*భావనారాయణాభిదుడను' అని అన్నారు.*

పై పద్యాన్ని బట్టి కలిదిండి వారి ఇంటి పేరు 'అడవి' అని కలిదిండి అనేది ఇతని నివాసమనీ తెలుస్తోంది. కాని ఇతని ముత్తాత రాచయమంత్రి కలిదిండి అనే ప్రాంతానికి అధిపతి అని మూడు తరాల తరువాత భావనారాయణ నేటికీ తొలి ఇంటి పేరు పోయి చిరకాలంగా గ్రామ పేరుతో సిద్ధి పొందినట్లు పెక్కు చోట్ల కలదు.

**"తరముల్ నాల్గయిదెందు నెందునగు దత్తత్ గ్రామనామంబులన్ బరగున్ వంశములెల్ల బూర్వపునిజ ప్రఖ్యాతి మాయంగ"** అనే పింగళి సూరనార్యోక్తి ప్రకారం కలిదిండి ప్రస్తుతం బందరుకు సుమారు ఇరవైమైళ్ళ దూరంలో ఉంది. కాని ఇప్పటికి అక్కడ కొన్ని బురుజులు, కోటలున్నాయి.

### 5.3.3.1 విష్ణుపురాణం పరిష్కరణాంశాలు:

పింగళి వారు ఈ పురాణాన్ని పరిష్కరించడంలో మూల ప్రతులను పరిశీలించడంతో పాటు తులనాత్మకంగా కూడా అధ్యయనం చేశారు. శబ్దాలను, ఛందస్సునీ కూడా పరిష్కరించారు.

*"కొన్నితరములు కడచునప్పటికీ భావనారాయణుని నాఁటికి) మొదటియింటి పేరు పోయి చిరకాలనివాసమువలన గ్రామనానుమే గృహనామముగా సిద్ధించె సిద్ధించెనేమో? అట్లు జరుగుటయుఁ బెక్కు చోట్లఁగలదు.*

*'తరముల్ నాల్గయిదెందు నెందునగుఁ, దత్తత్ గ్రామనామంబులన్*

*బరసీన్ వంశము లెల్లఁబూర్వపునిజ ప్రఖ్యాతి మాయరీగ'*

*అను పింగళి సూరనార్యోక్తి యిప్పట్లఁగూడ సార్థక మైనదేమో ? అట్లుగాక గద్యలో 'కలిదిండీ' అనిపడుట వ్రాయసకాండ్ర ప్రమాదమైనఁ గావచ్చును. 'కలిదిండి ప్రస్తుతము 'బందరు' పట్టణమునకు సుమారిరువదిమైళ్ల దశమునఁ గలదు. ఆయూర నిప్పటికిని గోటయను పేర వ్యవహరింపఁబడు నొక ప్రదేశము కలదు. అచ్చటఁ బూర్వమొక దుర్గముండెనఁట. ఉండెనను టకుఁ దార్కాణముగా నా ప్రదేశమున నిప్పటికిని గోడలయు, బురుజులయు జడలుగలవు. రాచయమంత్రి యాదుర్గాధిపతియో, లేక, కేవలము గ్రామకరణకుఁడో యయియుండును"* అని పేర్కొన్నారు.

### 5.3.3.2 విష్ణుపురాణాన్ని తులనాత్మకంగా పరిశీలన చేయడం:

విష్ణుపురాణాన్ని మూలంలోని సంస్కృతపురాణంతో కూడా తులనాత్మకంగా పరిశీలించి కొన్ని అంశాలను తెలిపారు.

*‘‘ఈ పురాణమును మూలముతోడను, వెన్నెలగంటి సూరన విష్ణుపురాణము తోడను బోల్చి చూచితిమి. తఱచిచూడcగాc దెనుcగుపురాణములలో నింతయథామాతృకమైన రచన యేకన్పట్టదు. వెన్నెలకంటి సూరన విష్ణుపురాణము భారతాదులవలె మూలమునకు యధోచితానుసరణ మేగాని, దీనివలె యథా మాతృ కముకాదు. తనకుcబూర్వము సుప్రసిద్ధమైన యొక విష్ణుపురాణము తెనుc గుననుండగాc దానును నా గ్రంథమే రచింపc బూనుటలో నీకవి సంకల్పము స్పర్థాహంకార ప్రేరితముగాక మూలవిధేయతను సంపాదించు కోర్కె వలనc గలిగియుండును. నేcడు బ్ర॥ శ్రీ. వే. కవిరాజ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి భారత రచనా సంకల్పము వంటిదే యీ భావనారాయణకవి సంకల్పమై యున్నది. ఇందీతcడు కృతార్థుcడయ్యెననియే చెప్పవచ్చును. ఎడ నెడcగొలcది మూలాతి క్రమణములున్నను నవియంతగాc బాటింపcదగినట్లుగా నగపడవు. అయినను నెచ్చో స్వతంత్ర రచనలున్న వూ, వానినన్నిటిబొందుపఱ చెదము’’* అని వాటిని వివరించారు. వాటిని క్రింది పట్టిక ద్వారా వివరిస్తాను.

**5.3.3.3. విష్ణుపురాణంలోని శబ్దాల పరిష్కరణ: పట్టిక:**

పింగళి లక్ష్మీకాంతగారు పండిత విమర్శకులు. అందుకనే వ్యాకరణాంశాల్ని కూడా తన విమర్శలో సమర్థవంతంగా వివరించారు.

*‘‘కొన్ని వ్యాకరణములను ప్రమాణములుగా గైకొని యీ గ్రంథమును బరీక్షించిచినచోcదప్పులని చెప్పcదగిన ప్రయోగములు కొన్ని పొడగట్టును, కాని మువానికిcదప్పులనక ప్రయోగవి శేములందుము. ఏమన స్వతంత్రుcడును, గ్రంథకర్తనగు కవిని నసమగ్ర లక్షణమునకు విధేయునిc జేయుట శాస్త్ర విరుద్ధము అట్టి ప్రయోగ విశేషములబొందుపఱచుచున్నాము ’’* అని వాటిని పేర్కొన్నారు. ఆ విషయాల్ని ఇక్కడ ఒక పట్టిక రూపంలో వివరిస్తున్నాను.

| క్రమసంఖ్య | పద్య సంఖ్య | విశేషము |
|---|---|---|
| 1 | 23 | కార్మొగుల్ పస గెల్వ (కార్మొగుల పసలనియర్థము) |
| 2 | 481 | కార్మొగుల్ నిగనిగల్ (కార్మొగుల నిగనిగలు) |
| 3 | 538 | మిక్కిలీ భూవలయంబునన్. (మిక్కిలి యీభూవలయంబునన్ ) |
| 4 | 64 | మిక్కి_ లయ్యున్ . |
| 5 | 578 | గప్లైయుండన్ – (కట్టియైయుండన్) |
| 6 | 105 | ఒనరు దేను (ఒనరుదున్, ఏను) |
| 7 | 111 | కేశవాచ్యుత (కేశవ ! అచ్యుత !) |

| | | |
|---|---|---|
| 8 | 182 | చేసిటు – (చేసి+ఇటు), చుట్టిచ్చి – చుట్టి+ఇచ్చి) |
| 9 | 190 | ఎక్కుక ఎక్కుకొని |
| 10 | 208 | ఎదబోదల్ ఎదబోదలు |
| 11 | 206 | చొరనఁగా –చొరఁగా |
| 12 | 408 | సతుల వెయ్యింటిఁ గనియె, వేయిమందిని అనుట. |
| 13 | 568 | అని దైత్యేంద్రుని సమ్మతించి – సమ్మతింపఁ జేసి |
| 14 | 71 | 2 పా॥ సంపూర్ణ స్ఫూర్తి–ర్ణ – లఘువు చేయబడినది |
| 15 | 78 | క్రొవ్వనఁ గోడలిఁగూఁతురుఁ గలిసిన |
| 16 | 285 | తనయుకు – (తనయునకు) |
| 17 | 74 | పథ్యుకు – పథ్యునకు. |
| 18 | 184 | తీసుక – తీసికొని, |

ఈ విధంగా పింగళి లక్ష్మీకాంతంగారు పరిష్కరణ విమర్శ, పరిశోధన చేయడంలో ఎంతో పాండిత్యాన్ని, లోతైన పరిశీలనను కనబరిచేవారు.

**5.4. కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ:**

తెలుగు సాహిత్య విమర్శ పద్ధతుల్లో కవి జీవిత విమర్శ పద్ధతి ఒకటి. దీని గురించి కొందరు పరిశోధకులు చెప్పిన నిర్వచనాలను చూద్దాం. దీన్నే కవి జీవిత విమర్శ అని కూడా అంటారు. ఈ విమర్శపద్ధతి గురించి ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యంగారు ఈ విధంగా " *కవుల జీవిత ఘట్టాలు, వారి మానసిక స్థితులు, వారి తాత్త్విక భావనలు వారి రచనలలో ఎలా ప్రతిబింబించాయని కానీ, వారి వ్యక్తిత్వాలు కృతుల నెలా రూపొందింపజేశాయని కానీ వివేచించే విమర్శ పద్ధతి ఇది"* అని (ఆంధ్ర సాహిత్య విమర్శ– ఆంగ్ల ప్రభావం,1983:118) పేర్కొన్నారు. దీన్ని బట్టి కవి జీవిత విమర్శలో కవికి సంబంధించిన జీవిత విశేషాలు, వారి వ్యక్తిత్వాలు, వారి సాహిత్యతత్త్వం వారి ఆలోచనలు, భావాలు రచనల్లో కనిపిస్తాయని అవగతమౌతోంది.

*"కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ వంటి మాటలను ఉపయోగిస్తున్నాం. ఈ విమర్శ చేసే విమర్శకుడు పరిశోధన చేయగలవాడై ఉండాలి. రచయితను గురించి ఆకరాలు ఎన్నిటినో సేకరించాలి. సేకరించిన అంశాలకు అతని సాహిత్యానికి మధ్య సమన్వయాన్ని సాధించగలిగి ఉండాలి. శాస్త్రీయ పరిశోధన, చారిత్రాత్మక విశ్లేషణ సామాజిక చరిత్రపై అవగాహన, రాగద్వేషాలకతీతంగా కవిని, అతని జీవితాన్ని, అతని సాహిత్యాన్ని, సమాజాన్ని చూడగల దృక్పథం కవి జీవిత విమర్శకుడికి ఉండాలి"* అని సి.హెచ్ లక్ష్మణ చక్రవర్తిగారు (తెలుగు

సాహిత్య విమర్శ దర్శనం, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ రీతులు అనే వ్యాసం,2016:156) కవి జీవిత విమర్శ గురించి దానిలోని వివిధ అంశాలను తెలిపారు.

*"కవి ఆత్మీయత అతని రచనలో ప్రతిఫలించును. కావున కవి జీవితమును పరిశీలించిన యెడల అతని కావ్య తత్త్వము సుగమమగును. కవి జీవితమునకు కావ్య రచనకు ఉన్న సంబంధమును పరిశీలించి వాని సమన్వయముతో విమర్శకు పూనుకొనిన అది కవి జీవిత విమర్శగా పేర్కొనవచ్చును. కవి వ్యక్తిత్వము, అతని జీవితములోని భౌతిక, మానసిక, తాత్త్విక విశేషములు అతని కావ్యములో ఎట్లు ప్రతిఫలించుచున్నవో ఇందు విశదీకరింపబడును"* అని ఆచార్య ఎస్వీ. రామారావుగారు (తెలుగులో సాహిత్య విమర్శ అవతరణము–వికాసములు, 2014:9) కవి జీవిత విమర్శలో ప్రతిఫలించే వివిధ విషయాల గురించి విశదీకరించారు.

**5.4.1. నన్నయ కవిజీవిత కావ్య సమన్వ విమర్శ:**

నన్నయ మహాభారతాన్ని రెండున్నర పర్వాలు మాత్రమే రాసి, తర్వాత దాన్ని ఆపేయడానికి గల కారణాలను కవిజీవిత కావ్య సమన్వయ విమర్శతో పాటు, చారిత్రక సాహిత్య విమర్శను చేశారు. అందువల్ల దాన్ని ఆ విభాగంలో వివరిస్తాను. 5.6.1. నన్నయ భారత రచనా కాలము –చారిత్రక సాహిత్య విమర్శ అనే ఉపశీర్షికలో గమనించవచ్చు.

**5.4.2. నన్నెచోడుని కుమార సంభవం:**

నన్నెచోడుడు 12 వ శతాబ్దానికి చెందినవాడు. ఇతడు శివాచార తత్పరుడై, జంగమ భక్తుడిగా, విలక్షణ శైలిలో రచనలు చేశాడు నన్నెచోడుడు. నన్నెచోడుడు గురించి, ఆయన రాసిన అపూర్వ గంథ్రం 'కుమారసంభవము' గురించి చాలా శతాబ్ధాలు తెలియదు తెలుగువారికి. 1909లో శ్రీ మానపల్లి రామకృష్ణ కవి ప్రపంచానికి ఈ 'కుమారసంభవ' మన్న అత్యద్భుత తెలుగు ప్రబంధాన్ని మనకు పరిచయం చేశారు. ఆ ప్రబంధం రచించిన నన్నెచోడుడి కాలం గురించి పండిత వర్గాలలో వాదోపవాదాలు జరిగాయి. ఆయన నన్నయ్య, తిక్కన నడిమి కాలం వాడని క్రీ.శ. 1125 నాటి వాడని తీర్మానించారు.

*"నన్నెచోడుడు శివాచార్యకత్వమును వహించి మత ప్రచారకుడిగా వర్తించినవాడు కాడు. అతడు శివాచార తత్పరుడును జంగమ భక్తుడును అయినను మత గ్రంథమును వ్రాయక కావ్యగుణమచే వాఙ్మయమునకు అలంకారము కాదగిన ఒక ప్రబంధమును వ్రాసి శైవులకే గాక అన్యమతస్థులకు కూడా కవిగా ఆదర్శపాత్రుడయ్యెను"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018: 56) తెలుగు సాహిత్య చరిత్రలో నన్నెచోడుడు గురించి పింగళి లక్ష్మీకాంతం ప్రారంభించారు. నన్నెచోడుడు కుమార సంభవం అనే ప్రబంధాన్ని రచించాడనీ, ఇతని కాలాన్ని మానవల్లి రామకృష్ణకవి 1910 సంవత్సరమని నిర్ధారణ చేశాడని పింగళివారు ఉటంకించారు. ఈ ప్రబంధ ప్రతిని సేకరించి రామకృష్ణ కవి ప్రకటించే వరకు సాహిత్యచరిత్రలో దీని గురించి ఎవరికీ

తెలియదని పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొన్నారు. *"ప్రాచీన గ్రంథ సంపాదన ప్రకటనములే సాహిత్యోపాసన వర్తించిన శ్రీ రామకృష్ణకవి ఈ గ్రంథమును ప్రచురించినపుడు నన్నెచోడుడు నన్నయ కంటే పూర్వుడు అని ఒక సిద్ధాంతమును చేసెను"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:56) తెలిపారు. దీన్ని బట్టి నన్నెచోడుడు ఆదికవిగా రామకృష్ణకవి ప్రకటించారు. అయితే అంతకుముందు నన్నయను ఆదికవియని, భారతమే ఆదిగ్రంథమని అనేక మంది పరిశోధకులు అభిప్రాయపడ్డారు.

దీనికి భిన్నంగా రామకృష్ణ కవి ప్రకటించిన సిద్ధాంతం సాహిత్య చరిత్రలో ఒక సంచలనం కలిగించింది. అప్పటి నుంచి నన్నెచోడుడు నన్నయ కంటే పూర్వుడనే అభిప్రాయం సాహిత్య చరిత్రలో ఒక వివాదంగా కొనసాగుతోంది. నిజానికి కవుల రచనలను, కాలాన్ని నిర్ణయించడానికి సరైన ఆధారాలు లభించినప్పుడు పరిశోధకులు అనుసరించే విధానాల గురించి పింగళి వారు చెబుతూ *"తెలుగు కవుల కాలమును, జీవిత చరిత్రలను నిష్కర్షగా చెప్పుట సాధ్యము కాదు. కావున నన్నెచోడుని విషయము కూడా ఇంత వరకు సాధ్యము కాలేదు. కాకపోతే అతని పేరు మీద జరిగిన వాదోప వాదములతో అతని గ్రంథము మీద జరిగిన విమర్శలతో చారిత్రక విమర్శనాత్మకమైన ఒక గ్రంథ జాలము వెలిసినది. తెలుగున ఏ కవిని గురించి యు ఇంత విమర్శ సాహిత్యంలో పుట్టలేదు"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:56) పేర్కొన్నారు.

**5.4.3. పాల్కురికి సోమనాథుడు:**

ద్విపద సాహిత్యానికి సేవ చేసిన సోమనాథుల, బుద్ధారెడ్డిల కవిత్వం గురించి చెప్తూ *"ద్విపద కావ్యానికి పాల్కురికి ప్రతిభాశాలి చురుకైన, బుద్ధారెడ్డి ద్వితీయాచార్యుడు. ఈ సోమన బుద్ధారెడ్డి ఇరువురు ద్విపద కావ్యసృష్టిస్థితులకు కారకులు, సోమనాథుడు పదకవిత్వమునకు సారస్వత గౌరవము సంపాదించిన ప్రథమాచార్యుడు"* అని(ఆంధ్రసాహిత్యచరిత్ర,2018:90) పింగళివారన్నారు. దీన్ని బట్టి తెలుగు సాహిత్యంలో ద్విపదకు పాదులు వేసిన పాల్కురికి సోమనేనని తన వారసత్వాన్ని తర్వాత కాలంలో బుద్ధారెడ్డి కొనసాగిస్తూ రంగనాథ రామాయణాన్ని, ప్రౌఢ కవి శ్రీనాథుడు జనులు చదువుకోవడానికి పల్నాటివీరచరిత్రను మంజరీ ద్విపదలో రచించాడు. ప్రజలగోంతుకలిపి *"తెలుగుజాతి పౌరుషాన్ని కీర్తించాడు. దేశి కవితా శబ్దాన్ని అన్నిటి సార్థకం చేసిన కావ్యాల్లో పల్నాటి వీర చరిత్ర యే మొదటిది మేటి"* అని పింగళివారు అన్నారు. పాల్కూరికి సోమనాథుడు శివకవియుగంలో అనేకమైన సాహిత్య ప్రక్రియల్ని సృష్టించాడు. సోమనాథుడు పండిత భాషను కాకుండా సామాన్య ప్రజల భాషను తన రచనల్లో అధికంగా ప్రస్తావించారు. దాన్ని జాను తెనుగు అని, జాను తెలుగు అని పలు వాదాలు జరిగాయి. దీనిపై అనేకమంది పరిశోధకులు భిన్నవాదాల్ని ప్రకటించారు. అదంతా తెలుగు సాహిత్య పరిశోధనకు, విమర్శకు తొలినాళ్ళల్లో మరింత బలాన్ని కలిగించాయి. సోమనాథుని

రచనల్ని అందులోని ప్రత్యేకతల్ని పరిశీలిస్తే పరిశోధన, విమర్శ రంగాలు ఒకే వారధిపై పయనిస్తాయి. కనుక సోమనాథుని రచనల్ని గమనిస్తే అనేక ప్రక్రియల్ని రాశారని అర్థమౌతుంది. పాల్కురికి సోమనాథుడు రాసిన బసవ పురాణంలో పురాణ లక్షణాలు లేవనే విషయాన్ని పింగళివారు ప్రస్తావించారు. అందువల్ల సోమనాథుడు ద్విపద ప్రక్రియలతో అనేక సాహిత్య ప్రక్రియల్ని రచించారు. అవి ద్విపద. రగడలు, అష్టకాలు, ఉదాహరణ మొదలైన ప్రక్రియలను రాశారు.

### 5.4.4. తిక్కన కవి జీవితసమన్వయ కావ్య విమర్శ :

తిక్కన మన వాఙ్మయమున నెంత ప్రసిద్ధుడో చరిత్రయందును అంత సుప్రసిద్ధుడు. ఆయన సకల సాహిత్య విజ్ఞానమునకును గురుపీఠమై విలసిల్లగా ఆయన గృహము ఒక మహా గురుకులముగ రూపొందెను.

తమ కృతులు వినిపించి ఆయన మెప్పు పడయుటకు వచ్చు కవులు, మంత్రాలోచనమునకై వచ్చు సచివ వతంసులు, ధర్మతత్త్వ మీమాంసలు చేయనేతెంచు పండిత ప్రకాండులు మొదలగు ప్రముఖులతో ఆయన ప్రాంగణ మెల్లప్పుడును నిండియుండెడిదట. వైదుష్యము వల్లనేకాక మంత్రిత్వ ప్రాభవము వలనను ప్రజలకాయన మాటల యందు అధిక గౌరవముండెడిది. కావుననే ఆయన నిత్యము తన యింట విద్యజ్జనులతో చేసెడి చర్చలు, వీటివలన తేలెడు సారాంశములు దేశమున నలు దిశల శాసనములవలె వ్యాపించెడివి కాబోలు.

ఇట్లాయన ఆచార్య పీఠాన్ని అధిష్ఠించి తానే ఒక సర్వవిద్యాసంస్థగా (an institution in himself) సకల రంగంలో శ్రేయో మార్గాల నుపదేశింపజొచ్చెను. *ఆనాటి విజ్ఞానమునకు ఆయనయే మూదల. మతాధికారి, ఏ సారస్వతోపాసకుడు గాని, ఏ రాజకీయవేత్త గానీ నిగ్రహింపలేని సమగ్రత ఆమూర్తిలో నున్నది. ఎవరైన వానిని చూడ నేగుచో అతడు చేయునది ఒక్క వ్యక్తి దర్శనమే కాదు. ఒక మహాసంస్థను వానిలో ఆతడు గుర్తించును. సనాతనధర్మముతో కూడి, ఒక ప్రత్యేక విశిష్టత గల ఆంధ్రవీరజాతిని సృష్టింప వాని ప్రయత్నము. ఇట్టివాడేకాన, ఆంధ్రావళి మోదంబొరయ భారతమును రచించుచున్నానని వ్రాయగల్గినాడు. ఆముష్మికమును విసర్జించిన ఐహికమును, ఐహికమును త్యజించిన ఆముష్మికమును కాదు వీనిది. ఐహిక సుఖముల ననుభవించుచు, ఆముష్మిక దృష్టిని విడనాడవలదని వీని సమన్వయము. అప్పుడే ధర్మవీరులు సృష్టింపబడుదురు''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:141) తెలియజేశారు.

తిక్కన సోమయాజి జీవితం ఆయన సాహిత్యం గురించి, నాటి సామాజిక, రాజకీయ వ్యవహారాలలో, సాంస్కృతికంగా తిక్కన ఒక విద్యాసంస్థకు అధిపతిగా, విద్యా విధానానికి ముఖ్య కేంద్రంగా, తన జాతిని సరైన మార్గంలో పయనించడానికి దారిని చూపించారు. అందుచేత తిక్కనయుగం ఎంతో వైవిధ్యమైనదిగా ఉందనీ, సాహిత్య చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందిన

యుగంగా నిలబడిందని పింగళి లక్ష్మీకాంతంగారు తనదైన శైలిలో పేర్కొన్నారు. కాబట్టి తిక్కన సాహిత్యం తరువాత యుగానికి, కవులకు ఆదర్శప్రాయమైనదని అవగతమౌతోంది.

### 5.4.4.1, తిక్కన కృతులు:

కవిత్రయంలో తిక్కన రెండో కవిగా ప్రసిద్ధి పొందారు. ఆయన నిర్వచనోత్తర రామాయణం, ఆంధ్ర మహా భారతం వంటి రచనల రచించారు. వీటి గురించి పింగళి లక్ష్మీకాంతంగారు పరిశీలించి విశ్లేషించారు. వీటిని తెలియజేసే ప్రయత్నం చేస్తాను.

### 5.4.4.2 నిర్వచనోత్తర రామాయణం:

తెలుగు రామాయణాలన్నీ వాల్మీకి రామాయణాన్ని అనుసరించే వచ్చాయి. రంగనాథుడు రంగనాథరామాయణాన్ని ద్విపదలో రచించారు. తిక్కన తన నిర్వచనోత్తర రామాయణం రాశాడు. రామాయణాలలో పూర్వ, ఉత్తర భాగాలుగా ఉంటాయి. నిర్వచనోత్తర రామాయణం గురించి పింగళి లక్ష్మీకాంతంగారు ఈ విధంగా చెబుతూ *"తెలుగులో పూర్వ రామాయణము ద్విపద ప్రక్రియలో ఉండగా ఉత్తర కాండను రచించి రామాయణమునకు సమగ్రత సంపాదింపనెంచిన ఈ కవి ఉత్తర భాగమును కూడ ద్విపదగా రచింపక పద్య ప్రబంధముగా నేల రచింపవలెను? మీదు మిక్కిలి దాని నిర్వచనమేలు చేయవలయుననెడి సందేహములు ఎవరికైనను పొడముట సహజము. దానికి నాకు తోచిన సమాధానమిది"* అని అన్నారు.

ఆ సమాధానాన్ని ఆయన మాటల్లోనే ఇలా తెలుసుకోవచ్చు." *నన్నయ ఉపక్రమించిన చంపూ పద్ధతి దేశీ రచన కాదనియు, చంపూ పద్ధతిలో నెడ వచ్చెడి గద్యలు పద్యపఠన రక్తికి ఉపహతి కల్గించుననియు, పద్యమునకు వాక్య సాంగత్యము చేయవలసి వచ్చినచోట కలిగెడు క్లేశమును చంపూకర్త రెండిటిమధ్య వచన వాక్యమును చొప్పించి తన అసమర్థతను కప్పి పుచ్చుకొన వచ్చుననియు సోమనాథ ప్రముఖ ద్విపద కవి వర్గము యొక్క ఆక్షేపణలై యుండును. బుద్ధారెడ్డి సోమనాథునితో ప్రతిభటత్వము వహించి తానును ద్విపద రచనయే చేసి బసవ పురాణమున కానవచ్చెడి లోపములు తన రామాయణమున దొరలకుండ నిర్వహించి సోమనాథుని కంటె తానే ప్రామాణికమైన ద్విపద రచన చేయగలవాడననెడి ప్రశస్తిని సంపాదించెను. నిజమే ఎవరు వ్రాసిననేమి? తిక్కనకు ద్విపద కావ్యము నచ్చదు. నిజముగా నది పాడుటకనువైనదేగాని పఠనమున కంతగా పనికిరాదు. చదువుకొనే వారికి అది కలిగించే విసుగుదలయు, వేసటయు గ్రంథము నెడ విముఖత్వము కలిగించును. పద్యకావ్యములో గల ఛందో వైవిధ్యము పఠనమునకు రక్తిని కలిగించును. ఒకపద్యమును ఇంకొక పద్యముతో సంఘటించునెడ కలిగెడి క్లేశమును చంపూ కవి, వచనము వలన దాటగలడనెడి రెండవ ఆక్షేపణకు సమాధానముగా తిక్కనార్యుడు "వాక్య సాంగత్యము సేయుచోనైన గద్యము తోడుగ చెప్పి పెట్ట అని ప్రతిజ్ఞ చేసి నిర్వచన ప్రబంధమును రచించి అది ద్విపద కావ్యముకంటే సర్వథా*

*మేల తరమని నిరూపింపదలచెనని అనుకొనవచ్చును''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018:146) తెలిపారు.

దీన్ని బట్టి ఒక నిర్ణయాన్ని ప్రకటించేముందు పింగళివారు అనేక ఉపపత్తులను చూపిస్తారని, ఇది ఆయన విమర్శలో కనిపించే ఒక సుగుణం గాను చెప్పుకోవచ్చు. దీని వలన పింగళివారు లోతైన విశ్లేషణ చేశారని అర్థమౌతోంది.

**5.4.4.3. నన్నెచోడుడు – తిక్కన కావ్య లక్షణాల తులనాత్మక పరిశీలన:**

నన్నెచోడుడు తన కుమారసంభవంలో కవి సామాన్య లక్షణముల నిర్దేశించారని ఆ విధంగానే తిక్కన కూడా తన సమకాలిక కవుల కవిత్వంలో వక్రమార్గాలను వ్యంగ్యముగా విమర్శించారని పింగళి లక్ష్మీకాంతం గారు తెలిపారు. కనుక ఆ విమర్శనావాక్యములే కావ్యానికి చెందిన సామాన్య లక్షణాలుగా అయ్యాయని తిక్కన తనదైనశైలిలో కావ్య లక్షణాలను తెలియజేశారు. వాటిని రెండు లక్ష్యాలుగా తెలిపారు. ఆయన కావ్య లక్షణాలను ఈ విధంగా తెలియజేశారు.

1. పలుకుల పొందు వాగర్థములు పొందు చెడకుండ పదములు హత్తియుండుట. ఇది తిక్కన కవితకు జీవగఱ్ఱ.

2. హారములోని పూసల మాడ్కి వాక్యములు పొందికగా రెండింటిని హత్తియుండుట.

3. ప్రాతవడ్డ మాటలతో నేర్పు చూపకుండుట.

4. నియమము నతిక్రమింపకుండుట.

5. యతిప్రాసల సందర్భము లందు కూడ నిరర్థక పదములు వేయకుండుట.

6. అలతి యలతి మాటలతో కాహళ సంధించిన విధముగ మేరువంత ధ్వనిని సంపాదించుట.

7. తెనుగు వాక్యములలో సంస్కృత వాక్యములను జొనపకుండుట, జాత్యము గాకుండుట వలన.

8. విశేష్య విశేషణముల యెడల లింగవచన విభేదము పాటించుట.

9. గంధవహుడు పుష్పసౌరభమును వెదజల్లునటుల రసమును బయల్వెడ జేయుట.

10. ప్రాసలో ఏకాక్షరమే యుండవలెను. శాంత ప్రాసాదులు పనికిరావు.

11. కావ్యము ఒక్క కవిసంతోషమునకే కాదు లోకము మెప్పు కొరకు''

(ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018:147, 148)

అని పింగళివారు కావ్యంలో ఉండే లక్షణాలను అవి కవిత్వంలో ఉండాల్సిన విధానాలను తెలిపారు.

నిర్వచనోత్తర రామాయణంలో రాముడిని పురుషోత్తముడుగా కాకుండా పురుష పుంగవుడిగానే చిత్రించిన తిక్కన తొలి నాటి వాల్మీకి ఆశయాన్ని అనుసరించారు. తిక్కన రావణుని పాత్రను సైతం రాక్షసుడిగా గాక ధీరోద్ధతుడి నాయకునిగా చిత్రించి రామునికి ప్రతి నాయకుడిగా నిలిచేటట్లు తిక్కన మలిచారని పింగళివారి అభిప్రాయం. దీన్ని బట్టి రాముడి పాత్ర ఔనత్యం పాటు రావణుడి పాత్ర గొప్పతనాన్ని పింగళివారు విశ్లేషించారు.

**5.4.4.4. నిర్వచనోత్తర రామాయణంలో వదిలిపెట్టిన అంశాలు:**

1.రావణుడు సూర్యచంద్ర మండలములకు పాతాళమునకు నేగిన దండయాత్రలు తిక్కన వదిలేశారు.

2. వాలిసుగ్రీవుల తండ్రి వృత్తాంతము కథావేగానికి బంగమని విడిచారు.

3. లక్ష్మణుడు సీతను విడిచి వచ్చిన తర్వాత అన్నదమ్ముల సంభాషణలో పూర్వరాజుల చరిత్రయని ఏడు సర్గల గ్రంథమున్నది. అది అంతయు ప్రక్షిప్తము గాకపోయినను ముందు కథకు భంజకముగా నుండడం వల్ల తిక్కన సూచనామాత్రంగా చెప్పి విడిచిపెట్టారు.

4. మాల్యవదాదులు ఈశ్వరుని వద్ద చేసిన ఆక్రోశము అతడే మరల తమ్మునితో చెప్పాడు. ఇది కేవలం పునరుక్తి అవుతుందని దీన్ని తిక్కన వదిలేశారు.

**5.4.4.5. నిర్వచనోత్తర రామాయణం–తిక్కన శిల్ప దృష్టి:**

తిక్కన భారతం రాయక ముందే నిర్వచనోత్తర రామాయణాన్ని రచించారు. కావ్య శిల్పం అధికంగా రామాయణంలోనే కనిపిస్తుందని, శిల్పం ఒక స్థిర రూపాన్ని పొందిందని పింగళి వారి దృక్పథం. ఈ శిల్పం తిక్కన రామాయణంలో ఏవిధంగా ఉందనే విషయాన్ని చెబుతూ *''శబ్దార్థౌచితి, సంభాషణ కౌశలము, సజీవ పాత్ర సృష్టి, నిశిత ప్రకృతి పరిశీలనము, తీక్ష్మనోనిదానము, అల్పాక్షరముల అనల్పార్థ రచన మొదలగునవన్నియు భారతమునందు వలె ఇందుకు వ్యక్తములగుచుండును''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018, పుట:149) తిక్కన కావ్య శిల్ప ప్రత్యేకత విభిన్న తరహా కనిపిస్తుందనీ పింగళి లక్ష్మీకాంతం గారు వివరించారు.

మరలా తిక్కన రామాయణంలోనే కాకుండా భారతంలో కూడా కావ్య శిల్పాన్ని ఏఏ అంశాలలో ప్రతిఫలింపజేశారనే విషయాన్ని పింగళివారు ఇలా చెబుతూ ''*తిక్కన భారతమును రచించక పోయినను ఈ రామాయణము వల్లనే ఆంధ్ర సాహిత్య లోకమున రచన వల్ల శాశ్వతమైన యశమునకు భోజనమయ్యెడివాడు. కాని భారత తెనుగున ఏ కవికి అందని బ్రహ్మపదమును చేపట్టి, కవి బ్రహ్మయయ్యెను. ఈ రామాయణము వల్ల అట్టి పదవి లభింపకున్నను కావ్యశిల్ప పారంగతుడైన మహాకవిగా పేరు పొందెడివాడు. నిర్వచనోత్తర రామాయణము విస్తృతి యందును అల్పగ్రంథము కాదు. అందు ఒకటి కాదు, రెండు ప్రబంధములకు సరిపడు గ్రంథమున్నది. వస్తుతత్త్వమును బట్టి, భారతమున కూడ అన్ని*

*యెదలను సాధ్యము కాని బహుముఖమైన కావ్యశిల్ప చాతురి ఈ గ్రంథమునందు ప్రతి పద్యమున గోచరించును*'' అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:153) పేర్కొన్నారు. దీన్ని బట్టి కవి జీవితాన్నే కాకుండా ఈ రచనలో ఉన్నటువంటి కవిత్వాంశాల్ని విశ్లేషించడంలో పింగళివారి లోతైన పరిశీలనకు నిదర్శనంగా కనిపిస్తుంది.

**5.4.4.6. తిక్కన భారత వైశిష్ట్యం:**

తిక్కన తాను రాసిన ఆంధ్ర మహా భారతంలో శిల్ప నైపుణ్యానికి మెరుగులు పెట్టే గుణాలను పింగళి లక్ష్మీకాంతంగారు కొన్ని సూచించారు. వాటిని కింది విధంగా తెలియజేశారు.

1. ''శబ్దార్థౌచిత్య మాయన కవితకు జీవగర్ర.

2. ఏ ఘట్టమునైన సంభాషణాకౌశలములతో సజీవ పాత్రములతో నాటకీయముగా తీర్చుట.

3. ప్రాకృత దృష్టి కందని అగాధమైన పాత్రల మనోధర్మ సూక్ష్మాతి సూక్ష్మములను వివరించి చెప్పుట.

4. అల్పాక్షరములలో అనల్పార్థ రచన చేయడం.

5. బుద్ధి గమ్యమైన శైలి. ఎరిగియున్నమాటలే యైనను వాక్యార్థము బుద్ధి విశేషమున గాని గోచరింపదు'' అని తెలియజేశారు.

(ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:154)

ఎర్రన కవి జీవిత విమర్శకంటే ఆయన రచనల్లోని హరివంశంతో తులనాత్మక సాహిత్యవిమర్శను పింగళి లక్ష్మీకాంతంగారు పరిశీలించారు. దీన్ని 5.5.1. ఎర్రన, సోమన హరివంశాలు, తులనాత్మక విమర్శ' అనే శీర్షికలో గమనించవచ్చు.

**5.4.5. శ్రీనాథుడు కవి జీవిత కావ్యసమన్వయ విమర్శ:**

శ్రీనాథు యుగాన్ని క్రీ.శ.1400 – 1500 సంవత్సరాల మధ్య కాలాన్ని సాహిత్య చరిత్రకారులు గుర్తిస్తున్నారు. అయితే, శ్రీనాథుని కాలం విషయంలో సాహిత్య చరిత్ర కారుల్లో సరైన స్పష్టత లేదు. అదొక వివాదాస్పదంగా ఉంది. ఆంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీనాథుని గురించి చెప్పాలంటే ముందుగా రెడ్డిరాజుల చారిత్రక నేపథ్యాల్ని తెలపాలి. పింగళివారు శ్రీనాథుని జీవితాన్ని తెలపడానికి రెడ్డిరాజుల నేపథ్యాల్ని సంక్షిప్తంగా పేర్కొన్నారు. రెడ్డిరాజుల కాలాన్ని సాహిత్యచరిత్రలో శ్రీనాథయుగంగా విభజించారు. సాహిత్య చరిత్రలో శ్రీనాథుని యుగాన్ని సంధియుగంగా, పురాణయుగంగా, ప్రబంధ పూర్వయుగంగా శ్రీనాథుడు యుగ విభజన చేశారు. ఇవన్నీ భిన్న అభిప్రాయాలుగా కనిపిస్తాయని పరిశోధకులు భావిస్తున్నారు.

శ్రీనాథుని రచనల్ని గమనిస్తే విభిన్నమైన రచనల్ని రాసినట్లు తెలుస్తుంది. ఆయన రచించిన *మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతి, పండితారాధ్య చరిత్ర, శృంగారనైషద*

*అనువాదం, కాశీఖండం, భీమఖండం, (క్రీడాభిరామం, పల్నాటివీరచరిత్ర కర్తృత్వ వివాదాలచర్చలు) శివరాత్రి మహాత్మ్యం* వంటి కావ్యాలలో శివ వైష్ణవ క్షేత్రమహిమల కావ్యాలను పింగళి వారు విశదీకరించారు. శ్రీనాథయుగంలోని సమకాలికులు, పోతన, మడికి సింగన, జక్కన, అనంతామాత్యుడు, గౌరనమంత్రి, దగ్గుపల్లిదుగ్గన, పిల్లలమర్రి పినవీరన, దూబగుంట నారాయణకవి, బైచరాజు వేంకటనాథుడు, వెన్నెలకంటి సూరన, పిడుపర్తి సోమన, నందిమల్లయ-ఘంటసింగయ, కొరవిగోశరాజు, వెన్నెలకంటి అన్నయ మొదలైనవారు రాసిన పురాణాలు, కథా కావ్యాలు, శాస్త్రి గ్రంథాలు, శతకాలు, ద్విపదలు వంటి రచనల ప్రక్రియా వైవిధ్యాన్ని పింగళివారు విశ్లేషణ గావించారు. తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీనాథుడు 15 వ శతాబ్దివాడని సాహిత్య చరిత్ర కారులు తెలుపుతున్నారు. శ్రీనాథునికి కవిసార్వభౌముడు అనే బిరుదును పొంది ప్రసిద్ధి పొందారు. శ్రీనాథుని కృతుల్ని చూద్దాం.

### 5.4.5.1.హరవిలాసం:

శ్రీనాథుని కావ్యాలలో హరవిలాసం కూడా ఒక కావ్యం. దీన్ని అవచి తిప్పయశెట్టికి అంకితం ఇచ్చాడు. శ్రీనాథుని ఇతర రచనలతో పోల్చినప్పుడు దీని ప్రత్యేకత తెలుస్తుంది. హరవిలాసం గురించి పింగళి లక్ష్మీకాంతం గారు ఇలా చెబుతూ *"ఇది పురాణమును కాదు. కావ్యమును కాదు, కావ్యము కాదగిన వ్యస్త్వైక్యమిందు లేదు. కథలన్నియు శివ సంబంధము గల్గియుండుటయే దీనగల యొక్యము దానిని వస్త్వైక్యమనలేము. ఈ కథలన్నియు ఒక దారముతో విడివిడిగా ముడి వేయబడిన సింహాచలం పూవులదండవలె నున్నవి. సిరియాలుని కథ, గౌరీ కల్యాణము, దారుకా వనవిహారము, హాలాహల భక్షణము, కిరాతార్జునీయము ఇందలి కథలు"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018: 272) అన్నారు.

దీన్ని బట్టి హరివిలాసంలో వస్త్వైక్యం లేదని, ఇందులోని కథలన్నీ శివ భక్తి కలిగి ఒకదానికొకటి ఒకటి పూలదండలాగా ఉన్నాయంటూ వివిధ కథా భాగాలను పేర్కొన్నారు. ఇందులో బసవపురాణం ఒకటి. దీన్ని పాల్కూరికి సోమనాథుడు తన ద్విపద బసవపురాణంలో వీరశైవమతాన్నీ తెలిపారు. సిరియాలుని వధించినపుడు మానవతా కలగలేదు. కానీ శ్రీ నాథుడు హరవిలాసంలో సిరియాలును వధించే సందర్భంలో తల్లిదండ్రుల విచారాన్ని వ్యక్తం చేశారు. శివుడు సిరియాలునికి కలిగే ఆపదలను ముందుగానే తెలిపారు. ఆ సందర్భంలో సిరియాలుడు శివునితో సంభాషించినప్పుడు అతనిలో ఒక వేదాంత ధోరణి ఉందని పింగళి వారు అన్నారు.

### 5.4.5.2. సిరియాలుని పాత్ర:

శ్రీనాథుని హరవిలాసం కావ్యంలో సిరియాలుని వృత్తాంతం ప్రముఖమైనది. సిరియాళునకును పుట్టుకతోనే అట్టి జ్ఞానం, ఆ జ్ఞానానికి అనుగుణమైన ఉపన్యాస ధోరణికూడా అలవడి ఉండవచ్చునని సమర్థించవచ్చు. కానీ, *"అట్టి సమర్ధనలు మానవ సంసారిక కథలుగల*

*కావ్యముల విషయమున రాణింపవని నా యూహ"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018:273) తెలిపారు.

హరవిలాసంలో సిరియాలకథను మొదటిగా చెప్పడానికి కథకు సంబంధించిన మూలం అవచి తిప్పయశెట్టి వంశానికి చెందినవాడు కావడం వలనే ఈ కథకు ప్రాధాన్యం ఇచ్చారని పింగళి వారు అన్నారు. హరవిలాసంలోని గౌరీ కళ్యాణం ఘట్టాన్ని కాళిదాసు కుమారసంభవాన్ని అనుసరించే శ్రీనాథుడు రచించాడనీ, కిరాతార్జునీయ కథను భారతంలోని పాశుపతాస్త్రం అనే కథను అనుసరించాడు. అయితే సంస్కృత కవి భారవి కాలికి దీనికి సంబంధం లేదన్నారు. అర్జునుడు పాశుపతాస్త్రం సంపాదించిన తర్వాత స్వర్గాకి వెళ్ళడం, ఊర్వశి శాపం, కాలకేయలను జయించడం, దేవేంద్రుడు పాండవులకు అర్జుని గురించి చెప్పడం ఇవన్నీ ఈ కిరాతార్జునీయంలోనివే. ఈ కథ భాగవతంలో ఉందనీ అయితే శ్రీనాథుడు దీన్ని పౌరాణిక పద్ధతిలో రచించాడనీ పింగళి లక్ష్మీకాంతం గారు పేర్కొన్నారు. హరవిలాసం కావ్యం గురించి పింగళి చెబుతూ *"శ్రీనాథుని ప్రౌఢ కావ్యములలో హరవిలాస మొక్కటే స్వతంత్ర రచనయని చెప్పదగినది"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:274) పేర్కొన్నారు. దీన్ని బట్టి శ్రీనాథుని ప్రౌఢ కవిగా చెప్పడానికి హరవిలాసం కావ్యం ఒక చక్కని నిదర్శనంగా కనిపిస్తుందని పింగళి లక్ష్మీకాంతంగారు వ్యాఖ్యానించారు.

### 5.4.5.3. భీమేశ్వర పురాణం:

భీమేశ్వర పురాణం స్థల పురాణం, చారిత్రక కావ్యం. దీనికి మూలం స్కాంద పురాణం అని పరిశోధకులు చెబుతున్నారని పింగళి వారి అభిప్రాయం. ఈ గ్రంథం ద్రాక్షారామ భీమేశ్వర స్వామికి సంబంధించిన కథ. ఈ కావ్యంలో ఘట్టాలు హాలహాల భక్షణము, త్రిపుర సంహార అనే రెండు కథలు శివలీలకు సంబంధించిన ఉపాఖ్యానాలు. అయితే ఈ క్షేత్ర కావ్యంలో అగస్త్యుడు కాశీని వదిలి వచ్చి వ్యాసునికి వివరించాడు. వీరిద్దరి సంభాషణలు, ఈ ఉపాఖ్యానాలలోని సన్నివేశాలను చర్చించినప్పుడు అత్యంత రసవత్తరంగా ఉంటాయి.

### 5.4.5.3.1. అగస్త్యుడి పాత్ర:

భీమేశ్వర పురాణం ఒక క్షేత్ర మహాత్మ్యాన్ని, చారిత్రక వైభవాన్ని కలిగిన శైవ కావ్యం. ఇందులో భక్తి *"అగస్త్యుడు ఆది యుగముననే వింధ్యపర్వత విజృంభణము నరికట్టుట కొరకు దేవతల ప్రార్థన పై లోకానుగ్రహార్థము, కాశిని వీడలేక దక్షిణాపథమునకు లోపాముద్రాసహితుడై వెడలివచ్చి దాక్షిణాత్యుడయ్యెను. మరికొంత కాలమునకు ద్వాపరాంతమున కాబోలు వ్యాసుడు శివునిచే శపింపబడి కాశిని వీడి రావలసి వచ్చింది. ఆ క్షేత్రాన్ని వదలి రాలేక వియోగంతో దుఃఖిస్తుంటాడు. ఆ సమయంలో అన్నపూర్ణాదేవి ప్రత్యక్షమై వ్యాసుడిని ఓదార్చి దక్షిణ కాశీ అనే పిలిచే ద్రాక్షారామానికి వెళ్ళమని చెబుతుంది. వ్యాసుడు అన్నపూర్ణదేవి చెప్పినట్లే ద్రాక్షారామానికి*

*వెళ్ళుతున్నప్పుడ మధ్యలో పిఠాపురం దగ్గర 'సాత్యవతేయ' అనే ఋషిని కలిసి పరస్పర కుశల ప్రశ్నల సందర్భంలో సంభాషించేటప్పుడు ఈ కావ్యం చాలా రసవంతంగా ఉంటుందని, వీరిద్దరితోనే కావ్యం ప్రారంభమౌతుందనీ, అగస్త్యుడు కాశీని వదిలి పెట్టడంతో భీమేశ్వర పురాణం కథ ప్రారంభమౌతుందని పింగళి వారు పేర్కొన్నారు.*

*"శ్రీనాథుడు కథామాత్ర ప్రధానములైన పురాణములను వ్రాయదగిన కవికాదు. ప్రబంధోచితమైన వర్ణనలతో కథను అలంకరించి గ్రంథమును విస్తరింపజేసినగానిఅతనికి తృప్తి గొలుపదు. అతడు నిక్కపు కవి. కవియను శబ్దమునకే వర్ణించువాడని అర్థము.ఆ వర్ణనలు నానావిధములుగ నుండును. వర్ణనీయమైన వస్తువు ఎట్టిదైనను దానిని తనివితీర వర్ణించుట ఈ కవికి పరిపాటి"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018, పుట: 278) తెలిపారు.

**5.4.5.4. వర్ణనలు –శ్రీనాథుని జీవితవిశేషాల పరామర్శ :**

శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో వర్ణించిన విభిన్న అంశాల గురించి పింగళివారు చెబుతూ *"ఈ ద్రాక్షారామము నేగాక గోదావరీ మండలమందలి నదులు, కొండలు, గుడులు–గోపురములు, క్షేత్రములు, ఆరామములు, తీర్థములు సర్వము నతని రమణీయ వర్ణనలకు పాత్రములైనవి. ప్రబంధమున నుండదగిన అష్టాదశవర్ణనలలో కొన్నింటిని ఇందు అవకాశం కల్పించి ఈ ఉపపురాణమును ప్రబంధ ప్రాయముగా శ్రీనాథుడు సంతరించెనని తూచును"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:278) అన్నారు. భీమేశ్వర పురాణం కావ్య వైశిష్ట్యం గురించి పింగళి చెబుతూ *" భీమేశ్వర పురాణం గోదావరీ మండల స్తోత్రమేగాని నిజమునకు పురాణము కానే కాదు. తెలుగు కవులలో స్వదేశమును ఇంత మక్కువతో తనివితీర వర్ణించిన కవి యింకొకడు లేడు. ఈ గ్రంథము అతని 'ప్రౌఢ నిర్భర వయఃపరిపాకమున' రచించిన దగుటచే తద్వయోనుగుణమైన భావరక్తిమయు, భావనాదోహలతయు ఈ కావ్యమునకు ఆత్మయు ప్రాణములుగా నున్నవి"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:279) తెలియజేశారు. శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో వర్ణనలను వర్ణించేటప్పుడు ప్రబంధ కవులలాగే ద్రాక్షారామాన్ని దీర్ఘంగా వర్ణించారు. ఆ నగరంలో ఉన్న భీమేశ్వరుడే కావ్య నాయకుడిగా చేశాడని పింగళివారన్నారు. ఆ నగర మహాత్మ్యంతో పాటు ఆ దేవుని సేవలను ప్రస్తావించడంలో శ్రీనాథ కవికి భీమేశ్వరునిపై ఎంతో భక్తితో పాటు అదేవిధంగా శైవ భక్తిని ప్రస్తావించారు. దీని వలన శ్రీనాథుడు శైవమతాన్ని అభిమానించినట్లు తెలుస్తుంది.

**5.4.5.5. క్రీడాభిరామం కర్తృత్వం:**

క్రీడాభిరామాన్ని తొలిసారిగా మానవల్లి రామకృష్ణ కవి తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీ నుంచి సంపాదించి ప్రకటించారు. దీన్నే వీధి నాటక పద్య సంపుటిలో గల పద్యాలు

కావచ్చుననీ నిజానికి వీథి నాటకం రామకృష్ణ కవి ప్రకటించిన క్రీడాభిరామమేననీ లేదా కల్పితమోనని పింగళి వారు అన్నారు. దీని ద్వారా శ్రీనాథుని వీథి నాటకమనగా క్రీడాభిరామమేనని రూఢమైంది. వీథి అంటే దశ విధ రూపాలలో ఒకటి. ఈ గ్రంథం లభించిన తర్వాత శ్రీనాథుని పేరుతో లక్షణ గ్రంథాలలో ఉదాహరించిన వీథి నాటకమనే గ్రంథం ఈ క్రీడాభిరామమే అని సాహిత్య చరిత్ర కారులు పేర్కొన్నారని కావున లక్షణ గ్రంథకర్తలు చెప్పిన శ్రీనాథుని వీథి నాటకమే ఈ క్రీడాభిరామమనీ పింగళి వారు పేర్కొన్నారు.

శ్రీనాథుని ఇతర రచనల్లో కొన్ని పద్యాలు, కొన్ని భాగాలు ఇందులో కనిపిస్తాయి. క్రీడాభిరామం రెడ్డి రాజుల కాలంలో రచించిన వీథి నాటకం. అయితే క్రీడాభిరామం పేరును పెట్టడంలో ఉన్న ఔదార్యం గురించి పింగళి వారు చెబుతూ *"క్రీడాభిరామమున గల విటవిటీధూర్త శృంగార చేష్టలు త్రిపురాంతకుని దృష్టిలో ప్రేమ మూలకములు. ప్రేమ శబ్దమునకు ఆ చేష్టలు అర్థములు కావని అవి ఒక విధమైన విలాసక్రీడలనియు శ్రీనాథుడు భావించి నామము మార్చెను. పాపపుణ్యములు ధర్మాధర్మములు మనస్సునకు తట్టని యువజనము స్వేచ్ఛగా వయోనురూపముగా ననుభవించు సుఖముల అనుభూతియే క్రీడా"* అని ( ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:281) పేర్కొన్నారు.

ఇది పవిత్రమును ధర్మబద్ధమునైనది ప్రేమ. సామాన్య లౌకిక దృష్టితో చూచినప్పుడు క్రీడ పరిహసింపదగిన ఉద్వృత్తియే కాని శిక్షింపదగినది కాదు. దీన్ని పింగళి వారు ఇలా చెబుతూ *"హాస్య రస ప్రధానమైన గ్రంథము రచించెనేని అది హేళన కావ్యమగును. హేళన కావ్యమునకు మొదటి లక్షణము హాస్య ప్రధాన మగుటయేగాక, ఆ హేళనకు గురియగు వ్యక్తులు సైతము తమ్ము గురించి తామే నువ్వుకొనునట్లు చేయుట. రెండోది ఆ హేళన కటువును దయారహితమును గాక మృదువును సరసమునయి ఉండుట ఈ లక్షణము క్రీడాభిరామము పట్ల సమగ్రముగా నన్వయించును. కావున ఇది తెలుగున వెలసిన మొదటి హేళన కావ్యము. క్రీడాభిరామము హేళన కావ్యములలో మొదటిదే గాక ఉత్తమోత్తమమునునైనది. మరియు తెలుగున లక్షణయక్తమైన మొదటి రూపకము ఇదియే"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:281) తెలిపారు. దీన్ని బట్టి క్రీడాభిరామం హాస్య రసంతో కూడిన హేళన కావ్యంగా సాహిత్య చరిత్రలో ప్రసిద్ధి చెందిందని పింగళివారు వ్యాఖ్యానించారు.

ఈ విధంగా శ్రీనాథుని కాలాన్ని, జీవితాన్ని, వారి కావ్యాల్ని, ఆయన పేరుతో ఉన్న కావ్యాల కర్తృత్వాన్ని కవిజీవిత విమర్శ పద్ధతిలో పింగళి లక్ష్మీకాంతంగారు హేతుబద్దంగా శాస్త్రీయంగా వివరించారు.

### 5.4.6. శ్రీకృష్ణదేవరాయలు కవిజీవిత విమర్శ:

తెలుగు సాహిత్య చరిత్రలో 16 వ శతాబ్దాన్ని ప్రబంధయుగమనీ, శ్రీకృష్ణదేవరాయల యుగమనీ, స్వర్ణయుగమనీ పరిశోధకులు చెబుతున్నారు. ఈ యుగంలో ప్రబంధ ప్రక్రియ ఒక విశిష్టమైనదిగా వికాసం చెందింది. రాయలు అష్టదిగ్గజకవుల్ని పోషిస్తూ ఈ ప్రబంధ సాహిత్యాన్ని మరింత బలాన్ని చేకూర్చారని కొందరి విమర్శకులు భావిస్తున్నారు. రాయలు ఆముక్తమాల్యద అనే ప్రబంధాన్ని రచించారు. ఈ ప్రబంధానికే విష్ణుచిత్తీయం అనే మరో పేరుతో పిలుస్తారు. దీనిలో విష్ణు భక్తికి సంబంధించిన కథలే ఉన్నాయని విమర్శకుల అభిప్రాయం. దీనిలో విష్ణుచిత్తీయం అనే పేరుతో విష్ణుచిత్తుని కథగా పూర్వభాగంలోను, ఆముక్తమాల్యద అనే పేరుతో గోదాదేవి చరిత్ర ఉత్తర భాగంలో ఉన్నాయని పింగళివారు తన అభిప్రాయాన్ని వక్రీకరించారు.

దీనిలో విష్ణుచిత్తుడు పన్నిద్ధరాళ్వారులలో ఒక విష్ణు భక్తుడు. దీనిలోని వృత్తాంతమంతా వైష్ణవ మత ప్రభావమే కనిపిస్తుంది. ఆముక్తమాల్యద అనే పదానికి చూడికొడుత్తాళ్ గా తమిళంలో పిలుస్తారు. ఆముక్తమాల్యదలో ఉపాఖ్యానాలు యమునాచార్య వృత్తాంతం, మాలదాసరి వృత్తాంతం, ఖాండిక్యదేళశిధ్వజోపాఖ్యానం, గోదావరి దేవి వృత్తాంతాలు ఉన్నాయి. ఇందులో యమునాచార్యుని కథకు మూలం ఆముక్తమాల్యద కాగా , మాలదాసరి కథకు వరాహ పురాణం కాగా, ఖాండిక్యదేశిధ్వజోపాఖ్యానానికి మూలం పరాశర రాసిన విష్ణుపురాణమనీ, కృష్ణదేవరాయలు చెప్పాలనుకున్న విష్ణుభక్తికి విశిష్టాద్వైతం ఒక పోషకంగా అనేక విష్ణు కథలను సృష్టించడం ఒక విశేషమని పింగళివారు చెప్పారు.

ఆముక్తమాల్యదలో విష్ణు భక్తి అనేక రూపాలలో స్ఫురిస్తుందని ఆ విశిష్టతలను చెబుతూ ఈ విధంగా అన్నారు. *“ఆముక్తమాల్యద యందలి ప్రాసంగికేతివృత్తములు కావ్యమునకు నిర్మాణసౌష్టవము లేకుండజేసినవి. ఈ ప్రాసంగికములను పరిహరించిన వస్తైక్యము సార్థక నామధేయము గల చక్కని కావ్యమయ్యేడిది”* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:393) తెలిపారు. దీన్ని బట్టి ఈ ప్రబంధంలో వస్తైవక్యం లేకపోవడానికీ కథలోని ప్రాసంగీకతే కారణమని పింగళి లక్ష్మీకాంతంగారు వ్యాఖ్యానించారు. ఆముక్తమాల్యద ప్రబంధంలోని విశేషాలను పింగళివారు తనదైన శైలిలో తన అభిప్రాయాల్ని ఈ విధంగా తెలిపారు.

*“ 1. ఆముక్తమాల్యదలో విష్ణు భక్తి వివిధ రూపముల వర్ణితమయ్యెను. ఐదురకముల భక్తి భేదాలు ఐదు కథలయందు సూచించబడింది. 2. యమునాచార్యుడు వేదవేదాంగ పరిజ్ఞానము జీర్ణము చేసుకొన్న విష్ణు భక్తుడు. విష్ణు కైంకర్యము నందలి యాసక్తియే. 3. గోదాదేవి ప్రసన్నత శృంగార రూపమును దాల్చింది. 4. గోదాదేవి కీర్తనలతో తాను నాయికగా*

*కృష్ణుని చెలికత్తెలతో చెప్పుచు పాడిన 'పాసురముల'ను ద్రావిడ వైష్ణవులు నేటికిని పాడుదురు. 5. గోదాదేవి శృంగారము లౌకికము గాదు ఆధ్యాత్మిక మయినది.*

*6. గోదాదేవి శ్రీరంగశాయికాత్మార్పణ మొనర్చుకొనిని ధన్యజీవి. 7. మాలదాసరి జ్ఞాని కాడు. కులమును బట్టి కైంకర్యము కవకాశము లేదు. ఇతడు చేసింది గాని కైంకర్యము. మాలదాసరి కైశికగాన దానం వలనే బ్రహ్మ రాక్షసునకు విప్రత్వమున భాగవత శ్రీయును గలిగించినట్లు చెప్పెను. 8. గానలోలుడగు భగవంతుని తృప్తి పరుచగలిగినదే కీర్తన కైంకర్యమే. 9. వైష్ణవ తేజం సర్వత్ర తానయై వెలుగుచుభిన్నభిన్న రూపముల నొందుచు నీ కావ్యము నానావిధముల ప్రదర్శించుచున్నది. 10. కవికి విష్ణుభక్తికియెడ గల చూపు మధురాతి మధురమైనది. 11. ఆనాటి సంపన్నుల, పేదసాదల, రాజుల, మంత్రుల, దేవళముల, అర్చకుల, వేయేల సమస్త జీవిత రహస్యములను కవి యిందు బ్రతిబింబింపజేసెను. 12. రాయల యాచారం వ్యవహారముల లెరుంగవలెనన్నచో నీ గ్రంథమువోలె నేయితర ప్రబంధమును ప్రయోజనకారి కాదు''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:393,394) తెలిపారు. దీన్ని బట్టి పింగళివారు ఆముక్తమాల్యద ప్రబంధంలోని పాత్రలన్ని కూడా వైష్ణవతత్త్వానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని వాటి గుణగణాలను, కులమత, సామాజిక, సాంఘీక, సాంస్కృతిక జీవనవిధానాల్ని ప్రతిబింబించేలా రాయలు ఈ ప్రబంధాన్ని చిత్రించాడని ఎంతో లోతైన దృష్టితో వివరించే ప్రయత్నం చేశారు. అలాగే ప్రబంధ కాలం నాటి జీవన స్థితిగతుల గురించి శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణమాచార్యులుగారు 'రాయల నాటి రసికత' అనే వ్యాసంలో చెబుతూ ''జనులలో రసికత పెరిగినట్లు సదసత్తులు, తరిగిన తరుగును కావున నెన్ని దోషములున్నను రసికత్వము తిరస్కరింపదగినది కాదు. అది నాగరికతకు నిదానము; పౌరుషమునకు ఫలము; అభ్యుదయమునకాధారము'' అని (సారస్వతాలోకము,1931:24) తెలియజేశారు. దీన్ని బట్టి రాయల కాలంలో ప్రజల అనుభవించిన రసికతను, ఆనాటి ప్రజల జీవితాల్ని విశదీకరించారు.

**5.4.7. నంది తిమ్మన కవిజీవిత కావ్యసమన్వయ విమర్శ:**

నంది తిమ్మన అనే పేరు గల కవికి ముక్కు తిమ్మన అనే పేరు కూడా ఉంది. ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో పెద్దన తరువాత ఎక్కువ ప్రాధాన్యత ఉంది. ఇతడు *పారిజాతాపహరణం* అనే ప్రబంధాన్ని రచించాడు. దీనికి మూలం సంస్కృత హరివంశంలో వజ్రనాభవధ అనే కథ దగ్గరగా ఉందని పింగళి వారు అన్నారు.

ఈ ప్రబంధంలో నారదుడు, శ్రీకృష్ణుడు, సత్యభామ, ఇంద్రుడు మొదలైన పాత్రలు ఉన్నాయి. ఈ ప్రబంధం గురించి పింగళి వారు చెబుతూ *''ఈ ప్రబంధోచిత సౌందర్యమునకు ముఖ్య హేతువు పాత్ర చిత్రణము, వర్ణనలు, కృష్ణుడు సత్యభామ యింట గడిపిన నాటి మజ్జన భోజనాది విలాసములు, సత్యాకృష్ణుల యాకాశయానము వర్ణనలే గాని కథాంగములు గావు. ఈ*

*వర్ణనలే లేనిచో నిది మిక్కిలి చిన్న కావ్యమగును''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:379) పేర్కొన్నారు.

ఈ ప్రబంధంలో రాయల దినచర్యల వర్ణనలను ఆధారంగా చేసుకుని శ్రీకృష్ణుని దినచర్యలని విమర్శకులు చెప్పారని పింగళి వారు సోదాహరణంగా పేర్కొన్నారు.

ఇందులో రాయల వైభవ జీవితాల్ని కవి వర్ణనలతో పాటు పుణ్యకవ్రత వర్ణన కూడా ఉంది. పారిజాతాపహరణంలో సత్యభామ పాత్ర చిత్రణ గురించి పింగళి వారు పేర్కొంటూ *''సత్యభామ పాత్ర సృష్టి యాతని పాత్ర చిత్రణా ప్రభావమునకు దార్కాణ. కృష్ణుని యంతపురములో సత్యదేవికి గల చనువేరికిని దెలియదనియు నాతడు సత్యభామ వశుడనియు నిర్ధారణ చేయుటకు సన్నివేశములతో సత్యయే కృష్ణునికి బరిపాలకురాలిగా సృష్టించి చూపెను. ఆమె మానక్రోధ వివశాత్మయైనట్లు ప్రదర్శించినట్ట మపూర్వ శిల్ప నిర్మాణము''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018: 380) తెలిపారు.

పారిజాతాపహరణం గురించి చెబుతూ *''నిజానికి మహా ప్రబంధములు వెలిసిన యానాడు కాక ఖండకావ్యములు వెలిసిన యుత్తరకాలమునకు జెందవలసినదీ రచన. ఇందలి యితివృత్తము విస్తృతిని బట్టి మహా కావ్యమునకు జాలదు''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:380) తెలిపారు.

పారిజాతాపహరణం లాంటి పిల్ల ప్రబంధాలు నాయక రాజులు కాలంలో వెలిశాయని పింగళి వారు కొన్నింటిని ఉటంకించారు. అంటే ఈ ప్రబంధాలకు అనుకరణ ప్రబంధాలు రావడమనేది ఈ ప్రబంధం యొక్క గొప్పతనమనేది పింగళివారి నిర్ణయం.

రఘునాథరాయలు రాసిన *పారిజాతాపహరణం*, శ్రీ కామేశ్వరకవి రాసిన *సత్యభామాసాంత్వనం*, వెలిదండ వేంకటకవి రాసిన *రాధామాధవ సంవాదం*, ముద్దుపెట్టింది రాసిన *రాధికాసాంత్వనం* వంటి అనుకరణ ప్రబంధాలు వచ్చాయని ఆయన చెప్పారు.

వరూధిని పాత్రను చిత్రించిన పెద్దన ఎంత నైపుణ్యం కలవాడో తిమ్మన సత్యభామ పాత్ర సృష్టించడంలో కూడా అలాంటి నైపుణ్యం కలవాడని పింగళి వారు పేర్కొన్నారు. ఈ వ్యాఖ్య చేయాలంటే ప్రబంధాల్ని లోతుగా పరిశీలిస్తేగాని కుదరదు.

*పారిజాతాపహరణం* ప్రబంధంలో నాయికపాత్ర ప్రాధాన్యం గురించి పింగళివారు చెబుతూ ''ఇది నాయికాశ్రయమైన కావ్యము. తంజావూరు ప్రబంధములు సామాన్యముగా నాయికాశ్రయములు. పారిజాతాపహరణము నాయికా శ్రయములైన ప్రబంధములలో మొదటిది'' అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018:381) అన్నారు.

ఒక రచన విలువల్ని నిర్ణయించేటప్పుడు కేవలం ఆ రచనకే పరిమితం కాకుండా అటువంటి ఇతివృత్తం కలిగిన రచనలను కూడా తులనాత్మకంగా పరిశీలించి, కావ్య

ఉత్తమత్వాన్ని నిర్ణయించే లక్షణం పింగళి లక్ష్మీకాంతంగారి విమర్శలో ఉందని చెప్పడానికి దీన్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

**5.4.7. అయ్యలరాజు రామభద్రుడు– కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ:**

ఇతడు సకలకథథాసారసంగ్రహ అనే కావ్యాన్ని రామాభ్యుదయం అనే ప్రబంధాన్ని రాసి గొబ్బూరి నరసరాజుకు అంకితమిచ్చాడు. రామాభ్యదయం ప్రబంధం ప్రక్రియలో ఇమిడిన రామకథకు చెందిన ఏకైక కావ్యం. అయ్యలరాజు రామభద్రకవి దీనికి మహా ఇతిహాసాలతో ప్రబంధచ్ఛాయను కల్పించాడు. రామాభ్యదయం ప్రబంధంలో ప్రాసంగికమైన అనేకాంశాలు ఉండటం వలన దీన్ని శుద్ధ ప్రబంధం అనలేమనీ పింగళి వారు పేర్కొన్నారు.

అందువల్ల కవి రామభద్రుడు ప్రాసంగికత్వాన్ని తీసేసి ప్రధాన కథకు ఆటంకం కలగకుండా ఏక సూత్రత్వాన్ని కల్పించాడు. ఈ ప్రబంధంలో కొన్ని ఉపాఖ్యానాలు కథతో కొంచెం దూరంగా ఉన్న కూడా కవి మరింత ప్రాధాన్యత కల్గించాడు. రామాయణంలో విశ్వామిత్రుడు వచ్చి రామలక్ష్మణులను దోడ్కొని అడవులకు పోయి చెప్పిన కథలను ఈ కవి వదిలేశారు. కథకు సంబంధించిన రాముని విషయంలో అహల్య శాపవిమోచనం కథను రామభద్రుడు తొలగించాడనీ పింగళి వారు అన్నారు. అందుచేత దీన్ని పింగళి లక్ష్మీకాంతం ఇలా చెబుతూ ''*ఆలంకారికమైన శబ్ద చాతుర్యమును జూపిన కవులలో నీతడు ప్రథముడు. ఇతడు చూపిన శబ్దం చిత్రములు, అర్థగుంభనములు, తరువాత వసుచరిత్రకారుడికి మార్గదర్శకములైనవి. రామభద్రుడా కాలమున మహాకవిగా నెన్నబడియుండును. ఈయన ప్రబంధయుగమునకొక యంతరవు సృజించి మేటి యనిపించుకొనినాడు*'' అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:382) పేర్కొన్నారు.

అయ్యలరాజు రామభద్రుని జీవిత విశేషాల్ని వివరిస్తూనే, పింగళి వారు కవి రాసిన కావ్య విశేషాల్ని సమన్వయించడం ఇక్కడ కనిపిస్తుంది.

**5.4.8. వేమన సాహిత్యం–కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ:**

తెలుగు సాహిత్యంలో అనేకమంది కవులు సమాజానిక దూరంగాలేరు. సమాజంలో జరుగుతున్న అంధవిశ్వాసాల్ని ఖండించారు. మోసాలు జరుగుతుంటే వాటిని సరిదిద్దే ప్రయత్నం చేశారు. అటువంటి కవుల్లో వేమన ఒకరు. వేమన సాహిత్య నేటికీ ప్రాసంగికంగా ఉండటానికి, దాన్ని నేటికీ చర్చించడానికి గల కారణాల్ని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు వేమన పట్ల ప్రదర్శించిన సామాజిక దృక్పథాన్ని వివరించాలనుకుంటున్నాను.

ప్రాచీన కాలంలో తిక్కన, మధ్యయుగ కాలంలో పింగళి సూరన, ఆధునిక కాలంలో వేమన అని త్రిమూర్తులని ప్రసిద్ధ విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డి గారు అభిప్రాయపడ్డారు. దీన్ని బట్టి కట్టమంచి రామలింగారెడ్డి గారికి వేమన సాహిత్యం, ఆధునిక సాహిత్యాల పట్ల గల

అభిప్రాయం తెలుస్తుంది. అందుకే దీనికి కట్టమంచి వారు వేమనపై ప్రసంగించిన ఉపన్యాసాలే సాక్ష్యం. భారతదేశంలో మత ప్రచారానికి వచ్చిన ఫాదర్ లెగాక్, అబే దుబాయ్, సి.పి. బ్రౌన్, వంటి పాశ్చాత్యులు తెలుగు వారికంటే ముందు వరుసలో వేమన సాహిత్యం గురించి విశేషమైన పరిశోధనలు చేసి తెలుగు పరిశోధకులకు మార్గదర్శకులయ్యారు.

సి.పి.బ్రౌన్ వేమన పద్యాలను సేకరించి శుద్ధ ప్రతులను తయారు చేసి 'The verses of vemana' (1829) అనే పేరుతో ఒక చారిత్రక గ్రంథాన్ని వెలువరించారు. వేమన సాహిత్యం గురించి తెలుగు సాహిత్య చరిత్రలో ఎంతో మంది ప్రాచ్య పాశ్చాత్యులు విలువైన పరిశోధనలు చేశారు. అలాంటి వారిలో ఫాదర్ లెగాక్, అబే దుబాయ్, సి.పి. బ్రౌన్, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కట్టమంచి రామలింగారెడ్డి, ఆరుద్ర, నార్ల వెంకటేశ్వరరావు, వంగూరి సుబ్బారావు, పింగళి లక్ష్మీకాంతం, ఆచార్య యన్ గోపి, మరుపూరి కోదండ రామిరెడ్డి, ముదిగంటి సుజాతా గార్లు తమ గ్రంథాల్లో వేమన సాహిత్యతత్త్వం గురించి తమ అభిప్రాయాలను తెలియజేశారు .

సి.పి.బ్రౌన్ జీవిత చరిత్రను ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు రచించారు. అందులో బ్రౌన్ తెలుగు సాహిత్యానికి చేసిన సేవల్ని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వేమన సాహిత్యాన్ని, ప్రపంచ సాహిత్యంలో వేమన గొప్పతనాన్ని గురించి ఆయన ఇలా అంటారు. ''వేమనకు కవులలో గల స్థానమును గూర్చి వ్రాయుచు బ్రౌన్ దొర అతనిని గ్రీకు భాషలోని 'లూసియన్' తో పోల్చెను.'' లూసియన్ వలెనే వేమనయును జనాదరణమును చూరగొన్న కవి'' అని (సి.పి.బ్రౌన్ చరిత్ర, 1963:211) అన్నారు. దీన్ని బట్టి వేమన సాహిత్యం ప్రపంచ సాహిత్యంలో గుర్తింపు పొందినట్లయిందనీ స్పష్టమౌతోంది.

*'' ఊరు కొండవీడు ఉనికి పశ్చిమ వీధి*
*మూగ చింత పల్లె మొదటి యిల్లు*
*ఎడ్డె రెడ్డి కులమ వేమని తెల్పుదు*
*విశ్వదాభిరామ వినురవేమ! ''*

*'' కదిరి తూర్పు నందు ఘనత శోభిల్లగా*
*బరగు వరకటార్ల పల్లె వెలసి*
*యచల నిష్ఠగూడ నిమరి యుండెదరయా*
*విశ్వదాభిరామ వినురవేమ ! ''*

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రలో దక్షిణాంధ్ర యుగం(1600-1775) అనే యుగంలో వేమన గురించి, వేమన సాహిత్య తత్త్వాన్ని

గురించి విశ్లేషించే ప్రయత్నం చేశారు. పింగళివారు వేమన సాహిత్యాన్ని దర్శించే తీరును చూస్తే ఆయన వేమన సాహిత్యం పట్ల లోతైన అవగాహనను గమనించవచ్చు. దీన్ని బట్టి నాటి సమాజంలో వేమనకు గల స్థానం, వేమన కవిత్వం కనిపించే వివిధ సామాజిక అంశాలను పింగళి వారు నిశితంగా పరిశీలించారనిపిస్తుంది.

వేమన కాల నిర్ణయమును గూర్చి చాలా వాదోపవాదాలున్నవనీ, వేమన 17 వ శతాబ్దివాడని మాత్రం చివరికి నిర్ణయింపబడింది. వేమన కవిత్వాన్ని గురించి భిన్నాభిప్రాయములున్నాయి. వేమన కవిత్వాన్ని తెలుసుకోవడానికి వేమనకు శాస్త్రాభ్యాసం లేదు. ఉపనిషత్ప్రణం లేదు. ఈ సాంప్రదాయ సాధనాలేమీ లేకుండగానే గురు ఉపదేశం వలన యోగసిద్ధి పొందిన ప్రతిభాశాలితడని, అద్వైతము యోగసిద్ధితోడనే పూర్ణమవుతుందన్నారు. ఆ సిద్ధిని కొందరు శాస్త్రజ్ఞానముతోడను, మరికొంద రాత్మజ్ఞానముతోడను పొందుదురు. వేమన రెండవజాతిలోని వాడు. అట్లే వాని కవిత్వమును పాండిత్యహీనమైన పద్యరచన మాత్రమే. ఈ రెండు శక్తులును వానికి ప్రకృతిసిద్ధములే యని తోచుచున్నది. ఇట్టి యద్వైతదృష్టితో చూచిన వాటి లోకవ్యవహార మంతయు నవ్యవస్థితముగా కన్పించును. లోకంలో నిండుకొన్న యజ్ఞానమును సంస్కరించవచ్చు. ఆ సంస్కరణ రెండు రకాలని చెప్పారు. అవి

*1. "దరిచేరిన శిష్యులకు ప్రపంచ తత్త్వమేమో చెప్పి దానిని ప్రచారానికి తేవడం.2. బాహాటంగా తానే చాటడం. ఈ బాహాటాన్ని చాటుడంలో మరల రెండు విధాలని అన్నారు.1. ఆదరముతోసదుపదేశము చేయుట.2. అనాదరంతో హేళన చేసి దూషించడం ఒకటి. ఈ రెండు పద్ధతుల్లో వేమన రెండో పద్ధతిని అనుసరించాడని"* అని పింగళి లక్ష్మీకాంతం గారు(ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018:432) అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా మరలా వేమన తన కాలం నాటి సమాజాన్ని హేళన చేయడంలో వేమన మొదటి కవి అని ఆ కవిత్వమంతా హేళనమయమని అది లోకాన్ని తిరస్కరించిందే కానీ గ్రహించలేదనీ పింగళివారు తన దృక్పథాన్ని తెలియజేశారు.

వేమన పద్యాల్లో అద్భుతమైన శక్తి ఉందని అది శబ్దార్థాల్ని సమపాలల్లో ఆశ్రయించిందనీ దాని వలన ప్రతి పద్యంలో అంతఃకరణశుద్ధి జీవనాడులను పాఠకులు ఆస్వాదించడం జరుగుతుంది. వేమన తన కవిత్వం ద్వారా ఎలాంటి వస్తువునైనా సులభ రీతిలో వ్యక్తం చేసే తీరును గమనించాల్సిన అంశం. దీనికొక ఉపపత్తిని ఉటంకిస్తూ *"నీతడీశ్వరుని గూడ లెక్క సేయలేదు. తానొక కవినన్న జ్ఞానమే వీనికి లేదు. తన్ను లోకమొక కవిగా నెన్నవలె నన్న యాశయును లేదు. వాని శబ్దజాలము కూడ ఈ దృష్టికే తగినంత తీక్షత కలది. వాని పద్యము లన్నియును జాను తెనుగు గని నుండి తీసిన రత్నములు"* అని ( ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:433) పింగళి వారు తెలిపారు.

*" ఎరిగిన శివపూజ ఎన్నడు చెడిపోదు*
*మొదల పట్టుబట్టి వదలరాదు*
*మొదలు విడిచి గోడ తుది బెట్ట గల్గునా*
*విశ్వదాభిరామ వినురవేమ "*

ఆ శబ్దము లన్నియు ప్రతి పల్లె కుటీరములోను వాడుకలో నున్నవే గాని గ్రంథముల నుండి కొనితెచ్చినవి కావు. ఏ శతక వేమన కవిత్వంలో ప్రయోగించిన భాషా ఏ విధంగా ఉందనే విషయాన్ని పింగళి వారు ఇలా అన్నారు. వేమన సాహిత్యంలో కనిపించే భాష శైలి గురించి ఇలా అన్నారు *" వ్యవహారభాషలో, నింత లక్ష్యశుద్ధి గల నీత్యుపదేశమును చేయలేదు. ఈ పద్యము లన్నియును యాదృచ్ఛికముగా వానికి తోచినప్పుడు నోటివెంట వచ్చిన కఱకులే కాని ఒక ప్రణాళికపై వ్యవస్థితమైన గ్రంథ రచనము మాత్రము కాదు"* అని (ఆంధ్రసాహిత్యచరిత్ర,2018:433) అన్నారు.

*" విద్యలేనివాడు విద్వాంసు చేరువ*
*నుండగానె పండితుండు కాడు*
*కొలది హంసల కడ కొక్కెర లున్నట్లు*
*విశ్వదాభిరామ వినురవేమ! "*

వేమన పద్యాలను పరిశోధనలు ఏ విధంగా గుర్తించారనే దాన్ని పింగళివారు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ *"వేమన పేరుమీద కొన్ని వేల పద్యములున్నవి. అవన్నియు వేమన కృతములు కావు. వానిలో చాల ప్రక్షిప్తములు గలవు. ఎన్ని త్రోసివైచినను సొంత మనదగినవి కొన్ని వేల పద్యము అయిన . వీటన్నింటిని వేమన కవిత్వమనుట పొరపాటు. వేమన సూక్తులనుట సమంజసము. కారణమే పద్యములోను రమణీయత లేకపోవుటయే. అవన్నియును స్మృతులకు వలె విధి నిషేధములకు సంబంధించినవి. అవన్నియును స్మృతులకు వలె విధి నిషేధములకు సంబంధించినవి. అవన్నియును ధర్మాధికారి శాసనములు"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:433) తెలిపారు. దీన్ని బట్టి వేమన కవిత్వంలోని సూక్తులను గుర్తించడానికి వీలవుతుందని పింగళివారు అన్నారు. అంతేకాకుండా వేమన కవిత్వం సూటిగా చెప్పడం వలన అతని కవిత్వంలో రామణీయత కనపడడం లేదనే విషయాన్ని సోదాహరణంగా తెలిపారు. వేమన చెప్పిన కవిత్వం అందులోని అంశాలు శాసనం లాగా ప్రజలకు అంతర్లీనంగా కనిపిస్తాయి. ఈ లక్షణాలన్నీ వేమన కవిత్వంలో దర్శించే అవకాశం ఉంది. వేమన శైలి మాత్రము చాల పటువైనది. ఈ గుణాన్ని బట్టి మాత్రమే వేమన కవిత్వమని అనడం జరుగుతుంది. ఈ సూక్తులలో రసవాదాలకు సంబంధించిన పద్యాలుండడం ఒక విశేషమని తెలుస్తోంది. వేమన కవిత్వంలోని సూక్తుల వలన అతనికి సమాజంలో ఎలాంటి స్థానం లభించిందనీ, సమాజం

నుంచి  విషయాన్ని పింగళి వారు ఈ విధంగా అభిప్రాయపడ్డారు. *"వేమన చాలా దురదృష్టవంతుడు. ఏమనగా సంఘముకొరకే తానిన్ని సూక్తులను జెప్పియున్నను, తాను సంఘమునకే దూరమయినాడు తన రచనలతో కాని వేమన నొక మహాపురుషునిగా మనము పేర్కొనుటకు కారణము వాని యోగసిద్ధియే"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018, :433) అన్నారు. ఆచార్య ముదిగంటి సుజాతా రెడ్డిగారు వేమన  యోగసిద్ధినే 'నాథ సంప్రదాయమని' నవ నాథులని వీరు తొమ్మిదిమంది ఉన్నారని అభిప్రాయపడ్డారు. ఇది హిందూ సంప్రదాయంలో కనిపిస్తుందని  అందులో వేమన ఒకరని తెలుస్తోంది.  వేమన సాహిత్యం ద్వారా  సమాజంలో జరిగిన అనేకమైన దురాగతాలను, ప్రజల మూఢవిశ్వాసాలను హేళన చేస్తూ విమర్శించడం ఒక్క వేమనకే వీలవుతుందని తెలుస్తోంది. వేమనను మహాకవిగాను, ప్రజాకవిగాను, యోగివేమనగాను, లోకకవిగాను, విశ్వకవిగాను  వాదించేవారు సాహిత్యం లోకంలో ఉన్నారనీ విమర్శకులు అనడం ద్వారా వేమన సాహిత్యంపై ఎక్కువగా చర్చలు జరిగాయనీ స్పష్టంగా కనిపిస్తోంది.

ఈ విధంగా నన్నయ నుండి ఆధునిక కవులవరకు గల కవుల కాలాన్నీ, రచనల కర్తృత్వాన్ని సమన్వయించిన విమర్శ అంతా కవిజీవిత కావ్య సమన్వయ విమర్శకునిగా పింగళి వారు శాస్త్రీయమై పద్ధతుల్లో విమర్శను చేసినట్లు తెలుస్తుంది.

### 5.5. తులనాత్మక సాహిత్య విమర్శ:

తెలుగు సాహిత్య విమర్శ పద్ధతుల్లో తులనాత్మక విమర్శ పద్ధతి ఒకటి. దీన్ని ఆంగ్లంలో Comparative Criticism అని విమర్శకులు పిలుస్తారు.

*"రచయితపై పూర్వకవి ప్రభావము ప్రసరించుట స్వాభావికము. అది అనుకరణము కాదు. ప్రతిభావంతుడైన కవి తర్వాతి వారికి మార్గదర్శకుడగును. కావున తులనాత్మక పరిశీలనము కవి స్థానమును నిర్ణయించుటకు, కావ్యతత్త్వమును నిరూపించుటకు ఉపకరించును. ఒక యుగములోని కవులను గాని, ఒక ప్రక్రియను అవలంబించిన కవులనుగాని, ఒకే వస్తువును స్వీకరించిన కవులను గాని తారతమ్య నిరూపకముగా సమాలోచన చేయుట ఉచితము. వివిధ భాషా కవులలోని సామ్య వైషమ్యముల పరిశీలన కూడ కావ్య ప్రమాణ నిర్ణయమునకు తోడ్పడును"* అని ఆచార్య ఎస్వీ రామారావు (తెలుగులో సాహిత్య విమర్శ అవతరణము – వికాసములు, 2014:10) తెలిపారు.

పింగళి లక్ష్మీకాంతంగారు నన్నయ మహాభారతాన్ని, సంస్కృత మహాభారతాన్నీ కూడా తులనాత్మకంగా చర్చించారు. ఆ విషయాలన్నీ భారత, రామాయణాల పరిశోధన అధ్యాయంలో వివరంగా వివరించాను. అందువల్ల ఇక్కడ కేవలం తులనాత్మక విమర్శకు సంబంధించి

ముఖ్యమైన అంశాలున్న వాటినే ప్రస్తావిస్తున్నాను. పింగళివారికున్న తులనాత్మక దృష్టికోణాన్ని గుర్తించడానికి మాత్రమే ఈ విభాగంలో పరిశీలన చేస్తున్నాను.

**5.5. 1. ఎఱ్రన, సోమన హరివంశం, తులనాత్మక విమర్శ:**

హరివంశాన్ని ఎఱ్రన, నాచన సోమన కవులు తెలుగులోకి అనువాదం చేశారు. నాచన సోమన ఉత్తర హరివంశాన్ని రచించారు పింగళి లక్ష్మీకాంతం గారు ఎఱ్రన, సోమన హరివంశంలోని వివిధ అంశాలను తులనాత్మకంగా పరిశీలించారు. ధర్మ గుణాలను బట్టి చూసినప్పుడు ఎఱ్రన సోమన కవిత్వంలోని రస పోషణ గురించి ఈ విధంగా చెబుతూ *"ఎఱ్రన కవితలో గల సత్వసిద్ధి సోమన కవితలో లేదు. సోమన రసభావము ఆవేశమున విశృంఖల విహారము చేయుచుండగా ఎఱ్రన భావము సత్వ సంయమత్మమై గంభీర మందగమనముతో సాగిపోవును. సోమన్న బావగమనము లేడీ పరుగు వంటిది. ఎఱ్రన్నది గజ గమనము వంటిదనీ వీటిని అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయం* చేస్తానయని పింగళి లక్ష్మీకాంతగారు అభిప్రాయపడ్డారు.

ఎఱ్రన కవిత్వంలో రసానుభూతి సుకరంగా కలిగించదు. అయితే సోమన ప్రతి పద్యంలోనూ ఆశ్చర్య గుణాన్ని ప్రతిఫలించేట్లు చేస్తాడు. ఇక శృంగార రసం ఇద్దరి రచనలో ఈ విధంగా పింగళి వారు విశ్లేషిస్తూ *"శృంగార రసాధిదేవత ఎఱ్ఱనకు వలె సోమనకు స్వచ్ఛమూర్తితో గానరాలేదు. దాంపత్యమును పరమ పవిత్రముగా నొనర్చు ప్రణయ వాత్సల్య దాస్య సాహచర్యాది మధుర కోమల భావములు శృంగారకవులందరు నెఱుంగరు. కాళిదాసు భవభూతుల యట్టి జగదేకకవులకే యా పవిత్రమూర్తి గోచరించునది. తక్కిన లోకసామాన్య కవులకు శృంగార మనగా దంపతుల శరీర సంయోగమేకాని వేఱుకాదు. ఎఱ్ఱన యా యుత్తమజాతి వర్గమున జేరగా సోమన రెండవ వర్గములలో ప్రవేశించెను. ఎఱ్ఱన శృంగారమునకు ప్రేమబీజము. సోమన దానికి గామముబీజ మని సాహసించి చెప్పవచ్చును. కనుకనే రుక్మిణీకల్యాణోషాపరిణయాది ముగ్ధనాయికా ప్రణయ వర్ణనమున కూడ నీతడు ప్రౌఢ కామవర్ణనము జేయును గాని ప్రణయదేవతను గన్నెత్తియైన జూడడు"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:245) పింగళివారు అన్నారు.

దీన్ని బట్టి చూస్తే శృంగార కవులు దాంపత్య జీవితం ప్రణయ, వాత్సల్యం, కోమల, మధుర భావాలను వర్ణించారు. సంస్కృత కవి కాళిదాసు, భవభూతి వంటి వారు కూడా శృంగార రసాన్నే అధికంగా వర్ణించారనీ పింగళి వారు పరోక్షంగా సహకరించారు. కనుక హరివంశంలో కూడా ఎఱ్రన, నాచన సోమన కవులు ఉత్తమ జాతి వర్గంలోనివారని, సోమన రెండు వర్గాలలో కనిపిస్తాడనీ ఎఱ్రన శృంగారం ప్రేమ బీజం అయితే సోమన దానికి కామం భీజమనీ పింగళి

లక్ష్మీకాంతం పేర్కొన్నారు. దీనికి సోదాహరణంగా రుక్మిణీ కళ్యాణం, ఉషా పరిణయం అనే ఘట్టాలలోని శృంగార రసం ఏ విధంగా ఉందనే విషయాన్ని చెప్పారు.

నాచన సోమన నగర జన మర్యాద తెలిసిన వాడు. అతడు వర్ణించే వన విహార ద్యూత క్రీడలు అందులకు తార్కాణము. రాజాస్థాన ప్రవేశమున్నను, ఎట్టినకు ఆ పరిచమున్నట్లు కానరాదు. శంభుదాసుడు సమగ్రముగా నెరిగినది పల్లీజన నిరాడంబర సోమన నగర జన మర్యాద లెరింగిన మేటి. అతడు వర్ణించు వన విహారములు, ద్యూత క్రీడలు మున్నగునవి జీవితము. గోకుల వర్ణనమును మిషగా గైకొని యాతడు చిత్రించిన జానపద జీవితము, పోతన చిత్రణమును గూడ మించిపోయినది. దండయాత్రలు, నగర సంరక్షణలు, ముట్టడులు, ద్వంద్వ యుద్ధములు, మొదలగు సేనా కార్యవర్ణనలు చేయుటలో సోమన ఆ రంగములను ప్రత్యక్షముగా ప్రదర్శింపగలడు" అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:245) అన్నారు. దీన్ని బట్టి సోమన రచనల్లోని నగర వర్ణనలను, పల్లే వర్ణనలను, క్రీడలను, యుద్ధవర్ణనలను మొదలైన వాటి గురించి వర్ణించారని పింగళి లక్ష్మీకాంతంగారు విశ్లేషించారు.

### 5.5.2. నాచన సోమన రసపోషణ విధానం:

నాచన సోమనకు నవీనగుణసనాథ, సాహిత్య రసపోషణ, సంవిధానం చక్రవర్తి అనే బిరుదులున్నాయి. ఇవే కాకుండా నవ్యత్వం పురాణ ప్రబంధ ఛాయలను దాల్చడం, రెండోది సహజమైన దానికంటే ఎక్కువ అలంకృతిరావారనీ పాటుపడిన వారు ప్రబంధ కవులు. రస పోషణ అంటే పద్యం, అర్థం మొదలైనవి బాగుండాలని అర్థం చేసుకోవాలి. రస పోషణ గురించి పింగళి వారు చెబుతూ *"ప్రతిపద్యమును రససవంతముగా జేయు రషపోషణలో పూర్వకవులకు ప్రత్యేక దృష్టి లేదు. తెలుగు కవిత్వ మార్గజాతి నుండి నవీనులలో పడుట వీని చేతులలోనే. ఎర్రన మెంత ప్రబంధపరమేశ్వరుడైనను పురాణ కవిత్వపు హద్దును మీరలేదు, రసానందం పద్య కవిత్వమే"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018: 246) అన్నారు.

నాచన సోమన అనుసరించిన రస పోషణ గురించి ఆయన కవిత్వంలో కనిపించే రసం గురించి పింగళి వారు తనదైన శైలిలో పేర్కొన్నారు. మరలా సాహిత్యంలో కవిత్వం, ఛందస్సు, రసానందం అంటే. రసవంతమైన గద్య, పద్య రచనలన్నీ సాహిత్యంగా పరిగణించాలని పింగళి వారు అభిప్రాయపడ్డారు.

### 5.5. 3.ఎర్రన, సోమన హరివంశం, పురాణం– తులనాత్మక విమర్శ:

నిజానికి ఇతిహాసాలను, పురాణాలను అనువదించిన కవులు వస్తువునో, శైలినో, పాత్రలనో, వర్ణనలనో, రసాలనో ప్రధానంగా కనిపిచేట్లు రాయడం ఒక విశేషం. నాచన సోమన కూడా ఉత్తర హరివంశంలో రసపోషణ ఇమిడింపజేశారు. దీనికి పురాణాలే నిదర్శనమని పింగళివారి అభిప్రాయం.

అందుకే పురాణాన్ని సోమన ఏ విధంగా వినియోగించుకున్నారో చెబుతూ *“పురాణములను తెనుగింపదలిచిన ఆంధ్ర కవి విషయ ప్రధానములైన ఘట్టములను తొలగించి రసవద్ఘట్టములనే చేపట్టినచో ఆ అనువాదము పురాణమే యనుపించుకొనదు. యదార్థముగా సాహిత్య కక్ష్యకు చెందని ఆ కావ్యేతర భారములను తొలగించి కావ్య కావ్యత్వము గల ఘట్టములనే అనువదించుటకు పూనుకొని రసపోషణతో వాటి కావ్యత్వమును సార్థకము చేయబూనినచో నతడు సాహిత్య రసపోషణకు నడిపించుకొనును”* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018: 247) తెలిపారు. దీన్ని బట్టి చూస్తే పురాణాలలో, ఇతిహాసాలలో కవులు రసం పోషణను అనుసరించిన విధానాన్ని పింగళి వారు విశ్లేషించారు.

అలంకారికులు శాస్త్ర కావ్యం గురించి ఇలా అన్నారని చెబుతూ *“వ్యుత్పత్తి మాత్ర ఫలములై, ఆనందప్రదములు కాని ఘట్టములలో కవిత్వపదార్థమే ఉండదు. కావ్య ఘట్టములతోపాటు విజ్ఞానప్రదములైన అట్టి ఘట్టములు గూడ గల గ్రంథములను అలంకారికులు శాస్త్ర కావ్యములని పేర్కొనిరి”* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:246) పేర్కొన్నారు. దీన్ని బట్టి పింగళివారు భారతీయాలంకారికులు చెప్పిన నిర్వచనాన్ని ప్రస్తావించారు. కావ్యంలో ఆనందం, విజ్ఞానం ఉండాలనీ అన్నారు. కావ్యంలో రస పోషణను కలిగిస్తాయనే దానికి పింగళివారు కొన్నింటిని ప్రత్యేకంగా పేర్కొన్నారు.

ఇతివృత్తం కథాకథనం, పాత్ర చిత్రణ,వర్ణనలు, అలంకారాలు ఇవన్నీ రస పోషణకు సామాగ్రిగా ఉంటాయి. నాచన సోమన హరివంశం నుంచి కొన్ని ఘట్టాలను వేరుచేసి ఆ కథకు పైన తెలిపిన వివిధ సామాగ్రితో రస పోషణ చేయడం ద్వారా సాహిత్య రస పోషణ సంవిధానం చక్రవర్తి అనే బిరుదు వచ్చిందనే విశేషాన్ని పింగళి వారు వెలుబుచ్చారు. భారతం వంటి రచనల మార్గాల నుంచి సోమన రస పోషణ సామాగ్రితో ఒక పురాణ భాగాన్ని నూతన పద్ధతిలో రచించడం వలనే నవీనగుణసనాథుడు అయ్యాడనే పింగళి లక్ష్మీకాంతంగారు తెలియజేశారు.

**5.6. చారిత్రక సాహిత్య విమర్శ:**

చారిత్రక విమర్శను ఆంగ్లంలో ‘Historical Criticism’ అని పిలుస్తారు.*“ఒకయుగంలో ఒక కావ్యంలో వెలసిన కావ్యం యొక్క విలువను నిర్ధారించడానికి ఆ ప్రక్రియ యొక్క చారిత్రక జ్ఞానం అవసరం. ప్రక్రియ యొక్క పుట్టు పూర్వోత్తరాలు, వికాశ దశ మొదలైన వాటి యొక్క చారిత్రక పరిణామ పరిజ్ఞానం లేనిదే సాహిత్యపు విలువను నిగ్గు తేల్చడం సాధ్యం కాదని భావించే విమర్శ విధానం చారిత్రక విమర్శ”* అని డా. జి.వి సుబ్రహ్మణ్యంగారు (ఆంధ్ర సాహిత్య విమర్శ-ఆంగ్ల ప్రభావం,1996:121) నిర్వచించారు.

మరోవైపు 16వ శతాబ్దంలోనే చారిత్రక విమర్శ పద్ధతి, కవి జీవిత చరిత్ర రచనా ప్రక్రియలో ప్రసవించింది. ముఖ్యంగా పాశ్చాత్య విమర్శకులు లీలండ్, బేల్, పానెల్, మెకంజీ

మొదలైనవారు చారిత్రక విమర్శను అభివృద్ధి చేశారు. ఆధునిక యుగంలో హార్టిన్, క్రైన్, డేవిడ్ డిచెస్, లియొనల్ మొదలైన వారు ఈ చారిత్రక విమర్శను అనునయించే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు.

చారిత్రక విమర్శ గురించి డా. సి. లక్ష్మణ చక్రవర్తి గారు ఇలా *''రచనను ఒక చారిత్రక అవశేషంగా భావించి, దాని ఆధారం చేసుకుని ఆ రచన చిత్రించే కాలంలో ప్రజల జీవితానికి సంబంధించిన అన్ని అంశాలను తెలుసుకునే ప్రయత్నం ఈ చారిత్రక విమర్శ చేస్తుంది''* అని (తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, 'ఆధునిక సాహిత్య విమర్శ రీతులు' అనే వ్యాసం, 2016: 155) తెలియజేశారు.

డా ఎస్. ఎస్. నళిని 'సాహిత్య విమర్శ పదాలు డిక్షనరీ' (2009) అనే ఎం. ఫిల్ ముద్రిత వ్యాసంలో చారిత్రక విమర్శ పద్ధతి గురించి తెలియజేశారు. దీని గురించి చేప్తూ *''ఒక రచనను పరిశీలించేప్పుడు అది వెలువడ్డ సామాజిక, చారిత్రక పరిస్థితులను పరిగణనలోనికి తీసుకోవడం. రచనా ప్రక్రియ ప్రారంభ వికాసాలనూ, రచనాకాలంలోని చారిత్రక విశేషాలనూ, సామాజిక ప్రత్యేకతనూ ఆధారం చేసుకుని చేసే విమర్శనా విధానం. రచయిత జీవితమూ, అతను పెరిగిన వాతావరణమూ వీటన్నింటినీ పరిశీలించడం ద్వారా ఆ రచనను అంచనా వేయడం చారిత్రక విమర్శలో భాగం. రచనలో ప్రతిబింబించిన ఆ కాలంనాటి ఆచార వ్యవహారాలనూ, సాంఘిక పరిస్థితులనూ, అప్పట్లో ఉన్న సాహిత్య సిద్ధాంతాలనూ, ఆ నాటికి గ్రంథం రావడానికి కారణమైన పరిస్థితులనూ, ఇతర గ్రంథాలనూ పరిశీలించి, వాటి ఆధారంగా నిర్ణయించడం జరుగుతుంది. ఈ రకపు విమర్శలో రచన అర్థాన్ని పాఠకులకి కలిగించిన అనుభవాన్ని చర్చించడం కంటే కూడా పాఠకులకు ఆనాటి సమాజం తాలూకూ వివరాలనీ, ఆ సమాజంలో ఆ రచనకున్న స్థానాన్ని విశ్లేషించడమూ ప్రధానంగా జరుగుతుంది''* అని (సాహిత్య విమర్శ పదాలు డిక్షనరీ, 2009: పుట: 74) తెలియజేశారు.

**5.6.1. నన్నయ భారత రచనా కాలము –చారిత్రక సాహిత్య విమర్శ:**

తెలుగు సాహిత్య చరిత్ర కారులు నన్నయ యుగాన్ని 11వ శతాబ్దమని అంటున్నారు. నన్నయ రాజరాజనరేంద్రుని ఆస్థాన కవిగా ఆంధ్ర మహా భారతం ఆది పర్వం, సభా పర్వం, అరణ్య పర్వంలో సగభాగాన్ని రచించారు. భారత కృతిపతియైన రాజనరేంద్రుడు 1022వ సంవత్సరంలో పట్టాభిషిక్తుడై 1063 వరకు రాజ్యపరిపాలన చేశాడు. చివరకు 1051లో తన అత్తింటివారు చోళరాజుల సహాయంతో సోదరుని మరల తలయెత్తకుండ అణచివేసి, సింహాసనాన్ని అధిష్ఠించి తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకొన్నాడు. ఆ పన్నెండు సంవత్సరాల కాలంలో అతడు రాజరాజనరేంద్రుడు విద్యాపోషకుడుగా, అగ్రహార దాతగా పరిపాలన చేశాడు.

ఆ కాలంలోనే ఆంధ్ర భారత రచనకు నన్నయను నియోగించాడని పరిశోధకుల అభిప్రాయాల్ని తెలిపారు.

రాజరాజ నరేంద్రుడు పట్టాభిషిక్తుడైన కాలంలో ఏ సంవత్సరంలో నన్నయభట్టు భారత రచనకు ఉపక్రమించెనో తెలియడానికి ఆధారాలు లేవని పింగళివారన్నారు. మరలా "*రాజనరేంద్రుని జీవితం, భారత గ్రంథం అనే రెండింటిలో మొదటిది ఏనాటికైనను నశ్వరమే! రెండవది కాలమునకైన అనశ్వరమే! 'నలసారము సంసారము' అని యుపదేశించిన నన్నయ నశ్వర వస్తువు నశించినదని విలపించుచు అనశ్వర వస్తువును చేజారె ననుటను నామనస్సు ఒప్పదు. తెలుగున భారతమును అవతరింపజేయుటయే ఆయన పూనిన దీక్ష ఆ క్రతువు విఘ్నమగుటను రాజనరేంద్రుని మరణముగాక నన్నయ స్వర్గ గమనమే కారణమని నే ననుకొందును. నా వలెనే ఈ యభిప్రాయము గలవారు పెక్కురు ఉందురని నా నమ్మకము*" అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018,:36) తెలిపారు. నన్నయకు నారాయణ భట్టు భారత రచనలో తోడ్పడ్డాడని ఈ పద్యం ద్వారా తెలుస్తోందని పింగళి వారు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

***"పాయక పాకశాసనికి భారత ఘోరరణంబునందు నా***
***రాయణునట్లు వాణస ధరామరవంశ విభూషణుండు నా***
***రాయణభట్టు వాఙ్మయధురంధరుడుం దనకిష్టుడున్ సహా***
***ధ్యాయుడునైన వాడభిమతస్థితి దోడయి నిర్వహింపగన్*** "

(ఆంధ్రసాహిత్యచరిత్ర,2018, పుట:36)

అని మహాభారత రచనా కాలనిర్ణయంతో పాటు, రాజరాజనరేంద్రుని కాలాన్ని కూడా నిర్ణయించడంలో పింగళి వారు స్పష్టంగా ఉన్నారని దీన్ని బట్టి తెలుస్తుంది. అసందిగ్ధంగా చెప్పకుండా సూటిగా వివరించిన విధానం ఇక్కడ కనిపిస్తుంది.

నన్నెచోడుడు ఇంత ప్రచారం పొందడానికి ప్రధానమైన కారణం అతని కాల నిర్ణయ సమస్య అని పింగళి వారు వ్యక్తం చేశారు. అయితే నన్నెచోడుడు కావ్య కాలం, కవి కాలాలను నిర్ణయించడానికి సాహిత్య చరిత్రలో అంతగా చారిత్రక ఆధారాలు పింగళి వారు అన్నారు. కృతి కర్తల వంశ వర్ణనలు, పూర్వ పరిశోధకులు, కవులు ఈ కుమార సంభవంలో లేవు. నన్నెచోడుడు కుమార సంభవంలో చెప్పుకున్న పద్యాలను బట్టి అతని వంశ వృక్షం తెలుస్తుంది. అతని తల్లి దండ్రుల పేర్లు చోడబల్లి, శ్రీసతి అని వీరు పాకనాటి ప్రాంతంలో ఇరవై వేల గ్రామాలకు కధీశుడని తెలుస్తుంది. 'టెంకణాదిత్యుడు' అంటే దక్షిణ సూర్యుడు. ఇతడ్ని తమ మూలపురుషుడని చెప్పుకున్నాడు. మరి కుమార సంభవాన్ని తన గురువు మల్లికార్జునయోగి అనే శైవాచార్యుడికి అంకితం ఇచ్చాడు. దీన్ని ఈ కింది పద్యంలో తెలిపాడు.

*" జంగమ మల్లికార్జున నిసర్గ కవిస్తవనీయ సూక్తి యు*
*క్తిం గొనియాడి తత్కరుణ గేనములే కనురక్తయైన భా*
*షాంగన దక్క నేలిన మహాత్త్వము లోకమునం బ్రసిద్ధి గా*
*భంగిన విస్తరించెద బ్రబంధము సద్రసంబంధురంబుగాన్ "*

(ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:57)

అని శ్రీ మానవల్లి రామకృష్ణ కవి నన్నెచోడుడు నన్నయ కంటే పూర్వుడనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి కొన్ని శాసనాలను, నన్నెచోడుని ప్రయోగించిన భాషలోని ప్రాచీనతలను ప్రమాణాలుగా ఉటంకించారు. దీనినే పింగళి లక్ష్మీకాంతం సమన్వయం చేసి తన పరిశోధన దృక్పథాన్ని తెలియజేశారు. కుమార సంభవంలో కాళిదాసు వంటి కవుల అనుకరించడం ద్వారానే ఇది తరువాత కవులకు మార్గదర్శమైంది. తన ప్రబంధంలో వీర శైవుడైన కవిరాజు నన్నెచోడుడు.

*"కుమారసంభవమనే కావ్య ప్రబంధంగా, తెలుగులో రాసిన మొదటి కవి ఆయన. అందుకే ఆయనని ఆదికవి అనడంలో తప్పులేదని అంటూ ఆరుద్ర గారు* నన్నెచోడుడుని గురించి ఇలా చెబుతూ "ఆదికవి అన్న బిరుదు లేకపోతే పోయింది కానీ నన్నెచోడుడు నిజంగా చాలా విషయాలలో ఆద్యుడు. ప్రతీ ప్రబంధంలోనూ మనం మొట్టమొదట చదివే ఇష్టదేవతా ప్రార్థన, పూర్వకవిస్తుతి, కుకవినింద, గ్రంధ కర్త స్వీయ వంశవర్ణన, కృతిపతివర్ణన, షష్ట్యంతాలు మొదలైనవి నన్నెచోడుడే మొదలుపెట్టాడు. అది తరువాతి కవులకు ఒరవడి అయింది" అని (ఆరుద్ర, సమగ్రాంధ్ర సాహిత్య,: 30) అభివర్ణించారు.

శైవ కవులలో శిఖరప్రాయులై విమర్శకులచేత గుర్తించబడిన వారిలో నన్నెచోడుడిది ప్రథమ స్థానం. ఆయన దేశికవితా ప్రవక్తగా, తెలుగులో మార్గ దేశీ పదాలను కలిత్వపరంగా మొదట వాడిన వారిలో నన్నెచోడుడే ప్రథముడిగా పరిశోధకులు భావిస్తున్నారు.

*"మును మార్గకవితా లోకం*
*బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం*
*గున నిలిపి రంధ్ర విషయం*
***బున జనచాళుక్య రాజు మొదలుగ బలువుర్"*** అని అన్నారు. దీనిలో మార్గ కవిత్వమంటే సంస్కృత మని, దేశీ కవిత్వమంటే తెలుగు కవిత్వమని నన్నెచోడుడు భావించాడు.

వర్ణనా ప్రధానమైన వస్తు కవిత అతని ధ్యేయము. వస్తువులో, అలంకృతిలో, భావంలో, భాషలో దేశీయత ఉట్టిపడాలనేది ఆయన లక్ష్యం. కావ్యవస్తు ద్రవ్యాలన్నీ దేశీయమై ఉండాలని, కవితాభివ్యక్తి కళా సుందరంగా ఉండాలనేది ఆయన అభిప్రాయంగా తెలుస్తుంది.

నన్నెచోడుని కుమార సంభవమందు 12 ఆశ్వాసాలున్న ప్రౌఢ ప్రబంధమని కొందరు పరిశోధకులు భావిస్తున్నారు.

*"సతిజన్మంబున్, గణాదీశ్వర జననము, దక్షక్రతు ధ్వంసముం, బా*
*ర్వతి జన్మంబున్, భావోగ్రవ్రత చరితము, దేవద్విషత్ క్షోభమున్, శ్రీ*
*సుత సంహారమ్ము, భూభృత్సుత తపము నమాసుందరోద్వాహమున్,*
*ద్రతి భోగంబుం గుమారోదయము నత దనిం దారకుంబోర గెల్వున్"*

(1-68)

ఈ పద్యంలో వరుసగా సతీదేవి జననము, గణాధిప జననము, దక్షాధ్వర ధ్వంసము, పార్వతీ జననము, శివుని తపస్సు, తారాకాసురుడు దేవతలకు కలిగించిన బాధ, మన్మథుడీశ్వరునిపైకి వెడలుట, మన్మథ సంహారము, పార్వతీ విరహము, పార్వతీ తపస్సు, ఈశ్వర వటు రూపధారణం, పార్వతీ తపస్సు ఫలితము, ఓషధీప్రస్థపురవర్ణనం, పార్వతీపరమేశ్వరులని వాహనమునకు అంకురార్పణ, పార్వతీ పరమేశ్వరుల వివాహము, వారి శృంగార లీలలు, కుమారస్వామి జననం, తారకాసుర, కుమార రాయబారాలు, యుద్ధ ప్రారంభం, తారక వధ, కుమారస్వామి విజయం అనే ఉపాఖ్యానాలు కుమార సంభవంలో ఉన్నాయి. వీటన్నింటిని నన్నెచోడుడు కావ్యతత్త్వ వివేచనలో ప్రసిద్ధమైన వస్తుకవిత ఒకటి. 'వస్తు' అనే పదానికి అలంకారికులు 'కథ' అనే అర్థాన్ని తెలిపారు. అంటే 'కథా కవిత, కథా కావ్యం" అని భావించవచ్చనే అభిప్రాయం మనకు కల్గుతుందని పింగళి వారు అన్నారు. వస్తు మయంగా, కావ్యంగా, అలంకార యుక్తంగా రచించాడని చెప్పుకున్నాడు.

*"సరళముగాగభావములు జాను తెనుంగువ నింపుపెంపుతో*
*బిరిగొన వర్ణనల్ ఫణితి పేర్కొన వర్థము లొత్త గిల్ల బం*
*ధురముగఁ బ్రాణముల్ మధు మృదుత్వ రసంబున గందలింప న*
*క్షరములు సూక్తులార్యులకుఁ గర్ణరసాయనలీలఁ గ్రాలగాన్"*

(1-35)

ఈ పద్యంలో భావాలు సరళతతోనూ, స్పష్టంగా ఉండి అందరికీ తెలియజేసే విధంగా 'జానుతెలుగు' పదాలతో నిండి ఉండాలనే విషయాన్ని నన్నెచోడుడు తన కుమార సంభవంలో ప్రస్తావించాడని తెలుస్తోంది. కానీ వర్ణనలు వాక్కు ప్రసిద్ధములుగా ఉండాలి అంటే అవి ఎప్పటికీ నోటికి గుర్తుండి పోయే విధంగా ఉండాలి. అర్థాలు పొడి పొడిగా కాక ఒత్తుకొనిపోయి సాంద్రతరంగా ఉండాలి. కావ్య జీవములు ఒప్పుగా మృదు మధురంగా అంకురించాలి. అక్షరాలు, సూక్తులు పండితులకు వీనుల విందుగా ఉండి మెప్పించగలగాలి. కావ్య రచనను అలా చేయాలి అని ఈ పద్య భావం.

ఇక్కడ కవి ప్రయోగించిన 'జానుతెనుగు' అనే కొత్త పదాన్ని ప్రయోగించాడు. మరోవైపు సంస్కృత పద భూయిష్టమైన 'మార్గ ' కవిత్వం కంటే సందర్భానికి తగినట్లు ఉండే తేట తెలుగు పదాల సమ్మిళితమైన 'దేశీ' కవిత్వాన్ని వాడాడు. జాను అనే పదం కన్నడ భాష నుండి వచ్చి చేరిందని మనకు కనపడుతుంది. 'జాణ్ణుడి' అనగా అందమైన నుడికారము కల భాష అని అర్థం. జాను తెనుగు అంటే అచ్చ తెనుగు అని, ప్రసన్న, సరసమైన, సరళమైన భాష అని కవి అన్నాడు. సాహిత్యంలో మార్గ కవిత' ప్రక్రియ క్లిష్టమైన ఛందో బద్ధంగా రాసే పద్యాలు చంపకమాల ఉత్పలమాలల్లో కనిపిస్తుంది. దీనికి భిన్నంగా దేశీ కవిత్వం ద్విపదలో సులభ ఛందస్సులో ఆడుతూ పాడుకోవడానికి సులభ రీతిలో అనుకూలంగా ఉంటుంది. 'ఆటవెలది, తేటగీతి మరియు సీసం' లాంటి పద్యాలలో దీన్ని కవులు రాస్తారు. అలాంటి వారిలో నన్నెచోడుడి కవిత్వం జాను తెనుగులో ప్రారంభించాడు.

*"పవడంపులత మీద ప్రాలేయ పటలంబు*
*బర్వెనా మెయినిండ భస్మమలది*
*లాలితంబగు కల్పలత పల్లవించెనా*
*గమనీయ ధాతువస్త్రములు గట్టి*
*మాధవీలత కళిమాలికల్ మునరెనా*
*రమణ రుద్రాక్షహారములు వెట్టి*
*వర హేమలతికపై బురినెమ్మి యూగెనా*
*సన్నుతమగు నెఱిజడలు బూని"* అని సీస పద్యంలో వున్న వర్ణన, తపస్సు చేస్తున్న పార్వతీదేవి గురించి. ప్రాలేయం అనగా మంచు. మంచు బిందువులతో మెరిసే పగడపుతీగలాగ ఆమే ఉన్నది ఎందుకు? ఆమె శరీరం సహజమైన కెంపుదనంతో పగడపుతీగలా కనిపిస్తుంది. దానిమీద తెల్లని బూడిద పూసుకుంది. అందుకు. అలాగే లలితమైన కల్పలత చిగురించినట్లు, ఆమె అందమైన కాషాయ వస్త్రాలను కట్టుకొంటే. మాధవీలత నల్లని తేనెటీగలు మూగినట్లుగా ఆమే కనిపిస్తుంది. ఒంటిపై చుట్టుకున్న రుద్రాక్షహారాలు. జడలుగట్టిన ఆమె నెఱికుఱులను చూస్తే అందమైన బంగారు సంపెంగ తీగపై, విప్పారినటువంటి నెమలి పురి విప్పినట్లు కనిపిస్తుంది. మరి జడ నల్లని కాంతులతో నిగనిగలాడుతూ ఉంటుందని, ఆమె తపోదీక్షలో, సంరక్షణ లేక కురులన్ని ఎఱ్ఱని రంగులోకి మారాయి. ఈ పోలికలన్నింటిని ప్రకృతినుంచి తీసుకున్నవే. పార్వతి ప్రకృతి స్వరూపమే కదా. పైగా నాలుగు పోలికలలోనూ మనకి కనిపిస్తుంది. ఆమె శరీరం తపస్సుకి ఎంతగా కృశించిపోయిందో, అయినా తన సహజ సౌందర్యంతో ఎలా శోభిస్తోందో, ఈ పోలిక వల్ల చక్కగా ధ్వనిస్తోంది.

*"హరుడు మాహేశ్వరీ రూపమైన చెలువ*
*మభినయించెనొ యని మును లర్థి జూడ*
*గురుతపశ్శక్తి మూర్తి నేకొనిన కరణి*
*దగిలి యుమ తపోవేషంబు దాల్చి పొల్చె!"* (6-82)

అని తేటగీతిలో వర్ణించాడు. దీనిలో పార్వతి వేషం సరిగ్గా శివుని రూపాన్ని పోలినదన్న స్ఫురణ మనకు కలగదు. అలా కలగకుండా చాలా జాగ్రత్తగా పద్యాన్ని చెక్కాడు కవి. ప్రతి పాదంలోనూ పార్వతీదేవి వేషధారణ చెప్పడానికి ముందు, దాని గురించిన రమణీయమైన పోలిక చూపించి, మనసుని కట్టిపడేసాడు అసలు వేషమ్మీదకి దృష్టి మళ్ళకుండా. ఇది కవి దృష్టి. ఎత్తుగీతి మొదటి పాదంలో హఠాత్తుగా శివుని రూపాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపజేశాడు.

ఈ శిల్పం ద్వారా కవి మామూలు మనుషుల చూపుకీ, మునుల చూపుకీ ఉన్న అంతరాన్ని అద్భుతంగా ఆవిష్కరించడం. మనము ప్రకృతి రమణీయకతకి పరవశులమైపోతాం. కానీ మహర్షులు అసలు స్వరూపాన్ని దర్శించగలుగుతారు. ప్రకృతిలో పరమాత్మను దర్శిస్తారు. పార్వతీ పరమేశ్వరులు, ప్రకృతీ పురుషులు ఒకటే అన్న జ్ఞానాన్ని పొందుతారు. ఇంత గొప్ప తత్త్వాన్ని అందమైన వర్ణనల మాటున, సీసపద్య శిల్పం ద్వారా చక్కగా ధ్వనింపజేశాడు నన్నెచోడుడు.

ఈ వర్ణనలో మరొక చిన్న విశేషం కూడా దాగి ఉంది. శివ దీక్షను చేపట్టినవారు ఆ శివునిలా రుద్రాక్షలు ధరించి, శరీరంపై బూడిదపూసుకొని అతని రూపాన్ని అనుసరించడం ఒక పద్ధతి. నన్నెచోడుడు కుమార సంభవమందు కథా సంవిధానమును సమగ్రపరచి, వస్త్వైక్యమును సాధించి వర్ణనాత్మక రచనా రీతికి ఆద్యుడైనాడు. ఈ కవిరాజ శిఖామణి రచనా చమత్కారము బహుధా ప్రశంసనీయము. ఈయన ప్రతిభాతిశయం కుమార సంభవము నందు అడుగడుగునా దర్శనమిస్తుంది. మత్తేభాల విక్రీడితాన్ని మత్తేభ విక్రీడితంలోనే చెప్పడం, అలాగే ముద్రాలంకార రచనా పద్ధతికి కూడా ఆద్యుడు నన్నెచోడుడే. పద్యానికి తాను వాడిన ఛందస్సు పేరు ఆ పద్యంలోనే వచ్చేటట్టు రాయడం ముద్రాలంకారం. స్వాగత వృత్త పద్యం రాస్తే అందులో స్వాగతమనే పదం వాడతాడు. క్రౌంచపదం వృత్తంరాస్తే ఆ పేరు ఉండేలా జాగ్రత్త పడతాడు. దానికి ఆద్యుడు నన్నెచోడుడు. ప్రబంధాల్లో అష్టాదశ వర్ణనలుండాలని నియమం. నన్నెచోడుడు తన కావ్యంలో పద్దెనిమిది వర్ణనలని సంపూర్ణంగా అమలుపరచాడు. కనుక నన్నెచోడుడు చక్కటి తెలుగు నుడికారాలతో ఈ ప్రబంధాని పరిపుష్టి చేశాడు.

నన్నెచోడుడు కుమార సంభవ కావ్యంలోని కవితా శక్తిని గురించి పింగళి వారు చెప్పిన సాహిత్య అంశాలను గొల్లపూడి ప్రకాశరావు ఇలా చెబుతూ *"కాళిదాసునే మురిపించెడి పద్యములు ఇట్టివి ఈ గ్రంథములో చాలా కలవు. నన్నెచోడుడు తన గురువైన జంగమ*

*మల్లికార్జునకు పరమేశ్వరునకు అభేదాన్ని పాటిస్తూ చెప్పిన పద్యాలు పింగళి వారికి నచ్చలేదు. పరాకాష్ట చెందిన ఇతని గురు భక్తి యరాధనీయమే కాని ఆ గురువునకు పరమశివునితో అభేదమును పాటించెడి పారవశ్యము మాత్రము సమర్థనీయము కాదు''* అని భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి – కాటూరి, 1999: 74 లో పింగళి వారు అన్నారని తెలియజేశారు.

**5.7. సాహిత్య ప్రక్రియా విమర్శ:**

తెలుగు సాహిత్య చరిత్రలను రాయడానికి సాహిత్య ప్రక్రియలు ఎంతగానో తోడ్పడతాయి. ఈ విమర్శను కొందరు పరిశోధకులు నిర్వచించే ప్రయత్నం చేశారు వాటిని చూద్ధాం. ప్రక్రియ విమర్శను ఆంగ్లంలో 'Genre criticism' అని అంటారు. *''ఒక రచన సృజింపబడుతున్నప్పుడే దాని స్వభావాన్ని అదే అభివ్యక్తం చేసుకుంటుంది. అలా అభివ్యక్తమయ్యే కావ్య స్వభావం తర్కబద్ధంగా ఉంటుంది. దీనిని అంగీకరిస్తే గతి తర్కాన్ని ఆశ్రయించి ఒక స్వరూప స్వభావాన్ని సంతరించుకున్న రచన ఒక వర్గంగా పరిగణింపబడుతుంది. ఇంగ్లీషులో ఈ వర్గాలనే Mode, kind, type అంటారు. అయితే ఈ తార్కిక వివేచన విధానానికి కూడా ఒక స్వయం సమగ్ర లక్షణ భావం ఉండాలి. అటువంటి తార్కిక వ్యవస్థ ఎలా రూపం భావానికి ప్రక్రియ అని పేరు. ఈ ప్రక్రియా సూత్రాన్ని వినియోగించుకుంటూ సాహిత్య స్వరూప స్వభావాలను తాత్త్విక కళాత్మకమైన విలువలూ వివేచించే విమర్శ పద్ధతిని ప్రక్రియా విమర్శ''* అని (ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు,2004: 221–222) అంటారని ఆచార్య జి. వి సుబ్రహ్మణ్యంగారు ప్రక్రియను, ప్రక్రియా విమర్శను తనదైన శైలిలో నిర్వహించారు.

*''ఒక కవి దర్శనం నుంచి ఒక సమగ్ర అనుభూతిని సామాజికులకు అందించాలనే ప్రయోజనంతో రచనా రూపంలో అభినవంగా అవతరించే సాహితీ మూర్తిమత్వం ప్రక్రియ''* అని, *ఒక రచన సృజించిన బడుతున్నప్పుడే దాని స్వభావాన్ని అదే అభివ్యక్తం చేసుకుంటుంది. అలా అభివ్యక్తమయ్యే కావ్య స్వభావం తర్క బద్ధంగా ఉంటుంది. ఈ ప్రక్రియా సూత్రాన్ని వినియోగించుకుంటూ సాహిత్య స్వరూప స్వభావాలను తాత్త్విక కళాత్మకమైన విలువలను వివేచించే విమర్శ పద్ధతిని ప్రక్రియా విమర్శ అంటారు అని అన్నారు. మరలా తెలుగు సాహిత్య విమర్శలో ప్రక్రియా వివేచన రెండు రీతులలో ఉందని అన్నారు. వాటిలో మొదటిది 'ప్రక్రియను గుర్తించడానికి, లక్షణాలు ఏర్పరచడానికి ఈ పద్ధతి విమర్శకు కావలిసిన మౌలిక సూత్రాలను అందించేది', రెండోది ఒక రచనను ప్రక్రియా దృష్టితో అనుశీలించి లక్షణాలను చెప్పే ప్రక్రియా వివేచన''* అని (తెలుగు సాహిత్య విమర్శ దర్శనం, 'ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ రీతులు' అనే వ్యాసం,2016:157,158) లక్ష్మణ చక్రవర్తిగారు తెలుగు సాహిత్యంలో ప్రక్రియను గుర్తించడంలో దాని లక్షణాలను, స్వరూప స్వభావాలను విశదీకరించే ప్రయత్నం చేశారు. ఈ

ప్రక్రియా విమర్శను ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తమ రచనల్లో సమన్వయించిన తీరు తెన్నులను తెలియజేస్తాను.

తెలుగు సాహిత్య విమర్శను ఒక ప్రక్రియగా రూపొందించడంలో, దాన్ని ఒక శాస్త్రస్థాయికి తీసుకురావడంలో ఎంతో మంది విమర్శకులు కృషి చేశారు. అటువంటి వారిలో ఆచార్య లక్ష్మీకాంతంగారు (1894–1972) తొలి తర పరిశోధకులుగా, తొలి తర విమర్శకులుగా ప్రసిద్ధి చెందినవారొకరు. తెలుగులో అప్పుడప్పుడే పరిచయమవుతున్న నవల, కథానిక, ఆధునిక నాటకం, సాహిత్య విమర్శ మొదలైన ప్రక్రియలకు స్పష్టతనివ్వడానికి ఆయన ఎంతగానో ప్రయత్నించారు. ఈ దృష్టి ఆయన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర', 'సాహిత్య శిల్ప సమీక్ష', 'గౌతమ వ్యాసాలు' అనే పరిశోధనాత్మక, విమర్శనాత్మక గ్రంథాల్ని పరిశీలిస్తే తెలుస్తుంది. ఆంగ్ల విమర్శకుల్లో 'William Henry Hudson' (1841–1922) ఒకరు. ఆయన 'An Introduction to the Study of Literature' (1910) అనే విమర్శ గ్రంథాన్ని రచించారు. దీన్ని ఆధారంగా చేసుకొని పింగళి లక్ష్మీకాంతం గారు 'సాహిత్య శిల్ప సమీక్ష' (1966) అనే గ్రంథాన్ని రచించారు. దీనిలో సాహిత్య విమర్శకు సంబంధించిన అనేక అంశాల్ని చెప్పారు. వాటిని గురించి ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేస్తాను. ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల్లో నవలా, వ్యాసం, జీవిత చరిత్ర, విమర్శ అనేవి ముఖ్యమైనవి. ఈ ప్రక్రియల తత్వాన్ని, స్వరూప, స్వభావాల్ని, లక్షణాల్ని, ప్రయోజనాల్ని గురించి తమదైన శైలిలో మనకు తెలియజేశారు.

### 5.7.1.కావ్య భేదాలు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు 'కావ్య భేదాల' గురించి విద్యార్థులకు బోధించారు. సాహిత్యంలో ఉన్న కావ్య ప్రక్రియల గురించి వివరణాత్మకంగా వివరించారు. అంతేకాకుండా భారతీయ ఆలంకారికులు, పాశ్చాత్యులు తెలిపిన కావ్య భేదాలలోని వివిధ అంశాలతో సమన్వయించి వాటి లక్షణాలను, సాదృశ్యాలను, విభేదాలను వర్గీకరించారు. ఆయన కావ్య భేదాలను సోదాహరణంగా వివరించీ నిర్వచనాలను తెలియజేసే ప్రయత్నం చేశారు.

సాహిత్యంలోని పద్యకావ్యాలను నిబద్ధ, అనిబద్ధ అనే రెండు విధాలుగా విభజించారు. నిబద్ధ కావ్యం అంటే ఏమిటో, నిబద్ధకావ్య నిర్వచనాన్నీ తెలిపారు. ''సంధి సామాగ్రీయుతమై ప్రకృష్టమైన బంధము కలిగి విస్తృతోదాత్తమైన ఇతివృత్తము గల కావ్యమే నిబద్ధకావ్యం'' అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) అన్నారు. దీన్నే 'దండి' సర్గబంధమని, మహాకావ్యమని పిలిచారని అన్నారు. తెలుగు సాహిత్యంలో నిబద్ధ కావ్యాన్నీ ప్రబంధాలుగా పిలుస్తారని అన్నారు.

నిబద్ధ కావ్యాన్ని సంధి సామగ్రిని (unifying factors) నిర్వచిస్తూ ''*ఒక కావ్యములో గల పద్యములనన్నిటిని పూలదండవలె ఏకసూత్రమునకు నిబంధించెడి ఒక కథయు,*

*ఆ కథ నలంకరించెడి వర్ణనలును, దానిని నడిపెడి పాత్రలును మొదలైన సాధనములతో ఆద్యంతములకు అవిచ్ఛిన్న సంబంధము కలిగించెడి రచన. ఇదియే నిబద్ధ కావ్యము.''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) పింగళివారు నిర్వచించారు.

అనిబద్ధకావ్యాలలో అంతర్గతంగా పంచరత్నాలు. నవరత్నాములు, శతకములు, నక్షత్రమాలికలు, ఖండకావ్యాలు అనేవి అనేక రకాలుగా ఉంటాయని చెప్పారు. ముక్తకం అంటే ఏమిటో ఆయన నిర్వచిస్తూ *''స్వయంసమగ్రమై రమణీయమగు పద్యము ముక్తకం''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) అనబడుననీ ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తెలియజేశారు.

### 5.7. 2. కులకం నిర్వచనం:

''క్రియాశీల సమాప్తికై పరస్పరాపేక్షగల ఐదు పద్యములు సముదాయము'' అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) కులకమని ఆయన నిర్వచించారు. అలంకారశాస్త్రములలో పురాణేతిహాసములు కావ్యములుగా పరిగణింపబడలేదు. ఆశాస్త్రము కావ్యసౌందర్య విమర్శనముకొరకు పుట్టినదగుటచేతను, ఆ సౌందర్యమునకు ప్రథమ హేతువు. కులకంలో ఇతివృత్తాన్ని *గురించి చెబుతూ ''ఆ కథ ఉత్తమ నాయకాశ్రయమైననేగాని సుందరముకాదు గనుకను, ఏక నాయకాశ్రయత్వము, వస్త్వైక్యములేని గ్రంథములను ఆలంకారికులు మహాకావ్యములుగా గైకొనరైరి''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:99) అన్నారు. దీనులోని మహాకావ్యాల గురించి ఆలంకారికుల మనోగతాన్ని తెలియజేశారు. అయితే ఈ ప్రమాణాలను బట్టి పురాణేతిహాసాలు కావ్యాలు కావని ఆలంకారికులు చెప్పిన అభిప్రాయాన్ని సమర్థించారు. తెలుగులో పురాణేతిహాసాల నుంచి సాహిత్యాన్ని వేరు చెయ్యలేమనీ, కవులు పురాణేతిహాసాలను స్వీకరించి కావ్య కళాదృష్టితో రసవంతంగా స్వతంత్ర కావ్యాలుగా తీర్చిదిద్దారనీ వీటినే ప్రబంధలుగా వ్యవహరిస్తున్నామని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు.

### 5.7. 3. కావ్యం– ప్రబంధం:

రాయల యుగాన్ని పింగళి లక్ష్మీకాంతం గారు మూడు వర్గాలుగా విభజించారు. అవి రాయల యుగం, రాయల సమకాలికుల యుగం, రాయల అనంతర యుగం అని విభజించారు. రాయల యుగంలో ప్రధానంగా ప్రబంధాలే ఆవిర్భవించడం వలన ఈ యుగానికి ప్రబంధ యుగం అనే పేరుతో సాహిత్య చరిత్ర కారులు పిలుస్తున్నారు. ఈ ప్రబంధాలు స్థూలంగా పురాణాలకు భిన్నమైనవనీ, మహాపురాణామనీ, ఖండపురాణామనీ కూడా పిలవచ్చుననీ పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు.

భారతీయ ఆలంకారీకుల అభిప్రాయం ప్రకారం కావ్యాలను నిబద్ధకావ్యాలని అనిబద్ధ కావ్యాలని వర్గీకరించారు. నిబద్ధ కావ్యాలలో కవిత్వపరంగాకొన్ని నిబంధనలు ఉంటాయి.

అనిబద్ధ కావ్యాలలో నిబంధనలుండవు. శతకాలు, నక్షత్రమాలలు మొదలైనవి. నిబద్ధ కావ్యంలో కథాశ్రయంగాను, అనిబద్ధ కావ్యంలో భావాశ్రయంగాను ఉంటుందని పింగళి వారు అన్నారు. అలంకారికకుల ప్రకారం ప్రబంధం అంటే ఏమిటో వాటిలో ఉండే ప్రత్యేక లక్షణాలను చూద్దాం.

1. అష్టాదశవర్ణనా భూయిష్ఠము.

2. ఉదాత్తేతివృత్తము, నుత్తమ నాయకాశ్రితము,

3. ఏకనాయకాశ్రయము. ఇది ప్రబంధమును పురాణేతిహాసముల నుండియు నిబద్ధకావ్యముల నుండియు వేఱుచేయును.

4. రసప్రాధాన్యము.

5. నాటకమునందు వలె ముఖము నుండి నిర్వహణసంధి వఱకు వికాసము సక్రమముగా జరుగవలయును.

6. ఆశ్వాసములుగా విభాగింపబడవలెను.

రాయల యుగంలోనే ప్రబంధ సాహిత్యం వెలువడినాయని సాహిత్య లోకానికి తెలిసిందే. కానీ రాయల యుగం కంటే ముందే కొన్ని ప్రబంధ లక్షణాలతో కూడిన కొన్ని రచనలు వచ్చాయని పింగళి లక్ష్మీకాంతం గారు పేర్కొన్నారు. వాటికి సంబంధించిన అంశాలను ఇలా వివరించారు.

1. నన్నెచోడుని కుమారసంభవమున బ్రబంధకర్త యపేక్షించు వస్త్వైక్యము లేదు. ప్రబంధేతివ్రత్తమును మించి పురాణేతివృత్తము గలదయ్యెను. వర్ణనాదులలో బ్రబంధ లక్షణము లనేకములు గలవు.

2. సంస్కృత రామాయణమేక నాయకాశ్రయ మగుట కావ్యము. కాని తెనుగు రామాయణము పురాణేతిహాసములలో జేర్చదగినది. సంస్కృత భారత మితిహాసము. భాగవతము పురాణము.

3. ఎఱ్ఱన నృసింహపురాణములో ప్రబంధమునకు జీవగఱ్ఱ యైన పాత్ర నిర్మాణము లేదు.

4. నైషధము శుద్ధమగు ప్రబంధమే గాని భాషాంతరీకరణ మగుట రాయల నాటి ప్రబంధమునకు భిన్నము. మనుచరిత్ర వంటిది కాదు.

5. హరవిలాసము నిబద్ధకావ్య మయ్యు నందు వస్త్వైక్యము లేదు.

6. శృంగారశాకుంతలమున గొంత యనుకరణము, కొంత స్వతంత్రము.

7. విక్రమార్క చరిత్ర, భోజరాజీయము – ఇవి పురాణములును గావు, ప్రబంధములును గావు. చిత్రకథాత్మకములు. ప్రత్యేకములు.

8. గౌరన హరిశ్చంద్ర యేకనాయకాశ్రయమును వస్త్వైక్యము గలదియు నయ్యును. నాలంకారికరీతిలేమి ప్రబంధము గాదు'' అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018: 372) సత్కావ్యా లక్షణాలను అవి కావ్యంలో ప్రతిఫలించే విధానాల్ని పింగళి లక్ష్మీకాంతంగారు క్రోడీకరించారు.

**5.7.4. రాయల యుగం ప్రబంధ లక్షణాలు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం ప్రత్యేకంగా ప్రబంధాలు వాటి లక్షణాలను ఈ కింది విధంగా తెలియజేశారు.

1. స్వతంత్ర రచనలు, భాషాంతరీకరణములు గావు.

2. పురాణాంతర్గతోపాఖ్యానములను నిమిత్తములుగా గైకొని యా యస్థిపంజరములను మాంసలములుగా సర్వావయవసుందరములుగా నున్మీలితములు చేసిన స్వతంత్ర చిత్రణములు. భాషాంతరీకరణముగాని స్వతంత్ర రచనయే యీ ప్రబంధమున కాయువుపట్టు.

3. ఆలంకారిక శైలి, అర్థాతిశాయియైన శబ్దము, ప్రాయికముగా శృంగారరస ప్రాధాన్యము కలిగినవి ప్రబంధాలు.

**5.7.4.1. ప్రబంధ నిర్వచనం:**

*''కథైక్యం కలిగి, అష్టాదశ వర్ణనలు కలిగి, శృంగార రసప్రధానమై అర్థాతిశాయియైన శబ్దముండి ఆలంకారిక సాంకేతికలములకు విధేయమై ఆనతి విస్తృతి గల ఇతివృత్తముతో భాషాంతరీకరణముగాక స్వతంత్ర రచనయే తెలుగు కావ్యము ప్రబంధము''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:372) ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు నిర్వహించారు. తెలుగు సాహిత్యంలో శ్రీకృష్ణదేవరాయల కాలం ప్రబంధ యుగానికి స్వర్ణయుగం అన్నారు. ప్రబంధానికి, కావ్యానికి మధ్య గల భేదసాదృశ్యాలను కూడా చర్చించారు.

ప్రాచీన సాహిత్యంలో కనిపించే సాహిత్య ప్రక్రియలే కాకుండా, ఆధునిక సాహిత్య ప్రక్రియలగురించి కూడా విస్తృతంగానే సాహిత్య శిల్ప సమీక్షలో వివరించారు.

**5.7. 6. నవలా ప్రక్రియ:**

తెలుగులో వచ్చిన నవలా ప్రక్రియ గురించి పింగళివారు చెప్తూ *''ఛందస్సునేగాక ఆలంకారిక శైలిని సయితము విసర్జించి, వర్ణనా చమత్కారమునకు, కథానైపుణికి, పాత్ర చిత్రణకు మాత్రమే ప్రాధాన్యత నొసగిన ఆఖ్యానము నవలయైనది. ఇది వచన వాఙ్మయ సరస్వతికి శిరోభూషణము, ఈ నవలయే ప్రాచీన మానవుడు ఉబుసుపోకకై నేర్పుమై చెప్పిన కథకు పరిణిత రూపము''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:174) నవలను నిర్వచించారు. మరలా నవలలోని ఇతివృత్తం ఏ విధంగా ఉండాలో చెప్తూ *''రమణీయమైన రచన ఉన్నంత మాత్రమున అన్ని కథలును కావ్య విశేషములుగా వన్నెకెక్కవు. కవికి పొడమెడి భావములు, వాటి స్వభావమును బట్టి , కొన్ని ఛందస్సును కోరుటయు, కొన్ని కొరుకుండుటయు తటస్థించుననెడి*

*సూత్రమే ఇంచుక భేదముతో ఇచ్చటను వర్తించును"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:175) తెలిపారు. దీన్ని బట్టి నవలా రచయిత ఇతివృత్తాన్ని తీసుకునే విధానాన్ని పింగళివారు చెప్పారని అర్థమౌతుంది.

నవలలోని కథాకథనం, పాత్రలు ఇతివృత్తంలో భాగంగా వస్తువు సాంఘిక, చారిత్రక అంశాల్ని సోదాహరణంగా తెలియజేశారు. *"క్లుప్తతకూ, చిత్రణకూ మధ్యేమార్గంగా నడిచే ప్రక్రియ నవలిక. కథా శిల్పాన్నీ, నవలా శిల్పాన్నీ రెంటినీ జీర్ణం చేసుకొని కథావస్తు ప్రయోజనం దృష్టిలో వాటి అవసరాన్ని గుర్తించి జాగ్రత్తగా, కత్తిమీద సాములా సాధించవలసిన ప్రక్రియ నవలిక. మంచి నవలికను పొడిగిస్తే నవల కాదు. తగ్గిస్తే కథ కాదు. కానీ నవలికలో నవలలోని చిత్రణా వుంటుంది. కథలోని క్లుప్తతా వుంటుంది. ఈ రెండింటి పరిమితినీ, ప్రయోజనాన్నీ తెలుసుకున్నప్పుడు మాత్రమే మంచి నవలిక కూడా రూపొందుతుంది.*

*నవలను నిర్దుష్టంగ నిర్వచించటం అసాధ్యమని రచయితలు, విమర్శకులు, పాశ్చాత్యులు నవలను నిర్వహించే ప్రయత్నం చేశారు. నవల సమకాలీన జీవిత వాస్తవికత మీద ఆధారపడ్డ కల్పనాత్మక వచన సాహిత్య ప్రక్రియ. ఇది సాధారణంగా కథాత్మకమైంది. ఇందులోని సంఘటనలూ, పాత్రలూ వాస్తవ జీవితానికి ప్రాతినిధ్యం వహిస్తాయి"* అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య (నవలా శిల్పం,2021:19) నవలా సాహిత్య ప్రక్రియను తనదైనశైలిలో నిర్వహించారు.

ఆయనే నవలలోని కథ, కథావస్తువు, పాత్రలు, నేపథ్యం అనే విభాగాలుగా విభజించి వాటి గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. నవల అనేదొక ప్రక్రియగా స్థిరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. తర్వాత కాలంలో అనేకమంది నవల లక్షణాలను చెప్పారు. కానీ, వీటి నేపథ్యం పింగళివారి రచనలో ఉందని దీన్ని బట్టి తెలుస్తుంది.

**5.7.7. ఒక సాహిత్య ప్రక్రియగా వ్యాసం:**

పింగళి వారు తెలుగు సాహిత్యంలో విశేషమైన ఆదరణ పొందుతున్న వ్యాసం అనే ప్రక్రియను నిర్వచిస్తూ ఇలా *"ఆహ్లాదజనకత్వము లేక, విషయ ప్రధానములయ్యు మనోహరమైన శైలిలో వ్రాయబడిన కొన్ని రచనలు సాహిత్య కక్షకు చెరును. అంత మాత్రమున అవి కావ్యములు కాజాలవు అదియే వ్యాసములు"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:182) వ్యాసాన్ని నిర్వచించారు.

తెలుగు వ్యాస ప్రక్రియ గురించి ఇనాక్ గారు పరిశోధన చేశారు. ఆయన తన సిద్ధాంత గ్రంథంలో వ్యాసంలో చెబుతూ " వ్యాసంలో వచనత్వం, అవిశాలత్వం, విశృంఖులత్వం,

విచిత్రత్వం, హాస్యత్వం, సృజనత్వం, అసంపూర్ణత్వం, వ్యక్తిత్వం, ప్రధాన లక్షణాలుగా స్వీకరించవచ్చు. ఇందులో కొన్ని లక్షణాలు లోపించినా ఆ రచన వ్యాసమవుతుంది'' అని ( తెలుగు వ్యాస పరిణామం:99) తెలియజేశారు.

పింగళివారే మరలా వ్యాసంలో భాగంగా ఉపన్యాసకుడి ఇచ్చే ఉపన్యాసం ఎలా ఉంటుందో చెప్తూ ''*శబ్ద వ్యుత్పత్తిని బట్టి వ్యాసము, ఉపన్యాసము సమానార్థకములు. ఒక వక్త విద్వత్సదస్సు నెదుట నిలబడి ఏ విషయమును గురించి మైననుసభ్యముగా, సరసముగా ఇంపు గొల్పెడి భాషలో ఒక పరిమిత కాలంలో ఆశువుగా ప్రసంగము చేసెననుకొందము. ఆ ప్రసంగమును తూచా తప్పకుండా సమర్థుడైన లేకరి*'' అని(సాహిత్య శిల్ప సమీక్ష,1966:182) వ్యాస కళను నిర్వచించారు.

వ్యాసాన్ని లేదా ప్రసంగాన్ని ఉపన్యసించే వక్తను తెలుపుతూ ''తాను చెప్పదలిచిన విషయమును గురించిన సంపూర్ణ పరిజ్ఞానము కలిగి చెప్పదగిన పరిమితి నెరిగి, చెప్పగలిగిన భాషాధికారముండి, తనవలెనే నేతృత్వము గల సభ్యుల ఆమోద మును పొందగల ప్రసంగమును చేసినవాడే వక్త అనిపించుకొనును'' అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:182) ఉపన్యాసాన్ని నిర్వచిస్తూ ఉపన్యాసకుడి గురించి వివరించారు. వ్యాస విషయాల్లో ప్రబోధం, వివరణ, విమర్శ అనే ప్రధానమైన విభాగాలు ఉంటూ, ఆ వ్యాసాల్ని వివరణ వ్యాసాలని, విమర్శ వ్యాసాలని, సాహిత్య వ్యాసాలని భిన్న విధాలుగా వర్గీకరించారు. దీన్ని బట్టి వ్యాసంలో ఉపన్యాసం, వక్త, రచయిత ప్రధాన భాగాలుగా ఉంటారని పేర్కొన్నారు.

### 5.7.8. సాహిత్య ప్రక్రియగా జీవిత చరిత్ర:

'జీవితచరిత్ర' ప్రక్రియ గురించి పింగళివారు అనేక విషయాల్ని తెలిపే ప్రయత్నం చేశారు. జీవితచరిత్ర యొక్క గొప్పతనాన్ని వివరిస్తూ *''ఒక మహాపురుషుని జీవిత మహత్త్వలోకము చేత కలిగిన అబ్బురపాటు ప్రేరణ కాగా, ఆ మహాత్త్వ విశిష్టతను లోకులకు తెలుపుటకై వ్రాయబడే కథయే జీవిత చరిత్ర''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:185) జీవిత చరిత్రను పరిశోధనాత్మకంగా పింగళివారు నిర్వచించారు. దీన్ని బట్టి జీవితచరిత్రను రాసేవారు విశిష్టమైన గుణాలను, స్వభావాలను కలిగి ఉండాలని అవగతమౌతుంది.

ఆయన మరలా ఇంకో విధంగా ''*జీవిత చరిత్ర ఏ వ్యక్తి యొక్క చరిత్రను చెప్పుటకు ఉద్దేశించునో అతని ఆత్మను వ్యక్తముచేయుటకు యత్నించును. ఆ వ్యక్తి జీవితము నందు ఏయే ఘట్టములు అతని మహాత్త్వ నిరూపణమునకు ఉపకరించునో ఆ ఘట్టములు కాల క్రమానుసారముగా సంఘటింపబడి విననింపైన కథా రూపమున వ్రాయబడినప్పుడే జీవిత చరిత్ర, చరిత్ర అనిపించుకొని ఆఖ్యానమై వాఙ్మయశాఖకొటికెక్కును*'' అని (సాహిత్య శిల్ప

సమీక్ష,1966:185) జీవిత చరిత్రను ఎలా రాయాలో దాని లక్ష్యాన్ని సోదాహరణంగా పింగళివారు వివరించారు.

జీవిత చరిత్ర ప్రక్రియ యొక్క లక్షణాల్ని తెలిపారు. అవి వరుసగా 'జీవిత చరిత్రలో కల్పనలు ఉండరాదు. 'దేశ చరిత్ర లాగా జీవిత చరిత్రలో కూడా యదార్థ కథనమై సత్యకథనమై ఉండాలి. జీవిత చరిత్రలో కల్పనలకు ప్రాధాన్యతకు అవకాశం లేని రచన కనుకనే దీనికి కావ్య శిల్ప గౌరవం దక్కలేదు. జీవిత చరిత్రలో కథ పురుషుని జీవిత మహాత్త్వమే ఆ చరిత్రకు సౌందర్యం. మానవ నాగరికతాభివృద్ధికి కారణభూతమ్యే వ్యక్తి యొక్క నడవడిక. ఇది జీవిత చరిత్రకు వస్తువుగా ఉపకరిస్తుంది. ఆ వ్యక్తి సర్వ మానవ కోటికి, తన జాతికి సాంఘికంగాను, రాజకీయంగాను, మహా పరోపకారం చేసే స్వార్థం లేని జీవితమే అతని చరిత్ర. అది కొంత కాలమైన తరువాత లోకానికి గొప్పదవుతుంది. అని జీవిత చరిత్ర ప్రక్రియ లక్షణాల్ని వివరించారు. అంతేకాకుండా స్వీయచరిత్ర, లేదా ఆత్మకథను తెలుపుతూ *“వ్యక్తి లేదా రచయిత తన జీవితాన్ని గురించి తానే అంతర్, బహిర్ అంశాల్ని వదలకుండా రాసుకోవడమే ఆత్మకథ అవుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ స్వీయ చరిత్రలో వాస్తవిక దృక్పథానికి అధిక ప్రాధాన్యతనిచ్చినప్పుడే ఆ రచనకు నిజమైన విశ్వసనీయత సమకూరుతుందని”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:186) పింగళివారు ఆత్మకథను నిర్వచించారు. అలాగే కవుల జీవిత చరిత్రలు సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఉపయోగపడతాయని తన అభిప్రాయాన్ని పింగళివారు పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యంలో 'జీవితచరిత్ర' ఆధునిక ప్రక్రియగా ఈ జీవితం చరిత్ర గురించి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తన అభిప్రాయాలను సాహిత్య శిల్ప సమీక్షలో విశ్లేషణ చేశారు. జీవిత చరిత్రకు సంబంధించిన నిర్వచనాన్ని, లక్షణాలను, స్వరూప స్వభావాలను విశదీకరించారు. సాహిత్యంలో ఒక వ్యక్తికి సంబంధించిన జీవితాన్ని జీవి తం చరిత్రగా ఏవిధంగా రాయాలో ,ఎలాంటి విషయాలను సేకరించి, విశ్లేషణాత్మకంగా తెలిపారు. *“ఒక మహాపురుషుని జీవిత మహత్త్వాలోకముచేత కలిగిన అబ్బురపాటు ప్రేరణ కాగా, ఆ మహత్త్వ విశిష్టతను లోకులకు తెలుపుటకై వ్రాయబడెడి కథయే జీవిత చరిత్ర అంటారని చెప్పారు. జీవిత చరిత్ర, ఏ వ్యక్తి యొక్క చరిత్రను చెప్పుటకు ఉద్దేశించునో, అతని ఆత్మను వ్యక్తముచేయుటకు యత్నించును. ఆ వ్యక్తి యొక్క జీవితమునందు ఏయే ఘట్టములు అతని మహత్త్వనిరూపణమునకు ఉపకరించునో, ఆ ఘట్టములు కాలక్రమానుసారముగా సంఘటింపబడి, వినసింపైన కథారూపమున వ్రాయబడునపుడే జీవితచరిత్ర ”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:185) పింగళివారు జీవితచరిత్ర ప్రక్రియ యొక్క నివ్వచనాన్ని తెలియజేశారు.

జీవితచరిత్రను రాయడానికి ఏలాంటి వ్యక్తుల జీవితాలను వస్తువుగా ఎన్నుకోవాలి, వారి గుణ గణాలు సమాజానికి ఏ విధంగా మార్గదర్శకంగా ఉపయోగపడుతుందో మొదలైన అంశాలను గుర్తించి జీవితచరిత్రను రాయాలన్నారు. దేశ చరిత్ర కంటే వ్యక్తి జీవిత చరిత్ర గొప్పది. ముఖ్యంగా దేశ చరిత్రలో ఒక రాజకీయ అంశాలు గాక ఆ దేశంలో ఆ జాతిలో నిర్మించిన మహాపురుషుని ప్రవృత్తిని ఎంతో విశిష్టతగా ఇతివృత్తాన్ని తీసుకొని సుందరమైన రచనగా చేయడాన్ని జీవిత చరిత్రగా రాయడం ఒక విశేషంగా చెప్పుకోవాలి.

ఇందులో ఆ వ్యక్తికి సంబంధించిన అంతర్గతంగా, బహిర్గతంగా బుద్ధిగతమైన స్వభావాన్ని, ఒక సౌందర్యాత్మకంగా చిత్రించాలి. విషయాన్ని బట్టి, శైలిని బట్టి జీవిత చరిత్ర ఒక సాహిత్య ప్రక్రియగా పరిగణించబడుతుంది. ఒక రచన సాహిత్యంగా రావాలంటే రమణీయమైన శైలియే ప్రధానాంశం. అయితే జీవితచరిత్రలో ఏలాంటి కల్పనలు లేకుండా కేవలం యదార్థ సత్యాలు, సంఘటనలను స్ఫురించేలా ఉండాలి. చారిత్రక కావ్యాలను రాసిన కవులు సైతం సుందర కల్పనల వలన శుద్ధ చారిత్రక అంశాలను కావ్యాలుగా రాయగలుగుతున్నారు.

### 5.7.9. సాహిత్య విమర్శ ప్రక్రియ:

విమర్శరంగం ఒక ప్రక్రియగా పరిశోధకులు భావిస్తున్నారు. పింగళివారు తెలుగు విమర్శ ప్రక్రియను తెలుపుతూ "*విమర్శ యనగా ఒకరు చేసిన పనియందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట*" అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:190) విమర్శ ప్రక్రియను నిర్వహించారు.

అంటే విమర్శలో మంచి, చెడులను విడమరిచి దాన్ని విలువను నిర్ధారించడమే విమర్శ అని అర్థం చేసుకోవాలని దీన్ని బట్టి తెలుస్తోంది. విమర్శకు ఉండవలసిన ప్రమాణాలేమిటని చెప్తూ "*తనకు నచ్చినదెల్ల మంచి అనియు, తనకు నచ్చనిదెల్ల చెడు అనియు ఎవ్వడైన అన్నచో ఆ మాట ప్రమాణికము కాదు. తనకు నచ్చుటకు శిల్పములోని గుణ విశేషముగాక ఇతర కారణములు వేరే ఉండవచ్చును*" అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:191) తెలియజేశారు.

విమర్శ ప్రమాణాల్ని పింగళివారు తెలిపారు. విమర్శకుడికి ఉండవలసిన లక్షణాల్ని కూడా చెప్పారు. అవి విమర్శకుడికి వ్యక్తిగత ద్వేషం ఉండకూడదు. విమర్శకుడు రాగద్వేషాలను ప్రదర్శించకూడదు. విమర్శకుడు సహృదయుడై ఉంటూ వివేచనా శక్తిని కలిగి ఉండాలి. విమర్శకుడుకి ప్రతిభా, అభ్యాసం, వ్యుత్పత్తి, శాస్త్ర పరిజ్ఞానం, ఛందస్సు, వ్యాకరణం, అలంకారాలలో ప్రవేశం ఉండాలి. కావ్య విమర్శకుడు అలంకార శాస్త్రాలతో పాటు ప్రాచీన సారస్వతాన్ని పఠించాలని సూచించారు. అలాగే సాంకేతిక విమర్శ, అలంకార విమర్శ, సహృదయ విమర్శ పద్ధతుల్ని సోదాహరణంగా వివరించారు. అదే విధంగా విమర్శ ప్రక్రియకు

అనేకమంది నిర్వచించే ప్రయత్నం చేశారు. వారిలో వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు ఒకరు. ఆయన 'నవలా శిల్పం', 'కథా శిల్పం', 'విమర్శా శిల్పం' అనే గ్రంథాల్ని రచించారు.

వల్లంపాటివారు విమర్శ ప్రక్రియను ఇలా చెబుతూ "*విమర్శ సంపూర్ణమైన కళాకాదు. శాస్త్రమూకాదు. కళగా ప్రారంభమై శాస్త్ర లక్షణాలను సంతరించుకుంటూ ఉన్న సాహిత్య ప్రక్రియ*" అని వల్లంపాటి వెంకటసుబ్బయ్య (విమర్శా శిల్పం,2002,:21)విమర్శ ప్రక్రియకు తనదైన శైలిలో నిర్వచనమిచ్చారు.

ఇవే కాకుండ విమర్శ లక్షణాలను తెలిపారు. అవి విమర్శకుడు ఉత్తమ పాఠకుడై ఉండాలి. విమర్శకుడికి రాగద్వేషాలు లేకపోవడం, విమర్శకుడు సహృదయత కలిగి ఉండటం, విమర్శకుడు సృజనశీలిగా ఉండటం అనేవి విమర్శా లక్షణాలు వల్లంపాటి వారు తెలిపారు.

ఇంకా సాహిత్య శిల్ప సమీక్ష లో భారతీయ ఆలంకారిక సిద్ధాంతాలు, మనోవైజ్ఞానిక అంశాలతో సాహిత్యాన్ని అధ్యయనం చేసే పద్ధతినీ, కవిత్వానికి ఉండాల్సి అంశాలను, నాటకంలో విషాదాంత, మోదాంత నాటకాలను సోదాహరణంగా ఒక సైద్ధాంతిక కోణంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతం విశ్లేషించారు. ఇవన్నీ తెలుగు సాహిత్యంలో తొలినాళ్ళలో వివిధ ప్రక్రియలను అవగాహను చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడ్డాయి.

### 5.7.10. నాటక ప్రక్రియ పింగళి వారి దృక్పథం:

పింగళి లక్ష్మీకాంతంగారు 'గౌతమ వ్యాసములు' అనే పీఠికల సంపుటిలో '*అధ్యక్షోపన్యాసం*' అనే వ్యాసం ఉంది. ఇది నాటక సాహిత్యానికి సంబంధించిన వ్యాసంగా కనిపిస్తుంది. దీనిలో తెలుగు నాటకం యొక్క వివిధ పరిణామాలను దాని విశిష్టతను చక్కగా వివరించే ప్రయత్నం చేశారు. నాటక ప్రక్రియ గురించి, ఆ రచనలోని ప్రత్యేకతను గురించి, నటుల గురించి, నాటి నాటక సాహిత్యానికి సేవలు వివిధ నాటక సంస్థలు గురించి ఎంతో లోతుగా పింగళివారు విశ్లేషించారు. నాటి నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు, నాటక సంస్థల పనితీరు, నాటకాలను ప్రజలు ఆదరించిన తీరు తెన్నులను సమన్వయం చేస్తూ తెలియజేశారు. నిజానికి నాటి నుంచి నేటి వరకు నాటక గురించి లక్ష్మీకాంతంగారి దృక్పథాలను ఈ వ్యాసంలో దర్శించవచ్చు. ఆయన నాటక ప్రక్రియ విశేషాలను తెలియజేస్తాను.

"*పదిమందికి జీవనాధారము కల్పించుటయే యీ పెద్ద కంపెనీలు చేసిన మొదటి మేలు. ఈ మేలును బట్టి చాలకీడును వచ్చినదందురా? అది నటుల లోపము గాని ఆ యజమానులు దొసగు కాదు. డబ్బుకు కక్కుర్తి, పడి ఎవరికి వారు సర్వతంత్ర స్వతంత్రులమని అనుకోవటం, నటులలో ద్వేషాసూయలు – ఇవి నాటకరంగ పతనానికి కారణాలని లక్ష్మీకాంతం గారు 1937 లోనే చెప్పగలిగారు*" అని (గౌతమ వ్యాసములు,1952:56) పేర్కొన్నారు. దీన్ని బట్టి నాటి

నాటక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఇవ్వడాన్ని 'ఉత్తమ నాటక రచన' పేరుతో బహుమతులివ్వడాన్ని లక్ష్మీకాంతంగారు తిరస్కరిస్తూ ఆయన తీర్పు ఇచ్చారు.

నాట్యపరులను, సాహితీపరులను సంతోషపెట్టగల నాటకములు సార్వజనీనములు. అవి యుత్తమ నాటకములు. అట్టివానిని చూచుకొని నటులు ప్రదర్శనమునకు గైకొనమును. అట్లు గాక సాహితీ గుణమును లోపింపజేసి, ప్రయోగార్హత మాత్రమే యుండునట్లు వ్రాయుమని మనము నిర్దేశింప కవి శబ్ద వాచ్యుడెవ్వడును వ్రాయడు. నాటకేతివృత్తం ఏదైనా లక్ష్మీకాంతం గారికి ఆమోదమే. నాటక వస్తువులో తిరస్కారం, పురస్కారం అనేవి లేవని చెప్పారు.

నాటకంలో *"క్రొత్త కల్పనల వలన వాఙ్మయమునకు పుష్టి కలుగునే కాని నష్టం రాదు అనగలిగిన ముందు చూపు ఆయనది. నాటకాలలో పద్య రచన అవసరమని లక్ష్మీ అభిప్రాయం. వ్రాయవలసిన చోట పద్యం వ్రాయకపోవటం వల్ల రసానుగుణంగా పద్యం పాడటం తెలియకపోవడం వల్ల పద్యం ఆటంకమనే భావన పుడుతోందని చక్కగా వివరించారు. నాటకాలలో పద్యాలు తుడిచి వేయడం వాంఛనీయమైన సంస్కారం కాదని చెప్పారు. లోక ధర్మాన్ని బట్టి తలపించడమే కళాధర్మం కానీ లోకధర్మమే కళాధర్మం కాదు"* అని (గౌతమ వ్యాసములు,1952, పుట: 50) పింగళి వారు తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు దీన్ని బట్టి ఆయనకు నాటక సాహిత్యం పట్ల ఒక లోతైన ప్రవేశం ఉందని తెలుస్తుంది. నిజానికి ఆయన విద్యార్థి దశలోనే నాటకాలను చూడడం, దాన్ని ఆదరించడం వలన ఆయనకు ఈ నాటక ప్రక్రియను ఎంతో ఆసక్తితో వివరించే ప్రయత్నం చేశారని అవగతమౌతుంది. పింగళివారు సాహిత్య శిల్ప సమీక్షలో నాటక ప్రక్రియ విశేషాలను, పాశ్చాత్య నాటకాలలోని కామేడి, ట్రాజడి వంటి వాటిని తనదైన శైలిలో లోతుగా విశ్లేషించే ప్రయత్నం చేశారు వాటిని తెలుసుకుందాం.

### 5.7.10.1. నాటకంలో అంకం:

లోకంలో జరిగిన వృత్తాంతంలో ఒక సంఘటనను అంకంలో బంధించి, కథ ఎంత దీర్ఘకాలమైన కావచ్చు. కానీ ఒక్కొక్క అంకంలో ఆ దీర్ఘకాలంలో ఒక్కొక్క రోజున జరిగిన దాన్ని మాత్రమే తీసుకోవాలని పింగళి లక్ష్మీకాంతం అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు శాకుంతలం కథ మూడు సంవత్సరాల పాటు జరిగింది. ఈ నాటకం ఏడు అంకాలుగా ఉందని విమర్శకులు అంటున్నారు. అయితే ఈ ఏడు అంకాల కథను ఏడు రోజుల పాటు తీసుకోవాలి. కథలో వెలితి ఉందని గాని ఏడు రోజుల కథ అని కవి మనస్సు భావించకుండా ఇతివృత్త సన్నివేశాల చాతుర్యాన్ని ప్రదర్శిస్తారు.

దీన్ని పింగళివారు ఈ విధంగా చెబుతూ *"శాకుంతలం నాటకంలో శకుంతలాదర్శనము మొదలుకొని పుత్రసంప్రాప్తి వరకు గల దుష్యంతుని చరిత్రలో ఆయువు పట్టు చెప్పదగిన దినములు ఏడింటిని గ్రహించి ఆ దినములలో జరిగిన చరిత్రను ఏకత్ర సంఘటించి*

*మిగిలిన బహుదిన ప్రవృత్తమైన చరిత్రను కాళిదాసు మనచే విస్మరింపజేసెను''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:121) తెలిపారు.

దీన్ని బట్టి అంకంలో కేవలం కథను కేవలం ప్రదర్శనా యోగ్యమైన భాగాన్ని మాత్రమే గ్రహించాడని తెలుస్తుంది. అంకంలో కథ ఒకటి రెండు పాత్రలే కాకుండా అనేక పాత్రలు ప్రవేశంలో తగిన విస్తృతి ఉండే విధంగా ఉండాలి. అంకంలో కథ నాటక లక్షణాలతో ఉంటూ బీజానుగుణంగా బిందు వ్యాప్తిగా ఉండాలి కనుక కథకు ఆది, మధ్య, అంతము అనే దశలుండాలి. ఈ దశలు క్రమంగా బీజం, బిందువు కార్యాలనే ఈ నాటక పరిభాషలో చెప్పుకోదగినవి అని పింగళివారు పేర్కొన్నారు.

నాటక లక్షణాలలో బీజం అంటే ఏమిటి చెబుతూ *''కవి నాటక కథను ఏ ప్రయోజనం కోసమైతే ప్రారంభించునో ఆ ఫలమును ఇచ్చుటకు సమర్థమైన ఉపక్రమణమునకు బీజం''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:122) పేరు ఉందని చెప్పారు. బిజం గురించి చెప్పి తరువాత బిందువు గురించి చెప్పారు.

''శక్తివంతమైన ఆ ఉపక్రమము బట్టియే కథా విస్తృతి వికాసములు ఘటిల్లును. ఆ నాటక వికాసమునకు బీజంనందలి శక్తి యొక్క వ్యాప్తియే కారణము. దీనినే ఈ లక్షణమున బిందువు'' అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:122) అంటారని పింగళివారు తెలియజేశారు.

అంకం బీజానికి అనుగుణంగా బిందువుగా పరివ్యాప్తి చెందాలంటే ఇతివృత్తం యొక్క ఈ క్రమ వికాసం జరగాలని ఆయన అన్నారు. దీన్ని బట్టి ప్రతి అంకంలో ఇతివృత్తం ప్రదానం. అంకంలో ప్రదర్శనీయమైన కథా మాత్రమే ఉండాలని, ప్రదర్శించలేనివి, ప్రదర్శించరానివి అనే వాటిని అయోగ్య, అసంభావ్య, అనావశ్యక అనే పదాలను సూచించారు. ఇవన్నీ అర్థోపక్షేపకాలలో అంతర్లీనంగా ఉంటాయని అన్నారు. మరలా అంకంలో దృశ్య కథ ఉండాలని అంకం ముగింపులో పాత్రలన్నీ నిష్క్రమించాలని పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు.

**5.7.10.2. నాటకంలో పంచ సంధులు:**

నాటక నిర్మాణానికి 'పంచ సంధులు' అనేవి ప్రాణవాయువు వంటివి. రచయిత నాటక నాటకాన్ని రచించడానికి తాను తీసుకున్న వస్తువు క్రమ వికాస పరిణామం పొందడానికి ఏ విధంగా సన్నివేశపరుస్తాడో, ఆ విధంగా ఊహించుకుని ఏర్పరచుకొన్న కథా ప్రణాళికల భాగాల్నే అర్థ ప్రకృతులు అంటారని కొందరు పరిశోధకులు భావిస్తున్నారు. దీన్ని ఆంగ్లంలో 'Elements of plot' అని పిలుస్తారు. ఈ అర్థప్రకృతులలో ఏ భాగంలో ఏ కార్యదశను నిర్బంధించుకొనాలని భావించి కవి దాని ప్రకారం కథను నిర్మిస్తాడు. ఈ విధానాన్నే కార్యావస్థలు అని అంటారు. దీన్ని ఆంగ్లంలో 'Stages in action' అని అంటారు.

నాటకంలో కార్యం అంటే పాత్రల యొక్క వాక్యం ద్వారా నర్తన ద్వారా జరిగే కథా గమనాన్ని కార్యం అంటారు. అర్థ ప్రకృతులు అనే పేరుతో జరిగే ఆ ప్రణాళిక వివిధ భాగాలతో కార్యావస్థలనే కథా భాగాలుగా పరస్పర విరోధం లేకుండా సమన్వయం అయ్యే సందర్భాలనే సంధి అని అంటారు. ఇక్కడ మరో విధంగా కాకుండా సంధి అంటే పదాలకు అనుకూలం, అవరోధం, సమన్వయం అని అర్థాన్ని కలిగిస్తుంది. నాటకంలో అర్థ ప్రకృతులతో కార్యావస్థలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలో ఒక చక్కటి ఉదాహరణతో పోల్చుతూ *"కర్షకుడు తన పొలమునకు నీరు పెట్టుటకై ముందుగా ఏర్పరచుకొనియున్న మడులు, బోదెలు మొదలగు వాటి వెంటనే కాలువలోని నీటిని పారించుట వంటిదే అర్థ ప్రకృతుల వెంట నాటక కార్యమును నడుపుట"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:126) పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొన్నారు.

**5.7.10.3. నాటకంలో అర్థోపక్షేపకములు:**

నాటకంలో అంకాలు, పంచ సంధులు ఉన్నట్లే అర్థోపక్షేపకాలు అంతర్గతంగా నిర్మితమై ఉంటాయి. నాటక రచయిత స్వీకరించిన ఇతివృత్తం ప్రదర్శన యోగ్యమైన భాగాన్ని అందుకుగాను, ప్రదర్శనీయం కాని దాన్ని అర్థోపక్షేపకంలో చూపిస్తాడు. అంక హితమైన భాగాన్ని కథా గమనాన్ని ప్రత్యక్షంగా జరుగుతుందని దీన్నే నాటకకార్యమని తెలిపారు. అదేవిధంగా అంకాలన్నింటిలోను కథాంశం ఉదాత్తమైన రసవంతమైనవిగా ఉండాలని సూచించారు. ఈ నాటక కార్యం నీరసం, అనుదాత్తం, అనుచితం అనే మూడు కథాంశాల్ని వదిలిపెట్టాలి. ఇవి కథకు అవసరమైతే అర్థోపక్షేపకాల్లో చూపించాలే కానీ పదర్శింపరాదని పింగళివారు అన్నారు. కనుక వీటిని ప్రదర్శనార్థం, కథాంశాలనే అయోగ్యాలనీ, అసంభావ్యాలని, అనావశ్యకాలని ఆయన విశదీకరించారు. విష్కంభం, ప్రవేశిక, చూళిక, అంకాస్యం, అంకావతారం వీటిని అర్థోపక్షేపకాలు అని పిలుస్తారని చెప్పారు. వీటిలో అంకాస్య, అవతారాలు సదృశ్యాలనీ, విష్కంభ ప్రవేశికలు అంక విభాగాలుగా ప్రత్యేక రంగాలుగా ఉంటాయనీ, అంకాస్య, అవతారాలు అంకం చివరిలో ఒక భాగంగా కలిసి ఉంటాయని పింగళివారు తెలిపారు.

సంస్కృత నాటకాలలో పాత్రలు విద్యా సంస్కారాలను బట్టి ఉత్తమ, మాధ్యమ, నీచమ అనే మూడు రకాలుగా విమర్శకులు విభజించారు. వీటిలో ఉత్తమ పాత్రులు సంస్కృత భాషను, నీచ పాత్రలు ప్రాకృత భాషను ఎంచుకొని సంభాషిస్తారు. అలాగే మాధ్యమ పాత్రలు, రాజసేవకులు సంస్కృతాన్నే సంభాషిస్తారు. వీటిలో అంతఃపురజనులు దాసీజనులతో రాణి కూడా ప్రాకృతంలోనే మాట్లాడతారు. అందువల్ల పట్టమహిషి నీచపాత్రగా కనిపిస్తుందనీ, మిగిలిన స్త్రీ పాత్రలన్నీ ప్రాకృత భాషలో మాట్లాడవనీ పింగళివారు పేర్కొన్నారు.

దీనికి ఉత్తర రామచరిత్రలో అరుంధతీ పాత్ర, సీత చెలికత్తెలు వాసంతి, ఆత్రేయ వంటి పాత్రలు సంస్కృత భాషలోనే మాట్లాడతారని ఆయన తెలియజేశారు. నాటక పరిభాషలో చూళిక అంటే ఏమిటి పింగళివారు చెబుతూ *"చూళిక అనగా ఆకాశ భాషణము. అశరీర వాణి గాని, ఒక దేవత మూర్తి గాని లేదా కథకు సంబంధించిన ఒక వ్యక్తి గాని, ప్రవేశింపబోవు ఒక పాత్ర గాని యవనికాంతరము నుండి ఇందు కథా సూచన చేయను"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:123) చూళికను ఆయన నిర్వచించారు.

నాటకంలో ఈ చూళిక యొక్క ప్రయోజనం ఏ విధంగా చెబుతూ " *తెరచాటు నుండి వెలువడెడి చూళికలను సామాజికలు శ్రద్ధతో ఆలకించి, ఆ యర్థమును కథతో సమన్వయ పరుచుకున్నపుడే ఆ అవి సార్థకములగునుగాని, లేనిచో అవి ప్రదర్శనమున నిష్ప్రయోజకములు. కాని ఆ నాటకమును కావురముగా చదువుకొను వేళ కొన్ని ఎడల చూళికలు కల్పించెడి ఉత్తేజము రసపరిప్లుతికి సహాయభూతమగును"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:123) ఆయన చెప్పారు.

**5.7.10.4. నాటక సాహిత్య విమర్శ:**

పింగళివారు 'నా రేడియో ప్రసంగాలు' అనే ప్రసంగాల పుస్తకాన్ని రచించారు. దీనిలో నాటక ప్రక్రియకు సంబంధించిన 'నాటక శరీర బంధం' అనే వ్యాసం ఉంది. దీనిలో తెలుగు నాటక ప్రక్రియ విశేషాలను వాటి లక్షణాలను, స్వరూప స్వభావాలను పింగళివారు సోదాహరణంగా తెలిపారు. పాశ్చాత్య, భారతీయ నాటకాలలో ఉన్న భేదాలను వివరణాత్మకంగా చెప్పారు. ఈ నాటక ప్రక్రియలో నాంధీ, ప్రస్తావన, అంకాలు, అర్థోపక్షేపకములు ఆధునికులు భావించినట్లు నిష్ప్రయోజనములు కావని, రసవంతము కానీ వాటిని ప్రదర్శింపరాదని అన్నారు. ఈ విషయంలో డ్రైడన్, మాథ్యూ ఆర్నాల్డ్ వంటి పాశ్చాత్యులు, మన భారతీయ లాక్షిణికులు చెప్పిన అంశాలను తులనాత్మకంగా వివరించారు. అరిస్టాటిల్ ప్రతిపాదించిన ఐక్యత్రయ సిద్ధాంతములో దేశైక్యము తప్ప కాలైక్యకార్యైక్యములకు సంస్కృత నాటక రచయితలు ప్రాధాన్యము ఇచ్చారు. నాటక భాగాలైన ప్రవేశిక, విష్కంభాలను పాశ్చాత్య నాటకాలలోలాగే భావించవచ్చుననీ పింగళివారు సోదాహరణంగా నిరూపించే ప్రయత్నం చేశారు. నాటక ప్రక్రియ గురించే మరింత వివరంగా చెప్తూ *"మానవ శరీరములో స్థూల దృష్టికి కానరాని శ్వాసకోశ, హృదయ కోశం లాగా నాటక శరీరంలో పంచసంధులకు గల ప్రాధాన్యం గొప్పదని"* తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నాటకంలో ఎంతో కష్టమైన నాటకశరీరబంధంలో అన్ని విషయాలను పాశ్చాత్య నాటక లక్షణాలతో విషాదాంత, మోదాంత నాటక, నాటికి లక్షణాలతో పాటు వాటి స్వభావాల్ని తులనాత్మకంగా తెలిపారు.

పింగళివారు సాహిత్య శిల్ప సమీక్ష అనే గ్రంథంలో సంస్కృత, పాశ్చాత్య నాటకాల్లోని నాయకుని పాత్రను, ప్రతినాయకుని పాత్రను వాటి లక్షణాలను, స్వభావాలను, పరిధులను వివరించారు. దీనితో పాటు ట్రాజెడీ నాటక లక్షణాలను సంస్కృత నాటకాలకు ఆపాదించి సమన్వయం చేయడానికి ప్రయత్నం చేశారు. నాటకంలో నాయకుణ్ణి ఆంగ్లంలో 'Hero' అనే పదం సంస్కృత వీర శబ్దానికి రూపాంతరం. దీన్ని తెలుగులో 'నాయకుడు' అనే పదంతో పిలుస్తారు. ఒక వ్యక్తి నాయకుడుగా ఉండాలంటే అతనికి కొన్ని లక్షణాలు ఉండాలని పరిశోధకులు అంటున్నారు. మహా నాటకంలో నాయకుడు అయ్యే వ్యక్తి మొదట ధీరత్వాన్ని ప్రదర్శించాలి. ఈ ధీరత్వం ఉదాత్తతమో, ఉద్ధతమో, లాలిత్యమో, శాంతమో, అనే గుణాలు ఉండాలని, దీనితో పాటు ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీరశాంతుడు అనే వాటిలో ఒక దాన్ని ప్రదర్శించాలని పింగళి వారు పేర్కొన్నారు.

1. నాయకుడు ధీరోదాత్తుడైనప్పుడు వీర,శృంగార నాటకంగా ఉంటుంది.2. నాయకుడు ధీరోద్ధతుడైనప్పుడు వీరరస నాటకంగా ఉంటుంది. 3. నాయకుడు ధీరలలితుడైనప్పుడు శృంగార నాటకంగా ఉంటుంది. 4. నాయకుడు ధీరశాంతుడైనప్పుడు కరుణ రసం నాటకంగా ఉంటుందని చెప్పారు.ఈ లక్షణాలకు అనుగుణంగా నాయకునిలో ఏ రసం ఉండాలనే దాన్ని ఇలా సమన్వయించారు.

**5.8. ఆలంకారిక విమర్శ –రస సిద్ధాంతం:**

పింగళి లక్ష్మీకాంతంగారు రసవాది. ఆయన స్వయంగా కవికూడా కావడం వల్ల కావ్యాస్వాదనలో ఉండే వివిధాంశాను సందర్భం వచ్చినప్పుడల్లా ప్రస్తావించేవారు. రస సిద్ధాంతంపై ఆయన చేసిన విమర్శ విశిష్టమైంది. భారతీయ ఆలంకారికులు చెప్పిన అంశాల్ని మనోధర్మశాస్త్రం ప్రకారం విశ్లేషించడంలో ఆయన ఆలంకారిక విమర్శకూడా విస్తృత పరిధిలో ఆలోచించవలసిన సిద్ధాంతంగా కనిపిస్తుంది. సాహిత్య శిల్ప సమీక్షలో రససిద్ధాంతాన్ని వివరించేటప్పుడు వివిధ పారిభాషిక పదాలను సృష్టించారు. వాటిని ఏడవ అధ్యాయంలో ప్రత్యేకించి ఆయన రూపొందించిన పారిభాషిక పదజాలం గురించి చేసిన చర్చలో వివరించాను.

**5.8.1, భారతీయ ఆలంకారికులు –రస సిద్ధాంతం:**

భారతీయ ఆలంకారిక సిద్ధాంతాల్లో భరతుని రససిద్ధాంతం కావ్యాన్ని ఆస్వాదించే ఒక సాహిత్య సాధనంగా పేర్కొన్నారు. నవరసాలా; అష్టరసాలా? వాటికున్న స్థాయీభావాలవంటివన్నీ సంప్రదాయ పండితులు విస్తృతంగానే చర్చించారు. కానీ పింగళి లక్ష్మీకాంతంగారు వాటిని వివరిస్తూనే, తనదైన ప్రత్యేకతతో విశ్లేషించారు. రసం గురించి చెబుతూ "*ఒక పద్యములో భావావేశమును మాత్రమే కలిగించెడి అంశము మాత్రమే ఉండి తక్కిన*

*అంశములు లేకపోయినను, అది చదివినంతనే ఒడలు జలదరించి హృదయము ఉప్పొంగునేని ఆ పద్యము చాల రసవంతముగ నున్నదని మెచ్చుకొందుము.అట్లే ఎట్టి భావావేశమును కరిగింపకయే కవి చిత్రింపదలచిన మూర్తి మన కనుల ఎదుట సజీవపదార్థము నటించుకున్నట్లుగా వర్ణింపబడియున్న పద్యమును చదివి ఆ మూర్తి సాక్షాత్కారము వలన కలిగే సుఖమును బట్టి ఆ పద్యము కూడా రసవంతమే అందుము''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:59) పింగళివారు కావ్యంలోని రసం గురించి తెలిపారు.

రసం కావ్యాలలో ఏ విధంగా పరిణామం చెందుతుందని చెబుతూ *''ఈ రసభావమనెడి పదార్థము కవి హృదయములో జన్మించినది కాదు. అతని కవిత్వము వలన మన హృదయములో జన్మించునది. కవి ఎంతో భావపూరితమైన హృదయము కలవాడు కావచ్చును. అతని కాశక్తి ఉన్నదా, లేదా? అని మనము ప్రశ్నింపరాదు. అతని పద్యము మన హృదయమున రసభావమును ఉద్భిన్నమొనర్చినచో, అతడు భావావేశపూరితుడే. అతని పద్యము మన హృదయమున అట్టి విక్రియ కలిగింపడేని, అతనికి భావావేశమైనను లేకపోవచ్చును. లేదా ఉండియు వంధ్యము కావచ్చును. ఆతడనుభవించిన భావావేశమును మనలో రసభావముగా ఉద్భిన్నము చేయుటకు ఆతడు చేయు ప్రయత్నమే కవిత్వరచన. భావహీనుడు మనకు దానిని కలిగింపనే లేడు. కొందరు చేతగాక దానిని కలిగింపలేరు. ఆ ఇరుతెగలవారిని అటుంచి, కవినామము సార్థకము కాగలవాని విషయములో మాత్రము ఆతనికి భావసంపద ఉన్నట్లును, దానిని మనలో రసభావముగా కలిగించునట్లును అంగీకరింపవలెను. రసమనునది ఈ రసభావము యొక్క పరిణామము''* అని ( సాహిత్య శిల్ప సమీక్ష,1966:61) పింగళివారు తెలియజేశారు.

ఈ రస సిద్ధాంతం గురించి ప్రపంచంలో మొట్టమొదటి చెప్పినవాడు భరతుడు. ఈయన రస సిద్ధాంతాన్ని కేవలం దృశ్య కావ్యాన్నే ఆధారంగా చేసుకుని ప్రతిపాదించాడు. అయితే భారతీయ ఆలంకారీకులు కొందరు శ్రవ్య కావ్యాల్ని ఆధారంగా చేసుకుని ఈ రస సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి ప్రయత్నం చేశారని పింగళి వారు పేర్కొన్నారు. వీరందరు రస సిద్ధాంతం గురించి చెప్పిన అంశాలను సమన్వయం చేస్తూ విమర్శ రంగాన్ని మరింత విస్తృతంగా వ్యాప్తింపజేశారు.

భరతుని దృష్టిలో ఈ రసం పోషణ కేవలం దృశ్య కావ్యంలో ఏర్పడుతుందనే విషయం గురించి ఇలా చెప్పారని *'' నాటక దర్శన వేళ మన హృదయములో రస భావము పొడముటకు నటించెడి పాత్రలే ఆధారమని భరతుని అభిప్రాయము''* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:61) పింగళివారు పేర్కొన్నారు.

కవి కొన్ని కల్పితంతో ఒక రమణీయ కావ్యాన్ని రాసినప్పుడు అలాంటి సందర్భంలో రమణీయ పదార్థాన్ని గురించి కవి పలికించే వాక్యాలే ఆధారం. ఈ ఆధారాలలో శాస్త్ర ప్రకారం 'ఆలంబన విభావం' అనే పేరుతో పిలుస్తారని పింగళివారు పేర్కొన్నారు.

**5.8.2. రస స్వరూప వివేచన:**

ఒక కావ్యంలో కానీ, పద్యంలో కానీ రసం ఉండడాన్ని తెలుపుతూ *" ఒక పద్యములో భావావేశమును మాత్రమే కలిగించెడి అంశము మాత్రమే ఉండి తక్కిన అంశములు లేకపోయినను అది చదివినంతనే ఒడలు జలదరించి హృదయము ఉప్పొంగునేని ఆ పద్యము చాల రసవంతముగ నున్నదని మెచ్చుకొందుము. అట్లే ఎట్టి భావావేశమును కరిగింపకయే కవి చిత్రింపదలచిన మూర్తి మన కనుల ఎదుట సజీవపదార్థము పట్టించుకున్నట్లుగా వర్ణింపబడియున్న పద్యమును చదివి, ఆ మూర్తి సాక్షాత్కారము వలన కలిగే సుఖమును బట్టి ఆ పద్యము కూడా రసవంతమే అందుము"* అని ( సాహిత్య శిల్ప సమీక్ష,1966:59) అన్నారు.

దీనికి కాళిదాసు రాసిన శృంగార శాకుంతలంలో పరిగెత్తుతున్న లేడిని వర్ణిస్తూ 'గ్రీవాభంగాభిరామం' అనే సంస్కృత శ్లోకం అత్యంత రసవత్తరంగా ఉందని దీన్ని లోకం మెచ్చుకోవడం వలనే రసభరితంగా ఉందనే విషయాన్ని పింగళివారు సోదాహరణంగా తెలిపారు.

**5.8.3. శృంగార రస భేదాలు:**

భారతీయ ఆలంకారికులు రీతి, ధ్వని, ఔచిత్యం, రసం మొదలైన సిద్ధాంతాల గురించి తమ గ్రంథాలలో ప్రస్తావించారు. వీటిలో శృంగారరసం గురించి కూడా ప్రత్యేకంగా వివరించారు. శృంగార రసాన్ని కొన్ని రకాలుగా ఆలంకారికులు చెప్పారు. శృంగారాన్ని సంయోగ, వియోగ అనే విధంగా విభజించారు. వీటినే సంభోగ, విప్రలంభ శృంగారమనే పదాలు కూడా ఉన్నాయి. ఈ సంయోగ, సంభోగ శబ్దాలకు పామర జనులు 'మిథున క్రీడ' అనే పేరుతో పిలవకూడదని దీనికొక శాస్త్రీయం, నాగరికత అర్థముందని పింగళి వారు అభిప్రాయపడ్డారు. ఆయన సంభోగ, సంయోగాల శృంగార గురించి చెబుతూ *"ఏకచిత్తులగు ఇరువురు ప్రాణాలు జీవిత పరిపూర్తికై ఒండొరులు కలిసి ఉండగోరుట సంయోగము. ఆ కలయికలో పరస్పర దర్శన స్పర్శనాదికమైన సుఖము కలదు. ఆ సుఖము ఇరువుర చేతను అనుభవింపబడుటయే సంభోగము"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966: 87) పింగళివారు తెలియజేశారు.

*"మిథున క్రీడ వలన శృంగారమునకు మూలమైన ప్రేమతత్వము ఉప్పొంగి, వెల్లివిరిసి, నిర్భరమైనప్పటి దశకే 'రతి'* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:87) పేరు వచ్చిందనీ పింగళివారు అన్నారు. సంయోగ శృంగారానికి ఉత్తర రామ చరిత్రలో సీతాదేవి యొక్క శరీర

దర్శన స్పర్శ సుఖాన్ని అనుభవించు రాముని చైతన్య భ్రమణం కలిగిందని అది సంయోగ శృంగారానికి పరమావధని పింగళి వారు అన్నారు.

*" వినిశ్చేతుం శక్యోన సుఖ మితి వా దుఃఖమితివా*

*భ్రమోవా నిద్రావా కిము విష విసర్పః కిము మదః*

*తవ స్పర్శేమమ హి పరిమూఢేంద్రియగణో*

*వికారశ్చైతన్యం భ్రమయతి చ సమ్మోహయతి చ"* అని ఉత్తర రామ చరిత్రలో భవభూతి చెప్పిన ఈ శ్లోకం ద్వారా విప్రలంభ శృంగారానికి తెలిపాడు. పరస్పర దర్శన స్పర్శ వలన ఆనంద జీవితం గడిపే నాయికా నాయకులు కారణాల రీత్యా వియుక్తులై పునస్సంయోగం కోసం విహరించే దాన్నే విప్రలంభ శృంగారమని పేరు. దీన్నే కొందరు విమర్శకులు పూర్వరాగమని, ఉత్తర రాగమని పిలిచారని పింగళివారు పేర్కొన్నారు.

ధనుంజయుడు తన దశరూపకంలో ఈ విప్రలంభ శృంగారాన్ని అభియోగం, సంయోగం, విప్రయోగం అనే మూడు విధాలుగా పేర్కొన్నాడని అన్నారు. ఆయోగ విప్రలంభ శృంగారాన్ని ఇలా చెబుతూ *"ఏకచిత్తులైన నాయికా నాయకులకు పరస్పరానురాగమైనప్పటికిని, పరతంత్రవలన గాని, దైవికముగా గాని, వాంఛాపూర్తికాక వారు విడివడీయుండుటను అయోగము"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:88) ధనుంజయుడు నిర్వచించాడని పింగళివారు తెలియజేశారు.

పింగళివారు విప్రలంభ శృంగారాన్ని కాకుండా సంయోగ శృంగార నిర్వచనాన్ని తెలుపుతూ *" పతి జీవితమైన ప్రియురాలును పత్నీ జీవితుడైన ప్రియుడును ఒకరి మనస్సులో ఒకరు ఉనికి కలిగించుకొని ఎడబాటు లేక మధురమైన దాంపత్య సుఖమును అనుభవించుటయే ఈ సంయోగ శృంగారము. దానికే ప్రణయ జీవితమని అర్థము"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:88) అన్నారు. ఈ ప్రణయ జీవితాన్ని వర్ణించడంలో మహాకవి కాళిదాసు సిద్ధహస్తుడని, దీనికి ఈ జగతికి తల్లి దండ్రులైన పార్వతీ పరమేశ్వరుల ప్రణయ జీవితాలే ఇందుకు ఒక ఉదాహరణంగా తెలిపారు.

అయితే ఆర్య సాంప్రదాయంలో దంపతులు అంటే ఎలా ఉండాలో పింగళి వారు చెబుతూ *" గృహస్థాశ్రమములో సహధర్మచారులు. అతిథి పితృ పూజలు, అనాధ దీనజన పోషణలు చేయుచు, ఉపవాసవ్రతానుష్టానములతో ఆత్మసంయమ మలవరచుకొని, నియమబద్ధమును లౌల్యరహితమును అగు తృతీయ పురుషార్థమును సేవించి, సత్సంతానమును కనివంశ ప్రతిష్ట కలిగించి, వనములకేగియో, ఇంటినే ఉండియో చరితార్థ జీవిత తృప్తిని అనుభవించుటలో దంపతులు ఆద్యంతము సహాధర్మచారులగుదురు"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:88) పేర్కొన్నారు. దీన్ని బట్టి దాంపత్య జీవితంలో దీక్షతో తల్లి దండ్రులును,

అతిథులను గౌరవిస్తూ నిత్యం ప్రేమమయంగా వెలుగొందు దంపతులు వారి జీవితాలను చరితార్థితం చేసుకోవడంలోనే ఈ ప్రణయ శృంగార జీవితం గొప్పగా కొనసాగుతుందని పింగళివారు అభిప్రాయపడ్డారు.

### 5.8.4. రస రాజం:

నవరసాలలో ఏ రసం ఉత్తమమైంది, ఏ రసం రసరాజంగా అనేకమంది అలంకారికులచేత ప్రకటించపడిందనే విషయాలను పింగళి లక్ష్మీకాంతంగారు కూడా తనదైన పరిశోధనా దృక్పథాన్ని తెలియజేశారు. నిజానికి భారతీయ అలంకారికులు శృంగార, కరుణ, శాంత రసాలను విభిన్న కోణాల్లో విశ్లేషించి నవరసాలలో ఏ రసం రసరాజంగా ప్రకటించారో తెలుసుకుందాం. శృంగార రసం అనేది తొలి నుంచి మనస్సుకు ఆహ్లాదాన్ని ఇచ్చే ఒక మాధుర్యమైంది. దీన్ని పింగళి లక్ష్మీకాంతంగారు ఇలా చెబుతూ *"శృంగార రసము ఆదినుండియు చిత్తసుఖమునిచ్చు మాధుర్యము కలది. మరి కావ్యమునందువలె లోకమునందును ఆద్యంత సుఖదాయకమైనది. తక్కిన రసములు పరిపోషణలోను, చరమదశలోను మాత్రమే ఆనందము నొసగును. లోకమున వాటి కట్టి ఆనందస్థితి అసలే లేదు. దుఃఖము లోకమున దుఃఖమే. అది కరుణమైనప్పుడు గాని ఆనందదాయకము కాదు. అట్లే క్రోధమెల్లెడను సుఖావహము కాదు. కావున లోకమునందును, కావ్యమునందును మొదటి నుండియు మనోహరమైన శృంగారము నవరసములలో అగ్రస్థానమున కర్షమగుచున్నది"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:83) తెలియజేశారు.

ఈ శృంగారరసం లోకంలోని అన్ని ప్రాణులకు అనురాగ భక్తి, ప్రేమ, ప్రణయం, వాత్సల్యం అనేవి హృదయ భావాలన్నింటిలో శృంగారం స్వర్గధాయకమైందని పింగళివారు అన్నారు. ఇది జీవులకు స్వర్గ సుఖాన్నిచ్చి జీవేశ్వరైక్యం అనే భావాన్ని సమస్త ప్రాణాలకు సమానమైన భావాలకు, అనుభవాలకు ఒక సాధనంగా ఉంటుందని ఆయన తెలిపారు. *"మానవుని జీవిత పరమావధి జీవేశ్వరైక్యము శృంగార రసము ఆ యాధ్యాత్మిక సిద్ధికి ఛాయా అగుటయే గాక, దానిని ప్రతిఫలింపజేయు ముకురము కూడా అగుచున్నది. శృంగార రసానుభవశాలి తన ఆత్మను పరమాత్మలో సుకరముగా లీనము చేయగలడు. హృదయము ప్రేమపూరితమైనప్పుడు ఆత్మ భగవంతుని పదముల వ్రాలియుండును"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:83) పేర్కొన్నారు.

అంతేకాకుండా అరిస్టాటిల్ క్షాళన సిద్ధాంతంలో ఎక్కువగా క్షాళనం వెలువడే భావాలు అనారోగ్యం ప్రదాలలని ఇవి ఆత్మకు తేజోహానిని కలిగించి క్షాళనాపేక్షలేని ఆరోగ్య ప్రధాలుగా ఉంటుందని పింగళి వారు పేర్కొన్నారు. ఆ ఆత్మకు చైతన్యం కలిగి శక్తి వాటిలో రతి భావాన్ని కలిగించడం తొలి గుణమని తెలిపారు. కనుక ఈ జాతికి చెందిన శమమని దీన్ని రెండో

స్థానంగా భారతీయ ఆలంకారికులు చెప్పారనీ దీని కారణంగానే భోజుడు శృంగార ఒక్కటే రసమనే సిద్ధాంతాన్ని తనదైన శైలిలో తెలియజేశారు.

**5.8.5. కరుణ రసం:**

భవభూతి రాసిన ఉత్తర రామ చరిత్రలోని పాత్ర ఆధారంగా చెప్పిన శ్లోకం ద్వారా కరుణ రసం గురించి సోదాహరణంగా ప్రస్తావించారు.

**“ ఏకోరుస: కరుణ ఏవ నిమిత్త భేదాత్**

**భిన్న:పృథ క్పృథగి వాశ్రయతే వివర్తాన్**

**ఆవర్త బుద్బుద తరంగమయాన్ వికారాన్**

**అంభోయథా సలిలమేవ హి తత్సమస్తమ్”** అని

దీని ద్వారా నవరసాలలో కరుణరసం ఒక్కటే రసమని ఈ రసం అనేక రూపాల్లో కనిపిస్తుందని ఆయన చెప్పారు. కావ్యంలోను, నాటకంలోను కవి పాత్రలు వలన చెప్పించే మాటలు, అతని వాక్యాలు అభిప్రాయాలు ఉద్దేశాలతో ఉంటాయి. మరలా కావ్యంలో, కథలో, నాటకంలో కవి తానై మాటలను ఇలా చెబుతూ *“ కథాత్మకమైన కావ్యము వ్రాయు కవి, తాను సూత్రధారుడై కొంతసేపును, పాత్రయై కొంతసేపు ను కథను నడుపును. పాత్రయైనపుడు అతడు పలికెడి పలుకులన్నియు యథాస్వభావ సందర్భముగా ఆ పాత్రవిగానే పలుకును గాని, తనవిగా పలుకుడు. దానికి తద్భావగమనము”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:84) అనే పేరుతో పిలుస్తారని పింగళివారు పేర్కొన్నారు.

అంతేకాకుండా సూత్రధారుడు అంటే కథకుడని, ఇది కావ్య ధర్మాన్ని బట్టి ఒకటిగా ఉంటుంది. ఈ ధర్మం నాటకంలో కథకుడు ఉండడు కనుక పలికే మాటలన్ని పాత్రలవే అని అన్నారు. సంస్కృత కవి భవభూతి ఉత్తర రామ చరిత్రలో పాత్రలు పలికిన శ్లోకం నిదర్శనమే కానీ ఆ పాత్రదే కానీ భవభూతిది కాదని పింగళివారు తెలిపారు. కరుణరసం పాత్ర చిత్రణలో ఉందని చెబుతూ *“భవభూతి ఈ శ్లోకము ఆ నాటకమున ఎరువు సొమ్ముగానే ఉన్నదిగాని సందర్భోచితముగాను, పాత్రోచితముగాను లేదు. శోకనిమగ్నులైన సీతారాములను చూచుచు, తానును శోకనిమగ్నమైన తమస తన హృదయ భారమును, ఆ నాయికా నాయకుల యెడగల సానుభూతిని వ్యక్తము చేసెడి ఏవో రసబంధురములగు వాక్యములను పలుకదగును కాని, అలంకార శాస్త్రములో ఉదాహరింపదగిన శ్లోకార్థమును పలుకతగదు. ఇది పాత్రోచితము కాదు గనుకనే పాత్ర పలికినను భవభూతి వాక్యమే అయినది. అందుచేతనే దీనికి ప్రాధాన్యము వచ్చినది”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:85) తెలియజేశారు.

నవరసాలన్నింటిలో మాధుర్యం వలన హృదయ ద్రువీకరణ కలిగి సంతోషాన్ని పొందించడంలో కరుణరసం పాత్ర మిగిలిన రసాలకు లేదని ఆయన అన్నారు. నిజానికి ఈ

రససిద్ధాంతం శారీరక, మానసిక శాస్త్రవేత్తలకు సంబంధించిన శాస్త్రమని ఇది మనోవైజ్ఞానిక శాస్త్ర వ్యతిరేకమైన దీన్ని ఆలోచనబద్ధంగా సమర్థించే చూడాలనీ తెలిపారు. చిత్రకళల్లో సంగీతానికి నవరసాలలో కరుణ రసానికి ఉన్నంత హృదయ స్పందన శక్తి ఉందనీ కానీ సంగీతం చిత్రకళల్లో మొదటి స్థానం లభించలేదని పింగళివారు పేర్కొన్నారు.

**5.8.6. శాంత రసం:**

నవరసాలలో శాంతరసం కూడా రస రాజంగా కొందరు భారతీయ ఆలంకారికులు అభిప్రాయపడ్డారు. దీన్ని పింగళివారు చెబుతూ “ *శాంతము చిత్తరువును వ్రాయుటకు అనువైన భిత్తికవంటిది. నానావిధ రస భావములు పుట్టకముందు స్వాస్థముగా ఉన్న చిత్తవృత్తి శాంతమయము. ఆ చిత్తవృత్తిలో పుట్టిన ఈ రస భావమును దానిలో కలిగిన వికారములు. అనగా శాంతము ప్రకృతి, రత్యాదులు వికృతి ఆ వికారములు ఆనంద పర్యవసాయులయియో, మరలా చిత్తవృత్తి శాంతమయమే అగును*” అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:85) పింగళి లక్ష్మీకాంతంగారు శాంతరసం ఏ విధంగా ఆవిర్భావిస్తుందో తెలియజేశారు.

నవరసాలన్ని చివరి దశలో శాంతరసంతోనే పర్యవసించి ఉత్తమ పురుషార్థమైన మోక్షాన్ని అనుసరించడం వలన ఈ శాంత రసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని అందువల్లనే శాంతరసం నవరసాలలో రసరాజంగా ఉంటుందని పింగళి వారు తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఆయన శాంత రసం రస రాజంగా పరిగణించడంలో రెండు దోషాలు ఉన్నాయని తెలిపారు. అవి సామాజికుని మనస్సు స్వాస్థముగా ఉన్నప్పుడు కలిగె వికారాలే రసభావాలని కాని ఆ స్వస్థత నిర్వికార చిత్తం కాదు. అంటే వైరాగ్యం జనితమైన శమం కాదన్నారు.

**5.8.8. శృంగార రసం:**

నవరసాలలో శృంగార రసానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని భారతీయ అలంకార సిద్ధాంతాలు చెబుతున్నాయి. శృంగార రసం గురించి పింగళివారు తన అభిప్రాయాలను తెలియజేశారు. వాటికి తనదైన శైలిలో నిర్వచనాలను ఇచ్చే ప్రయత్నం చేశారు. వాటిని తెలియజేస్తాను. రససిద్ది అనగా చెబుతూ “ *స్త్రీ ప్రకృతిని, స్త్రీ ప్రకృతి పురుష ప్రకృతిని ఆకర్షించును. జీవునకు తాత్త్వికములయిన పురుష స్త్రీత్వములు లేకపోయినను, పురుషశరీరధారియైన ఆత్మ, స్త్రీ శరీరధారియైన ఆత్మతోడి సంయోగము నభిలషించుటయు, స్త్రీ శరీరి పురుష శరీర వాంఛించుటయు, జీవునకు పాంచభౌతికమైన ప్రకృతి తోడి సంసర్గమువలన కలిగిన లక్షణము. అట్టి ఆత్మలు రెండును కలిసి, ఏకముగా భాసించుట పేరే అర్ధనారీశ్వరత్వము. శృంగార రససిద్ధి*” అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:87) అని శృంగార రస పుట్టుకను పేర్కొన్నారు.

అలాగే ఈ శృంగార రస రీతిని గురించి ఇలా చెబుతూ *"విజాతీయులైన స్త్రీ పుంసత్వ సంయోగమువలన కలిగినట్లు, సజాతీయ ప్రకృతి సంయోగమమున కలుగదు. కావుననే ఈ రసమునకు నాయికానాయకాలంబనము ఆవశ్యకమైనది. ఇది దీని పరమార్థము. అయినను ఆ జంట మిథున క్రీడా పరమైన సుఖము ననుభవింపదని చెప్పరాదు. అది ప్రధానము కాదు. దానికే ప్రాధాన్యమిచ్చి కావ్యములోను, శాస్త్రములోను అతిమాత్రముగా వర్ణించుట మాత్రము తప్పు. ఈ శృంగారమునకు మూలమైన ప్రేమతత్వము ఉప్పొంగి, వెల్లివిరిసి, నిర్భరమైనప్పటి దశకే 'రతి"* అని ( సాహిత్య శిల్ప సమీక్ష,1966:87) అన్నారు.

*"ప్రతి జీవితయైన ప్రియురాలును, పత్నీ జీవితుడైన ప్రియుడును ఒకరి మనస్సులో ఒకరు ఉనికి కలిగించుకొని ఎడబాటు లేక మధురమైన దాంపత్య సుఖమును అనుభవించుటయే ఈ సంయోగ శృంగారము దానికే ప్రణయ జీవితమని అర్థము"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:88) ప్రణయ శృంగారాన్ని నిర్వచించారు.

పరస్పర దర్శన స్పర్శనాదుల వలన పరమానంద జీవితం గడిపే ఇట్టి నాయికా నాయకులు ఏదో కారణం వలన వియుక్తులై, పునస్సంయోగవాంఛతో వ్యథపడడాన్ని విప్రలంభ శృంగార రసమని దీన్నే కొందరు పూర్వరాగమని, ఉత్తర రాగమని అనే పిలుస్తారని పింగళివారు తెలిపారు. దీన్ని దశ రూపకకర్త అయోగం, సంయోగం విప్రయోగం అని మూడు విధాలుగా విభజన చేశారని అన్నారు. దీన్ని బట్టి పింగళివారు రసవాది అని, రసహృదయవాదనే విషయం అర్థమవుతుంది. ఆయనకు రస సిద్ధాంతం పట్ల లోతైన అవగాహన, వివేచన ఉన్నట్లు దీన్ని బట్టి తెలుస్తుంది.

**5.9. పద్నాలుగు రకాల నైజాలు పట్టిక:**

ఆధునిక మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తలు మానవునిలో పద్నాలుగు రకాల నైజాలుంటాయని తెలిపారు. వారు చెప్పిన ఆ అంశాలను కింది పట్టిక రూపంలో తెలియజేస్తున్నాను.

| క్రమ సంఖ్య | నైజము (Instinct) | అనుగుణభావము |
|---|---|---|
| 1 | Escape from danger (అపాయ–అపనయనము) | Fear (భయము) (భయానక రసస్థాయి) |
| 2 | Combat (ప్రతిభటత్వము) | Anger (క్రోధము) (రౌద్ర రస స్థాయి) |

| | | |
|---|---|---|
| 3 | 3. Repugnance (అసహ్యత) | Disgust (జుగుప్స)(బీభత్స రస స్థాయి) |
| 4 | Curiosity (కుతూహలము) | Adventure (సాహస ప్రియత్వము) (ఇది వీరరస స్థాయియైన ఉత్సాహము కావచ్చును |
| 5 | Sexual Desire (కామవాంఛ) | Sexual Desire (కామవాంఛ (శృంగారస్థాయియైన రతి కావచ్చును) |
| 6 | Laughter (హాసము) | Amusement (వినోదము) (ఇది హాస్యరస స్థాయియైన హాసము) |
| 7 | Cry or Distress (ఆక్రోశము) | Helplessness (నిస్సహాయత) (ఇదికరుణరసస్థాయియైనశోకము కావచ్చును) |
| 8 | Parental Protection of the young (సంతాన రక్షణ) | ParentalFeeling (పుత్రవాత్సల్యము) |
| 9 | Self-assertion (ఆత్మాభినివేశము) | Superiority (స్వాతిశయము) |
| 10 | Self-abasement (ఆత్మావమానము) | Subjection (విధేయత) |
| 11 | Herd (సహవాసము) | Avrsion to loneliness (ఏకాంత విముఖత్వము) |
| 12 | Food-Seeking (ఆహారాన్వేషణ) | Appetite (ఆకలి) |
| 13 | Hoarding (ధనసంచయము) | Feeling of ownership (స్వామ్యానందము) |
| 14 | Construction (నిర్మాణ-ఆశ) | Feeling of creativeness (సృజనాభిలాష) |
| | | |

**5.10. నవరసాలు వాటి స్థాయీ భావాల పట్టిక:**

| క్రమ సంఖ్య | రసం | స్థాయీ భావం | స్వరూపము |
|---|---|---|---|
| 1. | శృంగారం | రతి | సంయోగ విషయమైన ఇచ్ఛా విశేషం. |
| 2. | హాస్యము | హాసమ | వికృత వస్తు దర్శన జన్య మనో వికారము. |
| 3. | కరుణము | శోకము | అనిష్ట ప్రాప్తిచే గానీ, ఇష్టజన నాశనముచే గానీ కలుగు దుఃఖము . |
| 4. | రౌద్రము | క్రోధము | ప్రతికూల విషయంగా గాని శత్రకృతిపచారము వలన గాని కలుగు మనఃప్రజ్వలము. |
| 5. | అద్భుతము | విస్మయము | అపూర్వార్థ సందర్శనం కలుగు చిత్త విస్తృతి. |
| 6 | భయానకము | భయము | రౌద్ర వస్తు సందర్శన శ్రవణాదుల చేత కలుగు అనర్థ శంక |
| 7 | వీరము | ఉత్సాహము | లోకోత్తర కార్యములకు చేయు స్థిరయత్న సంకల్పం |
| 8 | బీభత్సమ | జుగుప్స | వస్తు దోష సందర్శనాదుల వలన కలుగు రోత |
| 9 | శాంతము | శమము | వైరాగ్యజన్య నిర్వికార చిత్తం |

ఈ విధంగా కావ్యాస్వాదనలో రససిద్ధాంతం యొక్క ప్రాధాన్యాన్ని సోదాహరణంగా, సైద్ధాంతికంగా పరిశోధనాత్మకంగా వివరించారు.

పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య శిల్ప సమీక్ష గ్రంథాన్ని ఒక విమర్శ గ్రంథంగా తెలుగు సాహిత్యానికి అందించారని అనేకమంది సాహిత్య విమర్శకులు ప్రశంసించారు. తొలితరం విమర్శకుల్లో పింగళి లక్ష్మీకాంతంగారి ఈ గ్రంథానికి విశిష్టమైన స్థానమే ఉంది. ఆయన ప్రత్యేకించి దీన్ని సాహితి విమర్శ గ్రంథంగా పేర్కొనకపోయినా దీనిలో అనేక సాహిత్య సిద్ధాంతాలు, సాహిత్య విమర్శ పద్ధతులు, విలువలు, నిర్ణయాలు కనిపిస్తున్నాయి. దీనితోపాటు ఆయన ఆంధ్ర సాహిత్య చరిత్రలో కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ, గ్రంథ పరిష్కరణ

విమర్శ, చారిత్రక విమర్శ, తులనాత్మక విమర్శ పద్ధతులను పాటించి సాహిత్య చరిత్ర నిర్మాణాన్ని చేశారు. అది శిష్యుల నోట్స్ రూపంలో సేకరించి ఒక పుస్తకంగా ప్రచురించినా 1974 సంవత్సరం నుంచి నేటి వరకు పింగళి లక్ష్మీకాంతంగారి నోట్స్ ప్రతులు దొరికినప్పుడల్లా ఆ గ్రంథాన్ని పరిష్కరణ ప్రతిగా ఆచార్య కోలవెన్న మలయవాసినిగారు ముద్రిస్తున్నారు. ఈ రెండు గ్రంథాలతోపాటు ఆయన చేసిన నా రేడియో ప్రసంగాలు, గౌతమ వ్యాసములు, విజ్ఞాన సర్వస్వంలో రాసిన వ్యాసాలు ఆయన విమర్శ కృషిని తెలియజేస్తున్నాయి. పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య విమర్శను ఒక శాస్త్రీయమైన సాహిత్య విమర్శగా, పరిశోధనాత్మక విమర్శగా పేర్కొనడం సమంజసంగా ఉంటుందని భావిస్తూ సాహిత్య విమర్శకుడిగా లక్ష్మీకాంతంగారి కృషిని వివరించానని భావిస్తున్నాను.

ఆరో అధ్యాయం

# పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం

## 6.0. పింగళి లక్ష్మీకాంతం పరిశోధన:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి పేరు చెప్పగానే ఆయనని ఒక పరిశోధకుడుగాను, ఒక విమర్శకుడుగాను ఎక్కువమంది గుర్తిస్తారు. ***సాహిత్య శిల్ప సమీక్ష*** (1966)లో తెలుగు సాహిత్య ప్రక్రియలను పరిచయం చేశారు. ఆయన వివిధ సాహిత్య ప్రక్రియలకు సంబంధించిన తనదైన శైలిలో నిర్వచనాల్ని ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆయన రాసిన ***ఆంధ్ర సాహిత్య చరిత్ర*** (1974) లో ప్రాచీన సాహిత్య ప్రక్రియలైన గేయం, మార్గ, దేశి, ఇతిహాస, పురాణ, ద్విపద, ప్రబంధాల్ని సోదాహరణంగా వివరిస్తూ, వాటి నేపథ్యాల్ని, పూర్వాపరాల్ని లక్షణాల్ని, స్వరూప, స్వభావాల్ని అంచనావేశారు. ఈ రెండు గ్రంథాలను పాశ్చాత్య సాహిత్యాన్ని లోతుగా పరిశీలన చేసి, తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన పరిశోధన గ్రంథాలుగానే చెప్పుకోవచ్చు. ఆయన తెలుగుశాఖలో అధ్యాపకులుగా ప్రవేశించేనాటికి తెలుగు భాషా, సాహిత్యాలపై నేడున్నంత స్పష్టత లేదు. అందువల్ల వివిధ సాహిత్య ప్రక్రియల్ని పరిచయం చేయడంలోను, సాహిత్య చరిత్రను రాయడంలోను, సాహిత్య విమర్శను స్థిరీకరించడంలోను పింగళివారి పరిశోధన కృషి ఎంతో విలువైంది.

> ***"మాంగల్యనిధికి, బంధుజ***
> ***నాంగీకృతశీలక స్మదర్ధాంగికి, శ్రీ***
> ***పింగళి లక్ష్మీ నరసమ***
> ***కుం, గృతి యొసగితిని దీని, కులవర్ధనికిన్ "*** (సాహిత్య శిల్ప సమీక్ష:2)

అంటూ ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన 'సాహిత్య శిల్ప సమీక్ష'(1966) అనే విమర్శ, పరిశోధనాత్మక గ్రంథాన్ని తన భార్య శ్రీమతి లక్ష్మీనరసమ్మగారికి అంకితం ఇచ్చారు. ఆయన పరిశోధన ఈ కృషిని ఈ అధ్యాయంలో వివరించే ప్రయత్నం చేస్తాను.

## 6.1. సాహిత్య పరిశోధన పద్ధతులు లేదా విధానాలు:

సాహిత్య విమర్శకు కొన్ని పద్ధతులు ఉంటాయి. వాటి ఆధారంగా పింగళి లక్ష్మీకాంతంగారి కృషితో సమన్వయించే ప్రయత్నం చేస్తాను.

## 6.2. పాఠ్య పరిశోధన విధానం:

దీన్ని ఆంగ్లంలో Textual Research అని అంటారు. దీన్ని *" లిఖిత రూపం పొందిన శబ్దం, తర్వాత శాబ్దికరూపం. కవి / రచయిత మొదట రాసిన క్రమంలోనే రచన లోకంలోకి రాదు. ఆ రచయితే తన రచనను పలుమార్లు పునః పరిశీలించుకొని, మార్పులు చేసి ఉండవచ్చు. శబ్దం–*

*అర్థం సాధుత్వాసాధుత్వాలను, ఔచిత్యనౌచిత్యాలను పరిశీలనలోకి తీసుకుని లిఖిత శాబ్దిక రూపాలను పరిశోధించి చూసేది పాఠ్య విమర్శ. ఇప్పటికీ ప్రతి ప్రసిద్ధ కృతి విషయంలోనూ ఈ దృష్టితో పరిశీలించవలసినది ఎంతో ఉంది"* అని ఆచార్యగంగిశెట్టి లక్ష్మీనారాయణ (సాహిత్య పరిశోధనా కళా: విధానం,2017:18) తెలియజేశారు.

**6.3. జీవన చారిత్రక పరిశోధన విధానం:**

*"రచయిత జీవితానికి, రచనకు మధ్య అత్యంత సన్నిహితముంటుంది. రచయిత జీవితం ఆధారంగా లేదా అన్వయిస్తూ రచనను పరిశోధించడాన్ని జీవన చారిత్రక పరిశోధనా అంటారు"* అని ఆచార్యగంగిశెట్టి లక్ష్మీనారాయణ (సాహిత్య పరిశోధనా కళా: విధానం, 2017:19) పేర్కొన్నారు. దీని వలన ప్రతి రచయితకు, రచనకు మధ్య ఉండే సున్నిత భావాలను, బంధాలను ఈ పరిశోధన విధానం ద్వారా తెలుస్తాయని అవగతమౌతోంది. దీన్నే మరికొంతమంది కవిజీవిత కావ్య సమన్వయ పరిశోధనగా భావించారు.

**6.4. కవి/ కృతి కాల పరిశోధన:**

కవి జీవిత, చారిత్రక పరిశోధనలో కవి కృతి పరిశోధన అంతర్భాగంగా ఉంటుందని కొందరు పరిశోధకులు భావిస్తున్నారు. అయితే ఒక్కొక్క పరిశోధన విధానం ఒక ప్రత్యేకత ఉంటుంది. అలాగే ఈ పరిశోధన విధానంలో *" సాహిత్య చరిత్రలంటేనే కవి కాలాదిక చరిత్రలే కావడం వల్ల సాహిత్య చరిత్రను ప్రాధాన్య క్రమంలో రూపొందించుకోవలసిన అవసరం ఉంది. కనుక పరిశోధన అత్యధిక ప్రాచూర్యం పొందింది"* అని ఆచార్యగంగిశెట్టి లక్ష్మీనారాయణ (సాహిత్య పరిశోధనా కళా: విధానం, 2017:20) తెలిపారు.

**6.5. ప్రక్రియా వికాస పరిశోధన:**

సాహిత్య వివేచనలో, మొదటి మెట్టులోనే ప్రధాన వివక్ష లో వచ్చేవి రెండు: 1 రూపం 2 వస్తువు. సాహిత్య నిర్మాణ రూపాన్నే 'ప్రక్రియ' అంటాం. ఇంగ్లీషులో Kind/ Genre అంటారు. తెలుగులో ఎందుకో కాని, దాన్ని 'ప్రక్రియ' అని అనువదించారు. పక్కనే ఉన్న కన్నడంలో దాన్ని 'ప్రకార', 'సాహిత్య ప్రకార' అంటారు. 'ప్రక్రియ' అనే మాట తెలుగులో పారిభాషగా ప్రసిద్ధికెక్కింది. Process, Phenomenon అనే మాటలకు కూడా 'ప్రక్రియ' అనే వాడడముంది. ఒక వస్తువు, ఒక రూపంలోకి ఎలా ప్రోసెస్ అవుతోంది. ఆ విధానమేమిటి? అనే ప్రశ్నలను దృష్టిలో ఉంచుకొని, తొలితరం పెద్దలు 'ప్రక్రియ' అనే మాటను వాడుకలోకి తెచ్చి ఉంటారు. ప్రతి సాహిత్య ప్రక్రియ కూడా, ఒక భావ/వస్తువు జన్యు విధాన ప్రక్రియే కదా!... అందుకే కాబోలు ఆ అనువాదం. సాహిత్యమంటేనే

ఉత్తమ రచనల సమాహారం. ఆ సమాహారాన్ని మొత్తంగా 'అధ్యయనం' చేస్తున్నప్పుడు మూడు ముఖ్యమైన అంశాల గుండా వెళ్లాలి.

1. కృతి విశిష్టత (ఇందులో కవి విశిష్టత, కాల విశిష్టత కూడా కలుస్తాయి).

2. దాని రూప విశిష్టత అంటే ప్రక్రియా విశిష్టత.

3. వస్తు విశిష్టత (భావజాలాలు, ఉద్యమాలు అన్నీ ఇందులోకి వస్తాయి). ఈ మూడింటి సమాహార అధ్యయనమే ఆ సాహిత్య అధ్యయనం, సాహిత్య చరిత్ర అధ్యయనం. ఒక ప్రక్రియ, అటు కవి భావ దృక్పథానికి, ఇటు నాటి సమాజ దృక్పథానికి ప్రతిబింబం; అలాగే వస్తువును బట్టి ప్రక్రియ ఉంటుంది. ప్రక్రియను బట్టి వస్తువు నియంత్రితమవుతుంది. కనుక అటు కృతి విశిష్టతకు – ఇటు వస్తు విశిష్టతకు సంధిస్థానం, లేదా సేతువు వంటిది ప్రక్రియా విశిష్టత. చారిత్రక పరిశోధనలోని ఒక ఉత్తమ మార్గం ప్రక్రియా వికాస పరిశోధన" అని ఆచార్యగంగిశెట్టి లక్ష్మీ నారాయణగారు (సాహిత్య పరిశోధనా కళా విధానం, 2017:21) తెలియజేశారు.

### 6.6. తులనాత్మక (Comparative) పరిశోధన:

*"ఒక వస్తు స్థితిని సాదృశ్యమైన వాటితో పోల్చి సర్వ సమాన సూత్రాలనావిష్కరించడం. తులనాత్మక పరిశోధన వేరు – వర్తమాన అధ్యయన రంగంలో స్థిరపడ్డ 'తులనాత్మక అధ్యయనం' వేరు. తులనాత్మక సాహిత్యం (భారతీయ సందర్భంలో సమగ్ర భారతీయ సాహిత్యం; ఇతర సందర్భాల్లో ప్రాక్పశ్చిమ సార్వత్రిక సాహిత్యశాస్త్రం), తులనాత్మక కళా సౌందర్య మీమాంస, తులనాత్మక భాషా విజ్ఞానం వగైరా విభిన్న అధ్యయనాల సామూహిక సామాన్య శబ్దం 'తులనాత్మక అధ్యయనం"* అని ఆచార్యగంగిశెట్టి లక్ష్మీనారాయణ (సాహిత్య పరిశోధనా కళా విధానం,2017: 12) పేర్కొన్నారు.

పింగళి లక్ష్మీకాంతంగారి పరిశోధన కృషిని ఏడు విధాలుగా వర్గీకరించుకునే అవకాశం ఉందనుకుంటున్నాను. 1.సాహిత్య చరిత్ర నిర్మాణం – పరిశోధన, 2. సాహిత్య శిల్ప సమీక్ష–విమర్శనాత్మక పరిశోధన, 3. పీఠికలు పరిష్కరణ పరిశోధన, 4.కవిజీవిత సమన్వయ పరిశోధన, 5.సాహిత్య ప్రక్రియలు–పరిశోధన, 6. మహాభారత రామాయణాలపై పరిశోధన, 7. విద్యాత్మక విషయాలపై పరిశోధన.

### 6.7. సాహిత్య పరిశోధన – సాహిత్య విమర్శ:

సాహిత్య పరిశోధన సాధారణంగా వివిధ ప్రతులను సేకరించడం, వాటిని విశ్లేషించడం, సమన్వయం చేయడం, నూతన సిద్ధాంతాను ప్రతిపాదించడం, నూతన సిద్ధాంతాలతో సమన్వయం చేయడం, సాహిత్యం ద్వారా కొత్త ప్రక్రియలను పరిచయం చేయడం మొదలైన అంశాలన్నీ

పరిశోధనలో ఉంటాయి. అప్పటికే ఉన్న సిద్ధాంతాలను గానీ, అప్పటికే ఉన్న గ్రంథాలను గానీ అధ్యయనం చేసి, ఆ సిద్ధాంతాల్ని తర్వాత వచ్చిన సాహిత్యంతో సమన్వయించడం లేదా కొత్త సాహిత్య ధోరణులను పరిచయం చేయడం కూడా పరిశోధనలో భాగమవుతుంది. సాధారణంగా కొత్త అంశాల్ని కనుగొనడం పరిశోధనలో ముఖ్యమైన అంశం. సాహిత్య విమర్శలో అప్పటికే ఉన్న సిద్ధాంతాలు, సూత్రాలను అనుసరించి సాహిత్య విలువల్ని నిర్ధారించడం లేదా సాహిత్య విలువల్ని మూల్యాంకనం చేయడం ప్రధానం. సాహిత్య విమర్శలో విలువల నిర్ణయం అత్యంత ముఖ్యం.

సాహిత్య పరిశోధనలో కొత్త అంశాల్ని కనుగొనడం, వాటిని సాహిత్య ప్రపంచానికి అందించడం జరుగుతుంది. వాటి విలువల నిర్ణయం సాధారణంగా విమర్శకులు చేస్తారు. కానీ, పరిశోధకులు కొత్త ప్రతుల్ని, కొత్త ఆధారాల్ని, కొత్త ప్రక్రియల్ని అన్వేషించడం, పరిచయం చేయడం వంటివాటిపై దృష్టిని కేంద్రీకరిస్తారు. ఒక విధంగా పరిశోధన 'quantitative research' స్వభావాన్ని అధికంగానూ, దాన్ని విశ్లేషించడం అనే 'qualitative research' స్వభావంలో సాహిత్య విమర్శలో ఉండే విశ్లేషణ, తులనాత్మకత, పరిశీలన, నిర్ణయం వంటి వాటిపై ఆధారపడి ఉంటుంది.

పింగళి లక్ష్మీకాంతంగారి విమర్శ ఈ రెండు లక్షణాలకు సంబంధించినదై ఉండడం వల్ల పరిశోధనాత్మక విమర్శ, విమర్శనాత్మక పరిశోధనలుగా మిళితమైన కృషి ఆయన చేసిన రచనల్లో కనిపిస్తుంది. అందుకనే ఆంధ్రసాహిత్య చరిత్రగాని, సాహిత్య శిల్ప సమీక్ష .గానీ, ఇతర పీఠికలు గానీ అన్నీ ఈ రెండు స్వభావాల్నీ కలిగి ఉండడాన్ని గమనించవచ్చు.

ఆచార్యజి.వి.సుబ్రహ్మణ్యంగారు పరిశోధనలో విమర్శ, విమర్శలో పరిశోధనలు ఎలా ఒకదానికితో ఒకటి ముడిపడి కొనసాగుతాయో తన 'తెలుగు పరిశోధన రజతోత్సవ సంచిక' అనే గ్రంథంలో ఇలా వివరించారు *" విమర్శకూ పరిశోధనకూ అవినాభావ సంబంధం ఉంది కాబట్టి. శాస్త్ర సంబంధి పరిశోధనలలో పరిశోధకుడు విమర్శకుడు కావలసిన అవసరం లేదు; పరిశీలకుడు అయితే చాలు. కాని, సాహిత్యసంబంధి పరిశోధనలలో పరిశోధకుడు పరిశీలకుడు మాత్రమే అయితే సామగ్రిని ప్రోగుచేసి, వర్గీకరించి, వాటిని వ్యవస్థీకరింపగలడే కాని, వాటినుండి ఒక తాత్త్విక దర్శనాన్ని పిండి, సిద్ధాంతాన్ని ప్రతిపాదించలేడు; చివరకు సమన్వయాన్ని కూడా సాధించలేకపోవచ్చు. విమర్శకుడు పరిశోధనలో స్వీయాభిరుచులను ప్రవేశ పెడతాడనే అపప్రథ ఒకటి ఉంది. ఆ నింద అపరిణత విమర్శకులకు వర్తిస్తుంది లేదా అభిరుచి విమర్శకులకు వర్తిస్తుంది, లేదా నిబద్ధ విమర్శకులకు వర్తిస్తుంది. ఆ ముగ్గురూ ఉత్తమ విమర్శకులు కాలేరు. కాబట్టి వారి ప్రసక్తిని వదలి పెడితే విమర్శ ప్రవృత్తి పరిశోధనలో పోషకశక్తిగా పనిచేస్తుంది. అనువర్తిత పరిశోధనలో*

*విమర్శ, పరిశోధనతోపాటు సమాన గౌరవాన్ని పొందుతుంది. శుద్ధ పరిశోధన సాహిత్యరంగంలో సకృత్తు. అందువలన సాధారణంగా విమర్శకు ఆలంబనగా చేసుకొని పరిశోధన సాగక తప్పదు. అప్పుడు పరిశోధనకు విమర్శ లక్షణాల సాంగత్యం తప్పదు. ఆ లక్షణాలా పరిశోధనలో ప్రతిఫలించే విధానాన్ని బట్టి పరిశోధన స్వభావంలో కూడా భేదాలేర్పడక తప్పదు''* అని (తెలుగు పరిశోధన రజతోత్సవ సంచిక,1983:363) తెలియజేశారు.

దీన్ని బట్టి సాహిత్య పరిశోధనలో విమర్శకు కావలిసిన అకారాలన్ని లభ్యమౌతాయని. కానీ అది విలువలను  నిర్ధారణ చేయదు. పరిశోధకుడు లోతైన విశ్లేషనాత్మక పరిశోధన చేసేటప్పుడు పరిశోధనలో కూడా విమర్శ లక్షణాలు కనపడే అవకాశం ఉంది. ఈ విషయాన్నే జి.వి సుబ్రహ్మణ్యంగారు ఇక్కడ పేర్కొన్నారు. పింగళి లక్ష్మీకాంతంగారు పరిశోధనకు ఈ లక్షణాలకు దగ్గరగా ఉంటాయని ఆయన రచనలను అధ్యయనం చేసిన తరువాత తెలుస్తుంది. పరిశోధన విమర్శ స్వరూప, స్వభావాల గురించి అనేకమంది వివరించారు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన అనే గ్రంథంలో అనేకమంది పరిశోధకుల ఆయా రంగాల్లో నిష్ణాతుల అభిప్రాయాలను ఆచార్య వెలుదండ నిత్యానందరావు క్రోడీకరిస్తూ ఇలా అన్నారు.

*''తెలిసిన స్వల్ప ఆధారాలతో తెలియని దాని అంతర్వహిస్తత్వాలను అన్వేషిస్తు క్రమపద్ధతిలో సాగడమే పరిశోధన అని స్థూలంగా సూత్రీకరించుకొంటే ఆ చిన్ని సూత్రంలో అతి విస్తృత కార్యకలాపాలు అంతర్భూతంగా ఉన్నాయని చెప్పవచ్చు. మనమనుకున్నది మనం తెలుసుకొనేది ఒక స్పష్టమైన రీతిలో దేశకాల సాహిత్యస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని ఒక క్రమపద్ధతిలో ఏ? ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్నలకు తర్కసహంగా శాస్త్రీయంగా సమాధానాలు వెతకడమే పరిశోధన పరమార్థం''*

*''పరిశోధన, విమర్శ, సమీక్ష ఒక్కోదశలో విడదీయరానంత సన్నిహితంగా ఉన్నట్లు కనిపిస్తాయి. కలిసిపోతాయి కూడా. ఒక సిద్ధాంత గ్రంథంలోనే పరిశోధకత్వం, విశ్లేషకత్వం, సమీక్షత్వం చోటు చేసుకోవచ్చు. సత్యనిష్ఠ, తాటస్థ్యం, లభ్య ఉపపత్తుల సహాయంతో సిద్ధాంత ప్రతిపాదనం చేసుకుంటూ పరిశోధన వస్తునిష్ఠంగా సాగిపోతుంది. తర్వాతి సోపానం విమర్శ. పరిశోధితాంశం లేదా ఒక అంశం పఠితలో కలిగించే అనుభూతి విశేషాన్ని గుర్తించడం, గుణాగుణ వివేచనం చేయడం విమర్శలో ప్రధానంగా జరిగే వ్యాపారం. శాస్త్రీయతతో పాటు విమర్శకుని అభిరుచి కూడా కావ్య విశ్లేషణలో ముఖ్యపాత్ర వహిస్తుంది''* అని ఆచార్యవెలుదండ నిత్యానందరావుగారు (విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన,2013:5) తెలిపారు.  ఈ అభిప్రాయాలను అనుసరించి కూడా విమర్శ పరిశోధన ఒకదానితో ఒకటి అవినాభావ సంబంధాల్ని కలిగి ఉంటాయని

అర్థమౌతుంది. ఈ ప్రాథమిక అవగాహనతో ఆచార్యపింగళి లక్ష్మీకాంతంగారి పరిశోధన, విమర్శలను వివరించే ప్రయత్నం చేస్తాను.

### 6.8 సాహిత్య చరిత్ర నిర్మాణం–పరిశోధన:

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర కళా విశ్వ పరిషత్ తెలుగుశాఖలో 1931 సంవత్సరంలో అధ్యాపకుడిగా చేరారు. ఎం. ఏ తెలుగు ప్రణాళికను నూతనంగా ఏర్పాటు చేసి దానిలో సాహిత్య చరిత్రను కూడా ఒక అధ్యయన అంశంగా పెట్టారు. దీని వల్ల తెలుగు కవులు కాలక్రమంతోపాటు వారి రచనలు అవగాహన కలుగుతుంది. దీని వల్ల తెలుగు సాహిత్య ఆరంభ వికాసాలు తెలియడంతో పాటు సాహిత్య తత్త్వం కూడా అవగాహన కలుగుతుంది. ఈ విషయాలను విద్యార్థులకు బోధించడానికి ఆయన అనేక గ్రంథాలను అధ్యయనం చేయవలసి వచ్చింది.

### 6.8.1. సాహిత్య చరిత్రలు – యుగ విభజన విశిష్టత :

తెలుగు సాహిత్యంలో ఆంధ్ర వాఙ్మయ చరిత్రలను, సాహిత్య చరిత్రలను, సంగ్రహ సాహిత్య చరిత్రలను 18వ శతాబ్దిపూర్వ దశ, 19వ శతాబ్ది ఉత్తర దశ నుంచి నేటి ఆధునిక కాలం వరకు అనేక మంది సాహితీవేత్తలు తమకు తోచిన విధంగా రచించారు. మెకంజీ, సి. పి. బ్రౌన్ కృషి ఫలితంగా గ్రంథ పరిష్కరణ పద్ధతి వలన తెలుగులో పరిశోధన, విమర్శ రంగాలలో నూతన విధానాలు అవతరించాయి. ఇలా వచ్చిన నూతన చైతన్యంతో కవుల చరిత్రలు, వాఙ్మయ చరిత్రలు, సంగ్రహ చరిత్రలు వెలువడినాయి తెలుగు సాహిత్య చరిత్రలోని కొన్ని యుగాలను తీసుకొని ప్రత్యేకంగా గ్రంథాలు రచించిన వారూ ఉన్నారు. కేవలం ప్రాచీన యుగాన్ని, కేవలం ఆధునిక యుగాన్ని తీసుకుని గ్రంథాలు రచించినవారూ ఉన్నారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాల గురించి రచించిన వారు ఉన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలను రచించిన వారిలో చరిత్ర రచయితలు, విమర్శకులు, పరిశోధకులు, అధ్యాపకులు, పత్రికారచయితలు ఉన్నారు. తెలుగు సాహిత్య చరిత్రలను యుగాలుగా విభజించే సందర్భంలో అనేకమంది తెలుగు సాహిత్య చరిత్రకారులు పలు మార్గాలను అనుసరించారు. పురాణ, రామాయణ, భారతకవులనే పేర్లతోనూ, యుగానికి మార్గదర్శకులైన మహాకవులపేరుమీద, ప్రక్రియల మీద, కాలాన్ని బట్టి యుగవిభజన జరిగింది. ఏ వాఙ్మయానైనను ఒక ప్రత్యేక పద్ధతిలోనే యుగవిభజన చేయలనే నియమం లేదు. వాఙ్మయ చరిత్రకారులు సౌకర్యాన్నీ బట్టి, అభిరుచిని బట్టి ఏ విధంగానైనా యుగవిభజన చేసుకోవచ్చు. తెలుగులో వెలువడిన తెలుగు సాహిత్య చరిత్ర రచనలు ఇలా ఉన్నాయి.

కావలి రామస్వామి దొర 'దక్కను కవుల చరిత్ర' (1829), గురజాడ శ్రీరామమూర్తి 'కవి జీవితములు' (1893), కందుకూరి వీరేశలింగం 'ఆంధ్ర కవుల చరిత్ర' (1917), నిడదవోలు వెంకట్రావు 'తెనుగు కవుల చరిత్ర' (1953), దివాకర్ల వేంకటావధాని 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర' (1958), ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం' 13 సంపుటాలు (1968), పింగళి లక్ష్మీకాంతం 'ఆంధ్ర

సాహిత్య చరిత్ర' (1974), జి. నాగయ్య 'తెలుగు సాహిత్య సమీక్ష' (రెండు సంపుటాలు) (1983), కొర్లపాటి శ్రీరామమూర్తి 'తెలుగు సాహిత్య చరిత్ర' (5 సంపుటాలు) (1998), డా ముదిగంటి సుజాత రెడ్డి 'చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర' (1998), 'తెలంగాణ తెలుగు సాహిత్య చరిత్ర' (2015), ఆచార్య ఎస్.వి.రామారావుగారు 'సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర' (2017) వంటివి తెలుగులో సాహిత్య చరిత్రలు అవిరామంగా వచ్చాయి. ఈ సాహిత్యచరిత్రల్లో వారివారి సౌలభ్యం ఆధారంగా, ఆలోచనా ధోరణి ఆధారంగా యుగవిభజనలు విభజించుకున్నారు. వాటిని కొన్నింటిని చూద్దాం.

గురజాడ శ్రీరామమూర్తి తన '**కవి జీవితములు**'(1893) లో భారత కవులు, రామాయణ కవులుగా యుగ విభజన చేశాడు.

కందుకూరి వీరేశలింగం తన '**ఆంధ్రకవుల చరిత్ర**'(1917)లో ప్రాచీనకవులు, మధ్యయుగకవులు, ఆధునిక యుగ కవులుగా యుగవిభజన చేశాడు.

దివాకర్ల వెంకటావధానిగారు రాసిన '**ఆంధ్రవాఙ్మయచరిత్ర**' (1958)లో ప్రాఙ్నన్నయయుగం, భాషాంతరీకరణయుగం, కావ్యయుగంగా.... యుగవిజనచేస్తూ *"ఈ గ్రంథమున కావ్య ప్రక్రియా భేదములనుబట్టి యుగవిభజనము చేయబడును. వాఙ్మయ చరిత్రకారులు తమ యభిరుచినిబట్టి సౌకర్యమునకై యేవిధముగానైన యుగవిభజనము కావింపవచ్చును"* అని (ఆంధ్ర వాఙ్మయ చరిత్ర:4,5)లో యుగ విభజన పట్ల తనకున్న అభిప్రాయాన్ని తెలియజేశారు .

ఆరుద్రగారు తన '**సమగ్రాంధ్ర సాహిత్యం**' (1968)లో యుగ విభజనను చేస్తూ రాజ వంశాల పోషణ పేరిట ఆదిమ చాళుక్య యుగం, కాకతీయయుగం, రెడ్డిరాజులయుగంగా అని యుగ విభజన చేశారు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు రచించిన '**ఆంధ్ర సాహిత్య చరిత్ర**' (ప్రథమ ముద్రణ 1974, ద్వితీయ ముద్రణ1976, పునర్ముద్రణ 2018) లో యుగ విభజనను మహాకవుల పేరిట ప్రాఙ్నన్నయ నుంచి శ్రీకృష్ణ దేవరాయల యుగం వరకే ఉంది. అయితే ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారు పింగళి లక్ష్మీకాంతంగారు రచించిన ఆంధ్ర సాహిత్య చరిత్రను 1998 సంవత్సరంలో పరిష్కరించారు. ఈమే కూడా పింగళి లక్ష్మీకాంతంగారినే అనుసరిస్తూ మహాకవుల పేరుతోనే యుగ విభజనను కొనసాగించారు.

ఆయన ఆంధ్ర సాహిత్య చరిత్రలోనే కాకుండ గౌతమవ్యాసములు (1952) పీఠికలో 'ఆంధ్ర వాఙ్మయ స్థూల రూపము' అనే వ్యాసంలో సుదీర్ఘంగా సాహిత్యచరిత్ర యొక్క యుగ విభజనను కవుల కాలాన్ని బట్టి యుగ విభజనలో ఆధునికయుగాన్ని 1875 కాలం తో సూచిస్తూ యుగ విభజన చేశారు. అలాగే ఆయన విజ్ఞాన సర్వస్వంలో తిక్కన, పెద్దన, పింగళి సూరన వంటి కవులు

జీవితం, సాహిత్యాలను సమన్వయం చేస్తూ పరిశోధనాత్మక వ్యాసాలను రచించారు. దీనితో పాలు ప్రబంధ పూర్వ యుగం, ప్రబంధం యుగం అనే విధంగా యుగ విభజన చేశారు.

### 6.8.2. కావ్య అధ్యయన పద్ధతులు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్రలను రాయడానికి కావ్యాన్నీ పరిశీలన చేయడానికి అనుసరించాల్సిన పద్ధతులను పేర్కొంటూ కాలానుసరణపద్ధతితో, తులనాత్మకపద్ధతితో, చారిత్రకపద్ధతితో కావ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు. ఈ అధ్యయనం వలన *“సాహిత్యముఏయే కవులవంశమున ఏయేకాలము పెంపుచెందినదో ఏయే కాలమున ఏయేకవుల వంశమున క్షీణించినదో అట్లే ఏయే కాలమున మార్పులు నొందినదో గ్రహించుటకు తగిన యుపపత్తి లభించును”* అని (ఆంధ్రసాహిత్యచరిత్ర,1974:5) పేర్కొన్నారు.

### 6.8.3. యుగకర్త నిర్వచనం–పింగళి అభిప్రాయం:

సాహిత్య యుగవిభజనలో యుగానికి సంబంధించిన యుగకర్తను ఎవరిని ఎన్నుకోవాలనే, ఏవిధంగా ఎన్నుకోవాలనే ప్రధాన విషయాల పట్ల ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఈ విధంగా అభిప్రాయాన్ని వెలిబుచ్చుతూ *“వాఙ్మయ యుగకర్తల విషయమునను, ఎవని పేరుమీద ఒక కాలమున కవి వంశము ప్రతిష్ఠ సంపాదించునో ఎవని నడచిన మార్గమును అర్వాచీనులు శిష్యప్రాయులుగా ననుసరించేదరో, ఎవని అవతారమునకై ఆ కాలమునందలి పూర్వకవుల సాధన తపఃప్రాయమగునో, ఎవడు సూత్రధారుడై,* కావ్య *సరస్వతిని నూత్నవేషముతో అలంకరించి రంగమున ప్రవేశపెట్టునో, ఎవడు క్షీణదశయందున్న వాఙ్మయమును నూత్న మార్గమునొక్కి శక్తిమంతము చేయునో అతడు యుగకర్త అనిపించుకొనును. అవసరమైనచో ఒక కాలమున సర్వోన్నతుడు అని చెప్పదగిన కవి కానరాక సమస్కందులు పెక్కురున్నప్పుడు ఆ కాలమునకు ఇంకొక పేరు వాడవచ్చును”* అని (ఆంధ్రసాహిత్యచరిత్ర,1974:6,7) నిర్వచించారు. దీన్ని యుగకర్తను ఎన్నుకోనేటప్పుడు సరైన వారు లేకపోతే సమకాలికుల్లో ఒకరిని ఎన్నుకోవాలని స్పష్టంగా ప్రకటించారు. దీన్ని బట్టి యుగ విభజన చేయడానికి సరైన ప్రణాళికల్ని నిర్మించి దాన్ని అమలు పరిచారు. అందుకనే వీరు మహాకవులను యుగకర్తగా ఎన్నుకున్నారు. ఉదా. నన్నయ, తిక్కన, ఎర్రన యుగాలుగా విభజించారు. దీన్ని బట్టి వీరి యుగ విభజన సమంజసమని భావించి అనేకమంది అనుసరించారు.

సాహిత్యచరిత్రలను ఎంతోమంది రచించారు. వారిలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన ‘ఆంధ్ర సాహిత్య చరిత్ర’కు (1974, అసంపూర్ణం) ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. దీనికి ఆయన **‘సవిమర్శ ఆంధ్ర వాఙ్మయ చరిత్ర’** అనే మొదటి పేరును పెట్టుకున్నారు అయితే దీన్ని ‘ఆంధ్ర సాహిత్య చరిత్ర’గా తెలుగు అకాడమీవారు 1974లో ప్రాఙ్నన్నయ యుగం నుంచి శ్రీకృష్ణదేవరాయల యుగాన్ని కేవలం కొన్ని పుటల వరకు రచించారు. అంతకుముందు వెలువడిన కవులుచరిత్రలు,

వాఙ్మయచరిత్రలు, సంగ్రహచరిత్రలు ఉన్నప్పటికి ఈ గ్రంథ రచయితలందరు తమకుతోచిన విధంగా సాహిత్య చరిత్రను రచించారు. గురజాడ శ్రీరామమూర్తి, కందుకూరి, చాగంటి శేషయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, ఆరుద్రగార్లు, మొదలైన వారంతా సాహిత్య చరిత్రలను విశ్వవిద్యాలయస్థాయిలో బోధించకుండానే రాశారని అని పిలుస్తుంది.

- ★ ఆచార్య కోరాడ రామ కృష్ణయ్యగారు (మద్రాసు విశ్వవిద్యాలయం).
- ★ ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు (ఆంధ్ర విశ్వకళా పరిషత్).
- ★ ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి(ఆంధ్ర విశ్వకళా పరిషత్).
- ★ ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు (ఉస్మానియా విశ్వవిద్యాలయం).
- ★ ఆచార్య దివాకర్ల వేంకటావధాని (ఉస్మానియా విశ్వవిద్యాలయం ).
- ★ ఆచార్య ముదిగంటి సుజాతారెడ్డిగారు (ఉస్మానియా విశ్వవిద్యాలయం).
- ★ ఆచార్య ఎస్వీ రామారావు (ఉస్మానియా విశ్వవిద్యాలయం ).
- ★ ఆచార్య జి. నాగయ్య (శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం)
- ★ ఆచార్య వెలమల సిమ్మన్న (ఆంధ్ర విశ్వకళా పరిషత్).

వంటివారు ఆంధ్ర సాహిత్య చరిత్రను, ఆంధ్ర సాహిత్య విమర్శను విశ్వవిద్యాలయ స్నాతకోత్తరస్థాయిలో బోధించిన అనుభవంతో సాహిత్యచరిత్రలను రచించారు. వీటన్నింటిని తులనాత్మకంగా విశ్లేషించినప్పుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి ఆంధ్ర సాహిత్య చరిత్రను రాయడానికి అనుసరించిన యుగవిభజన ప్రణాళికలను పద్ధతిని ఏవిధంగా పాటించారో స్పష్టంగా తెలుస్తుంది.

ఆయన యుగవిభజన విధానంలో యుగానికి యుగకర్తను ఎన్నుకొని మహాకవులపేరుతో యుగవిభజన చేసిన పద్ధతిలో గమనించాల్సిన అంశం. యుగవిభజనలో పాటించిన మౌలికమైన పరిశోధన విధానాన్నీ, విమర్శనా పద్ధతులను తెలుసుకోవచ్చు. గ్రంథకర్తను, గ్రంథకర్తృత్వం, కవిత్వపరామర్శను విషయవిశ్లేషణ పట్ల లోతైన అవగాహన మొదలైన అంశాలపట్ల లోతైన విషయపరిశీలనాన్నీ, అధ్యయనాన్నీ గమనించడం వలన ఆయన పరిశోధనా దృక్పథాన్నీ, విమర్శనా దృక్పథాన్నీ తెలుసుకోవచ్చు. ఒకే యుగంలో ఉన్నటువంటి ఒకకవితో మరోకకవిని పోల్చడం, ఒకకావ్యాన్ని, మరోకావ్యంతో పోల్చడం ప్రతియుగాన్ని మరో యుగంతో పోల్చి తులనాత్మక దృష్టితో సాహిత్య చరిత్రను రాయడం ఆయన ప్రత్యేకతగా చెప్పుకోవాలి. ఆయన ఆంధ్ర సాహిత్య చరిత్రలో ప్రస్తావించిన ఇతిహాసం, పురాణం, ద్విపద, దేశి, మార్గ వస్తుకవిత, పదకవిత, గేయకవిత, కథాకావ్యాలు, సాంఘిక చరిత్రలు, ప్రబంధం, నాటక, భావకవిత్వం, నవల, కథ, వ్యాసం, జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, విమర్శ, యక్షగాన, మొదలైన ప్రక్రియల్లో కొనసాగింది. ప్రక్రియ

వికాసచరిత్రను, విమర్శ మొదలైన సాహిత్య ప్రక్రియలను నిర్వచించి వాటిని పరిశోధనాత్మకంగా ఏవిధంగా ప్రతిపాదించి నిరూపనలు చేసి వివరనాత్మకంగా తెలుసుకోవచ్చును.

**6.8.4. సాహిత్య చరిత్రలో ప్రక్రియ వికాస స్వభావం:**

సాహిత్యచరిత్రలో కావ్యాలను విమర్శించేటప్పుడు, విశ్లేషణచేసినప్పుడు ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం ప్రతిపాదించిన 'సాహిత్య చరిత్రలోని ప్రక్రియ వికాస చరిత్ర' నిర్మాణానికి కావాల్సిన మౌలికమైన సూత్రాలను పింగళి లక్ష్మీకాంతంగారు తన ఆంధ్ర సాహిత్య చరిత్రలో ఏవిధంగా సమన్వయించుకోవచ్చో తెలుసుకోవచ్చును.

తెలుగు సాహిత్యంలో ఉన్న ప్రక్రియలను తనదైన శైలిలో నిర్వచించి, సమన్వయించి, వాటిలోని సాహిత్యాంశాలను ప్రతిపాదించడం మరోక విశిష్టతను తెలుసుకోవచ్చును.

పూర్వం పరిశోధకుల అభిప్రాయాలను సమర్థించి నూతన ప్రతిపాదనలు చేసి సమన్వయించి విమర్శించడం మరోక విశిష్టతను తెలుసుకోవచ్చు. ఈ విధంగా పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య చరిత్రలో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి.

పింగళి లక్ష్మీకాంతంగారు తన ఆంధ్రసాహిత్యచరిత్రను రాయడానికి ఉపయోగించిన 'సాహిత్యచరిత్ర' అనే శీర్షికను గమనిస్తే బహుశా కేవలం సాహిత్యాన్ని ప్రదానంగా తెలియజేసే విధంగా సులభశైలిలో రచించారని గమనించాలి. ఈ గ్రంథం రచనా విధానంలో ఆయన పాటించిన ప్రణాళికను పరిశీలిస్తే యుగవిభజన విధానంలో ఒక యుగానికి యుగకర్తను ఎన్నుకొని మహాకవులపేరుతో యుగవిభజన చేశారని స్పష్టమౌతోంది.

యుగవిభజనలో పాటించిన మౌలికమైన పద్ధతులను తెలుసుకోవచ్చు. గ్రంథకర్తను, కవికాలనిర్ణయం, గ్రంథకర్తృత్వం, కవిత్వపరామర్శను, విషయవిశ్లేషణ పట్ల లోతైన అవగాహన మొదలైన అంశాలపట్ల లోతైన అధ్యయనం చేశారని దీని వలన తెలుసుకోవచ్చు.

ఒకేయుగంలో ఉన్న ఒకకవితో మరోకకవిని పోల్చడం, ఒకకావ్యాన్ని మరోకావ్యంతో పోల్చడం, ప్రతి యుగాన్ని మరో యుగంతో పోల్చి తులనాత్మక దృష్టితో సాహిత్య చరిత్రను రాయడం వీరి ప్రత్యేకతగా చెప్పుకోవాలి.

ఆయన తన సాహిత్య చరిత్రలో చెప్పిన ఇతిహాసం, పురాణం, ద్విపద, దేశి మార్గ వస్తుకవిత, పదకవిత, గేయకవిత, కథాకావ్యాలు, సాంఘికచరితలు, ప్రబంధం, నాటకం, యక్షగాన మొదలైన ప్రక్రియాపరమైన ప్రక్రియ వికాస విమర్శను ఎట్లా ప్రతిపాదించి వివరించారో తెలుసుకోవచ్చు. కావ్యాన్నీ విమర్శించేటప్పుడు, విశ్లేషణ చెసినప్పుడు ఆచార్య జి. వి. సుబ్రహ్మణ్యం ప్రతిపాదించిన 'సాహిత్యచరిత్రలోని ప్రక్రియ వికాస చరిత్ర' నిర్మాణానికి పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్యచరిత్రను ఏ విధంగా సమన్వయించుకోవచ్చో తెలుసుకోవచ్చు. తెలుగుసాహిత్యంలో ఉన్న ప్రక్రియలను తనదైన శైలిలో నిర్వచించి సమన్వయించడం మరోక విశిష్టతను తెలుసుకోవచ్చు. పూర్వం పరిశోధకుల

అభిప్రాయాలను సమర్థించి నూతన ప్రతిపాదనలు చేసి సమన్వయించి విమర్శించడం మరొక విశిష్టతను తెలుసుకోవచ్చు. కవికాలాదులను నిర్ణయించడం మరొక విశేషం.

కవి రచించిన కావ్యతత్త్వాన్ని విమర్శనాత్మకంగా వివరించి సాహిత్యచరిత్రను రచించడం మరొక పద్ధతి. ఆంధ్ర సాహిత్యచరిత్రను కవులకాలాను క్రమపద్ధతిలో రాయడం మరొక ప్రత్యేకత. కవికాలాలు, జన్మస్థలాలు, కులగోత్రాలు వంటి అనవసరం విషయాల పట్ల ఎక్కువగా దృష్టి కేంద్రీకరించకుండా కేవలం కవులు రచించిన కావ్యాలకు అధిక ప్రాధాన్యాన్ని కల్పించి కావ్యాలలో ఉన్న కవిత్వ అంశాలను గుర్తించి వివరించడం ఒక విశేషం.

ప్రతి యుగానికి యుగకర్తను ఏవిధంగా ఎవరిని ఎన్నుకోవాలో యుగకర్త లక్షణాల గురించి, యుగ ధర్మాలను పేర్కొంటూ ఆ యుగంలో ఉన్న సమకాలీన కవులను వారి రచనలను కూడా పరిశీలించడం మరొక విశిష్టతగా పేర్కొనాలి. కవుల కావ్యాల కాలం నిర్ణయాల విషయాల్లో చారిత్రక ఆధారాలను సాక్ష్యాదారాలను కూడా చూపించి సమన్వయించి కవుల కాలం నిర్ణయాలను పేర్కొనడం పింగళి లక్ష్మీకాంతంగారి పరిశోధన పద్ధతిలో గమనించాల్సిన విషయం. ప్రతి యుగంలో వెలువడిన సాహిత్యాన్ని గురించి చర్చించారు. ఆ యుగంలో విస్తృతంగా ఉన్న కవులను వారు రచించిన కావ్యలను, కావ్య విమర్శను, కోనసాగిస్తూ ఆ కావ్యాల్లో ఉన్న లక్షణాలను, ధర్మాలను, ప్రక్రియలను ప్రక్రియ లక్షణాలను దాని పుట్టుపూర్వోత్తరాలను గురించి లోతైన విశ్లేషణ చేశారు. అంతేకాకుండా ఆ యుగంలో వెలువడిన సాహిత్యాన్ని ప్రక్రియ పరమైన దృక్పథంతో నిశితంగా పరిశీలించి ప్రక్రియ వికాసాన్ని కూడా తెలియజేయడం ఒక విశేషం.

### 6.8.5. సాహిత్య యుగ విభజన తులనాత్మక పరిశీలన:

ఒకే యుగంలో వెలువడిన సాహిత్యాన్ని వివిధ శీర్షకలతో అంటే కవిత్వ పరామర్శ, గ్రంథపరామర్శ, లాంటి పద్ధతులను ప్రయోగించడం ఒక విశేషం. పింగళి లక్ష్మీకాంతంగారి యుగ విభజన ప్రణాళికలు ఈ కింది విధంగా ఉన్నాయి.

### 6.9. గౌతమ వ్యాసములు :

పింగళి లక్ష్మీకాంతంగారు 'గౌతమ వ్యాసములు'(1952) అనే పేరుతో ప్రచురించిన పుస్తకంలో సాహిత్యచరిత్ర నిర్మాణం గురించి చర్చించారు. ఈ గౌతమా వ్యాసములో మొదటిది *'ఆంధ్ర వాఙ్మయ స్థూల రూపం'* అనే వ్యాసం సుదీర్ఘమైనది. దీనిలో 'సాహిత్యచరిత్ర'ను స్థూలంగా యుగవిభజన చేసి వెయేడ్ల తెలుగు సాహిత్యాన్నీ సంక్షిప్తంగా తెలియజేశారు. దీనిలో యుగవిభజన ఈ విధంగా ఉంది.

*1.పేరులేదు*

*2. నన్నయ యుగం*

*3. **12వశతాబ్ది***

***4. తిక్కన యుగం 13వ శతాబ్ది.***

***5. ఎఱ్ఱన యుగం (1300 -1350).***

*6. శ్రీనాథయుగం* ***(1350 -1500).***

*7. కృష్ణరాయలయుగం* ***(1500-1600).***

*8. దక్షిణాంధ్రయుగం* ***(1600-1775).***

*9. క్షీణయుగం* ***(1775-1875)***

*10. ఆధునిక యుగం* ***(1875 -)*** *వరకు యుగ విభజన చేశారు.*

**6.10. ఆంధ్ర సాహిత్య చరిత్ర:**

పింగళి లక్ష్మీకాంతంగారు మరణించిన తర్వాత వారి శిష్యులు ఆయన తరగతి గదులలో చెప్పిన నోట్సును ఆధారంగా చెసుకొని ఆంధ్రసాహిత్యచరిత్ర (1974, 2018) గ్రంథాన్ని ప్రచురించారు. దీనిలో యుగవిభజన ఈ విధంగా ఉంది. పింగళివారు దీనికి ముందుగానే **'సవిమర్శ ఆంధ్ర వాఙ్మయ చరిత్ర'** అనే పేరును పెట్టుకున్నారు. కానీ దీన్ని తెలుగు అకాడమీవారు ఆంధ్ర సాహిత్య చరిత్రగా 1974 లో తొలి సారి ముద్రించారు. తర్వాత పలుమార్లు పునర్ముద్రణలు జరిగింది.

- *ప్రాఙ్నన్నయయుగము* ***( క్రీ.శ.1000 వరకు)***
- *నన్నయ యుగము* ***(క్రీ.శ.1000-1100),***
- *శివకవి యుగము* ***(క్రీ.శ.1100-1225),***
- *తిక్కనయుగము* ***(క్రీ.శ.1225-1320),***
- *ఎర్రనయుగము* ***(క్రీ.శ.1320-1400) ,***
- *శ్రీనాథయుగము* ***(క్రీ.శ.1400-1500) ,***
- *రాయలయుగము* ***(క్రీ.శ.1500-1600) ,***
- *దక్షిణాంధ్రయుగము* ***( క్రీ.శ.1600 - 1775),***
- *క్షీణయుగము* ***(క్రీ.శ.1775-1875),***

**6.11. విజ్ఞాన సర్వస్వంలో సాహిత్య చరిత్ర నిర్మాణం :**

పింగళి లక్ష్మీకాంతంగారు విజ్ఞాన సర్వస్వం కోసం ఒక సాహిత్య చరిత్ర నిర్మాణానికి సంబంధించిన వ్యాసాలను రచించారు. దీనిలో సాహిత్య చరిత్ర నిర్మాణం, కవి కాలాదులు, యుగ విభజన తదితర అంశాలను స్థూలంగా విశ్లేషణాత్మకంగా వివరించారు.

★. *తిక్కన అనే వ్యాసం.*

★. *ప్రబంధ పూర్వ యుగం అనే వ్యాసం.*

★. *ప్రబంధయుగం అనే వ్యాసం.*

★. *పెద్దన అనే వ్యాసం.*

★. *పింగళి సూరన అనే వ్యాసం* అని స్థూలంగా వర్గీకరించారు. దీన్ని బట్టి సాహిత్య చరిత్రలో యుగ విభజనను మహాకవుల పేరుతో, మరికొంత ప్రక్రియల పేరుతో చేశారని స్పష్టంగా కనిపిస్తుంది.

**6.12. పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య చరిత్రలు–తులనాత్మకత:**

పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్యచరిత్ర నిర్మాణానికి సంబంధించిన సుదీర్ఘకాలం పాటు ఆలోచనలు చేశారని ఆయన రాసిన గౌతమ వ్యాసములు, ఆంధ్ర సాహిత్య చరిత్ర, విజ్ఞాన సర్వస్వం రచనలను బట్టి తెలుస్తుంది. అందుకనే ఆయన తర్వాత వచ్చిన సాహిత్య చరిత్ర కారులు అత్యధికులు పింగళివారి యుగ విభజన సమంజసంగా ఉందని పేర్కొన్నారు. బి.ఏ స్పెషల్ తెలుగు విద్యార్థుల కోసం తెలుగు అకాడమీ హైదరాబాద్ వారు తెలుగు సాహిత్య చరిత్ర అనే పేరుతో ఒక పాఠ్యగ్రంథాన్ని ప్రచురించారు. దీనికి సంపాదకులు కలిదిండి వెంకటరామరాజు, రచయితలు వాడవల్లి చక్రపాణిరావు. దీనిలో పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్యచరిత్ర యుగవిభజన సమంజసంగా ఉందని పేర్కొన్నారు.

నన్నయ యుగానికి ముందు ఉన్న కాలానికి ప్రాఙ్నన్నయను యుగమని సాహిత్య చరిత్రకారులు పేర్కొన్నారు. పింగళివారు తన ఆంధ్ర సాహిత్య చరిత్రను ప్రాఙ్నన్నయను యుగకర్తగా ఎన్నుకోవడాన్ని ప్రారంభించి, క్షీణయుగంతో ముగించారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు 'గౌతమా వ్యాసములు' (1952) అనే పేరుతో ముద్రించారు. దీనిలో 'ఆధునిక యుగం 1875–) గురించి కొంత సాహిత్యాంశాల్ని సంక్షిప్తంగా తెలియజేశారు. దీనిలో ఆయన ఆధునిక సాహిత్య ప్రక్రియల పట్ల కొంత విషయావగాహనతో కనిపిస్తారు. వీటితో పాటు ఆయన వివిధ గ్రంథాలకు రాసిన పీఠికలు, తాను పల్నాటి వీరచరిత్ర, ద్విపదభారతం మొదలైన గ్రంథాలు ప్రతులను పరిష్కరించి వాటికి పీఠికలను రాశారు. వీటిలో ఆయన పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. ఈ మూడింటిలో గల భేదసాదృశ్యాల్ని కింది పట్టిక ద్వారా మరింత స్పష్టంగా గుర్తించే వీలుకలుగుతుంది.

## 6.13. యుగవిభజన – పట్టిక:

| | గౌతమవ్యాసములు (1952) | విజ్ఞాన సర్వస్వము–1 (1959) | ఆంధ్ర సాహిత్య చరిత్ర (1974) |
|---|---|---|---|
| 1 | పేరు పెట్టలేదు | చెప్పలేదు. | ప్రాఙ్నన్నయ యుగం (క్రీ.శ.1000) |
| 2. | నన్నయ యుగం | చెప్పలేదు. | నన్నయ యుగము (క్రీ.శ.1000-1100), |
| 3 | 12వశతాబ్ది | చెప్పలేదు. | శివకవి యుగము (క్రీ.శ.1100-1225) |
| 4 | తిక్కన యుగం, 13వ శతాబ్ది. | తిక్కనకొట్టరువు అనే వ్యాసం. (పుట: 252–256) | తిక్కనయుగము (క్రీ.శ.1225-1320) |
| 5 | ఎఱ్ఱనయుగం, (1300 -1350). | చెప్పలేదు. | ఎఱ్రనయుగము (క్రీ.శ.1320-1400 |
| 6 | శ్రీనాథయుగం, (1350 -1500). | ప్రబంధపూర్వయుగం వ్యాసం. (క్రీ.శ.1400-1500). (పుట:739–751) | శ్రీనాథయుగము (క్రీ.శ.1400-1500). |
| 7 | కృష్ణరాయలయుగం, (1500-1600). | 1.ప్రబంధయుగం వ్యాసం. (క్రీ.శ.1500-1875). (పుట:751–766). 2. పెద్దన, అల్లసాని వ్యాసం. (1470–1535) రమారమి. (పుట:380–383) 3. పింగళి సూరన: 16వ శతాబ్ది ఉత్తరార్థము వ్యాసం. (పుట:820–824). | రాయలయుగము (క్రీ.శ.1500-1600). |
| 8 | దక్షిణాంధ్రయుగం, (1600-1775). | చెప్పలేదు. | దక్షిణాంధ్రయుగము (క్రీ.శ.1600 - 1775). |
| 9 | క్షీణయుగం, (1775-1875) | చెప్పలేదు. | క్షీణయుగము (క్రీ.శ.1775-1875). వేమనగురించి చెప్పారు. |
| 10 | ఆధునిక యుగం (1875 ) | చెప్పలేదు. | |
| | | | |

**6.14. సాహిత్య శిల్ప సమీక్ష–విమర్శనాత్మక పరిశోధన:**

పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్రవిశ్వవిద్యాలయం(వాల్తేరు) తెలుగుశాఖలో రీడర్ గా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి) తెలుగుశాఖలో ఆచార్యుడిగా పాఠాలను బోధించేవారు. రిటైరైన తర్వాత సాహిత్య కృషి చేసి తన జీవితం గడిపారు. చివరి రోజులలో తాను చెప్పిన పాఠాల అంశాలను 'సాహిత్యశిల్పసమీక్ష' (1966) అనే పేరుతో గ్రంథరూపంలో తీసుకువచ్చారు. అందువలన ప్రధానంగా ఈ గ్రంథాలలో వారు చెప్పిన పాఠాలను అధ్యయనం చేస్తే ప్రాచీన తెలుగు సాహిత్య పరిణామాలను, వీటితో పాటు ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియల పట్ల ఆయనకున్న విభిన్న దృక్పథాలు, అభిప్రాయాలు కనపడతాయని స్పష్టంగా చెప్పవచ్చు. వీటన్నింటికి ఈ సాహిత్య శిల్ప సమీక్ష మీద ఆంగ్ల కవి WILLIAM HENRY HUDSON రచించిన "An Introduction to the Study of Literature" అనే విమర్శ గ్రంథ ప్రభావం బలంగా కనబడుతుందని ఆయనే స్వయంగా ప్రస్తావించుకున్నారు. దీన్ని తర్వాత విమర్శకుల కూడా ఈ విషయాన్ని తెలిపారు. ఆంగ్ల సాహిత్యవిమర్శలో హడ్సన్ గ్రంథం ప్రామాణికమనే చెప్పాలి. పింగళివారు ఇంచుమించు హడ్సన్ కాలానికి సమకాలీకులుగా ఆ గ్రంథంలో చెప్పిన పాశ్చాత్య అలంకార వేత్తల సిద్ధాంతాల ప్రతిపాదనలను తెలుగు అలంకార శాస్త్రాలకు అన్వయించి, సాహిత్య విమర్శను శాస్త్రీయంగా, సమన్వయ విమర్శ పద్ధతిలో నిరూపించడం ఆయన విమర్శ దృక్పథంలో కనిపించే ప్రధాన లక్షణం. ఆయన ఈ గ్రంథంలో పాశ్చాత్య కావ్య విమర్శ లక్షణాలను భారతీయాలంకారిక విమర్శ లక్షణాలతో తులనాత్మకంగా, సమన్వయాత్మకంగా చర్చిస్తూ, విశ్లేషిస్తూ సిద్ధాంతాలకు కావాల్సిన ప్రతిపాదనలు చేస్తూ నిరూపణ చేశారు.

ఒక పారిభాషిక పదాన్ని రూపొందించాలంటే కూడా ఆయన ఎంతగానో ఆలోచించేవారు. సాహిత్య శిల్ప సమీక్షలో తాను చేసిన పారిభాషిక పదాల రూపకల్పన గురించి ప్రస్తావిస్తూ ఆయన ఇలా అన్నారు. *"నేను కల్పించిన పెక్కు విమర్శ పారిభాషిక పదములకు కూడ భాషలో స్థిరత్వమేర్పడెను. తెలుగులో ముప్పదియేండ్లకు పూర్వము గల విమర్శభాషతో నేటి విమర్శ భాషను పోల్చి చూచినపుడు, కానవచ్చెడి పారిభాషిక పద భిన్నత్వమునకు నేనే కర్తనని చెప్పుటలో తప్పులేదు. పాశ్చాత్య కావ్య విమర్శ సిద్ధాంతములకును, భారతీయాలంకారిక సిద్ధాంతములకును, వస్తుత:వుండెడి భేద సాదృశ్యములను వివరించుచు, ఆ రెండు పద్ధతులను ఎంతవరకు సంవదించునో నిరూపించుటకు కొంత ప్రయత్నము చేసితిని. ఈ గ్రంథమున సుమారు ఏబది ఆంగ్ల ఉల్లేఖనములు (Quotation) కలువు. వాటిలో ఇంచుమించు ఇరువది 'Hudson' తన "An Introduction to the Study of Literature" అనే గ్రంథములో ఉదాహరించిన వాటి నుండి గైకొంటిని. ఆయా మూల గ్రంథముల ఆ మూల గ్రంథముల లు, పంక్తులు ఇవ్వలేకపోతిని"* అని పింగళి

లక్ష్మీకాంతం(సాహిత్య శిల్ప సమీక్ష,1966: పీఠికలో) ఈ 'సాహిత్య శిల్ప సమీక్ష' స్వభావం గురించి పీఠికలో తెలియజేశారు.

### 6.15. పింగళివారి పీఠికలు– పరిష్కరణ పరిశోధన:

పింగళి లక్ష్మీకాంతంగారు అనేక కావ్యాలకు పీఠికలు రాశారు. ముసలమ్మ మరణం, మా భూమి నాటకం, కళ్యాణ రాఘవం మొదలైన వాటిని చెప్పుకోవచ్చు. అలాగే రంగనాథ రామాయణం, పల్నాటి వీర చరిత్ర, ద్విపద భారతం, మానుకొండ రామాయణం, విష్ణుపురాణం మొదలైన వాటిని పరిష్కరించి పీఠికలలో తన పరిశోధనాంశాలను వివరించారు. వాటిని ఇక్కడ వివరించే ప్రయత్నం చేస్తాను.

### 6.15.1. రంగనాథరామాయణం పీఠిక

సాహిత్య చరిత్రలో రామాయణానికి, మహా భారతానికి, భాగవతానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. రామాయణాలలో రంగనాథ రామాయణం ద్విపద ప్రక్రియలో మొదటిది. తెలుగులో కూడా రంగనాథా రామాయణమే మొదటిది. దీని కర్తృత్వ నిర్ణయం గురించి జరిగిన చర్చలు మరే ఇతర కావ్యంపైన కూడా జరగలేదు. రంగనాథ రామాయణ కర్తృత్వ నిర్ణయం గురించి అనేక మంది పరిశోధకులు, విమర్శకులు విమర్శ, ప్రతి విమర్శల రూపంలో కొనసాగాయి. వీరంతా తమ దైన శైలిలో విమర్శనాత్మకంగా తెలియజేశారు. తెలుగు సాహిత్యచరిత్రలను రాసిన కందుకూరి వీరేశలింగం, ఆరుద్ర, పింగళ లక్ష్మీకాంతం, జి. నాగయ్య, కొర్లపాటి శ్రీరామమూర్తిలతో పాటు, చరిత్ర పరిశోధకులు కూడా ఈ రంగనాథ రామాయణం కర్తృత్వం పట్ల భిన్నమైన వాదాలు, విమర్శలు చేశారు. ఈ రంగనాథ రామాయణానికి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు, జనమంచి వేంకట సుబ్రహ్మణ్య శర్మ, మల్లంపల్లి సోమశేఖర శర్మ, ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు, కట్టమంచి రామలింగారెడ్డిగారు, డా సంగనభట్ల నరసయ్యగారు ఇలా మొదలైనవారు ఎంతో విలువైన పీఠికల్ని రాశారు. వీటిలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు రంగనాథ రామాయణానికి రాసిన పీఠిక విమర్శకుల మన్ననలను పొందింది. ఈ పీఠికలో ఆయన తెలియజేసిన విభిన్నమైన విమర్శనాంశాల గురించి తెలియజేస్తాను.

''*ఈ రామాయణమును గోనబుద్ధారెడ్డి రచించి తన తండ్రియగు 'విట్ఠలక్ష్మానాథు' పేరు వెలయించినట్లు గ్రంథ అవతారికలో కలదు. భారతీయ భాషలలో రామాయణములు సాధారణముగా గ్రంథకర్తల పేరుతోనే ప్రచారము పొందియున్నవి. ఈ దృష్టితో దీనికి 'రంగనాథ రామాయణ' మని పేరుండుటను బట్టి దీనిని రంగనాథుడను కవియే రచించియుండునని విమర్శకులు కొందరు తలంచిరి*'' అని రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారు ('భారతి' మాస పత్రిక, 1943) లో పేర్కొన్నారు.

*"కవియశమును గోనబుద్ధా రెడ్డికి సమగూర్చదలిచి, రంగనాథడు తన రామాయణములో అతని పేరు పెట్టి యుండునని వీరు తలంతురు. కాని ఈ కాలమున రంగనాథుడును కవి విట్టలక్ష్మానాథు నాస్థానమున నుండినట్లు చారిత్రక ఆధారాలు లేవు. ఈ కాలమున నుండిన చక్రపాణి రంగనయేరంగనాథుడై యుండునని శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారూహించిరి"* (రంగనాథ రామాయణం సింహావలోకనము అనే విమర్శ వ్యాసాల సంపుటి) లో తెలియజేశారు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు రంగనాథ రామాయణానికి ఎంతో విలువైన పీఠికను రాశారు. అందులో ఆయన చెప్పిన సాహిత్యాంశాలను, ఉటంకిస్తూ విషయాన్ని ఎంతో వివరణాత్మకంగా, విమర్శనాత్మకంగా, పరిశోధనాత్మకంగా చర్చించారు. అందుచేత ఆ పీఠిక విమర్శకుల మన్ననలను పొందిందని విమర్శకులు భావిస్తున్నారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు రంగనాథ రామాయణం గురించి చేసిన మౌలిక పరిశీలనలో గ్రంథనామసమన్వయం, గ్రంథకర్తృత్వం, వంశవృక్షంలో వంశాన్ని, అవతారికలో కవులు ప్రకటించుకున్న తమ నేపథ్యాలు, అవాల్మీక అంశాలు వంటి వాటిని ఏవిధంగా సమన్వయం చేస్తూ వివరించారో చూద్దాం.

1.గ్రంథ నామ సమన్వయం: ఈ గ్రంథాన్ని బుద్ధభూవిభుడు రచించాడని, తన తండ్రి విఠలుని పేరుతో ప్రఖ్యాతం చేసాడని అనడానికి కనిపించే ఆధారం తండ్రి పేరు ప్రఖ్యాతం చేయడమే అంటే అతని పేర రామాయణాన్ని పిలవడం ఈ అర్థంలో ఆ తండ్రి, కొడుకుల ఇద్దరు కలిసి రాశారనడానికి ఈ కింది పంక్తుల్ని బట్టి తెలుస్తోందని ఆయన ప్రకటించారు.

*"భూమిఁగవీంద్రులు బుధులును మెచ్చ*
*రామాయణంబు పురాణమార్గమునఁ*
*దప్పక నా పేరఁదగ సంధ్రభాషఁ*
*జెప్పి ప్రఖ్యాతంబు సేయింపు మర్వి"*

*'పనిపూని యరిఁగండ భైరవు పేర*
*ఘనుపేర మీసరగండని పేర*
*లలిత నిర్మల గుణాలంకారు పేర*
*నలఘు నిశ్చల దయాయత బుద్ధపేర*
*నా తత కృతపేర నతిపుణ్యపేర*
*మాతండ్రి విట్టలక్ష్మాపాలు పేర ....*

*శ్రీరాము చరిత మెప్పుఁజెప్పెద"* ఈ అర్థంలో దీనికి విట్టలరామాయణమని, గానీ విట్టలనాథరామాయణమని గానీ పేరుండాలి. అయితే రంగనాథరామాయణమని పేరును సూచించారు. పింగళివారు దీనితో పాటు గోనబుద్ధారెడ్డి వంశవృక్షాన్ని, అవాల్మీక అంశాలను కూడా తెలిపారు.

### 6.15. 2. మా భూమి నాటకం:

తెలంగాణ అంటేనే సాయుధ పోరాటాలకు నిలువెత్తు నిదర్శనం. ఈ నేల పోరాటాలకు, విప్లవాలకు, ప్రజా చైతన్యాలకు, పురిటి గడ్డ. ఈ ప్రాంతాన్ని నైజాం నవాబుల వందల సంవత్సరాల పాటు పరిపాలించారు. నైజాం పాలకులు తెలంగాణ ప్రజానీకాన్ని, నియంతృత్వంతో బంధించారు. నైజాం నేతృత్వంలో రజాకార్లు, నవాబులు, పటేల్, పట్వారీలు ఒక్కటై ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. దీని వలన ప్రజలకు స్వేచ్ఛా, సమానత్వ హక్కులు లేకుండాపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో అనేక మంది కవులు, మేధావులు నాటి తెలంగాణ సమాజాన్ని ప్రతిబింబించే విధంగా రచనలను రచించారు. అలాంటి తొలితరం తెలంగాణ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చరిత్రను 'మా భూమి' (1947) అనే సాంఘీక నాటకం పేరుతో సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు గార్లు చక్కగా చిత్రించారు.

ఈ నాటకానికి పుచ్చలపల్లి సుందరయ్య, హరి నాగభూషణం, మునిమాణిక్యం నరసింహారావు, పంద్రంగి కేశవరావు, రావి నారాయణరెడ్డి, కొప్పరపు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, పింగళి లక్ష్మీకాంతం, కళా వెంకట్రావు, వేముల కూర్మయ్య, బెజవాడ గోపాలరెడ్డి మొదలైన వారందరు తన అభిప్రాయాలను పీఠికల రూపంలో తెలియజేశారు. మా భూమి నాటకానికి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు పీఠిక రాస్తూ ఈ విధంగా అన్నారు. *"రచనలో విమర్శకు తావు లేదు. నగారా బాదే సమాసాలే కవిత్వం అనుకునేవారికి ఎంతమందికి ఈ జాతీయమైన తెలుగు తెలుసు? ఈ కవులు (Idiom) చాలా బాగా పట్టుకున్నారు.*

*వీరి రచనలు చూశాక మేం కవులమని చెప్పుకోడం సిగ్గుగా ఉంది. తిక్కన తర్వాత మళ్ళీ ఈనాడు జాతీయమైన భాష విన్నాం. ఆనాటి తెలుగు ఔన్నత్యం పునరుద్ధరించబడుతూందని ఈ కవులు రుజువు చేశారు. రైలుబండి నడకలాగా ఈ కవులు సంవాదం బహు చక్కగా నడిపారు. బీద రైతుల బాధలు చిత్రించారు. నైజాంలో దేశ ముఖులకు యింకా గోరీ కట్టలేదు. కాని, యిందులో కట్టారు. రామాయణం వాల్మీకి ముందుగానే గానం చేశాడు. నిజమయింది. అలాగే, ఈ సత్య కవుల వాక్కు త్వరలో ఫలిస్తుందని నమ్ముతున్నాను."* అని సుంకర సత్యనారాయణ వాసిరెడ్డి, భాస్కరరావు గార్లు (మా భూమి,1947:xiii) లో పింగళి లక్ష్మీకాంతంగారు మా భూమి నాటక ప్రత్యేకతను అందులో సామాజిక అంశాలను, నాటకంలో కవులు ప్రయోగించిన భాషను, భాషలోని సౌందర్యాన్ని గురించి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

**6.15.3.'ముసలమ్మ మరణము:**

శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు 'ముసలమ్మ మరణం' అనే కావ్యాన్ని రచించారు. దీన్ని ఆధునిక సాహిత్యంలో గొప్ప కావ్యమని అనేకమంది విమర్శకులు ప్రస్తావించారు. ఈ ఖండకావ్యానికి ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు పీఠిక రచించారు. దీనిలో కట్టమంచివారి 'ముసలమ్మ మరణం' కావ్యంలోని విశేషాలను, సాహిత్య విమర్శను స్తుతించారు. *"భావనాత్మకమైన కావ్యసృష్టిశక్తియు, వస్తుతత్వ వివేచనాత్మక మైన కావ్య విమర్శ ప్రజ్ఞయు ఒక వ్యక్తిలోనే నెలకొని యుండుట యసంభవము గాకపోయినను అసాధారణము. అట్లుండుటయే తటస్థించిననాడు ఆవ్యక్తిచే రచింపబడిన కావ్యము కళాకౌశల విభూషితమును, తర్కృతమైన విమర్శము రసవంతముననగును, ఆట్టివానిని కేవల విమర్శకుడనిగాని కేవల కవియనిగాని కాకుండా విమర్శకకవియని పేర్కొనదగును. ఆంగ్లేయ సారస్వతమున నిట్టి యుభయప్రజ్ఞలుగల మహనీయుకు గత శతాబ్దిలో మేథ్యూ ఆర్నాల్డు. ఆంధ్ర సారస్వకమున, ఈ శతాబ్దిలో శ్రీకట్టమంచి రామలింగారెడ్డి. ఆ దేశమున ఆర్నాల్డును ఈదేశమున రెడ్డియును విద్యాశాఖాధికారులుగా సరస్వతీ సేవకే జీవితము నంకిత మొనర్చుకొనుటయు వీరి సాదృశ్యముకు మరికొంత సన్నిహితం చేయుచున్నది"* అని(గౌతమ వ్యాసములు,1952:90) అన్నారు. పింగళి లక్ష్మీకాంతంగారు ముసలమ్మ మరణం కావ్యానికి పీఠికను రాస్తూ "ఆంగ్ల దేశంలో ఆర్నాల్డ్ కంటే ముందే గానీ అతని సమకాలికుల్లో గానీ విమర్శకులు లేకపోలేదు. అయినా ఆ విమర్శలో కావ్య వస్తు ప్రయోజన విషయాలలో ఆర్నాల్డ్ తో సరితూగ గల తెలుగు విమర్శకుల్లో కట్టమంచి రామలింగారెడ్డిగారు ఒకరని పింగళి లక్ష్మీకాంతం అభిప్రాయపడ్డారు.

మరలా ఈ కావ్యంలోని విశేషాలను చెప్తూ *"ఈ ముసలమ్మ మరణము ప్రతియాంధ్రుడును జదువవలసిన వీరగాథ, ఇట్టి సాంఘికేతివృత్తముగల మరణాంత కావ్యము గనుకనే యితని నూతన కవితా స్వతంత్రరీతులకు ఆనాడు దృష్టాంతముగా పేర్కొనబడినది. తెనుగులో స్త్రీ పాత్రకు ప్రాధాన్యమిచ్చి వ్రాసిన కావ్యములు చాల తక్కువ. ఏ కొలదిగానో యున్నను ఆవి శృంగారరస బహుళములేగాని యితర రసప్రతిపాదకములు కావు. మరియు వానిలోను ఏరెండు మూడిటనోతప్ప తక్కినవానిలో ఆ పాత్రములు వర్ణింపబడినవేగాని చిత్రింపబడినవికావు. పాత్ర వర్ణన యనగా దాని గుణగణము నంతయు కవి, తానై పేర్కొనుట, పాత్ర చిత్రణ మనగా కథాకార్యవశమున ఆ పాత్రలయొక్క స్వరూపస్వభావము లు స్వయం వ్యక్తమగునట్లు చేయుట. ఈ రెండవ పద్ధతిని స్వయం వ్యక్తమగు నట్లు చేసిన పాత్రలే సజీవములనియు, ఆ సజీవతయే కవియందలి సృష్టిశక్తి తాల్చిన రూపమనియు చెప్పుదురు. ఈ కావ్యములోని ముసలమ్మ పాత్ర అతి నిపుణముగా చిత్రితమైనదేగాని పూర్వ పద్ధతిని వర్ణితమైనదికాదు. ఈ రచనకు శోభ కలిగించిన విశేషములలో నీపాత్ర చిత్రణకౌశల మొకటి"* అని (గౌతమ వ్యాసములు:110) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి ముసలమ్మ మరణంలోని

ముసలమ్మ పాత్రకు కట్టమంచివారు ఎంతో ప్రాధాన్యతనిచ్చారనీ తెలిపారు. ముసలమ్మ పాత్ర ఒక వీరవనితగా, వీరగాథగా కనిపించేటట్లు కట్టమంచివారు చిత్రించారని అన్నారు. ఈ కావ్యంలో సాంఘీక ఇతివృత్తం ఉందని పూర్వ కవులు శృంగార రసాల్ని అనుసరిస్తే కట్టమంచివారు నవీన దృష్టితో నవ్యతను ప్రదర్శించారని ఇది ఆధునిక కవుల ప్రత్యేకతని పింగళివారు ఈ ముసలమ్మ మరణము ప్రతియాంధ్రుడును జదువవలసిన వీరగాథ, ఇట్టి సాంఘికేతివృత్తముగం మరణాంత కావ్యము గనుకనే యిని నూతన కవితా స్వతంత్రరీతులకు ఆనాడు దృష్టాంతంగా పేర్కొనబడినది అనిపింగళి లక్ష్మీకాంతం అభిప్రాయపడ్డారు.

### 6.15.4. కళ్యాణ రాఘవము:

శ్రీమాన్ చిలుకమర్రి రామానుజాచార్యులుగారు (వరంగల్) 'కళ్యాణ రాఘవము' (1960) అనే పద్య కావ్యాన్ని రచించారు. ఈ కావ్యానికి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు పీఠిక రచించారు. దీని నేపథ్యాన్ని చెబుతూ *''ఒక నాడు ఏదో ప్రసంగవశాన శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు నాతో ''వరంగల్లులో చిలుకమర్రి రామానుజాచార్యులు అనే మహాకవి 'కళ్యాణ రాఘవము' అను పేర సీత పెండ్లి కతను కావ్యంగా రచించినారు. అందులో కొన్ని భావాలు తలవునకు వచ్చినప్పుడెల్లా నేను మైమరచిపోతూ వుంటాను'' అని అంటూ ఒకటి రెండు భావాలు ఉదాహరణగా పేర్కొన్నాడు. నేను శ్రీవెంకటేశ్వరరావు వంటి మహాకవి మెప్పించిన ఆ మహాకవి ఎంతవాడై యుంటాడో అని లోలో అబ్బురమెంటు చెందుతూ, అయినా ఒక్కొక్క యెడ కవియొక్క సౌజన్యాన్ని పట్టి అతని కవిత్వమును మెచ్చుకొనే గుణము శ్రీ వేంకటేశ్వరరావులో ఉందని ఎరుగుదును. కనుక యీ 'కళ్యాణ రాఘవము' ఆ జాతి కావ్యమై ఉండునేమో అని అపోహపడ్డాను''* అని (కళ్యాణ రాఘవము,కావ్యం,1960:1)పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు. దీన్నీ వ్యాఖ్యానిస్తూ *''ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో సంస్కృత శాఖా అధ్యక్షులుగా ఉన్న ప్రొఫెసర్ కీత్ మహాశయుడు భవభూతి ఉత్తర రామాయణ చరిత్రను గురించి సమీక్ష చేస్తూ రామాదిపాత్రల స్వరూపములను స్వభావాలను వివరించి సీత పాత్రను తడవి ''This character is ethereal does not submit it self of analysis '' ఈ పాత్రను అతిలోకము విమర్శ వివేచనకు అందదు'' అని నమస్కారం చేశాడు. ప్రస్తుత కళ్యాణ రాఘవము నేటి సాహిత్యంలో ఆ జాతి కావ్యము విమర్శ వివేచనకు అందదు''* అని (కళ్యాణ రాఘవము కావ్యం,1966:2) తెలియజేశారు.

నిజానికి విమర్శను ఎట్లా వివేచన చేయాలని చెప్తూ *''ఒక కావ్యాన్ని సమీక్షించేటప్పుడు మొదటి రచయిత మొక్క నానాముఖమైన ఆత్మీయతనూ, రచనా నిర్వహణలో ఆ ఆతీయత ప్రయుక్తమైన పరుద్ధతిని అవగాహన చేసుకోవాలి. తరువాత ఆ కావ్యంలోని సౌందర్యం, శబ్ద గతమూ, అర్థగతమూ రీతిగతమూ, ఔచిత్యగతమూ, భావనాగతమూ, భావగతమూ అని పరిపరి ప్రమాణాలను బట్టి నిరూపించే ప్రయత్నం చెయ్యాలి. వీటిలో ఎక్కడో ఒక చోట కవి విశిష్టతస్ఫుటమవుతూ*

*వుంటుంది. కొన్ని యెడల ఒకటి, రెండు, మూడు చోట్ల కూడా అది స్ఫుటమవుతూ వుండవచ్చు. అది కైవసమైన పిమ్మట విమర్శకుడు యీ కావ్య గుణ మిది. యీ కవిత ప్రతిభ యిట్టిది, అది యిట్టిచోట నిష్ఠము – అని నిరూపించవచ్చు. నేను ఈ పద్ధతికి అలవడిన విమర్శకుడును. ఈ విమర్శ సంప్రదాయానుసారంగా యీ' కళ్యాణ రాఘవమున్ని చదవగా పైన పేర్కొన్న నానా కావ్య గుణములు ఒక్కచో రాశీభూతమైను, మనస్సుతో విడదీయుటకు వీలు లేనంతగా నిబిడీకృతమైన అఖండ జ్యోతిగా వెలుగొంది కనులకు మీరుమిట్లు గొల్పింది. కళ్యాణ రాఘవుడు యీ గ్రంథకర్తకు కళ్యాణ పరంపరలొసగుగాక ''* అని (కళ్యాణ రాఘవముకావ్యం,1966:2) అన్నారు. దీన్ని బట్టి ఒక కావ్యాన్ని ఏ విధంగా విమర్శించాలనే ఒక కావ్యంలోని సౌందర్యం, శబ్ద గతమా, అర్థగతమా రీతిగతమా, ఔచిత్య గతమా, భావనా గతమూ, భావగతమా అని పరిపరి ప్రమాణాలను బట్టి కావ్యానికి విలువను నిర్ధారించి, నిరూపించే ప్రయత్నం చెయ్యాలని తన అభిప్రాయాన్ని చాలా స్పష్టంగా విశదీకరించారు. దీన్ని బట్టి పింగళివారే తన విమర్శనా దృక్పథం గురించి చెప్పుకున్నారు.

**6.16. ఆధునిక యుగం:**

ఆంధ్ర సాహిత్య చరిత్రలో పింగళివారు ఆధునిక యుగాన్ని క్రీ.శ. 1875– కాలంతో ప్రారంభించారు. ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యం ఏ విధంగా పరిణామం చెందిందో పింగళి లక్ష్మీకాంతంగారు వివరించారు. ప్రాచీన లక్షణాలు గల సాహిత్యం కొంత, కేవలం నవీన లక్షణాలుగా కొనసాగింది. నిజానికి అంటే ఈ యుగంలో నవ్యరూపంలో సాహిత్యం అధికంగా వచ్చింది. అలా రావడానికి ఆధునిక యుగంలో కొత్త ఆలోచనలు, కేవలం గుణాన్ని బట్టి మాత్రమే ఈ కాలాన్ని ఆధునిక యుగంగా పింగళివారు ప్రకటించారు. *'' ఈ యుగమున పూర్వమార్గము ననుసరించిన వారిలో ఆద్యుడు గోపినాథుని వేంకటకవి. తొల్లింటి రామాయణములన్నియు యథామూలములు కావని ఈ కవి మరలా వాల్మీకి రామాయణమును తెనిగించెను''* అని (గౌతమ వ్యాసములు,1952:34) పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు.

దీన్ని బట్టి ఈ యుగంలో వాల్మీకి రామాయణాన్ని పూర్వయుగాన్ని అనుసరించి గోపినాథకవి తన రామాయణాన్ని రచించాడని పింగళివారు పేర్కొన్నారు. ఈ ఆధునికత ప్రభావం వీరేశలింగం పంతులు, చిన్నయ్యసూరి వంటివారు ప్రధానకారణమని అన్నారు. ఈ యుగంలో పురాణేతిహాసాలను అనువదించిన కవుల్లో దాసు శ్రీరాములు పంతులు, తిరుపతి వేంకటకవులు, త్రిపురాన తమ్మయదొర శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, వావికొలను సుబ్బారావు, జనమంచి శేషాద్రిశర్మ మొదలైనవారు ఉన్నారు. వీటితోపాటు ప్రాచీన ధోరణిని అనుసరించి ప్రబంధాలు రాసిన వారున్నారు. క్షీణ యుగ ప్రబంధాలకు ప్రతికలుగా అవతరించారే కానీ స్వతంత్రంగా కావ్య రచనలు చేసినవారు తక్కువ. మరలా మరో విధంగా చెబుతూ *''ప్రబంధములు వ్రాసిన వారికి నూతనత్వము ఆపాదించి నవ్యకవిత్వమునకు నాంది పఠించిన కవులు తిరుపతి వేంకటేశ్వర కవులు. అందుచేతనే ఈ మహా కవుల వాక్కు ప్రాచీన*

*సరణికి భరత వాక్యము, నవీన సరణికి నాందీ వాక్యము"* అని (గౌతమ వ్యాసములు,1952:34) అన్నారు. దీనికి ఉపపత్తిగా ఖండవల్లివారు చెప్పిన ఆధునిక యుగ విశిష్టతను చూద్దాం.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనంగారు సాహిత్యచరిత్రలో ఆధునికయుగం చాలా విస్తృతమైందని కొందరు పరిశోధకులు అంటున్నారు. దీన్ని ఇలా చెబుతూ *"ఆధునిక యుగము నన్నయ నుండి కందుకూరి వీరేశలింగం పంతులు వరకు సాగిన ఆంధ్ర చరిత్ర యంతయు ఒక యెత్తు; తరువాత చరిత్ర మరియెకయెత్తు; దీనిని ఆధునిక యుగమని స్థూలముగా నిర్దేశించుటయగుచున్నది. ఆధునిక సాహిత్య యుగ చైతన్యమునందు ప్రధానముగా పాశ్చాత్య ప్రభావము జాతీయ భావా పునరుజ్జీవనము, ప్రయోగ బాహుల్యము, సామాజిక చైతన్యమునకు ప్రాయకముగా వైవిధ్యమునకై ప్రయత్నము అను అంశములు గోచరించుచుండును. ఈ యుగమున వెలిసిన ప్రక్రియలు బాహుళములు; ప్రక్రియలలో ప్రవర్తిల్లిన ప్రయోగము అనంతములు. సాహిత్య ప్రగతికి ఉద్యమములు సారథ్యము ఊహించుట, ఉద్యమములనాశ్రయించి సాహిత్య ప్రయోజనములు సంభావింపబడుట, ప్రయోజనంలో ఉద్దేశించి ప్రయోగములు రూపుదిద్దుకొనుట ఈ రంగమునందు సామాన్య లక్షణములు. యుగ స్వభావము విశిష్టమైనది. కావున సముచితమైన విశ్లేషణ విధానము వివరించి సమీక్షింపక తప్పదు. ప్రక్రియల నాశ్రయించి ఆధునిక యుగమును వివేచించుట అనువైన పద్ధతి. ఆధునిక యుగమున ప్రక్రియల నాశ్రయించి కొన్ని అంగములు వింగడించుకొని, కవితా రంగము, నాటక సాహిత్య రంగము, సాహిత్య విమర్శ రంగము, పరిశోధన రంగము, నవలా రంగము, కథానిక రంగము, పత్రికా రంగము అను విభాగములనాశ్రయించి ఆయా రంగములందు జరిగిన వివిధ ప్రయోగములను సమీక్షించుట ద్వారా సాహిత్య వికాసమును సమీక్షింపవచ్చును"* అని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు (తెలుగు విజ్ఞాన సర్వస్వం-1, 'ఆధునిక యుగము (క్రీ.శ.1875 తరువాత' అనే వ్యాసం,1959,:767) తెలియజేశారు. దీన్ని బట్టి ఆధునిక యుగం ఏర్పడడానికి పాశ్యాత్యవిద్య, పునరుజ్జీవన ఉద్యమాలు, పత్రికలు, ఇలా అనేక అంశాలన్ని కూడా ప్రభావితం చేశాయని అభిప్రాయపడ్డారు.

ఆధునికయుగ విశిష్టత గురించి *"సాహిత్యంలో ఆధునికతను రెండు విధాలుగా నిర్వచించవచ్చు. మొదటిది సమకాలీనతనే ఆధునికతగా నిర్వచించటం. ఈ దృష్టిలో సమకాలంలో వచ్చిన ఏ సాహిత్యమైన-సాంప్రదాయికంగాని, నవీనంగాని – ఆధునికం అవుతుంది. రెండవది మారిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు పునాదిగా ఏర్పడిన కొత్త దృక్పథాలను, స్వరూపాన్ని సంతరించుకోవటమే ఆధునికత అని నిర్వచించటం. ఈ విధమైన సాహిత్యానికి అంతకు ముందు లేని ప్రత్యేక లక్షణాలు, కొత్త విలువలు ఉంటాయి. ఇక్కడ ఆధునికత అనేది కాలాన్ని సూచించేదికాదు. అది ఒక తత్త్వం. ఒక తత్వంగా ఆధునికతలో రెండు భిన్న ధోరణులు కనిపిస్తాయి. సామాజిక ప్రయోజనం, హేతుబద్ధమైన శాస్త్రీయ దృష్టి, వాస్తవికతల పైన ఆధారపడిన సాహిత్య దృక్పథాలు తాత్విక*

*భూమికగా కలిగిన ఆధునికత ఒకటి. అభ్యుదయవాద, విప్లవవాద, వాస్తవికతా వాదాలు, కొంతవరకు హేతువాదం ఈ కోవలోకి వస్తాయి. పైన చెప్పిన విలువలు లేకుండా వ్యక్తివాద, అరాచకవాదాలు తాత్విక భూమికగా కనిపించే ఆధునికత రెండవది. ఆధునికత (Modernism) పేరుతో పాశ్చాత్య దేశాలలో సాహిత్యంలోను, ఇతర కళలలోను 19, 20 శతాబ్దాలలో కొన్ని ధోరణులు వచ్చాయి. మొదటి ప్రపంచ యుద్ధానికి కొంచెం ముందు, తరువాత ఈ ఆధునికత పరాకాష్ఠనందుకుంది. సింబాలిజం, ఇమేజిజం, ఇంప్రెషనిజం, ఫ్యూచరిజం, డాడాయిజం, సర్రియలిజం, నేచురలిజం మొదలైన ధోరణుల సముదాయానికే ఆధునికత అని పేరు"* అని కె.కె. రంగనాధాచార్యులుగారు (ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు' ముందుమాట, 1982:1) వ్యాఖ్యానించారు.

ఆధునిక యుగంలో తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు వెలిశాయి. భావ, అభ్యుదయ, విప్లవ, దిగంబర, దళిత, స్త్రీవాద, ప్రాంతీయ వంటి కవిత్వ ఉద్యమాలు అవతరించాయి. వీటిలో భావకవిత్వం ఆధునిక కాలంలో ఏ విధంగా విస్తరించిందో పింగళి లక్ష్మీకాంతం చెబుతూ *" ఈరీతిని నవ్యసాహిత్యము శాఖోపశాఖలై పలు విధములు నలుదెసల విస్తరిల్లుచుండగా, ఆ పేరు ఉచ్చరించినంతనే కొందరకు భావకవిత్వమనియే మనస్సున స్ఫురించుటకు నేమి హేతువో నాకర్థముకాలేదు. ఈ విషయమై లేని పోని వివాదము లిదివరకే చాలా పెరిగినవి. వివాదముల దారిని వివాదములు పోవుచుండగా భావకవిత్వము దారిని భావకవిత్వము పుట్టుచునే యున్నది. సాధువో, అసాధువో ఈ శబ్దము రూఢమును అయినది.*

*దీనిలో ఏ గుణ విశేషోమును లేకున్న ఇంతమంది వ్రాయుటయు, నామోదించుటయు జరుగనే జరుగదు కదా ఆంధ్రసాహిత్య పరిషత్తువంటి మహా సంస్థలు ప్రాచీన సాహిత్య రక్షణార్థమై పాటుపడుచున్నట్లే, నవ్యసాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు ఈ నవీన కవిత్వ రక్షణార్థము పాటుపడుచున్నవి. ఏ పేరున పిల్చిన నేమి? ఇంత నిరూఢమైన వస్తువునకు ఈ యుగములో అరస్థానమీయక తప్పదు. ఈ జాతి కవిత్వమంతయు గుణవంతమేయని నేను అనను. తిరస్కారార్హమైనదిగా కలదు. పురస్కారార్హమైనదియు కొంత కలదు. ఈ భేదము అన్ని యుగముల సాహిత్యమునందును ఉండును. ఆయా కాలములలో తేజోహీనములైన రచనలు అర్థాయుష్యములై అస్తమించిపోగా, ప్రాణవంతములైన నిలిచినవే ప్రాచీన కవిత్వమను పేర మనకు పఠనీయములై నెగడుచున్నవి. ఈ కవిత్వములోను జీవము కలవి మాత్రమే నిలిచి, బావికాలమువారికి ప్రాచీన కవిత్వముగా పూజార్హమగుటకు సందియములేదు. ఇక దీనిని గూర్చి ఎంత తక్కువ చెప్పిన అంత మేలు"* అని (గౌతమ వ్యాసములు,1952:37) తెలియజేశారు.

భావకవిత్వం కాల ప్రభావంతోను, పాశ్చాత్య ప్రభావంతోను మన జాతికి కలిగిన జాతీయత అనే భావన ఆంధ్ర భాషా, సాహిత్యాల్లో విస్తృతంగా వ్యాప్తించింది. ఇందులో ఆర్థిక, రాజకీయ, సాంఘిక, చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలతో పాటు ఇతర రచనలు వ్యాసాలుగా, గ్రంథాలుగా జనించాయి.

కనుక తెలుగు కవుల కృషి వలన తెలుగు భాషా, కవిత్వాలకు సేవ జరిగిందని పింగళివారు తెలిపారు. ఆధునిక యుగంలో భావకవిత్వంతో పాటు ఇతర ప్రక్రియలు ఏ విధంగా జనించి పరిణామ, వికాసాలు పొందాయనే విషయాల్ని పింగళి లక్ష్మీకాంతంగారు సంక్షిప్తంగా తెలియజేశారు.

### 6.17. కవిజీవిత సమన్వయ పరిశోధన:

పింగళి లక్ష్మీకాంతంగారు తెలుగు సాహిత్య చరిత్రలో కవులను పరిచయం చేసేటప్పుడు వారి రచనలను విశ్లేషించేటప్పుడు ఈ పరిశోధన పద్ధతి కనిపిస్తుంది. విమర్శ, పరిశోధనల మేలు కలయికగా ఈ రెండు అంశాలు విడదీయరానంత కలిసిపోయి కనిపిస్తుంటాయి. అందువల్ల నిర్ణయాలు ప్రకటించిన అంశాలను 'సాహిత్య పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం' అనే అధ్యాయంలో వివరించాను. మిగతా అంశాలను అంటే నూతన సమన్వయాలు కొత్త అంశాలను ప్రకటించడం మొదలైన వాటిని ఈ అధ్యాయంలో పేర్కొన్నాను. దీని వలన పునరావృత్తం లేకుండా చేసే ప్రయత్నం చేశాను. తెలుగు సాహిత్యంలో ప్రాఙ్నన్నయ యుగం నుంచి ఆధునిక యుగం వరకు కవులు జీవితాన్ని వారి రచనలను సాహిత్య చరిత్రకు అనుగుణంగా వివరించారు. వాటిని విమర్శ విభాగంలో అధికంగా పేర్కొన్నాను వీటితోపాటు ముఖ్యమైన పరిశోధన అంశాలు జరిగిన విషయాలను ఇక్కడ వివరిస్తున్నాను.

#### 6.17.1. సంస్కృత కవి కాళిదాసు.

పింగళివారు తన 'నా రేడియో ప్రసంగాలలో 'కాళిదాసు కావ్యజగత్తు– 'తపస్వీ– ఆశ్రమ జీవితము' అనే వ్యాసం ఉంది. దీనిలో కాళిదాసు వానప్రస్థ జీవితాల్ని దానిలోని మౌలికతను వివరించే ప్రయత్నం చేశారు. సాధారణంగా మానవులు నాలుగు దశల్లో తమ జీవితాన్ని సాగిస్తారనీ నారదుడు ధర్మరాజుకు వివరించారు. వాటికి ఆశ్రమాలనే పేరుతో పిలుస్తారు. ఆ ఆశ్రమాలు నాలుగు రకాలు. అవి వరుసగా బ్రహ్మచర్యం, గృహస్థ, వానప్రస్థం, సన్యాసం. వీటిని ప్రాచీన భారతీయ విద్యా విధానంలో ఒకటిగా చెప్పవచ్చు. అలాంటి వారిలో కాళిదాసు కవి ఒకరు.

కాళిదాసు ఆశ్రమ జీవితం గురించి చెప్పిన విశేషాంశాలను ఈ ప్రసంగంలో పింగళి లక్ష్మీకాంతంగారు సంగ్రహంగా వివరించారు. వానప్రస్థాన్ని స్వీకరించేవారందరు చివరికి ఆశ్రమ జీవితాన్ని అలవాటుపడవల్సిందేనన్నారు. ఏకాంత తపోనిష్ఠలో ఉన్నటువంటి తపస్సులకు ఆశ్రమాలను నిర్వహణ బాధ్యతలు పెరిగినప్పటికీ వారు బ్రహ్మ పదమును ముట్టిన ప్రౌఢ కనుక తామరాకు పై నీటి బొట్టు లాగా నిర్లిప్తుడై యెలగెడి వాడని, కాని క్రమక్రమంగా ఆశ్రయములు తాపస వంశములు లౌకిక వంశములలో లీనమైనట్లు తెలియుచున్నదనిరి.

భారత రామాయణ కర్తలైన వ్యాస వాల్మీకులు ఆశ్రమవాసులైనందువలననే వారి స్వానుభవములు ఆశ్రుము వర్ణనలో వెల్లడియగుచుండిన వనియు, ఆర్ష సంసారాభిలాషుకుల మహా కవులు సైతము తాకిక జీవితమున అరణ్యర వాతావరణమనకు సమన్వయించి తపోవన జీవితమును

కావ్యములలో చిత్రించి రనియు అద్దు దానిలో కాళిదాసు అరగణ్యతని పింగళి లక్ష్మీకాంతంగారు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అభిజ్ఞాన శాకుంతలములోని కణ్వాశ్రమ వర్ణనలో కాళ్ళిదాను ప్రదర్శించిన సూక్ష్మాతి సూక్ష్మ పరిశీలన, రఘువంశమునందలి  వాల్మీకి వశిష్టాశ్రమము లలో కానరాదు. శాకుంతలమునందలి మారీచాశ్రమము దేహాంతి విజ్ఞానమునకు, దీర్ఘనియోగానంతరము శకుంతలా దుష్యంతులు పునస్సమాగమమునకు నెల పైనది. అదృమవాసమైన తపణ్యమే పునరు వరాహిత్యము నారిలియనో నాగరుడైన కాళిదాను కదా దీనినే శితించిను. శకుంతలము – గ్రందలి భారత వాక్యములో ఇది ప్రస్ఫుటీకరింపబడినది. కుమారసంభవాన్ని రాసిన కాళిదాసు, నన్నెచోడుల కవితా తీరులను చర్చించారు.

పింగళివారు 'మరలా 'కాళిదాసుని ప్రణయ తత్త్వం' అనే వ్యాసాన్ని రచించారు. దీనిలో సంస్కృత కవి కాళిదాసుని రచనల్లోని ప్రణయ తత్త్వాన్ని గురించి తెలిపారు. పింగళి లక్ష్మీకాంతంగారు రస సిద్ధాంతాలలో శృంగారరసం ప్రధానమైనది. శృంగారానికి, ప్రణయానికి గల భేదాలను పరిశీలించారు. ఋషికల్పుడైన కాళిదాస మహాకవికి కాముకత్వాది దుర్గణము చేయబడింది. ప్రణయం గురించి చెబుతూ *"కేవలము దంపతుల మధ్య ప్రవర్తిల్లునదియే ప్రణయము కాదు. అది ఏ రెండు జీవుల మధ్య గాని ఉండతగినదే అని సిద్ధాంతరీకరించిరి. దీనికి ఉపపత్తిగా ఆశ్రమ గతములైన చేతనా ప్రకృతి శకుంతలను ప్రేమించిన విధము, చిత్రకూట బంధువును చూడ వచ్చిన తొలకరి మేఘుని చూచి ఆ గిరిరాజు వేడి బిందువులు రాల్చిన దృశ్యం. పార్వతీ పరమేశ్వరుల నందనవన క్రీడా విహారము, ఇందుమతీ మరణ సందర్భంలో ఆ రాజుడామెను గూర్చి పరితపించిన విధం మొదలైనవన్నీ కాళిదాసు చిత్రించిన ప్రణయ జీవన పరమార్థానికి కొన్ని నిదర్శనములనిరి. ధర్మవ్యతిక్రమం లేని ప్రణయ జీవనము నిత్యానందదాయుని కాగలదని, ఆ దంపతుల లాగా ప్రణయమగ్న మనస్కులు కాగలిగినప్పుడే జీవిత మాధుర్యము చవిచూడగలిగినట్లు"* అని జి. విశ్వనాథ నాయుదుగారు ('పింగళి లక్ష్మీకాంతముగారి వ్యక్తిత్వము–సాహిత్యము', పిహెచ్.డి అముద్రిత సిద్ధాంత గ్రంథం, 1991:353) తెలియజేశారు.

కాళిదాస కవి చెప్పడాన్ని బట్టి ప్రణయ జీవిత తత్త్వం ఔదార్యం ప్రశంసనీయమైందనీ తెలుస్తోంది. ఆయనే మరో చోట ప్రణయతత్త్వాన్ని తెలుపుతూ *" శృంగారానికి ప్రణయానికి కొంత భేదముంది. అలంకారశాస్త్రాలోని శృంగార పదానికి, కామ ప్రేరణచే స్త్రీ పురుషులకు కలిగే శరీరైక్య వాంఛ అని అర్థం. ప్రణయమంటే ఇరువురు జీవులకు పరస్పరము ఉండే ప్రేమ, స్నేహము, అనురాగము, సౌహార్థము మొదలైన వివిధ నామములతో పిలువబడే యే మధుర కోమల భావము ఈ విశ్వములోని భూతజాలమును ఏకసూత్రానికి బంధించడానికి ప్రయత్నిస్తూ ఉంటుందో, అనిర్వచనీయమైన ఆ హృదయ ధర్మానికి ప్రణయమని పేరు. శృంగారం కూడా ఆ ప్రణయంలో భాగమని"* అని జి. విశ్వనాథ నాయుదుగారు ('పింగళి లక్ష్మీకాంతముగారి వ్యక్తిత్వము–

సాహిత్యము', పిహెచ్.డి అముద్రిత సిద్ధాంత గ్రంథం,1991:353) పేర్కొన్నారు. దీన్ని బట్టి పింగళివారు ప్రణయానికి, శృంగారానికి మధ్య ఉన్న భేదాలను సూక్షంలో సూక్షమన్నట్లుగా వివరించారని, ఈ ప్రణయం కాళిదాసు కవిత్వంలోనే కాకుండా ప్రపంచ సాహిత్యంలో కనిపిస్తుందని వీటిలో ప్రణయానికి, శృంగారానికి భేదాల్ని విశదీకరించే ప్రయత్నం చేశారనీ కనిపిస్తోంది.

**6.17.2. భాసనాటకకర్తృత్వము:**

సంస్కృత సాహిత్యంలో కాళిదాసు, భాసుడు రచనలు ఎంతో పేరు ప్రఖ్యాతులు పొందాయి. సంస్కృతంలో భాసుడు కాళిదాసుని తర్వాత పేరెన్నికకలవాడు. పింగళివారు 'నా రేడియో ప్రసంగాలు' అనే పుస్తకాన్ని రచించారు. దీనిలో భాసుని నాటకాల గురించి 'భాసనాటకకర్తృత్వము' అనే వ్యాసాన్ని రచించారు. దీనిలో భాసుని జీవితాన్ని, సాహిత్యాన్ని ప్రస్తావిస్తూ నాటకాల కర్తృత్వ అంశాలను చర్చించి వాటిని వివరించారు.

ప్రాచీన కాలంలో నుంచి భాసుని గురించి, భాసుని నాటకసాహిత్యం గురించి విస్తృతంగా పరిశోధనలు జరిగాయి. నాటక ప్రయోక్తగా భాసుని సంస్కృత నాటకాలను పెక్కంటిని సంక్షిప్తీకరించి ప్రదర్శంపజేసే వాటి గురించి పింగళి లక్ష్మీకాంతంగారు తెలిపారు. ఆయనే భాసుడేవరో అతని నాటకములేమో తమ ప్రసంగ సాహిత్యంలో చెప్పారు. భాసుని పేరు అక్కడక్కడ వినడం తప్ప అతడేయేనాటకాలకు కర్త అని నిర్ధారించాడానికి వీలుకాని పరిస్థితుల్లో దైవికంగా1910 సంవత్సరంలో పి. గణపతిశాస్త్రిగారు తిరువాన్కూరులోని ఒక మఠం నుండి ఒకేకట్టగా కట్టి ఉన్న పదమూడు సంస్కృత నాటకాల సంపుటిని గ్రహించారు. అందులో ప్రసిద్ధమైన స్వప్న వాసవదత్త నాటకం తక్కిన వానికి గల సాదృశ్యాలను బట్టి ఆ దృశ్యములన్ని తప్పక భాసునివే అయియుండుననీ పి. గణపతి శాస్త్రి గారు తీర్మానించారని పూర్వ పరిశోధకులను ప్రస్తావించారు.

లభించిన 13 నాటకాలలో మధ్యమవ్యాయోగం, పంచరాత్రం, దూతవాక్యము, దూతఘటోత్కచుడు, కర్ణభారము, ఊరభంగం అనే ఆరు భారతకథకు సంబంధించినవేనని అన్నారు. వీటిలో అభిషేకం, ప్రతిమ నాటకాలు మాత్రం రామాయణానికి సంబంధించినవి. ఈ రెండు నాటకాల్లో ఎన్నో విశేషమైన కల్పనలు దర్శనమిస్తాయని తెలిపారు. స్వప్న వాసవదత్త, ప్రతిజ్ఞ యౌగంధరాయణం అనే బంధనాటకాలు చారుదత్తము, అవిమారకము, బాలచరిత్ర అనేవి వాటినీ ప్రదర్శనకు అవకాశం లేని నాటకాలుగా ఉన్నాయని అన్నారు. ఈ నాటకాల్లో ఉన్న సన్నివేశాలు నాటక లక్షణాలకు విరుద్ధంగా ఉన్నాయి. అన్నీ నాటకాల్లో ప్రసిద్ధమైన, సామాన్యమైన, సాధారణమైన నాటకాలుగా ఎంతో సూక్ష్మంగా పరిశీలించి వాటి ఏకకర్తృత్వములే అని అతడు భాసుడి నాటకాల గురించి గణపతిశాస్త్రిగారే నిర్ణయించారనీ పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొన్నారు.

'భాసుని ఏకాంక నాటకాలు' అనే వ్యాసంలో భాసుని ఏకాంక నాటకాలకు సంబంధించిన విషయాలను వివరంగా తెలిపారు. భాసుని నాటకకర్తృత్వం గురించి ఇంతకు ముందు చూశాం.

అయితే ఈ ప్రసంగంలో భాసుని నాటకసాహిత్యంలో ఉన్నటువంటి ఏకాంకిక నాటకాలను మాత్రమే పింగళివారు విశదీకరించారు. భాసుని 13 నాటకాల్లో భారతకథకు సంబంధించిన ఆరింటిలో ఒక్క పంచరాత్రం తప్పితే మిగిలినవన్నీ ఏకాంక నాటకాలేనని పేర్కొన్నారు.

నిజానికి వీటిలోని ఇతివృత్తం ప్రదర్శించడానికి అనుకూలంగా రూపొందించిన విధానం భాసుని అనన్యమైన ప్రతిభాపాటవాలను తెలుపుతున్నాయని పింగళివారు అన్నారు. ఊరభంగం వంటి ఏకాంకిక నాటకంలో ప్రదర్శించకూడని కథా సన్నివేశాలు ప్రధాన స్థానాన్ని ఆక్రమించాయి. ఈ నాటకాల్లో ప్రతినాయకుడైన దుర్యోధన యొక్క పాత్ర చిత్రణ పాఠకులు సహృదయంతో సానుభూతిని, అనురాగాన్ని, ప్రేమ, జాలి, దయ వాటిని ప్రకటిస్తారు. వాటిలో పాత్ర చిత్రణలో సన్నివేశ కల్పనలో భాసుడు చూపిన తన ప్రత్యేకతలను తెలియజేసేలా రాశారని అంటూ ఈ విషయాన్ని పింగళివారు ప్రత్యేకంగా భాసుని ప్రతిభను మెచ్చుకున్నారు. ఒక్కొక్క ఏకాంకికలోని ఇతివృత్తం అందులోని ఔచిత్య సన్నివేశాలకు సంబంధించిన వాటిని సవిమర్శక దృక్పథంతో సమన్వయం చేస్తూ నిరూపించే ప్రయత్నం చేశారనీ తెలుస్తోంది. కవికుల గురువైన కాళిదాసుని లాగా భాసుడు సంస్కృత సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానాన్ని పొందారని, అతని జీవితం, సాహిత్య సేవలను పింగళి లక్ష్మీకాంతంగారు విశదపరిచారు.

### 6.17.3. ఆముక్తమాల్యద ప్రబంధం కర్తృత్వం– పరిశోధన దృక్పథం:

తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీ కృష్ణదేవరాయల కాలాన్ని రాయల యుగాన్ని, ప్రబంధయుగమని, స్వర్ణయుగమని సాహిత్య చరిత్ర కారులు భావిస్తున్నారు. ఆముక్తమాల్యద అనే ప్రబంధం కర్తృత్వం గురించి పరిశోధనలు చర్చించారు. దీన్ని కృష్ణదేవరాలు రచించాడా లేదా పెద్దన రచించాడా అనే విషయంపై స్పష్టత లేదు. దీని కర్తృత్వ విషయం గురించి పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రలో పరిశోధనాత్మక దృష్టితో వివరించారు. దీనికి కొన్ని ఉపపత్తులను చూపిస్తూ కొంత తెలియజేసే ప్రయత్నం చేశారు. పెద్దన ఆముక్తమాల్యద గ్రంథాన్ని రచించి కృష్ణదేవరాయలు పేరు పెట్టారని చెప్పడానికి కొన్ని ముఖ్యాంశాలను ప్రస్తావించారు.

1. రాయలవంశాభివర్ణన పద్యములు, విష్ణుస్తోత్రపర మయిన పద్యములు మనుచరిత్రలోనివే యిందు గలవు. 2. పెద్దనగారే యాముక్తమాల్యద రచించినట్లు లోకములో నొక చాటువు గలదు. ప్రౌఢదీర్ఘసమాసముల గూర్చి శ్రీనాథుండు కూలార్చె నైషధంబు దాని తల్లన నల్లసాని పెద్దన చెప్పె ముది మదితప్పియాముక్తమాల్యద – రామలింగకవి చాటువు. 3. లక్షణ గ్రంథములలో 'అల్లసాని పెద్దన విష్ణుచిత్తీయము' నుండియని యుదాహరింపబడెను. 4. ఆముక్తమాల్యద ప్రథమ వ్యాఖ్యాత యిది పెద్దనదిగానే స్వీకరించెను'' అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:389) తెలిపారు.

దీనికి మరి కొంత చర్చకు పెడుతూ ఇలా అన్నారు ''*ఆముక్తమాల్యదలో నిసర్గముగా రాయల శైలికి భిన్నమైన శైలిగల పద్యములు పెక్కు గలవు. సారళ్యము ప్రసన్నత ప్రధానముగ గల*

*శైలిలోనున్నవా పద్యములు. సాహిత్యసమరాంగణచక్రవర్తి యని పేరు గాంచిన రాయలు తన రచన సాగినంతకాలము తావ్రాసినది తనయాస్థాన కవులకు వినిపించు సందర్భమున వారికి దనతో గల చనవు బలిమిని వారి కోరికపైగాని తాగోరి కాని వారి పద్యములో నక్కడక్కడ జొప్పించి యుండును. వారికి ముచ్చట, ఆయనకు గోర్కె. అది కావుననే యాముక్తమాల్యద యందు భిన్న శైలులున్నవనుట. ఏపద్యము లెవరు చెప్పినను గ్రంథ నిర్వహణము రాయలదే కాన నాతడే కర్త''* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:390) అన్నారు. దీన్ని బట్టి రాయల పద్యాల్ని ఆధారంగానే ఆముక్తమాల్యద కర్త రాయలేననీ ఉటంకించారు.

1. చాటువులే ప్రబంధములుగా వెలసిన రోజులవి. పెద్దనయే ఆముక్తమాల్యద రచించెనన్న చాటువు కేవలము జల్లిపదముల కూర్పు. ఇక నందలి విషయము చారిత్రక ప్రమాణమునకు జాలదూరము. 2. ఆముక్తమాల్యద పెద్దన కృతమని యుదాహరించిన లాక్షణికులు గాని చరిత్ర పరిశోధకులు కారు'' అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:390) లాక్షణికులకు చారిత్రక పరిశోధకులు కారని వారు కేవలం సాహిత్యానికి సంబంధించిన అంశాల్నే చెబుతారని తన నిర్ణయాన్ని పింగళివారు ప్రకటించారు. 3. 'పత్తుంపత్తుం', 'మఱుమక్క తాయిరం' మొదలయిన యన్యదేశ్య పదప్రయోగములు, వ్యాకరణ విరుద్ధము అయిన 'నిట్టతాడు వంటతివ', 'చించిచ్చువారు' 'గంగనుకాసె' 'నెలతిచ్చెను' మొదలగు ప్రయోగములు గలవు. మనుచరిత్రలో నిట్టి దోషములు లేవు. పెద్దనయే యీరెండు గ్రంథములకు గర్తయైన లాక్షణిక సమ్మతమైన మనుచరిత్రను తన పేరుమీద నుంచుకొని లక్షణవిరుద్ధములగు ప్రయోగములు గల ఆముక్తమాల్యదను రాయల పేరుమీద వెలయించి ప్రాణమిత్రుడగు రాజు నపఖ్యాతి పాల్జెయుననుట సమంజసము గాదు. ఇక నీప్రయోగములు పెద్దనగారికి సమ్మతములనిన మనుచరిత్రయందట్టిది యొక్కటియు గానరాదు. ఇట్టి ప్రయోగములు రాయలకే సమ్మతములు. పెద్దన గారికి గావు. ఈ యసాధుశబ్దప్రయోగములను రాజాస్థానములో బరిహసింతురను భయము రాజాదరణము గోరు కవులకుండును గాని యా కవులను పోషించు రాజున కవసరములేదు. కావున రాయలే ఆముక్తమాల్యద కర్త'' అని (ఆంధ్ర సాహిత్యచరిత్ర,2018:389:391) అన్నారు. దీన్ని బట్టి ఆముక్తమాల్యద ప్రబంధాన్ని కృష్ణదేవరాయలే రచించారని కొన్ని ఉపపత్తులతో నిరూపించే ప్రయత్నం చేశారు. దీనికి గల ఆధారాల్ని ఈ గ్రంథంలోని సాహిత్యాంశాల్ని కొన్నింటిని వివేచించి నిజనిజాలను తెలుపుతూ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ విధంగా కృష్ణదేవరాలు ఆముక్తమాల్యద ప్రబంధాన్ని రచించాడని అర్థమవుతుంది.

### 6.17.4. అల్లసాని పెద్దన మను చరిత్ర పరిశోధన దృష్టి:

తెలుగు ప్రబంధ సాహిత్యంలో మనుచరిత్ర తొలి ప్రబంధంగా కీర్తించబడింది. ఈ మనుచరిత్ర రచనా కాలాన్ని 1519-20 అని చారిత్రక పరిశోధకులు చెప్పిన దాన్ని ఉటంకిస్తూ తన

భావాన్ని చెప్పారు. దీనికి మూలం మారన రాసిన మార్కండేయ పురాణం. ఇందులోని వరూధిని, ప్రవరాఖ్యుల ఘట్టాన్ని తీసుకుని పెద్దన మనుచరిత్ర అనే ప్రబంధాన్ని రచించాడు. అదే దీన్ని ఆధునిక కవి అయితే మను చరిత్ర కథలోని వరూధిని ప్రవరుల కథను తీసుకొని శృంగారాత్మక ఖండ కావ్యాన్ని రాసేవారు. భావకవి అయితే వరూధిని సౌందర్యాన్ని, ప్రవరుని శ్రౌతంగా వర్ణించేవారని పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు. మనుచరిత్ర శాంత, శృంగార రసాలకు సమ ప్రాధాన్యతనిస్తూ పెద్దన రచించాడు. మను చరిత్రలోని విమర్శనాంశాలను ప్రస్తావిస్తూ పింగళి లక్ష్మీకాంతం గారు కొన్నింటిని ఉదాహరించారు.

1. సిద్ధుడు ప్రవరునికి నౌషధ దానము చేసిన కాలము నిర్దిష్టముగా లేదు. అందుచే నుత్తరకథాకాలముతో బొత్తు కుదరలేదు. 2. ప్రబంధోచిత వ స్త్వైక్యము లేదు. వరూధినీ ప్రవర ఘట్టము వస్త్వైక్యభంజకము. 3. కావ్యమున రసాభాసమున్నది. 4. మనోరమ తన చెలికత్తెలను రక్షింపకముందే స్వరోచిని వివాహమాడుట యామె స్వార్థపరత్వ సూచకము. 5. కవికి నైతికనిష్ఠ లేదు. అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:374) అన్నారు.

**6.17.4.1. మను చరిత్ర– వస్త్వైక్యము పింగళి :**

*"వస్తైవక్యము లేదనుటకంటె నితివృత్త మతి విస్తృత మయ్యెననుట యుక్తము. గ్రంథనామము స్వారోచిష మనుసంభవము. ఈ పేరుగల ప్రబంధకథా నిర్వహణమునకు నేయే కారణకలాపములు, పూర్వాపూర్వ కథాంశములు గలవో వాని నన్నిటిని సూత్రించి కవి యాకథ కైక్యమును సమకూర్చెను. కానియప్రస్తుత మనిపించదు. వలననే వస్వైక్యము పాటింపబడినది యెంచవలెను. ఈ యేకసూత్రము వలనే వస్తైక్యము పాటింపబడినది యెంచవలను"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018 పుట:375) అన్నారు.

**6.17.4.2. మను చరిత్ర రస పోషణ:**

కావ్యం ఆనందభరితంగా, రసభరితంగా ఉండాలనీ భారతీయాలంకారికులు అభిప్రాయం. దీని ఆధారంగా పింగళి లక్ష్మీకాంతంగారు మను చరిత్రలో ఏ రసం ఉందనే విషయం గురించి ఇలా అన్నారు. *"రసపరిపోషణయే యానందమునకు హేతువు. కవి రసపోషణము చేయునేగాని కథలోలేని సిద్ధిని తెచ్చి పెట్టలేడు. కథానుసారిగా రసమును పోషించుట కళా ధర్మముగాని రసానుగుణముగా గథను కృత్రిమము చేయుట గాదు. కవి జాలను. వరూధినీపరమైన శృంగారకథ ప్రాసంగికము. తదాశ్రయమైన శృంగారమంగ రసము. కృత్రిమము చేయుట గాదు. ఏ కావ్యమునన్నైనను నంగిరసము సిద్ధిపొందినం జాలును. అంగరసము సిద్ధిపొందవలెనను నియమము లేదు. పరిపోషణ జరిగిన కావ్య ప్రధానరసము శాంతము. అది ప్రాసంగిక ప్రధాన ఘట్టములలో సిద్ధి పొందినది"* (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:375) అన్నారు.

దీన్ని బట్టి మనుచరిత్ర ప్రబంధంలో శాంతరసం ప్రధాన పాత్రను పోషిస్తుందనీ పింగళి లక్ష్మీకాంతం నిర్ణయించారు. మను చరిత్రలో వివిధ సందర్భాలలో శాంత రసమే కొనసాగుతుంది. కథా నిర్వహణలో శాంత రసం ప్రవరునితో ప్రారంభమై స్వారోచిష మనువుతో ముగుస్తుంది. ఈ కథలో కవి శాంత, శృంగార రసాలకు బద్ధ వైరాన్ని సృష్టించి చివరకు శాంత రసమే జయించేలా కవి అద్భుతమైన మలపును కవి పెద్దన కొనసాగించారు పింగళి వారు పేర్కొన్నారు. దీన్ని బట్టి మను చరిత్రలో శాంతి శృంగార రసాలు సమానంగా పయనించిన తుదకు శాంత రసాన్ని పోషించిందని తెలుస్తోంది. ఈ రస పోషణను స్వరోచి కథలో పాఠకుడు శాంత రస ప్రాధాన్యాన్ని వదలకుండానే స్త్రీ ఆసక్తిడగు అతని శృంగారం ఒక ఉపదేశంగా కనిపించి దీన్ని పశుపక్ష్యాదులతో  చెప్పించి శాంత రస పోషణ జరిగింది.

### 6.17.4.3. వరూధిని, ప్రవరాఖ్యుల పాత్రల గుణాల వైశిష్ట్యం:

మనుచరిత్రలోని గుణాలను గుర్తించడానికి పాత్రలు పోషించిన విధానాలను, నాటకీయతను, శైలిలోని విశేషాలను  పింగళి లక్ష్మీకాంతంగారు తెలియజేశారు. ఈ గుణాలు  వరూధిని ప్రవరుల పాత్రల కేంద్రంగా చేసుకొని 'పెద్దన వరూధిని, ప్రవరాఖ్యుల పాత్రల గురించి చెబుతూ *"ఆయన యారెండు పాత్రము లందు నేవంకకు మ్రొగ్గిన సమదృష్టితో జిత్రించెను. రెండిటిని సమానముగా నాదరించెను. విరోధములయ్యు నీ రెండు రసములను ప్రవాహములుగా వెల్లివిరియించెను. ఆ భాగ మందలి శాంతశృంగారరసములు రెండును సమానమగు నానందము నొసగును. కావ్య రసాస్వాదనమన నెఱుగనివాని మాటకేమి గాని కావ్యరసాస్వాదన రుచిగలవానికా రెండు పాత్రములును రుచికరములే"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:377) తెలిపారు. దీన్ని బట్టి మనుచరిత్ర గొప్పతనమంతా వరూధిని ప్రవరుల పాత్రల్లోనే ఉందని పింగళివారు వ్యాఖ్యానించారు. ఈ రెండు పాత్రలను సమభావదృష్టితో చూడడం వలన మిగిలిన ప్రబంధాలకంటే మను చరిత్ర ప్రత్యేకత కనపడుతుందని అందుకు కారణం వరూధిని, ప్రవరాఖ్యుల పాత్రల పోషణ, ఇందులోని రసం, నాటకీయతలే ముఖ్య భూమికను పోషిస్తాయని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు సోదాహరణంగా వివరించారు.

### 6.17.4.4. మను చరిత్ర నాటకీకరణ విధానం:

మను చరిత్రలోని రస వివేచనను, పాత్ర పోషణను  చూశాం. వీటితో పాటు ఇందులో నాటకీకరణ గురించి పింగళివారు చెబుతూ *"ఇది ప్రబంధమయ్యు నంత నాటకీయ మొనర్చుట ఆయన చాతుర్యము మఱియు గోచరించును. ఈ సంవాదము కేవలము నాటకీయమే గాక యతిప్రౌఢము, చతురము నయినది. అది పెద్దన గారి మనీషామహిమకు తార్కాణ. ఈ సంవాద మేకరసాశ్రయమైన నాసృష్టి కొంత తేలిక. కాని యిది విరోధ రససంఘర్షణ మగుట గష్టతరము. భిన్న ప్రవృత్తము లయిన రెండు పాత్రలు పరస్పరవిరోధరసముల నాశ్రయించిన వానితో గథ నడపుటయే*

*యిందలి విశేషము"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:377) తెలియజేశారు. దీన్ని బట్టి వరూధిని, ప్రవరుల పాత్రల నడుమ జరిగిన సంభాషణలు, మానసిక సంఘర్షణ, రససంఘర్షణ, వర్ణనలతోనే ఈ మను చరిత్ర ప్రబంధం గొప్ప నాటకంగా విరాజిల్లుతుందని విశ్లేషించారు.

**6.18. సాహిత్య ప్రక్రియలు–పరిశోధన:**

పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్ర సాహిత్య విమర్శ బోధించేటప్పుడు విద్యార్థులకు వివిధ ప్రక్రియల పట్ల స్పష్టతను ఇచ్చే ప్రయత్నాలలో అనేక ప్రక్రియల గురించి ఆయన పరిశోధించి ఆ విషయాలను వివరించారు. కావ్యం, ద్విపద, ప్రబంధం, నిబద్ధ కావ్యం, అనిబద్ధ కావ్యం, పురాణం, ఇతిహాసం, పద్య గద్య కావ్యాలు, శతకాలు, దండకాలు మొదలైన వాటిని పరిచయం చేశారు. వాటిని విమర్శ పరిశోధన అనే రెండు అధ్యాయాలలోనూ అవసరమైన అంత మేరకు వివరించే ప్రయత్నం చేస్తున్నాను. ముఖ్యంగా భావ కవిత్వ శాఖలను, ఆంగ్ల నాటక ప్రభావంతో తెలుగులోకి వచ్చిన మోదాంత, విషాదాంత నాటకాలను పరిచయం చేయడంలో ఈయన చేసిన పరిశోధన కృషి తెలుస్తుంది. వీటితోపాటు వ్యాసం, నవల, కథానిక, నాటకం, జీవిత చరిత్ర, విమర్శ, ఆత్మకథ మొదలైన వాటిని సాహిత్య విషయాలతో సమన్వయిస్తూ పింగళి లక్ష్మీకాంతంగారు వాటిని తెలియజేశారు.

ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యంగారికి ఆంధ్ర సాహిత్య చరిత్రల్లోని *"సాహిత్య చరిత్రను కవుల చరిత్ర కంటే భిన్నమైన అస్తిత్వాన్ని కల్పించి అందులోని వికాస సూత్రానికి ప్రాథమికమైన ఆధారాలను పునాదులుగా అమర్చిన మొదటి గౌరవం పింగళి లక్ష్మీకాంతంగారికే దక్కుతుంది"* అని ('రసజ్ఞశిల్పి' ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక, 'సమన్వయ విమర్శకేతనం సాహిత్య శిల్ప సమీక్ష' అనే వ్యాసం,1994:117) తెలియజేశారు. దీన్ని బట్టి పింగళివారి సాహిత్యచరిత్ర కంటే ముందు వచ్చిన ఆంధ్ర కవుల చరిత్ర వంటివి కేవలం కవుల చరిత్రలే తప్ప సాహిత్య చరిత్ర కాదనే విషయం అవగతమౌతుంది. అంటే పింగళివారు కేవలం సాహిత్య చరిత్రను రచించారని తెలుస్తుంది.

**6.18.1. ద్విపద కవిత్వం నిర్వచనం:**

తెలుగు సాహిత్యంలో ఉన్నటువంటి ప్రక్రియలో ద్విపద కవిత్వం అతి ప్రాచీనమైనది. ఈ ద్విపద కవిత్వం గురించి ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఇచ్చిన నిర్వచనం ఈ విధంగా ఉంది. *మాత్రాచ్ఛందో బద్ధములగు ద్విపద కావ్యాలు, కవిత్వంతో పాటు గేయ భావాలను కలిగి "పార్యే గేయేచ మధురమై" మార్గ విధానాలకు చెందిన పద్య కావ్యం వలె గాక సామాన్య ప్రజలలో ప్రచారాన్ని పొందుతాయి. "ఏ వాఙ్మయమందైనను నీ పద కవిత్వమే పద్య కవిత్వముకంటె ముందు పుట్టి పెరుగును. కాని యిది ఎంత నిరాడంబరమును విసర్గ మధుర మును అయినను ప్రౌఢ వాఙ్మయమున స్థాన మాసింపక గాలిలోనే పుట్టి గాలి లోనే పెరుగును దీనికి సారస్వత ప్రతిష్ఠ సంపాదించి స్థిరత్వము నెలకొల్పుటకై పలువిధముల పాటుపడిన సంస్కర్తలే, ద్విపద కావ్యకర్తలు. పాడదగిన పద కవిత్వము*

*నెడ నొక కంటిని, పరసయోగ్యమైన పద్యకవిత్వము నెడ రెండవ కంటిని బెట్టి యుభయ గుణములను ఏకము చేసి ఆ మహాసువులు వచనము చేసిన రసాయనమే ద్విపద కవిత్వము"* అనీ (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:120) పరిశోధనాత్మక దృష్టితో ఉటంకించారు. దీన్ని బట్టి ద్విపద కవిత్వం మాత్రా గణాలతో నియమబద్ధంగా ఉంటూ అందులోని భావాలను పాడడానికి అనుకూలంగా ఉంటుంది. దీనితో పాటు సామాన్య ప్రజల నోటిలో సులభంగా వెలుగుతుంది. నిజానికి ఇది పద కవిత్వం కన్న ముందే పుట్టిందని తెలిపారు. దీనికి లిఖితరూపం లేకపోవడం వలన మౌఖికంగా గాలిలోనే అంతమౌతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనికి సాహిత్య గౌరవాన్ని కల్పించడానికే ద్విపద కవులందరు కృషి చేశారని పరిశోధనాత్మకంగా వివరించారు.

**6.18.2. పద కవిత నిర్వచనం:**

"శుద్ధ దేశి కవిత్వమున 'ఇతివృత్తము, భాష, ఛందస్సు అనెడి మూడును దేశీయములేయై యుండవలెను. దానికి గీతి ఆయువుపట్టు. అట్టి లక్షణములు గల వాఙ్మయమే పద కవిత్వము" అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:129) పద కవిత్వాన్ని నిర్వచించారు.

ఏ భాషాయందైనను కవిత పరిణామమున గేయమే ప్రథమ దశ. అట్టి గేయ రూపమైన కవిత ఆడుచు, పాడుచు ఆనందింపదగిన 'ఆట-పాట' (Ballad-dance)గ ఆరంభమైయుండును. ప్రారంభ దశయందు 'ఆట-పాట' రూపమగు గేయకవిత వ్యక్తి నాశ్రయించియో 'బృందము నాశ్ర యించియో వెలసియుండును. కాలక్రమమున పలువురి కాలక్షేపమునకో, ఆనందమునకో కథాగేయములును, నాగరికతా భివృద్ధితోపాటు పద్య, గద్యాది రచనలును, పరిణమించియుండును. నేటి ప్రపంచమున అనాగరికులనబడునే ఆటవిక జాతికైనను వాగ్రూపమగు భాష ఉన్నది. అట్టి వారి భాషలో లిపి లేకపోయినను వారికానందోత్సాహములను కలుగజేయు గేయ రచనలు కలవు. నాగరికతాభివృద్ధితో లిపిని పొందిన భాషలలో పద్య గద్యాది వివిధ రచనా ప్రక్రియలు క్రమముగా పరిణమించయున్నవి. ప్రాథమిక గేయమునందే కవిత్వ బీజములుండును. కావున ఏ భాషా సాహిత్య మందయినను మొట్టమొదట గేయమును, ఆ పిదప పద్యరచనము, అటుపిమ్మట గద్యమును పరిణమించుట సహజమైయున్నది. ప్రాక్తన మానవునిలో పుట్టిన 'ఆట-పాట' రూపమగు గేయమున ప్రధానాంశములు మూడు: అభినయము, గీతి, శబ్దము. గీతి, అభినయాంశములకు ప్రాధాన్యమీయక శబ్దార్థమునకు ప్రాధాన్యమిచ్చిన రచన పద్యకవిత్వము. గీతికి అప్రత్యక్ష సంబంధము మాత్రమేకాక ప్రత్యక్షాధికారమే యొసగిన కవిత్వము పదకవిత్వము" అని ఆచార్య పింగళి లక్ష్మీ కాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రలో పదకవిత్వమును నిర్వచించారు.

పదకవిత్వాన్నీ తనదైనశైలిలో నిర్వహించడమేకాకుండా పదకవిత్వాన్నీ రెండు విధానాలుగా చెప్పవచ్చునని తెలిపారు. మొదటిది 'గేయశాఖ' రెండోది 'పదశాఖ' అని విభజన చేశారు. పదశాఖలో (1) శుద్ధ దేశిశాఖ, (2) దేశిశాఖ అని రెండు భేదములున్నట్లు ఆచార్య పింగళి

లక్ష్మీకాంతముగారు విభజించియున్నారు. రెండోది శుద్ధదేశిశాఖలోని పదములు సామాన్య ప్రజలలో, ప్రజల కొరకే పుట్టి, వారి ఆదరాభిమానములతో తరించిన తర్వాత తరముల వారిని తరింపజేయు ప్రజా కవిత్వమనదగినవి. తెలుగులోని బాలనాగమ్మకథ, లక్ష్మమ్మకథ, కామమ్మకధ, అంకమ్మకథ, చిన్నమ్మకధ, బొబ్బిలి కథ, ఆరె మరాటీల కథ, కాపు కథ, బంగారు తిమ్మరాజు కథ, కుమార రాముని కథ, దేశింగురాజు కథ ఇలాంటివి ఈ శాఖలోనివి. ఇవి ప్రౌఢ సాహిత్య రచనలుగా గణింపవీలులేనివని పదకవిత్వంలోని వివిధ అంశాల దశలను పింగళి లక్ష్మీకాంతంగారు పల్నాటి వీరచరిత్రలో తెలియజేశారు.

ద్విపద సాహిత్యానికి సేవ చేసిన సోమనాథుల, బుద్ధారెడ్డిల కవిత్వం గురించి చెప్తూ "ద్విపద కావ్యానికి పాల్కురికి ప్రతిభాశాలి చురుకైన, బుద్ధారెడ్డి ద్వితీయాచార్యుడు. ఈ సోమన బుద్ధారెడ్డి ఇరువురు ద్విపద కావ్యసృష్టిస్థితులకు కారకులు" అని చెప్తూ *"సోమనాథుడు పదకవిత్వమునకు సారస్వతగౌరవము సంపాదించిన ప్రథమాచార్యుడు"* అని పింగళి లక్ష్మీకాంతంగారు (ఆంధ్ర సాహిత్యచరిత్ర,2018:90) అన్నారు. ద్విపద కావ్యాల్లో పల్నాటి వీరచరిత్ర ముఖ్యమైందని పరిశోధకులంటున్నారు. తెలుగు సాహిత్యంలో ద్విపదకు పాదులు వేసినవాడు పాల్కురికి సోమన ఆ వారసత్వాన్ని తర్వాత కాలంలో బుద్ధారెడ్డి కొనసాగిస్తూ రంగనాథ రామాయణాన్ని, ప్రౌఢ కవి శ్రీనాథుడు జనులు చదువుకోవడానికి పల్నాటివీరచరిత్రను మంజరీద్విపదలో రచించాడు. *"ప్రజలగొంతుకలిపి తెలుగుజాతి పౌరుషాన్ని కీర్తించాడు. దేశి కవితా శబ్దాన్ని అన్నిటి సార్ధకం చేసిన కావ్యాల్లో పల్నాటి వీర చరిత్ర యే మొదటిది మేటి"* అని పింగళివారన్నారు.

**6.18.3. ప్రబంధ ప్రక్రియ:**

ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు పింగళివారి విమర్శదృక్పథాలను కొంతవరకు అంచనావేశారు. ప్రబంధ ప్రక్రియ పట్ల, ప్రక్రియల పట్ల పింగళివారికి ఉండే దృష్టిని తెలుపుతూ *"వికాస యుగానికి పింగళివారు బాటలు వేసిన వారిలో పింగళి లక్ష్మీకాంతంగారు ప్రథమంగా పేర్కొనదగినవారు. ప్రాచ్య పాశ్చాత్య విమర్శ సూత్ర సమన్వయం వారి విమర్శ లక్షణం. వారు సాగించిన సాహిత్య విమర్శ సప్రమాణమైన సమన్వయ ధోరణిని స్పష్టంగా వెలార్చింది. పింగళివారు మాట్లాడిన, వ్రాసిన అది సరసమైన సాహిత్యపు తీర్పులా ఉంటుందని తెలుగువారు మెచ్చుకునేవారు. తెలుగు కవుల వ్యక్తిత్వాలకు విలువకట్టింది, ప్రబంధ ప్రక్రియకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించిందీ, సాహిత్య చరిత్రలో యుగ విభాగాల నిర్ణయాన్ని వ్యవస్థీకరించిందీ, విమర్శ పద్ధతులను వివేచించిందీ ఆయనే"* అని (రసజ్ఞశిల్పి, ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక, 'సమన్వయ విమర్శకేతనం సాహిత్య శిల్ప సమీక్ష' అనే వ్యాసం,1994:118) పేర్కొన్నారు.

### 6.18.4. కావ్యము – కవిత్వము నిర్వచనం:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు 'నా రేడియో ప్రసంగాలు' అనే పుస్తకాన్ని రచించారు. దీనిలో 'కావ్యము – కవిత్వము' అనే వ్యాసం ఒకటి. ఇందులో కావ్యం, కవిత్వాలను తెలుపుతూ *"కవిత్వమనగా పద్య రచనయే అను దృఢాభిప్రాయములోక వ్యవహారమునసున్నది. కానీ ఆచ్ఛాదన మాత్రమైన ఛందస్సును కవిత్వమనుట పొసగదనియు, నిర్భర భావపూరితమైదుస్పహమైన ఆవేదన పొందినప్పుడు అప్రయత్నంగా లయాత్మకమై వెలువడినప్పుడే అది కవిత్వమనిపించుకొనును"* అని నిర్వచించారు. వాల్మీకి శోకపూరితమైన గుండె నుండి ఛందోబద్ధంగా వెలువడిన శ్లోకమే నిజమైన కవిత్వమైనదని తన అభిప్రాయాన్ని పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొన్నారు.

ఆయన సాహిత్య శిల్ప సమీక్షలో ఏది కావ్యం, ఏది కావ్యం కాదు అనే వాటి కొన్ని లక్షణాలను, పరిధులను వివరించి కావ్యం గురించి ఇలా చెబుతూ *"కావ్యమనగా గ్రంథమునందలి విషయము సర్వజనులకును ఆమోదజనకము కావలెననుట. రెండవది, అందలి శబ్ద రచన అలంకారికము సుందరముగానుండుట. మూడవది, ఆ గ్రంథము యొక్క పఠనము వలన గాని, శ్రవణము వలన గాని భావనాహ్లాదము కలుగుట. అనగా రసానందజనకమగుట. ఈ మూడు లక్షణములును సమగ్రముగానున్న గ్రంథము చిన్నదైనను, పెద్దదైనను కావ్యమనుపించుకొనును"* అని పింగళి లక్ష్మీకాంతం (సాహిత్య శిల్ప సమీక్ష,1966:3) అన్నారు. దీన్ని బట్టి కావ్యంలో శబ్దార్థాలు సమ్మిళితమై ఆనందాన్ని, ప్రయోజనాన్ని, భావానాత్మకంగా, రసానందంగా ఉండాలని తెలిపారు. పండితుల అభిప్రాయంలో కావ్యం ఏ విధంగా ఉండాలనే దాని గురించి మరోక నిర్వచనం చెప్పారు. *"రచన సుందరమైన, సార్వజనీన ప్రయోజనమును కలిగి భావనాత్మకమైన ఆహ్లాదమునిచ్చుచు, కర్తయొక్క ఆత్మీయతను స్ఫురింపజేయు గ్రంథము కావ్యము. ఆ కావ్యజాలమే సాహిత్యము ఆ సాహిత్య యొక కళా"* అని పింగళి లక్ష్మీకాంతం (సాహిత్య శిల్ప సమీక్ష,1966:3) పేర్కొన్నారు.

#### 6.18.4.1. వస్తు, శిల్పా కవిత్వము నిర్వచనం:

కావ్యాల్ని విభజన చేసినప్పుడు దానిలోని అంతర్గతంగా వస్తు, శిల్పలా కలయికతో కవిత్వం లేదా కావ్యం, రచనలుగా నిర్మాణం ఏర్పడుతుందనే కవిత్వ పుట్టుకను అనేక మంది పరిశోధకులు తెలియజేశారని కొందరి పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. వారిలో పింగళి లక్ష్మీకాంతంగారు ఈ వస్తు కవిత్వ తీరును సాహిత్య చెబుతూ "వస్తు కవిత్వానికి ఇతివృత్తం ముఖ్యమైంది. ప్రకృతిలో కనిపించే దృశ్యాన్ని చూసి కవి అనుభవించే ఆనందం భావకవి వ్యక్తం చేసి కథలో, పాత్రలో, ధర్మంలో దాన్ని వ్యక్తం చేసి కావ్య వస్తువుగా గ్రహిస్తాడు. ఆ వస్తువుగా నిలిచే కావ్యమే వస్తుకవిత్వం. అదే కవితా శిల్పం" అని పింగళి లక్ష్మీకాంతంగారు ( సాహిత్య శిల్ప సమీక్ష,1966:110) పేర్కొన్నారు.

వస్తు కవిత్వం పద్య,గద్యం, చంపూ, దృశ్య, శ్రవణ రూపాల్లో ఉండవచ్చు. శ్రవ్య కావ్యాలలో కవి కథను, పాత్రను తెర వెలుపల ఉండి పాఠకులకు, పాత్రలకు మధ్యలో తాను ఉండి

అవసరమైనప్పుడు పాత్రతో  మాట్లాడించి, లేదా తానే మాట్లాడతాడు. ఇలా పాత్రలు, కవి ద్వారా కథను నడుస్తుంది. ఇది వీధి అనే నాటకంలో సూత్రధారుడు చేసే విధంగా ఉంటుంది. దృశ్య కావ్యాలలో కవి మనకు కనిపించడు. దీనిలో ఈ సృష్టి కర్త భగవంతుడు సాక్షీభూతంగా ఉండి, జీవులను తానే నడిపిస్తూ జీవులు పొందే సుఖం దుఃఖాలను చూస్తూ పాత్రలను మన ఎదుట నిలబెడతాడని అభిప్రాయపడుతున్నారు.

**6.18.5. నిబద్ధ, అనిబద్ధ కావ్య ప్రక్రియలు నిర్వచనాలు:**

పింగళి వారి పరిశోధనలో సాహిత్య ప్రక్రియల తీరు తెన్నులు వాటి పరామర్శ విధానం లక్షణాలను, స్వభావాలను, విభాగాలుగా విభజించి సమన్వయం చేసే ప్రయత్నం చేశారు. తెలుగు సారస్వతంలో కావ్యాలు, వాటిని నిర్వచించారు. కావ్య భేదాలలో కనిపించే విభిన్న ప్రక్రియల్లోని విశేషాలను చూద్దాం. పద్య కావ్యాలలో నిబద్ధత,అనిబద్ధలుగా విభజించారు. భారతీయాలంకారికులు ఛందస్సును ప్రమాణంగా తీసుకుని దాని భావాలను బట్టి కావ్యాలను పద్య,గద్య, చంపూలుగా విభజన చేశారు. వాటిలో కొన్ని సాహిత్య ప్రక్రియలకు సంబంధించిన నిర్వచనాలను చూద్దాం.

**6.18.6. దృశ్య కావ్యం:**

*“ప్రదర్శన ప్రమాణమును పురస్కరించుకొని ప్రదర్శన యోగ్యములైన వాటిని దృశ్యములని”* (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98)అని నిర్వహించారు.

**6.18.7. శ్రవణ కావ్యం:**

కేవలం *“శ్రవణ యోగ్యములను శ్రావ్యములని”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) నిర్వహించారు.

**6.18.8. సంగీత కావ్యం:**

అప్పకవి మొదలైన లాక్షిణికులు చెప్పిన *“గీతిని పురస్కరించుకొని, సంగీత కావ్యమనియు, సాహిత్య కావ్యమనియు”* అని (సాహిత్యశిల్ప సమీక్ష,1966:98) విభాగం చేసి దాన్ని నిర్వహించారు.

**6.18.8.1. నిబద్ధ కావ్యము:**

1. *“సంధిసామాగ్రీయుతమైన, ప్రకృష్టమైన బంధము కలిగి విస్తృతోదాత్తమైన ఇతివృత్తము గల కావ్యమే నిబద్ధ కావ్యము”* అని నిర్వచించారు. దీన్నే సర్గబంధమనీ, మహా కావ్యమని సంస్కృత కవి దండి అన్నారని, దీన్ని తెలుగులో ప్రబంధంగా పిలుస్తున్నారని పింగళి వారు తెలియజేశారు.

2. *“ఒక కావ్యములో గల పద్యములన్నింటిని పూలదండవలె ఏకసూత్రమునకు నిబంధించెడి ఒక కథయు ఆ కథయు ఆ కథ నలంకరించెడి వర్ణనలును, దానిని నడిపెడి పాత్రలును మొదలైన సాధనములతో ఆద్యంతములకు అవిచ్ఛిన్న సంబంధము కలిగించెడి రచన ఇదియే నిబద్ధత కావ్యము”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) పింగళివారు నిర్వచించారు.

**6.18.8.2. అనిబద్ధ కావ్యాలు:**

పింగళి వారు నిబద్ధ కావ్యాలను తెలిపినట్లే అనిబద్ధ కావ్యాలలోని అనేక విభాగాలున్నాయని ప్రస్తావించారు. వాటిని కింది విధంగా తెలియజేస్తాను.

**6.18.9. ముక్తకం:**

*“స్వయం సమగ్రమై రమణీయమగు పద్యము ముక్తకము”* అని(సాహిత్య శిల్ప సమీక్ష,1966:98) అన్నారు. అయితే అమరకోశంలోని శ్లోకాలన్ని ముక్తకాలవుతాయని సూచించారు.

**6.18.10. కులకం:**

*“క్రియాపద సమాప్తికై పరస్పరాపేక్షగల ఐదు పద్యముల సముదాయము కులకమనబడును”* అని(సాహిత్య శిల్ప సమీక్ష,1966:98)‘కులక’ ప్రక్రియ గురించి చెప్పారు. ఇవే కాకుండా పంచరత్నాలు, నవరత్నాలు, నక్షత్రమాలికలు, ఖండ కావ్యాలు, శతకాలు ఇతివృత్తం లేని ఆధునిక ఖండ కావ్యాలు మొదలైన సాహిత్య ప్రక్రియలన్ని అనిబద్ధ కావ్యాలలో చేరుతాయని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన అభిప్రాయాల్ని వెల్లడించారు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు నిబద్ధ, అనిబద్ధ కావ్యాలలో ఉన్నటువంటి భేదాలను వివరించారు. “ఇతివృత్త ప్రాధాన్యము లేని అనిబద్ధ కావ్యములందు భావము యొక్క ఉల్బణత్వము, చాలనము, హెచ్చుగా నుండును. అందువల్ల వాటిలో ప్రతి పద్యరసోదయము కలుగుచుండును.*“నిబద్ధ కావ్యములో ప్రతి పద్యమును రసోత్పదమగుట సంభవింపదు”* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:99) లో పింగళివారు వెల్లడించారు. వీటితో పాటు పురాణ, ఇతిహాస ప్రక్రియలను తెలియజేశారు.

**6.18.11.పురాణ ప్రక్రియ పరామర్శ :**

పింగళివారు తన ‘ఆంధ్ర సాహిత్య చరిత్ర’ లో పురాణ ప్రక్రియ లక్షణాలను, స్వభావాలను, అందులోని విశేషాలను పరిశోధనాత్మకంగా తెలియజేశారు.

1. ఇక పురాణములో ప్రత్యేకము ఒక పురుషుని గురించిగాని ఒక వంశమును గురించిగాని కాక, సర్వమానవ లోకమునకు సర్వకాలములకు సంబంధించిన విజ్ఞానమును వర్ణించు గ్రంథములు.

2. పురాణమనెడి శబ్దమునకే పూర్వచరిత్ర యని పేరు. పురాణ గ్రంధములయొక్క రచన ఆధునికముగానే పొడగట్టుచున్నను చెప్పబడు విషయము మాత్రము విశ్వసృష్టి నుండి ప్రారంభమగును.

3.అందుచేతనే పురాణము సృష్టి, ప్రతిసృష్టి, వంశము, వంశాను చరితము, మన్వంతరములు అను పంచలక్షణములు కలది. అని నిర్వచింపబడినది.

4. అనగా కాలచక్రము ప్రవర్తితమైన నాటినుండియు కథా కాలము నాటికి ఎన్ని సృష్టులు జరిగెనో, ఎన్ని ప్రళయములు వచ్చెనో, ఆయా కాలముల యందు ఏయే రాజవంశములు తలయెత్తి, ప్రజాపాలనము చేసెనో, ఏయే మనువులు ఏయే కాలముల నుద్భవించిరో నిర్దేశించును.

5. అంతేకాక, వేదశాస్త్రములలో విహితమైయున్న విజ్ఞానమంతకును పురాణములలో స్థానము కల్పింపబడుటచే అవి చరిత్రలు అని గాని, కావ్యములనిగాని పేరు పొందక, జ్ఞాన విజ్ఞాన కోశములను పేర బరగుచుండును.

6. పురాణములలో కొన్ని వైష్ణవములని, కొన్ని శైవములని వివిధ దేవతా మహత్త్వముల నుగ్గడించునవి యైనను అన్నియు కలిసి పురాణ సంహిత యను పేర వేదసంహితవలె సర్వలోకసం సేవ్యములె యుండును'' అని పింగళి లక్ష్మీకాంతం (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018:194) తెలిపారు సాహిత్య శిల్ప సమీక్షలో పురాణ ప్రక్రియను విశ్లేషిస్తూ పరామర్శించారు. ఆ అభిప్రాయాలను కింది విధంగా తెలియజేశారు.

అలంకారశాస్త్రాలోని పురాణేతిహాసాలను కావ్యాలుగా కొందరు పరిగణింపబడలేదని పింగళివారు తెలిపారు. ఆ శాస్త్రం కావ్యసౌందర్య విమర్శ వలనే పుట్టడం, ఆ సౌందర్యానికి తొలి హేతువుగా కథ ఉండడం వలన ఆ కథ ఉత్తమ నాయకాశ్రయమైననేగాని సుందరం కాదు కనుక ఏక నాయకాశ్రయత్వం, వస్త్వైక్యం లేని గ్రంథాలను అలంకారికులు మహాకావ్యాలుగా పరిగణించారు. ఈ ప్రమాణాలనుబట్టి పురాణేతిహాసాలు కావ్యాలు కావని వారి తలంపు' అని అన్నారు. ఆంధ్ర మహా భారతాన్ని ఇతిహాసంగా, కావ్యంగా కొందరు పరిశోధకులు భావించారని పేర్కొన్నారు.

తెలుగులో పురాణ ఇతిహాసాలను సాహిత్యం నుంచి వేరు చేయడానికి వీలు లేదు. తెలుగు కవులు వీటిని కావ్య కళా దృష్టితో రసవంతంగా రచించారు. దీని గురించి చెబుతూ *''సంస్కృత ఆలంకారికులు పురాణే తిహాసములను కావ్యములు కావని త్రోసిపుచ్చలేక, వాటిని శాస్త్ర కావ్యములని సిద్ధాంతము చేసిరి''* అని పింగళి లక్ష్మీకాంతం (సాహిత్య శిల్ప సమీక్ష,1966:99) అన్నారు. భారత, భాగవత, రామాయణాలలో కేవలం రామాయణాన్నే కావ్యమని కొందరు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. దీనికి గల కారణాలను విశదీకరించారు. అవి

1. రామాయణంలోని ఇతివృత్తం ఏక నాయికాశ్రయములు.
2. ఈ గ్రంథము రాముడనెడి మహాపురుషుని మనోహర చరిత్రము.
3.ఈ రామ చరిత్రలో ఎన్ని గాథలు, ఎన్ని ధర్మ ప్రసంగములు వచ్చినను ఏక
4. నాయకాశ్రయ జన్యమైన వస్త్వైక్యమునకు భంగమురాదు.

భాగవతం ఒక పురాణంగా ఎలా చూడాలో, చూడవచ్చో అనే చర్చను పరామర్శించారు రామాయణ, భారత, భాగవతాలను పురాణాలని, ఇతిహాసాలని, మహాకావ్యాలని, కావ్యాలని భారతీయాలంకారికులు, పరిశోధకులు భావిస్తున్నారు. పింగళివారు కూడా ఈ భాగవతం గురించి

చెబుతూ *''భాగవతమున ఏక నాయకుడు లేడని, యుగాంత వ్యాప్తమైన అనేక కథలతో, సృష్టి స్థితి లయములకు సంబంధించిన ధర్మతత్త్వములను నిరూపించునుబహు విస్తృతమైన ఆ యితివృత్తము ఒక కాలమునకు ఒక లోకమునకు మాత్రమే సంబంధించినది గాక, త్రికాలములకు, త్రిలోకములకు సంబంధించినది. ఇట్టి లోకాంతర యుగాంతర వ్యాప్తిగల విషయమునకు మానవమాత్రుడెవ్వడును నాయకుడు కాజాలడు. పురాణములు సాధారణముగా భగవల్లీలా మయములే అగుటచే వాటికిని నాయకుండుండ వలెనని చెప్పవలసివచ్చినచో భగవంతుడే నాయకుడు. అంతమాత్రమున అందు వస్త్వైక్యముండుననుకొనుట పొసగదు. పురాణములలో ఉండెడి కథలన్నియు జీవిత ధర్మములకో, మతసిద్ధాంతములకో, సృష్టిరహస్యములకో ఉదాహరణముగా నుండును. ఆ కథలలో మానవులేగాక దేవతలు, రాక్షసులును పాత్రలుగా ఉందురు. ఆ పాత్రలన్నియు భగవంతుని ఆగ్రహమునకో, అనుగ్రహమునకో పాత్రములైన జీవులు. ఆ జీవులద్వారా భగవల్లీలావర్ణనము జరుగుచుండును. ఆ కథయొక్క ప్రయోజనమంతియే. ఆ కథలలో కొన్ని భూలోక రాజులకు సంబంధించినవి వున్నను అవి యథార్థముగా 'చారిత్రకములు' అని అనిపించుకొనదగినవి కావు''* అని అని పింగళి లక్ష్మీకాంతం (సాహిత్యశిల్పసమీక్ష,1966:100) పేర్కొన్నారు. దీన్ని బట్టి రామాయణంలో కేవలం రాముని పాత్రను బట్టి ఏక నాయకుడు కావడం వలన దీన్ని కావ్యమని పరిశోధకులు పిలిచేవారని తెలియజేశారు.

**6.18.12. ఇతిహాస ప్రక్రియ పరామర్శ :**

పింగళివారు పురాణ ప్రక్రియ గురించి తెలిపినట్లే ఇతిహస ప్రక్రియ గురించి కూడా వివరించారు. ఇతిహాస ప్రక్రియ అంటే చెబుతూ ''చారిత్రకము అనిపించుకొనదగిన ఇతివృత్తము కలది ఇతిహాసము'' అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:100) నిర్వచించారు. మరలా ఇతిహాసంలో ఏ విషయాలుంటాయనే చర్చించారు. దీనిలో ఉండే ముఖ్యాంశాలను తెలుపుతూ *''ఒక రాజునకుగాని, ఒక రాజవంశమునకుగాని, ఒక జాతికిగాని, ఒక దేశమునకుగాని సంబంధించిన ఇతివృత్తము యథార్థముగా చారిత్రకము. కొన్ని యితిహాసములు ఏక నాయకాశ్రయములై ఉండవచ్చును. అట్టి దానికి 'పరిక్రియ''* అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహిత్య శిల్ప సమీక్ష,1966:100) పేరును సూచించారు. పరిక్రియ ఏక నాయకాశ్రయమైనను దానియందు అతని జీవితచరిత్రకు సంబంధించని దేశచరిత్ర విస్తరించి యుండుటచేత, అది కావ్యము కాజాలదు. బహునాయకాశ్రయమైన ఇతివృత్తమునకు 'పురావృత్తమ'ని పేరు. ఇతిహాసమునందును పౌరాణికములని పించుకొనదగిన సందర్భములు పెక్కులున్నను, అవి చరిత్రాంశకు ఉదాహరణములుగా, పోషకములుగా చెప్పబడుటచే, అందలి ప్రధాన చరిత్రకు భంగము వాటిల్లదు అని అభిప్రాయపడ్డారు.

దీన్ని బట్టి ఇతిహాసాలలో దేశచరిత్ర, ఇతివృత్తం పౌరాణికంగా, అనేకమందినాయకులు ఉండాలని తెలిపారు. ఈ వివరాలనుబట్టి పురాణేతిహాస కావ్యాలలో దివ్య, చారిత్రక, సాంసారితక

అనే మూడు అంశాలు ప్రధానంగా కనిపిస్తాయని చెప్పారు. కాబట్టి ఈ మూడు జాతుల గ్రంథాలలో అన్యోన్యగుణమైన సంబంధాలు ఉండవని, ఇతిహాసంగా, కొంతవరకు కావ్యంగా భావించే రామాయణంలో దివ్య, చారిత్రకాంశాలు లేకపోలేదని అన్నారు. చారిత్రకమైన భారతేతిహాసాలలో దివ్య, సాంసారికాంశాలు లేకపోలేదని అందుకని వీటి విభజనలో ప్రాధాన్యాన్ని బట్టి చేసినదేగాని మరేవిధంగా కాదని పింగళివారు తెలియజేశారు.

**6.19. భావకవిత్వం– ప్రక్రియా వివేచన:**

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక తెలుగు సాహిత్యంలోకి అనేక ప్రక్రియలు దిగుమతి అయ్యాయి. ఆధునిక యుగము *“ఈరీతిని నవ్యసాహిత్యము శాఖోపశాఖలై పలువిధముల నలుదెసల విస్తరిల్లుచుండగా, ఆ పేరు ఉచ్చరించినంతనే కొందరకు భావకవిత్వమనియే మనస్సున స్ఫురించుటకు నేమి హేతువో నాకర్థముకాలేదు. ఈ విషయమై లేని పోని వివాదము లిదివరకే చాలా పెరిగినవి. వివాదముల దారిని వివాదములు పోవుచుండగా భావకవిత్వము దారిని భావకవిత్వము పుట్టుచునే యున్నది. సాధువో, అసాధువో ఈ శబ్దము రూఢమును అయినది. దీనిలో ఏ గుణవిశేషములు లేకున్న ఇంతమంది వ్రాయుటయు, నామోదించుటయు జరుగనే జరుగదు కదా! ఆంధ్రసాహిత్య పరిషత్తువంటి మహా సంస్థలు ప్రాచీన సాహిత్య రక్షణార్థమై పాటుపడుచున్నట్లే, నవ్యసాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు ఈ నవీన కవిత్వ రక్షణార్థము పాటుపడుచున్నవి. ఏ పేరున పిల్చిన నేమి? ఇంత నిరూఢమైన వస్తువునకు ఈ యుగములో అరస్థానమీయక తప్పదు. ఈ జాతి కవిత్వమంతయు గుణవంతమేయని నేను అనను. తిరస్కారార్హమైనది కలదు: పురస్కారార్హమైనదియు కొంత కలదు. ఈ భేదము అన్ని యుగముల సాహిత్యమునందును ఉండును. ఆయా కాలములలో తేజోహీనములైన రచనలు అర్థాయుష్యములై అస్తమించిపోగా, ప్రాణవంతములైన నిలిచినవే ప్రాచీన కవిత్వమను పేర మనకు పఠనీయములై నెగడుచున్నవి. ఈ కవిత్వములోను జీవము కలవి మాత్రమే నిలిచి, బావికాలమువారికి ప్రాచీన కవిత్వముగా పూజార్హమగుటకు సందియములేదు. ఇక దీనిని గూర్చి ఎంత తక్కువ చెప్పిన అంత మేలు”* అని ( గౌతమ వ్యాసములు,1952:37) తెలియజేశారు.

దీన్ని బట్టి ఆధునిక యుగంలో భావకవిత్వం ఏ విధంగా పరిణామం చెందిందో పింగళి లక్ష్మీకాంతం గారు తెలియజేశారు. కాల ప్రభావంతోను, పాశ్చాత్య ప్రభావంతోను మన జాతికి కలిగిన జాతీయత అనే భావన, భావుకతను ఆంధ్ర భాషా, సాహిత్యాల్లో విస్తృతంగా వ్యాప్తించింది. ఇందులో ఆర్థిక, రాజకీయ, సాంఘిక, చరిత్ర, విజ్ఞాన శాస్త్రాలతో పాటు ఇతర రచనలు వ్యాసాలుగా, గ్రంథాలుగా జనించాయి. కనుక కవుల కృషి వలన తెలుగు భాషా, కవిత్వాలకు సేవ జరిగిందని పింగళి వారు తెలిపారు.

*“ ఆంగ్లమున “Lyric” అనగా “Lyre” అనెడి జంత్రవాద్యముతో కలిపి పాడు “అనువైన గీతము” అని అర్థము. దీనికి ఈ యర్థము తొలగిపోయి చిరకాలమైనది. ఇప్పుడు ఈ పదమును గీత*

*ప్రధానమైనట్టియు, ఆత్మభావ వ్యక్తరూపమైనట్టియు కవిత్వము అనెడి అర్థమున వాడుచున్నారు. అవయవార్థమునుబట్టి సార్థకములు కాదగిన భావగీతులు తెలుగులో పెక్కుకలవు. వాటిలో త్యాగయ్యగారి కృతులు మకుటాయ మానములు. హృదయమునుండి ఉప్పొంగిన ఆయన రామభక్తిభావము గీతముగా అనువ్యాహృతమై ఆయనచేతనే తంబురా శ్రుతితో గానము చేయబడెను. కనుక అదియే స్వచ్ఛమైన భావగీతము. వాగ్గేయకారులు వ్రాసి పాడుకొను కీర్తనలన్నియు ఈ కోవకు చెందినవే"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:107) పేర్కొన్నారు. కవి తనకు కలిగిన భావాలనే వ్యక్తీకరిస్తాడు. ఆ భావాలు ఉదాత్తంగా, సుందరంగా, ఆనందంగా లోక కళ్యాణాన్ని ఉపయోగించాలి. తన భావాల్నే ప్రమాణంగా కవిత్వంలో మనసు నుంచి పుట్టాలని పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొన్నారు. ఈ భావ కవిత్వంలో ప్రణయ కవిత్వం, రాజభక్తి కవిత్వం, ప్రకృతి కవిత్వమనే భేదాలను తెలిపారు.

**6.19.1. ఆత్మాశ్రయ కవిత్వం పరామర్శ:**

పింగళివారు భావ కవిత్వ ప్రక్రియను తెలిపినట్లే ఆత్మాశ్రయ కవిత్వ ప్రక్రియకు సంబంధించిన అనేక నిర్వచనాలు పలు కోణాల్లో విశదీకరించారు. వాటిని చూద్దాం. ఆయన కావ్యాన్ని తెలుపుతూ *"కవి యొక్క ఆత్మీయతా ప్రతిఫలనము గల గ్రంథమే కావ్య మనియు"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:101) కావ్య అంటే ఏమిటి నిర్వచించారు. ఈ కావ్యంలో మరలా ఆత్మాయతా ప్రాధాన్యతను బట్టియే కావ్య వాఙ్మయంలో ఆత్మాశ్రయ కవిత్వం అనే ప్రక్రియ ఏర్పడడానికి కారణం అవుతుంది. ఈ మానవ ప్రపంచం అంతర, బహిర అనే రెండు విధాలుగా ఉంటుంది. మనం చూసే అంశాలన్ని బహిర జగత్తులో ఉంటూనే కవి ఈ బహిర జగత్తు నుంచే తన కావ్య రచనకు కవితా వస్తువును తీసుకుంటాడని పింగళివారు తెలియజేశారు. దీన్ని బట్టి ఆయన కవిత్వంలోని వస్తువు గురించి చెబుతూ *"ఒక రమణీయమైన పదార్థమైనను కావచ్చును. లేదా లోకమున జరిగిన ఒక వృత్తాంతమైనను కావచ్చును. ఆ వృత్తాంతమైనను కవి దర్శనమునకు రమణీయముగా తోచినపుడే అతడు దానిని చేపట్టును. అతని హృదయమును ఆకర్షించిన ఆ వృత్తాంతమును కావ్య వస్తువుగా గుర్తిస్తూ బాహ్య జగత్తు సమర్పించిన కావ్య వస్తువు"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:101) లో పేర్కొన్నారు. ఈ విధంగా లభించిన కవితా వస్తువును తీసుకుని రమణీయమైన కవిత్వాన్ని రచించడంలో రెండు విధానాలను అనుసరిస్తాడని తెలిపారు. వాటిలో మొదటిది పరాశ్రయ కవిత్వం కాగా రెండోది ఆత్మాశ్రయ కవిత్వమని విభజించారు.

**6.19.2ఆత్మాశ్రయ కవిత్వ ప్రక్రియ నిర్వచనాలు:**

1. "కవియైనవాడు తన మానసిక క్షేత్రమున ఉద్భవించినట్టి సుఖదుఃఖాత్మకములగు భావములను కావ్యరూపమున వ్యక్తము చేసినప్పుడు ఆ భావములు అతని ఆత్మీయములు గనుక అది

‘ఆత్మాశ్రయ కవిత్వము’ (Poetry of experience) అనిపించుకొనును’’ అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:101) లో నిర్వచించారు.

2. ‘‘కవియే కన్నువిప్పి, బాహ్య జగత్తును చూచుటలో ఒక సుందర పదార్థము కంటబడినపుడు దాని సౌందర్యమునకు ముగ్ధుడై దాని వలన తన మనస్సులో పుట్టిన భావములను వ్యక్తము చేసినపుడు అది ఆత్మాశ్రయ కవిత్వమే అగును’’ అని తెలియజేశారు.

3. ‘‘పదార్థము బాహ్య జగత్తులోనిదే యైనను, దాని దర్శనము వలన అతనికి కలిగిన మానసిక విక్రియను వ్యక్తముచేయుచున్నాడు గనుకను, ఆ విక్రియ ఆత్మీయమే గనుకను అది ఆత్మాశ్రయ కవిత్వమే’’ అని పింగళి వారు అభిప్రాయపడ్డారు.

4. ‘‘కన్నుమూసికొని హృదయ గత సుఖ దుఃఖ భావములను వ్యక్తము చేసినను, కన్ను తెరిచి బాహ్య ప్రకృతి గత సుందర పదార్థమును వర్ణించినను రెండును ఆత్మాశ్రయ కవిత్వమే’’ అని చెప్పవచ్చుననీ పింగళి వారు పేర్కొన్నారు.

5. ‘‘కవి తన భావములను ఏదోనొక పాత్రకు ఆపాదించి, దాని ముఖమున వాటిని వ్యక్తము చేసినపుడు అదియు ఆత్మాశ్రయ కవిత్వమే అగును’’ అని తెలిపారు.

6. ‘‘ఒకని హృదయ గత భావములను తనవిగా అనుభవము చేసికొని, ఆ వ్యక్తియే తానుగా భావించుకొని, భావవ్యక్తీకరణము చేయునప్పుడు అదియు ఆత్మాశ్రయ కవిత్వముగానే (Poetry of imagination) అంగీకరింపబడును’’ అని నిర్వచించారు.

### 6.19.3. గేయ కవిత్వ నిర్వచనం:

ఆధునిక కవితోద్యమాలు భావకవిత్వం ప్రసిద్ధమైందని కొంతమంది పరిశోధకుల తెలుపుతున్నారు. ఆత్మాశ్రయ కవిత్వంలో గేయ కవిత్వం అంతర్భాగంగా మిళితమై ఉంటుందని కొందరు పరిశోధకులంటున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారు ఇతర సాహిత్య ప్రక్రియల్ని నిర్వచించినట్లు గేయ ప్రక్రియను నిర్వచించారు. ఈ గేయ కవిత్వ ప్రక్రియ గురించి అనేకమంది పరిశోధకుల తమ అభిప్రాయాల్ని వ్యక్తీకరించారు. గేయంలో ఉండే రకాలను తెలుపుతూ *‘‘గీతం వలనే తన సర్వ అధికారమైన కృతులు, కీర్తనలు, పదములు అనెడి విశేషములతో గేయ కవిత్వమనెడి పేరు దాల్చినది’’* అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహిత్య శిల్ప సమీక్ష,1966:105) లో గేయ ప్రక్రియ విశిష్టతల్ని తెలిపి నిర్వచించారు.

భావకవిత్వంలో ఒక అంతర్భాగంగా ఆత్మాశ్రయ, పరాశ్రయ శాఖ ఉంటాయి. దీనిలో ఆత్మ భావాలతో కూడిన భావుకత శక్తి బలంగా వెల్లడవుతుంది. భావ కవులు దీన్ని కూడా ఆదరించి రచనలు చేశారు. ఆ కవిత్వంలో మరలా రెండు విధాలును ఉంటాయని తెలుపుతూ వాటిని విభజించి నిర్వహించారు. వాటిని చూద్దాం.

**6.19.4.అన్యాశ్రయ కవిత్వ నిర్వచనాలు:**

1. " అన్యాశ్రయ కవిత్వమనగా కవి బాహ్య జగత్తులో జరిగిన ఒక వృత్తాంతమును ఇతివృత్తముగా గ్రహించి రచించిన కవిత్వము అని అర్థము" అని పింగళివారు (సాహిత్యశిల్పసమీక్ష,1967:102) తెలియజేశారు.

2. "కవికి పరులైన మానవుల నాశ్రయించి విస్తరించిన ఇతివృత్తము కలదియగుటయే ఆ రచన పరాశ్రయ కవిత్వము" అని పింగళివారు (సాహిత్య శిల్ప సమీక్ష,1967:102) లో నిర్వచించారు.

3. " ఒకప్పుడు కవి తన జీవిత వృత్తాంతమునే కావ్య వస్తువుగా గ్రహించినను, అది పరాశ్రయ రచనయే అగును" అని అన్నారు. అయితే ఇది ఆత్మాశ్రయకవిత్వం కన్న కొంత భిన్నమైనదని పింగళి వారు పేర్కొన్నారు. ఆత్మశ్రయ, పరాశ్రయ కవిత్వాలకు రామాయణంలోని కొన్ని ఘట్టాలను తీసుకుని సోదాహరణంగా వివరించే ప్రయత్నం చేశారు.

**6.20. కథానిక ప్రక్రియ పరిశోధన దృక్పథం:**

ఆధునిక వచనసాహిత్యలో కథానిక ఒక ప్రక్రియని, కల్పనా సాహిత్య వచన ప్రక్రియని పలువురు పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని ఆంగ్లంలో 'Short story' అని పిలుస్తున్నారు. తెలుగు నవల, కథానిక ప్రక్రియలు ఆఖ్యాన వచన సాహిత్య విభాగానికి చెందుతాయని ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు వెల్లడించారు.

★ నవల, కథానిక ప్రక్రియలు ఆఖ్యాన వచనశాఖలో ఆవిర్భావించాయి.

★ కథానిక ప్రక్రియా ఆధునిక మానవ జీవితాన్ని చిత్రించడానికి బహు కార్యంగా ఉంటుంది.

★ కథానిక ప్రక్రియా పాఠకుల సంఖ్య ఉన్నట్లు మరి ఏ కావ్య జాతికి లేదు.

★ ఆధునిక జీవితములో శ్రమాపనోదనార్థమ, సాహిత్య జన్యమైన మానసిక సుఖమును అనుభవించుటకు విరామము కలిగించుకొని తెలికగా చదువుకొనదగిన కావ్య విశేషముగా ఒక్క కథానికయే లభించుచున్నది.

★ కథానిక పాఠకుల చదువుకోవడానికి వార్తా పత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు విరివిగా లభించి కథానికకు ఈడులేని ప్రాచుర్య ప్రభావమును తెచ్చెను.

★ ఆంగ్లాది భాషలలో నవలల కంటే గుణోత్తరములైన కథానికలు వ్రాసిన ప్రఖ్యాత రచయితలు ఎందరో కలరు. అట్టి వారి వలననే కథానిక వచన సారస్వత శిల్ప ఖండముగా పేరు పొందినది" అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహిత్య శిల్ప సమీక్ష,1967:178) లో కథానిక ప్రక్రియ నవల లాగే వచన శాఖకు సంబంధించినదని తెలుస్తోంది. ఈ కథానిక ప్రక్రియా గురించి అందులోని విశేషాలను వివరించారు.

### 6.20.1. కథానిక ప్రక్రియ నిర్వచనం:

కథానిక ప్రక్రియ పుట్టుక సంస్కృత సాహిత్యం జనించిందని పూర్వ పరిశోధకులు చెప్పారని వాటిని సమన్వయించే ప్రయత్నం చేశారు. అటువంటి వాటిలో ఒక సిద్ధాంతాన్ని పూర్వపక్షం చేస్తూ *''ఆఖ్యాన సాహిత్యంలో లక్ష్యములుగా నేడు మనకు రెండు మూడు కావ్య భేదములే జాతులు కానవచ్చుచున్నవి. గాని, అగ్ని పురాణమునందును, ధ్వన్యాలోకమునందును పేర్కొనబడిన ఆఖ్యాన జాతులు ఐదు కలవు. అవి ఆఖ్యాయిక, కథా, ఖండకథా, పరికథా, తథా కథానికేతి మన్యంతే గద్య కావ్యాంచ పంచధా''* అని దీనిలో కథా విస్తృతిని బట్టి ఆఖ్యాయికలన్నింటిలో పెద్దదని, కథానిక చిన్నదనియు తోస్తుందని పింగళి వారు తెలియజేశారు. దీనిలో కథానిక విస్తృతంగా ఉంటుందని దీన్ని కావ్యంగానే పరిగణించాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే కథానిక ప్రక్రియ లక్షణాలను కొందరు విమర్శకులు చెప్పిన అంశాలనే తీసుకుని వాటిని సమన్వయించే ప్రయత్నం చేశారు. 'భయానకం సుఖతరం గర్భేచ కరుణో రసః అద్భుతోన్తే సుక్లప్తార్థా, నోదాత్తాని కథానిక' అనే శ్లోకం ఆధారంగా కావ్యంలో రసాలు, ఇతివృత్తం, వస్తువు ఉంటాయని పింగళివారు వ్యక్తం చేశారు. అయితే ఆధునిక కథానిక గురించి విమర్శ ఎలా ఉంటుందో తెలియజేస్తూ ఈ విధంగా విమర్శించారు.

1. ఆధునిక కథానిక విమర్శలో ఈ రసం ఉండరాదని నవలకు గాని, కథానికకు గాని, ఉత్తమ లక్ష్యములే లక్షణములై విమర్శకులకు ప్రమాణభూతములగుచున్నవి.
2. ఆలంకారిక పారి భాషను తొలగించి పై లక్షణములను విమర్శ సంప్రదాయానుసారమైన వ్యాఖ్యనము చేసినచో నేటి కథానికలోని చాలా వరకు ఈ లక్షణములు లక్ష్యములు .
3. కథానికలో కథా ఉదాత్తముగా ఉండి రచన సంక్షిప్తముగా ఉండవలెను.
4. కథానికలో కథ అనేది నీచ పాత్రలు ఉండి ఉత్తమ పాత్రలుగా గాని, మధ్యమ పాత్రలు యుండవలెను.
5. కథానికలో మధ్యలో దుఃఖమును పుట్టింపవలెనెడి నియమము కథలన్నింటికిని వర్తింపదు.
6. కథానికలో పాత్రలకు కలిగే క్లిష్ట పరిస్థితుల వలన పాఠకుని చిత్తము సుఖముతోడ, సంభ్రమమునో కలిగించెడి సంఘటనను కల్పించుట సాధ్యం కాదు.
7. నాడు గాని, నేడు గాని కథానికకు సన్నివేశ చమత్కారమే ప్రాణము'' అని పింగళివారు (సాహిత్య శిల్ప సమీక్ష,1966:180) కథానిక ప్రక్రియా గురించి దానిలోని ముఖ్యాంశాలను లోతైన విశ్లేషణ చేసి తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

### 6.20.2. నవల, కథానిక పాత్రలు తులనాత్మక విమర్శ:

ఆధునిక తెలుగు నవల, కథానిక ప్రక్రియల్లో పాత్రలు, ఇతివృత్తం పోషించే ప్రత్యేకతలను, వాటి మధ్య ఉండే భేదాలను తెలియజేశారు. 1.నవలలో కథ నైపుణ్యమును బట్టి పాత్రస్వభావమును సంపూర్ణముగా సమున్మీలితము చేయవచ్చును. 2. కథానిక సంక్షిప్తతను బట్టి ఒక సంఘటనము మాత్రమే చూపబడును గాన దానికి సంబంధించిన స్వభావము మాత్రమే ఆపేక్షితమగును. 3. కొన్ని కథానికల్లో పాత్రలు నిమిత్తమాత్రములును, సంఘటనలు ప్రధానములనును అయియుండును. 4. కథానికలో బహు పాత్ర ప్రవేశమును భరింపలేదు'' అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:180) తెలిపారు.

### 6.21. నాటక ప్రక్రియ పరిశోధన విధానం:

పింగళివారు 'గౌతమ వ్యాసములు' అనే పుస్తకాన్ని రచించారు. దీనిలో రెండో వ్యాసమే 'అధ్యక్షోపన్యాసం'. ఇది నాటక ప్రక్రియకు సంబంధించిన వ్యాసమని చెప్పవచ్చు. దీనిలో తెలుగు నాటకం యొక్క వివిధ పరిణామాలను దాని విశిష్టతను చక్కగా వివరించే ప్రయత్నం చేశారు. నాటక ప్రక్రియ గురించి, ఆ రచనలోని ప్రత్యేకతను గురించి, నటుల గురించి, నాటి నాటక సాహిత్యానికి సేవలు వివిధ నాటక సంస్థలు గురించి ఎంతో లోతుగా పింగళివారు విశ్లేషించారు. నాటి నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు, నాటక సంస్థల పనితీరు, నాటకాలను ప్రజలు ఆదరించిన తీరు తెన్నులను సమన్వయం చేస్తూ తెలియజేశారు. నిజానికి నాటి నాటక కంపెనీలను గురించి లక్ష్మీకాంతంగారి దృక్పథం చూద్దాం.

1. పదిమందికి జీవనాధారము కల్పించుటయే యీ పెద్ద కంపెనీలు చేసిన మొదటి మేలు. ఈ మేలును బట్టి చాలకీడును వచ్చిన దందురా? అది నటుల లోపము గాని ఆ యజమానులు దొసగు కాదు. డబ్బుకు కక్కుర్తి, పడి ఎవరికి వారు సర్వతంత్ర స్వతంత్రులమని అనుకోవటం, నటులలో ద్వేషాసూయలు – ఇవి నాటకరంగ పతనానికి కారణాలని లక్ష్మీకాంతంగారు 1937 లోనే చెప్పగలిగారు. నాటి నాటక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఇవ్వడాన్ని 'ఉత్తమ నాటక రచన' పేరుతో బహుమతు లివ్వడాన్ని లక్ష్మీకాంతం గారు తిరస్కరిస్తూ ఆయన తీర్పు ఇచ్చారు.

2. నాట్యపరులను, సాహితీపరులను సంతోషపెట్టగల నాటకములు సార్వజనీనములు. అవి యుత్తమ నాటకములు. అట్టివానిని చూచుకొని నటులు ప్రదర్శనమునకు గైకొనమును. అట్లు గాక సాహితీ గుణమును లోపింపజేసి, ప్రయోగార్హత మాత్రమే యుండునట్లు వ్రాయుమని మనము నిర్దేశింప కవి శబ్ద వాచ్యుడెవ్వడును వ్రాయడు. నాటకేతివృత్తం ఏదైనా లక్ష్మీకాంతం గారికి ఆమోదమే. నాటక వస్తువులో తిరస్కారం, పురస్కారం అనేవి లేవని చెప్పారు.

3. నాటకంలో *''క్రొత్త కల్పనల వలన వాఙ్మయమునకు పుష్టి కలుగునే కాని నష్టం రాదు అనగలిగిన ముందు చూపు ఆయనది. నాటకాలలో పద్య రచన అవసరమని లక్ష్మి అభిప్రాయం.*

*వ్రాయవలసిన చోట పద్యం వ్రాయకపోవటం వల్ల రసానుగుణంగా పద్యం పాడటం తెలియకపోవడం వల్ల పద్యం ఆటంకమనే భావన పుడుతోందని చక్కగా వివరించారు. నాటకాలలో పద్యాలు తుడిచి వేయడం వాంఛనీయమైన సంస్కారం కాదని చెప్పారు. లోక ధర్మాన్ని బట్టి తలపించడమే కళాధర్మం కానీ లోకధర్మమే కళాధర్మం కాదు''* అని (గౌతమ వ్యాసములు,1953: 50) పింగళివారు తన అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు.

దీన్ని బట్టి ఆయనకు నాటక సాహిత్యం పట్ల ఒక లోతైన ప్రవేశం ఉందని తెలుస్తుంది. నిజానికి ఆయన విద్యార్థి దశలోనే నాటకాలను చూడడం, దాన్ని ఆదరించడం వలన ఆయనకు ఈ నాటక ప్రక్రియను ఎంతో ఆసక్తితో వివరించే ప్రయత్నం చేశారని అవగతమౌతుంది. ఆయన మరలా నాటక ప్రక్రియ గురించి సాహిత్య శిల్ప సమీక్ష అనే గ్రంథంలో కూడా ప్రస్తావించారు. వాటిని కూడా ఇక్కడే సమన్వయిస్తూ తెలియజేస్తాను.

### 6.21.1. నాటకంలో అంకం:

నాటకంలో అంకం అంటే ఒక భాగం. దీన్ని ఆంగ్లంలో ఎపిసోడ్ అనే పదాన్ని వాడతారు. లోకంలో జరిగిన వృత్తాంతంలో ఒక సంఘటనను అంకంలో సంబంధించి, కథ ఎంత దీర్ఘకాలమైన కావచ్చు. కానీ ఒక్కోక్క అంకంలో ఆ దీర్ఘకాలంలో ఒక్కోక్క రోజున జరిగిన దాన్ని మాత్రమే తీసుకోవాలని పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు శాకుంతలం కథ మూడు సంవత్సరాల పాటు జరిగింది. ఈ నాటకం ఏడు అంకాలుగా ఉందని విమర్శకులు అంటున్నారు. అయితే ఈ ఏడు అంకాల కథను ఏడు రోజుల పాటు తీసుకోవాలి. కథలో వెలితి ఉందని గాని ఏడు రోజుల కథ అని కవి మనస్సు భావించకుండా ఇతివృత్త సన్నివేశాల చాతుర్యాన్ని ప్రదర్శిస్తారు. దీన్ని పింగళివారు చెబుతూ *''శాకుంతలం నాటకంలో శకుంతలాదర్శనము మొదలుకొని పుత్రసంప్రాప్తి వరకు గల దుష్యంతుని చరిత్రలో ఆయువు పట్ల చెప్పదగిన దినములు ఏడింటిని గ్రహించి ఆ దినములలో జరిగిన చరిత్రను ఏకత్ర సంఘటించి మిగిలిన బహుదిన ప్రవృత్తమైన చరిత్రను కాళిదాసు మనచే విస్మరింపజేసెను''* అని (సాహిత్య శిల్ప సమీక్ష.1966:121) తెలిపారు.

దీన్ని బట్టి అంకంలో కేవలం కథను కేవలం ప్రదర్శనా యోగ్యమైన భాగాన్ని మాత్రమే గ్రహించాడని తెలుస్తుంది. అంకంలో కథ ఒకటి రెండు పాత్రలే కాకుండా అనేక పాత్రలు ప్రవేశంలో తగిన విస్తృతి ఉండే విధంగా ఉండాలి. అంకంలో కథ నాటక లక్షణాలతో ఉంటూ బీజానుగుణంగా బిందు వ్యాప్తిగా ఉండాలి కనుక కథకు ఆది, మధ్య, అంతము అనే దశలుండాలి. ఈ దశలు క్రమంగా బీజం, బిందువు కార్యాలనే ఈ నాటక పరిభాషలో చెప్పుకోదగినవి అని పింగళి వారు పేర్కొన్నారు. నాటక లక్షణాలలో బీజం అంటే ఏమిటి చెబుతూ *''కవి నాటక కథను ఏ ప్రయోజనం కోసమైతే ప్రారంభించునో ఆ ఫలమును ఇచ్చుటకు సమర్థమైన ఉపక్రమణమునకు బీజం''* అని (సాహిత్య శిల్ప సమీక్ష.1966:122) పేరు ఉందని చెప్పారు. *''శక్తివంతమైన ఆ ఉపక్రమము బట్టియే*

*కథా విస్తృతి వికాసములు ఘటిల్లును. ఆ నాటక వికాసమునకు బీజంనందలి శక్తి యొక్క వ్యాప్తియే కారణము. దీనినే ఈ లక్షణమున బిందువు"* అని (సాహిత్య శిల్ప సమీక్ష.1966:122) అంటారని పింగళివారు తెలియజేశారు.

అంకం బీజానికి అనుగుణంగా బిందువుగా పరివ్యాప్తి చెందాలంటే ఇతివృత్తం యొక్క ఈ క్రమ వికాసం జరగాలని ఆయన అన్నారు. దీన్ని బట్టి ప్రతి అంకంలో ఇతివృత్తం ప్రదానం. అంకంలో ప్రదర్శనీయమైన కథా మాత్రమే ఉండాలని, ప్రదర్శించలేనివి, ప్రదర్శించరానివి అనే వాటిని అయోగ్య, అసంభావ్య, అనావశ్యక అనే పదాలను సూచించారు. ఇవన్నీ అర్థోపక్షేపకాలలో అంతర్లీనంగా ఉంటాయని అన్నారు. మరలా అంకంలో దృశ్య కథ ఉండాలని అంకం ముగింపులో పాత్రలన్నీ నిష్క్రమించాలని పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు.

### 6.21.2. నాటకంలో పంచ సంధుల ఆవశ్యకత:

రచయిత నాటక నాటకాన్ని రచించడానికి తాను తీసుకున్న వస్తువు క్రమ వికాస పరిణామం పొందడానికి ఏ విధంగా సన్నివేశపరుస్తాడో, ఆ విధంగా ఊహించుకుని ఏర్పరచుకొన్న కథా ప్రణాళికల భాగాల్నే అర్థ ప్రకృతులు అంటారు. దీన్ని ఆంగ్లంలో Elements of plot అని పిలుస్తారు. ఈ అర్థ ప్రకృతులలో ఏ భాగంలో ఏ కార్యదశను నిర్బంధించుకొనాలని భావించి కవి దాని ప్రకారం కథను నిర్మిస్తాడు. ఈ విధానాన్నే కార్యావస్థలు అని అంటారు. దీన్ని ఆంగ్లంలో Stages in action అని అంటారు. కార్యం అంటే పాత్రల యొక్క వాక్యం ద్వారా నర్తన ద్వారా జరిగే కథా గమనాన్ని కార్యం అంటారు.

అర్థ ప్రకృతులు అనే పేరు జరిగే ఆ ప్రణాళిక భాగాలతో కార్యావస్థల అనే కథా భాగాలు పరస్పర విరోధం లేకుండా సమన్వయం అయ్యే సందర్భాలనే సంధి అని అంటారు. ఇక్కడ మరో విధంగా కాకుండా సంధి అంటే పదాలకు అనుకూలం, అవరోధం, సమన్వయం అని అర్థాన్ని కలిగిస్తుంది. నాటకంలో అర్థ ప్రకృతులతో కార్యావస్థలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలో ఒక చక్కటి ఉదాహరణతో పోల్చుతూ *"కర్షకుడు తన పొలమునకు నీరు పెట్టుటకై ముందుగా ఏర్పరచుకొనియున్న మడులు, బోదెలు మొదలగు వాటి వెంటనే కాలువలోని నీటిని పారించుట వంటిదే అర్థ ప్రకృతుల వెంట నాటక కార్యమును నడుపుట'*అని(సాహిత్య శిల్ప సమీక్ష,1966:126) పింగళి లక్ష్మీకాంతంగారు పేర్కొన్నారు.

### 6.21.3. నాటకంలో అర్థోపక్షేపకములు ఆవశ్యకత:

నాటక నిర్మాణానికి ఈ అర్థోపక్షేపకాలు అంతర్గతంగా ఉంటాయి. వీటిని నాటక రచయిత స్వీకరించిన ఇతివృత్తం ప్రదర్శన యోగ్యమైన భాగాన్ని అందుకుగాను, ప్రదర్శనీయం కాని దాన్ని అర్థోపక్షేపకములో చూపిస్తాడు. అంకనిహితమైన భాగాన్ని కథా గమనాన్ని ప్రత్యక్షంగా జరుగుతుందని దీన్నే నాటక కార్యమని అంటారు. దీనిలో అంకాలన్నింటిలో కథాంశం ఉదాత్తమైన

రసవంతమైనవిగా ఉండాలి. ఈ నాటక కార్యం నీరసం, అనుదాత్తం, అనుచితం అనే మూడు కథాంశాల్ని వదిలిపెట్టాలి. ఇవి కథకు అవసరమైతే అర్థోపక్షేపకాల్లో చూపించాలే కానీ పదర్శింపరాదని పింగళి వారు అన్నారు. కనుక వీటిని ప్రదర్శనార్థం, కథాంశాలనే అయోగ్యాలనీ, అసంభావ్యాలని, అనావశ్యకాలని ఆయన తెలియజేశారు. విష్కంభం, ప్రవేశిక, చూళిక, అంకాస్యం, అంకావతారం వీటిని అర్థోపక్షేపకాలు అంటారు. వీటిలో అంకాస్య, అవతారాలు సదృశ్యాలనీ, విష్కంభ ప్రవేశికలు అంక విభాగాలుగా ప్రత్యేక రంగాలుగా ఉంటాయనీ, అంకాస్య,అవతారాలు అంకం చివరిలో ఒక భాగంగా కలిసి ఉంటాయని పింగళివారు పేర్కొన్నారు.

### 6.21.4. నాటకం – నాయకుడి పాత్ర విశిష్టత:

సంస్కృత నాటకాలలో పాత్రలు విద్యా సంస్కారాలను బట్టి ఉత్తమ, మాధ్యమ, నీచమ అనే మూడు రకాలుగా విమర్శకులు విభజించారు. వీటిలో ఉత్తమ పాత్రులు సంస్కృత భాషను, నీచ పాత్రలు ప్రాకృత భాషను ఎంచుకొని సంభాషిస్తారు. అలాగే మాధ్యమ పాత్రలు, రాజసేవకులు సంస్కృతాన్నే సంభాషిస్తారు. వీటిలో అంతఃపురజనులు దాసీజనులతో రాణి కూడా ప్రాకృతంలోనే మాట్లాడతారు. అందువల్ల పట్టమహిషి నీచపాత్రగా కనిపిస్తుందనీ, మిగిలిన స్త్రీ పాత్రలన్నీ ప్రాకృత భాషలో మాట్లాడవనీ పింగళివారు పేర్కొన్నారు. దీనికి ఉత్తరరామచరిత్రలో అరుంధతీ పాత్ర, సీత చెలికత్తెలు వాసంతి, ఆత్రేయ వంటి పాత్రలు సంస్కృత భాషలోనే మాట్లాడతారని ఆయన తెలియజేశారు. చూళిక అంటే ఏమిటి పింగళి వారు చెబుతూ *"చూళిక అనగా ఆకాశ భాషణము. అశరీర వాణి గాని,ఒక దేవత మూర్తి గాని లేదా కథకు సంబంధించిన ఒక వ్యక్తి గాని, ప్రవేశింపబోవు ఒక పాత్ర గాని యవనికాంతరము నుండి ఇందు కథా సూచన చేయను"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:123) చూళికను ఆయన నిర్వచించారు. నాటకంలో ఈ చూళిక యొక్క ప్రయోజనం ఏ విధంగా చెబుతూ *" తెరచాటు నుండి వెలువడెడి చూళికలను సామాజికలు శ్రద్ధతో ఆలకించి, ఆ యర్థమును కథతో సమన్వయ పరుచుకున్నప్పుడే ఆ అవి సార్థకములగునుగాని, లేనిచో అవి ప్రదర్శనమున నిష్ప్రుయోజకములు. కాని ఆ నాటకమును కాపురముగా చదువుకొను వేళ కొన్ని ఎడల చూళికలు కల్పించెడి ఉత్తేజము రసపరిప్లుతికి సహాయభూతమగును"* అని (సాహిత్య శిల్ప సమీక్ష,1966:123) ఆయన చెప్పారు.

#### 6.21.4.1. సంస్కృత, ఆంధ్ర నాటకాల లక్షణాలు–తులనాత్మక పరిశోధన:

పింగళి లక్ష్మీకాంతంగారు నాటకంలో నాయకుని పాత్ర, ప్రతి నాయకుని పాత్రల గొప్పదనాలను ఎంతో పరిశోధనాత్మకంగా తెలిపారు. నాయకుని పాత్ర తెలుగు నాటకాలలో, సంస్కృత నాటకాలలో, పాశ్చత్య నాటకాలలో ఏ విధంగా ఉంటారనే విషయాలను తులనాత్మకంగా సమన్వయించారు. అందువల్ల ఆ అంశాలను ప్రస్తావిస్తాను

### 6.21.5. నాటకం – నాయకుని పాత్ర నిర్మాణం:

పింగళివారు సాహిత్య శిల్ప సమీక్ష అనే గ్రంథంలో సంస్కృత, పాశ్చాత్య నాటకాల్లోని నాయకుని పాత్రను, ప్రతినాయకుని పాత్రను వాటి లక్షణాలను, స్వభావాలను, పరిధులను వివరించారు. దీనితో పాటు ట్రాజెడీ నాటక లక్షణాలను సంస్కృత నాటకాలకు ఆపాదించి సమన్వయం చేయడానికి ప్రయత్నం చేశారు. నాటకంలో నాయకుణ్ణి ఆంగ్లంలో 'Hero' అనే పదం సంస్కృత వీర శబ్దానికి రూపాంతరం. దీన్ని తెలుగులో 'నాయకుడు' అనే పదంతో పిలుస్తారు. ఒక వ్యక్తి నాయకుడుగా ఉండాలంటే అతనికి కొన్ని లక్షణాలు ఉండాలని పరిశోధకులు అంటున్నారు. మహా నాటకంలో నాయకుడు అయ్యే వ్యక్తి మొదట ధీరత్వాన్ని ప్రదర్శించాలి. ఈ ధీరత్వం ఉదాత్తతమో, ఉద్ధతమో, లాలిత్యమో, శాంతమో, అనే గుణాలు ఉండాలని, దీనితో పాటు ధీరోదాత్తుడు, ధీరోద్ధతుడు, ధీరలలితుడు, ధీరశాంతుడు అనే వాటిలో ఒక దాన్ని ప్రదర్శించాలని పింగళివారు పేర్కొన్నారు. ఈ లక్షణాలకు అనుగుణంగా నాయకునిలో ఏ రసం ఉండాలనే దాన్ని ఇలా సమన్వయించారు.

1. నాయకుడు ధీరోదాత్తుడైనప్పుడు వీర, శృంగార నాటకంగా ఉంటుంది.
2. నాయకుడు ధీరోద్ధతుడైనప్పుడు వీర రస నాటకంగా ఉంటుంది.
3. నాయకుడు ధీరలలితుడైనప్పుడు శృంగార నాటకంగా ఉంటుంది.
4. నాయకుడు ధీరశాంతుడైనప్పుడు శాంత నాటకంగా ఉంటుంది. అని చెప్పారు.

### 6.21.5.1. ట్రాజెడీ నిర్వచనం– విమర్శల దృష్టి:

నిజానికి విషాదాంత నాటకాలు పాశ్చాత్య నాటక సాహిత్యంలో అధికంగా ప్రదర్శించడం జరుగుతుంది. ఇది నాటక ప్రక్రియగా గ్రీసు దేశంలో పుట్టిందని, ఈ నాటక లక్షణాలను అరిస్టాటిల్ చెప్పారని పింగళివారు పేర్కొన్నారు. దీన్ని మన తెలుగు భాషలో 'అశుభాంత నాటకం' అనే పేరుతో పిలుస్తారు. దీన్నే మరలా మరణాంతమని, విషాదాంతమని అనేక పేర్లతో పిలుస్తారని పరిశోధకులు ప్రస్తావించారని తెలిపారు. వీటిలో విషాదాంతం అనే దాన్ని ట్రాజెడీ అని అరిస్టాటిల్ తన 'డి పోయెట్' అనే గ్రంథంలో తెలిపారని పింగళి లక్ష్మీకాంతం ఉటంకించారు అయితే ఈ ట్రాజెడీ నాటకానికి అరిస్టాటిల్ ఒక నిర్వచనాన్ని తెలిపారు. *" Tragedy is the imitation of an action that is serious, complete in itself and of a certain magnitude, in language made beautiful by different means in different parts, in the dramatic not in the narrative form, with incidents arousing pity and fear, bringing about the catharsis (purgation) of such emotions."* అని ( సాహిత్య శిల్ప సమీక్ష, పుట: 131) పేర్కొన్నారు. దీన్ని గురించి కొందరు విమర్శకులు చెబుతూ *" రూపక*

*ప్రక్రియను తీసుకుని ఇంచుమించుగా నూటపాతిక పేజీలలో దీనికి సంబంధించిన పాత- కొత్త విషయాల్ని అన్నింటినీ సమగ్రంగా సమీక్షించారు. దీనిలో ప్రాచీనాలంకారికుల అభిప్రాయాల పరిశీలన, పాశ్చాత్య తాత్త్వవేత్తల భావానుశీలనం జరిగింది. ట్రాజెడీ అనే రూపక భేదాన్ని పరీక్షకి పెట్టి సమగ్ర చర్చ చేశారు''* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974, 'ఆచార్య పింగళి వారి సాహిత్య శిల్ప సమీక్ష' అనే వ్యాసం, డా. కొత్తపల్లి వీరభద్రరావు, పుట: 55) తెలిపారు. దీన్ని బట్టి ట్రాజెడి అనే రూపకం పాశ్చాత్యులు కనుగొన్నదేనని దీన్ని ప్రదర్శించడానికి కొత్తపాత కలయికతో కొంత పరీక్షించారని వీరభద్రరావుగారు వ్యాఖ్యానించారు.

### 6.22. మహాభారత రామాయణాలపై పరిశోధన:

తెలుగు అధ్యాపకులు వివిధ పాఠ్యాంశాలను చెప్పేటప్పుడు మహాభారతాన్ని, రామాయణాన్ని, మహా భాగవతాన్ని ప్రస్తావించకుండా ఉండడం అసాధ్యం. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు అధ్యాపక వృత్తిలోకి రాకమునుపే మహాభారతంపై ప్రత్యేకమైన పరిశోధన చేసి పాండిత్యాన్ని సాధించి దాన్ని ఇతరులకు బోధించేవారు. దానివల్ల కేవలం తెలుగు మహాభారతాన్ని మాత్రమే కాకుండా సంస్కృత మహాభారతాన్ని కూడా అధ్యయనం చేయవలసిన ఆవశ్యకత ఏర్పడింది. అంతేకాకుండా ఆయన మహాభారతంపై గౌతమ వ్యాసాలలోను రేడియో ప్రసంగాలలోనూ మహాభారత రామాయణాల విశేషాలను ప్రస్తావించిన అనేక సందర్భాలు అనేక ఉన్నాయి. దీంతోపాటు రంగనాథ రామాయణం పై ప్రత్యేకమైన కృషి చేయడం వలన సంస్కృత రామాయణాలతో పాటు తెలుగులో వచ్చిన వివిధ రామాయణాలను కూడా ఆయన అధ్యయనం చేసి రంగనాథ రామాయణ పీఠిక సందర్భంలో ప్రస్తావించారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అంత సాహిత్య చరిత్రలో సంస్కృత ఆంధ్ర మహాభారతాలను తులనాత్మకంగా వివరించిన తీరు పరిశోధకుడిగా పింగళివారి కృషిని తెలియజేస్తుంది. వీటిని ఇక్కడ సంక్షిప్తంగా వివరిస్తాను.

#### 6.22.1. ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము:

ప్రసిద్ధ విమర్శకులు అక్కిరాజు రమాపతిరావుగారు *'సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపూటి'* (2003) అనే పుస్తకాన్ని రచించారు. దీనిలో పింగళివారు 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము' అనే వ్యాసం ప్రచురించబడింది.

పింగళివారు ఈ వ్యాసంలో తెలుగు సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావాన్ని, దీనితో పాటు నన్నయ, తిక్కన, ఎర్రనపై వ్యాసుడి ప్రభావాలను సుదీర్ఘంగా విశ్లేషించారు. సంస్కృత మహాభారతాన్ని మాతృకగా గ్రహించిన తెలుగు కవిత్రయం సనాతన ధర్మాలను, భారతీయతను అనుసరించారని పింగళివారు తెలిపారు. ఈ సనాతన సంస్కృతిని కాపాడడంలో తెలుగు కవిత్రయం వారు ఎంతో కృషి చేశారు. ఆ కృషిని శ్రీకృష్ణుని అవతారం ఎంతగానో కొనసాగించిందని పింగళివారు అభిప్రాయపడ్డారు. సనాతన సంస్కృతిని కాపాడడంలో వ్యాసుడు మొదటి వాడని తర్వాత

ఆంధ్ర మహా భారతాన్ని ఆంధ్రీకరించడం వలనే నన్నయ, తిక్కన, ఎర్రన అనే కవిత్రయంవారు రెండో వర్గమనీ పింగళివారు వింగడించే ప్రయత్నం చేశారు.

*"మన జాతియొక్క ప్రవృత్తికి, మన సాంఘిక నియమములకు, మన ఆధ్యాత్మిక ఉన్నతికి ఆదినుంచీ కారణ భూతమైన వేద శాస్త్ర విజ్ఞానమంత ఆ మహా కల్లోలంలో ఛిన్నాభిన్నమై, సనాతనా మార్గము తప్ప, పరస్పర భిన్నములైన పలు రకముల కృత్రిమ మతములకు, ఆ మతములను ఆశ్రయించిన పలు రకములు జాతులకు, ఆ జాతులను పాలించే పలు రకముల రాజులకూ తల యెత్తే అవకాశం చిక్కినది. ఆ విప్లవమును ధర్మగ్లాని అని గాని, ధర్మసాంకర్యము అని గాని చెప్పవచ్చును. ఎప్పుడెప్పుడు ధర్మగ్లాని కలుగుతుందో అప్పుడప్పుడు నన్ను నేను సృజించుకుంటాను అని చెప్పిన భగవంతుడు శ్రీకృష్ణుడు సనాతన ధర్మమును పునః ప్రతిష్ఠించుటకు ఆ కాలంలో అవతరించాడు"* అని (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటి, 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము', అనే వ్యాసం 2003:174) పింగళివారు అన్నారు. ఆయన ఈ మాటలను అనడం ద్వారా భారతీయ సనాతన ధర్మాలను, మతాలను కాపాడడానికి శ్రీకృష్ణ పరమాత్ముడు ఈ భూమిమీద అవతరించాడు. అందుచేత కృష్ణపరమాత్మ దుష్టులను శిక్షించడానికే అవతరించాడన్నారు. దీని ద్వారా కృష్ణుడు శాంతిని స్థాపించారని అన్నారు.

దీన్ని స్థాపించడానికి ఆయన చేపట్టిన ప్రయోగమే భారత యుద్ధం. ఇది కురుపాండవుల యుద్ధం కాదు, రెండు వర్గాలు కాదు నాటి భరత ఖండంలో ధర్మధర్మాల మధ్య, న్యాయన్యాయాల మధ్య జరిగిన యుద్ధం. ఆ అ యుద్ధానికి బలాన్ని చేకూర్చినవారు కంసుడు, శిశుపాలుడు, నరకుడు, జరాసంధుడు. వీరిలో నరక జరాసంధులు ప్రజలను చంపి, హింసను కొనసాగించిన శాక్తేయ మతస్తులు. నాడు మతం పేరుతో చేసిన దుష్పరిపాలన ద్యారానే వారిని రాక్షసులుగా పిలిచేవారిని ఆయనన్నారు. వీరు ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేశారు. దీన్ని భరించలేని ప్రజలు దేవుళ్లను ఆశ్రయించారు. కనుకనే ఈ రాక్షసులను సంహరించడానికే శ్రీకృష్ణుడు అంతరించాడు. వీరిని అంతం చేయడం ద్యారా సనాతన ధర్మాలను, ప్రజల్లో సాత్విక మతాన్ని స్థాపించడమే శ్రీకృష్ణుని అవతార లక్ష్యమని పింగళివారన్నారు.

అంతేకాకుండా ఆ సాత్విక మతాన్ని స్థాపించడానికే శ్రీకృష్ణుడు భూమిపై అవతరించాడు. ఈ సాత్విక మతాన్ని ప్రతిష్టించేవారు కేవలం పాండువులేననీ అందుకే భారత యుద్ధంలో పాండవులను గెలిపించాడని పింగళివారన్నారు. దీన్ని బట్టి సనాతన సంప్రదాలను కాపాడడంలో శ్రీకృష్ణుని పాత్ర ఔన్నత్యం తెలుస్తుంది.

### 6.22.1.1. శ్రీకృష్ణుడు–వ్యాసుల అవతారతత్త్వం:

కృష్ణుడు భారతయుద్ధానంతరం పాండవులకే పట్టం కట్టాడు. ఈ యుద్ధానికి ముందు భారత విజ్ఞానం, వేదాలు, యజ్ఞాలు, ధర్మశాస్త్రాలన్నీ దావాగ్నిలో దగ్ధమైనాయి. కనుకనే అధర్మాలు,

అసత్యాలు, అన్యాయాలు సమాజంలో సంభవించాయి. దీన్ని పింగళివారు ఇలా అన్నారు *"అనాటి విజ్ఞానమంతా గ్రంథరూపంలో కాక శ్రుత రూపంగానే ఉండేది. అందుచేతనే పండితులకు బహుశ్రూతులు అనే పేరు వచ్చింది. ద్వాపరాంతంలో జరిగిన యీ ప్రళయంలో శ్రుత రూపమైన అవిజ్ఞానమంతా మృగ్యమైపోయింది. ధర్మ సంస్థాపనం చేయడానికై కృష్ణుడవతరించినట్లే ఇంచుమించుగా అస్తమించిపోయిన ఈ ప్రాచీన విజ్ఞానాన్ని సంస్థాపన చేయడానికే వ్యాసుడు పుట్టాడు"* అని (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపూటి, 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము', అనే వ్యాసం,2003:175) తెలియజేశారు. వ్యాసుడు శ్రీకృష్ణవతారమని పరోక్షంగా చెప్పినట్లైంది. దీన్ని బట్టి వ్యాసుడు సంస్కృత మహా భారతంలో

భారతీయ సనాతన ధర్మాలను కొనసాగించారనే విషయం అవగతమౌతోంది. తరువాత కవిత్రయంలో వ్యాసుడి వారసత్వాన్ని ఎర్రన చేపట్టాడు. ఈ విషయాన్ని పింగళివారు చెప్తూ "ఎర్రాప్రెగడ 'ప్రాగులై' యెందును పోగేర్పడక యున్న, శ్రుతులన్నియును ఓజ సూత్ర పరిచె' అని చక్కగా, సంగ్రహముగా, వ్యంగ్య ప్రధానమైన పద్య పాదంలో ఇమిడ్చాడు.

తర్వాత భారతీయ సనాతన వేదములు విడదీసినంతనే భారతీయ సంస్కృతి భవనమునకు దృఢమైన పునాది యేర్పడింది. ఆయన భారతాన్ని రచించడము అనగా ఆ పునాది మీద భారతీయ విజ్ఞాన సౌధాన్ని నిర్మించటము. దీనికి భారతం ఏ విధంగా దోహదపడిందని చెబుతూ *"కౌరవ పాండవ చరిత్రను నిమిత్త మాత్రముగా గ్రహించి ఆ మహాకవి భారతములో ధర్మశాస్త్ర వాక్యములూ, ఆగమ తాత్పర్యములూ, ఉపనిషద్రహస్యములూ, ఐతిహాసిక గాథలూ, పురాణ చరిత్రలూ, రాజ వంశ వర్ణనలూ అది యీది అననేల సమగ్ర భారతీయ సంస్కృతి సారమంతా రాశీ భూతమై చేసి ఒక్కచోట నిబంధించాడు"* అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపూటి, 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము', అనే వ్యాసం 2003:176) తెలియజేశారు. దీన్ని బట్టి శ్రీకృష్ణుడు, వ్యాసుడు, ఎర్రన మొదలైన వారు ఈ భారతీయ సనాతన ధర్మాలను, వాటి ప్రాధాన్యాలను వివరించారు. కనుకనే రామాయణ, భారత, భాగవత, ఇతిహాస, పురాణాలు, విజ్ఞాన శాస్త్రాలు, వివిధ కావ్యాలలో పైన తెలిపిన విషయాలకు పునాదిగా ఉండి ఈ భారతీయ వేద విజ్ఞానం వాటి వెలుగులు కనిపిస్తాయి. ఆ వెలుగుల ప్రభావం నవ్యంగా కొనసాగుతుందని అర్థమౌతుంది. నాటి ఆగమ శాస్త్రాలను ఒకే చోట సమన్వపరిచారు. వీటి సారానంతటిని భగవద్గీతలో బంధించారని అభిప్రాయపడ్డారు.

భారతీయ ఆత్మస్వరూపం భారతంలో ఆది పర్వంలోని 32 పద్యం 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని' అర్థాన్నిచ్చే సంస్కృత శ్లోకం 'ధర్మే చార్థే చ కామే చ మోక్షే చ భరతర్షభ, యిది హాస్తి తదన్యత్ర యన్నే హాస్తి నతత్ క్వచిత్' అని సౌతి అన్న మాటలను బట్టి భారతీయ ధర్మ తత్త్వం కనిపిస్తుంది. అయితే ఈ భారతీయ సరస్వతీ నిజ స్వరూపం ఏమిటనేది ప్రశ్నిస్తే దీనికి సమాధానాన్ని

ఇలా చెప్పాడు. *" అది ధర్మాద్వతమూర్తి అని తిక్కన సోమయాజి చరమపరమ సిద్ధాంతము చేశాడు. అందుచేతనే సమస్త వేద వేదాంగ సారములు క్రోడీకరించిన శోకము కావున ఈ మహాగ్రంథము పంచమవేదమైనది"* అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటి, 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము', అనే వ్యాసం 2003:176) పేర్కొన్నారు.

**6.22.1.2. మహాభారతేతిహాసాలు–సంస్కృతి:**

భారతీయ భాషలలో సాహిత్యం ఎట్లా పుట్టింది, అందులో ఉత్తమ కవిత్వం అనదగిన ప్రౌఢ రచనలన్నీ సంస్కృత సాహిత్యానికి అనువాదాలగానో, అనుసరణగానో అవతరించాయనే విషయాన్ని గురించి ఇలా అన్నారు. *"భారతజాతికంతటికి ఒకే సంస్కృతి ఉండటం. అది సంస్కృతంలో నిక్షిప్తమై ఉండటమున్నూ, విజ్ఞానాత్మకము, ఉపదేశపూర్వకము అయిన సాహిత్య రచనకు దొరకొన్న దేశ భాషా కవులు ఆ సంస్కృత మహా నిధులను త్రవ్వి ప్రజలకు ఆ ధనములను పంచిపెట్టటం కంటే తాము క్రొత్తగా సృష్టించేది యేది ఉండదని భావించి ఉంటారు"* అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటి, 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము', అనే వ్యాసం 2003:176) తెలిపారు. దీన్ని బట్టి భారతీయ సంస్కృతిని విస్తరించి దాని విలువల్ని అందరికి తెలపాలి. ఈ విజ్ఞానం కేవలం మహా భారతంలో నిక్షిప్తమైంది. ఆ ధనానంతా వెలికి తీసి ప్రజలందరికి చేర్చాలని పింగళివారు అన్నారు. ప్రాచీన భారతీయ భాషలలో ప్రసిద్ధి చెందిన సంస్కృత భాషలో కవిత్వావిర్భావం గురించి విశదీకరించారు. సంస్కృత భాషలో కవిత్వం, కవులు ఉన్నారని అది బాల్యదశని ఆ దశలో కవిత్వమంతా రమణియంగా, ఆనందకరంగా ఉందన్నారు. ఆనందంతో పాటు విజ్ఞానం ఉన్న సాహిత్యం మాత్రమే ఉత్తమమైంది. దీనితో పాటు తిక్కన భారతీయ సనాతన సంప్రదాయాల్ని పునరుద్ధరించడంలో ఏలాంటి కృషి చేశారనే విషయాన్ని ఇలా చెప్పారు.

తిక్కన భారత రచించడం వలన భారతీయ సనాతన సంప్రదాయాల్ని ఏ విధంగా పునర్నిర్మాణం చేశాడనే విషయం గురించి చెబుతూ *" వీరశైవము అనే పేర ఒక నూతన మత ప్రచారము సాగి వర్ణాశ్రమ ధర్మాలను, కర్మపరత్వమును, నిర్దయగా తీక్షణంగా ఖండింపమొదలడింది. ఆ మతాచార్యుల ఉపదేశములూ ఆ కవుల గ్రంథములూ అమాయకమైన ప్రజాస్వామన్యమును, సామాన్యలనే కాక వివేకవంతులైన విద్యా వంతులు కూడా సనాతన మార్గం నుండి తొలగింపుపూనుకొన్నాయి. శివ భక్తి శివారాధన, శివపారమ్యము భారతీయులందరకూ వందనీయమే కాని శివేతరులైన దేవతలను నిందించటం, దూషించడం వీరశైవ సింహమేనా లింగాధారణం మొదలైనవిలేని శివ భక్తులను తూలనాడటం మొదలైన గ్రామ్య ప్రచారాన్ని అరికట్టడానికి అద్వైతానికి శక్తి చాలక ఉండినది. అద్వైత సారమంతా సంస్కృత భాషలో ప్రస్థాన త్రయంలో ఉన్నది. దానిని*

*చదివినవారు చెప్పగా, విన్నవారు విని గ్రహించినవారు చాలా తక్కువ. భారతంలో ఉన్నది ఈ అద్వైత సారమే కదా, ఆ భారతాంధ్రానువాదాన్ని పూర్తిచేస్తే ప్రజలకు ప్రజలు భాషల్లో అద్వైతమును బోధ చేసినట్లు అవుతుంది. ఈ ధర్మసారం పంటపండితే వీరశైవం మీద వారే విముఖులవుతారు. అందుచేత కవిబ్రహ్మ తిక్కన సోమయాజి దీక్షాపూర్వకంగా భారత రచనానికి ఉపక్రమించి ఆంధ్రులకు ఆంధ్ర భాషలో అద్వైతామృతాన్ని పంచిపెట్టాడు. స్వర్గ వాసులయిన రాజరాజనరేంద్రుడు, నన్నయ భట్టు,తమ తపస్సు ఫలించిందని సంతోషంచారు. శివకేశవాత్మకమైన హరిహరపరబ్రహ్మమును సృష్టించిన అపరబ్రహ్మ యీ కవిబ్రహ్మ''* అని అక్కిరాజు రమాపతిరావు ( సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటి, 'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము', అనే వ్యాసం, 2003:178) తెలియజేశారు. నన్నయ, తిక్కన తర్వాత ఆంధ్ర మహా భారతాన్ని ఎర్రన పూర్తి చేసి భారతీయ సనాతన ధర్మాల్ని అందించాడు. దీన్ని గురించి కూడా చెబుతూ *''ఎర్రాప్రగడ అరణ్యపర్వ శేషమును పూర్తిచేసిన ఎర్రాప్రగడ కూడా నన్నయ తిక్కనల ప్రక్కనిలబడగల మహాకవియే. కవిత్రయము అను పేర ఆ ముప్వురు మనకు పూజ్యులైనారు. ఇంకొక చిత్రమేమంటే గుణప్రాధాన్యమునుబట్టి చూచినపుడు ఈ ముగ్గురి రచనలును మూడు భిన్న పద్ధతులలో నడుస్తుంటాయి. నన్నయ రచనలో ప్రధాన గుణము కథా కథనము. తిక్కన రచనలో ప్రధాన గుణము నాటకీయత, అనగా సంవాద చతురత, పాత్ర చిత్రణము, అభినయ నిర్దేశము మొదలైనవి. ఎర్రన రచనలో ప్రధాన గుణము వర్ణనా సౌలభ్యము. అసలు సారస్వతము అనేది శ్రవ్యము, దృశ్యము, వర్ణనాత్మకము అని మూడు విధములుగానే ఉంటుంది. ఆ మూడు శాఖలకు ఈ ముప్వురు ఆది కవులు మహాగురువులై ఉత్తరకాలంలో ఏ జాతి కవికైననూ తమ రచనే ఆదిభిక్ష అగునటులుగా భారతమును ఇచ్చిపోయినారు'' అని కవిబ్రహ్మ''* అని (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటి,(సంపా)'ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము' అనే వ్యాసం ,2003:178) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి వ్యాసుడు, శ్రీకృష్ణుడు, నన్నయ, తిక్కన, ఎర్రన వంటి మహానీయుల జీవితాలు వారి రచించిన రచనలన్ని సనాతన భారతీయ సంప్రదాయాల్ని, దీనితో పాటు భారతీయ సంస్కృతిని, భారతీయ తత్వాన్ని సామాన్య జనులకు అందించడంలో విశేషమైన కృషి చేశారని ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తనదైన శైలిలో వ్యాఖ్యానించారు.

పింగళివారు కళలు గురించి కూడా ప్రస్తావించారు. కవిత్వంతో పాటు చిత్రకళల్లో ఒకటైన కవిత్వం మిగిలిన సోదర కళలకు దుర్గమమైన భూములను అంటే సంపదను ఇవ్వడం వలనే సంగీతాది చిత్రకళలు ఆనందదాయకమైనవే కాకుండా విజ్ఞానదాయకమైనవి. ఈ చిత్రకళలకు ఉభయ సామర్థాలను కలిగినది కావ్యం. అందుచేతనే మహాకావ్యాలెప్పుడు విజ్ఞానంతో, ఉపదేశాలతో విశ్వ శ్రేయస్సును కాంక్షించే విధంగా ఉంటాయన్నారు. భగవంతుడు మహాకవులకు జన్మనివ్వడమే కాకుండా మహాకావ్యాలను రచించే బాధ్యతలిచ్చారనీ పింగళివారన్నారు. అటువంటి కావ్యాలలో

మహాభారతం ప్రదానమైనది. భారత కథను దేశ భాషలోకి అనువదిస్తే ఆ ధర్మ విజ్ఞానం అందరికి లభించి దేశ ప్రజలు ధర్మమార్గాలను అనుసరిస్తారని పింగళివారు ఒక సూచన చేశారు.

పింగళివారు దీన్ని ఇలా అన్నారు *“దేశ ప్రజలు మాట్లాడే భాషలో ఆ ధర్మాలను అనువదిస్తే ఉత్తమ సాహిత్యంగా నిలిచిపోతుంది. దీనికి సంకల్పించినవారు రాజరాజనరేంద్రుడైతే దీన్ని తన రచనలో ప్రచారం చేసినవారు నన్నయ. నన్నయ ఆది కవి అయినట్లు గానే తెలుగులో భారతము ఆది కావ్యమయింది. సంస్కృతములో రామాయణం ఆది కావ్యమయి యుండగా దానిని వదిలిపెట్టి రాజరాజనరేంద్రుడు భారతాన్నే ఎందుకు కోరాడంటే మహత్వములో రామాయణము కంటే భారతము గొప్పది. కనుక నన్నయ భారతము పుట్టుకచేత ఆది కావ్యమే కాకుండా ఉత్తమ కావ్య రచనకు మార్గదర్శకము కూడా అయింది”* అని పింగళి లక్ష్మీకాంతంగారు (సాహితీ వైజయంతి ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపూటి, ‘ఆంధ్ర సాహిత్యంపై సంస్కృత మహా భారత ప్రభావము’, అనే వ్యాసం,2003:178) అన్నారు. దీని బట్టి పింగళివారికి భారత, రామాయణ కావ్యాల పట్ల ఉన్న దృక్పథం తెలుస్తుంది. మరోవైపు ఆ కావ్యాలను రాసిన వ్యాసుడు, నన్నయ కవులు చెప్పిన ధర్మాలు ఈ దేశ ప్రజలకు ఇచ్చిన ఉపదేశాలను వాటిలోని విజ్ఞానాలు దానిలోని విశేషాలను మనకు పింగళి వారు తెలియజేశారు. కనుకనే తెలుగు సాహిత్యంలో నన్నయను ఆదికవిగా, ఆంధ్ర మహా భారతాన్ని ఆదికావ్యంగా స్పష్టంగా పింగళి వారు ప్రకటించడం ఆయన సహృదయ విమర్శకు నిదర్శనమని తెలుస్తోంది.

వేదాలు, ఉపనిషత్తులు, మహా భారతం, రామాయణం, భాగవతం వంటి కావ్యాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ఇందులో రామాయణం, భారతం భారతీయులకు అత్యంత ముఖ్యమైనవి. ఆంధ్ర మహా భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రన అనే కవిత్రయం రచించారు. భారతీయ సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, లౌకిక విజ్ఞానాలన్నింటినీ నింపుకున్న మహాకావ్యాలుగా విరాజిల్లుతున్నాయి. ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు కూడా ఆంధ్ర మహాభారతానికి ప్రాధాన్యం ఉంది. ‘వింటే భారతం వినాలి, తింటే గారలే తినాలి’ అనే సామెత ఇప్పటికి కూడా జనుల నాలుకల మీద ధ్వనిస్తూనే ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఆంధ్ర మహా భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రన అనే కవిత్రయం రచించారు. దీనికి మూలం వ్యాసుడు రాసిన సంస్కృత భారతం. దీన్ని ఆధారం చేసుకొని ప్రముఖ పరిశోధకుడు, విమర్శకుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తన రచనల్లో రాసిన వివిధ అంశాలను పేర్కొంటాను.

### 6.22.1.3. నన్నయ ఆంధ్ర మహా భారతం:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన ‘ఆంధ్ర సాహిత్య చరిత్ర’ను తొలిసారిగా ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అకాడమీ వారు1974 సంవత్సరంలో ప్రచురించారు. ఈ తొలి ముద్రణలో కేవలం ప్రాఙ్నన్నయ యుగం, నన్నయ యుగం, శివకవి యుగం, తిక్కన యుగం, ఎఱ్ఱాప్రగ్గడ

యుగం, శ్రీనాథుని యుగం, రాయల యుగం కొంత పుటల వరకే ఉంది. తరువాత పింగళి లక్ష్మీకాంతంగారి శతజయంతి ఉత్సవాలు హైదరాబాదులో 1994 లో జరిగాయి. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్తు తెలుగు శాఖ ఆచార్యులు కొలవెన్ను మలయవాసినిగారు పింగళివారి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర'కు సంబంధించిన ఇతర ప్రతులను సేకరించి ప్రోత్సాహంతో దక్షిణాంధ్రయుగం, క్షీణయుగం, ఆధునిక యుగం అనే పేరుతోనే యుగ విభజన ప్రణాళికను నిర్మించుకున్నారు.

వేదాలు, ఉపనిషత్తులు, మహా భారతం, రామాయణం, భాగవతం వంటి కావ్యాలు భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ఇందులో రామాయణం, భారతం భారతీయులకు అత్యంత ముఖ్యమైనవి. ఆంధ్ర మహా భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రన అనే కవిత్రయం రచించారు. భారతీయ సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, లౌకిక విజ్ఞానాలన్నింటినీ నింపుకున్న మహాకావ్యాలుగా విరాజిల్లుతున్నాయి. ప్రాచీన కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు కూడా ఆంధ్ర మహాభారతానికి ప్రాధాన్యం ఉంది. 'వింటే భారతం వినాలి, తింటే గారలే తినాలి' అనే సామెత ఇప్పటికి కూడా జనుల నాలుకల మీద ధ్వనిస్తూనే ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఆంధ్ర మహా భారతాన్ని నన్నయ, తిక్కన, ఎర్రన అనే కవిత్రయం రచించారు. దీనికి మూలం వ్యాసుడు రాసిన సంస్కృత భారతం. దీన్ని ఆధారం చేసుకొని ప్రముఖ పరిశోధకుడు, విమర్శకుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తన రచనల్లో రాసిన వివిధ అంశాలను పేర్కొంటాను.

తెలుగు కవుల చరిత్రలను, సాహిత్య చరిత్రలను రాసిన సాహిత్య కారులు నన్నయ సాహిత్యాన్ని, నన్నయ యుగాన్ని గురించి అనేక విధాలుగా విశ్లేషించారని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ కోవలోనే ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు 'ఆంధ్ర సాహిత్య చరిత్రను రచించారు. దీన్ని తెలుగు అకాడమీ వారు1974 లో ప్రచురించారు. పింగళి లక్ష్మీకాంతంగారి శతజయంతి 1998 సందర్భంగా ఆచార్య కోలవెన్ను మలయవాసినిగారు క్షీణ యుగం వరకు పరిష్కరించారు. మరలా అనేక మార్లు ఈ గ్రంథం పునర్ముద్రణ జరిగింది. ఇటీవలనే ఆంధ్ర సాహిత్య చరిత్రను నవచేతన హైదరాబాద్ వారు 2018లో ప్రచురించారు. ఇందులో పింగళి వారు నన్నయ సాహిత్యాన్ని విశ్లేషించారు.

**6.22.1.4. వ్యాస భారత :**

*''ధర్మ తత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని*
*యధ్యాత్మ విదులు వేదాంత మనియు*
*నీతివిచక్షణుల్ నీతి శాస్త్రంబని*
*కవివృషభులు మహాకావ్యమనియు*
*లాక్షణికులు సర్వ లక్ష్య సంగ్రహ మని*

*యైతిహాసికు లితిహాస మని యు*
*బరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ*
*యం బనిమహి గొనియాడు చుండ*

*వివిధ వేద తత్త్వవేది వేద వ్యాసు*
*డాది ముని పరాశరా త్మజుండు*
*విష్ణు సన్నిభుండు విశ్వజనీనమై*
*పరగు చండ జేసె భారతంబు ''*

(నన్నయ, ఆంధ్రమహాభారతము, ఆది పర్వం)

వ్యాస భారతాన్ని కేవలం ఒక శాస్త్రానికి సంబంధించినది కాదని ధర్మ తత్త్వవేత్తలకు అనేక ధర్మ సందేహాలను తీర్చేదిగాను, ఆధ్యాత్మిక వేత్తలకు ఒక భక్తితత్త్వంగాను, ఒక వేదశాస్త్రంగాను, కవులకు మహాకావ్యం గాను, లాక్షణికులకు సర్వ విషయాలను తెలిపేదిగాను, పురాణమని, ఇతిహాసమని, కావ్యమని, సర్వ విజ్ఞానాన్ని, విశ్వంలో ఉన్న విభిన్న అంశాలను విశదీకరించేదిగా ఉందనే పై పద్యం వలన తెలుస్తోంది. అందువల్ల ఆంధ్ర మహా భారతాన్ని పింగళి ఇలా అన్నారు *''ఆ విజ్ఞానమంతా ఆర్యజాతిదేగాని ద్రావిడులమైన మనది కాదని దానితో మనకేమిపని''* అనే సంకుచిత భేద భావాలుండకూడదని అన్నారు.

**6.22.1.5.భారతజాతికంతకు ఒకే సంస్కృతి:**

దాని విస్తృతమైన పరిధిని ఈ విధంగా చెబుతూ *''ఆ సేతుశీతాచలము బుద్ధియు ఆనాటితెలుగువారికిగాని అరవవారికిగాని లేవు. ఒకే భూఖండమనియు అందుగల కులపర్వతములు, మహానదులు, పుణ్యక్షేత్రములు సంసేవ్యములే యనియు మన ఔత్తరాహులుగాని అన్ని రాష్ట్రములవారికిని, అన్ని జాతులవారికిని పూర్వుల ఉదారాశయములు. అందుచేత దాక్షిణాత్యులుగాని భరతభూమికి మాతృభాష అని చెప్పదగిన సంస్కృత గ్రంథ జాలమును మొదట దేశభాషలలోనికి అవతరింపజేసిరి. భారతజాతికంతకు ఒకే సంస్కృతి కలదనియు అది సంస్కృత భాషలో నిక్షిప్తమై యున్నదనియు అంగీకరించిన దేశభాషా కవులు విజ్ఞానదాయకమును, ఉపదేశపూర్వకమును అయిన ఉత్తమ సాహిత్య రచనలకు దొరకొన్నప్పుడు ఆ సంస్కృత మహానిధులను త్రవ్వి తమ దేశీయులకు ఆ ధనములను నుంచి పెట్టుటకంటే తాము క్రొత్తగా సృష్టించేది ఏదీ ఉండదని భావించియుందురు''* అని పింగళి లక్ష్మీకాంతంగారు (ఆంధ్ర సాహిత్య చరిత్ర, 2018:31) భారతీయతను అందులోని వివిధ అంశాలను సంస్కృత భారతంలోను, తెలుగు భారతంలోను ప్రతిఫలించిన భారతీయతకు సంబంధించిన విజ్ఞానాలను సవివరంగా తెలియజేశారు.

**6.22.1.6.వ్యాస భారత ఆవిర్భావం:**

వ్యాసభారతం కేవలం కురుపాండవ యుద్దానికి సంబంధించిన చరిత్ర మాత్రమేకాదు. ఆ యుద్ధం అంతకముందు ఎంతో కాలంనుంచి భారతదేశంలో విజృంభించిన సాంఘిక దావాగ్ని యొక్క పరిణామం. ఆ దావాగ్నిలో పురాతన భారతీయ విజ్ఞానమంత ఇంచుమించు దగ్ధమైపోయింది. వేదాలు తారుమారైనాయి. ధర్మశాస్త్రాలు విస్మృతమైనాయనీ పింగళివారన్నారు. ఆనాడు విజ్ఞానమంతా గ్రంథరూపంలో గాక శ్రుతరూపంలో ఉండేదని చెప్పారు. దీన్ని పింగళివారు చెబుతూ *"ద్వాపరాంతములో జరిగిన వివిధ పరిణామాల వలన శ్రుతరూపమైన ఆ విజ్ఞానమంతా మృగ్యమై అధర్మాలుగా, అసత్య సిద్ధాంతాలుగా తలయెత్త సాగినవి. ఇంచుమించుగా అస్తమించిపోయిన ఆ విజ్ఞానమును పునస్సంస్థాపన చేయుటయే తన జన్మప్రయోజనముగ వ్యాసుడు అవతరించెను. యుగాంతములో యాదవకృష్ణుడును కృష్ణద్వైపాయనుడు పుట్టియుండకపోయినచో భారతీయ నాగరకత కథావశేష మయ్యేడిది"* అని(ఆంధ్రసాహిత్యచరిత్ర,2018:31) తెలియజేశారు.

**6.22.1.7. భారత ప్రతులు:**

ఆంధ్ర మహా భారతానికి మాతృకలు భారతదేశంలో అనేక రకాలుగా ఉన్నాయనీ పింగళి లక్ష్మీకాంతం గారు చెప్పారు. సంస్కృత భారత ప్రతులు అనేక రాష్ట్రాల్లో అనేక రీతులుగా ఉన్నాయన్నారు. వీటిలో ఉత్తర, దక్షిణ ప్రతులకు ఎంతో భేదాలున్నాయన్నారు. ఈ విషయాన్ని ఇలా చెబుతూ *"మూల భారతము పుట్టిన పిమ్మట గడిచిన ఇన్నివేల సంవత్సర కాలములో ప్రతులు వ్రాసికొనువారు ఎవరికి తోచినట్లు వారు కొన్ని శ్లోకములు కల్పించి, కొన్నింటిని తొలగించి కొన్ని ప్రకరణములను పెంచి, కొన్నింటిని తగ్గించి యుందురు కావున సమగ్ర గ్రంథమునకు యధాతథముగా దక్కలేదు. ఈ తారు మారు నన్నయ నాటికే జరిగినదని"* అని (ఆంధ్ర సాహిత్య చరిత్ర,2018::3) తన అభిప్రాయాన్ని తెలియజేశారు.

అంటే నన్నయ కాలం కన్న ముందే భారత ప్రతులు అనేకమైన ప్రతులు ఉన్నాయనీ వాటి యొక్క సమగ్ర ప్రతులు లభించడం కానీ మరే విధంగా ఉన్నాయో అని తనకు తోచిన రీతిలో తనదైన దృక్పథాన్ని విశదీకరించారు. మహా భారతాన్ని తెలుగులోకి ఆంధ్రీకరించినప్పుడు మూలంలో చేసిన మార్పులను కొన్నింటిని సోదాహరణంగా వివరించారు. సంస్కృత శ్లోకాలను దాన్ని అనువదించిన తెలుగు పద్యాలను పేర్కొనడం పింగళి లక్ష్మీకాంతంగారి తులనాత్మక దృష్టికి నిదర్శనం.

**6.22.1.8.గౌతమ వ్యాసములలో మహాభారతాంశాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారు 'గౌతమ వ్యాసములు'(1952)అనే వ్యాస సంపుటిని రచించారు. ఇందులో 'ఆంధ్ర వాఙ్మయ స్థూల రూపం' అనే తొలి వ్యాసంలో తెలుగు సాహిత్య చరిత్రను విహంగ వీక్షణం చేస్తూ 'నన్నయ యుగాన్ని 'నన్నయ యుగము 11 వ శతాబ్ది' అనే పేరుతో యుగ విభజన ప్రకటించారు. ఇందులో నన్నయ భారత ప్రత్యేకతల్ని వివరించే ప్రయత్నం చేశారు. *"ఆంధ్ర భారతము*

*సంస్కృత భారతమునకు అనువాదమయ్యెను. అది మూల కథా మాత్ర ప్రధానముగా నడిచిన స్వతంత్ర రచనయే కాని, సంస్కృత శ్లోకములకు కేవలము ప్రతిబింబములైన తెలుగు పద్యముల కూర్పు మాత్రము కాదు''* అని పింగళి లక్ష్మీకాంతంగారు (గౌతమ వ్యాసములు,1952:6) అభిప్రాయపడ్డారు. చేయగలిగిరి *''తెలుగు భారతము యథోచితానుసరణమేకాని యథామాతృకము కాదనుట. పురాణేతిహాసములను తెనిగించిన ఆంధ్ర కవులందరును నన్నయ తీసిన ఈ దారినే నడిచి తమ రచనలను అనువాదములయ్యు స్వతంత్రములుగానే''* అని (గౌతమ వ్యాసములు,1952:6) అన్నారు.

నన్నయకు సమకాలికులుగా చెప్పే కవులలో గ్రంథ కర్తలు గా కనిపించే వారు లేరన్నారు. అయితే నారాయణరావు భట్టు మహాకవియనీ, ఆయన శక్తినంతా నన్నయకే ఉపయోగించారు. భారత రచనలో నన్నయకు నారాయణుడు చేసిన సాయం ఎంతో ఉందని పింగళి వారు భావించారు. తెలుగు సాహిత్యంలో మార్గ సాహిత్యానికి నన్నయ చేసిన కృషిని పింగళి వారు *చెబుతూ ''మార్గ కవిత్వమను పేర ఆంధ్రులకు సంస్కృత కవిత్వమే శరణ్యమైయున్న రోజులలో దేశికవితను పుట్టింపవలెనని సంకల్పించిన చాళుక్య రాజుల తపస్సిద్ధి నన్నయ భారత రూపమున ఫలించి, ఆంధ్ర వాఙ్మయ ప్రపంచమునకు మూల స్తంభముగా నిలిచెను''* అని (గౌతమ వ్యాసములు,1952:8) పేర్కొన్నారు.

దీన్ని బట్టి నన్నయ చాళుక్య రాజుల ప్రోత్సాహంతో తెలుగు సాహిత్యంలోకి 'మార్గ' అనే కవిత్వ ప్రక్రియను పరిచయం చేశారు. వ్యాస సంస్కృత భారతాన్ని నన్నయ తెలుగులోకి అనువదించడం వలనే ఆంధ్ర మహా భారత రూపంలో తెలుగు సాహిత్యం ప్రపంచ వ్యాప్తంగా విస్తృతమైందనీ ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తన దృక్పథాన్ని వ్యక్తం చేశారు.

**6.23. ద్విపద భారతము :**

ఇది తిమ్మయ్య, సోమన, బాల సరస్వతి అనే ముగ్గురు ద్విపదలో ద్విపద భారతాన్ని రాశారు. దీనికి పీఠిక రాస్తూ 'ద్విపద భారతము' అనే పేరుతో వ్యాసాన్ని రాశారు. దీనిలో విమర్శ, పరిశోధనల మేళవింపు కనిపిస్తుంది. ఈ ముగ్గురు కవులు ఆంధ్ర మహా భారతాన్ని మాతృకగా తీసుకున్నారని సోదాహరణంగా ఆ విశేషాలను ఈ వ్యాసంలో రాశారు.

*'' ఈ ద్విపద భారతము వచనము వలె ఆస్వతంత్ర పరివర్తనము మాత్రము కాదు. వ్యాస భారతమునకు కవిత్రయ భారతమెంత విధేయమో వారి భారతమునకు నిదియను అంతే విధేయము. అనగా అదియు, నిదియు మూలమునకు యథోచితానుసరణములే కాని యథామాతృకములుగావు.ఒక్కొక్కయెడ మూలానుసరణములో నన్నయ కంటే తిమ్మనయే విశృంఖలముగా వివరించెనేమోయనియు తూచును''* అని పింగళివారు (గౌతమ వ్యాసములు,1952:67) తెలియజేశారు. దీన్ని బట్టి ద్విపద భారత రచనకు మాతృకగా వ్యాసుని

భారతం, నన్నయ భారతమని అన్నారు. నన్నయ భారతంలో కనిపించే విశృంఖలత్వం తిమ్మన ద్విపద భారతంలో అధికంగా కనిపిస్తామని పింగళివారు వింగడించారు.

" ద్విపద భారత గ్రంథానికి వ్రాసిన పీఠిక. శ్రీ తిరుమల రామచంద్ర, శ్రీ కొమ్మనమంచి జోగయ్యశర్మ తంజావూరు సరస్వతీ మహలునుంచి తెచ్చిన వ్రాతప్రతిని సంస్కరించి ఆంధ్ర విశ్వకళాపరిషత్తు పక్షంలో ప్రచురించారు. తిమ్మయ, సోమన, బాలసరస్వతి అనే ముగ్గురు కవులు వ్రాసిన ద్విపద భారతం ఇది. వీరు ద్విపద భారత కవిత్రయంగా వెలుగులోకి రావడానికి కారకులు ఆచార్యులవారే. భాషా ప్రయోగాల విషయంలో ఉచితానుచితాల్ని చర్చించారు. తాము మార్చిన పదాలను గూర్చి ఈ విధంగా అన్నారు. "ఒక్కొక్క మూల పదమునకు నేదో యొక యర్థమున్నను, ప్రకరణమునుబట్టి యది కవి ప్రయుక్తమై యుండునని తోచియు, స్వారస్యముపేక్షించియు దానిని సవరించి మూల పదమును పాదతల సూచనలలో (Foot Notes) చూపితిని. నా సవరణకంటే మూలపదమే బాగనువారు దానినే గ్రహించవచ్చును." అని (గౌతమ వ్యాసములు,1952:63) తెలిపారు. దీన్ని బట్టి

*" ప్రాచీన తాళపత్ర గ్రంథములను సంస్కరించి ముద్రింప బూనుకొను వారికి కావలసిన సదుపాయములలో మొదటిది ప్రత్యంతరలబ్ధి. వివిధ ప్రతుల సాహాయ్యమున్నచో వానియందలి పాఠాంతరము పరిశీలించి "ఏది సాధువు – ఏది యసాధువు. ఏది కవిది – ఏది కాదు" అను విషయములను నిర్ణయించు కొని, గ్రంథమునంతను కవి హృదయానుసారముగా నొక సూత్రమునకు తెచ్చుటకు వీలగును. ఆ సాయములేనినాడు సంపాదకుడు పడు క్లేశము అతనికే యెరుక, ఈద్విపద భారత సంస్కరణమున నాకు నట్టి శ్రమయే కలిగినది"* అని (గౌతమ వ్యాసములు,1952:78) పేర్కొన్నారు. దీన్ని బట్టి ఈ ద్విపద భారతాన్ని పరిష్కరించేటప్పుడు తనకు కలిగిన అవరోధాలను వాటిని అధిగమించి సమన్వయం చేయడానికి ఎంతో శ్రమించాననీ పింగళి లక్ష్మీకాంతంగారు చెప్పుకున్నారు. ద్విపద భారతంలోని పరిశోధనాత్మక కృషిని కొందరు పరిశోధకులు ఇలా అన్నారు. *" పరిష్కరణ విమర్శ(Textual Criticism) గురించి అధ్యయనం చేసే వారు తప్పకుండా ఈ ద్విపదభారతాన్ని చూడాల్సిందే. అంతేగాక వారుచూపని సవరణలు సైతము తాము చూపవచ్చును, అని శ్రీ పింగళివారన్న మాటను గ్రహించి వారి సహృదయ విమర్శన మనస్తత్వాన్ని స్వాగతించవచ్చును"* అని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి (ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు (తొలి మలి), సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి, వారిజారాణి, జి. విజయ కుమార్ (సంపా) 'పింగళి లక్ష్మీకాంతం ప్రాక్పశ్చిమ విమర్శన దర్శనం' అనే వ్యాసం,2008:107) తెలియజేశారు.

దీన్ని బట్టి పింగళి వారి ద్విపద భారతం పరిష్కరణ కోసం తిరుమల రామచంద్ర, జోగయ్యశర్మగార్లు ఎంతో సహాయకారాల్ని ఇచ్చారని వీరు కూడా ఈ ద్విపద భారతాన్ని పరిష్కరించినట్లు అయిందని కసిరెడ్డి వెంకటరెడ్డి గారు అభిప్రాయపడ్డారు.

**6.24. మాని కొండ రామాయణము:**

మానికొండ సత్యనారాయణశాస్త్రి వాల్మీకి రామాయణాన్ని అనుసరిస్తూ మాని కొండ రామాయణము'ను రచించారు. ఈ రామాయణానికి పింగళి లక్ష్మీకాంతంగారు పీఠిక రాశారు. కవి తన ఇంటి పేరుతోనే 'మాని కొండ రామాయణము' అని నామకరణం చేశాడు. అందువల్ల దీనికి మాని కొండ సత్యనారాయణమని తెలుస్తుంది. శాస్త్రిగారు పెట్టుకున్న పేరు తెలుగు వాల్మీకం అయితే రామాయణం తమ పుణ్యం కోసం కవులు మరలామరలా రాస్తూ ఉంటారు. ఇది రామనామాన్ని మనసులో పదేపదే గుర్తు చేసుకోవడంలో భాగంగా భక్తిపూర్వకంగా రాముణ్ణి స్మరించు కోవడంలో భాగమే కవులు మరల రామాయణం రాయడంలోనే పరమార్థం. ఈ రామాయణాన్ని రాసిన వారి పేరుతో రామాయణాన్ని పిలవడం తెలుగులో కొనసాగుతున్న సంప్రదాయం. ఆ విధంగా మాని కొండ రామాయణం పేరుతో పీఠిక రాశారు. ఈ పీఠిక రాయమనీ అడగడానికి పింగళి లక్ష్మీకాంతం గారి దగ్గరకు వచ్చిన కవి మాటల్లో పింగళి లక్ష్మీకాంతం గారి విమర్శ ఎలాంటిదో స్పష్టమయ్యే వాక్యం ఒకటి కనిపిస్తుంది. *"మీరు మంచిని మంచిగా, చెడును చెడుగా నుడివెదరనియు అట్టి విమర్శయే గ్రంథకర్తలపెక్షించు దగుననియు నా యుద్దేశము కాని యా గ్రంథమునకు నేనే యొక యుపోద్ఘాతము వ్రాసితిని. దానిని చక్కగా పరిశీలించడమే మీరు గ్రంథమును విమర్శంపవచ్చును"* అని(గౌతమ వ్యాసములు,1952:97) ఆయన తెలిపారు. అందుకనే ఈ వ్యాసానికి శీర్షికను పింగళి లక్ష్మీకాంతంగారు 'మాని కొండ రామాయణము పరామర్శ' అని పెట్టుకున్నారు. 'పరామర్శ' అనడం ద్వారా ఇది ఒక విమర్శ వ్యాసమనీ స్పష్టంగా తెలుస్తోంది.

**6.25.'ప్రభావతీ ప్రద్యుమ్నము దాని– మూలము' తులనాత్మక పరిశోధన:**

పింగళి లక్ష్మీకాంతంగారు యం.ఏ ఆనర్స్ చేసిన పరిశోధన ఆయన విద్యాత్మక పరిశోధనలో భాగంగా చెప్పుకోవచ్చు. ఇది ఆయన తొలి పరిశోధనగా కూడా భావించే అవకాశం ఉంది. ఆయన అధ్యాపకుడిగా పని చేసినప్పటికి తాను సొంతంగా డాక్టరేట్ పట్టా కోసం పరిశోధనలు చేయలేదు. కానీ ఆయన చాలామంది విద్యార్థుల చేత పిహెచ్.డి పట్టాల కోసం పరిశోధనలు చేయించారు. (చూడు – అనుబంధం) అయితే, ఆయన ఆంధ్ర విశ్వ కళా పరిషత్ లో (వాల్తేరు) అసోసియేట్ ప్రొఫెసర్ (రీడర్) గా పదవీ విరమణ చేశారు. కానీ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో (తిరుపతి) మరలా అధ్యాపకుడిగా చేరి అక్కడ ఆచార్యునిగా పదోన్నతి పొందారు. ఆ తర్వాత ఆయనకు గౌరవ డాక్టరేట్ (డి.లిట్) ఇచ్చి గౌరవించింది. ఆయనను డాక్టర్ పింగళి లక్ష్మీకాంతం అని ఎవరూ పిలవకపోవడానికి ఆయన ప్రత్యేకించి డాక్టరేట్ పట్టా కోసం పరిశోధన చేయకపోవడమే ప్రధాన కారణం. కానీ ఆచార్యునిగా పనిచేశారు. కనుక, అనేకమంది విద్యార్థులకు గురువుగా ఆచార్యత్వం వహించారు. కనుక ఆయనను ఆచార్య పింగళి లక్ష్మీకాంతం అని పిలవడం సర్వ సామాన్యంగా మారింది. ఆయన ఎం.ఏ., ఆనర్స్ (ప్రైవేట్ గా) పూర్తి చేశారు. అప్పుడు మద్రాసు విశ్వవిద్యాలయంలో

ఎం.ఏ ఆనర్స్ చేసే వాళ్ళు ఒక పరిశోధన వ్యాసాన్ని సమర్పించాలని నిబంధన ఉండేది. పింగళి లక్ష్మీకాంతం గారు 'ప్రభావతీ ప్రద్యుమ్నుడు మూలం' పై పరిశోధన వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనను ఇక్కడ వివరిస్తాను.

**6.25.1.పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నము –ఇతివృత్తం:**

ఆంధ్ర సాహిత్య చరిత్రలో 16 శతాబ్ద ప్రబంధయుగాన్ని, కృష్ణదేవరాయల యుగమని పిలుస్తున్నారు. రాయల ఆస్థానంలో ఉండే కవుల్ని అష్టదిగ్గజకవులని సాహిత్య చరిత్రకారులు చెబుతున్నారు. పింగళి సూరన అష్టదిగ్గజాలలో ఒకరు. ఈయన రాఘవపాండవీయం అనే ద్వ్యర్థకావ్యం, కళాపూర్ణోదయం అనే ప్రబంధాన్ని, ప్రభావతీ ప్రద్యుమ్నము అనే ప్రబంధాన్ని, గరుడపురాణం అనే పురాణాన్ని రచించారు. వీటిలో ప్రభావతీ ప్రద్యుమ్నము ఐదశ్వాసాల ప్రబంధం.

మొదటి అశ్వానం ఈ ప్రబంధం ద్వారకా నగర వర్ణనలతో ప్రారంభమౌతుంది. ఇంద్రుడు వజ్రనాభుని వలన తనకు కలిగిన ఆపదల గురించి చెప్పుకోవడానికి ద్వారకకు వస్తాడు. ఇంద్రుడు ద్వారకలో శ్రీకృష్ణుని దర్శించి మాట్లాడాలనీ చెప్తాడు. ఆ సమయంలో కృష్ణుని తండ్రి వసుదేవుడు యజ్ఞం చేస్తున్నాడు కనుక యజ్ఞం పూర్తి కాగానే అన్ని అంశాల గురించి చర్చిస్తానంటాడు శ్రీ కృష్ణుడు. యజ్ఞం ఆ జరుగుతున్నా రోజులు 'భద్రుడు' అనే నాట్యాచార్యుడు తన నటనతో అందరిని మెప్పిస్తాడు. భద్రుని నటనను చూసిన శ్రీకృష్ణననికి ఒక ఆలోచన వచ్చింది. వజ్రపురి ప్రవేశానికి ఒక ఉపాయం ఆలోచిస్తాడు. దేవలోకంలో దేవేంద్రుడు హసనలతో వజ్రనాభుని వధించడానికి సమాలోచనలు చేస్తారు. వాటిలో 'శుచి ముఖీ' అనే దేవ హంస వజ్రపురి వార్తలను ఎప్పటికప్పుడు ఇంద్రుడుకి చెప్పేటట్లు ఉపాయాన్ని ప్రణాళికను నిర్మిస్తారు. ప్రభావతీ స్వప్న వృత్తాంతాన్ని చెబుతుంది. పార్వతీదేవి ప్రభావతీని ఆశీర్వదించి ప్రద్యుమ్నునితో వివాహం జరుగుతుందనీ చెప్పినట్లు తెలియజేస్తుంది.

రెండో అశ్వాసం శుచిముఖీ వృత్తాంతం గురించి ఇంద్రుడి కోరిక ప్రకారం ప్రభావతీ ప్రద్యుమ్నముల కలయిక జరగడం. శుచిముఖీ రాయబారం చేయడం, శుచిముఖీ శ్రీకృష్ణుని సందర్శించి ప్రద్యుమ్నముని చూసి అతని ఎదుట ప్రభావతీ సౌందర్యాన్ని వర్ణిస్తుంది. పార్వతీదేవి సంకల్పాన్ని చెప్పి అక్కడి నుంచి వజ్ర పురికి ప్రయాణం చేస్తుంది. శుచిముఖీ వర్ణించిన ప్రభావతీ సౌందర్యాన్ని విని ప్రద్యుమ్నుడు ముగ్ధుడై ప్రభావతీ పట్ల అనురాగం కలుగుతుంది.

మూడో అశ్వాసం ఇందులో ప్రభావతీ సౌందర్యం గురించి శుచిముఖీ ప్రద్యుమ్నునికి చెప్పిన తరువాత అతనికి ప్రభావతీ పట్ల ప్రణయం కలుగుతుంది. అప్పుడు ప్రద్యుమ్నుడు ప్రణయ లేఖను చిలుక ద్వారా ప్రభావతీకి చేర్చుతాడు. వజ్రపురిలో శుచిముఖీ ప్రభావతీని ఆకట్టుకొని ప్రద్యుమ్నుని సౌందర్యాన్ని విని ఆమె కూడా విరహం పొందుతుంది. ఆ సమయంలోనే చిలుక తెచ్చిన రాయబారం

లేదా ప్రణయ లేఖ ప్రభావతీకి ఇస్తుంది. దీనితో పాటు చిలుక శుచిముఖీ ప్రద్యుమ్నుని దైన్య స్థితిని ప్రభావతీకి ప్రత్యక్షంగా మరలా వర్ణిస్తుంది.

నాలుగో ఆశ్వాసం చిలుక తెచ్చిన రాయబార ప్రణయ లేఖల్ని ప్రభావతీకి ఆమె చెలికత్తె రాగవల్లరి చదివి వినిపిస్తుంది. ఎలాగైనా ప్రద్యుమ్నుని వజ్రపురికి రప్పించమని శుచిముఖీకి ప్రభావతీ తెలియజేస్తుంది.

ఐదో ఆశ్వాసం ఈ అశ్వాసంలో ప్రభావతీ ప్రద్యుమ్నుల సమాగమం గదసాంబుల, చంద్రావతి, గుణవంతుల కలయిక జరుగుతుంది. మరోవైపు ప్రద్యుమ్నుడు వజ్రనాభుని వధించడానికి యుద్ధం ప్రారంభమౌతుంది. వజ్రనాభుని ప్రద్యుమ్నుడు వధిస్తాడు. ఇంతటితో దేవతలందరు ప్రద్యుమ్నుని ఆశీర్వదించి ప్రభావతీకి ప్రద్యుమ్నునికి వివాహం జరిపిస్తారు. ఈ దంపతులకు అనిరుద్ధుడు జన్మిస్తాడు. అనిరుద్ధుడిని వజ్రపురికి రాజుగా ప్రకటిస్తారు.

**6.25.2. ప్రభావతీ ప్రద్యుమ్నములో పింగళి సూరన చేసిన మార్పులు:**

1. సంస్కృత హరివంశంలో వజ్రనాభవధ అనే పేరు ఉంటే దాన్ని కల్పనలు చేసి ప్రభావతీ ప్రద్యుమ్నము అని నూతన పేరును పెట్టాడు.
2. శుచిముఖీ పాత్ర సృష్టి, చిలుక రాయబారం, ప్రద్యుమ్నుని లేఖా వృత్తాంతం, చంద్రవతి గుణవతుల కథలు కల్పనలు.
3. ఈ ప్రబంధంలో సూరన చేసిన మరో మార్పు రసాభాసానికి అనుకూలమైన పక్ష్యాదులను పాత్రలుగా చేయడం ఒక విశేషం. ఇది ఈ ప్రబంధంలో కనిపించే ప్రత్యేకత. పూర్వం శ్రీనాథుడు పంచతంత్ర కథల్లో కూడా పశుపక్ష్యాదులను పాత్రలుగా ప్రయోగించినట్లే పింగళి సూరన కూడా శుచిముఖీ , చిలుక అనే ఆడ పక్షులను పాత్రలుగా ప్రయోగించడం ఇక్కడ కనిపిస్తున్న ప్రత్యేకతని పరిశోధనలు కొందరు అభిప్రాయపడుతున్నారు.
4. పింగళి సూరన శుచిముఖీ, చిలుక పాత్రల ద్వారా జరిపిన రాయబారంతో గొప్ప రాజకీయ చాతుర్యాన్ని ప్రదర్శింపజేశారు. శుచిముఖీ, చిలుక కథా గమనంలో ప్రదర్శించిన ప్రతిభ వలనే ప్రభావతీకి, ప్రద్యుమ్నుడికి పరస్పరం అనురాగం కలిగేటట్లు చేశాయి. మరోవైపు పరోక్షంగా వజ్రనాభుని వధించడానికి ప్రద్యుమ్నుడికి లభించిన గొప్ప అవకాశమని ఈ పాత్ర ద్వారా సూరన కల్పించిన అపూర్వ విజయమని తెలుస్తోంది. ఇంద్రుడు ఈ కింది పద్యం ద్వారా శుచిముఖీ పాత్ర వైశిష్ట్యాన్ని దాని సంభాషణ నైపుణ్యాన్ని దాని గుణాలను ప్రశంసించారు.
5. *“ఒకటి పూర్వోత్తర విరోధ మొదవకుండ*
   *తత్తదవయవ వాక్య తాత్పర్యభేద*

*ములు, మహా వాక్య తాత్పర్యమునకు, నొసర*

*బలుక నేర్పుట బహు తపః ఫలము గాదె ''*

(ప్ర. ప్ర. ద్వితీయాశ్వం, 3 వ పద్యం).

**6.25.3. శుచిముఖి పాత్ర చిత్రణ:**

శుచిముఖి ఆడ హంస. దీన్ని సరస్వతి పెంచింది. ఈ హంసకు శబ్ద సంస్కారమైన బుద్ధి ఉండడం వలనే సరస్వతి దేవి 'శుచిముఖి' అనే పేరు పెట్టింది. అంతేకాదు సరస్వతి దేవి శుచిముఖికి అన్ని విద్యలను నేర్పించి ఉపమాతిశయోక్తి కామధేనువు అనే బిరుదును ఇచ్చింది. అందుకే ఇంద్రుడు వజ్రనాభుని వధించడానికి శుచిముఖి సహాయాన్ని అడుగుతాడు. ''దేవకార్యంబు కడ ముట్ట నిర్వహించుటకు నీవ తక్క నొరులు నేర్వరని ప్రార్థను విని, ప్రభావతీ స్వప్న వృత్తాంతాన్ని తెలిపి సందిగ్ధంలో ఉన్న ఇంద్రుడుకి ఒక మార్గాన్ని చూపించింది. వజ్రనాభుని వధించడానికి తన కర్తవ్యాన్ని నిర్విఘ్నంగా చేస్తాననీ ధైర్యాన్ని చెబుతుంది. ఇంద్రుని మాట ప్రకారం ద్వారకకు వెళ్ళి శ్రీకృష్ణుని సందర్శించి జరగాల్సిన దేవ కార్యాన్ని వివరిస్తుంది. ద్వారకా నుంచి బయలుదేరి వెళ్ళుతుండగా మార్గ మధ్యలో ప్రద్యుమ్నుడిని కలుసుకొని కథా కార్యనిర్వహణలో ప్రద్యుమ్నుడు చేయవలసిన కార్యాన్ని అతనికి చెబుతుంది. ''అల్లయతండితడు గావలయునవశ్య మీవర పురుషునితో మాటలాడి చనుట మనకు మేలు'' అని ప్రద్యుమ్నుడితో శుచిముఖి సంభాషిస్తుంది. వజ్రనాభుని వాదించడానికి అతనిలో వీరత్వాన్ని ప్రేరేపిస్తుంది.

ప్రభావతి స్వప్న వృత్తాంతం చెప్పి చిత్రపలకను చూపించి ప్రద్యుమ్నునికి ప్రభావతీ సౌందర్యాన్ని వర్ణించి అతని మనసును ప్రభావతీపై పురికులిపేటట్లు చేస్తుంది. తరువాత వజ్రపురి నగరంలోకి ప్రవేశించి అంతఃపుర తోటలల్లో విహరిస్తూ ఉంటుంది. ఆ సమయంలోనే ప్రభావతీ ఆమె చెలికత్తె రాగవల్లరి సరోవరంలో ప్రద్యుమ్నుని చిత్ర పటాన్ని చూస్తుంటారు. ఎలాగైనా శత్రుదేశంలో ఉన్న ద్వారకలో ఉన్న ప్రద్యుమ్నుని ఇక్కడికి రప్పించాలనే ఆలోచన చేస్తుంది. దీన్ని బట్టి శుచిముఖి ఏ సమయంలో కథను ఎలా నడిపించాలో తెలిసిన ప్రజ్ఞాశాలిగా కనిపించేటట్లు కవి పింగళి సూరన కల్పించి సృష్టించిన అద్భుతమైన పాత్రగా చిత్రించారు. ప్రభావతీ చిత్ర పటాన్ని చూస్తున్నప్పుడు శుచిముఖి తన మాటలతో ప్రభావతీని ఆకర్షిస్తుంది. అప్పుడు ప్రభావతీ శుచిముఖిని ప్రశ్నిస్తూ ఆ చిత్ర పటంలో ఉన్నవారు ఎవరని అడుగుతుంది. శుచిముఖి ప్రభావతి కి ప్రద్యుమ్నుని పుట్టు పూర్వోత్తరాలను చెప్పి అతని పట్ల అనురాగం కలగడానికి కారణమైంది. ప్రభావతి విరహంతో శుచిముఖితో ఇలా అంటుంది. ప్రద్యుమ్నుని దగ్గరకు ఇంకొకసారి వెళ్లి దురవస్థమైన నాయవస్థను చెప్పి చేరికగొంతు చేయవచ్చునో అని బ్రతిమిలాడుతుంది. మరలా శుచిముఖి, చిలుక ప్రభావతికి శాంతి పలుకులు చెప్పి కొంత విరహా బాధ నుంచి ఉపశమనం కల్గిస్తాయి. ప్రభావతికి రాగవల్లరి

చెలికత్తె ఉపచారాలు చేస్తుంది. ఈ స్థితికి కారణం శుచిముఖి అని రాగవల్లరి భావిస్తుంది. సరిగ్గా ఈ సమయంలోనే కవి పింగళి సూరన చిలుక పాత్రను కథలోకి ప్రవేశింపజేశాడు.

**6.25.4.చిలుక పాత్ర చిత్రణ:**

విరహ బాధతో ఉన్న ప్రభావతీ కి ఒకింత ఉపశమనాన్ని చిలుక కల్గించేటట్లు చేయడం కవి పింగళి సూరనగారి ప్రతిభకు నిదర్శనం. పాఠకులు శుచిముఖి పాత్రను ఎలాగైతే ఆదరిస్తారో, లేక దృష్టిని కేంద్రీకరిస్తారో అదేవిధంగా చిలుక పాత్ర పై కూడా ఆసక్తిని కనబరుస్తారు. ప్రభావతి స్థితిని చూసిన చిలుక ప్రద్యుమ్నుని ప్రణయ లేఖలను కిందపడేలా చేస్తుంది. ఈ లేఖలతో ప్రభావతికి ఎక్కడ లేని ధైర్యం కలుగుతుంది. ఈ సంఘటలను శుచిముఖి గమనించి చిలుకను జాగ్రత్తగా గమనిస్తూ దాని గుణగణాలను, స్వభావాలను తెలుసుకుంటుంది. దీనితో చిలుక యొక్క రాయబార రహస్యాలన్ని శుచిముఖికి తెలిసిపోయి తాను చెడవలసిన దేవ కార్యానికి మరింత బలం అదనంగా చేకూరిందని భావిస్తుంది.

వజ్రనాభుని తమ్ముడు సునాభునికి, చంద్రవతీ, గుణవతీ అనే ఇద్దరు కుమార్తెలుంటారు. వీరికి ద్వారకలో ఉన్న గదుడు, సాంబుడు నడుమ చిలుక ప్రేమ వ్యవహారం నడుస్తోందని చిలుక శుచిముఖితో చెబుతుంది. ఈ రాయబారం వలన కథను మరింత ఆసక్తిగా తీర్చిదిద్దాడు కవి పింగళి సూరన. ప్రభావతీకి ప్రద్యుమ్నునికి వివాహంతో పాటు చంద్రవతీ, గుణవతీ, గదసాంబులకు కూడా వివాహం జరిగేటట్లు చెయాలనే ఒక నిర్ణయానికి వస్తుంది. ప్రద్యుమ్నుడు వజ్రపురి నగరంలోకి ప్రవేశించాలంటే శుచిముఖి ప్రతిభా విశేషాల గురించి వజ్రనాభునికి తెలియజేయాలి. ఇలానే శుచిముఖి సరస కథా ప్రవీణ అనీ, సకల విద్యాధురణీ అనీ వజ్రనాభునికి ప్రభావతీ సభలో వినిపిస్తుంది. ఆ సమయంలో ప్రభావతీ ద్వారా కింది పద్యంలో కవి చెబుతాడు.

*"శుచిముఖి యంద్రు దానిని; వచోనిపుణత్వమునందు, సత్కథా*
*రచనలయందు, నీతి విదురత్వమునందు, బహుశ్రవో వలో*
*కచణతయందు, నెందుసరి గానము దానికి, వేయునేల దా*
*ని చతురతా విశేషములు నీవ కనన్ వలయున్ మహాత్మకా!"*

(ప్ర, ప్ర, చ॥ ఆ॥ 57 ప॥)

అని ప్రభావతీ చెప్పగానే శుచిముఖిని చూడాలనే ఉత్సుకతను వజ్రనాభుడు కనపరుస్తాడు. వెంటనే శుచిముఖిని సభకు రమ్మంటాడు. శుచిముఖి సభలోకి ప్రవేశించి తన శాస్త్ర పాండిత్య విద్యలను వజ్రనాభుని ముందు ప్రదర్శించి సభలోని అందరిని ఆకట్టుకుంటుంది. అప్పుడు పింగళి సూరన శుచిముఖి గురించి కింద పద్యంలో అపురూపంగా వర్ణిస్తాడు.

*"వీనులకు సుధారసముల*
*సోనలు వర్షించు మృదుల సుస్వర ఫణితిం*
*దా నిట్టటు గుక్కక పని*
*లేని పునఃపదము లిడక లీల దలిర్పన్ "*

(ప్రభావతీ ప్రద్యుమ్నము నా. ఆ. 80 వ పద్యం)

వజ్రనాభునికి సంగీత యెడల ఆసక్తి ఉందని గ్రహించిన శుచిముఖి సంతోషిస్తుంది. "నీవును నానా దిగంతచారిణివి. నీకనిన యద్భుతంబు లేమేనియుం గలిగిన నెరిగింపు" అని శుచిముఖినీ వజ్రనాభుడు ప్రశ్నిస్తాడు. అప్పుడు ఈ లోకంలో భద్రుడు అనే సంగీత నాట్యాచార్యుడు ఒకరున్నారనీ అతడు నాట్య విద్యా ప్రదర్శనలో అత్యంత ప్రావీణుడని చెబుతుంది. అతడు దేశదేశాలలో సంచరిస్తూ అనేక సంగీత నాట్య విద్యలను ప్రదర్శనలు చేస్తుంటారని కూడా తెలుపుతుంది. ఇది విన్న వజ్రనాభుడు ఎలాగైనా భద్ర నటుడిని తన అంతఃపురానికి వచ్చేలా చేయమని శుచిముఖిని వజ్రనాభుడు కోరతాడు. తన దేవ కార్యం నెరవేరుతుందని శుచిముఖి ఆనందిస్తుంది. ఇక నేను పోయివస్తాననీ శుచిముఖి వజ్రనాభునితోను, ప్రభావతీతోను చెప్పి అక్కడి నుంచి ద్వారకకు బయలుదేరుతుంది.

ద్వారకలో శ్రీకృష్ణుని ఏకాంతంగా సందర్శించి వజ్రనాభ వధకు అనుకూలత ఏర్పడుతుందని సంకేతమిస్తుంది. వజ్రపురిలోకి ప్రవేశించడానికి ప్రద్యుమ్నుడిని భద్ర నటుడి వేషంలో వెళ్ళమని అతనికి సహాయంగా గదసాంబులను కూడా సహ నటుల వేషంలో వెళ్ళమని చెబుతుంది. ఇంతలోనే ప్రద్యుమ్నునితో మాట్లాడుతూ నీ ప్రణయ లేఖలను ప్రభావతీకి అందాయనే విషయాన్ని కూడా ఈ సందర్భంలో వ్యక్తం చేస్తుంది. శుచిముఖికి దేవ కార్య బాధ్యతను నేరవేరేటట్లు కనిపిస్తుందనీ పింగళి సూరన పరోక్షంగా సూచించాడని తెలుస్తోంది. అందుకే శుచిముఖి ప్రద్యుమ్నుడితో "వజ్రపురంబున కరిగి యేనును దగిన తెఱంగునం దావకీన కార్యను గుణ్యంబు నడుపుచుండెద" అని పింగళి సూరన పలికించాడు. దీన్ని బట్టి వజ్రనాభుని వధించేవాడు ప్రద్యుమ్నుడేననీ తెలుస్తోంది.

**6.25.5. ప్రభావతీ ప్రద్యుమ్నము సూరన శైలి:**

రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి గారు కూడా, ప్రభావతీ ప్రద్యుమ్నం పై పరిశోధన చేశారు. దీన్ని 'శిల్ప ప్రభావతీ' అనే పేరుతో 1980 లో ముద్రించారు. ఈ గ్రంథంలో సూరన శైలి గురించి చెబుతూ *"రాఘవపాండవీయములో సూరన కవల శబ్దశక్తినే చూపినాడు. ప్రభావతీ ప్రద్యుమ్నములో భావ సంపద దానిమ్మ గింజ వలె గర్భీకృతమై ఉన్నది"* అని ('శిల్ప ప్రభావతీ' పుట: 253) తెలియజేశారు. ప్రభావతీ ప్రద్యుమ్నమును గూర్చి, తత్కర్త పింగళి సూరనార్యుఁడు హరి వంశ కథాశ్రయమని చెప్పియుండఁగా, మునుపటి పండితులు కొందరు కథ, హరివంశమున లేదనియు, నందలి యుషాపరిణయ కథనే యిట్లు రచించి, దానికి, ప్రభావతీ ప్రద్యుమ్నుమని, కవి క్రొత్త పేరిడెననియు

నభిప్రాయపడిరి. *"హరివంశమునందీ కథ కనుపట్టుటలేదు. ఈ కథయందలి ముఖ్యమగు పట్టులన్నియును బరికించి చూచినచో అనిరుద్ధ చరిత్రయందలికథ పట్టులే పెక్కులు కానంబడియెడు. అనిరుద్ధ చరిత్ర హరివంశములోనిది. ఆ కథయందలి శోణపుర మే యిందలి వజ్రపురము. 'అచ్చటి పార్వతీవరదేవి మాహాత్మ్యమే యిచ్చటి పార్వతీ వర మాహాత్మ్యము. అందున్న స్వప్నమే యిందలి స్వప్నయి. అచ్చటి బాణాసుర వధయే, యిచ్చటి వజ్రనాభవధ"* అని సూర్యనారాయణరావుగారి (ప్రభావతీ ప్రద్యుమ్నము యొక్క యుపోద్ఘాతము)లో తెలిపారనీ పింగళి లక్ష్మీకాంతంగారు అభిప్రాయపడ్డారు.

సంస్కృత హరివంశంలో విష్ణు పర్వంలో ప్రభావతీ ప్రద్యుమ్న కథ ఉంది. ఎర్రన, నాచన సోమన ఈ ప్రభావతీ ప్రద్యుమ్నము ఘట్టాన్ని అనువదించి కాకుండా వదిలేశారు. 12 వ శతాబ్దంలో కేరళలోని తిరువనంతపురం అనే ప్రాంతాన్ని 'రవివర్మ భూపతి' అనే రాజ కవి పరిపాలించారు. ఆ రాజ కవి 'ప్రద్యుమ్నాభ్యుదయము' అనే సంస్కృత నాటకాన్ని రచించారు. బాసును సంస్కృత నాటకాలను సేకరించి పరిష్కరించిన గణపతిశాస్త్రిగారే ఈ ప్రద్యుమ్నాభ్యుదయము నాటకాన్ని కనుగొన్నారు. పింగళి లక్ష్మీకాంతంగారు దాన్ని సేకరించి పరిశీలించి చూడగా తెలుగు ప్రభావతీ ప్రద్యుమ్నము ప్రబంధానికి ప్రద్యుమ్నాభ్యుదయము నాటకమే మూలం కావచ్చుననీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రభావతీ ప్రద్యుమ్నము ప్రబంధంలో ఉన్న ప్రభావతీ, ప్రద్యుమ్నుడు, శ్రీకృష్ణుడు, వజ్రనాభుడు, భద్రనటుడు పాత్రలు ఈ నాటకంలో కూడా ఉన్నాయి. కానీ శుచిముఖి పాత్ర సంస్కృత నాటకంలో లేదు. హరివంశమునే కాక పైన తెలిపిన నాటకాన్ని కూడా తెలుగు ప్రబంధానికి మూలమని భావించాననీ పింగళి లక్ష్మీకాంతంగారు ప్రకటించుకున్నారు.

### 6.25.6.ప్రద్యుమ్నాభ్యుదయం సంస్కృత నాటకం–ఇతివృత్తం:

ప్రద్యుమ్నాభ్యుదయం అనే సంస్కృత నాటకాన్నీ కేరళ రాజకవి రవివర్మ భూపతి 12వ శతాబ్దంలో రచిస్తాడు. దీనులోని ఇతివృత్తాన్ని చూద్దాం. నారదుడు ఒక నాడు శ్రీ కృష్ణుని సందర్శించడానికి ద్వారకకు వస్తాడు. ఉభయ పక్షాలు కుశల ప్రశ్నలు అనంతరం నీ రాకకు కారణమేమని కృష్ణుడు నారద మహర్షిని అడుగుతాడు. అప్పుడు నారదుడు శ్రీ కృష్ణునితో ఇలా అంటాడు. *" మహాభాగా వసు దేవ వితన్యమానాశ్వ మేధ మహోత్సవ ధురంధరుండవైన నీ దర్శనమే నా రాకకు బ్రథమకారణము. ఇంక రెండవది. అఖండ భుజ శౌండీర్య కుంఠితాఖండల వజ్రుండైన వజ్రనాభుడను దానవపతి కనకగిరి కటకమున జిరకాలము తపము చేసి తత్ప్రకర్ష చే బితామహుని సంతోష పెట్టి యా యనఘువలన నమరావధ్యతయు, నిజానుమతి లేక యఖిల దుష్ప్రవేశమై రత్నమయమైన వజ్రపురమను నగరమును, సకలసంకల్పసిద్ధియు, వరములుగా బడసి ద్విగుణిత మదాంధకారిత హృదయుడై త్రిభువనములకు బీడ గావించు చుండెను"* అని పింగళి లక్ష్మీకాంతంగారు (ప్రభావతీ ప్రద్యుమ్నము దాని–మూలము,1930:6) లో తెలిపారు. తన మనసులో

మాటను శ్రీకృష్ణునికి నారదుడు తెలుపుతాడు. దేవేంద్రుడు కూడా తనతో వజ్రనాభుని గురించి చర్చించాడని నారదునితో శ్రీకృష్ణుడు అంటాడు.

వజ్రనాభుడు దేవలోకానికి వెళ్ళి కశ్యపుని సందర్శించి ఇలా అన్నాడు "చతురానన దత్త వరలాభ గర్వితుడైన వజ్రనాభుడొకప్పు డమరావతికి వచ్చి నన్నిట్లని . యెను. వాసవా నాకు జగదైశ్వర్యం ఇమ్మని అని లేదా యుద్ధానికిరా అని . ఈజగమంతియు మహాత్ములైన కాశ్యపులకు సామాన్యము గాదా యనుటయు నేను బృహస్పతితో నాలోచన చేసి ఇలా అంటాడు. "సౌమ్యుడా *మనతండ్రి కశ్యపముని యిప్పుడు సత్ర దీక్షితుడై యున్నాఁడు. అది ముగియగానే యాయన యేది న్యాయ్య మో యది చేయునని. అంత వజ్రనాభుడు కశ్యపుని పాలి కరిగి వృత్తాంతమంతయు నివేదింప నా బ్రహ్మర్షి పుత్రా అని సత్రావసానమున నేది యుచితమో యది చేయుదము, నీవిప్పటికి నిజపురమునకు బొ' మ్మని యానతీయ నా నికృష్టాశయు డొట్లో సమ్మతించి వజ్రపురము జేరి యిప్పుడు జగగుపప్లవమును జేయుచున్నాఁడు. పిమ్మట దేవరయే ప్రమాణము"* అని ('ప్రభావతీ ప్రద్యుమ్నము దాని– మూలము'1930:7) అన్నారు. ఆదానవపతికి ప్రభావతి అనే కూతురు కలదు. ఆ కన్యారత్నం సౌందర్యవతి. ఆమె పార్వతీ వరం వలన జన్మించింది. ఆ కన్యను చేపట్టువాడు ఎక్కువ కాలం జీవిస్తాడని పార్వతీదేవి వరాన్నిస్తుంది ఆ ప్రభావతి ఇప్పుడు నవయవ్వనంలో ఉందనీ తండ్రి స్వయంవరాన్ని ఏర్పాటు చేస్తాడు. ఆ స్వయంవరానికి వచ్చిన యువరాజులు ఆమెకు నచ్చరు. సకలలోకాతిశాయి సౌందర్య సంపన్నుడైన ప్రద్యుమ్నుడు వజ్రపురమునకు పోతే అతని చూసి మనసు లగ్నమగునని" అని నారుదుడు శ్రీకృష్ణునితో తెలియజేస్తాడు.

### 6.25.7 సంస్కృత హరి వంశంలోని కథ:

వజ్రనాభుడు అనే రాక్షసుడు మేరు పర్వతం మీద బ్రహ్మదేవుడి గురించి తపస్సు చేస్తాడు. వజ్రనాభునికి బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమై వజ్రపురం అనే నగరాన్ని వరంగా ఇస్తాడు. ఆ నగరం లోపలికి ఎవరు ప్రవేశించడానికి వీలుగా ఉండదు. ఈ వరం అనుగ్రహం వలన వజ్ర నాభుడు ఇంద్రలోకానికి వెళ్లి ఇంద్రుడితో ఈ విధంగా అంటాడు. "పాకశాసనా ! ఈ త్రైలోక్యమును శాసించవలెనని నాకు నిచ్ఛగలదు. నీ ప్రభుత్వమును నాకిమ్ము. లేదా యుద్ధమిమ్ము. కాశ్యపులమైన మనకీ జగమంతయు సామాన్యము గాదా యనియెను" ఇంద్రుడు బృహస్పతితో సమాలోచనలు చేసి వజ్రనాభునితో ఇలా అన్నారు. "సౌమ్యుఁడా ! మనతండ్రి కశ్యపుడిపుడు సత్రదీక్షితుడై యున్నాడు. సత్రావసానమున నయ్యనముఁదేది న్యాయ్యమని యాదేశించునో యట్లు నడచుకొందము" అని వజ్రనాభునితో చెబుతారు. దీన్ని ఇష్టపడని వజ్రనాభుడు తండ్రి దగ్గరకు వెళ్లి తన మనసులో ఉన్న కోరికను వెల్లడిస్తాడు. అప్పుడు ఆ మహాముని ఇలా అంటాడు. "సత్రావసానమున మీ సంగతి విచారించి తీర్చెదను, ఇప్పటికి నుద్ధతిమాని నీవు వజ్రపురమునకుఁ బొమ్ము" అని అక్కడి నుంచి వజ్ర నాభుణ్ణి వజ్రపురానికి పంపిస్తాడు.

ఇంద్రుడు ద్వారకకు వెళ్ళి శ్రీకృష్ణుడితో జరిగిన పరిణామాలను వివరించాడు. అప్పుడు కృష్ణుడు తన తండ్రి వసుదేవుడు అశ్వమేధయాగం చేస్తున్నారు. ఆ యాగం ముగిసిన తరువాత వజ్రనాభుని వధించడానికి తగిన ఉపాయాన్ని ఆలోచిస్తానని అంటాడు. వసుదేవుడు యజ్ఞం చేసే సమయంలో శ్రీకృష్ణుడు భద్రనటుడు అనే నాట్యాచార్యుణ్ణి పిలిచి ఒక సంగీత నాట్యాన్ని ఏర్పాటు చేస్తాడు. ఆ నాట్యాన్ని చూడడానికి నగర ప్రజలతో పాటు దేవ లోకం నుంచి దేవతలు కూడా వస్తుంటారు. భద్రనటుని నాట్య ప్రదర్శనాన్ని చూసిన కృష్ణుడు వజ్రనాభుని వధించడానికి భద్రనటుడే సమర్థుడని భావిస్తాడు. ఈ విధంగా వజ్రపురికి భద్రనటుని పంపించడానికి ఇంద్రునితో, నారదుడితో తన అభిప్రాయాన్ని తెలియజేస్తాడు. దీని కోసం శుచిముఖి అనే హంస సహకారాన్ని తీసుకుంటారు. శుచిముఖి ప్రద్యుమ్నుడిని, ప్రభావతీ కలపడానికి ప్రయత్నిస్తుంది.చివరకు ప్రద్యుమ్నుడు వజ్రనాభునితో యుద్ధం చేసి విజయం సాధిస్తాడు. ఆ విజయంతో ప్రద్యుమ్నుడి, ప్రభావతీ ప్రద్యుమ్నుడి వివాహంతో ఈ ప్రబంధం ముగుస్తుంది. ఇందులో సూరన సృష్టించిన అపూర్వ కల్పనలతో శుచిముఖి పాత్రను సృష్టించారని అనేకమంది పరిశోధకుల అభిప్రాయపడుతున్నారు.

ఈ విధంగా ప్రభావతీ ప్రద్యుమ్నం పై ఒక పరిశోధనను కేవలం తన పట్టా కోసమే కాకుండా, దానిని లోతుగా అధ్యయనం చేస్తూ పరిశోధన చేశారని దీన్ని బట్టి తెలుస్తుంది.

**6.26. పరిశోధకుడుగా పింగళి లక్ష్మీకాంతం– విమర్శకులు అభిప్రాయాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారు తొలి తరం పరిశోధకుడిగా విమర్శకులు గుర్తించారు. ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు తయారు చేసుకున్న నోట్స్ ఆ తర్వాత కాలంలో వ్యాసాలుగా, గ్రంథాలుగా ప్రచురించబడిందని కొన్ని పరిశోధన విషయాలను అందించగలిగిందని కొందరు విమర్శకులు వ్యాఖ్యానించారు. అలాంటి విమర్శలు చేసిన కొందరి విమర్శకుల అభిప్రాయాల్ని తెలియజేస్తాను.

**6.26.1. ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు:**

*“సాహిత్య పరిశోధనలో కొన్ని సమన్వయాలను, కొన్ని ప్రతిపాదనలను చేశారు. వీటిలో కొన్నింటినైనా నిరూపించటం ద్వారా ‘పరిశోధకుడిగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి కృషిని అంచనా వేయగలిగే అవకాశం కలుగుతుంది”* అని (వీచిక సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి,2009,:108) అభిప్రాయపడ్డారు. ఆయన సాహిత్య చరిత్రకు ఇచ్చిన నిర్వచనం కూడా నేటికి ప్రామాణికంగా కనిపిస్తుంది. ఆయన చేసిన యుగ విభజన, ఆయన పాటించిన తులనాత్మక పద్ధతులు, ఆయన చేసిన కవి కాలాదుల నిర్ణయం, ఆయన చేసిన పల్నాటి వీరచరిత్ర పరిష్కరణ ఆయనను గొప్ప పరిశోధకుడిగా నిలబెడుతున్నాయి.

ఆయన ప్రబంధ పరిణామాల గురించి చెప్పిన వాక్యం తెలుగు ప్రబంధాలన్నింటిని పరిశీలించిన వారికి మాత్రమే సాధ్యం అవుతుంది. *“భారతములో బీజప్రాయంగా , ఎర్రనలో అంకుర*

*ప్రాయంగా, సోమన్న లో మొలకగా పొడచూపిన ప్రబంధలత శ్రీనాథుని చేతిలో కొనలు సాగి, చిగిర్చి, మారాకువేసినది. అది పుష్ప ఫల సమన్వితమగుట రాయల కాలంలో, మనుచరిత్రయే ఆలతపూచిన తొలి పూవు, పండిన తొలి ఫలము''* అని తెలుగు సంస్కృతిలో (మొదటి సంపుటి పునఃసంశోధితం,1983:754) ప్రబంధ ప్రక్రియ పరిణామాల తీరు తెన్నులను సమన్వయం చేసి నిర్వచించారు. ఇది నేటికీ సాహిత్య చరిత్రలలో ప్రామాణికంగా పేర్కొనడం గమనార్హం అని అన్నారు.

దీనితో పాటు శ్రీనాథుడు కన్నడం వాడు కాదని ఆంధ్ర కవి అని పింగళి లక్ష్మీకాంతం గారు నిరూపించిన విషయం పరిశోధకుల మన్నలను పొందిందనే ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు 'పరిశోధకుడిగా పింగళి లక్ష్మీకాంతం' అనే వ్యాసంలో వ్యాఖ్యానించారు.

ఆధునిక భాషాశాస్త్రవేత్తలు శైలి విషయంలో మరింత లోతుల్లోకి వెళ్ళి శాస్త్రీయ దృష్టి కోణాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు శ్రీనాథుని శైలి గురించి చేసిన విశ్లేషణ వల్ల శ్రీనాథుడు కన్నడవాడు కాదనీ, ఆంధ్రకవేనని నిరూపించిన విషయం పరిశోధకుల మన్ననలను పొందింది. శ్రీనాథుడు 'భీమేశ్వర పురాణం'లో ..

***'' ప్రౌఢిబెరికింప సంస్కృత భాషయంద్రు***
***పలుకు నుడికారమున నాంధ్ర భాష యందు***
***రెవ్వరేమన్ననంద్రునాకేమి కొరత***
***నాకవిత్వము నిజము కర్ణాటభాష''***

అని వర్ణించారు. అలాంటిదే ఒక చాటు పద్యంలో 'తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ! దయలేదా నేను శ్రీనాథుఁడన్' అని అంటాడు. దీనిలో గల 'కర్ణాట భాష' 'తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మీ' ప్రయోగాలను అనుసరించి శ్రీనాథుడిని కర్ణాటక రాష్ట్రానికి చెందిన వాడనే వాదాన్ని పూర్వపక్షం చేశారు. నా కవిత్వము నిజము 'కర్ణాటభాష' అంటే 'కర్ణాట శైలి'' అని అర్థమని పింగళి లక్ష్మీకాంతంగారు తన ఆంధ్రసాహిత్య చరిత్రలో పేర్కొన్నారు. ఇలాంటి అనేక విషయాలను ఆయన వివరించారు.

*''ఒక కవి రచనను గురించి, వాని భాష కఠినముగా ఉండును. వాని భాష రసవంతముగా ఉండును. అని మనము చెప్పినప్పుడు, అచ్చటి కాఠిన్యముగాని, రసవత్తర భాషకు సంబంధించినది గాని కాదు. శైలికి సంబంధించినది కనుక అక్కడ 'భాష' శైలి అనే అర్థం శ్రీనాథుడు 'కర్ణాట భాష' అనే పద్యానికి వాచ్యార్థమే అనుకుంటే శ్రీనాథుని కావ్యాల్లో ఒక్క వాక్యమైనా కన్నడ భాషలోనిది చూపగలమా?* అని ప్రశ్నిస్తారు.

*''దక్షిణాత్యులంతా పాడే కర్ణాటక సంగీతం ఒకశైలి వంటిదేనని, శాస్త్రనిబద్ధ మార్గ సంగీతానికి, శాస్త్రేతి సంగీతమైన దేశీ సంగీతానికి భిన్నమైన రెండింటి కలయిక వల్ల ఏర్పడిన శైలినే 'కర్ణాట శైలి''* అంటారని సంగీత శాస్త్ర ప్రమాణాలతో శ్రీనాథునిశైలిని లక్ష్మీకాంతంగారు నిరూపించారు.

బెండపూడిఅన్నయామాత్యుడు శ్రీనాథుణ్ణి పాకనాటింటి వాడవు,భాంధవుడవు అని సంబోధించటాన్ని బట్టి ఇద్దరూ బంధువులేనని, ఇద్దరూ పాకనాటి నియోగులేనని, ఈ శాఖ వాళ్ళు కన్నడ దేశంలో ఉన్నట్లు తెలియదనీ ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు చెప్పడాన్ని పరిశోధకులు కూడా అంగీకరించారు. *''సంగీత నాట్యపరిభాషను కరణముగా చెవికింపును మనస్సుకు పెంపును కలిగించెడి ఒక శైలిని సృష్టించి దానినే కర్ణాట భాష''*గా శ్రీనాథుడు పేర్కొన్నాడని పింగళివారు ప్రశంసనీయంగా సమన్వయం చేశారు'' అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, (వీచిక, సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి, 2009:122,123) తెలియజేశారు.

తెలుగులో తొలి ప్రబంధం ఏదనే విషయంలో వివిధ ప్రబంధాలను పరిశీలించి ఆ లక్షణాలను బట్టి పెద్దన రాసిన 'మను చరిత్ర' ను ప్రథమ ప్రబంధం అవుతుందని నిరూపించడానికి కొందరు పరిశోధకులు తమ అభిప్రాయాలతో పింగళి వారు సమన్వయించారు. ''తొలి ప్రబంధం మనుచరిత్ర, ప్రాచీన ఆంధ్రకవులు 'ప్రబంధ'శబ్దాన్ని ప్రాచీన సంస్కృత అలంకారికులు వాడిన అర్థంలోనే వాడారు. దాన్ని ప్రక్రియా విశేషంగా భావించలేదు. తిక్కన, కేతన, ఎర్రన, సోమన, శ్రీనాథుడు మొదలైన కవులంతా తమ కావ్యాలను 'ప్రబంధాలు' గానే పేర్కొన్నారని అచార్య పింగళి లక్ష్మీకాంతం వివరించారు. అయితే, 'ప్రబంధం 'పేరుతో వచ్చిన గ్రంథాలన్నింటినీ తీసుకుని లక్షణాన్ని క్రోడీకరించే ప్రయత్నం చేశారు.

ప్రధానంగా వాటిని మనుచరిత్రకే అనువర్తించి చూపారు. ఆ లక్షణాలివి. 1.ఏకనాయకాశ్రయత్వం, 2. అష్టాదశ వర్ణనలు, 3. శృంగార రస ప్రధానం, 4. ఆలంకారిక శైలి, 5. భాషాంతరీకరణం కాకూడదు. స్వతంత్రరచనై ఉండాలి.

నన్నయ ఆంధ్ర మహా భారతం రెండున్నర పర్వాలను మాత్రమే రాసి తర్వాత ఆ రచనను ఆపేయడానికి కారణం రాజరాజనరేంద్రుడు మరణించడం కారణం కాదని బహుశా నన్నయ మరణించి ఉండవచ్చునని పింగళివారు ఒక సూత్రీకరణ చేశారు.

'' నన్నయ యుగం (1000 1100), ఆంధ్ర సాహిత్య చరిత్రలో కాల స్పష్టత కనిపిస్తుంది. రాజరాజనరేంద్రుడు 1022లో పట్టాభిషిక్తుడై 1063 వరకు రాజ్యపాలన చేశాడనీ, ఇక కొనసాగింపుగా జరగలేదన్నారు. ఏ సంవత్సరంలో నన్నయ భారత రచనకు ఉపక్రమించారో తెలియదుకానీ, రాజరాజ నరేంద్రుని పాలనాకాలం చివరిలో ప్రారంభించి, రాజు మరణంతో నన్నయ గ్రంథ రచన ఆపారనే అభిప్రాయం సరికాదనీ, నన్నయ స్వర్గ గమనమే కారణమై ఉందునని ఊహించారు. ఈ యుగంలో 'ఆంధ్ర మహా భారతం' తప్ప, వేరే గొప్ప గ్రంథం లేకపోవటాన్ని బట్టి ఈ శతాబ్ది వాఙ్మయానికి నన్నయ యుగకర్తగా ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు'' అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, వీచిక(సాహిత్యవిమర్శవ్యాసాలసంపుటి,2009:127)లో పేర్కొన్నారు.

వీటితోపాటు పరిశోధకుడిగా పింగళి లక్ష్మీకాంతంగారిని గుర్తించడానికి కావాల్సిన కొన్ని అంశాలను ఆచార్య దార్ల వెంకటేశ్వరరావుగారు 'పరిశోధకుడుగా పింగళిలక్ష్మీకాంతం' అనే వ్యాసంలో క్రోడీకరించారు. వాటిలో ముఖ్యమైన కొన్ని అంశాలను కింది పరిశోధనాంశాలను ఇక్కడ పేర్కొంటున్నాను.

"1. నన్నయ తర్వాతవాడే నన్నెచోడుడు అని సమర్థించటం.

2. తెలుగులో మొదటి హేళన కావ్యం క్రీడాభిరామం అని చెప్పటం.

3. తిమ్మయ, సోమన, బాలసరస్వతి అనే కవిత్రయం రాసిన ద్విపద భారతాన్ని శాస్త్రీయంగా పరిష్కరించటం.

4. ద్విపద భారతాన్ని కవిత్రయ భారతంతో పోల్చటం సరైంది కాదని నిరూపించటం.

5. గోనబుద్ధారెడ్డి ద్విపద రామాయణాన్ని రాసి, తన తండ్రి విఠలధరణీశుని పేరుతో 'రంగనాథ రామాయణం' అని పేరు పెట్టాడని నిరూపించటం....

6. 'ముసలమ్మ మరణం' లో ముసలమ్మ లోక కళ్యాణం కోసమే ఆత్మ త్యాగం చేయటంవల్ల, ముగింపు 'మంగళకరమే' అవుతుంది అని నిరూపించటం.

7. 'ప్రభావతీ ప్రద్యుమ్నం' సంస్కృత మూలంలో ఉందని స్పష్టం చేయటం.

8. 'కర్ణాటక భాష' అంటే 'కర్ణాటక శైలి' అని సంగీత శాస్త్రాన్ని అనుసరించి నిరూపించటం,

9. పలనాటి వీరచరిత్ర, ద్విపద భారతం, రంగనాథ రామాయణాన్ని పరిష్కరించి, పరిష్కరణ పట్ల పరిశోధకుని జాగ్రత్తను గుర్తుచేయటం.

10. సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్రలలో భారతీయ, పాశ్చాత్య సంప్రదాయాలను సమన్వయించటం వల్ల విజ్ఞానాభివృద్ధికి మార్గం వేయగలిగే సమన్వయాన్ని చూపటం.

11. ప్రబంధాన్ని సమన్వయించి, మను చరిత్రను అన్ని లక్షణాలు ఉన్న ప్రబంధంగా నిర్ణయించటం."

ఇలా పరిశోధనలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు కొన్ని కొత్త అంశాలను, కొత్త సమన్వయాలను చేయగలిగారు. ఈ కృషి వల్ల 'తెలుగు సాహిత్య చరిత్ర పరిశోధకుడు'గా ఒక విశిష్ట స్థానాన్ని సాధించారని స్పష్టమవుతుంది.

ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యంగారు వ్యాఖ్యానించినట్లు "*సాహిత్య చరిత్రను కవుల చరిత్ర కంటే భిన్నమైన అస్తిత్వాన్ని కల్పించి, అందులో వికాస సూత్రానికి ప్రాథమికమైన ఆధారాలను పునాదులుగా అమర్చిన మొదటి గౌరవం పింగళివారికే దక్కుతుంది. తెలుగులో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు 'సాహిత్య చరిత్ర' రాసే నాటికే కవుల చరిత్రలు ఉన్నాయి. వాటికంటే భిన్నంగా కావ్య సమీక్ష, విమర్శ*

*లక్షణాలను సంతరించుకోవడం వల్ల వీరి 'సాహిత్యచరిత్ర'కి ఒక విశిష్టస్థానం చేకూరింది''* అనే వ్యాఖ్యలు దార్ల వెంకటేశ్వరరావుగారు ('వీచిక' సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి,2009:131) పింగళి లక్ష్మీకాంతంగారి పరిశోధన కృషిని స్పష్టంగా వివరిస్తున్నాయని పరిశోధనాత్మకంగా తెలియజేశారు.

**6.26.2. ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు 'సాహిత్య చరిత్ర'ను, సాహిత్య విమర్శను సుదీర్ఘకాలం పాటు బోధించారు. అలా బోధించడానికి ప్రధానంగా కనిపించేది లోతైన అధ్యయనం, అధ్యాపకం. ఈ రెండు రంగాల్ని ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత భాషల్లో కొనసాగించారు. అందువల్ల సాహిత్య చరిత్రను ఏ విధంగా బోధించాలనే విషయమై కొన్ని పాఠ్య ప్రణాళికల్ని, కొన్ని సూత్రాల్ని నిర్మించుకున్నారు. ఈ విషయాలను ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు ఇలా అన్నారు

1. *''పాఠ్యగ్రంథాలు లేని సాహిత్య విమర్శసూత్రాలు' 'సాహిత్య చరిత్ర' 'సంస్కృత సుబోధవ్యాకరణం' మొదలైన అంశాలలో పింగళివారు దుర్గమారణ్యంలో త్రోవలు వేసినట్లు కొన్ని బాటలు నిర్మించి చూపించి మార్గదర్శకులు, మార్గనిర్మాతలు అయ్యారు. 'సాహిత్యచరిత్ర'ను కవుల చరిత్ర కంటే భిన్నమైన అస్తిత్వాన్ని కల్పించి, అందులోని వికాససూత్రానికి ప్రాథమికమైన ఆధారాలను పునాదులుగా అమర్చిన మొదటి గౌరవం పింగళివారికే దక్కుతుంది. అలాగే విమర్శసూత్రానికీ, అనువర్తిత విమర్శవిధానానికి సంబంధించిన అంశాలలో కూడా వారి ఆచార్యపీఠం. అయితే, ఈ మూడంశాలూ బోధించిన కొద్దీ పరిణతిని సూచించేవి. సాహిత్య చరిత్రను, సాహిత్య విమర్శనూ బోధించే ఆచార్యుడు ప్రతిసంవత్సరం, లేదా చెప్పిన ప్రతిసారీ ఏదో ఒక నూతనాంశాన్ని జోడించి చెప్పకపోతే అతడు పరిణతి చెందుతున్నట్లు కాదు. ఆ అంశాలలో పరిణతిని కోరే పండితునికి ఎప్పుడూ తృప్తి కలగదు''* అని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు (రసజ్ఞశిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక, 'సమన్వయ విమర్శకేతనం సాహిత్య శిల్ప సమీక్ష అనే వ్యాసం,1994:117) తెలియజేశారు.

*2. ''ఈ యుగం ప్రారంభం కావటానికి ముందే ఈ యుగచైతన్యానికి బాటలు వేసిన వారిలో పింగళి లక్ష్మీకాంతంగారు ప్రథమంగా పేర్కొనదగినవారు. ప్రాచ్య పాశ్చాత్య విమర్శ సూత్ర సమన్వయం వారి విమర్శ లక్షణం. వారి గౌతమవ్యాసాలు (1952) వారి సమన్వయ విమర్శవిధానానికి తొలివెలుగుబాట. ఆ తరువాత వారు సాగించిన సాహిత్య విమర్శ సప్రమాణమైన సమన్వయధోరణిని స్పష్టంగా వెలార్చింది. (పింగళివారు మాట్లాడినా, వ్రాసినా, అది సమరసమైన సాహిత్యపు తీర్పులా ఉంటుందని తెలుగువారు మెచ్చుకొనేవారు. పెక్కుమంది తెలుగుకవుల వ్యక్తిత్వాలకు విలువకట్టింది, 'ప్రబంధ ప్రక్రియకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించింది, సాహిత్యచరిత్రలో*

*యుగవిభాగాల నిర్ణయాన్ని వ్యవస్థీకరించింది, విమర్శపద్ధతులను వివేచించిందీ ఆయనే"* అని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు (రసజ్ఞశిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక, 'సమన్వయ విమర్శకేతనం సాహిత్య శిల్ప సమీక్ష అనే వ్యాసం,1994:118) తెలియజేశారు.

*3."సమన్వయయుగంలో సృజనాత్మక విమర్శ కంటే సమన్వయాత్మకమైన, విశ్లేషణాత్మక విమర్శ ఎక్కువ వచ్చింది. సమన్వయయుగ విమర్శకులు పాశ్చాత్య విమర్శ పద్ధతులనూ, ప్రమాణాలనూ, ప్రక్రియలనూ, పారిభాషిక పదజాలాన్నీ తెలుగువారికి స్పష్టంగా తెలియబరుస్తూనే, వాటిని దేశీయమైనవాటితో సమన్వయిస్తూ సంవాదవిధానాన్ని వ్యక్తం చేశారు. భారతీయ సిద్ధాంతాలతో పాశ్చాత్య సిద్ధాంతాలను తులనాత్మకంగా చర్చించి, ఆంధ్రసాహిత్యంలో అవి యే విధంగా ప్రయోగాలలో స్వతంత్ర ప్రతిపత్తిని సంపాదించుకొన్నయో వివరించే విజ్ఞతను ప్రకటించారు. భారతీయ దృక్పథానికి పాశ్చాత్య ప్రభావం పరిపోషక ద్రవ్యంగా ప్రవర్ధిల్లిన పద్ధతిని ప్రవచించారు. ఇదే సమన్వయ యుగ ప్రధాన ధర్మంగా పరిగణింపబడుతున్నది"* అని జి.వి. సుబ్రహ్మణ్యంగారు (రసజ్ఞశిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక, 'సమన్వయ విమర్శకేతనం సాహిత్య శిల్ప సమీక్ష అనే వ్యాసం,1994:118) తెలియజేశారు.

**6.26.3. గొల్లపూడి ప్రకాశరావుగారు:**

పింగళివారి ఆంధ్ర సాహిత్య చరిత్రలోని యుగవిభజన గురించి చెప్తూ ఇలా అన్నారు. *"సాహిత్య చరిత్రలో యుగవిభజన ముఖ్యాంశం. ఆంధ్ర సాహిత్య చరిత్రను పింగళివారు పది యుగాలుగా విభజించారు. "రాజవంశం పేరు మీదను, దేశ విభాగము పేరు మీదను, మరికొన్ని ప్రమాణముల మీదను ఈ విభాగములు చేయవచ్చును గాని మహాకవుల పేరు మీదనే ఆ యుగములను విభజించి పిలుచుట న్యాయము"* అని కవుల పేరుమీద యుగ విభజన గావించారు. వీరు నాయకరాజుల యుగం తర్వాత యుగానికి క్షీణయుగమని పేరు పెట్టారు" అని గొల్లపూడి ప్రకాశరావు (భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి-కాటూరి1999:74) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి యుగ విభజనలో పింగళివారు అనుసరించిన విధానం శాస్త్రీయంగా ఉందని దీన్ని తర్వాత సాహిత్య చరిత్ర నిర్మాతలు పాటించారని తెలియజేసే ప్రయత్నం చేశారు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు రాసిన ఆంధ్ర సాహిత్య చరిత్రలోని యుగవిభజన ప్రణాళికల గురించి కొందరు సాహిత్య నిర్మాతలు కొన్ని అభిప్రాయాల్ని వెల్లడించారు. అలాంటి వారిలో ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు పింగళివారి యుగ విభజన తీరుతెన్నుల్ని కొన్నింటిని ప్రశంచించారు. వాటిని తెలియజేస్తాను.

**6.26.4. ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు:**

ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తిగారు ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో తెలుగు శాఖలో ఆచార్యునిగా, శాఖ అధ్యక్షుడుగా పని చేశారు. ఈయన అనేక సంవత్సరాల పాటు స్నాతకోత్తర విద్యార్థులకు సాహిత్య చరిత్రను, సాహిత్య విమర్శను బోధించారు. ఆ అనుభవంతో ఆయన తెలుగు సాహిత్య చరిత్రను 5 సంపుటాలుగా ప్రచురించారు. ఆ సందర్భంలో సాహిత్య చరిత్రలలోని యుగవిభజన తీరుల్ని పరిశీలించే ప్రయత్నం చేశారు. తెలుగు సాహిత్య చరిత్రల్ని పరిశీలించిన తర్వాత కొర్లపాటివారికి పింగళి లక్ష్మీకాంతంగారి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర'లోని యుగ విభజన ప్రణాళిక ఎంతో సమంజసంగా ఉందని భావించి తాను రాయబోయే తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి పింగళివారి యుగ విభజననే అనుసరిస్తున్నానీ చాలా స్పష్టంగా ప్రస్తావించారు. వాటి తాలుకు వివరాల్ని ఆయన కింది విధంగా తెలియజేశారు. వాటిని చూద్దాం.

1. *''ఆంధ్ర సాహిత్య చరిత్ర విద్యార్థుల్లోకమునకు ఏ తీరులో ఉండవలెనె?ఏ ఉండవలెనె? అను విషయమును ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రథమ అధ్యక్షులైన పింగళి లక్ష్మీకాంతంగారు కవులను యుగకర్తలుగా గౌరవించి సాహిత్య చరిత్రను సరళ సుందరమైనశైలిలో వివరించిరి. అదే శాఖలో ఆచార్య శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు మహాకవుల పరమైన యుగవిభజనమే ఉత్తమమైనదిగా, భావించి నిరూపించి తెలుగు సాహిత్య చరిత్రను సర్వాంగసుందరముగా తీర్చిదిద్దిరి''* అని (తెలుగు సాహిత్య చరిత్ర ప్ర. భా.1991:ix) తెలియజేశారు. దీన్ని బట్టి ఆచార్య కొర్లపాటివారు వారు తన తెలుగు సాహిత్య చరిత్రను రాయడానికి ఇగ విభజనను ఆకలి పేరుతోనే చేశారని దీనికి పిల్లల వారి ఆంధ్ర సాహిత్య చరిత్ర ఆదర్శమని అనుసరిస్తున్నానని స్పష్టంగా తెలియజేశారు.

2. *''ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు తెలుగుశాఖ అధ్యక్షులు పింగళి లక్ష్మీకాంతముగారు సాహిత్యచరిత్రను, సాహిత్యవిమర్శను పాఠ్యప్రణాళికను ప్రవేశ పెట్టినారు. ఆచార్యపింగళి లక్ష్మీకాంతముగారి ఆంధ్రసాహిత్యచరిత్ర అసమగ్రముగ 1974వ సంవత్సరమునందు ముద్రితమైనది. లిఖితప్రతికి, ముద్రితగ్రంథ మునకు చాల అంతరము కలదు. ఆంతర్యము దురవగాహము. లిఖితప్రతియందు అజ్ఞాతయుగము మొదలు ఆధునికయుగము వఱకు కలదు. అందు చక్కని ప్రణాళిక కలదు. సమగ్రమైన సమ్యగవగాహనము కలదు. స్పష్టమైన ప్రతిపాదనము కలదు. కమనీయమైన కవితాశైలి కలదు. అది సమగ్రసుందరమైన సాహిత్య చరిత్ర''* అని (తెలుగు సాహిత్య చరిత్ర ప్ర. భా.1991:ix) పేర్కొన్నారు. దీన్ని బట్టి సాహిత్య చరిత్రను రాయడంలో ఒక ప్రత్యేక దృక్పథం ఉందని అ దృక్పథంలో సరైన ప్రతిపాదనలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

**6.26.5.ఆచార్య ఎస్వీ రామారావుగారు:**

*తెలుగు సాహిత్య చరిత్ర గురించి ఆచార్య ఎస్వీ రామారావు గారు ఎలా అన్నారు "ఆంధ్ర సాహిత్య చరిత్ర అనేక సంవత్సరంలో బోధించిన అనుభవంతో అర్చింపబడిన ఈ గ్రంథము అసంపూర్ణంగా వెలువడట చరిత్ర జిజ్ఞాసువుల దురదుష్టము. ఇందలి యుగ విభజనము ,యుగ లక్షణ వివేచనము, కవిత్వం పరామర్శము శాస్త్రియములు, హేతుబద్ధములు, ప్రామాణికములైయున్నవి"* అని (తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ– వికాసములు,2014:289) అన్నారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారి ఆంధ్ర సాహిత్య చరిత్ర యొక్క గొప్ప తనాన్ని అందులోని విశేషాల్ని ప్రశంసించారు.

**6.26.6.ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు:**

ఆచార్య ఎస్వీ రామారావుగారు సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర' (2019) అనే గ్రంథాన్ని రచించారు. దీనికి ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు పీఠిక రాశారు. దీనిలో పింగళివారి సాహిత్య చరిత్ర గొప్పతనం గురించి ప్రశంసిస్తూ *" తొలి నాటి తెలుగు కవుల చరిత్రలు సాహిత్య చరిత్ర రచనకి మార్గదర్శకాలుగా నిలిచేయి. పింగళి లక్ష్మీకాంతం, ఖండవల్లి లక్ష్మీ రంజనం, దివాకర్ల వేంకటావధాని అనే ఆచార్య త్రయం ఆంధ్ర సాహిత్య చరిత్ర నిర్మాణంలో తొలి తరానికి చెందిన మహా శిల్పులు. వారు నిర్దేశించిన మార్గంలో నేటికీ సాహిత్య చరిత్రని రచిస్తూనే ఉన్నారు"* అని ('సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర, పీఠికలు,2019: సమగ్ర సమీక్ష అనే శీర్షిక)లో వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి తెలుగు సాహిత్య చరిత్రల నిర్మాణంలో పింగళి లక్ష్మీకాంతంగారు తొలి తరానికి చెందినవారని, పింగళివారు చేసిన సాహిత్య చరిత్ర నిర్మాణం ఎంతో ప్రామాణికమన్నారు. నేటికి కూడా ఆదర్శనీయం అనడానికి ఆంధ్ర సాహిత్య చరిత్ర ఒక గొప్ప నిదర్శనమని స్పష్టంగా కనిపిస్తుందని తెలియజేశారు.

**6.26.7. ఆచార్య కొలవెన్ను మలయవాసినిగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రను రచించారని విదితమే. దీన్ని ఆచార్య కొలవెన్ను మలయవాసినిగారు పింగళివారి శతజయంతి సందర్భంగా పరిష్కరించారు. దీని గురించి చెబుతూ ఈ విధంగా అన్నారు. *"శ్రీ పింగళి లక్ష్మీకాంతం గారు తెలుగు సాహిత్య చరిత్ర, విమర్శ–విషయాలు తాము బోధించడం వల్ల వాటికై ప్రత్యేకమయిన శ్రద్ధతో కృషిచేసి నోట్సు తయారుచేశారు. నోట్సు వంశపారంపర్యంగా సంక్రమించే ఆస్తిలా – సీనియర్ విద్యార్థుల నుండి జూనియర్ విద్యార్థులు తీసికొని ప్రతులు వ్రాసుకుని భద్రపరచుకునేవారు. తెలుగు ఆనర్సు, ఎం.ఎ. చదివే ఆంధ్ర విద్యార్థులకు, ఆంధ్ర సాహిత్య చరిత్ర బోధించే అధ్యాపకులకు ఆ వ్రాతప్రతి ఆశ్రిత పారిజాతమయింది. ఆ వ్రాతప్రతులు ఇంచుమించు ఒక అర్ధశతాబ్దికాలం ఆంధ్రదేశం నలువైపులా వ్యాపించాయి"* అని (రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక, 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' అనే వ్యాసం,1994:108) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి తెలుగు సాహిత్య చరిత్రను బోధించే అధ్యాపకులు తప్పనిసరిగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర సాహిత్య చరిత్రను

అధ్యయనం చేసి అందులోని విశేషాల్ని విద్యార్థులకు బోధించాలని తెలిపారు. దీనితో పాటు తెలుగు సాహిత్య చరిత్రను రచించేవారు కూడా ఈ గ్రంథాన్ని అనుసరించాలని స్పష్టమౌతుంది.

**6.26.8. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి సాహిత్య విమర్శ పద్ధతులు గురించి, పరిశోధన విధానాల గురించి అనేకమంది పరిశోధకులు, విమర్శకులు విభిన్నమైన దృక్కోణాలలో వివేచించే ప్రయత్నం చేశారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డిగారు *"తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వారి శిష్యులుగా వారిచే ప్రశంస లందుకొన్నారు. తన శిష్యుల చేతనేమో "రస సిద్ధాంత రహస్యోప నిషదుపాధ్యాయునిగా", "సాహిత్య శిల్ప క్రియోజ్వల విద్యా చతురాస్యునిగా" కీర్తినందుకొన్నారు. ప్రాచ్యపాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాలకు సమన్వయం సాధించిన అపూర్వ గ్రంథంగా సాహిత్య శిల్ప సమీక్ష గ్రంథం పలువురి చేత ప్రశంసలనందుకొంది.తెలుగు సాహిత్య విమర్శకునిగా వారిని నిలబెట్టింది"* అని (ఆధునిక సాహిత్య విమర్శకులు– ప్రస్థానాలు తొలి మలి తరాలు, పింగళి లక్ష్మీకాంతం ప్రాక్పశ్చిమ విమర్శన దర్శనం, (సంపా), సిహెచ్. లక్ష్మణ చక్రవర్తి,పి. వారిజారాణి, జి. విజయ కుమార్,2008:103) పేర్కొన్నారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతం గారి విమర్శ పద్ధతిలో ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయం చేస్తూ తన విద్యార్థులకు పాఠాలు బోధించారని తెలుస్తుంది. దీనితో పాటు ఆయన రాసిన సాహిత్య శిల్ప సమీక్ష విమర్శకుడుగా గుర్తించడానికి ఒక గొప్ప గ్రంథంగా కనిపిస్తుందని అభిప్రాయపడ్డారు.

**6.26.9. తెలుగు అకాడమీవారు:**

"తెలుగులో వాఙ్మయచరిత్రాధ్యయనము అనునది ఆంగ్ల సాహిత్య పఠన ప్రభావమువలన వచ్చినది. తొలిదశలో కవుల చరిత్రలేకాని వాఙ్మయ చరిత్రలు తెలుగున లేవు. కందుకూరి వీరేశలింగము పంతులుగారు, గురజాడ శ్రీరామ మూర్తిగారు, శిష్ట్లరామకృష్ణశాస్త్రి గారు మొదలగువారు కవుల చరిత్రలను రచించినారు. తరువాతి కాలమున వాఙ్మయ చరిత్రములు అనదగిన గ్రంథములు కొన్ని వెలువడినవి. వంగూరి సుబ్బారావుగారు, కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు, పింగళి లక్ష్మీకాంతముగారు, నిడదవోలు వెంకట రావుగారు, ఖండవల్లి లక్ష్మీరంజనముగారు, దివాకర్ల వేంకటావధానిగారు, కె.వి.నారాయణరావు గారు, కె.వి.ఆర్. నరసింహముగారు మున్నగు ప్రముఖులు వాఙ్మయ చరిత్ర రచనమునకు మార్గదర్శకులు. వీరందరి కృషిని సమన్వయపరచుచు ఆరుద్రగారు సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రను సంతరించుటకు కృషి చేసిరి" అని (తెలుగు సాహిత్య చరిత్ర, తెలుగు అకాడమీ ప్రచురణ, 1986:8) లో రచయితలు డా. వైదుల కృష్ణారావు, శ్రీ వాడవల్లి చక్రపాణిరావుగార్లు, (సంపా) డా. కలిదిండి వేంకట రామరాజు గారు అభిప్రాయపడ్డారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్రను రచించి సాహిత్య చరిత్రకారుల్లో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పొందారని వ్యాఖ్యానించడం సముచితమని తెలుస్తుంది.

### 6.26.10. శలాక రఘునాథ శర్మగారు:

పింగళి వారు రాసిన సంస్కృత కుమార వ్యాకరణము అనే పుస్తకం గురించి కొందరు పరిశోధకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కోవలోనే ఆచార్య శలాక రఘునాథశర్మగారు ఈ విధంగా చెబుతూ *"ఈ గ్రంథం ప్రాచీన సంప్రదాయ రీతి పండితులకు అంతగా రుచించదు. సంస్కృత వ్యాకరణానికి సంబంధించి విద్వద్వర్గంలోనే రెండు బలమైన అభిప్రాయాలు ఉన్నాయి. పాణినీయ సూత్రజాలాన్ని అదే క్రమంలో అధ్యయనం చేయాలనేది ఒక భావన. ఇది 'కాశికా' మార్గం. ప్రక్రియా దృష్టితో సూత్రాల క్రమాన్ని తారుమారు చేసి ప్రకరణ విభాగాత్మకంగా రూపొందించుకోవటం రెండవ పద్ధతి. ఇది 'కౌముదీ' మార్గం. కాశికా మార్గానుయాయులు కౌముదీమార్గాన్నే మన్నించలేదు. భట్టోజీ దీక్షితుని ఈ కౌముదీ మార్గం ఆవిర్భవించిన నాటి నుండి అదే పఠన పాఠనాదులలో విశ్వరూపం తాల్చిందన్న మాట అలా ఉండనీయండి. దానిమీద నిరసన ఈనాటికి కూడా లేకపోలేదు. ఇట్టి స్థితిలో ఆధునిక ఆంగ్లేయ సంప్రదాయపు జోడింపూ, ఒక విధంగా ప్రాచీన వ్యాకరణ సంప్రదాయానికి ప్రతిద్వంద్విగా కొందరు భావించే భాషాశాస్త్రాల' సిద్ధాంతాల మేళనము గల ఈ గ్రంథం సంప్రదాయ మార్గ నిష్ఠులకు ఇష్టం ఎలా అవుతుంది? అయినా పింగళి వారి ఈ ప్రయత్నంలోని చిత్తశుద్ధిని ఎవరూ శంకింపనవసరం లేదు. ఏమంటే; వారి తాత్పర్యం సంస్కృత వ్యాకరణ శాస్త్రానికి ఒక సరిక్రొత్త గ్రంథాన్ని సంతరించి మురిసిపోవటం కాదు. తెలుగు అధ్యయనశాఖలోని విద్యార్థికి కావలసిన కొద్దిపాటి సంస్కృత వ్యాకరణ పరిజ్ఞానాన్ని కాలానుగుణమైన కూర్పుతో మొదటి మెట్టులా అందించటం మాత్రమే. దీనిని మనం జాగ్రత్తగా గుర్తిస్తే వారి పూనికను మనసారా అభినందించగలం"* అని ( రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం 'ఆచార్య పింగళి కూర్చిన సంస్కృత కుమార వ్యాకరణమము' అనే వ్యాసం,1994:122) లో వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు కవిగా, పరిశోధకుడుగా, విమర్శకుడుగా అందరికి తెలిసిందేననీ ఆయన సంస్కృత కుమార వ్యాకరణాన్ని బట్టి చూసినప్పుడు ఒక సంస్కృత వ్యాకరణకర్తగా, సంస్కృత పండితునిగా కనిపిస్తాడని ఆచార్య శలాకవారు అభిప్రాయపడ్డారు.

### 6.26.10.1. భారతీయ జీవన విధానంలో గురువుగా పింగళి పాత్ర విశిష్టత:

మొదటి అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతంగారి గురుశిష్యుల సంబంధాలను కొంత వరకు ప్రస్తావించాను. అవి (తిరుపతి వేంకటశాస్త్రి-పింగళి లక్ష్మీకాంతం)- (కోరాడ రామకృష్ణయ్య-పింగళి లక్ష్మీకాంతం) – (పింగళి లక్ష్మీకాంతంగారు- పింగళివారి శిష్యులు) ఇలా మూడు తరాల గురు శిష్యుల పరంపరను సంక్షిప్తంగా తెలియజేశాను.

తర్వాత పింగళి లక్ష్మీకాంతంగారు తొలిసారిగా బందరు పాఠశాలలో కొంతకాలం తెలుగు అధ్యాపకుడుగా చేరారు. అక్కడ నుంచి మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా మూడు సంవత్సరాల పాటు పరిశోధన చేశారు. కేవలం కొద్ది సంవత్సరాల కాలంలో ఆంధ్ర విశ్వకళా

పరిషత్తులో తెలుగు శాఖలో అధ్యాపకుడుగా చేరారు. అక్కడే రీడర్ గా, శాఖ అధ్యక్షులుగా, పాఠ్య ప్రణాళికల రూపకర్తగా విభిన్న సేవల్ని కొనసాగిస్తూ అనేక మంది విద్యార్థుల్ని తీర్చిదిద్దారు. ఒకవైపు విశ్వవిద్యాలయ అభివృద్ధిని, మరోవైపు తెలుగు శాఖను తక్కువ కాలంలో విశ్వవ్యాప్తం చేశారు. దీని తర్వాత విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలకు అధిపతిగా చేరారు. అక్కడ తెలుగు భాష, సాహిత్యాలకు విశేషమైన కృషి చేశారు. ఆకాశవాణి కేంద్రంలో తన శిష్యుల చేరడం ఒక విశేషం. కనుక ఇక్కడ కూడా గురు శిష్యుల సంబంధాల్ని కొనసాగించారు. పింగళివారిని ఆచార్యునిగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. ఇక్కడ మరలా అధ్యాపక వృత్తిని చేపట్టి బోధన, పరిశోధన, విమర్శ రంగాలతో మమేకమై మేత, కూత, వ్రాతల కృషిని మరికొంతకాలం పాటు సాహిత్య సేవల్ని విద్యార్థిలోకానికి ఇచ్చారు. వీటన్నింటిని పరిశీలిస్తే పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, విజయవాడ ఆకాశవాణి కేంద్రం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాలలో అధ్యాపకుడుగా పని చేశారు. అందుచేత విద్యార్థిలోకాన్ని ఏవిధంగా ప్రభావితం చేశారు. ఆయన విద్యారంగానికి చేసిన విశిష్టమైన వ్యక్తిత్వాన్ని తెలుసుకోవడానికి పింగళివారి శిష్యబృంద మాటలను బట్టి ఇక్కడ వాటిని తెలియజేస్తాను.

**6.26.10.1.1. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యవర్గంలో భద్రిరాజు కృష్ణమూర్తిగారు ప్రసిద్ధి చెందారు. కృష్ణమూర్తిగారు ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో పింగళివారి దగ్గరే చదువుకున్నారు. తర్వాత కాలంలో భాషాశాస్త్రంలో పరిశోధనలు చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో భాషాశాస్త్ర ఆచార్యునిగా, అధ్యక్షులుగా పని చేశారు. తెలుగు అకాడమీ తరపున తెలుగు అమలుకోసం విశేష కృషి చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వ్యవహరించారు. పింగళివారు తెలుగు భాష అమలు కోసం ఏ విధంగా ఉద్యమించారో ఇలా చెబుతూ *“గురుపాదులు శ్రీపింగళి లక్ష్మీకాంతంగారి పేరు అను కొన్నా, విన్నా కండ్లకు కట్టేది, మనసుకు తట్టేది 30 ఏండ్లు వచ్చినా వెన్ను వంచకుండా నిటారుగా నడిచే కడ్డీలాంటి విగ్రహం, మెరమెరలాడే తెల్లజుట్టు, సన్నని నిలువుబొట్టు, కొనదేరిన ముక్కు, చురుకైన చూపు, పొల్లుమాట కలవని ఉపన్యాస చాతుర్యం, వ్యవహారజ్ఞత, తెలుగుసాహిత్య చరిత్ర, కావ్య విమర్శన– ఇవి. అధికారులు తన్ను ప్రశంసించేట్టు చేసుకొనేవాడు కాని, అధికారులను ఏనాడూ ప్రశంసించే వాడుకాదు. ఆత్మగౌరవం, హుందాతనం స్వేచ్ఛ, ‘తనతనం’ ఆయన నడకలోనూ, మాటలోనూ ఉట్టి పడుతుండేవి. అభిమానులు, శిష్యులు అంటే మనసు విప్పి వాత్సల్యంతో మాట్లాడేవారు. ఇతరులతో మిత భాషిత్వం. గిట్టనివాళ్ళ పేరు తాను వినే అంత ప్రాధాన్యం కూడా ఇచ్చేవారుకారు. ఒంటరితనాన్ని స్వచ్ఛ, తనతనం, నిర్వేదాన్ని వైరాగ్యంతోను, కోపాన్ని మౌనంతోనూ మరుగుపరిచేవారు. ఇది పింగళివారి స్వభావం, శీలం. తెలుగుసాహిత్య విమర్శలో ఆయనది ఆచార్య పీఠం. పాత విషయాన్ని గూడా కొత్తతీరున చెప్పటం ఆయన ఉక్తిలోను,*

*రచనా విధానంలోను ఉన్న ఒక అనన్య సామాన్యమైన శక్తి"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,'ఆధునిక భాష – పింగళివారు' అనే వ్యాసం, 1974:58) అన్నారు. దీన్ని బట్టి పింగళివారి బోధనను, ఆయన ఇతరుల పట్ల ఉండే తీరును, ఆయన భౌతిక రూపాన్ని చక్కగా తెలియజేశారు. దీనితో పాటు పింగళివారి విమర్శను, సాహిత్య చరిత్రను పాఠం చెప్పేటప్పుడు ఆయన ప్రసంగం ఉత్సుకత కలిగించేదనీ కృష్ణమూర్తిగారి మాటలే నిదర్శనం.

**6.26.10.1.2. ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావుగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యబృదంలో కొత్తపల్లి వీరభద్రరావుగారు ఒకరు. ఈయన ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో పింగళివారి దగ్గర చదువుకున్నారు. తర్వాత 'తెలుగు సాహిత్యంపై ఇంగ్లీషు ప్రభావం' అనే అంశంపై పిహెచ్.డి పరిశోధన చేశారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యునిగా, తొలి అధ్యక్షులుగా నియమితులయ్యారు. పింగళివారికి ప్రియ శిష్యునిగా ఉంటూ సేవ చేశారు. పింగళివారి గురించి చెబుతూ *"సాహిత్య చరిత్ర చెబుతూ ఉన్నప్పుడు కనబడుతూనే ఉండేది. కాని దీని పరాకాష్ఠ, సాహిత్య సిద్ధాంత విషయాలు చెప్పేటప్పుడు మాకు దృగ్గోచర మయ్యేది. ఆయనది సమన్వయ దృష్టి. "పురాణ మిత్యేవ న సాధు సర్వం న చాపి కావ్యం నవమిత్యపద్యం" అనే వాక్యాన్ని ప్రకరణాం తరంలో తెచ్చి వారి దృష్టి విషయంలో సమన్వయించ వచ్చు. సాహిత్య చరిత్ర చెప్పినా సాహిత్య సిద్ధాంత వివేచన చేసినా ఆయన బాణీ అంతా "కొత్త పాతల మేలు కలయిక" అని సాహిత్య సిద్ధాంత విషయాల్ని నవీనంగా వివరించే టప్పుడు పాతమాటల్ని కొత్తఅర్థాల్లో వినియోగించవలసి ఉంటుంది;నవ్యపారిభాషిక పదజాలాన్నిసృష్టించవలసి ఉంటుంది. ఈ రెండింటినీ లక్ష్మీకాంతంగారు సమర్థవంతంగా సాధించారు"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 'ఆచార్య పింగళి వారి సాహిత్య శిల్ప సమీక్ష' అనే వ్యాసం,1974:52,53) వ్యాఖ్యానించారు. సాహిత్య చరిత్రను కొత్తపాత కలయికతో నూతనత్వం కనిపించే విధంగా, ఆంగ్ల పారిభాషిక పదాల్ని సమన్వయం చేస్తూ బోధించడంలో ఒక గొప్ప విశేషమని పింగళివారి విమర్శ తీరుతెన్నుల్ని కొత్తపల్లి వీరభద్రరావుగారు పేర్కొన్నారు.

**6.26.10.1.3. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు:**

పింగళివారి శిష్యుల్లో దివాకర్ల వేంకటావధానిగారు చెప్పుకోదగినవారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో పింగళివారి దగ్గరే చదువుకున్నారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యునిగా, అధ్యక్షులుగా పని చేశారు. దివాకర్లవారు పింగళివారి గురించి చెబుతూ *"శ్రీ లక్ష్మీకాంత కవిగా రొక్కరే రచించిన మధుర పండిత రాజము పండితరాయల కవితా మాధుర్యము నాంధ్ర సహృదయుల కామెత వెట్టఁజాలినది. వారెంత మహాకవులో యంత మహా విమర్శకులు. వారి గౌతమ వ్యాసము లాంధ్రమునఁ బరిశోధన విమర్శన పాటవమునకు వలెనే వచనరచన కును ఒజ్జబంతులు. వారిటీవలనే ప్రచురించిన సాహిత్య శిల్పసమీక్ష ప్రాచ్య పాశ్చాత్య*

*కావ్యతత్వ సాహితీ శిల్ప సమావిష్కరణ పాటవమున సాటిలేనిదై సాహిత్య అకాడమీ పారితోషికమునకు పాత్రమైనది. వారి కుమారవ్యాకరణ మాంధ్రకుమారులు గీర్వాణ వ్యాకరణ గహనమున స్థానందనోహలముగా సాగిపోవుట కలవరింపఁబడిన పూలబాట. వారి గౌతమ నిఘంటువును ఆంగ్ల నవలానువాదములును యాంగ్లభాషా ప్రాభవమున కాదర్శములు''* అని (ఆచార్యపింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, దివాకర్ల వేంకటావధాని 'ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ తరపున ప్రశంస పత్ర ప్రసంగ వ్యాసం',1974:13) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి పింగళివారు సాహిత్య విమర్శను, చరిత్రను పాఠాలు బోధించారని, సాహిత్య శిల్ప సమీక్షలో ప్రాచ్య పాశ్చాత్య దృక్పథంతో కావ్యాత్మను తెలిపేలా విద్యార్థులకు బోధించారనడానికి దివాకర్లవారి మాటలే నిదర్శనం. దివాకర్ల వెంకటావధానిగారు రాసిన 'ఆంధ్ర వాఙ్మయ చరిత్ర' (1958) లోని యుగ విభజన ఇలా ఉంది. *''ప్రాఙ్నన్నయయుగం, భాషాంతరీకరణయుగం, కావ్యయుగంగా....* యుగవిజనచేస్తూ *''ఈ గ్రంథమున కావ్య ప్రక్రియా భేదములనుబట్టి యగవిభజనము చేయబడును. వాఙ్మయ చరిత్రకారులు తమ యభిరుచినిబట్టి సౌకర్యమునకై యేవిధముగానైన యుగవిభజనము కావింపవచ్చును''* అని (ఆంధ్ర వాఙ్మయ చరిత్ర:4,5)లో యుగ విభజన పట్ల తనకున్న అభిప్రాయాన్ని తెలియజేశారు. దీన్ని బట్టి కూడా పింగళివారు తెలియజేసిన సాహిత్య ప్రక్రియా విశేషాలను అనుసరించి దివాకర్లవారు కావ్య ప్రక్రియానుసారంగానే యుగ విభజన చేస్తున్నాననీ చెప్పుకున్నారు. దీని వెనుక పింగళివారి కృషి ఫలితం కనిపిస్తుందనీ, ఈ విధంగా పింగళివారి 'ఆంధ్ర సాహిత్య చరిత్ర' ఎందరికో ఆదర్శపాయమైందని స్పష్టంగా అర్థమౌతుంది.

**6.26.10.1.4. ఆచార్య కాకర్ల వేంకటరామనరసింహంగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్య వర్గంలో కాకర్ల వెంటకరామనరసింహం ఒకరు. ఈయన ఆంధ్ర విశ్వకళా పరిషత్తులో బి.ఏ ఆనర్స్ చేశారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వకళా పరిషత్తు తెలుగుశాఖలో ఆచార్యునిగా, అధ్యక్షునిగా పని చేశారు. పింగళివారి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని, ఆధ్యాత్మికత పట్ల తన అభిప్రాయాల్ని ఇలా చెప్పారు. *''1941 సం॥లో నేను 'రిసెర్చి స్కాలర్ 'గా విశ్వకళాపరిషత్తులో ప్రవేశించాను అప్పటినుంచే మూడేళ్ళపాటు అహర్నిశలు నేను వారితోనే ఉండేవాణ్ణి. ఆ రోజుల్లోనే, నేను వారికి అత్యంత సన్నిహితుణ్ణి అయాను. కష్టాల్లోగాని, సుఖాల్లోగాని, వారు నన్ను విడిచి ఉండలేదు. నేను వారిని విడిచి ఉండలేదు. నేను పరిశోధన చేస్తున్నప్పుడు, మొదటి సంవత్సరం లోనే విశాఖపట్టణంమీద బాంబులు పడ్డాయి. ఆ సన్నివేశం ఇప్పటికీ నాకు జ్ఞప్తిలో ఉంది. లక్ష్మీకాంతంగారు డాబాతోటలో ఇల్లుకట్టి అప్పటికి. రెండు మూడేళ్ళే అయింది. వసారాలో మేమిద్దరం కూర్చున్నాం. వారు రంగనాథ రామాయణానికి పీఠిక చెపుతున్నారు. నేను వ్రాస్తున్నాను లక్ష్మీకాంతంగారి రచనల్లో మూడు వంతులు, వారు ఆశువుగా చెప్పినవే. గాంగనిర్ఝర ధాటితో ఆనర్గళంగా వారి వాక్ప్రవాహం పరువులుపెట్టేది. ఆ ప్రవాహవేగాన్ని అందుకోలేక లేఖకులు చాలా*

*ఇబ్బంది పడుతూ ఉండేవారు. పింగళి వారిని సాహిత్య లోకం కవిగా భావించిందా లేదా విమర్శకులు అని భావించిందా అనే విషయం గురించి కాకర్ల వారు ఇలా అన్నారు. ‘‘లక్ష్మీ కాంతంగారు ప్రధానంగా కవులు అని కొందరు, విమర్శకులు అని కొందరు వాదిస్తూ ఉంటారు. నిజానికి వారు కవులూ, విమర్శకులు అని నా అభిప్రాయం. సృజనాత్మకమూ, విమర్శనాత్మకమూ అయిన రెండు శక్తులూ వారిలో సమరసభావంలో ఉన్నాయని నా నమ్మకం. వంలో ఉన్నాయని నా నమ్మకం. వారు కవిత్వం వ్రాస్తున్నప్పుడు వాస్తవంగా అక్కడే ఉండి చూచిన వాణ్ణి కాబట్టి వారి పద్య రచనా విధానాన్ని గురించి కొంత వివరిస్తాను.*

*మధురపండితరాజం స్వతంత్ర గ్రంథం కాదు ఆంధ్రీకరణం. వారుమూలశ్లోకం చదివేవారు; అయిదారు నిమిషాలు కళ్ళుమూసుకుని ఆలోచించేవారు. తరువాత పద్యం వ్రాయడానికి పూనుకొనేవారు. రచన అడ్డూ ఆపూ లేకుండా చకచక సాగిపోయేది. పద్యం వ్రాయడానికి ఒకటి రెండు నిమిషాలకంటె సామాన్యంగా ఎక్కువ కాలం పట్టేది కాదు. వ్రాసినతరువాత సాధారణంగా చెరుపులుగాని, దిద్దుబాట్లుగాని ఉండేవి కావు.*

*దైవభక్తి లక్ష్మీకాంతంగారు గొప్ప ఆస్తికులు; వేంకటేశ్వరస్వామిని ప్రతిదినం భక్తిశ్రద్ధలతో ఆరాధించేవారు. ‘శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే’ అనే మకుటంగల వేంకటేశ్వర స్తవాన్ని నిత్యం పఠించేవారు. వారి పూజావిధానం ముఖ్యంగా భగవంతుణ్ణి అలంకరించడానికి పరిమితమై ఉండేది. ‘అలంకారప్రియో హరిః’ విష్ణువు అలంకార ప్రియుడు కాబట్టి ఆయన్ని పుష్పాదులచేత అలంకరించడం ప్రధానం అని చెప్పేవారు’’* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, ‘మరపురాని గడియలు’ అనే వ్యాసం,1974:39,40) వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి పింగళివారికి ఆధ్యాత్మిక భావాలున్నాయని, పండితరాజము అనువాద రచన కాదని, అది స్వతంత్రానువాదంతోనే రాశారని, వేంకటేశ్వరస్వామిని నిత్యం ఆరాధించేవారని, దీనితో పాటు విష్ణువును ఏ విధంగా పూజించాలనే భక్తి రహస్యాల్ని అనుసరించారని కాకర్లవారు స్పష్టంగా విశదపరిచారు.

**6.26.10.1.5. ఆచార్య తంగిరాల సుబ్బారావుగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యబృందంలో తంగిరాల సుబ్బారావుగారు ఒకరు. సుబ్బారావుగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పింగళివారి దగ్గర చదువుకున్నారు. పింగళివారి పర్యవేక్షణలో ‘పల్నాటి వీరచరిత్ర’పై పిహెచ్.డి చేశారు. తర్వాత కాలంలో బెంగుళూరు విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ఆచార్యునిగా, శాఖాధ్యక్షులుగా పని చేశారు. జానపద సాహిత్యంలోని అనేక అంశాలపై పుస్తకాల్ని ప్రచురిస్తూ విశేషమైన పరిశోధనలు ఇప్పటికి చేస్తున్నారు. తంగిరాలవారు పింగళివారి గురించి ఇలా అన్నారు. *‘‘కాటూరి వెంకటేశ్వరరావుగారు తరచుగా మద్రాసు వెళ్ళి, ప్రముఖ భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రిగారితో మిక్కిలి స్నేహంగా ఉండేవారు. వీరి స్నేహం పింగళివారికి నచ్చేదికాదు. తమ అసంతృప్తిని ఒకసారి నా దగ్గర వెలిబుచ్చారు. పింగళి*

*లక్ష్మీకాంతంగారు కవి మాత్రమే కాదు, గొప్ప నటుడు. గురుదేవులు చెళ్ళపిళ్ళవారి ఆశీస్సులతో పాండవోద్యోగవిజయాలలో ధర్మరాజు పాత్ర వేసి, చాలా గొప్పగా మెప్పించారు. (వీరి అన్నగారు నరసయ్యగారు భీముని పాత్ర అత్యద్భుతంగా పోషించేవారట.) పింగళివారు ఇతర నాటకాలలో కూడా వివిధ నాయక పాత్రలు సమర్థవంతంగా పోషించేవారు. పింగళివారి నటనా కౌశలాన్ని గురించి ప్రశంసిస్తూ పురాణం సూరిశాస్త్రిగారు తన "నాట్యాంబుజం" అనే గ్రంథంలో ఇలా వ్రాశారు: "రసభావయుక్తముగ, నుచితమగు సంగీతముతో, శ్రవణానందముగ పద్యము చదువనేర్చినవాడు లక్ష్మీకాంతమే..... (ఇతడు) ధర్మరాజునందలి నిజస్వభావమును చక్కగా గ్రహించియున్నాడు. ధర్మరాజు గుణాభినయములో లక్ష్మీకాంతమును మించిన నటుడులేనేలేడు"* అని ( ఆచార్య పింగళి లక్ష్మీకాంతం అనే వ్యాసం, మిసిమి మాస పత్రిక, సెప్టెంబర్ 2018:83) తన గురువు పింగళి లక్ష్మీకాంతం గారి గురించి తంగిరాలవారు తెలిపారు. దీన్ని బట్టి పింగళివారు సాహిత్యంలో నటునిగా కూడా గుర్తించవచ్చని తెలుపుతూ సంగీత సాహిత్య కలయికతో పింగళివారు ప్రసిద్ధులని విశదీకరించారు.

### 6.26.10.1.6. ఆచార్య నాయని కృష్ణకుమారిగారు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్య వర్గంలో నాయని కృష్ణకుమారిగారు ఒకరు. ఈమే ఆంధ్ర విశ్వకళాపరిషత్తులో పింగళివారి దగ్గర చదువుకున్నారు. తర్వాత కాలంలో ఉస్మానియ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యులుగా, అధ్యక్షులుగా పని చేశారు. తన గురువు పట్ల తనకున్న అభిప్రాయాల్ని దీనితో పాటు పింగళివారి బోధన, పరిశోధన, విమర్శ రంగాలకు చేసిన సేవల్ని ఈ విధంగా *"లక్ష్మీకాన్తం గారిని విద్యాగురువులుగా, ప్రత్యక్షంగా నేనెరుగుదును 1948లో నేను ఆంధ్ర కళాపరిషత్తులో బి.ఏ. ఆనర్సు స్థాయి విద్యార్థినిగా చేరినప్పుడు ఆయన మాకు 'సాహిత్య చరిత్ర' లో పాఠాలు చెప్పేవారు. తెలుగుశాఖకు అప్పటి అధ్యక్షులు కూడా! గురువుగా ఆయన వ్యక్తిత్వం చాలా గంభీరమైనది. వారి మాట ధాటి కలది. మనసు వెన్న. మాటలోని దార్ఢ్యం మనసులోని మెత్తదనం, రెండూ ఆయన వ్యక్తిత్వంలో సరి సమానంగా భాసిస్తుంటాయి"* అని (రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక, 'గురుస్మరణ' అనే వ్యాసం,1994:14) తెలియజేశారు. దీన్ని బట్టి పింగళివారి వ్యక్తిత్వంలో కనిపించే సుగుణాల్ని గమనించవచ్చని ఆచార్య నాయని కృష్ణకుమారిగారు అన్న మాటలే నిదర్శనం.

### 6.26.10.1.7. శ్రీమతి పులిగడ్డ విజయలక్ష్మీగారు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్య వర్గంలో శ్రీమతి పులిగడ్డ విజయలక్ష్మీగారు ఒకరు. ఈమే శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పింగళివారి దగ్గర చదువుకున్నారు. పింగళివారు పాఠాలను ఏ విధంగా బోధించారనే విషయం గురించి విజయలక్ష్మీగారు తమ అభిప్రాయాల్ని తెలిపారు. పింగళివారు తరగతిగదిలో పాఠాన్ని ఏ విధంగా ప్రారంభిస్తారో చెబుతూ *"శూరులు*

*జన్మంబు సురల జన్మంబు, నేరుల జన్మంబు ఎఱుఁగ నగునె" From where this quotation has been taken'? అని ప్రశ్నించారు. క్లాసంతా మరికొంచెం నిశ్శబ్దంగా మారిపోయింది. నేను నెమ్మదిగా లేచి కుమార అస్త్రవిద్యా ప్రదర్శనంలో దుర్యోధనుడు భీమునితో అన్నాడని చెప్పాను. సమాధానం సరైనదని తెలిసినా పూర్తిగా బెరుకు పోలేదు. దానికర్థం చెప్పమన్నారు. వెంటనే చెప్పాను. సమాధానం పూర్తికాగానే ఉపన్యాసంలోకి దిగారు లక్ష్మీ కాంతంగారు. శూరుల జన్మను, సురల జన్మను, నదులు ఉపన జన్మను ఏ విధంగా తెలుసుకోలేమో అదే విధంగా సాహిత్యం ఎప్పటినుండి ప్రారంభించ బడిందో స్పష్టంగా చెప్పటం చాలాకష్టం. ఏ విషయాన్నైనా నిర్ణయించటానికి, సాక్ష్యాలూ ఆధారాలూ కావాలి అంటూ సాహిత్య చరిత్ర బోధనను ప్రారంభించారు. ఆ క్లాసు ఎప్పుడు పూర్తి అయిందో మాకే తెలియదు. అంతగా లీనమైపోయాము అనిర్వచనీయమైన బోధన శక్తిగల ఆయన పాఠంలో. గురువంటే ఇలా ఉండాలి. అనే గురి ఏర్పడిపోయిందా క్షణంలో, అందరూ గురు శబ్దానికి అర్హులుకారనే పరమ సత్యం అర్థమయింది. బోధన పద్ధతే గురుత్వానికి ఉత్తమ నిదర్శనం"* అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,'గురు స్మృతి' అనే వ్యాసం,1974:61)తెలియజేశారు. దీన్ని బట్టి పింగళి వారు సాహిత్య చరిత్రను బోధించేటప్పుడు తెలియని విషయం నుంచి తెలిసిన విషయం వైపు విద్యార్థుల్ని ఆకట్టుకునేలా పాఠాలు చెప్పారని పేర్కొన్నారు. దీనితో పాటు ఆయన అనుసరించిన బోధనా పద్ధతిలోని ప్రత్యేకతల్ని విజయలక్ష్మీగారు సోదాహరణంగా విశదీకరించారు.

**6.26.10.1.8. ఆచార్య జి. నాగయ్యగారు:**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో ఆచార్యునిగా పని చేశారు. అక్కడ అనేక మంది విద్యార్థులకు పాఠాలు చెబుతూ పరిశోధనలు చేయించారు. అలాంటి వారిలో ఆచార్య జి. నాగయ్యగారు ఒకరు. నాగయ్యగారు ద్విపద సాహిత్యంపై పింగళివారి పర్యవేక్షణలో పిహెచ్.డి చేశారు. అందుచేత పింగళివారికి, నాగయ్యగారికి సన్నిహితమైన బంధం ఉందని అర్థమౌతుంది. నాగయ్యగారు తర్వాత కాలంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యునిగా, అధ్యక్షుడుగా పని చేశారు. నాగయ్యగారు కూడా తెలుగు సాహిత్య చరిత్రను రచించారు. అవి 'తెలుగు సాహిత్య సమీక్ష' (1983) అనే పేరుతో రెండు సంపుటాల్ని రాసి ప్రచురించారు. దీనిలో పింగళివారి సాహిత్య చరిత్రలోని యుగ విభజన ప్రణాళికను అనుసరించారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్య చరిత్రను రాయడానికి తన ఆంధ్ర సాహిత్య చరిత్రలో కొన్ని పద్ధతుల్ని చెప్పారు. అవి కాలానుసరణ, చారిత్రక, తులనాత్మక అనే పద్ధతుల్ని ఆచార్య జి. నాగయ్యగారు తన తెలుగు సాహిత్య సమీక్ష'లో పాటించారు (చూడు – ఆచార్య జి. నాగయ్య, తెలుగు సాహిత్య సమీక్ష'–1,1983:4,5,6). దీన్ని బట్టి పింగళివారి అధ్యయన, పరిశోధన, విమర్శ, సాహిత్య చరిత్రల నిర్మాణాల్ని ఇంచుమించుగా తర్వాత తరం వారు కూడా అనుసరించారనీ స్పష్టమౌతుంది.

### 6.26.10.1.9. ఆచార్య పోణంగి శ్రీరామ అప్పారావుగారు:

పింగళివారి దగ్గరే పోణంగి శ్రీరామ అప్పారావుగారు చదువుకున్నారు. నాటి ప్రభుత్వం ఆదేశాల ప్రకారం తెలుగు అకాడమీ తరపున తెలుగు పాఠ్య గ్రంథాలలో ఉండాల్సిన భాషా విధానం గురించి తిరుపతిలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పింగళివారి కృషిని చెబుతూ *"1965 ఏప్రిల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పక్షాన శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలో లక్ష్మీ కాంతంగారి అధ్యక్షతను పాఠ్య గ్రంథాల శైలిని గూర్చి ఒక గోష్ఠి నిర్వహించాను – అపుడు నేను D.P.I. ఆఫీసులో "Special Officer for Nationalization of Text Books"గా పనిచేస్తున్నాను. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి మున్నగు ప్రముఖులు ఆ గోష్ఠిలో పాల్గొన్నారు. భాషేతర గ్రంథాలలోను (అంటే సైన్సు, లెక్కలు, సివిక్సు మొ), ద్వితీయ భాషా గ్రంథాలలోనూ శిష్ట వ్యవహారికం ఉండాలనీ, మాతృభాషా గ్రంథాలలో శిష్టవ్యవహారమునకు సన్నిహితంగా ఉండే సరళగ్రాంథికం ఉండాలనీ ఆ గోష్ఠిలో నిర్ణయమైనది. అయితే, శిష్ట వ్యావహారిక మన్నది ఎట్లా ఉండాలి? అనే సమస్య తరువాతి కాలంలో ఉత్పన్నమైనది. అప్పుడు నేను తెలుగు అకాడమి డైరక్టర్గా ఉన్నాను – విశ్వవిద్యాలయ స్థాయిలో అన్ని పాఠ్య గ్రంథాలను తెలుగు మాధ్యమంలో ప్రచురించ వలసిన బాధ్యత తెలుగు అకాడమికి అప్పగించబడింది. నాడు, మాన్యశ్రీ పి.వి. నరసింహారావుగారు తెలుగు అకాడమి అధ్యక్షులు; విద్యా విషయక స్థాయీసంఘమునకు లక్ష్మీకాంతంగారు అధ్యక్షులు. ఈ ఇరువురి ఆధ్వర్యంలో శిష్టవ్యవహారమునకు ఒక రూపం ఇవ్వటం జరిగింది"* అని ( రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక, 'బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం' అనే వ్యాసం,1994:8) అన్నారు. దీన్ని బట్టి నాటి తెలుగు భాష అమలు కోసం విద్యా విషయక స్థాయీ సంఘానికి అధ్యక్షులుగా ఆంధ్రదేశ మంతా పర్యటించి గ్రంథి వాదులను ఒప్పించి సరళ వ్యవహారిక భాషనే అమలయ్యేలా విశేషమైన సేవ చేశారు. ఈ విధంగా ఆయనకు తెలుగు భాష పట్ల ఉన్న దృక్పథం కనిపిస్తుంది.

### 6.26.10.1.10. డా. ప్రసాదరాయకులపతిగారు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యువుల్లో ప్రసాదరాయ కులపతిగారు ఒకరు. ఈయన పింగళివారి పర్యవేక్షణలో *'ఆంధ్ర భాగవతం పరామర్శ'* అనే అంశంపై ప్రసాదరాయ కులపతిగారు శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పిహెచ్. డీ పరిశోధన చేశారు. తర్వాత కాలంలో ఈయన యోగ విద్యలో ప్రయెక్తగా ప్రసిద్ధి చెందారు. ఈయన తన గురువు పింగళివారి ఆధ్యాత్మికతలో కనిపించే యోగ విద్య తీరు తెన్నుల్ని ఈ విధంగా చెప్తూ *" తిరుపతిలో వారి దగ్గర రిసెర్చుకి చేరిన సంవత్సరం సుమారు ముప్పై సంవత్సరాల క్రింద– ఒకరోజు జరిగిన సంఘటన గుర్తుకు వస్తున్నది. ఆత్మలహరి పద్యాలు కొన్ని అప్పుడప్పుడు వినిపిస్తూ ఉండేవారు. ఆ రోజు "భావంబున దలచెద" అనే పద్యం వినిపిస్తే నేను అడిగాను" మాస్టారూ! ఈ భవ్యావేశానికి హేతువైన మీ తపస్సాధన ఏ మార్గమునకు*

*సంబంధించినది? జపమా? తపమా? యోగమా?"* అని – వారు నవ్వుతూ *"తిక్కన చెప్పిన విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశమే అది. నాకు వేరే జపము తపము లేవు. సాహిత్యమే నా సాధన. కవిత్వమే యోగము. ఒక భక్తుడు తన ఇష్టదైవాన్ని స్మరించి ధ్యానించి పరవశుడై అశ్రుపాతము లేవిధంగా పొందుతాడో – మహాకవుల కవిత్వాన్ని చదివినప్పుడు నేనా స్థితి పొందుతాను. కాళిదాసు శ్లోకాన్ని స్మరిస్తే చాలు కన్నీరు కంటి వెంట బొట బొటా కారుతుంది. తిక్కన పద్యాన్ని పఠిస్తే శరీరం పులకాంకురిత మవుతుంది. పోతన పద్యాన్ని చదివితే కంఠం గద్గద మవుతుంది. మహాకవుల రచనలను సహృదయుడు చదివినప్పుడు విభావానుభావ వ్యభిచారిభావ ప్రక్రియ లేకుండానే – లేదా అసందీక్ష్య క్రమంలో అని శాస్త్రం చెపుతుందనుకో! మనస్సు సాత్త్వికస్థితిలోకి ప్రవేశిస్తుంది. అందువల్ల రసానందానుభవం వేగంగా కలుగుతుంది. ఆ స్థితిని పొందగలగడమే నా తపస్సిద్ధి. అదే నా యోగసాధన"* అని అన్నారని డా. ప్రసాదరాయకులపతిగారిని బట్టి తెలుస్తుంది. మరలా పింగళివారి యోగం గురించి చెబుతూ *"ఆ సారస్వతధ్యాన యోగం వారిని మహాచార్యుని చేసింది. సాహిత్య శాస్త్ర ప్రవచనం వారు చేసినట్లు చేయగల వారింతవరకు పుట్టలేదు. అంతటి మహోపాధ్యాయుడు ఇంకొకరు లేరు. ఆయన చెప్పే తీరు ఆయన ప్రవచన పద్ధతి అనన్యం అపూర్వం"* అని (రసజ్ఞ శిల్పి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శత జయంతి సంచిక, 'ఆత్మలహరి–ఒక పరిశీలన' అనే వ్యాసం,1994:53) అన్నారు. దీని బట్టి పింగళి లక్ష్మీకాంతంగారు దైవాన్ని కానీ, దైవానికి సంబంధించిన అంశాల పట్ల భక్తిని ప్రదర్శించేవారని అది కొన్ని సందర్భాలలో గురువును తలచుకున్నప్పుడు, యోగ ధ్యానం ద్వారా పాఠాలు చెప్పేటప్పుడు కలిగే భక్తి ద్వారా కనిపించేదనీ ప్రసాదరాయగారు సోదాహరణంగా విశదీకరించారు.

### 6.26.10.1.11. శ్రీ ఎట్టోజు మాధవాచార్యులు:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యువుల్లో శ్రీ ఎట్టోజు మాధవాచార్యులు ఒకరు. ఈయన పింగళివారికి సన్నిహితంగా ఉండేవారని పింగళి శత జయంతి సంచిక, స్మారకసంచిక ద్వారా తెలుస్తుంది. ఎట్టోజువారు పింగళివారి గుణాలను చెబుతూ *"తన విద్యార్థులకు సహాయం చేసే గుణం పింగళివారిలో కనిపించే ఒక గొప్ప గుణాన్ని ఆయన శిష్యులు ఈ విధంగా చెప్పారు "ఆచార్య శ్రీపింగళి లక్ష్మీకాంతంగారిని 1935లో నేను బి.ఎ (ఆనర్సు) చదవడానికి వాల్తేరు వెళ్ళినప్పుడు మొదటిసారి దర్శించినాను. కాని, అప్పటి యూని వర్సిటీ నియమావళి అనుమతించనందువల్ల నాడు వైనాభాన్సలరుగా ఉంటున్న జయపురము దివాను శ్రీ ఓ. పుల్లారెడ్డిగారి ఆమోదముద్రతో ఒక ప్రత్యేక సౌకర్యము కల్పించి, వారు నన్ను చేర్చు కొన్నారు. తదాది నాకు వారియందు భక్తివిశ్వాసములు వారికి నాయందు వాత్సల్యానురాగములు క్రమాభివృద్ధి చెందుతూ వచ్చినవి. మూడేళ్ళు వారి సన్నిధిలో శ్రద్ధగాచదివి యూనివర్సిటీలో ప్రథమస్థానము పొంది ఉత్తీర్ణుడనైనాను. తరువాత వారి ప్రోత్సాహమువల్ల, : ఆనాటి పరిమితావకాశములలో యూనివర్సిటీలోనే రిసెర్చి ఫెలోగాచేరి మూడేళ్లు*

కృషి చేసినాను" అని (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 'మా మాష్టరుగారు' అనే వ్యాసం,1974:32)అన్నారు. దీన్ని బట్టి పింగళివారు తన విద్యార్థులకు చదువుకోవడానికి సహాయసహకారాల్ని ఇచ్చేవారని, విద్యార్థులచేత పరిశోధనలు చేయడానికి కూడా తగిన సహకారాల్ని ఇచ్చి ప్రోత్సహించేవారని అనడానికి శ్రీ ఎఱ్ఱోజు మాధవాచార్యులుగారి మాటలే నిదర్శనం.

**6.26.10.1.12.డా. మల్లెల గురవయ్యగారు:**

పింగళివారి శిష్యుల్లో మల్లెల గురవయ్యగారు ఒకరు. ఈయన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పింగళివారి దగ్గర ఎం.ఏ చదువుకున్నారు. శ్రీ పోలూరి హనుమజ్జానకీరామశర్మగారు పింగళివారి శిష్యుడని, రామశర్మగారి శిష్యుణ్ణి గురవయ్యని గురవయ్యగారే చెప్పుకున్నారు. ఈ విధంగా పింగళివారికి గురవయ్యగారంటే అభిమానం ఉందని చెప్పవచ్చు. గురవయ్యగారు పింగళివారి వ్యక్తిత్వాన్ని గురించి చెబుతూ ఇలా అన్నారు. "*ఎం.ఏ, మొదటి సంవత్సరంలోనే పింగళి లక్ష్మీకాంతంగారు మా తరగతిలో అడుగుపెట్టగానే అనంతమైన నిశ్శబ్దత ఆవహించింది. ఆ నిశ్చలతలో ఎంతో నిర్మలత్వం, నిర్భయత్వం,నిశ్చయత్వం చోటు చేసికొనేవి. అనర్గళమైన వారి ఉపన్యాసం దానినుండి అప్పుడే భువికి దిగివచ్చిన గంగాఝురివలె ఉవ్వెత్తున సంతోషసాగరములో మిమ్మల్ని ముంచెత్తేది. సాహిత్య రూపాన్ని, దాని పుట్టుపూర్వోత్తరాల్ని చర్చిస్తూ 'నది పుట్టుకను గురించి నన్నయ్య ఏమన్నాడోయ్' అని ప్రత్యేకించి నన్ను అడగ్గానే నేను వెంటనే "సూరుల జన్మంబు సురల జన్మంబును నేరుల జన్మంబు నెరుగనగునె" అని చెప్పడంతో సెబాస్ అని ప్రశంసించడం ఈ నాటికీ స్మృతి పథంలో తారాపదూతూనే ఉంది. దూరంగా ఉన్నప్పుడు వారెంత గంభీరంగా ఉండేవారో, చనువుతో సన్నిహితమైనప్పుడు అంత ఆత్మీయతనూ, ఆప్యాయతనూ, అవ్యాజమైన వాత్సల్యాన్ని విమర్శించేవారు. వారి శిష్య వాత్సల్యం అనుభవించాల్సిందేగాని వివరించడానికి మాటలు చాలవు. ఒక సందర్భంలో నేను వారింటికి నిమ్మ పండ్లు తీసుకొని పోయాను ? దూరంగానే ఏమిటది అలా చేయకూడదు అని మహా గంభీరంగా భయచకితుణ్ణియ్యేటట్లు గర్జించారు. కానీ అంతలోనే అభయముద్ర వహిస్తూ ప్రేమామృత వర్షాన్ని హర్షింతో ప్రసరింపజేసారు. నేను అప్పుడప్పుడు పింగళి వారిని కలిసికొనేవాణ్ణి. వారెంతో సన్నిహితంగా చేరదీసి ఎన్నో సాహిత్య మర్మాలు విప్పి చెప్పేవారు*" అని జి. విశ్వనాథ నాయుడుగారు ('పింగళి లక్ష్మీకాంతముగారి వ్యక్తిత్వము-సాహిత్యము', పిహెచ్.డి అముద్రిత సిద్ధాంత గ్రంథం,1991:115) అన్నారు. దీన్ని బట్టి పింగళివారు తన విద్యార్థులతో సన్నిహితంగా ఉండేవారని ఆయన నడకలో, మాటల్లో గంభీరం ఉన్నా తొందరగానే విద్యార్థులను ప్రేమతో దగ్గరకు తీసుకొనేవారని, ఆయన సుగుణాలను తెలపడానికి మాటలు సరిపోవని మల్లెల గురవయ్యగారు వ్యాఖ్యానించడమే నిదర్శనం.

ఈ విధంగా భారతీయ జీవన విధానంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు గొప్పగా గురువు పాత్రను పోషించారు. తెలుగు సాహిత్య చరిత్రకు, సాహిత్య విమర్శకు, విశ్వవిద్యాలయ స్థాయిలో ఎవరికి అందనంత ఎత్తులో పయనించడం ఆయనకు ఆయనే సాటి. ఈ మార్గాన్ని ఆయన అనంతరం ఆయన శిష్యవులే ఇంచుమించు అనుసరించడంలో ఓకింతా సఫలమయ్యారని కొంతవరకు కనిపిస్తుంది. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి బోధనలో కనిపించే విశేషాల్ని ఆయన శిష్యవుల్లో ఒకరైన శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావుగారు చెప్పిన పద్యాలతో ముగిస్తే సముచితమని తెలియజేస్తున్నాను. *“ఎందరొ విద్యాగురువరు*

*లెందరొ సాహిత్య మర్మ హితబోధకు లా*

*యందరిలో లక్ష్మీకాం*

*తుం దలచి ఘటింతు కేలుదోయిం దలపై ”*

*“ ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య పద్ధతులను*

*మేలవించి, విమర్శ పథాల జూపె*

*ఆంధ్ర వాఙ్మయ చరితంబు నవలనెవరు*

*చెప్పి, వ్రాసింది నది గురూచ్ఛిష్టమె కద ”*

(ఆచార్యపింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక,1974:48)

*“ తిరుపతి వేంకటేశ్వరుల సారస్వత*

*జైత్రయాత్రల ఛాత్ర సమితియందు*

*మారుతిపై యుగ్మ ధోరణి పద్యముల్*

*పలికించి ‘కాటూరి’ చెలిమియందు*

*ప్రాచ్చ భాషాధ్యక్ష పదవి గైకొని యాంధ్ర*

*విశ్వవిద్యాలయ వేదియందు*

*అఖిల భారత నియుక్తాకాశవాణిక*

*సాహితీ దేశికాస్థానమందు*

*ఏ మహా వాక్కు వినుచుట నెసగె నీకె*

*ఈ యుగాచార్య విఖ్యాతి ఆ యమోఘ*

*శాస్త్ర సంస్కృత శిష్య సంసార దేయ*

*శబ్ద సుందరవాణి కంజలి ఘటింతు ”* (ఆచార్యపింగళి లక్ష్మీకాంతం స్మారకసంచిక,1974:74) అని ‘దిగుమర్తి సీతారామస్వామిగారు’ పింగళివారికి ‘గురుపూజ మహోత్సవం’ చేసిన సందర్భంలో చెప్పిన పద్యమిది. ఈ పద్యంలో పింగళివారి గురుభక్తి తత్పరతను వెరసి తనకు ఛందోబద్ధమైన పద్యవిద్యను ప్రసాదించమని శ్రీ ఆంజనేయస్వామిని ప్రార్థించడాన్నీ, కాటూరివారి యడల చూపిన మిత్రవాత్సల్యాన్నీ, తనకు అధ్యాపక జీవితాన్నిచ్చినా ఆంధ్ర

విశ్వకళాపరిషత్తు విజయవాడ ఆకాశవాణి రేడియో కేంద్రాల ఔనత్యాల్ని, సంస్కృత భాష పాండిత్యాన్నీ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇచ్చిన ఆచార్యత్త్వం, వెరసి అఖిలాంధ్రాలో వ్యాపించిన తన శిష్యులను స్ఫురింపజేసేలా పింగళివారి జీవిత మర్మాల్ని 'దిగుమర్తి సీతారామస్వామిగారు' గొప్ప ధ్వనిని ప్రదర్శించారని అర్థమౌతుంది.

పరిశోధన ఒక నిరంతర సాధన. పరిశోధన ఒక నిరంతర అన్వేషణ. తన జీవితకాలంలో నిజమైన పరిశోధన ఎవరూ కూడా తాను సమగ్రంగా అన్ని పరిశోధనలు చేశానని చెప్పుకోరు. పింగళి లక్ష్మీకాంతంగారు చేసిన పరిశోధన కూడా ఆయన రాసిన సాహిత్య చరిత్ర పరిశోధన పరంగా చూసినప్పుడు గొప్ప పరిశోధనాగా కనిపిస్తుంది. విమర్శ పరంగా చూసినప్పుడు అనేక కావ్యాల విలువ మూల్యాంకనలు కనిపిస్తాయి. సాహిత్యంలోనూ విమర్శలోనూ ఆయన పాటించిన పద్ధతులు తర్వాత తరం వాళ్లు అందుకోవడానికి వాటిని మరింత అభివృద్ధి చేయడానికి ఎంతగానో దోహదపడ్డాయి. అందుకనే ఆయన తర్వాత మంచి నేటి వరకు వచ్చిన సాహిత్య చరిత్రలు, విమర్శలు, విమర్శ గ్రంథాలు వంటి వీటన్నింటిలోనూ పింగళి లక్ష్మీకాంతంగారిని ప్రస్తావించారు. సాహిత్య చరిత్ర నిర్మాణంలో కూడా కవుల పరంగా, సాహిత్య పోషకులపరంగా, యుగ పరిణామాల పరంగా రకరకాల విభాగాలు చేసినప్పటికీ కాంతం గారి యుగ విభజనను తప్పకుండా ప్రస్తావించాలి. ఇవన్నీ ఆయన విమర్శనాత్మక పరిశోధనకు, పరిశోధనాత్మక విమర్శకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. వీటన్నింటినీ ఈ అధ్యాయంలో నా సామర్థ్యం మేరకు విశ్లేషించాను.

ఆచార్య జి.వి సుబ్రహ్మణ్యం గారు 'పరిశోధన దిక్సూచి' పేరుతో ఆచార్య వెలుదండు నిత్యానంద రావుగారు ప్రచురించిన విశ్వవిద్యాలయంలో తెలుగు పరిశోధన గ్రంథానికి ముందుమాట రాస్తూ ఇలా అన్నారు. *''పరిశోధనజీవితంలో అన్వేషణ ఆగనిది, తార్కిక అనుమానం ఆగనివ్వనిది. విమర్శలాగానే పరిశోధన కూడా ఒక ప్రత్యేక ప్రక్రియగా గుర్తింపబడింది. పరిశోధన ఒక కల్పవృక్షం. దానికి తార్కిక అనుమానం మూలం అన్వేషణ స్కంధం ప్రయోగాలు శాఖలు, సమన్వయాలు ఆకులు, దృక్పథాలు కుసుమాలు, సిద్ధాంతాలు ఫలాలు, సూచులు పాదులు, సామగ్రులు ఎరువులు, చిత్తశుద్ధి నీరు. పరిశోధన సంస్థలు నందనోద్యానాలు. పండ్లు పండించేవాడు ఎంత ముఖ్యమో పరిశోధన కల్పవృక్షానికి పాదులుచేసి, ఎరువులు వేసి, నీరుపట్టేవాడు అంత ముఖ్యం''* (వెలుదండ నిత్యానందరావు, 2013:460) ఈ అభిప్రాయం తొలి తరం తెలుగు పరిశోధకులలో పింగళి లక్ష్మీకాంతం గారికి బాగా వర్తిస్తుందని ఈ పరిశోధన ఆయన పరిశోధన గురించి పరిశీలించిన తర్వాత నాకు అనిపించింది. అందువల్ల ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి పరిశోధన ఒక నిరంతర నిమిషం ఆయనపై ఆయన ప్రతిపాదించిన అంశాలు కూడా నిరంతర పరిశోధనకి అవకాశం ఉన్నవే అని నా అభిప్రాయం.

రాబోయే అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతం గారి అనువాద కృషిని వివరిస్తాను.

ఏడవ అధ్యాయం

# అనువాదకుడుగా పింగళి లక్ష్మీకాంతం

## 7.0. ఆంగ్ల నవలానువాదకునిగా లక్ష్మీకాంతం:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి పేరు చెప్పగానే వినగానే ఆయన ఒక విమర్శకుడు, పరిశోధకుడు, అధ్యాపకుడిగా మాత్రమే ఎక్కువ మంది గుర్తిస్తారు. ఆయన ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాలను లోతుగా అధ్యయనం చేశారు.తెలుగు సాహిత్యవిమర్శపై ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాల సమన్వయంతో రాసిన తొలితరం విమర్శకుడుగా కూడా ఆచార్య పింగళి లక్ష్మీకాంతం తనదైన ముద్ర వేశారని ఇంతకుముందు అధ్యాయాల్లో వివరించాను. ఈ అధ్యాయంలో ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి నవలానువాదాన్ని పరిచయం చేస్తాను.

తొలితరం తెలుగు చదివేవాళ్ళు ఆంగ్ల సాహిత్యాన్ని చదవడంతో పాటు, ఇంగ్లీష్ మీడియంలోను చదవాల్సి వచ్చేది. అది ఆ నాటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆ విద్యార్థులు తొలితరం అధ్యాపకులుగా తమ వృత్తిని ఎన్నుకున్న వాళ్ళ వల్ల తెలుగు సాహిత్యాన్ని శాస్త్రీయ పంథాలో పయనింపజేయడానికి ఎంతగానో ఉపయోగపడింది. ఆచార్య పింగళి వారికి గల ఆ ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానం వల్ల ఆయన కొన్ని సాహిత్యేతర రచనలు, నవలలు తెలుగులోకి అనువదించారు. కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోరికపై మహాత్మాగాంధీ సూక్తుల సంకలనం *''All Men Brothers''* అనే గ్రంథాన్ని తెలుగు భాషలోకి ''మానవులందరూ సోదరులు'' అనే పేరుతో అనువాదం చేశాడు. దీన్ని 1964 సంవత్సరంలో కేంద్ర సాహిత్య అకాడమీ వారు ప్రచురించారు. ఆంగ్ల రచయిత L.G.Brakdak అనే పేరుని తెలుగులో ఎల్.జి. బ్రెండన్ గా పుస్తకంలో ముద్రించారు. ఈయన ఒక ఉపాధ్యాయుడు. ఈయన ఇంగ్లీషులో *History of British* అనే పేరుతో ఈ గ్రంథాన్ని రచించారు. దీన్ని పింగళి లక్ష్మీకాంతం గారు ***ఆంగ్ల దేశ చరిత్ర*** (1931) అనే పేరుతో అనువదించి ప్రచురించారు.

## 7.1 మాబీడిక్ నవల – పింగళి లక్ష్మీకాంతం అనువాదం:

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు ప్రసిద్ధ అమెరికన్ ఆంగ్ల నవలా రచయిత హెర్మన్ మెల్వవిల్లే (Herman Melville) (1819–1891) రాసిన ఆంగ్ల నవల Moby–Dic ని తెలుగులో 'మాబీడిక్' పేరుతో అనువదించారు. ఈ నవలకు 'The Whale, The white Whale' అనే పేర్లు కూడా ఉన్నాయి. దీన్ని ప్రసిద్ధ నవలా రచయిత డి.హెచ్. లారెన్స్ ప్రపంచ నవలా సాహిత్యంలో ఒక గొప్ప అద్భుతమైన నవలగా వ్యాఖ్యానించారు. తొలుత దీన్ని 1851లో లండన్ లోని రిచర్డ్ బెంట్లీ మూడు సంపుటాలుగా ప్రచురించారు. అప్పుడది సుమారు వెయ్యి పుటలకు పైగానే ఉంది. తర్వాత అమెరికన్ ప్రచురణ సంస్థ 635 పుటల్లో ఒకే పుస్తకంగా ప్రచురించారు. కానీ దీన్ని అనేకసార్లు ప్రచురించారు. ఇది 20 వ శతాబ్ది నాటికి ఒక గొప్ప నవలగా ప్రాచుర్యం పొందింది. ఆంగ్ల

సాహిత్యంలో సాహసోపేతమైన చర్యల్ని వర్ణిస్తూ వచ్చిన నవలల విభాగంలో దీన్నొక ముఖ్యమైన పుస్తకం సాహితీవేత్త భావిస్తారు.

హెర్మన్ మెల్విల్లే ఒకప్పుడు ఒక సాధారణ నావికుడు జీవించిన అనుభవం ఈ నవలా రచనకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయనకు సుమారు నాలుగు సంవత్సరాల (1841 నుండి 1844) నావికుడిగా అనుభవం ఉంది. ఈ నవల రాసే ముందు సముద్ర సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసి, సుమారు 18 నెలల పాటు ఈ నవలను హెర్మన్ మెల్విల్లే రాశారు.

పింగళి లక్ష్మీకాంతంగారు 'మాబీడిక్' నవలను 1964లో తన అనువాదాన్ని పూర్తి చేశారు. దీన్ని క్లాసిక్ బుక్స్ విజయవాడ వారు మే 2021 సంవత్సరంలో మరలాప్రచురించారు. మూలంలో ఉన్న కథను యథాతథంగా కాకుండా కొన్ని ముఖ్యమైన వాటిని తప్ప వాటిని సార సంగ్రహంగా అనువాదం చేశారు. అయినప్పటికీ నవలా అధ్యాంతం ఆసక్తిగా చదివిస్తుంది. సుమారు 240 పుటల్లో ఈ నవల 85 ఉప శీర్షికలుగా చదవడానికి అనుకూలంగా ఉప శీర్షికలను పెట్టారు. సముద్రాన్ని మానవ జీవిత అన్వేషణ స్థలంగా భావిస్తే మానవుడి యొక్క సుఖ దుఃఖాలు, రాగద్వేషాలు వాటిని అన్వేషించడం తాను అనుకున్నది ఒకటైతే ఒక్కోసారి మరొకటి జరగడం ఇలా జీవితం తనకు తెలియని గమ్యానికి తీసుకుపోవడం అనే అనుభవాన్ని ఈ నవల కలిగిస్తుంది.

### 7.1.1 మాబీడిక్ నవలా వస్తువు:

ఈ నవలకు సంబంధించిన వస్తువుని అనువాదకుడు పింగళి లక్ష్మీకాంతంగారు సంక్షిప్తంగా ముందుగానే చెప్పారు. *"అమెరికాలో 19 శతాబ్దానికి పూర్వార్థంలో తిమింగలాలు వేట ఒక పెద్ద పరిశ్రమగా ఉండేది. ఆ వ్యాపారం చేసే వాళ్ళు ఈ భూమండలంలో ఉన్న మహా సముద్రాలన్నింటినీ కలయతిరిగి తిమింగలాలను వేటాడే వాటి నుండి లభించే నూనెను అమ్ముకుంటూ ఉండేవారు. ఆ రోజుల్లో దాని కోసం ఓడలు తీసుకుని సముద్రాల మీద అనేక నెలలు, సంవత్సరాలు ప్రయాణం చేయవలసి వచ్చేది. అది చాలా ప్రమాదమనీ తెలిసిన దాన్ని ఎదుర్కొంటు తమ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నించే వాళ్ళు సాహసాలు తెలుసుకోవడానికి ఈ నవల ఉపయోగపడుతుంది. ఈ నవల తిమింగలాల వేటకు సంబంధించిన ఇతివృత్తం అయినప్పటికీ కేవలం దానికే పరిమితం కాకుండా సముద్ర వేటలోని అనేక ఒడుదుడుకులను చిత్రిస్తూనే దాన్ని ఆధారంగా చేసుకుని జీవిత అన్వేషణను స్ఫురించేలా రాయడం ఈ నవలలోని వస్తు ప్రత్యేకత. ఈ నవలలో 'అహబ్' అనే ఒక ప్రధాన పాత్ర.అతడు సముద్ర వేటలో ఒకసారి ఒక తిమింగలం వల్ల తన కాలును పోగొట్టుకుంటాడు. ఆ కాలు పోవడానికి కారణమైన తిమింగలం పేరే 'మాబీడిక్'. అందువల్ల దాన్ని పట్టుకోవాలనీ సముద్రాల్లో వేట మొదలు పెడతాడు. మాబీడిక్ తన కాలు తినేసిన దానికి ప్రతీకారంగా దాన్ని చంపాలనుకుంటాడు. మొత్తం మీద అనేక కష్ట నష్టాలకు గురైనా ఆ తిమింగలాన్నీ పట్టుకుంటాడు. అది అహబ్ ని*

*ప్రతిఘటిస్తుంది. దాన్ని బంధించాలనీ ప్రయత్నిస్తాడు. దాన్ని చంపాలనుకుంటాడు. కానీ ఆ తిమింగలమే అతణ్ణి చంపేస్తుంది. ఈ కథంతా తన అనుచరుల్లో ఒక్కడైనా 'ఇస్మాయిల్' ఈ కథనంతా చెబుతాడు. ఈ సముద్రాలలో తిరిగిన తిమింగలాల వేటను అమెరికా అధ్యక్షుడి కోసం జరిగే పోటీతో పోల్చుస్తాడు రచయిత. అహబ్ తన ప్రయాణంలో అనేక తిమింగలాలను చంపినా కానీ మాబీడిక్ ను పట్టుకొనేదాకా అతని అహం చల్లారలేదు. ఒక సందర్భంలో ఇస్మాయిల్ ద్వారా కొన్ని జీవిత సత్యాలను ఆవిష్కరిస్తాడు రచయిత. "అందరిని సమం చేసి అందరికి ఒకే మాదిరిగానే అంత్య కాలంలో సాక్షాత్కరించే మృత్యువు యొక్క ఆగమనం గురించి రచయిత తప్ప బతికి ఉన్న వాడెవుడూ సంతృప్తికరంగా వివరించలేదు. మృత్యువు అంటే మనకు తెలియని లోకానికి తీసుకునిపోయె సాధనమే కదా"* అని పింగళి లక్ష్మీకాంతం(మాబిడీక్,2021:372,373) అని అంటాడు.

దీన్ని బట్టి ఈ నవలలో భౌతికంగా తిమింగలాల వేట కనిపించినా మానవుడిలోని అనేక సమస్యల్ని పరిష్కరించుకునేటట్లూ తన లక్ష్యాలకు చేసుకోవాలనుకునే సంఘర్షణాత్మక పయనం మనకు స్ఫురిస్తుంది. జీవిత అనుభవాలు జీవితం పట్ల ఒక స్పష్టత నిలుస్తుంది. ప్రతి మానవుడు తాను ఏదో ఒకటి సాధించాలనే ఏదోక లక్ష్యంతో ఉంటాడు. కొన్ని సార్లు ఆ లక్ష్యాన్ని కొంత మంది చేరుకుంటారు. మరి కొంత మంది చేరుకున్నట్టే చేరుకొని వైఫల్యాలకు గురి అవుతారు. కొంత మంది ఎన్ని లక్ష్యాలను సాధించినా తనకు అత్యంత ఇష్టమైన లక్ష్యానికి చేరుకోకపోతే అసంతృప్తికి లోనవుతూ ఉంటాడు. అది ప్రతి మనిషి జీవిత పర్యంతం కనిపించే ఒక తాత్త్విక సత్యం. అహబ్ లో ఈ మనస్తత్వమే కనిపిస్తుంది. ఇటువంటి అన్వేషణే వాస్తవిక జీవితాలకి ఆకర్షణీయమవుతుంది. అందుకనే పింగళి లక్ష్మీకాంతం గారికి ఈ నవల ఆకర్షితమైంది. అది ఎంత పెద్ద నవలా అయినప్పటికీ తాను చదివి పడేయకుండా దానిలోని తాత్త్విక సత్యాలను ప్రజలకు అందించాలనే తపన ఈ నవలను అనువాదం చేసేలా చేసిందనీ భావించవచ్చు.

నా పరిశోధన ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితాన్ని, రచనలను సమగ్రంగా పరిశీలించడమే నా పరిశోధక ప్రధాన లక్ష్యం. కనుక ఆ నవల అనువాద విధానం, నవలా శిల్ప కథాంశాలను, అనువాద రచయిత జీవిత అనుభవాలను సమన్వయం చేస్తూ ఈ పరిశోధన కొనసాగడం లేదనీ గమనించాలి. అందువల్ల ఈ నవల పరిచయాన్ని మాత్రమే ఈ పరిశోధనలో తెలియజేస్తున్నాను.

అయినప్పటికీ పూర్వ పరిశోధకులు చెప్పిన కొన్ని అంశాలను కూడా ఇక్కడ ఉదహరిస్తున్నాను. *"నిరంతరము మానవునిలో జరుగు అంతర్యుద్ధమును అహబ్ పాత్ర అహంకారమునకు ప్రతీకగా చిత్రించిన బడినది. ప్రతీకార బుద్ధితో అతడు ప్రతిజ్ఞాపూర్వకముగా సాగించిన ప్రయత్నములు తుదకు విధి వైపరీత్యముచే ఎదురు తిరిగి స్వీయ వినాశమునకే దారి తీసిన వృత్తాంత మిందు కన్నులకు కట్టినట్లు చిత్రింపబడినది. విధి అనుల్లంఘనీయమను పరమసత్యము. చిత్ర*

*విచిత్ర సన్నివేశములతో అద్భుత వీరరస సమ్మిశ్రమగు కథా కథన పద్ధతిలో మహాద్ధతముగా సాగినది. అందందు సందర్భవశమున జీవన సాగరమునందెదుర్కొన కష్ట పరంపరలు, పర్వతసదృశములైన తిమింగలములు బారి నుండి తప్పించుకొని తన శక్తి సామర్థ్యములు తెలియక అసమాన ధైర్య శౌర్యములతో వానిని మట్టుపెట్టదలచు సన్నిహములలో తుదకు తానే అసువులు బాసిన పరిస్థితులు, చక్కగా వివరింపబడినవి.*

*మహాసాగరమున సాగిన ఈ ఇతివృత్తము మానవుని మానోమయ జగత్తులో జరిగిన అంతస్సంఘర్షణకు అపురూపమైన ప్రతిరూపమనుట యధార్థము. క్రైస్తవ మత పరముగా నిందలి కొన్ని పాత్రలు కల్పింపబడినవి. కావున ఈ నవల సాంధ్యవసాయ సరణిలో సాగిన ఆధ్యాత్మిక నవల యనుట నిస్సంశయము"* అని జి. విశ్వనాథ నాయుడు (*పింగళి లక్ష్మీకాంతం గారి వ్యక్తిత్వం – సాహిత్యం,* పిహెచ్.డి అముద్రిత సిద్ధాంత గ్రంథం, 1991:317) వ్యాఖ్యానించారు.

### 7.2 బగ్ జార్గల్ ఆంగ్ల నవలానువాదం:

బగ్ జార్గల్ ఆంగ్ల నవలను ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు గార్లు జంట కవిత్వంగా తెలుగులోకి అనువాదం చేశారు. ఈ బగ్ జార్గల్ నవలను 1929 సంవత్సరం లో మొదటిసారిగా ముద్రించారు. ముద్రణ 1967 సంవత్సరంలో పునర్ముద్రణగా వెలువడింది.

### 7.2.1 నవల నేపథ్యం:

ప్రపంచ ప్రఖ్యాత నవలా రచయిత విక్టర్ హ్యూగో (Victor-Marie Hugo 1802–1885) రాసిన ***బగ్ జార్గల్ (Bug-Jar gal)*** అనే ఆంగ్ల నవలను పింగళి–కాటూరి కవులు జంటగా అనువదించారు. ప్రసిద్ధ ఫ్రెంచ్ కవి, నాటక రచయిత, నవలా రచయిత విక్టర్ హ్యూగో (Victor Hugo 1802–1885) ఆంగ్లంలో బగ్ జార్గల్(1826) అనే నవలను రాశారు. ఈ బగ్ జార్గల్ నవలను 1929 సంవత్సరంలో తెలుగులోకి అనువాదం చేశారు.

### 7.3. నవలావస్తువు:

బగ్ జార్గల్ నవలకు ఎన్నుకున్న వస్తువు వెస్ట్ ఇండీస్ దీవుల్లో ఒకటైన డామింగో నగరంలో నిగ్రోలకు, శ్వేతజాతులకు మధ్య జరిగిన వర్ణ సంఘర్షణలు ఏవిధంగా జరిగాయో ఈ నవలలో రచయిత చిత్రించారు. నీగ్రోలు బానిసలు, పాలించబడేవారు, శ్వేత జాతీయులు పాలించేవారు. శ్వేతజాతీయులు నిగ్రోలను తమ అరటి, తేయాకు తోటల్లో వ్యవసాయ భూముల్లో వ్యాపారాలు కోసం, అక్రమంగా, అన్యాయంగా, హింసిస్తూ నీగ్రోలను బానిసలుగా పోషించేవారు. ఈ నేపథ్యంలో నిగ్రోజాతులు తమ హక్కులకోసం, స్వేచ్ఛ,సమానత్వం,బానిస విముక్తి కోసం పోరాటాలు చేస్తూ తమ అస్తిత్వాన్ని ఏ విధంగా కాపాడుకున్నారో ఈ నవలలో రచయిత చిత్రించారు.

### 7.4. బగ్ జార్గల్ కథా సారాంశం:

బగ్ జార్గల్ నవలోని కథా కథనం యాభై మూడు భాగాలుగా(ఎపిసోడ్స్) రూపంలో కొనసాగుతుంది. బగ్ జార్గల్ నీగ్రో యువరాజు. లియోపాల్డ్ అవర్నీ ఫ్రాన్స్ దేశానికి చెందిన ఒక భూస్వామ్య కుటుంబానికి చెందిన వాడు. అంతేకాకుండా ఫ్రాన్స్ దేశానికి సైనిక బలగాలకు కెప్టెన్ హోదాలో అవర్నీ ఆఫ్రికా, స్పెయిన్,ఇటలీ మొదలైన దేశాలను సందర్శించాడు. వెస్ట్ ఇండీస్ దీవుల్లో ఒకటైన డామింగో ద్వీపం లో 'గాలిఫట్' నగరం దగ్గరలో 'అకల్' మైదానంలో అవర్నీ మేనమామ పెద్ద భూస్వామ్య యజమానిగా జీవిస్తూంటాడు. ఇతని ఎస్టేట్ లో దాదాపు వెయ్యి మంది నీగ్రోలు బానిసలుగా పనిచేస్తుంటారు. ఇతనికి ఒక కూతురు ఉంది. ఈమె పేరు మేరీ. అవర్నీ చిన్నతనం నుంచీ మేనమామ ఇంట్లోనే పెరిగి పెద్దవాడయ్యాడు.అవర్నీ మేరీలకు వివాహ నిశ్చితార్థం జరుగుతుంది. ఈ నేపథ్యంలో నీగ్రోలు విప్లవాన్ని సృష్టించిఅవర్నీమేనమామను చంపి మేరీని అపహరిస్తారు. అవర్నీ అక్కడ నుంచి వెళ్ళిపోయి ఒక సైనిక శిబిరంలో చేరతాడు. అ శిబిరంలో హెన్రీ,పాస్కల్,అల్ ఫ్రెండ్, తాడ్యూస్ అనేవారు తన తోటి సైనికులుగా ఉంటారు. వీరంతా అవర్నీ పట్ల సహృదయంతో మెలుగుతుంటారు. ఈ క్రమంలో తాడ్యూస్ అవర్నీ జీవిత నేపథ్యాన్ని చెప్పమని ఎంతో కుతూహలంతో అడుగుతాడు. 'అవర్నీ' తన జీవిత గాథను చెప్పే సందర్భంలో తాను ఎలాంటి అవరోధాలను అధిగమించాడో చెప్తూ అందులో ప్రధానంగా నీగ్రో యువరాజు 'బగ్ జార్గల్' యొక్క ఉదారమానవ స్వభావ జీవితాన్ని కూడా జోడించి విచారకరమైన హృదయంతో మమేకమై వివరిస్తాడు.

నా మామ ప్రతిరోజు ఎస్టేట్ కు వెళ్తాడు. అక్కడ పనిచేస్తున్న నీగ్రో బానిసల పనితీరును గమనిస్తుంటారు. నా మామకు తోడుగా ఒక విదూషకుడు ఉంటాడు. అతని పేరు హెబిబ్రా చూడడానికి మరుగుజ్జు రూపంలో ఉంటూ చూపరులకు నువ్వును తెప్పిస్తాడు. ఎస్టేట్ లో ఒక బానిస అలసి ఒక చెట్టు కింద నిద్రపోతుంటాడు. దీన్ని గమనించిన నా మామ ఒక్కసారిగా ఆ బానిసను భయాందోలనకు గురిచేసి తన చేతిలో ఉన్న తాడుతో కొట్టడానికి ప్రయత్నించినప్పుడు చెట్ల పొదల్లో నుంచి ఇంకోక బానిస అడ్డుకుంటారు. దీనితో ఆగ్రహించిన యజమాని అతన్ని కారాగారంలో బంధించమని అజ్ఞాపిస్తాడు. అతను ఎవరో కాదు పీరట్ అనబడే బగ్ జార్గల్ మారు పేరుతో బానిసల కోసం ఎంతటి కార్యానైనా ఎదుర్కోనే ధీరుడు. పీరట్ ఒక కుక్క ను పెంచుతాడు. ఆ కుక్క పేరు రాస్కా. అంతకుముందే మేరీని రెండుసార్లు ప్రాణాపాయం నుంచి కాపాడతాడు. ఈ విషయం తెలియని మేరి తండ్రి పీరట్ ను కారాగారంలో బంధిస్తాడు. అవర్నీ తన మామ నిద్రపోతున్నప్పుడు రహస్యంగా కారాగారానికి వెళ్లి పీరట్ ను క్షమించమని కోరేవాడు. అదే సమయంలో పీరట్ కు రహస్యంగా ఉత్తరాలు వచ్చేవి.ఈ ఉత్తరాలు విషయాన్నీ అవర్నీ తన మామకు చెప్పడు. అయితే ఆగస్టు ఇరవై రెండు నాటికి ముందే అకల్ నగరాన్ని వదిలి పెట్టి మీ కుటుంబం మొత్తం ఎక్కడికైన వెళ్ళమని పీరట్ అవర్నీని హెచ్చరించాడు.దీన్ని

అవర్నీ పట్టించుకోడు.అవర్నీ,మేరి వివాహాలు కోసం ఏర్పాట్లు చేస్తారు.వివాహ శుభ సందర్భంగా మేరి తన తండ్రితో పీరట్ కు క్షమాభిక్ష ఇవ్వమని కోరుతుంది.కూతురి కోరికను కాదనలేక ఒప్పుకుంటాడు.ఈ సంతోషకర విషయాన్ని మేరి అవర్నీ కి చెప్తుతుంది. అందర్నీ సంతోషించి కారాగారంలో ఉన్న పీరట్ కు ఈ విషయాన్ని చెప్పడానికి వెళ్తాడు. అప్పటికే పీరట్ జైలు నుంచి రహస్యంగా వెళ్ళిపోతాడు.

మేరితో నా వివాహం 1791 ఆగస్టు 22 న అకల్ నగరంలోని ఒక చర్చి లో జరుగుతుంది. ఆరోజు రాత్రి సమయంలో అంకుల్ నగరానికి దూరాన నీగ్రో బానిసలు విప్లవ జ్వాలలను వెలిగిస్తారు. బానిస విప్లవాన్ని గమనించిన సైనికులు అవర్నీకు తెలియజేశారు.అవర్నీ అంకుల్ నగర గవర్నర్ కు చెప్పి తన ఎస్టేట్ భవనానికి కొంతమంది సైనికులను కాపలకాయమని తన మామ అనుమతితో స్వతంత్రంగా సైన్యాలను తీసుకుని కోట అవతలివైపుకువెళ్తాడు.అప్పటికే తన మామ ఎస్టేట్ లో ఉన్న తోటలు, వ్యవసాయ పొలాలు, నీగ్రో బానిసలగూడేములు అగ్నిప్రమాదానికి గురౌతాయి. అంకుల్ నగర గవర్నర్ అత్యవసరంగా రాష్ట్ర సభ సభ్యులను సమావేశపరిచి విప్లవ స్థితిని చర్చించారు.అయితే నీగ్రో బానిసల తరపున కొందరు నాయకులు, రాష్ట్ర సభలో పెద్దల మధ్యలో వాదోపవాదాలు జరుగుతాయి.ఈ వాదాలలో ఒకరు మాట్లాడుతూ సంకరులకు ఆయుధాలను ఇస్తే బానిసలతో పోరాడతారని అంటాడు.ఇంకరు మాట్లాడుతూ ఈ సంకరుల,బానిసల వలనే ఈ విప్లవం జరుగుతోందని వాపోయాడు.ఇంతకు ముందే ఫ్రాన్సు దేశంలో ఇలాంటి సంకరులు, గిరిజనబానిసలు, ఆంగ్లబానిసల వలనే మహా విప్లవం సంభవించిందని దాని మరొకరు గతాన్ని గుర్తుకు తెస్తాడు.ఇంకరు మాట్లాడుతూ *“ ఏ ప్రభుత్వమైన చిరస్థాయికావలెనన్న, దారుణం దండనీతి ప్రయోగమవసరము. మనం మీ నీగ్రోలకు దానిని చవిచూపవలెను ”* అని (బగ్ జార్గల్1929:62 ) వాదిస్తాడు.

### 7.5 విక్టర్ హ్యూగో విశిష్టత:

విక్టర్ హ్యూగో 19 వ శతాబ్దానికి చెందిన కవి. హ్యూగో ప్రధానంగా నవలాకారుడు,కథకుడు, విమర్శకుడు, సృజనాత్మక రచయితగా కూడా ప్రసిద్ధ చెందిన ఫ్రెంచ్ రచయిత. హ్యూగో 1802 ఫిబ్రవరి 26 న బెసనాన్లో జనరల్ లిమోపోల్డ్ హ్యూగో కుటుంబంలో జన్మించాడు.హ్యూగో తండ్రి వడ్రంగి మాస్టర్ గా పేరు తెచ్చుకున్నాడు. నెపోలియన్ పాలనలో అనేక జనరల్ హోదాగా పదవులను అలంకరించాడు. హ్యూగో తల్లి నెపోలియన్ బోనాపార్టిని వ్యతిరేకించింది.హ్యూగో కుటుంబం తరచు ప్రదేశాలు ఒక దేశం నుండి మరో దేశానికి వెళ్లాల్సిన స్థితి ఏర్పడింది.హ్యూగో తన కవితా ప్రతిభను యుక్త వయస్సు నుంచే ప్రారంభించాడు. టౌతాస్ అకాడమీ నిర్వహించిన కవితా పోటీలలో హ్యూగో రాణించాడు. విక్టర్ హ్యూగో 1882 సంవత్సరంలో మొట్టమొదట కవితా సంకలనం ‘ఓడెస్’ తో పాటు వివిధ కవితలు వెలువరించాడు. వీటిని క్లాసిసిజం శైలిలో సృష్టించాడు.తర్వాత కాలంలో హ్యూగో

క్లాసిసిజాన్ని వదిలి క్రమంగా రొమాంటిక్స్ వైపు ప్రయాణించాడు. హ్యూగో రొమాంటీక్స్ సాహిత్యంలో అత్యున్నత స్థాయికి ఎదిగాడు.1821 – 22 మధ్యకాలంలో రాసిన మొదటి నవల 'ఖాన్ ఐస్లాండడర్' 1826 లో రెండో నవల 'బగ్ జార్గల్' ను రచించాడు. బగ్ జార్గల్ నవల ప్రపంచనవలా సాహిత్యంలో పేరు పొందింది. బగ్ జార్గల్ నవల రొమాంటిక్స్ జం శైలిలో అత్యున్నత స్థానాన్ని ఆక్రమించుకుంది.బగ్ కార్గిల్ నవలలో ప్రధాన ఇతివృత్తం నిగ్రోలకు ,శ్వేత జాతులకు నడుమ జరిగిన ఒక వర్ణాంతర సంఘర్షణ మొక్క చరిత్ర. నీగ్రోలు బానిసలు నల్లజాతి వారు అంతేగాక బానిసత్వాన్ని ఎదిరించే పోరాటం ఈ నవలలో చూడవచ్చు. శ్వేత జాతులు అంటే తెల్లవాళ్ళు . ఈ తెల్ల వాళ్ళు పాలకులు శాసన కర్తలు. బగ్ జార్గల్ నిగ్రో యువరాజు కథా నాయకుడు.లిమోపాల్డ్ అవర్నీ ఫ్రాన్స్ దేశస్తుడు. బైసో అనే వ్యక్తి అత్యంత ప్రతిష్టాత్మకంగా కలిగిన పాత్ర. బైసో మంచి మాటకారి సమయస్ఫూర్తి కలిగిన వ్యవహార దక్షుడు.అవర్నీ చేతనే ప్రశంసలు అందుకున్న ఘణుడు బైసో. ఈ నవలలో బిగ్ జార్గల్, అవర్నీ, బైసో, హెన్రీ, లిమోపాల్డ్, పాస్కల్, ఆల్ ఫ్రెడ్, రాస్కు (కుక్కపేరు) మొదలైన పాత్రలను విక్టర్ హ్యూగో ఈ నవలలో అద్భుతంగా చిత్రించారు.

*"1929లో అనువదింపబడిన ఈ నవల యొక్క ముఖ్యోద్దేశ్యము ప్రతి పౌరుడు జాతి సముద్ధరణకై అసతి మాన ప్రతాప స్ఫూర్తితో చచ్చియైన తన లక్ష్యమును సాధించి తీరవలెనన్న పట్టుదలతో వర్తింపవలెనని హెచ్చరించుచున్నది. ఒక వైపున గాంధీ సిద్ధాంతములు, మరొకవైపున జాతిసముద్ధ రణైక దీక్ష, దేశభక్తి యిందు చక్కగా నిరూపింపబడినవి. ఈ జంట కవులు గాంధీతత్త్వమును ఆకళించుకొని, ఆయన ప్రభావముచే ఆకృష్టులైన రసభావ విదులు కావుననే, ఫ్రెంచిదేశమున జరిగిన విప్లవ గాథను ప్రస్తుతం భారతదేశ పరిస్థితులకు అన్వయించునిమిత్తమై యిట్టి అనువాదమును గావించిరి. నవల రూపమున సంఘ జనాత్మకముగా జాతి విప్లవమును ఆంధ్రులకు కూడ తెలియపరచ దలచి దీని నీ జంటకవులు అనువదించిరి. జాతి యొక్కటే మానవ జాతి అన్న మహోన్నత ధ్యేయమును సర్వజన సౌభాతృత్వమును చాటిన ఈ నవల తెలుగును వెలువడుట నిజముగ తెలుగు పాఠకుల యదృష్టము"* అని జి. విశ్వనాథ నాయుడు (పింగళి లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వము – సాహిత్యము, అముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం, 1991: 238, 239) తెలియజేశారు. దీని బట్టి నాటి ప్రపంచ దేశాలు కొన్ని నియంతృత్వం ఉండి కొన్ని దేశాల్ని బానిసత్వంగా చేసుకొని పరిపాలించారు. దీనికి వ్యతిరేఖంగా పీడిత దేశాలన్నీ కలిసి తమ సమస్యల్ని రూపుమాపడానికి విప్లవ మార్గమే ఏకైక ఆయుధమని భావించి పోరాటాలు చేశారని తెలుస్తుంది.

### 7.6. భారతీయ తత్త్వ వేత్తగా మహాత్మా గాంధీజీ:

మహాత్మాగాంధీ ప్రపంచ దేశాలకు పరిచయం అవసరం లేని పేరు. గాంధీజీ పేరు తలుచుకోగానే సత్యం, అహింస భావాలు గుర్తుకొస్తాయి. ఆయన భారత స్వాతంత్ర్య ఉద్యమ నాయకుడుగా దేశానికి సేవలు మరువలేనివి. తన జీవితం గురించి తానే *'My Experiment with truth'* అనే పేరుతో ఆంగ్ల భాషలో స్వీయ చరిత్రను రాసుకున్నారు. గాంధీజీ జీవిత చరిత్రను భారతీయ భాషల్లోకే కాకుండా, ప్రపంచ భాషల్లోకి అనువాదాలయ్యాయి. గాంధీజీ వివిధ సందర్భాలలో దేశం ఎదుర్కొంటున్న అనేక సమస్యల గురించి, బ్రిటిష్ పాలనలో భారతీయుల దయనీయ పరిస్థితుల గురించి సూక్తుల ఆధారం చేసుకొని ప్రసంగాలను ఇచ్చారు. ఆ ప్రసంగాల్ని శ్రీ కృష్ణ కృపలాని గారు ఆంగ్లంలో *'All men are brothers'* అనే పేరు ఒక సంకలన గ్రంథంగా ముద్రించారు. ఈ సూక్తుల ఆధారంగానే ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు 'మానవులందరూ నా సోదరులు' (1964) అనే గ్రంథాన్ని వచనంలో అనువదించారు. దీన్ని కనుక అధ్యయనం చేస్తే గాంధీజీ తత్త్వ వేత్తగా (PHILIOSOPHY) మనకు దర్శనమిస్తారు. దీన్ని భారతీయ సాహిత్య అకాడమీ న్యూఢిల్లీ వారు 1964 సంవత్సరంలో తొలిసారిగా ప్రచురించారు.

#### 7.6.1. మానవులందరు నా సోదరులు:

ఈ పుస్తకంలో గాంధీజీ స్వీయ చరిత్ర ఘట్టాలే కనిపిస్తాయి, గాంధీజీ అనుసరించిన సత్యం, మతం, అహింస, శాంతి, ప్రజాస్వామ్యం, విద్య మొదలైన పద్ధతులు దర్శనమిస్తాయి. వీటి తీరు తెన్నుల్ని పింగళి వారు గొప్పగా అనువాదం చేసి చిత్రీకరించారు. కనుక ఇవన్నీ ఆయన జీవన సరళిని, ఆయన క్రమశిక్షణను, ఆయన జీవన దశల్లో పోషించిన పాత్రలను అవగాహన చేసుకోవడానికి ఈ గ్రంథం ఎంతగానో తోడ్పడతాయి. ఈ పద్ధతులన్నింటినీ ప్రపంచానికి పరిచయం చేస్తూ ఒక నిశ్శబ్ద విప్లవాన్ని వెలిగించారు. ఈ పుస్తకానికి యునెస్కో వారు ముందుమాట రాస్తూ *''గాంధీజీ వ్యక్తిత్వమునకును, ఆయన రచనలకును సంబంధించిన విభిన్న దృక్పథములను ప్రదర్శించి యవి వారికి మరింత చక్కగా అవగాహన యగునట్లు చేయుట మా యుద్దేశ్యము''* (పుట: vii) అని ఈ గ్రంథాన్ని సమాజానికి అందించారని తెలుస్తోంది. దీన్ని బట్టి మానవాళికి కలిగే ప్రయోజనాల్ని, ఆశయాల్ని, మనం పాటించాలనే సందేశాన్ని స్ఫురించేలా ఈ పుస్తకం చెబుతుంది. అదే విధంగా అప్పటి భారత రాష్ట్రపతి డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు 'ఉపోద్ఘాతము' అనే శీర్షికను రాస్తూ *''గాంధీ మతము యుక్తి యుక్తము, నైతికమును, హేతువాదమునకు నిలువని యేసిద్ధాంతమును ఆయన అంగీకరింపడు. అంతరాత్మకు నచ్చని యేవిధి నిషేధములను ఆయన పాటింపడు. జాతీయులు, అంతర్జాతీయములునగు సమస్యలను పరిష్కరించుటకు అహింసనే ఉత్తమ సాధనముగా పరిగ్రహింపవలెననుట పై సిద్ధాంతమునకు అనుషంగికము. తాను యోగిని కాని, దివ్యజ్ఞానిని కాని కాదనియు, ఆదర్శకర్మవాది ననియు గాంధీ నొక్కి చెప్పెను.అహింస యనునది*

*యోగులకును, తపస్వులకును మాత్రమే యుద్దేశించినట్టిది కాదు. సామాన్య మానవులకును అది యుపయోగ కరమే. హింస జంతుధర్మము. మానవధర్మము అహింస. జంతువు వంటివాడే మానవుడును. వానియందు ఆత్మ నిగూఢమై యుండును.శారీరక బలప్రయోగముతప్ప నాతనికి ధర్మము తెలియదు. ఆత్మబలము శరీరబలముకంటే ఉన్నతము, ఉత్తమము.దానికి విధేయుడై యుండుటయే మానవుని ఉత్కృష్టత. వ్యక్తి మాత్రమునకు సంబంధించిన అహింస సిద్ధాంతమును సాంఘిక, రాజకీయ కక్ష్యలకు ప్రప్రథమముగా కొంపోయిన మహనీయుడు మానవజాతి చరిత్రలో గాంధీ ఒక్కడే''* నేనీ (మానవులందరు సోదరులు,1964: x, xi) వ్యాఖ్యానించారు. దీని బట్టి గాంధీజీ వ్యక్తిత్వాన్ని, గాంధీజీ ఫిలాసఫీనీ, భారతచరిత్రలో గల స్థానాన్ని సర్వేపల్లివారు ఆవిష్కరించారు.

గాంధీజీ జీవితానుభవాలను పుణికి పుచ్చుకున్న గొప్ప గ్రంథమిది. గాంధీజీ స్వీయ చరిత్రను తెలుసుకోవడానికి ప్రతి భారతీయుడు తప్పక చదవాలిసిన గ్రంథమిది. ఇందులో గాంధీజీ జీవితాన్ని విభిన్న దృక్పథాలను అన్వేషించడానికి అవకాశమున్న గొప్ప గ్రంథమిది. ఆయన అనుసరించిన విధానాల వలన భారతదేశమే కాకుండా ప్రపంచ దేశాలు ఆకర్షితులయ్యాయి. ఆయన అన్వేషణ వలన మానవ జాతి పడుతున్న సమస్యలకు పరిష్కారాలు లభించాయి. ఆయన తీసుకున్న నిర్భయాలే ప్రపంచ శాంతికి పునాదులు ఏర్పడ్డాయి. గాంధీజీ ఈ చరాచర సృష్టికి అందించిన విలువైన సంపదలను కొన్నింటిని సోధాహరణంగా తెలిపే ప్రయత్నం చేస్తాను.

### 7.6.1. గాంధీజీ సత్యనిష్ట :

''నేను సత్యములో సౌందర్యమును చూతును. సత్యములైన భావములు, సత్యములైన ముఖములు, ముఖములు, సత్యములైన చిత్రములు, సత్యములైన కీర్తనలు అన్నియు సౌందర్యమయములే. రణముగార్తనలు సాధా మానవులు ఈ సత్య సౌందర్యమును చూడలేకపోవు చున్నారు. వారిలోను ప్రాకృతజనులు ఆ సౌందర్య తేజమువలన కన్నులు మిరుమిట్లు గొలిపి, అంధులై పారిపోవుచున్నారు. సత్య సౌందర్యమును ఆవిర్భవించును. చూడగలిగిననా డే సత్యమైన శిల్పము'' అని పింగళివారు (మానవులందరు సోదరులు,1964:118) తెలియజేశారు. దీనిలో

### 7.6.2. ఆధ్యాత్మిక వేత్తగా గాంధీజీ:

''ఆధ్యాత్మిక జ్ఞానమును, ఆధ్యాత్మిక సిద్ధిని ఒకటే అనుకొనుట తప్పు మత గ్రంథములు చదువుట, వేదాంత మీమాంగులు చేయుట ఆధ్యాత్మికత కాదు. అది హృదయకృషి. అనంతళ కీమంతము, నిర్భయత్వము ఆధ్యాత్మికతకు మొదటి లక్షణము, భీరువులకు నీతి ఉండదు. అందుచే ఆధ్యాత్మికతకు అర్హులు కారు. మానవుడు సర్వభూత శ్రేయస్సును అభిలషింపవలయును ఆట్టి అభిలషించుశక్తిని ప్రసాదింపుమని భగవంతుని అర్థింపవలెను. సర్వభూత శ్రేయస్సులో తన శ్రేయస్సుగూడ ఇమిడియున్నదిగదా! తన జాతియొక్క శ్రేయస్సునుమాత్రమే కోరువాడు స్వార్థపరుడు.ఎప్పుడును మేలు జరుగదు. తాను శ్రేయస్సు అనుకొను. తనకు జరుగవలసిన నిజమైన

శ్రేయమునకును భేదమును. దానికిని, గ్రహించుట మానవునకు మీరరాని విధి. భగవంతుడు ఒక్కడే, ఒక్కటే. కాబట్టి మానవజాతీయంతయు శరీరము లెన్నియైన నేమి? ఆత్మ ఒక్కటియే. సూర్యుని కిరణములు ఎన్నిగా కానవచ్చినను మూల తేజము ఒక్కటియేకదా! కావున నే పరమ దుర్మార్గునికంటెగాని, పరమ పవిత్రునికంటేగాని నేను భిన్నుడను కాజాలను'' అని (మానవులందరు సోదరులు,1964:125) పేర్కొన్నారు.

### 7.6.3. తత్త్వ వేత్తల పట్ల గాంధీజీ వైఖరి:

''ఏసుక్రీస్తు, డేనియల్, సోక్రటీసు వీరు ముప్వరు నిష్కళంకమైన సత్యాగ్రహమును అనగా ఆత్మశక్తిని ప్రదర్శించిరి. ఈ ముప్వరు ప్రవక్తలును ఆత్మముందు శరీరము తృణప్రాయ మని గ్రహించిరి. ఆధునిక కాలములో ఈతముకు టాల్ సాయ్ లు గొప్ప వ్యాఖ్యాత. ఆయన వ్యాఖ్యానము ఉజ్జ్వలముగా నుండును. ఊరక వ్యాఖ్యానించుటే కాదు. ఆయన తన జీవితమును తదనుసారముగా నే గడుపుకొనెను. పాశ్చాత్య దేశములలోకంటె ముందుగానే ఈ దేశములో ఈ ధర్మము గ్రహింపబడి సర్వసాధారణముగా ఆచరింపబడెను. శరీరబలముకంటె ఆత్మబలము మిన్న యని తెలిసికొనుట ఎంతో "సుకరము. ప్రజలు తమకు జరుగు అన్యాయములకు ఆత్మబలముతో నే పరిహారమును సంపాదింప బూనుకొన్నప్పుడు, ఇప్పుడు లోకములో కానవచ్చు దుఃఖములు, బాధలు చాలవరకు తప్పిపోవును'' అని (మానవులందరు సోదరులు,1964:157) అన్నారు.

### 7.6.4. గౌతమబుద్ధుని పట్ల గాంధీజీ దృక్పథం:

'' గౌతమబుదుడు శిబిరములలోనికి పోయెను. బుధుని ఆత్మబలము చే ఈ ఆయుధముతో నిర్భయముగా శత్రు అహంకారపూరితులైన పురోహిత వర్గము జయింపబడి ఆయనయెదుట మోకరిలిరి. క్రీస్తు జెరూసలెమ్ దేవాలయములో వడ్డీ వ్యాపారము చేయు వర్తకులను ఆవలకు తఱిమి వై చెను. యూదుజాతిలో నామమాత్ర పూర్వాచారు లైన పంచకులను భగవదాగ్రహమునకు పాత్రుల జేసెను. శ్రీక్ష మైన ప్రత్యక్ష చర్యకే పూనుకొనిరి. విధించిన ప్రేమమయము, నను ఆ శిక్షావిధానము సౌమ్యము, అనగా శత్రువులకు శారీరక బాధకలిగించిరని అనుకొనవద్దు. వారిమీద ఈ ప్రవక్త లిర్వురు వ్రేలైనను తాము వీసత్యముకొరకు జీవిత మంకితము ఒనర్చుకొనిరో, దానిని విడనాడుటకు ఒప్పుకొనక తామే సంతోష పూర్వకము గా శత్రువుల వశమగుటకు సిదపడిరి. పురోహితవర్గమును లొంగదీయుటకు మహోన్నత మైన తన ప్రేమమహత్త్వము చాలకపోయినచో గౌతముడు వారిని ప్రతిఘటించుటలోనే శరీరత్యాగము చేసియుండును, కాని ఆయన ప్రేమయే జయించెను గనుక అట్టి పని జరుగలేదు. క్రీస్తు ఒక సామ్రాజ్యశక్తిని ప్రతిఘటించుచునే శిరమున కంటక కిరీటము తాల్చి శిలువమీద శరీరత్యాగము చేసెను. నేను అహింసా పూర్వక మైన ప్రతిఘటనల కే పూనుకొంటి నేని మహాగురువుల మింతును. అడుగుజాడలలో వినయముతో ఆ యిరువురు నడచుటకే ఉద్యమింతును'' అని (మానవులందరు సోదరులు,1964:159) తెలిపారు.

**7.6.5. అహింస వాదిగా గాంధీజీ:**

‘‘మనలను ప్రేమించిన వారిని ప్రేమించుట అహింస కాదు. మనలను ద్వేషించినవారిని ప్రేమించుట అహింస. ఈ మహోదారమైన ఈ ప్రేమ ధర్మమును పరిపాలించుట ఎంతో కష్టమో నే నేనెరుగుదును. ఇదే ఆన నేల ? మహౌదార కార్యములన్నియు కష్టములే. అన్నిటిలో ద్వేషిని ప్రేమించుట మహాకష్టము. దృఢ సంకల్ప మున్నచో ఈ మహాకష్టముకూడ సాధ్యమగునట్లు భగవంతుడు అనుగ్రహించును’’ అని (మానవులందరు సోదరులు,1964:135) అన్నారు.

**7.6.6. మతం సత్యం పట్ల గాంధీజీ దృష్టి :**

‘‘మత మనగా, ఆహార పానీయ నియమములు మాత్రమే అనుకొనెడి దుర్దశ ప్రాప్తించినది. మనలోనే కొందరు అధికులని, కొందరు అల్పులని భావించుట ఆ దుర్దశవల్లనే. ఇంత కంటె శోచనీయమైన అజ్ఞాన మింకొకటి లేదు. తక్కువలను కులముగాని, నియమములుగాని ఎక్కువ తక్కువలను నిర్ణయింపవు. శీల మొక్కటే ఆధిక్యమునకు గాని, అల్పత్వమునకుగాని కారణము. వీడు అల్పుడు, వీడు అధికుడు అని భగవంతుడు మనలా సృష్టించినప్పుడే ముద్రలు వేసి పంపలేదు. పుట్టుక చేతనే అల్పుడని, అస్పృశ్యుడని మానవునకు పేర్లు పెట్టు ఏ మత గ్రంథమునకును మనము విధేయులము కాకూడదు. దానికి. విధేయుల మగుదుమేని భగవంతుని, సత్యమును నిరాకరించిన వార మగుదుము. సత్యమే భగవంతుడు’’ అని (మానవులందరు సోదరులు,1964:100) తెలిపారు.

**7.6.7. గాంధీజీ దృష్టిలో ప్రపంచ శాంతి :**

‘‘నేను భారతదేశ భక్తిగల అకించనుడను. నే చేయు దేశ సేవ వలన ప్రపంచ సేవయు చేయుచున్నాను. నీ జాతికి నీవు చేయు సేవ ప్రపంచ సేవకు ప్రతికూలము కాదనెడి యేండ్ల అనుభవమువలన దృఢతరమైనది. ఇది ఒక విధమైన మంచి నిదాంతము. నా విశ్వాసము ఏబది దీనిని శిరసావహింతు మేని ఈ మధ్య లోకమున నివసించు జాతుల మధ్య ప్రబలుచున్న అన్యాయలు, ద్వేషములు తమంత సమసి పోవును’’ అని (మానవులందరు సోదరులు,1964:190) వ్యాఖ్యానించారు.

**7.6.8. పేదల పట్ల గాంధీజీ ఆలోచనలు:**

‘‘బీదల పాలిట ఆర్థికమే ఆధ్యాత్మికము, అదిగాక మరియేడి చెప్పినను వారి చెవిని జొరదు, మనసున కెక్కదు. అన్నము చూపిన వానినే వారు దేవు డనుకొందురు, ఇంకొక ఆలోచన చేయుటకు వారికి శక్తి చాలదు’’ అని (మానవులందరు సోదరులు,1964:215) అన్నారు.

**7.6.9. ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్ర :**

“ పాలిత ప్రజల సమ్మతి లేనిచో, ఎట్టి నిరంకుశ ప్రభుత్వమైనను ఒక్క క్షణము నిలువదు. అందుచేతనే అట్టి ప్రభుత్వము పాలితుల సమ్మతిని బలవంతముగా భయపెట్టి సంపాదించుచుండును. ప్రజలు భయరహితులైననాడు, ఆ ప్రభుత్వము, దాని బలము ఎగిరిపోవును” అని (మానవులందరు సోదరులు,1964:231) తెలిపారు.

**7.6.10. గాంధీజీ విద్యా విధానం:**

“నిసర్గమైన నీ అంతశ్శక్తిని బహిర్గత మొనర్చి, పెంపొదింపదగిన దానికే యథార్థమైన విద్య అని పేరు. అందుకై మానవసృష్టి పరిశీలన కంటే ఉత్తమ గ్రంథ మేముండును” అని (మానవులందరు సోదరులు,1964:239) అన్నారు.

**7.6.11. గాంధీజీ దృష్టిలో విశ్వవిద్యాలయ విద్య:**

“ విశ్వవిద్యాలయములు స్వయం పోషకములుగావలెను. ఇతర ఉన్నతవిద్యలు సంపన్నులు పోషించునట్లు ప్రభుత్వము ప్రోత్సహించేవలెను. ఏది ఏమైనను సరే, వెను వెంటనే ప్రాంతీయ భాషలద్వారా విద్య లన్నియు కఱపవలెను. ఈ మార్పువల్ల ఉన్నత విద్యలో తాత్కాకమైన ఎట్టి ఆస్తవ్యస్తస్థితియైనను వచ్చుగాక! ఇప్పుడు నానాటికి పెరిగిపోవుచున్న ధనవ్యయము, శక్తివ్యయము మాత్రము క్షంతవ్యము కాదు” అని (మానవులందరు సోదరులు,1964:246) పేర్కొన్నారు.

**7.6.12. గాంధీజీ దృష్టిలో  భారతీయ స్త్రీ స్థానం:**

“భారత దేశమునందలి స్త్రీ పురుషులు ధైర్యముతో అహింసా పూర్వకముగా మృత్యువును ఎదుర్కొను శక్తి నలవఱచుకొందు లేని, ఎట్టి ఆయుధజలమునైనను లెక్కచేయక, తిరస్కరించి ప్రజాసామాన్య మునకు కావలసిన నిష్కళంక స్వాతంత్ర్యమును సంపాదింపగలరు అని నాచృఢ విశ్వాసము” అని (మానవులందరు సోదరులు,1964:263) తెలియజేశారు.

**7.6.13. శాస్త్రీయమైన, మేధోపరమైన ఆలోచనలు:**

“నాకు దివ్య దర్శనము లేదు. ఋషిని కాను. నేను మీవలెనే సామాన్య మర్త్యుడను. మీలో నున్న లోపములే నాలోను ఉన్నవి. నేను ప్రపంచమును చాల చూచితిని, గ్రుడ్డిగా కాక, వివేకముతోనే జీవితమును గడపితిని, మానవభాగ ధేయములైన ఎన్నో అగ్ని పరీక్షలకు లోనైతిని. ఈ విధమైన వినీతిని అభ్యసించితిని” అని (మానవులందరు సోదరులు,1964:266) అన్నారు.

**7.7. అనువాదం వివిధ పారిభాషిక పదాలు:**

పింగళి లక్ష్మీకాంతంగారు తొలితరం పరిశోధకులు. ఆయన వివిధ విషయాలను తమ బోధించేటప్పుడు  ఆంగ్ల గ్రంథాలను చదివేవారు. వాటిలో కొన్ని పదాలను తెలుగులోకి అనువాదం చేసేటప్పుడు కొన్ని నూతన పారిభాషిక పదజాలాన్ని సృష్టించవలసి వచ్చేది. అప్పటికి ఆంగ్ల పదాలను

తెలుగులో ప్రయోగించడానికి తగిన పారిభాషిక పద కోశాలు లేవు. అయినప్పటికి పింగళివారు కొన్ని పారిభాషిక పదాలను తెలుగులో సృష్టించే ప్రయత్నం చేశారు. ఇదంతా పింగళివారి పాండిత్యానికి, పరిశోధన పటిమకు నిదర్శనంగా నిలుస్తుంది. అందువలన వాటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

**సంస్కృత కుమార వ్యాకరణము – ఇంగ్లీష్ పారిభాషిక పదాలు**

| వరుస సంఖ్య | ఇంగ్లీష్ పదం | తెలుగు పదం | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1) | Vowels | స్వరములు | 02 |
| 2) | Consonants | వ్యంజనములు | 02 |
| 3) | Syllabic value | అక్షరత్వము | 02 |
| 4) | Simple vowels | సమాచ్చులు | 04 |
| 5) | Liquid simple vowels | సమచరాచ్చులు | 04 |
| 6) | Diphthongs | సంధ్యచ్చులు | 04 |
| 7) | All vowels | అచ్చులన్నియు | 04 |
| 8) | Semi-vowels | అంతస్థములు | 04 |
| 9) | Simple vowels | సమాక్షరములు | 05 |
| 10) | Diphthongs | సంధ్యక్షరములు | 05 |
| 11) | Soft consonants except Nasal semivowels | అంతస్థములును, అనునాసికములను, హ ఆకారము తప్ప తక్కిన నాదాక్షరములు | 04 |
| 12) | Aspirate soft consonants except 'h' | మహా ప్రాణనాదాక్షరములు | 04 |
| 13) | Un-aspirate soft consonants | అల్ప ప్రాణనాదాక్షరములు | 04 |
| 14) | All hard consonants | శ్వాసాక్షరములు | 04 |
| 15) | Hard consonants except sibilants | ఊష్మేతర శ్వాసాక్షరములు | 04 |
| 16) | Sibilant hard consonants | ఊష్మ శ్వాసాక్షరములు | 04 |

| | | | |
|---|---|---|---|
| 17) | All consonants except nasals & semi-vowels | అంతస్థములు అనునాసికములు కాక తక్కిన హల్లులు. | 04 |

| | | | |
|---|---|---|---|
| 18) | All consonants except nasals & semi vowels, sibilants and ḥ | అంతస్థములు అనునాసికములు ఊష్మములను హకారమున్ను కాక తక్కిన హల్లులు. | 05 |
| 19) | Liquid vowels | చరాచ్చులు | 06 |
| 20) | Modern Philogists | ఆధునిక భాషా శాస్త్రవేత్తలు | 07 |
| 21) | Larynx | వాయుమార్గం | 08 |
| 22) | Vocal cords | నాదతంత్రులు | 08 |
| 23) | Material for speed sound | వర్ణమునకు ద్రవ్యమై | 08 |
| 24) | Beyond the orbit of the mouth | ముఖమండలమునకు ఆవల కంఠము వైపు | 09 |
| 25) | Epiglottis | తదనంతరము వాయువు | 09 |
| 26) | Pharynx | స్వరపేటిక | 09 |
| 27) | Places of Articulation | వర్ణ వ్యక్తిస్థానములు | 10 |
| 28) | Articulator | కరణము | 10 |
| 29) | Retroflex | తివేష్టిత జిహ్వాగ్రమ్ | 10 |
| 30) | Mutually opposite | విపరీత కార్యములు | 13 |
| 31) | Gutturals | కంఠ్యములు | 18 |
| 32) | Palatals | తాలవ్యములు | 18 |
| 33) | Cerebrals or Linguals | మూర్ధన్యములు | 18 |
| 34) | Dentals | దంత్యములు | 18 |
| 35) | Labials | ఓష్ఠ్యములు | 18 |
| 36) | Unaspirate hard consonants | అల్ప ప్రాణశ్వాసాక్షరములు | 18 |
| 37) | Aspirate hard consonants | మహాప్రాణ శ్వాసాక్షరములు | 18 |
| 38) | Unaspirate soft consonants | అల్పప్రాణ నాదాక్షరములు | 18 |
| 39) | Aspirate soft consonants | మహాప్రాణ నాదాక్షరములు | 18 |
| 40) | Nasals soft | అనునాసిక నాదాక్షరములు | 18 |

| | | | |
|---|---|---|---|
| 41) | Soft sibilant & semi vowels soft | హాళీ అంతస్థములు (నాదాక్షరములు) | 18 |
| 42) | Sibilant hard | ఊష్మములు శ్వాసాక్షరములు | 18 |
| 43) | Vowels | నాదము | 18 |
| 44) | Second rate | రెండవ రకపు సవర్ణత్వము | 18 |
| 45) | Increase in quantity multiple | గుణమనగా అక్షర పరిమాణములో పెంపు | 21 |
| 46) | Further increase in quantity | అక్షర పరిమాణములో గుణము కంటె మరికొంత పెంపు | 23 |
| 47) | Ablaut | భాషాతత్త్వశాస్త్రమున | 24 |
| 48) | Contact | అత్యంత సన్నికార్షము ఏర్పడును | 24 |
| 49) | Assimilation | సమీకరణము | 25 |
| 50) | In one breath | ఏక ప్రాణయోగము | 25 |
| 51) | External sandhi | పదాంతసంధి | 28 |
| 52) | Internal sandhi | పదమధ్యసంధి | 28 |
| 53) | Syllables | గుణెక్షరములు | 30 |
| 54) | Assimilation | సమీకరణము | 32 |
| 55) | To be influenced by | ఒక అక్షరము రెండవ అక్షరము యొక్క లక్షణమునకు వశమగుట | 38 |
| 56) | Aspirate throwing forward | మహాప్రాణ పురోగతి అని పేరు ముందుకు జరుగుట | 46 |
| 57) | Breakfast | ప్రాతరాశః | 53 |
| 58) | Declension | సుబంత ప్రక్రియ | 58 |
| 59) | Prepositions | ఉపసర్గలు | 58 |
| 60) | Particles | నిపాతలు | 59 |
| 61) | Primary nominal base | కృత్ అంతమందు గలది కృదంతము | 61 |
| 62) | Secondary nominal base | తద్ధితాంతము | 61 |
| 63) | Indivisible first syllable | అవిభాజ్యమైన ఒక ప్రథమాక్షరము | 62 |
| 64) | Proper names | సంజ్ఞావాచకములు | 64 |

| | | | |
|---|---|---|---|
| 65) | Proper names have no connotation | సంజ్ఞకు అన్వయము వ్యుత్పత్తి లేదు అని. | 64 |
| 66) | Original nouns | సహజనామములు | 64 |
| 67) | Root | ధాతువు | 64 |
| 68) | Root noun | ధాతువు నామము | 65 |
| 69) | Derived | లాక్షణికములు | 66 |
| 70) | Ordinals | పురణాకములు | 67 |
| 71) | Nouns ending in possessive suffixes | మతబంతములైన విశేషణములు | 67 |
| 72) | Participles | ధాతుజన్య విశేషణములు | 67 |
| 73) | Present Participle | వర్తమానార్ధకము | 67 |
| 74) | Past Participle | భూతార్ధకము | 67 |
| 75) | Future Participle | భవిష్యదర్ధకము | 67 |
| 76) | Potential Participle | విధ్యర్ధకము | 67 |
| 77) | Active | కర్త్రర్థకము | 67 |
| 78) | Passive | కర్మార్థకము | 67 |
| 79) | Agent noun | కర్తృవాచకం | 68 |
| 80) | Action noun | భావవాచకం | 68 |
| 81) | Vowel ending | అజంతములు | 69 |
| 82) | Consonant ending | హలంతములు | 69 |
| 83) | Strong stem | దృఢ ప్రాతిపదికము | 76 |
| 84) | Weak stem | దుర్బల ప్రాతిపదికము | 76 |
| 85) | Middle stem | మధ్యమ ప్రాతిపదికము | 76 |
| 86) | Strong stem | సర్వనామస్థాన ప్రాతిపదికము | 76 |
| 87) | Middle stem | పదసంజ్ఞక ప్రాతిపదికము | 77 |
| 88) | Weak stem | భసంజ్ఞక ప్రాతిపదికము | 77 |
| 89) | Root nouns | ధాతువు నామములు | 81 |
| 90) | Unchangeable | స్థిర ప్రాతిపదికములు | 81 |
| 91) | Changeable stems | అస్థిర ప్రాతిపదికములు | 82 |

| | | | |
|---|---|---|---|
| 92) | Strong stem | దృఢ రూపము | 83 |
| 93) | Middle stem | మధ్యమ రూపము | 83 |
| 94) | Weak stem | దుర్బల రూపము | 84 |
| 95) | Analogy | పోలిక | 84 |
| 96) | Present and Future Participles | శంతర్థకములు | 86 |
| 97) | Possessive adjectives | మతుబంతములు | 86 |
| 98) | Past active participles | భూతకాల కర్తృర్థక క్రియాజన్య విశేషణములు | 86 |
| 99) | Pronominal adjectives of quantity | సర్వనామ పరిణామార్థములు | 86 |
| 100) | Categories | విభాగాలు | 88 |
| 101) | Secondary roots | ప్రత్యమాంత ధాతువు | 88 |
| 102) | Desiderative roots | సన్నంత ధాతువులు | 88 |
| 103) | Intensity | తీవ్రత | 88 |
| 104) | Frequency | పునః ప్రారంభం | 88 |
| 105) | Future Participles | భవిష్యదర్థక క్రియాజన్య విశేషణములు | 91 |
| 106) | Secondary derivatives | తద్ధితాంతములు | 92 |
| 107) | Primary derivatives | కృదంతములు | 92 |
| 108) | Past active participles | భూతకాల కర్తృర్థక క్రియాజన్య విశేషణములు | 93 |
| 109) | Pronominal adjectives at quantity | పరిమాణార్థక సర్వనామ విశేషణములు | 94 |
| 110) | Irregular | అనిమతములు | 95 |
| 111) | Your honour | పూజ్యుడవైన నీవు | 95 |
| 112) | Liver | పిత్తకోశము | 96 |
| 113) | Functional adjective | ధర్మివాచకము | 97 |
| 114) | Last syllable | ప్రత్యమాంతములు | 99 |
| 115) | Possessive adjectives | తద్ధితాంతములు | 100 |

| | | | |
|---|---|---|---|
| 116) | Secondary abstract nouns | భావార్థక తద్ధితాంతములు | 100 |
| 117) | Possessive adjectives | తద్ధితాంతములు | 107 |
| 118) | Adjectives of comparative degree | తరభావాత్మక విశేషణములు | 119 |
| 119) | Positive | ప్రకృతి రూపం | 119 |
| 120) | Past active perfect participles | ప్రత్యయాంతములు | 120 |
| 121) | Known as | తెలిసిన | 129 |
| 122) | Present participles | వర్తమానార్థక క్రియాజన్య విశేషణములు | 133 |
| 123) | Passive present and Future participles | కర్మార్థక వర్తమాన భవిష్యదర్థ క్రియాజన్య విశేషణములు | 133 |
| 124) | Potential participles | కృత్య ప్రత్యమములు | 133 |
| 125) | Past participles active & passive | కర్తృర్థ, కర్మార్థక, భూతకాలిక ప్రత్యమాంతములు | |
| 126) | Uninflected stem | ప్రత్యమ రహితములు | 136 |
| 127) | Prevention of hiatus | విరామం యొక్క నివారణ | 146 |
| 128) | Mono syllabic | ఏకాక్షర శబ్దం | 147 |
| 129) | Personal pronouns | వ్యక్తిపై సర్వనామములు | 161 |
| 130) | Interrogative pronouns | ప్రశ్నార్థక సర్వనామములు | 161 |
| 131) | Relative pronouns | సాపేక్ష సర్వనామములు | 161 |
| 132) | Numerical pronouns | సంఖ్యావాచకములు | 161 |
| 133) | Pronominal adjectives | విశేషణ సర్వనామములు | 161 |
| 134) | Reflexive pronoun | సర్వనామార్థము | 161 |
| 135) | Pronominal adjectives | సర్వనామ విశేషణములు | 169 |
| 136) | Possessive adjectives | మత్వర్థీయములు | 172 |
| 137) | A little | కొంచెము | 175 |
| 138) | So many | అధికం | 176 |
| 139) | Numerals | సంఖ్యావాచకములు | 175 |
| 140) | Gardinals | సంఖ్యానార్థకములు | 175 |

| | | | |
|---|---|---|---|
| 141) | Ordinals | పురణార్థక సంఖ్యావాచకములు | 182 |
| 142) | Syncopation | ఒక పదం లోపల శబ్దాల నష్టం | 182 |
| 143) | Syntactical Unit | వాక్యనిర్మాణం యొక్క యూనిట్ | |
| 144) | Complex formation of word which requires resolution and which can be resolved | శబ్ద నిష్పత్తి ప్రక్రియా వివరణమును అపేక్షించునట్టియు, ఆ వివరణము చెప్పదగినట్టియు శబ్ద స్వరూపమని | 191 |
| 145) | Collective neuter singular | సమాహార ద్వంద్వము | 194 |
| 146) | Oblique cases | వాలుగా ఉన్న కేసులు | 195 |
| 147) | Past passive participle | | |
| 148) | Forsaken by money and knowledge. | ధనము చేత విసర్జింపబడినవాడు, విద్యచేత విసర్జింపబడినవాడు | 196 |
| 149) | Related to | సంబంధించి ఉన్నప్పుడు | 197 |
| 150) | In apposition with | సమానాధికరణము | 200 |
| 151) | Gold ring | బంగారపు ఉంగరం | 201 |
| 152) | A particular of a class | పూర్వపదము విశేష వాచకము | 202 |
| 153) | Particle | నిపాతం | 203 |
| 154) | Middle stem | పదసంజ్ఞక ప్రాతిపదిక | 208 |
| 155) | Adjectival sense | విశేషణార్థములు | 216 |
| 156) | Abstract | భావార్థకము | 216 |
| 157) | Possessive sense | మతుబద్ధకము | 216 |
| 158) | Abstract nouns | భావార్థక తద్ధితములు | 221 |
| 159) | Comparative & superlative degrees of adjectives | మాత్రాభేద విశేషణ ప్రత్యయములు | 226 |
| 160) | Frist Syllable | ప్రథమాక్షరము | 228 |
| 161) | Disyllable | రెండవ అక్షరము | 228 |
| 162) | Positives | ప్రకృతి రూపములు | 230 |
| 163) | Better | మంచిది | 230 |

| | | | |
|---|---|---|---|
| 164) | Best | ఉత్తమమైనది | 230 |
| 165) | Comparative | తులనాత్మక | 230 |
| 166) | Superlative | అతిశయోక్తి | 230 |
| 167) | Verbal system | తిజంత ప్రక్రియ | 232 |
| 168) | Conjugational Tenses | వికరణ కాలములు | 232 |
| 169) | Moods | అర్థ బోధకములు | 232 |
| 170) | Divisions | భాగాలు | 232 |
| 171) | Conjugational signs | వికరణ సంజ్ఞలు | 233 |
| 172) | Tenses | కాలబోధకములు | 235 |
| 173) | Present | వర్తమానం | 235 |
| 174) | General truths | శాశ్వత సత్యములను | 235 |
| 175) | Habits | నిత్యాభ్యాసములను | 235 |
| 176) | Immediate Future | అవ్యవహిత భవిష్యత్తును తెలపడం | 235 |
| 177) | General truth | ప్రాతఃకాలమున ఉదయించు | 235 |
| 178) | Habit | సఃఅతిమాత్రం సురాంపిబతి. వాడు కల్లు తాగును | 235 |
| 179) | First future | సమీప భవిష్యత్ | 236 |
| 180) | Second future | దూర భవిష్యత్ | 236 |
| 181) | Imperfect | సమీప భూతము | 236 |
| 182) | Partech | పరోక్ష భూతము | 236 |
| 183) | Imperative | ప్రారంభమైన పని ఇంకా జరుగుతూ ఉన్న దాన్ని తెలుపుట | 237 |
| 184) | Potential | విధ్యర్థకము | 237 |
| 185) | Benedictive | ఆశీరర్థకము | 237 |
| 186) | Conditional | సంకేతార్థకము | 237 |
| 187) | Subjunctive mood | సంకల్పార్థం మొదలైన వాటిలో వాడతారు | 237 |
| 188) | Present | లట్ [గచ్ఛతి] సార్వ ధాతుకాలు | |
| 189) | Imperative | లోట్ [గచ్ఛతు] | |

| | | | | |
|---|---|---|---|---|
| 190) | Imperfect | లజ [గఅచ్ఛత్] | | 239 |
| 191) | Potential | విధిలిజ [గచ్ఛేత్] | | |
| 192) | Perfect | లిట్ [జగామ] | అర్ధ ధాతుకములు | 239 |
| 193) | 1st Future | లుట్ [గంతా] | | |
| 194) | 2nd Future | లృట్ [గమిష్యతి] | | |
| 195) | Benedictive | ఆశీర్లిజ్ [గమ్యాత్] | | |
| 196) | Aorist | లుజ్ [అగాత్] | | |
| 197) | Conditional | లృజ్ [అగమిష్యత్] | | 239 |
| 198) | Present | లట్ [భవతి] | | 239 |
| 199) | Imperative | లోట్ [భవతు] | | 239 |
| 200) | Imperfect | లజ్ [అభవత్] | | 239 |
| 201) | Potential | విధిలిజ్ [భవేత్] | | 239 |
| 202) | Perfect | లిట్ [బభూవ] | అర్ధ ధాతుకాలు | 239 |
| 203) | 1st Future | లుట్ [భవితా] | | 239 |
| 204) | 2nd Future | లృట్ [భవిష్యతి] | | 239 |
| 205) | Benedictive | ఆశీర్లిజ్ [భూయాత్] | | 239 |
| 206) | Aorist | లుజ్ [అభూత్] | | 239 |
| 207) | Conditional | లృజ్ [అభవిష్యత్] | | 239 |
| 208) | Present | వర్తమాన కాలము | | 241 |
| 209) | Imperfect | అన్యద్యతతన భూతము | | 241 |
| 210) | Imperative | అజ్ఞార్థకము | | 242 |
| 211) | Potential | విధిలిజ్ | | 242 |
| 212) | Imperfect | లజ్ | | 244 |
| 213) | Imperative mood | లోట్ | | 245 |
| 214) | Syllabic augment | అక్షరాగమము | | 246 |
| 215) | Temporal augment | క్షరాగమము | | 246 |
| 216) | Irregular roots | అనియత ధాతువులు | | 253 |
| 217) | Re-duplication | ధాతువు ద్విరుక్తం అగుట | | 253 |

| | | | |
|---|---|---|---|
| 218) | Splitting at the conjunct consonant at the root | ఒక విధమగు ధాతువు శిధిలత | 254 |
| 219) | Present passive | వర్తమాన కర్మణి | 255 |
| 220) | Strong terminations | దృఢ ప్రత్యయాలు | 257 |
| 221) | Weak terminations | దుర్బల ప్రత్యయాలు | 257 |
| 222) | Accent | ఉదాత్త స్వరము | 259 |
| 223) | Stress Accent | పీడన ప్రధానము | 260 |
| 224) | Pitch Accent | స్థాయి ప్రధానము | 260 |
| 225) | Phonetic changes | ధ్వని మార్పులు | 261 |
| 226) | Reduplication | ద్విరుక్త కార్యము | 282 |
| 227) | One variety at Aorist | ఒక జాతి లుఙ్ లో | 282 |
| 228) | Desiderative | సన్నంత ధాతువులలో | 282 |
| 229) | Frequnetative | మఙ్ లుగంత ధాతువులలో | 282 |
| 230) | Non-conjugational Teens | వికరణకాలములు కానివి | 301 |
| 231) | Moods | అర్థబోధకములు | 301 |
| 232) | Monosyllabic | ఏకస్వర ధాతువులు | 302 |
| 233) | Disyllabic | ద్విస్వర ధాతువులు | 302 |
| 234) | Trisyllabic | త్రిస్వర ధాతువులు | 302 |
| 235) | Secondary roots | ప్రత్యమాంత ధాతువులు | 302 |
| 236) | Perfect Tense | పరోక్షభూతము | 304 |
| 237) | 1st Future | అనద్యతన భవిష్యత్తు | 304 |
| 238) | 2nd Future | సామాన్య భవిష్యత్తు | 304 |
| 239) | Benedective | ఆశీర్లిఙ్ | 304 |
| 240) | Aorist | సామాన్య భూతము | 304 |
| 241) | Present Perfect | పరోక్షభూతము | 304 |
| 242) | I have come | నేను వచ్చియున్నాను | 305 |
| 243) | He has gone | వాడు వెళ్ళియున్నాడు | 305 |
| 244) | Conditional | ఇది జరగన కార్యమును | 305 |
| 245) | Perfect Tense | పరోక్షభూతము | 305 |

| | | | |
|---|---|---|---|
| 246) | Periphrastic Perfect | చంక్రమణ లిట్ అని | 312 |
| 247) | 1st Future | అన్యతన భవిష్యత్ | 313 |
| 248) | 2nd Future | సామాన్య భవిష్యత్ | 315 |
| 249) | Aorist | సామాన్య భూతము | 317 |
| 250) | Conditional | ల్ఋజ్ | 323 |
| 251) | 2nd Future | ల్ఋట్ | 323 |
| 252) | Imperfect | లజ్ | 323 |
| 253) | 2nd Future | ల్ఋట్ | 324 |
| 254) | Benedictive mood | ఆశీర్లిజ్ | 324 |
| 255) | Passive Voice | కర్మణి ప్రయోగము | 327 |
| 256) | Impersonal construction | భావే ప్రయోగము | 327 |
| 257) | Active Voice | కర్తరి ప్రయోగము | 327 |
| 258) | Passive Voice | కర్మణి ప్రయోగము | 327 |
| 259) | Impersonal construction | భావే ప్రయోగం | 327 |
| 260) | 2nd Future | భవిష్యదర్థకము | 331 |
| 261) | Aorist | సామాన్య భూతము | 333 |
| 262) | Causal | ప్రేరణార్థకము | 333 |
| 263) | 1st Future | లుట్–గమయితా | 335 |
| 264) | 2nd Future | ల్ఋట్–గమయిష్యతి | 335 |
| 265) | Desiderative | సన్నంత ధాతువులు | 336 |
| 266) | Palatalization | తాలవ్యీకరణం | 337 |
| 267) | Frequently | పునః పునః జరుగును | 339 |
| 268) | Intensely | పని ఎక్కువ జరుగుట | 339 |
| 269) | Nominal Verbs | నామ ధాతువులు | 340 |
| 270) | Agent Nouns | కర్తృవాచకములు | 343 |
| 271) | Participles | క్రియాజన్య విశేషణములు | 347 |
| 272) | Present Participles | వర్తమానార్థక విశేషణములు | 347 |
| 273) | Future Participles | భవిష్యదర్థక క్రియాజన్య విశేషణములు | 350 |
| 274) | Future Active Participles | కర్తృరకము | 351 |

| | | | |
|---|---|---|---|
| 275) | Future Passive Participles | కర్మార్థక విశేషణములు | 351 |
| 276) | Perfect Pas Active Participles | పరోక్ష భూతకాల క్రియాజన్య విశేషణములు, కర్త్రర్థకములు | 352 |
| 277) | Past Passive Participles | భూతకాలికములు | 353 |
| 278) | Indication of complete action | క్రియా పరిసమాప్తి సూచకం | 359 |
| 279) | Passive in form active in sense | కర్మణ్యర్థక రూపములో ఉన్న కర్త్రర్థకములు | 360 |
| 280) | Potential Participles | క్రియాజన్య విశేషణములు–కృత్య ప్రత్యమాంతములు | 360 |
| 281) | Prefixes | ఉపసర్గలు | 368 |
| 282) | Prepositions | విభక్తి ప్రత్యమాలు | 371 |
| 283) | Particles | నిపాత | 372 |
| 284) | To become such | అలా చేయాలి లేదా అలా అవాలి | 372 |
| 285) | To make such | అలా చేయాలి | 373 |
| 286) | Adverbs of manner | విధాన వాచకములైన అవ్యమములు | 375 |
| 287) | Pronominal adverbs | సార్వనామిక అవ్యయము | 375 |
| 288) | Setting of the sone | సూర్యుడు అస్తమిస్తాడు | 377 |
| 289) | Primary | సహజములు | 378 |
| 290) | Agreement with the verb | క్రియతో కూడిన సంబంధం కలిగి ఉండటం | 380 |
| 291) | Subject | కర్త | 380 |
| 292) | Object | కర్మ | 380 |
| 293) | Instrument | కరణము | 380 |
| 294) | Gift | సంప్రదానము | 380 |
| 295) | Separation | అపాదానము | 380 |
| 296) | Iocation | అధికరణము | 380 |
| 297) | Idiom | జాత్యాములు [జాతీయాలు] | 381 |
| 298) | Impersonal Construction | భావే ప్రయోగం | 382 |

| | | | |
|---|---|---|---|
| 299) | Indicated by the verb | కథితము | 382 |
| 300) | Not indicated by the verb | అకథితము | 382 |
| 301) | Direct | ప్రధాన కర్మ | 382 |
| 302) | Indirect Objects | గౌణకర్మ | |
| 303) | Adverbial accusatives at time | అవిచ్ఛిన్నమై మార్గమును, కాలమును తెలుపు పదములు | 382 |
| 304) | Instrument | కరణము | 387 |
| 305) | Instrumental case | కరణము | 387 |
| 306) | He gave the Brahmin a cow | బ్రాహ్మణుడికి తను ఒక ఆవు ఇచ్చెను | 389 |
| 307) | A cow was given by him to the Brahmin | అతనిచే బ్రాహ్మణుడికి ఆవు ఇవ్వబడింది | 389 |
| 308) | To the Brahmin | బ్రాహ్మణుడికి | 389 |
| 309) | Dative Case | చతుర్థీ విభక్తి | 389 |
| 310) | Creditor | ఉత్తమర్ణ శబ్దము | 389 |
| 311) | Separation | అవధాన విభక్తి | 390 |
| 312) | Secondary Cases | ఉపవిభక్తులు లేదా ఉపపదవిభక్తులు | 393 |
| 313) | Except | మినహా | 393 |
| 314) | Without | లేకుండా | 393 |
| 315) | In between | అంతరాల మధ్య | 393 |
| 316) | Absolute construction | భావలక్షణ | 395 |
| 317) | Complex Sentence | మహా వాక్యము | 395 |
| 318) | Principal Sentence | ప్రధాన వాక్యము | 395 |
| 319) | Clauses | అవయవ వాక్యములు | 395 |
| 320) | Phrase | వాక్యములు | 396 |
| 321) | Headline | ప్రధాన వాక్యానికి పొత్తు లేకపోయిన అర్థంలో పొత్తు ఉండును | 396 |
| 322) | Benedective | ఆశీర్లిఙ్ [ఆశీర్థకము] | v |
| 323) | – | – | vi |

| | | | |
|---|---|---|---|
| 324) | Would | – | vi |
| 325) | Periphrastic | – | vi |
| 326) | Agreement | ఒప్పందము | |
| 327) | Separation | అపాధానము | |
| 328) | Except | మినహాయింపు | |

**సాహిత్య శిల్ప సమీక్ష (Literary Criticism)**

**పింగళి లక్ష్మీకాంతం**

| | | | |
|---|---|---|---|
| 328 | Inner being | అంతరమూర్తియు | 2 |
| 329 | Personality | ఆత్మీయ త | 2 |
| 330 | Murder as an art | సొగసుదనమును చూచి మెచ్చినవారు దానిని కళ అని | 5 |
| 331 | Arts at delineation | చిత్రకళలు | 6 |
| 5) | Graceful execution | లలితకళలు | 6 |
| 6) | Aesthetic arts | సరసకళలు | 6 |
| 7) | Arts at pleasure | విలాసకళలు | 6 |
| 8) | Pure Music and Applied Music | అసలు, శుద్ధ గానము | 9 |
| 9) | Royal road to salvation | సంగీతమునకు మోక్షమునకు రాచబాట | 11 |
| 10) | Philosophy | తత్త్వశాస్త్రము | 11 |
| 11) | Nature at the Medium | తత్త్వద్వాహక ద్రవ్య స్వభావం | 13 |
| 12) | Ideal Archetype | ఆదర్శ రూపము | 14 |
| 13) | Art is twice removed from reality | అవి మూలమునకు రెండంతరువులు ఎడముగల అనుకృతులు | 14 |
| 14) | Republic | ధర్మరాజ్యము | 14 |
| 15) | Ideal Archetype | ఆదర్శరూపము | 14 |
| 16) | Art imitates nature | కళ ప్రకృతిని అనుకరించును | 15 |
| 17) | Nature taught art | ప్రకృతియే కళలను నేర్పెను. | 15 |
| 18) | Imitation | అనుకరణ | 16 |

| | | | |
|---|---|---|---|
| 19) | Tragedy imitates men in action | కథలో వచ్చేడి పురుషుల రూపములకు సంబంధించినది. | 16 |
| 20) | Yes. It is not real. But it depicts a higher reality. | నిజమే, కావ్యము యదార్ధం కాదు. కాకపోయినను అది ప్రదర్శించు సత్యము యదార్ధము కంటె ఉన్నతమైనది. | 16 |
| 21) | Arts | కళలు | 17 |
| 22) | Nature | ప్రకృతి | 17 |
| 23) | Significant Form | సార్ధకరూపము | 18 |
| 24) | Photography | ఛాయాగ్రహణం | 18 |
| 25) | Idea | ఆలోచన | 21 |
| 26) | Parenthesis | వాక్యగర్భిత దోషము | 22 |
| 27) | Poetic qualities at matter and manner | పదార్ధం మరియు పద్ధతిలో కవితా లక్షణాలు | 22 |
| 28) | Any particularpiece at literature | సాహిత్యమనిపించుకోనదగిన ఏ రచనయైనను కావ్యము అగును | 22 |
| 29) | Poetry | కవిత్వము | 22 |
| 30) | Poetry we will call musical thought | మధురమైన అర్ధమును కవిత్వమందురు | 23 |
| 31) | Poetry is the language at imagination and emotions | భావనా భావావేశముల శబ్ద స్వరూపమే కవిత్వము. | 24 |
| 32) | Dichtung | గద్య పద్యాత్మకం | 26 |
| 33) | Poetry | కవిత్వము | 26 |
| 34) | Dichter | పద్య రచయిత | 26 |
| 35) | Psychologists | మనోధర్మశాస్త్రవేత్తలు | 28 |
| 36) | Ball Dance | నృత్యగీతం | 28 |
| 37) | Harmony and Rhythm | తంత్రములు మరియు శ్రుతి లయలు అని | 28 |
| 38) | If angles arespeak, they speak in poetry | దేవుళ్ళు మాట్లాడవలసి వచ్చినచో కవిత్వముననే భాషించుతురు. | 29 |
| 39) | Physical | భౌతికము | 32 |

| | | | |
|---|---|---|---|
| 40) | Meta-physical | ఆధ్యాత్మికము | 32 |
| 41) | Scientists | వైజ్ఞానికులు | 32 |
| 42) | Philosophers | తాత్త్వికులు | 32 |
| 43) | Particulars in his field at investigation | తాను చేపట్టిన పరిశోధనా క్షేత్రమునందలి వివిధ విశేషములు | 32 |
| 44) | Objective attitude | తటస్థ చిత్తవృత్తి వైఖరి | 33 |
| 45) | Truth | సత్యము | 35 |
| 46) | Emotional aspect | రసభావాంశము | 36 |
| 47) | Reaction | విక్రియ | 37 |
| 48) | Sociology | సాంఘిక శాస్త్రము | 41 |
| 49) | Ethics | నీతిశాస్త్రము | 41 |
| 50) | Philosophy | తత్త్వశాస్త్రము | 42 |
| 51) | Poetic Justice | కళన్యాయ సూత్రము | 43 |
| 52) | Historical truth | చారిత్రక సత్యం | 44 |
| 53) | Art for art's sake | శిల్పమునకు శిల్పి సిద్ధి కంటె ప్రయోజనాంతరము | 45 |
| 54) | Aesthetic School | శిల్ప మర్యాద | 45 |
| 55) | Aesthetic sense | రసబోధ | 47 |
| 56) | Religious sense | భక్తిబోధ | 47 |
| 57) | Moral sense | నైతిక బోధ | 47 |
| 58) | Artistic beauty is not different from moral beauty. | కళా సౌందర్యము నైతిక సౌందర్యము కన్న భిన్నము కాదు. | 47 |
| 59) | Vision divine | దివ్య దర్శనము | 48 |
| 60) | Feeling | భావన | 50 |
| 61) | Emotion | భావావేశం | 51 |
| 62) | Imagination | ఊహ | 51 |
| 63) | Elements at poetry | కవిత్వంలోని అంశాలు | 54 |
| 64) | Emotion | భావోద్వేగం | 54 |

| | | | |
|---|---|---|---|
| 65) | Imagination | ఊహ | 54 |
| 66) | Thought | ఆలోచన | 54 |
| 67) | Form | పదగుంఫనము | 54 |
| 68) | Poetry is not expressing emotion but withstanding it. | కవిత్వమనగా భావావేశ వ్యక్తీకరణము కాదు భావావేశ సంగ్రహము. | 57 |
| 69) | Intellectual | బుద్ధిగమ్యము | 57 |
| 70) | Emotional | భావస్ఫోరకము | 57 |
| 71) | Aesthetic | శ్రవఃవేయము (సౌందర్యం) | 57 |
| 72) | Noiseless sound | మధురనాదము | 58 |
| 73) | Imaginative pleasure | భావనాత్మక నిర్వృత్తి (ఊహాత్మక ఆనందం) | 58 |
| 74) | Sensuous emotion | భావము వైషయికము | 58 |
| 75) | Aesthetic emotion | రసభావము | 58 |
| 76) | Reaction | విక్రియ | 62 |
| 77) | Stimulus | ఉద్బోదకం | 62 |
| 78) | Purgation | ప్రక్షాళన | 63 |
| 79) | Pure form | పరమానందం పొంది | 63 |
| 80) | The touch at the wordily | లౌకిక భావోపస్పర్శనము కలిగి | 63 |
| 81) | The higher nature and the lower nature at human consciousness | మానవుని చైతన్యము ఊర్ధ్వ ప్రకృతి, అధః ప్రకృతి | 63 |
| 82) | Imperceptibly | అసంలక్ష్యక్రమమున | 65 |
| 83) | Imitation at men action | కావ్యము మానవ వర్తనానుకరణము | 66 |
| 84) | Atmosphere | వాతావరణం | 66 |
| 85) | Its effect | కార్యమైనది | 66 |
| 86) | Subjective reality | ఆత్మాశ్రయమైన సత్యము | 73 |
| 87) | Objective reality | పరాశ్రయమైన సత్యము | 73 |
| 88) | Non-real | అసత్యము | 73 |
| 89) | Tragedy | విషాదం | 74 |

| | | | |
|---|---|---|---|
| 90) | Catharsis | భావనశబ్దము | 74 |
| 91) | Purgation | వైద్య సంబంధం | 74 |
| 92) | Purification | మత సంబంధము | 74 |
| 93) | Instinct | నైజములు | 79 |
| 94) | Emotions | భావములు | 79 |
| 95) | Instinct | నైజము | 79 |
| 96) | Attendant emotion | అనుగుణ భావము | 79 |
| 97) | Escape from danger | అపాయ–అపనయనము | 79 |
| 98) | Fear | భయము | 79 |
| 99) | Combat | ప్రతిభటత్వము | 79 |
| 100) | Anger | క్రోధము | 79 |
| 101) | Repugnance | అసహ్యత | 80 |
| 102) | Disgust | జుగుప్స | 80 |
| 103) | Curiosity | కుతూహలము | 80 |
| 104) | Adventure | సాహస ప్రియత్వము | 80 |
| 105) | Sex | కామము | 80 |
| 106) | Sexual desire | కామవాంఛ | 80 |
| 107) | Laughter | హాసము (నవ్వు) | 80 |
| 108) | Amusement | వినోదము | 80 |
| 109) | Cry or Distress | ఆక్రోశము | 80 |
| 110) | Helplessness | నిస్సహాయత | 80 |
| 111) | Parental Feeling | పుత్ర వాత్స్యలము | 80 |
| 112) | Self-assertion | ఆత్మాభినివేషము | 80 |
| 113) | Superiority | స్వాతిశయము | 80 |
| 114) | Self-abasement | ఆత్మావమానము | 80 |
| 115) | Subjection | విధేయత | 80 |
| 116) | Herd | సహవాసము (మంద) | 80 |
| 117) | Aversion to loneliness | ఏకాంత విముఖత్వము | 80 |
| 118) | Food seeking | ఆహారాన్వేషణ | 80 |

| | | | |
|---|---|---|---|
| 119) | Appetite | ఆకలి | 80 |
| 120) | Hoarding | ధనసంచయము | 80 |
| 121) | Feeling at owenship | స్వామ్యానందము | 80 |
| 122) | Construction | నిర్మాణం లేదా ఆశ | 80 |
| 123) | Feeling at creativeness | సృజనాభిలాష | 80 |
| 124) | Parental protection at the young | సంతాన రక్షణ | 80 |
| 125) | Parental feeling | పుత్రవాత్సల్యము | 80 |
| 126) | Fervour | ఉద్ధతరసము | 81 |
| 127) | He entered life | ఒకడు జీవితమున ప్రవేశించెను. | 81 |
| 128) | Possession | పరిగ్రహం | 82 |
| 129) | Physio-psychological science | శారీరక–మానసిక తత్త్వశాస్త్రం | 83 |
| 130) | To be imitated | అనుకరించాలి | 93 |
| 131) | Unifying factors | సంధి సామాగ్రి | 98 |
| 132) | Supernatural | దివ్యమైన | 100 |
| 133) | Historical | చారిత్రక | 100 |
| 134) | Personal | వ్యక్తిగత (సంసారిక) | 100 |
| 135) | Objective Poetry | ఆత్మాశ్రయ కవిత్వము | 101 |
| 136) | Poetry at experience | ఆత్మాశ్రయ కవిత్వం | 102 |
| 137) | Poetry at imagination | కవి యొక్క ఊహ | 102 |
| 138) | Lyrical poetry | భావకవిత్వము | 103 |
| 139) | Narrative form | కథన రూపం (ఆఖ్యానరూపం) | 103 |
| 140) | Dialogue form | సంవాదరూపం | 103 |
| 141) | Music | సంగీతం | 103 |
| 142) | Ballad Dance | నృత్యగీతం | 104 |
| 143) | Emotion | భావం | 104 |
| 144) | Motion | వేగం | 104 |
| 145) | Lyrical poetry | భావ కవిత్వం | 107 |
| 146) | Love lyrics | ప్రణయ గీతములు | 108 |

| | | | |
|---|---|---|---|
| 147) | Patriotic lyrics | దేశభక్తి గీతములు | 108 |
| 148) | Philosophical & Mystical lyrics | తత్వగీతములు | 108 |
| 149) | Elegies | స్మారక గీతములు | 108 |
| 150) | Satires | హేళన గీతములు | 108 |
| 151) | Natural Descriptions | ప్రకృతి వర్ణనలు | 108 |
| 152) | Lyrical poetry is the purest and the simple. | భావకవిత్వము అతి స్వచ్ఛము, అతి సులభం | 109 |
| 153) | Assumption at character | పాత్రారోపణము | 111 |
| 154) | Acting a drama | నాటకమును అభినయించుట | 113 |
| 155) | Facts | నిజాలు | 116 |
| 156) | Introduced | ప్రస్తుతింపబడును | 119 |
| 157) | Clue | కీలకం | 119 |
| 158) | Elements at plot | అర్ధ ప్రకృతులు | 125 |
| 159) | Development | బిందువు | 122 |
| 160) | Motif | బీజము | 122 |
| 161) | Scenes in an act | రంగములు | 123 |
| 162) | Main theme | అధికారకము | 126 |
| 163) | Episodical theme | ప్రాసంగికము | 126 |
| 164) | Plan | పథకము | 126 |
| 165) | Agreement | సమన్వయము | 126 |
| 166) | Structural divisions | నిర్మాణ విభాగాలు | 127 |
| 167) | Introduction | ప్రవేశము | 128 |
| 168) | Exposition | ఉన్మీలనము | 128 |
| 169) | Climax | శిఖరారోహణము | 128 |
| 170) | Denouncement | అవరోహణము | 128 |
| 171) | Catastrophe | ఉపసంహృతి | 128 |
| 172) | Epic | ఇతిహాసం | 132 |
| 173) | Comedy | ప్రహసనము | 132 |
| 174) | Pity | జాలి | 132 |

| | | | |
|---|---|---|---|
| 175) | Fear | భయము | 132 |
| 176) | Purgation at the emotion | భావ భావనము | 134 |
| 177) | Unity at plot | కథైక్యము | 135 |
| 178) | Unity at action | కార్త్యైక్యము | 135 |
| 179) | Unity at time | కాలైక్యమును | 136 |
| 180) | Unity at place | దేశైక్యమును గురించి | 136 |
| 181) | Unity at action | అభినవ ప్రాచీనులు | 137 |
| 182) | Zenith | అత్యున్నత స్థాయి | 137 |
| 183) | Neo-classicists | అభినవ ప్రాచీనులు | 139 |
| 184) | Romantic drama | కల్పనా చమత్కృతిగల నూతన నాటక సంప్రదాయము | 139 |
| 185) | Chorus | గాయక వర్గం | 141 |
| 186) | Contrast | ప్రతియోగము | 142 |
| 187) | Similarity | అనుయోగము | 142 |
| 188) | Hero | హీరో | 143 |
| 189) | Type | జాతి (జాతులు) | 143 |
| 190) | Literary criticism in antiquity | ప్రాచీన సాహిత్య విమర్శ | 151 |
| 191) | Aesthetic distance | సౌందర్య దూరం | 153 |
| 192) | Realists | స్వభావవాదులు | 157 |
| 193) | Dramas at character | నాటకములో పాత్రలు | 164 |
| 194) | Drama at incident | నాటకము కథా బీజము | 164 |
| 195) | Drama | నాటకము | 165 |
| 196) | Epic | మహా కావ్యం | 165 |
| 197) | Stage directions | అభినయ దిశలు | 166 |
| 198) | Art though contented | కళ అయితే తృప్తిగా ఉంటుంది | 171 |
| 199) | I am content | నాకు తృప్తిగోల్పినది | 171 |
| 200) | I am more sinned against than sinning | నేను చేసిన అన్యాయముల కంటె నాకే ఎక్కువ అన్యాయం జరిగినది | 171 |
| 201) | Imaginative pleasure | భావనాహ్లాదము | 181 |

| | | | |
|---|---|---|---|
| 202) | Public | ప్రకాశము | 186 |
| 203) | Private | అప్రకాశము | 186 |
| 204) | Abstract criticism | సాంకేతిక విమర్శ | 192 |

7.7. ముగింపు:

పింగళి లక్ష్మీకాంతం గారు ఇలా అనేక పారిభాషిక పదాలను తెలుగులోకి అనువాదం చేసి ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. నేటికీ వీటిలో అనేక పదాలు ప్రామాణికంగా ఉపయోగిస్తున్నారు. ఒకప్పుడు భాషా శాస్త్రాన్ని 'ఫైలాలజి' అని పిలిచేవారు. పింగళి వారు కూడా ' Modern philogists' అనే పదాన్ని ఆధునిక భాషాశాస్త్ర వేత్తలు అని అనువాదం చేశారు. Aesthetic arts సరస కళలు అని అనువాదం చేశారు. దీన్ని సౌందర్య శాస్త్రంలో విస్తృతంగా ఉపయోగిస్తారు.18 Imitation అనే పదాన్ని అనుకరణ అని ఉపయోగించారు. దాన్ని నేటికి అలాగే వాడుతున్నారు. Photography అనే పదానికి ఛాయా చిత్రం అని వాడుతున్నారు. కానీ దీన్ని ఆయన ఛాయ గ్రహణం అని ఉపయోగించారు. అనే పదాన్ని మనో ధర్మ శాస్త్ర వేత్తలు అని అనువాదం చేశారు. నేటికి దీన్ని Psychologists సైకాలజిస్ట్ లు అని తెలుగులో రాస్తున్నారు. Emotional aspect అనే పదానికి రసభావాంశము అని ఎంతో చక్కగా అనువాదం చేశారు. Aesthetic sense అనే దానికి రసబోధ అనడం చాలా బాగుంది. Feeling ఫీలింగ్ అనే పదానికి 'భావన' అని సందర్భాన్ని బట్టి రాశారు. కానీ ఫీలింగ్ అనేది 'అనుభూతి' అనడం బాగుంటుందేమో.

ఇలా సుమారు 410 పదాలను తెలుగులో పరిశోధన, విమర్శ, వ్యాకరణం, సాహిత్య చరిత్ర, సౌందర్య శాస్త్రం మొదలైన వాటిలో వినియోగించుకోవడానికి అనుకూలంగా పారిభాషిక పదజాల రూపకల్పనకు ఆయన విశేషంగా కృషి చేశారని తెలుస్తుంది. ఈ పారిభాషిక పదాలను ఆ సందర్భాలను మూల గ్రంథాలతో పోల్చుతూ తులనాత్మక భాషా శాస్త్ర పరిశోధన చేయడానికి అవకాశం ఉంటుందేమోననీ కూడా అనిపిస్తుంది.

మొత్తం మీద ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితాన్ని, రచనలను అధ్యయనం చేసినప్పుడు తొలితరం అధ్యాపకులలో ఉండే పరిశోధన, దాన్ని విద్యార్థులకు విమర్శనాత్మకంగా అందించే పద్ధతీ, దీన్ని అవసరమైనంతమేరకు ప్రాచ్య, పాశ్చాత్య సిద్ధాంతాలను అధ్యయనం చేయడంతోపాటు విద్యార్థులకు అందించడం తర్వాత తరాన్ని ప్రభావితం చేయడం వంటి అనేక అంశాలు పింగళి లక్ష్మీకాంతంగారిలో కనిపిస్తున్నాయి. ఈ అంశాలన్నింటినీ నా పరిశోధన కాలం,

పరిధి, పరిమితుల మేరకు వివరించే ప్రయత్నం చేశాను. ఫలితాంశాలలో నేను చేసిన పరిశోధనాంశాలను సంక్షిప్తంగా ప్రస్తావించాను. అంతేకాకుండా, ఆ పింగళి లక్ష్మీకాంతంగారి రచనలపై జరగాల్సిన పరిశోధన అంశాలను సూచించాను. నేను చేసిన సమన్వయాలన్నీ నా అవగాహన మేరకు కలిగినవని వినయపూర్వకంగా తెలియజేస్తున్నాను. నాకు తెలియని అంశాలను ఈ పరిశోధనలో ప్రస్తావించి వదిలేసాను.

ఈ పరిశోధన ప్రారంభించినప్పటినుంచి నా దృష్టి అంతా పింగళి లక్ష్మీకాంతంగారి రచనల సేకరణ, వారి బంధువులతోనూ, ఆయన సాహిత్య జీవిత విశేషాలు చర్చించడం, వారి శిష్యుల నుంచి వివరాలను సేకరించి వారితో వివిధ అంశాలను చర్చించడం ఇవన్నీ నాకు పింగళి లక్ష్మీకాంతంగారి పట్ల, ఆయన రచనల పట్ల, అభిమానాన్ని, ఇష్టాన్ని, పరిశోధనా ఆసక్తిని ఎంతగానో పెంపొందించాయని భావిస్తున్నాను. ఇంతకుముందు పరిశోధనలలో లభించని వ్యాసాలు, రచనలు, నవలలు వంటి విషయాలను నా పరిశోధనలో విశ్లేషించే ప్రయత్నం చేశాననీ చెప్పడమనేది నేను చేసిన పరిశోధనను విన్నవించడమే తప్ప గర్వంతో చెప్పడం కాదని వినయపూర్వకంగా తెలియజేస్తున్నాను.

# పరిశోధన ఫలితాంశాలు

# (Research Results)

పింగళి లక్ష్మీకాంతంగారు 1894 సంవత్సరంలో జన్మించారు. అప్పటికి భారతదేశానికి స్వాతంత్ర్యం రాలేదు. కానీ స్వాతంత్ర్య ఉద్యమం విస్తృతంగా జరుగుతున్న ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం 1856లో జరిగిపోయింది. ఆ తరువాత బ్రిటిష్ వారి పరిపాలన కొనసాగింది. లాల్, బాల్, పాల్ త్రయం భారత స్వాతంత్ర్య సంగ్రామం కోసం వారి వారి మార్గాల్లో తీవ్రంగా జాతీయ స్వాతంత్ర్య కోసం పోరాడుతున్నారు. మహాత్మాగాంధీజీ చేసిన స్వాతంత్ర్య ఉద్యమాన్ని కూడా పింగళి లక్ష్మీకాంతంగారు గమనించిన వారె. ఎందుకంటే ఆయన 1972 వరకు జీవించారు.

ఆయన తెలుగు సాహిత్యాన్ని జాగ్రత్తగా గమనిస్తే పాలక వర్గాన్ని వ్యతిరేకించే స్వభావం ఈయన రచనల్లో ఎక్కడ కనిపించదు. స్వాతంత్ర్య రాకముందు ఆయన ఆంగ్ల దేశ చరిత్రను (1931) తెలుగులోకి అనువాదం చేశారు. కానీ స్వాతంత్ర్యం తరువాత గాంధీ మహాత్ముని బోధనలు, సూక్తులు మొదలైన వాటిని తెలుగులోకి అనువాదం చేశారు. అంటే స్వాతంత్ర్యోద్యమం పట్ల బలమైన ఆకాంక్ష ఉన్నప్పటికి ఆయన స్వతఃసిద్ధంగా శాంతి కోరుకొనే వాడనీ, పాలక పక్షాల్ని వ్యతిరేకించే వాడు కాదనీ ఆయన జీవితాన్ని, ఆయన రచనల్ని అధ్యయనం చేసిన తరువాత తెలిసింది. ఆయన కాలంలోనే భారత స్వాతంత్ర్య ఉద్యమం రావడం తెలుగు సాహిత్యంలో భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, చేతనావర్తన కవిత్వం, విప్లవ కవిత్వం మొదలైన సాహిత్య ధోరణులు, ఉద్యమాలు వచ్చాయి. కానీ ఒక విమర్శకుడిగా, ఒక పరిశోధకుడిగా, ఒక సృజనకారుడిగా, ఒక వక్తగా ఈ వాదాలను, ధోరణులను ఆయన పట్టించుకోలేదని కేవలం పద్య కవిత్వంలో మాత్రం భావ కవిత్వ ప్రభావంతో కొన్ని పద్యాలను రాశాడని స్పష్టమౌతోంది.

ఆయన తన జీవిత కాలంలో ఆయన రాసిన రచనలన్నిటినీ జాగ్రత్తగా పరిశీలించినప్పుడు శుద్ధ కళా వాదాన్ని, సాహిత్య సౌందర్య అభిలాషను ప్రదర్శించారనీ తెలుస్తోంది. అయితే సమకాలీన అభ్యుదయ, దిగంబర,చేతనావర్త, విప్లవ కవిత్వ వాదాలు, ఉద్యమాల పట్ల తన వ్యతిరేకతను కూడా ప్రదర్శించలేదనీ ఈ అధ్యయనం వలన స్పష్టమౌతోంది. అంటే ఆయన సాహిత్యంలో సామాజిక ఉద్యమాలు ప్రతిఫలన పట్ల కొద్దిగా విశ్వాసం చూపించలేదని చెప్పవచ్చు. అందుకనే ఆయన అత్యధికంగా భారత, రామాయణాలు, భాగవతం, ప్రబంధాలు, కావ్యాలు, నాటక సాహిత్యం మొదలైన వాటిపైనే ఎక్కువగా దృష్టిని పెట్టారని ఈ అధ్యయనం వలన తెలుస్తోంది. కానీ సమకాలీన

సాహిత్య, సామాజిక, పరిణామాలను గుర్తించడం వలనే సాహిత్య చరిత్ర యుగ విభజనలో ఆధునిక యుగం అని ఒక యుగాన్ని పేర్కొన్నారు. దీన్ని బట్టి సామాజిక సాహిత్య పరిణామాలకు తనకు తెలిసిన వాటిని ఒక సాహిత్య చరిత్రకారుడిగా యుగ విభజన చేసే వరకు మాత్రమే అంగీకరించారు. అంటే సామాజిక ప్రయోజనాల్ని ముఖ్యంగా ఉద్యమ ప్రభావాల్ని సాహిత్యంలో గుర్తించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకున్నాడనిపిస్తుంది. భవిష్యత్తులో రాబోయే సాహిత్య సమాచారమే వాటి ప్రభావాల్ని , గుర్తించవచ్చులేననీ వాటి గురించి తన అభిప్రాయాలుగా ఎక్కడ చెప్పలేదనీ అనుకోవచ్చు. పింగళి లక్ష్మీకాంతంగారు అప్పటికే తెలుగు శాఖ అధ్యక్షుడిగా ఉండడం వలన తెలుగు భాషా, సాహిత్యాల్లో వస్తున్న మార్పుల్ని గుర్తించే అవకాశం ఉంది.

**ఈ పరిశోధనను దీనివల్ల కింది ఫలితాంశాలు.**

* ఆంధ్ర సాహిత్య చరిత్ర గ్రంథంలో సాహిత్య చరిత్ర నిర్మాణం కోసం కవి కాల నిర్ణయం, కవి రచనాకాల నిర్ణయం, సాహిత్య యుగ విభజన వంటి అంశాలలో అనుసరించిన పరిశోధనా దృక్పథాన్ని మరింత లోతుగా విశ్లేషణ చేయడానికి అవకాశం కలుగుతుంది. ఒక రచన విలువల్ని నిర్ణయించేటప్పుడు కేవలం ఆ రచనకే పరిమితం కాకుండా, అటువంటి ఇతివృత్తం కలిగిన రచనలను కూడా పరిశీలించి కావ్య ఉత్తమత్వాన్ని నిర్ణయించే లక్షణం పింగళి లక్ష్మీకాంతం గారి విమర్శలో ఉందని చెప్పిన పలు సందర్భాల్ని ఉదాహరణగా చెప్పవచ్చు.

* సాహిత్య శిల్ప సమీక్ష గ్రంథంలో భారతీయ పాశ్చాత్య కావ్య సంప్రదాయాలను సమన్వయించిన విధానాన్ని గురించి, గౌతమ వ్యాసములు అనే సంపుటిలో వివిధ కావ్యాలకు రాసిన పీఠికలలో పరిశోధనా దృక్పథాన్ని అధ్యయనం చేయడానికి ప్రస్తుత పరిశోధన తోడ్పడుతుంది.

* ఆత్మలహరి, తొలకరి వంటి ఖండకావ్యాల రచయితగా, కాటూరి వెంకటేశ్వరరావుతో కలిసి జంట కవిత్వాన్ని చెప్పిన కవిగా, తెలుగులో విజ్ఞాన సర్వస్వ నిర్మాతగా, గాంధీజి ప్రవచనాలను తెలుగులోకి అనువదించిన అనువాదకుడిగా పింగళివారిని ఆధునిక తరానికి పరిచయం చేయడానికి ఈ పరిశోధన తోడ్పడుతుందని విశ్వసిస్తున్నాను.

* పింగళి లక్ష్మీకాంతంగారి పేరు చెప్పగానే ఆయన్ని ఒక విమర్శకుడిగా, పరిశోధకుడిగా మాత్రమే అత్యధికులు పేర్కొనేవారు. కానీ ఈ పరిశోధన వల్ల ఆయన ఒక అనువాదకుడుగాను, ఒక గొప్ప కవిగాను, ఒక గొప్ప ఆధ్యాత్మిక భావాలు గల వ్యక్తి గాను గుర్తించే అవకాశం ఉంది.

* దీనితో పాటు పింగళి లక్ష్మీకాంతంగారు తన అధ్యాపకం, అధ్యయనం, కవిత్వం, పరిశోధన, విమర్శ, అనువాదం మొదలైన రంగాలలో లబ్ధ ప్రతిష్టలై తెలుగు భాషా, సాహిత్యాలకు ఎంతో సేవ చేశారని ఈ పరిశోధన ద్వారా గుర్తించే అవకాశం ఉందని భావిస్తున్నాను.

* ఆత్మలహరి, తొలకరి అనే ఖండకావ్యాల్లో ఉన్న కవిత్వ మర్మాల్ని పరిశీలిస్తే పింగళి లక్ష్మీకాంతంగారు నవ్యసాహిత్య దృక్పథంతో నాటి భావకవిత్వ ఉద్యమానికి ప్రభావితమైయ్యారని

భావిస్తున్నాను. ఈ భావాల్ని ఆయన కాటూరి వెంకటేశ్వరరావుగారితో కలిసి జంటగా అనుసరించారని విశ్వసిస్తున్నాను. పింగళివారు భావకవిత్వ శాఖల్లోని స్మృతి కవిత్వం, ప్రకృతి కవిత్వం, దేశభక్తి కవిత్వం, సంఘసంస్కరణ కవిత్వం, ప్రణయ కవిత్వం ధోరణులకు ప్రభావితమైయ్యారని పైన తెలిపిన కావ్యాలే నిదర్శనాలేనని భావిస్తున్నాను.

* సాహిత్య శిల్ప సమీక్ష గ్రంథంలో భారతీయ పాశ్చాత్య కావ్య సంప్రదాయాలను సమన్వయించిన విధానాల్ని గమనిస్తే ఆయన రసవాదిగా కనిపిస్తారు.

# సింహావలోకనం

*'పింగళి లక్ష్మీకాంతం జీవితం, రచనల పరిశీలన'* అనే ఈ సిద్ధాంత వ్యాసం ఏడు అధ్యాయాలుగా విభజించాను. ఈ సిద్ధాంత వ్యాసంలో ఇమిడ్చిన ఒక్కొక్క అధ్యాయంలో నేను పరిశోధించి పరిశీలించి వెల్లడించిన అంశాలను ఈ కింది విధంగా తెలియజేస్తున్నాను.

*మొదటి అధ్యాయం* *'పింగళి లక్ష్మీకాంతం జీవితం: రచనల పరిచయం'* లో పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం, కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, గురు శిష్యుల సంబంధం, వివాహం, ఉద్యోగం(విశ్వవిద్యాలయ అధ్యాపకుడు), పొందిన బహుమతులు, సత్కారాలు,చెపట్టిన పెదవులు, మొదలైన వాటిని సంక్షిప్తంగా పరిచయం చేశాను. దీనితో పాటు ఆయన సాహిత్య రచనల్ని తెలిపి అందులో లభ్యమైన రచనలు, అలభ్య రచనల వివరాలు, వాటిలోని వైవిధ్య భరితమైన రచనలు, ఇతర రచనలు చేశారని తెలుపుతూ వాటిని సోదాహరణంగా వివరించాను. వెరసి ఈ అధ్యాయంలో పింగళివారి జీవితమంతా కవిత్వం, విశ్వవిద్యాలయ బోధన, పరిశోధన, విమర్శ వంటి సాహిత్య కృషితోనే కొనసాగిందని తెలియజేసే ప్రయత్నం చేశాను. మొత్తంగా గమనిస్తే ఈ అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతం గారి జీవితంతో పాటు ఆయన సమగ్ర సాహిత్య రచనలన్ని తెలుగు సాహిత్య చరిత్ర నిర్మాణానికి ఏ విధంగా తోడ్పడుతాయో ఉదాహరించాను.

*రెండో అధ్యాయం* *'పింగళి, కాటూరి: జంట కవిత్వం (తొలకరి) పరిశీలన'* అనే రెండో అధ్యాయంలో *తొలకరి* కావ్యం గురించి విశ్లేషించాను. ఇంతకు ముందు అధ్యాయంలో పింగళి లక్ష్మీకాంతంగారు వైవిధ్య భరితమైన రచనలు చేశారని పేర్కొన్నాను. ఆయన తొలి దశలో ఛందోబద్ధమైన కవిత్వాన్ని చేపట్టి కావ్యాన్ని రచించారు. ఈ నేపథ్యంలో కాటూరి వెంకటేశ్వరరావు గారితో కలిసి జంటగా సౌందరనందం, తొలకరి అనే కావ్యాల్ని రచించారు. ఈ అధ్యాయంలో కేవలం పింగళి, కాటూరివారి ***'తొలకరి'*** అనే ఖండ కావ్యం యొక్క విశిష్టతను తెలిపాను. దీనిలో విభిన్నమైన వస్తువును తీసుకొని వాటితో సృజించిన కవిత్వ లోతులను పేర్కొన్నాను. దీనిలోని కవిత్వాన్ని గమనిస్తే ఈ జంట కవులు ప్రకృతి కవిత్వం పట్ల మమేకమై వివిధ ఋతువుల్లో వచ్చే తెలుగు వారి పండుగలు, చెట్లు, ఫలాలు మొదలైన వాటి ప్రత్యేకతలను తెలిపారని తెలియజేశాను. దీనితో వీరి కవిత్వంలో వీర రసాలను ఉద్బోధించే చారిత్రకమైన వీరగాథలను కవిత్వీకరించడం మరొక ప్రత్యేకత కూడా కనిపిస్తుందని పేర్కొన్నాను. ఈ విధంగా ఈ అధ్యాయంలో పింగళి, కాటూరి జంట రచన తొలకరి ఖండకావ్యం యొక్క పరమార్థాన్ని తెలియజేశాను.

*మూడో అధ్యాయం **పింగళి, కాటూరి సౌందరనందం కావ్య వైశిష్ట్యం.*** ఈ అధ్యాయంలో పింగళి, కాటూరి కవులు జంటగా రాసిన ***'సౌందరనందం'*** అనే బౌద్ధ కావ్యం గురించి పరిచయం చేశాను. ఈ కావ్యానికి మూలం సంస్కృత కవి అశ్వఘోషుడు రాసిన సంస్కృత సౌందరనందమనీ పూర్వ వైభవం చెప్పిన అభిప్రాయాలనే తెలిపాను. అందులోని ఇతివృత్తం, సుందరి, నందుడు, బుద్ధుడు వంటి పాత్రల గొప్పతనాల్ని పేర్కొన్నాను. దీనితో పాటు ఈ కావ్యంలోని పాత్రల సంభాషణలు, వర్ణనలు, అలంకారాలు మొదలైన వాటిని సోదాహరణంగా వివరించాను.

*నాలుగో అధ్యాయం **'పింగళి లక్ష్మీకాంతం స్వతంత్ర పద్య కవిత్వం పరిశీలన'*** ఇంతకు ముందు అధ్యాయాలలో పింగళి లక్ష్మీకాంతం గారి జంట కవిత్వాన్ని అందులోని విశేషాలను తెలియజేశాను. ఈ అధ్యాయంలో కేవలం పింగళి లక్ష్మీకాంతం గారు రచించిన ***'ఆత్మ లహరి'*** అనే ఖండ కావ్యం గురించి విశ్లేషించాను. ఈ ఆత్మ లహరిలోని కవిత్వాన్ని చూస్తే ఇది పింగళివారి స్వీయ చరిత్రగా అవగతమౌతుంది. దీనిలోని ఒక్కొక్క ఖండిక తన అంతరాత్మను, తన గురువును, తన భార్యను, భగవంతుడు, తన మిత్రులను, దేశానికి ని స్వార్థ సేవలు చేసిన నాయకులు మొదలైన వారి గురించి ఎంతో చక్కగా ఛందోబద్ధమైన కవిత్వంలో బంధించారని తెలిపాను. ముఖ్యంగా తన గురించి,తన భార్య గురించి, భగవంతుడి గురించి స్ఫురిస్తూ ఆధ్యాత్మిక చింతనను మొదలైన విధానాలను పేర్కొన్నాను.

*ఐదో అధ్యాయం **'విమర్శకుడిగా పింగళి లక్ష్మీకాంతం'.*** ఈ అధ్యాయంలో పింగళి వారి, గౌతమ వ్యాసములు, ఆంధ్ర సాహిత్య చరిత్ర, సాహిత్య శిల్ప సమీక్ష, నా రేడియో ప్రసంగాలు, ఇతర వ్యాసాలు మొదలైన వాటన్నింటిలో ఆయన సాహిత్య విమర్శ కృషిని పొందుపరిచాను. ఆయన అనుసరించిన కవి జీవిత విమర్శ, తులనాత్మక విమర్శ, అలంకారిక విమర్శ, సాంఘిక విమర్శ, గ్రంథ పరిష్కరణ విమర్శ మొదలైన విమర్శ పద్ధతుల్లోని విశేషాలను తెలియజేశాను.

*ఆరో అధ్యాయం **'పరిశోధకుడిగా పింగళి లక్ష్మీకాంతం'.*** ఈ అధ్యాయంలో ఆంధ్ర సాహిత్య చరిత్రలో, ప్రక్రియల గురించి, గ్రంథ కర్తృత్వ గురించి ఆయన వెలువరించిన అభిప్రాయాలు ఏ విధంగా పరిశోధనాత్మకంగా వివరించి వాటిని సమన్వయించిన రీతుల్ని పేర్కొన్నాను. ఆయన పీఠికల్లోను, ఇతర వ్యాసాల్లోను కొన్ని తీర్పులు, ప్రకటనలు వెల్లడించారు. వాటిలో కూడా పరిశోధన దృక్పథం కనిపిస్తుందని సోదాహరణంగా తెలియజేశాను.

*ఏడో అధ్యాయం **'అనువాదకుడిగా పింగళి లక్ష్మీకాంతం'.*** ఇంతకు ముందు అధ్యాయాలలో పింగళివారు కవిత్వం, పీఠికలు, పరిశోధన, విమర్శ మొదలైన ప్రక్రియల్లో సాహిత్య కృషిని కొనసాగించారని ప్రస్తావించాను. ఈ అధ్యాయంలో పింగళి వారు అనువాద ప్రక్రియలో కూడా సాహిత్య కృషి చేశారని పేర్కొన్నాను. ఆయన అనువాదంలో బగ్ జార్గల్ , మాబిడీక్ అనే ఆంగ్ల నవలల్ని , ఆంగ్ల దేశ చరిత్ర, మానవులందరు సోదరులు అనే వాటిని తెలుగులోకి అనువదించారు. ఈ రచనలన్నింటి గురించి ఈ అధ్యాయంలో సంక్షిప్తంగా పరిచయం చేశాను.

**భవిష్యత్ పరిశోధనాంశాలు:**

*'పింగళి లక్ష్మీకాంతం జీవితం, రచనల పరిశీలన'* అనే అంశంపై పరిశోధన చేసిన తర్వాత వారి రచనలపై ఇంకా విస్తృతంగా పరిశోధన చేయడానికి అవకాశం ఉందని నాకు అనిపించింది. ఈ నేపథ్యంలో పింగళివారి జీవితం, సాహిత్యం గురించి పరిశీలించి వెల్లడించే ప్రయత్నం చేశాను. ఈ సమయంలో ఆయనకు సమకాలికులుగా, జంటకవిగా, మిత్రుడిగా ఎంతో సహకారాన్ని అందించిన కాటూరి వెంకటేశ్వరరావుగారి జీవితం, సాహిత్య విశేషాలను కూడా సంక్షిప్తంగా తెలుసుకోగలిగాను. దీనితో పాటు పింగళి, కాటూరి కవులు సాహిత్య చరిత్రలో జంటకవులుగా ప్రసిద్ధులని కొందరు పరిశోధకులు అభిప్రాయపడ్డారు. ఈ కారణం వలన పింగళి, కాటూరి కవుల సాహిత్య సేవలను భవిష్యత్ పరిశోధకులు మరింత విస్తృతంగా పరిశోధనలు చేయవచ్చనే తెలుపుతూ ఆ పరిశోధనాంశాల వివరాలను ఈ కింది విధంగా తెలియజేస్తున్నాను. పింగళి లక్ష్మీకాంతం పద్యకావ్యాలు భాష, సాహిత్యాలపై ప్రత్యేకించి పరిశోధన చేయవచ్చు. అలాగే వారి అనువాద సాహిత్యంపైన, వారి సాహిత్య విమర్శ, పరిశోధనలపైన ప్రత్యేకించి పరిశోధన చేయడానికి అవకాశం ఉంది. వీటితో పాటు ఆయన ఉపయోగించిన పారిభాషిక పదజాలంపై ఒక పరిశోధన చేయడానికి కావల్సినంత సమాచారం ఉంది.

సాధారణంగా ఇంతకముందు పింగళివారిపై పరిశోశనలు జరిగాయని ఇక ప్రత్యేకించి పరిశోధన చేయడానికి ఏముంది అనుకోవడానికి నేను చేసిన పరిశోధన ఒక ఉదాహరణగా నాకు అనిపిస్తుంది. నేను కూడా ఆయనపై పరిశోధన చేయడానికి అంత అవకాశం ఏముంటుందని అనుకున్నాను కానీ ఇంత వరకు జరిగిన పరిశోధనలో కనీసం ప్రస్తావించని ఆయన రచనలు కొన్ని లభించాయి. వాటినన్నింటిని నా మొదటి అధ్యాయంలో పెట్టాను. అలాగే సందర్భానుసారంగా వివిధ అధ్యాయాలలో కూడా వివరించాను. అలాగే భవిష్యత్తులో పరిశోధన చేయాలనుకొనేవారు ఎన్నో నూతన అంశాలను పరిశోధన చేయడానికి అవకాశం ఉందనుకుంటున్నాను.

# ఉపయుక్త గ్రంథ సూచికలు


ఆరుద్ర. (2007). *సమగ్రాంధ్ర సాహిత్యం*. హైదరాబాద్: తెలుగు అకాడమీ ప్రచురణ.

ఇనాక్, కొలకలూరి.(2001). ***తెలుగు వ్యాస పరిణామం.*** హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

ఉమేష్, బడిగే.(2019). ***రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ జీవితం, రచనలు: సమగ్ర పరిశీలన.*** హైదరాబాద్: (అముద్రితం) పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం హైదరాబాద్ విశ్వవిద్యాలయం

కరుణశ్రీ, (1954). ***పుష్పవిలాపం.*** గుంటూరు: ఉదయశ్రీ (ప్రథమ భాగం,24వముద్రణ).

చంద్రశేఖర రెడ్డి. రాచపాళెం.(1975). ***శిల్ప ప్రభావతి.*** తిరుపతి: (అముద్రితం) పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

దేవులపల్లి, కృష్ణశాస్త్రి. (2021). ***కృష్ణపక్షం.*** హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

నమశ్శివాయ, గూడూరి.(1991). ***శ్రీ పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర.*** సికింద్రాబాద్: చార్మినార్ ఆర్ట్ ప్రింటర్.

నళిని.ఎస్.ఎస్.(2009). ***సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ.*** హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.

నాగయ్య, జి. (1967). ***ద్విపద వాఙ్మయము.*** తిరుపతి: మాలికో ప్రింటర్స్.

నాగయ్య, జి. (2009). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** (ప్రథమ, ద్వితీయ సంపుటాలు). తిరుపతి: నవ్య పరిశోధన ప్రచురణ.

నాగేశ్వరరావు, పింగళి. (2007). ***పింగళి వంశ చరిత్ర.*** హైదరాబాద్: వాగ్దేవి ప్రింటర్.

నారాయణ మూర్తి, డి.వి.యస్. (2002). ***ఆంధ్ర కావ్య శిల్పజ్ఞ శేఖరుడు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు*** వ్యాసం. విశాఖపట్నం: అనుపమా ప్రింటర్స్.

నారాయణరెడ్డి, సి. (1989). ***ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు.*** హైదరాబాద్: (ముద్రిత) పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

నిత్యానందరావు, వెల్దండ.(2013). ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన.*** హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం.

పద్మనాభ రావు, అనంత.(2022). ***ఆచార్య దేవోభవ (160మంది విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యుల జీవన రేఖలు.)*** హైదరాబాద్: అక్షయ గ్రాఫిక్స్.

పింగళి, కాటూరి కవులు. (1923). ***తొలకరి.*** (పద్య ఖండకావ్య సంపుటి). బందరు: కృష్ణా స్వదేశి ముద్రాక్షరశాల.

పింగళి, కాటూరి. (1929), ***బిగ్ జార్జల్*** (అనువాదం). విజయవాడ: దేవి ప్రెస్.

పింగళి, కాటూరి. (2001). ***సౌందరనందము.*** (ఎనిమిదో ముద్రణ). హైదరాబాద్:
వై.ఎమ్.ఏ. పబ్లికేషన్స్, జూబ్లీహిల్స్.

ప్రకాశరావు, గొల్లపూడి.(1999). ***భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి–కాటూరి*** న్యూఢిల్లీ:
భారతీయ సాహిత్య అకాడమి ప్రచురణ.

భాస్కరరావు, వాసిరెడ్డి. సత్యనారాయణ, సుంకర.(1947). మాభూమి(నాటకం).
విజయవాడ: ఆంధ్ర ప్రింటర్స్.

రంగనాథాచార్యులు, కే.కే. (2006). ***ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు.***
హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.

రమాదేవి. (1996). ***ఆంధ్ర సౌందరనంద కావ్యము–సమాలోచనాత్మక అనుశీలన***. అనంతపురం:
పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం శ్రీకృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం.

రామ మోహన రాయ్, కడియాల.(1982).***తెలుగు కవితా వికాసం.*** హైదరాబాద్:
ఆంధ్ర ప్రదేశ్ సాహిత్యఅకాడమి, ప్రచురణ.

రామకృష్ణయ్య, కోరాడ. లక్ష్మీకాంతం, పింగళి.(1930). ***విష్ణు పురాణము పరిష్కరణ***. మద్రాసు:
ఓరియంటియల్ మ్యాన్ స్క్రిప్టు ప్రచురణ.

రామానుజారావు, చిలుకమర్తి.(1967).***కళ్యాణ రాఘవము.***(కావ్యం) బందరు: త్రివేణి పబ్లికేషన్స్.

రామారావు, ఎస్వీ. (2014).***తెలుగులో సాహిత్య విమర్శ అవతరణము–వికాసములు.***
హైదరాబాద్: ఎస్. స్వయంప్రభ పబ్లికేషన్స్.

రామారావు, ఎస్వీ.(2017). ***సమగ్ర తెలుగు సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: పసిడి ప్రచురణలు.

రాములు, పిల్లలమర్రి. (2015). ***తెలుగులో భక్తి కవిత్వం సామాజిక విశ్లేషణ.***
హైదరాబాద్: (ముద్రితం), పిహెచ్. డి సిద్ధాంత గ్రంథం ప్రజాశక్తి బుక్ హౌస్.

లక్ష్మణ చక్రవర్తి, సిహెచ్. వారిజారాణి. పి, విజయకుమార్, జి. (సంపా).(2008).
***ఆధునిక సాహిత్య విమర్శకులు –ప్రస్థానాలు*** (***తొలి మలి తరాలు***)
హైదరాబాద్: నవచేతన పబ్లికేషన్స్.

లక్ష్మణ చక్రవర్తి, సిహెచ్. సంపత్కుమారాచార్య, కోవెల. (సంపా).(2016).
***విజ్ఞాన సర్వస్వం సంపుటం:ii తెలుగు సాహిత్య విమర్శ దర్శనం*** . హైదరాబాద్:
శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

లక్ష్మీకాంతం శ్రేష్ఠి, పాలాది.(2015).***తెలుగులో జంట కవులు.*** (ద్వితీయ భాగము)కడప:,
వాసవీ గ్రాఫిక్స్, ప్రచురణ.

లక్ష్మీకాంతం, పింగళి. (1964). ***మానవులందరు నా సోదరులు.*** మచిలీపట్టణము:

కేంద్ర సాహిత్య అకాడమీ పక్షాన, త్రివేణి ప్రెస్.

లక్ష్మీకాంతం, పింగళి. (1966). ***సాహిత్య శిల్ప సమీక్ష***. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లికేషన్స్.

లక్ష్మీకాంతం, పింగళి.( 1971). ***సంస్కృత కుమార వ్యాకరణము***. తిరుపతి: శ్రీతిరువేంకటేశ్వర ప్రెస్.

లక్ష్మీకాంతం, పింగళి.(1933). ***ప్రభావతీ ప్రద్యుమ్నము–దాని మూలము. మద్రాసు:*** మద్రాసు విశ్వవిద్యాలయం.

లక్ష్మీకాంతం, పింగళి.(1942).***రంగనాథరామాయణము పరిష్కరణ***. వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్ ప్రచురణ.

లక్ష్మీకాంతం, పింగళి.(1943). ***ద్విపద భారతము పరిష్కరణ.*** వాల్తేరు: ఆంధ్ర విశ్వకళా పరిషత్, ప్రచురణ.

లక్ష్మీకాంతం, పింగళి.(1952). ***గౌతమ వ్యాసములు.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

లక్ష్మీకాంతం, పింగళి.(1954). ***మధుర పండిత రాజము.***(ఖండకావ్యం) హైదరాబాద్: పింగళి సూర్య సుందరం ప్రచురణలు.

లక్ష్మీకాంతం, పింగళి.(1961). ***పల్నాటి వీర చరిత్ర పరిష్కరణ***. విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణ.

లక్ష్మీకాంతం, పింగళి.(1974). ***ఆంధ్ర సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: తెలుగు అకాడమీ ప్రచురణ.

లక్ష్మీకాంతం, పింగళి.(1974).***ఆత్మ లహరి.*** (ఖండకావ్యం).బందరు: త్రివేణి పబ్లికేషన్స్.

లక్ష్మీకాంతం, పింగళి.(2018). ***ఆంధ్ర సాహిత్య చరిత్ర.*** హైదరాబాద్: నవచేతన పబ్లిషింగ్ హౌస్.

లక్ష్మీకాంతం, పింగళి.(2021). ***మాబీడిక్*** (అనువాదం). విజయవాడ: క్లాసిక్ బుక్స్ ప్రచురణ.

లక్ష్మీనారాయణ. గంగిశెట్టి, (2017). ***సాహిత్య పరిశోధనా కళ: విధానం (సాహిత్య విశ్లేషణా విధానాలు: సాంకేతికతల పరిచయంతో)*** . హైదరాబాద్ : హిమాలయ గ్రాఫిక్స్.

విశ్వనాథనాయుడు, జి. (1992). ***పింగళి లక్ష్మీకాంతంగారి వ్యక్తిత్వము– సాహిత్యము.*** తిరుపతి: (అముద్రితం)పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

వీరభద్రరావు, కొత్తపల్లి.(1986). ***తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము.*** సికింద్రాబాద్: శివాజీ ప్రెస్.

వీరేశలింగం, కందుకూరి.(2008). ***ఆంధ్ర కవుల చరిత్ర***. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లికేషన్స్ హౌస్.

వెంకటసుబ్బయ్య, వల్లంపాటి.(2002). ***నవలా శిల్పం.*** హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

వెంకటేశ్వరరావు, దార్ల. (2003). ***పరిశోధకుడుగా ఆరుద్ర***. హైదరాబాద్ :

(అముద్రితం) పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

వెంకటేశ్వరరావు, దార్ల.(1999). ***జ్ఞానానంద కవి ఆమ్రపాలి పరిశీలన.*** హైదరాబాద్: జోత్స్న కళా పీఠం.

వెంకటేశ్వరరావు, దార్ల.(2009). ***వీచిక*** (సాహిత్య విమర్శ వ్యాసాల సంపుటి). ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్ హైదరాబాద్.

వేంకట కృష్ణారావు, పింగళి. (2013). ***పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము.*** విజయవాడ: నిర్మలా ఆఫ్ సెట్ ప్రింటర్స్.

వేంకటకృష్ణారావు, పింగళి.(1992). ***కాటూరివారి సాహితీ సమాలోచనము.*** విజయవాడ: శ్రీ రాఘవేంద్ర ముద్రణ.

వేంకటరామనరసింహం, కాకర్ల. (1985). ***సాహిత్య దర్శనం.*** విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్.

వేంకటావధాని, దివాకర్ల.(2009). ***ఆంధ్ర వాఙ్మయ చరిత్ర.*** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.

వేంకటావధాని, దివాకర్ల.(2013). ***సాహిత్య సోపానములు.*** హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ.

వేంకటేశ్వర్లు, మందపూడి. 1993). ***రాయలయుగ ప్రబంధములలో ఉపాఖ్యానములు.*** హైదరాబాద్: షాబారి ఆర్ట్ ప్రింటర్స్.

శర్మ నాగభూషణ, మొదలి. (2011). ***తొలినాటి తెలుగు నాటక విమర్శ పురాణం సూరి శాస్త్రిగారి నాట్యాంబుజము.*** చెన్నై: కళా తపస్వి క్రియేషన్,

శివనాగిరెడ్డి, ఈమని.(2020). ***గోనబుద్ధారెడ్డి రంగనాథరామాయణంపై పరిశోధనలు.*** విజయవాడ: శ్రీ రాఘవేంద్ర ప్రచురణ.

శ్రీరామ అప్పారావు, పోణంగి. రామకృష్ణమాచార్య, నందూరి. సూర్యసుందరం, పింగళి. (సంపా).(1994). ***రసజ్ఞ శిల్పి: ఆచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక.***విశాఖపట్టణం: శ్రీనివాస్, పి.డా. ప్రచురణ.

శ్రీరామ అప్పారావు, పోణంగి.(సంపా.).(1974). ***ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక.*** హైదరాబాద్: విజ్ఞాన సమితి తెలుగు అకాడమీ.

శ్రీరామమూర్తి, కొర్లపాటి.(1996). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** (చతుర్థ భాగం) **విశాఖపట్టణము.** రమణశ్రీ ప్రచురణ.

శ్రీరామమూర్తి, కొర్లపాటి.(1996). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** (తృతీయ భాగం) విశాఖపట్టణము. రమణశ్రీ ప్రచురణ.

శ్రీరామమూర్తి, కొర్లపాటి.(1996). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** (ద్వితీయ భాగం) **విశాఖపట్టణము.**

రమణశ్రీ ప్రచురణ.

శ్రీరామమూర్తి, కొర్లపాటి.(1996). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** (పంచమ భాగం) **విశాఖపట్టణము.** రమణశ్రీ ప్రచురణ.

శ్రీరామమూర్తి, కొర్లపాటి.(1996). ***తెలుగు సాహిత్య చరిత్ర.*** (ప్రథమ భాగం) **విశాఖపట్టణము.** రమణశ్రీ ప్రచురణ.

సీతారామయ్య, కురుగంటి.(1994). ***నవ్యాంధ్ర సాహిత్య వీధులు.*** హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ.

సుబ్బారావు, తంగిరాల. ***ఆచార్య పింగళి లక్ష్మీకాంతం.*** (వ్యాసం) హైదరాబాద్: మిసిమి మాస పత్రిక(2018).

సుబ్రహ్మణ్యం, జి.వి.(1986).***ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం***, హైదరాబాద్: జి.వి. సుబ్రహ్మణ్యం షష్ఠిపూర్తి ప్రచురణలు,

సుమన్ బాబు, జంధ్యాల.(2003). ***ఆధునికాంధ్ర కవిత్వంలో బౌద్ధ కావ్యములు– తులనాత్మక పరిశీలన.*** విజయవాడ: (ముద్రితం) పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం నిర్మలా ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్.

సూర్య కుమారి, ఎస్.వి.(1989). ***తెలుగులో సాహిత్య చరిత్రలు.*** హైదరాబాద్: ఎం.ఫిల్ సిద్ధాంత వ్యాసం హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

సూర్యసుందరం, పింగళి.(2010). ***పింగళి లక్ష్మీకాంతం.*** హైదరాబాద్: (ప్రథమ, ముద్రణ) సి పి బ్రౌన్ అకాడమి.

# అనుబంధం–1

# పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం, సాహిత్యంపై జాతీయ సదస్సుల, పరిశోధన పత్రాలు





మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 18 - Special Issue. 7 - July 2021 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-



**EDITORIAL BOARD**

*Chief Editor*

**PITTA SANTHI**

***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***

C/o. **Dr. Busi Venkataswamy**

Holy Homes Apartment, Postal colony ,

4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

**ADVISORY COMMITTEE**

1. **Prof. G. Yohan Babu (Rtd.),** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San).,
M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao,** M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

**ASSOCIATE EDITORS**

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics
and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Associate Professor,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

# Contents (విషయ సూచిక)

| | | |
|---|---|---|
| 1. ప్రాచీనకాలంలో భారత జీవన విధానం | - డా॥. బ్రహ్మానందరెడ్డి | 15 |
| 2. భారతీయ జీవన విధానం - స్త్రీ వాద కవిత్వం | - డా॥. బూర్గుల స్వరూప | 19 |
| 3. ప్రాచీన తెలుగు సాహిత్యము - ప్రజాజీవన విధానము | - డా॥. సి. నర్సింహులు | 22 |
| 4. డా॥ శాంతినారాయణగారి "బతుకుబంతి కథలు"... | - డా॥. సి. శివన్న | 26 |
| 5. పల్నాటి వీరచరిత్ర - భారతీయ జీవన విధానం | - డా॥. సి. ఉదయశ్రీ | 32 |
| 6. గురజాడ 'కన్యాశుల్కం' - జీవనరీతులు | - డా॥. కె. రామలక్ష్మి | 37 |
| 7. నవలా సాహిత్యంలో - జాతియోద్యమాన్ని చిత్రీకరించిన నవలలు | - డా॥. కడివెండి మమత | 41 |
| 8. బి.సి. కథలు - వృత్తి సమస్యలు | - డా॥. కడియాల వెంకటరమణ | 45 |
| 9. సనాతన సాహిత్యంలో సామాజిక జీవన విశ్లేషణ | - డా॥. కప్పగంతు రామకృష్ణ | 49 |
| 10. భారతీయ జీవనవిధానంలో - జానపద వైద్యం | - డా॥. ఎం. ప్రభావతి | 54 |
| 11. జానపదం - జీవితాంశాలు | - డా॥. మామిడి మురళి | 59 |
| 12. మాడభూషి 'మూడోమనిషి' కవిత్వం - మన జీవన స్థితిగతులు | - డా॥. మానమ మునిరత్నం | 66 |
| 13. భారతీయ సంస్కృతి - జానపదుల జీవన విధానం | - ఎన్. దీపిక | 74 |
| 14. శ్రీ గురజాడ వారి గేయ సాహిత్యం - భావ తరంగాలు | - డా॥. పైడిపాటి ఉమానాథ శర్మ | 78 |
| 15. సారస్వత మహోదయం | - డా॥. శారదాపూర్ణ శొంఠి | 83 |
| 16. జానపద గేయసాహిత్యం - భారతీయ జీవన విధానం | - డా॥. తండు కృష్ణ కౌండిన్య | 93 |
| 17. గేయ సాహిత్యం - భారతీయ జీవన విధానం | - డా॥. గురుజాడ రాజరాజేశ్వరి | 97 |
| 18. కరుణశ్రీ, సుధాంశుల సృజన సాహితి | - జంధ్యాల శరత్‌బాబు | 105 |
| 19. తెలుగు నవలలు - భారతీయ జీవన విధానం | - కె. రంగనాయకులు | 108 |
| 20. తెలుగు కథా సాహిత్యంలో వృత్తి చిత్రణ | - కడివెండి మమత | 111 |
| 21. కథా సాహిత్యం - భారతీయ జీవన విధానం | - రాధిక మంగిపూడి | 116 |
| 22. భారతీయ జీవనవిధానంలో వైద్యం | - డా॥. మన్నవ గంగాధర ప్రసాద్ | 119 |
| 23. ప్రాచీన కావ్యాల్లో జానపదుల ఆహార పదార్థాల వర్ణన | - ముద్దులూరు సురేష్ | 122 |
| 24. అర్వీయస్ సుందరం నవలలు - భారతీయ జీవన విధానం | - నూకల విజయలక్ష్మి | 127 |
| 25. తెలుగు కవుల సాహిత్యం - భారతీయ జీవన విధానం | - డా॥. పి. కాళియప్ప | 131 |
| 26. మహాభారత కథ - మన జీవన విధానం | - పప్పుల శైలజ | 137 |

**శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ & సైన్స్ మహిళా కళాశాల - ప్రత్యేక సంచిక** 13

| | | |
|---|---|---|
| 27. భారతీయ జీవన విధానంలో సంస్కృతి సంప్రదాయాలు... | - పట్నాన ధర్మారావు | 140 |
| 28. కె.ఎల్.నరసింహం (కాంభట్ల) కథావస్తువు - జీవన విధానం | - ఆర్. బాలసుబ్రమణ్యం | 145 |
| 29. "తెలిచిరాజు నవల - భారతీయ తాత్విక చింతన" | - ఎస్. మహేందర్ | 152 |
| 30. తెలుగు కథానికలు - భారతీయ జీవన విధానం | - శ్రీలత అలువాల | 154 |
| 31. విశ్వనాథ సాంఘిక నవలల్లో భారతీయ జీవన విధానం .... | - అవధానం సుజాత | 159 |
| 32. వాడ్రేవు వీరలక్ష్మీదేవి కథలు - భారతీయ జీవన విధానం | - హిమబిందు వేదుల | 163 |
| 33. ఎ.ఎన్. జగన్నాథ శర్మ కథలు - భారతీయ జీవన విధానం | - దేవరకొండ ప్రవీణ్‌కుమార్ | 166 |
| 34. ఆచార్య తుమ్మల రామకృష్ణ మట్టిపొయ్యి కథలు - సామాజికత | - డా॥. జి. శైలమ్మ | 170 |
| 35. తెలుగు శతక సాహిత్యం - జీవన మార్గ దర్శకాలు | - డా॥. టి. మోహనశ్రీ | 176 |
| 36. మాడభూషి కవిత్వం - భారతీయ జీవన విధానం | - డా॥. కె.లక్ష్మణ | 180 |
| 37. ఒద్దిరాజు సోదరుల రచనలలోని భారతీయ జీవన విధానం | - డా॥. కొండపల్లి నీహారిణి | 188 |
| 38. కొందరు కవులు - రచనలు - భారతీయ జీవన విధానం | - మృదుల పోరెడ్డి | 195 |
| 39. భారతీయ సాహిత్యంలో గురు శిష్యుల సంబంధాలు... | - నలసాని రాం ప్రసాద్ | 197 |
| 40. తెలుగు క్షేత్ర సాహిత్యం - భారతీయ జీవన విధానం | - డా॥. పి. ఎస్. మైథిలి | 204 |
| 41. ఆముక్తమాల్యద - సాంప్రదాయికత | - రాఘవేంద్రరావు | 208 |
| 42. ఆదివాసీల సామెతలు | - డా॥. పి. లావణ్య & | 212 |
| | - డా॥. బూసి వెంకటస్వామి | |
| 43. మాడభూషి 'శత్రువుతో ప్రయాణం' కవిత్వం- భారతీయ జీవన విధానం | - డా॥. సి. సంపత్ | 218 |
| 44. ఐతాచంద్రయ్య కథలు - మానవ సంబంధాలు | - డా॥. ఎన్.సూర్యకాంతి | 224 |
| 45. ఆటవికుల జీవితానికి అద్దంపట్టిన - "ఆకురాలు కాలంలోకి.." | - డా॥. పెరుగుపల్లి బలరామ్ | 228 |
| 46. డా.వి.ఆర్.రాసాని 'బతుకాట' నవల-మానవ సంబంధాలు | - జి. నాగరాజు | 231 |
| 47. బి.సి. కథలు - వృత్తి సమస్యలు | - డా॥. కడియాల వెంకటరమణ | 235 |
| 48. నిజామాబాద్ జిల్లా బంజారా గేయ సాహిత్యం | - రూప్ సింగ్ | 239 |

# భారతీయ సాహిత్యంలో గురు శిష్యుల సంబంధాలు: ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

- నలసాని రాం ప్రసాద్, రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ, యూనివర్సిటి అఫ్ హైదరాబాద్, హైదరాబాద్,

**పత్ర సారాంశం :**

మన భారతీయ జీవన విధానంలో గురు శిష్యుల పరంపరకు ఎంతో విలువ ఉంది. అధునిక కాలంలో కూడా ఆ భారతీయ జీవన విధానంలోని గురు శిష్యుల పరంవర కొనసాగుతోందనడానికి సజీవ నిదర్శనం అచార్య పింగళి లక్ష్మీకాంతం గారి జీవితం ఒక గొప్ప ఉదాహరణ. అది ఏ విధంగా కొనసాగించడమనేది వివరించడమే నా పత్ర సారాంశం. అచార్య పింగళి లక్ష్మీకాంతం గారు తన గురువుల పట్ల భక్తి ప్రదర్శించిన వినయం, తన గురువుగార్ని అనుసరించడం వంటి అనేకమైన అంశాలు తన జీవితాన్ని ఉన్నతమైన స్థితికి తీసుకెళ్లాయి. అయన తన జీవితాన్ని తన గురువు గారి మార్గంలోనే పయనించారు. ఆ గుణాలనే సమన్వయం చేసుకుంటూ జీవించారు. అయన పాటించిన విధానాలను గమనించిన అయన శిష్యులు కూడా లక్ష్మీకాంతం గారినే అనుసరించారు. అందువల్లనే లక్ష్మీకాంతంగారు మరణించిన తర్వాత కూడా అయన జీవిత లక్ష్యాలను తమ శిష్యులు ముందుకి తీసుకెళ్ళడానికి ఎంతగానో ప్రయత్నించారు. పింగళి వారి గురువుగారు తిరుపతి వేంకట శాస్త్రి, కోరాడ రామకృష్ణయ్యలు. పింగళి వారి శిష్యులు పియస్ అర్ అప్పారావు, భద్రిరాజు కృష్ణమూర్తి, జి.నాగయ్య, కెవిఅర్, తిరుమల రామచంద్ర, కోలవెన్ను మలయవాసిని తదితరులు .... ఇలా మూడు తరాల గురుశిష్యుల సంబంధాన్ని పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం ద్వారా తెలుసుకోవచ్చు. అలా ఒక పరంపరగా కొనసాగడమే నిజమైన భారతీయ జీవన విధానంలో కనిపించే ఔన్నత్యం. అలాంటి భారతీయ జీవన విధానంలో కనిపించే గురుశిష్యుల ఔన్నత్యాన్ని తెలుసుకోవడానికి అచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితాన్ని ఒక ఉదాహరణ ప్రాయంగా ఈ పత్రంలో వివరించడమే నా పత్ర లక్ష్యం.

(కీలకాంశాలు : భారతీయ జీవన విధానం, గురు శిష్యుల సంబంధం, పింగళి లక్ష్మీకాంతం, నలసాని రామ్ ప్రసాద్, యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్, శ్రీ కన్యకాపరమేశ్వరీ కళాశాల)

భారతీయ జీవన విధానంలో సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో ప్రత్యేకత ఉంది. అ సంస్కృతీ సంప్రదాయాలలో 'విద్య' ప్రముఖపాత్ర పోషిస్తుంది. అ విద్యా విధానాలలో గురువు, శిష్యవుల మధ్య గల సంబంధాలకు ఒక ప్రత్యేకత ఉంది. రామాయణం, మహాభారతం, భాగవతం, పురాణాలు, కావ్యాలలో గురు-శిష్యుల మధ్య ఉన్న సంబంధాల గురించి అనేక కథలు ఉన్నాయి. అటువంటి గురు-శిష్యుల సంబంధాలే అచార్య పింగళి లక్ష్మీకాంతం గారి జీవితంలోనూ కనిపిస్తాయి. అయన తన గురువుల పట్ల పాటించిన వినయం, తన శిష్యుల కూడా పాటించారు. అవిధంగా ఒక గురు-శిష్యుల సంప్రదాయాన్ని ఒక పరంపరగా కొనసాగడం మన భారతీయ జీవనవిధానంలో అంతర్భాగంగా ఉందని నిరూపించడమే నా పత్ర లక్ష్యం. మన భారతీయ జీవన విధానంలో గురు శిష్యుల పరంపరకు ఎంతో విలువ ఉంది. అధునిక కాలంలో కూడా డా అ భారత జీవన విధానంలోని గురు శిష్యుల జీవన పరంపర కొనసాగుతోందనడానికి సజీవ నిదర్శనం అచార్య పింగళి లక్ష్మీకాంతం గారి జీవితం గొప్ప ఉదాహరణ. అది ఏ విధంగా

కొనసాగించడమనేది వివరించడమే నా పత్ర సారాంశం. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు విద్యార్థి దశ నుంచే తరగతి గదిలోను, చదువులోను ముందుండేవారు. అయన తన గురువుల పట్ల భక్తి ప్రదర్శించి, వారి దగ్గర అనేకమైన అంశాలను నేర్చుకున్నారు. ఆయన తన విద్యాభ్యాసాన్ని ఈ లక్షణాలనే సమన్వయం చేసుకుంటూ పాటించారు. ఆయన పాటించిన విధానాలను ఆయన శిష్యులకు బోధించడం ఒక విశేషం. ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు కూడా అనుసరించారు.

రామాయణంలో శ్రీరాముడు తన గురువైన వశిష్ట మహర్షి దగ్గర ఎంతో వినయంగా ఉన్నాడు. తండ్రి మాట ప్రకారం రాముడు విశ్వామిత్రునితో పాటు అడవులకు వెళ్ళి రాక్షసుల నుండి విశ్వామిత్రుణ్ణి, మునులను కాపాడి విశ్వామిత్రుని దగ్గర విద్యను నేర్చుకుంటాడు. ఆంధ్ర మహాభారతంలో కూడా గురువు, శిష్యుల మధ్య ఉన్న సంబంధాల గురించి మాట్లాడితే అది ఒక గ్రంథం అవుతుంది. భరద్వాజ అనే ముని ఆశ్రమంలో ద్రోణుడు, ద్రుపదుడు పెరిగి విద్యాభ్యాసాన్నీ పూర్తి చేశారు. ఒక సందర్భంలో ద్రోణుడు, ద్రుపద మహారాజు దగ్గరకు వెళ్లి సహాయాన్ని అర్థిస్తాడు. గర్వంతో ద్రుపదుడు నిండు సభలో ద్రోణుణ్ణి అవమానిస్తాడు. తర్వాత ద్రోణుడు కౌరవులకు, పాండవులకు గురువు అవుతాడు. ద్రోణుడు అర్జుణ్ణి చేరదీసి అన్ని విద్యలను నేర్పించి ద్రుపదుడిపై ప్రతీకారాన్నీ తీర్చుకుంటాడు. కాబట్టి మిత్ర వాత్సల్యం, గురు వాత్సల్యం, గురుభక్తి లేకపోతే ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందో ద్రోణుడు, ద్రుపదుడి కథలో మనం గమనించవచ్చు.

విష్ణు స్వరూపుడైన శ్రీకృష్ణుడు సాంధీపుని ఆశ్రమంలో విద్యను నేర్చుకుంటాడు. ఒకసారి సాందీపుని ఏకైక కుమారుణ్ణి పాంచజన్యం అనే రాక్షసుడు ప్రభాత తీర్థంలో అపహరిస్తాడు. ఈ విషయం తెలిసిన సాందీపుని దంపతులు దుఃఖిస్తుంటారు. బలరామకృష్ణులు సాందీపుని దుఃఖానికి కారణమైన పాంచజన్యుణ్ణి సంహరించి, సాందీపుని కుమారుణ్ణి కాపాడి గురువుకు గురు దక్షిణంగా కుమారుణ్ణి సమర్పిస్తారు.

మహా భారతంలో ద్రోణాచార్యుడు, ఏకలవ్యుడి కథ మన అందరికీ తెలిసిందే. ఒకసారి ద్రోణుడు పాండవులతో కలిసి అడవులకు వెళ్ళుతుంటారు. అడవి మార్గంలో వారికి ఒక శబ్దం వినపడుతుంది. ద్రోణాచార్యులు, పాండవులతో కలిసి అక్కడికి వెళ్తారు. అక్కడ ఏకలవ్యుడు ద్రోణాచార్యుని విగ్రహాన్నీ తయారు చేసుకొని ఆ విగ్రహాం ముందు విలువిద్యలను నేర్చుకుంటుంటాడు. అక్కడికి వచ్చిన ద్రోణాచార్యుల శిష్యబృందాన్నీ చూసిన ఏకలవ్యుడు ఒకింత ఆశ్చర్యానికి లోనవుతాడు. తనకు కూడా విద్యలను నేర్పమని ఏకలవ్యుడు ద్రోణాచార్యులను కోరతాడు. ద్రోణుడు ఏకలవ్యుడితో మాట్లాడుతూ నీవు గిరిజన కులంలో జన్మించడం వలన నీకు విద్యను నేర్పనని నిరాకరిస్తారు. అయినా కూడా ఏకలవ్యుడు ద్రోణుణ్ణి గురువుగా భావించి విద్యలను నేర్చుకుంటాడు. ఏకలవ్యుడి విలువిద్యల శక్తులను తెలుసుకున్న ద్రోణుడు జరగబోవు ప్రమాదాన్నీ గ్రహించి ఏకలవ్యుడి బొటన వేలును గురుదక్షణగా ఇవ్వమని అడుగుతాడు. ఏకలవ్యుడు ఏ మాత్రం ఆలోచించకుండా తన బొటన వేలును ఇస్తాడు. ఈ కథలో ఏకలవ్యుడు పాత్రను గమనిస్తే ఒక త్యాగభక్తిని చూడవచ్చు. ఇక్కడ ఏకలవ్యుడు తన గురువు ద్రోణుడికి ఇచ్చిన విలువ చూస్తే భారతీయ విద్య విధానంలో గురువు యొక్క పాత్ర తెలుస్తుంది. అలాగే ఏకలవ్యుడు గురువుకు ఇచ్చిన ప్రాధాన్యాన్నీ, ఏకలవ్యుడు చేసిన త్యాగాన్నీ చూస్తే గొప్ప శిష్యుడిగా, త్యాగశీలిగా ఏకలవ్యుడు చరిత్రలో నిలిచిపోయాడు.

ఆధునిక కాలంలో భారతరత్న డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు (1888-1975) ఉపాధ్యాయుడిగా, తత్త్వవేత్తగా, భారత తొలి ఉప రాష్ట్రపతిగా ప్రసిద్ధి చెందారు. ఆయన ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు వెళ్ళుతుంటే ఆయన శిష్యవులు ఆయణ్ణి రథంపై ఊరేగింపుగా తీసుకుపోయారు. ఇక్కడ

గురువు, శిష్యువుల సంబంధం ఎంత ఉన్నతమైయిందో తెలుస్తుంది. భారతీయులు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జన్మదినమైన సెప్టెంబర్ 5 తేదీన ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. దీన్ని బట్టి మన సమాజంలో గురువుకు ఎంతో విశిష్టత ఉందని చెప్పవచ్చు.

అధునిక కాలంలో అచార్య పింగళి లక్ష్మీకాంతంగారు (1894-1972) సుప్రసిద్ధులు. అయన జీవితాన్నీ బందరు (పాఠశాల దశ), మద్రాసు విశ్వవిద్యాలయం (పరిశోధన దశ), అంధ్రవిశ్వకళాపరిషత్ (బోధన, పరిశోధనల దశ), విజయవాడ (ప్రసంగాల దశ), శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం(బోధన, పరిశోధనల దశ), హైదరాబాద్ దశ అరు దశలుగా వర్గీకరించవచ్చు. అర్తమూరు, రేపల్లె, బందరు, మద్రాసు మొదలైన ప్రాంతాలలో విద్యనభ్యసించారు. ప్రముఖ శతావధాని, తిరుపతి కవుల్లో ఒకరైన తిరుపతి వేంకటశాస్త్రి గారు బందరు హైస్కూల్లో తెలుగు పండితునిగా పాఠాలను బోధించారు. పింగళి వారు తరగతిలో చదువులో ప్రతిభను కనపరిచేవారు. ఈ నేపథ్యంలోనే తిరుపతి వేంకటశాస్త్రి గారు పింగళి వారిని చేరదీసి మరింత శిక్షణ ఇచ్చారు. పింగళివారు వేంకటశాస్త్రి గారి శిక్షణలోనూ, అచార్య కోరాడ రామకృష్ణయ్యగారి శిక్షణలోనూ ఏ విధంగా రాణించాడో, అదే విధంగా అచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన విద్యార్థులను ఎలా తీర్చిదిద్దారో వీరందరిలో ఉన్న గురు శిష్యుల సంబంధాల్లోని నేపథ్యాలను కాలక్రమంలో ఎలా పరిణామం జరిగాయో సమన్వయం చేస్తూ తెలియజేస్తాను.

**తిరుపతి వేంకటశాస్త్రి -పింగళి లక్ష్మీకాంతం :**

పింగళి లక్ష్మీకాంతం అర్తమూరు, రేపల్లెలో ప్రాథమిక విద్యను, బందరు హైస్కూల్లో యస్.యస్.ఎల్.సి (నేటి పదవ తరగతి) పూర్తి చేశారు. బందరు జాతీయ కళాశాలలో ఇంటర్మీడియట్, బి,ఏ పూర్తి చేసి కొంతకాలం అక్కడే ఉపాధ్యాయుడిగా పని చేశారు. ప్రముఖ శతావధాని, తిరుపతి కవుల్లో ఒకరైన తిరుపతి వేంకటశాస్త్రి గారు బందరు హైస్కూల్లో 1904లో తెలుగు పండితునిగా చేరారు. "పింగళి లక్ష్మీకాంతం పదమూడు, పద్నాలుగు సంవత్సరాల వయస్సులో బందరు హిందూ హైస్కూలులో చేరాడు. క్లాసులో వేంకటశాస్త్రిగారడిగిన "నదికీ, కాలువకీ భేద మేమిటి?" అనే ప్రశ్నకి సమాధానం చెప్పిన మర్నాడు అ బాలుడు వేంకటశాస్త్రిగారింటికి వెళ్ళి "నన్ను శిష్యువుణ్ణిగా చేసుకోమ్మని" అడిగాడు. "నీ అభిలాష ఏమిటని" ప్రశ్నించారు. అ బాలుడు "నేను కవిని కావాలి" (పింగళి లక్ష్మీకాంతం జీవిత చరిత్ర, 2010, పుట:24) అనీ అన్నారు. అప్పటి నుంచి పింగళివారు తిరుపతి వేంకటశాస్త్రి గారిని తమ గురువుగా భావించారు. 1910 లో రాయప్రోలు సుబ్బారావుగారు, మంగిపూడి వెంకటశర్మగారు ఒకసారి వేంకటశాస్త్రి గారింటికి వెళ్ళినప్పుడు "మహాకవి (వేంకటశాస్త్రి) ఒక విద్యార్థికి కౌముది పాఠం చెప్పుతున్నారు. అయన ప్రక్కనే వున్నాడు మరొక పడుచువాడు.మంచి అకారము, కోరచూపు, పసిమిఛాయ. మంగిపూడి శర్మ గారు నన్ను వేంకటశాస్త్రిగారికి ఎఱిగించారు. రాయప్రోలు సుబ్బారావు సాష్టాంగ నమస్కారం చేసుకుని వెంటనే నన్ను చూసి లలిత కావ్య రాసింది మీరేనా అన్నాడు. అ సుందర వ్యక్తి లక్ష్మీకాంతము". (అచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974, పుట:17) అని గురు శిష్యులకు చెపుతున్న విద్యావిధానాన్ని గురించి పేర్కొన్నారు. పింగళివారు తన గురువు దగ్గర ఛందోవ్యాకరణాలను, అలంకారాలను నేర్చుకొని పద్యాన్ని రాయడానికి కావలిసిన నైపుణ్యాలను పొందారు. గుంటూరు సీమలో అవధానాలు విస్తృతంగా జరుగుతున్నప్పుడు తిరుపతి కవులకు, కొప్పొరపు కవులకు వివాదాలు జరిగేవి. అయన గురువుతో కలిసి పలు అవధానాలలో పాల్గొనేవారు. గురువుతో కలిసి అవధానాలను నిర్వహించారు. ఈ విషయాలను కొన్నింటిని తన 'అత్మలహరి' అనే ఖండకావ్యంలో చెప్పుకున్నారు. అందులో తన గురువుగారిని స్మరిస్తూపింగళి లక్ష్మీకాంతంగారు కొన్ని పద్యాలను రాశారు.

ఆంధ్ర కవితా జగద్గురు డమరపురికి
దరలిపోయెను శిష్య సంతతుల విడచి
సహజగీర్వాణవాణీ ప్రసక్తులై న
దేవతలు చెప్పగల రింక దెల్గు కవిత.

(ఆత్మలహరి, పుట :64, పద్యం-1)

తిరుపతి వేంకటశాస్త్రి గారు బందరు పాఠశాలలో తెలుగు పండితునిగా పని చేశారు. ఆయన దగ్గర పింగళి లక్ష్మీకాంతంగారు, కాటూరి వేంకటేశ్వరరావుగారు, రాయప్రోలు సుబ్బారావుగారు, విశ్వనాథ సత్యనారాయణ గారు విద్యనభ్యసించారు. తరువాత కాలంలో వీరంతా తమ గురువుగారి అడుగుజాడల్లో పయనించి పద్య కవులుగా, ఉత్తమ అధ్యాపకులుగా, రాణించి తిరుపతి వేంకటశాస్త్రి గారి వలె పేరు ప్రఖ్యాతలను పొందారు. పింగళి లక్ష్మీకాంతంగారు వేంకటశాస్త్రిగారి ఇంట్లో అత్యంత దగ్గరగా ఉండి, గురువుకు సేవ చేస్తూ చదువు కున్నారు. గురువు మరణించినప్పుడు విషాదకర హృదయంతో పై పద్యాన్నీ రాశారు. దేవ లోకానికి అధిపతి ఇంద్రుడు, దాని రాజధాని అమరపురి. అలాగే నాటి ఆంధ్ర కవిత లోకానికి తిరుపతి వేంకట శాస్త్రి గారు అధి పతులుగా ఉండేవారని, ఆయన మరణించి ఈ కవితా లోకాన్నీ, శిష్యువులందరిని విడిచి అమరపురికి వెళ్ళి పోయారని పింగళి లక్ష్మీకాంతంగారు తెలియజేశారు. ఇక్కడ పింగళి వారిపై వేంకటశాస్త్రి గారి ప్రభావాన్నీ, గురు, శిష్యుల సంబంధాలు ఎలా ఉన్నాయో తెలుస్తోంది.

**ఆచార్య కోరాడ రామ కృష్ణయ్య- పింగళి లక్ష్మీకాంతం :**

కోరాడ వారు మద్రాసు విశ్వవిద్యాలయంలో తొలి తరం ఆచార్యుడిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా ప్రసిద్ధి చెందారు. ఆయన భాషా, సాహిత్య రంగాల్లో విస్తృతంగా పరిశోధనలు చేశారు. పింగళి లక్ష్మీకాంతం గారు బందరులో ఉపాధ్యాయుడుగా ఉన్నారు. పింగళి లక్ష్మీకాంతం గారికి పరిశోధన చేయడానికి ఫెలోషిప్ లభించింది. ఈ నేపథ్యంలో ఆయన మద్రాసుకు వెళ్ళడానికి కొన్ని అడ్డంకులు ఎదురయ్యాయి. ఆయన మద్రాసుకు ఏ విధంగా వెళ్ళారో గొడవర్తి సూర్యనారా యణగారు చెప్పిన మాటలను చూద్దాం. "1927 లో మద్రాసు విశ్వవిద్యాలయంలో రీసెర్చ్ ఫెలోషిప్ వీరికి లభించింది. పట్టాభి, జాన్ స్టన్ , అహోబలరావు గార్ల సలహా సంప్రదింపుల మీద అక్కడికి వెళ్లి అక్కడ 1929 వరకు పరిశోధన సాగించారు. అక్కడే నండూరి బంగా రయ్యగారు వీరితో కలిసి భారతంలో కొంత పరిశోధన చేయడం జరిగింది. తంజావూరు సరస్వతీ మహల్ లో ఉన్న తాళపత్ర గ్రంథావలోకనం కూడా జరిగింది. ఆ ఉద్యోగం ముగియగానే రెండు సంవత్సరాలు మద్రాసు లోనే ఉండిపోయారు. ఆ కాలంలోనే "ప్రభావతీ ప్రద్యుమ్నము దాని మూలం" అనే ఒక వ్యాసాన్ని వ్రాసి బంగారు పతకాన్ని పొందారు. ఆయన ప్రయివేటుగా ఎం.ఏ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై బంగారు పతకాన్ని కూడా అందుకున్నారు". (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 1974,పుట:5) అనీ శ్రీ గొడవర్తి సూర్యనారాయణ తెలియజేశారు.

ఆయన మద్రాసులోనే మహాభారతంతో పాటు యక్ష గానాలను, ద్విపద భారత ప్రతులను సేకరించి వాటిని విస్తృతంగా అధ్యయనం చేసి, పరిష్కరించి వాటికి మరలా పీఠికలుగా రాసి ప్రచురించుకున్నారు. కోరాడ రామ కృష్ణయ్య గారి సమక్షంలో పింగళి లక్ష్మీకాంతం గారు పరి శోధనలో విశేషమైన పాండిత్యాన్నీ కనబరిచారు. కోరాడ వారి పరిశోధన, విమర్శల ప్రభావంతో పింగళి వారిపై ఉందని చెప్పవచ్చు. దీనికి ఒక బలమైన కారణం ఉంది. కోరాడ వారి విమర్శ పద్ధతులను పింగళి వారు అను సరించడమే ఆ బలమైన కారణం. కోరాడ వారు ఆంధ్ర వాఙ్మయ చరిత్రము, యుగ విభజనము' అనే వ్యాసాన్నీ రాశారు. దీనిలో ఆయన చేసిన యుగ విభజన విధానాలను పింగళివారు తన 'ఆంధ్ర సాహిత్య చరిత్ర'లో పాటించి వాటిని సాహిత్య చరిత్రలో విస్తృతం చేశారు. ఈ విషయాన్నీ కోరాడ రామ కృష్ణయ్య శత జయంతి

సాహితీ నీరాజనం అనే గ్రంథంలో అచార్య కోలవెన్ను మలయవాసిని గారు చెప్తూ "అచార్య పింగళి లక్ష్మీకాంతము గారు చేసిన యుగ విభజనవే నేడు విశ్వవిద్యాలయస్థాయి పఠన పాఠనములందు ప్రామాణికము నిర్దిష్టములయిన విభజనగా పలువురు పండితులు అంగీకరించిరి. అచార్య పింగళి లక్ష్మీకాంతము గారు శ్రీ కోరాడ రామ కృష్ణయ్య గారి శిష్యులు. వీరి పర్యవేక్షణలో "ప్రభావతీ ప్రద్యుమ్నము" పై శ్రీ లక్ష్మీకాంతముగారు MA (Honours) ను చేసిరి. శ్రీ కోరాడ వారి సాన్నిధ్యము, ప్రభావము కలిగిన లక్ష్మీకాంతముగారు అంధ్ర వాఙ్మయమును పది యుగములుగ విభజించిరి. అ పది యుగములు కోరాడ వారి యుగ విభజనము నుండి పుట్టినవే.

పింగళి వారి విభజనము ప్రధానముగా మహాకవులను యుగ కర్తలుగా నిర్ణయించి చేసినదే. ఈ విధానము అ గురు ప్రభావమే. కోరాడ వారి కవిత్రయ యుగమును - పింగళ వారు 'నన్నయ యుగము', 'తిక్కన యుగము', 'ఎఱ్ఱన యుగము' అని విభ జించిరి. నన్నయ తిక్కనలకు నడుమ శివకవి యుగమును చేర్చిరి. దక్షిణదేశ వాఙ్మయ అధునిక యుగములకు నడుమ క్షీణయుగము నొకదానిని చేర్చిరి. కోరాడ వారి మార్గముననుసరించియే పింగళివారు ఈ విభాగము చేసిరి. కాగా అంధ్ర వాఙ్మయ యుగ విభజనమునకు కోరాడ వారు మార్గదర్శకులన్న మాట" అని అన్నారు. (కోరాడ రామ కృష్ణయ్య శత జయంతి సాహితీ నీరాజనం, 1992, పుట: 241) దీనిలో కోరాడ వారికి, పింగళి వారికి మధ్య ఉన్న సంబంధాలను బట్టి సాంస్కృతికంగా, చారిత్రకంగా, సామాజికంగా భారతీయుల జీవితాలలో గురువు, శిష్యువుల యొక్క ప్రాధాన్యాలను మనందరినీ అలోచింపజేస్తుంది

**అచార్య పింగళి లక్ష్మీకాంతంగారిపై - అయన శిష్యుల అభిప్రాయాలు :**

పింగళి లక్ష్మీకాంతం గారు బందరు జాతీయ కళాశాలలో ఉపాధ్యాయ జీవితాన్ని ప్రారంభించారు. అయన మద్రాసు విశ్వవిద్యాలయంలో పరిశోధనలు చేశారు. 1931లో అంధ్ర విశ్వ కళాపరిషత్ (వాల్తేరు) తెలుగుశాఖను కొత్తగా ఏర్పాటు చేశారు. అదే సమయంలో పింగళి లక్ష్మీకాంతం గారిని రీడర్‌గా నియమించారు. అయన విద్యా సంబంధమైన పాఠ్య ప్రణాళికల రూపకల్పన చేశారు. తరువాత కాలంలో వాటినే మిగతా విశ్వవిద్యాలయాలు పాటించి వాటిని విశ్వవ్యాప్తం అవడానికి ముఖ్య కారకులైయ్యారు. అయన క్రమక్రమంగా ఎదిగి శాఖాధ్యక్షులుగా కూడా విధులు నిర్వర్తించి 1949లో పదవీ విరమణ పొంది సాహిత్య వ్యాసంగాన్నీ కొనసాగించారు. అయన కొంతకాలం పాటు విజయవాడ అకాశవాణి కేంద్రంలో సాహిత్యానికి సంబంధించిన అనేక అంశాలను రేడియోలో ప్రసంగించి వాటిని ప్రసారం చేసేవారు. తర్వాత అయన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం(తిరుపతి) అచార్యునిగా నియమితులయ్యారు. అయన జీవితంలో ఎక్కువ కాలాన్నీ బోధనారంగంలో కొనసాగించారు. అయన అంధ్ర విశ్వ కళాపరిషత్ లో, విజయవాడ అకాశవాణి కేంద్రంలో, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో అనేకమంది విద్యార్థులకు పాఠాలను బోధించారు. అయన చెప్పిన పాఠాలకు ప్రభావితులై

అనేక మంది విద్యార్థులు బోధనా రంగంలో స్థిరపడడం ఒక విశేషం. అయన శిష్యువుల పట్ల ప్రదర్శించిన వ్యక్తిత్వాన్నీ, అయన తరగతిలో బోధించిన తీరుతెన్నులను, అయన శిష్యుల పట్ల చూపే వాత్సల్యాలను మొదలైన సుగుణాలను అయన గురించి అయన శిష్యులు చెప్పిన మాటలను తెలియజేస్తాను.

ప్రసంగ కళ: పింగళివారు తరగతిలో గానీ , సాహిత్య సభల్లో గానీ ఉపన్యాస కళ గురించి ఇలా అన్నారు "కవిగా వీరు ఎంత ప్రసిద్ధులో వక్తలుగా కూడా అంతటి లబ్ధ ప్రతిష్ఠులు. ఏ విషయంపైన ప్రసంగించినా శ్రవణ సుఖం గాను, అభిరుచి జనకం గాను ఉండడానికి కారణం వారి ప్రసంగాల్లో ఉండే ఔచిత్యం ప్రధానం.

వారి ప్రసంగాల్లో ఐక్యత, పొందిక, సమత అంగాంగీ భావము ఉండి శాఖా చంక్రమణం లేకుండా సంక్షిప్తంగా ఉండడమే. అదీ కాక సామాజికుల స్థాయిని బట్టి కూడా ప్రసంగం రూపభేదం పొందుతుండేది. వేదిక మీద ఉన్నప్పుడు 'కాలపరిమితి' 'విషయము', 'సామాజికులు' అన్న వాటిని దృష్టిలో ఉంచుకొని మాట్లాడే బహు కొద్ది మంది వక్తలలో వీరొకరు. అందమైన పదబంధాలతో, లఘు వాక్య నిర్మాణంతో చక్కని వీణానాదంవలె వారి ఉపన్యాసాలు రైట్ అనరబిల్ శ్రీనివాసశాస్త్రిగారి ప్రసంగాలను జ్ఞప్తికి తెచ్చేవి'' (అచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974,పుట:9)

అయన తన ప్రసంగాలలోని పాటించిన మౌలిక లక్షణాలు విషయంలో ఔచిత్యం, విషయంలో ఐక్యత, విషయంలో పొందిక , విషయంలో సమతాభావం, విషయాన్నీ చెబుతున్నప్పుడు కాలపరిమితిని గుర్తుంచుకోవడం, వినేవారి స్థాయిని బట్టి ప్రసంగించడం మొదలైన లక్షణాలన్నింటినీ పింగళి లక్ష్మీకాంతం గారు తన ప్రసంగాలలో సమన్వయం చేసుకుంటూ పాటించారని తెలుస్తోంది. అయన అనంతరం వివిధ విశ్వవిద్యాలయాలలో అయన శిష్యవులు కూడా ఈ లక్షణాలనే పాటించి అయనకు మరింత కీర్తిని తెచ్చిపెట్టారు.

**మహిళల పట్ల పింగళివారి దృక్పథం :**

పులిగడ్డ విజయలక్ష్మీగారు పింగళి లక్ష్మీకాంతం గారి దగ్గర శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ప్రత్యక్షంగా చదువుకున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారికి విద్యార్థుల పట్ల ఎలాంటి అభిప్రాయం కలిగి ఉండేవారో చెప్తూ ఇలా అన్నారు.

"తనంతటి వాళ్లని తన శిష్యుల్ని చేయాలని సంకల్పించారు పింగళివారు. లక్ష్మీకాంతంగారికి శిష్య వాత్సల్యంలో తరతమభేదా లెప్పుడూ లేవు, అయన ఎంతటి గురుభక్తి కలవారో అంతటి శిష్యవాత్సల్యం గలవారు. వారికి ప్రత్యక్ష శిష్యురాల్ని కావడమే నేను చేసుకొన్న సుకృతం. వారి దగ్గర చదువుకొన్న వాళ్లందరూ శిష్యులమనే చెప్పుకొంటుంటారు. అయన ప్రాచీన సంప్రదాయాలను ఎంతగా పాటించేవారో, అధునిక భావాలను అంతగా అదరించేవారాయన. అడపిల్లలు కూడా బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని వారి ఉద్దేశ్యం'' (అచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక,1974,పుట: 62)

అయన దగ్గర చదువుకున్న విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో అయన ఎలాంటి భేద భావాలను ప్రదర్శించలేదు. అయన ఉత్తమ గురువుగా ఆలోచించి, స్త్రీలు కూడా విద్యావంతులు కావాలనే అభిప్రాయాన్నీ బట్టి అయన నిర్మించుకున్న వ్యక్తిత్వం విద్యార్థులకు ఏ విధంగా మార్గదర్శకత్వాలను చూపిందో స్పష్టమవుతుంది.

"లక్ష్మీకాంతం గారి శిష్య వాత్సల్యం చాలా గొప్పది. వర్ణించి చెప్పనలవిగానిది. శిష్యులను అయన తన తనయులవలె, తమ్ముళ్ల వలె చూచుకొనే వారు. అవసరమైతే అ శిష్యుని సహాయార్థం ఒక నాటక ప్రదర్శనమును సైతం జరిపించేవారు''.(అచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 1974, పుట:94) అని గూడూరు నమశ్శివాయ గారు చెప్పారు. ఇంకా అయన విద్యార్థుల అవసరాలను గుర్తించి, వారికి వివిధ రూపాలలో సహాయం చేయాలనీ భావించే గొప్ప సహృదయత కలిగిన వ్యక్తి అచార్య పింగళి లక్ష్మీకాంతం గారు. అయన వ్యక్తిత్వమే విద్యార్థిలోకాన్నీ ప్రభావితం చేసింది. మరొక సందర్భంలో జరిగిన సంఘటనను చూద్దాం తనకు సహాయం చేసిన వారిని గుర్తించుకొని వారి పట్ల కృతజ్ఞతను తెలపడం అయనకు ఉన్న ప్రత్యేక లక్షణం. ఈ లక్షణానికి ఒక ఉదాహరణాన్ని చూద్దాం.

పింగళి లక్ష్మీకాంతంగారి చిన్నతనంలో అనారోగ్యంగా ఉంటే గూడూరి సుబ్రహ్మణ్యం గారు వైద్యం చేస్తారు. పింగళి వారు విశ్వవిద్యాలయంలో అచార్యులుగా ఉన్నప్పుడు గూడూరి సుబ్రహ్మణ్యం గారి మనుమడు గూడూరి కృష్ణగారు నాటి తెలుగు అధ్యాపకుల గురించి సమాచారాన్ని సేకరించి పత్రికల్లో ప్రచురించేవారు. కృష్ణగారు

పింగళి వారిని తరచు కలిసేవారు. కృష్ణగారు పింగళి లక్ష్మీకాంతం గారు గురువుగా విద్యార్థులకు ఏ విధంగా మార్గదర్శకులో చెప్తూ "ఆయన గురువుల చిత్రాలకు నమస్కారం చేసి కళాశాలకు వెళ్లేవాడిని, శిష్యులతో ఏనాడు పేచీ పడలేదని , విద్యార్థులకు సరిగా పాఠాలు చెప్పి వారు గౌరవ విమానాలను సంపాదించిన ఉపాధ్యాయుడు గురవుతారు". (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం స్మారక సంచిక, 1974పుట :127) అనీ అన్నారు.

ఈ విధంగా ఆయన మొదట్లో గ్రాంధిక భాషలోనూ, సరళ గ్రాంధిక భాషలోనూ బోధించేవారు. అధునికంగా భాషలో వచ్చిన మార్పులను గమనిస్తూ ఆయన దృష్టి వ్యవహారిక భాష వైపు మళ్లడం ఒక విశేషం అని చెప్పాలి. బోధనా భాషలో ఒకటి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలలో ఉండవలసిన భాష గురించి ఆలోచించారు. కాలానికి అనుగుణంగా భాష మారుతుందని, ఒకటి నుంచి పదో తరగతి వరకు పిల్లలకు వ్యవహారిక భాషలోనే బోధించాలని సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ తెలుగు అకాడమీ (హైదరాబాదు, 1968) ఏర్పాటుకు ఆయన కృషి చేశారు. కేంద్ర ప్రభుత్వం భారతీయ భాషలకు ఇచ్చే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలో తెలుగు అనువాద గ్రంధాలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం రావడానికి కూడా ఆయన చేసిన కృషి ఉందని చెప్పాలి. ఈ విధంగా ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవితం భారతీయ విద్యావిధానంలో గురువు పాత్రను ఎంతో ఉదాత్తంగా పోషించారు. ఆయన ముఖ్యంగా తెలుగు సాహిత్యానికి, తెలుగు భాషకు చేసిన సేవ మరువరానిది. ఆయన అనేక మంది విద్యార్థులను అధ్యాపకులుగా తీర్చిదిద్ది మన సమాజానికి అందించిన గొప్ప గురువు. గురువుగా ఆయన జీవితం అధ్యాపక లోకానికే గాక మనందరికీ ఆదర్శనీయం.

❖❖❖


ISSN 2581-3153
రాయలసీమ జాగృతి
జూలై 2022
సంపుటి: 07 సంచిక: 01
RNI/APTEL/2016/69069

గౌరవ సంపాదకులు
పద్మశ్రీ స్వీకర్త
ఆచార్య కొలకలూరి ఇనాక్.,
పూర్వ ఉపాధ్యక్షులు, శ్రీ వేంకటేశ్వర విద్యాలయం, తిరుపతి

సంపాదకులు
సాకే శ్రీహరిమూర్తి.,M.A.,TELUGU.,L.L.B., & J.M.C
సెల్: 9866216044



సహ సంపాదకురాలు
సాకే సిరి ప్రియ

సంపాదక మండలి

ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి.,
తెలుగు శాఖాధ్యక్షులు, బెంగుళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు
ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు.,
తెలుగు శాఖాధ్యక్షులు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్
ఆచార్య కొలకలూరి మధుజ్యోతి.,
తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి
ఆచార్య గుండ్లూరి బాలసుబ్రమణ్యం.,
తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము
ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ.,
తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
డా॥ మూల మల్లికార్జున రెడ్డి.,
బాధ్యులు, సి.పి.బ్రౌన్ పరిశోధక కేంద్రం, కడప
డా॥ ఎం.మంజుశ్రీ.,
అసిస్టెంట్ ప్రొఫెసర్, తార ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డి
డా॥ కె.రత్న శేఖర్.,
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం
డా॥ కాకాని సుధాకర్.,
తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమండ్రి
డా॥ కట్టెపోగు సురేష్ కుమార్.,
తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, గుంటూరు
డా॥ గుండిమెడ శ్రీనివాస రావు.,
ఉపన్యాసకులు, మహిళా డిగ్రీ కళాశాల, కామవరపుకోట, ఏలూరు
డా॥ గంధం అరుణ.,
అసిస్టెంట్ ప్రొఫెసర్, రాయలసీమ విశ్వ విద్యాలయం

ప్రధాన కార్యాలయం: 13/3-645, ఖాజా నగర్,
గంగ గౌరి టాకీస్ దగ్గర, అనంతపురము

ఈ పత్రికలో వెలువరించిన అభిప్రాయాలు, వ్యాసాలకు సంబంధించిన వివాదాలు
అనంతపురం కోర్టు పరిధిలో మాత్రమే వర్తిస్తాయి

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు పత్రికవి కానవసరం లేదు

# సామాజిక ప్రయోజనంతో ముడిపడినదే సాహిత్యం

"సహిత స్వభావ: సాహిత్యం" "హితేన సహితం సాహిత్యం" ఆర్యోక్తి మేరకు హితంతో కూడినది,హితాన్ని కోరేది సాహిత్యం.మనలోని అంతర్లీనమైన సహజ భావాలను మౌఖికంగా లేదా లిఖితంగా కళాత్మక అభినివేశంతో వ్యక్తీకరించడమే సాహిత్యం. సాహిత్యం ఒకజాతి సంస్కృతికి అద్భుతమైన లిఖితాధారం. అంతేకాకుండా భాషాపరిణామాన్ని తెలియజెప్పే సాధనం కూడా. ఇది మనిషిని మనిషిలా తీర్చిదిద్దుతుంది. అంతటి వైభవోపేతమైన మన ప్రాచీన సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, పోతన వంటి ఎంతోమంది కవులు ఈ జాతికి చిరస్మరణీయులు.

మనలోని ఆవేదనకు ఆక్రోశానికి ఆనందానికి అక్షర రూపమే సాహిత్యం. సాహిత్యానికి ప్రభుత్వాలను మార్చే శక్తి,విప్లవాలను జనింపచేసే శక్తి ఉంటుంది. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సృష్టించబడిన సాహిత్యాన్ని ఆదారంగా తీసుకుని చారిత్రక సత్యాలను తెలుసుకునే అవకాశముంటుంది.

లభిస్తున్న తొలి తెలుగు కావ్య సాహిత్యం నన్నయ రాసిన ఆంధ్ర మహాభారతం రెండున్నర పర్వాలు. నన్నయకు ముందున్న సాహిత్యం ఎంతో ఉంది. కన్నడ భాషలో ఆదికవిగా పేర్కొంటున్న పంపడు తెలుగువాడే.ఆధునిక సాహిత్యంలో సంఘ సంస్కరణ, కాల్పనికోద్యమం, అస్తిత్వవాదం, ప్రతీకవాదం, అధివాసవికవాదం, భావచిత్రవాదం, డాడాయిజం, చైతన్య స్రవంతి, మానవతావాదం, వ్యక్తివాదం, మార్క్సిజం, హేతువాద ప్రభావాలతో సాహిత్యం వచ్చింది. వీటి తర్వాత స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, బహుజనవాదం, ప్రాంతీయవాదం నేపథ్యంలోంచి సాహిత్యం వచ్చింది. వచన కవితలో మినీ కవిత, హైకూ, గజల్, నానీలు, నానోలు, రెక్కలు వంటి అనేక ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద, దళితవాద, మైనారిటీ, ప్రాంతీయవాద కవిత్వం ఇలా ఆధునిక కవిత్వంలో అనేక వైరుధ్యాలు, వైవిధ్యాలు చోటు చేసుకున్నాయ్. ప్రస్తుతం తెలుగులో వచన సాహిత్యం ఎక్కువగా వస్తోంది.

కాలంతో పాటుగా వస్తున్న మార్పుల్ని ఇముడ్చుకుంటూనే విస్తృత వైవిధ్యంతో తెలుగు సాహిత్యం విస్తరిల్లుతోంది. మల్లియ రేచన కాలం నుండి తెలుగు సాహిత్యం ఎలాంటి ఎడం లేకుండా నేటికీ వస్తూనే ఉంది. అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న తెలుగు సాహిత్య సంప్రదాయంలోని విలువైన అంశాల్ని ప్రపంచానికి అందించాలి.తెలుగు సాహిత్యం వైశిష్ట్యంలోనూ, వైవిధ్యంలోనూ ఏ సాహిత్యానికీ తీసిపోదు. తెలుగు సాహిత్య విశిష్ట వారసత్వం, సంప్రదాయాన్ని కొనసాగించాల్సిన బాధ్యత తెలుగు వారందరిపై ఉంది.సమాజం నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ఉత్తమ సాహిత్యమైనా మరుగున పడుతుందని తెలుగు సాహిత్యానికి నేడు ఆపరిస్థితి దాపురించిందని ఇప్పటికైనా మేల్కొనకపోతే తెలుగు భాషను భావితరాలు మరిచిపోయే ప్రమాదం ఉంది.

**సాకే శ్రీహరిమూర్తి**

గౌరవ సంపాదకులు
పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్

సంపాదకులు
సాకే శ్రీహరిమూర్తి.,
సెల్: 9866216044





సహ సంపాదకులు
సాకే సిరిప్రియ

సంపాదక మండలి

ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి.,
ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు.,
ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ.,
ఆచార్య గడ్డూరు బాలసుబ్రమణ్యం.,
ఆచార్య మూల మల్లిఖార్జున రెడ్డి.,
ఆచార్య కొలకలూరి మధుజ్యోతి.,
డా॥మంజు శ్రీ.,
డా॥ కాకాని సుధాకర్.,
డా॥సురేష్ గద్దర్.,
డా॥గుండిమెడ శ్రీనివాసరావు.,
డా॥ గంధం అరుణ.,



1. పరిపూర్ణమైన విజయపతాకం-4 లో
ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు
2.జాషువా సాహిత్యం దేశభక్తి - 8లో
డా॥మంజుశ్రీ
3.తెలుగు సాహిత్యంలో పాట సాంస్కృతిక ప్రభావం -15 లో
డా॥జరుపుల రమేష్
4. ప్రబంధ పరమేశ్వరుడు - ఎర్రాప్రెగడ 18లో
సాకే శ్రీహరిమూర్తి
5.పులుల బోను- నేను నవలా విశ్లేషణ
డా॥ గిన్నారపు ఆదినారాయణ
6.మహా భారతం- వైశిష్ట్యం
డా.బత్తల అశోక్ కుమార్
7.భద్రమైన బోగ్గుల బతుకు నవల-27 లో
డా.నాగశేషు
8.ఆత్రేయ "భయం" నాటకం విశ్లేషణ-33 లో
సాగర్ల సత్తయ్య


# సామాజిక ప్రయోజనంతో ముడిపడినదే సాహిత్యం

"సహిత స్వభావ: సాహిత్యం" "హితేన సహితం సాహిత్యం" ఆర్యోక్తి మేరకు హితంతో కూడినది,హితాన్ని కోరేది సాహిత్యం.మనలోని అంతర్లీనమైన సహజ భావాలను మౌఖికంగా లేదా లిఖితంగా కళాత్మక అభినివేశంతో వ్యక్తీకరించడమే సాహిత్యం. సాహిత్యం ఒకజాతి సంస్కృతికి అద్భుతమైన లిఖితాధారం. అంతేకాకుండా భాషాపరిణామాన్ని తెలియజెప్పే సాధనం కూడా. ఇది మనిషిని మనిషిలా తీర్చిదిద్దుతుంది. అంతటి వైభవోపేతమైన మన ప్రాచీన సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన నన్నయ్య, తిక్కన, ఎఱ్ఱన, శ్రీనాథుడు, పోతన వంటి ఎంతోమంది కవులు ఈ జాతికి చిరస్మరణీయులు.

మనలోని ఆవేదనకు ఆక్రోశానికి ఆనందానికి అక్షర రూపమే సాహిత్యం. సాహిత్యానికి ప్రభుత్వాలను మార్చే శక్తి,విప్లవాలను జనింపచేసే శక్తి ఉంటుంది. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా సృష్టించబడిన సాహిత్యాన్ని ఆదారంగా తీసుకుని చారిత్రక సత్యాలను తెలుసుకునే అవకాశముంటుంది.

లభిస్తున్న తొలి తెలుగు కావ్య సాహిత్యం నన్నయ రాసిన ఆంధ్ర మహాభారతం రెండున్నర పర్వాలు. నన్నయకు ముందున్న సాహిత్యం ఎంతో ఉంది. కన్నడ భాషలో ఆదికవిగా పేర్కొంటున్న పంపడు తెలుగువాడే.ఆధునిక సాహిత్యంలో సంఘ సంస్కరణ, కాల్పనికోద్యమం, అస్తిత్వవాదం, ప్రతీకవాదం, అధివాసవికవాదం, భావచిత్రవాదం, డాడాయిజం, చైతన్య స్రవంతి, మానవతావాదం, వ్యక్తివాదం, మార్క్సిజం, హేతువాద ప్రభావాలతో సాహిత్యం వచ్చింది. వీటి తర్వాత స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీవాదం, బహుజనవాదం, ప్రాంతీయవాదం నేపథ్యంలోంచి సాహిత్యం వచ్చింది. వచన కవితలో మినీ కవిత, హైకూ, గజల్, నానీలు, నానోలు, రెక్కలు వంటి అనేక ప్రక్రియలు రూపుదిద్దుకున్నాయి. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, స్త్రీవాద, దళితవాద, మైనారిటీ, ప్రాంతీయవాద కవిత్వం ఇలా ఆధునిక కవిత్వంలో అనేక వైరుధ్యాలు, వైవిధ్యాలు చోటు చేసుకున్నాయ్. ప్రస్తుతం తెలుగులో వచన సాహిత్యం ఎక్కువగా వస్తోంది.

కాలంతో పాటుగా వస్తున్న మార్పుల్ని ఇముడ్చుకుంటూనే విస్తృత వైవిధ్యంతో తెలుగు సాహిత్యం విస్తరిల్లుతోంది. మల్లియ రేచన కాలం నుండి తెలుగు సాహిత్యం ఎలాంటి ఎడం లేకుండా నేటికీ వస్తూనే ఉంది. అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్న తెలుగు సాహిత్య సంప్రదాయంలోని విలువైన అంశాల్ని ప్రపంచానికి అందించాలి.తెలుగు సాహిత్యం వైశిష్ట్యంలోనూ, వైవిధ్యంలోనూ ఏ సాహిత్యానికీ తీసిపోదు. తెలుగు సాహిత్య విశిష్ట వారసత్వం, సంప్రదాయాన్ని కొనసాగించాల్సిన బాధ్యత తెలుగు వారందరిపై ఉంది.సమాజం నిర్లక్ష్యం చేస్తే ఎంతటి ఉత్తమ సాహిత్యమైనా మరుగున పడుతుందని తెలుగు సాహిత్యానికి నేడు ఆపరిస్థితి దాపురించిందని ఇప్పటికైనా మేల్కొనకపోతే తెలుగు భాషను భావితరాలు మరిచిపోయే ప్రమాదం ఉంది.

**సాకే శ్రీహరిమూర్తి**

# మానవుని అంత: సంఘర్షణను చిత్రించిన 'మాబీడిక్' నవల

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం పేరు చెప్పగానే వినగానే ఆయన ఒక విమర్శకుడు, పరిశోధకుడు, అధ్యాపకుడిగా మాత్రమే ఎక్కువ మంది గుర్తిస్తారు. ఆయన ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాలను లోతుగా అధ్యయనం చేశారు. తెలుగు సాహిత్యవిమర్శపై ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాల సమన్వయంతో రాసిన తొలితరం విమర్శకుడుగా కూడా ఆచార్య పింగళి లక్ష్మీకాంతం తనదైన ముద్ర వేసుకున్నారు. ఆరోజుల్లో తెలుగు చదివేవాళ్ళు కూడా ఆంగ్ల సాహిత్యాన్ని చదవడంతో పాటు, ఇంగ్లీష్ మీడియంలోను చదవాల్సి వచ్చేది. అది ఆ నాటి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆ విద్యార్థులు తొలితరం అధ్యాపకులుగా తమ వృత్తిని ఎన్నుకున్న వాళ్ళ వల్ల తెలుగు సాహిత్యాన్ని శాస్త్రీయ పంథాలో పయనింపజేయడానికి ఎంతగానో ఉపయోగపడింది. ఆచార్య పింగళి వారికి గల ఆ ఆంగ్ల సాహిత్య పరిజ్ఞానం వల్ల ఆయన కొన్ని సాహిత్యేతర రచనలు, నవలలు తెలుగులోకి అనువదించారు. ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారు ప్రసిద్ధ అమెరికన్ ఆంగ్ల నవలా రచయిత హెర్మన్ మెల్విల్లే (ుఎతీఝఅ వీవశ్రీజఱశ్రీశ్రీవ) (1819-1891) రాసిన ఆంగ్ల నవలవీశీఎం-ఱఙఎని తెలుగులో 'మాబీడిక్' పేరుతో అనువదించారు. ఈ నవలకు ుష్ట్రవ ఔష్ట్రుశ్రీవ, ుష్ట్రవ ఎష్ట్రఉవ ఔష్ట్రుశ్రీవ అనే పేర్లు కూడా ఉన్నాయి. దీన్ని ప్రసిద్ధ నవలా రచయిత డి.హెచ్. లారెన్స్ ప్రపంచ నవలా సాహిత్యంలో ఒక గొప్ప అద్భుతమైన నవలగా వ్యాఖ్యానించారు. తొలుత దీన్ని 1851లో లండన్ లోని రిచర్డ్ బెంట్లీ మూడు సంపుటాలుగా ప్రచురించారు. అప్పుడది సుమారు వెయ్యి పుటలకు పైగానే ఉంది. తర్వాత అమెరికన్ ప్రచురణ సంస్థ 635 పుటల్లో ఒకే పుస్తకంగా ప్రచురించారు. కానీ దీన్ని అనేకసార్లు ప్రచురించారు. 20 వ శతాబ్ది నాటికి ఒక గొప్ప నవలగా ప్రాచుర్యం పొందింది. ఆంగ్ల సాహిత్యంలో సాహసోపేతమైన చర్యల్ని వర్ణిస్తూ వచ్చిన నవలల విభాగంలో దీన్నొక ముఖ్యమైన పుస్తకం సాహితీవేత్త భావిస్తారు. హెర్మన్ మెల్విల్లే ఒకప్పుడు ఒక సాధారణ నావికుడు జీవించిన అనుభవం ఈ నవలా రచనకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయనకు సుమారు నాలుగు సంవత్సరాల ( 1841 నుండి 1844) నావికుడిగా అనుభవం ఉంది. ఈ నవల రాసే ముందు సముద్ర సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేసి, సుమారు 18 నెలల పాటు ఈ నవలను హెర్మన్ మెల్విల్లే రాశారు.

మాబీడిక్ నవల

పింగళి లక్ష్మీకాంతం గారు ' మాబీడిక్ ' నవలను 1964 తన అనువాదాన్ని పూర్తి చేశారు. దీన్ని క్లాసిక్ బుక్స్ విజయవాడ వారు మే 2021 సంవత్సరంలో మల్లా ప్రచురించారు. మూలంలో ఉన్న కథను యథాతథంగా కాకుండా కొన్ని ముఖ్యమైన వాటిని తప్ప వాటిని సార సంగ్రహంగా అనువాదం చేశారు. అయినప్పటికీ నవలా అధ్యాంతం ఆసక్తిగా చదివిస్తుంది. సుమారు 240 పుటల్లో ఈ నవల 85 ఉప శీర్షికలుగా చదవడానికి అనుకూలంగా ఉప శీర్షికలను పెట్టారు. సముద్రాన్ని మానవ జీవిత అన్వేషణ స్థలంగా భావిస్తే మానవుడి యొక్క సుఖ దుఃఖాలు, రాగద్వేషాలు వాటిని అన్వేషించడం తాను అనుకున్నది ఒకటైతే ఒక్కోసారి మరొకటి జరగడం ఇలా జీవితం తనకు తెలియని గమ్యానికి తీసుకుపోవడం అనే అనుభవాన్ని ఈ నవల కలిగిస్తుంది.

నవలా వస్తువు:

ఈ నవలకు సంబంధించిన వస్తువుని అనువాదకుడు పింగళి లక్ష్మీకాంతం గారు సంక్షిప్తంగా ముందుగానే చెప్పారు. " అమెరికాలో 19 శతాబ్దానికి పూర్వార్థంలో తిమింగలాలు వేట ఒక పెద్ద పరిశ్రమగా ఉండేది. ఆ వ్యాపారం చేసే వాళ్ళు ఈ భూమండలంలో ఉన్న మహా సముద్రాలన్నింటినీ కలయతిరిగి తిమింగలాలను వేటాడే వాటి నుండి లభించే నూనేను అమ్ముకుంటూ ఉండేవారు. ఆ రోజుల్లో దాని కోసం ఓడలు తీసుకుని సముద్రాల మీద అనేక నెలలు, సంవత్సరాలు ప్రయాణం చేయవలసి వచ్చేది. అది చాలా ప్రమాదమనీ తెలిసిన దాన్ని ఎదుర్కొంటు తమ లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నంచే వాళ్ళు సాహసాలు తెలుసుకోవడానికి ఈ నవల ఉపయోగపడుతుంది. ఈ నవల తిమింగలాల వేటకు సంబంధించిన ఇతివృత్తం అయినప్పటికీ కేవలం దానికే పరిమితం కాకుండా సముద్ర వేటలోని అనేక ఒడుదుడుకులను చిత్రిస్తూనే దాన్ని ఆధారంగా చేసుకుని జీవిత అన్వేషణను స్ఫురించేలా రాయడం ఈ నవలలోని వస్తు ప్రత్యేకత. ఈ నవలలో ' అహబ్ 'అనే ఒక ప్రధాన పాత్ర.అతడు సముద్ర వేటలో ఒకసారి ఒక తిమింగలం వల్ల తన కాలును పోగొట్టుకుంటాడు. ఆ కాలు పోవడానికి కారణమైన తిమింగలం పేరే 'మాబీడిక్ '. అందువల్ల దాన్ని పట్టుకోవాలనీ సముద్రాల్లో వేట మొదలు పెడతాడు. మాబీడిక్ తన కాలు తినేసిన దానికి ప్రతీకారంగా దాన్ని చంపాలనుకుంటాడు. మొత్తం మీద అనేక కష్ట నష్టాలకు గురైనా ఆ తిమింగలాన్నీ పట్టుకుంటాడు. అది అహబ్ ని ప్రతిఘటిస్తుంది. దాన్ని బంధించాలనీ ప్రయత్నిస్తాడు. దాన్ని చంపాలనుకుంటాడు. కానీ ఆ తిమింగలమే అతణ్ణి

చంపేస్తుంది. ఈ కథంతా తన అనుచరుల్లో ఒక్కడైనా 'ఇస్మాయిల్' ఈ కథనంతా చెబుతాడు. ఈ సముద్రాలలో తిరిగిన తిమింగలాల వేటను అమెరికా అధ్యక్షుడి కోసం జరిగే పోటీతో పోల్చుస్తాడు రచయిత. అహబ్ తన ప్రయాణంలో అనేక తిమింగలాలను చంపినా కానీ మాబీడిక్ ను పట్టుకొనేదాకా అతని అహం చల్లారలేదు. ఒక సందర్భంలో ఇస్మాయిల్ ద్వారా కొన్ని జీవిత సత్యాలను ఆవిష్కరిస్తాడు రచయిత. "అందరిని సమం చేసి అందరికి ఒకే మాదిరిగానే అంత్య కాలంలో సాక్షాత్కరించే మృత్యువు యొక్క ఆగమనం గురించి రచయిత తప్ప బతికి ఉన్న వాడెవుడూ సంతృప్తికరంగా వివరించలేడు. మృత్యువు అంటే మనకు తెలియని లోకానికి తీసుకునిపొయె సాధనమే కదా" (పుట: 372,73) అని అంటాడు.

దీన్ని బట్టి ఈ నవలలో భౌతికంగా తిమింగలాల వేట కనిపించినా మానవుడిలోని అనేక సమస్యల్ని పరిష్కరించుకునేటట్లూ తన లక్ష్యాలకు చేసుకోవాలనుకునే సంఘర్షణాత్మక పయనం మనకు స్ఫురిస్తుంది. జీవిత అనుభవాలు జీవితం పట్ల ఒక స్పష్టత నిలుస్తుంది. ప్రతి మానవుడు తాను ఏదో ఒకటి సాధించాలనే ఏదోక లక్ష్యంతో ఉంటాడు. కొన్ని సార్లు ఆ లక్ష్యాన్ని కొంత మంది చేరుకుంటారు. మరి కొంత మంది చేరుకున్నట్టే చేరుకొని వైఫల్యాలకు గురి అవుతారు. కొంత మంది ఎన్ని లక్ష్యాలను సాధించినా తనకు అత్యంత ఇష్టమైన లక్ష్యానికి చేరుకోకపోతే అసంతృప్తికి లోనవుతూ ఉంటాడు. అది ప్రతి మనిషి జీవిత పర్యంతం కనిపించే ఒక తాత్త్విక సత్యం. అహబ్ లో ఈ మనస్తత్వమే కనిపిస్తుంది. ఇటువంటి అన్వేషణే వాస్తవిక జీవితాలకి ఆకర్షణీయమవుతుంది. అందుకనే పింగళి లక్ష్మీకాంతం గారికి ఈ నవల ఆకర్షితమైంది. అది ఎంత పెద్ద నవలా అయినప్పటికీ తాను చదివి పడేయకుండా దానిలోని తాత్త్విక సత్యాలను ప్రజలకు అందించాలనే తపన ఈ నవలను అనువాదం చేసేలా చేసిందనీ భావించవచ్చు.

నా పరిశోధన ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి జీవితాన్ని,రచనలను సమగ్రంగా పరిశీలించడమే నా పరిశోధక లక్ష్యం. కనుక ఆ నవల అనువాద నవలా శిల్ప కథాంశాలను అనువాద రచయిత జీవిత అనుభవాలను సమన్వయం చేస్తూ ఈ పరిశోధన కొనసాగడం లేదనీ గమనించాలి. అందువల్ల ఈ నవల పరిచయాన్ని మాత్రమే ఈ పరిశోధనలో తెలియజేస్తున్నాను.

అయినప్పటికీ పూర్వ పరిశోధకులు చెప్పిన కొన్ని అంశాలను కూడా ఇక్కడ ఉదహరిస్తున్నాను. "నిరంతరము మానవునిలో జరుగు అంతర్యుద్ధమును అహబ్ పాత్ర అహంకారమునకు ప్రతీకగా చిత్రించిన బడినది. ప్రతీకార బుద్ధితో అతడు ప్రతిజ్ఞాపూర్వకముగా సాగించిన ప్రయత్నములు తుదకు విధి వైపరీత్యముచే ఎదురు తిరిగి స్వీయ వినాశమునకే దారి తీసిన వృత్తాంత మిందు కన్నులకు కట్టినట్లు చిత్రింపబడినది. విధి అనుల్లంఘనీయమను పరమసత్యము. చిత్ర విచిత్ర సన్నివేశములతో అద్భుత వీరరస సమ్మిశ్రమగు కథా కథన పద్ధతిలో మహూద్ధతముగా సాగినది. అందందు సందర్భవశమున జీవన సాగరమునందెదుర్కొన కష్ట పరంపరలు, పర్వతసదృశములైన తిమింగలములు బారి నుండి తప్పించుకొని తన శక్తి సామర్థ్యములు తెలియక అసమాన ధైర్య శౌర్యములతో వానిని మట్టుపెట్టదలచు సన్నిహములలో తుదకు తానే అసువులు బాసిన పరిస్థితులు, చక్కగా వివరింపబడినవి.

మహాసాగరమున సాగిన ఈ ఇతివృత్తము మానవుని మానోమయ జగత్తులో జరిగిన అంతస్సంఘర్షణకు అపురూపమైన ప్రతిరూపమనుట యధార్థము. క్రైస్తవ మత పరముగా నిందలి కొన్ని పాత్రలు కల్పింపబడినవి. కావున ఈ నవల సాంధ్యవసాయ సరణిలో సాగిన ఆధ్యాత్మిక నవల యనుట నిస్సంశయము" అని 'పింగళి లక్ష్మీకాంతం గారి వ్యక్తిత్వం - సాహిత్యం' అనే అంశంపై పరిశోధన చేసిన జి. విశ్వనాథ నాయుడు గారి వ్యాఖ్య ఎంతో సమంజసమని ఈ నవల చదివితే తెలుస్తుంది. ఇంగ్లీషు సాహిత్యంలో సముద్రాన్నీ, దానిలోని తిమింగలాల వేట వెనుక ఉన్న అన్వేషణను ఎంతోమంది రచయితలు కొన్నినవలలు రాశారు. ఈ ఒరవడిలో ఈ నవల అగ్రస్థానంలో నిలుస్తుందని విమర్శకుల అభిప్రాయం.


**నలసాని రాం ప్రసాద్,**

**రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ,**

**యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్,**

**ఫోను: 9502847494.**






RNI No. APTEL/2003/12253
భావవీణ
కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక
ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category
BHAVA VEENA
Journal of Arts, Literary, Culture & Language Study
Vol : 19 Issue No. 1 (1) Monthly January (1) 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-
సావిత్రిబాయి ఫూలే




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 1 - January (1) 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San).,
   M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
   (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics
   and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., PhD.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   HOD, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | వాలాగ్ని నాటికలు - పరిశీలన | - బాదరవేణి నాగరాజు | 6 |
| 2. | వరంగల్ జిల్లా వచన కవితా పరిణామం | - బోజనపల్లి లక్ష్మణ్‌కుమార్ | 10 |
| 3. | ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలలు-దళిత స్త్రీ బ్రతుకు పోరాటం | - సురేఖ దుగులూరు &<br>- డా॥. వై. సుభాషిణి | 14 |
| 4. | మాతృభాషతోనే మనోవికాసం - నూతన జాతీయ విద్యా విధానం 2020 | - డా॥. భూక్యా రాజారాం | 18 |
| 5. | శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి సాగర సంగమం కథ - దళిత చైతన్యం | - డా॥. గుండ్లూరు వెంకట రమణ | 22 |
| 6. | అనుబంధాలకు చిరునామా 'మహీధర' నవలలు | - కచ్చళ్ళ బలరామ్ | 24 |
| 7. | అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నతీకరణంలో | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 28 |
| 8. | అభ్యుదయ శంఖారావం - అనిసెట్టి కవిత్వం | - డా॥. పి. విజయకుమార్ | 31 |
| 9. | దళిత కవిత్వం - సామాజిక చైతన్యం | - ఆచార్య డి. వి. శ్రవణ్ కుమార్ | 34 |
| 10. | వేదాంగ వాఙ్మయంలో స్మృతులు | - డా॥. డి.ఉదయకుమారి | 39 |
| 11. | ప్రాచీన కథాకావ్యాల్లో తెలుగువారి సంస్కృతి - జీవన విధానం | - డా॥. వేదాంతం. బి.యమ్.యమ్ | 42 |
| 12. | తిక్కన తెలుగు తెన్నులు | - డా॥. వై. విజయలక్ష్మి | 44 |
| 13. | కుందుర్తి కవిత్వంలో మానవీయత | - డా॥. చింతల రాకేశ్ భవాని | 47 |
| 14. | 'వలస' నవల : వస్తు పరిణామం | - డా॥. వి. శాంతిలక్ష్మి | 52 |
| 15. | అంగర వెంకట శివ ప్రసాదరావు కథలు - మానవతా విలువలు | - నద్దన పుట్టి గణేష్ | 55 |
| 16. | శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి గారి సాహిత్యము - పరిశీలన | - కాంపల్లె రవిచంద్ర | 59 |
| 17. | అమెరికా తెలుగు కథానిక - మహిళ | - యన్. మహేశ్వరి &<br>- ఆచార్య మూలె విజయలక్ష్మి | 63 |
| 18. | కాకాని చక్రపాణి నవలలు - సమగ్ర పరిశీలన | - మల్లెంబాక వేంకటరావు | 66 |
| 19. | జయంతి ప్రకాశ శర్మ కథలు - సామాజిక చైతన్యం | - మొండి స్వామి | 72 |
| 20. | పింగళి - కాటూరి 'అజ్ఞాన కృతము' కరుణశ్రీ 'పుష్ప విలాపం'.. | - నలసాని రాం ప్రసాద్ | 76 |
| 21. | సాహిత్య ప్రస్థానం కథల్లో - మద్యంపై పోరాడిన స్త్రీ పాత్రలు | - పి. సాయిలక్ష్మి | 82 |
| 22. | ద్రావిడ భాషల్లో భారతాలు | - డా॥. వి. పళని | 87 |
| 23. | కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య పరిచయం | - ఆర్. గోపాల్ | 90 |
| 24. | డా॥. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు 'ఊత రాని పడవలు' కథలోని.. | - శివయ్య రాజులపాటి | 93 |
| 25. | జూకంటి జగన్నాథ కవిత్వంలో చారిత్రక సాంస్కృతిక అంశాలు | - యన్. మహేందర్ | 98 |
| 26. | అనురాగ తరంగాలు నవల - అద్దె గర్భం చిత్రణ | - వడ్డివాటి మల్లయ్య | 101 |
| 27. | తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే | - డా॥. పెండ్యాల లావణ్య &<br>- డా॥. బూసి వెంకటస్వామి | 109 |
| 28. | Philosophical Concepts in the Bhagavad Gita - An Overview | - Ashok Manda | 113 |
| 29. | A Literature Review on the Challenges of Learning English Skills... | - B.Venkateshwarlu &<br>- K.Saritha | 118 |
| 30. | History, Architecture and Terrain analysis of Chandragiri fort | - Dr. Meesala Ramakrishna,<br>- Dr. Doneti Sivaji &<br>- Dr. Seelam Srinivasa Rao | 123 |
| 31. | SOCIO POLITICAL CONCERNS in Nayantara Saghal's ... | - Dr. C. Jaiganesh | 131 |
| 32. | Erroneous Companionship in Shobhaa De's work Snapshots | - V.Hamsaveni | 136 |

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | వాలాగ్ని నాటికలు - పరిశీలన | - బాదరవేణి నాగరాజు | 6 |
| 2. | వరంగల్ జిల్లా వచన కవితా పరిణామం | - బోజనపల్లి లక్ష్మణ్‌కుమార్ | 10 |
| 3. | అచార్య కొలకలూరి ఇనాక్ నవలలు-దళిత స్త్రీ బ్రతుకు పోరాటం | - సురేఖ దుగులూరు &<br>- డా॥. వై. సుభాషిణి | 14 |
| 4. | మాతృభాషతోనే మనోవికాసం - నూతన జాతీయ విద్యా విధానం 2020 | - డా॥. భూక్యా రాజారాం | 18 |
| 5. | శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి సాగర సంగమం కథ - దళిత చైతన్యం | - డా॥. గుండ్లూరు వెంకట రమణ | 22 |
| 6. | అనుబంధాలకు చిరునామా 'మహీధర' నవలలు | - కచ్చళ్ళ బలరామ్ | 24 |
| 7. | అస్పృశ్యమవుతున్న దేశీ శబ్దజాలం నిమ్నీకరణంలో | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 28 |
| 8. | అభ్యుదయ శంఖారావం - అనిసెట్టి కవిత్వం | - డా॥. పి. విజయకుమార్ | 31 |
| 9. | దళిత కవిత్వం - సామాజిక చైతన్యం | - అచార్య డి. వి. శ్రవణ్ కుమార్ | 34 |
| 10. | వేదాంగ వాఙ్మయంలో స్మృతులు | - డా॥. డి.ఉదయకుమారి | 39 |
| 11. | ప్రాచీన కథాకావ్యాల్లో తెలుగువారి సంస్కృతి - జీవన విధానం | - డా॥. వేదాంతం. బి.యమ్.యమ్ | 42 |
| 12. | తిక్కన తెలుగు తెన్నులు | - డా॥. వై. విజయలక్ష్మి | 44 |
| 13. | కుందుర్తి కవిత్వంలో మానవీయత | - డా॥. చింతల రాకేశ్ భవాని | 47 |
| 14. | 'వలస' నవల : వస్తు పరిణామం | - డా॥. వి. శాంతిలక్ష్మి | 52 |
| 15. | అంగర వెంకట శివ ప్రసాదరావు కథలు - మానవతా విలువలు | - నద్దన పుట్టి గణేష్ | 55 |
| 16. | శ్రీ గొట్టిముక్కల సుబ్రహ్మణ్యశాస్త్రి గారి సాహిత్యము - పరిశీలన | - కాంపల్లె రవిచంద్ర | 59 |
| 17. | అమెరికా తెలుగు కథానిక - మహిళ | - యస్. మహేశ్వరి &<br>- అచార్య మూలె విజయలక్ష్మి | 63 |
| 18. | కాకాని చక్రపాణి నవలలు - సమగ్ర పరిశీలన | - మల్లెంబాక వేంకటరావు | 66 |
| 19. | జయంతి ప్రకాశ శర్మ కథలు - సామాజిక చైతన్యం | - మొండి స్వామి | 72 |
| 20. | పింగళి - కాటూరి 'అజ్ఞాన కృతము' కరుణశ్రీ 'పుష్ప విలాపం'.. | - నలసాని రాం ప్రసాద్ | 76 |
| 21. | సాహిత్య ప్రస్థానం కథల్లో - మద్యంపై పోరాడిన స్త్రీ పాత్రలు | - పి. సాయిలక్ష్మి | 82 |
| 22. | ద్రావిడ భాషల్లో భారతాలు | - డా॥. వి. పళని | 87 |
| 23. | కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య పరిచయం | - అర్. గోపాల్ | 90 |
| 24. | డా॥. ఎమ్.వి.జె. భువనేశ్వరరావు 'ఊత రాని పడవలు' కథలోని.. | - శివయ్య రాజులపాటి | 93 |
| 25. | జూకంటి జగన్నాథ కవిత్వంలో చారిత్రక సాంస్కృతిక అంశాలు | - యస్. మహేందర్ | 98 |
| 26. | అనురాగ తరంగాలు నవల - అద్దె గర్భం చిత్రణ | - వడ్డివాటి మల్లయ్య | 101 |
| 27. | తొలితరం మహిళా ఉద్యమకారిణి సావిత్రిబాయి పూలే | - డా॥. పెండ్యాల లావణ్య &<br>- డా॥. బూసి వెంకటస్వామి | 109 |
| 28. | Philosophical Concepts in the Bhagavad Gita - An Overview | - Ashok Manda | 113 |
| 29. | A Literature Review on the Challenges of Learning English Skills... | - B.Venkateshwarlu &<br>- K.Saritha | 118 |
| 30. | History, Architecture and Terrain analysis of Chandragiri fort | - Dr. Meesala Ramakrishna,<br>- Dr. Doneti Sivaji &<br>- Dr. Seelam Srinivasa Rao | 123 |
| 31. | SOCIO POLITICAL CONCERNS in Nayantara Saghal's ... | - Dr. C. Jaiganesh | 131 |
| 32. | Erroneous Companionship in Shobhaa De's work Snapshots | - V.Hamsaveni | 136 |

BHAVAVEENA
Vol. 19, Issue. 1, January (1) 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావ వీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# పింగళి - కాటూరి 'అజ్ఞాన కృతము' కరుణశ్రీ 'పుష్ప విలాపం' : ప్రకృతితత్త్వం

- నలసాని రాం ప్రసాద్, రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

'సంవాదిన్యో మేధావినా బుద్ధయ:" అని సంస్కృతంలో ఒక మాట ఉంది. కొంతమంది మేధావుల ఆలోచనలు ఒకేలా ఉంటాయని దాని భావం. మన తెలుగు కవుల్లో కూడా చాలా మంది కొన్ని పద్యాల్ని, కొన్ని కావ్యాల్ని ఒకరినొకరు అనుసరించుకున్నట్లు రాసినవి కనపడు తుంటాయి. భావకవిత్వంలో ఇలాంటి అనుసరణలు లేదా ఒకరికి తెలియకుండా మరొకటి రాన్తున్నవారిలా కనిపిస్తాయి. నేనీ వ్యాసంలో 1918-21 మధ్యకాలంలో రాసిన కరుణశ్రీ గారి 'పుష్పవిలాపం,', 1921 ప్రాంతంలో పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావుగార్లు రాసిన 'అజ్ఞానకృతము' ఖండకావ్యాల్లో కనిపించే ప్రకృతి తత్వాన్ని విశ్లేషించాలనుకుంటున్నాను.

**పింగళి-కాటూరి 'అజ్ఞానకృతము' :**

అజ్ఞాన కృతమనే ఈ ఖండిక కృష్ణా పత్రికలో 1927 అగష్టులో ప్రచురితమైంది. ఇది పింగళి లక్ష్మీ కాంతం, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు జంటగా రాసిన 'తొలకరి' ఖండకావ్య సంపుటిలోనిది. దీనిని కాటూరి వేంకటేశ్వర రావు గారు రాసిన ఉంటారని పింగళి వేంకట కృష్ణారావు గారు (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనం. పుట:385) దీనికి ఒక ఉపపత్తిని చూపించారు. "అలెగ్జాండర్ డ్యూయస్' రచించిన 'బ్లాక్ టులిప్' అనే ఆంగ్ల నవలను కాటూరి వేంకటేశ్వరరావు గారు నల్లకలువ పేరుతో 1965 సంవత్సరంలో అనువదించారు. ఇందులో కోర్నిలియస్ పుష్ప ప్రేమికుడు. అతడు పెంచిన కలువ పూవును ఈర్ష్యతో గ్రిఫస్ అనేవాడు ధ్వంసం చేస్తాడు.ఆ సందర్భంలో కాటూరి వేంకటేశ్వరరావు గారు కోర్నీలియస్ చేత జాలి గొలుపు పూలపాటను పాడించారు. దీనిని బట్టి మొదటి నుండి వీరికి పుష్పాలంటే ఒక సుకుమారమైన భావన ఉన్నదేమో వినిపిస్తుంది. భావంలో భాషలో ఈ ఖండికలో కాటూరి వారి పోకడలే కనిపిస్తున్నాయి" అని అజ్ఞానకృతమనే ఖండికను కాటూరి వేంకటేశ్వరరావు గారే రాసి ఉంటారని తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. "జంట పువ్వులలో ఒక పువ్వును తెంపిన పుత్రుని మందలిస్తున్న తల్లి భావాలను వివరించే ఖండిక" అని గొల్లపూడి ప్రకాశరావు (భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి-కాటూరి,1999:27) తెలియజేశారు. పూల మొక్కలకు కూడా మనిషిలాగే ప్రాణముంటుంది. ప్రకృతిని కవులు అంత ఇష్టపడటానికి కారణం ప్రకృతిలోని కదలికను కవి హృదయంతో చూడగలుగుతాడు. అందుకనే ప్రకృతిని అంతగా ఇష్టపడతాడు కవి. వీటిని ఆకాశాన్ని, భూమిని, వాయువుని, అగ్నిని, నీటిని వీటినే పంచభూతాలంటారు. ఈ పంచభూతాలు అన్ని కలిస్తేనే ప్రకృతి. మనిషి పంచభూతాల నిర్మాణం. మనిషిలో అగ్ని అంటే వేడి ఉంటుంది. ఊపిరి అంటే మనిషిలో వాయువు ఉంటుంది. శరీరం ఒక పదార్థ నిర్మాణం. దానిలో మట్టి ఉంటుంది. ఇలా మానవ దేహం పంచభూతాత్మకం. అందుకే మనిషికి, ప్రకృతికి విడదీయరాని బంధం ఉంటుంది. భావ కవిత్వం లో కవులు విస్తృతంగా వర్ణించడం జరుగుతుంది. అజ్ఞాన కృతము ఖండికలో మానవునిలాగే ప్రాణమున్న చెట్లను నరకడం, పువ్వులను కోయడం, కొమ్మలను నరకడం మొదలైన పనులన్నీ అజ్ఞానంతో చేసే పనులు అని చెప్పడమే ఈ అజ్ఞాన కృతము ఖండికలోని ముఖ్యమైన సందేశం.

తన తోటలోని చెట్లకు రెండు పూలు పూస్తాయి. ఆ రెండింటిలో ఒకదాన్ని ఒక బాలుడు తుంచుతాడు. ఆ

దృశ్యాన్ని చూసిన తల్లి ఆ పువ్వుని విడదీసి నందుకు మరొక పువ్వు ఆ చెట్టు ఎలా బాధపడతాామో కవులు ఇలా వర్ణిస్తారు. ఆ రెండు పువ్వులు ఒకే మంచంపై ఎంతో సంతోషంగా పడుకొని ఉండగా వాటి నుండి ఒకదాన్ని విడదీయడానికి నీకు చేతులేట్లా వచ్చాయి. అంతేకాదు తనకెంతో ఇష్టమైన బిడ్డను త్రుంచడం వలన ఆ తల్లి తీగ ఎంత దుఃఖిస్తుంది కదా అంటూ...

"కనులు మొగిడ్చి కూర్కు తన గాదిలిబిడ్డను నీవు త్రుంచిపో
యినగని తల్లితీవ నిలువెల్ల జలింపగ నెట్టు విహ్వలిం
చనో కనుగొంటివే? కడుపు చుమ్మలుచుట్టగ బాష్పబిందువుల్
కనుగొనలందు నిండి తొలకన్ గనువారల గుండె నీరుగన్"

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:31)

అని వర్ణిస్తారు. పువ్వు తల్లి అయిన చెట్టు బాధను కడుపు లుంగలులుంగలు చుట్టిన బాధతో కన్నీళ్ళు కారుస్తూ గుండె నీరు అవుతుంది అంటారు కవి. సహజంగా పూలమొక్కలపై రాత్రి కురిసిన మంచు ఉంటుంది. మనం, ఆకు గానీ, పువ్వు కోసినప్పుడు గానీ గట్టిగా తెలుపడం వలన ఆ మొక్క మీద ఉన్న మంచు నీళ్ళు కిందపడతాయి. అలా నీళ్ళు కిందపడటాన్ని గుండెనీరై కన్నీళ్ళు కాలుస్తుందనడంలో అద్భుతమైన భావుకత కనిపిస్తుంది. "అందుకనే ప్రకృతిని మాతృ మూర్తిగా, దేవతగా భావకవులు గ్రహించడం జరుగుతుందని" (ఆంధ్రునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు: ప్రయోగాలు,1989:403) భావ కవిత్వ లక్షణాల గురించి పేర్కొన్నారు.

అంతేకాదు, అక్కా చెల్లెళ్లలా జంటగా కలకాలం పెరిగే ఆ జంటలోని ఒక పువ్వుని త్రుంచేసిన తరువాత ఆ మిగిలిన పువ్వు ప్రొద్దున్నే లేచి తన ప్రియమైన చెల్లెలు కనిపించకపోవడం వలన బాధపడునో కదా అంటూ అలా ఆ జంటను విడగొట్టడం అది ఎంతటి విషాదానికి కారణం అవుతుందో అని భయం వేస్తుందని తల్లి తన కొడుకుని మందలిస్తున్నట్లు ఈ విధంగా వర్ణిస్తారు.

"కటకట! నిద్ర లేచి తన గాదిలిచెల్లెలు గానరామి ని
క్కటమగు నార్తిజెంది, నవకమ్ములు మాయగ దొంటిమేని ము
చ్చటలకు బాసి యెంతటి విషాదము జెందునొ జంటపూవు? నీ
కటికతనమ్ముగన్నగొడుకా ! భయమయ్యెండు నేమిసేతురా"

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:31)

అంతేకాదు ఆ అక్కాచెల్లెళ్ళు ఒకరినొకరు కానరాక ఎలా బాధపడుతుందో

"నిన్నటి సంజ జెల్లి జననీ ! యవి కోసియొసంగు మన్న, నీ
క్రొన్నన లెల్లి విచ్చినను గోసియొసంగెద నంటి, శయ్యపై
కన్నులు విచ్చి జాలకముత్రంతల నీ దురవస్థ చూసి, యా
చిన్నది యెంత పొరిడునొ? చెంపల నశ్రులు జాలువాఱగన్ "

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:32)

అంతేకాదు నీ అజ్ఞానం వలన ఆ పువ్వును కోసేశావు. నిన్న ఒక తుమ్మెద ఆ పువ్వుల చుట్టూ తిరుగుతూ వాటిని ఎవరూ ముట్టుకోకూడదని కొన్ని మంత్రాలు వేసింది. దాని ప్రభావం నీపై ఉంటుందమో అని తల్లి భయాన్ని వ్యక్తం చేసింది. తన కుమారుడు చేసిన పనికి ఎంతో బాధ పడింది. అది తెలియక చేసిన పని అని ఆ తల్లి పదేపదే ఆ పూలమొక్కకు వివరించింది. ఆ పూల మొక్కల్ని, పూవుల్ని రాత్రంతా తన చల్లని ప్రేమ అనే రసాన్ని వాటి మీద చల్లుతూ రాత్రంతా కాపాడింది. మరలా రాత్రి వచ్చి ఒక పువ్వు కనిపించకపోవడం వలన ఆ చందమామ ఎంతగా బాధపడుతుందో అని ఆ ప్రకృతిలో ఒకదానితో

ఒకటి ఎలా సంబంధాల్ని కలిగి ఉంటాయో ఊహిస్తున్నారు కవి. ఆ భావనను ఒక అందమైన పద్యంలో వర్ణిస్తూ ...

"చల్లని ప్రేమరసము బై
జల్లుచు రేయెల్ల సాకె చంద్రుడు వీనిన్
బిల్లడ! మాపటికిన్ జిం
తిల్లుచుదనపూవు గనమి దెసల బరచుగా"

(తొలకరి, అజ్ఞాన కృతము పుట:32)

అని వర్ణించారు. తన కుమారుడు చేసిన పనిని కాదనలేను, కానీ తన బిడ్డను తాను మరలా ఎలాగో తెచ్చి ఇవ్వలేకపోయిన తన బిడ్డను మాత్రం మీ బిడ్డగా భావించమంటుంది. అంతేకాదు భవిష్యత్తులో మొక్కలను, పువ్వులను ఎవరూ నాశనం చేయకుండా కలకాలం మేలు జరగాలని కోరుకుంటున్నాననీ దీవిస్తుంది.

ఈ ఖండికలో పువ్వును కోసిన మొక్కలను కొట్టేసినా ప్రకృతితో వాటికున్న అనుబంధాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అవి కూడా మనుషుల్లాగే తమ చుట్టూ ఉండే గాలి, నీరు, భూమి, సూర్యుడు, చంద్రుడు మొదలైన వాటితో అనుబంధాన్ని కలిగి ఉంటాయని గుర్తుంచాలని అంటారు కవులు. భావకవులు ప్రకృతితో గల తాదాత్మ్యాన్ని ఎంతగానో అనుభూతి చెందుతారు. ఆ ప్రభావం ఈ అజ్ఞాన కృతము ఖండికలో స్పష్టంగా కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారిని భావ కవితా ఉద్యమానికి ఒక నాయకుడిగా చెప్తారు. ఆయన రాసిన కృష్ణపక్షంలో ప్రకృతి తాదాత్మ్యంతో అనేక కవితలు రాశారు. ఒకసారి ఆయన బెజవాడ నుంచి బళ్లారికి రైళ్లో వెళ్లుతుండగా చుట్టూ ఉన్న పొలాల సౌందర్యానికి రైలు పడుతున్న వరకు పరవశించి 'అకులో అకునై' అనే ఖండికను రాశారు. (దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం, 2021:1)

"అకులో అకునై పువ్వులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేత రెమ్మనై
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన నిచటనే యాగిపోనా" ఇక్కడ అడవి అనగానే ఒక ప్రకృతి సౌందర్యం, క్షేత్రం అనిపిస్తుంది.

"గల గాలని వీచు చిరుగాలిలో కెరటమై
జల జలని పారు సెలపాటలో తేటనై
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన నిచటనే యాగిపోనా"ప్రకృతిలో గాలి,నీరు వాటి వలన కలిగే ఆనందాన్ని ఇక్కడ ప్రత్యేకంగా వర్ణిస్తున్నారు కవి.

"పగడాల చిగురాకు తెరచాటు తేటినై
పరువంపు విరిచేడె చిన్నారి సిగ్గునై
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన నిచటనే యాగిపోనా" ఇక్కడ పగడాల చిగురాకు మొక్కలోని చిగురాకులో కనిపించే అందం లేదా సౌందర్యం అక్కడే తిరిగే తుమ్మెదలు అప్పుడప్పుడు విరిసే మొగ్గలు వాటిని మానవీకరించినట్లుగా అవి తనను పిలుస్తున్నట్లుగా,అని తనతో మాట్లాడుతున్నట్లుగా వర్ణించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ప్రకృతి తాదాత్మ్యం అపూర్వమైంది.

"అకలా దాహమా చింతలా వంతులా
ఈ కరణి వెర్రినై యేకతమ తిరుగాడు
ఈ యడవి దాగిపోనా
ఎట్లైన నిచటనే యాగిపోనా" (దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం, 2021:1) అని ఇక్కడ ప్రకృతితో తాదాత్మ్యం చెందిన వ్యక్తికి అకలి, దాహం, నిద్ర మొదలైనవి ఉండవనడంలో భావకవి ప్రకృతి వర్ణనలతో ఆ సౌందర్యానికి పతాక చిహ్నం. దేవులపల్లి కృష్ణశాస్త్రి గారు ప్రకృతినంతా ఎంతో తాదాత్మ్యంతో అనుభవించి, అనుభూతి చెందుతూ పులకరించాడని ఈ కవిత్వంలో అని చెప్పవచ్చు. ప్రకృతే తానై మాట్లాడాడు. పింగళి, కాటూరి కవులు మాత్రం ఆ ప్రకృతితో సంభాషించడం ఆ ప్రకృతికే తన బిడ్డను అంకితం చేయడం వంటి వర్ణనలు కృష్ణశాస్త్రిగారితో పోటి పడటం అనిపిస్తుంది. కృష్ణశాస్త్రి

గారు 'కృష్ణపక్షం'లో ప్రకృతి తాదాత్మ్యంతో కూడిన కవితలు ఎన్నింటినో వర్ణించారు. ఈ ప్రకృతిని ఎందుకు ప్రేమిస్తున్నావు, ఈ ప్రకృతి మనల్ని ఎందుకు ప్రేమిస్తుందనే ప్రశ్నలు ఒకదానికి మరొక ప్రశ్నగా మిగులుతాయి తప్ప అదే సమాధానంగా చెప్పలేము. దీన్ని 'ఏల ప్రేమింతును' అనే ఖండికలో కృష్ణశాస్త్రి గారు పువ్వుల పరిమళాన్ని ఎందుకు ఇస్తాయి, చందమామ వెన్నెలను ఎందుకు ఇస్తుంది, నదులు ఎందుకు ప్రవహిస్తాయి, ఈ చల్లగాలి ఎందుకు వీస్తుంది అంటే ఏమి చెప్పగలం. అలాగే నిన్నె నిన్ను ఎందుకు ప్రేమిస్తున్నావని నేను ఎందుకు చెప్పగలనని చెప్పడం ప్రేమించడం తన సహజ గుణంగా చెప్పిన మాటల్లో గొప్ప తాత్త్విక సత్యం ఉంది. ప్రకృతి మనిషికి కావాల్సింది నావి ఎందుకు ఇస్తుంది, ప్రకృతిని మనిషి ఎందుకు ప్రేమిస్తున్నాడు. అవి ఒకదానికి ఒకటి ముడిపడిన సహజ బంధాలు అని ఈ కింది పద్యాంలో ఇలా చెప్తారు కృష్ణశాస్త్రి గారు.

"సౌరభము లేల చిమ్ము పుష్పవ్రజంబు?
చంద్రికల నేల వెదజల్లు చందమామ?
ఏల సలిలంబు పారు? గాడ్పేల విసరు?
ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను? "
"మావిగున్న కొమ్మను మధుమాసవేళ
పల్లవము మెక్కి కోయిల పాడు టేల
పరుల తనియించుటకొ? తన బాగు కొరకొ?
గాన మొనరింపక బ్రతుకు గడవ బోకొ?"
(దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణపక్షం,2021, పుట,14)

ఇటువంటిదే కరుణశ్రీ గారి పుష్ప విలాపం కూడా అని ఈ ఖండిలకలను చూస్తే అర్థమవుతుంది.

**కరుణశ్రీ 'పుష్పవిలాపం' :**

కరుణశ్రీ పూర్తి పేరు జంధ్యాల పాపయ్య శాస్త్రి. అయన రాసిన ఈ పుష్ప విలాపం. కరుణరస భరిత మైనది. ఒక భక్తుడు పూజ కోసం పూలు కోయాలని, పూలతోటకు వెళ్తాడు. పూలు కోసేటప్పుడు ఆ పువ్వుల ఆవేదన అతని మనస్సులో ఎలాంటి భావ ప్రకంపన కలిగించిందో ఒక నంభాషణగా వర్ణించిన తీరు ఎంతోమందిని ఆకట్టుకుంటుంది.

"నే నొక పూలమొక్క కడ నిల్చి చివాలున కొమ్మవంచి
గో
రానెడు నంతలోన విరు లన్నియు జాలిగ నోళ్ళు విప్పి
"మా
ప్రాణము తీతువా" యనుచు బావురు మన్నవిబీ
క్రుంగిపోతి నా

మానసమం దెదో తళుకు మన్నది పుష్పవిలాప కావ్యమై (కరుణశ్రీ 'పుష్పవిలాపం') అని ఆ పుష్ప విలాప సందర్భాన్ని వర్ణిస్తారు కవి కరుణశ్రీ. ఆ పువ్వులు కోసే అతనితో ఇలా అంటాయి. ఓం భక్తుడా నువ్వ మోక్షం అనే ధనం కోసం మిమ్మల్ని మా తల్లి ఒడిలోని ఆడు కుంటున్న మమ్మల్ని తెంపి బుట్టలో పెట్టి అమ్ము కుంటావు. హృదయమే లేని నీకు పూజలెందుకు అని ప్రశ్నిస్తుంది. ఇక్కడ ప్రకృతినే దైవంగాను, దైవాన్ని ప్రకృతిగాను అనే ఒక తాదాత్మ్య భావం ఇందులో కనిపిస్తుంది. ఈ పద్యంలో ఇలా ఉంది.

"తల్లి యొడిలోన తలిరాకు తల్ప మందు
ఆడుకొను మమ్ములను బుట్టలందు చిదిమి
అమ్ముకొందువె మోక్ష విత్తమ్ము కొరకు!
హదయమే లేని నీ పూజ లెందుకోయి?
జడమతుల మేముబీ జ్ఞానవంతుడవు నీవుబీ
బుద్ధి యున్నదిబీ భావ సమద్ధి గలదుబీ
బండబారె నటోయి నీ గుండెకాయ!
శివునకై పూయదే నాల్గు చిన్ని పూలు?
(కరుణశ్రీ 'పుష్పవిలాపం')

పింగళి కాటూరి కవులు కూడా ఈ పద్యంలోని భావం లాగే పువ్వులు తల్లితో ఆడుకుంటున్నట్లు వర్ణించారు. ఓ భక్తుడా నిన్ను జ్ఞాన వంతుడు అంటారు. మమ్మల్ని జడవంతులంటారు. మరి నీకు బుద్ధి ఉన్నది, మాట్లాడ గలిగే శక్తి ఉన్నది, అటువంటి నీకు హృదయం బండబారిపోయిందా అని అనడం కవి వర్ణిస్తారు. గారిని

గౌరవించి ఆ గాలి ద్వారా మేము పరిమళాల్ని వెదజల్లుతాం. తుమ్మెదలకు మనుషులకు విందు చేస్తాం. అటువంటి మమ్మల్ని తల్లి బిడ్డలను వేరు చేస్తూ ఉంటారు. అది స్వార్థ బుద్ధి కాదా అని ప్రశ్నిస్తాయి.

ఆయువు గల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవతల్లి
జా
తీయత దిద్ది తీర్తు ముబీ తదీయ కరమ్ములలోన
స్వేచ్ఛమై
నూయల లూగుచున్ మురియుచుందుముబీ
ఆయువు దీరినంతనే
హాయిగ కన్ను మూసెదము ఆయమ చల్లని కాలి
వ్రేళ్ళపై

(కరుణశ్రీ, పుష్పవిలాపం)

పింగళి కాటూరి కవులు కూడా ఒక పువ్వును తుంచడం వలన కలిసి ఆడుకుంటున్న అక్క చెల్లెళ్ళ, తల్లి బిడ్డలా ఉన్న వాళ్ళని విడగొట్టడాన్ని ఒక విషాదంగానే అభివర్ణించారు కవులు. అలా ప్రకృతిలో ఉన్నటువంటి పువ్వుల్ని కోసినప్పుడు కేవలం రెండవ పువ్వు, తల్లి ఆ ప్రకృతి విలాపాన్ని పింగళి కాటూరి కవులు పలికించగలిగారు. దాన్ని ఒక అజ్ఞాన మైన చర్యగా అభివర్ణించి ఆ ఖండికలు అజ్ఞాన కృతమనే పేరును పెట్టారు. కరుణశ్రీ పువ్వులను కోయడం ఆడవాళ్ళు పువ్వులను దారాలతో గొంతులను గూర్చి ఉరి బిగించి గుండెలో నుంచి పువ్వుల్ని గుచ్చి తలలో పెట్టుకుంటారు. అటువంటి దయలేని ఆడవాళ్ళు కూడా నిందిస్తారు కరుణశ్రీ. అసలు ఆ నరజాతికే నీతి, జాలి లేదని వ్యాఖ్యానిస్తారు.

మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద
మాధురీ
జీవిత మెల్ల మీకయి త్యజించి కృశించి నశించిపోయెబీ
మా
యౌవన మెల్ల కొల్లగొని ఆ పయి చీపురుతోడ చిమ్ము
మ
మ్మావల పారబోతురు గదా! నరజాతికి నీతి
యున్నదా!
బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు
సహజ మగు ప్రేమ నీలోన చచ్చెనేమి?
అందమును హత్య చేసె హంతకుండ!
మైలపడిపోయె నోయి! నీ మనుజ జన్మ.
పూజ లేకున్న బాబు నీ పున్నె మాయె!
కోయ బోకుము మా పేద కుత్తుకలను
అకట! చేసేత మమ్ముల హత్య చేసి
బాపుకొన బోవు ఆ మహా భాగ్య మేమి?

(కరుణశ్రీ, పుష్పవిలాపం)

కరుణశ్రీ గారి పద్యాలు పువ్వుల వలె మెత్తగా మకరందం జాలువిరునట్లుగా హృదయాన్ని తాకుతూ ఉంటాయి. పువ్వుల్ని కోయడం మాత్రమే కాకుండా ఆ పువ్వుల్ని మరలా ఎలా పడేస్తారో చెప్పారు. దానికి బుద్ధ దేవుడు పుట్టిన, అహింసను వారసులైన శాంతి భూమిలో పుట్టినవారు కూడా పువ్వుల్ని కోస్తున్నారని ఎంతో ఉదాత్తంగా వర్ణిస్తారు. కరుణశ్రీ పద్యాలు మాధుర్య గుణంతో సుకుమార శైలిలో వినగానే అర్థమయ్యేటట్లుగా వర్ణించారు.

భావకవులొకరినొకరిపై వారి ప్రభావం పడుతుంది. కృష్ణశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతం గారు ఎంతో స్నేహంగా ఉండేవారు. వివిధ శుభ కార్యక్రమాలేవైనా జరిగితే ఒకరింటికి మరొకరు వస్తూ పోతుండేవారు. పింగళి లక్ష్మీకాంతంగారి కుమారుడి వివాహానికి దేవులపల్లి కృష్ణశాస్త్రి, కాటూరి వేంకటేశ్వరరావు గార్లు హాజరయ్యారు. ఆ దృశ్యాన్ని పింగళి సూర్య సుందరం తన 'పింగళి లక్ష్మీకాంతం' అనే గ్రంథంలో (పుట: 69)లో ప్రచురించారు. దీన్ని బట్టి ఒకరికొకరికి ఎంత దగ్గరగా ఉండేవారో దీన్ని బట్టి కూడా అర్థమవుతుంది. వీరి భావాలు కూడా ఒకరివి మరొకరిపై పడే అవకాశం కూడా ఉందని దీన్ని బట్టి కూడా ఊహించవచ్చు. అయితే ఆ ప్రభావం ఎంత ఉన్నప్పటికి పింగళి,

కాటూరి కవులపై పడిన ప్రభావం గురించి ప్రముఖ విమర్శకులు కడియాల రామ మోహన రాయ్ వ్యాఖ్యానిస్తూ "భావ కవులు రాసే దంతా ప్రేయసి గురించి మాత్రమే కాదని భావ కవిత్వంలో ఒక నూతన ఒరవడిని సృష్టిస్తారని" అని (తెలుగు కవిత వికాసం,1982 పుట: 69) అన్నారు.

పింగళి కాటూరి కవుల పద్యాల్లో నిగూఢమైన భావుకత ఉంటుంది. గొప్ప ధ్వని ఉంటుంది. మాధుర్య గుణం ఉన్నప్పటికి కరుణశ్రీ గారి పద్యాలలోని పదలాలిత్యం కనిపిస్తుంది. కానీ ప్రకృతితత్త్వం ఔచిత్యవంతగా ప్రతిఫలిస్తుంది. భావ కవులు సుకుమార మైన ప్రకృతిని ప్రేమిస్తారు. మనుషుల్ని ఇంకెంత ప్రేమిస్తారో అలోచించుకోవలసిందే, అందుకే. ప్రేమకు స్వేచ్ఛ ప్రాణం, స్వేచ్ఛ సుఖ సంతోషాల్ని నిర్వాజత అందిస్తుంది. అంటే ఒకరు మనకు ఇచ్చిన దానికి వెలకట్టడం గానీ, లేదా మనకు ఇచ్చిన వారికి పరోపకారం చెయ్యాలని అనుకోకుండా ఇవ్వడమే లక్ష్యంగా ఉండేదాన్ని నిర్వాజత అంటారు. నిజానికి ప్రకృతి మానవునికి ఇచ్చిన త్యాగాన్నే నిర్వాసిత అంటారు. అంటే ఒకరు మనకు సహాయం చేశారు కాబట్టి, మనం కూడా వారికి సహాయం చెయాలనుకోవడం స్వార్థం పరస్పర సహకారం అవుతుంది. అలా కాకుండా వాళ్ళు అడక్కుండానే మనం సహాయం చేయడం, మరలా వారి నుంచి సహాయాన్ని ఆశించకపోవడం నిర్వ్యాజత. ఈ గుణం ప్రకృతిలో ఉంది. కాబట్టి ప్రకృతియే మనిషి కంటే గొప్పది. ప్రకృతితత్త్వ రహస్యం ఇదేనని భావించవచ్చు. ప్రముఖకవి, విమర్శకుడు సుమనశ్రీ "కవితా సామాగ్రి పుష్కలంగా ఉన్న'తొలకరి" అనే వ్యాసం (రసజ్ఞ శిల్పి -అచార్య పింగళి లక్ష్మీకాంతం శతజయంతి సంచిక, పుట: 24)లో చెప్పిన మాటలతో దీన్ని ముగిస్తాను. "ప్రకృతి దృశ్యాల్ని వర్ణించుటలోను, నాటకీయంగా దృశ్యాల్ని మన కళ్ళముందు రూపుకట్టించడంలోను ఈ జంటకవులు ( పింగళి-కాటూరి) సిద్ధహస్తులు."

**ఆధార గ్రంథాలు :**

1. కరుణశ్రీ రచనలు 'పుష్పవిలాపం,'ఉదయశ్రీ' (ప్రథమ భాగం, 24వముద్రణ), అక్టోబర్, రామాపబ్లిషర్స్, గుంటూరు, 1954.
2. పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు, 'తొలకరి' (పద్య ఖండకావ్య సంపుటి), బందరు కృష్ణా స్వదేశి, ముద్రాక్షరశాల ప్రథమ ముద్రణ, 1923.
3. పింగళి వేంకట కృష్ణారావు, 'పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము' నిర్మలా అఫ్ సెట్ ప్రింటర్స్, విజయవాడ,2013.
4. దేవులపల్లి కృష్ణశాస్త్రి 'కృష్ణపక్షం' నవచేతన పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2021,
5. పింగళి సూర్యసుందరం, 'పింగళి లక్ష్మీకాంతం' (ప్రథమ, ముద్రణ) సి.పి.బ్రౌన్ అకాడమి హైదరాబాద్, 2010.
6. సి.నారాయణరెడ్డి, 'అధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయోగములు' ముద్రిత పిహెచ్.డి సిద్ధాంత గ్రంథం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, ప్రథమ ముద్రణ,1989
7. గొల్లపూడి ప్రకాశరావు, 'భారతీయ సాహిత్య నిర్మాతలు పింగళి-కాటూరి' భారతీయ సాహిత్య అకాడమి న్యూఢిల్లీ, 1999.
8. కడియాల రామ మోహన రాయ్, 'తెలుగు కవితా వికాసం' ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్,1982.
9. సుమనశ్రీ, కవితాసామాగ్రి పుష్కలంగా ఉన్న తొలకరి (వ్యాసం), రసజ్ఞ శిల్పి (సంపాదకులు) : పోణంగి శ్రీరామ అప్పారావు, నండూరి రామకృష్ణమాచార్య, పింగళి సూర్య సుందరం. ప్రచురణ: డా.పి.శ్రీనివాస్, విశాఖపట్టణం.1994.

★

# అనుబంధం–2

## నా పరిశోధనేతర వ్యాసాలు



సంపుటి : 06 సంచిక:03
సెప్టెంబర్ 2021



**సంపాదకులు**
**సాకే శ్రీహరి మూర్తి.,**
సెల్ : 9866216044

**సహ సంపాదకులు**
**సాకే సిరిప్రియ**

**గౌరవ సంపాదకులు**
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు

విషయసూచిక

1.విశ్వ మానవ కవి- జాషువా 4లో
ఆచార్య దార్లవేంకటేశ్వరావు
2.జాషవా ఆత్మకథ - నాకథ 8లో
డా. గిన్నారపు ఆదిరాయణ
3.ఆధునిక మహాకవి - జాషువా 10 లో
డా. బత్తల అశోక్ కుమార్
4.జాషువా సాహిత్యం - మానవ దృక్పథం 12 లో
పుట్టా పెద్ద ఓబులేసు
5.జాషువా కవిత్వం - అనువర్తనాలు 15 లో
డా. జాడ సీతాపతిరావు
6.జాషువా కవితా శైలి 18 లో
సాకే శ్రీహరిమూర్తి
7.జాషువా అంతరంగ తరంగమే గబ్బిలం 20 లో
డా.పాణుగంటి శేషకళ
8.జాతీయోద్యమ కవిత్వం - జాషువా 22 లో
డా.మందలపు నటరాజ్
9. ధిక్కార కవిత్వ పంచమ గొంతుక 24 లో
కెంగార మోహన్

**ప్రధాన కార్యాలయం**
డో.నెం:13/3-645,ఖాజా నగర్, అనంతపురము

కవర్ పేజీ ఫోటో: గోపి అక్కల
తిరుపతి

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు
పత్రికవి కానవసరం లేదు

## సంపాదకీయం.,

# నవయుగ కవి చక్రవర్తి- గుఱ్ఱం జాషువా

వసి వాడని పసి వయసులో నాటకాలు చూడాలన్న కుతూహలం కొద్దీ నాటకాలు వేసేచోటు నుండి నెట్టివేయబడ్డ గుర్రం జాషువా గండపెండేరాలతో చెళ్ళపిళ్ల వేంకటకవులతో సత్కరించబడ్డ ధీశాలి.విభిన్నమైన కథాంశాలను తీసుకొని విలక్షణమైన రీతిలో కట్టిపడేసే తన పద్య శైలిలో వర్ణించిన ఏకైక నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా.

గబ్బిలం కావ్యంలో వాడిన పద్య భాషను, నుడికారాలను మలచిన తీరు అత్యద్భుతం.అధముడైన రాజుని కూడా దేవుడిలా కీర్తించలేక, స్త్రీ అంగాంగ వర్ణనల అశ్లీలాన్ని తట్టుకోలేక, ప్రేమికుల చిలిపి, మధుర, సరస, విరహ వేదనలు పలుకలేక, భూగర్భం నుండి విశ్వాంతరాలాల మధ్యలో మళ్ళీ మళ్ళీ విహరించలేక,అద్భుత, అద్వితీయ అభూత కల్పనలకు ఊ కొట్టలేక,ప్రకృతికి పరిచయం లేని పదాలను వివరించలేక,అ దేవ దేవుడ్ని సైతం పొగడ్తల పద్యాల మత్తులో ముంచలేక,అవే అవే వర్ణనలు వేరు వేరు కలాల నుండి పదే పదే జన్మిస్తుంటే సాహిత్యం ధనికుల, అగ్ర వర్ణాల వారి గృహాలలో వెట్టి చాకిరి చేస్తుంటే,సాహిత్య ప్రక్రియలు కొద్దిమంది గీసిన హద్దుల్లో బందీలుగా బ్రతుకుతుంటే,రచనలకు కూడా అంటరానితనమనే లక్షణాలు పెరుగుతుంటే ఆ సాహితీ వేత్తలకు చెప్పలేక, ఆ కూర్పులో ఇమడలేక, ఏం చేయాలో అర్థంకాక,అలసిపోయి దిక్కులు చూస్తున్న అక్షరాలకు కొత్త శక్తిని ఇచ్చాయి వెయ్యేళ్ళ పైగా చరిత్ర కలిగిన పద్య రూపాన్ని అస్త్రంగా చేసుకొని సమరం సాగించిన గుఱ్ఱం జాషువా కలం నుండి జాలువారిన పద్యాలు కోకొల్లలు.

ఎవరూ చూడని చీకటి కోణాలను చూడగల క్రాంతిదర్శి కవి కోకిల జాషువా గారు. జాషువా కవిత్వంలో జాలి, దయ, కరుణలు కనిపిస్తాయి. నిజానికి జాషువా జీవితం నుండి అతని కవిత్వం వికసించింది. తన రచన ద్వారా అణగారిపోతున్న పేద సమాజాన్ని మార్చాలి అనుకున్నారు. ఆ కోవలోనే ప్రయత్నించారు. జాషువాలో, అతని రచనలలో కసి గానీ, ద్వేషం గానీ లేదు. కేవలం ప్రతిఘటన మాత్రమే. జాషువ కలాన్ని గళంగా మార్చి విశేష సాహిత్య సంపదను సృష్టించారు. ప్రజల్లో తన రచనల ద్వారా చైతన్యాన్ని రగిలించారు. సమాజంలో చెరగని ముద్ర జాషువా.

ఆనందం,హితోపదేశం,ప్రతిభ ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఆయన కవిత్వం కొనసాగుతోంది. నిజాయితీ, ఆర్తి, ఆవేశం-ఆవేదన ,ఆలోచన ,ప్రతిఘటన, పరిష్కారం, సామాజిక పరివర్తన జాషువా కవిత్వానికి జీవ లక్షణాలు.అయితే వేదనా భరిత జీవిత అనుభవంతో మానవ జీవితాన్ని వ్యాఖ్యానించి జీవిత విలువలు నొక్కి చెప్పిన కవి గాగుర్రం జాషువాచిరపరిచితులు., ప్రవక్తలు ,దేశభక్తులు, స్వాతంత్ర సమరయోధుల జీవితాలను కావ్యాలుగ మలచి కర్తవ్య బోధ చేసినాడు.పండిత పామరులను రంజింప చేయడం తో పాటు గబ్బిలం , గిజిగాడు వంటి పక్షుల నోటిద్వారా, వాటి చేష్టల ద్వారా ఎంతో సందేశాన్ని జనానికి అందించారు.

కుల నిర్మూలనకై తపన పడిన జాషువా ,కుల వ్యవస్థ ద్వారా అవమానించబడిన గుండె గాయాలే వీరి కవిత్వానికి అండగా రచనల అన్నింటా నిండి ఉన్నాయి. కుల అణచివేత వర్ణవ్యవస్థ కొనసాగుతున్న శీతా కాలం, అస్పృశ్యత పురివిప్పిన శీతా కాలం ఆ కవి మన గుండె తలుపులు తడుతూనే ఉంటాడు. ఆయన కవిత్వం మానవతా కోణం. కవిత్వం చదివినప్పుడు ఆనాటి సామాజిక స్థితిగతులు మనకు కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంటాయి .ఇది మహాకవి కుండవలసిన కవితా లక్షణం. వీరి ఆవేదనలు ,ఆందోళనలు జాలువారగా కురిసిన కవితా ప్రవాహం వలన కరుణరసార్ద్ర కవి కాగలిగాడు.జాషువా లోతైన అవగాహన ఉన్న కవి. సాంస్కృతిక ,సామాజిక జీవనాన్ని ప్రకృతి తో పోల్చి చెప్పిన కవి. కులాలకు అతీతంగా వినగలిగిన శ్రావ్యత గల ఆయన కవిత్వానికి పునాది ఆత్మ గౌరవం. వేద వ్యాసుడు నాలుగు వర్ణాలను సూచిస్తే మాదిగలు అస్పృశ్యులు పంచములు ఎలా అవుతారని తన పద్యాల ద్వారా కుల వ్యవస్థలోని అసంబద్ధత ను నిలదీసినాడు జాషువా. వారి ఆశలు అకాంక్షలు, లక్ష్యాలు నేరవేర్చడమే మనం వారికిచ్చే నిజమైన నివాళి.

మహనీయుడు గుఱ్ఱం జాషువా సమాజంలో అణిచివేయబడుతున్న వారి పక్షాన, గొంతెత్తలేని వారి పక్షాన గొంతుకగా మారి తన అక్షరాలతో అండగా నిలబడ్డాడు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని 126 వ జయంతి సందర్భంగా ప్రత్యేక సంచిక తీసుకురావాలనే ఆలోచనకు అంకురార్పణ కలిగించిన ఆత్మీయ అక్షర అప్తుల సూచనలు,నా ఆలోచనలకు
రూపకల్పనగా ఈ గుఱ్ఱం జాషువా గారి ప్రత్యేక సంచికను
మీ ముందుకు తీసుకువస్తున్నందుకు
చాలా సంతోషంగా ఉంది.

శ్రీహరి మూర్తి

# 'గిజిగాడు' జాషువా కవితా నైపుణ్యం

తెలుగు సాహిత్యంలో గుర్రం జాషువా గారికి (1895-1971) ప్రత్యేక స్థానం ఉంది. ఆయన ఇతర కవుల కంటే భిన్నమైనటువంటి వస్తువును తీసుకున్నాడు. ఆ వస్తువు వైవిధ్యం కూడా జాఘవా గారిలో కనిపించే ఒక ప్రత్యేకత. గబ్బిలం, సాలీడు, గిజిగాడు, లైకా, కుక్క ఇలా మాట్లాడలేని జీవుల భావాలను, వాటి గొప్పతనాన్ని తన కవిత్వం ద్వారా జాఘవా మనకు తెలియజేశారు.ఈ వ్యాసంలో జాషువాకు ఎంతో పేరు తెచ్చిన వాటిలో ఒకటైన 'గిజగాడు' ఖండికలోని విశిష్టతను వివరించే ప్రయత్నం చేస్తాను.

గిజిగాడు ఒక పిచ్చుక పిల్ల. అది ఒక చిన్న పక్షి. చెట్ల మీద మనకు ఆ పిచ్చుక గూళ్ల కనిపిస్తుంటాయి. ఆ గూళ్ల బోర్లించిన జాడీ అకారంలో టోపి లాగా ఉంటాయి. చెట్టుకి ఉన్న కొమ్మలకు ఈ గూడును గిజగాడు అల్లుతుంది. గిజగాడు అల్లికలో ఉన్న కళా నైపుణ్యాన్ని గురించి జాఘవా అద్భుతమైన పద్యంలో తెలియజేశారు.

*తేలిక గడ్డిపోచలను దెచ్చి, రచించెద వీవు తూగుటు*
*య్యేలగృహంబు, మానవుల కేరికి సాధ్యము గాదు, దానిలో*
*జాలరు,లందులో జిలుగు శయ్యలు, నంతిపురంబు లొప్పగా*
*మేలు భళీ!పులుంగుటెకిమీడవురా!గిజిగాడనీడజా!*

'తూగుటుయ్యాలు' గా ఉంటుందని కవి వర్ణించడంలో కవి పరిశీలన ఎంతో లోతైనదని తెలుస్తుంది. దానితో పాటు లోపల 'జిలుగు శయ్యలు' అనడాన్ని గమినిస్తే, లోపల చీకటిగా ఉండకుండా మిణుగురుపురుగుల్ని తెచ్చి గిజగాడు అమర్చడం వల్ల వెలుగులు వస్తున్నాయనేది కవి చక్కగా వర్ణించారు. మిణుగురు పురుగుల ప్రసక్తిలేకుండానే మెరుస్తున్న పరుపులు గా ఆ పిచ్చుకగూడుని వర్ణించడం కవి సాధించిన ధ్వనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.తేలికైన గడ్డపోచలు దీనిలో గిజగాడు (పిచ్చుక) ఎక్కడెక్కడి నుండో గడ్డిని తెంపుకుని వచ్చి దాన్ని పిచ్చుక  ఆ గూడును ఎంతో అందంగా ఆకర్షణీయంగా నిర్మిస్తుంది. అది కేవలం పద్దెనిమిది రోజుల్లో పూర్తి అవుతుందని పరిశోధకులు చెప్పారు. అది ఆ గూడు ఎంత గాలి వీచినా, తుపానులు వచ్చినా ఊగుతుందే  కానీ అది కిందికి జారిపోదు. ఆ విధంగా కట్టడం ఆ పక్షి కున్న నైపుణ్యం. ఆ నైపుణ్యం నేడు మన ఇంజనీర్ల కంటే గొప్పదని పరిశోధకులు వ్యాఖ్యానించారు. ఆ పిచ్చుక గూడులోనికి ప్రవేశించడానికి ఒక దారి ఉంటుంది. అది వెళ్లి పడుకోవడానికి పరుపుగా స్థలాన్ని ఆ గూడులో ఏర్పాటు చేసుకుంటుంది. అక్కడ తన పిల్లల్ని తన భార్యను నిద్ర పోయేటట్లుగా చేయగల నేర్పు పిచ్చుకకు ఉంటుంది. ఆ పిల్లలు గానీ, పక్షులు గానీ ఆ గూడులో నిద్రిస్తాయని కవి గిజగాడిని వర్ణించారు. అందుకనే ఆ నిర్మాణ ఔన్నత్యాన్ని వాటి సౌఖ్యాన్ని వర్ణిస్తూ ఈ పద్యం చెప్పారు.

*కులుకు పసిండినిగ్గుల దుకూలములన్ ధరియించి, ముద్దుబి*
*డ్డలును, బడంతి, నీపాదిగిట న్నిదురింపగ గన్నెగాడ్పు లూ*
*యెలనదనంబు నూచ, భయమింత యెఱుంగక కన్నుమూయు, నీ*
*యలఘుసుఖంబు  మాకు గలదా?గిజిగా!యొకజేనికున్నదా?*

అంతేకాదు ఈ చిన్న పక్షి చూడటానికి చాలా చిన్న పక్షి ఎలా ఉంటుంది. ఎక్కడేక్కడి నుండో ఆకులను గడ్డి పోచల్ని ఈత ఆకుల్ని తెస్తుంది. ఆ అల్లిక చాలా గొప్పగా కళాత్మకంగా ఉంటుంది. ఆ అందాన్ని నిర్మాణాన్ని చూసి మానవులు కూడా ఆ గూడును తెచ్చుకొని దాచుకుంటారు. ఆ నిర్మాణాన్ని చూసి ఆశ్చర్యపోతుంటారు. అందుకే కవి గజగాడి గొప్పతనాన్ని వర్ణిస్తూ దేవతలు కూడా నీకు సాటి రారు అని అన్నారు. నిన్ను మించిన మొనగాడు కూడా ఈ లోకంలో లేరు అని చెప్పారు. ఒక మహారాజుకి కూడా లేని సౌఖ్యం నీకుమాత్రమే ఉందని చెప్పాడు కవి. 'దేవతల జేఉడు' అంటే ఇంద్రుడికి కూడా లేనంత వైభవం నీవు కట్టుకున్న గూడువల్ల కలుగుతుందంటూ కింది పద్యం వర్ణించారు కవి.

*అందమున నీకు నీడగు నందగాడు*
*గృహవినిర్మాణమున నిన్ను  గెలుచువాడు*
*వైభవంబున బోలు దేవతలజేడు*
*లేడురా!గిజిగా!మొనగాడవోయి!.*

అంతేకాదు జాఘవాకు ఉన్న భగవంతుని పట్ల విశ్వాసం కూడా గిజగాడు ఖండిక వల్ల తెలుస్తుంది. సాధారణంగా ఆయన హేతువాదని, దేవుడిని నమ్మడని, నాస్తికుడని కొంతమంది  పరిశోధకులు అన్నారు. కానీ, నాస్తికులను ప్రస్తావిస్తూ భగవంతుని ముందు గొప్ప ఆలోచనల ముందు నాస్తికులు తలలు వంచుతారని  వ్యాఖ్యానిస్తూ ఈ పద్యం చెప్పారు.

*నీ గిజిగానినామకము నీ తెలివిం బ్రకటించుగూడు, నీ*
*మై గలసోయగం, బవని మానవకోటికి ముద్దుసేయు నో*
*యీ! గిజిగాడ! భీతిలకు మీవు ధరాతలి నున్నబిట్టుగా*
*వాగెడు నాస్తికు ల్తలలువంతు రనంతునిచెంత ఖిన్నులై.*

(జాషువా సర్వ లభ్య రచనల సంకలనం, పుట:493)

జాషువాగారు కేవలం పంచ రత్నాలలాంటి పద్యాలు తెలుగు సాహిత్యంలో జాఘవా కీర్తి ప్రతిష్ఠితల్నిశాశ్వతం చేశాయనిఅనడంలోఅతిశయోక్తికాదు.జాషువా వర్ణనా నైపుణ్యాన్ని 'ఆరుద్ర' గారు వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు. ''ఒక్క పురుగులోనే కాక పులుగులో కూడా ఉన్న నిర్మాణ చాతుర్యాన్ని జాఘవా గారు చూడగలిగారు. ప్రకృతిలోని ఒక కీటకానికి, ఖేచరానికి ఉన్న శక్తులు తనలో లేవా ఉన్నవని జాఘవాగారు తెలుసుకున్నారు. సకల కార్మిక సమాజముల జీవ కథానకములు ఆలించే కర్ణాలు ఆయనవి'' అని (సమగ్ర ఆంధ్ర సాహిత్యం, సంపుటి నాలుగు, తెలుగు అకాడమీ, 2017 పుట: 711) లో జాషువాగారికి ప్రకృతి కవిత్వం పట్ల ఉన్న దృష్టిని ఆరుద్ర గారు వ్యాఖ్యానించారు. అందుకే జాషువా గారు విశ్వనరుడు అయ్యారు. జాషువాగారికి మూగ జీవుల పట్ల ఎంతో ప్రేమ, సానుభూతి, కరుణార్ద్ర హృదయం ఉందని ఆయన రాసిన 'గిజిగాడు' ఖండికతో పాటు అనేక ఖండికలు మనకు స్పష్టంగా తెలియజేస్తున్నాయి.


**రామ్ ప్రసాద్ నలసాని,**
**రీసెర్చ్ స్కాలర్, తెలుగుశాఖ,**
**యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్ (సెంట్రల్ యూనివర్సిటీ),**
**హైదరాబాద్, ఫోను: 9502847494**

# అనుబంధం-3

## పింగళి వారితో పరిచయం ఉన్న

## కొంతమంది రచయితలతో ముఖాముఖి

**పింగళి వేంకటకృష్ణారావుగారి ప్రశ్నావళికి సమాధానాలు:**

**నమస్కారం సార్:**

**1. సాధారణంగా డాక్టరేట్లుల కోసం మాత్రమే ఇంత క్లిష్టమైన అంశాలను విశ్లేషిస్తూ గ్రంథాన్ని రాస్తారు కానీ మీరు ఈ గ్రంథాన్ని రాయడంలో గల ఆంతర్యాన్ని తెలుసుకోవచ్చా?**

(జ). నాకు స్వతంత్ర భావాలు ఎక్కువ. ఏ విషయాన్నైనా మా గురువులకు నమస్కరించి, నా బుద్ధి బోధబడినంత వరకు సానుకూలంగా ఆలోచిస్తాను. పలుమార్లు వివేచిస్తాను. అప్పుడైన పండిత మిత్రులతో సంప్రదిస్తాను. నిశ్చయ బుద్ధి కలిగిన తరువాత వ్రాస్తాను. అదే సత్యమని, అదే నిజమైనదని ఎప్పుడు వాదించను. నాకు శాస్త్రీయ విమర్శ కన్నా కళా విమర్శ అంటే ఇష్టం. కవి మనోగత కళారూపాన్ని అక్షరాలకు అతీతమైన సౌందర్యాన్ని పట్టి పాఠకులకు అందించే విమర్శ కళా విమర్శ అని కాటూరి వేంకటేశ్వరరావుగారి అభిప్రాయం. నేటి పరిశోధనలో శాస్త్రీయ అంశాలు ఎక్కువ. అంతవరకు అ విషయంపై పూర్వ విమర్శకులు ఏమి చెప్పారో వ్రాయాలి. పర్యవేక్షకుల అభిప్రాయాలను ఆదరించాలి. కొంత అనుసరించాలి కూడా. ఇంత ఓపిక, తీరిక లేక డాక్టరేట్లు జోలికి పోలేదు. నా గురువులు నేర్పిన చదువు, భారతీదేవి కటాక్షం, కరుణ లేదా నా రచనలకు మార్గదర్శకాలు.

**2. పింగళి లక్ష్మీకాంతంగారితో మీకు ఏమైనా బంధుత్వం ఉందా ఆ వివరాలను చెప్పండి?**

(జ) కృష్ణా తీరం కామేపల్లి దగ్గర ఉన్న 'పింగళి' అనే గ్రామాన్ని కృష్ణానది కబళించిన తరువాత ఒక శాఖ పింగళి వారు ఒంగోలు ప్రాంతానికి వెళ్లారు. ఆ శాఖలో పింగళి వేంకట సుబ్బారావు, పింగళి పాండురంగారావు మొదలైన కవులున్నారు. శ్రీకాకుళం దగ్గర కృష్ణానదిని దాటి తూర్పు కృష్ణలోకి ప్రవేశించిన శాఖలోని వారు పింగళి లక్ష్మీకాంతంగారు, పింగళి వెంకయ్యగారు (జాతీయ జెండా నిర్మాత), పింగళి నాగేంద్ర రావు మొదలైనవారు. ఇంకా అమరావతి దగ్గర కృష్ణానదిని దాటి నందిగామ తాలూకాలో స్వతంత్ర గ్రామం గోకరాజుపల్లెను నిర్మించుకున్న గ్రామం శాఖ మాది. మా శాఖలో పింగళి రామయామాత్యుడు, మా తమ్ముడు పింగళి జగన్నాధరావు మొదలైన కవులున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారితో చుట్టరికం కన్న పరిచయం ఎక్కువ. మాది ఒకటే సదురు, ఒకటే గోత్రం. సాహిత్య కుటుంబం మాది. మేము గౌతమ గోత్రజులం. భరద్వాజ గోత్రకులైన పింగళివారున్నారు. వారు వేరు.

**3. మీరు అనేక సందర్భాల్లో పింగళి కాటూరి కవిత్వాన్ని విశ్లేషిస్తూ పింగళివారి పద్య శైలినీ గుర్తించే ప్రయత్నం చేశారు. ఆయన రాసిన పద్యాలు గుర్తించడానికి ఇంకా ఎలాంటి పద్ధతులు అనుసరిస్తే బాగుంటుందని సూచిస్తారా?**

(జ) పింగళి కాటూరి కవుల కవిత్వం గుర్తించే విషయాల్ని 'లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము' అనే పుస్తకంలో చాలా వరకు వివరించాను. కాటూరివారి కవిత్వంలో చమత్కారం ఉంటుంది. పింగళి వారి కవిత్వంలో రమణీయార్థముంటుంది. మీరు పరిశోధించి మరికొన్ని విషయాలను చెప్పగలరన్న విశ్వాసం నాకున్నది.

**4. సౌందరనందం పింగళి కాటూరిపై విడదీయలేనంతగా పెనవేసుకుపోయింది. కవిగా కాటూరి వేంకటేశ్వరరావు గారికి లభించినంతా కీర్తి పింగళి లక్ష్మీకాంతంగారికి కలిగిందని భావించవచ్చా?**

(జ). పండిత వర్గంలోని కావ్య నిర్మాణ శిల్పం తెలిసిన ప్రౌఢ కవిత్వాభిమానులు పింగళి లక్ష్మీకాంతంగారిని మెచ్చుకుంటారు. పద్య నిర్మాణ శిల్పం మీద సరళమైన శైలిమీద ప్రేమ గల వారు కాటూరి వారిని మెచ్చుకుంటారు. ఎవరి కీర్తి వారిది. ఎవరి ప్రతిభ వారిది.

**5. సాహిత్య లోకం జంటకవులు అన్న పింగళి కాటూరి పేర్లు ప్రస్తావన వచ్చిన సౌందరనందం గుర్తుకొస్తుంది కానీ అంతకంటే మించి ఎంతో ప్రతిభావంతంగా ఆయన అనేక కావ్యాలు రాశారు కానీ వాటికి గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా తెలపండి?**

(జ). పింగళి కాటూరి కవులు విడివిడిగా రాసిన కావ్యాల గొప్పతనం చెప్పాలనే సంకల్పంతో వారి వారి రచనలను గురించి రెండు వేరువేరు గ్రంథాలు నేనే రచించాను. సమకాలీనమైన ఇతివృత్తం వల్ల సౌందరనందానికి ఎక్కువ ఖ్యాతి వచ్చింది. మిగిలిన గ్రంథాలు కూడా పండితులకు పరిచయమే.

**6. పింగళివారి కవిత్వంలో మనం గమనించే ప్రధానమైన అంశాలు అని మీరు వేటిని భావిస్తున్నారు?**

(జ). రమణీయార్థము– సంప్రదాయ గౌరవము– ప్రౌఢ కవిత్వము– వీర రసాభిమానము–శాస్త్రీయ దృక్పథము ఇవి వీరి ప్రత్యేకతలు. దైవ భక్తి అందునా శ్రీ వేంకటేశ్వర స్వామి యందు భక్తి ఎక్కువ.

**7. పింగళి లక్ష్మీకాంతంగారు అంత విమర్శకుడు పరిశోధకుడు కూడా తన రచనలను అంకితం వచ్చేటప్పుడు ఛందోబద్ధమైన పద్యాలులోనే రాసేవారు దాన్ని ఎలా అర్థం చేసుకోవాలి (అంటే మంచి వచనంలో కాకుండా కవిత్వంలోనే ఎందుకు రాసేవారు) కవిగా ఆయనకు వచ్చిన కీర్తి ప్రతిష్ఠలు లభించలేదని భావించవచ్చా?**

(జ). అప్పటికి, ఇప్పటికి సాహిత్య పరులకు కవిత్వమంటే మోజు. అందునా పద్యమంటే అదొక పరవశం. గాన యోగ్యమైనది కావడం వల్ల కాబోలు విమర్శకునిగా, కవిగా కలగలిపిన వారి కీర్తి తెలుగు చదివే విశ్వ విద్యాలయ విద్యార్థులున్నంత వరకు చెక్కుచెదరదు.

**8. మీరు ఆత్మహత్య గంగాలహరి మొదలైన పద్యాలను వర్ణించేటప్పుడు లేదా విశ్లేషించేటప్పుడు ఆ ఖండికలలో**

**స్ఫురించని నేపథ్యాన్ని, లేదా ఖండికలో పేర్కొననీ నేపథ్యాన్ని ఎంతగానో వివరించారు వాటిని ఎలా సేకరించారు?**

(జ). పింగళి వారి శిష్యుల నుండి, వారి అభినందన సంచికల నుండి వారి కుమారుడు పింగళి సూర్య సుందరం నుండి కొన్ని విషయాలు తెలుసుకున్నాను.

**9. ఇంత వరకు వచ్చిన పింగళి లక్ష్మీ కాంతంగారి పై జరిగిన పరిశోధనలు మీకు నచ్చిన పరిశోధన ఏది?**

(జ). బహుశా మీదే కావచ్చేమో– మీ కృషి చూస్తుంటే అలా అనిపిస్తున్నది. అలా కావాలని కాంక్షిస్తున్నాను.

**10. మీరు కాటూరి వేంకటేశ్వరరావు గారి కావ్య సమాలోచనలు అనే పుస్తకం, పింగళి లక్ష్మీకాంతం గారి కావ్య సమాలోచనము అనే పుస్తకాలను రాశారు కదా పింగళి– కాటూరి వారి పద్య శైలిలో మీకు ఎవరి శైలి ఇష్టం ఎందువల్ల చెప్పగలరు?**

(జ). నేను (పింగళి వేంకటకృష్ణారావు) సందర్భాన్ని బట్టి రెండు శైలుల్ని ఇష్టపడతాను.

**11. మీరు పింగళి లక్ష్మీకాంతం గారి పరిశోధన, విమర్శన కంటే ఆయన రాసిన కవిత్వంపైన గ్రంథం రాయడానికి కారణం ఏమిటి చెప్పగలరా?**

(జ). పింగళి లక్ష్మీకాంతంగారి విమర్శ గ్రంథాలను సంక్షిప్తంగా పరిచయం చేయాలని ఒకప్పుడు అనుకున్నాను. వారి రచనల్లో ఏ ఒక్క కావ్యాన్ని గానీ, భావాన్ని గానీ, తొలగించలేక మరొకటి రాయలేక విరమించుకున్నాను.

**12. పింగళి లక్ష్మీకాంతం గారు గంగాలహరిని మూలంలో జగన్నాథ పండితరాయల కావ్యాలతో అద్భుతంగా వివరించారు కదా ఈ రెండింటిలో ఏది బాగుంది నిష్పాక్షికంగా చెప్పగలరా ?**

(జ). తెలుగు వారికి కవిత్రయ భారతం ఎలా బాగుంటుందో అలానే పింగళి వారి 'మధుర పండిత రాజము' కూడా తెలుగు వారికి బాగుంటుంది.

**13. పింగళివారి పై మీరు విశేషమైన కృషి చేశారు పింగళి వారి వంశం వారు కాబట్టి చేశారని అనుకోవచ్చా మరే కారణం ఉందా తెలపండి?**

(జ). ఈ ప్రశ్నలకు సమాధానం 'లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము' అనే పుస్తకంలో చివరి రెండు పద్యాలలో ఉన్నది. పింగళి గ్రామం గుంటూరు జిల్లాలోనే ఉన్నదని, వీరు మహారాష్ట్ర నుండి రాలేదని, పూర్వం నుండి పింగళి గ్రామం, గౌతమ గోత్రజులైన పింగళి వారి నివాసమని, నిరూపించడానికి *"పింగళి వారి పుట్టు పూర్వోత్తరాలు"* అన్న పరిశోధన వ్యాసం వ్రాశాను.

**14. పింగళి లక్ష్మీకాంతంగారితో మీకు వ్యక్తిగత పరిచయం ఉందా, ఉంటే ఆయన గురించి కొంత వివరించండి?**

(జ). ఆయన మితభాషి. నచ్చినవారు ఎందుకు వచ్చారో, ఆ విషయం తప్ప మరో విషయం మాట్లాడేవారు కాదు. గంభీరుడు.

**15. ఆయన బిగ్ జార్గల్, మాబీడిక్ నవలలను అనువాదం చేశారు కదా ఆ నవలల్ని మాత్రమే అనువాదం చేయడానికి కారణాలు మీరేమైనా తెలుసా తెలపండి?**

(జ). నాకు అంతగా తెలియదు – అప్పుడు ఉప వాచకాలుగా పెట్టారేమో.

**16. ఆయన ఆంగ్ల దేశ చరిత్ర గ్రంథాన్ని రాయడానికి కారణం కేవలం ఆర్థిక పరిస్థితులే కారణాలు కావచ్చా మీరేమైనా కారణాలు కావచ్చు అని తెలపండి?**

(జ). ఆర్థిక పరిస్థితులే కారణం.

**17. ఆయన అముద్రిత రచనలు ఏమైనా ఉన్నాయా ఆయన రచనల్ని మీరు చదివారా చెప్పండి?**

(జ). అముద్రిత రచనలు నాకు తెలిసినంతవవరకు లేవు.

**18. ఆయన కుటుంబ సభ్యులు ఆయన సాహిత్య వారసత్వాన్ని ఎంత వరకు కొనసాగించారో ఆ వివరాలను తెలుపగలరు?**

(జ). పింగళి లక్ష్మీకాంతంగారి కుమారులు పింగళి సూర్య సుందరంగారు రచనా వ్యాసంగం కలవారు. కవిత్వ ధోరణి లేదు. రమణ మహర్షి, శంకరాచార్యులపై కొన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను రచించారు.

**19. ఆయన పత్రికలకు దూరంగా ఉండేవారనీ తెలిసింది దానికి కారణాలు ఏమైనా మీకు తెలుసా తెలపండి?**

(జ). పొగడ్తల మీద – పత్రికల ప్రచారం మీద పింగళి లక్ష్మీకాంతంగారికి ఆసక్తి లేదు. ఆయన సాహిత్య కృషి అంతా విద్య వితరణే పరమార్థంగా సాగింది.

**20. ఆయన (ఆచార్య పింగళి లక్ష్మీకాంతం) గురించి నేటి సాహిత్య ప్రపంచం లేదా సమాజం తెలుసుకోవాలి అనిపించే అంశాలు ఏమైనా ఉంటే దయచేసి వివరించగలరు?**

(జ). పింగళి లక్ష్మీకాంతంగారు లేకపోతే నేటి విశ్వవిద్యాలయాల్లో తెలుగు అధ్యయనమే లేదు. యం.ఏ తెలుగు పాఠ్యాంశాలు– బోధన ప్రణాళికలు– పరీక్ష విధానాలు– దానికి తగిన పాఠ్య గ్రంథాల రూపకల్పనలు అంతా ఆయన చలువే. నేటి విశ్వవిద్యాలయాల్లో కానీ, తెలుగు అధ్యాపకులకు గౌరవం కలిగించిన మహనీయుడు పింగళి లక్ష్మీకాంతం. నవీన సనాతన సాహితీ కళా సంగమ రంగాల బిందువు. తెలుగు పంతులందరికి పొంట్లు, కోట్లు, బూట్లు ప్రసాదించిన నవ్య భావన విలసితుడు. తెలుగు సాహిత్య విమర్శను క్రొత్త పుంతలు త్రొక్కించిన పుణ్యమూర్తి, సాహిత్య స్ఫూర్తి, నిత్య స్మరణీయులు, నిత్య సదానీయులు పింగళి లక్ష్మీకాంతంగారు.

**ఆచార్య.బి.యల్. శంకరరావుగారితో ఇంటర్వ్యూ :**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి శిష్యవర్గంలో ఆచార్య బి. ఎల్. శంకర్రావుగారు ఒకరు. ఈయన శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పింగళివారి దగ్గర చదువుకున్నారు. తర్వాత తరంలో శంకర్రావుగారు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఆచార్యునిగా, అధ్యక్షులుగా పని చేశారు. నా పరిశోధనలో భాగంగా ఆచార్యపింగళి లక్ష్మీకాంతగారి గురించి ఆయన జీవితం గురించి, ఆయన బోధనా విధానం గురించి, ఆయన విమర్శ గురించి నేను (**నలసాని రాంప్రసాద్**) ఈ రోజు(24-12-2022) ఫోన్ చేసి తమ అభిప్రాయాలను అడిగాను. ఆయన తమ అభిప్రాయాలను నాతో ఈ విధంగా పంచుకున్నారు.

" ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు సాహిత్యాన్ని ఎంతో హృదయ రసభరితంగా చదువుకున్నారని శంకర్రావుగారు అన్నారు. అంతకుమించి ఆయన మంచి నటుడు, నాటకాలలో ఎన్నో పాత్రలు ధరించారు. పింగళి లక్ష్మీకాంతంగారు తరగతిలో పాఠాలు చెప్పేటప్పుడు కాళిదాసు, తిక్కన గురించి చెప్పేటప్పుడు ఎంతో రసభరితంగా చెప్పేవారని, ఆ సమయంలో ఆయనకు కన్నీళ్లు కూడా వచ్చేవని అన్నారు. కాళిదాసు, తిక్కన గురించి పాఠాలు విన్నప్పుడు ఆయనతో పాటు విద్యార్థులకు కూడా కన్నీళ్లు వచ్చేవని అన్నారు. తాను కూడా ఎన్నోసార్లు కన్నీళ్లు పెట్టుకున్నానని శంకర్రావుగారు నాతో అన్నారు. పింగళివారు పాఠాలు చెప్పడంలో రసవాది, రస హృదయ వాది ముఖ్యంగా ఆంధ్ర మహాభారతంలోని తిక్కన గురించి చెప్పేటప్పుడు ఆయనకు పూనకం వచ్చేదని ఆ సమయంలో ఆయన కంఠం గోంగురు పోయేదని అన్నారు. అలాగే కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలం గురించి పాఠం చెప్పేటప్పుడైతే ఆయన హృదయం ఒక్కసారిగా ఉప్పొంగిపోయేది అని అన్నారు. పింగళివారు కాళిదాసు తిక్కన పాఠాలను మాత్రమే కాకుండా సాహిత్య చరిత్రను, ఆంధ్ర మహా భారతం, రామాయణం, భాగవతాల్లోని పురాణ పాత్రలను ఎంతో ఉదాత్తంగా బోధించేవారు. ముఖ్యంగా కవులు గురించి, కవులు రాసిన రచనల గురించి చెప్పేటప్పుడు ఆయన ఎంతో స్పష్టంగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరించేవారని శంకర్రావుగారు తెలియజేశారు. శంకర్రావుగారు మాట్లాడుతూ పింగళివారి పాఠాలు విన్న నేను పింగళవారి శైలినే అనుసరించాననీ, వాటిని నేను తరగతులలో విద్యార్థులకు బోధించానని తెలియజేశారు. ఆయన దగ్గర చదువుకున్న వాళ్లెంతోమంది తర్వాత కాలంలో వివిధ విశ్వవిద్యాలయాలలో ఆచార్యులుగా పని చేశారని వారంతా ఇంచుమించు పింగళివారి మార్గాల్నే అనుసరించారని శంకర్రావురావుగారు పేర్కొన్నారు. ఆచార్యపింగళి లక్ష్మీకాంతంగారి దగ్గర చదువుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నాను" అని తమ అభిప్రాయాల్ని వెల్లడించారు.

**ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి చివరి రోజులు: సి. శివచందర్ గారి ముఖాముఖి**

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు తన చివరి రోజులను ఏ విధంగా గడిపారనే విషయాన్ని ఆయన మేనల్లుడు సి. శివచందర్ గారిని ఫోన్ చేసి (24-12-2022, మధ్యాహ్నం12:47) అడిగాను. శివచంద్ గారు ఇలా చెప్పారు.

*"డిసెంబరు నెలలో ఆరోగ్యం సహకరించలేదు. సాహిత్య చరిత్ర వ్యాసంగం సాగలేదు. అయితే చివరవరకు తమ పనులను తానే చూసుకునేవారు. కుమారుడు డా. పింగళి శ్రీనివాసు, విశాఖపట్నంలో ఉండేవాడు. సహాధ్యాయి డా. జయంతి సుబ్బారావు హైదరాబాద్ లో ఉండేవారు. పింగళివారు వైద్యశాలలో చేరగానే పింగళి శ్రీనివాసు హైదరాబాద్ కు వచ్చాడు. ఉస్మానియా వైద్యశాలలో ఉన్నత పదవిలో కార్డియాలజస్టుగా పని చేస్తున్న డా. ఉపమాక బ్రహ్మాజిరావుగారు, అదే శాఖలోని డా. వేదం సుబ్రహ్మణ్యంగారు ఇంటికి వచ్చి చూసి వైద్యం చేసేవారు. పడుకుంటే ఇబ్బందిగా ఉండేది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారు. కాని ప్రతిరోజూ పోణంగి శ్రీరామ అప్పారావుగారూ, గొడవర్తి సూర్యనారాయణగారు, ఇంకా చాలా మంది వస్తూ పోతూ ఉండేవారు. వారందరితో అనేక విషయాలు మాట్లాడేవారు. ఇలా ఉండగా ఒక సోమవారంనాడు పొద్దున్న ఆస్పత్రికి తీసుకొని వెళ్ళవలసిన పరిస్థితి వచ్చినది. ఉస్మానియాలో డా. వేదం సుబ్రహ్మణ్యంగారు అత్యవసర వైద్యం చేసి కాపాడారు. కాని కోలుకోలేక పోయారు. డా బ్రహ్మాజిరావుగారు గ్రహించి వారితో 'మాస్టరు గారూ, ఏదీ ఒక కంద పద్యం వదలండి' అని అడిగారు. కాని కఫంతో కూడిన ఆయన స్వరం సహకరించలేదు. ఆయన జనవరి నెల(10-01-1972) పదవతారీఖు రాత్రి తుదిశ్వాస వదిలారు"*

# అనుబంధం–4

# ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి పర్యవేక్షణలో జరిగిన పరిశోధనలు

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు ఆంధ్ర విశ్వకళా పరిషత్ (వాల్తేరు), శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో రీడర్ గా, ఆచార్యునిగా ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించారు. ఈ రెండు విశ్వవిద్యాలయాలలో ఆయన పర్యవేక్షణలో జరిగిన, ఎం.ఏ ఆనర్స్, పిహెచ్.డి పరిశోధనల వివరాలను ఇక్కడ తెలియజేస్తున్నాను.

1. సూర్యనారాయణ. జి. **'తిక్కన ఉద్యోగ పర్వ పరామర్శ'** (ఎం.ఏ ఆనర్స్), ఆంధ్ర విశ్వ కళా పరిషత్, 1936, వాల్తేరు.

2. రామచంద్ర.వి. **'ఎఱ్ఱాప్రగడ కృతులు–విమర్శనాత్మక పరిశీలన'** పిహెచ్.డి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 1966, తిరుపతి.

4. నరసింహం. కె.వి.ఆర్.**'ఆంధ్ర ప్రబంధ అవతరణ వికాసాలు'** ఆంధ్ర విశ్వ కళా పరిషత్, 1945,వాల్తేరు.

5. నాగయ్య. జి, **'ద్విపద వాఙ్మయము'**, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,1965,తిరుపతి.

6. మాధవ శర్మ పాటిబండ, **ఆధునికాంధ్ర భావ కవిత్వం'** (ఎం. ఏ ఆనర్స్), ఆంధ్ర విశ్వ కళా పరిషత్, 1936,వాల్తేరు.

7. వెంకటావధాని దివాకర్ల, **'ఆంధ్ర నాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు'**, (ఎం. ఏ ఆనర్స్), ఆంధ్ర విశ్వ కళా పరిషత్,1935, వాల్తేరు.

8. వెంకట సుబ్బారావు తంగిరాల, **'తెలుగు వీరగాథా కవిత్వం'**, పి హెచ్ డి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,1969, తిరుపతి.

9. ప్రసాదరాయకులపతి, **ఆంధ్ర భాగవత విమర్శ'** పిహెచ్ డి, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి. (ఈ పరిశోధన సిద్ధాంత గ్రంథానికి ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు, ఆచార్య. కోరాడ మహదేవశాస్త్రిగారు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. (ప్రసాదరాయకులపతి, 'ఆంధ్ర భాగవత విమర్శ' పుట:iv, ముద్రితం.)

# అనుబంధం–5

ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి జీవిత రేఖలకు సంబంధించిన ఫోటోలు.



శ్రీ రాఘవశర్మగారి సహ కవితావ్యాసంగికులు
శ్రీ పింగళి లక్ష్మీకాంతం, శ్రీ కాటూరి వేంకటేశ్వరరావుగార్లు

# అనుబంధం-6

# ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి వంశ చరిత్ర

**పింగళి వంశ చరిత్ర చర్చ:**

తెలుగు సాహిత్యంలో పింగళి అనే పేరు వినపడగానే ప్రబంధ కవి పింగళి సూరన, పింగళి గోకన మంత్రి, భారత జాతీయ పతాక సృష్టికర్త శ్రీ పింగళి వెంకయ్యగారు, తెలుగు సినీ పాటల రచయిత, దర్శకుడు, నిర్మాత పింగళి నాగేంద్రరావుగారు, ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు, ప్రముఖ జర్నలిస్టు పింగళి రామమోహనరావుగారు, పింగళి జగన్నాథరావుగారు, పింగళి వేంకటకృష్ణారావుగారు, పింగళి సూర్యసుందరం, ఆచార్యపింగళి శైలజాగారు (హైదరాబాద్ విశ్వవిద్యాలయం, పింగళి లక్ష్మీకాంతంగారి మనుమరాలు) మనసుకు స్ఫురిస్తారు.

ఈ పింగళి వంశంలోనే అధ్యాపక వృత్తిలో విలక్షణమైన పాండిత్యాన్ని ప్రదర్శించినవారు ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు. పింగళి వంశంలోనే విశ్వవిద్యాలయ స్థాయిలో ఆచార్యత్వాన్ని కలిగినవారిలో ఏకైక వ్యక్తి ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు. అందుచేత ఇంత ఘన కీర్తి కలిగిన పింగళి వంశానికి సంబంధించిన కొంత వంశ చరిత్ర గురించి జనవ్యవహారాలలో ఉన్న కథల్ని, కొందరు పరిశోధకులు చెప్పిన అభిప్రాయాల్ని ఇక్కడ ప్రస్తావిస్తే బాగుంటుందని భావిస్తున్నాను. కనుక పింగళి వంశ చర్చ గురించి అనేక మంది పరిశోధకులు కొన్ని విషయాలను వెల్లడించారని, అలాంటి వారిలో పింగళి నాగేంద్రరావు గారు ఏకంగా *'పింగళి వంశ చరిత్ర'*(2007) అనే పుస్తకాన్ని రచించారు. దీనితో పాటు పింగళి వేంకటకృష్ణారావుగారు రాసిన *'పింగళి లక్ష్మీకాంతంగారి కావ్య సమాలోచనము'*(2013) అనే గ్రంథంలో కూడా ఈ పింగళి వంశం యొక్క కథల్ని సోదాహరణంగా వివరించారు. కనుక వీరు చెప్పిన అభిప్రాయాలనే యథాతథంగా స్వీకరించి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

**1. దొండ తీగకథ:**

పింగళి వంశానికి సంబంధించిన కథల్లో దొండ కథ ఒకటి దీన్ని చూద్దాం.'' పింగళి గోకనమంత్రి ధర్మపత్ని సంతానం లేకపోవటంవల్ల సూర్యదేవుని, ఆరాధించిందట. ఆ స్వామి కలలో బ్రాహ్మణవేషంతో కన్పించి ఒక దొండతీగనిచ్చి దీన్ని పెంచుకోవలసిందని, ఆమె కుటుంబం అలానే వృద్ధి పొందుతుందని చెప్పాడట. ఆ తర్వాత ఆ వంశం శాఖోపశాఖలుగా విస్తరించిందట. అందువల్లనే కాబోలు మా వంశంలో సూరన్న లెక్కువగా ఉన్నారు'' అని ఒక కథ ప్రచారంలో ఉందని పింగళి వేంకటకృష్ణారావుగారు ప్రస్తావించారు.

**2. పింగళి పేకి కథ:**

పింగళి వంశానికి సంబంధించిన కథలను కొందరు పరిశోధకులు తెలియజేశారు. పింగళి పేకి కథ మరొకటి దీని గురించి చెప్తూ *" ఈ కథ అనేక మార్పులతో ప్రచారంలో ఉన్నది. ఈ కథలు జనశ్రుతులే. సూరన గోకనమంత్రి పేకి అనే గంధర్వకాంతను దాసిగా నేలాడని మాత్రమే చెప్పాడు. గోకనమంత్రి ఒక అడవి మార్గం గుండా ప్రయాణిస్తున్నాడట. దారిలో ఒక పూస దొరికిందట, దాన్ని ఆయన ఇంటికి తెచ్చి ఒక పెట్టెలో దాచాడట. ఆ పూసనాశ్రయించుకొనిఉన్న పేకి అనే గంధర్వ స్త్రీ మరునాడు దాసిగా వారింట్లో ప్రవేశించిదట. అది యజమానికి ఎన్నో అసాధ్యమైన పనులు చేసిపెట్టేదట. గోకన ఇంట లేని ఒకరాత్రి బాలింతరాలుగా ఉన్న ఆయన భార్య, పేకిని దీపం ఎగదోయమన్నదట. అవతల గదిలో పడుకున్న అది, తన నాలుకను చాపి దీపం ఎగదోసిందట. దానికి భీతిల్లి గోకనభార్య మరునాడు భర్త రాగానే విషయం చెప్పి, దాన్ని ఎలాగైనా వెళ్లగొట్టమన్నదట. దాన్ని ఏదో విధంగా వదలించుకోవాలని గోకన కాశీకి పోయి గంగాజలం తెమ్మని చెప్పి, అది అటుపోగానే ఊరు ఖాళీచేసి మరో గ్రామానికి మకాం మార్చాడట. తిరిగి వచ్చిన పేకి, అక్కడ వారు లేకపోవటం చూచి వారు వదలిపోయిన పెద్ద రోటిని నెత్తికొత్తుకొని వారున్న చోటికి పోయిందట. గోకన "నీవు మమ్మల్ని ఎలా వదులుతావు" అని అడిగితే, నా పూస నాకిస్తే పోతానన్నదట. వారు ఇచ్చారట. అది వెళ్లిపోతూపోతూ తనను తిప్పలు పెట్టినందుకు పింగళివారికి శాపమిచ్చిందట. వంశానికొక అవ్యక్తుడు, ఎంత మంచి గృహం నిర్మించుకున్నా కురవటం, ఎంత గట్టి వంటపాత్రలు కొనుక్కున్నా వాటికి చిల్లులు, ఇవి పేకి శాపాలు. సదాచారం దైవభక్తి కలవారిని పేకి శాపాలు బాధించవని మా పెద్దలు. చెబుతుండేవారు"* అని పింగళి వేంకటకృష్ణారావుగారు తెలియజేశారు.

**3. రెండవ కథ:**

పింగళి వంశానికి సంబంధించిన కథల్లో మరోక కథ ఇలా ఉంది. *"గోకన పేకిని వదిలించుకోవటానికి ఉపాయంగా దానికొక వెంట్రుక నిచ్చి దాని వంకలు తీయమన్నాడట సాధ్యం కాక దానంతట అదే పారిపోయిందట"* అని పింగళి వేంకటకృష్ణారావుగారు తెలియజేశారు.

**4. మూడవ కథ:**

పింగళి వంశానికి సంబంధించిన కథల్లో మరోక కథ ఇలా ఉంది. *" పింగళి గోకనగారి ఆవులదొడ్లో కట్టేసిన లేగలు, ఆవులు, అలానే ఉండేవి. కాని ఉదయానికల్లా ఆవుల పొదుగులు ఖాళీ అయ్యేవి. గోకన ఒకరాత్రి కాపుకాసి అన్ని ఆవులదగ్గర పాలు త్రాగుతున్న ఒక మాయ దూడను పట్టుకున్నాడట, ఆ దూడ ఒక స్త్రీ రూపం ధరించి గింజుకుంటుండగా దాని జడలోని పూస గోకనకు చిక్కిందట, తరువాత కథ మొదటి కథలాగానే. గోకరాజునే, గొకనగా భ్రాంతిపడ్డ మా వారు కొందరు,ఈ కథను గోకరాజుపల్లెతో ముడిపెట్టి చెబుతుండేవారు. కథకు కాలు లేవు మనతో చివరి*

*లేవన్నట్లున్నాయి ఈ కథలో సంగీతం సాహిత్యాలను ఇష్టపడేవారు వాటిని ప్రసాదించేవారు ఆయన కొందరు యక్షనే దేవతలు ఉంటారు పిల్లలు ఎక్కువగా మంత్రి అలాంటిది దేవతను ఉపాసించి ఉంటాడు ఈ కథల వల్ల గోకన మంత్రి కభే కాకుండా గొప్ప మంత్రవేత్త అన్న సంగతి తెలుస్తున్నది ఇలా ఎన్నో కథలకు కవితలకు కాణాచి పింగళి వంశము"* అని (పింగళి లక్ష్మీకాంతంగారి కావ్యసమాలోచనము,2013:440,441) పింగళి వేంకటకృష్ణారావుగారు అన్నారు.

పింగళి వేంకటకృష్ణారావుగారు మాటలను చూద్దాం. *"కృష్ణా తీరం కామేపల్లి దగ్గర ఉన్న 'పింగళి' అనే గ్రామాన్ని కృష్ణానది కబళించిన తరువాత ఒక శాఖ పింగళి వారు ఒంగోలు ప్రాంతానికి వెళ్లారు. ఆ శాఖలో పింగళి వేంకట సుబ్బారావు, పింగళి పాండురంగారావు మొదలైన కవులున్నారు. శ్రీకాకుళం దగ్గర కృష్ణానదిని దాటి తూర్పు కృష్ణలోకి ప్రవేశించిన శాఖలోని వారు పింగళి లక్ష్మీకాంతంగారు, పింగళి వెంకయ్యగారు (జాతీయ జెండా నిర్మాత), పింగళి నాగేంద్ర రావు మొదలైనవారు. ఇంకా అమరావతి దగ్గర కృష్ణానదిని దాటి నందిగామ తాలూకాలో స్వతంత్ర గ్రామం గోకరాజుపల్లెను నిర్మించుకున్న గ్రామం శాఖ మాది. మా శాఖలో పింగళి రామయామాత్యుడు, మా తమ్ముడు పింగళి జగన్నాధరావు మొదలైన కవులున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారితో చుట్టరికం కన్న పరిచయం ఎక్కువ. మాది ఒకటే సదురు, ఒకటే గోత్రం. సాహిత్య కుటుంబం మాది. మేము గౌతమ గోత్రజులం. భరద్వాజ గోత్రకులైన పింగళివారున్నారు. వారు వేరు"* అని తనకు తెలిసిన విషయాన్ని పేర్కొన్నారు. (చూడు-ప్రశ్నావళి)

**4. పింగళి వంశంలో ఇంటి పేర్లు:**

పింగళివంశం చరిత్రను దాని తాలుకు పూర్వ పరాల్ని, నేపథ్యాల్ని గురించి సంక్షిప్తంగా లేదా రేఖా మాత్రంగా గమనించిన తర్వాత పింగళివంశం ఆవిర్భావాల్ని తెలుసుకున్నాం. దీనితో పాటు పింగళివంశం కాలక్రమేనా శాఖోపశాఖలుగా విస్తరించిందనడానికి పింగళి వేంకటకృష్ణారావుగారు తెలిపిన పరిశోధకుల అభిప్రాయాల్నే ఇక్కడ తెలుపుతున్నాను. పింగళివంశంలోని ఇంటి పేర్లను కొన్నింటిని తెలియజేస్తాను.

'నేటి కోలవాసి పింగళి' ' పిన్నెలి పింగళి' 'గోకరాజు శాఖ పింగళి' అనేవి మొదలైనవి ఉన్నాయని కృష్ణారావుగారు తెలిపారు. వీరిలో కొందరు భరద్వాజ, గౌతమ గోత్ర నామాలతో ఉన్నారని అన్నారు. వీరిలో కొందరు నియాగ శాఖకు చెందినవారున్నారు. పింగళి గోకనమంత్రి, పింగళి సూరన, పింగళి వేంకటకృష్ణారావుగార్లు బ్రహ్మకులంలోని నియోగశాఖగా, గౌతమ గోత్రలుగా పిలవబడుతున్నారు. దీన్ని పింగళి లక్ష్మీకాంతంగారు కింది పద్యంలో చెప్పుకున్నారు.

*“ నీ రాక వినిన పింగళి*
*సూరన వంశకర్త  చూచెడి కోర్కిన్*
*జేరంగ బిలిచి కుశలం*
*బారయుచో నా ప్రణామ మందిమ్ము సఖీ ”*

(ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, ఆత్మలహరి కావ్యం,1974:69)

అని పింగళివారు అనడాన్ని బట్టి  (నేను–పింగళి) పింగళి వంశస్తులని చాలా స్పష్టంగా తెలియజేశారు. ఇంకా పింగళి వంశస్తులు నేటికి దేశవిదేశాలలో, తెలుగు రాష్ట్రాలలోని హైదరాబాద్, విజయవాడ, కృష్ణాజిల్లా, గుంటూరు, బందరు, ఖమ్మం, వరంగల్ మొదలైన ప్రాంతాల్లో నివసిస్తున్నారని పింగళి వేంకటకృష్ణారావుగారు విశదీకరించారు. అలాగే పింగళి వంశ వృక్ష పటాన్ని పింగళి నాగేంద్రరావు గారు తన ‘పింగళి వంశ చరిత్ర’ అనే పుస్తకంలో పొందుపరిచారు. ఈ వంశవృక్ష పటాన్ని అనుబంధంలో ప్రస్తావించాను. (చూడు – అనుబంధం)

# అనుబంధం–7

పింగళి వారి రచనల్లో ముఖ్యమైన కొన్ని పుస్తకాల ముఖచిత్రాలు




GOWTHAMA
NIGHANTUVU

ENGLISH - TELUGU
DICTIONARY

500 PAGES

BY :
Sri Pingali Lakshmikantham,

*Publishers :*
Sri Tirupathi Venkateswara Book Depot,
RAJAHMUNDRY-1.

# అనుబంధం–8

## పింగళి వారి స్వ దస్తూరి


19.1.65